# 24 గంటలు

## కె. జి. కన్నబిరాన్

### ఆత్మకథాత్మక సామాజిక చిత్రం



అక్షరీకరణ
ఎన్. వేణుగోపాల్

9293

వులపల్లి పబ్లికేషన్స్

# 24 గంటలు

## కె.జి. కన్నబిరాన్

## ఆత్మకథాత్మక సామాజిక చిత్రం

అక్షరీకరణ

**ఎన్. వేణుగోపాల్**

**దేవులపల్లి పబ్లికేషన్స్**

12-1-62, విజయా గార్డెన్స్, బండ్లగూడ, నాగోల్

హైదరాబాద్ - 500 068.

360.922
తెలు-కె.జి

**Kannabiran Athmakathatmaka Samajika Chitram**

24 Gantalu

**Personalised Social History of K.G. Kannabiran's Memoirs**
**Published in Prajatantra Telugu Weekly**
**between 18-02-2006 and 17-05-2008**

© Devulapalli Publications

Type Setting by: Palepu Raja Sekhar

First Published : January 2010

No. of Copies : 1000

Printed at : Joy 'N' Joy Offset Printers
12-1-62, Vijaya Gardens
Bandlaguda, Nagole
Hyderabad.
Phone : 9502320616

For Copies :

- **Devulapalli Publications**
12-162, Vijaya Gardens
Bandlaguda, Nagole
Hyderabad
Phone : 9502320616
- **All leading Book Shops**

Price Rs 200/-

Cl 7148
A C.No. 94293

# అంకితం

పౌర హక్కులను, చట్టబద్ధ పాలనను బలోపేతం చేయడానికి ఆంధ్ర ప్రదేశ్‌లో ప్రత్యేకంగానూ, దేశవ్యాప్తంగానూ మూడు దశాబ్దాలపాటు పనిచేసిన గణిత శాస్త్రవేత్త, మానవహక్కుల కార్యకర్త, న్యాయవాది డాక్టర్ కె. బాలగోపాల్ (1952-2009).

ఆయన మానవహక్కుల తొలి కృషి 1983 నుంచి ఆంధ్ర ప్రదేశ్ పౌరహక్కుల సంఘం ప్రధాన కార్యదర్శిగా రాజ్యహింస మీద, శిక్షాతీత పాలవిధానాల మీద విమర్శగా ప్రారంభమయింది. తర్వాత ఆయన సహచరులతో కలిసి 1999లో మానవహక్కుల వేదికను స్థాపించి విప్లవ హింసను కూడ విమర్శిస్తూ పౌర, రాజకీయ, సామాజిక, ఆర్థిక హక్కుల విశాల క్షేత్రంలో పనిచేశారు.

1980ల నుంచి 2009 దాకా సాగిన ఈ మూడు దశాబ్దాల కాలం చాల సృజనాత్మకమైనది, చలనశీలమైనది. స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, సమానత్వం, శిక్షాతీత ప్రవర్తన, వివక్ష వంటి వాటి అర్థాలను వెతుకుతూ సంపన్నమైన చర్చ, ఆలోచన, సంఘర్షణ సాగిన కాలం అది. ఈ మౌలిక చర్చా సాంప్రదాయాన్ని నిర్మించిన కీలక వ్యక్తులలో బాలగోపాల్ ఒకరు. రాష్ట్రంలోనూ దేశమంతా కూడ అవిశ్రాంతంగా తిరుగుతూ, అణచివేతనూ, హక్కుల ఉల్లంఘనలనూ నమోదు చేస్తూ ఆయన దారుణమైన దాడులకు గురయ్యారు. జైలుపాలయ్యారు. తాను చూసిన విషయాలనూ, వాటిమీద విమర్శనాత్మక విశ్లేషణలనూ నిరంతరాయంగా ఇంగ్లీషులో, తెలుగులో రాస్తూ వచ్చారు. రాజ్యనిర్బంధం నుంచి రిజర్వేషన్లు, మైనారిటీల హక్కుల దాకా అనేక అంశాలమీద సాగిన ఈ రచనల ద్వారా బాలగోపాల్ అసమానమైన దీక్షతో మానవహక్కుల చైతన్యాన్ని ప్రచారం చేశారు.

1990ల చివర న్యాయవాద వృత్తిని అవలంబించి, ఈ సంపన్నమైన కార్యకర్త అనుభవాన్నీ, మారుతున్న రాజ్యపు ముఖాలపట్ల నిశితమైన అవగాహననూ, శిక్షాతీత ప్రవర్తన మీద తన పోరాటాన్నీ ఆయన న్యాయస్థానాలలోకి తీసుకువచ్చారు.

ఈ పుస్తకం బాలగోపాల్‌కు అంకితం.

— కె.జి. కన్నబిరాన్

ఆయనను
ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్
'మానవహక్కుల కొరకు ఉద్విగ్నంగా పోరాడే న్యాయవాది'
అంది.

నక్సల్బరీ తరం నాయకుడు
సత్యనారాయణసింగ్
'ప్రాసిక్యూటర్లకు ప్రాసిక్యూటర్' అన్నాడు.

ఒకప్పటి మానవహక్కుల నేత, జర్నలిస్టు,
ఇప్పుడు సంఘపరివార్ సిద్ధాంతకర్త
అరుణ్ శౌరి
'లోకాధివక్త' అన్నాడు.

ఆయన
నాలుగు దశాబ్దాలుగా
న్యాయవాద వృత్తిలో
పోరాడే ప్రజల హక్కుల
పరిరక్షణ కోసం
అహర్నిశలు శ్రమిస్తున్న
అసాధారణ మేధావి

ఆంధ్రదేశంలోనే కాదు
దేశం మొత్తానికే
పౌర, ప్రజాతంత్ర హక్కుల స్ఫూర్తికి
పర్యాయ పదంగా ఎదిగినవాడు

మనిషిగా సామాన్యుడు
వాదనా పటిమలో అసామాన్యుడు
తోటి మనిషి హక్కులను కాపాడడంలో అనితరసాధ్యుడు

# విషయసూచిక


| | | |
|---|---|---|
| పరిచయం | -- | దేవులపల్లి అమర్ |
| ఒక గొప్ప అవకాశం | -- | ఎన్ వేణుగోపాల్ |
| కన్నబిరాన్ తో అర్ధశతాబ్దం | -- | వసంత కన్నబిరాన్ |
| ఈరోజే పుట్టిన రోజు | -- | వరవరరావు |

| | పేజి |
|---|---|
| 1. ప్రారంభం ... | 01 |
| 2. మళ్ళీ హైదరాబాదుకు ... | 11 |
| 3. పౌరహక్కుల ఉద్యమం ప్రారంభం ... | 22 |
| 4. ఎమర్జెన్సీ ... | 29 |
| 5. తార్కుండే కమిటి ... | 51 |
| 6. జస్టిస్ భార్గవా కమిషన్ ... | 67 |
| 7. భార్గవా కమిషన్ తర్వాత ఎన్‌కౌంటర్లు ... | 98 |
| 8. మరణదండనపై ఏదీ సంప్రదాయం ... | 128 |
| 9. హక్కుల ఉద్యమంలో నేను ... | 143 |
| 10. అంతర్గత విషయాలు ... | 170 |
| 11. చర్చలపై నా వైఖరి ... | 173 |
| 12. మానవతకే మచ్చ ... | 179 |
| 13. జాతిహనన చర్య ... | 190 |
| 14. శంకర్‌గుహా నియోగి ... | 212 |
| 15. చెర, లోచన్‌లపై ముఖ్యమైన తీర్పు ... | 234 |
| 16. వలస చట్టాల ప్రభావం ... | 265 |
| 17. క్రమంలేని నా జీవిత పథం ... | 273 |
| 18. కోయంబత్తూరు కేసు ... | 277 |
| 19. బహిరంగ విచారణ ప్రాముఖ్యం ... | 283 |
| 20. ప్రాథమిక హక్కులకోసం నల్లకామన్ పోరాటం ... | 286 |
| 21. సాధారణీకరించడం సాధ్యంకాదు ... | 299 |
| 22. ఆధ్యాత్మికత-ప్రేమానంద ... | 302 |
| 23. కమిషన్ల నిర్వ్యాపకత్వం ... | 316 |
| 24. గుజరాత్ హననకాండ నేపథ్యం-శ్రీకృష్ణ కమిషన్... | 324 |
| 25. గుజరాత్ హననకాండ ... | 330 |
| 26. లౌకిక విలువలు, రాజ్యాంగం ... | 346 |
| 27. దళితుల రాజ్యం, న్యాయవ్యవస్థ ... | 349 |
| 28. అసంబద్ధ వాదన ... | 359 |
| 29. పదిరికుప్పం ... | 366 |
| 30. కారంచేడు ... | 368 |
| 31. చుండూరు ... | 370 |
| 32. మేళవలపు దురంతాలు ... | 377 |
| 33. ఒకానొక అత్యాచారం ... | 387 |
| 34. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు ... | 395 |
| 35. పులికాట్ కేసు ... | 398 |

# పరిచయం

కన్నబిరాన్ గారితో ఎట్లాగైనా ఆయన అనుభవాలు రాయించాలన్న నా ప్రయత్నం సఫలం కావడానికి కనీసం ఏడెనిమిదేళ్లు పట్టింది.

1998 జనవరిలో "ప్రజాతంత్ర" పునఃప్రారంభించినప్పటి నుంచీ ఆయనను అడుగుతూనే ఉన్నాను. మధ్యలో ఒకటి రెండుసార్లు గట్టి ప్రయత్నమే చేసాను. ఎందుకో ఆయన చాలాకాలం పెద్దగా ఆసక్తి చూపలేదు. చివరకు అంగీకరించారు. అయితే ఎవరైనా తన దగ్గర కూర్చుంటే అనుభవాలు చెబుతాను రాసుకోవచ్చునన్నారు. ఆ పని చేయాలని కోరగానే అంగీకరించాడు వేణు. బహుశా వేణు తప్ప ఇంకెవరు అక్షరీకరించినా కన్నబిరాన్ అనుభవాల రచన ఇంత బాగా వచ్చి ఉండేది కాదన్నది నా గట్టి నమ్మకం.

24 గంటలూ మానవ హక్కులమీదనే ధ్యాసతో వాటి పరిరక్షణ కోసమూ, వాటి ఉల్లంఘనను ప్రతిఘటించిడానికి వెచ్చించినందుకే ఈ రచనకు '24 గంటలు' అని శీర్షిక నిర్ణయించి ఉంటారు. వేణుకు ఈ పని అప్పగించడం వరకే నేను చేసింది. ఆ తరువాత అంతా తనే చూసుకున్నాడు. వారం వారం అచ్చులో కన్నబిరాన్ అనుభవాలు చదవడం తప్ప నేను చేసిందేమీ లేదు.

కన్నబిరాన్ గారు నాకు 1977-78 సంవత్సరాలనుంచే పరిచియం. ఆయనను బాగా దగ్గరి నుంచి చూడటం 1985లో డాక్టర్ రామనాథం గారి హత్య రోజు నుంచే.

నేను జర్నలిజంలో, ముఖ్యంగా రిపోర్టింగ్‌కు మారిన తొలి ఐదారు సంవత్సరాల్లో జరిగిన రెండు మూడు ఘటనలను గురించి ఇక్కడ ప్రస్తావించాలి. కాజీపేట రైల్వే స్టేషన్‌లో ఎస్.ఐ. యాదగిరి రెడ్డిని నక్సలైట్లు చంపేసారు, ఆ మరునాడే అప్పటి ఎస్.పి. అరవిందరావు అగ్రభాగాన నడిచిన యాదగిరి రెడ్డి శవయాత్ర నుంచి కొంత మంది పిల్లల డాక్టర్ రామనాథం గారి క్లినిక్‌లో దూరి ఆయనను కాల్చి చంపారు. ఆ వార్త తెలియగానే ఇండియా టుడే విలేకరి అమర్‌నాథ్ కె. మీనన్‌తో కలిసి నేను వరంగల్ వెళ్లాను. అప్పటికే కన్నబిరాన్ అక్కడవున్నారు. సంఘటన స్థలానికి, మార్చురీకి ఆ రాత్రి ఆయనతో కలిసే వెళ్లాను.

ఆ వెనువెంటనే పెద్దపల్లిలో డిఎస్‌పి బుచ్చిరెడ్డిని నక్సలైట్లు చంపేస్తే వెనువెంటనే ప్రతీకార చర్యగా పౌరహక్కుల సంఘం నేత అల్గనూరు సర్పంచ్ జాపా లక్ష్మారెడ్డిని 'ఎవరో' చంపేసారు.

ఈ రెండు సంఘటనలు జరిగిన చాలా కొద్ది రోజులకే నేను కరీంనగర్‌కు ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో విలేకరిగా పనిచేయడానికి వెళ్లాను.

వెళ్లడం వెళ్లడమే పోలీసులు నా మీద నిఘా పెట్టారు. అక్కడ నేను నాలుగు సంవత్సరాలు పనిచేసాను. రెండు మూడు సంవత్సరాల తరువాత అనుకుంటా ఒక

హెడ్ కానిస్టేబుల్ చెప్పాడు నాకు. వచ్చిన కొత్త రోజుల్లో నా వెనుక 24 గంటలూ ఫాలో అయిన పోలీసులలో తానూ ఒకడినని. ఏం తెలుసుకున్నారు నన్ను ఫాలో అయి అని అడిగాను. నవ్వేసి 'వారం రోజులకే' వెళ్లి ఎస్పీ గారికి చెప్పాం 'ఈయనను ఫాలో కావడం దండగ, జర్నలిస్టు పని తప్ప ఇంకేం చెయ్యడం లేదీయన' అని అన్నాడు.

అప్పట్లో కరీంనగర్‌లో వాతావరణం అంతా ఒక తెలియని భయంతో నిండి ఉండేది. ఎవరూ నోరు విప్పి మాట్లాడే పరిస్థితి లేదు. పోలీసులకు వ్యతిరేకంగా అయితే అసలే సాధ్యం కాదు.

పత్రికాఫీసులకు పోలీసులు వొచ్చేసి ఈ వార్త ఎందుకు రాసారు? సమాచారం ఎవరిచ్చారు? అని ప్రశ్నిస్తున్న పరిస్థితి. పౌరహక్కుల కార్యకర్తల పరిస్థితి ఇంక చెప్ప నవసరం లేదు. 1989 ఎన్నికల దాకా ఇదే పరిస్థితి.

ఆ రోజుల్లోనే కన్నబిరాన్, బాలగోపాల్ జాడ తెలియకుండా పోయిన అమ్మాయిలకు సంబంధించిన ఒక కేసులో కరీంనగర్‌కు రావడం మొదలయింది. కన్నబిరాన్ తన జూనియర్‌లతో కలిసి మారుతీ వ్యాన్‌లో కరీంనగర్ కోర్టుకు వచ్చేవారు. మజిలీ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఆఫీసు. ఎస్పీ నన్ను పిలిపించి అడిగాడు - ఎందుకొస్తున్నారు వాళ్లు మీ ఆఫీసుకు అని. 'నన్ ఆఫ్ యువర్ బిజినెస్ సర్' అని ఖండితంగా చెప్పాను. జర్నలిస్ట్ నన్న ధైర్యం ఒకటి, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వంటి పత్రికలో పనిచేస్తున్నాను నన్నేం చేస్తారన్న ధీమా ఇంకొకటి. పైగా జర్నలిస్ట్‌ల యూనియన్ జిల్లా అధ్యక్షుడిని, ఎపియుడబ్ల్యూజె అండ ఉందన్న బలం తోడై బహుశా నాతో ఆ మాటలు అనిపించి ఉంటాయి.

కన్నబిరాన్, బాలగోపాల్ ఒకరోజు కేసు కోసం కరీంనగర్ కోర్టు కొచ్చారు. కోర్టు ఆవరణంతా పోలీసులే. నేను వార్త రాయడం కోసం వెళ్లాను. కన్నబిరాన్ జడ్జి దగ్గర తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసారు.

కోర్టు ఆవరణలో ఒక ఇన్స్‌స్పెక్టర్ నా దగ్గరికొచ్చి రివాల్వర్‌ను వేలితో గిరగిరా తిప్పి 'అసలీ నాయకుల్లో ఒకడిని ఏసేస్తే సరిపోతుంది ఇంకోసారి కోర్టుకెవడూ రాడు' అని వెళ్లిపోయాడు. ఆ వారమే నేను అదంతా 'ఆంధ్రప్రభ' ఎడిట్ పేజీలో న్యూస్ లెటర్‌గా రాసాను కూడా. ఆ మాటలతో నాకెందుకో బాగా పట్టుదల పెరిగింది. వెంటనే స్థానిక ప్రెస్ క్లబ్ అధ్యక్షుడితో మాట్లాడాను. 'ఆంధ్రజ్యోతి' విలేకరిగా పనిచేస్తుండిన మిత్రుడు జాకీర్ అప్పుడు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు.

ప్రెస్ క్లబ్ తరఫున పౌరహక్కుల పరిస్థితి మీద కళాభారతి ఆడిటోరియమ్‌లో ఒక సదస్సు పెట్టాం. కన్నబిరాన్, బాలగోపాల్ వక్తలు. చాలా మంది భయపెట్టారు మమ్మల్ని. పోలీసులూ దీర్ఘాలు తీసారు జర్నలిస్టులకు పౌరహక్కులతో ఏం పని అని. సభ బాగా జరిగింది. ఆ వెంటనే కొద్ది రోజుల్లో ఎపిసిఎల్‌సి సభ పెద్ద ఎత్తున అదే ఆడిటోరియంలో జరిగింది. అప్పట్లో నాకు తెలిసి ఎపిసిఎల్‌సి తరఫున కరీంనగర్‌లో సుధాకర్ రెడ్డి అనే

ఒక న్యాయవాది మాత్రమే మిగిలి ఉన్నారు. జాపా లక్ష్మారెడ్డి హత్యానంతరం చాలామంది రాజీనామాలు చేసారు లేదా స్తబ్దుగా ఉండిపోయారు.

ఆ తరువాత వరంగల్‌లో హయగ్రీవాచారి హత్య దాని వెంబడే యువ న్యాయవాది నర్రా ప్రభాకర రెడ్డి హత్య హైదరాబాద్‌లో బ్యూరోచీఫ్‌గా ఉండి ఈ సంఘటనా కవర్ చేసాను.

ప్రధానంగా ఈ మూడో సందర్భంలో నేను కన్నబిరాన్‌ను, బాలగోపాల్‌నూ చాలా దగ్గరగా చూసాను. అప్పటి నుంచే కన్నబిరాన్‌తో ఏదైనా రాయించాలనే ఆలోచన నాలో బలంగా నాటుకున్నది.

ఇన్నాళ్లకు అదిసాధ్యమయింది. 'ప్రజాతంత్ర'లో కన్నబిరాన్ ఆత్మకథాత్మక సామాజిక చిత్రం చదివిన చాలామంది మిత్రులు నాతో అది ఇంగ్లీషులో కూడా పుస్తకంగా వస్తే బాగుంటుందని సూచించారు.

కన్నబిరాన్ అంతర్జాతీయ ఖ్యాతి గడించిన మానవహక్కుల నేత, ఆయన అనుభవాలు ఇంగ్లీషులో కూడా రావాలని ఆ అదృష్టం 'ప్రజాతంత్ర' నిర్వాహకులకే దక్కాలని నా కోరిక.

- దేవులపల్లి అమర్

# ఒక గొప్ప అవకాశం

నేను అపారంగా గౌరవించే కన్నబిరాన్ గారి అనుభవాలూ జ్ఞాపకాలూ అక్షరీకరించే గొప్ప అవకాశం నాకు రావడం, అదృష్ట దురదృష్టాల మీద ఎంతగా నమ్మకంలేకపోయినా, అదృష్టమనే చెప్పాలి. ఆయన జీవితానుభవాలు ఒక వ్యక్తి జీవితానుభవాలు మాత్రమే కాదు, ఒకానొక సంక్షుభిత కాలపు సామాజిక చరిత్ర శకలాలు. ఒకానొక ఉజ్వల ఉద్యమపు ఆరంభ వికాసాల గాథలు అవి. మననేలమీద ప్రజాఉద్యమాల నిర్మాణాలు అనుభవించిన జయాపజయాలకు నిరంతర ప్రత్యక్ష సాక్షి కథనాలు అవి. మన ప్రజాజీవిత గమనంలో ప్రధానమైన మైలురాళ్లకు సూచికలు అవి. సాంఘిక చరిత్ర అధ్యయనం మీద, రచనమీద ఆసక్తి ఉన్న నాకు ఈ రచన చేసే అవకాశం రావడం అరుదయిన గౌరవం.

కన్నబిరాన్ గారిని ముప్పై ఐదు సంవత్సరాలుగా చూస్తున్నాను. బహుశా సికిందరాబాదు కుట్రకేసు తొలిరోజులలో 1974-75ల్లో ఆయనను మొదటిసారి హైకోర్టు ఆవరణలోనో, సిటీ సివిల్ కోర్టుల ఆవరణలోనో చూసి ఉంటాను. ఎమర్జెన్సీ అంతాకూడ మామయ్యను కలవడానికి కోర్టుకు వెళ్లినప్పుడు అక్కడ కన్నబిరాన్ గారిని కలుస్తూనే ఉండేవాళ్లం. కాని ఆయనతో సాన్నిహిత్యం ఎమర్జెన్సీ తర్వాత తార్కుండే కమిటీ పనిమీద, భార్గవ కమిషన్ పని మీద, సభల్లో మాట్లాడడానికి ఆయన హనుమకొండకు వస్తున్నప్పుడు పెరిగింది.

ఆ తర్వాత 1980ల మొదట్లో మా అరుణక్క ఉద్యోగం తొలగింపు కేసు విషయంలో ఆయనను ఎక్కువసార్లు కలిశాను. విద్యార్థిగా ఉన్నప్పుడు రాడికల్ విద్యార్థి సంఘంలో పాల్గొన్నందువల్ల, వరవరరావు కుటుంబ సభ్యురాలయినందువల్ల ఉద్యోగం నుంచి తొలగిస్తున్నామని అంటూ మా అరుణక్కను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగం నుంచి తొలగించినప్పుడు ఆ కాగితాలు తీసుకుని కన్నబిరాన్ గారి దగ్గరికి వచ్చాం. రాష్ట్రప్రభుత్వ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ లోనో, హైకోర్టులోనో ఆ కేసు వాదిస్తున్నప్పుడు కన్నబిరాన్ గారి విశ్వరూపం చూశాను. ఇప్పటికీ ఆయన ఆరోజు కోర్టు హాలులో వినిపించిన వాదనలు నా చెవుల్లో రింగుమంటూనే ఉంటాయి. ఉద్యోగి కావడం కన్న ముందు మనిషి మనిషిగా ఉండాలని, అంటే భావప్రకటనా స్వేచ్ఛ, రాజకీయ విశ్వాసాలు ఉంచుకునే స్వేచ్ఛ ఉండాలని ఆయన ఎక్కడెక్కడి ఉదాహరణలో ఉటంకిస్తూ ఆ రోజు చేసిన వాదనలు నిజానికి న్యాయస్థానపు వాదనలు కావు, న్యాయభావన నిండిన వాదనలు. న్యాయమైన వాదనలు. నిజానికి అవి వాదనలు కూడ కావు, ఒక ఉద్వేగపూరితమైన ఉపన్యాసం. న్యాయస్థానం ప్రభుత్వ ఉత్తర్వులను కొట్టివేసి, పునర్నియామకం జరపాలని ఆదేశించిందంటే, న్యాయసూత్రాల కన్న ఎక్కువగా కన్నబిరాన్ గారి వాదనాపటిమే కారణమనుకుంటాను. ఆరోజు నుంచీ నేను ఆయనకు వీరాభిమానినయిపోయాను. మళ్లీ అట్లా ఆయనను ఎన్నో

సార్లు విని ఉంటాను గాని, మరొక గుర్తుండిపోయిన అనుభవం 1983 ఫిబ్రవరిలో తిరుపతిలో రాడికల్ విద్యార్థి సంఘం సభల్లో ఆయన చేసిన ఉపన్యాసం. అప్పటికి కొద్దిరోజులముందే చిత్తూరు జిల్లా పాదిరికుప్పంలో తెలుగుదేశం నాయకులు తమకు వోట్లు వేయలేదని దళితవాడ మీద దాడిచేస్తే పౌరహక్కుల సంఘం ఆ ఘటన మీద నిజనిర్ధారణకు వెళ్లింది. ఆయన అక్కడినుంచే తిరుపతి సభకు వచ్చి ఆవేశంగా మాట్లాడారు.

ఆ తర్వాత ఆయనను ఎన్నోసార్లు ఎన్నో పనుల మీద కలిశాను. నాకు ఉద్యోగం ఇప్పించడానికి ప్రయత్నించడం దగ్గరినుంచి, నా ఆరోగ్యం గురించి ఆందోళనతో వాకబు చేయడందాకా ఆయన నా మీద ఎంతో వాత్సల్యం చూపారు. పౌరహక్కుల ఉద్యమ నాయకుడిగా, మేధావిగా, న్యాయవాదిగా మాత్రమే కాక, వ్యక్తిగానూ, పెద్దదిక్కుగానూ, ప్రేమాస్పదుడిగానూ ఆయనను అభిమానించాను.

ఆ దశలో ఆయన ఆత్మకథకు లేఖకుడిగా ఉండమని ప్రతిపాదన వస్తే ఎగిరి గంతేశాను. దేవులపల్లి అమర్ ఒకరోజు "ఎట్లాగైనా కన్నబిరాన్ తో కూచుని ఆయన ఆత్మకథ చెప్పించుకుని ఎవరయినా రాయాలి. ఆయనచేత అది రాయించాలని నా చిరకాల కోరిక. ప్రజాతంత్రలో సీరియలైజ్ చేద్దాం. ప్రజాతంత్ర కోసం నువ్వు ఆ పని చేయగలవా" అని అడిగాడు. వెంటనే ఒప్పుకున్నాను.

ఇక అక్కడినుంచి ఒక యజ్ఞమే సాగిందనాలి. కన్నబిరాన్ ఇల్లు (మారేడుపల్లి), ప్రెస్ అకాడమీ, ఫతే మైదాన్ క్లబ్, న్యాయవాది నళినీకుమార్ ఆఫీసు (నాంపల్లి) – అలా ఎన్నెన్నో చోట్ల కూచుని ఈ ఐదు దశాబ్దాల జ్ఞాపకాల కవిలెకట్ట విప్పుకున్నామో చెప్పలేను. ఒక ప్రవాహం లాగ కన్నబిరాన్ గారు చెప్పుకుపోతుంటే అది ఒకవైపు కాసెట్ లో రికార్డ్ చేసుకుంటూ, నోట్స్ తీసుకుంటూ, మధ్యలో వివరణలు అడుగుతూ, ఒక్కోసారి ఆయన ధోరణిలోపడి ఎక్కడికో వెళిపోతే వెనక్కి తీసుకువస్తూ సాగిన ఆ అనుభవం స్వయంగా పొందవలసిందే తప్ప అక్షరాల్లో చెప్పలేను. నిజానికి ఆయన చెప్పినవన్నీ, ఆ స్వల్ప సంఘటనలతో, హావభావాలతో, ఇతరుల మీద ఆయన అభిప్రాయాలతో సహా, ఆయనకు సహజసిద్ధమైన హాస్య, వ్యంగ్య స్పర్శతో, ప్రతిమాట వెనుకా ఉండే ప్రగాఢమైన జీవితానుభవంతో పూర్తిగా అక్షరీకరించగలిగానా నాకు అనుమానమే. సాహిత్యం, అర్థశాస్త్రం, తత్వశాస్త్రం, రాజకీయాలు, న్యాయశాస్త్రం, చరిత్ర, ఆర్ద్రమైన మానవసంబంధాలు కలగలిసిన ఆయన సువిశాల పరిజ్ఞానం అలా ప్రవహిస్తూ ఉంటే వాటిలో ఎన్నిటి వివరాల కోసం నేను ఎన్ని పుస్తకాలు సంప్రదించవలసి వచ్చిందో చెప్పలేను. ఆయన చెప్పిన విషయాలను పూర్తిగా అర్థం చేసుకుని మళ్లీ నామాటల్లో పెట్టడానికి ఆయన ప్రస్తావించిన కేసుల రికార్డులన్నీ చదవవలసి వచ్చేది. అమెరికన్, ఇంగ్లిష్ న్యాయస్థానాల వివాదాల గురించి తెలుసుకోవలసి వచ్చేది. రాజ్యాంగ నిర్ణయ సభ చర్చ చదవవలసి వచ్చేది. దేశంలోనూ, రాష్ట్రంలోనూ నడిచిన ఎన్నో కేసుల వివరాలు

తెలుసుకోవలసి వచ్చేది. ఆయన జ్ఞాపకం మీద ఉటంకించిన సాహిత్య, సాహిత్యేతర గ్రంథాలు తవ్వితీసి అసలు ఉటంకింపులు రాయవలసివచ్చేది.

ఇదంతా ఒక ఎత్తు అయితే, నిరాటంకమైన ధారగా సాగే అనుభవాల కథనంలో ఆయన మొదలుపెట్టిన విషయానికే పరిమితమవుతారనే నమ్మకం ఎప్పుడూ లేదు. ఎక్కడో మొదలుపెట్టి, మధ్యలో ప్రస్తావనవశాత్తూ వచ్చిన ఒక మనిషి పేరో, ఊరిపేరో పట్టుకుని మరెక్కడికో వెళ్లిపోయేవారు. ఆ కథ కూడ పూర్తయ్యేది కాదు, మధ్యలో మరొక చంక్రమణం జరిగినా జరిగేది. ఒక్కోసారి చెప్పిన విషయమే మళ్లీ చెప్పేవారు. ధార ఆగిపోతుందనే భయంతో ఒక్కోసారి ఆయనను ఆపేవాణ్ని కాను. అలా రూపొందిన వందల పేజీల నోట్స్ లోంచి అక్కడి వాక్యాలు ఇక్కడి కథనంలోకీ, ఇక్కడి వాక్యాలు అక్కడి కథనంలోకీ మార్చడం మరొక పెద్ద పని.

ఈ ఆత్మకథ ప్రారంభమైన ప్రజాతంత్ర సంచిక ఆవిష్కరణ సభలో మాట్లాడుతూ బాలగోపాల్ ఒక మాట అన్నారు. 'సారు ఆత్మకథ రాయించడం మన రాష్ట్ర పౌరహక్కుల ఉద్యమ చరిత్రకు చాల అవసరం అనుకుని మేం రెండు మూడు సార్లు ప్రయత్నించాం. కాని సారు అనుభవాల విస్తృతి వల్ల అది ఏకధారగా సాగదు గనుక ఆ పని చేయడం సాధ్యం కాదనుకున్నాం. ఇప్పుడు వేణు ఈ పని ఎలా చేస్తాడో చూడాలి' అని.

మొత్తం ఒక్కసారే రాసిన తర్వాత అచ్చువేయడం మొదలుపెడదామని ముందు నేను అనుకున్నాను గాని ప్రజాతంత్ర నిర్వాహకుల తొందరతో మొదట కొన్ని వారాలకు సరిపడేంత రాసి ఇచ్చాను. ఆ రోజుల్లో ఆ రచనే నిత్యాలోచనగా, అన్నపానాలుగా ఉన్నాను. సారు జీవితచరిత్ర ఎంత గొప్పదో అర్థమవుతున్న కొద్దీ దానికి ఏదయినా మంచిపేరు, సరిగ్గా ఆయన జీవితాన్నంతా పట్టుకోగలిగే పేరు కావాలని ఆలోచన, ఆలోచన, తెగని ఆలోచన. 'కన్నబిరాన్ ఆలోచన ఇరవైనాలుగు గంటలూ పౌరహక్కుల గురించేకదా, ఇరవై నాలుగు గంటలు అనే మాటకు పౌరహక్కులలో చాల ప్రాధాన్యత ఉంది గదా, ఆ మాటే శీర్షికగా బాగుంటుందేమో' అని సూచించింది వనజ. ఇరవై నాలుగు గంటలకు మించి నిర్బంధంలో ఉంచుకునే హక్కు పోలీసులకు లేదు అనే రాజ్యాంగ ఆదేశమే పౌరహక్కుల ఉల్లంఘన నుంచి ప్రజలను కాపాడే సాధనం. అదే పౌరహక్కుల ఉద్యమపు ఆయుధం. కనుక కన్నబిరాన్ జీవిత పర్యంతం పౌరహక్కులకే అంకితం అనే అర్థం, పౌరహక్కుల ఉద్యమపు ప్రధాన పునాది అయిన రాజ్యాంగ ఆదేశం అనే అర్థం రెండూ వస్తాయి అనే ఉద్దేశంతో ఆ పేరు ఖరారు చేశాను.

మొదట అయితే కొన్ని వారాలకు సరిపడా రాసి ఇచ్చేవాణ్నిగాని, ఆ తర్వాత ఏవారానికావారం రాయడం అలవాటయింది. తర్వాత నాదగ్గర ఉన్న కాసెట్స్ గాని, నా నోట్స్ గాని సరిపోనప్పుడు సారు తాను అదివరకు రాసిన వ్యాసాల రెఫరెన్స్ ఇచ్చి దాంట్లోంచి విషయం తీసుకుని రాయి అనేవారు. అవి కొన్ని సార్లు పూర్తిగా అనువాదం

చేశాను, కొన్నిసార్లు వాటిలోంచి కొంత తీసుకుని, కొంత ఆయన చెప్పినదానిలోంచి తీసుకుని రాశాను. అలాగే 2004లో ఓరియంట్ లాంగ్మన్ ప్రచురించిన సారు వ్యాసాల సంపుటం 'ది వేజెస్ ఆఫ్ ఇంప్యునిటీ' నుంచి కొన్ని భాగాల్ని వాడుకున్నాను. ఆ తర్వాత సారు కొత్తగా వ్యాసాలు, అనుభవాలు రాసి పంపించడం మొదలుపెట్టారు. నేను అమెరికాలో ఉన్న మూడు నెలలూ అట్లా సారు పంపిన రచనల అనువాదాలు సాగాయి.

అనుకోకుండానే అయినా, అందుకు తగిన అరత ఉన్నా లేకపోయినా ఈ అద్భుతమైన, అసాధారణమైన సామాజిక చరిత్ర రచనకు నాకు అవకాశం ఇచ్చిన వారందరికీ కృతజ్ఞతలు చెప్పవలసి ఉంది. మొట్టమొదట కన్నబిరాన్ గారు నామీద అంతకు ముందరి వాత్సల్యాన్ని ఈ ఆత్మకథ రచన సమయంలో మరింత ఎక్కువగా చూపారు. వసంత కన్నబిరాన్, కల్పన కన్నబిరాన్ ఈ పనికి అవసరమైన సాయం చేశారు. దేవులపల్లి అమర్, దేవులపల్లి అజయ్ లు పూనుకోకుంటే ఇది సాధ్యమయ్యేదే కాదు. ఈ అనుభవాలూ జ్ఞాపకాలూ అచ్చయిన రెండు సంవత్సరాలూ ప్రజాతంత్ర సిబ్బంది అనేకరకాల సహకరించారు. ఈ రచన, అచ్చు సాగుతున్నప్పుడు కె. జితేంద్రబాబు, జి ఎస్ వాసు, భరత్ కుమార్, బి నళినీకుమార్, ఓల్గా, అక్కినేని కుటుంబరావు, చలసాని ప్రసాద్, కృష్ణాబాయి, జి హరగోపాల్, వరవరరావు, రాంకి, రాము, వనజ, తదితరులెందరో వేరువేరు రూపాలలో ఈ రచనకు తమ సహాయం అందించారు. మొదట ప్రజాతంత్రలో అచ్చయిన ప్రతి సాఫ్ట్ కాపీ సరిగా లేదని మళ్లీ కంపోజింగ్ చేయించాలనుకున్నప్పుడు, పాలెపు రాజశేఖర్ ఓపికగా కంపోజ్ చేశారు. ఎస్ జగన్ రెడ్డి ప్రూఫులు దిద్దారు.

ఈ ఆత్మకథ ప్రజాతంత్రలో అచ్చవుతున్నప్పుడు ప్రతివారం కొన్ని డజన్లమంది పాఠకులు నాకూ సారుకూ కూడ ఫోన్లు చేసో, వ్యక్తిగతంగా కలిసో ఈ ఆత్మకథ ఎంత ముఖ్యమైనదో చెప్పారు. ఈ రచన తమకు చాల ఉత్తేజకరంగా ఉందని ప్రోత్సహించారు.

తెలుగు సమాజం అనుభవించిన ఒక అత్యద్భుతమైన కాలపు దస్తావేజు ఇది. ఈ దస్తావేజు వెలువడడంలో నావంతు పాత్రను నిర్వహించడంలో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు.

**- ఎన్ వేణుగోపాల్**

హైదరాబాద్, అక్టోబర్ 30, 2009

# కన్నబిరాన్ తో అర్ధశతాబ్దం

'ప్రజాతంత్ర'లో కన్నబిరాన్ "24 గంటలు" వారం వారం ప్రచురించబడుతున్నపుడు ఎంతోమంది దాని కోసం ఆత్రుతగా ఎదురు చూశారు. ఆసక్తితో చదివారు. ఆ సమయంలో నేను సరదాగా నా స్నేహితులతో "కన్నబిరాన్ తో అర్ధ శతాబ్దం" అని రాయాలని వుందన్నాను. అది గనక రాస్తే రాయల్టీల రూపంలో చాలా సంపాదించగలననే దాన్లో నాకేం సందేహం లేదు. ఐతే ఆ పుస్తకంలో నేను చెప్పాలనుకున్న వాటిలో కొన్నయినా చెప్పే అవకాశం నేననుకున్న దానికంటే ముందుగానే వచ్చింది. ఈ పుస్తకానికి ముందుమాట రాయమని నన్నడిగినపుడు నేను ఉలిక్కిపడ్డాను. దాంతో పాటు కాస్త ఉబ్బితబ్బిబ్బయిన మాట కూడా నిజం. వెంటనే ఒప్పుకున్నాను. ఎందుకంటే ఆ అభ్యర్ధన సంప్రదాయ విరుద్ధం.

మరి ఎందుకడిగారంటే కన్నబిరాన్‌ని అన్ని దశల్లో అన్ని సందర్భాల్లో నా అంత కూలంకషంగా తెలిసిన వాళ్ళింకొకరు లేరు. ఆరాధనీయ విగ్రహంగా మారిన వ్యక్తి కాళ్ళ(కున్న) మట్టి భార్యకే తెలుస్తుంది. నేను నా పతిదేవుడి పాదపద్మాలకు నమస్కరించటంతో ఈ ముందుమాట ప్రారంభించాలని పాఠకులు ఆశిస్తారా? లేక ఆ పద్మాలు వికసించిన బురదనీటికి నమస్కరిస్తాననుకుంటారా? లేక నా నమస్కారం అతని హృదయ కమలానికా? నేను "కఠోర షడ్జమాల"ను కన్నబిరాన్‌కి అంకితం యిచ్చినపుడు చాలామంది నాపతిభక్తికి సంతోషించారు. కానీ ఆ పుస్తకంలో నేను పితృస్వామ్య ధోరణులను దుయ్యబట్టిన తీరుకి చిరాకుపడ్డారు.

ఐతే ఆ అంకితానికి కారణం నా సతీత్వం కాదు. కన్నబిరాన్ నా రచనలను ఇష్టంగా చదివే మొదటి పాఠకుడు. ఆయనెన్నడూ సెన్సార్ కత్తెర పట్టుకోలేదు. కానీ నా రచనల్లో నేను వదిలే వ్యంగ్య బాణాల మీద ఆయన వ్యాఖ్యలు వినటం నాకెంతో ఇష్టం. ఆయన పట్ల నాకున్న గౌరవం మీకందరికీ ఉన్న గౌరవం కంటే తక్కువది కాదు. కానీ ఆయనకు నామీదున్న గౌరవం స్పష్టమైనపుడల్లా నాకు ఆశ్చర్యం కలుగుతుంది. కన్నబిరాన్ భార్యగా ఉండాలంటే చెల్లించాల్సిన మూల్యం ఏమిటో ఆయనకు తెలుసు. ఒకసారి నేనాయన భద్రత గురించి భయపడుతుంటే (ఆయన రాజకీయాల్లోకి ప్రవేశించటానికి చాలా రోజుల ముందు) నువ్విలా ఉండటమేంటి అన్నాడు. నా కష్టసమయాలలో నాకు బలాన్నిచ్చే మూలస్తంభానివి, నువ్వింత బలహీనంగా ఉండటం నేను భరించలేను అన్నాడు. ఆ భయంతోనే నేను మన ఉద్యమాలన్నీ హర్షించి స్తుతించే వీరపత్నిని కాలేదు. నీ చావు నువ్వు చావు. నేనెవరికీ మూలస్తంభాన్ని కాదు అనుకున్నాను. స్థంభం అంటే యిక అదెప్పటికీ కదలలేదు కదా. అటూ యిటూ జరగలేదు. ఉన్నచోటి నుండి అన్నీ వదిలేసి నడిచిపోలేదు. కానీ నాకా అవకాశాలన్నీ ఉండాలనుకున్నాను. అదీగాక మా పెళ్ళి

జరిగినపుడు నేనాయనతో మనం ఓ పది సంవత్సరాలు కలిసి బతికి చూద్దాం. ఆ తర్వాత కావాలనుకుంటే ఎవరి దోవన వాళ్ళు పోదాం అని చెప్పినట్టు గుర్తు. ఆయన కూడా దానికి తలూపాడు. బహుశ ఒక బంధనానికి అలవాటుపడటం అంటే ఏమిటో నాకంటే బాగా ఆయనకు తెలుసేమో. యాభయ్యేళ్ళయింది మరి.

దంపతులను ఈ లోకం ఏ అర్థంలో చూస్తుందో ఆ అర్థంలో మేం దంపతులం కాము. మేం ప్రతిచోటా కలిసి కనిపించం. మా పెళ్ళి ఫోటోలు కాక మేం కలిసి ఉన్న ఫోటో గుత్తికొండబిలం వెళ్ళే దారిలో తీసినదే. ఆ ఫోటో మేమిద్దరం కలిసి చేసిన సుదీర్ఘ ప్రయాణ మార్గాన్ని సూచించేదిగా ఉందనిపించి దానిని టేబిల్ మీద పెట్టాను.

"మీరు కూడా రండి మేడం" అనే అభ్యర్థనలు చాలానే ఉంటాయి గానీ వాటిని నేనెప్పుడూ ఒప్పుకోను. గుర్రం వెనకాల బండిలా ప్రతిసారీ కలిసి రామని చెబుతుంటాను. కన్నబిరాన్ ఒప్పుకున్నాడంటే అతనికి ఒక్కడే వెళ్ళినా యిద్దరం వెళ్ళినా తేడా లేదేమో. ఇద్దరిలో కనపడకుండా యిమిడిపోయేది నేనే కదా. నా స్వేచ్ఛకే గదా ప్రమాదం. మేం కలిసున్న యిన్ని సంవత్సరాల్లోనూ చాలా భిన్నంగా బతికాం. ఇద్దరు విడి విడి వ్యక్తులుగా బతికాం. మాకు ఒకరంటే ఒకరికి ఎంతో విలువ. కానీ సమస్యల మీద భీకరంగా విభేదించుకుంటాం. నిరంతరం వాదించుకుంటాం. ఐతే మా మధ్య ఉన్న తేడా ప్రజల మనిషికీ, బాబ్డ్ హెయిర్‌తో సిగరెట్టు తాగుతూ ఉండే అగ్రవర్ణ, అగ్రవర్గ బూర్జువా ఫెమినిస్టుకీ ఉండే తేడా మాత్రమే కాదు. చాలా కొద్ది మంది మాత్రమే దీనిని గుర్తిస్తారు.

యాభైఏళ్ళుగా ఏ మనిషి జీవితం, ఆలోచనలు నా జీవితంతో ఆలోచనలతో మమేకమైపోయాయో ఆ మనిషి గురించి చెప్పమంటే నేనేం చెప్పగలను? నేనాయన్ను పెళ్ళి చేసుకున్నపుడు ఆయన ఒక మామూలు మనిషి. అతనిలో నేను ప్రేమించింది అతని స్వేచ్ఛాతత్వాన్ని. అమితంగా చదివే గుణాన్ని. ఆపలేని హాస్య ప్రియత్వాన్ని. కన్నబిరాన్ అంత హాస్య చతురత ఉన్న మనిషి నాకింకొకరు తెలియదు. ఈ గుణమే ఆయన పరిచయస్తులను దగ్గరివారిగా చేస్తుంది. చాలా సున్నితమైన స్వభావం. స్త్రీలతో పిల్లలతో మృదువుగా వ్యవహరిస్తాడు. ఆయన క్రాస్ ఎగ్జామిన్ చెయ్యటానికి లేవగానే సాక్షులుగా బోనెక్కిన పోలీసు ఆఫీసర్లకు చమటలు పట్టటం చూసి నాకు ఆశ్చర్యంతో మతిపోయేది. ఆయన కళ్ళు ఎదుటి వ్యక్తిని చీల్చి చూసేవి. అతను మరికాస్త ఎత్తు ఎదిగినట్లు కనిపించేవాడు. ఎదుటి మనిషిని వణికించే కంఠస్వరం. ఆ బోనులో నిలబడ్డ మనిషి మీద జాలేసేది. కణ్ణాని "ఎందుకతని మీద అలా విరుచుకు పడతావు" అని అడిగే దాన్ని. "వాడికి అలా చెప్తే తప్ప అర్థం కాదులే" అనేవాడు.

మా వివాహానికి ముందు కన్నబిరాన్ చివరిసారి సివిల్ సర్వీస్ పరీక్షలు రాశాడు. ప్రతిసారీ రాత పరీక్షలో పాసయ్యేవాడు కానీ పర్సనాలిటీ లేదని వెనక్కి పంపేవాళ్ళు. ఎంపిక చేసే వాళ్ళను నేను తప్పు పట్టను. కానీ వాళ్ళ ప్రమాణాలేమిటా అని ఆశ్చర్యపోతాను.

యదార్థమేమిటంటే కన్నబిరాన్ మామూలు మనిషి. సాధారణ మానవుడు. ఆయన తెలివైనవాడు. కష్టపడి పనిచేస్తాడు. కానీ అలాంటివాళ్ళు వేలమంది ఉన్నారు. ఆయననొక 'లెజెండ్'గా నిలబెట్టిందేమిటి? సమయం వచ్చినపుడు ఆయన దాన్ని అందుకుని, ఆ సవాలుని ఎదుర్కొంటూ తానూ ఎదుగుతాడు. ఆ సమయం అతన్ని ఎంచుకుని అతన్ని తన స్వంతం చేసుకున్నదా అనిపించేలా ఉంటుందా పిలుపు. ఒక శుభ్రమైన ఇల్లు, స్కూటరు, ఆదివారాల పూట పిల్లలకు సినిమాతో పాటు ఐస్‌క్రీము అనే మధ్యతరగతి కల నుంచి పూర్తి భిన్నమైన ప్రాంగణంలోకి మా జీవితాలు మారటాన్ని నేను ఆశ్చర్యంతో గమనించాను. ఒక రోజు రాత్రి ఎవరో విప్లవకారులు (ప్రదీపనుకుంటాను) ఒక రాజకీయ కేసు వాదించమన్నారని కన్నబిరాన్ చెప్పటం నాకింకా గుర్తుంది.

నాలో ఆశ్చర్యానందాలు - నా బాల్యంలో సిగరెట్ పొగల మధ్య జరిగే కమ్యూనిస్టు మీటింగుల జ్ఞాపక చిహ్నాలు, చంచల్‌గూడ జైలుకి వెళ్ళి నా ప్రియమైన చిన్నాన్న వెంకట్‌ను కలుసుకోవటం, ఈ జ్ఞాపకాలతో మళ్ళీ నా ఇంటికి నేను తిరిగి వచ్చిన అనుభూతి. హరీంద్రనాథ చట్టోపాధ్యాయ, మఖ్దూం, హైదర్, రాజ్ బహదూర్ గౌడ్, యస్.వి.కె. ప్రసాద్, కల్పనా దత్, దిల్‌షాద్ యింకా ఎందరితోనో నిండిన బాల్యం నాది. మళ్ళీ విప్లవకారుల కేసులంటే అంతా సహజంగానే ఉందనిపించింది. నా చిన తాతలు కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపక సభ్యులు. నా చిన్నతనంలో నా హీరోలు వాళ్ళే. అందువల్లనే మళ్ళీ నా ఇంటికి నేను వెళ్తున్న అనుభూతి. ఎ.యస్.ఆర్ చారి కన్నబిరాన్‌కి బాగా తెలుసు. అతని సాహసానికి ఆశ్చర్యపడుతూ, అతన్ని తనకాదర్శంగా చేసుకున్నాడంటే ఆశ్చర్యమేముంది. ఎ.యస్.ఆర్ చారికీ తనకూ బంధుత్వం లేకపోయినా అతనెదిగిన ఎత్తులు దాటుతూ అతనికి వారసుడయ్యాడు.

మా పెళ్ళయిన తొలి సంవత్సరాలలో లెక్చరర్‌గా నాకొచ్చే ఆదాయంతో బతకటం కష్టంగానే ఉండేది. ఆయనకప్పటికి కేసులు రావటంలేదు. కానీ మా పిల్లలకు సరైన సదుపాయాలు చేయలేని స్థితిలో ఉన్నామనే అసంతృప్తిగానీ, నిరాశగానీ మాకున్నట్లు గుర్తులేదు. నేనొకటే నిర్ణయించుకున్నాను. ఆయన చిన్నతనంలోనూ, యువకుడిగానూ చాలా కష్టాలు పడ్డాడు. అందువల్ల మాకున్నంతలో ఆయనకు ఏ లోటూ లేకుండా కాపాడుకోవాలి. అలాగే కన్నబిరాన్ కూడా నాకు భద్రత, సౌకర్యాలు కల్పించాలనే పట్టుదలతో ఉన్నాడు. ఇదంతా ఓ.హెన్రీ కథలా అనిపిస్తుంది గానీ సెంటిమెంటల్‌గా ఫీలయ్యే సమయం కూడా మాకు లేదు. పట్టు వదలని విక్రమార్కుడిలా ఆయన తన పనిలోకి దూకాడు. ఆ పట్టుదల ఆయన చేసే ప్రతి పనిలో కనపడుతుంది. ఆయన మంచి న్యాయవాదిగా పేరు ప్రఖ్యాతులు సంపాదించాడు. చాలా కష్టపడి పనిచేసేవాడు. కుటుంబంలోని చిన్న చిన్న సంతోషాలు అనుభవించే సమయం కూడా ఆయనకుండేది కాదు. పని తగ్గించుకోమని అంటే ఈ న్యాయవాద వృత్తిలో పైకి పోవటం, కింద

పడటం తప్ప మనిష్టం వచ్చినట్లు పనిచెయ్యటం కుదరదనేవాడు. అదీ గాక తనకు లాయర్‌గా అనుభవం సంపాదించాల్సిన అవసరమూ ఉంది. ఆయన రైటే. ఐతే అప్పటికి నేను ఆ భద్రమైన జీవితం, అవసరాలకు తడుముకునే పరిస్థితి లేకపోవటం వీటితో విసుగెత్తి ఉన్నాను.

1968వ సంవత్సరానికి మా జీవితం భిన్నమైన మార్గంలోకి మళ్ళింది. హక్కుల పరిరక్షణ కార్యకర్తగా అతననుభవించిన ఒంటరితనం వల్ల కావచ్చు. నా తెలివి తేటల మీదున్న గౌరవం వల్ల కావచ్చు. ఆయన తన ప్రతి కేసు గురించీ నాతో మాట్లాడేవాడు. నాకా కేసులన్నీ తెలుసు. మెసేజ్‌లు తీసుకునేదాన్ని. వివరాలు గుర్తు చేసేదాన్ని, మొత్తం మీద మంచి సెక్రటరీ నయ్యాను. కాలేజీలో పాఠాలు చెప్పటం కంటే ఈ పనిలోనే తృప్తి కలిగేది. కానీ మొదటి నుంచీ బహిరంగంగా ఆయనతో కలిసి పనిచేయకుండా జాగ్రత్త పడ్డాను. ఆ మాత్రం దూరం ఉంచడం మంచిదనుకున్నాను. ఆయన భార్యగా ఉండటంతో తృప్తి పడ్డాను. అది తెలివైన పనని నాకు తెలుసు. అలా ఉండకపోతే కరపత్రాలు పంచుతూ, పార్టీ సిద్ధాంతపు లక్ష్మణరేఖలు దాటకుండా ఫీట్లు చేస్తుండేదాన్ని. కన్నబిరాన్‌లో మహా అబ్బురమనిపించే లక్షణం ఆయన ప్రజాస్వామిక హృదయం. (ప్రవర్తనలో ఆ ప్రజాస్వామ్యం అరుదుగా కనిపిస్తుంది) పిల్లలను అపుడపుడు కోప్పడి ఉండొచ్చు గానీ వాళ్ళతో నేనున్నంత కర్కశంగా ఆయనెప్పుడూ లేడు. ఆయన అసహనంగా ఉంటాడు. వాదనలో ఎదురొచ్చిన దానిని కూలగొడుతూ పోతాడు. కానీ ఎప్పుడూ అగౌరవంగా మాట్లాడడు. నేనంత గౌరవంగా ఉండనని ఎప్పుడూ అప్‌సెట్ అవుతుంటాడు.

ఆయన తన జూనియర్లతో కఠినంగా వ్యవహరించే తీరు, వారి తప్పులపట్ల చూపే అసహనం చూసి నేనాయనకు ఎప్పుడూ భయపడగూడదని నిర్ణయించుకున్నాను. ఆయన జూనియర్లు, యితర క్లయింట్లు వాళ్ళ 'సార్' తో నేనెంత మామూలుగా మాట్లాడతానో, వాళ్ళ ముఖ్యమైన సమావేశాలను ఎంత అల్పమైన సమాచారాలతో అభ్యర్థనలతో అడ్డుకుంటానో చూసి షాకవుతారు. కానీ నాకప్పటికే తెలుసు. సరైన సమయం కోసం చూస్తూ ఉంటే, ఆయన రాజకీయ ప్రాధాన్యాలను అడ్డుకోకూడదని కాచుకుంటే – నేను జీవితాంతం ఎదురు చూడాల్సి వచ్చేది. ఆ ముఖ్యమైన చర్చల్లో నేను కలిగించే అంతరాయాల వల్ల కన్నబిరాన్ ఎన్నడూ చిరాకు పడలేదు. బహుశ ఆయన వాటిని ఆహ్వానించాడు.

ఎమర్జెన్సీ సమయంలో అరెస్టుల గురించి కన్నబిరాన్‌కు చెప్పమని అసంఖ్యాకంగా ఫోన్ కాల్స్ వచ్చేవి. ఆయన గనక అరెస్ట్ అయితే చెప్పుకోవటానికి ఎవరూ లేరనే వాస్తవం నాకు తెలుసు. ఆయనతోటి న్యాయవాద స్నేహితులు కన్నబిరాన్‌కి అభివాదం చేయాల్సి వస్తుందేమోనని కారిడార్‌లో అతనొచ్చే వైపు రాకుండా వేరే వైపు వెళ్ళే వారు. నిజంగా ఎమర్జెన్సీ సృష్టించిన భయం తీవ్రమైంది. ఆ రోజుల్లోనే విప్లవ కవులు, రాజకీయ

కార్యకర్తలు, పార్టీ వాళ్ళూ మా జీవితంలోకి వచ్చారు. ఈ కేసుల వల్లనే అనేక మంది దగ్గరగా పరిచయమయారు. వారిలో యిద్దరూ పూర్వ స్నేహితులు ఉన్నారు. తర్వాత మేమంతా స్త్రీ శక్తి సంఘటనగా యేర్పడ్డాం. ఆ రోజుల్లో జీవించి ఉండటం ఒక వరమనే చెప్పాలి. అందులోనూ యువతరంగా ఉన్నామా యిక స్వర్గమే. నా జీవితమూ ఆలోచనలూ విప్పారిన విధానాన్ని వర్ణించటం చాలా కష్టం. ఆ రోజుల నాటి స్నేహాలు, ఆ వెచ్చని చెలిమి నన్ను నన్నుగా నిలబెట్టాయి. కన్నబిరాన్ భార్యగా మాత్రమే కొట్టుకుపోకుండా సహాయ పడ్డాయి. నా మటుకు నాకు ఆ కాలంలో మేధో పరంగా, రాజకీయంగా ఎంతో లోతుకి వెళ్ళిన దశ. శత్రుఘ్న మా జీవితంలోకి వచ్చింది ఆ రోజుల్లోనే.

భూమయ్య, కిష్టాగౌడ్‌లను ఉరితీయటం ఆపాలని కన్నబిరాన్ 'స్టే' తీసుకొచ్చిన సమయంలో ముషీరాబాద్ జైలు ఎదుట మేమిద్దరం ఎదురుచూస్తూ నిలబడటం నాకు గుర్తొస్తోంది. అర్ధరాత్రి దాటింది. జైలర్ స్టే ఆర్డర్ కాపీని చూశాడని ధృవపరచుకుని అధికారికంగా ఆ కాపీ అతనికందే వరకూ వేచివున్నాం. అక్కడ కొద్ది మంది మనుషులు చిన్న గుంపుగా చేరారు. వాళ్ళు హింసకు దిగుతారేమోనని పోలీసులు నన్నక్కడ నుంచి వెళ్ళిపొమ్మన్నారు. నా వంటి మధ్య తరగతి మర్యాదస్తుల మీద వాళ్ళకున్న శ్రద్ధ అది.

తార్కుండే కమిటీతో మా జీవితంలో మరో మలుపు తిరిగింది. స్టేట్‌మెంట్లను రికార్డు చేయటం, అనువాదాలు చేయటంతో జీవితం నిండిపోయింది. సాక్షులను కిడ్నాప్ చేస్తున్నారు. కన్నబిరాన్ ప్రాణం నిజంగా ప్రమాదంలో పడింది. నేను నిరంతరం ఒక సెక్యూరిటీ గార్డులాగా నడవటం మొదలు పెట్టాను. మా వెనకాల అడుగుల చప్పుడు వింటూనే ఉండేదాన్ని. దగ్గరి కొచ్చిన ప్రతి ముఖాన్నీ శల్యపరీక్ష చేసి ఎక్కడ ఏ ముప్పు పొంచి ఉందోనని చూస్తుండేదాన్ని. కన్నబిరాన్ బాధ ఎంత తీవ్రమవుతుందో చూస్తున్నాను. ప్రతి మరణం ఆయనను గాయపరుస్తోంది. అసంఖ్యాకంగా చనిపోతున్న యువకుల మరణాలతో ఆయన కుంగిపోయాడు. ఒకసారి ఇదంతా నీకెలా అనిపిస్తోందని అడిగితే ఆయన అంగుళం అంగుళంగా నాశనమవుతున్నట్లుందన్నాడు. చనిపోయిన మనుషులు ఆయనకు కేవలం అంకెలు కారు. రోజు రోజుకీ ముభావంగా మారటంలో, దీర్ఘమవుతున్న మౌనాల్లో ఆయన బాధ దాగి ఉంటోంది. ఏమయిందని నేనడిగితే ' నేను ఒంటరి'నని సమాధానం. ఆయన బాధలన్నీ పంచుకోవటానికి నేనెప్పుడూ పక్కనే ఉంటున్నా ఒంటరినంటాడేమిటని నాకు కోపం వచ్చేది. ఐతే మరెవ్వరూ పంచుకోలేని ఒంటరితనం ఆయన లోలోతుల్లో ఉందని అర్థమైంది.

కొద్దికాలమే పనిచేసినప్పటికీ భార్గవ కమిషన్ గొప్ప విజయంలా, సంబరపడే విషయంగా అనిపించింది. కానీ అదీ తొందరలోనే ముగిసింది. అప్పటికి కన్నబిరాన్ నగరంలో అత్యంత ప్రముఖుడు. లాయర్‌గా అందరికీ ఆయనే కావాలి. అచ్చమైన క్రిమినల్స్ నుంచి అవినీతి పరులైన రాజకీయ నాయకుల వరకూ అందరికీ ఆయన సలహాలు

కావాలి. చట్టంలో, న్యాయశాస్త్రంలో ఆయనకున్న నైపుణ్యం, పట్టు యివే ఆయనకున్న పెద్ద బలం. చాలా గొప్పవాళ్ళనుకునే న్యాయవాదులకంటే తాను మరెంత మెరుగైన న్యాయవాదిననీ, ఐనప్పటికీ ఈ దేశంలో అతి బీదవాడికి కూడా అందుబాటులో ఉంటాననీ ఆయన గర్వపడతాడు. ఔను. ఆయన పేదల న్యాయవాది. వాళ్ళ నుంచి ఆయన పొందే భక్తి ప్రపత్తులు చూసి నేను నివ్వెరపోతుంటాను. ఆయన నిర్భయం, సాహసం, నిజాయితీలు తిరుగులేనివి. ఆయన పట్టుకుని పనిచేయని సమస్యలేదు. ఈశాన్య రాష్ట్రాలు, కాశ్మీరు, గుజరాత్, ఎల్.టి.టి.ఇ, వీరప్పన్, బాంబు పేలుళ్ళు, న్యాయం కాదనుకున్న హింసను చాలా స్పష్టంగా గట్టిగా ఎదిరిస్తాడు.

ఆయన కష్టపడి పనిచేసే తీరు, శారీరకమైన కష్టాల గురించి ఒక్క మాట మాట్లాడకుండా సహించి నిలబడగల సామర్థ్యం యివన్నీ ఆయనను అద్భుతమైన, మహోన్నతమైన వ్యక్తిని చేశాయి. వయసు మీద బడిన తర్వాతనే, ఆరోగ్యం మందగించిన తర్వాతనే ఆయన తన అలసిన శరీరం కొంత సేద తీరాలని గ్రహించాడు. దాని గురించే మా యిద్దరి మధ్యా గొడవ జరుగుతుంటుంది.

ఆయన్ని అశాంతి పెట్టే విషయాల్లో ఒకటి ఆయన మీద రేగే ద్వేషం, తిరస్కారం. ఈ ద్వేషం అపరాధ భావనలో ఉన్న పోలీసు ఆఫీసర్ల నుంచి కాదు. అదెలాగూ ఉంటుంది. కానీ సహన్యాయవాదులు, మధ్య తరగతి ప్రజలు ఆయన మీద చూపే ద్వేషం - కన్నబిరాన్ ధైర్యాన్ని చూసి, వాళ్ళు కలకూడ కనలేని పనులు కన్నబిరాన్ చేయటం చూసి వాళ్ళలో కలిగే ద్వేషం. వాళ్ళ కంటే భిన్నంగా ఉండటం భరించలేక చూపే ద్వేషం. ఆయనకొచ్చే ద్వేషపూరితమైన ఉత్తరాలు, ఫోన్ కాల్స్ తమాషా కాదు. వాటితో సహజీవనం సులభం కాదు. కానీ పేద ప్రజలు ఆయన మీద కురిపించే ప్రేమ ఆ ద్వేషాన్ని చల్లార్చే చిరుజల్లు.

ఆయన కొండపల్లి సీతారామయ్యతో దగ్గరిగా, స్నేహంగా ఉన్న రోజుల్లో మా మధ్య ఒక జోక్ నడుస్తుండేది. నువ్వు పార్టీ సభ్యుడివని అందరూ అనుకుంటారు. నిజంగా నువ్వు పార్టీ సభ్యుడివా అని నేను నిన్నడగలేను. ఎందుకంటే నవ్వు కాదని చెప్తే అది నిజమైనా నేను అబద్ధమనే అనుకొంటాను. నువ్వు నిజంగా సభ్యుడివే అయితే నాతో నిజం చెప్పలేవు అనేదాన్ని. ఎనభయ్యవ దశాబ్దంలో పుచ్చలపల్లి సుందరయ్య తరచుగా మా ఇంటికి వస్తుండేవాడు. నియమబద్ధమైన ఆయన జీవితాన్ని నేను మెచ్చుకొనేదాన్ని. కొల్లా వెంకయ్య కూడా మా యింటికొచ్చే ప్రముఖుల్లో ఒకరు. మా ఇల్లు రాజకీయ కార్యక్రమాలకు నిజమైన నెలవు. అసలు సిసలు సమాచారాన్ని అసలైన వాళ్ళ నోటి నుంచి రాబట్టటానికి తరచుగా విలేఖరులు కూడా వచ్చేవాళ్ళు.

మా ఇంటి తలుపులు స్నేహితుల కోసం ఎప్పుడూ తెరిచే ఉన్నప్పటికీ నేను మాదైన జీవితం కోసం ఒక చిన్న చోటుని అట్టిపెట్టేదాన్ని. ఆ చోటుని జాగ్రత్తగా రక్షించుకుంటూ

మాకంటూ కాస్త ప్రైవసీ, విశ్రాంతి దొరికేలా చూసుకునేదాన్ని. అది కన్నబిరాన్‌కి అమూల్యం. ఆనందం. ముఖ్యంగా తన మనవరాళ్ళతో గడిపే సమయం. తన పిల్లల బాల్యాన్నీ, వారి పెరుగుదలనూ చూడలేదనే భావం మనవరాళ్ళ బాల్యాన్ని చూసి సంతోషపడటంలో మాయమవుతుంది. కన్నబిరాన్‌కి కుక్కలంటే ప్రేమ. తను పెంచే కుక్కతో ఆయన సున్నితమైన, సుదీర్ఘమైన సంభాషణలు ఎంతో సరదాగా ఉంటాయి. ప్రస్తుతం యిరుగు పొరుగు పిల్లలకు ఆయన "కుక్కపిల్లను వెంటబెట్టుకు వచ్చే అంకుల్".

కన్నబిరాన్ గురించిన మరో విషయం. ఆడవాళ్ళు ఆయన్ని ఆరాధించే తీరు. ఎమర్జెన్సీ తర్వాత కార్యరంగంలోకి దిగిన ఎంతో మంది యువతులు ఆయన కళ్ళల్లోకి చూస్తూ రెండు వారాలు మా ఇంట్లో ఉండి ఆయన సెక్రటేరియల్ వర్క్‌లో సహాయం చేస్తామని అడిగేవాళ్ళు. అంతా వసంత్ చూసుకోగలదనే ఆయన సమాధానానికి నేను షాకయ్యేదాన్ని. ఒక పక్క మా టీము మొత్తం కూర్చుని పని చేస్తూనే ఉండేవాళ్ళం. కానీ ఈ బాంబే, ఢిల్లీల నుంచి వచ్చిన వాళ్ళ వరస చూస్తే చాలా వినోదంగా ఉండేది. దీనంతటితో నన్ను నేను ఆయన భార్యగా ఎన్నడూ చూసుకోలేదు. బీదర్ గురుద్వారాలో కన్నబిరాన్‌కి 'శిర్ పావో' సత్కారం జరిగినపుడు వాళ్ళు ఆయన భార్యని కూడా రమ్మని పిలుస్తుంటే ఎవర్ని పిలుస్తున్నారా అని నేను అటూ ఇటూ చూస్తూ ఉండిపోయాను. చివరికి వాళ్ళే నన్ను చేయిపట్టుకుని తీసుకెళ్ళి ఆయన పక్కన నిలబెట్టారు.

కన్నబిరాన్ మహా గొప్పగా వంట చేస్తాడు. ఫ్రెంచ్ టోస్ట్, ఆమ్లెట్, కాఫీ మాత్రమే. నేను వండిన వంటలు హాయిగా తింటాడు. నేను అపురూపంగా వండే వంటల రెసిపీలను, వాటి గురించి ఏ మాత్రం తెలియకుండా చాలా వివరంగా అతిథులకు చెప్పటం చూసి నేను తరచు షాక్‌లోకి వెళ్తుంటాను. వంట అంటే తినటం కాదనే అవగాహన ఆయనకింకా రాలేదు. 80 వ దశాబ్దంలో ఒకసారి నేను ఇల్లు నడపటంలో, అందరి అవసరాలు తీర్చటంలో తలమునకలై చాలా ఒత్తిడికి గురయ్యాను. అప్పుడాయన "అదంతా నాకొదిలేయ్, నేను చూస్తాను" అన్నాడు. నేను ఆశ్చర్యంగా చూస్తుంటే ఆయన "నువ్వెక్కడ సరుకులు కొంటావో ఆ షాపుల లిస్టు యివ్వు. నేను వాళ్ళకు చెక్కులు పంపించేస్తాను" అన్నాడు. నేను కాసేపలాగే చూసి కళ్ళంట నీళ్ళు కారేదాకా నవ్వాను. " అదేం కుదరదు నువ్వే ఆ షాపులు వెతుక్కుంటూ వెళ్ళి కావల్సినవి కొని డబ్బులిచ్చి రమ్మ"న్నాను. " అసలు ముందు ఇంట్లోకి ఏం కావాలో తెలుసుకో" అన్నాను. అంతే అంతటితో ఆయన గృహ నిర్వహణ బాధ్యత సమాప్తమయింది. వేదికల మీదికెక్కి శ్రమ విభజన గురించి బోధించే నేను దాన్నెప్పుడూ ఆచరణలో పెట్టలేక పోయాను. ఎందుకంటే శ్రమ విభజన నా పనిని మరింత పెంచుతుంది. ఐతే ఆయన ఫతేమైదాన్ క్లబ్ నుంచి తిండి కొనుక్కురావటానికి ఇష్టంగా వెళ్తాడు. దాని క్రెడిట్ ఆయనకిచ్చి తీరాలి గదా!

మా కుటుంబమంతా ఆయన్ని చూసి ఎప్పుడూ నవ్వుతుంటుంది. పిల్లలు ఆయనతో

చాలా చనువుగా, మామూలుగా ఉంటారు. మేం భీకరంగా వాదించుకుంటాం. సమస్యలు చర్చిస్తాం. పోట్లాడుకుంటాం. ఒక సలహా కోసమో, అభిప్రాయం కోసమో ఆయన వైపు చూసినపుడు, అది మానవహక్కులకో చట్టానికో సంబంధించినదైతే తప్ప ఆయన మాట నిలుస్తుందనే గ్యారంటీ లేదు.

తన పిల్లల్ని చూసి, వారెన్నుకున్న మార్గాలు చూసి ఆయన గర్వపడతాడు. వాళ్ళు తాము చేస్తున్న పని ఆనందంగా, దాని మీద నమ్మకముంచి, ప్రిన్సిపల్స్ పాటిస్తూ చేస్తే చాలు. వాళ్ళు భిన్నమైన రంగాలలో ప్రవేశించి అక్కడ తమదైన ముద్ర వేయటానికి చేసే పోరాటాలు ఆయనకు సంతృప్తినిస్తాయి. (ఐతే ఆయన గర్వం ఎంత అమాయకమైందంటే, బొత్తిగా చదువురాని పల్లెటూరి మనిషి విదేశాల్లో ఉద్యోగం చేసే తన పిల్లల్ని చూసి గర్వపడినట్లే ఉంటుంది) దానికి కారణం చిన్నతనంలో ఆయన పడిన కష్టాలు, చదువుకోటానికి పడిన ఆరాటం అనుకోవచ్చు. పిల్లలకొక దారి చూపించటానికి మాకున్న సమయం, డబ్బు చాలా తక్కువైనా, వాళ్ళు మమ్మల్నీ, మా పనిని గౌరవించటం మాకు ఎనలేని తృప్తినిస్తుంది.

టి.వి. ఛానళ్ళ వాళ్ళు ఆయన ఇంటర్వ్యూ కోసం వచ్చినపుడంతా మేం " ఆదిగో డాన్ వెళ్తున్నాడు చూడండంటూ" నవ్వుకుంటాం. మా విస్తృతమైన కుటుంబంలో స్నేహితులందరి పేర్లూ చెప్పకపోవటం ఒకరి పేరుచెప్పి యింకొకరి పేరు మర్చిపోతాననే భయంతోనే.

ఐతే 80,90 దశాబ్దాలలో మా కుటుంబంలోకి ఇద్దరు అమూల్యమైన మనుషులొచ్చారు. వాళ్ళిద్దరూ మా అందరితో అనేక పద్ధతుల్లో స్నేహం చేశారు. వాళ్ళిద్దరి లోటూ మాకు తీరనిది. వాళ్ళు కాళోజి, కొండపి. వారి రాక మా జీవితాల్లోకి ఎంతో సంపదను, కాంతినీ తెచ్చింది. శత్రుఘ్న లేని లోటు యిప్పటికీ ఉంది.

కణ్ణాను తన అనుభవాల గురించి రాయమని నేనెప్పుడూ అడుగుతుండేదాన్ని. రాయటం చాలా ముఖ్యమనీ, ఎక్కడో ఎవరో ఆయన జీవితానుభవాలనుంచి నేర్చుకుంటారని నా అభిప్రాయం. ఆయన చదివిన పుస్తకాలే కదా ఆయనకింత బలాన్నిచ్చింది. ఆయన సభలలో చెప్పే విషయాలు ఆ సమూహం లాగే మాయమైపోతాయి. అందుకే ఆయన సభలకు వెళ్ళటం తగ్గించి కంప్యూటర్ ముందు కూర్చుని కష్టపడి టైప్ చేయటం చూసి సంతోషించాను. "వేజెస్ ఆఫ్ ఇంప్యూనిటీ" పుస్తకం ప్రచురితమైనపుడు ఆనందించాను. ఈ "24 గంటలు"కు వచ్చిన స్పందన అపూర్వం. ఇది కూడా పుస్తక రూపంలో వస్తున్నందుకు మరీ సంతోషం. ఈ పనిలో అమర్ చూపిన శ్రద్ధ, చొరవ, వేణు పడిన శ్రమ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఆంధ్రప్రదేశ్ ప్రజల అభిమానాన్ని పొందిన వ్యక్తి జీవితాన్ని ఈ పుస్తకం పొందుపరుచుకుంది. ఈ పుస్తకం ఆయన్ని ప్రేమించే ప్రజలకోసం. ఆయన్నించి నేర్చుకోవాల్సిన ప్రజల

కోసం. ప్రేమ తప్ప మరింకే కారణం లేకుండా దీపా ధనరాజ్ తీసిన "ది అడ్వకేట్" సినిమా ఆయన అనన్య సామాన్యమైన జీవితాన్ని పట్టుకోగలిగింది. భవిష్యత్ తరాలకు యిది మిగిలింది, అని తృప్తిగా ఉంది. దాంతో వాళ్ళేం చేసుకుంటారో అది వేరే విషయం.

కన్నబిరాన్ జీవితంలో నా ప్రత్యేకమైన పాత్ర ఆయన పాదాలను నేల మీద ఆనేలా చేయటమే. పొగడ్తలను, పొగిడేవారిని దూరంగా ఉంచుతూ, వాటితో నేను కొట్టుకు పోకుండానే ఆయన మీద నా యిష్టాన్ని నిలుపుకోవటం. ఆయన మెగా నాయకుడిగా తయారవకుండా సాధారణ మానవ లక్షణాలను నిలపుకునేలా కాపాడటం. ఆయన తననుంచి తాను దూరం కాకుండా ఉంచటంలో నేను సహాయపడ్డాను. కన్నబిరాన్ సామాన్య మానవుడు. తన సామాన్య లక్షణాలను పోగొట్టుకోకుండా అసామాన్య జీవితాన్ని గడిపిన అదృష్టవంతుడు.

**- వసంత కన్నబిరాన్**

# ఈ రోజే పుట్టిన రోజు

మృత్యువు రోజూ మన ఉచ్ఛ్వాస నిశ్వాస నీడల్లో
మొగలి పొదల్లో నాగుబాములా సయ్యాటలాడుతూనే వుంటుంది
మఫ్టీలోనూ యూనిఫామ్‌లోనూ
ఖాకీయే కానక్కర్లేదు కాషాయమూ కావచ్చు
ఖాదీ తెలుపూ కావచ్చు
రూపంలో ఎరుపూ కావచ్చు
సెప్టెంబర్ మూడు తర్వాత మనం బతికే వున్నామంటే
అది యాక్సిడెంటల్
లేక కాళోజీ అన్నట్లు ఆనాడే చచ్చిపోయామా
జీవితాన్ని ప్రేమించేవాణ్ణి మృత్యువు ద్వేషిస్తుంది
స్వేచ్ఛకు తగిలించిన సంకెల సంగతి సరే
ఎక్కడ ఏ గొలుసు వెనక్కి లాగకుండా రెక్కలున్నాయి చెప్పండి.
మీరు
అంధ దేవతల కనుల పండుగగా పుట్టిన రోజు జరుపుకున్నారు
మేము
నిత్యనిందితులుగా మీకు పుష్పగుచ్ఛం అందించాం
మూడు తలల సింహం మాంసల పాదాల కింద
వాడిగోర్ల మధ్యన కదలని ధర్మచక్రం స్వభావాన్ని
నిర్వచించడంలోనే
మీ మధ్యాహ్నపుటెండపొడ అరుగుల దగ్గరకొచ్చింది.
నేనూ
సాలిటరీ కన్‌ఫైన్‌మెంట్‌లో
సాల్‌గిరాలు జరుపుకుంటూనే వున్నాను
లాకప్‌లలో 'ఎన్‌కౌంటర్'లలో అజ్ఞాతంగా
ఎందరి పుట్టిన రోజులు అదృశ్యమవుతున్నాయో
రోజూ చచ్చేవాని కోసం
మార్చురీలో కూడ జాగా ఖాళీలేదు
కాలానికి జాలీలేదు
ఒక్కసారే చచ్చేవాళ్ళం గనుకనే
చావు మననంత అపురూపంగా పిలుస్తున్నది
చచ్చేదాకా సజీవంగా వుంటానని చాటి చెప్పారు గనుకనే
ఈ రోజే మీ పుట్టిన రోజు

**- వరవరరావు**

# ప్రారంభం

డెబ్బై ఆరు సంవత్సరాల జీవితంలో, అర్ధ శతాబ్దానికి పైబడిన న్యాయవాద వృత్తిలో, నేనెన్నో అనుభవాలు గడించాను. చిరస్మరణీయమైన జ్ఞాపకాలు, సమాజం గురించీ, మానవ సంబంధాల గురించీ, ఉద్యమాల గురించీ చెప్పదగిన విశేషాలు అనేకం ఉన్నాయి. కాని నా ఈ జీవిత కథను ఆత్మకథగా రాయాలని నేననుకోవడం లేదు. అనుభవించిన జీవితం గురించి రాసుకోవడం ఒక అలసట గొలిపే ప్రక్రియ. ఒక వ్యక్తిని రూపొందించిన ఘటనల గురించి ఆ వ్యక్తే గుర్తు తెచ్చుకోవడం కష్టసాధ్యమైన ప్రయత్నం. అందువల్ల నా జీవిత చరిత్ర వ్యక్తిగా నా సొంత గొడవగా ఉండగూడదని నా ఉద్దేశ్యం.

నేనొక వ్యక్తిగా, పౌరహక్కుల ఉద్యమ కార్యకర్తగా, న్యాయవాదిగా, ప్రజాస్వామిక వాదిగా తయారు కావడంలో నా చుట్టూ జరిగిన అనేకానేక ఘటనల ప్రభావం ఉంది. అనేకమందితో నా సంబంధాల వల్ల, నా సంభాషణల వల్ల, ఆదాన ప్రదానాల వల్ల నా వ్యక్తిత్వం రూపుదిద్దుకుంది.

తెలుగునేల మీద నా జీవితం, ఈ ప్రాంతంలో జరిగిన సమరశీల, వామపక్ష ఉద్యమాల పట్ల నా ప్రతిస్పందనలు, న్యాయవాదిగా ఈ సమాజం నా నుంచి కోరిన సేవలు, ఉద్యమజీవుల హక్కులను పరిరక్షించేందుకు నేను చేసిన న్యాయపోరాటాలు, ఈ రాష్ట్రంలోనూ, దేశంలోనూ ఎక్కడ ప్రజాస్వామిక హక్కుల ఉల్లంఘన జరిగినా నేనక్కడికి వెళ్ళి బాధితుల పక్షాన న్యాయపోరాటం సాగించాలని బాధితులు ప్రత్యేకంగానూ, సమాజం సాధారణంగానూ వ్యక్తం చేసిన ఆశలు-ఇవన్నీ నా వ్యక్తిత్వంలో భాగం. నా జీవితంలో విడదీయరాని భాగం. నా జీవితంలోని ఆ భాగాన్ని సమీక్షించుకోవడం, పునరావలోకనం చేయడం అవసరం. అంటే నా జీవిత కథ నేను ఏ సామాజిక పరిణామాలకు స్పందించానో ఆ సామాజిక పరిణామాల వివరణగా ఉండాలి. ఆ సామాజిక చరిత్రలో నేనెట్లా భాగమయ్యానో, పాలుపంచుకుంటూనే ఆ చరిత్రను నేనెట్లా చూశానో వివరించడానికే నా ఈ జీవిత కథ.

అయితే న్యాయవాద వృత్తిలోకీ, పౌరహక్కుల ఉద్యమంలోకీ నేను ఎలా ప్రవేశించానో వివరించడానికి నేపథ్యంగానైనా నా జీవితంలోని తొలిరోజుల గురించి చెప్పడం అవసరం.

మా పూర్వీకులు తమిళులు. ఎన్నో శతాబ్దాల కింద నెల్లూరు చేరి అక్కడే స్థిరపడిన కుటుంబం మాది. మా నాన్న డా॥ కె.జి.అయ్యంగార్ సికిందరాబాద్‌లోని కింగ్ ఎడ్వర్డ్ మెమోరియల్ (ప్రస్తుత గాంధీ) ఆస్పత్రిలో నేత్ర వైద్యుడిగా పని చేస్తుండేవాడు. అప్పుడు మా కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగానే ఉండేది గాని మా నాన్న రెండో పెళ్ళి చేసుకోవడంతో

మా అమ్మ పిల్లలను తీసుకుని నెల్లూరు వెళ్ళవలసి వచ్చింది. ఆమె చాలా దృఢమైన అభిప్రాయాలున్న, ఎవరికీ తలవంచని మహిళ. మా నాన్న గురించి నాకు ఉన్న జ్ఞాపకాలు ఆయన చాలా హింసాత్మకమైన, ఉద్రేకపూరితమైన మనిషి అని. ఆయన మా అమ్మను కొడుతూ ఉండడం కూడ నాకు గుర్తు.

మొత్తం మీద మా అమ్మ నెల్లూరుకు చేరి మా పూర్వీకుల ఇంట్లో ఉంటూ, పిత్రార్జిత మైన కొద్ది భూమి మీద వ్యవసాయంతో జీవనం సాగించడం మొదలు పెట్టిన తర్వాత మా ఆర్థిక స్థితి దిగువ మధ్యతరగతికి పడిపోయింది. అక్కడ నేను ఆరోఫారం దాకా తెలుగు మాధ్యమంలోనే చదువుకున్నాను. ఎస్ఎస్ఎల్‌సి అయిపోయిన తర్వాత నాకిక మద్రాసు వెళ్లక తప్పలేదు. మా పెద్దమ్మ కొడుకు, రాజప్ప అని మేం ప్రేమగా పిలుచుకునే శ్రీనివాస్ రాఘవన్, దగ్గరికి వెళ్ళాను. తండ్రి మరణించిన తర్వాత పుట్టిన మా రాజప్ప ఎన్నో కష్టాలు పడి జీవితంలో పైకి వచ్చాడు. ఆయన నా కన్న పది సంవత్సరాలు పెద్ద. చాలా ప్రజాస్వామికంగా ఉదారవాద భావాలతో ఉండేవాడు. ఆయన అప్పటికే మద్రాసులో న్యాయవాద వృత్తి ప్రారంభించాడు. మంచి క్రికెట్ ఆటగాడిగా, క్రికెట్ రాజకీయాలలో చురుగ్గా పాల్గొంటూ ఉండేవాడు.

మద్రాసులోని పచ్చయప్ప కాలేజిలో నేను ఇంటర్మీడియట్‌లో చేరేటప్పటికి స్వాతంత్ర్యోద్యమం ముగింపుకు వస్తోంది. సర్ పెతిక్ లారెన్స్ నాయకత్వంలోని కాబినెట్ మిషన్ తన ప్రతిపాదనలను దేశం ముందుంచడం, ఆ ప్రయత్నంలో భాగంగా కాబినెట్ మిషన్ మా కాలేజిని కూడ సందర్శించడం నాకు గుర్తు.

సరిగ్గా ఆ సమయంలో నా పై పడిన మూడు నాలుగు ప్రభావాలు నా వ్యక్తిత్వాన్ని రూపుదిద్దాయనుకుంటాను.

మొదటిది, విపరీతంగా పుస్తకాలు, సాహిత్యం చదవడం. ఇంగ్లీషు సాహిత్యం చాలా ఎక్కువగా చదివాను. న్యాయశాస్త్ర విద్య అయిపోయే సమయానికి ఇంగ్లీషు నవలల్లో చదవదగినవన్నీ చదివేశాను. నాకు ఈ సాహిత్య ఆసక్తి కలగడానికి కారణం మా అన్నయ్య శేషాద్రి. ఆయన అప్పటికే కమ్యూనిస్టు. నెల్లూరులో సఫాయి కర్మచారి యూనియన్ నాయకుడిగా ఉండేవాడు. ఆయన విపరీతంగా పుస్తకాలు చదివేవాడు. నాకు ఆ పుస్తకాలన్నీ ఇచ్చి చదివించేవాడు. ఆ పుస్తకంలో ఏముందో చెప్పమనేవాడు. మా ఇద్దరి మధ్య తొమ్మిది సంవత్సరాలు తేడా ఉన్నా నాతో చాలా స్నేహంగా ఉండేవాడు. నాకూ ఆయన దగ్గర చాలా చనువుండేది. అయితే తనలో ఉన్న విప్లవాభినివేశం మూర్ఖత్వం స్థాయిలో ఉండేదని నాకిప్పుడనిపిస్తుంది. ఏ భావాలయినా-అవి వామపక్ష భావాలయినా, అభివృద్ధి నిరోధక భావాలయినా-అంత తీవ్రంగా ఉంటే పిచ్చితనం అంచులలో ఉంటాయని, మూర్ఖంగా ఉంటాయని నాకు అర్థమయింది. నా మీద ఆయన ప్రభావం ఉన్నప్పటికీ అది అంత తీవ్రతగా పరిణమించలేదు. ఎక్కువగా చదవడానికీ ఆలోచించడానికీ మాత్రం పనికి వచ్చింది.

అప్పుడే హైదరాబాద్ రాష్ట్రంలో కమ్యూనిస్టుల మీద తీవ్రమైన అణచివేత చర్యలు మొదలయ్యాయి. వసంత వైపు బంధువు, హైదరాబాదు రాష్ట్రంలో ప్రఖ్యాత కార్మిక నాయకుడు ఎఎస్‌కె అయ్యంగార్ నిర్బంధాన్ని తప్పించుకోవడానికి అజ్ఞాతంలోకి వెళ్ళ వలసి వచ్చింది. ఆయన మద్రాసు వచ్చి తలదాచుకోవలసి వచ్చింది. కమ్యూనిస్టు పార్టీ మీద నిషేధం ఉండిన ఆ రోజుల్లో అయ్యంగార్‌కు మా రాజప్ప ఆశ్రయం ఇచ్చాడు. క్రికెట్ ఆటగాడిగా రాజప్పకు చాలా పరపతి ఉండేది. ఆ పరపతి వల్ల కావచ్చు అయ్యంగార్ అజ్ఞాత జీవితం సజావుగానే గడిచింది. అయ్యంగార్ నాకు ఎన్నో పుస్తకాలు పరిచయం చేశాడు. ఆయన చెప్పగా మారిస్ డాబ్ 'డెవలప్‌మెంట్ ఆఫ్ కాపిటలిజమ్', శేషాద్రి చెప్పగా టిఎ జాక్సన్ ఫిలాసఫీ పుస్తకాలు చదివాను. తప్పనిసరిగా చదవాల్సిన పుస్తకాల జాబితా ఉండేది.

మరొక ప్రభావం పచ్చయప్ప కళాశాలలో, మద్రాసులో ఉండిన వాతావరణం. ఇంటర్మీడియట్ పచ్చయప్ప కళాశాలలో పూర్తిచేసిన తర్వాత వివేకానంద కాలేజ్‌లో బిఎ (ఆనర్స్) ఎకనామిక్స్, పాలిటిక్స్, ఇండస్ట్రియల్ లేబర్ ప్రాబ్లమ్స్ ప్రధానాంశాలుగా చేశాను. ఆ నాలుగైదు సంవత్సరాలు మద్రాసు రాజకీయ వాతావరణం చాలా వేడిగా, వాడిగా ఉండేది. కాలేజిలో చదువుకోవలసినది ఎక్కువగా ఉండేది కాదు. విద్యార్థులకు కళాశాలలో వ్యక్తృత్వ పోటీలు తప్పనిసరిగా ఉండేవి. పచ్చయప్ప కాలేజిలో ద్రవిడ ఉద్యమం చాలా బలంగా ఉండేది. పెరియార్ ఇవిఆర్ రామస్వామి నాయకర్ ప్రభావం చాలా ఉండేది. కాలేజిలోనూ, బయట పట్టణంలోనూ బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమం, ఆ భావాలు ప్రబలంగా ఉండేవి. భారత సమాజం ఒక బహుళ సమాజమని, దీన్ని ఏదో ఒక పరిమితిలో పెట్టడం అసాధ్యమని మొట్టమొదటి హెచ్చరిక ద్రవిడ కజగం ఉద్యమమే. అది భారత స్వాతంత్ర్యం ఎదుర్కొన్న మొట్టమొదటి సవాల్.

మా పచ్చయప్ప కాలేజిలో తమిళ అధ్యాపకుడిగా ఉండిన అంబు అళగన్ ద్రవిడ ఉద్యమ నాయకుడు. మా కాలేజి ద్రవిడ కజగం విద్యార్థి ఉద్యమ కేంద్రం. పెరియార్ ఉపన్యాసాలు ప్రజల్ని ఉద్రూతలూగిస్తుండేవి. ఆయన గొప్ప ప్రచారకుడు. ఆత్మగౌరవ ఉద్యమం, బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమాల ప్రభావం వీధుల్లో కనబడుతుండేది. మద్రాసు వీధుల్లోని బ్రాహ్మణ భోజన హోటళ్ళ ముందు, 'బ్రాహ్మణ' పదం తొలగించమని ప్రదర్శనలు జరుగుతుండేవి. బ్రాహ్మణ పదాన్ని తొలగించి శాకాహార అని చేరుస్తుండే వాళ్ళు. ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే అది హాస్యాస్పదంగా, విషాదకరంగా అనిపిస్తుంది. 'బ్రాహ్మణ' నుంచి 'శాకాహార' కు మార్చడం కన్న తీవ్రమైన సమస్యలు లేవా అనిపిస్తుంది.

అప్పుడే జాతీయ సైన్స్ కాంగ్రెస్‌ను ప్రారంభించడానికి నెహ్రూ మద్రాసు వచ్చాడు. ఆయనకు నిరసనగా పెద్దఎత్తున నల్లజెండాల ప్రదర్శన జరిగింది. బ్రాహ్మణ వ్యతిరేక

ఉద్యమం, హిందీ వ్యతిరేకతను కూడా వ్యక్తం చేసింది. స్టేషన్లలో హిందీ బోర్డుల మీద తారు పూసేవాళ్ళు. హిందీని జాతీయభాషగా అంగీకరించబోమని తమిళ ప్రజలు ధిక్కార ప్రకటన చేశారు. హిందీ వ్యతిరేకత ఉత్తరాది నాయకుల పట్ల వ్యతిరేకతగా పరిణమించింది. సాధారణంగా ఓపెన్ టాప్ జీపులో తిరిగే నెహ్రూ మద్రాసులో ఆ అలవాటు మానుకున్నాడు.

ద్రవిడ కజగం ఉద్యమం ఆ తర్వాత ఏ రకంగా మారిపోయినా, దాని తొలిరోజులు ఉత్సాహభరితంగా ఉండేవి. అది ఎవరో ఒకరిద్దరు రెచ్చగొడితే ప్రారంభమైన ఉద్యమం కాదు. అది గొప్ప విశ్వాసాన్నీ, ఆశనూ ప్రేరేపించిన ఉద్యమం. నేను బ్రాహ్మణుడిగా పుట్టినప్పటికీ, ఆ కారణం వల్ల పచ్చయప్ప కాలేజిలో బి.ఎ.లో సీటు సంపాదించలేకపోయి నప్పటికీ, ఆ బ్రాహ్మణ వ్యతిరేక, ద్రవిడ ఉద్యమాన్ని తమిళ సమాజ అభ్యున్నతి కోసం సాగుతున్న ఉద్యమంగా గుర్తించాను. అది నిజంగా తమిళ జాతి పునరుజ్జీవన ఉద్యమం. బ్రాహ్మణేతర కులాల మధ్యతరగతి వ్యక్తులు అధికార స్థానాలకు రావడం ఆ ఉద్యమం లేకపోతే జరిగి ఉండేది కాదు.

అది ఒక వెల్లువలా సాగిన ఉద్యమం. అప్పటికే చాల ప్రముఖుడైన కామరాజ్ నాడార్‌ను అనామకుడైన ఒక న్యాయశాస్త్ర విద్యార్థి ఓడించగలిగాడంటే ఆ ఉద్యమ ప్రభావం తెలుసుకోవచ్చు.

ఈ సామాజిక ఉద్యమాల, సాహిత్య అధ్యయనపు ప్రభావాలకు తోడు మా అన్న రాజప్ప ప్రభావం కూడా నా మీద బలంగానే పడిందనుకుంటాను. ఆయన న్యాయవాద వృత్తిలో పైకి ఎదగడం, నేను కూడ న్యాయశాస్త్రం చదివి ఆయనతో పాటే కలిసి పని చేయాలని ఆయన కోరుకోవడం కూడ నేనిట్లా మారడానికి పునాదిగా పనిచేసి ఉంటాయి.

రాజప్ప చాల అననుకూలమైన పరిస్థితులలో న్యాయవాదిగా తనను తాను తీర్చిదిద్దు కున్నాడు. నేను న్యాయశాస్త్ర పట్టా పుచ్చుకునే నాటికి ఆయనకు న్యాయవాదిగా మంచి పేరు వచ్చింది. ఆ రోజుల్లోనే నాలుగంకెల సంపాదనకు చేరాడాయన. అప్పుడు నాలుగంకెల సంపాదన సాధించడమంటే సంపన్నవర్గంలో చేరినట్టే. అప్పుడే ఆయన కారు కొనుక్కున్నాడు. సొంత గ్రంథాలయం నిర్మించుకోవడం మొదలుపెట్టాడు. ప్రతి న్యాయవాదీ ఈ రెండు విజయాలూ సాధించాలని కోరుకునేవాడారోజుల్లో. ఆస్తి లేకుండా, కుటుంబ నేపథ్యం లేకుండా న్యాయవాద వృత్తిలో ప్రవేశించిన వాళ్ళెవరికైనా అవి రెండూ సాధించడానికి పదేళ్ళ కఠోరశ్రమ అవసరమయ్యేది.

నేను చదువుల్లో ఎప్పుడూ సగటు విద్యార్థిగానే ఉండేవాణ్ణి గనుక నేనేదో గొప్ప చదువులు చదువుతాననే ఆశ నాకెప్పుడూ లేదు. అర్థశాస్త్రంలో నేను ఎంఎ పూర్తి చేశాక పోటీ పరీక్షలకు హాజరయి ఐఎఎస్, ఐఎఫ్ఎస్ లాంటి సర్వీసులలోకి వెళ్ళడమో, బర్మాషెల్, ఎస్సో, కాల్టెక్స్ వంటి ఆయిల్ కంపెనీలలో చేరడమో లేదా న్యాయశాస్త్రం చదువుకుని

న్యాయవాదిగా మారడమో అనే అవకాశాలే ఉన్నాయి. అయితే లా కాలేజిల్లో సీట్లు చాలా సులభంగా దొరికేవి గనుక అదొక్కటే వీలయిన పనిగా కనిపించింది. ఇటు న్యాయశాస్త్రం చదువుతూనే అటు పోటీ పరీక్షలు రాయొచ్చుననుకోండి, కానీ నేనాపని చేసి ఇంటర్వ్యూలో ఫెయిలయిపోయాను. వ్యక్తిత్వ పరీక్ష అనబడేదానిలో సున్న మార్కులు తెచ్చుకోవడం అనే అసాధారణమైన ప్రతిభ కనబరిచాను నేను. నా వ్యక్తిత్వాన్ని అంత కచ్చితమైన గణితశాస్త్ర ప్రమాణంతో కొలవడం నన్నిప్పటికీ ఆశ్చర్యపరుస్తుంది. అలా నేను న్యాయశాస్త్రంలో చేరి మా రాజప్పను సంతోషపెట్టాను.

నేను న్యాయశాస్త్రం చదివిన రెండు సంవత్సరాలూ నా విద్యార్థి జీవితంలోకెల్లా సుఖంగా గడిచాయి. చాలా తరచుగా మిత్రులకు కాఫీ టిఫిన్‌లు ఇప్పించగలుగుతుండే వాణ్ణి. పుస్తకాలు కొనుక్కోవడానికి, స్నేహితులతో సినిమాలకు వెళ్ళడానికి కూడా చేతిలో డబ్బులు ఆడుతుండేవి.

న్యాయవాద వృత్తితో పాటు రాజప్పకు క్రికెట్ అన్నా, క్రికెట్ రాజకీయాలన్నా చాలా ఆసక్తి ఉండేది. ఆ రోజుల్లో ఎ డివిజన్ లీగ్ టీమ్‌గా ప్రఖ్యాతిగాంచిన ట్రిప్లికేన్ క్రికెట్ క్లబ్‌లో ఆయన సభ్యుడుగా ఉండేవాడు. టెస్ట్ క్రికెటర్లు ఎం.జె.గోపాలన్, సి.ఆర్.రంగాచారి కూడ ఆ టీమ్‌లో ఆడేవారు.

నా న్యాయశాస్త్ర విద్య అయిపోయే సమయానికి రాజప్ప ఈ క్రికెట్ రాజకీయాలలో పైపైకి ఎదిగి భారత క్రికెట్ కంట్రోల్ బోర్డ్ కార్యదర్శి అయ్యాడు. ఆ పదవిలో ఉండడ మంటే న్యాయవాద వృత్తిని వదిలేసి సాయంకాలాలన్నీ క్రికెట్ బోర్డు పనుల్లో గడపడమో, ఎక్కువ రోజులు ప్రయాణాలు చేయడమో అవసరమయ్యేది. అప్పటికి ఆయన న్యాయవాద కార్యాలయంలో టి.అర్జునన్ అనే ఒకే ఒక్క జూనియర్ ఉండేవాడు గాని ఆయన పెద్దగా వాదనలు చేయగలిగేవడు కాదు. ఏదో ఒక రకంగా ఆఫీసును నిభాయించ గలిగేవాడు గాని, రాజప్ప దగ్గర గుమస్తాగా ఉండిన మలయప్ప అయ్యర్‌ను అదుపులో పెట్టగలిగేవాడు కాదు.

ఆ రోజుల్లో ప్లీడర్ గుమస్తాలు చాలా శక్తిమంతులుగా ఉండేవాళ్ళు. ప్లీడర్‌ను కలవాలో వద్దో వాళ్ళే నిర్ణయించేవాళ్ళు. కొంతమంది ప్లీడర్ గుమస్తాలు ఎంత దాబుగా ఉంటారంటే వాళ్ళే ప్లీడరేమోనని కక్షిదార్లు అనుకుంటారు. ఆ గుమస్తాలకే తమ ప్లీడరు కార్యాలయం మీద పూర్తి అదుపు ఉంటుంది. ఏ ఫైలు ఎక్కడుందో, ఏ కేసు ఏ స్థాయిలో ఉందో సమస్త సమాచారం వాళ్ళ దగ్గరే ఉంటుంది.

ప్లీడర్ చెప్పినా చెప్పకపోయినా ఈ గుమస్తాలే రైల్వేస్టేషన్లో, బస్‌స్టాండ్లలో కాపువేసి కక్షిదార్లను కనిపెట్టి తమ ప్లీడర్ దగ్గరికి తీసుకు వచ్చేవారు. ఒక మనిషిని చూడగానే అతను కక్షిదారో కాదో కనిపెట్టగలిగిన నేర్పు వారికి ఉండేది.

మా మలయప్ప అయ్యర్ కూడా అటువంటి గుమస్తానే. కాని రాజప్ప పేరు

ప్రఖ్యాతులు పెరిగిపోతూ ఎక్కువ కేసులు వస్తున్న రోజుల్లోనే ఆయన క్రికెట్ కంట్రోల్ బోర్డు కార్యదర్శి కావడంతో ఆఫీసు గందరగోళం అయింది. కక్షిదార్లను కలవడానికి రాజప్పకు సమయమే దొరికేది కాదు. మలయప్ప అయ్యర్‌కు గుర్రపు పందాల మోజు వల్ల ఆఫీసు దిగజారడం మరింత పెరిగింది.

కక్షిదార్లకు ప్లీడర్ దొరకకపోవడమనేది మామూలు విషయమే. తమ కేసు నిర్లక్ష్యం చేస్తున్నాడనో, డబ్బు విషయంలో సరిగ్గా లేడనో ఏ కక్షిదారూ తమ ప్లీడర్ మీద కోపం తెచ్చుకోడు. నిజం చెప్పాలంటే ప్లీడరుకూ కక్షిదారుకూ ఉండే సంబంధం అనైతిక సంబంధం. కక్షిదారు తీసుకు వచ్చిన వ్యాజ్యం ఎటువంటిదో ఎప్పుడూ తీర్పు చెప్పగూడదని, తటస్థంగా ఉండాలని ప్లీడరు నేర్చుకునే మొదటి పాఠం. ఒక సాంకేతిక నిపుణిడిలాగ న్యాయవాది కూడా వ్యాజ్యంతో నిరపేక్షంగా వ్యవహరించాలి. కనుక ఒక వ్యాజ్యం తీసుకోవడంలో నీతి-అవినీతి ప్రశ్న లేదు. తాను చేపడుతున్న వ్యాజ్యపు న్యాయాన్యాయాల గురించి న్యాయవాది ఆలోచించగూడదు. అంటే న్యాయవాది తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని ద్వంద్వ స్వభావంతో చూడగలగాలి. ఒక ప్రపంచం తన కక్షిదారుల, వారి వ్యాజ్యాల ప్రపంచం. రెండో ప్రపంచం న్యాయవాది వ్యక్తిగత జీవితానికి సంబంధించినది. అతనికి తన కుటుంబంతో, న్యాయవాదులు కాని మిత్రులతో, నచ్చిన ప్రాపంచిక దృక్పథంతో సంబంధం ఉన్నది. న్యాయవాదికి పేరు ప్రఖ్యాతులు పెరిగిన కొద్దీ ఈ రెండు ప్రపంచాలలో సొంత ప్రపంచం కుంచించుకు పోతూ ఉంటుంది. కక్షిదారుల ప్రపంచం విస్తరిస్తూ ఉంటుంది.

స్వేచ్ఛాయుత పోటీ ప్రపంచంలో ప్రత్యర్థి కన్న ఒక మాట ఎక్కువ అనడమే ప్రమాణమైన చోట న్యాయవాది భీకరమైన పోటీలోకి దిగిపోతాడు. తొలిరోజుల్లోనైతే న్యాయవాదులు తమ జ్ఞానంతో, పాండిత్యంతో, వాగ్ధాటితో ప్రత్యర్థుల మీద పైచేయి సాధించేవారు. అందువల్లనే ఆ కాలం ప్రతిభావంతులైన న్యాయవాదు లెందరినో తయారు చేసింది. ఈ ప్రతిభతోనే వారికి ఆత్మసంతృప్తి దొరికేది. ఇప్పటిలాగ సంపాదనాపేక్ష అంతగా ఉండేదికాదు. నిజం చెప్పాలంటే న్యాయవాదులు వెచ్చించే శ్రమకూ, ఖర్చుపెట్టే కాలానికీ వారి సంపాదనకూ ఎప్పుడూ పొంతన ఉండేది కాదు.

న్యాయవాదులకు పైకి ఎగబాకడానికి 'నిచ్చెనలు' ఎక్కడా దొరకవు. ఒక యువ న్యాయవాది తన వృత్తి ప్రారంభించేటప్పుడు ఆహ్వానించే బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంభీరంగా సర్ అల్లాడి ఎంత అట్టడుగు నుంచి ప్రారంభించి శిఖరాలు అధిరోహించారో వివరిస్తారు. ఎవరికైనా పైకిపోయే అవకాశం ఉందంటాడు. కాని సమాజం ఒక అల్లాడిని గుర్తించి పైకి తీసుకుపోయే లోపల, ఎంతోమంది అల్లాడిలు విఫలమై ఉంటారు. నిచ్చెనలు దొరకక నిస్సహాయులయిపోయి ఉంటారు.

న్యాయవాద వృత్తిలోని వాస్తవ జీవితానికీ, ఆ వృత్తి ఔన్నత్యం గురించిన గంభీర

ప్రవచనాలకూ మధ్య అంతరం నేను న్యాయవాద వృత్తిలో ప్రవేశించిన క్షణమే నాకు అర్థమైంది. జీవితంలో అనుసరించక తప్పని ఈ ద్వంద్వ ప్రవృత్తి వల్లనే న్యాయవాదులు కుహనా జీవితం జీవిస్తుంటారనుకుంటాను.

అలాంటి ఆలోచనలతో 1953లో నేను న్యాయశాస్త్ర విద్య పూర్తిచేసి, 1954 నవంబర్ చివరిలో మద్రాసు హైకోర్టులో న్యాయవాదిగా చేరాను. అప్పటి మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పి.వి.రాజమన్నార్ నేతృత్వంలోని ఫస్ట్ కోర్టులో నన్ను మా రాజప్ప న్యాయవాదిగా నమోదు చేయించాడు. ఇక్కడ మద్రాసు హైకోర్టు గురించి ఒక విషయం చెప్పాలి.

మద్రాసు హైకోర్టు బ్రిటిష్ చక్రవర్తి ఆజ్ఞ ప్రకారం ఏర్పడిన హైకోర్టులలో ఒకటి. భారత రాజ్యాంగం రూపొందించిన ఐదు దశాబ్దాల తర్వాత కూడా ఇంకా మద్రాసు హైకోర్టు బ్రిటిష్ ప్రభుత్వ లెటర్స్ పేటెంట్ ప్రకారమే నడుస్తోంది. ఇవాళ్టికి కూడా చీఫ్ జస్టిస్ అధికారాలకు మూలం 1919 భారత ప్రభుత్వ చట్టమే.

అలా మద్రాసు హైకోర్టులో న్యాయవాద వృత్తిలో ప్రవేశించానో లేదో ఒక విషాదం సంభవించింది. 1955 జనవరి 31న నాగపూర్ దగ్గర జరిగిన విమాన ప్రమాదంలో మా రాజప్ప మరణించాడు. అంతకుముందు రోజు సాయంకాలం మౌంట్ రోడ్‌లోని దక్కన్ ఎయిర్‌వేస్ కార్యాలయం దగ్గర నేనాయనను వదిలేశాను. మర్నాడు ఉదయమే ఆ విమాన సంస్థ కార్యాలయం నుంచి నాకు ఫోన్ చేసి నాగపూర్ దగ్గర గాలిలోకి ఎగురుతుండగా విమానం కూలిపోయిందని, ఒక్కరు కూడా బతకలేదని చెప్పారు. ఆజానుబాహుడుగా ఉండే మా రాజప్ప మృతదేహాన్ని ఐదున్నర అడుగుల శవపేటికలో తీసుకొచ్చారు. ఎఎస్‌కె అయ్యంగార్ ఆ మృతదేహాన్ని గుర్తించి తీసుకొచ్చాడు.

రాజప్ప మృతితో న్యాయవాద వృత్తిలో నేను అనాథనయిపోయాను. అప్పటికి నేను వృత్తిలోకి ప్రవేశించి కొద్దికాలమే అయినందువల్ల రాజప్ప దగ్గర ఉన్న కేసు లన్నిటినీ నేను కొనసాగించలేకపోయాను. ఆయనకు అప్పగించిన కేసులను ఈ కొత్త కుర్ర న్యాయవాదికి అప్పగించడానికి కక్షిదారులకు నమ్మకం చాలలేదు. కనుక నేను ఒక్కొక్కటిగా ఆ కేసులను వదిలించుకోవడం, రాజప్ప అద్దెకు తీసుకున్న కార్యాలయాన్ని ఖాళీ చేయడం లాంటి పనుల్లో మునిగిపోయాను. చాలా తరచుగా కటిక పేదరికం అనుభవించాను. బీచ్ రోడ్ మీదుగా మైలాపూర్ దాకా రోజూ నడిచి వెళ్ళడం అలవాటు చేసుకున్నాను. ఆ నడకలో ట్రిప్లికేన్ దాకా ఒక స్నేహితుడు తోడు వచ్చేవాడు. అలా నడక సాగిస్తున్న రోజుల్లోనే మాకు ఒక వృద్ధుడు స్నేహితుడయ్యాడు. ఆయన న్యాయశాస్త్రం చదివానని, చదువుకునే రోజుల్లో ప్రతిభావంతుడైన విద్యార్థిగా ఉండేవాడినని, కాని న్యాయవాద వృత్తిలో నిలదొక్కుకో లేకపోయానని చెప్పేవాడు. ఇప్పుడు బీచ్‌లోనే బతుకు సాగిస్తున్నాను గనుక ఇక ఇబ్బందేమీ లేదని అనేవాడు. ఆ ముసలాయన కూడా ట్రిప్లికేన్ బీచ్ దాకా

మాతో వచ్చేవాడు. రోగిష్టి భార్యకు వైద్యం చేయించడానికి తన దగ్గర డబ్బులు లేవని, కొడుకును పెంచలేక మరెవరికో దత్తతకు ఇచ్చానని, కూతురిని సేవాసదన్‌లో చేర్చానని చెప్పేవాడు. ఒక ఉదయం వేళ అతని శవాన్ని బీచ్‌లో చూడకపోతే మేమా కథలు నమ్మి ఉండేవాళ్ళం కాదు.

అలా నా న్యాయవాద వృత్తి మద్రాసు హైకోర్టులో అంతులేని విసుగుదలతో మొదలయింది. తర్వాత నాలుగయిదు సంవత్సరాలు అక్కడ అట్లాగే సాగింది. మధ్య మధ్య కొన్ని సంతోషకరమైన, గుర్తుంచుకోదగిన సందర్భాలు లేకపోలేదు. అటువంటి వాటిలో ఒకటి ఆసియాబేగం కేసు.

రాజప్ప మరణం తర్వాత నేను మరొక సీనియర్ ఆఫీసులో చేరాను. ఆసియాబేగం కేసు ఆ రోజుల్లోనే, అంటే 1955-56ల్లో నా చేతికి వచ్చింది. ఆ రోజుల్లో నేను నా నల్లకోటు, గౌను ఎ.కె.బాలకృష్ణన్ కార్యాలయంలో పెట్టుకోవడానికి వెళుతుండగా అక్కడ గేటు ముందర ఒక ముస్లిం స్త్రీ తచ్చాడుతూ కనిపించింది. ఆమె ఆ గేటు దాటి ఆవరణలోకి ప్రవేశించడానికి సంకోచించినట్టుంది.

అట్లా సంకోచపడుతూనే ఆమె నా దగ్గరికి వచ్చి నా చేతికి ఒక కాగితం ఇచ్చింది. నేనేమన్నా సాయపడగలనా అని అడిగింది. ఆమె ఆసియాబేగం. ఆమె దగ్గర పాకిస్తానీ పాస్‌పోర్టు ఉన్నందువల్ల, విదేశస్తుల చట్టం కింద ఆమెను పాకిస్తాన్‌కు తిప్పి పంపుతామని భారత ప్రభుత్వం ఆమెకు ఒక నోటీసు ఇచ్చింది. ఆమె నా చేతికిచ్చిన కాగితం ఆ నోటీసే.

ఆ తమిళ ముస్లిం స్త్రీ జాలిగొలిపే కథనాన్ని నాకు వినిపించింది. జరిగిన కథ వింటే ఆమె బాధ్యత లేకుండా జరిగిపోయిన పనులకు ఆమెకు శిక్ష విధిస్తున్నట్టని పించింది. ఆమె అనుభవిస్తున్న పేదరికం తనకంటె కొంచెం తక్కువ పేదవాడయిన, రెండు సంవత్సరాలుగా మాత్రమే వృత్తిలో ఉన్న న్యాయవాదిని మాత్రమే పెట్టుకోగలదు.

దేశవిభజన తర్వాత పాకిస్తాన్‌లో మంచి బతుకు దొరుకుతుందని భ్రమపడి, అవే భ్రమలను తమ కుటుంబ సభ్యులకు కలిగించి అక్కడికి తీసుకుపోయిన పురుషు లెందరో ఉన్నారు. అలా తమ తండ్రుల వెంట, భర్తల వెంట, కొడుకుల వెంట పాకిస్తాన్‌కు తరలిపోయిన నిర్భాగ్య స్త్రీ లెందరో ఉన్నారు. ఆసియాబేగం అటువంటి ఒక స్త్రీ. అది మినహా ఆమె నూటికి నూరుపాళ్ళు తమిళ స్త్రీ.

పాకిస్తాన్ వెళ్ళిన తర్వాత ఆ అపరిచిత వాతావరణంలో ఆమె ఇమడలేక పోయింది. ఉపాధి కరువైపోయింది. ఇటు ఆకలి, పేదరికంతో పాటు స్థానిక ప్రజల నుంచి శత్రుత్వాన్నీ ఎదుర్కొంది. వరదలా వస్తున్న శరణార్థుల వల్ల తమ జీవనోపాధి దెబ్బతింటుందని భయపడిన స్థానిక ప్రజలు వలసవచ్చిన వారి మీద వ్యతిరేకత పెంచుకున్నారు.

ఈ పరిస్థితులలో ఆసియాబేగం వెనక్కి వచ్చెయ్యదలచుకుంది. ఆమె ఈ దేశం వదలి వెళ్ళినప్పుడు పూర్తి భారతీయ పౌరురాలు. వెనక్కి తిరిగి వచ్చినప్పుడు ఆ స్థితి ఏమీ మారలేదు. అలా అటూ ఇటూ కాందిశీకులుగా వెళ్లినవాళ్ళు ఎప్పుడైనా తిరిగి వెనక్కి రావచ్చునని అధికారులు ఊహించలేదు. అలా తిరిగి వచ్చిన వాళ్ళు అధికారుల అంతులేని వేధింపులకు గురికావలసి వచ్చింది. అసలు మనపాలనకే అధికార యంత్రాంగపు వేధింపు అనే అర్థం వచ్చిందనుకోండి.

ఆసియా బేగం వెనక్కి తిరిగి వస్తున్నప్పుడు ఆమె చేతికి ఇచ్చిన కాగితం ఒక పాస్‌పోర్టు అని, అది ఆమెను పాకిస్తాన్ పౌరురాలిగా మార్చేసిందని కూడా ఆమెకు తెలియదు. ఆమె చేతిలో ఆ కాగితం ఉండడం వల్ల ఆమె భారతీయ పౌరురాలిగా చూపెట్టుకునే అవకాశం కోల్పోయింది. తరతరాలుగా ఆమె, ఆమె పూర్వీకులు నివసించిన నేల తనదేనని చెప్పుకునే అవకాశాన్ని ఆమె కోల్పోయింది. కొద్దిరోజుల కోసం నివాసముండిన ఏదో ఒక పరాయి దేశానికి ఆమె పౌరురాలయి పోయింది. ఒక దిగువ మధ్యతరగతి, నిరక్షరాస్య స్త్రీ, అందులోనూ ఒక మైనారిటీ మతానికి చెందిన స్త్రీ ఈ గందరగోళం నుంచి బైటపడడం అలా ఉంచి, అసలీ గందరగోళాన్ని ఎట్లా అర్థం చేసుకుంటుంది?

ఈలోగా ప్రభుత్వం ఒక శాసనాన్ని తీసుకొచ్చింది. పౌరసత్వం చట్టం 1955 అనే ఈ చట్టం ప్రకారం ఎవరిదగ్గరయినా ఒక విదేశీ పాస్‌పోర్టు ఉండడం వారు విదేశీ పౌరులనడానికి తిరుగులేని ఆధారం. వారు ఆ పాస్‌పోర్టు తీసుకున్నారంటేనే భారతీయ పౌరసత్వాన్ని వదిలేశార్నమాట. పౌరసత్వానికి ఇటువంటి నిర్వచనం ఇవ్వడం ద్వారా భారత ప్రభుత్వం ప్రజాస్వామ్య స్ఫూర్తిని అపహాస్యం చేసింది. ఒక సమాజంలో సభ్యులుగా మనుషులకు ఉండే గౌరవ ప్రతిష్టలను దిగజార్చింది.

నాకంటూ అప్పటికి లైబ్రరీ ఏర్పడలేదు. కోర్టు లైబ్రరీలోనూ సీనియర్ల లైబ్రరీల్లోనూ కూచుని పౌరసత్వ చట్టం లోతుగా అధ్యయనం చేశాను. అప్పటికింకా ఒక ప్లీడరు ఎలా మాట్లాడాలో పూర్తిగా నేర్చుకోలేదు గనుక ప్రధానంగా చట్టపు పద్మవ్యూహం వెనుక అంత అమానుషత్వం ఉన్నదో వాదించడానికి ప్రయత్నించాను.

అప్పటి చీఫ్ ప్రెసిడెన్సీ మెజిస్ట్రేటు అయ్యస్వామి చెట్టి ముందర ఈ కేసులో నా వాదనలు సాగాయి. ఆసియా బేగంను పాకిస్తాన్‌కు తరలించడానికి ఇచ్చిన ఉత్తర్వులు రద్దు చేయాలని రెండు గంటలపాటు వాదించాను. ఆమె పాకిస్తాన్ పౌరురాలనే మాట హాస్యాస్పదమైనదని, ఆమెకు దేశ విభజన అంటే ఏమిటో తెలియదని, భుక్తి కోసం అక్కడికి వెళ్లింది గాని అక్కడే ఉండిపోవడానికి వెళ్ళలేదని వాదించాను. కోర్టు నా వాదనలను అంగీకరించింది. ఆసియా బేగంను తరలించడానికి జారీ అయిన ఉత్తర్వులను కొట్టివేసింది.

పౌరసత్వ చట్టం వచ్చిన తొలిరోజుల్లోనే ఆ చట్టం మీద వెలువడిన తీర్పుకావడం

వల్ల అప్పటి పత్రికలు ఈ కేసును, నా వాదనలను, తీర్పును ప్రముఖంగా ప్రచురించాయి. 'హిందూ' లో వివరమైన రిపోర్టు వచ్చింది.

అయితే అనుకూలమైన తీర్పు వచ్చినప్పటికీ ఆసియా బేగం అంతగా సంతోష పడలేదని నాకనిపిస్తుంది. అప్పటికీ ఆమె జీవిత భద్రత గురించి భయ సందేహాలు ఆమెను వదిలి ఉండవు. నిజానికి అటువంటి జీవితం గురించిన భయ సందేహాలు మనకెప్పుడూ అదృశ్యంగానే ఉండిపోతాయి.

అసంఖ్యాక జనబాహుళ్యానికి ఆ భయ సందేహాలున్నాయి. పాకిస్తాన్‌కు వలస వెళ్ళిన వారిలో కనీసం సగం మంది అయినా స్త్రీలుండి ఉంటారు. ఆసియాబేగం ఆ అనామక, అసంఖ్యాక జనబాహుళ్యంలో ఒకరు మాత్రమే.

ఇటీవలి కాలంలో అతిపెద్ద ఎత్తున జనాభా వలసలు వెళ్ళిన సమయం దేశ విభజన. అప్పుడు కనీసం యాభై, అరవై లక్షల మంది అటునుంచి ఇటూ, ఇటునుంచి అటూ కాందిశీకులుగా, శరణార్థులుగా వెళ్ళారు. రెండు దేశాలలోనూ ఎన్నో కాందిశీకుల శిబిరాలు ఏర్పాటయ్యాయి. మద్రాసు సమీపంలో ఆవడిలో ఎన్నో అటువంటి శిబిరాలను నేను చూశాను.

అంత విపత్సమయంలో చూడవలసింది చట్టపరమైన, న్యాయశాస్త్రపరమైన అంశాలు కాదు. అక్కడ ప్రధానంగా దృష్టి పెట్టవలసింది మానవహక్కుల మీద. మనిషికి మనిషి అయినందువల్ల, ఒక సమాజంలో సభ్యుడైనందువల్ల సహజంగా కొన్ని హక్కులు వస్తాయి. జాతి రాజ్యాల భావన పునాదిపై పుట్టుకొచ్చిన దేశాల సరిహద్దులు గాని, సార్వభౌమాధికారాలు గాని ఆ హక్కులను అడ్డుకోజాలవు. పెద్ద ఎత్తున ప్రజానీకం తమ తమ నివాస స్థలాలు వదిలి ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్న ఆపత్సమయంలో మానవహక్కులను గుర్తించడం ప్రభుత్వ బాధ్యత. చాలా సందర్భాలలో ఆ వలసలు నిర్హేతుకంగా, మూర్ఖత్వపు కారణాల మీద సాగుతాయి గనుక, ఆ సందర్భాలను సాకుగా చూపి మానవ హక్కులను ఉల్లంఘించే అధికారం ప్రభుత్వాలకు లేదు.

మన దేశ చరిత్రలో దేశ విభజన అనేది అత్యంత దారుణమైన మానవ పునరావాస ఘటన. అందులో దాదాపు పది లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. కొన్నివేల మంది స్త్రీలు అపహరణకు గురయ్యారు. దేశ విభజన ప్రతిపాదన పెట్టినవాళ్ళు ఆ ప్రతిపాదన ఎంత విస్తృతమైన, ఎంత భయంకరమైన మూల్యాన్ని చెల్లించబోతున్నదో ఊహించినట్టు లేదు. లేదా అటువంటి పెద్ద రాజకీయ నిర్ణయాలలో ఇటువంటి మానవ విషాదాన్ని పట్టించుకోనక్కరలేదని అనుకుని వుంటారు.

మానవ విషాదాన్ని తగ్గించేలా వలసలను క్రమబద్ధంగా సాగించవచ్చునని రెండు వైపులా ప్రభుత్వాలు అనుకోలేదు.

ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటుంటే ఆసియా బేగం కేసును నేను యాదృచ్ఛికంగానే

చేపట్టి, వాదించి, గెలిచినప్పటికీ, నా సామాజిక ఆలోచనల మీద ఆ కేసు, దానితో ముడిపడిన రాజకీయ, సామాజిక, తాత్విక అంశాలు ప్రభావం వేశాయని అర్థమవుతుంది. సరిగ్గా యాభై సంవత్సరాల కింద నేను వాదించిన ఆ కేసులో ఏ ఆలోచనలు, ఏ దృక్పథం నా వాదనలకు పునాది అయ్యాయో అవే ఆలోచనలు, అదే దృక్పథం నా పౌరహక్కుల ఉద్యమ భాగస్వామ్యానికి దారి తీశాయి.

అలా మద్రాసు కోర్టులో నా న్యాయవాద వృత్తి నాలుగైదేళ్లు గడిచాక, 1951 మే నెలలో వసంతతో నా పెళ్ళి అయింది. నేను మద్రాసులోనే సీనియర్ న్యాయవాది మోహన కుమార మంగళం ఆఫీసులో చేరుదామనుకున్నాను గాని అది కుదరలేదు. ఇక మద్రాసు వదిలేసి హైదరాబాదు వచ్చెయ్యాలనే నిర్ణయం తీసుకున్నాం. 1960లో నేను కుటుంబం తో సహా హైదరాబాదు వచ్చేశాను.

* * *

# మళ్లీ హైదరాబాదుకు

మోహనకుమార మంగళం నాకు బాగా పరిచయం. అప్పటికి నాలుగైదేళ్లుగా మద్రాసు హైకోర్టులో నా న్యాయవాద వృత్తి అంతంత మాత్రంగా ఉండడంతో ఆయన దగ్గర జూనియర్‌గా చేరుదామనుకున్నాను. అప్పటికే ఆయన సీనియర్ న్యాయవాదిగా ఉన్నారు. 'నా ఆఫీసు తీసేశాను. సీనియర్ ఎంగేజ్‌మెంట్స్‌కు మాత్రమే వెళ్తున్నాను' అని ఆయన నేనక్కడ చేరడానికి కుదరదన్నాడు. ఇక నాకు మరో మార్గం చూసుకోక తప్పలేదు. ఇక హైదరాబాదు వద్దామనుకున్నాను. నాకిక్కడ ఏదో మద్దతు ఉన్నదని కాదు గాని మద్రాసు ప్రాక్టీసు కన్న హైదరాబాదు ప్రాక్టీసే మంచిదని అనుకున్నాను.

నిజంగా తొలిరోజుల్లో న్యాయవాద వృత్తిలో రాణించడానికి చాలా కష్టాలు పడ్డాను. ఇబ్బందులను ఎదుర్కొన్నాను. నేనీ జీవితకథనం రాయదలచుకున్న పద్ధతికి అవి అంత ముఖ్యం కాదు.

నెలకు నూటయాభై రూపాయల జీతంతో రెడ్డి మహిళా కళాశాలలో వసంత లెక్చరర్‌గా చేరింది. యాభై రూపాయల కిరాయితో చిక్కడపల్లిలో ఒక ఇల్లు తీసుకున్నాం.

మొదటినుంచీ కూడా నేను వాదనలలో సమర్థుడైన న్యాయవాదిగా ఉన్నాననే నేననుకుంటాను. 1968-69 వచ్చేటప్పటికి నా ఆఫీసు చాలా పెద్ద ఆఫీసే అయింది. నా దగ్గర చాలా కేసులు జమకూడాయి. అయితే ఆ ఏడెనిమిది సంవత్సరాల నా న్యాయవాద వృత్తిలో నేను పొందిన అనుభవాలు, నేను నిర్ణయించుకున్న జీవన సూత్రాలు, హైదరాబాదు

జీవితంలో నేను పొందిన స్నేహాలు ఆ తర్వాతి జీవితంలో ముఖ్యపాత్ర వహించాయి.

అప్పట్లో నేను కొంతకాలం సెకండ్ గవర్నమెంట్ ప్లీడర్ ఆఫీసులో పనిచేశాను. అక్కడ చేరడం విచిత్రంగా జరిగింది. మా నాన్న మరణశయ్యపై ఉన్నప్పుడు నేను ఆయనకు ఆక్సిజన్ సిలిండర్ సంపాదించడం కోసం అటూ ఇటూ ఆదుర్దాగా పరుగులు పెడుతున్నాను. అప్పుడు నా ముందర ఒక కారు ఆగింది. ఆ కారులోని వ్యక్తే సెకండ్ గవర్నమెంట్ ప్లీడర్ శంకరరావు.

ఆయన నన్ను ఎన్.ఎస్. రాఘవన్ ఆఫీసు ఎక్కడ అని అడిగారు. రాఘవన్ అప్పటి అడ్వకేట్ జనరల్. నేనాయనకు రాఘవన్ ఆఫీసు ఎక్కడుందో చూపాను. కొన్నాళ్ళకే నేనాయన దగ్గరే చేరబోతున్నానని నాకప్పటికి తెలియదు.

'నాకు మీ ఆఫీసులో చేరాలని వుంది. మీరు నాకు ఒక్క పైస కూడా ఇవ్వనక్కర లేదు. న్యాయవాద వృత్తి నేర్చుకునేలా చాల పని ఇస్తే చాలు' అన్నాను. ఆయన చాల పని ఇవ్వడంలోనూ, డబ్బు ఇవ్వకపోవడం లోనూ కూడా మాట నిలబెట్టుకున్నారు. ఆరు నెలల లోపలే నేను న్యాయవాద వృత్తిలో నేర్చుకోవలసినవన్నీ నేర్చుకున్నాను. అన్ని కోర్టులతోనూ, జడ్జీలందరితోనూ పరిచయం పెంచుకున్నాను. జడ్జీలు నన్ను గుర్తించడం ప్రారంభించారు.

ఆ తర్వాత నా ప్రాక్టీసు మొదలయింది.

ఇక్కడ ఒక విషయం చెప్పాలి. నేను మద్రాసు హైకోర్టులో ఉండగా వి సి గోపాల రత్నం అని ఒక సీనియర్ న్యాయవాది ఉండేవారు. చాలా ప్రేమాస్పదుడైన మనిషి ఆయన. ప్రతి రోజూ యువ న్యాయవాదులందరమూ ఆయన చుట్టూ చేరేవాళ్ళం. ఆయన విపరీతంగా జోక్స్ చెప్పేవారు. ఇతర పుస్తకాలతోపాటు ఆయన దగ్గర జోక్స్ పుస్తకాలు కూడా చాల ఉండేవి. ఒక సంచీ నిండా వేరు వేరు రకాల పెన్నులుండేవి.

హైదరాబాదు వద్దామని నిర్ణయించుకున్నప్పుడు నేనాయన దగ్గరికి వెళ్ళి నా నిర్ణయం గురించి చెప్పాను.

"వెళ్ళిన కొత్తలో ప్రాక్టీసు ఉండదు. కాని నువ్వంటూ ఒక ప్లీడరువు ఉన్నావని లోకానికి తెలియాలి. ఒక ఆఫీసు పెట్టుకో. అందరికీ కనబడేటట్లుగా కూచో, వెనుక ఒక బీరువా పెట్టుకుని పాత 'లా' పుస్తకాలు కొన్ని పెట్టుకో. కూచుని చదువుకుంటూ ఉండు. అదే ప్రారంభం. వచ్చిపోయే వాళ్ళందరూ అక్కడ ఒక ప్లీడరు ఉన్నాడని, అందుబాటులో ఉన్నాడని, ఎప్పుడు చూసినా నమ్మకంగా కనిపిస్తాడని అనుకోవాలి. వాళ్ళలో ఎవరికైనా, వాళ్ళలో ఎవరి స్నేహితులకైనా ప్లీడరు అవసరం వచ్చినప్పుడు నీ పేరు గుర్తొచ్చేలా ఉండాలి" అని గోపాలరత్నం సలహా చెప్పారు.

నేనా సలహాను పూర్తిగా అక్షరాలా పాటించాను. మారేడుపల్లిలో ఆఫీసు తెరిచాను. నరసింహాచారి అనే అప్రెంటిస్ లాయర్ నా దగ్గర చేరాడు. కొన్నాళ్ళకు అహ్మద్ అనే

తమిళ ముస్లిం లాయరు కూడా చేరాడు.

క్రమక్రమంగా నా ఆఫీసు గుర్తింపులోకి వచ్చింది. చాలా కేసులు రావడం మొదలయింది. అప్పుడే కృపాల్ సింగ్ అని నా స్నేహితులొకరు ప్యారీ అండ్ కంపెనీలో ఉండేవారు. అయనా నేను క్రికెటర్లుగా స్నేహితులం. ఆయన ద్వారా ప్యారీ అండ్ కంపెనీ నన్ను తమ లాయర్‌గా నియమించుకుంది. అలా చాలా కంపెనీలు వచ్చి నన్ను తమ లీగల్ అడ్వైజర్‌గా పెట్టుకున్నాయి. సివిల్ లిటిగేషన్ కేసులు చాలా రావడం మొదలయింది.

అప్పుడు నా ఆదాయం గురించి నేనొక నియమం పెట్టుకున్నాను. కక్షిదారు ఎవరయినా సరే పిచ్చిగా డబ్బులు చేసుకోగూడదు. డబ్బులు సంపాదించాలనే యావలో పడిపోగూడదు. కంపెనీ వ్యాజ్యాలకు కూడ నేను నా మామూలు ఫీజు కన్న ఎక్కువ వసూలు చేసేవాణ్ని కాదు. ఇతర కేసుల్లోనయితే వారు ఇస్తే తీసుకోవడమే తప్ప నాకై నేను అడిగింది లేదు. అసలు ఈ న్యాయవాద వృత్తిలోను, బైట జీవితంలోనూ కూడ నేను నా కోసమో, నా కుటుంబం కోసమో ఎవరినీ ఏమీ అడగలేదు.

వసంతకు కాలేజి దూరం అయిపోతుందని, ఇబ్బంది అవుతుందని 1968 ప్రాంతాల్లో హైదరాబాదుకే ఇల్లు, ఆఫీసు మార్చాం. అసలు మొత్తం హైదరాబాదు జీవితంలో 18 ఇళ్ళు మార్చి ఉంటాను.

సరిగ్గా ఆ 1968 ప్రాంతాల్లోనే దేశ రాజకీయం, సామాజిక జీవనంలో లోతయిన మార్పులు వస్తున్నాయి. ఆ మార్పుల ప్రభావం న్యాయవ్యవస్థ మీద, ఆలోచనా పరులందరి మీదా పెద్ద ఎత్తుననే కనబడడం మొదలయింది.

అప్పటికే దేశ సమస్యల గురించి, ముఖ్యంగా దేశ విభజన, ద్రవిడ కజగం ఉద్యమం, తమిళనాడులోనూ, అంతకు ముందరి మద్రాను రాష్ట్రంలోను జరిగిన రాజకీయ పరిణామాలు, కేరళ ప్రభుత్వాన్ని పడగొట్టిన తీరు, దేశంలో పెరిగిపోతున్న అస్తవ్యస్తపాలన గురించి ఆలోచిస్తున్న నాకు జరుగుతున్న పరిణామాలు ఆసక్తి కలిగించాయి.

అప్పుడే న్యాయవ్యవస్థలో కూడా మార్పులు రావడం మొదలయింది. తర్వాతి కాలంలో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తులుగా ప్రముఖులైన వి.ఆర్. కృష్ణ అయ్యర్, పి.ఎస్.భగవతి వంటి వాళ్ళు బేర్ ఫుట్ లాయర్స్, సామాన్యుడి ముంగిట్లోకి న్యాయం, చట్టమే ప్రజల దగ్గరికి పోవడం వంటి ఆలోచనలు ప్రకటిస్తున్నారు.

రాజ్యాంగంలో ప్రకటించుకున్న ఉదాత్త లక్ష్యాలకు అనుగుణంగా న్యాయ వ్యవస్థ నడవడం లేదని న్యాయవాదులు పెద్ద ఎత్తున ఆందోళన చెందడం మొదలయింది.

ఇది ఒక స్థాయిలో మోజుగా కూడా మారిపోయి, ప్రగతిశీల న్యాయవాదిగా పేరు తెచ్చుకోవడానికి యువ న్యాయవాదులలో వెంపరలాట కూడ మొదలయింది.

దేశవ్యాప్తంగా న్యాయస్థానాలలో మొదలయిన ఈ సంచలనానికి తప్పని సరిగా

రాజకీయ, సామాజిక కారణాలున్నాయి.

ప్రస్తావన వశాత్తూ ఆ రాజకీయ, సామాజిక కారణాల్ని నేను ఎన్నో చోట్ల వివరించాల్సి వచ్చింది. ఇక్కడ సందర్భానికి తగినవి చెప్పుకుంటే అవి నన్ను పౌర హక్కుల ఉద్యమం వైపు ఎట్లా నడిపించాయో అర్థమవుతుంది.

మనం మన రాజ్యాంగాన్ని పట్టించుకోవలసినంత తీవ్రంగా, గంభీరంగా పట్టించుకోలేదనుకుంటాను. ఆ నిర్లక్ష్యానికి మనం మూల్యం చెల్లిస్తున్నాం. రాజ్యాంగం అనేది కేవలం ఒక చట్టపరమైన పత్రం కాదు. అది ఒక రాజకీయ ప్రకటన. దాని వెనుక ప్రజలున్నారు. ప్రజా ఉద్యమం ఉంది. ప్రజా ఆకాంక్షలున్నాయి. రాజ్యాంగాన్ని ఈ నేపథ్యంలో చూడకపోవడం వల్ల ఒక రాజకీయ ప్రకటనగా దానికి ఉండవలసిన శక్తిని, పటుత్వాన్ని మనం విస్మరించాం.

రాజ్యాంగాన్ని అలా గుర్తించకపోవడం వల్లనే. మన న్యాయస్థానాల తీర్పులు స్వాతంత్ర్యోద్యమంతో, ఆ విలువలతో ఏమీ సంబంధం లేకుండా వెలువడడం మొదలైంది. సమానత్వం అనే సూత్రాన్ని రాజ్యాంగంలో, ప్రవేశికలోనే రాసుకున్నాం గాని దాన్ని సరైన పద్ధతిలో అర్థం చేసుకోలేక పోయాం.

దేశ సమస్యలను సవ్యంగా అర్థం చేసుకోవడంలో, వ్యాఖ్యానించడంలో శిక్షణ పొందిన న్యాయవ్యవస్థ వైఫల్యం చెందింది.

రాజ్యాంగ రచన కన్న ముందే, స్వాతంత్ర్య ప్రకటన వెన్వెంటనే ఎస్.గోపాలన్ మీద రాజద్రోహం కేసు, 1952లో మద్రాసు ప్రభుత్వానికీ చంపకం దొరైరాజన్ కూ మధ్య నడిచిన కేసు మన స్వాతంత్ర్యోద్యమ ఆదర్శాలకూ, వాస్తవ పాలనకూ మధ్య ఎంత వైరుధ్యం ఉన్నదో చూపెట్టాయి. ప్రివెంటివ్ డిటెన్షన్ నిబంధనలు రాజ్యాంగం హామీ ఇచ్చిన స్వేచ్ఛకు పరిమితులు విధించాయి.

అసలు కొంచెం చరిత్రలోకి వెళ్తే కోర్టును వలసవాద ప్రభుత్వం ఒక అణచివేత సాధనంగా తయారు చేసింది. ఆ వ్యవస్థ వలస పాలన కాలమంతటా అట్లాగే ఉండింది. స్వాతంత్ర్యానంతరం ఆ వ్యవస్థ స్వభావాన్ని మార్చే దిశగా ఏ ప్రయత్నమూ జరగలేదు.

ఒక్క న్యాయవ్యవస్థ అని మాత్రమే కాదు, సామాజిక వ్యవస్థలలోనే ఎటువంటి మార్పుల ప్రయత్నం జరగలేదు. జమీందార్లు, సంస్థానాధీశులు, రాజుల ఆస్తులను, సంపదలను స్వతంత్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోలేదు. చేసుకున్న చోట్ల భారీ నష్ట పరిహారాలు చెల్లించింది. అధికార మార్పిడి వల్ల, వలస పాలన నుంచి రాజకీయ స్వాతంత్ర్యం వల్ల ఈ దేశంలో దోపిడీ వర్గాలకు చిన్నఎత్తు నష్టం కూడా జరగలేదు. వాళ్ళు తరతరాలుగా ప్రజలను దోపిడీ చేసి కూడ బెట్టిన ఆస్తులు సమాజపరం కాలేదు సరిగదా, వాళ్ళే మంత్రులూ, పార్లమెంటు సభ్యులూ, శాసనసభ్యులూ అయ్యారు.

సమసమాజం సాధించే లక్ష్యంతో జరిగిన పాలనా సంస్కరణలేవీ సమానత్వాన్ని సాధించలేకపోగా, అసమానతలను పెంచాయి. దేశంలో కొత్త భూస్వాములు

పుట్టుకొచ్చారు.

దేశంలోని మౌలిక వ్యవస్థలు-సామాజిక, పార్లమెంటరీ, రాజకీయ, న్యాయ-అన్నీ 1950ల నుంచీ కూడా దిగజారుడు దారిలో సాగుతున్నాయి. చట్టపరమైన వ్యవస్థలను, రాజకీయ వ్యవస్థలను కూలదోసే, విచ్ఛిన్నం చేసే పద్ధతిలో దుష్పరిపాలన సాగుతోంది. పార్లమెంటు దాని రాజకీయ కర్తవ్యాలను, బాధ్యతలను నెరవేర్చడంలో విఫలమవుతూ వస్తోంది. గవర్నర్ల వ్యవస్థ దుర్వినియోగానికి గురయింది. ఎన్నికల వ్యవస్థ, ఎన్నికల ప్రచారం ప్రహసనంగా మారిపోయాయి. రాజకీయ చర్చా సంప్రదాయం అడుగంటిపోయి, చర్చల స్థాయి దిగజారి పోయింది.

ఇటువంటి ప్రమాదాల గురించి సూచనలు, హెచ్చరికలు 1950ల నుంచే వెలువడు తున్నాయి. ఎం ఆర్ రాధా అని తమిళ నటుడు ఉండేవాడు. ఆ రోజుల్లోనే రక్తకన్నీరు నాటకంలో ఒక డైలాగ్ ప్రాచుర్యంలోకి తెచ్చాడు. "కాంగ్రెస్ చాల తెలివయిన పార్టీ. కాంగ్రెస్‌లో గెలిస్తే మంత్రి కావచ్చు. ఓడిపోతే గవర్నర్ కావచ్చు" అని.

అట్లా ఒక రాజకీయ పార్టీ తన రాజకీయాధికారాన్ని దుర్వినియోగం చేస్తే అంతిమంగా అది ఎంత సామాజిక అవ్యవస్థకు, దుష్పరిపాలనకు దారితీయ గలదో గత ఐదు దశాబ్దాల రాజకీయాలు రుజువు చేశాయి.

స్వాతంత్ర్య సాధన తర్వాత కొద్ది సంవత్సరాలు దేశం అభివృద్ధి పథంలో సాగుతున్నట్టే కనబడింది. జమీందారీ వ్యవస్థ రద్దయింది. ప్రభుత్వరంగంలో భారీ పారిశ్రామిక, వ్యాపార సంస్థలెన్నో వచ్చాయి. పెద్ద ఎత్తున ఉద్యోగ కల్పన జరిగింది. ఆర్థిక సౌభాగ్యం చేకూరబోతున్నదనే ఆశలు ప్రజల్లో వెల్లువెత్తాయి. అయినా రాజకీయ అసంతృప్తి ఏదో ఒక మూల కొనసాగుతూ వచ్చింది.

ఆ సామాజిక, రాజకీయ అసంతృప్తే మా తరానికీ, మా తర్వాతి తరానికీ కూడా ఆదర్శాలనందించింది. ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే నా బాల్యంలో, చదువుకునే రోజుల్లో ఉండిన పేదరికం, న్యాయవాద వృత్తిలోకి వచ్చిన కొత్తలో సమాజమంతటా చెలరేగుతున్న అసంతృప్తి నన్ను ప్రభావితం చేశాయనిపిస్తుంది. నేను పౌరహక్కుల ఉద్యమంలోకి ఎట్లా వచ్చానో చెప్పేముందు ఈ ప్రభావాల గురించి మరికొంత చెప్పాలి.

చిన్నతనంలో నామీద ప్రభావం వేసిన వారిలో రాజప్ప, శేషాద్రిలతో పాటు మా అన్నయ్య రాంజీ గురించి చెప్పాలి. మేం రాంజీ అని పిలుచుకునే ఆయన పేరు కె.జి.రామనాథన్. ఆయన మద్రాస్‌లో తహసీల్దార్ ఆఫీసులో గుమస్తాగా పని చేసేవాడు. నెలకు ఐదు రూపాయల జీతం. నాకు మొట్టమొదటి చెప్పుల జత కొనిచ్చినవాడు ఆయనే. నన్ను అప్పుడప్పుడు బైటికి తీసుకెళ్ళి మసాలదోసె లాంటివేవో తినిపించేవాడు. బట్టలు ఆ రోజుల్లో మాకు రెండు జతలు సరిగ్గా ఉంటే గొప్ప.

ఆయన స్వభావం చిత్రంగా ఉండేది. ముక్కు మీద కోపం ఉండేది. కాని ఇతరులకు

సాయపడడానికి ఎన్ని ఇబ్బందులైనా పడేవాడు. అందుకేననుకుంటాను ఎనభయవ పడిలో ఉన్నా, ఇప్పటికీ ఆయనను రోజూ పలకరించే మిత్రులు నలభై యాభై మంది ఉన్నారు. రాంజీ కొన్నాళ్ళకు తహసీల్దార్ ఆఫీసు వదిలేసి హిందుస్థాన్ ఇన్సూరెన్స్ కంపెనీలో చేరాడు. 1956లో దేశంలో ఇన్సూరెన్స్ వ్యాపారం జాతీయకరణ జరిగి నప్పుడు ఆయన ఎల్.ఐ.సి.లో భాగమై దాని ఉద్యోగుల ట్రేడ్ యూనియన్ నాయకు డయ్యాడు. ఇంటర్ కూడా చదవలేదు గాని ఆయన నాయకుడుగా రాణించాడు. అఖిల భారత ఇన్సూరెన్స్ ఉద్యోగుల సంఘానికి దక్షిణ జోనల్ కార్యదర్శి అయ్యాడు. అప్పుడు ఆ సంఘానికి మోహనకుమార మంగళం అధ్యక్షుడు. నాకు కుమార మంగళం సన్నిహితమైంది మా రాంజీ ద్వారానే.

యూనియన్ కార్యకలాపాలు నిర్వహించడం కోసం రాంజీ ప్రతిసారీ ప్రమోషన్ నిరాకరించాడు. పదవీ విరమణదాకా గుమస్తాగానే కొనసాగాడు. బహుశా మా రక్తం లోనే ఈ తత్వం ఉందనుకుంటాను. రాంజీ గానీ, శేషాద్రి గానీ, నేను గానీ మాకు వీలయినంత నిరాడంబరంగానూ, మా ఆదర్శాలకు తగ్గట్టుగా జీవించాం. ఒక సమయం లో నాకు విపరీతంగా సంపాదించడానికి అవకాశం వచ్చింది గాని 'అవసరాలకు మించి డబ్బు పోగేసుకో కూడదు, అవసరాలు మితిమీరి పెంచుకోకూడదు' అని నియమం పెట్టుకున్నాను.

రాంజీ వల్లనే నాకు వి.జి.రావు కూడా పరిచయమయ్యారు. ఆయన 'వి.జి.రావు వర్సస్ స్టేట్' అనే కేసు ద్వారా సుప్రసిద్ధుడు. 1952లో మద్రాసు ప్రభుత్వం పీపుల్స్ ఎద్యుకేషనల్ సొసైటీ అనే సంస్థ మీద నిషేధం విధించినప్పుడు ఆయన ఆ నిషేధాన్ని సవాలు చేసి గెలిచారు. ఆ సంస్థ కమ్యూనిస్టు అనుబంధ సంస్థ అనే పేరుతో ప్రకాశం పంతులు ప్రభుత్వం ఆ సంస్థను 1908 క్రిమినల్ లా అమెండ్‌మెంట్ అక్ట్ కింద నిషేధించింది. నిజానికి స్వాతంత్ర్యోద్యమ కాలంలో చిత్తరంజన్ దాస్ వంటి నాయకులు ప్రత్యేకంగానూ, మొత్తంగా కాంగ్రెస్ పార్టీ ఈ క్రిమినల్ లా అమెండ్‌మెంట్‌ను తీవ్రంగా ఖండించారు. అధికారంలోకి రాగానే వాళ్ళే దాన్ని వినియోగించడం మొదలుపెట్టారు. వి.జి.రావు వాదన వల్ల సుప్రీం కోర్టు ఆ చట్టాన్నే కొట్టివేసింది.

విచిత్రమైన విషయమేమిటంటే 1992 మే లో రాష్ట్రంలో అప్పటి పీపుల్స్ వార్ పార్టీని, ఆరు ప్రజా సంఘాలను నేదురుమల్లి జనార్దన రెడ్డి ప్రభుత్వం నిషేధించింది ఆ క్రిమినల్ లా అమెండ్‌మెంట్ ఆక్ట్ కిందనే. ఆ చట్టం అసలు ఉనికిలో లేనేలేదని, 1952 లోనే సుప్రీం కోర్టు దాన్ని కొట్టివేసిందని, కనుక ఈ నిషేధం చెల్లదని మేం వాదించిన తర్వాత హడావుడిగా 1992 జూన్‌లో ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సెక్యూరిటీ ఆర్డినెన్స్ అనేదాన్ని తీసుకొచ్చి దాని కింద నిషేధం విధించారు. అదే ఆ తర్వాత చట్టంగా మారింది.

సరే, విజి రావు అప్పుడు రావు అండ్ రెడ్డి అనే న్యాయవాదుల ఆఫీసును మద్రాసులో

నడుపుతుండేవారు. ఆ తర్వాతి కాలంలో హైకోర్టు న్యాయమూర్తి అయిన ఎవి రెడ్డి కూడా ఆయనతో ఉండేవారు. వామపక్ష కార్యకర్తల కేసులు, పెద్దగా ఫీజులు ఇచ్చుకోలేని పేదల కేసులు చేపట్టే లక్ష్యంతో విజి రావు ఆ ఆఫీసు నెలకొల్పారు. న్యాయవాదులలో వామపక్ష సంస్కృతిని, పేద ప్రజల పట్ల ఆదరాభిమానాలను పెంపొందించడానికి ఆ ఆఫీసు ఎంతో కృషి చేసింది. నేను ఆ ఆఫీసులో చేరకపోయినా వారి కృషి నామీద ప్రభావం వేసింది.

సీనియర్ న్యాయవాది బాలకృష్ణన్ నన్ను ఆర్ఎం శేషాద్రి అనే మరో సీనియర్ న్యాయవాది దగ్గర చేరమని సలహా ఇచ్చారు. నేను బాలకృష్ణన్ ఆఫీసులో నా నల్లకోటు, గౌను పెట్టుకుంటుండే వాణ్ణని, ఆయన లైబ్రరీ ఉపయోగించుకునే వాణ్ణని ఇదివరకే చెప్పాను.

ఆర్ఎం శేషాద్రి చాలా ప్రతిభావంతుడైన న్యాయవాది. ఆయన ఐసిఎస్ అధికారిగా పదవీ విరమణ చేసి న్యాయవాద వృత్తిలో ప్రవేశించారు. నేనాయన దగ్గర చేరాను గాని ఎనిమిది నెలలలోపలే ఆ ఆఫీసు నుంచి బయటకు వచ్చేశాను.

ఆ తర్వాత టివిఎస్ కంపెనీలో ఉద్యోగంలో చేరాను. కొన్నాళ్ళు మద్రాసులో పర్సనల్ ఆఫీసులో పనిచేసి ఆ తర్వాత బ్రాంచి మేనేజరుగా విజయవాడ వచ్చాను. ఆ రోజుల్లో టివిఎస్ వ్యాపారం అంత పెద్దగా ఉండేది కాదు. నేను విజయవాడ వచ్చే టప్పటికి అక్కడ రెండు ట్రక్కులు మాత్రమే ఉండేవి. నేనక్కడ తొమ్మిది నెలలు పని చేశాను గాని వ్యాపారం బాగా పుంజుకుంది. నేను ఉద్యోగం వదిలేసేటప్పటికి దాదాపు అరవై ట్రక్కుల రవాణా జరుగుతుండేది.

నేను విజయవాడలో ఉన్న రోజుల్లోనే లుముంబానగర్ మహాసభ జరిగింది. మోహనకుమార మంగళం వక్తగా వస్తే నేను మా ఆఫీసు కారులోనే ఆయనను స్టేషన్ నుంచి మా ఇంటికి తీసుకుపోయాను.

కుమార మంగళం నన్ను తన ఆఫీసులోకి తీసుకోలేదని నాకు అప్పుడు కోపం వచ్చింది గాని ఇప్పుడు నా దగ్గర జూనియర్లుగా చేరుతామని వచ్చే యువ న్యాయవాదులతో నేనూ అట్లాగే అంటున్నాను.

కుమార మంగళం మెల్లమెల్లగా కాంగ్రెస్ వైపు, ఇందిరాగాంధీ వైపు జరగడం నేను చూశాను. ఆయన అడ్వకేట్ జనరల్ పదవిలో చేరడానికి ఒప్పుకున్న సందర్భంలో వచ్చి రిట్జ్ హోటల్‌లో ఉన్నాడు. నేనాయనను కలిసి 'అదేంపని' అని గట్టిగా అరిచాను. ఇక ఇందిరా గాంధీని సమర్థిస్తూ ఆమె మంత్రివర్గంలో చేరినప్పుడు నిరసన తెలుపుతూ ఉత్తరం రాశాను.

అట్లా రాంజీ, విజి రావు, కుమార మంగళం వంటి వారి ప్రభావాల వల్ల కావచ్చు నేను హైదరాబాద్ రాగానే సింగరేణి కార్మికుల ఉద్యమంతో సంబంధం ఏర్పడింది.

అప్పుడు సింగరేణి కాలరీస్‌లో శ్రీనివాసన్ అని ఐఎన్‌టియుసి నాయకుడు ఉండేవారు.

సింగరేణి కార్మికుల వేతనాలకు సంబంధించి ఏదో వివాదం వచ్చింది. ఇంక్రిమెంట్లు ఇచ్చే పద్ధతి గురించి యాజమాన్యానికీ, కార్మికులకూ విభేదం వచ్చింది. శ్రీనివాసన్ నా దగ్గరికి వచ్చి ఈ కేసు చేపట్టాలని, వాదనలకోసం ఎవరైనా సీనియర్ న్యాయవాదిని పిలవాలని అడిగారు. నేను మోహన కుమార మంగళాన్ని అడుగుతానని, ఆయనకు వీలు కాకపోతే నేనే వాదిస్తానని అన్నాను.

ఆ రోజుల్లో బొగ్గుగని కార్మికుల కేసులు వాదించడానికి ధన్‌బాద్‌లో నర్సింగ్ అని ఒక ప్లీడర్ ఉండేవారు. బొగ్గుగనుల గురించి, కార్మికుల పని పరిస్థితుల గురించి వాదించడంలో ఆయన దిట్ట.

నా వరకు నాకు అది మొట్టమొదటి పెద్ద కేసు. చాల కష్టపడి నా వాదనలన్నీ సమకూర్చుకున్నాను.

ఆ కేసు గోపాలరావు ఎక్బోటె ముందు విచారణకు వచ్చింది. నా వాదనలతో ఆయన ఏకీభవించారు. నేనంటే ఆయనకు చాలా ఇష్టం ఏర్పడింది. ఆ కేసులో నేను గెలవడం మాత్రమే కాదు, గోపాలరావు ఎక్బోటె వంటి న్యాయమూర్తికి ప్రీతి పాత్రుణ్ణయ్యాను.

ఆ తర్వాత కొద్దికాలానికే సింగరేణి కార్మికుల వేజ్ బోర్డు వివాదం వచ్చింది. కార్మికుల హోదాలు, జీత భత్యాలు జాతీయ స్థాయిలో ఒకేరకంగా నిర్ధారించాలని, వేతన స్కేళ్ళను నిర్ధారించాలని ప్రయత్నం మొదలయింది.

ఈ వివాదం పారిశ్రామిక వివాదాల ట్రిబ్యునల్ ముందుకు వచ్చింది. మళ్ళీ శ్రీనివాసన్ నా దగ్గరికి వచ్చి ఈ కేసు చేపట్టాలన్నారు. నేని విజి రావును సంప్రదించాను. ఆయన అప్పటికి రిటైరయి బెంగుళూరులో ఉంటున్నారు. పారిశ్రామిక వివాదాల చట్టం కేసులలో ఆయన నిష్ణాతుడు. ఆయనతో ఈ కేసు గురించి చర్చించడం కొరకు నేను బెంగుళూరు వెళ్ళాను. టైప్ రైటర్‌ను, గుమస్తాను పెట్టుకుని రైలు ప్రయాణంలోనే క్లెయిమ్ పత్రాలు టైపు చేయించుకు వెళ్ళాను.

విజి రావు నేను రాసిన వాదనలు చదివి అన్నీ బాగున్నాయన్నారు. రెండు రోజుల పాటు చర్చించి హైదరాబాదుకు తిరిగి వచ్చాను.

కాని పారిశ్రామిక వివాదాల చట్టం కేసుల్లో, ట్రిబ్యునల్‌లో చాలా కాలయాపన జరుగుతుంది.

ఈలోగా ఐఎన్‌టియుసి పెద్దలు నా దగ్గరికి వచ్చినందుకు అభ్యంతరం చెప్పినట్టున్నారు. శ్రీనివాసన్ నా దగ్గరికి రావడం మానేశారు. ఎఐటియుసి నాయకుడు కొమరయ్య వచ్చారు. ఆయన అట్టడుగు కార్మికవర్గం నుంచి వచ్చారు. తర్వాతి కాలంలో ఏమయిపోయినా అప్పుడు మాత్రం చాలా చిత్తశుద్ధితో ఉండేవారు.

కాని కేసు పదేపదే వాయిదా పడుతుండేది. సాక్ష్యాల నమోదు చాలా ఆలస్యమవు తుండేది. కొమరయ్య 'ఏమి సార్ ఇట్లా, ఎన్నాళ్ళకు తెగుతుంది' అనేవాడు. మొత్తం వివాదాన్ని చిన్న చిన్న ముక్కల కింద చేస, ఆ చిన్న అంశాల మీద సమ్మె చేసి పరిష్కారం సాధించుకోవడం ఉత్తమమని నేను సలహా ఇచ్చాను. నిజంగానే అది సాధ్యమైంది.

ఆ ట్రిబ్యునల్ టి. చంద్రశేఖర రెడ్డి నేతృత్వంలో కొత్తగూడెంలో విచారణ జరుపు తుండేది. యాజమాన్యం తరపున కోకా శ్రీనివాస మూర్తి వాదించేవారు.

మొత్తం మీద ఒక వైపు ట్రిబ్యునల్ జరుగుతుండగానే ఆ వివాదంలోని అనేక అంశాలు యాజమాన్యానికీ, కార్మిక యూనియన్లకూ మధ్య ఒప్పందాల ద్వారా పరిష్కారమయిపోయాయి.

చివరికి మిగిలిపోయిన వివాదాల కోసం కొత్తగూడెంలో విచారణ మొదలయింది. నేనక్కడ ఒక చిన్న హోటల్‌లో ఉండి నా వాదనలు సాగించాను. మొత్తం 109 మందిని విచారించడం జరిగింది.

అప్పుడే చంద్రశేఖర రెడ్డి నన్ను భద్రాచలం రమ్మన్నారు. నాకు నమ్మకాలు లేవని, రానని అన్నాను గాని మర్యాద కోసం వెళ్ళవలసి వచ్చింది. చంద్రశేఖర రెడ్డి, శ్రీనివాస మూర్తి, నేను భద్రాచలం రామాలయంలోకి వెళ్ళాం.

అక్కడ నా పేరు చెప్పగానే, ఆ ఆలయంలోని శ్రీవైష్ణవ పూజారి నా పేరును సరిగా, కచ్చితంగా ఉచ్చరించారు. నాపేరు మీదనే కౌశిక గోత్రస్య, కన్నబిరాన్ నామధేయస్య అని మొదటి అర్చన చేయించారు. నా తర్వాతే చంద్రశేఖర రెడ్డి, శ్రీనివాస మూర్తిల అర్చన జరిగింది.

నా పేరు జనం నోళ్ళలో చాలా రకాలుగా మారిపోయింది. కొందరు కన్నాభిరామన్ అని, మరికొందరు కన్నాభిరామ్ అని, ఇంకా కొందరు కన్నాభిరాన్ అని, మరికొందరు కన్నబీరన్ అని పిలుస్తారు. ఆ భద్రాచలం ఆలయ పూజారి బహుశా తమిళ సంపర్కం వల్ల కావచ్చు నా పేరు సరిగ్గా పలికారు.

ఆ రకంగా ఒకవైపు ఎక్కువగా సివిల్ కేసులు చేస్తూనే పారిశ్రామిక వివాదాల ట్రిబ్యునల్ ముందుకూడ చాలా కేసులు వాదించాను. ఆ తర్వాతి కాలంలోని పౌర హక్కుల ఉద్యమాచరణకు ఈ ట్రేడ్ యూనియన్ కేసుల అనుభవం కూడ చాలా ఉపకరించిందనుకుంటాను.

ఇక్కడ ట్రేడ్ యూనియన్ ఉద్యమం గురించి నా ఆలోచనలు చెప్పాలి. ట్రేడ్ యూనియన్లలో 1960ల చివరికల్లా ఆర్థిక వాదం ప్రబలిపోయింది. ట్రేడ్ యూనియన్ల లో, కార్మికోద్యమంలో తప్పనిసరిగా ఉండవలసిన రాజకీయ సునిశితత్వం మొద్దుబారి పోవడం మొదలయింది. అందరూ వేతన శర్మలై పోయారు. ఒకప్పుడు రాజకీయ అభినివేశం సక్రమంగా ఉండిన కార్మిక సంఘాలను కూడా ఆర్థిక వాదం లోలోపలి

నుంచి తొలిచివేసింది.

అప్పుడే ప్రొఫెషనల్ - వృత్తిపరమైన - ట్రేడ్ యూనియన్ ఉద్యమం ఈ దేశంలో ప్రారంభమైంది. ట్రేడ్ యూనియన్ నాయకులకు కార్మికుల పని పరిస్థితులతోగాని, వారి జీవితాలతో గాని ఏ సంబంధమూ ఉండనవసరం లేని స్థితి తలెత్తింది. యాజమాన్యం తో బేరసారాలాడగలగడం, యాజమాన్యాన్ని ఒప్పించ గలగడం, ఆడంబరంగా ఉండ గలగడం మాత్రమే కార్మిక నాయకత్వానికి అర్హత అయ్యాయి.

అటువంటి పరిణామాలకు ఒక సూచిక దత్తా సామంత్ వంటి కార్మిక నాయకులు పుట్టుకురావడం.

అంటే కార్మిక నాయకులకు, కార్మికోద్యమాన్ని నడపదలచిన వాళ్ళకు ఎటువంటి విశాల దృక్పథం అవసరంలేని, రాజకీయాలు అవసరం లేని స్థితి ఏర్పడింది. అందువల్ల కార్మిక నాయకత్వం సులభంగా అవినీతికి లొంగేదిగా, అమ్ముడు బోయేదిగా తయారయింది.

ట్రేడ్ యూనియన్లు తమ కార్మికుల సమస్యల మీద రాజకీయ పోరాటాలు, సమ్మెలు చేయకుండా ట్రిబ్యునళ్ళ ముందరికి వెళ్ళడం, ఆ కాలయాపనలో పడి అణాపైసల కోసం దేబిరించడం మొదలయింది. మరోవైపు చాల మంది న్యాయవాదులు పారిశ్రామిక వేత్తల, వ్యాపారస్తుల ఛాంబర్లలో సభ్యులయి, యజమానుల పక్షాన వాదించడం మొదలయింది.

అట్లాగే రాజకీయాలతో ఏ సంబంధమూ లేకుండా, రాజకీయ దృక్పథం లేకుండా కుప్పలు తెప్పలుగా ట్రేడ్ యూనియన్లు పుట్టుకు రావడం కూడ కార్మికోద్యమానికి నష్టం కలిగించింది.

అలా ఎమర్జెన్సీ నాటికి, ఒక్క రైల్వే కార్మికోద్యమం మినహా, మిగిలిన అన్ని రంగాలలో కార్మికోద్యమం బలహీనమై పోయింది. ఒక రంగపు కార్మికులకు మద్దతుగా, సంఘీభావంగా మరో రంగపు కార్మికులు ఆందోళనకు దిగడం అనే అలవాటే తప్పిపోయింది.

కార్మికోద్యమం ఇట్లా బలహీన పడుతుండగా న్యాయస్థానాలు దాన్ని మరింత దెబ్బతీశాయి. కార్మికులకు, పౌరులకు సంఘాలలో సంఘటితమయ్యే హక్కును ఒక ప్రాథమిక హక్కుగా రాజ్యాంగం హామీ ఇచ్చినా, న్యాయస్థానాలు ఆ హక్కును నీరుగార్చడం మొదలుపెట్టాయి.

కార్మికులకున్న సామూహికంగా బేరసారాలాడే హక్కులో సమ్మె హక్కు భాగం కాజాలదని న్యాయస్థానాలు కొత్త నిర్వచనాలిచ్చాయి. ప్రతి వివాదాన్నీ 'సామరస్య పూర్వకంగా' ట్రిబ్యునళ్ళలో పరిష్కరించుకోవాలని చెప్పడం ద్వారా సంఘంగా ఏర్పడే హక్కు పల్చబారిపోయింది. ఆ ట్రిబ్యునల్ పరిష్కారాలు కూడా కొత్త నిర్వచనాల ప్రకారం

అమలులోకి రావడం మొదలయింది. వివాదాలను సివిల్ దావాల పరిధిలోకి తీసుకు వచ్చి కార్మికులకు కార్ఖానా ఆవరణలో ప్రవేశించే హక్కు లేదని, యాభై మీటర్ల అవతలే ఉండాలని, ఊరేగింపులు తీయగూడదని, ప్రదర్శనలు జరపగూడదని అనేక ఆంక్షలు విధించడం మొదలయింది.

అంటే న్యాయస్థానాలు శాంతిభద్రతల పరిరక్షణ బాధ్యత తమ భుజాలకెత్తు కున్నాయన్న మాట. సాధారణంగా కార్యనిర్వాహక వర్గం, ముఖ్యంగా పోలీసు శాఖ సెక్షన్ 144 ద్వారా ఏ అధికారాలు అనుభవిస్తుందో, ఆ అధికారాలను పారిశ్రామిక ప్రాంతాల విషయంలో న్యాయస్థానాలు అనుభవించడం మొదలు పెట్టాయి. న్యాయ స్థానాలు ఇవాళ్టికి కూడ ప్రజా ప్రయోజన వ్యాజ్యాలను అడ్డుపెట్టుకుని, సమ్మెలను భగ్నం చేసే వ్యవస్థలుగా తయారయ్యాయి.

పారిశ్రామిక వివాదాల చట్టం ఎంత వివాదస్పదమైన వ్యాఖ్యానాలకు దారితీసిందో ఊహించశక్యం కాదు. కార్మికులు నిస్సహాయులై పోయారు. ట్రేడ్ యూనియన్లు ఒకప్పుడు విడివిడి కార్మికుల సమస్యల మీద కూడా పోరాటం చేసేవల్లా ఇప్పుడా పనిని వదిలేశాయి. పారిశ్రామిక వివాదాల చట్టంలోని అభ్యంతరాలను సవరించేందుకు ఎన్ని సవరణలు వచ్చినా, కొత్త కొత్త రూపాలలో పాత నిర్వచనాలే, పాత వ్యాఖ్యానాలే కొనసాగాయి.

ట్రేడ్ యూనియన్ ఉద్యమం ఇంత గందరగోళంగా, అస్తవ్యస్తంగా ఉండగా అందులోకి నక్సలైట్లు ప్రవేశించారు. వాళ్ళకు ఈ రంగాన్ని ఎట్లా అవగాహన చేసుకోవాలో, ఇందులో సమస్యలేమిటో, వాటికి ఆచరణ సాధ్యమైన పరిష్కారాలేమిటో తెలియదు. నిజానికి ట్రేడ్ యూనియన్ సమస్యల పరిష్కారంలో తిరుగుబాటు (ఇన్‌సరెక్షనరీ) పద్ధతులు పనిచేయవు. కాని నక్సలైట్లు పిడుక్కీ బియ్యానికీ ఒకే మంత్ర మన్నట్టు అవే పద్ధతుల ద్వారా ట్రేడ్ యూనియన్ సమస్యలను పరిష్కరిద్దామనుకున్నారు.

ట్రేడ్ యూనియన్ ఉద్యమం తప్పనిసరిగా ప్రజాస్వామికంగా ఉండవలసి ఉంటుంది.

అలా ప్రజాస్వామికంగా ఉండక పోవడం వల్ల, తిరుగుబాటు పద్ధతులను అమలు చేసినందువల్ల ఎన్నో కార్మిక సమస్యలలో ఓడిపోవడం నాకు తెలుసు. కాని ఆ సమస్య లన్నీ న్యాయమైనవీ, ఇతర పద్ధతులలో పోరాడి ఉంటే విజయం సాధించగలిగినవీ కూడ. అటువంటి పద్ధతుల వల్లనే రైతాంగ ఉద్యమం కూడ అపజయానికి గురయిందని నేననుకుంటాను. కాని అది మరోచోట.

దేశం మొతం మీద పనిచేస్తున్న ట్రేడ్ యూనియన్లు ఒకవైపు ఆర్థిక వాదంలో కూరుకు పోవడంతో పాటు మరోవైపు పిడివాదంతో కొందరు కార్మికులను, ఒక విశాల కార్మిక రంగాన్ని దూరం చేసుకున్నాయి.

అది అసంఘటిత కార్మిక రంగం. కాంట్రాక్టు కార్మికులను పూర్తి స్థాయి కార్మికులుగా గుర్తించి, తమ సంఘాలలో సంలీనం చేసుకునేందుకు జాతీయ కార్మిక సంఘాలు

సంకోచించినందువల్ల దేశంలో విస్తృతమైన అసంఘటిత రంగంలోని కార్మికులు ఎక్కడికక్కడ తమకు తోచిన రీతిలో సంఘాలలో సంఘటితం కావడం మొదలయింది.

ఇటువంటి కార్మికులను సమీకరించవలసి ఉన్నదని, ఆ ఉద్యమాన్ని రాజకీయ స్పర్శతో నిర్వహించాలని సంపూర్ణంగా గుర్తించి, ఆ పని చేసినవాడు శంకర్ గుహనియోగి. ఆయన మీద ఎన్ని రకాల ఒత్తిడులు ఎన్నివైపుల నుంచి వచ్చినా లొంగిపోలేదు. అందుకే ఆయనను చంపేశారు. ఆయన హత్యకేసు నేను వాదించాను. అది మరోసారి.

ఇదంతా చెప్పడం ఎందుకంటే నా పౌరహక్కుల ఉద్యమ కార్యాచరణ నాటి సామాజిక, రాజకీయ స్థితిగతులు ఆ ఉద్యమాన్ని ఎట్లా అనివార్యం చేశాయో చూపడానికే.

ట్రేడ్ యూనియన్లలో ఆర్థికవాదం ప్రవేశిస్తే అది ఏ ప్రమాదానికి దారితీస్తుందో లెనిన్ రాశాడు. సరిగ్గా ఆయన హెచ్చరించినట్టుగానే మనదేశంలో కూడ సంఘటిత కార్మికోద్యమంలో ప్రవేశించిన ఆర్థికవాద వేరు పురుగు దేశ రాజకీయ జీవితంలోని ప్రతి ఒక్క అంశాన్నీ ధ్వంసం చేసేసింది. దేశ రాజకీయ, ఆర్థిక, సామాజిక సమస్యలపైన పోరాడగలిగిన శక్తి ఉన్న కార్మికవర్గం ఆ ఆర్థికవాదం వల్లనే నిర్వ్యాపకతలోకి దిగజారింది.

మన సామాజిక జీవితంలోని ఒక్కొక్క వ్యవస్థా - రాజకీయాలు, పార్లమెంటు, న్యాయ వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ, మధ్య తరగతి, కార్మిక వర్గం - తమ కర్తవ్య నిర్వహణలో ఎట్లా విఫలమవుతూ వచ్చాయో నా అనుభవం నుంచి రేఖామాత్రంగా వివరించాను.

* * *

## పౌరహక్కుల ఉద్యమం ప్రారంభం

ఈ వైఫల్యం వల్లనే పౌరహక్కుల ఉద్యమం పుట్టుకురావలసి వచ్చింది. అది ఎవరో ఒక వ్యక్తి వల్లనో, కొందరు వ్యక్తుల వల్లనో రాలేదు. ఒక చారిత్రక అనివార్యతగా వచ్చింది. ఆ తర్వాత అది ఎట్లా మారిందనేది వేరే చర్చ. కాని పౌరహక్కుల ఉద్యమం చాలా సహజంగా తలెత్తడానికి తగిన భూమికను మన సామాజిక జీవితమే సృష్టించి పెట్టింది.

1970 లకు ముందు దేశంలో పౌరహక్కుల ఉద్యమం లేదని కాదు. కాని దాని మూలాలకూ, 1970 ల తర్వాతి పౌరహక్కుల ఉద్యమ మూలాలకూ తేడా ఉంది. 1964లో అనుకుంటాను, ఎంఎల్ఎ క్వార్టర్స్‌లో జరిగిన ఒక పౌరహక్కుల సమావేశానికి వెళ్ళాను. అది చివరికి సిపిఐ, సిపిఎం సానుభూతి పరుల మధ్య ఘర్షణగా ముగిసింది. 1970ల ముందరి పౌరహక్కుల ఉద్యమం గురించి నాకు అంతకన్న ఎక్కువ సంబంధం లేదు.

కాని 1970ల తర్వాత, ఇంకా స్పష్టంగా చెప్పాలంటే 1968 తర్వాత దేశంలోనూ, రాష్ట్రంలోనూ సాగిన పౌరహక్కుల ఉద్యమ ఆలోచనలకు చాలా లోతయిన సామాజిక పునాది ఉంది.

అప్పుడే ప్రారంభమైన నక్సలైట్ల సాయుధ పోరాటం ఆ రోజుల్లో వర్గ శత్రు నిర్మూలన అనే మార్గాన్ని చేపట్టింది. ప్రభుత్వం ఆ పోరాటకారుల మీద అతి తీవ్రమైన అణచివేతను అమలుచేసింది.

అప్పటికే ఒక దశాబ్దంగా దేశంలో పరిపాలన అనేది చట్ట, న్యాయ, రాజకీయ వ్యవస్థలను దిగజార్చివేసింది. పార్లమెంటు దాని రాజకీయ బాధ్యతలను మరచి పోయింది. గవర్నర్ల వ్యవస్థ దుర్వినియోగానికి గురయింది. ఎన్నికల రాజకీయాలు, ఎన్నికల ప్రచారాలు హాస్యాస్పదమైన ప్రహసనంగా మారిపోయాయి. దేశంలో రాజకీయ చర్చల సరళి అట్టడుగుకు దిగజారిపోయింది.

ఆ స్థితిలో ఏదో ఒక రాజకీయ ఆలోచన ఉండక తప్పదని ఇందిరా గాంధీ గుర్తించింది. అందువల్ల జనాకర్షక రాజకీయాలనైనా ఉనికిలోకి తెచ్చింది. రాజ్యాంగం లోని ఆదేశిక సూత్రాలను ఆచరణలోకి తీసుకురావలసిన అవసరం గురించి మాట్లాడడం మొదలుపెట్టింది.

అయితే ఆ చర్చలో ఆమె చాల తెలివిగా ఆదేశిక సూత్రాలకూ, ప్రాథమిక హక్కులకూ పోటీ పెట్టింది. పార్లమెంటుకూ, న్యాయవ్యవస్థకూ పోటీ పెట్టింది. అర్ధసత్యాలు ప్రచారం చేయడం మొదలు పెట్టింది. ఆమె మాటలను చాలామంది నమ్మారు కూడ.

ఇక్కడ ఒక చిత్రం ఏమంటే ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరిగితే న్యాయస్థానానికి వెళ్ళవచ్చు. న్యాయస్థానం ద్వారా వాటిని సంపాదించుకోవచ్చు. అందుకే వాటిని జస్టిసియబుల్ అంటారు. ఆదేశిక సూత్రాలు అటువంటివి కాదు. వాటిని న్యాయస్థానం ద్వారా సంపాదించుకోవడానికి వీలు లేదు. అవి నాన్ జస్టిసియబుల్. ఆమె ఎంత తెలివిగా ఈ వాదన ముందుకు తెచ్చిందంటే న్యాయస్థానం ద్వారా సంపాదించగలిగిన వాటికన్న న్యాయస్థానానికి వెళ్ళి అడగడానికి వీలులేనివే ముఖ్యమైనవని వాదించింది.

కాని నేనేమనుకుంటానంటే ఆదేశిక సూత్రాలను అమలుచేయడానికి ప్రాథమిక హక్కులు ఉండడం అత్యవసరం. కాని ఈ దేశంలో న్యాయవ్యవస్థ అప్పటికే దిగజారి పోయి, సామాజిక పరివర్తనా కర్తవ్యాన్ని చేపట్టడానికి చేతకాని స్థితికి చేరింది.

సుప్రీం కోర్టు స్థితి చూస్తే న్యాయవాద వృత్తి అసహ్యకరమైన స్థితికి చేరుకుంది. ఒకరోజు, ఒక గంట వాదిస్తే, లేచి నిలబడితే వేలాది రూపాయలు ఫీజు వసూలు చేసే వాతావరణంలో ఒక పేదవాడి కేసు సుప్రీం కోర్టు ముంగిట్లోకైనా వెళ్తుందా?

న్యాయవాద వృత్తి సమాజానికి సేవచేయాలనే ఆదర్శాన్ని మరిచిపోయింది. వైద్య, ఉపాధ్యాయ వృత్తుల్లో కూడా అదే జరిగింది. ఆ పరిస్థితుల్లో ఆ అసంతృప్తితో సహజంగానే

ఉద్యమాలు పెల్లుబుకుతాయి.

కమ్యూనిస్టు ఉద్యమంలోని యువ కార్యకర్తలు ఇంక ఓపిక పట్టలేకపోయారు. ఎన్నో చర్చలు, వివాదాల తర్వాత సాయుధ పోరాటం తప్ప మరో దారి లేదనే నిర్ణయానికి వచ్చారు. క్రమక్రమంగా ఎప్పటికో ఒకప్పటికి సోషలిజం వస్తుందనే మాటలో వారికి విశ్వాసం పోయింది. బలప్రయోగమే మంత్రసాని అనే మాట వాళ్ళు దృఢంగా నమ్మారు. వాళ్ళ కళ్ళ ముందర చైనా అనుభవం కూడా ఉంది. అదే ఏకైక మార్గమని వాళ్ళు అనుకున్నారు.

అయితే వాళ్ళ పొరపాటేమిటంటే చైనా పరిస్థితులకూ, భారతదేశపు పరిస్థితులకూ చాల తేడా ఉంది. అది వాళ్ళు గమనంలోకి తీసుకోలేదు. బ్రిటిష్ వలసవాదం ఈ దేశంలో తయారు చేసి పెట్టిన పాలకవ్యవస్థలు, సుశిక్షితులైన పోలీసు, సైనిక యంత్రాంగాలు చాలా బలమైనవి.

ఆ తొలితరం సాయుధ పోరాటాన్ని ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా అణచివేసింది. వందలాది మంది కార్యకర్తలను ఎన్‌కౌంటర్ల పేరిట చంపివేసింది. దాదాపు ఐదువేల మంది గిరిజనులను జైళ్ళలో నిర్బంధించింది. శ్రీకాకుళం జిల్లాలోని రెండు మూడు తాలూకాలు నిర్బంధ శిబిరాలుగా మారిపోయాయి. ఇటు హైదరాబాద్ కుట్ర కేసు (నాగిరెడ్డి కుట్రకేసు), అటు పార్వతీపురం కుట్రకేసు పెట్టి వందలాది మంది కార్యకర్తలను, సానుభూతిపరులను వాటిలో ఇరికించింది.

అప్పుడు - 1970కి ముందే - ఈ నక్సలైటు కేసులను రావి సుబ్బారావు గారు హైకోర్టులో వాదిస్తుండేవారు. ఆయన అప్పటికి సిపిఐతో ఉన్నప్పటికీ నక్సలైట్ల కేసులన్నీ ఆయనే చేపట్టేవారు.

ఆయన చాలా మంచిమనిషి. నాకు ఆయనతో చాలా సాన్నిహిత్యం ఉండేది. ఆయనే నాకు ఈ పౌరహక్కుల, నక్సలైట్ల కేసులతో పరిచయం కల్పించారు.

అప్పుడే నాకు జ్వాలాముఖి కూడ పరిచయమయ్యాడు. నా ఆఫీసులో పని చేస్తుండిన నరసింహాచారికి జ్వాలాముఖికి బంధుత్వం ఉందనుకుంటాను. అందువల్ల జ్వాలాముఖి నా దగ్గరకు వస్తుండేవాడు.

నాకిప్పటికీ గుర్తొస్తుంది - జ్వాలాముఖి వర్గ శత్రు నిర్మూలన అవసరం గురించి నాకు పాఠం చెపుతుండేవాడు. నేను ఆయనతో విభేదిస్తుండేవాడ్ని.

"ఇట్లా వర్గశత్రువులను ఒక్కొక్కడ్ని పట్టుకుని చంపడం ఎప్పుడయ్యేను? ఇది పద్ధతి కాదయ్యా - ఏదో వెల్లువ లాగ వచ్చి ఇదంతా కొట్టుకు పోవలసిందే తప్ప ఇది పనికి రాదు" అనేవాడ్ని.

"పురుగుల్ని చంపే మిషన్ కనిపెట్టి ప్రచారం చేస్తున్నాడట అమ్మేవాడెవడో. ఒక్కొక్క పురుగును పట్టుకో, మిషన్‌లో పెట్టు, మీట నొక్కు-ఇదంతా అయ్యేపని కాదు" అనేవాడ్ని.

ఆ రోజుల్లోనే విరసం ఏర్పడింది. జ్వాలాముఖి, చెరబండరాజు, నిఖిలేశ్వర్ కవిత్వం వినిపిస్తుండేవాళ్ళు. వాళ్ళ కవిత్వం పుస్తకాల్ని ప్రభుత్వం నిషేధించింది. 1970 జులై 4న విరసం ఏర్పడిన రోజున విడుదలయిన 'మార్చ్' కవితా సంకలనాన్ని, అక్టోబర్‌లో విరసం మొదటి మహాసభల్లో విడుదలయిన 'ఝంఝ' కవితా సంకలనాన్ని ప్రభుత్వం నిషేధించింది.

1971 మార్చిలో ఈ నిషేధ ఉత్తర్వులు వస్తే వెంటనే విరసం తరపున ఈ రెండు పుస్తకాల నిషేధం మీద హైకోర్టులో రిట్ పిటిషన్ వేశాం. మొదట 'మార్చ్' నిషేధాన్ని వరంగల్ సెషన్స్ కోర్టు ధృవపరిచింది. హైకోర్టులో మాత్రం ముగ్గురు న్యాయమూర్తుల బెంచిలో ఇద్దరు న్యాయమూర్తులు నిషేధాన్ని ఖాయం చేస్తూ తీర్పు ఇచ్చారు. జస్టిస్ కొండా మాధవ రెడ్డి మాత్రం సుదీర్ఘమైన డిసెంట్ నోట్ రాశారు.

ఆ బెంచిలో జస్టిస్ ఓబుల్ రెడ్డి, జస్టిస్ శ్రీరాములు, జస్టిస్ మాధవ రెడ్డి ఉన్నారు. మార్చ్, లే సంకనాల నిషేధం మీద నేను వాదించగా, ఝంఝ నిషేధం మీద పత్తిపాటి వెంకటేశ్వర్లు వాదించాడు. మార్చ్, ఝంఝల నిషేధాన్ని సమర్థించిన న్యాయమూర్తులు, లే నిషేధాన్ని కొట్టివేశారు. మొత్తం మీద రాజద్రోహం అనే మాటకు న్యాయస్థానం చాలా సంకుచితమైన నిర్వచనం ఇచ్చింది.

ఆ నిర్వచనాన్ని జస్టిస్ మాధవ రెడ్డి అంగీకరించలేదు. ఆయన చాల ఓపికగా న్యాయవాదుల వాదనను వినే న్యాయమూర్తి. అతి కొద్ది మంది మంచి న్యాయమూర్తులలో ఆయన ఒకరు.

ఆ సంవత్సరమే ఆగస్టులో జ్వాలాముఖి, నిఖిలేశ్వర్, చెరబండరాజు లను అరెస్ట్ చేసి ప్రివెంటివ్ డిటెన్షన్ ఆక్ట్ కింద కేసులు పెట్టారు. ఆ అరెస్టులను సవాలు చేస్తూ, అసలు ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టమే రాజ్యాంగ విరుద్ధమని వాదించాం. జస్టిస్ చిన్నప్ప రెడ్డి, జస్టిస్ ఎడివి రెడ్డిల ధర్మాసనం మా వాదనను అంగీకరించి పిడి ఆక్ట్‌లోని ఒక నిబంధనని కొట్టివేసింది. ఫలితంగా పి.డి. చట్టం పూర్తిగా రద్దయిపోయింది. ఆ చట్టం, దాని బాగోగులు, వాదనలు మరోసారి వివరిస్తాను.

రావి సుబ్బారావు గారితో స్నేహం వల్ల నేను కూడా ఆయనతో పాటు ఈ కేసులు వాదించడం మొదలు పెట్టాను. ఆయన పట్ల గౌరవంతోనే నేను ఒక సిపిఐ కార్యకర్త పోషణకు నెలవారీ విరాళం కూడా ఇస్తుండేవాడ్ని.

రాష్ట్రంలో విపరీతంగా నిర్బంధం అమలవుతున్న ఆ రోజుల్లో కోర్టు కేసులు వాదించడానికి న్యాయవాదులను ప్రేరేపించవలసిన అవసరం వచ్చింది. పార్వతీపురం కుట్రకేసు, హైదరాబాదు (నాగిరెడ్డి) కుట్రకేసులతో పాటు ఎన్నో దజన్ల కేసులు విప్లవ కార్యకర్తల మీద, సానుభూతి పరుల మీద నడిచాయి. అప్పుడు కొందరు విప్లవకారులు 'బూర్జువా కోర్టులను బహిష్కరించాలి' అనే వైఖరి తీసుకోవడం వల్ల వాళ్ళ తరపున

వాదనలు వినిపించుకునే అవకాశం కూడ పోగొట్టుకున్నారు.

ఈ స్థితిలో విప్లవకారుల కేసులు వాదించేలా న్యాయవాదులను ప్రోత్సహించడానికి కలకత్తా నుంచి సీనియర్ న్యాయవాది భక్తి భూషణ్ మండల్ హైదరాబాదు వచ్చారు. భక్తి భూషణ్ మండల్ హైదరాబాదు పర్యటనను రావి సుబ్బారావే నిర్వహించారనుకుంటాను.

ఒక సాయంకాలం హోటల్ హరిద్వార్ కాన్ఫరెన్స్ హాలులో భక్తి భూషణ్ మండల్ ఉపన్యాసం ఏర్పాటు చేశారు. ఆ సభకు నన్ను రావి సుబ్బారావు తీసుకుపోయారు. ఆ సభకు దాదాపు నలభై మంది న్యాయవాదులు హాజరయ్యారు. అది కచ్చితంగా 1971కి ముందే జరిగిన సమావేశం. ఒక రకంగా రాష్ట్రంలో పౌరహక్కుల ఉద్యమ నిర్మాణపు తొలి ప్రయత్నాలలో అది ఒకటి.

ఆ సమావేశంలో భక్తి భూషణ్ మండల్ చాలా బాగా మాట్లాడారు. విప్లవకారుల కేసులు వాదించడానికి మమ్మల్ని ఉత్తేజపరిచారు. ఆ సమావేశం చివరిలో ఏదయినా నిర్మాణ ప్రయత్నం చేయాలనుకున్నాం.

అప్పటికే నా తల నెరవడం మొదలయింది. "మీ తల నెరుస్తోంది కాబట్టి మీకు బాధ్యత తీసుకునే అర్హత వచ్చిందన్నమాట. మీరు కన్వీనర్‌గా ఉంటే బాగుంటుంది" అన్నారందరూ. అట్లా నక్సలైటు ఖైదీల డిఫెన్సు కమిటీ ఏర్పడి నేను దాని కన్వీనర్ నయ్యాను.

ఆ డిఫెన్స్ కమిటీ బాధ్యులుగా జీవన్ రెడ్డి, పద్మనాభ రెడ్డి, రావి సుబ్బారావు, పత్తిపాటి వెంకటేశ్వర్లు ఉండేవారు. జీవన్ రెడ్డి ఆ తర్వాత జడ్జి అయ్యారు. రావి సుబ్బారావు 1980లో చనిపోయారు. పద్మనాభ రెడ్డి, పత్తిపాటి వెంకటేశ్వర్లు ఇంకా న్యాయవాద వృత్తిలో ఉన్నారు.

కాని ఆ డిఫెన్స్ కమిటీ వేసినప్పుడు మేమందరమూ బహుశా మా ముప్పయ్యవ పడిలోనే ఉన్నాం. రాష్ట్రంలో ఎక్కడ డిఫెన్స్ వాదనలు అవసరమయినా వెళ్ళి మా శక్తియుక్తులు వెచ్చించగల వేడినెత్తురుతో ఉన్నాం.

నా వరకు నాకు అప్పటికి బయటికి వెళ్ళి పనిచేసిన అనుభవం లేదు. అప్పటికి నేను సభల్లో ఉపన్యాసాలు ఇచ్చిన వాడ్ని కూడా కాదు. కేవలం న్యాయస్థానాలలో పని చేసిన అనుభవం ఉంది. ఎంతో కొంత వాదనా పటిమ సంపాదించాను. కాని ఆ హరిద్వార్ హోటల్ సమావేశం తర్వాత, అన్యాయంగా కేసుల పాలయి నిర్బంధం అనుభవిస్తున్న ప్రజా ఉద్యమ కార్యకర్తలకు మద్దతుగా ఒక నిర్మాణం తయారవు తున్నప్పుడు, దానికి నా శక్తి ధారపోయడం అవసరం అనిపించింది.

అంతేకాదు, 'ఎంత చిన్నదయినా సరే నీ రంగం అంటూ ఒకటి ఎంచుకో, ఆ రంగంలో సమర్థంగా పనిచెయ్యి' అనే నా జీవనతత్వం ఇక్కడ ఉపయోగించవచ్చు ననిపించింది. ఉద్యమ కార్యకర్తలు, ప్రజలు కోల్పోతున్న పౌర, ప్రజాస్వామిక హక్కులను

పరిరక్షించడానికి పోరాడడమే నా రంగం అని నిర్ణయించుకున్నాను.

నాకు గుర్తున్నంతవరకు, ఆ సమావేశం జరిగిన మర్నాడే పార్వతీపురం కుట్రకేసు ముద్దాయిల తరపున 250 రిట్‌పిటిషన్లు దాఖలు చేశాం. అప్పటికి పార్వతీపురం కుట్రకేసు పెట్టి చాల కాలమయింది గాని విచారణ మొదలు కాలేదు. అసలు ఈ రాష్ట్రంలో కుట్రకేసుల పేరు మీద జరిగిన అక్రమాల గురించి వివరంగా చెప్పాలి. దానికి మరో అధ్యాయం కేటాయిస్తున్నాను గాని ప్రస్తుతానికి పార్వతీపురం కుట్రకేసు గురించికొన్ని విషయాలు చెప్పాలి.

పార్వతీపురం కుట్రకేసు అనబడేది ఎన్నో కేసుల, నేరారోపణల సమాహారం. అసలు ఆ కేసు నమోదయిన 1970 జనవరి నుంచి ఇటీవలి కుట్రకేసుల దాకా ఇన్వెస్టిగేటింగ్ ఆఫీసర్లు చేసిన పనల్లా అంతకుముందరి ఒకటి రెండు సంవత్సరాల్లో నమోదయిన ఎఫ్ఐఆర్ లన్నీ చదివి వాటన్నిటినీ మళ్ళీ ఒకచోట రాయడం. ఈ పని చేసినందుకు కనీసం ఇద్దరు ఇన్వెస్టిగేటింగ్ ఆఫీసర్లు ప్రమోషన్లు పొంది ఐపిఎస్‌లుగా కన్వర్ట్ అయ్యారు.

పార్వతీపురం కుట్రకేసులో ముద్దాయిలు 148 మంది. ప్రాసిక్యూషన్ ఇచ్చిన సాక్షుల సంఖ్య వెయ్యికి పైన. వెయ్యి మంది సాక్షులు చూస్తుండగా నూటయాభై మంది చేసిన పనులు కుట్ర ఎట్లా అవుతాయని విప్లవ రచయితలు ఎద్దేవా చేస్తుండే వాళ్ళు.

ఈ కేసులో 1970 జనవరిలో ఎఫ్ఐఆర్ దాఖలయింది. బొడ్డుపాడు గ్రామంలో 1968 అక్టోబర్‌లో సమావేశం జరిగిందని, ఆ సమావేశంలో జరిగిన కుట్రవల్ల ఆ తర్వాత ఏడాదిన్నరలో 30 హత్యలు, 100 దోపిడీలు, 200 ఇతర నేరాలు జరిగాయని 1970 అక్టోబర్‌లో పెట్టిన ఛార్జిషీట్‌లో అభియోగాలు మోపారు.

ఆ కేసు నత్తనడక నడుస్తోంది గనుక, ఇంతమంది నిందితులతో, సాక్షులతో కేసు విచారణ ఎప్పటికి పూర్తవుతుందో తెలియదు గనుక నిందితులందరినీ విడుదల చేయాలని మేం మా రిట్ పిటిషన్లలో అభ్యర్థించాం. ఆ రిట్ పిటిషన్ల మీద జీవన్ రెడ్డి, నేను వాదించాం.

మా వాదనల ఫలితంగా ప్రభుత్వం పార్వతీపురం కుట్రకేసు విచారణ జరపడానికి విశాఖపట్నంలో ఒక ప్రత్యేక న్యాయస్థానాన్ని ఏర్పాటు చేసింది. అట్లాగే నాగిరెడ్డి కుట్రకేసు విచారణ కోసం హైదరాబాదులో మరో ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటయింది.

పార్వతీపురం కుట్రకేసు చాలా పెద్దకేసు గనుక, అప్పటికే నక్సలైటు ఉద్యమంలో చీలికలు మొదలయి, అన్ని వర్గాల వాళ్ళు వేరు వేరు న్యాయవాదులను కోరుకున్నారు గనుక, ఆ కేసులో చాలామంది నిందితులు నిరక్షరాస్య గిరిజనులు గనుక ఆ కేసు వాదనల పనిని చాలామంది న్యాయవాదులతో పంచుకోవలసి వచ్చింది.

ఆ కేసు విచారణల సందర్భంగా, వాదనలు తయారు చేసుకునే సందర్భంగా నిందితుల తరపున వాళ్ళ బంధువులో, మిత్రులో, రాజకీయ ప్రతినిధులో న్యాయవాదు

లను తరచుగా కలుస్తుండే వాళ్ళు.

డిఫెన్సు కమిటీల ఏర్పాటులోను, దాని పనిలోను, తరిమెల నాగిరెడ్డి చాల శ్రద్ధాసక్తులు కనబరిచారు. ఆయన చాల తరచుగా మా ఇంటికి వస్తూ ఉండేవారు. లెక్కలేనన్ని చార్మినార్ సిగరెట్లు, చాయ్‌లు తాగుతూ కేసుల విషయాలు మాట్లాడుతుండే వారు. డిఫెన్స్ కమిటీ ఏర్పడిన కొత్తలో అందులో న్యాయవాదులందరమూ ఏ విభేదాలు లేకుండా చేరాం గాని క్రమక్రమంగా పత్తిపాటి వెంకటేశ్వర్లు చారుమంజుదార్ అభిమాని అయ్యారని నాగిరెడ్డికి అనుమానం ఉండేది.

నాకు ఈ విభేదాల మీద అప్పుడూ ఇప్పుడూ కూడా సదభిప్రాయం లేదు. అందువల్ల నా దగ్గరికి అన్ని రకాల వాళ్ళు వస్తుండేవాళ్ళు. జ్వాలాముఖి, నిఖిలేశ్వర్, చెరబండరాజు, పత్తిపాటి వెంకటేశ్వర్లు, రంగనాధం లాంటి వాళ్ళందరూ ఎప్పుడూ కలుస్తుండేవాళ్ళు.

అటు కేసుల విషయంలోను, ఇటు బెయిల్ పిటిషన్లు వాదించడం, షరతులతో కూడిన బెయిల్స్ వస్తే, ఆ షరతులను ఎత్తివేయించడం కోసం ప్రయత్నించడం మొదలయిన పనులను డిఫెన్స్ కమిటీ బాగానే చేసింది. మా పనిలో జిల్లాలో న్యాయవాదులెందరో కూడా భాగం పంచుకున్నారు. ఒక కొత్త, యువ న్యాయవాదుల బృందం ముందుకొచ్చి ప్రజా ఉద్యమ కార్యకర్తల కోసం నిస్వార్థంగా కృషిచేసే సంప్రదాయం మొదలయింది.

ఇటు న్యాయవాదులు డిఫెన్సు కమిటీని కొనసాగిస్తుండగానే, 1974లో హైదరాబాదులో ఒపిడిఆర్ (ఆర్గనైజేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ డెమొక్రటిక్ రైట్స్), గుంటూరులో ఆంధ్ర ప్రదేశ్ పౌరహక్కుల సంఘం (ఆంధ్ర ప్రదేశ్ సివిల్ లిబర్టీస్ కమిటీ - ఎపిసిఎల్‌సి) ఏర్పడ్డాయి.

వివేకవర్ధిని కళాశాల (హైదరాబాదు) లో వాదారి వెంకటరామయ్య అనే సీనియర్ న్యాయవాది నాయకత్వంలో ఒపిడిఆర్ ప్రారంభ సభ జరిగింది. అప్పటికే డిఫెన్స్ కమిటీ వల్ల ఏర్పడిన సాన్నిహిత్యంతో నన్ను ఒపిడిఆర్‌లో చేరమని నాగిరెడ్డి ఆహ్వానించారు. అప్పటికే నాగిరెడ్డి రాజకీయాలకు భిన్నంగా చారుమజుందార్ రాజకీయాలతో ఉన్న భూమయ్య, కిష్టా గౌడ్ ఉరిశిక్ష రద్దు ఉద్యమంలో కూడ ఉన్నాను. కాని ఎపిసిఎల్‌సిలో చేరాలని కూడ నేను అనుకోలేదు.

ఏ ఒక్క బృందంతోనూ నన్ను నేను కలిపి చూపుకోవాలని అనుకోలేదు.

మరికొద్ది నెలలకే దేశంలో ఎమర్జెన్సీ అమలులోకి వచ్చింది. ఒపిడిఆర్, ఎపిసిఎల్‌సి రెండూ పనిచెయ్యలేని స్థితి వచ్చింది. ఇటు డిఫెన్స్ కమిటీకి, అటు ఎపిసిఎల్‌సి కి కూడ కార్యదర్శిగా ఉండిన పత్తిపాటి వెంకటేశ్వర్లును ప్రభుత్వం అరెస్టు చేసి జైల్లో తోసింది. డిఫెన్స్ కమిటీని మూసివేయడం మంచిదని ఒక న్యాయవాది సలహా ఇచ్చారు. నాతో మాట్లాడదానికి తోటి న్యాయవాదులు భయంభయంగా ఉండే పరిస్థితి వచ్చింది.

జూన్ 26, 1975 - అది రాజకీయ చరిత్రలో చాలా పెద్ద దుర్దినం. ఆ రోజుల ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ కేవలం తన పదవిని కాపాడుకోవడం కోసం దేశంలో

అత్యవసర పరిస్థితిని విధించింది. రాజ్యాంగంలోని 352 అధికరణం ప్రకారం, అసలు మొత్తంగా 18వ భాగం ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించుకుని కేంద్ర మంత్రి వర్గసలహా మేరకు రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ జూన్ 25 అర్ధరాత్రి ఎమర్జెన్సీ ప్రకటించారు.

ఎమర్జెన్సీ ప్రకటించడమంటే రాజ్యాంగం హామీ ఇచ్చిన ప్రాథమిక హక్కులను తాత్కాలికంగా రద్దు చెయ్యడమన్న మాట. ఎమర్జెన్సీ ప్రకటించడమంటే రాజ్యాంగ బద్ధపాలనను తుంగలో తొక్కడమన్న మాట.

నిజానికి రాజ్యాంగం అప్పటికి అమలులోకి వచ్చి పావు శతాబ్దం గడిచినా, రాజ్యాంగంలోనే ఎమర్జెన్సీ విధించే అధికరణాలు ఉన్నప్పటికీ అటువంటి చీకటి రాజ్యం వస్తే ఎలా ప్రవర్తించాలో భారత ప్రజానీకం సంసిద్ధంగా లేదు.

ఎమర్జెన్సీ ప్రకటించబడే నాటికి మేమంతా భూమయ్య, కిష్టాగౌడ్ ఉరిశిక్షను రద్దు చేయాలనే ఆందోళనలో తలమునకలుగా ఉన్నాం. మే లో అనుకుంటాను ఆ ఉరిశిక్ష రద్దు ఆందోళనలో భాగంగా పెద్ద సభ జరిపాం. అప్పటికి ఆ సభ జరిపిన వాళ్ళం కూడ ఎమర్జెన్సీ వస్తుందని ఊహించలేదు.

నిజానికి దేశంలో అప్పటికే ఎక్స్‌టర్నల్ ఎమర్జెన్సీ (బాహ్య కారణాల వల్ల అత్యవసర పరిస్థితి) అమలులో ఉంది. 1962లో చైనా యుద్ధం సందర్భంగా ఎమర్జెన్సీ ప్రకటించ బడింది. ఆ ఎమర్జెన్సీని తొలగించాలని కొంత ఆందోళన ఉండేది గాని దాన్ని ఎత్తి వేయడం జరగలేదు. అసలు 1947 నుంచే దేశంలో నిరంకుశ ప్రభుత్వ పాలనకు చట్టబద్ధంగానూ, చట్టానికి బైటా బీజాలు పడ్డాయి. ఆ చర్చ మరొకసారి గాని ఇప్పటికి 1975 ఎమర్జెన్సీ సంగతి చూద్దాం.

* * *

# ఎమర్జెన్సీ

ఎమర్జెన్సీ వచ్చేటప్పటికి మన వ్యవస్థలోని మౌలిక నిర్మాణాలన్నీ ధ్వంసమై పోయాయి. ముఖ్యంగా న్యాయవ్యవస్థ, పార్లమెంటరీ వ్యవస్థ పనికిరాకుండా పోయాయి. పార్లమెంటు అనేది బాతాఖానీ షాపు కూడా కాకుండా పోయింది.

కొంత మంది ప్రజ్ఞావంతులయిన పార్లమెంటేరియన్లు ఉండేవారు. ఉదాహరణకు మధులిమాయే ఉండేవాడు. అశోక్ మెహతా ఉండేవాడు. రాం మనోహర్ లోహియా ఉండేవాడు... అటువంటి ప్రజ్ఞావంతులయిన పార్లమెంటేరియన్లు కూడ నిరర్థకమయి పోయారు. పాకిస్తాన్‌తో యుద్ధంలో గెలిచి, బంగ్లాదేశ్ సాధించి, ఆమె విజయేందిర అయిన తర్వాత ఆమెకు తిరుగులేకుండా పోయింది.

అందువల్ల ప్రజాప్రతినిధులనబడే వాళ్ళు ప్రజలకు ప్రాతినిధ్యం వహించడం మానేశారు. పార్లమెంటులో పెరుగుతున్న ఆధిపత్య, నిరంకుశ ధోరణులకు ప్రాతినిధ్యం వహించడం మొదలుపెట్టారు.

అట్లాగే న్యాయవ్యవస్థను విధ్వంసం చేయడం క్రమబద్ధంగా, పద్ధతి ప్రకారం 1960ల నుంచే జరిగింది. ఆ క్రమం గురించి మరోసారి.

ఆంధ్ర ప్రదేశ్‌లో ఎమర్జెన్సీ పాలన భయానకంగా సాగింది. అక్రమ అరెస్టులు విచ్చలవిడిగా సాగాయి. వందలాది మంది నక్సలైట్ల సానుభూతిపరులు, ప్రతిపక్ష నాయకులు, ప్రజా సంఘాల నాయకులు ఎంతో మంది ఈ నిర్బంధానికి గురయ్యారు. ప్రభుత్వ భవనాలు, పాఠశాలలు, పంచాయతీ భవనాలు, గెస్ట్ హౌసులు నిర్బంధ శిబిరాలుగా మారాయి.

అంపశయ్య నవీన్ రాసిన నవల 'చీకటి రోజులు'లో ఆ నిర్బంధ కాండ గురించి వివరంగా ఉంది.

ఆ రాత్రి నుంచే నాకు ఫోన్ కాల్స్ రావడం మొదలయింది. మొట్టమొదటి ఫోన్ కాల్ పత్తిపాటి వెంకటేశ్వర్లు నుంచి. ఆయన అప్పటికి మా డిఫెన్స్ కమిటీకి కార్యదర్శి. పౌరహక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి.

పోలీసులు ఆయన ఇంటిమీద దాడి చేసి పుస్తకాలు ఎత్తుకుపోయారు. పౌర హక్కుల సంఘం రికార్డ్స్ ఎత్తుకుపోయారు. ఆయనను అరెస్టు చేశారు.

ఆ తర్వాత ఎంటి ఖాన్ నుంచి ఫోన్. ఎంతోమంది కవులు, రచయితలు ఫోన్లు చేశారు. వాళ్ళ కుటుంబ సభ్యులు ఫోన్ చేశారు. ఆ రాత్రి నుంచి మర్నాటి ఉదయం దాకా నాకు కనీసం ఇరవై ముప్పై మంది అరెస్టయిన వార్త ఫోన్ ద్వారా తెలిసింది.

ఆ వెంటనే నేను రాజ్యాంగం తీసి ఎమర్జెన్సీ ఏమిటి, దాని వల్ల ఏయే హక్కులు పోతాయి మళ్ళీ ఒకసారి చదువుకున్నాను.

ఆ తర్వాత అబిడ్స్‌లోని ఎఎ హుస్సేన్ పుస్తకాల షాపుకు వెళ్ళి విలియం షైరర్ రాసిన 'ది రైజ్ అండ్ ఫాల్ ఆఫ్ ది థర్డ్ రీష్' పుస్తకం కొనుక్కున్నాను. హిట్లర్ జర్మనీలో అధికారాన్ని ఎట్లా సంపాదించాడో, ఆ అధికార సోపానంలో అత్యున్నత శిఖరాలకు ఎట్లా ఎగబాకాడో, చివరికి ఎట్లా పతనమైపోయాడో చాలా వివరంగా, విమర్శనాత్మకంగా చెప్పిన పుస్తకం అది. వందలాది పేజీల ఆ ఉద్గ్రంథంలో విలియం షైరర్ మహా నియంత హిట్లర్ గురించి ఏమేమి వర్ణించాడో, ఇందిరా గాంధీ సరిగ్గా ఆ పనులే చేయడం మొదలుపెట్టింది. ఆ పనుల వరుసలో ఒకానొకటి ఈ ఎమర్జెన్సీ ప్రకటన.

ఆ రోజు నేను చేసిన మొదటి పని పత్తిపాటి వెంకటేశ్వర్లు తరఫున పిటిషన్ రాయడం. పిటిషన్ ప్రధాన భాగమంతా రాసి టైపు చేయించాను. వెంకటేశ్వర్లు భార్య వెంకాయమ్మ గారిని పిలిపించాను. ఆమె వివరాలన్నీ ఆ పిటిషన్‌లో చేర్పించాను. అప్పుడే వెంకటేశ్వర్లు దగ్గర గుమస్తాగా పనిచేస్తుండిన వెంకటరావు కూడా వచ్చాడు.

వెంకటేశ్వర్లు దగ్గర ఉన్న కేసుల ఫైళ్ళన్నీ నా దగ్గరికి తెప్పించుకున్నాను. కక్షిదార్లందరికీ చెప్పమని వెంకటరావుకు చెప్పాను. ప్రతి కక్షిదారూ ప్రతి కేసు విషయం లోనూ వెంకాయమ్మ గారి దగ్గరికి వెళ్ళి ఫీజు ఇచ్చి రావాలి. ఆమె ఆ విషయం నాకు చెప్పిన తరువాతనే 'నేను కోర్టులో వాదిస్తాను' అనే ఏర్పాటు చేశాను.

సరే, ఆ రోజు పత్తిపాటి వెంకటేశ్వర్లు పేరు మీద లంచ్ మోషన్ మూవ్ చేశాను. ఆ పిటిషన్‌లో అసలు ఎమర్జెన్సీ చట్టబద్ధతను సవాలు చేశాను. అంతరంగిక భద్రతా చట్టం (మెయింటెనెన్స్ ఆఫ్ ఇంటర్నల్ సెక్యూరిటీ ఆక్ట్ - మీసా) సమంజసత్వాన్ని ప్రశ్నించాను. పత్తిపాటి వెంకటేశ్వర్లును అరెస్టు చేయడాన్ని సవాల్ చేశాను.

ఆ లంచ్ మోషన్ జస్టిస్ కొండా మాధవ రెడ్డి గారి బెంచి మీదికి వచ్చింది.

కోర్టు హాలులోకి అప్పటి పోలీసు కమిషనర్ శరణ్యన్ వచ్చి కూచున్నాడు. డ్రెస్‌తో వచ్చి కూచున్నాడు. వెంపటాపు సత్యనారాయణ అనే శ్రీకాకుళ ఉద్యమ నాయకుడిని చంపడంలో ఆ శరణ్యన్‌కు సంబంధం ఉందని నాకు తెలుసు.

రాత్రికి రాత్రే మొత్తం వాతావరణం మారిపోయినట్టు కనబడింది.

ఆ గాలిలో భయం, అనుమానం వ్యాపిస్తుండడం నేను చూశాను. న్యాయవాదుల మనసులలో బెరుకు ముఖాల మీద కనబడుతోంది.

మా డిఫెన్స్ కమిటీ కోశాధికారిగా ఉండిన శ్రీరామారావు అనే న్యాయవాది వచ్చి ఇంకెందుకు మన డిఫెన్స్ కమిటీ? మన పని అయిపోయింది గదా 'మూసేద్దాం' అని అన్నాడు.

'లేదు. మన పని ఇప్పుడే మొదలవుతోంది' అని నేనన్నాను.

ఎవరు నా వెంట ఉన్నా, లేకపోయినా నేనీ పని చేస్తూనే ఉంటాను, చేయాలి అనుకున్నాను.

న్యాయవాదులు, బైటి మిత్రులు కొందరు కూడ నన్ను తప్పించుకు పోవడం మొదలు పెట్టారు. ఎదురు పడితే మాట్లాడేవారు కాదు. కొందరు రెడ్డి మిత్రులు మాత్రం నాతో పాటు భోజనం దగ్గర కూర్చునేవారు.

మధ్యాహ్నం పిటిషన్ విచారణకు వచ్చింది. నా వాదనలు మొదలు పెట్టాను. "అసలు అతడ్ని అరెస్టు చేయడానికి తగిన కారణమే లేదండీ. అతను డిఫెన్స్ కమిటీ కార్యదర్శి. అతడ్ని తీసుకుపోయి మీసా కింద ఇరికిస్తే ఎట్లా అండీ" అని నేను మాధవ రెడ్డి గారి ముందు వాదిస్తున్నాను.

'అసలు గ్రౌండ్సే లేవండి' అని నేను జస్టిస్ మాధవ రెడ్డి గారితో అనగానే ఆయన పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఓబులపతి చౌదరి వైపు తిరిగి 'గ్రౌండ్స్ ఎక్కడ' అని అడిగారు.

'గ్రౌండ్స్ టైపవుతున్నాయండీ' అని ఓబులపతి చౌదరి చెప్పారు.

'ఆ స్టేట్‌మెంట్ రికార్డు చెయ్యండి. గ్రౌండ్స్ మీద అరెస్టు చేయడం కాదు. ముందు

అరెస్టు చేసి పడేసి ఆ తర్వాత కారణాలేవో బనాయించి ఇప్పుడు టైపు చేయిస్తున్నారు' అని నేను తగులుకున్నాను.

దీన్ని ఎట్లా చేసేదిరా అని మాధవ రెడ్డి గారికి సంకటం పట్టుకుంది. దాన్ని అట్లనే రికార్డు చేస్తే చౌదరి ఉద్యోగం పోతుంది.

అందుకని ఆయన కొంచెం తాత్సారం చేశాడు. అట్లా సాగదీసే సరికి గ్రౌండ్స్ టైప్ అయిన కాగితం వచ్చింది.

సరే, ఆ తర్వాత చట్టానికే ఒక సవరణ తెచ్చారు. గ్రౌండ్స్ ఏమిటి అని అడగడానికి వీల్లేదు అని. అసలు ప్రతిరోజూ ఏదో ఒక సవరణ ఫాక్స్ వస్తూనే ఉండేది. ఎక్కడో ఏదో రిట్ పిటిషన్ పడి, చట్టాన్ని మొత్తంగానో, చట్టంలోని ఏదో ఒక నిబంధననో సవాలు చేయడం, వెంటనే దానికి సవరణ తీసుకురావడం - ఈ మాదిరిగా ఉండేది.

అంతకు ముందే సుప్రీం కోర్టు రాజ్యాంగపు మౌలిక నిర్మాణాన్ని మార్చగూడదు అని తీర్పు ఇచ్చి ఉంది గదా. అది ఆస్తి విషయంలోనేనా మనకు ఉండగూడదా అని అరెస్టు రాజ్యాంగపు మౌలిక నిర్మాణానికి ఉల్లంఘన, కనుక చెల్లదని వాదించాను.

నేనిట్లా వాదించగానే మాధవ రెడ్డి గారు దాన్ని ఫుల్ బెంచికి నివేదించారు. ఫుల్ బెంచిలో జస్టిస్ మాధవ రెడ్డి గారు, జస్టిస్ గంగాధరరావు గారు, జస్టిస్ జయచంద్రా రెడ్డి గారు ఉన్నారు.

ఇది ఎట్లా అయిపోయిందంటే నేనీ కేసు వాదిస్తూ ఉండగానే, ఇంకా ఇంకా ఎంతో మందిని అరెస్టు చేసి డిటెన్యూలుగా తీసుకురావడం, వాళ్ళు మా వకీలు కన్నబిరాన్ అని అంటూ ఉండడం. ఇట్లా వాదన సాగుతూ పోయింది.

అందరికీ నేను మెమో ఆఫ్ అపియరెన్స్ వేసేవాణ్ణి. రిట్ పిటిషన్లు వేసేవాణ్ణి. తలమునకలుగా పని ఉండేది. జక్కా వెంకయ్య, వై. రాధాకృష్ణమూర్తి - సిపిఎం వాళ్ళు, ఎంఎల్ వాళ్ళు అందరూ నా పేరే చెప్పేవాళ్ళు.

జైల్లో పడి ఉన్నప్పుడు బైట గాలి పీల్చాలంటే కోర్టు వాయిదానే ఆధారం. అట్లా ఏదో ఒక కారణం మీద ఆ డిటెన్యూలందరూ పిటిషన్లు వేసేవాళ్ళు. వాళ్ళ తరపున నేనే వాదించే వాణ్ణి. అట్లా మొత్తం మీద ఆ రోజుల్లో నేను దాదాపు రెండు మూడు వందల రిట్ పిటిషన్లు వేసి ఉంటాను. ఒకే పిటిషన్ నలుగురు, ఐదుగురు డిటెన్యూల తరపున వేయవలసి ఉండేది.

పత్తిపాటి వెంకటేశ్వర్లు తరపున వేసిన పిటిషన్‌ను కోర్టు డిస్మిస్ చేసింది. అట్లాగే ఆ పిటిషన్లన్నీ డిస్మిస్ అయిపోయాయి.

ఆ రోజుల్లో నా ఇంటి ముందర విపరీతమైన నిఘా పెట్టారు. ఎందుకో నన్ను మాత్రం అరెస్టు చేయలేదు. ఇంకో న్యాయవాది ఎవరూ ఇటువంటి కేసులు చేయడం లేదు గనుక ఉన్న ఒక్కణ్ణి ఎందుకు అరెస్టు చేయాలనుకున్నారో ఏమిటో తెలియదు. వకీలును కూడా తీసేసినారంటే ఇంకా భ్రష్టు పడతామని అనుకున్నారేమో.

ఒక్కసారి ఇన్ని రిట్ పిటిషన్లు ఉండడంతో ఒక్కోసారి ఒకే సమయానికి రెండు మూడు కోర్టుల్లో వాదనలు ఉండేవి. అవి వాయిదా అయినా అడిగే వాణ్ని, లేదా ఏం మునిగిపోయింది మీరే వాదించుకోండి అని డిటెన్యూలకు చెప్పేవాణ్ణి.

అట్లా ఒక ఫుల్ బెంచికీ, మరొక బెంచికీ పరస్పరం విభేదించుకున్న తీర్పు వచ్చింది. జస్టిస్ మాధవ రెడ్డి, జస్టిస్ పున్నయ్య ఆ బెంచిలో ఉన్నారు. కేశవరావు జాధవ్, నరేంద్ర, శీతల్ సింగ్ లష్కరి, పి. వెంకటేశ్వర్లు - ఇట్లా పదిమంది ఒక బ్యాచ్‌గా వేసిన రిట్ పిటిషన్ అది.

మాధవ రెడ్డి గారు ఆ రిట్‌ను అనుమతించారు. పున్నయ్య గారు కొట్టేశారు.

ఈ డిటెన్యూలు పున్నయ్యకు వ్యతిరేకంగా కోర్టు హాల్లో నినాదాలు చేశారు. నరేంద్ర, శీతల్ సింగ్ లష్కరిలు బెంచి మీదికి చెప్పులు విసిరేశారు.

అలా చేయడం తప్పే. పున్నయ్య గారేదో ఆయన అభిప్రాయం ఆయన చెప్పాడు. అప్పటికే ఎందరో మహామహులు ఇందిరా గాంధీకి దాసులయి పోయినప్పుడు పున్నయ్య గారి మీద అట్లా ప్రవర్తించడం తప్పే.

అట్లా కోర్టు హాల్లో నినాదాలివ్వడం, న్యాయమూర్తి మీదికి చెప్పులు విసరడం తప్పు. అది కోర్టు ధిక్కరణ కిందికే వస్తుంది. నన్ను న్యాయమూర్తులు తమ ఛాంబర్ లోకి పిలిపించారు. 'మీ క్లయింట్లు ఇట్లా కోర్టు ధిక్కరణకు పాల్పడితే ఎట్లా? దీన్ని కోర్టు ధిక్కరణ కింద విచారించి శిక్షలు వేస్తాము' అన్నారు.

అది ఒక పెద్ద సంక్షోభం. అప్పటికే వాళ్ళు ఆరు నెలలకు పైగా అక్రమ నిర్బంధం లో ఉన్నారు. మళ్ళీ కోర్టు ధిక్కరణ కింద శిక్ష పడితే మరింత వేధింపుకు గురవుతారు. నేను గందరగోళంలో పడ్డాను. అటు వాళ్ళు తప్పు చేయలేదని వాదించలేను. ఇటు ఈ కొత్త నేరం కింద శిక్ష విధించడానికి ఒప్పుకోలేను.

అందుకని జస్టిస్ పున్నయ్య గారి మానవతా దృష్టిని మేల్కొలిపాను. "నిజమే. వాళ్ళు అట్లా ప్రవర్తించడం తప్పే. అది కోర్టు ధిక్కారమే. న్యాయమూర్తిని, న్యాయస్థానాన్ని అవమానించడమే. కాని అప్పటికి ఆరు నెలలుగా వాళ్ళు ఏ నేరారోపణ లేకుండా, విచారణ లేకుండా జైల్లో మగ్గుతున్నారు. వాళ్ళ ప్రవర్తనను ఆ నేపథ్యం నుంచి అర్థం చేసుకోండి. మీరిప్పుడు ఈ కొత్త నేరం కింద మరింత శిక్ష విధించారనుకోండి, మీకు అదనంగా వచ్చేదేమీ లేదు. పెద్ద మనసుతో వాళ్ళను క్షమించండి. న్యాయమూర్తిగా మీరెంత హుందాగా ప్రవర్తించగలరో చూపండి" అని వాదించాను.

మొత్తానికి పున్నయ్య గారు నా విన్నపాన్ని అంగీకరించారు. డిటెన్యూల ప్రవర్తనను క్షమించారు.

ఆ రోజుల్లో జరిగిన మరొక సంఘటన చెప్పాలి.

జస్టిస్ చెన్నకేశవ రెడ్డి బెంచి ముందు నేను ఈ ఎమర్జెన్సీ డిటెన్యూల కేసులే

వాదిస్తున్నాను. అప్పటి రాడికల్ విద్యార్థి సంఘం అధ్యక్షుడు ఎన్. వెంకటరమణి కూడా డిటెన్యూలలో ఉన్నాడు.

అప్పటి అరెస్టుల గురించి రమణి నాకొక విషయం చెప్పాడు. మామూలుగా ఎవరిని, ఏ కారణాల మీద అరెస్టు చేస్తున్నారో పేరు, వివరాలు, నేర అభియోగాలు, సెక్షన్ల వివరాలతో అరెస్టు వారెంట్లు తయారుచేసి, అవి నిందితుడికి చూపి అరెస్టు చేయాలి. కాని పోలీసులు పేర్లు, వివరాలు లేకుండా ఖాళీ అరెస్టు వారెంట్లు తయారు చేసి ఇష్టం వచ్చిన వాళ్ళను అరెస్టు చేసి కోర్టుకు తీసుకొచ్చినప్పుడు ఆ వివరాలు నింపుతున్నారని రమణి చెప్పాడు.

అప్పుడు కోర్టు హాల్లో రామకృష్ణా రెడ్డి అనే డిసిపి ఉన్నాడు. ఆయన దగ్గర కూడ అటువంటి ఖాళీ వారెంట్లున్నాయి. అసలు అట్లా ఖాళీ వారెంట్లు తయారుచేసి దగ్గర పెట్టుకోవడం శిక్షార్హమైన, చట్ట వ్యతిరేకమైన పని.

అలా పోలీసు అధికారి దగ్గర ఖాళీ వారెంట్లున్నాయని, అలా అరెస్టు చేయడం చట్ట వ్యతిరేకమని నేను జస్టిస్ చెన్నకేశవ రెడ్డి గారికి చెప్పాను. ఆ పోలీసు అధికారి దగ్గర వారెంట్లు దొరికాయి. చెన్నకేశవ రెడ్డి గారు నిండు కోర్టు హాల్లో ఆ అధికారికి బాగా చివాట్లు పెట్టారు. 'ఏమిటీ చట్ట వ్యతిరేక చర్యలు' అని అరిచారు.

అయితే ఎమర్జెన్సీలో ఎంత భయానక వాతావరణం ఉండిందంటే ఈ చట్ట వ్యతిరేక పని గురించి తెలిసి కూడ, నిండు కోర్టు హాల్లో పోలీసు అధికారిని చివాట్లు పెట్టి కూడ, న్యాయమూర్తి ఆ అరెస్టులను మాత్రం కొట్టివేయ లేకపోయారు. ఎంత గట్టిగా మాట్లాడినా, న్యాయమూర్తి అరెస్టులను కొట్టివేసి, మా రిట్ పిటిషన్‌ను ఆమోదించి, డిటెన్యూలను విడుదల చేయబోరని నాకు ముందే తెలుసు.

నా ఊహను నిజం చేస్తూ న్యాయమూర్తి మా పిటిషన్‌ను డిస్మిస్ చేశారు. అక్రమ అరెస్టులని తెలిసినప్పటికీ ఆ అరెస్టులను ఆమోదించారు.

అట్లా ఎమర్జెన్సీలో ఆంధ్ర ప్రదేశ్‌లో వందలాదిమంది అక్రమ నిర్బంధానికి గురయి, ఎమర్జెన్సీ కాలమంతా జైళ్ళలో మగ్గిపోయారు. వేలాది మంది కొద్ది రోజుల పాటో, నెలల పాటో తాత్కాలిక నిర్బంధ, చిత్రహింసా శిబిరాల్లో ఉండిపోయారు.

ఆ ఎమర్జెన్సీ డిటెన్యూలలో కొందరి పిటిషన్లయినా ఆమోదించి వారి విడుదలకు ఆదేశించిన న్యాయమూర్తులు జస్టిస్ జి.సి.కొండయ్య, జస్టిస్ సాంబశివరావు, జస్టిస్ మాధవ రెడ్డి, జస్టిస్ కుప్పుస్వామి లాంటి కొద్దిమంది మాత్రమే.

అంటే ఇక్కడ ఒక విచిత్రం చూడాలి. వామపక్ష, ప్రగతి శీల రాజకీయాలకు దగ్గరగా ఉండే ప్రభుత్వం అని అందరూ చెప్పుకుంటూ ఉంటే అణచివేత ఎక్కువగా వామపక్ష పార్టీల మీద, సానుభూతిపరుల మీద అమలయింది.

భారత కమ్యూనిస్టు పార్టీ శ్రీమతి ఇందిరా గాంధీని సమర్థించింది. మొదట డాంగే సమర్థించాడు. తర్వాత పార్టీ అంతా అదే ధోరణి అవలంబించింది.

రావి సుబ్బారావు వల్ల నేను అప్పటికి ఒక సిపిఐ కార్యకర్త పోషణ బాధ్యత వహిస్తున్నానని చెప్పాను గదా. అప్పటికి నేను బాగానే సంపాదిస్తున్నాను. ఈ కార్యకర్త పోషణ గురించి సుబ్బారావు నన్నడిగాడు. నేను సరేనన్నాను.

కానీ ఎమర్జెన్సీలో నేను పార్టీతో విభేదించాను. చాలా తీవ్రంగా విభేదించాను. నేను ఎమర్జెన్సీని సవాలు చేస్తూ హైకోర్టులో రిట్ పిటిషన్లు వేస్తున్నాను. ఆ పార్టీయేమో ఎమర్జెన్సీని సమర్థిస్తూ ఉంది.

మేమంతా స్థూలంగా అప్పటికి సిపిఐని సమర్థిస్తూ ఉన్నాం గనుక తమ్మారెడ్డి సత్యనారాయణ గారు మా వకీళ్ళందరినీ ఒక సమావేశానికి ఆహ్వానించారు. క్రొవ్విడి నరసింహం గారింట్లో ఆ సమావేశం జరిగింది. నరసింహం గారు సిపిఐకి చెందిన అడ్వకేటు.

వాదారి వెంకట రమణయ్య, నేను, మరికొంతమంది వకీళ్ళం ఆ సమావేశానికి వెళ్ళాం. వాదారి వెంకట రమణయ్య ఉదారవాద న్యాయవాది. సిపిఐకి మద్దతు ఇచ్చేవాడు. ఆయన ఆ సమావేశంలో చర్చల మధ్యలో "అసమ్మతి తెలిపే, భిన్నాభిప్రాయం ప్రకటించే హక్కు ఉండగూడదా" అని ప్రశ్నించాడు.

"ఆ హక్కు ఎవరికి?" అని తమ్మారెడ్డి సత్యనారాయణ ఎదురు ప్రశ్న వేశారు.

నాకు దిగ్భ్రాంతి కలిగింది.

"అడగవలసిన ప్రశ్న ఎవరికి అని కాదు, ఎందుకు అని. భిన్నాభిప్రాయం ప్రకటించడం ఏ ప్రయోజనం కోసం అని" నేనన్నాను.

అట్లా ప్రశ్నించడం చాలా అప్రజాస్వామికం అని స్పష్టంగా చెప్పాను.

దానితో వాళ్ళకు నా మనసెక్కడుందో అర్థమయిపోయింది. ఆ కార్యకర్త పోషణకు నా దగ్గర నుంచి విరాళం తీసుకోవడం మానేశారు. అభిప్రాయ భేదం వచ్చినప్పుడు అది సహజమే అని నేననుకున్నాను. అయితే అట్లని వాళ్ళపట్ల నాకేమీ దురభిప్రాయాలు ఏర్పడలేదు. అప్పటి పరిస్థితులు వాళ్ళను అటువైపు నెట్టాయి. అందువల్ల వాళ్ళు ఎమర్జెన్సీని సమర్థించారు. నేను వ్యతిరేకించాను. అంతే. నిజానికి వాళ్ళు కూడా తమ అప్పటి వైఖరి తప్పని తర్వాతి కాలంలో గుర్తించారు.

సరే, ఆ రోజుల్లో అటు సిపిఎం వాళ్ళను, ఇటు నక్సలైట్లను పెద్ద ఎత్తున అరెస్టు చేశారు. మరెంతో మందిని అక్రమ నిర్బంధంలో ఉంచారు.

ప్రతి నిర్బంధం విషయంలోనూ ఇమిడి ఉన్న చట్టపరమైన అంశాలను లేవనెత్తడం నా పని. అది అయితే కొట్టివేయబడేది లేదా ఫుల్ బెంచికి రిఫర్ చేయబడేది. పెద్దగా విజయం సాధించిందేమీ లేదు గాని రాజ్యాంగం గురించీ, ప్రాథమిక హక్కుల గురించీ చర్చను న్యాయస్థానాలలో ఎడతెగకుండా సాగించడం సాధ్యమయింది.

నిజానికి భారత రాజ్యాంగ యంత్రం నిర్వచనమే దాని పరిమితుల ఆధారంగా

సాగింది. భారత రాజ్యాంగం ఈ రాజ్యాంగ యంత్రం ఏయే పరిమితుల లోపల పని చేయవలసి ఉంటుందో నిర్వచించింది.

అంటే సైద్ధాంతికంగా కూడ భారత రాజ్యానికి అపరిమిత అధికారాలు లేవు అనేది నా బలమైన విశ్వాసం. పరిమితులను రాజ్యాంగం అధికరణం 12 నుంచి ప్రాథమిక హక్కుల అధ్యాయంలో నిర్ధారించింది.

నిజానికి రాజ్యాంగంలో కీలకమైన అధ్యాయాలు ప్రాథమిక హక్కులకు, ఆదేశిక సూత్రాలకు సంబంధించినవి. సరే, ప్రవేశిక ఎట్లాగూ ఉంది. ఇవి రాజకీయ, సామాజిక విలువల గురించి మాట్లాడిన అధ్యాయాలు.

ఈ మౌలిక అధ్యాయాలను పక్కన పెట్టిన శ్రీమతి ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ రోజులలో కొన్ని బాధ్యతల గురించి కూడ మాట్లాడడం మొదలు పెట్టింది.

ఎమర్జెన్సీలో, 1976 డిసెంబర్‌లో ఆమె రాజ్యాంగానికి 42వ సవరణను ప్రతిపాదించింది. ఆ సవరణ చాల ఇతర అంశాలతో పాటు రెండు ముఖ్యమైన మార్పులను ప్రతిపాదించింది. రాజ్యాంగ ప్రవేశికలో కొత్తగా సోషలిస్టు, సెక్యులర్ అనే మాటలను చేర్చింది. దానితో పాటు భాగం IVఎ అనే పేరుతో, అధికరణం 51ఎ గా ప్రాథమిక విధులు అనే పరిచ్ఛేదాన్ని చేర్చింది.

అప్పుడు పి.ఎం.భార్గవ ఒక సదస్సును నిర్వహించారు. ఆ సదస్సులో నేనూ ఒక పత్రం సమర్పించాను.

రాజ్యాంగంలోకి మీరు ఒక వైపు బాధ్యతలు ప్రవేశపెట్టి, మరోవైపు సోషలిజం ప్రవేశపెట్టారంటే ఇవి రెండూ కలిస్తే నేషనల్ సోషలిజం అవుతుంది అని నేనన్నాను. నేషనల్ సోషలిజం అంటే నాజీజం. హిట్లర్ అధికారాన్ని కైవసం చేసుకోవడానికి ఉపయోగించిన నినాదం అది. దాన్ని అవలంబించడం అంత మంచి పనేమీ కాదు అని చెప్పాను.

భార్గవను నేనప్పుడు తరచుగా కలుస్తుండేవాణ్ణి. ఆయన అప్పుడు తయారు చేస్తుండిన జాతీయ విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనకు నేను సహకరించాను. అంతకుముందే పరంజపే గారింట్లో నేను ఆయనను కలిశాను. ఆ రోజుల్లో సిపిఐకి దగ్గరగా ఉండిన, ప్రగతిశీల భావాలుండిన చాల మంది పరంజపే ఇంట్లో ప్రతివారం సమావేశం అవుతుండేవారు. సామాజిక, రాజకీయ పరిణామాల మీద చర్చిస్తుండే వారు.

నేను ఆ సమావేశాల్లోనే రాజబహదూర్ గౌర్‌ను కలుసుకున్నాను. ఎంతోమంది నాకక్కడ పరిచయమై స్నేహితులయ్యారు.

సరే, ప్రాథమిక విధుల గురించిన చర్చ, పౌరుడి బాధ్యతల గురించిన చర్చ ఎప్పుడు పైకొస్తుందంటే ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరుగుతున్నప్పుడు. అణచివేత సాగుతున్నప్పుడు.

సైద్ధాంతికంగా చూస్తే, మీరు మీ ప్రాథమిక హక్కులను వినియోగిస్తున్నారంటే, ఇతరులు వారి ప్రాథమిక హక్కులు అనుభవించడానికి బాధ్యత పడుతున్నారన్నమాట. అంటే ఇతరుల హక్కుల పరిరక్షణ మీ బాధ్యత అవుతుంది. హక్కులకూ బాధ్యతలకూ మధ్య సంబంధాన్ని ఇట్లా అర్థం చేసుకోవాలి.

ఎమర్జెన్సీ నిర్బంధాల కేసులు వాదించే సందర్భంలో మళ్ళీ మళ్ళీ బైటపడిన విషయం ఏమంటే రాజ్యాంగంలోని హక్కుల ఆధారిత దృక్పథం క్రమక్రమంగా విచ్ఛిన్నమైపోయింది.

సామాజిక జీవనంలో మార్పులు తెచ్చే బాధ్యతను ఏ విమర్శనాత్మక వైఖరి లేకుండా రాజ్యాంగ యంత్రం చేతుల్లో పెట్టడం జరిగింది. దాదాపు ప్రతి రిట్ పిటిషన్‌లోనూ ఈ వాదనే మళ్ళీ మళ్ళీ చేయవలసి వచ్చింది.

రాజ్యం రక్షణ విలువలతో సంబంధంలేని విషయం కాదని, ఏ విలువల కోసం రాజ్యం ఆవిర్భవించిందో, ఆ విలువలను గౌరవించాలని నేను వాదించాను. ఆ విలువలు జాతీయోద్యమ, మానవతా విలువలు.

సరే, ఈ అరెస్టు చట్టబద్ధంగా జరగలేదు, ఇది రాజ్యాంగ మౌలిక నిర్మాణానికి వ్యతిరేకం లాంటి చట్టపరమైన, సాంకేతికమైన అంశాలు కూడ వాదిస్తుండేవాడ్ని.

అయితే వ్యక్తుల నిర్బంధం విషయంలో రాజ్యాంగ మౌలిక నిర్మాణం దెబ్బతినడం లేదని సుప్రీం కోర్టు కూడ తీర్పు ఇచ్చింది. ఆస్తి విషయంలో రాజ్యంగ మౌలిక నిర్మాణాన్ని మార్చే పనులు చేయగూడదని తీర్పు ఇచ్చిన సుప్రీం కోర్టు, వ్యక్తిగత స్వేచ్ఛ విషయంలో మాత్రం దానికీ రాజ్యాంగ మౌలిక నిర్మాణానికీ సంబంధం లేదని అంది.

ఆ ధర్మాసనం అభిప్రాయమేమంటే ప్రభుత్వం హక్కులు ఇస్తుంది. రాజ్యాంగం హక్కులు ఇస్తుంది. అందువల్ల ఆ హక్కులను ప్రభుత్వం, రాజ్యాంగం వెనక్కి తీసుకోవచ్చు అని.

కాని ప్రాథమిక హక్కులను ఈ రకంగా అర్థం చేసుకోవడం చాలా తప్పు. ఎందుకంటే ఏ పాలకులయినా, ఏ రాజ్యమయినా, ఏ ప్రభుత్వమయినా, ఏ రాజ్యాంగ మయినా మనుషులకు సహజంగా ఉన్న హక్కులను గుర్తిస్తుంది. గౌరవిస్తుంది. వాటిని కాపాడతానని హామీ ఇస్తుంది. అంతేగాని లేని హక్కులను ఇవ్వదు.

రాజనీతి శాస్త్రంలో సామాజిక ఒడంబడిక (సోషల్ కాంట్రాక్ట్) సిద్ధాంతమే తీసుకోండి. ప్రజలు పాలకులకు, ప్రభుత్వాధికారానికి కొన్ని అధికారాలివ్వడానికి ఒడంబడిక చేసుకుంటారు. "ఫలాని ఫలాని షరతులకు లోబడి నీకు అధికారం ఇస్తున్నాము" అని ప్రజలు ప్రభుత్వానికి అధికారం ఇస్తారు.

ఈ సామాజిక ఒడంబడిక పురుషుల మధ్యనే కుదిరినట్టుందని, ఇందులో స్త్రీలకు భాగం ఉన్నట్టు కనబడడం లేదని అద్భుతంగా వాదించిన ఒక స్త్రీ వాద పుస్తకం చదివాను. ఆ వాదన పూర్తిగా నిజమేనని నాకనిపిస్తుంది.

సరే, ఈ లోతయిన విషయాలను పక్కన పెట్టి, ఎమర్జెన్సీ నాటి రాజకీయ నాయకులు ప్రజల హక్కులను హరించడానికి తమకు సర్వాధికారాలు ఉన్నట్టు, శ్రీమతి ఇందిరా గాంధీకి ఇంకా ఎక్కువ అధికారాలున్నట్లు ప్రవర్తించారు. మాట్లాడారు.

ఇంకా ఆశ్చర్యకరమైన విషయమేమంటే ఈ దేశంలోని మేధావి వర్గం ఈ మొత్తం చర్చలో ఆరోగ్యకరమైన వాదనలు ముందుకు తేవడంలో విఫలమై పోయింది.

తత్ఫలితంగా ఈ దేశంలో ప్రజాస్వామిక వ్యవస్థ నిర్మాణంలో అనేక వక్రీకరణలు చోటు చేసుకున్నాయి. ఆ వక్రీకరణల వల్ల, అసమ్మతి తెల్పిన వ్యక్తులందరూ, సకారణంగా అసమ్మతి తెల్పినప్పటికీ, జైళ్ళలో తోయబడ్డారు.

ఆ సమయంలో మరికొందరు వ్యక్తులు నిర్బంధించవలసిన అవసరం లేకపోయినా నిర్బంధించబడ్డారు. అనవసరంగా జైళ్ళపాలయిన ఆ వ్యక్తులే ఆ తర్వాతి కాలంలో తామేదో గొప్ప త్యాగం చేసినట్టుగా వీరాలాపాలు పలికి, జయప్రకాశ్ నారాయణ్ భుజాల మీదికి ఎక్కి అధికార పగ్గాలు చేపట్టారు. మతోన్మాద పాలనకు పునాదులు వేశారు. వారిని ఎమర్జెన్సీలో నిర్బంధించడం ద్వారా ఈ దేశానికి ఇందిరా గాంధీ ఇచ్చిన కానుక అది.

వాళ్ళు నిజానికి ఎప్పుడూ జైలు జీవితాన్ని చూసి ఉండలేదు. వాళ్ళు జాతీయోద్యమంలో భాగం కారు. కాని ఇందిరా గాంధీ వారికి ఆ సదవకాశాన్ని ఇచ్చింది.

జమాయత్ ఎ ఇస్లామ్ కార్యకర్తలను, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కార్యకర్తలను కూడ అరెస్ట్ చేసి జైల్లో పెట్టారు.

భవానీ శంకర్ అని ఒక కుర్రవాడుండేవాడు. అతని రిట్ పిటిషనే నా ఆఖరి రిట్ పిటిషన్. ఆ కుర్రవాడికి అప్పటికి పదిహేనేళ్ళో, పదహారేళ్ళో. ఆ తర్వాత భారతీయ మజ్దూర్ సంఘ్ నాయకుడయ్యాడు.

ఆ రోజు నేను జస్టిస్ సాంబశివరావు, జస్టిస్ గంగాధరరావు కోర్టులో ఏదో కేసు వాదించి వస్తున్నాను. హెబియస్ కార్పస్ కేసనుకుంటాను వాదించి బైటకి వచ్చి సిగరెట్ తాగుతూ నిలబడ్డాను.

అప్పుడే అంతరంగిక భద్రతా చట్టం సరైనదేనని చెపుతూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు వచ్చింది.

ఈ భవానీ శంకర్‌ను కోర్టుకు తీసుకొచ్చారు. “మీ వకీలెవరు” అని జడ్జీలడిగితే ఆ కుర్రవాడు “కన్నబిరాన్” అని చెప్పాడు. జైల్లో చెప్పి పంపించి ఉంటారు. ఇక్కడికొచ్చి అదే పేరు చెప్పాడు.

‘కన్నబిరాన్ ఇప్పుడే బైటికి పోయాడుగదా, పిలవండి’ అన్నారు జడ్జీలు.

జవాను బైటికొచ్చి పిలిస్తే నేను కోర్టు హాల్లోకి వెళ్ళాను.

ఆ కుర్రవాడికి ఇంకా నూనూగు మీసాలు కూడా సరిగా లేవు.

'ఈ పసి కుర్రవాడు ఈ దేశ అంతరంగిక భద్రతకు ప్రమాదంగా ఉన్నాడంటే, ఆ బోడి, పనికిమాలిన అంతరంగిక భద్రత అవసరమే లేదు' అన్నాను నేను.

ఆ రోజులు ఎట్లా ఉండేవంటే, శంకరాచార్యుడు దేని గురించి చెప్పాడోగాని 'నహినహిరక్షతి దుక్రిన్ కర్‌నె' అన్నది అక్కడ వర్తించింది. అప్పుడే దుక్రిన్ కర్‌నె అని తెలిసింది. ఈ వ్యాకరణం, ఈ వాక్యనిర్మాణం, ఈ చట్టం ఏదీ పనిచేయడం లేదు అని అర్థమయింది. చాలా బట్టబయలుగా తెలిసింది.

అప్పుడే ఓ సారి కె.వి.రమణారెడ్డిని కోర్టుకు తీసుకొచ్చారు. ఆయన విరసం నాయకుడు, వక్త. ఆయన ఒక మంచి ఉపన్యాసం చేశాడు. చివరికి 'లాంగ్ లివ్ ఈవెన్ బూర్జువా డెమోక్రసీ' (కనీసం బూర్జువా ప్రజాస్వామ్యమైనా సరే, వర్ధిల్లాలి) అని నినాదం ఇచ్చాడు.

ఈ రకమైన అక్రమ, చట్టవ్యతిరేక పద్ధతుల వల్ల ఎంతో మంది డిటెన్యూల కుటుంబాల ఆర్థిక జీవితం చిన్నాభిన్నమైపోయింది. వాళ్ళు ఆర్థికంగా చితికిపోయారు.

పత్తిపాటి వెంకటేశ్వర్లు ఒక ఉదాహరణ. ఆయన అప్పుడప్పుడే పైకి వస్తున్న యువ న్యాయవాది. ఆయనను అక్రమంగా నిర్బంధించి లోపల పడేస్తే ఆయన కుటుంబం ఎట్లా గడుస్తుంది? సంపాదన ఎట్లా వీలవుతుంది?

అంతేకాదు. కొందరిని అయితే విడుదల చేయగానే మళ్ళీ మరో కేసు పెట్టి అరెస్టు చేసేవారు.

ఒకసారి ఒక కేసులో నేను వాదించాను. ముక్కు సుబ్బారెడ్డి మీద కేసు కొట్టివేసి విడుదల చేశారు. మళ్ళీ నేను ఇంటికి వెళ్ళేసరికి సుబ్బారెడ్డి ఇంట్లో ఉన్నాడు. 'ఏమి ఇట్లా వచ్చావు, ఇక్కడిక్కడ కనబడ్డావంటే మళ్ళీ అరెస్టు చేస్తారు. పరుగెత్తు' అని పంపించాను.

బుర్రా సుబ్బారాయుడు అని జనసంఘ్ నాయకుడుండేవాడు. ఆయనను కోర్టు వదిలేస్తే ఆయన అక్కడి నుంచి ఇంటికి చేరేలోపల మళ్ళీ అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌లో కూచోబెట్టారు.

ఆయనను మళ్ళీ కోర్టుకు తీసుకొస్తే ఆయన కోసం వాదించడానికి న్యాయవాదులు లేరు. ఆయన బాబుల్ రెడ్డి పేరు చెప్పాడు గాని బాబుల్ రెడ్డి కూడా వాదించడానికి సిద్ధంగా లేడు. ఆ కేసు కూడ నేనే తీసుకున్నాను.

సరే, భవానీ శంకర్ కేసు వచ్చింది.

కేంద్ర ప్రభుత్వ ప్లీడర్ లేచి "అసలింక వాదన లేవీ అవసరం లేదండి. అంతరంగిక భద్రతా చట్టం సరైనదేనని సుప్రీం కోర్టు తీర్పు వచ్చింది. కనుక ఈ డిటెన్యూ డిటెన్షన్‌ను మీరు కన్‌ఫర్మ్ చేయొచ్చు" అన్నాడు. జడ్జీలు అడగకుండానే ఈ అభిప్రాయం చెప్పాడు.

"నువ్వింకా జడ్జి కాలేదనుకుంటాను" అని నేను చురక వేశాను.

ఆ రోజుల్లో ప్రతివాడు అధికారంలో ఉన్నవారి మెప్పు పొందడం కోసం ఇటువంటి అత్యుత్సాహాన్ని ప్రదర్శించేవాడు.

జస్టిస్ తోట లక్ష్మయ్య గారు ఎమర్జెన్సీని పొగుడుతూ పెద్ద తీర్పు రాశారు. అట్లా రాస్తే సుప్రీం కోర్టుకు తీసుకుపోతారేమోనని ఆశ. జస్టిస్ టి.ఎల్.ఎన్.రెడ్డి జిల్లా జడ్జిగా ఉంటూ నంబియార్ కేసులో ఎమర్జెన్సీని పొగుడుతూ పెద్ద తీర్పు రాశారు.

అంటే సామాజిక పరివర్తనలో నమ్మకం పెట్టుకోవలసిన మేధావి వర్గం ఏవో వ్యక్తిగత ప్రయోజనాలను, సౌకర్యాలను ఆశించి నిరంకుశాధికారాన్ని సమర్థించడం మొదలుపెట్టింది.

ఇదంతా ఆ రోజుల్లో బహిరంగంగా, చూస్తే కనబడేటట్టుగా జరుగుతుండేది.

అప్పుడు గార్గ్ ఇక్కడికి వచ్చారంటే సిపిఐ న్యాయవాదులు ఆయన చుట్టూ మూగుతుండేవారు. ఎక్కడో ఒకచోట జడ్జి పదవి రాకపోతుందా అన్నట్టుగా ప్రవర్తించే వారు. 'వర్గ సమాజంలో న్యాయం వర్గ ప్రయోజనాలకు అతీతంగా ఉండదు' అని ప్రగతి శీలంగా కనబడే నినాదాలు నాలుగు నేర్చుకుని అవి వల్లిస్తూపోతే చాలు. శ్రీమతి ఇందిరా గాంధీ అటువంటి వాతావరణం తయారుచేసి పెట్టారు. చట్టాన్ని వ్యాఖ్యానించడానికి, న్యాయాన్ని అమలు చేయడానికి వామపక్ష భావాలు గల ఒక జస్టిస్ చిన్నపరెడ్డిని, ఒక జస్టిస్ జీవన్ రెడ్డిని, ఒక జస్టిస్ కృష్ణ అయ్యర్‌ను, ఇట్లా ముగ్గురు నలుగురిని వేసుకున్నారు. రాజ్యాంగానికి వామపక్ష, ప్రజానుకూల వ్యాఖ్యానం ఇవ్వబోతున్నాననే ఒక అభిప్రాయాన్ని కల్పించారు.

ఆ వ్యవహారంలో కూడా అంతర్గత ఘర్షణలు, విభేదాలు ఉన్నాయనుకోండి. అది వేరే కథ.

ఆ రోజుల్లో జనసంఘ్ రంగారెడ్డి నాకు ఒక ఆసక్తికరమైన సంగతి చెప్పారు. ఆయన చాలా మంచి సంభాషణా చతురుడు. ఎమర్జెన్సీలో నక్సలైట్ నాయకుడు నీలం రామచంద్రయ్యను పోలీసులు పట్టుకుని కాల్చిచంపారు. ఎన్‌కౌంటర్ కథ అల్లారు. నీలం రామచంద్రయ్య అంతకు ముందు శాసన మండలి సభ్యుడు గనుక శాసనసభా నాయకుడుగా జలగం వెంగళరావు సంతాప తీర్మానం ప్రతిపాదించారు. "చంపమని ఆదేశం ఇచ్చేది నువ్వే. మరణానికి సంతాపం ప్రకటించేది నువ్వేనా" అని రంగారెడ్డి అభ్యంతరం ప్రకటించారు.

జైలు నుంచి కోర్టుకు వచ్చినప్పుడు "కన్నబిరాన్, నేను ఉత్తరం రాశాను. చంపేది వాళ్ళే. సంతాపం ప్రకటించేది వాళ్ళేనా అని రాశాను" అన్నారు.

అట్లాగే వి.రామారావు గారు నాకు దగ్గరి స్నేహితుడు. ఇప్పుడు సిక్కిం గవర్నర్‌గా ఉన్నారు. ఆయన, అప్పటి సిపిఎం నాయకులు ఓంకార్ ఒక స్పెషల్ రిట్ పిటిషన్ వేశారు.

వాళ్ళిద్దరూ అప్పటికి ఆంధ్ర ప్రదేశ్ శాసనమండలి సభ్యులు. "మేము శాసనమండలి లో పాల్గొనడం దేశ భద్రతకు ప్రమాదం కాదు. మేం ఎన్నికైన ప్రజా ప్రతినిధులము

కాబట్టి మా వల్ల దేశ భద్రతకు ముప్పు వాటిల్లదు. మేం శాసనమండలికి హాజరు కావడం ప్రజా ప్రయోజనాల కొరకే" అని ఆ పిటిషన్.

రెండు రోజులపాటు వాదించాను. జస్టిస్ ఆవుల సాంబశివరావు గారి బెంచి అది.

'మరి ఎట్లా పంపించాలి' అంటే 'మీరు మీ భద్రతా సిబ్బందితో పంపించండి. శాసన మండలి సమావేశం అయిపోగానే జైల్లో పడేయండి' అని వాదించాను.

సరే, మామూలుగానే ఆ రిట్ పిటిషన్‌ను కూడ ఆమోదించలేదు. కొట్టేశారు.

అయితే ఈ డిటెన్యూలందరికీ ఏదో ఒక కారణం మీద ఏదో ఒక పిటిషన్ వేసి కోర్టుకు రావాలని ఉండేది. కొన్ని గంటలపాటయినా బైట స్వేచ్ఛా వాయువులు పీల్చ వచ్చు. కొంత మందినయినా కలవవచ్చు అన్నట్టుండేది.

ఎం.వి.రామమూర్తి గారు వేసిన పిటిషన్ ఇంకా చిత్రమైనది.

ఆయన ఏం చేసినాడంటే ఒక రిట్ పిటిషన్ వేసినాడు. 'నా భార్యతో సంభోగించే హక్కు నాకుంది. ఎమర్జెన్సీ ఆ హక్కును తొలగించడం లేదు. కనుక నా హక్కును పరి రక్షించాలి' అని. 'నా భార్యను అప్పుడప్పుడైనా కలుసుకునే అవకాశం ఇవ్వాలి' అని.

ఆయనకు అప్పటికి అరవై ఏళ్ళున్నాయనుకుంటాను. ఆయనకు మంచి హాస్య ప్రియత్వం ఉండేది.

ఆ పిటిషన్ జస్టిస్ చెన్నకేశవ రెడ్డి గారి ముందుకు వచ్చింది. వాదారి వెంకట రమణయ్యను అమికస్‌క్యురి (ధర్మపీఠానికి సలహాదారు) గా నియమించారు. చివరికి పిటిషన్ కొట్టేశారు గాని చాల చర్చ జరిగింది.

నిజానికి రామమూర్తి గారితో నాకు పరిచయమయింది ఇటువంటి ఎమర్జెన్సీ కేసులతోనే. ఆయనతో భిన్నాభిప్రాయాలుండేవి గాని ఆయన చాలా స్నేహశీలి. సంభాషణా చతురుడు. మాకు బాగా సాన్నిహిత్యం ఏర్పడింది.

సరే, ఆ పిటిషన్ కొట్టివెయ్యడానికి న్యాయస్థానానికి కారణాలున్నాయి. సంభోగ హక్కు అనేది వ్యక్తిగత హక్కు. దాన్ని పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత కాదు. ప్రభుత్వం శోభనం జరిపే బాధ్యత తీసుకోదు గదా!

ఇట్లా ఏదో ఒక అంశం మీద డిటెన్యూలు కోర్టుకు రావడం మొదలుపెట్టే సరికి కోర్టులు రాజకీయవాదుల సమావేశ స్థలాలయ్యాయి. బైట రాజకీయ చర్చలకు అవకాశం లేదు కాబట్టి కోర్టులలోనే రాజకీయ అంశాలు చర్చకు వచ్చాయి. కోర్టు హాళ్ళలోకి పెద్ద ఎత్తున జనం వస్తుండేవారు. నేను ఒక కోర్టు నుంచి ఇంకో కోర్టుకు వెళుతుంటే నా వెంట జనం గుంపుగా వచ్చేవాళ్ళు.

ఏదో ఒక బెంచి ముందర అట్లా ఎమర్జెన్సీ డిటెన్యూల తరఫున పిటిషన్లు వేస్తూ వాళ్ళు వేసిన పిటిషన్ల మీద వాదిస్తూ ఉండేవాణ్ని.

అట్లా ఒకసారి జస్టిస్ చిన్నపరెడ్డి, జస్టిస్ జీవన్ రెడ్డిల బెంచి ముందు ఒక కేసు

వచ్చింది. అది జూపూడి యజ్ఞనారాయణ కేసు. ఆయన గుంటూరులో సీనియర్ న్యాయవాది. మంచివాడు. ఆయనను, గౌతులచ్చన్నను నేను ఒకసారి ఉస్మానియా జనరల్ ఆస్పత్రిలో చూసివచ్చాను.

ఆ రోజుల్లో డిటెన్యూలు ఏదయినా అనారోగ్యం ఉన్నా, లేకపోయినా తరచుగా బైట ఆస్పత్రులలో చేరుతుండేవాళ్ళు. ఆ రకంగానైనా బైటి ప్రపంచాన్ని చూడవచ్చునని, మిత్రులను, బంధువులను కలవవచ్చునని అనుకునే వాళ్ళు.

"ఇందిరా గాంధీని మీరు మీ ఇష్టం వచ్చినట్టు తిట్టినారు. కొంచెం సభ్యతతో మాట్లాడి ఉంటే ఆమెకు ఇంత పరపతి వచ్చేది కాదు" అని యజ్ఞనారాయణ తో చెప్పాను.

తర్వాత వాళ్ళు కోర్టుకు వచ్చారు. అప్పుడే జస్టిస్ కుప్పుస్వామి, జస్టిస్ ఎ.వి.కృష్ణారావు, జస్టిస్ రామచంద్రరాజుల ఫుల్ బెంచ్ ముందర మరొక మీసా కేసు హియరింగ్‌కు వచ్చింది. నేనక్కడికి పోతున్నాను. 'మరి నేనాబెంచికి పోవాలి, మీరే వాదించుకుంటారా' అని యజ్ఞనారాయణను అడిగాను.

"మేమే వాదించుకుంటాం. మీరు రానక్కర్లేదు. చూడండి, సాయంత్రానికి చట్టాన్ని కొట్టేస్తారు. మీరు ఈ కేసు వాదన నుంచి విముక్తి అయిపోయినట్టే" అన్నారు యజ్ఞనారాయణ.

ఆ బెంచి మీద ఇద్దరూ ప్రగతిశీల న్యాయమూర్తులు కదా. మీసా చట్టాన్ని, అక్రమ నిర్బంధాన్ని కొట్టివేస్తారని యజ్ఞనారాయణ అమాయకంగా ఆశించారు.

నేను చెప్పినాను – 'మీరు చాల పొరపాటు పడుతున్నారు. చట్టాన్ని కొట్టెయ్యరు. మీ రిట్ పిటిషన్‌ను కొట్టేస్తారు. మీరు మనుషుల గురించి గాని, ఇక్కడ కూచునే న్యాయమూర్తుల గురించి గాని, కోర్టుల గురించి గాని, చాలా తప్పుడు అంచనా వేస్తున్నారు. అది ఎవరి బెంచయినా సరే. అది వీలు కాదు' అని చెప్పాను.

అటువంటి నిర్ణయం తీసుకోవడానికి అసాధారణమైన సాహసం కావాలి. ఆ చట్రం నుంచి బైట పడాలి. చట్రాన్ని అతిక్రమించి ఒక న్యాయబద్ధమైన తీర్పు ఇవ్వాలంటే చాల గొప్ప నైతిక ధైర్యం కావాలి. అది మన దేశంలో అరుదు.

మరుసటి రోజు ఆ రిట్ పిటిషన్‌ను కొట్టివేశారు.

అంటే న్యాయమూర్తి గనుక ప్రగతిశీలవాది అయితే ఇంకా సులభం. జమాయత్ ఎ ఇస్లాం వాళ్ళను, ఆర్ఎస్ఎస్ వాళ్ళను నిర్బంధించడం సరైందే అని వాళ్ళ రిట్ పిటిషన్లను కొట్టి పారెయ్యవచ్చు. అక్కడ భావప్రకటనా స్వేచ్ఛ ఎవరికి అనే ప్రశ్న వస్తుంది గాని ఎందుకు అని రాదు.

జస్టిస్ గంగాధరరావు గాని, అటువంటి న్యాయమూర్తులెవరయినా గాని కొన్ని రకాల అభిప్రాయాలతో ఉండేవారు. వారి దృక్పథాలు ఒక మాదిరిగా ఉండేవి. అందువల్ల ఎమర్జెన్సీ వ్యతిరేక రిట్ పిటిషన్లను సులభంగా కొట్టివేస్తూ ఉండేవాళ్ళు.

ఎమర్జెన్సీ పట్ల మేధావి వర్గం ఇట్లా దాసోహం అనే వైఖరి తీసుకున్నప్పటికీ ప్రజలు అటువంటి వైఖరి తీసుకోలేదు. మేధావులు లొంగిపోయారు. కాని జనం దాన్ని పట్టించుకోలేదు.

ఇందిరా గాంధీ అసలు ఎమర్జెన్సీని ఎత్తివేస్తుందా లేదా అనే సందేహాలు కూడ ఉండేవి. కాని ఆమె ఓడిపోయిన తర్వాత, ఇంకా నిర్ణయాధికారం తనదే అని చూపుకోవడానికి ఎమర్జెన్సీ ఎత్తివేసింది.

కాని ఈ క్రమం మొత్తాన్ని జాగ్రత్తగా గమనించవలసి ఉంది. ప్రజలు ప్రజాస్వామ్యాన్ని తిరిగి నిలబెట్టారు. ఈ ప్రజాస్వామ్య పునరుద్ధరణను మనం ఉపయోగించుకున్నామా, దుర్వినియోగం చేశామా వేరే సంగతి. ఆమె అన్ని రాజ్యాంగ వ్యవస్థలను విధ్వంసం చేసింది. ఇక మరమ్మత్తు చేయడానికి వీలు లేకుండా చెడగొట్టి పెట్టింది. రెండు సంవత్సరాల జనతా పార్టీ పాలన తర్వాత ఆమె తిరిగి వచ్చింది. అయినా అంతకుముందు చలాయించినంతటి అధికారం చలాయించలేకపోయింది.

జనతా పాలనా కాలంలో కూడా అంతకు ముందు ఎమర్జెన్సీలో రాజ్యాంగ వ్యవస్థలకు ఏమి ప్రమాదం జరిగిందని నిజమైన విచారణ జరగలేదు. ఎన్నో విచారణ సంఘాలు ఏర్పడ్డాయి. ప్రత్యేకించి షా కమిషన్ వచ్చింది.

దేశంలో అధికార యంత్రాంగం ఎట్లా ఉన్నదో, ఎట్లా పనిచేసిందో షా కమిషన్ పరిశోధించింది. భారత పోలీసు వ్యవస్థ పనితీరు, రాజకీయ నాయకుల పనితీరు, ఆ రాజకీయ నాయకులు తమ అవసరాల కోసం అధికార యంత్రాంగాన్ని ఎట్లా వాడుకున్నారో తెలిపే ఉదాహరణలు – అన్నీ షా కమిషన్ పరిశీలించింది.

అది జనతా ప్రభుత్వానికి ఒక అద్భుతమైన అవకాశం. ఆ రాజ్యాంగ వ్యవస్థ లన్నిటినీ సంస్కరించి, రాజ్యాంగ బద్ధంగా పనిచేయడమెట్లాగో నేర్పగలిగిన అవకాశం జనతా ప్రభుత్వానికి దొరికింది. ఆ వ్యవస్థలను పునర్నిర్మించే అవకాశాన్ని జనతా ప్రభుత్వం వాడుకోలేదు.

అప్పటికే జయప్రకాశ్ నారాయణ్ అనారోగ్య పీడితుడిగా ఉన్నాడు. ఆయన మీద ఆధారపడడం తప్పు.

అసలు జనతా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినదే ఆధిపత్య, నిరంకుశ ధోరణులను అరికడతాననే వాగ్దానం మీద. అంటే అసలు ఆధిపత్య, నిరంకుశ ధోరణులంటే ఏమిటి అని తేల్చాలి.

ఆ పని చేయడానికే షా కమిషన్‌ను నియమించారు. అది చాల మంచి పని. సరైన పని. అధికార యంత్రాంగపు అక్రమాలను, పెత్తందారీతనాన్ని, నేరాలను పరిశోధించడానికి వేరే కమిషన్లు కూడ వేశారు. ఆ కమిషన్ల పని అంతా ఈ దేశంలో అధికార యంత్రాంగం ఎక్కడ విఫలమైందో కనిపెట్టడమే. ఆ కమిషన్లను వాడుకోకుండా జనతా ప్రభుత్వం దారి తప్పిపోయింది. ఆ సంస్థలను పునర్వ్యవస్థీకరించకుండా కాలయాపన చేశారు.

ఇందిరా గాంధీ పాలనా కాలంలో రాజకీయ నేరాలు, అక్రమాలు చాల జరిగి పోయాయనే అవగాహనతో ప్రత్యేక న్యాయస్థానాలను తయారు చేశారు. అది చాలా అవసరమైన పని. మామూలు నేరాలకు, ఈ మాదిరి రాజకీయ నేరాలకు మధ్యన ఒక విభజన రేఖ గీయవలసిన అవసరం ఉండింది.

ఈ ప్రత్యేక న్యాయస్థానాల బిల్లును రాష్ట్రపతి ఆమోదానికి పంపారు. ఏదో రాజకీయ ప్రత్యర్థుల మీద కక్ష సాధింపు కోసం ఇటువంటి బిల్లు తెచ్చారని అనిపించు కోకుండా ఉండడానికి, రాష్ట్రపతి పరిశీలనకు పంపారు. అది చట్టంగా మారింది.

సుప్రీం కోర్టు కూడా ఈ ప్రత్యేక న్యాయస్థానాల చట్టాన్ని సాదరంగా ఆహ్వానించింది. భారత రాజకీయాలలో స్వర్ణయుగం ప్రారంభమైందని చంద్రచూడ్ తీర్పు రాశారు. ఇది ఒక శాశ్వత అంగం కావాలని కృష్ణయ్యర్ రాశారు రాజకీయ దుష్ప్రవర్తనను అరికట్టే, నియంత్రించే ఒక సంస్థగా ఇది అభివృద్ధి చెందుతుందని ఆశించారు.

ఆ ప్రత్యేక న్యాయస్థానం సక్రమంగా పనిచేయనే లేదు. దాంట్లో మొదట నాలుగు కేసులు వచ్చాయి.

ఆ తర్వాత విసి శుక్లా, మరికొందరు 'ఇది ప్రత్యేక న్యాయస్థానం కాదు. దీని పరిధి ఏమిటి' అని సవాల్ చేశారు.

అప్పుడు సుప్రీం కోర్టు 'ఇది ప్రత్యేక న్యాయస్థానమే, శాశ్వత వ్యవస్థే, ఎమర్జెన్సీ కేసుల విచారణతోనే దీని పని అయిపోలేదు' అని మళ్ళీ తీర్పు ఇచ్చారు.

మళ్ళీ శ్రీమతి ఇందిరా గాంధీ అధికారంలోకి వచ్చిన తర్వాత షా కమిషన్ పరిధి ఏమిటని మరొక సుప్రీం కోర్టు జడ్జి ప్రశ్నిస్తూ తీర్పు ఇచ్చాడు. ఆ వెంటనే శ్రీమతి గాంధీ ప్రత్యేక న్యాయస్థానాల (రద్దు) చట్టం తీసుకొచ్చింది. గుర్తించవలసిన విషయ మేమంటే ఈ రద్దును పార్లమెంటులో కూడ ఎవరూ ప్రశ్నించలేదు. ఎవరి దృష్టికీ రాకుండానే ఒక్క కలం పోటుతో ప్రత్యేక కోర్టులు రద్దు అయిపోయాయి.

ఆమె చెప్పిన కారణం ఏమంటే ప్రత్యేక న్యాయస్థానాలను ఏర్పరచడానికి తీసుకొచ్చిన చట్టానికి కాలం చెల్లిందని.

ఇది అప్పుడు ఎవరూ గమనించలేదు. నేను పది సంవత్సరాలుగా దాని గురించి రాస్తూనే ఉన్నాను. ఎమర్జెన్సీ అయిపోయిన వెంటనే రాసిన పుస్తకంలో అరుణ్ శౌరి ఈ ప్రత్యేక న్యాయస్థానాల అవసరం గురించి రాశాడు. ఇప్పుడు ఆయనే నేరుగా సెంటార్ హోటల్ కుంభకోణంలో చిక్కుకున్నాడు.

ఎమర్జెన్సీ నేరాల మీద ఎటువంటి చర్య తీసుకుని ఉన్నా అధికార వ్యవస్థలన్నీ ఇట్లా కుప్పకూలిపోయి ఉండేవి కావు. జనతా పార్టీకి ఒక మంచి అవకాశం వచ్చింది. ఒక మంచి ప్రారంభం చేశారు. వ్యవస్థ ఎక్కడ విఫలమయిందో అన్వేషణ ప్రారంభ మయింది. కమిషన నివేదికలు చదివితే ఆ అన్వేషణ ఎంత బాగా జరిగిందో తెలుస్తుంది. ఆ

నివేదికల మీద ఆధారపడి ఆ వ్యవస్థలను పునర్నిర్మించవలసి ఉండింది. కాని ఆ పని జరగలేదు.

అట్లా మన అధికార వ్యవస్థలను పునర్నిర్మించే పని స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచీ ఎప్పుడూ జరగలేదు. జనతా పార్టీ పాలనా కాలంలో వచ్చిన అవకాశాన్ని కూడా జారవిడుచుకున్నారు.

అది ఉద్దేశ్యపూర్వకంగా జరిగిందనుకోను. అది కేవలం మన అలవాటు వల్ల జరిగింది.

ఈ దేశంలో అలవాటు ఏమంటే ఏదీ పని చేయగూడదు. ఉన్నది ఉన్నట్లు ఉంచడానికి ఈ దేశం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుంది. మేధో ప్రపంచంలోనూ అంతే. రాజకీయ రంగంలోనూ అంతే.

అందువల్లనే మతోన్మాద రాజకీయాలు గాని, ప్రపంచీకరణ రాజకీయాలు గాని మనను ముంచెత్తడం సాధ్యమయింది.

రాజ్యాంగబద్ధంగా పాలన సాగి ఉన్నట్టయితే ఈ దేశంలో విప్లవం గురించి ఇంత ఆలోచన ఉండేదే కాదు. జీవితం ఎంతో కొంత సంతృప్తికరంగానే ఉండేది.

ప్రజలను భ్రమల్లోనే ఉంచుతూ ఉంటే, ఆ భ్రమలు ఎప్పటికీ వాస్తవరూపం ధరించకపోతే, అసంతృప్తి పెల్లుబుకుతుంది. అది వేర్వేరు ఉద్యమాలకు, ఆందోళనలకూ దారి తీస్తుంది.

అందుకే ఎంతో బాధ్యతాయుతుడైన రాజకీయవేత్త జయప్రకాశ్ నారాయణ్ కూడ 'తప్పుడు ఆజ్ఞలను ఉల్లంఘించండి, విధేయంగా ఉండనవసరం లేదు' అని మన సైనిక బలగాలకు పిలుపునిచ్చాడు. అంటే ప్రజలను పాలకులు ఆ స్థితికి నెట్టారన్నమాట.

ఎమర్జెన్సీ అనంతరం మన అధికార యంత్రాంగంలో నిండిపోయిన వ్యక్తులలో అత్యధికులకు భవిష్యత్ దృష్టి లేదు. అట్లా ఒకవిధంగా ఏ పనికీ పనికిరాని నిర్వీర్య వ్యక్తులను సృష్టించడం జరిగింది.

మొత్తం మీద ఎమర్జెన్సీని అధ్యయనం చేసి దాని నుంచి పాఠాలు తీయడం జరగలేదు. ఎందుకు ఎమర్జెన్సీ వచ్చింది, ఎందుకు మన రాజ్యాంగ, అధికార వ్యవస్థలు క్షీణించి పోయాయి, వీటిని బలోపేతం చేయడం ఎట్లా అనే ఆలోచనే సాగలేదు.

అందువల్ల ఏ మెరుగుదల జరగలేదు. రాజ్యాంగ బద్ధపాలన ఎట్లా జరగాలనే ఆలోచన ఎమర్జెన్సీ అనంతరం కూడ రాలేదు. రాజ్యాంగం వెనుక ఏదయినా ఉదాత్త తాత్విక దృక్పథం, ఆచరణాత్మకమైన దృక్పథం ఉన్నదా అని కూడ ఆలోచనలు రాలేదు.

అటువంటి రాజ్యాంగబద్ధమైన ఆలోచనలు లేనప్పుడు రథయాత్ర వంటి మతోన్మాద ఆచరణలు సాగుతాయి. ఎందుకంటే రథయాత్ర జరపడానికి రాజ్యాంగం ఆమోదించదు. రాజ్యాంగాన్ని రథయాత్ర ప్రమాణాలతో నిర్వచించడం, వ్యాఖ్యానించడం కుదరదు.

ఎమర్జెన్సీ అత్యాచారాల వల్ల రాజ్యాంగంలోని సంక్షేమ భావనలు కూడా దెబ్బతిని పోయాయి. ఎవరయినా కష్టం చేసుకుని బతకాలి గదా, సంక్షేమం ఎందుకు అని కొందరు మాట్లాడుతుంటారు. పాతకాలంలో సెకండ్ క్లాసు కంపార్ట్‌మెంట్లో సీటు దొరికిన వాడి మాదిరి.

ఎమర్జెన్సీ ముగింపుకు వచ్చే సమయానికి, ఎమర్జెన్సీ అయిపోయిన వెంటనే పరిస్థితి ఎలా ఉండిందంటే ఎంత సదుద్దేశ్యమున్నా ఎవరూ న్యాయం చేయలేని, సమాన పంపిణీ న్యాయం చెయ్యలేని స్థితి వచ్చిపడింది.

సుప్రీం కోర్టు ముందర ఎమర్జెన్సీ కేసు వచ్చింది. సుప్రీం కోర్టు న్యాయమూర్తులు భయంలో మునిగిపోయారనుకుంటాను. తమ గౌరవనీయత ఎక్కడ ధ్వంసమైపోతుందో అని వాళ్ళ భయం.

నేను ఇక్కడ హైకోర్టులో ఫుల్ బెంచి ముందర వాదించేటప్పుడు కూడ రామచంద్రా రెడ్డి గారు ఏం చెప్పినారంటే, వీధిలో ఓ కుర్రవాడిని పోలీసులు కాల్చి చంపారు అని నువ్వు పిటిషన్ వేస్తే కూడ అది అనుమతించడానికి వీల్లేదు అని, దాని గురించి మాట్లాడడానికి లేదు అని.

అదే విషయం సుప్రీం కోర్టులో అటార్నీ జనరల్ నిరేన్ దే కూడ అన్నాడు. ఎమర్జెన్సీ అయిపోయేంత వరకు మాట్లాడడానికి వీల్లేదు అని. ఒక వ్యక్తిని పోలీసులు కాల్చి చంపేసినా కూడా దాని గురించి ఎక్కడా ప్రశ్నించడానికి లేదు అని. ఎమర్జెన్సీలో కార్య నిర్వాహక వర్గానికి, అధికార యంత్రాంగానికి అందిన అధికారాలు అంత విస్తృతమైనవి అని.

ఆ బెంచిలో జస్టిస్ భగవతి కూడా ఉన్నారు.

ఒక జడ్జియేమో డిటెన్యూలను ప్రభుత్వం కన్నతల్లిలా చూసుకుంటున్నది అని రాశాడు.

జస్టిస్ చంద్రచూడ్ యేమో నాకీ పాలన మీద వజ్ర సమానమైన ఆశ ఉంది అని రాశారు.

ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు ఫుల్ బెంచ్ ఎమర్జెన్సీని సమర్థిస్తూ తీర్పు ఇచ్చింది. ఆ తీర్పు చదువుతుంటే ఇప్పటికి కూడ ఆశ్చర్యంగా ఉంటుంది. ఆ వాదనలు, ఆ సమర్థనలు ఎట్లా రాశారా అనిపిస్తుంది.

ఎందుకంటే స్వయంగా శ్రీమతి ఇందిరా గాంధీయే ఒక వైరుధ్యాన్ని ప్రవేశ పెట్టారు. ప్రాథమిక బాధ్యతలు అనే అధికరణాన్ని ఆమె నలభైరెండో రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారు. అందులో జాతీయోద్యమాన్ని ప్రభావితం చేసిన భావాలను, ఆదర్శాలను గౌరవించడం కూడ ఒక బాధ్యత అని చెప్పారు. ఆ బాధ్యత ప్రతి ఒక్కరికీ వర్తిస్తుంది. న్యాయమూర్తికీ వర్తిస్తుంది. నాకూ వర్తిస్తుంది. న్యాయమూర్తి బంట్రోతుకూ వర్తిస్తుంది.

జాతీయోద్యమం ఏ విలువల కోసం, ఏ పాలనకు వ్యతిరేకంగా చేశామనే విషయం వీళ్ళకు గుర్తుకు వచ్చిందా లేదా కూడ అర్థం కాదు.

హక్కుల విశ్లేషణ-అది జాతీయోద్యమంలో భాగంగా అయినా కాకపోయినా, సాధారణ ప్రజాస్వామిక అర్థంలోనయినా-వాటిని కూడ లెక్కలోకి తీసుకోకుండా ఆ తీర్పు రాశారు.

ఆ తీర్పును వ్యతిరేకిస్తూ, జస్టిస్ హెచ్ ఆర్ ఖన్నా, తన అసమ్మతి ప్రకటిస్తూ భిన్నాభిప్రాయ తీర్పు రాశారు. న్యాయమూర్తి పదవికే రాజీనామా చేశారు.

ఆ రకమైన సూత్రబద్ధమైన వైఖరి తీసుకున్నది జస్టిస్ ఖన్నా మాత్రమే.

నిరంకుశత్వాన్ని వ్యతిరేకిస్తూ అటువంటి సూత్రబద్ధ వైఖరి తీసుకున్న మరొక మేధావి ఎవరూ నాకు కనబడలేదు.

'నాకు ఈ సూత్రబద్ధమైన అవగాహన ఉంది. ఈ అవగాహనను నువు గౌరవించకపోతే, నా భిన్నాభిప్రాయంతో సహా నన్ను సహించలేకపోతే, నేను అధికారిక హోదాను, స్థానాన్ని త్యజిస్తాను' అని చెప్పే ధైర్యం చేసిన వాళ్ళు చాల తక్కువమంది.

మధ్య ప్రదేశ్‌లో ఎడిఎం జబల్పూర్‌లో డిటెన్షన్ చట్టాన్ని కొట్టేశారు. దాని మీద అప్పీలు హైకోర్టులో వచ్చింది. మన దగ్గర ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు డిటెన్షన్ చట్టాన్ని సమర్థించింది. దానిమీద మనమే అప్పీలుకు పోలేదు. కాని అది ప్రిసిడెంట్-అనుసరించ దగిన పూర్వ నిర్ణయం - అయింది. సుప్రీం కోర్టు కూడా ఈ తీర్పును అనుసరించడం మొదలు పెట్టింది. ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు తీర్పును మేం ఎత్తి పడుతున్నాము అని సుప్రీం కోర్టు అంది. దాంట్లో జస్టిస్ భగవతి కూడ భాగమే. సమర్థిస్తూ ఆయన ఒక పెద్ద తీర్పు రాశారు.

ఆ రోజుల్లో సంజయ్ గాంధీ రాజకీయాల్లోకి రాగానే 'సూర్యోదయ మయింది' అని న్యాయమూర్తులు ఉత్తరాలు రాశారు.

ఆ తర్వాత ఈ న్యాయమూర్తులలో కొందరు పశ్చాత్తాప పడ్డారు. "మేం తప్పు చేసినాము. ఇంతమంది డిటెన్యూలను నిర్బంధించడం, ఆ నిర్బంధాన్ని ఖరారు చేస్తూ రిట్ పిటిషన్లు కొట్టెయ్యడం తప్పు" అని మాత్రం ఒక్కరు కూడా ఒప్పుకోలేదు. బహిరంగ క్షమాపణ చెప్పలేదు.

అది ఎవరూ చెప్పలేదు. తీర్పులలో కూడ మేం ఈ మాదిరి తప్పుడు నిర్ధారణలకు వచ్చినాము. మాకు పౌరహక్కుల పట్ల అవగాహన ఈ మాదిరిగా ఉండవలసింది. ఉండలేదు అని తర్వాతి తీర్పులలో రాయవచ్చు గదా. ఎవరూ రాయలేదు. వాళ్ళు జడ్జీలు. అంత పెద్ద మనుషులు తప్పు ఎట్లా చేస్తారు అని అందరూ అంటారు గద.

నేనేమనుకుంటానంటే, ఎవడయినా గానీ ఎంత పెద్దవాడయినా సరే, ఏదయినా తప్పు చేస్తే తర్వాత తప్పని తెలిస్తే బహిరంగంగా క్షమాపణ అడగాలి. తప్పయిందని ఒప్పుకోవాలి. అనవసరంగా సిక్కు మతస్తులను ఊచకోత కోసినందుకు, అనవసరంగా ముస్లిం మతస్తులపై మారణకాండ జరిపినందుకు ఆయా ప్రభుత్వాలు పశ్చాత్తాపం ప్రకటించాలి.

ఇప్పుడు ఇంతమంది పౌరహక్కుల కార్యకర్తలను చంపించినందుకు అరవిందరావు క్షమాపణ చెప్పుకోవాలి. ఎప్పుడో ఒకప్పుడు డిజిపి అవుతాడు గదా. 'మేం ఈ తప్పులు చేశాం. పొరపాటయింది' అని చెప్పాలి. చెప్పగలిగే ధైర్యం ఉండాలి.

అట్లా తప్పు ఒప్పుకోవడం ఈ దేశంలో జరగదు.

1978లో, ఎమర్జెన్సీ తర్వాత, వాళ్ళకు ఏమయిందంటే, ఎంత కాదనుకున్నా కోర్టనేది ప్రజలకు ఎదురుగా, ప్రజల ముందర నిలబడవలసిన వ్యవస్థ గదా. అందువల్ల ఎమర్జెన్సీలో తాము చేసిన పాపాలకు ప్రాయశ్చిత్తం అన్నట్టుగా పబ్లిక్ ఇంటరెస్ట్ లిటిగేషన్- ప్రజా ప్రయోజన వ్యాజ్యం - అనేదాన్ని మొదలు పెట్టారు.

ఎమర్జెన్సీలో న్యాయస్థానాలకు పూర్తిగా రిలవెన్స్ - సంబద్ధత - పోయింది. నిజానికి న్యాయస్థానాలు సంబద్ధత కోల్పోవడానికి చాల చరిత్ర ఉంది. 1963లోనే రిజర్వేషన్ల మీద గోల మొదలయింది. 1968లో చాల చోట్ల ఆదివాసుల తిరుగుబాట్లు, శ్రీకాకుళ పోరాటం జరిగాయి. ఈ సామాజిక సంచలనాలతో ఏమీ సంబంధం లేకుండా, వాటి గురించేమీ పట్టకుండా కోర్టులు పనిచేస్తూ వచ్చాయి.

దానివల్ల న్యాయస్థానాలు ఒక మోస్తరు పశ్చాత్తాపం పడవలసి వచ్చింది. ఆ పశ్చాత్తాపం నుంచే పబ్లిక్ ఇంటరెస్ట్ లిటిగేషన్ మొదలయింది.

జస్టిస్ భగవతి గారి సంగతే చూడండి. ఆయనకు ఇప్పుడు హఠాత్తుగా రాజ్యాంగం లోని 21వ అధికరణంలో కొత్తకోణాలు కనబడడం మొదలయింది. ఎమర్జెన్సీని సమర్థిస్తూ తీర్పు రాసినప్పుడు అదే రాజ్యాంగ అధికరణంలో కనబడనివన్నీ ఇప్పుడు కనబడ్డాయి.

అపసవ్యమైన చట్టం అంటే ఏమిటి అని ప్రశ్నించి అపసవ్యమైన విచారణ జరిగితే అది చట్టపరమైన విచారణ కానట్టే అని చెప్పడం, అధికరణం 14 ప్రకారం నిరంకుశ పాలనకు అవకాశం ఉందని, అది కేవలం వర్గ, సామాజిక న్యాయాన్ని సాధించేది కాదని చెప్పడం-అంటే రాజ్యాంగాన్ని కొత్తగా చూసే వైఖరి మొదలయింది. అవే విషయాలు అంతకు ముందు కనబడలేదు.

క్రమంగా సమానత్వ భావన రాజ్యాంగం నిండా అంతటా పరచుకుని ఉందని గుర్తించారు.

అంటే నిబద్ధ న్యాయవ్యవస్థ నుంచి క్రియాశీల న్యాయవ్యవస్థ దాకా ప్రయాణం సాగిందన్న మాట.

దీనివల్ల ప్రజలకు జరిగిన మేలేమీ లేదు. ఆ న్యాయమూర్తులకు దండిగా వ్యాసాలు రాసుకునే అవకాశం వచ్చింది. తమను తాము మేమంత చెడ్డవాళ్ళం కాదులే అని ఓదార్చుకుంటున్న పద్ధతిలో రాసుకున్నారు.

ఏం జేశారంటే, సునీల్ బాత్రా కేసు నుంచి ఆటో శంకర్ కేసు దాకా ఈ న్యాయ మూర్తులు న్యాయసూత్రాలు, నీతి వచనాలు వల్లించిందంతా రౌడీలు, గూండాలు, సంఘ వ్యతిరేక శక్తుల విషయంలోనే.

అందువల్లనే నేను ఒక వ్యాసంలో రాశాను. సుప్రీం కోర్టు 1978 తర్వాత దగాకోరుల భజన ప్రారంభించింది అని. ఎందుకంటే ఒక తమాషా అయిన విషయం ఉంది. స్వేచ్ఛ గురించి, హక్కుల గురించి గంభీరమైన తీర్పులు వెలువడినప్పుడల్లా అవి బైట ఉండే మామూలు ప్రజల స్వేచ్ఛ గురించి కాదు. జైలు లోపల ఉండవలసిన వాళ్ళ స్వేచ్ఛ గురించి. అదీ ఎమర్జెన్సీ తర్వాత.

ఎమర్జెన్సీ అనుభవం నుంచి మనం గ్రహించవలసిన పెద్ద పాఠమేమంటే ఒక సమాజంలోని పాలనా వ్యవస్థలను, నిర్మాణాలను, అధికార యంత్రాంగాలను అధికారంలో ఉన్నవాళ్ళు స్వప్రయోజనాలకు దుర్వినియోగం చేసే అవకాశం ఉంది. ఆ దుర్వినియోగం జరగకుండా ప్రజలు, ప్రజా చైతన్యం నిరంతర జాగరూకతతో ఉండాలి. ఆ ప్రజా చైతన్యానికి పూర్తి అవకాశం కల్పించాలి.

ఎందుకంటే, ఎటువంటి సమాజానికైనా పాలనా వ్యవస్థలు, నిర్మాణాలు, అధికార యంత్రాంగాలు అవసరం. అది రాచరికం కావచ్చు, బూర్జువా ప్రజాస్వామ్యం కావచ్చు. సోషలిజం కావచ్చు. నియంతృత్వం కావచ్చు - కొన్ని నిర్మాణాల మీద ఆధారపడి ఉండక తప్పదు. ఆ నిర్మాణాలు చాల ముఖ్యమైన పాత్ర నిర్వహిస్తాయి.

ఆ నిర్మాణాలను సాధారణంగా రాజ్యాంగం నిర్దేశిస్తుంది. లేదా ఆ నిర్మాణాల పనితీరును రాజ్యాంగపు విలువలు నిర్దేశిస్తాయి. అందువల్ల పాలన, అధికారం అనేవి రాగద్వేషాలకతీతంగా తటస్థంగా తయారవుతాయి. అదే సమయంలో అవి మానవీయంగా కూడ కావాలి.

మనం 1950లో రాజ్యాంగాన్ని ఆమోదించుకున్నప్పటి నుంచి, మన పాలనా నిర్మాణాలను, రాజ్యాంగ బద్ధంగా కాక పార్టీ బలం పెంపొందించుకోవడానికి పార్టీ ప్రయోజనాలు కాపాడుకోవడానికి వాడుకుంటున్నాం. రాజ్యాంగం ప్రకారం ప్రజల కొరకు, ప్రజల అభివృద్ధి కొరకు, ప్రజా సంక్షేమం కొరకు పనిచేయవలసిన పాలక నిర్మాణాలన్నీ అధికారంలో ఉన్న పార్టీ కోసం పనిచేయడం మొదలయింది. రాబోయే ఎన్నికల్లో ఈ పార్టీయే మళ్ళీ గెలవడానికి ఏమి చేయాలని పాలనా నిర్మాణాలు ఆలోచిస్తున్నాయి.

ఈ దృక్పథం వల్ల పాలనా నిర్మాణాలన్నిటినీ పద్ధతి ప్రకారం, ఒకదాని తర్వాత ఒకటిగా లోలోపలి నుంచి తొలిచేస్తూ వచ్చారు. ఒక్కసారే దాడి చేసి ఆ నిర్మాణాలను ధ్వంసం చెయ్యలేదు. క్రమక్రమంగా అవి పనికి రాకుండా అయ్యేలా చేశారు. బలహీనం చేశారు. ఏమవుతుందిలే, ఏమీ కాదు అనే పద్ధతిలో అప్పుడొక అధికరణం మార్చడం, అప్పుడొక చట్టాన్ని ప్రవేశపెట్టడం, అప్పుడొక జడ్జీని తనకు కావలసిన వాళ్ళను వేసుకోవడం-ఈ మాదిరి జరిగిపోయింది. ఈ ఒక్క చర్య వల్ల ఏమవుతుందిలే అని ఆలోచనాపరులు కూడ అనుకున్నారు. ఈ చర్యలన్నీ కలిసి కొన్ని సంవత్సరాలు, దశాబ్దాలు తిరిగే సరికల్లా మన పాలనా నిర్మాణాలన్నీ ధ్వంసమైపోయాయి.

మొత్తానికి రాముల వారి పాల సామెత లాగ ప్రతి ఒక్కరూ ఇటువంటి పనే చేస్తూ పోయారు. అందరూ నీళ్ళే పోసి, ఎవరూ పాలు పోయని మాదిరి అయిపోయింది.

కమ్యూనిస్టులను అధికారంలోకి రానివ్వగూడదనే ఉద్దేశ్యం ఉంటే వాళ్ళ విధానాలను వివరించి ఓడించాలి గాని సంస్థలను, నిర్మాణాలను వాడుకుని బలప్రదర్శన చేస్తే చివరికి రాజ్యాంగం ధ్వంసమై పోతుంది. సోషలిస్టు, కమ్యూనిస్టు రాజ్యాంగమైనా సరే, ప్రత్యర్థులను బలప్రయోగం ద్వారా ఓడించడానికి రాజ్యాంగ సంస్థలను వాడుకోవచ్చు ననుకుంటే రాజ్యాంగమే బలహీన పడుతుంది.

అసలు ఈ సమస్య ఎందుకొస్తుందంటే సంస్థలను, నిర్మాణాలను అధికారానికీ, సంపదకూ వనరులుగా చూడడం వల్ల వస్తుంది.

అందువల్ల ఆర్థిక పరిస్థితి క్షీణించినప్పుడు దానికి ఆరోగ్యకరమైన ప్రతిస్పందనగా నిర్మాణాలను బలపరచవలసి ఉంటుంది. కాని నిర్మాణాలను దెబ్బతీసి ఆ సమస్య నుంచి గట్టెక్కాలనుకుంటే సమస్య వస్తుంది.

స్వతంత్ర భారతంలో, రాజ్యాంగం తర్వాత మొదటిసారి ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం- కారణాలు చూపకుండా ఒక వ్యక్తిని నిర్బంధించే చట్టం - ప్రవేశ పెడుతున్నప్పుడు జవహర్‌లాల్ నెహ్రూ దాన్ని సమర్థించాడు. చీకటి బజారు వ్యాపారస్తులను ఒక్కొక్కరినీ ఒక్కొక్క దీపస్తంభానికి ఉరితీయాలన్నాడు. ఆ చట్టం అందుకోసమేనన్నాడు.

అయితే ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం కింద మొట్టమొదలు అరెస్టు చేసిందెవరిని? కమ్యూనిస్టు నాయకులు ఎకె గోపాలన్‌ను, కృష్ణన్‌ను!

ఆ సమయంలో న్యాయవ్యవస్థ ఒకె తప్పుడు అవగాహన ప్రకటించింది. భారత పార్లమెంటుకు, బ్రిటిష్ పార్లమెంట్ లాగే, సర్వాధికారాలున్నాయని ప్రకటించింది. ఆ అవగాహనను సరిదిద్దుకోవడానికి దేశంలో ప్రగతిశీల రాజకీయ పక్షాలేవీ తోడ్పడలేదు గాని అభివృద్ధి నిరోధక పార్టీలే తోడ్పడ్డాయి. 'సార్వభౌమాధికారం' అనేది ప్రజలది మాత్రమే. అది రాజ్యాంగంలో ఉంది. అంతే తప్ప పార్లమెంటుకు ఆ అధికారం లేదు, అని వాళ్ళు చెపితే మనం తెలుసుకోవలసి వచ్చింది.

బ్రిటన్‌లో పార్లమెంటుకు అటువంటి సర్వాధికారాలుండేవి. రాజు నిరంకుశత్వాన్ని వ్యతిరేకించడానికి పార్లమెంటుకు నిరంకుశాధికారాలిచ్చారు.

అయితే పతంజలి శాస్త్రి లాంటి మేధావి అయిన న్యాయమూర్తి ఒక మాట మనందరమూ గుర్తుంచుకోవాలి అని చెప్పాడు. ఈ రాజ్యాంగం ఒకరు నడిపేది కాదు. పలు రాజకీయ పక్షాలు పదవికి వచ్చి రాజ్యాంగాన్ని నడుపుతాయి తప్ప దాన్ని ఒక రాజకీయ పార్టీ కొరకు వక్రీకరించగూడదు అన్నాడు.

మనదేశంలో మత రాజకీయాలు లేవుగాని మొదటి నుంచీ రాజకీయాలు బిజెపి పద్ధతిలోనే జరిగాయి. కొంత ఉదారవాదం, ఒక రకమైన లౌకికవాదం, ఇదే రాజకీయంగా చలామణీ అయింది.

క్రమంగా దేశం ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంది. దానికి కోర్టులే బాధ్యత వహించాలన్నట్టు కోర్టులను నిందించడం మొదలయింది. తప్పులన్నిటినీ కోర్టుల మీద నెట్టారు. ఒకరకమైన ప్రజాకర్షక రాజకీయాలు మొదలయ్యాయి.

ప్రజాకర్షక రాజకీయాలు చలామణీ కావాలంటే నిరంకుశాధికారం కావలసిందే. అందువల్లనే 1964లో బాహ్య ఎమర్జెన్సీ వచ్చింది. 1975 లో ఆంతరంగిక ఎమర్జెన్సీ వచ్చింది. ఆంధ్ర ప్రదేశ్‌లో 1968 నుంచే భయానక పరిస్థితులున్నాయి. ఎవరిని ఎప్పుడు ఎత్తుకు పోతారో తెలియని స్థితి వచ్చింది. రాజకీయ హత్యలు సాధారణ పాలనా పద్ధతిగా మారిపోయాయి.

ఎమర్జెన్సీలో రాష్ట్రంలో 70 మందికి పైగా బూటకపు ఎన్‌కౌంటర్లలో కాల్చివేయబడ్డారు. ఎమర్జెన్సీ ముగిసిన వెంటనే దేశంలో ప్రజాస్వామిక చైతన్యం విస్తృతంగా పెల్లుబికింది. చాలా మందికి ఈ దేశం ప్రజాస్వామిక దేశమని గుర్తు వచ్చింది. ఎన్‌కౌంటర్ హత్యల వంటివి జరగకుండా ఆపడం ఎట్లా అని చాలామంది ఆలోచించడం మొదలు పెట్టారు. చాలా సమావేశాలు జరిగాయి.

అయితే ఈ ప్రభావం ఎన్నికల మీద పెద్దగా లేదు. ఇప్పుడు గుజరాత్‌లో మోడీ తిరిగి గెలిచినట్టుగానే వెంగళరావు కూడా తిరిగి గెలిచి ముఖ్యమంత్రి అయ్యాడు.

ఆ రోజుల్లో ఎమర్జెన్సీ అత్యాచారాలకు వ్యతిరేకంగా, ప్రజాస్వామిక విలువల కోసం చాలా సమావేశాలు జరిగేవని చెప్పాను గదా, వాటిలో ఒక సమావేశం గురించి ప్రత్యేకంగా చెప్పాలి.

* * *

## తార్కుండే కమిటి

అది నారాయణగూడ వైఎంసిఎలో ఎమర్జెన్సీ అయిపోయిన ఒకటి రెండు నెలలకే జరిగిన సమావేశం. ఎం.వి.రామమూర్తి గారు ఆ సమావేశం ఏర్పాటు చేశారు. అప్పటికి జయప్రకాశ్ నారాయణ నడుపుతుండిన సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ (సిఎఫ్‌డి) తరపున ఆ సమావేశం ఏర్పాటయింది.

ఆ సమావేశంలో బలవంతరెడ్డి లాంటి చాల మంది మాట్లాడారు. రామమూర్తి గారు అధ్యక్షత వహించారనుకుంటాను.

అక్కడ మాట్లాడే క్రమంలో జ్వాలాముఖి ఒక సూచన చేశారు. ఈ ఎన్‌కౌంటర్ హత్యల మీద ఒక అనధికార, ప్రజాకమిటీ విచారణ జరిపితే బాగుంటుందని ఆయన అన్నారు.



A.C.No. 94293

అప్పటికే కమిషన్ ఏర్పాటయింది. అది అధికారిక విచారణ కమిషన్. అది ఆంధ్ర ప్రదేశ్‌లో పనిచేయడం లేదు.

అలాంటి అనధికార విచారణ కమిషన్ వేసే ఆలోచన బాగుందని చాలామంది అన్నారు. ఆ కమిషన్‌కు కన్వీనర్‌గా నేనుండాలని సూచించారు.

కన్వీనర్‌గా నా పని ఏమంటే విచారణ కమిటీలో ఎవరెవరు ఉండాలో నిర్ణయించడం. నాకు ఆ పని కొంత ఇబ్బంది కలిగించింది. ఆ కమిటీని ఎవరెవరితో ఏర్పాటు చేయాలని నేను చాల ఆలోచన చేయవలసి వచ్చింది. ఎందుకంటే అప్పుడు సమావేశంలో మాట్లాడిన వారందరూ నక్సలైట్లకు అనుకూలమైన సంస్థలలో ఉన్నవారే.

వాళ్ళతోనే, కమ్యూనిస్టులతో, నక్సలైట్లతో సంబంధం ఉన్నవాళ్ళతోనే, నేను ఆ కమిటీని తయారు చేస్తే పని ముందుకు సాగదని నాకు తెలుసు.

మన దగ్గర కమ్యూనిస్టుల మధ్య జ్ఞాతి వైరాల వల్ల వాళ్ళ మధ్య తగాదాలతోనే కమిటీ పని తెల్లవారుతుంది.

ఈ ఇబ్బంది ఎదుర్కొంటున్నప్పటికీ నేను ఎవరి సలహా తీసుకోవాలని కూడా అనుకోలేదు. రామమూర్తి గారిని కూడా అడగలేదు.

అలా ఉండగా ఒకరోజు ఒక అనుకోని సంఘటన జరిగింది.

నాకు జౌహార్ గోహో అని ఒక న్యాయవాది మిత్రుడుండేవాడు. ఆయన కలకత్తాకు చెందిన ఒక బారిస్టర్. ఆయనకు ఇక్కడ ఉండే కేసులు నేను వాదిస్తుండేవాణ్ణి.

ఒకరోజు ఆయన కేసు అయిపోయింది. కోర్టు నుంచి ఆయన బస చేసిన రిట్జ్ హోటల్‌కు వెళ్తూ డ్రింక్ కోసం నన్ను కూడా రమ్మన్నాడు.

అప్పటికి ఇరవై ఏళ్ళుగా నేను రిట్జ్ హోటల్స్‌కు న్యాయపరమైన సలహాదారుగా ఉన్నాను. సరే, పదండి అని నేనూ ఆయనతో వెళ్ళాను.

అక్కడ ఆయన నన్ను దీపక్ శౌరికి పరిచయం చేశాడు. దీపక్ మెటల్‌బాక్స్ అనే కంపెనీలో పని చేస్తున్నాడు. ఆయన అరుణ్ శౌరికి తమ్ముడు. ఆయన కలకత్తా నుంచి ఆ కంపెనీ పనిమీద హైదరాబాదు వచ్చి ఉన్నాడు.

మేం అట్లా కూచుని ఎమర్జెన్సీలో ఏమేం జరిగాయో, ఆంధ్ర ప్రదేశ్‌లో ఏం జరిగిందో మాట్లాడుకుంటుండగా అరుణ్ శౌరి పేరు ప్రస్తావనకు వచ్చింది. అరుణ్ శౌరి అప్పటికి ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సంపాదకుడుగా ఉన్నాడు. ఢిల్లీ పియుసిఎల్‌డిఆర్ లో ఉన్నాడు.

నాకు అరుణ్ శౌరితో మాట్లాడవలసిన పని ఉందని, ఆయనను పరిచయం చేయమని నేను దీపక్ శౌరిని అడిగాను. అట్లా నాకు అరుణ్ శౌరితో సంబంధం ఏర్పడింది.

ఆ తర్వాత రెండు మూడు రోజులకే నేను ఢిల్లీ వెళ్ళి అరుణ్ శౌరిని కలిశాను. ఆయన ఇంట్లోనే ఉన్నాను. ఆయన ఇంట్లో కారు గారేజ్‌లో ఆయన ఆఫీసు నడుస్తోంది. దాంట్లోనే ఒక చిన్న మంచం. మీ పని అయ్యేదాకా మీరు ఇక్కడే ఉండొచ్చు అన్నాడాయన.

ఆ పని చేయడానికి ఆయన చాలా ఉత్సాహం, ఆసక్తి కనబరిచాడు.

ఆ రోజుల్లో పౌరహక్కుల కృషిలో ఆయన అపారమైన శ్రద్ధతో పనిచేసేవాడు. నేను ఆంధ్ర ప్రదేశ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్ల గురించి, వాటిమీద ప్రజావిచారణ జరప వలసిన అవసరం గురించి చెప్పగానే తాను చేయగలిగిన సహాయమంతా చేయడానికి ముందుకొచ్చాడు.

ఇక మేం ఇద్దరం కలిసి ఆ కమిటీలో ఎవరెవరు ఉంటే బాగుంటుందనే ఆలోచన మొదలుపెట్టాం.

అప్పటికే నేను హైదరాబాద్ వైఎంసిఎలో జరిగిన మరొక సమావేశంలో విఎం తార్కుండే మాట్లాడగా విని ఉన్నాను. ఆయన రాడికల్ హ్యూమనిస్టు ఉద్యమ నాయకుడు. జయప్రకాశ్ నారాయణతో కలిసి పౌరహక్కుల ఉద్యమంలో కూడా పాల్గొంటున్నాడు. అందువల్ల ఈ కమిటీలో ఉండమని తార్కుండేను అడిగితే బాగుంటుందని నేను సూచించాను.

తార్కుండే మంచి వక్త. చాలా హేతుబద్ధంగా మాట్లాడే హేతువాది. ఎమర్జెన్సీలో కుల్‌దీప్ నాయర్ అరెస్టు సందర్భంగా, సుప్రీం కోర్టు న్యాయవాదిగా తార్కుండే చాలా ప్రాముఖ్యంలోకి వచ్చారు.

ఇక అరుణ్ శౌరి, నేను తార్కుండే దగ్గరికి వెళ్ళాం. ఆయనను కలవడానికి మేం సుప్రీం కోర్టుకు వెళ్ళాం. ఆయన అక్కడ ఊపిరి సలపని పనుల్లో ఉన్నప్పటికీ అక్కడ సుప్రీం కోర్టు న్యాయవాదుల సంఘం కార్యాలయంలో ఆయనతో కూచుని మాట్లాడాం.

తార్కుండే అప్పటికే పెద్దమనిషి. ముక్కోపి. అక్కడ ఆయనేదో అన్నాడు. నేనేదో అన్నాను. నేను ఆయనను కలవడం అదే మొదటిసారి. చివరికి 'మీరు ఈ కమిటీకి అధ్యక్షులుగా ఉండక తప్పదు' అన్నాను.

ఆయన ఒప్పుకున్నాడు. మాకు చాలా సంతోషం వేసింది. అరుణ్ శౌరి, నేను ఇద్దరం కన్నాట్ ప్లేస్‌కు వచ్చి భోజనం చేశాం.

ఇక ఆ తర్వాత ఎవరు? కమిటీలోకి ఎవరెవరిని తీసుకోవాలి?

ఆ కమిటీ ఎంత విశాలంగా ఉంటే అంత బాగుంటుందని అనుకున్నాం. ఆంధ్రప్రదేశ్ నుంచి బల్వంత రెడ్డి, ఎం.వి. రామమూర్తి, కాళోజీ ఉంటే బాగుంటుందని నేను సూచించాను.

ఇక ఆ తర్వాత కమిటీలోకి ఆంధ్ర ప్రదేశ్ నుంచి ప్రతాప రెడ్డి గారు కూడా చేరారు.

అరుణ్ శౌరికి అప్పుడే జయప్రకాశ్ నారాయణతో సాన్నిహిత్యం పెరుగుతున్నది. ఆ నేపథ్యంలో ఉత్తర భారతం నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఆయన కొందరి పేర్లు సూచించాడు.

బి జి వర్గీస్ ఉంటే బావుంటుందన్నాడు. నబకృష్ణ చౌదరి ఉంటే బావుంటుందన్నాడు. అరుణ్ శౌరి ఈ కమిటీకి కార్యదర్శిగా ఉంటే బావుంటుందన్నాను. అట్లా మొత్తానికి

వి.ఎం. తార్కుండే అధ్యక్షులుగా, ఎనిమిది మంది సభ్యులుగా తార్కుండే కమిటీ ఏప్రిల్ 1977లో రూపొందింది.

ఆ కమిటీ సభ్యుల వివరాలు చెప్పబోయే ముందు కె.ప్రతాప రెడ్డి కమిటీలోకి ఎట్లా వచ్చారో చెప్పాలి.

ఆ విచారణలో భాగంగా సాక్షుల వాంగ్మూలాలు రికార్డ్ చేసి ఢిల్లీ తీసుకు పోతుండే వాడ్ని. ఆ రికార్డులను సురక్షితంగా ఢిల్లీ తీసుకుపోయి అరుణ్ శౌరికి చేర్చడం ఇబ్బంది కరంగా ఉండేది. ఆ రికార్డుల అసలు ప్రతులను స్వాధీనం చేసుకుని మాయం చేయడానికి పోలీసులు అన్ని ప్రయత్నాలు చేస్తుండేవారు.

ఆ రోజుల్లో ఒకసారి నేను ఢిల్లీ వెళుతుండగా విమానాశ్రయంలో ప్రతాప రెడ్డి కలిశారు. ప్రతాప రెడ్డి అప్పుడు జనతా పార్టీలో ఉన్నారు గనుక ఆ కాగితాలు ఆయన దగ్గర ఉంటే సమస్య లేదని ఆయన దగ్గర కాగితాలు పెట్టి ఆయనను కమిటీలోకి ఆహ్వానించాను. నిజానికి ఆ స్థానంలో ఒక డాక్టర్‌ను సభ్యులుగా ఉండమని అడిగాం గాని ఆయన ఒప్పుకోక పోవడంతో ఆ స్థానం ఖాళీగా ఉండిపోయింది.

అట్లా బొంబాయి హైకోర్టు మాజీ న్యాయమూర్తి, సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు వి.ఎం. తార్కుండే అధ్యక్షులుగా, ఒరిస్సా మాజీ ముఖ్యమంత్రి నబకృష్ణ చౌదరి, హిందుస్తాన్ టైమ్స్ మాజీ సంపాదకులు బి.జి. వర్గీస్, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సంపాదకులు అరుణ్ శౌరి, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజి ప్రొఫెసర్ డా. బల్వంత రెడ్డి, ప్రజా కవి కాళోజీ నారాయణ రావు, సీనియర్ న్యాయవాదులు ఎం.వి.రామమూర్తి, కె. ప్రతాప రెడ్డి, నేను సభ్యులుగా తార్కుండే కమిటీ ఏర్పడింది.

ఈ కమిటీ ఏర్పాటు జరిగిన తర్వాత జయప్రకాశ్ నారాయణ దగ్గరికి వెళ్ళి చర్చించాలని నిర్ణయించుకున్నాం. అప్పటికే జె.పి. తీవ్రమైన అనారోగ్యంతో బొంబాయిలో జస్లోక్ ఆస్పత్రిలో ఉన్నారు.

జె.పి.ని కలవడానికి మేం ఎదురు చూస్తున్నప్పుడే, ఆ ఆస్పత్రిలోనే నేను మొదటి సారి స్వామి అగ్నివేశ్‌ను కలుసుకున్నాను. అరుణ్ శౌరియే నన్ను అగ్నివేశ్‌కు పరిచయం చేశాడు.

అప్పుడు మేం జెపి ని కలవడానికి వెళ్ళాం. ఆయన చాలా బలహీనంగా ఉన్నారు. మంచం మీదనే మేం-అరుణ్ శౌరీ నేనూ - ఆ పక్కా ఈ పక్కా కూచుని మాట్లాడాం. ఆయన ప్రశ్నలడుగుతుంటే నేను జవాబులు చెప్పాను.

చివరికి కమిటీ ఏర్పాటవుతున్నదనే ప్రకటన జెపి చదవగా రికార్డ్ చేశాం. ఆంధ్ర ప్రదేశ్‌లో ఎన్‌కౌంటర్‌ల పేరుతో జరిగిన హత్యలను విచారించడం ఈ కమిటీ పని. ఈ కమిటీ తనకు అందిన ఫిర్యాదులన్నింటినీ పరిశీలించి, ఆయా సంఘటనా స్థలాలకు వెళ్ళి విచారణలు జరిపి, నిజానిజాలు నిర్ధారించి, ప్రజలకు నివేదిక ఇవ్వవలసి ఉంటుంది.

అయితే ఈ కమిటీ విచారిస్తున్న అంశం ఎంతో సున్నితమైనదీ, ప్రభుత్వం నుంచీ, పోలీసుల నుంచీ ప్రమాదం ఎదుర్కోగలదీ గనుక విచారణ క్రమమంతా రహస్యంగా ఉండవలసి ఉంటుంది.

ఈ సూచనలు కూడా జెపి యే చేశారు.

ఇక అక్కడి నుంచి మా విచారణాంశాల నిజానిజాల సేకరణ మొదలయింది. మొత్తం మీద ఎమర్జెన్సీలో 77 మందిని హత్యచేసి, వారందరూ ఎన్‌కౌంటర్లలో చనిపోయి నట్టుగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ అన్ని ఘటనలను విడివిడిగా పరిశీలించి వాటిలో నిజమైన ఎన్‌కౌంటర్లెన్నో, ఎన్‌కౌంటర్‌ల పేరుతో జరిగిన హత్యలెన్నో తేల్చి చెప్పడం మా కమిటీ బాధ్యత.

మా కమిటీ 1977 మే, జూన్‌లలో అనేక ప్రాంతాలు పర్యటించి మూడు ఎన్‌కౌంటర్‌ల సంఘటనలను కూలంకషంగా పరిశీలించింది. మేలో ఢిల్లీలో మా మొదటి నివేదిక విడుదల చేసినప్పుడు అందులో పదిమందిని బూటకపు ఎన్‌కౌంటర్లలో చంపడం జరిగిందని పేర్కొన్నాం. జూన్‌లో వెలువరించిన రెండవ నివేదికలో మరి తొమ్మిది మంది హత్యల గురించి వాస్తవాలు వెల్లడించాం. మా దగ్గర చేరిన సమాచారాన్ని, సాక్షుల వాంగ్మూలాలను అప్పటి ప్రధాన మంత్రి మొరార్జీ దేశాయికీ, కేంద్ర హోం మంత్రి చరణ్ సింగ్‌కూ సమర్పించాం.

తార్కుండే కమిటీ పనితీరు గురించి వివరించబోయే ముందు అసలు ఈ ఎన్‌కౌంటర్ కట్టుకథల గురించి చెప్పాలి.

నేను ఇంతకు ముందు చెప్పినట్లు ఎమర్జెన్సీలో డిటెన్యూల రిట్ పిటిషన్లు వాదిస్తున్నప్పుడు తరచుగా విప్లవ కార్యకర్తలను కాల్చి చంపిన వార్తలు వింటుండేవాణ్ని.

తనను తాను ప్రజాస్వామిక దేశంగా చెప్పుకునే దేశంలో ప్రభుత్వం ఇంత దుర్మార్గంగా మనుషుల ప్రాణాలు తీయడం దారుణం. ఇదంతా రాజకీయ అసమ్మతిని లక్ష్యంగా చేసుకుని, ఆ భిన్నాభిప్రాయాన్ని తుడిచివేసే ప్రక్రియ. ఈ ప్రక్రియను చాలా పెద్ద ఎత్తున నక్సలైటు ఉద్యమాన్ని అణచివేయడానికి ఉపయోగించారు. పశ్చిమ బెంగాల్ లోనూ, ఆంధ్ర ప్రదేశ్‌లోనూ జరిగిందదే. తర్వాత అది ఇతర రాష్ట్రాలకు కూడా పాకింది.

ఈ ప్రక్రియ పట్ల నేను లోలోతుల నుంచి చలించి పోయాను. ఒక న్యాయవాదిగానూ, ఒక మనిషిగానూ, రాజ్యం హింసాత్మకంగా మారడానికి అనుమతించ గూడదని విశ్వసించేవాడిగానూ నేను వ్యక్తిగతంగా చాలా చింతించాను.

ఎందుకంటే ఇట్లా చంపడానికి ఒకసారి లైసెన్స్ దొరికితే, మొత్తంగా నిరంకుశత్వానికి, అపరిమితాధికారానికి దారి పడినట్టే.

ఈ విధానాలు నిజానికి హిట్లర్ పాటించిన విధానాల లాంటివి. కాకుంటే తేడా ఏమంటే హిట్లర్ మూకుమ్మడిగా మనుషులను చంపేవాడు. మూకుమ్మడిగా చెరసాలల్లో పెట్టి హింసించేవాడు. జవాబుదారీతనం ఎంత మాత్రం ఉండేది కాదు.

అటువంటి హత్యల నేపథ్యంలోనే అంతర్జాతీయ మానవహక్కుల ప్రకటన వచ్చింది. ఏ చట్టమైనా, ఏ పాలక వర్గమైనా ఎవరికీ మనుషులను చంపే హక్కు ఇవ్వలేదు.

మనదగ్గర తెలంగాణా సాయుధ పోరాటం రోజుల్లో ఇటువంటి హత్యా పద్ధతిని చాలా ఎక్కువగా వాడారు. కమ్యూనిస్టు ఉద్యమాన్ని అణచివేయడానికి వచ్చిన కేంద్ర ప్రభుత్వ బలగాలు రెండున్నర వేల మందిని చంపివేశాయని సుందరయ్య రాశారు. అది ఎన్ని సంవత్సరాల మీదనైనా ప్రభుత్వమే తన పౌరులలో రెండున్నర వేల మందిని చంపడం ఘోరాతిఘోరం. అంటే ప్రభుత్వం అంత నిరాటంకంగా నిరంకుశంగా ప్రవర్తించిందన్నమాట.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొదటి రెండు దశకాలు ఇంత బాహాటంగా ప్రజలను చంపే ధైర్యం పాలక వర్గాలకు రాలేదు. కాని నక్సలైటు ఉద్యమం మొదలయిన తర్వాత ప్రజలను చంపడమే పాలనా విధానంగా ప్రభుత్వం అమలు చేయడం మొదలు పెట్టింది.

ఇట్లా చంపడం అనేది మన రాష్ట్రంలో శ్రీకాకుళ ఉద్యమంతో బైటికి వచ్చింది. చాలా మందిని ఎదురుకాల్పుల పేరుతో చంపివేశారు. విప్లవ రాజకీయాల అణచివేత పోలీసులకు అప్పగించడం జరిగింది. అవి ఒక రాజకీయాలు, వాటిని రాజకీయంగానే ఎదుర్కొనాలి అని తెలిసినప్పటికీ వెంగళరావు వాటిని అణచివేసే పనిని పోలీసు వ్యవస్థకు ఇచ్చేశాడు.

అంటే నాయకత్వంలో అప్రజాస్వామిక లక్షణాలు దేశంలో ప్రజాస్వామిక స్వభావాన్ని కొల్లగొడుతూ, ధ్వంసం చేస్తూ వచ్చాయి. ఇందిరా గాంధీ పాలన తర్వాత, ఎమర్జెన్సీ తర్వాత ఈ అప్రజాస్వామిక లక్షణాలు ఇంకా బాహాటంగా పెరిగి పోయి నిరంకుశత్వానికి దారి తీశాయి.

వెంగళరావు ఎన్నికల పార్టీల రాజకీయాలు తప్ప మరే రాజకీయాలు తెలిసిన వాడు కాదు. ఆయన అసలు రాజకీయ ఆలోచనలు ఉన్నవాడు కాదు. ఆయన కేవలం ఇంటిలిజెన్స్ నివేదికల మీద మాత్రమే ఆధారపడి ముఖ్యమంత్రి అయ్యాడని ఆ రోజుల్లో చెప్పుకునేవారు. ఇంటిలిజెన్స్ అధికారిగా ఎం.వి.నారాయణ రావు వెంగళరావుకు క్లీన్ చిట్ ఇచ్చాడని, ముఖ్యమంత్రిగా తగిన వాడని చెప్పాడని, అందువల్లనే వెంగళ రావు ముఖ్యమంత్రి అయ్యాడని వదంతి ఉండేది.

ఇందిరా గాంధీ పాలనలో స్థానికంగా కింది నుంచి ఎన్నికయిన ముఖ్యమంత్రులెవరూ ఉండేవాళ్ళు కాదు. అందువల్ల వెంగళరావు కూడా ఇట్లా ముఖ్యమంత్రి కావడంలో ఆశ్చర్యం లేదు.

అంతకుముందు మద్రాస్ సప్రెషన్ ఆఫ్ డిస్టర్బెన్సెస్ ఆక్ట్ 1947 అని ఉండేది. ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడిన తర్వాత ఐదారు సంవత్సరాలకు ఆ చట్టాన్ని ఆంధ్ర ప్రదేశ్ శాసనసభ కూడా ఆమోదించింది. ఆ చట్టంలో ఒక సెక్షన్ ఉంది. ఆ సెక్షన్ ప్రకారం

ఏదయినా ఒక ప్రాంతాన్ని డిస్టర్బ్‌డ్ ఏరియా (కల్లోలిత ప్రాంతం) గా ప్రకటించడానికి ప్రభుత్వానికి అధికారం ఉంటుంది.

అట్లా కల్లోలిత ప్రాంతంగా ప్రకటించిన ప్రాంతంలో ఐదుగురికన్న ఎక్కువ మంది సమావేశమయితే, వాళ్ళను చెదిరిపొమ్మని హెచ్చరించినా చెదిరి పోకపోతే కాల్పులు జరిపే అధికారం ఎస్ఐ కి సంక్రమిస్తుంది. మామూలుగానయితే ప్రజల మీద పోలీసులు కాల్పులు జరపాలంటే మెజిస్ట్రేట్ అనుమతి ఉండాలి. కాని కల్లోలిత ప్రాంతంగా ప్రకటించిన ప్రాంతంలో ఎస్ఐ హోదా ఉన్న వ్యక్తి కూడ ఎవరి అనుమతీ లేకుండానే కాల్పులు జరపవచ్చు. తాను కాల్పులు జరపడాన్ని సమర్థించుకోవచ్చు.

ఈ అవకాశంతో ఎక్కడయినా నక్సలైట్లను అరెస్టు చేయడం, ఈ కల్లోలిత ప్రాంతాలకు తీసుకువెళ్ళి కాల్చి చంపడం అనే ప్రక్రియను పోలీసులు 1969లో ప్రారంభించారు.

ఈ ప్రక్రియను పెద్ద ఎత్తున అమలు చేసిన వారు ఎం.వి. నారాయణరావు. ఆయన ఈ ఘోరకృత్యాన్ని ఒక పాలనా విధానంగా తయారు చేశాడు. ఆయన ఇంటిలిజెన్స్ డిఐజిగా వెంగళరావుకు చాల సన్నిహితుడు.

ఇటువంటి బూటకపు ఎదురుకాల్పుల విధానం, హత్యావిధానం ఎందువల్ల తీవ్రమైన అంశమో ఆలోచించాలి. సాధారణంగా ఎక్కడయినా ఒక హత్య జరిగితే, ఒక నేరం నమోదవుతుంది. భారత శిక్షాస్మృతి 302 కింద నేరం జరిగినట్టుగా రిజిస్టరవుతుంది. దాని మీద నేర పరిశోధన, విచారణ జరుగుతాయి. కేసు పెట్టవలసి ఉంటుంది. కోర్టులలో కింది నుంచి పై దాకా ఒక పద్ధతి ప్రకారం విచారణ జరుగుతుంది.

కాని ఒక పోలీసు అధికారి ఏవరినయినా చంపితే, ఎన్‌కౌంటర్ అని తనకుతానే ప్రకటన చేస్తే అడిగేవాడు లేడు. ప్రజలు ఎన్నుకున్న రాజకీయ నాయకులకు కూడ దక్కని హక్కు కేవలం జీతం కోసం, బతుకు తెరువుగా పోలీసు వృత్తిలో చేరిన వ్యక్తులకు దక్కుతోంది.

ఇటువంటి చట్ట వక్రీకరణ ఇంకా జరుగుతూనే ఉంది. ఇది చట్ట పరిధిలోకి రాదని, చట్టాన్ని నిర్వచించడం సాధ్యం కాదని, చట్ట వ్యతిరేక ప్రవర్తనను రుజువు చేయడం కష్టమని - ఏదో ఒక సాకుతో ఈ చట్ట వక్రీకరణను కోర్టులు కూడా చూసీ చూడనట్టు వదిలేస్తున్నాయి.

అల్లూరి సీతారామరాజు నుంచి ఇవాల్టి దాకా ఎన్‌కౌంటర్ హత్యలు ఒకే మాదిరిగా జరుగుతున్నాయి. కాలం ఏదయినా నేరం ఒకటే అన్నమాట.

ఇటువంటి హత్యలను మతోన్మాదంతో పోల్చవచ్చు. మతోన్మాదం, దాని ఆధారంగా జరిగే హత్యలు ఉన్నాయే, అవి ఎలాంటివో ఎన్‌కౌంటర్ హత్యలు కూడా అలాంటివే. ఇది ఒక రకంగా అసహనపు సమస్య.

1950 తర్వాత మనం ఒక రాజ్యాంగంతో, ఒక విలువల వ్యవస్థతో, ఆదేశిక

సూత్రాలతో, ప్రాథమిక హక్కులతో ఒక చట్టబద్ధ పాలన పరిధిలోకి ప్రవేశించాం. కాని ఆ చట్టబద్ధతను మనం పాటించ దలచుకోలేదు.

అందుకే ముందు చెప్పినట్టు ఎక్కడో ఒకచోట పట్టుకుని కల్లోలిత ప్రాంతంగా ప్రకటించిన చోట కాల్చి చంపేసే వాళ్ళు. పార్వతీపురం కుట్ర కేసులో అట్లాగే చేశారు. దాన్ని కూడ అడిగినవాడు లేడు.

భువనమోహన పట్నాయక్ అని న్యాయవాది ఉండేవాడు. చాలా మృదుస్వభావి ఆయన. పార్వతీపురం కుట్రకేసు విచారణలో క్రాస్ ఎగ్జామినేషన్‌లో ఈ సమస్య లేవనెత్తాడు. అవి ఎన్‌కౌంటర్‌లు కాదని రుజువు చేయడానికి ప్రయత్నించాడు.

అయితే ఆ విచారణలో ఈ నిజాలు నిర్ధారించడం సాధ్యంకాదు. ఒక విచారణలో భాగంగా అటువంటి విషయం – ప్రభుత్వమే హత్య చేసిందనే విషయం – నిర్ధారించడం కుదరదు. విచారణా పద్ధతి అందుకు అంగీకరించదు. అది అట్లా ఎందుకు ఉందో నాకు తెలియదు.

ఒకవేళ ఒక విచారణలో భాగంగా హత్య జరిగిందని తేలితే ఆ కోర్టు ఆ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. ఆ హత్యను విచారణ చేసే అధికారం తనకు లేకపోతే ఆ అంశాన్ని తగిన కోర్టుకు అప్పగించాలి. చట్టాన్ని ఈ విధంగా దుర్వినియోగం చేస్తున్న వాళ్ళను బోనెక్కించాలి.

కాని కేవలం పద్ధతిలోని అస్తవ్యస్తత వల్ల అటువంటి అవకాశం లేదు.

సరే, బైట పట్టుకున్న వాళ్ళను కల్లోలిత ప్రాంతానికి తీసుకువెళ్ళి చంపడం అనే కనీసపు సిగ్గుబిళ్ళ, కనీసపు చట్టబద్ధ ప్రవర్తన అయినా తొలిరోజుల్లో ఉండేది.

ఎమర్జెన్సీ ప్రకటించిన తర్వాత కల్లోలిత ప్రాంతాల ప్రకటన అనే ముసుగు కూడా అవసరం లేకపోయింది. జనాన్ని ఎక్కడ పడితే అక్కడ చంపడం మొదలయింది. ఎమర్జెన్సీలో దాదాపు 75 మందిని ఇట్లా చంపేసి ఎన్‌కౌంటర్ కట్టుకథలు అల్లారు.

ఎమర్జెన్సీలో నేను కోర్టులో డిటెన్యూల కేసులు వాదిస్తున్నప్పుడు ఈ ఎన్‌కౌంటర్ హత్యల వార్తలు నాకు అందుతుండేవి. గిరాయి పల్లి ఎన్‌కౌంటర్ వార్త నాకట్లాగే తెలిసింది. నీలం రామచంద్రయ్య, జంపాల చంద్రశేఖర ప్రసాద్ ఎన్‌కౌంటర్ల వార్త నాకు కోర్టులోనే తెలిసింది.

అంటే రాజ్యాన్ని ఆపగల శక్తేదీ లేకుండా పోయిందన్నమాట. ఇంత పెద్ద ఎత్తున మానవహక్కుల ఉల్లంఘన జరుగుతుంటే, ఈ మాదిరిగా ప్రాణాలు తీస్తూవుంటే ఏ చట్టపరమైన ఆటంకాలు లేవన్నమాట. భారత శిక్షాస్మృతిగాని, నేర విచారణాస్మృతి గాని– అంటే ఇండియన్ పీనల్ కోడ్ గాని, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ గాని – ఆత్మ రక్షణ కోసమయినా సరే, ఇటువంటి హత్యలను అనుమతించవు. కాని వాటిపట్ల లక్ష్యం లేకుండా ఈ మారణకాండ సాగిపోయింది.

ఎమర్జెన్సీలో మొదటి పౌరహక్కుల ఉల్లంఘన - అరెస్టు చేసి జైళ్ళలో కుక్కడం. రెండో ఉల్లంఘన - అరెస్టును ఎక్కడా చూపకుండా అక్రమ నిర్బంధంలో రోజుల తరబడి, నెలల తరబడి ఉంచడం. బహుశా డిటెన్యూల సంఖ్యకు ఎనిమిది రెట్లో పది రెట్లో ఎక్కువగా ఈ అక్రమ నిర్బంధంలో ఉన్నవాళ్ళు ఉండేవారు. ఈ రెండింటి కన్నా దారుణమైనది ఈ అక్రమ నిర్బంధంలో ఉన్నవాళ్ళలోంచి ఎవరిని ఎప్పుడు ఎక్కడ చంపుతారోననే భయం.

నిజానికి తరిమెల నాగిరెడ్డి కోర్టు ప్రకటనలో-తాకట్టులో భారతదేశం-ఇటువంటి అక్రమ హత్యల గురించి మాట్లాడారు. బత్తుల వెంకటేశ్వరరావు అనే నక్సలైటు నాయకుడిని ఎన్‌కౌంటర్ పేరిట ఎట్లా చంపేశారో వివరించారు.

అది ఒక సంఘటన మాత్రమే. అటువంటి సంఘటనలు లెక్కలేనన్ని జరిగాయి.

అందువల్లనే ఎమర్జెన్సీ ముగిసిపోయి దేశమంతా ప్రజాస్వామిక చైతన్యం, ఆందోళన విస్తరిస్తున్నప్పుడు, ఇట్లా మనుషులను చంపి పారవేసే దుష్ట సంప్రదాయాన్ని ఆపడానికి ఏమయినా చేయగలమా అని ఆలోచనలు ప్రారంభించాం. తార్కుండే కమిటీ ఏర్పాటు అటువంటి ఆలోచనల ఫలితమే.

తార్కుండే కమిటీ ఎట్లా ఏర్పాటయిందో ఇదివరకే చెప్పాను. ఇక కమిటీ పని ప్రారంభమయింది. ఎమర్జెన్సీలో ఆంధ్ర ప్రదేశ్‌లో 77 మందిని ఇట్లా బూటకపు ఎన్‌కౌంటర్లలో చంపివేయడం జరిగింది గనుక ఆ అన్ని ఘటనలను విచారించి నిజా నిజాలు కనిపెట్టి బహిరంగంగా ప్రకటించాలని మేం అనుకున్నాం.

మేం నిజానిజాలు సేకరించడం మొదలుపెట్టిన మొట్టమొదటి సంఘటన గిరాయిపల్లి ఎన్‌కౌంటర్‌గా ప్రఖ్యాతమయిన ఘటన. మెదక్ జిల్లా గిరాయిపల్లి సమీపంలోని అడవిలో 1975 జులై 25న, అంటే ఎమర్జెన్సీ ప్రకటించిన సరిగ్గా నెల రోజులకు, నలుగురు యువకులను కాల్చి చంపారు. ఆ నలుగురూ నక్సలైటు ఉద్యమ కార్యకర్తలు. అప్పటికి పీపుల్స్‌వార్ కూడ ఏర్పడలేదు. ఆ నలుగురూ కొండపల్లి సీతారామయ్య నాయకత్వంలోని విప్లవ గ్రూపు కార్యకర్తలు.

వారు సూరపనేని జనార్దన్, లంకా మురళీమోహన్ రెడ్డి, వి. సుధాకర్, కె. ఆనందరావు. ఇందులో జనార్దన్ వరంగల్ రీజినల్ ఇంజనీరింగ్ కాలేజ్ విద్యార్థి. మురళీమోహన్ రెడ్డి, సుధాకర్, ఆనందరావు వరంగల్‌కు చెందినవాళ్ళు. వాళ్ళలో జనార్దన్‌ను విడిగా, మిగిలిన ముగ్గురినీ మరొక చోట పట్టుకుని, కనీసం వారం రోజులు చిత్రహింసలు పెట్టి, ఆ తర్వాత గిరాయిపల్లి తీసుకునివెళ్ళి అక్కడ చెట్లకు కట్టి కాల్చి చంపారని మాకు తెలిసింది.

గిరాయిపల్లి సమీపంలోని సిరిసినగండ్ల అనే గ్రామంలో 1975 జూన్ 22న దొంతుల అంతయ్య అనే వడ్డీ వ్యాపారి హత్య జరిగింది. అతను చాల క్రూరంగా

ఉండేవాడని, అప్పులు వసూలు చేయడంలో నిర్దాక్షిణ్యంగా ఉండేవాడని పేరు. ఆ హత్య విషయంలో ఒక కేసు పెట్టారు. విచారణ జరిగింది. ఆ విచారణ సందర్భంలో ఈ నలుగురు యువకులను పట్టుకున్నారు. ఆ నలుగురు యువకులను కొన్ని రోజులు ప్రశ్నించారు. ఆ తర్వాత చంపివేసి, ఎదురుకాల్పులలో చనిపోయారని ప్రకటించారు.

నా మిత్రుడు, న్యాయవాది చల్లా నరసింహా రెడ్డి అప్పుడు సిపిఐ(ఎం) లో ఉండే వారు. ఆయన దొంతుల అంతయ్యకు న్యాయవాది. కాని అంతయ్య హత్య తర్వాత పోలీసులు ఆ కేసులో ఆయనను కూడా ఇరికించారు.

గిరాయిపల్లి ఎన్‌కౌంటర్ నిజానిజాలను సేకరించడంలో నరసింహా రెడ్డి నాకు ఎంతో సహాయం అందించారు. ఆయన అప్పుడు సిద్ధిపేటలో న్యాయవాదిగా ఉండేవారు. ఆయనకు ఈ కేసుకు సంబంధించి వాస్తవాలు సంపూర్ణంగా తెలుసు. నాకు మిత్రుడు కూడా కావడం వల్ల ఆయన తనకు తెలిసిందంతా నాకు చెప్పడానికి సిద్ధపడ్డారు. ఆయనలోని గొప్ప గుణం ఏమంటే ఆయన నాకు తప్పులు చెప్పడానికో, నన్ను పక్కదారి పట్టించడానికో ఎంతమాత్రం ప్రయత్నించలేదు.

మేం చాల వివరంగా, చాలసేపు మాట్లాడుకున్నాం. అసలు నరసింహా రెడ్డి నాకు పరిచయమైనదే నా మిత్రుడు పంచాగ్నుల సత్యనారాయణ ద్వారా. సత్యనారాయణ నాకు చాల సన్నిహితులు, మంచి న్యాయవాది.

ఎన్‌కౌంటర్ ఘటన ఎట్లా జరిగిందో నరసింహా రెడ్డి నాకు చిన్న చిన్న వివరాలతో సహా చెప్పారు. ఆ అంతయ్య హత్య కేసుతో సంబంధం ఉన్న ఎవరెవరిని ఎప్పుడెప్పుడు అరెస్టు చేసి ఎక్కడెక్కడ పెట్టి ప్రశ్నించారో నరసింహారెడ్డి నాకు చెప్పారు. తద్వారా నేను వాళ్ళందరి దగ్గరికి వెళ్ళి మాట్లాడే అవకాశం దొరికింది. వాళ్ళందరూ నిజం చెప్పేలా ప్రోత్సహించడానికి వీలు కలిగింది. ఇందిరా గాంధీ పరాజయంతో నాకూ, ఆ సాక్షులందరికీ కూడ బహిరంగంగా నిజాలు చెప్పే, వాదించే ధైర్యం వచ్చింది.

గిరాయిపల్లి కేసులో నేను పరీక్షించిన, ప్రశ్నించిన వారిలో ఏ ఒక్కరూ కూడ నిజం చెప్పడానికి భయపడలేదు. నేను, మిత్రులు ఆయా ప్రాంతాలకు వెళ్ళేవాళ్ళం. సాక్షుల వాంగ్మూలాలు రికార్డు చేసేవారం. బల్వంత రెడ్డి ఎప్పుడు ఫోన్ చేసినా వెంటనే వస్తుండేవారు.

ఆశ్చర్యకరంగా పోలీసుల నుంచి పెద్దగా ఆటంకాలు రాలేదు. నిజానికి పోలీసులు మమ్మల్ని అడ్డుకుంటారనీ, ఇబ్బందులు పెడతారనీ, రౌడీయిజం చెలాయించి మేం సాక్ష్యాలు సేకరించకుండా అడ్డుపడతారనీ నేను ఊహించాను. కాని నేను ఊహించి నట్టుగా జరగలేదు. ఎందుకంటే పోలీసులు మేం ఏం చేస్తున్నామో గుర్తించలేదు. వాళ్ళు మేం హైదరాబాదులో ఏదో చేస్తున్నామని అనుకున్నట్టున్నారు. మేం గ్రామాలకు వెళ్ళి, ప్రజలతో మాట్లాడి, సాక్ష్యాలు రికార్డు చేస్తామని ఊహించలేదనుకుంటాను.

అప్పుడు మా కమిటీ పనుల్లో మాకు ఎందరో సహకరించారు. ప్రతిరోజూ డజన్ల కొద్దీ మిత్రులు మా ఇంటికి వస్తూండేవారు. లలిత, విఠల్ రాజన్,శత్రుఘ్న, వీణ, రమ-అందరూ తమ తమ స్థాయిల్లో కమిటీ పనికి సహకరించేవాళ్ళు.

అందరికన్న ఎక్కువగా ఆ రోజుల్లో నాకు సాయం చేసినది రంగనాథం, ఎమర్జెన్సీకి ముందు వెలువడుతుండిన 'పిలుపు' పత్రిక సంపాదకుడిగా రంగనాథం ఎమర్జెన్సీలో జైలులో ఉన్నాడు. ఎమర్జెన్సీ తర్వాత కొంతకాలం పౌరహక్కుల సంఘంలో పనిచేశాడు.

రంగనాథం బాగా టైప్ చేసేవాడు. ఉదయాన్నే వచ్చేవాడు. బాగా పొద్దుపోయే దాకా పనిచేస్తూ ఉండేవాడు. ఆయనకు ఈ విషయాల్లో చాలా అవగాహన ఉండేది. ఎంతో ఆసక్తి ఉండేది. ఇటువంటి దుర్మార్గమైన, అసహ్యకరమైన ప్రవర్తన, పద్ధతులు లేకుండా చేయడానికి మనమేమైనా చేయాలి అనే తపన ఉండేది.

ఎన్‌కౌంటర్ల విషయం తెలిసిన వాళ్ళందరి దగ్గరి నుంచి సమాచారం సేకరిస్తుండే వాళ్ళం. అది మళ్ళీ మళ్ళీ టైపు చేయిస్తుండేవాళ్ళం. వసంత ఇంగ్లీషు సరిచూస్తూ ఉండేది. నేనూ చూస్తుండేవాడ్ని. అదంతా కార్ఖానాలాగా నడిచేది.

గిరాయిపల్లి ఎన్‌కౌంటర్‌కు సంబంధించి సాక్ష్యాధారాలన్నీ సేకరించడం అయిపోగానే ఒక నివేదిక తయారు చేశాం. ఆ నివేదికను మొత్తం కమిటీ ఆమోదించ డానికి వీలుగా ముసాయిదా రాశాం. కమిటీ అధ్యక్షులు, మిగతా సభ్యులు వేరే చోట్ల ఉండేవాళ్ళు గదా.

తార్కుండే గాని, అరుణ్ శౌరి గాని ఈ సమాచార సేకరణలో భాగంగా ఇక్కడికి రాలేదు. వస్తే కమిటీ పని మీద దృష్టి ఎక్కువపడి పోలీసుల నుంచి ఇబ్బందులు వచ్చే వనుకుంటాను.

ఇక తార్కుండే, నేను, వర్గీస్, అరుణ్ శౌరి జాగ్రత్తగా పదం పదం చదివి నివేదిక ఎక్కువ మందికి ఆమోదయోగ్యంగా ఉండేలా తయారు చేసేవాడు. వర్గీస్ కూడ నివేదికను మెరుగు పరచడంలో తోడ్పడేవాడు.

ఇక్కడ ఒక సంగతి చెప్పాలి. గిరాయిపల్లి ఎన్‌కౌంటర్ సాక్ష్యాధారాలు సేకరిస్తున్నప్పుడు నాకు ఒక విషయం తెలిసింది. ఈ గిరాయిపల్లి ఎన్‌కౌంటర్ హతులను, సహనిందితులను మెదక్ జిల్లాలోని ములుగులో నీలగిరి తోట డాక్ బంగళా లో నిర్బంధించారని తెలిసింది. అది ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌కో, పిడబ్ల్యూడికో చెందిన బంగళా. అక్కడే ఆ రోజుల్లో ఎస్పీ, డిఎస్పీ, కొందరు పోలీసు అధికారులు బస చేశారు. నేను ఆ గెస్ట్‌హౌస్‌కు వెళ్ళాను. వాచ్‌మన్‌ను గెస్ట్ రిజిస్టర్ తీసుకు రమ్మని అడిగాను. అక్కడి వాచ్‌మనో, గెస్ట్‌హౌస్ ఇన్‌ఛార్జో ఆ రిజిస్టర్ తీసుకువచ్చాడు. దాంట్లో ప్రత్యేకించి ఆ తేదీల్లో జిల్లా ఎస్పీ సుభాష్ చంద్రబోస్ బస చేసినట్టు నమోదయి ఉంది. నేను ఆ పేరు చుట్టూ గుండ్రంగా గీసి గుర్తు పెట్టాను. 'తనిఖీ చేసి, పేరు చుట్టూ గుండ్రంగా గీశాను'

అని రాసి సంతకం పెట్టాను. కె.జి.కన్నబిరాన్, కార్యదర్శి, తార్కుండే కమిటీ అని రాశాను. ఆ వాచ్‌మన్‌ను పిలిచి ఆ రిజిస్టర్ కాపీ మీద సంతకం తీసుకున్నాను.

ఆ బస చేసిన తేదీ ఏమిటి, అంతకు ముందు పేజీలో ఉన్న అతిథి పేరు ఏమిటి, తర్వాతి పేరు ఏమిటి మొదలయిన వివరాలన్నీ జాగ్రత్త చేసేవాడ్ని. తద్వారా వాళ్ళకు ఆ తర్వాత కాగితాలు చింపేసి, సాక్ష్యాధారాలు మాయం చేయడానికి వీలు లేకుండా చేసేవాడ్ని.

గిరాయిపల్లి ఎన్‌కౌంటర్ మేం జరిపిన మొదటి విచారణ కాగా, మా రెండో విచారణ చిలకలగుట్ట ఎన్‌కౌంటర్. చిలకలగుట్ట అనేది వరంగల్ జిల్లా నర్సంపేట సమీపంలోని పాకాల దగ్గర ఉన్న అడవి. హైదరాబాద్‌లో పాత మలక్‌పేటలో పి.రామనర్సయ్యను, అయన సహచరులు జానకి రామరెడ్డి, నారాయణ, శ్రీహరిలను అరెస్టు చేసి, నిండా టార్పాలిన్ కప్పిన వ్యాన్‌లో చిలకలగుట్టకు తీసుకువెళ్ళి అక్కడ కాల్చి చంపేశారు. పి. రామనర్సయ్య అప్పటికి చంద్ర పుల్లారెడ్డి నాయకత్వంలో పని చేస్తుండిన విప్లవ గ్రూపుకు రాష్ట్ర కార్యదర్శి. ఈ ఎన్‌కౌంటర్ హత్యలు 1976 అక్టోబర్ 31న జరిగాయి.

ఇక ఈ ఘటన నిజానిజాలు సేకరించడం మొదలుపెట్టాం. ప్రీతం సింగ్ అని ప్రభుత్వ మింట్‌లో పనిచేసే ఉద్యోగి ఉండేవాడు. అయనకు పాత మలక్‌పేటలో ఉన్న ఇంట్లో రామనర్సయ్యను అరెస్టు చేశారు.

అసలు ప్రీతంసింగ్ ఇంట్లో ఒక పోర్షన్‌లో ఒక ఆర్‌టిసి ఉద్యోగి అద్దెకు ఉండేవాడు. అయన పేరు రెడ్డి అనుకుంటాను. పోలీసులు ఆ ఇంటికి వెళ్ళి అక్కడి నుంచి రామనర్సయ్యను పట్టుకుని కట్టేసి వ్యాన్‌లో వేసుకుని తీసుకుపోయారు. ఈ సంఘటన తనకు తెలిసిందని అప్పటి సిపిఐ(ఎం) శాసనసభ్యుడు ఎం. ఓంకార్ కూడా ఆ తర్వాతి కాలంలో భార్గవా కమిషన్ ముందర చెప్పారు.

రామనర్సయ్యను, అయన సహచరులను చిత్రహింసలు పెట్టారని, చేతి వేళ్ళు నరికేశారని కూడా మా విచారణలో తెలిసింది.

నేను ఇంకొక సంగతి కూడ విన్నాను. అప్పుడు ఇనస్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ గా ఉండే కె.రామచంద్రారెడ్డికి రామనర్సయ్య అరెస్టు గురించి చెప్పారట. నిజానికి రామనర్సయ్య అప్పటికే చాలా సీనియర్ నాయకుడు. చాల గౌరవాభిమానాలు సంపాదించుకున్న వ్యక్తి. బహుశా అందువల్లనేనేమో అయన అరెస్టు జరగగానే పోలీసు ఉన్నతాధికారికి ఆ సమాచారం అందజేసి ఉంటారు.

రామనర్సయ్యను న్యాయస్థానంలో హాజరు పరచండి అని రామచంద్రారెడ్డి చెప్పాడంటారు. కాని ఏమయిందో, అయనను కోర్టులో హాజరుపరచలేదు.

మొత్తానికి చిలకలగుట్ట సంఘటనలో కూడ నలుగురిని చంపేశారు.

మా విచారణలో మూడో హత్యా సంఘటన ఇల్లందులో జరిగిన 'ఎన్‌కౌంటర్'. ఆ

ఎన్‌కౌంటర్ 1976 నవంబరు 4-5 తేదీల మధ్య రాత్రి జరిగిందని పోలీసులు ప్రకటించారు. ఈ ఎన్‌కౌంటర్‌లో చంపివేయబడ్డవాళ్ళు ఇద్దరు. నీలం రామచంద్రయ్య, జంపాల చంద్రశేఖర ప్రసాద్.

నీలం రామచంద్రయ్య ఆంధ్ర ప్రదేశ్ శాసనమండలి సభ్యుడిగా కొంతకాలం పని చేశారు. చాలా సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు. చంద్ర పుల్లారెడ్డి గారి నాయకత్వంలోని విప్లవగ్రూపులో నాయకుడిగా ఉన్నారు. జంపాల ప్రసాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ చదువుతూ విద్యార్థి నాయకుడిగా, పిడిఎస్‌యు నాయకుడిగా రాష్ట్రమంతటా గుర్తింపు పొందాడు. కాని "గుర్తు తెలియని వ్యక్తుల ఎన్‌కౌంటర్" అని పోలీసులు ప్రకటించారు.

వీళ్ళందరినీ 1976 నవంబర్ 4 సాయంకాలం విజయవాడలో అరెస్టు చేసి ఉంటారనడానికి ఎన్నో సాక్ష్యాధారాలు దొరికాయి. వారిని ఆ రాత్రికే వంద కిలోమీటర్ల దూరంలోని ఖమ్మం జిల్లా ఇల్లందు అడవిలోకి తీసుకువెళ్ళి కాల్చి చంపేశారు.

ఈ మూడు ఘటనలను విచారించి అవసరమైన, దొరికిన సాక్ష్యాధారాలన్నీ సేకరించిన తర్వాత ఒక మధ్యంతర నివేదిక విడుదల చేయాలనుకున్నాము. గిరాయి పల్లి, చిలకలగుట్ట, ఇల్లందు ఎన్‌కౌంటర్ హత్యలలో చంపివేయబడిన పదిమంది విప్లవోద్యమ కార్యకర్తలను ఎప్పుడు ఎక్కడ ఎట్లా అరెస్టు చేసి, ఏ న్యాయ విచారణల లేకుండానే ఎట్లా చంపేశారో, ఎంత చట్టవ్యతిరేకమయిన మారణకాండ సాగిందో. దేశం దృష్టికి తీసుకురావడం తార్కుండే కమిటీ ఉద్దేశ్యం. నిజానికి అప్పటికి మాకు భార్గవ కమిషన్ లాంటి ఒక అధికారిక కమిషన్ ఏర్పడి విచారణ జరపబోతుందనే సూచన కూడ లేదు.

దొరికిన ఆధారాలన్నింటితో మధ్యంతర నివేదిక నేనే రాశాను. ఆ నివేదికను 1977 మే 16న ఢిల్లీలో పత్రికా సమావేశంలో విడుదల చేశాం. పది మంది పౌరులను ఏ చట్టబద్ధ ప్రక్రియ, విచారణ లేకుండా ఇంత క్రూరంగా పోలీసులు హత్య చేశారనే వాస్తవం దేశాన్ని కుదిపేసింది.

ఆ నివేదిక విడుదల చేసిన తర్వాత కూడ మిగిలిన ఎన్‌కౌంటర్ ఘటనలను విచారించడం కొనసాగించాం.

ఆ తర్వాత విచారణ ప్రారంభించిన ఘటనలు గుంటూరు జిల్లాలోనూ, ప్రకాశం జిల్లాలోనూ జరిగిన ఎన్‌కౌంటర్లుగా చెప్పబడేవి. ఈ ఘటనలలో మొత్తం తొమ్మిది మంది చంపివేయబడ్డారు. జయరావు, సూర్యవర్మ, సత్యానందం, మల్లికార్జునరావుల హత్యలకు సంబంధించి విచారణ, సాక్ష్యాధారాల సేకరణ ప్రారంభించాను. ఈ నలుగురిలో ఇద్దరు దళితులనుకుంటాను.

ఈ ఎన్‌కౌంటర్ ఒక్కసారి ఒక్కచోట జరిగినది కాదు. ఒక్కొక్కరిని ఒక్కొక్క చోట ఎన్నో రోజులపాటు చంపుతూ పోయారు.

ఈ సాక్ష్యాధారాల సేకరణ క్రమంలో నేను తెట్టు అనే ఊరికి వెళ్ళడం నాకింకా గుర్తుంది. అక్కడ కచ్చితంగా ఎక్కడ వారిని చంపారో ఆ ప్రదేశం చూశాం. మంచి ఎండలో టాక్సీ తీసుకుని తెట్టు వెళ్ళాను. అక్కడ టాక్సీ చెడిపోయింది. ఒక లారీ ఎక్కి కావలి వచ్చాను. కెవి రమణారెడ్డి ఇంటికి వెళ్ళాను. ఆయన ప్రత్యేకమైన లక్షణాలు, అలవాట్లు నేను చూసిందక్కడే.

ఆ సాయంత్రం నన్ను హైదరాబాదుకు రైలు ఎక్కించాడు. నేను ఎక్కిన రైల్లో ఒక పెద్ద పోలీసు పటాలం ఎక్కింది. వాళ్ళు నన్నేమైనా చేస్తారేమోనని కెవిఆర్ ఆందోళన పడ్డాడు. నా దగ్గర తెట్టు ఎన్‌కౌంటర్ సాక్ష్యాధారాల రికార్డులు ఉన్నాయి గదా.

“మనం ఏం చేయగలం? ఇట్లాగే వెళతాను. ఒకవేళ వాళ్ళు నన్నేమైనా బెదిరించి ఈ రికార్డులు గుంజుకుంటే మళ్ళీ సాక్ష్యాలు సేకరించవలసిందే” అని కెవిఆర్‌కు చెప్పేసి రైలెక్కాను.

తర్వాత కూడ ఆందోళన కొనసాగింది. ఏమంటే ఒక ఇంటిలిజెన్స్ ఉద్యోగి నేనున్న పెట్టెలోకి ఎక్కాడు. కాని తర్వాత ఏమీ జరగలేదు.

మా రెండో మధ్యంతర నివేదికను కూడా జూన్‌లో విడుదల చేశాం. అది ఢిల్లీలో వర్గీస్ విడుదల చేశాడనుకుంటాను. ఈ రెండు నివేదికల సారాంశం అరుణ్ శౌరి తన పుస్తకంలో ఒక అధ్యాయంగా రాశాడు. మా నివేదికలు తెలుగులో విస్తృతంగా అచ్చయ్యాయి. అప్పుడు జనతా ప్రభుత్వ కాలంలో వెల్లువెత్తిన ప్రజాస్వామిక వాతావరణం వల్ల తార్కుండే కమిటీ నివేదికలకు దేశవ్యాప్తంగా ప్రాచుర్యం వచ్చింది.

మా నివేదికలన్నీ పద్ధతి ప్రకారం హోం మంత్రిత్వ శాఖకు, ప్రధాని కార్యాలయానికి కూడ పంపించేవాళ్ళం. జయప్రకాశ్ నారాయణ్‌కు అందజేయడం, ప్రజల ముందుంచడం, పత్రికలకు తెలియజేయడం సరేసరి.

ఈ నివేదిక ఉపోద్ఘాతాన్ని క్లుప్తంగా ఆదిరాజు వెంకటేశ్వరరావు రాసిన హంతకు లెవరు? (వెలుగు పబ్లికేషన్స్ 1977) నుంచి ఈ కింద ఇస్తున్నాను.

“సాయుధ సంఘర్షణలు” గా అభివర్ణించిన, పదిమంది మృతికి కారణమైన మూడు సంఘటనల గురించి కమిటీ సాక్ష్యాన్ని సేకరించింది. వాటిలో రెండు సంఘర్షణలు అసలు జరగనే జరగలేదని కమిటీకి నమ్మకం కలిగింది. మూడవ సంఘర్షణ కూడ నిజం కాదని చెప్పేందుకు కూడ చాలా ఆధారాలు కన్పిస్తున్నాయి.

ప్రతి సందర్భంలోను తమకు చేజిక్కిన వ్యక్తులను పోలీసులు ఎంత క్రూరంగా హింసించినదీ సాక్షులు వివరించారు. ఈ హింసాకాండలో ఉద్దేశ్యం పోలీసులు ఇరికించిన కేసులలో తాము నిజంగానే దోషులని వారిని అంగీకరింప చేయటానికేనని అర్థమవుతుంది.

1973 క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 174లో నిర్దేశించిన ప్రకారం మృతదేహాలపై అధికారులు విచారణ ఏ ఒక్క సందర్భంలోను జరిపించలేదు.

ఈ హత్యలు జరిగిన పద్ధతి మాకు అవగతం అయినట్టు వివరిస్తున్నాము. నిర్బంధించిన వారిని హింసించి చంపడంలో పాత్ర వున్నట్టుగా చెప్పబడే అధికారుల జాబితాను విడిగా కేంద్ర దేశీయాంగ శాఖామంత్రికి అప్పగిస్తున్నాము. వివిధ సాక్షుల పత్రాలను కూడ దేశీయాంగ శాఖ మంత్రికి అప్పచెపుతున్నాము.

ఆంధ్ర ప్రదేశ్‌లో "సాయుధ సంఘర్షణ"లని పేర్కొనబడిన వాటిలో పౌరులు చనిపోయిన ఉదంతాలన్నింటిపైనా విచారణ జరిపేందుకు న్యాయవిచారణ సంఘాన్ని నియమించాలని కూడ కోరుతున్నాము. ఈ సంఘటనలు న్యాయ విచారణకు తగినవనీ, అత్యవసర ప్రజాప్రాముఖ్యత కలవనీ చెప్పడంలో ఏ సందేహమూ లేదు.

మేము ఇంతవరకు సేకరించిన సాక్ష్యం, ఇకముందు సేకరించనున్న సాక్ష్యం మా మటుకు మేము విచారణ సంఘం ఏర్పాటు కాగానే ఆ సంఘానికి అప్పచెప్పడానికి సిద్ధంగా ఉన్నాము.

రెండు – మేము పేర్కొన్న పోలీసు అధికారులను విచారణ అయ్యేవరకు తాత్కాలికంగా ఉద్యోగం నుండి తొలగించినట్లయితే వారు సాక్ష్యాన్ని వమ్ముచేసే అవకాశం ఉండదు.

మూడు – విచారణ అనంతరం సంఘర్షణలు జరగడం అబద్ధమనీ, ఇవి కేవలం పచ్చి హత్యలని తేలితే మాత్రం అందుకు సంబంధించిన అధికారులందరినీ హత్యా నేరంపై విచారించి శిక్షించగలరని విశ్వసిస్తున్నాము.

నాలుగు – హత్యలు రుజువైతే మంత్రిత్వ స్థాయి బాధ్యత, మంత్రుల సమిష్టి బాధ్యత సూత్రాలను దృష్టిలో ఉంచుకొని అసలు ఖూనీకోరులు తప్పించుకోకుండా చూడగలరనీ, ఎవరో కొందరు జూనియర్ పోలీసు అధికారులను మాత్రమే దండించి సంతృప్తి పడరనీ విశ్వసిస్తున్నాము. ఒక్కసారికాదు పెక్కుసార్లు తను నక్సలైట్లను తుడిచి పారవేసినట్టు ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు చేసిన ప్రకటనలు గుర్తుంచుకోవాలి.

అయిదు – పోలీసులు వారిపై అఘాయిత్యం చేయకుండా సాక్షులకు రక్షణ కల్పించాలి. రక్షణ కొరకు మేము చేసిన విజ్ఞప్తిని పురస్కరించుకొని కొందరు సాక్షులు హైదరాబాదు కస్తూరీబా గాంధీ సేవాసంఘ ఆశ్రమానికి మారుతున్నారు. వారు ఓం ప్రకాశ్ గుప్త (సర్వోదయ నాయకుడు) కనుసన్నలలో ఉంటారు. వారు పోలీసుల నుండి సురక్షితంగా ఉండేట్టు చూడాలి.

విచారణ జరిపించడానికి మేము సేకరించిన సాక్ష్యం తగినంత ఉన్నదనే భావిస్తున్నాము.

ఒకవేళ కేంద్ర ప్రభుత్వం తక్షణం న్యాయవిచారణకు చర్యలు గైకొనకపోతే మేము మా విచారణను కొనసాగిస్తూ మేము సేకరించిన వివరాలను ఎప్పటికప్పుడు పత్రికలకు విడుదల చేస్తాము.

ఎట్లాగయినా మా దృష్టికి వచ్చిన 77 హత్యా సంఘటనలపై మేము విచారణ కొనసాగిస్తాము. న్యాయవిచారణ జరిగితే సాక్ష్యం అంతటినీ అంద చేస్తాము.

ఈ హత్యల గురించి తెలిసిన వారు ఆ సమాచారమంతా భయాన్ని వదిలి, ముందుకు వచ్చి మాకు తెలుప వలసిందిగా ఆంధ్ర ప్రదేశ్ ప్రజలకు కూడ మేము విజ్ఞప్తి చేస్తున్నాము.

ఈ పని వారు బహిరంగంగా చేస్తేనే వారికి క్షేమకరమని కూడ మేము విజ్ఞప్తి చేస్తున్నాము.

ప్రతి సందర్భంలో ఒక సాక్షి తనకు తెలిసిన సమాచారంపై సాక్ష్యం ఇస్తే అతనికి తగిన రక్షణ కల్పించవలసినదిగా మేము కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయగలము.

మా నివేదికలు సమర్పించే క్రమంలో అప్పటి ప్రధాన మంత్రి మొరార్జీ దేశాయినీ, హోం మంత్రి చరణ్‌సింగ్‌నూ చాలాసార్లే కలవవలసి వచ్చింది. మొరార్జీ దేశాయితో నా పరిచయం బాగా పెరిగింది. ఆయనతో ఈ విషయాలు మాట్లాడేటప్పుడు దీని మీద ఏం చేస్తే బాగుంటుందని చర్చ జరిగింది. ఎటువంటి విచారణ కమిషన్ వేస్తే ఉపయోగకరం అని మాట్లాడుకున్నాం.

నివేదికలు చదవగానే ఒక అధికారిక విచారణ కమిషన్ వేయవలసిందే అని మొరార్జీ దేశాయి నిర్ణయించారు. కాని అది సాధ్యమా కాదా చర్చించేందుకు హోం మంత్రిత్వ శాఖతో మాట్లాడమని మాకాయన సూచించారు.

ఇక మేం హోం మంత్రి చరణ్ సింగ్ దగ్గరికి వెళ్ళాం. ఆయన దగ్గర కూడ వివరంగానే సాధ్యాసాధ్యాలు మాట్లాడాం. ఆయనకు కూడ విచారణ కమిషన్ నియమించాలనే అభిప్రాయం ఉన్నప్పటికీ, అది కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి రాదు. అటువంటి కమిషన్‌ను నియమించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి మాత్రమే ఉంది.

రాజ్యాంగంలోని అధికరణం 21 ఉల్లంఘన జరిగితే, నిష్కారణంగా, చట్టబద్ధ ప్రక్రియ లేకుండా ప్రభుత్వ బలగాలు ప్రజల ప్రాణాలు తీస్తుంటే అది కేంద్ర పరిధిలోకి వస్తుందా, రాష్ట్ర పరిధిలోకి వస్తుందా అని చర్చ చేస్తారా అని మేం వాదించాం. ఇది కేవలం శాంతిభద్రతల సమస్య కాదు. అట్లా పరిగణించి అందువల్ల రాష్ట్ర జాబితాలోని అంశం అనడానికి వీలులేదు. ఇది హత్య. ఉద్దేశపూర్వకమైన హత్య. ప్రజల ప్రాణాలు తీయడం కనుక కేంద్రం జోక్యం చేసుకోవచ్చు అని మేం వాదించాం.

ఈ చర్చల తర్వాత వాళ్ళు ఒక రాజీ సూత్రం ప్రతిపాదించారు. కేంద్రం న్యాయ మూర్తి పేరు ప్రతిపాదిస్తుంది. ఆ న్యాయమూర్తిని రాష్ట్ర ప్రభుత్వం నియమించి విచారణ కొనసాగిస్తుంది. బహుశా అది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కుదిరిన రాజీ కావచ్చు.

* * * •

# జస్టిస్ భార్గవ కమిషన్

అట్లా మొరార్జీ దేశాయి, చరణ్‌సింగ్‌లు ఈ ఎన్‌కౌంటర్ హత్యలను విచారించే కమిషన్‌కు జస్టిస్ వశిష్ఠ భార్గవ నాయకత్వం వహిస్తారని సూచించారు. ఆయన పదవీ విరమణ చేసిన సుప్రీం కోర్టు న్యాయమూర్తి. ఉత్తర ప్రదేశ్‌కు చెందినవాడు.

ఆ సూచనను వెంగళరావు అంగీకరించాడు. అంగీకరించక తప్పలేదు. అట్లా రాష్ట్ర చరిత్రలోనే అసాధారణమైన విచారణ నిర్వహించిన భార్గవా కమిషన్ ఏర్పాటయింది.

ఆ రోజుల్లోనే మేం ఢిల్లీలో కనాట్ ప్లేస్‌లో ఒకరోజు భోజనానికి వెళ్ళాం. నేనూ అరుణ్ శౌరీ. అక్కడ హోటల్లో నాకోసం సత్యనారాయణ సింగ్ వేచి చూస్తున్నాడు. సత్యనారాయణ సింగ్ అంటే నక్సల్బరీ తరం బీహారీ పోరాట నాయకుడు. చారు మజుందార్‌తో విభేదించి మరొక పార్టీ పెట్టిన నాయకుడు. మార్క్సిస్టు లెనినిస్టులు కూడ ఎన్నికల రాజకీయాలలోకి రావాలని చెప్పి 1977-79 మధ్య అటు చరణ్ సింగ్‌కూ ఇటు విప్లవకారులకూ మధ్య మైత్రి కుదర్చడానికి ప్రయత్నించిన వాడు. 1980ల్లో చనిపోయాడు గాని 1970ల చివర ఆయనకు చాలా పెద్ద ఇమేజ్ ఉండేది.

మేం ఆ హోటల్‌లోకి వెళ్ళగానే అరుణ్ శౌరి నన్ను ఆయనకు పరిచయం చేశాడు. నేనాయనను చూడడం అదే మొదటిసారి. ఆయన అప్పటికింకా అజ్ఞాతవాసం లోనే ఉన్నాడో, బైటికి వచ్చాడో గుర్తులేదు. నన్ను పరిచయం చేయగానే ఆయనలేచి "కన్నబిరాన్, ప్రాసిక్యూటర్ ఆఫ్ ప్రాసిక్యూటర్స్" అని చెయ్యి కలిపాడు.

సరే, భార్గవ కమిషన్ ఏర్పాటయిందని నోటిఫికేషన్ వెలువడింది. దాని విచారణాంశాలు ఎట్లా ఉంటే బావుంటుందని చాలా చర్చ చేశాం. సూచనలు అందించాం.

జస్టిస్ భార్గవ తన విచారణ ప్రారంభించడానికి హైదరాబాదు వచ్చారు. దిల్‌కుషా గెస్ట్‌హౌస్‌లో కమిషన్ పని ప్రారంభమయింది. మొట్టమొదటి సమావేశానికి జస్టిస్ తార్కుండే వచ్చారు. జస్టిస్ భార్గవ ముందర మొట్టమొదటి వాంగ్మూలం ఇచ్చారు. ఆ తర్వాత ఒపిడిఆర్‌కు చెందిన న్యాయవాది వెంకటకృష్ణ ఒక ప్రకటన చేశారు. వర్గ సమాజంలో న్యాయం వర్గాతీతంగా ఉండదని, వర్గప్రయోజనాలకు లోబడే ఉంటుందని జస్టిస్ భార్గవకు చెప్పారు. ఆ కమిషన్ విచారణలో ఒపిడిఆర్ భాగస్వామ్యం ఆ ప్రకటనతో ముగిసిపోయింది.

ఆ తర్వాత ఒపిడిఆర్ కూడ రాష్ట్రంలో జరిగిన అన్ని ఎన్‌కౌంటర్ హత్యలను విచారించడానికి ఒక కమిటీని నియమించింది. ఆ కమిటీ వల్ల నాకు ఎన్నో చిక్కులొచ్చాయి. ఆ కమిటీ విచారణ శ్రీకాకుళంలో జరిగింది. మోహన్‌రామ్, రజనీ ఎక్స్‌దేశాయి మొదలయిన వాళ్ళు ఆ కమిటీలో ఉన్నారు.

సరే, భార్గవా కమిషన్ విచారణ ప్రారంభమయింది. ఆ విచారణ కమిషన్‌కు కార్యదర్శిగా బి.నరసింగరావును నియమించారు. బీనాదేవి పేరుతో ఎన్నో రచనలు చేసిన సున్నిత మనస్కుడైన జడ్జి ఆయన. ఆయన కార్యదర్శిగా 1977 జులై 21న భార్గవా కమిషన్‌కు సంబంధించిన తొలి బహిరంగ ప్రజా ప్రకటన వెలువడింది.

ఆ ప్రకటన ప్రకారం జస్టిస్ వశిష్ట భార్గవ నాయకత్వంలోని ఏకసభ్య కమిషన్ నాలుగు విచారణాంశాలను తన పరిధిలోకి తీసుకుంది. అవి:

1. నక్సలైట్ల కార్యకలాపాల వల్ల ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో, కొన్ని ప్రాంతాలలో ఏర్పడిన పరిస్థితి, ఆ కార్యకలాపాలతో, ఫలితాలతో వ్యవహరించేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలు, ఇచ్చిన ఆదేశాలు.

2. 1968 నుంచి 1977 వరకు పోలీసులకూ నక్సలైట్లకూ మధ్య జరిగిన ప్రతి ఒక్క ఎన్‌కౌంటర్ సంఘటన వాస్తవాలు, పరిస్థితులు.

3. నక్సలైటు ఖైదీలను హత్యచేశారని, క్రూర చిత్రహింసలకు గురిచేశారని వచ్చిన ఆరోపణలు.

4. భవిష్యత్తులో ఈ సమస్యతో వ్యవహరించడంలో తీసుకోవలసిన పాలనాపరమైన చర్యలు.

జస్టిస్ భార్గవ కమిషన్ విచారణ ప్రారంభించింది. తార్కుండే కమిటీ తరపున ఎం.వి.రామమూర్తి గారు, నేను హాజరయి వాదనలు వినిపించడం మొదలు పెట్టాం. పంచాగ్నుల సత్యనారాయణ కూడ మా వైపు నుంచి వాదనలు వినిపిస్తుండేవాడు. సత్యనారాయణ నాకు సహాయకుడిగా ఉంటాడని చెప్పాం.

వి.శివశంకర్‌ను ప్రభుత్వ ప్రతినిధిగా నియమించారు. ఆయన పని పోలీసు అధికారులను సమర్థిస్తూ వాదనలు వినిపించడం. అందుకు గాను ప్రజాధనం నుంచి రోజుకు పదిహేను వందల వేతనం ఖరారు చేశారు. ఆ రోజుల్లో అది చాలా పెద్ద మొత్తం. ఆయనతోపాటు పోలీసు శాఖ తన తరఫున కూడ ఒక న్యాయవాది కమిషన్‌కు సహాయకుడిగా ఉండాలని ఆశించింది. ఐజి రామచంద్రారెడ్డి తన శాఖ కోసం ఆ పదవి న్యాయవాది టి.అనంతబాబుకు దక్కేలా చూశారు. అనంతబాబుకు సహాయకుడిగా కె.కుళంద రెడ్డిని నియమించాలని రామచంద్రారెడ్డి ప్రయత్నించారు.

ఆ రోజుల్లో కమిషన్ పనులు, ఆ పనులపై మా ప్రతిస్పందనలు ఎంత వేగంగా జరుగుతుండేవో గుర్తుచేసుకుంటుంటే ఆశ్చర్యంగా ఉంటుంది. జులై 21న కమిషన్ ఏర్పాటయిందని ప్రకటన వస్తే పదిరోజులు తిరగకుండానే ఈ నియామకాలన్నీ జరిగిపోయాయి. ఈ నియామకాల్లో అనంతబాబు, కుళంద రెడ్డిల నియామకాలు చెల్లవని, దురుద్దేశ్య పూరితమైనవని ఎం.వి.రామమూర్తి గారు ఆగస్టు 5న కమిషన్ ముందు మెమొరాండం వేశారు.

అసలు కమిషన్‌కు సహాయకుల అవసరమే లేదని, జిల్లా జడ్జిగా పని చేసిన నరసింగరావు గారు కమిషన్ కార్యదర్శిగా ఉన్నారు గనుక సరిపోతుందని మేం వాదించాం.

అంతేగాకుండా, అనంతబాబు అంతకుముందు వరకూ రామచంద్రారెడ్డికి న్యాయసలహాదారుగా పనిచేశారనీ, అప్పటికీ పని చేస్తున్నారనీ చెపుతూ, హత్యలకూ, చిత్రహింసలకూ ప్రధాన బాధ్యత వహించవలసిన ఇన్‌స్పెక్టర్ జనరల్‌కు వ్యక్తిగత న్యాయ సలహాదారుగా ఉన్న వ్యక్తి ఈ కమిషన్‌కు సహకరించజాలడని మేం వాదించాం. అట్లాగే కుళంద రెడ్డి మరెవరో కాదు, రామచంద్రారెడ్డి సోదరుడే.

అందువల్ల ఆ ఇద్దరినీ ఆ పదవులనుంచి తొలగించాలని మేం కోరాం.

అట్లాగే కమిషన్ నిర్ధారణలు ఏమిటో తెలుసుకోవాలని ప్రజలలో చాలా ఆసక్తి ఉందని, అందువల్ల కమిషన్ ఒక్కొక్క ఘటన మీద విచారణ పూర్తి చేయగానే మధ్యంతర నివేదికలు తయారు చేసి బహిరంగంగా ప్రజల ముందు ఉంచాలని కూడ మేం వాదించాం.

ఈ మూడు వాదనలలో కేవలం కుళంద రెడ్డి విషయంలో మాత్రం ఆయన సహాయకుడిగా ఉండనవసరం లేదని జస్టిస్ భార్గవ భావించారు. అనంతబాబు సహాయకుడిగా కొనసాగారు. భార్గవ కమిషన్ విచారణలు మధ్యంతర నివేదికల దగ్గరికి రాకముందే ఆగిపోవలసి వచ్చింది.

పై మెమొరాండంలతో పాటు ఆ రోజుల్లోనే అంటే అగస్ట్ 5-9 ప్రాంతాలలోనే మేం సమర్పించిన మరొక రెండు మెమొరాండంల గురించి కూడ చెప్పాలి.

కమిషన్ విధివిధానాలకు సంబంధించిన మెమొరాండం ఒకటి, కమిషన్ ప్రకటించిన విచారణాంశాల వరుస క్రమాన్ని మార్చాలని కోరే మెమొరాండం ఒకటి కూడ మేం దాఖలు చేశాం.

ముప్పై సంవత్సరాలు గడిచిపోయిన తర్వాత ఆ రెండు మెమొరాండంలను చదువుతుంటే వాటి చారిత్రక ప్రాధాన్యత తెలిసి వస్తోంది.

అగస్ట్ 9, 1977న జస్టిస్ భార్గవకు సమర్పించిన మెమొరాండం ఆన్ ప్రొసీజరల్ మాటర్స్ ఆరు ప్రధానమైన అంశాల గురించి ప్రస్తావించింది. ఏ అత్యాచారాల ఆరోపణల గురించి కమిషన్ విచారణ జరుపుతున్నదో, ఆ అత్యాచారాలు జరిపిందనే ఆరోపణ ఉన్న ప్రభుత్వం ఇంకా పాలన చలాయిస్తుండడం వల్ల కమిషన్ విచారణకు అవరోధాలు ఏర్పడే అవకాశం ఉన్నదని మేం ఆ మెమొరాండంలో రాశాం. నిజానికి ఐదారు నెలలు తిరగకుండానే మా సందేహాలు రుజువయిపోయాయి.

ఆ అవరోధాలు కమిషన్ పని అడ్డుపడకుండా ఉండాలంటే ఆరు రంగాల మీద దృష్టి పెట్టాలని మేం సూచించాం. అవి:

1. విశ్వసనీయత. 2. విచారణాంశాలలో ప్రాధాన్యతలు నిర్ణయించడం. 3.హత్యలు,

చిత్రహింసల ఘటనల విచారణాక్రమం. 4. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు యథాతథంగా కొనసాగడం. 5. మధ్యంతర నివేదికల ప్రచురణ ఆవశ్యకత. 6. అవసరమైన అధికారిక పత్రాల సేకరణ.

అప్పటికే కమిషన్ బహిరంగ ప్రకటన ద్వారా సాక్షుల వాంగ్మూలాలను ఆహ్వానించింది. కాని ఆ సాక్షులకూ, వాంగ్మూలాలకూ ఎటువంటి రక్షణ కల్పించాలో నిర్ధారించుకోలేదు. అందువల్ల సాక్షుల పేర్లుగాని, వాంగ్మూలాలలో ఉన్న విషయాలు గాని రాష్ట్ర ప్రభుత్వానికి, దాని అధికారులకు తెలిసిపోతే సాక్షులను బెదిరించవచ్చు. సాక్ష్యాలను తారుమారు చేయవచ్చు. వాంగ్మూలాలను మార్చడానికి, సంబంధిత వాస్తవ రికార్డులను ధ్వంసం చేయడానికి ప్రయత్నించవచ్చు. అందువల్ల సాక్షులు చెప్పే విషయాలకు రక్షణ కల్పిస్తామని, రహస్యంగా ఉంచుతామని కమిషన్ హామీ ఇవ్వాలని మేం వాదించాం.

ఈ వాదనకు మద్దతుగా మేం భిక్షపతి అనే కీలక సాక్షి ఉదంతాన్ని ఉటంకించాం. భిక్షపతి సాక్ష్యం చాల కీలకమైనది, అరుదైనది. ఆయన సాక్ష్యాన్ని 1977 జులై 30న మేం రికార్డు చేశాం. తెలుగులో ఆయన సాక్ష్యం చెపుతుండగా తార్కుండే కమిటీ సభ్యులయిన అరుణ్ శౌరి, కాళోజీ నారాయణరావు విని, రికార్డు చేసుకున్నారు. ఈ రికార్డు చేసుకున్న సందర్భంలో హనుమకొండకు చెందిన ఇద్దరు న్యాయవాదులు పి. విఠల్ రావు, ఎస్. శంకరయ్య, విప్లవ కవి, కళాశాల అధ్యాపకుడు పి. వరవరరావు కూడ సాక్షి సంతకాలు చేశారు.

ఈ భిక్షపతి సాక్ష్యంలో రెండు భాగాలున్నాయి. అవి రెండూ వివరంగా పరిశీలించాలి.

మొట్టమొదటిది, హనుమకొండకూ కాజీపేటకూ మధ్యన ఉన్న వడ్డెపల్లి గ్రామానికి చెందిన 24 సంవత్సరాల యెదులాపురం భిక్షపతి గిరాయిపల్లి హత్యలకు ప్రత్యక్షసాక్షి. గిరాయిపల్లి అడవులలో జనార్దన్, మురళీమోహన్, ఆనందరావు, సుధాకర్‌లను తన కళ్ళముందే చెట్లకు కట్టి కాల్చి చంపారని భిక్షపతి చెప్పాడు. తార్కుండే కమిటీ ప్రాథమిక విచారణలో ఆయన ఈ మేరకు వాంగ్మూలం నమోదు చేయించాడు.

అంత ముఖ్యమైన వాంగ్మూలం చెప్పినందువల్ల ఆయన ప్రాణాలకు భద్రత లేదని భావించి, తార్కుండే కమిటీ ఆయనకు హైదరాబాదులో ఆశ్రయం కల్పించింది. కాని రోజువారీ కూలీగా పనిచేసే భిక్షపతి, హైదరాబాదులో ఉండలేక, తిరిగి వడ్డెపల్లికి వెళ్ళిపోయాడు. అప్పుడు వరంగల్‌లో జనతా పార్టీ నాయకుడిగా ఉండిన పి. శంకరయ్య సహాయంతో ఆయన జిల్లా కలెక్టర్‌ను కలుసుకున్నాడు. ఆయన అంతకు ముందు అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టిన పోలీసు అధికారి షమీమ్ వల్ల తనకు ప్రాణభయం ఉందని, రక్షణ కల్పించమని కలెక్టర్‌ను వేడుకున్నాడు. కలెక్టర్ జిల్లా ఎస్‌పితో మాట్లాడి భిక్షపతికి

రక్షణ ఏర్పాట్లు కల్పించాడు. భిక్షపతి సురక్షితంగా ఉన్నాడో లేడో నిర్ధారించు కునేందుకు ప్రతిరోజు కలెక్టర్ కార్యాలయానికి వచ్చి రెవెన్యూ అసిస్టెంట్ దగ్గర సంతకం చేయాలని చెప్పాడు. ఈ ఏర్పాటు 1977 మే 6న మొదలయింది. ఆ తర్వాత వారం రోజులకే ఇద్దరు పోలీసు అధికారులు భిక్షపతి ఇంటికి వెళ్ళి, అయన తార్కుండే కమిటీ ముందర సాక్ష్యం చెప్పినందుకు, జనార్ధన్ ఎన్‌కౌంటర్ కేసును తవ్వి తీయడానికి సహకరిస్తున్నందుకు మూల్యం చెల్లించవలసి ఉంటుందని హెచ్చరించారు.

అప్పటి నుంచి జులై 26 దాకా ఇటువంటి వేధింపులు సాగుతూనే ఉన్నాయి. చివరికి జులై 26న - అంటే భార్గవ కమిషన్ ప్రకటన వెలువడిన తర్వాత - పోలీసు అధికారులు భిక్షపతి ఇంటికి వెళ్ళి సాక్ష్యం చెప్పకుండా ఉంటే ఇరవై వేల రూపాయలు ఇస్తామని, ఉద్యోగం ఇప్పిస్తామని ఆకర్షణలు చూపారు. సాక్ష్యం చెప్పవద్దని బెదిరించారు.

ఈ విషయాలన్నిటినీ భిక్షపతి జులై 30న మరో వాంగ్మూలంలో ప్రకటించాడు. ఇది రెండో వాంగ్మూలం. మేం జస్టిస్ భార్గవకు ఈ రెండో వాంగ్మూలం అందజేశాం. ఈ కారణం వల్ల సాక్షుల రక్షణ బాధ్యతను తీసుకోవాలని, తాము చెప్పే సాక్ష్యం రహస్యంగా ఉంటుందనే నమ్మకం కలిగించాలని కమిషన్‌ను కోరాం.

ఇక రెండవ అంశం, విచారణాంశాల ప్రాధాన్యతలను నిర్ణయించడం. కమిషన్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నాలుగు విచారణాంశాలను నిర్దేశించింది. ఆ విచారణాంశాలు నక్సలైటు ఉద్యమం ఆవిర్భావం దగ్గరి నుంచి భవిష్యత్ సూచనల దాకా అనేక అంశాలను తమలో ఇముడ్చుకున్నాయి.

ఇంత విస్తృతమైన అంశాలను చర్చించే పనికి పూనుకోవడం చాలా ఆహ్వానించ దగిన పరిణామమే. కాని అసలు ఈ కమిషన్ ఏర్పాటుకు కారణం కొన్ని చట్ట వ్యతిరేక హత్యల పట్ల ప్రజలలో వెల్లువెత్తిన ఆందోళన. అందువల్ల ఆ ఆందోళనకు కారణమైన హత్యలనూ, అత్యాచారాలనూ, చిత్రహింసలనూ విచారించడం మొట్టమొదటి లక్ష్యం కావాలి.

ఇవి హత్యలా, ఎదురు కాల్పులా, ఆత్మ రక్షణార్థం జరిపిన కాల్పులలో సంభవించిన మరణాలా అనేది మొట్టమొదట తేల్చవలసి ఉంటుంది. అవి హత్యలే అయితే బాధ్యులు, హంతకులు ఎవరో తేల్చవలసి ఉంటుంది. ఈ రెండు పనులూ తక్షణమే జరపాలి. అందువల్ల విచారణాంశాలు నాలుగింటిలో ఇది ప్రధానాంశం కావాలని, ప్రాధాన్యతలు మార్చాలని మేం కమిషన్‌కు సూచించాం.

మా మెమొరాండంలో మేం లేవనెత్తిన మూడో అంశం చాలా ముఖ్యమైనది. హత్యలు, చిత్రహింసల ఘటనల విచారణలో వరుసక్రమం ఎట్లా ఉండాలనే విషయం అది. అప్పటికి మాకు అందిన సమాచారం ప్రకారం 1969 నుంచి 1976-77 వరకు ఎదురుకాల్పుల (ఎన్‌కౌంటర్) సంఘటనలుగా చెప్పబడిన వాటిలో మొత్తం 250కి పైగా వ్యక్తులు

మరణించారు. ఈ మొత్తం ఘటనలలో 19 మంది నక్సలైట్ల మృతికి సంబంధించిన సాక్ష్యాధారాలను తార్కుండే కమిటీ సేకరించింది. మరొక 70-80 మంది నక్సలైట్ల హత్యకు సంబంధించి మా దగ్గర ప్రాథమిక సాక్ష్యాధారా లున్నాయి. ఇతర సంస్థల దగ్గర కూడ మరికొంత సమాచారం ఉండవచ్చును.

అందువల్ల, విరివిగా సమాచారం లభ్యమవుతున్న ఘటనలపైనే విచారణ ప్రారంభించడం కమిషన్ పనిని సులభతరం చేస్తుంది. అంతేగాక, ఈ ఘటనలకు సంబంధించి సాక్ష్యాధారాల సేకరణ పనిని అప్పగించడానికి విశ్వసనీయమైన ప్రభుత్వ సంస్థ ఏదీలేదు గనుక, ఈ పనికి సంస్థలనో, గడువులనో విధించడం సాధ్యం కాదు. కనుక విచారణ జరిగే క్రమానికి నిర్దిష్ట సమయవ్యవధిని పాటినంచనక్కరలేదని మేం సూచించాం.

మా నాలుగో ప్రతిపాదన రాష్ట్ర ప్రభుత్వాన్ని, ప్రభుత్వాధికారులను యథాతథంగా కొనసాగించవచ్చునా అనేది. ప్రభుత్వాధికారుల పైన చిత్రహింసలు చేశారనీ, హత్యలు చేశారనీ ఆరోపణలు వచ్చాయి. ఇంత తీవ్రమైన అభియోగాలు ఉన్నప్పుడు ఆ అధికారులు గాని, ప్రభుత్వం గాని సాక్ష్యాధారాలను మాయం చేసే, తారుమారు చేసే అవకాశాలు ఎక్కువ. ఆ అధికారులే ఇంకా పదవులలో, నిర్ణయాధికారంలో ఉంటే ఆ అవకాశాలు ఇంకా పెరుగుతాయి.

గతంలో ఏర్పాటయిన విచారణ కమిషన్‌లు ఏవయినా అప్పుడు అధికారంలో లేని ముఖ్యమంత్రుల మీద, మంత్రుల మీద, అధికారుల మీద విచారణలు జరిపాయి. అది దృష్టిలో ఉంచుకుని, ప్రస్తుత కమిషన్ విచారణ జరుగుతున్నప్పుడు, ఆ ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులను ఉద్యోగాల నుంచి సస్పెండ్ చేయాలని ప్రతిపాదించాం.

ఒకవేళ సస్పెన్షన్ సాధ్యంకాదని అనుకుంటే కనీసం విచారణను ఎదుర్కొంటున్న ఐపిఎస్ అధికారులను రాష్ట్రం బైటికి, ఇతర అధికారులను జిల్లాలకు బదిలీ చేయాలని మేం సూచించాం. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం ఆ పని చేయకపోతే, అసలు రాష్ట్ర ప్రభుత్వం కొనసాగడం విచారణకు ఆటంకమవుతుందేమో ఆలోచించాలని కూడ మేం సూచించాం.

మా ఐదో ప్రతిపాదన మధ్యంతర నివేదికలు వెలువరించడం గురించినది. కమిషన్ గనుక తాను విచారిస్తున్న ఎన్‌కౌంటర్ల గురించి మధ్యంతర నిర్ధారణలకు వచ్చినట్టయితే, ఆ నిర్ధారణలను బైటికి ప్రకటించడం మంచిదని మేం సూచించాం. అట్లాంటి బహిరంగ ప్రకటనల వల్ల ఎంతోమంది సంకోచిస్తున్న సాక్షులకు నైతిక ధృతి కలుగుతుందని, ఈ కమిషన్ సత్యాన్ని వెలికి తీయడంలో సరైన పని చేస్తుందనే నమ్మకం కలుగుతుందని మేం సూచించాం.

మా ఆరో ప్రతిపాదన సేకరించవలసిన ప్రభుత్వ, అధికారిక పత్రాల గురించినది. అప్పటికి కమిషన్ పత్రికా ప్రకటన ద్వారా సాధారణ ప్రజానీకం నుంచి సాక్ష్యాధారాల

సేకరణ ప్రారంభించింది. కాని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించవలసిన సమాచారం, అధికారిక పత్రాలు, సాక్ష్యాధారాల ప్రస్తావన ఆ ప్రకటనలో లేదు. అందువల్ల కమిషన్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కొన్ని డాక్యుమెంట్లు అడగాలని, ప్రభుత్వాలు అవి ఇవ్వకపోతే అధికారికంగా స్వాధీనం చేసుకోవాలని మేం సూచించాం.

మేం ఆ మెమొరాండంలో పొందుపరచిన అధికారిక పత్రాల జాబితా ఇది:

- నక్సలైటు సమస్య గురించి భారత ప్రభుత్వ పత్రాలు
- ఈ విషయంలో పోలీసు శాఖకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశపత్రాలు
- ఈ సమస్యతో వ్యవహరించే పోలీసు అధికారుల సమావేశాల కార్యక్రమ వివరణలు
- గత మూడు సంవత్సరాలలో (ప్రత్యేకించి గత మూడు నెలలలో) జరిగిన పోలీసు అధికారుల బదిలీలు, నియామకాలు.
- 1969 నుంచి 1977 వరకు ఆంధ్ర ప్రదేశ్ పోలీసు సిబ్బందికి ప్రకటించిన పారితోషికాలు, ఆ పారితోషికాలకు కారణాలు.
- ఎన్‌కౌంటర్లు జరిగాయని చెప్తుతున్న జిల్లాలలో 1967-1977 కాలంలో పోలీసు అధికారుల ప్రయాణభత్యం, రోజువారీ భత్యాల బిల్లులు.
- ఎన్‌కౌంటర్లుగా చెపుతున్న సంఘటనలకు సంబంధించిన మృతదేహాల శవపరీక్ష నివేదికలు, పంచనామా నివేదికలు.
- 1968-77 కాలంలో నక్సలైట్లతో జరిగాయని చెపుతున్న ఎన్‌కౌంటర్‌లలో భాగం పంచుకున్న పోలీసు అధికారులు గత రెండు సంవత్సరాలలో ఎక్కడెక్కడికి వెళ్ళారో చెప్పే నివేదికలు.
- 1968-77 కాలంలో ముఖ్యమంత్రి, ప్రధాన కార్యదర్శి, ఇనస్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, డిప్యూటీ ఇనస్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌ల టెలిఫోన్ బిల్లులు.
- ములుగు-గజ్వేల్-సిద్ధిపేట-హైదరాబాదుల మధ్య, విజయవాడ-ఖమ్మంల మధ్య, ఎల్లందు-హైదరాబాదుల మధ్య, శ్రీకాకుళం-హైదరాబాదుల మధ్య నడిచిన వైర్‌లెస్ సందేశాలకు సంబంధించిన అన్ని రిజిస్టర్లు, అన్ని రికార్డులు.

హైదరాబాద్ నగరానికి, మెదక్, వరంగల్, ఖమ్మం, కృష్ణా, గుంటూరు జిల్లాలకు సంబంధించిన పోలీసు వాహనాల రాకపోకలు రికార్డు చేసే లాగ్ బుక్స్.

ఈ పత్రాలన్నీ వెంటనే కమిషన్ స్వాధీనం చేసుకోవాలని, సంబంధిత శాఖలను వెంటనే అప్పగించమని ఆదేశించాలని, అవి కమిషన్‌కు చేర్చడానికి మధ్యవర్తిగా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఉండడానికి కూడ వీలులేదని మేం ఆ మెమొరాండంలో రాశాం.

ఆ మెమొరాండంలో రెండు మూడు అంశాలను మాత్రం కమిషన్ ఆమోదించింది. సాక్షులకు రక్షణ కల్పించవలసిన అవసరం ఉందని, విచారణాంశాలను అటూ ఇటూ మార్చి ఎన్‌కౌంటర్ ఘటనల నిజానిజాలు ముందుగా విచారించవచ్చునని కమిషన్

అంగీకరించింది. ఐతే మా చివరి డిమాండ్ అయిన అధికారిక పత్రాల సేకరణకు, స్వాధీనానికి పోలీసులు అడ్డుపడ్డారు. ప్రభుత్వ న్యాయవాది అది సాధ్యం కాదన్నాడు. ఆ పత్రాలలో ఏ ఒక్కటి దొరికినా ఎన్‌కౌంటర్లు ఎంత బూటకమో, ప్రజాధనాన్ని, ప్రజలు ఇచ్చిన అధికారాన్ని పోలీసులు ఎట్లా దుర్వినియోగం చేస్తున్నారో బయటపడేది.

జస్టిస్ భార్గవా కమిషన్ ఏ విచారణ కొరకు నియమించబడిందో అది పూర్తి కాకుండానే తన పని మూసివేసుకోవలసి వచ్చింది. అది ఒక విషాద పరిణామం. కాని జరిగిన కొద్ది కాలమయినా భార్గవా కమిషన్ ప్రజల ముందుకు అవసరమైన వాస్తవాలను తీసుకువచ్చింది.

సరే, భార్గవా కమిషన్ విచారణ ప్రారంభమయింది. కమిషన్ కొందరు నిపుణులను కూడా నియమించుకుంది. వాళ్ళు ఆయారంగాలలో నిష్ణాతులన్నమాట. ప్రకాశరావు అనే చేతిరాత నిపుణుడు. ఆయన కూడ శివశంకర్‌కు సహాయకుడిగా ఉండాలి. అట్లాగే మరికొందరు.

మొత్తం మీద మా తరఫున 25 మంది సాక్షులు. ప్రభుత్వం తరఫున మరికొందరు సాక్షులున్నారు. ఇదంతా గిరాయిపల్లి ఎన్‌కౌంటర్‌కు సంబంధించి.

మా మొట్టమొదటి సాక్షి చల్లా నరసింహారెడ్డి, ఆయన సిద్దిపేటలో న్యాయవాదిగా పనిచేస్తుండేవాడు. ఆయన తన వాంగ్మూలం చాలా బాగా ఇచ్చాడు. క్రాస్ ఎగ్జామినేషన్ మొదలయింది. ప్రకాశరావు క్రాస్ ఎగ్జామినేషన్ చేయడం మొదలు పెట్టినాడు. నరసింహా రెడ్డి ఆయనను చీల్చి చెండాడాడు. నిజంగా ఆ రోజు నరసింహా రెడ్డి వ్యవహారం అద్భుతంగా ఉండింది.

అప్పుడు మాకు పెద్ద సమస్య, సాక్షులను కాపాడడం ఎట్లా అనేదే. సాక్షులను తీసుకురావడం, వారిచేత సాక్ష్యం చెప్పించడం, ఆ తర్వాత పోలీసులు వారిని ఎత్తుకు పోయి బెదిరించి సాక్ష్యాలు తారుమారు చేయకుండా కాపాడడం-ఇదంతా పెద్దపనిగా ఉండేది. మేం మా సాక్షులతో ఒక్క అబద్ధం కూడ చెప్పించలేదు. నేను మామూలుగానే కోర్టులో. చెపుతూ ఉంటాను - నిజం చెప్పేటట్టయితే ఎన్నిసార్లు చెప్పినా, ఎంతమంది ముందర చెప్పినా, ఎందరు క్రాస్ ఎగ్జామిన్ చేసినా ఒక్కలాగానే ఉంటుంది. అది అబద్ధమయితేనే ఒకసారికీ మరోసారికీ మారిపోతుంది. ఒకరి ముందర చెప్పినట్టు మరొకటి ముందర చెప్పలేం. క్రాస్ ఎగ్జామినేషన్‌లో బైటపడిపోతాం.

మేం ప్రవేశపెట్టిన సాక్షులందరూ నిజాలు చెప్పేవాళ్ళే. కాని వాళ్ళను పోలీసుల దాడికి గురికాకుండా కాపాడడం కష్టం. గిరాయిపల్లి ఘటనకు సంబంధించి మాకు సాక్ష్యాధారాలన్నీ సేకరించి పెట్టినవాడు రాజ్‌కుమార్. ఆయన అప్పుడు వరంగల్ రీజనల్ ఇంజనీరింగ్ కాలేజి విద్యార్థి. రాడికల్ విద్యార్థి సంఘం నాయకుడిగా ఉండేవాడు. ఆయన మా దగ్గరికి సాక్షులను తీసుకురావడమో, సాక్షుల గురించి చెప్పడమో చేసేవాడు.

అప్పుడు సిపిఐ(ఎం) శాసనసభ్యుడిగా ఉండిన ఎం. ఓంకార్ కూడ భార్గవా కమిషన్ విచారణలో చాల ఆసక్తి చూపి, చాలా సహకరించాడు. రాజ్‌కుమార్ మా ఇంటికి సాక్షులను తీసుకుని వచ్చేవాడు. రాత్రి తొమ్మిది, తొమ్మిదిన్నర, పది – ఆ సమయానికి తీసుకొచ్చేవాడు. సాక్షులు పోలీసుల కంట పడకుండా ఉండడానికి మేం తీసుకున్న జాగ్రత్త అది. ఫలానావాళ్ళు సాక్ష్యం చెప్తున్నారు అని పోలీసులకు తెలిసిందంటే ఆ సాక్షుల భద్రతకు ముప్పు వాటిల్లినట్లే. ఒక సాక్షిని పోలీసులు ఎంతగా వేధించారో తర్వాత చెపుతాను.

రాజ్‌కుమార్ సాక్షులను తీసుకొచ్చి మా ఇంట్లో వదిలేవాడు. మా ఇల్లు అప్పుడు దోమలగూడాలో ఉండేది. అది చాలా చిన్న ఇల్లు. అదే నా ఇల్లుగానూ, ఆఫీసు గానూ ఉండేది. ఇంటినిండా కిటకిటలాడుతూ బంధువులు, పిల్లలు ఉంటుండేవాళ్ళు. సాక్షులు కూడ అక్కడే అట్లాగే ఉండేవాళ్ళు. సాక్షుల తొలి విచారణ అక్కడే జరిపేవాణ్ణి. ఆ సాక్షులందరూ పూర్తిగా నిజాలే చెపుతున్నారని నాకు అప్పుడే విశ్వాసం కలిగింది.

'మీకు తెలిసినది చెప్పండి' అని గనుక సాక్షులనడిగితే ఎంత గట్టి క్రాస్ ఎగ్జామినేషన్ లోనయినా వాళ్ళను ఇబ్బంది పెట్టడం సాధ్యం కాదు. కాని మామూలుగా న్యాయవాదులు తమ సాక్షులకు ఏం చెప్పాలో, ఏం చెప్పగూడదో బోధిస్తూ ఉంటారు. తెలిసినది ఎట్లా ఉన్నా, బోను ఎక్కి ఏం చెప్పవలసి ఉంటుందో, ఏ ప్రశ్నకు ఏ జవాబు చెప్పాలో నేర్పుతూ ఉంటారు. అట్లా బోధించినప్పుడు, నేర్పినప్పుడు ఆ సాక్షులు క్రాస్ ఎగ్జామినేషన్‌లో తొట్రుపడుతూ ఉంటారు. న్యాయవాది చెప్పినట్టుగా జరుగలేదు గనుక న్యాయవాది చెప్పింది మరిచిపోతారు. ఒకదాని కొకటి పొంతన లేకుండా మాట్లాడుతారు.

మా సాక్షులందరూ అట్లా తమకు తెలిసిన నిజాలు, జరిగింది జరిగినట్టు చెప్పేవాళ్ళే గనుక నాకు వాళ్ళకు నేర్పించే పనేమి ఉండేదికాదు. మీరు అక్కడ బోనెక్కి మీకు తెలిసిందంతా చెప్పండి అనేవాణ్ణి.

నేను, రామమూర్తి గారు నేరుగా విచారణ కమిషన్ దగ్గరికి వెళ్ళేవాళ్ళం. శివశంకర్ చాలా సమర్థుడైన, చెప్పుకోదగిన క్రాస్ ఎగ్జామినేషన్ చెయ్యగలిగిన న్యాయవాదేమీ కాదు. సాక్షి వాంగ్మూలం చదివి, దాంట్లో ఏదో ఒక వాక్యం తీసుకుని, 'మీరు ఇట్లా అన్నారు. ఇది అబద్ధమని నేనంటాను, మీరేమంటారు' అని ప్రశ్నించడమే ఆయనకు తెలిసింది.

ఈ విచారణలో నాకు అసలు మన న్యాయవిచారణలో ప్రాసిక్యూషన్ ఎందుకు విఫలమవుతున్నదో తెలిసి వచ్చింది. ఇన్‌స్పెక్టర్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఒక నేరం గురించి ఎట్లా చెపితే హేతుబద్ధంగా, పకడ్బందీగా ఉంటుందో ఆలోచిస్తారు. పెద్ద వ్యూహం తయారు చేస్తారు. తమ వాదనలను సాక్షుల నోటివెంట చెప్పించడానికి ప్రయత్నం చేస్తారు. కాని సాక్షులు, మామూలు మనుషులు ఎవరయినా, తాము చూసింది చూసినట్టు చెప్పమంటేనే వాస్తవం చెప్పగలరు. ఆ సంఘటనను తాము చూడకపోతే ఏమీ చెప్పలేరు. ఎంత గొప్ప న్యాయవాది బోధించినా జరిగేది ఇదే.

మన ప్రాసిక్యూషన్ సాక్షులలో చాలమంది సాక్ష్యం చెప్పకుండా ఎదురు తిరిగేది, హోస్టేయిల్‌గా మారేది ఇందువల్లనే. వారికేదో హోస్టేయిల్‌గా మారుదామనే కోరిక ఉండడం వల్ల కాదు. జరిగిందేమిటో వారికి .తెలియకపోవడం వల్ల, జరిగింది జరిగినట్టుగా కాకుండా మరోరకంగా చెప్పమని ప్రాసిక్యూటర్ బోధించినందువల్ల.

ఈ పరిస్థితుల వల్లనే సాక్షులు 25 మందిలో ఏ ఒక్కరిని కూడ శివశంకర్ ఇబ్బంది పెట్టలేకపోయాడు.

ఇంకో విషయం ఏమంటే, భార్గవా కమిషన్ విచారణ జరిగినన్ని రోజులూ, ముఖ్యంగా గిరాయిపల్లి ఎన్‌కౌంటర్ విచారణ జరిగినప్పుడు, మా సాక్షి వాఙ్మూలం ఇవ్వగానే, ఇచ్చినరోజే శివశంకర్ క్రాస్ ఎగ్జామినేషన్ జరిపేవాడు కాదు. మర్నాడు క్రాస్ ఎగ్జామినేషన్ చేస్తానని, అనుమతి ఇవ్వమని కోరేవాడు.

నేనెప్పుడూ అట్లా సమయం తీసుకునే వాణ్ణికాదు. మామూలుగా అన్ని కోర్టుల లోనూ అట్లా సమయం ఎందుకు తీసుకుంటారంటే, ఆ రోజంతా న్యాయవాది ఆ సాక్షిని కూచోబెట్టుకుని, మర్నాడు ఏ ప్రశ్నలు రాబోతాయో, వాటికి ఎట్లా జవాబు చెప్పాలో తయారు చేస్తారు.

మొత్తం మీద భార్గవా కమిషన్ విచారణ నా వరకు నాకు గొప్ప అనుభవం. నేను ఆ విచారణ నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. ఆ విచారణలో భాగమైన సాక్షుల వాంగ్మూలాల గురించి, క్రాస్ ఎగ్జామినేషన్ గురించి మరోసారి వివరంగా చెపుతాను.

ఈలోగా ఒక వింత సంఘటన గురించి చెప్పాలి. భార్గవా కమిషన్ విచారణలో భాగంగా గిరాయిపల్లి ఘటన గురించి సాక్ష్యాలన్నీ దాదాపుగా పూర్తయిపోయాయి. టి.కామేశ్వరరావు అని స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ విచారణ మాత్రం మిగిలి ఉండింది.

నాకు, విచారణకు కూడా సహాయం చేసే ఉద్దేశ్యంతో సీనియర్ జర్నలిస్టు మిత్రుడు ఆదిరాజు వెంకటేశ్వరరావు ఒకపని చేశాడు. నాకు సహాయం చేయాలనే అయన కోర్కె నిజాయితీతో కూడిందే. ఆయన కామేశ్వర్‌రావును కలిసి, తాగబోయించి, కామేశ్వరరావుతో కావలసిన విషయాలు మాట్లాడించి రికార్డు చేశాడు. తాను మాట్లాడేవి రికార్డు అవుతున్నాయని కామేశ్వరరావుకు తెలియదు. తప్పతాగిన స్థితిలో, లోలోపల దాచుకున్న నిజాలు చెప్పేశాడు.

ఆదిరాజు వెంకటేశ్వరరావు నాకు ఆ టేపులు ఇచ్చినప్పుడు, నేను వాటిని ఒక సాక్ష్యాధారంగా కమిషన్‌కు సమర్పించాను. అసలది తనగొంతే కాదని కామేశ్వరరావు అన్నాడు.

ఆ టేపుల వ్యవహారం చాలా రోజులు జరిగింది. కెఎస్ గోపాల్, శశి వంటి మిత్రులు ఆ టేపుల మీద చాల పనిచేశారు. గంటలకు గంటలు కూచుని ఆ టేపులు ముందుకూ వెనక్కూ ప్లే చేస్తూ వింటూ, అవసరమయిందల్లా రాసుకుంటూ ఉండేవారు.

భార్గవా కమిషన్ విచారణకు చాలమందే హాజరవుతూ ఉండేవారు. రమిజాబీ సంఘటనపై విచారణ జరిపిన ముక్తధర్ కమిషన్ విచారణకు వేలాదిగా హాజరయ్యే వారు. దానితో పోలిస్తే భార్గవా కమిషన్‌కు హాజరయ్యే వాళ్ళు తక్కువే. కాని మొత్తం మీద భార్గవా కమిషన్ విచారణ చాల బాగా జరిగింది.

జస్టిస్ భార్గవ చాల నిజాయితీపరుడు. చాల సూటిగా మాట్లాడేవాడు. ఆయనకు ఐసిఎస్ ఉండేది. జడ్జీగా, జిల్లా జడ్జిగా, హైకోర్టు జడ్జిగా, సుప్రీం కోర్టు జడ్జీగా పని చేశాడు.

విచారణ జరిగేటప్పుడు, ఆ విచారణ విషయాలను పత్రికల్లో చదివి కొండయ్య అనే వ్యక్తి తన వాంగ్మూలం, ఇస్తానని వచ్చాడు. ఆ వాంగ్మూలం, కొండయ్య విషయం లో పోలీసులు ప్రవర్తించిన పద్ధతి తప్పకుండా చర్చించవలసినవి.

వల్లభనేని కొండయ్య అనే ఆ యువకుడు పూనాలో బజాజ్ ఆటోమొబైల్స్ కంపెనీలో ఫిట్టర్‌గా పనిచేస్తుండేవాడు. ఆయన హైదరాబాద్‌లో బాలనగర్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్స్‌లో చదువుకుంటూ, బైట గది తీసుకొని ఉంటుండే వాడు. గిరాయిపల్లిలో చంపేసిన మురళీమోహన్ రెడ్డిని, ఆనందరావును కొండయ్య గదిలోనే పట్టుకున్నారు. కొండయ్యను కూడ అరెస్టు చేసి కొన్నాళ్ళ నిర్బంధం తర్వాత వదిలేశారు. ఆ తర్వాత ఆయన పూనా వెళ్ళి ఉద్యోగంలో చేరాడు.

భార్గవా కమిషన్ విచారణ గురించి పత్రికల్లో చదివిన తర్వాత, కొండయ్యకు తనకు తెలిసిన విషయాలు కమిషన్‌కు చెప్పాలని అనిపించింది. మురళీమోహన్, ఆనంద్‌రావులను పోలీసులు పట్టుకు పోయారనడానికి నమ్మకమైన సాక్ష్యం అది.

కొండయ్య పత్రికల్లో వార్తలు చదివి నేరుగా నా దగ్గరికి వచ్చాడు. తనతోపాటు గదిలో ఉండి, అరెస్టు చేయబడిన వ్యక్తులు చంపెయ్యబడినందుకు, ఆ ఘటనను ఎన్‌కౌంటర్‌గా చూపుతున్నందుకు కొండయ్యకు విచారం కలిగింది. పశ్చాత్తాప పడడం మొదలు పెట్టాడు. తన ఏమీ చేయలేకపోయానని ఆయన విచారపడ్డాడు.

కొండయ్య నా దగ్గరికి రావడానికి ముందు మా ఇంట్లో కొందరు సాక్షులు ఉన్నారు. అది చలికాలం అనుకుంటాను. వారిలో ఒకరి ఒంటిమీద అంగీలేదు. నేను నా అంగీ ఒకటి ఇచ్చి తొడుక్కోమన్నాను. ఆ రాత్రిపూట ఆయన మూత్రానికో, చుట్ట తాగడానికో బైటికిపోతే పోలీసు జీపులో వేసుకునిపోయారు.

మర్నాడు శివశంకర్ కమిషన్ ముందర 'కన్నబిరాన్ సాక్షులను అక్రమంగా నిర్బంధించి ఉంచుతున్నాడు, ఇదిగో ఈ సాక్షిని నిర్బంధించాడు' అని ఆయనను ప్రవేశపెట్టాడు. నేను బలవంతాన సాక్ష్యం చెప్పమంటున్నానని అన్నాడు.

నేనా సాక్షిని ఒకటే ప్రశ్నవేశాను: 'నేను నిన్నేమయినా చెప్పమన్నానా' అని.

ఏం లేదయ్యా - 'నీకు తెలిసింది చెప్పు అన్నవు' అన్నాడాయన.

'నేను అంగీ ఇస్తాననో, ఇంకేమైనా ఇస్తాననో ఆశ చూపి సాక్ష్యం చెప్పమన్నానా'

అని అడిగాను.

'చలికి ఒంటి మీద అంగీ లేకపోతే నేనేగదయ్యా అంగీ అడిగింది' అన్నాడాయన.

జస్టిస్ భార్గవ ఈ విషయాన్ని అంతగా పట్టించుకోలేదు. కాని ఈ సంగతి ఎందుకు చెపుతున్నానంటే ప్రాసిక్యూషన్ న్యాయవాదులు ఎప్పుడూ కూడ అసలు వాస్తవాల్ని పక్కదారి పట్టించడానికి, మరుగు పరచడానికి ఇటువంటి అబద్ధాల మీద చిన్న చిన్న, పనికిమాలిన విషయాల మీద ఆధారపడుతుంటారు. చల్లా నరసింహారెడ్డిని, భిక్షపతిని క్రాస్ ఎగ్జామినేషన్ చేసేటప్పుడు కూడా మొత్తంగా ప్రాసిక్యూషన్ న్యాయవాదులు తమ దృష్టి అంతా పెట్టింది ఇటువంటి చిల్లర విషయాల మీదనే. ఆ వివరాలు తర్వాత చెపుతాను.

ఇప్పుడు కొండయ్య సాక్ష్యం సంగతి చూద్దాం.

కొండయ్యను నేను అక్రమంగా నిర్బంధించి ఉంచానని, బలవంతపు సాక్ష్యం ఇప్పించబోతున్నానని, అందువల్ల కొండయ్యను నా దగ్గరి నుంచి విడిపించాలని జస్టిస్ భార్గవ ముందర ప్రాసిక్యూషన్ న్యాయవాదులు ఒక పిటిషన్ వేశారు.

నిజానికి కొండయ్య అప్పుడు నా దగ్గర లేడు. ఆ పిటిషన్‌ను శివశంకర్ దగ్గర జూనియర్‌గా ఉంటూ ఉండిన ఎ.రామకృష్ణ అనే న్యాయవాది వేశాడు.

ఈ పిటిషన్‌కు కౌంటర్ వెయ్యను అని నేను చెప్పాను. 'నా మిత్రులను నిరాశ పరుస్తున్నందుకు క్షమించాలి. నాకు ఈ పిటిషన్‌ను వ్యతిరేకిస్తూ కౌంటర్ వెయ్యాలని లేదు. వెయ్యను' అని అన్నాను.

అది కొండయ్యను నేను నిర్బంధించానా లేదా అన్న సమస్య కాదు. నేను ఎవరినైనా వాళ్ళు ఇష్టపూర్వకంగా సాక్ష్యం చెపితేనే నా సాక్షిగా ప్రవేశ పెడతాను. అందువల్ల సూత్రబద్ధంగానే నేను కౌంటర్ వెయ్యకుండా ఉన్నాను. వాస్తవమేమిటో కమిషనే తేల్చుకోవచ్చునన్నాను.

అప్పుడు జస్టిస్ భార్గవ ఏమన్నారంటే 'ఆ సాక్షిని తీసుకొచ్చి నా ఛాంబర్‌లో కూచోబెట్టండి. పోలీసులు అడిగినట్టు వాళ్ళ మామతో కలిపి హోటల్‌లో ఉంచడానికి కూడ వీలులేదు. కొందరు తల్లిదండ్రుల, పెద్దవాళ్ళ ఉపదేశాలు కూడా తప్పుగా ఉండవచ్చు' అని.

కొండయ్యనో, వాళ్ళ మామనో బెదిరించి, ఆ సాక్ష్యాన్ని తారుమారు చేయాలని పోలీసులు చేసిన ప్రయత్నం అట్లా బెడిసికొట్టింది.

అట్లా కొండయ్యను తీసుకువెళ్ళి జస్టిస్ భార్గవ ఛాంబర్‌లో కూచోబెట్టారు.

నామీద ఇట్లా అన్యాయమైన నింద వేశారు. ఇది తేటతెల్లమయ్యే వరకూ నేను నా వాదనలు కొనసాగించబోను. ఈ సంగతి తేల్చండి, అని నేను జస్టిస్ భార్గవను కోరాను. 'ఒకవేళ నేను ఆ సాక్షిని నిర్బంధించి, బలవంతపెట్టి సాక్ష్యం చెప్పించానని రుజువయితే నేనీ కమిషన్ విచారణ నుంచే తప్పుకుంటాను' అని చెప్పేసి బయటికి వచ్చేశాను. బైట

సిగరెట్ తాగుకుంటూ కూచున్నాను.

అప్పుడు జస్టిస్ భార్గవ కొండయ్యను వాస్తవమేమిటని అడిగారు.

'పత్రికలలో మీ కమిషన్ వార్తలు చూసి నాకు మీ దగ్గరికి రావాలనిపించింది. నాకు ఈ సంఘటనలకు సంబంధించి కొన్ని ముఖ్యమైన విషయాలు తెలుసు గనుక మీకు చెప్పడం నా బాధ్యత అనిపించింది. నాతోపాటు గదిలో ఉన్న ఇద్దరు మిత్రులను నా కళ్ళముందే పట్టుకుపోయారు. ఆ తర్వాత వాళ్ళు ఎన్‌కౌంటర్‌లో చనిపోయినట్టుగా పోలీసులు ప్రకటించారు. ఇది అబద్ధమని ఎక్కడయినా చెప్పాలనే నేను అనుకుంటున్నాను. మీ కమిషన్ వార్తలు చూసి ఇవాళ ఉదయమే పూనా నుంచి ఇక్కడ దిగాను. నిన్న కూడ నేను ఇక్కడ లేను. కమిషన్ ముందర బాధితుల తరపున వాదిస్తున్న న్యాయవాది ఎవరని కనుక్కుని ఈ ఉదయమే కన్నబిరాన్ గారి దగ్గరికి వెళ్ళి ఇటు వచ్చాను. ఈ సాక్ష్యం చెప్పడంలో ఎవరి బలవంతమూ, ప్రోద్బలమూ లేదు' అని కొండయ్య స్పష్టంగా చెప్పాడు.

జస్టిస్ భార్గవ ప్రాసిక్యూషన్ పిటిషన్‌ను కొట్టివేసి విచారణ కొనసాగించారు. ఆ విచారణ మొత్తంగా చాలా సవ్యంగా జరిగింది. ఎంతోమంది సాక్షులను విచారించడం జరిగింది.

ఆ సాక్షుల వాంగ్మూలాలు, క్రాస్ ఎగ్జామినేషన్లు, జస్టిస్ భార్గవ వ్యాఖ్యలు అన్నీ కూడ పత్రికల్లో చాల ఎక్కువగా వస్తుండేవి. ప్రతిరోజూ పెద్ద పెద్ద వార్తలు భార్గవ కమిషన్ గురించి వస్తుండేవి.

మొత్తం మీద నేను చేస్తున్న వాదనలు నూటికి నూరుపాళ్ళు సత్యాలని నేను ప్రజల ముందు ఉంచగలిగాను. గిరాయిపల్లి ఘటన పోలీసులు చెపుతున్నట్టుగా అనుకోకుండా జరిగిన ఎదురుకాల్పుల సంఘటన కాదని, ఆ నలుగురు యువకులను రోజుల తరబడి నిర్బంధించి, చిత్రహింసలకు గురిచేసి, చివరికి చెట్లకు కట్టికాల్చి చంపారని నేను సాక్ష్యాధారాలతో సహా రుజువు చేయగలిగాను. ఆ వాదనలన్నీ రోజురోజూ పత్రికలలో వివరంగా అచ్చయి ప్రజలకు చేరాయి.

ఈ విచారణ సందర్భంగా జరిగిన మరో రెండు మూడు విషయాలు కూడ చెప్పాలి.

గిరాయిపల్లిలో ఆ నలుగురు యువకులను కాల్చి చంపడానికన్న ముందు, ఆ నలుగురిని, ఇంకా చాల మందిని నీలగిరి రహదారి బంగళాలో ఉంచి చిత్రహింసలు పెట్టారు. వారిని ఆ రహదారి బంగళాలో చాలా రోజులు ఉంచడంతో వాళ్ళను నిర్బంధించి పెట్టిన అధికారుల పేర్లు వాళ్ళకు తెలిసిపోయాయి. తమను ప్రశ్నలు అడిగిన ఇంటిలిజెన్స్ అధికారుల పేర్లు, కొట్టిన పోలీసుల పేర్లు వాళ్ళు చెప్పగలిగారు. వాళ్ళను గుర్తు పట్టగలిగారు.

అప్పుడే నాకు యాదృచ్ఛికంగా మరో సంఘటన కలిసి వచ్చింది. అప్పటికి సికందరాబాదు కుట్రకేసు విచారణ కూడ హోరాహోరీగా సాగుతున్నది. ఆ కేసులో

పచ్చిపాల వెంకులు అని ప్రాసిక్యూషన్ సాక్షి ఒకాయన ఉండేవాడు. ఆయన ఆ నేరాలలో పాల్గొన్నాడని, ఆ తర్వాత అప్రూవర్ అయి నక్సలైట్లకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పడానికి వచ్చాడని పోలీసులు ఆ కేసులో చెపుతున్నారు.

పచ్చిపాల వెంకులు అప్రూవర్ అయ్యాడు గనుక పోలీసులే రక్షణ ఇస్తుండేవాళ్ళు. ఏదో ఒక పోలీస్ స్టేషన్‌లోనో, కార్యాలయంలోనో, గెస్ట్‌హౌస్‌లోనో పెట్టేవాళ్ళు. కాని కింది వర్గాల నుంచి వచ్చిన మనిషి గనుక ఏదో ఒక పని చెప్పి చేయించుకుంటుండే వాళ్ళు. ఆయనను ఒక పోలీసు కార్యాలయంలో పాత కాగితాలు, రికార్డులు చింపేసే, తగులబెట్టే పనికి పెట్టారు.

ఆ రోజుల్లో పోలీసులు చేసిన ప్రతి పనికీ ఏదో ఒక రికార్డు ఉంచుకునే వాళ్ళు. ఎంత దుర్మార్గమైన పని అయినా ఎక్కడో ఒక చోట నమోదు అయి ఉండేదన్నమాట. ఇప్పుడయితే ఎంత ముఖ్యమైన పనికయినా ఎక్కడా రికార్డు ఉండదనుకోండి.

పోలీసు రికార్డులు నిర్వహించే పద్ధతి గురించి ఒక విషయం చెప్పాలి. ముందు పోలీసులు ఎఫ్ఐఆర్ రికార్డు చేయడానికి నంబర్లు ఉండేవి. అంటే వరుసగా నంబర్లు వేసిన ఎఫ్ఐఆర్ కాగితాల పుస్తకం ఉండేది. ఆ పుస్తకం లోంచి వరుసగా కాగితాలు చించి ఎఫ్ఐఆర్ రాయాలన్న మాట. బిల్లు పుస్తకం లాగ.

కాని పోలీసులు ఇష్టం వచ్చినట్టుగా ఎఫ్ఐఆర్‌లు బనాయిస్తుంటారు గనుక ఒక కేసులో చంద్ర పుల్లారెడ్డి నిందితుడుగా ఉన్న కేసులో ముందరి నంబర్ ఉన్న ఎఫ్ఐఆర్ కు వెనుక తేదీ, వెనుక నంబర్ ఉన్న ఎఫ్ఐఆర్ కు ముందరి తేదీ ఉన్నట్టు బయట పడింది. కోర్టులో దాని మీదనే వాదోపవాదాలు జరిగి ఆ కేసు కొట్టుడుబోయింది. ఇక అప్పటి నుంచి ఎఫ్ఐఆర్‌లకు వరుసగా నంబర్లు వేయడం మానుకున్నారు.

మొత్తానికి పోలీసులకు రికార్డులను యధాతథంగా ఉంచడమంటే చికాకు. అందుకని పాత రికార్డులు చింపేసే పని పచ్చిపాల వెంకులుకు అప్పగించారు.

ఆ కాగితాల్లో గిరాయిపల్లి హత్యలు చేసినందుకు కొంతమంది పోలీసు అధికారులకు పారితోషకాలు, పదోన్నతులు ఇస్తూ చేసిన ఉత్తర్వు ఒకటి ఉండింది. ఆ ఉత్తర్వు ప్రతిని పచ్చిపాల వెంకులు నాకు తెచ్చి ఇచ్చాడు.

అప్పటికి సాక్షుల విచారణ అంతా అయిపోయింది. ఇంక ఏం చేయాలని నేను ఆలోచిస్తుండగా నా చేతికి ఈ మెమొరాండం వచ్చింది. ఆ మెమొరాండం నా దగ్గర ఉంది అని అంటే అసలు దానికి సాధికారత లేదని అనవచ్చు. ఆ పత్రాన్ని నేనే సృష్టించాననవచ్చు. నాకెట్లా దొరికిందనే వాదన లేవదీసి అసలు విషయాన్ని పక్కదారి పట్టించవచ్చు. అందుకని ఏమి చేయాలిరా అని ఆలోచించాను.

ఈ మెమొరాండం ప్రతిని కమిషన్‌కు సమర్పించకుండానే, దాని నంబర్ మాత్రం చెప్పి, 'అది చాల ముఖ్యమైన పత్రం, గిరాయిపల్లి ఎన్‌కౌంటర్‌లో ఎవరెవరు పాల్గొన్నారో

జాబితా అది. దాంట్లో పాల్గొన్నందుకు ఎవరెవరికి ఏ పారితోషకాలు, పదోన్నతులు ముట్టాయో చెప్పే మెమొరాండం అది. కనుక దాన్ని ప్రవేశ పెట్టమని పోలీసులను ఆదేశించండి' అని జస్టిస్ భార్గవను కోరాను.

'అది రహస్య పత్రం. అందులో కీలకమైన రహస్యాలున్నాయి. ప్రజా భద్రత, ప్రభుత్వ ప్రయోజనాలు దెబ్బ తింటాయి. కనుక దాన్ని ప్రవేశ పెట్టడానికి వీల్లేదు' అని శివశంకర్ వాదించాడు.

ఇక నేను ఈ గొడవంతా ఎక్కడ పెట్టుకునేది, నువ్వు ఆర్గ్యూ చెయ్యి అని మా సత్యనారాయణకు అప్పగించాను.

ఈ వ్యవహారమంతా చూసి జస్టిస్ భార్గవ ఒక మార్గాంతరం సూచించారు. జాబితా రహస్య పత్రం గనుక మీకు చూపించను. నా దగ్గరే పెట్టుకుంటాను. కాని మీరు మీ సమాచారం ప్రకారం ఆయా పోలీసు అధికారులు బోను ఎక్కినప్పుడు వాళ్ళు పారితోషకం పొందారా లేదా, పదోన్నతి పొందారా లేదా అని అడగవచ్చు. ఒకవేళ వాళ్ళు తమకు ఆ ఘటనతో సంబంధం లేదనో, పారితోషకం పొందలేదనో అంటే ఈ జాబితా చూసి నేను ధృవీకరించుకుంటాను. వాళ్ళు అబద్ధం చెపితే నమోదు చేసుకుంటాను' అన్నారు.

ఆ జాబితాలో నీలం రెడ్డి వగైరా పోలీసు అధికారుల పేర్లన్నీ ఉన్నాయి. వాళ్ళందరూ తమకు పారితోషకం అందిందని, పదోన్నతి వచ్చిందని చెప్పక తప్పలేదు. కమిషన్ ముందర అబద్ధాలు చెప్పలేరు గదా. పైగా జస్టిస్ భార్గవ దగ్గర సరైన జాబితా ఉందని వాళ్ళందరికీ తెలుసు. ఒక్కొక్కరు బోను ఎక్కడం, తనకు రెండువేల రూపాయలు అందాయని ఒకరు, పదిహేను వందల రూపాయలు అందాయని ఒకరు, వెయ్యి రూపాయలు అందాయని ఒకరు చెపుతూ పోయారు.

అట్లా నేను నా వాదనను రుజువు చేసినట్టయింది. నీలగిరి రహదారి బంగళాలో ఎవరెవరు బందీలను చిత్రహింసలకు గురి చేశారని నేను అభియోగం మోపానో, సరిగ్గా ఆ జాబితాలోని అధికారులకే ఇక్కడ పారితోషకాలు అందాయి. అంటే నీలగిరి రహదారి బంగళా చిత్రహింసలకూ, గిరాయిపల్లి ఎన్‌కౌంటర్ అనబడే దానికి సంబంధం ఉందన్నమాట. అసలు గిరాయిపల్లిలో ఎన్‌కౌంటర్ జరగనేలేదని, ములుగు లోని నీలగిరి రహదారి బంగళా నుంచి ఆ నలుగురిని గిరాయిపల్లి అడవిలోకి తీసుకు వెళ్ళి చెట్లకు కట్టేసి కాల్చి చంపారని నేను చేసిన వాదనకు బలం చేకూరిందన్నమాట.

సెంట్రల్ ఇంటెలిజెన్స్ నుంచి జస్టిస్ భార్గవ శ్రీరాములు అనే ఒక ఇనస్పెక్టర్‌ను తీసుకొచ్చుకున్నారు. ఆ ఇనస్పెక్టర్ చేత నా గురించి విచారణ చేయించారు. నేనేమిటో తెలుసుకున్నారు. ఆ తర్వాత అప్పుడు శ్రీనివాస వరదన్ అని కేంద్ర ప్రభుత్వ హోంశాఖ కార్యదర్శి ఉండేవారు. ఆయన ఒకరోజు వచ్చి జస్టిస్ భార్గవను కలిశాడు.

ఈ కమిషన్ విచారణ జరిగినన్ని రోజులు, శివశంకర్‌కు ఇచ్చినట్టుగానే కన్నబిరాన్ కు కూడా రోజుకు పదిహేను వందల రూపాయలు భృతి ఇవ్వాలని ప్రధాని మొరార్జీ

దేశాయి అన్నారని శ్రీనివాస వరదన్ జస్టిస్ భార్గవకు చెప్పాడట.

'కన్నబిరాన్‌కు ఈ విషయం చెప్పి ఆయన అనుమతి తీసుకుని ఈ ఏర్పాట్లు చేయండి' అని శ్రీనివాస వరదన్ జస్టిస్ భార్గవకు సూచించాడు.

జస్టిస్ భార్గవ ఈ మాట నాకు కోర్టులో చెప్పారు. అప్పుడు డిఫెన్స్ తరఫున ముగ్గురం వాదిస్తున్నాం గదా. మా ముగ్గురిలో ఒకరికి ఈ రకంగా రోజుకు పదిహేను వందల రూపాయల భృతి ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తున్నదని, మా అంగీకారం తెలపమని ఆయన కోరారు. మేం అక్కర్లేదన్నాం.

నన్ను ఆయన తన ఛాంబర్‌కు పిలిపించారు. 'మీకే ఈ భృతి ఇమ్మని కేంద్ర ప్రభుత్వం నుంచి సూచన వచ్చింది. మీ గురించి ఒక సెంట్రల్ ఇంటిలిజెన్స్ ఇనస్పెక్టర్ తో విచారణ జరిపించాను. మీకు చాల మంచి ప్రాక్టీసు ఉందని నాకు తెలిసింది. ఆ ప్రాక్టీసు వదులుకుని, ఈ కమిషన్ విచారణకు మీరు సహకరిస్తున్నారు. కనుక ఎంతో కొంత పరిహారంగా ఈ భృతి అంగీకరించండి' అని ఆయన అన్నారు.

'నాకు ఈ డబ్బు అవసరం లేదండీ. నేను నా రాజకీయ విశ్వాసాల కోసం ఈ పని చేస్తున్నాను గాని పారితోషకం ఆశించి కాదు' అని చెప్పాను.

బహుశా అప్పటికి రోజుకు పదిహేను వందల రూపాయల లెక్కన ఎనభై వేలో, తొంభై వేలో వచ్చేదనుకుంటాను. 1978లో అది చాలా పెద్దమొత్తమే. అయినా సరే, నాకు అక్కర్లేదని వచ్చేశాను.

తర్వాత కోర్టులో ఏదో ఒక తేదీన విచారణ జరపడానికి తమకు వీలుకాదంటే వీలు కాదని అనంతబాబు, శివశంకర్ వాదిస్తున్నారు. "ఈ కోర్టులో నేను ఏ తేదీ చెపితే మీరు ఆ తేదీన రావలసిందే. ఏ మాత్రం డబ్బులు తీసుకోకుండా కేవలం కేసు మీద ఆసక్తితో వాదనకు వస్తున్నది కన్నబిరాన్ గనుక ఆయనకు ఏ తేదీ అయినా వీలు కాదంటే నేను ఒప్పుకోగలను. కాని మీరిద్దరూ డబ్బులు తీసుకుని, ఉద్యోగులుగా ఈ కోర్టుకు వస్తున్నారు. మీకు ఏ రోజయినా కుదరదనడానికి వీలు లేదు. నేను రమ్మన్నప్పుడు రావాల్సిందే' అన్నారు జస్టిస్ భార్గవ.

అంతేకాదు, జస్టిస్ భార్గవ ఆ విచారణను మొత్తం చాలా జాగ్రత్తగా అధ్యయనం చేశారు. ప్రతి వాంగ్మూలం మీద, క్రాస్ ఎగ్జామినేషన్ మీద ఆయన ఎర్ర పెన్సిల్ మార్కులు, నీలం పెన్సిల్ మార్కులు ఉండేవి. "మీరు మీ కేసును రుజువు చేశారు" అని నాతో స్పష్టంగా అన్నారాయన.

'మరి అట్లయితే, ఈ గిరాయిపల్లి కేసు వరకు మీ నిర్ధారణ ఏమిటో ప్రకటించ వచ్చు గదా' అన్నాను.

'కాదు అన్ని సంఘటనల విచారణ అయిపోయిన తర్వాత ఒకేసారి తీర్పు ప్రకటిస్తాను' అన్నారాయన.

అప్పుడు మాత్రం ఆయన అర్థం లేకుండా ప్రవర్తిస్తున్నట్టు నాకు అనిపించింది.

మనసుకు కష్టం వేసింది.

జస్టిస్ భార్గవ పంపించిన ఇంటెలిజెన్స్ ఆఫీసరే స్వయంగా పోలీసు అధికారుల సాక్షులను ఎట్లా తారుమారు చేస్తున్నారో రాశాడు. గిరాయిపల్లి వెళ్ళి సాక్షుల దగ్గ స్వయంగా వాంగ్మూలాలు సేకరించుకుని రమ్మని జస్టిస్ భార్గవ తన ఇంటెలిజెన్స్ అధికారులను పంపించారు. ఆ అధికారి గిరాయిపల్లి వెళ్ళడానికి అరగంట ముందే స్థానిక పోలీసుల స్పెషల్ బ్రాంచి అధికారులు వెళ్ళి ఆ సాక్షికి బాగా కల్లు తాగించి తప్పుడు సాక్షం ఇప్పించారు. ఆ సాక్షి పేరు కొమరయ్య అనుకుంటాను. ఆయన ఆ సాక్ష్యం తీసుకుని తిరిగి వస్తూ సిద్ధిపేట బస్టాండ్‌లో స్పెషల్ బ్రాంచి అధికారులను చూశాడు. వీళ్ళే గిరాయిపల్లి వెళ్ళి ఆ సాక్షిని బెదిరించి వచ్చి ఉంటారనుకుని ఆయన గిరాయిపల్లికి మళ్ళీ వెళ్ళాడు. మరో రకమైన సాక్ష్యం తీసుకువచ్చి అదంతా జస్టిస్ భార్గవకు నివేదించాడు.

భార్గవ కమిషన్ విచారణ క్రమంలో ఇటువంటి సంఘటనలు ఎన్నో ఉన్నాయి.

గిరాయిపల్లి విచారణలో కామేశ్వరరావు టేప్ రికార్డర్ వాంగ్మూలం గోల జరుగుతుండగానే ఆ తర్వాత ఏ సంఘటనను విచారించాలనే ఆలోచన మొదలయింది.

రామనర్సయ్యను ఎన్‌కౌంటర్ పేరిట కాల్చి చంపిన ఘటనను ఆ తర్వాత విచారణకు తీసుకోవాలని అనుకున్నాం. కాని ఆ ఆలోచన సాగుతుండగానే ఆ సంఘటనలో కీలక సాక్షి ప్రీతం సింగ్‌ను పోలీసులు ఎత్తుకుపోయారు. నాగ్‌పూర్‌కు ఎత్తుకుపోయారు.

ప్రీతం సింగ్‌ను పోలీసులు ఎత్తుకు పోయిన ఘటన విచిత్రంగా జరిగింది. ఆయన పాత మలక్‌పేటలో ఉండేవాడు. ఆయన ఇంటి నుంచే రామనర్సయ్యను పోలీసులు ఎత్తుకుపోయి వరంగల్ జిల్లా నర్సంపేట సమీపంలోని చిలకలగుట్ట దగ్గర కాల్చి చంపేశారు. భార్గవా కమిషన్ విచారణ మొదలయిన తర్వాత ఈ ప్రీతం సింగ్ తన వాంగ్మూలం ఇవ్వదలిచాడు. పాత మలక్‌పేటలో ఉండే కెవిఎన్ నరసింహారావు అనే పబ్లిక్ ప్రాసిక్యూటర్ బోర్డు చూసి, న్యాయవాది గదా అని లోపలికి వెళ్ళాడు. ఆ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రీతం సింగ్‌ను కూచోబెట్టి పోలీసులను పిలిపించాడు. పోలీసులు ప్రీతం సింగ్‌ను ఎత్తుకుపోయి నాగ్‌పూర్ తీసుకుపోయారు.

ఈ సంగతి తెలియగానే నేను ముగ్గురు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల మీద కోర్టులో పిటిషన్ వేశాను. ఆ ముగ్గురికి పబ్లిక్ ప్రాసిక్యూటర్లుగా ఉండే అర్హత లేదని వాదించాను. వాళ్లు కేవలం పోలీసు శాఖ ఉద్యోగులుగా ప్రవర్తిస్తున్నారని వాదించాను. షాద్‌నగర్ కోర్టులోనూ, హైకోర్టు లోనూ నేను చేసిన వాదనల వల్ల ఆ ముగ్గురిని ఉద్యోగాల నుంచి తొలగించారు. ఆ కేసు ఫలితంగానే పబ్లిక్ ప్రాసిక్యూటర్లుగా నియమించడానికి ఉండవలసిన అర్హతల గురించి చట్ట సవరణ వచ్చింది.

సరే, రామనర్సయ్య కేసు విచారణ చేపడదామంటే ఓంకార్ కొందరు సాక్షులను

తీసుకొచ్చాడు. కాని నాకు ఆ సాక్ష్యాల మీద పూర్తి విశ్వాసం కుదరలేదు. వాళ్ళందరూ రామనర్సయ్యను, ఆయనతోపాటు మరి ముగ్గురిని హైదరాబాదు నుంచి పోలీసు వ్యాన్లలో ఎట్లా వరంగల్ తీసుకొచ్చారో, నర్సంపేటకు, చిలకలగుట్టకు తీసుకుపోయారో చెప్పేవారు. ఆ సాక్ష్యం ఎవరయినా చెప్పవచ్చునని, ప్రత్యక్ష సాక్షి కానక్కరలేదని నాకు అనిపించింది.

ఆ కేసులో కీలక సాక్షి, ప్రత్యేక సాక్షీ ప్రీతం సింగే. ఆయన ఇంట్లో నుంచి రామనర్సయ్యను పోలీసులు పట్టుకుపోయారని ఆయన చెపుతున్నాడు. కాని విచారణ ప్రారంభిద్దామంటే ఆయనను ఎత్తుకుపోయారు. ప్రీతం సింగ్ వచ్చి ఉంటే, సాక్ష్యం చెప్పి ఉంటే చిలకలగుట్ట కేసులో కూడ, గిరాయిపల్లి కేసులో లాగనే, మా వాదన నిర్ధారణ అయి ఉండేది.

అందుకని నేనేం చేశానంటే, ఇప్పుడు రామనర్సయ్య కేసు విచారణ పక్కన పెడదాం, రామచంద్రయ్యను, జంపాల ప్రసాద్‌ను చంపివేసిన ఇల్లందు ఎన్‌కౌంటర్ ఘటనపై విచారణ ప్రారంభించమని అడుగుదాం అని మా వాళ్ళతో అన్నాను.

ఆ కేసులో నా దగ్గర పోస్ట్‌మార్టమ్ రిపోర్టు ఉండింది. నా దగ్గర ఆ పోస్ట్‌మార్టమ్ రిపోర్టు ఉందని పోలీసులకు తెలియదు. ఆ రిపోర్టు ప్రకారం వాళ్ళిద్దరినీ అతి సమీపం నుంచి కాల్చినట్టుగా ఉంది. గుండెలలోంచి తూటా దూసుకు పోయినట్టుగా ఉంది. అటూ ఇటూ ఎదురుకాల్పులు జరిగితే అటువంటి తూటా గాయాలు ఉండే అవకాశం లేదు.

ఈ పోస్టుమార్టం రిపోర్టు కాపీ సంపాదించడంలో డాక్టర్ వై. రాధాకృష్ణమూర్తి గారు సహాయం చేశారు. ఆ రోజుల్లో నక్సలైట్ల మీద హత్యాకాండను ఖండించడంలో, వారికి న్యాయ సహాయం చేయడంలో సిపిఎం నాయకులందరూ శక్తివంచన లేకుండా కృషి చేశారు.

ఈ ఎన్‌కౌంటర్ ఘటనలో మొట్టమొదటి సాక్షి కె.లలిత. ఆమె అంతకు ముందు ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ స్టూడెంట్స్ యూనియన్ నాయకురాలిగా ఉండింది. ఎమర్జెన్సీలో జంపాల చంద్రశేఖర ప్రసాద్‌ను అరెస్టు చేసిన ఘటనకు ఆమె ప్రత్యక్ష సాక్షి.

అప్పుడు ఐపిఎస్ అధికారి రొద్దం ప్రభాకర రావు ఎపిఎస్‌ఆర్‌టిసికి ఎండిగా ఉండేవాడు. ఆ ప్రభాకరరావే లలితను ఎమర్జెన్సీలో అరెస్టు చేసినవాడు. లలితను నిర్బంధంలో క్రూరమైన చిత్రహింసలకు గురిచేసినవాడు అతనే. ఆమె తనను ఎట్లా కిటికీకి కట్టేసి పెట్టిందీ, ఎట్లా చిత్రహింసలు పెట్టిందీ ఒక్కొక్క సంఘటనా జస్టిస్ భార్గవ ముందర వివరించింది. రొద్దం ప్రభాకరరావును గుర్తుపట్టింది.

లలిత వాంగ్మూలమంతా పత్రికల్లో పెద్ద ఎత్తున వచ్చింది. ఒక మహిళ మీద పోలీసులు ఎంత దుర్మార్గంగా ప్రవర్తించారో పత్రికా పాఠకులకు, సమాజానికంతా తెలిసిపోయింది.

ఇంత బహిరంగంగా పోలీసుల అత్యాచారాల గురించి, హింసల గురించి పత్రికల్లో వస్తూ ఉంటే పోలీసుల నైతిక స్థైర్యం దెబ్బతిని పోతుంది అని పోలీసు అధికారులు వాదించడం మొదలుపెట్టారు. ఒక పోలీసు అధికారుల ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి చెన్నారెడ్డి దగ్గరికి వెళ్ళి గోలచేసింది. ఇట్లా పోలీసు అధికారుల ప్రతిష్ఠ దెబ్బతిని పోతుంటే పనిచేయడం కష్టం అని వాదించింది.

కనుక విచారణ వ్యవహారం బహిర్గతం కాకుండా ఆపాలని చెన్నారెడ్డి భావించాడు. ఇక నుంచి భార్గవ కమిషన్ విచారణ బహిరంగంగా, పత్రికా విలేకరుల సమక్షంలో కాకుండా రహస్యంగా జరగాలని ప్రతిపాదించాడు.

రహస్య విచారణ అంటే ఒక సమస్య ఉంది. కమిషన్ ముందుకు వచ్చే వాంగ్మూలాలు ఇచ్చే సాక్షులెవరో పోలీసులకు తెలుస్తుంది గాని ప్రజలకు తెలియదు. అందువల్ల ఆ సాక్షులను బెదిరించి, సాక్ష్యం చెప్పకుండా చేయడం పోలీసులకు సులభమవుతుంది. సాక్షులు ఎంత బహిరంగంగా కనబడితే, వాళ్ళ వాంగ్మూలాలు ఎంత పెద్ద ఎత్తున ప్రచారమయితే సాక్షులకు అంత ఎక్కువ రక్షణ దొరుకుతుంది. సాక్షులకు వచ్చే గుర్తింపే పోలీసులు వాళ్ళను ముట్టకుండా రక్షణ కవచంగా ఉంటుంది.

అందువల్ల రహస్య విచారణ జరిగితే మా సాక్షులకు రక్షణ ఉండదు అని మేం జస్టిస్ భార్గవ ముందర వాదించాం. ఒకవేళ రహస్య విచారణే జరిగితే మేం అందులో పాల్గొనబోము అని ముగ్గురం న్యాయవాదులమూ తార్కుండేతో కూడ చెప్పి జస్టిస్ భార్గవకు చెప్పాం. విచారణ నుంచి బైటికి వచ్చేశాం.

నిజానికి షా కమిషన్, భార్గవా కమిషన్ రెండూ చాలా మంచి కమిషన్లు. చాలా బాగా పనిచేశాయి. ఆ కమిషన్లు ఇచ్చే నివేదికల మీద ఆధారపడి ప్రభుత్వం మంచి పాలనా సూత్రాలను తయారు చేసే అవకాశం ఉండేది. కాని ఒక కమిషన్ సరిగా పనిచేయకుండా, మధ్యలోనే పని ఆపివేసేటట్టు ప్రభుత్వమే ప్రవర్తించింది. కేవలం పోలీసు అధికారుల కోసం ఆ పనిచేసింది. మరొక కమిషన్ నివేదిక కోర్టు ఉత్తర్వుల వల్ల పనికి రాకుండా పోయింది.

భార్గవా కమిషన్ పని చేయకుండా చేయడానికి పోలీసులు పన్నిన పన్నాగాలు ఒకటీ రెండూ కాదు. కొండయ్యను అక్రమంగా నిర్బంధించి పెట్టానని నా మీద వాళ్ళ మామతోనే పిటిషన్ వేయించారు. నన్ను ఆ కేసులో అరెస్టు చేయడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. వాటిలో విజయం సాధించలేదు. కనుక అసలు విచారణనే రద్దుచేసే ప్రయత్నం చేశారు.

జస్టిస్ భార్గవా కమిషన్ విచారణలో బైట పడినదేమంటే, ఒక మామూలు, కక్ష పూరితమైన కక్షిదారుకన్న ఎక్కువ క్రూరంగా, కక్షపూరితంగా, దుర్మార్గంగా పోలీసులు ప్రవర్తించ గలరు అని. విచారణ ఆపడానికి అన్ని రకాల కుట్రలు చేయగలరు అని.

వాళ్ళు ఏదంటే అది పిటిషన్లు వేయగలరు. సాక్షులను ఎత్తుకుపోగలరు. సాక్షులు ముందుకు వచ్చి సాక్ష్యాలు చెప్పకుండా అడ్డుకోగలరు. హంతక ముఠాలు ఏయే పనులు చేస్తాయని పోలీసులు ఆరోపిస్తూ ఉంటారో ఆ పనులన్నీ పోలీసులు చేయగలరు. పోలీసులే గనుక బోను ఎక్కవలసి వస్తే ఈ పనులన్నీ సాధారణ నేరస్తులకన్న పది రెట్లు ఎక్కువగా చేస్తారు.

భార్గవా కమిషన్ విచారణ ద్వారా నేను గ్రహించిన అనుభవం అది.

అయితే దారుణమైన విషయమేమంటే, పోలీసులు సాగించే ఈ నేర ప్రవర్తనను రాజ్యం అనుమతిస్తున్నది. అందులో భాగం పంచుకుంటున్నది. దాన్ని ప్రోత్సహిస్తున్నది. చట్ట ప్రకారం, రాజ్యాంగ ప్రకారం నడుచుకోవలసిన రాజ్యం ఈ మాదిరిగా ప్రవర్తించడం అత్యంత హేయమైన విషయం. ఇదే ఇప్పుడు అన్నిటికన్న పెద్ద సమస్య.

పోలీసులు అర్థం చేసుకోని విషయమేమంటే, ఒక మనిషిని రోజుల తరబడి నిర్బంధించి కొట్టినప్పుడు, చిత్రహింసలు పెట్టినప్పుడు ఆ మనిషి తనను చిత్రహింసలు పెట్టినవాళ్ళను మరిచిపోలేడు. ఎప్పుడో ఒకసారి పోలీసులు ఒకరినొకరు పిలుచుకుంటారు గనుక వాళ్ళ పేర్లు కూడ గుర్తు పెట్టుకుంటాడు. బోను ఎక్కి సాక్ష్యం చెప్పవలసి వచ్చినప్పుడు ఎవరినైనా గుర్తు పడుతున్నాడంటే, పేరు చెపుతున్నాడంటే అది కేవలం నిజం చెప్పడం కోసమే తప్ప, ఏదో కల్పించి చెప్పడం కోసం కాదు.

అట్లా నిజాలు చెపితేనే పోలీసుల మానసిక స్థయిర్యం దెబ్బతిని పోతుందంటే ఆ మానసిక స్థయిర్యం ఎంత బలహీనమయినదయి ఉండాలి!

పోలీసులు అబద్ధాలు చెప్పడం, అబద్ధాల్ని నమ్మడం ఎంత అలవాటయి పోయిందంటే చాంద్రాయణగుట్ట పోలీసు స్టేషన్‌లో జరిగిన ఒక లాకప్ హత్య ఉదంతం చెప్పాలి. అక్కడ ఒక వ్యక్తి లాకప్‌లో చనిపోయాడు. నేను ఒక పిటిషన్ వేయిస్తే కోర్టు ఒక కమిషనర్‌ను నియమించింది. ఆ కమిషనర్ పోలీసు స్టేషన్‌కు వెళ్ళే సమయానికి ఎస్ఐ లేడు. స్టేషన్‌లో సెంట్రీ మాత్రమే ఉన్నాడు. ఏం జరిగిందో చెప్పమంటే ఆ సెంట్రీ 'ఆ వ్యక్తి మా పోలీసు స్టేషన్ ముందుకు వచ్చి రెండుసార్లు అటూ ఇటూ తిరిగినాడు. ఆ తర్వాత లోపలికొచ్చి సెల్ తలుపు తెరవమన్నాడు. నేను తెరవగానే లోపలికి వెళ్ళాడు. వెంట సైనైడ్ తెచ్చుకుని అది మింగి చనిపోయాడు' అని చెప్పాడు. అటువంటి పిట్ట కథలు చెప్పాడు.

ఈ దేశంలో మనుషులకు ఆత్మహత్యలు చేసుకోవడానికి పోలీస్ స్టేషన్లలో లాకప్పులు తప్ప వేరే స్థలాలు లేనట్టు!

భార్గవా విచారణ ఆపడానికి పోలీసులు ఎన్నెన్ని పనులు చేశారో గుర్తుకు తెచ్చుకుంటుంటే ఎంతకీ తరగడం లేదు. ఈ విచారణ వల్ల పోలీసుల మానసిక స్థయిర్యం దెబ్బతింటుందని, ఈ ఎన్‌కౌంటర్ల మీద విచారణ జరిపే బదులు నక్సలైట్లు చేసిన హత్యల మీద విచారణ జరపాలని వందేమాతరం రామచంద్రరావు చేత పిటిషన్ వేయించారు. ఈ విచారణ జరగగూడదు. పోలీసుల అత్యాచారాలు, హింసాకాండ

బైట పడగూడదు. అంతే.

ఆదిలాబాద్ జిల్లా తపాలపూర్ భూస్వామి పీతాంబరరావును నక్సలైట్లు చంపేశారు గదా. ఆయన కొడుకు చేత జస్టిస్ భార్గవ ముందర ఒక పిటిషన్ దాఖలు చేయించారు.

ఒకదశలో హైదరాబాదు చుట్టుపక్కల వరుసగా ఎన్నో బందిపోటు దొంగతనాలను పోలీసులే పనిగట్టుకుని చేయించారు. ఈ ప్రాంతంలో శాంతి భద్రతల స్థితి సరిగా లేదని, పోలీసులు ఎక్కువ బలప్రయోగం చేయక తప్పదని జస్టిస్ భార్గవ నమ్మేలా చేయాలని వాళ్ళ ప్రయత్నం.

ఒకరోజు విచారణలో ఈ బందిపోటు దొంగతనాల ప్రస్తావన కూడ వచ్చింది. "ఈ బందిపోట్లన్నీ మిమ్మల్ని ప్రభావితం చేయడానికి ప్రత్యేకంగా చేయబడుతున్నాయి మిలార్డ్" అని స్పష్టంగా చెప్పేశాను.

గిరాయిపల్లి విచారణ గురించి తలచుకుంటుంటే ఎన్నెన్ని గుర్తు చేసుకోవలసిన విషయాలున్నాయో ననిపిస్తుంది.

పోలీసులు సాక్ష్యాధారాలు తారుమారు చేయడానికి ఎన్ని ప్రయత్నాలు చేశారో లెక్కలేదు. మా సాక్షులను బెదిరించడం, సాక్ష్యాలు తారుమారు చేయడం సరే. కమిషన్ సాక్షులను, ప్రాసిక్యూషన్ సాక్షులను కూడ మార్చడానికి ప్రయత్నించారు. కొమురయ్య సంగతి ప్రస్తావించాను గదా. ఆయన పోలీసు సాక్షి. ఆయన సాక్ష్యాన్ని తారుమారు చేయడానికి పోలీసులు చేసిన పనుల గురించి జస్టిస్ భార్గవ నియమించిన ఇనస్పెక్టరే నిండు కోర్టులో చెప్పాడు.

ఇక మా సాక్షులను బెదిరించడం మొదలయ్యాక నేను ఒకసారి గిరాయిపల్లి వెళ్ళాను. ఊళ్ళో చావడి ఉంది. నేను సిగరెట్ తాగుతూ అక్కడ కూచున్నాను. గ్రామస్తులు అనుమానంగా చూస్తున్నారు. సాధారణంగా అంతే. వాళ్ళు నిన్ను నమ్మేదాకా మనసు విప్పి నీతో ఏమాటా చెప్పరు.

నేను కూడ వాళ్ళను ప్రశ్నలు అడగకుండా మొదట మాట్లాడుతూ ఒక గుంపు పోగయ్యేదాకా చూశాను. జనార్ధన్ వాళ్ళను అక్కడ ఎన్‌కౌంటర్ పేరుతో చంపకముందు నక్సలైటు దళం అక్కడ సిరిసినగండ్ల అనే గ్రామంలో దొంతుల అంతయ్య అనే వడ్డీ వ్యాపారిని చంపేశారు. ఆ వడ్డీ వ్యాపారి కర్కోటకుడని పేరు. ఆ వ్యాపారిని చంపినందుకు ప్రతిగా పోలీసులు ఈ నలుగురు యువకులను చంపేశారు. నిజానికి అంతయ్య హత్యకేసు విచారణ జరుగుతోంది. ఆ విచారణతో సంబంధం లేకుండా, ఆ హత్యతో సంబంధం ఉందని తాము అనుకున్న నలుగురిని చంపేయాలని పోలీసులు అనుకుని అది అమలు చేశారు. ఇప్పటికీ ఇటువంటివి జరుగుతూనే ఉన్నాయి.

'మరి దొంతుల అంతయ్యను చంపినారు గదా వీళ్ళు. అంతయ్య ఎటువంటి వాడు అనేది పోనీయండి. ఆయనను వీళ్ళు చంపినారు. వాళ్ళను పోలీసులు చంపితే

ఏం తప్పు?' అని అడిగాను.

ఒక చదువూ సంధ్యలేని గొల్లవాడు అక్కడ ఉన్నాడు. ఎన్నడూ బడి ముఖం కూడ చూసి ఉండడు. ఆయన "మరి కోర్టులు ఎందుకున్నయయా" అని ప్రశ్నించాడు.

నాకు హఠాత్తుగా ఏమనిపించిందంటే ఈ గొల్లవాడు ఇంతగా రూల్ ఆఫ్ లా గురించి, చట్టబద్ధపాలన గురించి మాట్లాడుతున్నాడు. ఈ విషయం పోలీసులకు కూడా తెలియదు గదా అనిపించింది.

పోలీసులకు మాత్రమే కాదు, ఈ రూల్ ఆఫ్ లా ఉండాలనే విషయం మన న్యాయవాదులలో కూడా చాలామందికి తెలియదు. ఎందుకంటే నేను గిరాయిపల్లి నుంచి కోర్టుకు వెళ్ళాను. అక్కడ కొంతమంది న్యాయవాదులు కలిశారు. అప్పుడే జస్టిస్ భార్గవా కమిషన్ విచారణ ముమ్మరంగా జరుగుతోంది. పత్రికల్లో విపరీతంగా వార్తలు వస్తున్నాయి. అది చాల వేడిగా ఉంది.

ఒక లాయర్ వచ్చి నన్ను సూటిగా అడిగాడు. మంచి ఇంగ్లీషులో "మిస్టర్ కన్నబిరాన్, సూటిగా సమాధానం చెప్పండి. రాజ్యాంగంలో, చట్టంలో విశ్వాసం లేదని చెప్పుకునే నక్సలైట్లకు, రాజ్యాంగంలో, చట్టంలో చెప్పిన రక్షణలు ఎందుకు ఇవ్వాలి" అని అడిగాడు.

చాలా గంభీరంగా, చాలా సైద్ధాంతిక ప్రశ్న అడిగిన పద్ధతిలో ఆయన ఆ ప్రశ్న అడిగాడు. ఆ ప్రశ్న తిరుగులేదని, నేను జవాబు చెప్పలేని ప్రశ్న అని ఆయన అనుకున్నట్టున్నాడు.

నేను అప్పుడే ఆ గొల్లవాని సమాధానం విని వస్తున్నాను.

అందుకని, అదిగో నేను ఆ సంఘటన వివరించాను. "మరి కోర్టులు ఎందుకున్నయయా" అని ఆ గొల్లాయన అడిగాడు అని చెప్పాను. ఆ గొల్లాయన సహజ న్యాయ సూత్రాలు, చట్టాలు, ఉద్గ్రంథాలు వగైరాలేవీ చదవలేదు. మీ తల్లి దండ్రులు చాలా కష్టపడి, ఎంతో డబ్బు ఖర్చు పెట్టి మీ చేత అవన్నీ చదివించారు. అయినా మీకు రూల్ ఆఫ్ లా గురించి కనీస అవగాహన కలగలేదు. మీ చదువు దండగ" అని చెప్పాను.

ఇటువంటి ప్రశ్నలు ఎందుకు పుట్టుకొస్తాయంటే, అసలు విషయం పక్కకు పోయి ఇటువంటి అనవసరపు విషయాల మీద చర్చ జరుగుతుంది.

ఇంకొక ఉదాహరణ చెపుతాను; గిరాయిపల్లి వెళ్ళి ఆ అడవిని పరిశీలించాలి అని నేనొక పిటిషన్ వేశాను.

పోలీసులు దానికి కౌంటర్ వేశారు. వాళ్ళు ఒక అడవి బొమ్మ చిత్రించారు. ఆ అడవి బొమ్మను జస్టిస్ భార్గవకు సమర్పించారు. అందులో ముదురు ఆకుపచ్చ, నలుపు చిక్కని మట్టి రంగుల్లో చెట్లు, పొదలు, తీగలు, మొక్కలు చిత్రించి, అది చిక్కని అడవి, అందులోకి ప్రవేశించడం కష్టం అని చెప్పారు. చీమలు దూరని చిట్టడవి, కాకులు దూరని కారడవి అన్న మాదిరిగా, చాలా ఊహాత్మకంగా అడవిని చిత్రించామని వాళ్ళు

అనుకున్నారు.

అయినా సరే, జస్టిస్ భార్గవ దాన్ని చూడవలసిందే అన్నారు. అక్కడిదాకా వెళ్ళ వచ్చునని, సమస్యేమీ లేదని మేమన్నాం. సరే అని బయల్దేరాం.

నేను, జస్టిస్ భార్గవ ఒక అంబాసిడర్ కారులో ఉన్నాం. అక్కడి దాకా వెళ్ళకముందే "కార్లు అక్కడికి వెళ్ళలేవు సార్. జీపుల్లో పోవలసిందే. దిగి జీపు లెక్కండి" అన్నారు పోలీసులు.

"చూద్దాం. కారు ఎక్కడిదాకా వెళితే అక్కడిదాకా వెళ్ళి అక్కడి నుంచి నడుద్దాం. లేకపోతే అక్కడ జీపు ఎక్కుదాం" అని నేను కారు ముందుకు కదలమన్నాను.

చివరికి మా కారు సరిగ్గా జనార్దన్, మురళీమోహన్, ఆనందరావు, సుధాకర్‌లను ఏ చెట్లకు కాల్చి చంపారో ఆ చెట్ల దగ్గరికి వెళ్లగలిగింది.

అట్లాగే ఆ నలుగురిని ఎక్కడ దహనం చేశారో అక్కడికి కూడా వెళ్ళాం. అక్కడ జనార్దన్‌ను దహనం చేసిన చోటునుంచి వాళ్ళ నాన్న రామారావు గారు అస్థికలు ఏరి తెచ్చాడు. ఆ అస్థికల్ని ఆ తర్వాత నేను హుసేన్ సాగర్‌లో నిమజ్జనం చేయించాను.

ఇదంతా ఎందుకు చెపుతున్నానంటే, పోలీసులు పరిశోధనను, రూల్ ఆఫ్ లా ను అడ్డుకోవడానికి ఇంత మూర్ఖంగా, అజ్ఞానంతో, అనాగరికంగా ప్రవర్తించగలరని చెప్పడానికే.

సరే, కె.లలిత రొద్దం ప్రభాకరరావు తన మీద అమలు చేసిన చిత్రహింసలను గురించి కమిషన్ ముందర చెప్పిన తర్వాత, అవన్నీ పత్రికలలో వచ్చిన తర్వాత పోలీసు అధికారుల ప్రతినిధి బృందం ఒకటి ముఖ్యమంత్రి చెన్నారెడ్డి దగ్గరికి వెళ్ళింది. తమ నైతిక స్థయిర్యం దెబ్బతింటున్నదని ఫిర్యాదు చేసింది.

ఒకవేళ మీరు మీ వృత్తి ధర్మాన్నే అనుసరించినట్టయితే, ఆ ప్రవర్తన బయట పడినప్పుడు నైతిక స్థయిర్యం ఎందుకు దెబ్బతింటుంది? మీరు చేసిన పని సరైనదేనని మీ అంతరాత్మకు అనిపిస్తే, అది బయటపడినప్పుడు నైతికస్థయిర్యం ఎందుకు దెబ్బతింటుంది?

అయినా సరే, ప్రతి సందర్భంలోనూ పోలీసుల వాదన ఈ నైతిక స్థైర్యం దెబ్బతినడం అనే పునాది మీదనే ఆధారపడుతుంది. ఇది ముప్పైఏళ్ళ కింద జస్టిస్ భార్గవా కమిషన్ విచారణ సందర్భంలో మాత్రమేకాదు, ఇవాల్టికీ ఎక్కడ పోలీసు అత్యాచారాల సంఘటన, పౌరహక్కుల ఉల్లంఘన వార్త బయటపడినా వెంటనే పోలీసు అధికారులందరికీ గుర్తుకు వచ్చేది నైతిక స్థయిర్యం సమస్యే.

ఇటీవల నేషనల్ పోలీసు అకాడమి దగ్గర ఒక సిగరెట్ల అంగడి వ్యక్తిని ట్రెయినీ పోలీసు అధికారులు కొట్టిన సంఘటనే చూడండి. జరిగిన సంఘటన వాస్తవాలు పత్రికలలో వస్తుంటే పోలీసు అధికారులు పాత పాటే పాడుతున్నారు. పోలీసుల నైతిక స్థయిర్యం

దెబ్బతింటుంది అని.

ఒకవేళ ఆ దుకాణాదారుదే తప్పనుకుందాం. అతను ఎవరయినా గానీ. అతణ్ణి కొట్టడానికి పోలీసులకు ఏం అధికారం ఉంది? ఒకవేళ ఆ అంగడివాడు 'నేను నీకు సిగరెట్ అమ్మను' అన్నాడనుకో, 'ఇరవై రూపాయలకు ఒక సిగరెట్ కొంటే కొను లేకపోతే పో' అన్నాడనుకో. అంగడి పెట్టుకున్నాడు అతని ఇష్టం. అతణ్ణి కొట్టడం ఎందుకు? కొట్టి సరుకు తీసుకోవడమేనా?

ఎందుకు కొట్టారయ్యా అంటే అదే చిలక పలుకు; నైతిక స్థయిర్యం దెబ్బతింటుంది అని.

చర్చల సందర్భంగా ఏం జరిగింది? నక్సలైట్లు వచ్చి ప్రభుత్వాన్ని, పోలీసులను విమర్శించారు. వాళ్ళ తప్పులు బైటపెట్టారు. అంతే ప్రభుత్వపు నైతిక స్థయిర్యం దెబ్బతింది.

ఇంత సులభంగా దెబ్బతినే నైతిక స్థయిర్యం ఉంటే ఏం, పోతే ఏం?

సరే, అట్లా నైతిక స్థయిర్యం సమస్య ముందుకు తెచ్చి జస్టిస్ భార్గవా కమిషన్ విచారణ రహస్యంగా జరగాలని ఒత్తిడి తెచ్చారు.

ఎంవి రామమూర్తి గారు, పంచాగ్నుల సత్యనారాయణ, నేను దీనిమీద చాలా చర్చించుకున్నాం. మా మధ్య ఇతరంగా భిన్నాభిప్రాయాలున్నా ఈ విషయంలో మాత్రం ఏకాభిప్రాయం ఉండింది. ఎవరినైనా సరే, చట్ట వ్యతిరేకంగా, చంపగూడదు. ఎంత పెద్దనేరమైనా సరైన విచారణ జరిపి శిక్ష విధించాలి. ఇది ఒక ఉదారవాద ఆలోచన. దానికీ పార్టీ రాజకీయాలకూ ఏమీ సంబంధం లేదు. ఒక వ్యక్తి అవలంబించే రాజకీయాలతో నీకు ఇష్టం లేకపోయినా, ఆ వ్యక్తిని చంపివేసే అధికారం నీకు లేదు అనేది ఒక చట్టబద్ధపాలనా సూత్రం. అది మా విధానం. ఇప్పటికీ మారని విధానం.

జస్టిస్ భార్గవా కమిషన్ విచారణ సందర్భంగా నేను గమనించిన మరొక విషయ మేమంటే పోలీసు అధికారులు నిజంగా చాలా పిరికివాళ్ళు. నా చేతులు పట్టుకుని, ఇవి చేతులు కావు, కాళ్ళనుకో అన్న పోలీసు అధికారులు ఎందరో ఉన్నారు.

ఇక్కడ ఒక సంఘటన చెప్పాలి.

డాక్టర్ మజీద్‌ఖాన్ అని ఒక మానసిక వైద్యుడు ఉన్నారు. భార్గవా కమిషన్ విచారణ జరుగుతున్నప్పుడు ఆయన నాకు ఫోన్ చేశారు. ఆయన నాకు అంతకుముందు పరిచయమే. ఫోన్ చేసి "మీరేదో కేంద్ర ప్రభుత్వానికి కొందరు పోలీసు అధికారుల మీద ఫిర్యాదు చేశారట. ఎవరెవరి పేర్లు రాశారో చెపుతారా" అని అడిగాడు.

తార్కుండే కమిటీ విచారణలో ఏయే పోలీసు అధికారుల మీద అభియోగాలు వచ్చాయో ఆ పేర్లు మేం కేంద్ర ప్రభుత్వానికి సీల్డ్ కవర్లలో పంపుతుండేవాళ్ళం. ఆ సీల్డ్ కవర్లలో తమ పేర్లున్నాయేమోనని అధికారులు భయపడి చస్తుండేవాళ్ళు. అట్లా భయంతో, మానసిక వేదనతో ఈ మానసిక వైద్యుడిని సంప్రదించి ఉంటారు.

డా. మజీద్‌ఖాన్ నాకు ఫోన్ చేసి, 'మీరు ప్రభుత్వానికి పంపిన జాబితా చదివి వినిపించండి. నా దగ్గరికి వైద్యానికి వస్తున్న అధికారి ఉన్నాడో లేడో తెలుస్తుంది. తద్వారా నేను సరైన చికిత్స చేయగలను' అన్నాడు.

"డాక్టర్ గారూ-మీరూ ఒక వృత్తి నిపుణులు. మీ దగ్గరికి ఎవరెవరు ఏయే వైద్యం కోసం వస్తారో మీరు రహస్యంగా ఉంచుతారు. మీ దగ్గరికి వచ్చే రోగులు అందువల్లనే మీ మీద విశ్వాసం ఉంచుతారు. మరి నేనూ మీ లాగనే మరొక వృత్తి నిపుణుడిని. భార్గవా కమిషన్ విచారణ వల్ల మనసు చెదిరిపోయి మీ దగ్గరికి చికిత్సకు వచ్చే అధికారి ఎవరో నేను అడగను. నేను ఎవరి పేర్లు రాశానో మీరు అడగకూడదు. అది వృత్తి రహస్యం" అన్నాను.

అంతేనా అన్నాడాయన. అంతే అన్నాను.

ఎవరెవరు భయంతో మానసిక వైద్యుడిని ఆశ్రయించారో ఆ తర్వాత నాకు తెలిసింది. ?ది వేరే కథ.

మీకు ఒక విశ్వాసం ఉంటే ధైర్యంగా చెప్పండి. "నేను సైద్ధాంతికంగా కమ్యూనిస్టు వ్యతిరేకిని. అందువల్ల కమ్యూనిస్టయిన ప్రతివాడినీ చంపి పారేస్తాను" అని బహిరంగంగా ప్రకటించండి, కాని తప్పుడు సాకులు చెప్పకండి.

ఇది కేవలం నక్సలైట్ల విషయంలో మాత్రమే కాదు. ఎవరి విషయంలోనైనా అంతే. చంపే అధికారం పోలీసులకు లేదు.

నక్సలైట్ల కేసులు ఏవయినా తీసుకోండి. ఆ కేసులో ముద్దాయిల సంఖ్యలో కనీసం సగం మందిని ఛార్జిషీటు పెట్టకముందే పోలీసులు చంపేసి ఉంటారు. అంటే వాళ్ళు చేసిన నేరమేమిటో కోర్టుకు నివేదించకముందే, వాళ్ళు ఆ నేరం చేశారా లేదా, లేదా సాక్ష్యాధారాలతో కోర్టు నిర్ధారించకముందే పోలీసులే వాళ్ళకు శిక్ష విధించేశారన్న మాట. అదికూడా ఏకంగా మరణశిక్ష విధించారన్నమాట. ఇది ఏం పాలన?

ఇటువంటి అకృత్యాలకు అడ్డుపడాలని పౌరహక్కుల కార్యకర్తలు ప్రయత్నిస్తే, వాళ్ళనూ చంపుతారు, లేదా కేసుల్లో ఇరికిస్తారు. పోలీసుల హింసను ఎవరు వ్యతిరేకిస్తారో, పోలీసులకు ఆ హింస చేసే అధికారం లేదని ఎవరు గొంతెత్తుతారో వాళ్ళను టెర్రరిస్టుగా చిత్రిస్తారు పోలీసులు.

ఇటువంటి ఆరోపణలు జస్టిస్ తార్కుండే పైన కూడ చేశారు. బ్రహ్మ చెల్లానీ అనే జర్నలిస్టు కేసు చేసినందుకు తార్కుండేను కూడ టెర్రరిస్టు అన్నారు. తార్కుండే ఒకరకంగా కమ్యూనిస్టు వ్యతిరేకి. రాడికల్ హ్యూమనిస్టు. హైకోర్టు జడ్జిగా పని చేశాడు. అయినా ఆయన మీద ఇటువంటి ఆరోపణ చేశారు.

సరే, జస్టిస్ భార్గవా కమిషన్ గిరాయిపల్లి సంఘటనను సంపూర్ణంగా విచారించింది గనుక, సాక్ష్యాల సేకరణ, పరిశీలన పూర్తయింది గనుక అంతవరకయినా మధ్యంతర

నివేదిక వస్తే పోలీసు వ్యవస్థ పనితీరు కొంతలో కొంతయినా మెరుగుపడేది.

ఆ నివేదిక రాకపోవడంతో, జస్టిస్ భార్గవా కమిషన్‌ను మూసివేయించడంలో పోలీసులు విజయం సాధించడంతో, ఆవిధంగా మెరుగుపడే అవకాశమే పోయింది. ఇప్పుడిక మనుషులను చంపడమే ఒక పాలనా విధానంగా పాలకులు తయారు చేసుకున్నారు. అందుకు వాళ్ళ చేతుల్లో ఆయుధంగా పోలీసులు ఉపయోగపడుతున్నారు.

జస్టిస్ భార్గవా కమిషన్ విచారణ ఇట్లా ఇబ్బందులను ఎదుర్కొంటుంటే దాన్ని కాపాడడానికి కేంద్ర ప్రభుత్వం కూడా సహకరించలేదు. అప్పటికే జనతా ప్రభుత్వం ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ఇక ఇందిరా గాంధీ తిరిగి అధికారంలోకి రాగానే ఎన్‌కౌంటర్ హత్యలు మళ్ళీ మొదలయ్యాయి.

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ, కేంద్రంలో జనతా ప్రభుత్వం ఉన్నన్ని రోజులు, భార్గవా కమిషన్ విచారణ జరుగుతున్నన్ని రోజులు రాష్ట్రంలో కూడ ఎన్‌కౌంటర్ హత్యలు లేవు.

ఆ రోజుల్లో నల్గొండ జిల్లాకు సూపరింటెండెంట్‌గా కెఎస్ వ్యాస్ పనిచేసిన కాలంలో కుప్పలు తెప్పలుగా ఎన్‌కౌంటర్లు జరిగాయి. అప్పటినుంచి ఎన్‌కౌంటర్ హత్యలు కొనసాగుతూనే ఉన్నాయి.

ఈ ఎన్‌కౌంటర్ హత్యలలో చెప్పుకోవలసిన సంఘటన మందాడి రవీందర్ రెడ్డి, నర్సయ్యల ఎన్‌కౌంటర్. వాళ్ళిద్దరూ సికిందరాబాద్ కుట్రకేసులో నిందితులు. ఆ కేసులోనూ, ఇతర కేసుల్లోనూ వాళ్ళమీద వేర్వేరు కోర్టులలో విచారణ జరుగుతూనే ఉంది.

వాళ్ళు బెయిల్ మీద ఉన్నారు. వాళ్ళను అరెస్టు చేసి సూర్యాపేట మున్సిఫ్ మేజిస్ట్రేట్ ఇంటి దగ్గర, ఆ మేజిస్ట్రేట్ ముందర హాజరు పరిచారు. లోపల హాజరు పరిచి, బైటికి తీసుకువచ్చి, గేటు దాటగానే కాల్చి చంపేశారు. అంటే జుడిషియల్ కస్టడీలో ఉండగా కాల్చి చంపేశారు. చాలా ప్రత్యేకమైన, దుర్మార్గమైన సంఘటన ఇది. హైకోర్టు పట్టించు కోలేదు. చట్టబద్ధపాలన అమలు చేస్తామనే వాళ్ళెవరూ పట్టించుకోలేదు. పోలీసులు దాన్నీ ఎన్‌కౌంటర్‌గానే చూపారు.

ఈ ఎన్‌కౌంటర్ పై నిజనిర్ధారణ జరపడానికి నేను, జార్జిఫెర్నాండెజ్, మరికొంత మంది వెళ్ళాం. మేజిస్ట్రేట్‌తో మాట్లాడాం. మా నివేదిక విడుదల చేశాం. ఏమీ జరగలేదు.

నా యాభై ఏళ్ళ అనుభవంతో స్పష్టంగా చెప్పగలదేమంటే పోలీసుల దుర్మార్గాలను సరిచేయాలని ప్రభుత్వాలు అనుకోవడం లేదు. తాము అనాగరికంగా ప్రవర్తిస్తున్నామని, తమ పనితీరు మార్చుకుని, చట్టబద్ధంగా ప్రవర్తించాలని పోలీసులు అనుకోవడం లేదు.

కొంతమంది చెడ్డ ఆఫీసర్లు ఉండడం వల్లనో, కొందరి దుష్ప్రవర్తన వల్లనో ఇలా జరుగుతోందని, ఇది ఒక మినహాయింపు మాత్రమేనని కొందరు అంటారు. కాని అది

తప్పు. ఇది వ్యక్తిగత వ్యాధి కాదు. జాతీయ పోలీసు అకాడమి నుంచి పది, పదిహేను మంది పోలీసు అధికారులు వచ్చి దుకాణాదారును కొట్టారంటే అది మినహాయింపు కాదు.

అది అధికార ఉన్మాదం. పోలీసు శాఖలో ఎందుకు చేరుతున్నామంటే అధికారం సంపూర్ణంగా దక్కుతుంది. ఎవరినయినా అణచివేయడానికి అవకాశం దొరుకుతుంది అని. అధికారాన్ని దుర్వినియోగం చేస్తే గాని అధికారపు మజా తెలియదు.

ఈ రకమైన శిక్షలేని, శిక్షాభయం లేని అధికార ఉన్మాదం, ఇంప్యునిటీ 1980ల నుంచీ పెరుగుతూనే వస్తోంది. ఈ స్వభావాన్ని ఎంతగా పెంచి పోషించారంటే, ఈ పోలీసులు ప్రైవేటు దుస్తులతో, ప్రభుత్వం సరఫరా చేసిన ఆయుధాలతో, నంబర్ ప్లేట్లు లేని వాహనాలలో వచ్చి మనుషులను చంపిపోతారు.

ఆ స్వభావాన్ని వ్యతిరేకించే పోరాటం చేయడమే పౌరహక్కుల ఉద్యమ లక్ష్యం. ఇంతకాలంగా పౌరహక్కుల ఉద్యమకారులందరమూ చేస్తున్నది ఆ పోరాటమే.

ఎన్‌కౌంటర్లు ఇప్పుడయితే నిర్విచక్షణగా చేస్తున్నారు గాని మొదటినుంచీ ఈ ఎన్‌కౌంటర్ ఘటనలన్నిటినీ చూస్తే నాయకులను ఏరి చంపడం కనబడుతుంది. అంటే ఏమిటన్నమాట? ఒక నాయకుడ్ని చంపితే ఆ ఉద్యమం బలహీన పడుతుంది. అంటే నాయకులను చంపడమనేది ఒక ఉద్దేశ్యపూర్వక విధానం అన్నమాట.

ఇటీవల రామకృష్ణను చుట్టుముట్టారన్న వార్త వచ్చింది. ఆయన చర్చలలో పాల్గొన్న నాయకుడు. అప్పుడు చాలామంది 'అంత పెద్ద చేప దొరికితే చంపకుండా వదిలి పెడతారా' అన్నారు. ఆ మాట ఏ పోలీసు అధికారి దగ్గరయినా వచ్చి ఉండవచ్చు. లేదా ఎవరయినా మామూలు మనుషులు కూడా అని ఉండవచ్చు. ప్రజలలో ఉన్న అవగాహన అది.

రాజకీయాలంటే, పాలన అంటే ప్రజలకు, పోలీసులకు కూడ ఉన్న అవగాహన అదే. నాయకులను పోలీసులు చంపుతారు అనేది అందరికీ తెలిసిన విషయం.

ఈ ఎన్‌కౌంటర్ ఘటనలన్నీ ఎట్లా అయిపోయాయంటే అది జరిగిన చోటికి వెళ్ళకుండా కూడా అది ఎట్లా జరిగి ఉంటుందో నేను రాయగలను. అది నిజం కూడ అవుతుంది. అందువల్లనే పౌరహక్కుల సంఘాలు ఘటనలు జరిగిన చోటికి వెళ్ళి, ప్రజలను కలిసి రూపొందించిన నిజ నిర్ధారణ నివేదికలు అంతగా వాస్తవికంగా ఉంటున్నాయి. పోలీసులు గాని, ప్రభుత్వాలు గాని ఆ నివేదికలలో ఏ ఒక్క అంశాన్నీ తప్పు అని చెప్పలేక పోతున్నాయి.

మేళ్ళచెరువు నాగేశ్వరరావును చంపేశారు. ఆయన దళితుడు. అమృత రెడ్డి అనే ప్రైవేటు వ్యక్తికి తుపాకి ఇచ్చి కాల్చి చంపేయమన్నారు. అప్పుడు కృష్ణమూర్తి ఎస్పీ. ఈ సంఘటన మినహాయిస్తే ఆయన చాల మంచి అధికారి. ఈ హత్యే ఆయన చరిత్ర మీద

మచ్చు. మరోరకంగా చెప్పాలంటే, ప్రభుత్వ భాషలో చెప్పాలంటే ఆయన అసమర్థుడైన ఎస్పీ అన్నమాట. పరిస్థితులు అట్లా మారిపోయాయి. మంచి అధికారులను అసమర్థులనే పరిస్థితి వచ్చింది. ఆయన ఎస్పీగా తన శాఖను కేవలం కాగితాల మీద పాలిస్తుండే వాడే గాని పెద్దగా చట్టవ్యతిరేక పనులకు పూనుకోలేదు.

నాగేశ్వరరావు హత్య తర్వాత నేను వెళ్ళి ఆయనను ఇంటర్వ్యూ చేశాను. 'నన్నీ ప్రశ్నలు అడగడానికి మీరెవరు' అని అడిగాడాయన.

'నేను ఒక పౌరుణ్ని, మిమ్మల్నీ, ఏ అధికారినైనా ప్రశ్నించే హక్కు నాకుంది' అని చెప్పాను.

నేను, తారకం గారు మరికొందరం అక్కడికి వెళ్ళాం. మేం అడిగిన కొన్ని ప్రశ్నలకు జవాబు చెప్పడానికి ఆయన నిరాకరించాడు.

అట్లా అడుగుతూ పోతుంటే 'సెల్ఫ్ డిఫెన్స్' (ఆత్మరక్షణ) అన్నాడు. సాధారణంగా పోలీసులకు ఉండే జవాబు అది ఒక్కటే.

ఆత్మరక్షణ అనే మాట వెనుక ఎంత చట్టపరమైన వాదనలు ఉన్నాయి! చంపేసి ఎందుకు చేశావయ్యా అంటే ఆ జవాబు చెప్పడానికి ఎంత అగాహన కావాలి! మన పోలీసులకు దానితో పనిలేదు. ఎవడిని పడితే వాడిని చంపేసి 'ఆత్మరక్షణ కోసం చంపాం' అనవచ్చు.

ఈ వ్యవహారమంతా నేను జస్టిస్ భార్గవ కమిషన్ ముందు వాదనలలో తేటతెల్లం చేశాను. 'ఆత్మరక్షణ అనే సాకుతో ఎవరినైనా చంపిపారేయవచ్చునా' అని ప్రశ్నించాను.

ప్రతి ఎన్‌కౌంటర్ విషయంలోనూ ఒక ఎఫ్ఐఆర్ తయారవుతుంది. అందులో చనిపోయిన వ్యక్తిపేరు రాస్తారు. ఆ వ్యక్తి మీద సెక్షన్ 307 (హత్యా ప్రయత్నం), సెక్షన్ 147, 148, 149 (దొమ్మీ, ఆయుధ ధారణ, చట్టవ్యతిరేక సమావేశం) ల కింద అభియోగాలు నమోదు చేస్తారు.

నిజానికి ఈ ఎఫ్ఐఆర్ ఒక్క నేరాన్ని కాదు, రెండు నేరాలను నమోదు చేస్తుందన్న మాట. మీరు ఆ ఎఫ్ఐఆర్‌ను జాగ్రత్తగా చదివితే అందులో మృతుడు పాల్పడినట్టుగా చెపుతున్న నేరం ఉంటుంది. ఆ వ్యక్తిని ఆత్మరక్షణార్థం కాల్చి చంపిన నేరం కూడ ఉంటుంది. అది ఆత్మరక్షణే అనుకుందాం. కాని అది ఆత్మరక్షణ కోసం చేసిన హత్య. అంటే ఎఫ్ఐఆర్ ఏం చెపుతుందంటే ఒక హత్య జరిగింది. కాని ఆ హత్యలో అంతకు ముందు హత్య చేయడానికి ప్రయత్నించిన వ్యక్తి చనిపోయాడు. అంటే ఇందులో ఒకరి హత్యా ప్రయత్నం నేరం ఉంది. మరొకరి హత్యానేరం ఉంది.

ఈ రెండు నేరాలను విచారించాలి. పరిశోధించి, సాక్ష్యాధారాల ద్వారా నిజం తేల్చాలి. అది ఆత్మరక్షణార్థమే జరిగిందా, ఆ ఆత్మరక్షణా ప్రయత్నానికి ముందు జరిగిన ఘర్షణ ఎంత, అవతలివైపు నుంచి ఎంత పెద్ద ఎత్తున బలప్రయోగం జరిగింది, ఇటువైపు నుంచి జరిగిన బలప్రయోగం అంతదేనా, అంతకన్నా ఎక్కువదా, అది అవసరమైనదేనా-

ఇవన్నీ విచారించడానికి న్యాయస్థానాలున్నాయి.

నేనీ వాదనంతా జస్టిస్ భార్గవ ముందర వినిపించాను. ఆయన నా వాదనతో ఏకీభవించారు.

కాని పోలీసులు, ప్రభుత్వంలో ఉన్నవాళ్ళు ఈ చట్టపరమైన విషయాలను పట్టించుకునే స్థితిలో లేరు. నోటికి ఏది వస్తే అది చెప్పేస్తున్నారు.

ఈ విషయంలో రాజశేఖర రెడ్డి సూటిగా చెప్తున్నాడు. 'వాళ్ళు చంపుతుంటే చంపకుండా ఎట్లా ఉంటారయా' అని నేరుగా అడిగేస్తున్నాడు. రాయలసీమ భాషలో ప్రతీకారం గురించి మాట్లాడుతున్నాడు. చంద్రబాబు నాయుడు చంపే హక్కు ఉన్నదనే అనుకున్నాడు. ఎన్.టి. రామారావుకు ఈ విషయాలు ఇంతగా తెలియవనుకుంటాను.'

ఇండియన్ పీనల్ కోడ్‌లో ప్రభుత్వోద్యోగులు తమ విధి నిర్వహణలో భాగంగా ఎవరినైనా చంపితే, అది హత్యానేరానికి మినహాయింపుగా చూడాలి ఉన్నమాట నిజమే. కాని ఆ మినహాయింపు పొందాలంటే ఆ అతి బలప్రయోగం విధి నిర్వహణలో భాగంగా అవసరమైందని రుజువు చేయాలి. న్యాయస్థానం నమ్మడానికి సాక్ష్యాధారాలు సమర్పించాలి. ఎవిడెన్స్ అక్ట్ ఏమంటుందంటే, ఏదయినా విషయంలో నువు మినహాయింపును కోరుతున్నావంటే, ఆ మినహాయింపు ఏ నేరానికి సంబంధించినదో, ఆ నేరం జరిగిందన్నమాట. అప్పుడు ఆ నేరం ఏ పరిస్థితుల్లో జరిగిందో, అది ఎట్లా మినహాయింపు అవుతుందో వివరించాలి. న్యాయస్థానాన్ని ఒప్పించాలి.

అయితే ఈ ధర్మసూక్ష్మాలన్నిటినీ ఏ రకంగానైనా వ్యాఖ్యానించవచ్చు. దేశంలో ఫాసిజం ఎంతగా కమ్ముకుని వస్తున్నదంటే, ఇంకే గత్యంతరం లేదు. సాధారణ అవగాహన ప్రకారం అయితే, ఎవరయినా 'నా ఆత్మరక్షణ కోసం అవతలి వ్యక్తిని కాల్చి చంపాను' అని చెప్పినట్టయితే. ఆ అనివార్య పరిస్థితి ఎలా వచ్చింది. ఆ సన్నివేశం ఏమిటి అని వివరించాలి. అటువైపు అయుధాలు లేకపోతే ఆ సన్నివేశాన్ని వివరించడం చాల కష్టం. కాని అటువైపు ఆయుధాలు ఉన్నాయి గనుక పోలీసులు సులభంగా ఈ మాట చెప్పగలుగుతున్నారు.

కాని ఆ పరిస్థితిలో కూడ అటువైపు ఉన్న అయుధాలేమిటి? చాల సందర్భాలలో తపంచాలు, అంటే రైతులు పంటలను రక్షించుకోవడానికి, పందికొక్కులను చంపడానికి వాడే అయుధాలు. వాటితో నిజంగా పోలీసులను చంపగలరా? అత్యాధునిక అయుధాలున్న పోలీసులు తపంచాలను చూసి ఆత్మరక్షణా భయంలో పడడం నిజమేనా?

ఏదో ఒకవిధంగా వివరణ వస్తూనే ఉంటుంది. అది సరైనది కావచ్చు, కాక పోవచ్చు. వినే ప్రజలు శ్రద్ధగా, నిశితంగా పరిశీలించకపోతే, ఇంత అసంబద్ధంగా ఉందేమిటి అని ప్రశ్నించకపోతే చెప్పేవాడు చెపుతూనే ఉంటాడు. చెప్పేవాడికి వినేవాడు లోకువ అని సామెతే ఉంది గదా.

ప్రజలలో మానసిక అప్రమత్తత లేదు. జాగరూకత లేదు. ఇదేమిటి, ఇంత పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నాడు. ప్రజాస్వామిక అధికార బాధ్యతలు నిర్వహించేవాడు ఇట్లా మాట్లాడవచ్చునా అని నిరంతరం ప్రజలు కనిపెట్టుకుని ఉండాలి. అది లేదు గనుక ఇటువంటి మాటలు వస్తూనే ఉంటాయి.

ప్రస్తుత డిజిపి స్వరణ్‌జిత్‌సేన్ మాట్లాడుతున్న మాటలు చూడండి. ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నాడు. 'అధికారం ఉంది కాబట్టి ఏమయినా మాట్లాడుతాను' అనుకోవడం వేరు. పదవి వచ్చిన పరిధి లోపల మాట్లాడుతున్నావా లేదా అనేది వేరు. అది ఎవరికీ తెలిసినట్టు లేదు.

అందుకే నేనేమంటానంటే, అధికారాన్ని దుర్వినియోగం చేయకపోతే అధికారం అనుభవించినట్టే ఉండదు. అధికారపు మజా తెలియాలంటే దాన్ని దుర్వినియోగం చేయాల్సిందే. అధికారం మాత్రమే నిర్వహించాలంటే దర్పం అక్కరలేదు. ఫోటోలు, వీడియోలు ప్రచారం అక్కరలేదు.

ఇది ఎవరూ ఒప్పుకోవడం లేదే, ఏం చేయాలి అని ఆలోచిస్తున్నారు. రమీజాబీ రేప్, ఆ తర్వాత ప్రజాందోళనలు జరిగాయి. అప్పుడు జస్టిస్ ముక్తధర్ కమిషన్ వేశారు. అది కస్టడీలో జరిగిన హింస. ఆ సమయంలో సయ్యద్ బిన్ అలీని ఇంటికి వెళ్ళి బైటికి పిల్చి కాల్చి చంపారు. రౌడీని కాల్చిచంపినారు కాబట్టి అతను నక్సలైటు కాదు కాబట్ట న్యాయస్థానం సరిగా స్పందిస్తుందేమో అని నేను వాదించదలచు కున్నాను. ఆ కేసు చేసే న్యాయవాదికి విజ్ఞప్తి చేసి నేను వాదించడం మొదలు పెట్టాను.

జస్టిస్ ముక్తధర్ దగ్గర చెప్పాను. ఇండియన్ ఎవిడెన్స్ ఆక్ట్‌లో సెక్షన్ 105 ఉంది. దాని ప్రకారం ఎవరయినా మినహాయింపు కోరుకుంటున్నట్టయితే, ముందుగా నేరం జరిగిందని అంగీకరించాలి. ఆ నేరానికి ఛార్జిషీట్ తయారు చేయాలి. ఆ నేరాభియోగానికి గురయిన వ్యక్తి ఆ నేరం ఏ పరిస్థితుల్లో చేయవలసి వచ్చిందో, అది ఎందువల్ల మినహాయింపు అవుతుందో రుజువు చేసుకోవడానికి పూర్తి అవకాశాలు ఇవ్వాలి. చాలసేపు వాదించాను.

ముక్తధర్ ఇబ్బందిలో పడ్డారు. నా వాదనను ఒప్పుకోక తప్పదు. అందుకని ఈ కేసును ఫుల్‌బెంచికి నివేదించారు. ఆ బెంచిలో జస్టిస్ రామచంద్రరావు, నరసింగరావు ఉన్నారు.

మన జడ్జీలు కూడ ఎలా ఉంటారంటే, మరి పోలీసులకు తుపాకులు ఎందుకు ఇస్తున్నారు అని ప్రశ్నించారు.

'తుపాకులు ఇచ్చేది కాల్పులు జరిపి జనాన్ని చంపి పారేయడానికి కాదండీ' అన్నాను. ఆ జడ్జి వకీళ్ళతో బాగా మాట్లాడుతుండేవాడు. కోర్టు హాల్లో చర్చ బాగుండేది. చాల మంచి జడ్జి ఆయన.

పెద్ద ఎత్తున ప్రజలు గుంపుగా మీద పడితే, దొమ్మీ జరిగితే అప్పుడు ఉపయోగించ

డానికి తుపాకులు ఇచ్చారు. అప్పుడు కూడ ప్రజలను హెచ్చరించడం, గాలిలో కాల్పులు జరపడం, మెజిస్ట్రేటు అనుమతితోనే కాల్పులు జరపడం, అప్పుడు కూడ నేరుగా మనుషులకు గురిపెట్టి కాకుండా, మోకాళ్ళ కింద కాల్చడం లాంటి ఎన్నో నిబంధనలున్నాయి.

దేశంలో ఏ ఒక్క చట్టమయినా పోలీసులకు ప్రజలను కాల్చి చంపే అధికారం ఉంది అని చెప్పలేదు. అప్పుడూ ఈ మాటే చెప్పాను. ఇప్పటికీ నా బలమైన విశ్వాసం అదే. పోలీసులకు ప్రజలను కాల్చి చంపే అధికారం లేదు.

అప్పుడు ఓబులపతి చౌదరి గారు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఉన్నారు. నేనొక ప్రతిపాదన చేశాను. ఒక రోజంతా సమయం తీసుకోండి - ఏ చట్టంలో ఏ నిబంధ నయినా పోలీసులకు ప్రజలను చంపే అధికారం ఇస్తుందేమో చూపెట్టండి.

అటువంటి అధికారం లేదు. ఎందుకంటే, పోలీసులకు అటువంటి అధికారం ఇస్తే అది చట్టం విధించిన విచారణాక్రమానికి ప్రత్యామ్నాయం అవుతుంది. అంటే అప్పుడు చట్టం చట్టవ్యతిరేకం అవుతుంది. అన్యాయమైన చట్టం అవుతుంది.

రాజ్యాంగంలో 21వ అధికరణం ఉన్నంతవరకు అటువంటి అధికారం ఇచ్చే చట్టానికి అవకాశం లేదు. మరి ఆ అధికరణమేమో చట్టం నిర్దేశించిన ప్రక్రియ ప్రకారం తప్ప మరొక రకంగా ప్రాణం తీసే అధికారం లేదు అని ప్రకటిస్తుంది. అధికరణం 21 ఉన్నంతవరకు ఏ అధికారికీ మనుషులను కాల్చి చంపే అధికారం లేదు.

ఒక అధికారి, చట్టబద్ధమైన విచారణ లేకుండా, మనుషులను ఇష్టం వచ్చినట్టుగా కాల్చి చంపవచ్చు అని రాజ్యాంగంలో రాసుకోలేదు గదా. చట్టం విధించిన విచారణా ప్రక్రియ ప్రకారం అని రాజ్యాంగంలో రాసుకున్నాం గదా.

అందువల్ల అటువంటి పద్ధతిలో కాల్చి చంపితే అది అన్యాయమవుతుంది. అందువల్ల అసమంజసమవుతుంది. అది నిరంకుశాధికారం అవుతుంది.

ఇట్లా వాదించాను. న్యాయమూర్తికి ఎటూ తోచలేదు. కడపటికి ఏం చేసినాడంటే, మీరు ప్రైవేటు కంప్లెయింట్ వేసుకోండి అని కొట్టేశాడు.

ఒక అన్యాయమైన పని జరిగిందంటే అందరికందరూ ప్రజలకు వ్యతిరేకంగా ఏకమవుతారు. ముఠాకడతారు. మొత్తం వ్యవస్థలోని అంగాలన్నీ ఒక్కదగ్గరికి వస్తాయి. ఆ అన్యాయం వల్ల బాధితులెవరో, ఆ బాధితులకు వ్యతిరేకంగా వ్యవస్థ అంతా ఏకమవుతుంది.

రమీజాబి వేశ్య. నక్సలైట్లు నెత్తురు తాగుతారు. టెర్రరిస్టులు అనైతికంగా ప్రవర్తిస్తారు. ఇట్లా ఆరోపణలు చేసేది, ఆ అన్యాయపు పని నుంచి తప్పించుకునేది. జిందా, సుఖాల విచారణ చూడండి. ఆ మొత్తం విచారణ క్రమంలో వాళ్ళిద్దరూ నీతి బాహ్యులని, చాలా అనైతికమైన పనులు చేశారని చూపడానికి వెయ్యి ఆధారాలు న్యాయస్థానం ముందర

పెట్టారు. వాళ్ళకు బొంబాయిలో, పూనాలో వేశ్యలతో సంబంధా లున్నాయని చూపారు.

అవన్నీ అబద్ధాలు. వాటిలో ఒక్కదాన్ని కూడ న్యాయమూర్తి కూడా నమ్మలేదు. ఆ ఇద్దరూ చాల మతాభినివేశం గల వ్యక్తులు. తాము ప్రాణప్రదంగా ఎంచే స్వర్ణ దేవాలయం లోపలికి టాంకులు, శతఘ్నులు వెళ్ళి బాంబులు వేయడం, నేలమట్టం చేయడం వారిని కలచివేసింది. అందుకు బాధ్యుడుగా భావించిన జనరల్ వైద్యను వాళ్ళు హత్య చేశారు. ఆ సంగతి వాళ్ళే ఒప్పుకున్నారు. అందుకు కోర్టు వాళ్ళకు శిక్ష కూడా విధించింది.

కాని ఈ విచారణా క్రమంలో ప్రాసిక్యూషన్ ఆ ఇద్దరు ముద్దాయిల మీద ఎన్నో అబద్ధాలు ప్రచారం చేసి ఛార్జిషీట్‌లో కూడా రాసిందే. వాటిని న్యాయమూర్తి కూడా నమ్మలేదే. మరి తీర్పులో వాటి గురించి ఒక్కమాట లేదు.

అంటే మొత్తం వ్యవస్థ న్యాయానికి వ్యతిరేకంగా పనిచేయాలని, చేస్తుందని మనం అనుకుంటాం.

భార్గవా కమిషన్ తర్వాత ఇరవై సంవత్సరాలు గడిచిపోయాక ఒక రెండు ముఖ్యమైన పరిణామాలు సంభవించాయి.

* * *

# భార్గవా కమిషన్ తర్వాత ఎన్‌కౌంటర్లు

మొదటిది, మధుసూదన్ రాజ్ యాదవ్ కేసులో హైకోర్టు తీర్పు.

మధుసూదన్ రాజ్ యాదవ్ చాల చురుకైన, నెమ్మదస్తుడయిన యువకుడు. ఆయన పెళ్ళి నేనే చేశాను. చనిపోయే నాటికి నలభై రెండేళ్ళో ఏమో, ఆయన కుటుంబం నేపథ్యం కూడ చాల మంచిది. వాళ్ళ నాన్న ప్రభుత్వోద్యోగిగా పనిచేశాడు.

ఆయనతో నాకు ఎన్నో సన్నిహిత అనుభవాలున్నాయి. ఒకరోజు నేను ఒంటరిగా గోల్కొండ చౌరస్తా నుంచి గాంధీనగర్ వెళ్ళే దారిలో నడిచి వెళ్తున్నాను. మధుసూదన్ రాజ్ స్కూటర్‌లో నా పక్కకు వచ్చి, 'సార్, ఎందుకు సార్, ఒంటరిగా నడిచిపోతున్నారు? ఎవరయినా ఏమయినా చేయొచ్చు. ఒంటరిగా ఎప్పుడూ వెళ్ళకండి' అని హెచ్చరించి, స్కూటర్ మీద ఎక్కించుకుని మా స్నేహితుడి ఇంట్లో వదిలిపెట్టాడు.

మధుసూదన్ రాజ్ అంతకు ముందు పిడిఎస్‌యులో చురుకైన కార్యకర్తగా ఉండేవాడు. మేం 1978లో కాళోజీని వెంగళరావు మీద ప్రత్యర్థిగా నిలబెట్టి పోటీ చేసినప్పుడు ఆ ఎన్నికల ప్రచారంలో మధుసూదన్ రాజ్ కీలకపాత్ర పోషించాడు.

ఆ మధుసూదన్ రాజ్‌ను 1995 జూలై 26న హైదరాబాద్‌లో గాంధీనగర్‌లో ఒక ఇంట్లో పట్టుకుని కాల్చి చంపేశారు. అది ఒక ఎన్‌కౌంటర్ అని ఆ ఎన్‌కౌంటర్‌లో ఒక-

గుర్తు తెలియని పీపుల్స్ వార్ నక్సలైటు మరణించాడని మర్నాడు పత్రికల్లో పోలీసు ప్రకటనలు వచ్చాయి. అటువంటి పోలీసుల కట్టుకథలు మామూలయి పోయాయి గదా.

కాని ఆ రోజు నేను ఏదో కేసు పనిమీద హైకోర్టులో ఉన్నాను. నా జూనియర్ న్యాయవాది ఎస్.భరత్ కుమార్ వచ్చి 'సార్ ఇది మధుసూదన్ రాజ్ యాదవ్ కావచ్చు ననుకుంటున్నారు. ఈ ఎన్‌కౌంటర్ జరిగిన సమయం నుంచి ఆయన ఆచూకీ తెలియడం లేదంటున్నారు' అని చెప్పాడు.

'ఒకవేళ ఈ ఎన్‌కౌంటర్‌లో చనిపోయినది మధుసూదన్ రాజ్ యాదవే అయితే మనం ఏమయినా చేయాల్సి ఉంటుంది' అని నేననుకున్నాను. 'మధుసూదన్ రాజ్ లాంటి వాడికి ఇది జరగకూడదు' అనుకున్నాను. ఏ ఎన్‌కౌంటర్ హత్య విషయంలో నయినా నేను అట్లాగే స్పందిస్తాను. కాని మధుసూదన్ రాజ్ అనే సరికి నాకు అప్పటికి పదిహేనేళ్ళకు పైగా పరిచయం గనుక వెంటనే ఏమయినా చేయాల్సిందే అనుకున్నాను.

నేను కోర్టు హాల్లోకి వెళ్లి ఇట్లా ఒక ఎన్‌కౌంటర్ జరిగింది. అది అనుమానస్పదంగా ఉంది. ఎవరూ గుర్తించకముందే పోలీసులు ఆ మృతదేహాన్ని మాయం చేయడానికి కూడ ప్రయత్నిస్తున్నారు. ఆ చంపివేయబడిన వ్యక్తి మధుసూదన్ రాజ్ యాదవ్ అనే యువకుడు కావచ్చునని అనుమానం ఉంది. ఒకవేళ అతనే అయితే, అతను నాకు చాలా పరిచయస్తుడు. అతని పెళ్లి నేనే చేశాను. అందువల్ల ఆ మృతదేహం ఎవరిదో గుర్తించేదాకా మాయం చేయకుండా చూడాలి. ఒకవేళ అతనే అయితే కుటుంబానికి మృతదేహం అందజేయాలి అని ఒక మౌఖిక అభ్యర్థన చేశాను.

అసలు ఈ ఎన్‌కౌంటర్ బూటకమైనదని ఒక రిట్ దాఖలు చేస్తానని కూడా చెప్పాను.

ఈ మౌఖిక ఫిర్యాదును అంగీకరించిన హైకోర్టు ధర్మాసనం మృతదేహాన్ని మధుసూదన్ రాజ్ యదవ్ భార్య స్వర్ణ, తండ్రి నీలకంఠ యాదవ్ నా సమక్షంలో గుర్తుపట్టాలని, అప్పటిదాకా ఆ మృతదేహాన్ని ఎవరూ కదిలించకుండా చూడాలని మధ్యంతర ఉత్తర్వు ఇచ్చింది.

ఆ తర్వాత రెండు వారాలు విచారణ, వాద ప్రతివాదాలు జరిగిన మీదట అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రభాశంకర్ మిశ్రా, న్యాయమూర్తి సి.వి.ఎన్. శాస్త్రి చాల ముఖ్యమైన తీర్పు ప్రకటించారు. 1995 ఆగస్ట్ 14న వెలువరించిన ఆ తీర్పులో వారు ప్రధానంగా చెప్పినదేమంటే, మధుసూదన్ రాజ్ మరణం పోలీసులు చెప్పినట్టు ఎదురుకాల్పులలో జరిగినా అది ఉద్దేశ్యపూర్వకమైన, శిక్షార్హమైన నేరం కిందికే వస్తుంది. ఆ మరణానికి ఎవరు బాధ్యులు, అది హత్య అవునా కాదా అనే విషయం సాక్ష్యాధారాల వల్ల తేలవలసిందే గాని ఏ పక్షం చెప్పినదాన్నయినా యధాతథంగా నమ్మనక్కరలేదు. అంటే ఆ హత్య లేదా మరణం జరిగిన తీరు గురించి సరైన పరిశోధన జరగాలి. ఆ పరిశోధనా ఫలితాలను ఒక న్యాయస్థానం సాక్ష్యాధారాల ద్వారా విచారించాలి.

ఆ తీర్పులో న్యాయమూర్తులు రాసిన కొన్ని మాటలు ముఖ్యమైనవి. "అతని మృతి గురించి నివేదిక ముషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో క్రైం నంబర్ 150/95 గా నమోదయింది. ఎఫ్ఐఆర్ ప్రకారం, సమాచారం అందించిన అధికారి, ఇతర అధికారులు విధి నిర్వహణలో ఉండగా అడ్డుకుని ఆ వ్యక్తి నేరం చేశాడు. అతను వాళ్ళను ఎదిరించాడు. తప్పించుకు పోయాడు. తన రివాల్వర్ తీసి, వారిని చంపే ఉద్దేశ్యంతో కాల్పులు జరిపాడు. ఆత్మరక్షణార్థం వారు ఎదురు కాల్పులు జరపగా అతను అక్కడికక్కడే చనిపోయాడు. ఆ తోపులాటలో కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. ఈ మొత్తంలో మధుసూదన్ రాజ్ యాదవ్‌కు చాలా తూటాలు తగిలాయి. ఒక కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి గాని అవి తుపాకి కాల్పుల గాయాలు కావు. ఒక పోలీసు అధికారుల బృందం తాము ఒక వ్యక్తిని అరెస్టు చేయడానికి వెళ్ళామని, ఆ వ్యక్తి అరెస్టును తప్పించుకున్నాడని, ఆ తప్పించుకోవడంలో బలప్రయోగం చేశాడని, తాము ఎదురు బలప్రయోగం చేస్తే అతను చనిపోయాడని ప్రకటిస్తే ఆ ప్రకటనను అంగీకరించి, అట్లా ఒక ప్రాణం తీయడాన్ని "చట్టబద్ధమైన పద్ధతులు నిర్దేశించినట్టుగా జరిగినదేనని పవిత్రీకరించే చట్టం ఉందా?" అని న్యాయమూర్తులు ప్రశ్నించారు.

'శిక్షార్హమైన హత్య' అనే మాటకు ఇండియన్ పీనల్ కోడ్ ఇచ్చిన నిర్వచనాన్ని ఉటంకించి "మధుసూదన్ రాజ్ యాదవ్ శరీరం మీద తుపాకితో కాల్పులు జరిపిన పోలీసు అధికారులకు ఆ చర్య ద్వారా తాము ఆయన చావుకు కారణమవుతున్నారని తెలియదనడం కష్టం. వారు చేసిన పని సమర్థనీయమవునా కాదా, ఒక నేరం నిర్వచనానికి సరిపోయే ఆ చర్య క్షమార్హమవునా కాదా పరిశీలించవలసిన విషయాలే. కాని వారు చేసిన వాదన నిజానిజాలను చట్టాన్ని అనుసరించి పరీక్షించినప్పుడు, నేరం చేయబడిందనే విషయం గాని, మధుసూదన్ రాజ్ యాదవ్ మీద కాల్పులు జరిపారంటున్న వారి మీద శిక్షార్హమైన హత్యానేరం నమోదు చేయలేదనే విషయంగాని విస్మరించడం సరైనదీ కాదు, న్యాయమైనదీ కాదు. మా ముందుకు వచ్చిన ఈ విషయం గురించి మేం తీవ్రంగా ఆలోచించాం. మధుసూదన్ రాజ్ యాదవ్ తమ మీద కాల్పులు జరిపాడని, అందువల్ల తమకేమీ గాయాలు కాలేదని, తాము అతనిపై కాల్పులు జరిపామని, ఫలితంగా అతను మరణించాడని పోలీసు అధికారులు స్వయంగా చేసిన ప్రకటన మీద ఆధారపడి ఒక కేసు నమోదు చేసుకోవలసిందని, తగిన అధికారుల చేత చట్ట ప్రకారంగా విచారణ జరపవలసిందని, అందుకు తగిన కారణాలున్నాయని మేం భావిస్తున్నాం" అని న్యాయమూర్తులు రాశారు.

ఈ చట్ట పరమైన పరిభాషను మాములు మాటల్లో చెప్పాలంటే అది నిజంగా ఎదురు కాల్పుల ఘటనే, ఎన్‌కౌంటర్ అయినా, ఒక మనిషి ప్రాణాన్ని మరో మనిషి తీయడం జరిగింది. గనుక అది హత్య కేసుగా నమోదు కావాల్సిందే. ప్రాణం తీసిన

వ్యక్తి విచారణ క్రమంలో తాను ఏ పరిస్థితుల్లో, ఆత్మరక్షణ కోసం, ఆ పని చేయవలసి వచ్చిందో వివరించుకోవచ్చు.

ఈ తీర్పు చాల కీలకమైన తీర్పు. జస్టిస్ భార్గవా కమిషన్ తర్వాత ఇరవై సంవత్సరాల తర్వాత ఈ తీర్పు వచ్చిందని గుర్తించాలి. సరిగ్గా జస్టిస్ భార్గవ ముందర నేను ఏమి వాదించానో ఇప్పుడు రాష్ట్ర హైకోర్టు ధర్మాసనం అదే మాట చెప్పింది. ఇరవై ఐదు సంవత్సరాలకు పైగా అవి ఎన్‌కౌంటర్లు కావు, బూటకపు ఎదురు కాల్పులు, హత్యలు అనే నేను, నాబోటి వాళ్ళం చెపుతూ వస్తున్నాం. ఇప్పుడు హైకోర్టు ధర్మాసనం కూడ అవి హత్యలు అని, వాటిని హత్యానేరాలుగా నమోదు చేసి విచారించాలని చెప్పింది. వెంగళరావు పాలనా కాలంలో ఆయనను మేం నరహంతకుడు అని పిలిచాం. ఈ రాష్ట్రంలో ఈ ఎన్‌కౌంటర్ హత్యల విధానానికి రూపశిల్పి ఆయన. లేదా ఎన్‌కౌంటర్ హత్యల విధానాన్ని ప్రోత్సహించి, పాలనా విధానంగా మార్చిన వాడు ఆయన. లేదా ఈ ఎన్‌కౌంటర్ హత్యల విధానాన్ని ఎం.వి. నారాయణరావు రచిస్తే వెంగళరావు ప్రోత్సహించాడు.

అంటే హై కోర్టు ధర్మాసనం తీర్పు ఈ క్రూర హంతక విధానానికి వ్యతిరేకంగా నేను చేసిన వ్యక్తిగత పోరాట సాఫల్యం అనిపించింది. అది నా వ్యక్తిగత పోరాటం కావచ్చు. లేదా రాష్ట్రంలో అద్భుతంగా పురోగమించిన పౌరహక్కుల ఉద్యమానికి నాయకత్వం వహించిన వ్యక్తిగా చేసిన పోరాటం కావచ్చు.

దీనికి సమాంతరంగానే మేం మరొక కార్యక్రమం తీసుకున్నాం. పౌరహక్కుల సంఘం తరపున డాక్టర్ బాలగోపాల్ జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఒక దరఖాస్తు తయారు చేశాడు. ఆ దరఖాస్తులో దాదాపు 250 మంది ఎన్‌కౌంటర్ హత్యల గురించి పూర్తి వివరాలు పొందుపరిచాడు. అవి ఎట్లా నిజమైన ఎదురు కాల్పులు కావో, కార్యకర్తలను, ప్రజలను పట్టుకుని కాల్చివేసి ఎన్‌కౌంటర్ల పేరు పెట్టడం జరిగిందో, కట్టు కథలు అల్లడం జరిగిందో ఆ దరఖాస్తులో వివరించాం.

అప్పుడు జాతీయ మానవహక్కుల కమిషన్‌కు జస్టిస్ రంగనాథ మిశ్రా చైర్మన్‌గా ఉన్నారు. ఆయన గురించి ఎన్ని అభిప్రాయాలు వదంతులు అయినా ఉండవచ్చుగాని, ఆయన తర్వాత ఆ పదవిని అధిరోహించిన వారందరికన్న ఆయన చాలామేలు. ఆయనకు ఒక స్థిరమైన వైఖరి తీసుకునే ధైర్యం ఉండేది.

ఆయనకు ఈ పిటీషన్ సమర్పించి, రాష్ట్రంలో పర్యటించి ఈ విషయాల నిజానిజాలు పరిశీలించమని విజ్ఞప్తి చేశాం. ఆయన ఒప్పుకున్నాడు. నేను ఈ క్రమంలో ఆయనను ఎన్నోసార్లు కలుసుకున్నాను.

పైన చెప్పిన రాష్ట్ర హైకోర్టు ధర్మాసనం తీర్పు 1995లో అయితే, ఈ జాతీయ మానవ హక్కుల కమిషన్ విచారణ 1996లో జరిగింది.

జస్టిస్ రంగనాథ మిశ్రా విచారణ కోసం రాష్ట్రానికి వచ్చి ఐదారు చోట్ల సమావేశాలు ఏర్పాటు చేశాడు. స్వయంగా ఆయన ముందరే పోలీసులు వరంగల్‌లోను, అనంతపురం లోను బాలగోపాల్‌ను కొట్టడానికి ప్రయత్నించారు. ఇక నల్లగొండలో విచారణ జరగ వలసి ఉండింది. అప్పుడు నేను హాజరవుతానని నేనన్నాను. జస్టిస్ రంగనాథ మిశ్రాకు ఫోన్ చేసి చెప్పాను. 'ఆంధ్ర ప్రదేశ్ పోలీసులు ఎటువంటి వాళ్ళో మీకు చూపెట్టదలచు కున్నాను. నల్లగొండలో నేను హాజరయి మీకు చూపెడతాను' అని చెప్పాను.

నేను నల్లగొండ వెళ్ళాను. నన్ను కూడ జస్టిస్ మిశ్రా తోపాటు వేదిక మీద కూచోమన్నారు. పోలీసులు ఒక రౌడీ గుంపును తీసుకొచ్చారు. ఆ గుంపు నినాదాలు, కేకలు, అరుపులు మొదలు పెట్టింది.

ఆ గొడవను ఆపడానికి, నేను లేచి ఆ అరుస్తున్న గుంపు దగ్గరికి వెళ్ళాను. నేను వేదిక మీంచి కిందికి దిగి ఆ గుంపువైపు నడవడం మొదలు పెట్టగానే మఫ్టీలో ఉన్న స్పెషల్ బ్రాంచి పోలీసులు నా చుట్టూ కమ్ముకుని నన్ను కొట్టడం, అటూ ఇటూ తోయడం మొదలుపెట్టారు. అప్పుడక్కడ గోపీనాథ రెడ్డి ఎస్పీగా ఉన్నాడనుకుంటాను. నా మీద అట్లా దౌర్జన్యం జరుగుతుంటే చూస్తూ నిలబడ్డాడు. కాసేపటి తర్వాత అడ్డుకోవడానికి ప్రయత్నించినట్టు నటిస్తూ నా కారు దగ్గరికి తీసుకుపోయాడు.

నాతోపాటు నల్లగొండకు వసంత కూడా వచ్చింది. ఈ జరుగుతున్న గొడవను వసంత జస్టిస్ మిశ్రా దృష్టికి తీసుకువచ్చింది. అప్పటికి ఆయన ఈ గొడవ జరుగుతున్న వైపు చూడడం లేదు.

అప్పుడు జస్టిస్ రంగనాథ మిశ్రా ఇటువైపు చూశాడు. ఆయనకు చాల కోపం వచ్చింది. భోజనం మిగిలిన కార్యక్రమాలు అన్నీ రద్దు చేశాడు. పోలీసులను పిలిచి వాళ్ళమీద విరుచుకుపడి ఏం జరిగిందని అడిగాడు. సరే, పోలీసులు ఏవో కట్టుకథలు చెప్పారు.

ఈ వ్యవహారమంతా అయిపోయాక, రంగనాథ మిశ్రా హైదరాబాదు వచ్చి దిల్ కుషా గెస్ట్ హౌజ్‌లో ఎన్‌కౌంటర్ల మీద విచారణ ప్రారంభించాడు.

మొత్తం మేం పిటిషన్‌లో ప్రస్తావించిన 250 ఘటనలలోంచి ఓ ఐదారు సంఘటనలు ఎంపిక చేస్తే వాటి మీద విచారణ జరుపుతానన్నాడు. అయితే అక్కడ ఒక విచిత్రమైన చట్టపరమైన ఆటంకం వచ్చింది.

ఒకటి రెండు సంవత్సరాల కన్న ముందు జరిగిన సంఘటనలను విచారించడం సాధ్యంకాదని, వాటి మీద పరిమితి ఉన్నదని ఆయన అన్నాడు.

అది నాకు ఆశ్చర్యం కలిగించింది. ఎందుకంటే అది అసమంజసమైన సూత్రం. నేరాల విచారణకు, పరిశోధనకు కాలపరిమితి ఏమి లేదు. ముఖ్యంగా హత్యా నేరాలను విచారించడానికి కాలపరిమితి లేదు. కాని అటువంటి నిబంధన ఒకటి చట్టాలలో ఉండిపోయింది. మన గొప్ప న్యాయమూర్తులలో ఏ ఒక్కరయినా ఈ నిబంధన చెల్లదు

అని అనిఉండవచ్చు. కొట్టేసి ఉండవచ్చు. కాని కొట్టివేయలేదు. జస్టిస్ మిశ్రా ఇప్పుడు ఆ నిబంధనను ఉటంకించారు.

నిజానికి ఈ విచారణ క్రమంలో ఎట్లాగూ శిక్ష విధించే అధికారం లేదు గనుక, విచారణ అయినా జరిగితే పోలీసు దౌర్జన్యాల వాస్తవాలయినా బైటికి వచ్చేవి.

ఇక దిల్‌కుషాలో విచారణ ప్రారంభమైనాక పోలీసు సాక్షులను కొనివేశారు. బెదిరించారు. సరైన సాక్షులు రాకుండా చూశారు. తప్పుడు సాక్ష్యాలు చెప్పించారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఒక కేసు విచారణ జరిగేటప్పుడు మామూలు నేరస్తులు, హంతకులు ఎట్లా ప్రవర్తిస్తారో, పోలీసులు సరిగ్గా అట్లాగే ప్రవర్తించారు.

ఈ విచారణ జరిగేటప్పుడు స్పెషల్ బ్రాంచిలోనో ఎక్కడో ఎస్పీగా ఉండిన దినకర ప్రసాద్ విచారణ జరిగే ప్రాంగణంలో ఉండే సాక్షులను బెదిరించడం మొదలు పెట్టాడు. జస్టిస్ రంగనాథ మిశ్రా దినకర ప్రసాద్‌ను పిలిచి చివాట్లు పెట్టాడు. అరిచాడు.

ఈ దినకర ప్రసాద్ గురించి కొంచెం చెప్పాలి. ఆయన బెంగుళూరు వెళ్ళి అక్కడి బెంగుళూరు విశ్వవిద్యాలయంలో ఇంగ్లీషు ప్రొఫెసర్ నగరి బాబయ్యను అరెస్టు చేసి ఇంటరాగేషన్ చేశాడు. కొండపల్లి సీతారామయ్యకు అద్దెకు ఇల్లు ఇప్పించాడనో ఏదో ఆరోపణ. ఆ ఇంటరాగేషన్ క్రమంలో టేబుల్‌కు అటు దినకర ప్రసాద్, ఇటు బాబయ్య కూచున్నారట. అంటే మధ్యలో రెండు అడుగులు కూడ ఉండదన్నమాట. ఇంటరాగేషన్ లో భాగంగా ఆ టేబుల్ మీద పేపర్ వెయిట్ తీసి బాబయ్య ముఖానికి గురిపెట్టి విసిరాడట. ఆయన ఎంత సూటిగా విసిరాడంటే ఆ వెయిట్ బాబయ్యకు తగలలేదు. వెనక ఎక్కడో కూచుని ఈ ఇంటరాగేషన్ చూస్తున్న ఇనస్పెక్టర్ కాలికి తగిలి మడమ విరిగిపోయిందట! అంత కచ్చితంగా కొట్టాడన్నమాట. ఇక ఎన్‌కౌంటర్లలో ఎక్కడో దూరంగా ఉన్నవాళ్ళను సూటిగా చంపగలిగామంటారు! సరే, జస్టిస్ రంగనాథ మిశ్రా ఆ దినకర ప్రసాద్‌ను ఆ ప్రాంగణం నుంచి బైటికి వెళ్ళగొట్టాడు.

సరే, ఆ విచారణ ముగిసేటప్పటికి జస్టిస్ రంగనాథ మిశ్రా ఏమన్నారంటే తాను విచారణ జరిపిన ఘటనలన్నీ హత్యలేనని, వాటి మీద సరైన విచారణ జరగాలని అన్నారు. అంటే న్యాయస్థానాలలో విచారణ జరగాలన్న మాట.

ఇక మధుసూదన్ రాజ్ యాదవ్ ఎన్‌కౌంటర్‌లో సుప్రీం కోర్టులో పిటిషన్ వేసింది ప్రభుత్వం. రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పును మార్చాలని అప్పీలుకు వెళ్ళింది. నిజానికి ఆ అప్పీలును సుప్రీం కోర్టు అనుమతించ లేదు. అడ్మిషన్ సమయంలోనే డిస్మిస్ చేసేసింది. కాని జస్టిస్ రంగనాథ మిశ్రా ముందు, ఇతర చోట్ల ఎక్కడబడితే అక్కడ 'ఆ హైకోర్టు తీర్పు మీద అప్పీలుకు వెళ్ళాం. కనుక అది చెల్లదు' అని ప్రభుత్వం అబద్ధం ఆడుతూ వచ్చింది.

అప్పటి డిజిపి హెచ్.జె. దొర ఈ అబద్ధాన్ని నిస్సిగ్గుగా, బహిరంగంగా పదేపదే

పల్లించాడు. దొర చాల గంభీరంగా ఆ అబద్ధం చెపుతూ న్యాయస్థానాలను పక్కదారి పట్టించాడు.

అది పోనీండి, జస్టిస్ ప్రభాశంకర్ మిశ్రా తీర్పు - ప్రతి ఎన్‌కౌంటర్ ఘటననూ శిక్షార్హమైన నేరంగా పరిగణించి న్యాయస్థానాల చేత విచారణ జరిపించాలనే తీర్పు - చాల చరిత్రాత్మకమైనది. ఆ చరిత్రాత్మకమైన తీర్పు గతి ఏమయిందో చూద్దాం.

మరొక ఎన్‌కౌంటర్ కేసులో ఒక న్యాయవాది కొంత అపరిణతంగా మళ్ళీ ఇటువంటి తీర్పునే కోరుతూ న్యాయస్థానానికి వెళ్ళాడు. అలా వెళ్ళినందువల్ల ఆ న్యాయవాదికి పేరు ప్రఖ్యాతులు రావచ్చు. కాని అది పద్ధతి కాదు. ఎందుకంటే అదే విషయంలో అప్పటికే ఒక మంచి తీర్పు వచ్చి ఉంది. ఇక ఆ తీర్పును ఎట్లా అమలులో పెట్టించాలో మార్గాలు వెతకాలి గాని మళ్ళీ అదే విషయం మీద అటువంటి తీర్పునే ఆశిస్తూ న్యాయస్థానానికి వెళ్ళనక్కర లేదు.

రాజకీయ సంబంధమైన కేసులు చేసే న్యాయవాదులు అలవరచుకోవలసిన పద్ధతులున్నాయి. మీ కక్షిదారులను గాని, వాళ్ళమీద ఆధారపడిన వాళ్ళను గాని ఇబ్బంది పెట్టే పనులేవీ మీరు చేయగూడదు. రాజకీయ వైఖరులకే దెబ్బ తగిలే పనులేవీ చేయగూడదు. అంతకు ముందు వచ్చిన తీర్పులకు మాత్రమే గాదు మొత్తంగా రాజకీయ ప్రయోజనాలకే వ్యతిరేకంగా పోయే పనులు చేయగూడదు.

ఈ కొత్తకేసులో అప్పీలు వల్ల అసలు పాతకేసులో జస్టిస్ ప్రభాశంకర్ మిశ్రా తీర్పును ఫుల్ బెంచి పరిశీలించాలని నిర్ణయం జరిగింది. జస్టిస్ ప్రభాశంకర్ మిశ్రా ఇచ్చిన తీర్పు సరైనదా కాదా అని ఇప్పుడు ఫుల్ బెంచి నిర్ణయిస్తుందన్నమాట. ఎన్‌కౌంటర్లకు సంబంధించి న్యాయస్థానాల విచారణలో మనం ఇప్పటికి చేరుకున్న స్థితి ఇది. ఈలోగా ఎన్‌కౌంటర్ హత్యలు పాలనా విధానంగా మారిపోయాయి.

ఈ విచిత్రం చూడాలి. ఎన్‌కౌంటర్ పేరు మీద మనిషి ప్రాణాలు తీసి, ఆత్మరక్షణ కోసం ప్రాణాలు తీశామని బుకాయిస్తే కేసు పెట్టకుండా ఉండగూడదు. కేసు పెట్టి న్యాయస్థానం ముందర ఆత్మరక్షణ అవసరాన్ని రుజువు చేసుకొమ్మనాలి అని ఒక న్యాయమూర్తి తీర్పు ఇస్తే, ఆ తీర్పును ఫుల్ బెంచికి రిఫర్ చేశారు.

ఇంతవరకూ ఎవరూ భూసంస్కరణల తీర్పులను ఫుల్‌బెంచికి రిఫర్ చేయాలనలేదు!

జీవితం, స్వేచ్ఛల విషయంలో మాత్రం వాటిని పరిరక్షించాలా లేదా అని అనుమానం వచ్చింది. పరిరక్షించాలి అని ఒక న్యాయమూర్తి తీర్పు ఇస్తే ఆయన తీర్పు తప్పుగా రాశాడేమో మళ్ళీ ఓసారి పరిశీలిద్దాం అని ఫుల్ బెంచికి రిఫర్ చేశారు!

అటువంటి పరిస్థితుల్లో మనం ఉన్నాం!

ఈ వ్యవహారంలో ఎవరి దగ్గరి నుంచీ సహాయం అందేటట్టు లేదు. వ్యవస్థలో ఎన్నో యంత్రాంగాలున్నాయి గదా. ఎన్‌కౌంటర్ల విషయంలో మాత్రం ఎవరూ కల్పించుకోరు. పరిశోధన జరగనే జరగదు. ఒకవేళ పరిశోధన జరిగినా హంతకులే

పరిశోధిస్తారు. న్యాయమూర్తులకు జీవితమన్నా, మనిషి ప్రాణమన్నా, స్వేచ్ఛన్నా సానుభూతి లేదు. వాళ్ళ సానుభూతి అంతా ఆస్తిమీదనే.

'ఎన్‌కౌంటర్లు జరగకూడదు. మనిషి ప్రాణాన్ని శిక్షాభయం లేకుండా ఇంత దారుణంగా తీయగూడదు' అని ఎక్కడా లేదు. ఇది దేశంలో మాత్రమే కాదు, ప్రపంచ మంతటా సమస్య అయిపోయింది. చట్ట వ్యతిరేకంగా ప్రవర్తిస్తే శిక్షించబడతాము అనే భయం లేదు. ఇది అంతర్జాతీయ సమస్య.

ఇందులో పెద్ద తాత్విక చర్చ చేయవలసిందేమీ లేదు. పాండిత్య ప్రకర్ష అవసరం లేదు. మానవహక్కుల చర్చ ప్రపంచ వ్యాప్తంగానే చాలా ముందుకు పోయింది.

ఆ చర్చలో భాగంగా చాలా అంశాలు వచ్చాయి. చివరికి విప్లవకారులయినా మానవ హక్కుల సంప్రదాయాన్ని పాటించాలి అని అభిప్రాయాలు వస్తున్నాయి. ఆ మానవ హక్కుల సంప్రదాయం మావోయిస్టు సూత్రాలకు అనుగుణంగా ఉండక పోవచ్చు. కాని ఆ సంప్రదాయం మీ అధికారాన్ని అర్థవంతం చేస్తుంది. ప్రయోజన కరంగా మారుస్తుంది.

ప్రపంచమంతటా సాగిన ఆ చర్చలో మనమూ పాల్గొన్నాం. అధికారం మీద తప్పని సరిగా పరిమితులు, ఆంక్షలు ఉండాలని సర్వజనామోదం వచ్చింది. మితిమీరిన అధికారానికి ఏ సైద్ధాంతిక సమర్థనలూ పనికిరావు. సమర్థన అంటే చేసిన ఏ పనికైనా ఏదో రకంగా సమర్థించుకోవచ్చు.

హింస, అధికార సమర్థన ఎప్పుడైనా మీరు ఏ ప్రయోజనం కోసం అధికారం నిర్వహిస్తున్నారో ఆ ప్రయోజనానికి హానికరం అవుతాయి. అంతేకాదు అవి మిమ్మల్ని బలహీన పరుస్తాయి కూడా. ఎందుకంటే ప్రజలు వాటిని ఎక్కువకాలం సహించబోరు.

ఎన్‌కౌంటర్ల విషయానికి వస్తే ఒక రాజకీయ బృందాన్ని శత్రువులుగా చూపుతున్నారు. వాళ్ళను చంపుతున్నారు. రాజకీయ అసమ్మతి వాదులను భౌతికంగా నిర్మూలిస్తున్నారు. అసమ్మతిని నిర్మూలించడం కాదు. ఈ క్రమం నేను చెప్పినట్టుగా ఇటువంటి క్రమాన్ని అమలు చేస్తున్న వాళ్ళను బలహీనపరుస్తుంది. రాజ్యం ఒక రాజకీయ బృందాన్ని శత్రువులుగా చూసి లక్ష్యంగా పెట్టుకుని భౌతికంగా నిర్మూలించి నట్టుగానే ఆ రాజకీయ బృందం రాజ్యాంగ యంత్రాన్ని శత్రువుగా చూసి అందులో కొందరిని లక్ష్యంగా పెట్టుకుని వాళ్ళను భౌతికంగా నిర్మూలిస్తుంది. రాష్ట్రంలో జరిగిన ఎంతోమంది పోలీసు అధికారుల హత్యలు ఈ క్రమానికి ఉదాహరణ.

ఈ వ్యవహారాన్ని మన పురాణాలు కూడా బ్రహ్మాండంగా, అద్భుతంగా వివరించాయి.

హిరణ్యకశిపుడి ఉదంతమే చూడండి. వాడు దినంల చంపొద్దు, రాత్రిలో చంపొద్దు, మనిషి చంపొద్దు, జంతువు చంపొద్దు, ఆయుధం ఉపయోగించొద్దు అని అన్ని కండిషన్లు ఏర్పాటు చేసుకుని వరం అడిగాడు. శిక్షా భయం లేకుండా ఉందామనుకున్నాడు. ఇంప్యునిటీతో ఉందామనుకున్నాడు.

హిరణ్యకశిపుడి ఉదంతం నుంచి నేను తెలుసుకున్నదేమంటే ఇంప్యూనిటీతో కనుక ఉండదలచుకుంటే ప్రమాదం మరింత పెరుగుతుంది. ఒక్క హిరణ్యకశిపుడి వృత్తాంతమే కాదు, ఏ మత బోధనలలోనైనా ఇటువంటి ఉదంతాలు కనబడతాయి. శిక్షాభయం లేకుండా విచ్చలవిడిగా నేరాలు చేసేవాడు కడపటికి అందరికన్న ఎక్కువ ప్రమాదంలో, ఎక్కువ బలహీనంగా, సులభంగా దొరికిపోయేలా ఉంటాడు.

ఈ విషయం అర్థం కావడానికి పెద్ద తత్వశాస్త్రమేమీ చదవనక్కరలేదు. పెద్ద పెద్ద నియంతలు, క్రూరమైన అధికారులు, పోలీసు అధికారులు పరుగెత్తి పారిపోవలసి వచ్చింది. ఎంతోకాలం ఇంప్యూనిటీతో నేరాలు చేసిన వాళ్ళు ఒక్కసారి ప్రజలు లేచి నిలబడి తిరుగుబాటు చేయగానే మట్టి కరిచారు. లెవాంటిన్ బెరియాను ప్రజలు కాల్చి చంపేశారు. ఒకప్పుడు అతణ్ణి చూస్తే వణికిపోయిన ప్రజలే కాల్చి చంపారు.

అంటే ఇంప్యూనిటీతో, శిక్షాభయం లేకుండా నేరాలు చేసేవాడు - విప్లవకారు డయినా, అధికారయినా - చివరికి శిక్ష అనుభవించక తప్పదు. సంపూర్ణంగా ఇంప్యూనిటీతో ప్రవర్తిస్తే ఎప్పుడో ఒకప్పుడు అది ఎదురుదెబ్బ కొడుతుంది. అది విప్లవకారుడి కయినా వర్తిస్తుంది. పరిటాల రవి లాంటి అరాచకుడికయినా వర్తిస్తుంది.

ఇదంతా చెపుతున్నానంటే నేను హింసాహింసల చర్చలోకి వెళుతున్నానని కాదు. నేను చెప్పదలచుకున్నదల్లా విప్లవమయినా, ప్రభుత్వపాలనయినా విచారణాక్రమం న్యాయంగా ఉండాలని మాత్రమే. అది మానవీయంగా ఉండాలని మాత్రమే.

ఆ విచారణాక్రమం ఎప్పుడూ కూడా కంటికి కన్ను, పంటికి పన్ను అని లెక్కలు తేల్చుకునే క్రీడలాగ ఉండగూడదు.

కాని రెండు వైపులా ఇంప్యూనిటీయే ఉండి, శిక్షాభయం లేని విచ్చలవిడి ప్రవర్తనే ఉండి, ఒక క్రమం సాగుతున్నప్పుడు శాంతి ప్రయత్నం జరగాలనుకుంటాను. రెండు పక్షాలూ కూచుని చర్చకు అవకాశం ఇవ్వాలనుకుంటాను.

లేకపోతే, రాజకీయ సంక్షోభం ఉన్న సమాజంలో పెద్ద ఎత్తున వక్రీకరణలకు దారి తీస్తుంది. వాస్తవికతలో అనేక వక్రీకరణలుంటాయి. ఆ వాస్తవికత గురించి మన అవగాహనలలో అనేక వక్రీరణలుంటాయి. ఉదాహరణకు మన ప్రస్తుత సామాజిక సందర్భమే చూడవచ్చు. శాంతి చర్చలు ఒకసారి జరిగి విఫలమయిన తర్వాత, ఆ తర్వాత జరుగుతున్న హింసకు ఆ శాంతి చర్చలే కారణమని కొందరు అంటున్నారు. ఇది ఎంత వక్రీకరణో చూడండి.

శాంతి ప్రయత్నమే ఎక్కువ హింసకు దారితీసిందట. వాళ్ళ రిక్రూట్‌మెంట్ పెరిగిందట. వాళ్ళ రిక్రూట్‌మెంట్ ఎప్పుడూ జరుగుతూనే ఉంది. ఎప్పుడన్నా ఆగిందా? వాళ్ళు రిక్రూట్ చేసుకుంటున్నారు. ఎన్‌కౌంటర్లలో పోగొట్టుకుంటుకున్నారు, లొంగుబాట్లలో పోగొట్టుకుంటున్నారు. మళ్ళీ రిక్రూట్ చేసుకుంటూనే ఉన్నారు. కనుక శాంతి చర్చల

వల్లనే రిక్రూట్‌మెంట్ పెరిగిందనడం ఎంత వక్రీకరణ!

కాని నేనేమనుకుంటానంటే ఆ ఆరునెలల శాంతి వల్లనే ఇప్పుడు హింసను ఎక్కువగా గుర్తిస్తున్నాము. అంతకు ముందూ హింస ఉంది గాని అది మనకు అలవాటయి పోయింది. ఆ ఆరునెలల్లో హింస లేదు కాబట్టి, ఆ తర్వాతి హింస కొట్ట వచ్చినట్టు కనబడుతోంది.

ఎన్‌కౌంటర్ల విషయంలో జస్టిస్ ప్రభాశంకర్ మిశ్రా తీర్పువల్ల, జస్టిస్ రంగనాథ్ మిశ్రా జాతీయ మానవహక్కుల కమిషన్ నివేదిక వల్ల ఒక గుణాత్మక స్థితికి చేరామని నేననుకున్నాను. కాని దురదృష్టవశాత్తు, శాంతి చర్చల వైఫల్యం తర్వాత ఎన్‌కౌంటర్లు అడ్డూ ఆపూ లేకుండా జరుగుతున్నాయి. కాకపోతే ఇప్పుడు హింస, ప్రతిహింసల విషవలయం మొదలయి అటువైపు ఎంతమందిని చంపారు, ఇటువైపు ఎంతమందిని చంపారు అని స్కోర్‌కార్డులు పెట్టుకుని లెక్కలు వేసుకోవలసి వస్తోంది.

ఎన్‌కౌంటర్ల గురించి మేం చేసిన న్యాయపరమైన ప్రయత్నాలలో మరి రెండింటిని గురించి కూడా ప్రస్తావించుకోవాలి. మేం సుప్రీం కోర్టులో రెండుసార్లు పిటిషన్లు దాఖలు చేశాం.

మొదటిసారి రవీందర్ రెడ్డి, పర్సయ్య, నేపాల్ రెడ్డిల ఎన్‌కౌంటర్‌ల సమయంలో మృతుల తండ్రుల పేర్ల మీద ఒక పిటిషన్ వేశాం. ఆ పిటిషన్ చాలకాలం పెండింగ్‌లో ఉండిపోయింది.

ఆ తర్వాత సుప్రీం కోర్టులో ఎన్‌కౌంటర్‌ల గురించి మరొక రిట్ పిటిషన్ వేశాం. సుప్రీం కోర్టు ఆ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ, ఆయా కేసులకు సంబంధించి విడివిడిగా ప్రైవేటు ఫిర్యాదులు దాఖలు చేసుకోవచ్చునని అంది.

ఈ పిటిషన్‌ను 1980లో వేయగా, 1985లో ఎన్.టి.రామారావు ప్రభుత్వం ఉండగా విచారణకు వచ్చింది. మిగిలిన అన్ని ఎన్‌కౌంటర్‌ల వివరాలు కూడా ఇస్తే, రాష్ట్ర ప్రభుత్వం అన్ని కేసులకూ కలిపి ఒకే కౌంటర్ దాఖలు చేస్తుందని సుప్రీం కోర్టు అంది.

అప్పుడు రొద్దం ప్రభాకర రావు డిజిపిగా ఉన్నాడు. ఆ సమయంలోనే అటు పోలీసులు కౌంటర్ ఫైల్ చేయడం, ఇటు కిడ్నాప్‌లు జరగడం మొదలైన పరిణామాలన్నీ జరిగాయి.

జరిగిన పరిణామాలన్నీ సంపూర్ణంగా తెలిసి కూడా సుప్రీం కోర్టు ముందు ప్రమాణం చేసి రొద్దం ప్రభాకర రావు పచ్చి అబద్ధాలతో కౌంటర్ పిటిషన్ వేశాడు. అందులో నా గురించి, నా ప్రవర్తన గురించి, కిడ్నాప్‌ల సందర్భంగా నా మధ్యవర్తిత్వం గురించి పచ్చి అబద్ధాలు రాశాడు.

దానికి నేను వ్యక్తిగతంగా జవాబు రాశాను. "నేను కొండపల్లి సీతారామయ్య అనే అజ్ఞాత నాయకుడితో సంప్రదించి కిడ్నాపైన అధికారులను విడుదల చేయించానని ఆ అఫడవిట్‌లో ప్రభాకర రావు రాశాడు. అది దారుణమైన అబద్ధం. కిడ్నాప్ వృత్తాంతం, అందులో నన్ను మధ్యవర్తిగా ఉండమని ప్రభుత్వం బతిమిలాడిన తీరు, నేను వాళ్ళనుంచి

లిఖితపూర్వకమైన అభ్యర్థనను అందుకున్న తర్వాతనే తూర్పు గోదావరి అడవులలోకి వెళ్ళిన వైనం అన్నీ మరోసారి చెపుతాను.

కాని ఇక్కడ చెప్పదలచిందల్లా ఆ రోజుల్లో ఏం జరిగిందో సంపూర్ణంగా, స్పష్టంగా తెలిసి కూడ రాష్ట్ర డైరక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అంతటి మనిషి, దేశంలోనే సర్వోన్నత న్యాయస్థానమైన సుప్రీం కోర్టు ముందర, రాష్ట్ర ప్రభుత్వం తరపున దాఖలు చేసిన అఫిడవిట్‌లో ఘోరమైన అబద్ధాలు, తప్పులు రాశాడన్నదే.

అట్లా ఘోరమైన అబద్ధాలు రాస్తూ అన్నీ నిజాలే చెపుతున్నామని వాళ్ళు అనుకుంటారు.

నేను దానికి ఒక సుదీర్ఘమైన జవాబు రాశాను. ఆ జవాబు గురించి వివరంగా చెప్పాలి.

కాని ఆ అఫిడవిట్‌లోనే, ఎన్‌కౌంటర్ మృతులందరిపైన ఎన్ని కేసులున్నాయో చెప్పే ఎఫ్ఐఆర్‌ల కట్టను పొందుపరిచారు. జాతీయ మానవహక్కుల కమిషన్ ముందర కూడ అపనే చేశారు.

అట్లా మరణించినవారినే నిందితులుగా చూపుతూ తన ముందర దాఖలయిన ఎఫ్ఐఆర్‌ల కట్టలోంచి కొన్నిటిని జాతీయ మానవ హక్కుల కమిషన్ అధ్యక్షులు జస్టిస్ వెంకటాచలయ్య, మాజీ ఐఎఎస్ అధికారి, పౌరస్పందన వేదిక బాధ్యులు ఎస్ ఆర్ శంకరన్ గారికి పంపించారు.

ఇలా మృతుల మీద నేరాలు ఆరోపించి తాము చేసిన నేరాల నుంచి తప్పించుకోవడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఇది మొదటిసారి కాదు, ఎన్నో సంవత్సరాలుగా వాళ్ళు ఇదే పని చేస్తున్నారు.

ఇది అబద్ధం అనే సంగతి కూడ పక్కన పెట్టండి. అంతకన్న తీవ్రమైన విషయం ఏమంటే పోలీసులు, రాష్ట్ర ప్రభుత్వం కలిసి కోర్టుల ముందర, జాతీయ మానవహక్కుల కమిషన్ ముందర న్యాయ విచారణాక్రమాన్ని తప్పుదారి పట్టిస్తున్నారు. నిస్సిగ్గుగా, పర్యవసానాల గురించి భయం లేకుండా న్యాయ విచారణాక్రమాన్ని వక్రీకరిస్తున్నారు.

అటువంటి అబద్ధపు, వక్రీకరణ తతంగాల వల్ల ఎన్‌కౌంటర్ల గురించి కొన్ని పిటిషన్లు కొట్టుడుపోయాయి.

ఈ సందర్భంలో ఒక ముఖ్యమైన కేసు గురించి చెప్పుకోవాలి. ఈశాన్య రాష్ట్రాలలో, మణిపూర్‌లో కూడా ఉద్యమకారులను ఈవిధంగా బూటకపు ఎన్‌కౌంటర్లలో కాల్చి చంపడం పరిపాటి. అటువంటి ఒక ఘటనలో పియుసిఎల్ న్యాయస్థానంలో ఫిర్యాదు చేసింది. సుప్రీం కోర్టులో జస్టిస్ జీవన్ రెడ్డి ముందర ఆ కేసు విచారణకు వచ్చింది. పియుసిఎల్ వర్సస్ స్టేట్ ఆఫ్ మణిపూర్ అనే ఆ కేసులో 1997లో ఇచ్చిన ఒక కీలకమైన తీర్పులో జస్టిస్ జీవన్ రెడ్డి ఆ కేసులో వివరమైన, సమగ్రమైన న్యాయ విచారణ జరిపించాలని ఆదేశించారు. అంతే కాదు, 'ఈ రకంగా ప్రభుత్వం వైపు నుంచి ప్రజలను

మట్టుబెట్టడం అనే విధానం తీవ్రంగా ఖండించదగినది' అని కూడ ఆయన రాశారు.

ఆ సమయంలోనే పశ్చిమ బెంగాల్‌లో ఒక కేసు వేశాం. కలకత్తా హైకోర్టులో రిట్ పిటిషన్ అది. చారుమజుందార్ కొడుకు ఇక్కడికి నా దగ్గరికి వచ్చాడు. పిటిషన్ తయారు చేశాం. నేను కలకత్తా వెళ్ళి వాదించాను.

నిజానికి బెంగాల్‌లో చాలా దుర్మార్గాలు జరిగాయి. ఎంతో మంది యువకులను దారుణంగా చంపేశారు. సరోజ్ దత్తాను చంపేశారు. చారుమజుందార్ మృతి కూడా చాలా అనుమానాస్పదమైన పరిస్థితుల్లో సంభవించింది.

కలకత్తా హై కోర్టులో ఎపిడిఆర్ (అసోసియేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ డెమొక్రటిక్ రైట్స్) వేసిన ఆ కేసులో నేను వెళ్ళి మూడు నాలుగు గంటలు వాదనలు వినిపించాను. అప్పుడు నా వాదనలు విన్న బెంచిలో ఒకరుగా ఉన్న న్యాయమూర్తి ప్రస్తుతం సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా ఉన్నారు. జస్టిస్ తరుణ్ ఛటర్జీ, మరొక న్యాయమూర్తి బిటి మిత్ర చనిపోయారు.

అక్కడ కేసు ఏమంటే, బెంగాల్‌లో అంతకుముందు ఎన్‌కౌంటర్ హత్యలను, పోలీసు అత్యాచారాలను విచారించడానికి ఒక కమిషన్ ఉండేది. ఆ కమిషన్‌ను అర్ధాంతరంగా నిలిపివేశారు. మా కేసు ఆ కమిషన్ విచారణను కొనసాగించమని, లేదా మరో రకమైన విచారణకయినా ఆదేశించమని.

ఆ కేసును కలకత్తా హైకోర్టు కొట్టివేసింది. అప్పుడు మేం సుప్రీం కోర్టును అభ్యర్థించాం. సుప్రీం కోర్టులో ఈ పిటిషన్ జస్టిస్ సుజాతా మనోహర్, మరొక న్యాయమూర్తి ముందుకు వచ్చింది. వాళ్ళు ఈ పిటిషన్‌ను అనుమతించడానికి నిరాకరించారు.

అంటే ఏమిటన్న మాట? ఈ దేశంలో అతి దారుణమైన మానవహక్కుల ఉల్లంఘన విషయంలో రాజ్యాంగబద్ధ వ్యవస్థలు, చట్టపరమైన, రాజ్యాంగబద్ధమైన పరిష్కారాన్ని ఇవ్వడానికి సిద్ధంగా లేవు. అటువంటి పరిష్కారం ఇంకా రావలసే ఉంది.

అంతర్జాతీయ మానవహక్కుల ప్రకటన దగ్గరి నుంచి మొదలు పెడదాం. ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధి సభ 1948 డిసెంబర్ 10న దాన్ని ఆమోదించి, ప్రకటించింది. సభ్యదేశాలన్నీ దాని మీద సంతకం చేసి, దాన్ని అమలు చేస్తామని ప్రకటించాయి. ఆ ప్రకటనలో జీవించే హక్కు ఒక ముఖ్యమైన హక్కు.

ఇప్పటికీ ఐక్యరాజ్య సమితి అస్తిత్వంలో ఉంది గాని మానవహక్కుల పట్ల ఎవరికీ గౌరవం ఉన్నట్టు కనబడడం లేదు. అందువల్ల మానవహక్కుల భావనను బలోపేతం చేయవలసిన అవసరం ఉంది. ఆ భావన గురించి ఎక్కువగా చర్చించవలసి ఉంది.

ఈ సందర్భంలో గుర్తు ఉంచుకోవలసిన విషయాలు కొన్ని ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా అన్ని సమాజాలు 1960ల మధ్యభాగం నుంచి 1970ల మధ్యభాగం వరకు ఎన్నో సంక్షోభాలను చవిచూశాయి. సమాజాలకు సమాజాలే అల్లకల్లోలమై పోయాయి.

యూరప్‌లో విద్యార్థి ఆందోళనల నుంచి దక్షిణ అమెరికా అంతటా ప్రజలు బ్రహ్మాండమైన ప్రదర్శనలు జరిపారు.

ఈ సామాజిక సంక్షోభాల ఫలితంగానే మానవహక్కుల గురించి చర్చ మరోసారి మరింత పెద్ద ఎత్తున జరిగింది. మానవ హక్కులను స్థూలంగా, సాధారణ అర్థంలో కాకుండా నిర్దిష్టంగా, వివరంగా నిర్వచించే ప్రయత్నం మొదలయింది. అందువల్లనే ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, పౌర రాజకీయ హక్కులను విడివిడిగా నిర్వచించుకుని ఒప్పంద పత్రాలు ప్రకటించవలసి వచ్చింది. అందుకే ఇంటర్నేషనల్ కాన్వెంట్ ఆన్ ఎకనమిక్, సోషల్ అండ్ కల్చరల్ రైట్స్ (ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కుల గురించి అంతర్జాతీయ ఒప్పందం), ఇంటర్నేషనల్ కాన్వెంట్ ఆన్ సివిల్ అండ్ పొలిటికల్ రైట్స్ (పౌర, రాజకీయ హక్కుల గురించి అంతర్జాతీయ ఒప్పందం) అనే రెండు ఒప్పందాలను ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధి సభ 1966 డిసెంబర్‌లో ఆమోదించి ప్రకటించింది. ఈ అన్ని పత్రాలలోనూ భారత ప్రభుత్వం సంతకం చేసింది.

వీటిలో అంతర్జాతీయ మానవహక్కుల ప్రకటన ఉపోద్ఘాతంలో ఒక కీలకమైన వాక్యం ఉంది. 'ఇక చిట్టచివరి ప్రయత్నంగా మనిషి నిరంకుశత్వానికీ, పీడనకూ వ్యతిరేకంగా తిరగబడడం తప్ప దారిలేదని అనుకోకుండా ఉండాలంటే మానవహక్కు లను చట్టబద్ధ పాలన ద్వారా పరిరక్షించుకోవలసి ఉంటుంది' అని ఆ వాక్యం చెపుతుంది.

అంటే చట్టబద్ధపాలన అనే అంశం మానవహక్కుల ప్రకటనలోకి ఈవిధంగా వచ్చి చేరింది. మానవహక్కులు ఎవరికి వర్తిస్తాయి. అందరికీ వర్తిస్తాయా లేదా అనే చర్చకే ఆస్కారం లేదు. ఏ మనిషి అయినా నిరంకుశత్వాన్నీ, పీడననూ ఎదిరించడంలో తిరగబడడం తప్ప మార్గం లేదు అని అనుకోకుండా చేయడానికే చట్టబద్ధపాలన. అంటే తిరగబడవలసిన అవసరం లేకుండానే సమస్యలు పరిష్కారమవుతాయి అనే నమ్మకం మనుషులందరికీ ఇవ్వడం కోసమే చట్టబద్ధపాలన.

మరో మాటల్లో చెప్పాలంటే చట్టబద్ధ పాలన అనేది ప్రభుత్వాలపైన క్రమశిక్షణను అమలు చేసే పద్ధతి. ప్రజాస్వామిక నియమాలను కచ్చితంగా పాటించేలా చూసే పద్ధతి.

అందువల్ల మానవహక్కుల గురించి పెద్ద తాత్విక చర్చ అవసరమని నేననుకోను. అది కేవలం పాలనను, ప్రజాస్వామిక పాలనను, ప్రజాస్వామిక హక్కులను అమలులోకి తెచ్చే సాధనం మాత్రమే. ప్రజాపాలన గురించి, సమాజాన్ని మార్చడం గురించి ఉనికిలో ఉన్న వేర్వేరు తాత్విక దృక్పథాలను కూడా పరీక్షకు పెట్టడానికి, అమలు చేయడానికి మానవహక్కులు ఒక సాధనం.

ఇదీ నా అభిప్రాయం. అంతే తప్ప మానవహక్కుల గురించి అనవసరంగా తాత్విక చర్చలు చేయడం, గందరగోళ పరచడం తగదు.

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత యుద్ధనేరాలను విచారించడానికి వార్ క్రైమ్స్

ట్రిబ్యునల్స్ ఏర్పడ్డాయి. న్యూరెంబర్గ్ లోను, టోక్యో లోను విచారణలు జరిగాయి. ఆ ట్రిబ్యునల్స్ లక్ష్యం ఏమిటి? అవి సాధించదలచినదేమిటి?

యుద్ధ సమయాలలోను, శాంతి సమయాలలో కూడ ఎటువంటి మానవీయ నియమాలను పాటించాల్సి ఉంటుంది. మానవ హక్కులను ఎట్లా గౌరవించవలసి ఉంటుంది అని మానవ సమాజానికి చూపడమే ఆ యుద్ధనేరాల విచారణ లక్ష్యం.

అంటే ఆ యుద్ధనేరాల ట్రిబ్యునల్‌లు ఏర్పాటు కావడమే మానవహక్కుల భావనకు అందిన గౌరవం.

జాతిహననం అనే భావన ఉంది. జాతిని మొత్తంగా నిర్మూలించడం. యూదు జాతిని అంతం చేయాలని హిట్లర్ చేసిన ప్రయత్నం. యుద్ధనేరాల విచారణలో ఈ జాతి హననం అనేదే ముఖ్యమైన అంశం అయింది. అందువల్లనే 1948 డిసెంబర్‌లో ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ కన్వెన్షన్ ఆన్ ది ప్రివెన్షన్ అండ్ పనిష్మెంట్ ఆఫ్ ది క్రైమ్ ఆఫ్ జెనోసైడ్ (జాతి హనన నేరాన్ని నిరోధించే, శిక్షించే ఒప్పందం)ను ఆమోదించి ప్రకటించింది. భారత ప్రభుత్వం కూడ ఈ ఒప్పందం మీద సంతకం చేసింది.

కాని ఒక మీమాంస తలెత్తింది. రాజకీయ బృందాలను, భిన్నమైన రాజకీయ విశ్వాసాలుగల సమూహాలను లక్ష్యంగా చేసుకుని, వాళ్ళను అణచివేయడానికి, తుద ముట్టించడానికి ప్రయత్నిస్తే దాన్ని జాతిహననం నిర్వచనం కిందికి తేవడానికి వీలవుతుందా?

అటువంటి అణచివేత, పీడన జాతిపరమైనది కాదు, మతపరమైనది కాదు. అందువల్ల అది జాతి హననం కాదు. ఈ వాదన ఇప్పుడు వినవస్తోంది.

కాని అధికార వర్గాలు ప్రత్యర్థి రాజకీయ వర్గాలను లక్ష్యంగా చేసుకుని హింసాకాండ సాగించడం ఎప్పుడూ ఉంది. అది ఫాసిజం, నాజీజం తలెత్తుతుండిన రోజుల్లో కూడా ఉంది. కాకపోతే ఆ అణచివేత జాతిహననం ముసుగువేసుకుని వచ్చింది.

అందువల్ల అంతర్జాతీయ నేరవిచారణ న్యాయస్థానాన్ని ఏర్పరచాలని ఐక్యరాజ్య సమితితోపాటే ప్రయత్నాలు మొదలయ్యాయి. అది అప్పుడే ప్రారంభం కాకపోయినా, గత శతాబ్ది చివరికైనా అటువంటి న్యాయస్థానం ఏర్పడింది. రువాండా, బోస్నియాల్లో జరిగిన జాతి హననాలను విచారించడం జరిగింది.

ఈ అన్ని సందర్భాలలోను గుర్తించవలసిన విషయం ఏమంటే రాజ్యం తన పాలితులలోని ఒక బృందంపైన, అంటే తన పౌరులపైన, లేదా తాను ఆక్రమించుకున్న భూభాగంలోని పౌరులపైన మానవహక్కుల ఉల్లంఘనకు పాల్పడుతుంది. దాన్ని జాతి హననంగా గుర్తిస్తున్నాము. విచారిస్తున్నాము. అంతర్జాతీయ న్యాయసూత్రాలలోనే ఈ విధంగా రాజ్యాంగయంత్రం తన సొంత పౌరుల మీద జరిపే అత్యాచారాలను, మానవ హక్కుల ఉల్లంఘనలను గుర్తించాలనే ఆలోచనే భాగమయింది.

కాని నా వాదన ఏమంటే, జాతి హననం గురించి విచారణలో ఇంత పెద్ద ఎత్తున చర్చ జరిగినప్పటికీ, అంతర్జాతీయ చట్ట, న్యాయ ప్రమాణాలు ఏర్పడినప్పటికీ ఒక రాజకీయ బృందాన్ని భౌతికంగా నిర్మూలించడం అనే ప్రక్రియ అందులో భాగం కావడం లేదు. ఇవి రెండూ ఒకే రకమైన నేరాలు. వాటిని ఒకేరకంగా గుర్తించవలసి ఉంది.

రాజ్యాంగంలోని అధికరణం 21 ప్రకారం చట్టపరమైన పద్ధతులలో తప్ప మరో రకంగా ఒక మనిషి ప్రాణాన్ని గాని, స్వేచ్ఛను గాని హరించడానికి వీలు లేదన్నప్పుడు అది ప్రభుత్వానికీ, దాని సంస్థలకూ విద్యుక్తధర్మం అవుతుంది. ఆ విద్యుక్తధర్మాన్ని, రాజ్యాంగాన్ని ప్రభుత్వం గౌరవించినంతవరకూ న్యాయవ్యవస్థ సక్రమంగా పనిచేయ గలుగుతుంది. ఈ ధర్మాన్ని గౌరవించకపోవడం అంటే వ్యవస్థ విచ్ఛిన్నమై నిరంకుశ అధికారం విచ్చలవిడిగా సాగినట్టే. ప్రభుత్వానికి పాలనాక్రమంలో ఎన్ని అవరోధాలు ఎదురయి నప్పటికీ చట్టబద్ధ పాలనను వదులుకోవడానికి వీలు లేదు.

మనదేశంలో ఆంగ్లో-సాక్సన్ న్యాయ సూత్రాలను పాటించే న్యాయ స్థానాలన్నీ ఈ చట్టబద్ధపాలన సూత్రాన్ని అనేకసార్లు వక్కాణించాయి.

అమెరికన్ సుప్రీం కోర్టు ఒక తీర్పులో 'తన చట్టాన్ని తానే గౌరవించలేని ప్రభుత్వాన్ని ధ్వంసం చేయడానికి మరెవరూ అవసరం లేదు. దానికదే అతివేగంగా విచ్ఛిన్నమై పోతుంది' అని చెప్పింది. నిజానికి ఈ తీర్పుకు మూలం 1928లో అమెరికన్ సుప్రీం కోర్టులోనే జస్టిస్ బ్రాండీస్ రాసిన ఒక అసమ్మతి తీర్పు. ఆ తీర్పులో ఆయన "మన ప్రభుత్వం సర్వ శక్తిమంతమైన, సర్వసాక్షి అయిన బోధకుడిలాంటిది. మంచి అయినా, చెడు అయినా అది తన ఉదాహరణ ద్వారా ప్రజలకు బోధిస్తుంది. ప్రభుత్వమే గనుక చట్టాన్ని ఉల్లంఘిస్తున్నట్టయితే, అది ప్రజలలో చట్టం పట్ల అగౌరవాన్ని కలిగిస్తుంది. ప్రతి మనిషీ చట్టం తన చేతుల్లోకి తీసుకునేందుకు అది ప్రోత్సహిస్తుంది. అంటే అరాచకత్వానికి ఆహ్వానం పలుకుతుంది" అన్నారు.

ఇవాళ దేశంలో నెలకొని ఉన్న పరిస్థితి ఇదే. ఎన్‌కౌంటర్ హత్యల ద్వారా, ఇతర మానవహక్కుల ఉల్లంఘనల ద్వారా ప్రభుత్వం చేస్తున్న పని ఇదే.

మన సుప్రీం కోర్టు కూడా 1997లో డికె బసు వర్సస్ స్టేట్ ఆఫ్ వెస్ట్ బెంగాల్ అనే సుప్రసిద్ధ కేసులో చేసిన వ్యాఖ్యలు ఈ సందర్భంలో తప్పని సరిగా గుర్తుచేసు కోవాలి.

"తీవ్రవాదాన్ని ఎదిరించడానికి రాజ్యాంగ యంత్రపు తీవ్రవాదం జవాబు కాజాలదు. ఎప్పుడయినా వ్యాధి కన్న ఔషధం ప్రమాదకరమైనది కాగూడదు. రాజ్యామే తీవ్రవాది అయితే, హింసావాది అయితే, హింసావాదికి సాధికారత దొరుకుతుంది. అది రాజ్యానికీ, సమాజానికీ, చట్టబద్ధ పాలనకూ గొడ్డలి పెట్టువంటిది. అందువల్ల, హింసావాదాన్ని అరికట్టడానికి తాను ఏర్పరిచే అన్ని సంస్థలూ చట్టపరిధి లోపల పనిచేసేలా, తమకు తామే చట్టంగా మారిపోకుండా ఉండేలా రాజ్యం జాగ్రత్త తీసుకోవాలి. ఒక తీవ్రవాది, హింసావాది అమాయక పౌరుల మానవహక్కులను హరిస్తే, ఆ తీవ్రవాదిని శిక్షకు గురి

చేస్తున్నాము. కాని అతని హక్కులను కూడ చట్టం చెప్పిన పద్ధతిలో తప్ప మరొక రకంగా ఉల్లంఘించడానికి వీలు లేదు".

అయితే ఒక ఎన్‌కౌంటర్ విచారణ ఎట్లా చేస్తాము, నిజాన్ని ఎట్లా నిగ్గుతేలుస్తాము అనేది కొంత ఇబ్బందికరమైన విషయమే. ఎందుకంటే ఎన్‌కౌంటర్ ఘటనలకు సాక్ష్యాధారాలు ఏమీ ఉండవు. ప్రతక్ష సాక్షులుండరు. ఒకవేళ ఉన్నా రాజ్యశక్తుల పట్ల భయంతో వాళ్ళు వచ్చి సాక్ష్యం చెప్పే వీలుండదు.

అందుకే భార్గవా కమిషన్ విచారణలో నేను ఒక మాట చెప్పాను. ఎన్‌కౌంటర్ విచారణలో పోలీసులు, అధికార వర్గాలు ఎట్లా ప్రవర్తిస్తాయంటే, మామూలు హత్య కేసుల్లో హంతకులు, ముఠా నాయకులు సాక్షులను బెదిరించి, సాక్ష్యాలు మాయం చేయడానికి చేసే ప్రయత్నాలన్నీ పోలీసులు కూడా చేస్తారు.

అట్లా నేను కలకత్తా వెళ్ళి జస్టిస్ తరుణ్ ఛటర్జీ, జస్టిస్ బి జితేంద్రమోహన్ మైత్రీల ముందు వాదించేటప్పుడు 'ఎన్‌కౌంటర్‌లతో ఎప్పుడూ సమస్యేమంటే ఏ ఘటనకు ఆ ఘటనను ఎప్పటికప్పుడు పరిశోధించడం, విచారించడం జరగదు. సాధారణంగా ఆలస్యం జరుగుతుంది. ఎప్పుడో ఉద్యమం వచ్చి, అవి విచారించాల్సిన అవసరం వచ్చేటప్పటికి చాలా ఘటనలు పేరుకుపోతాయి. అప్పుడు అన్ని ఘటనల మీద పరిశోధన జరపాల్సి వస్తుంది. ఈ ఎన్‌కౌంటర్ మరణాల మీద విచారణ జరపాలనే ఉద్దేశ్యమే రాజ్యానికి లేదనేది ఒక వాస్తవం అయితే, ఇట్లా ఆ మరణాల సంఖ్య పేరుకుపోయి విచారణ జరపడం కష్టసాధ్యమైన, అసాధ్యమైన స్థితికి చేరడం మరో వాస్తవం, అని చెప్పాను.

ఇటువంటి కేసుల్లో మరొక సమస్య ఏమంటే ఇంతకాలమయిపోయింది గదా, ఇప్పుడు పరిశోధించవచ్చునా అని మరొక వాదన వస్తుంది. ముఖ్యంగా కలకత్తా హైకోర్టులో మేం వాదించిన కేసు 1968-72 మధ్య జరిగిన ఎన్‌కౌంటర్ల మరణాలకు సంబంధించినది. ఆ కేసు వాదనలు 1998లో అంటే 27 సంవత్సరాల తర్వాత జరిగాయి. అప్పటికి సాక్ష్యాధారాలు మిగిలే అవకాశాలు చాల తక్కువ. 'ఇన్ని సంవత్సరాలు గడిచిపోయిన తర్వాత ఇప్పుడు విచారణ ఎందుకు' అని ప్రాసిక్యూషన్ వాదించింది.

అయితే మనిషి ప్రాణహానికి సంబంధించిన నేరాలలో కాలవ్యవధి పరిమితి ఏమీలేదు. మరణానికి సంబంధించిన విచారణను నేరం జరిగిపోయిన తర్వాత ఎన్నో ఏళ్ళ తర్వాతనయినా, దశాబ్దాల తర్వాత నయినా చేపట్టవచ్చు.

ఈ వాదనల గురించి ఒక విషయం చెప్పాలి. ఎన్‌కౌంటర్‌ల గురించి ఎక్కడ వాదించేటప్పుడయినా 'నక్సలైట్లకు ఎవరినయినా చంపే హక్కు ఉన్నది. కాని నక్సలైట్లను చంపగూడదు' అనే వైఖరి కాదు మేం తీసుకున్నది. మేము ఇట్లా వాదిస్తున్నా మేమోనని చాలామంది పొరపడుతుంటారు. అది తప్పు. మా వైఖరి అది కానేకాదు.

అటువంటి వాదనా చట్రం ఒకటి ఉంది. అది ఒక తప్పుడు అభిప్రాయాన్ని కలిగిస్తుంది.

పోలీసులను, వర్గశత్రువులుగా ప్రకటించిన ఎవరినయినా చంపి వేయడానికి నక్సలైట్లకు అధికారం ఉన్నట్టు. ఈ తప్పుడు అభిప్రాయం భావిస్తుంది. అది వేరు. కాని మానవహక్కుల ఉద్యమం, మానవహక్కుల కార్యకర్తలు అట్లా భావించ లేరు. చట్టబద్ధ పాలన, మానవహక్కుల హామీ అనే చట్రంలో మాత్రమే మేం ఈ వాదనలు చేస్తున్నాం.

మాకు అటు నక్సలైట్లు చేసే హత్యలకు, ఇటు పోలీసులు చేసే హత్యలకు మధ్య తేడా ఏమీ లేదు. మేం ఈ రెండు పక్షాల నేరాలను విడదీసి చూడలేము. మేం అనేదల్లా నక్సలైట్లు చేసే నేరాలను భారత శిక్షాస్మృతి కింద, నేరశిక్షాస్మృతి కింద న్యాయస్థానాలు విచారిస్తున్నాయి. పరిశోధనలు సాగుతున్నాయి, కొన్ని సందర్భాలలో శిక్షలు కూడా పడుతున్నాయి. న్యాయస్థానాలలో విచారణ జరగకముందే వారికి పోలీసులే మరణశిక్ష విధించి చంపివేయడం జరుగుతున్నది. కాని పోలీసులు చేసే నేరాలను, చివరికి హత్యలను కూడ నమోదు చేసి పరిశోధించడం కూడ జరగడం లేదు. న్యాయస్థానాల ముందరికి ఆ నేరాలు విచారణకు రావడం లేదు. వారు చేసే నేరాలన్నిటినీ విధి నిర్వహణ అనే పేరు కింద మూసిపెట్టడం జరుగుతున్నది. ఇది చట్టబద్ధపాలనా స్ఫూర్తికి వ్యతిరేకం. మా వాదన ఇంతే.

అందుకే కలకత్తా హైకోర్టు వాదనలలో నేను ఏమన్నానంటే, "ఆ సమయంలో నక్సలైట్లు ప్రయోగించిన హింస గురించి, వారు చేసిన నేరాల గురించి మాకు తెలుసు. ఆ నేరాలకు గాను ఎంతోమంది నక్సలైట్లను అరెస్టు చేయడం జరిగింది. వారిని న్యాయస్థానాలలో విచారించారు. అయితే ఇక్కడే చెప్పవలసిన విషయం ఏమంటే, నక్సలైట్లు ప్రయోగించిన హింసకన్న రాజ్యం ప్రయోగించిన హింస చాల ఎక్కువ. ఇరుపక్షాలలోనూ లక్ష్యాలకూ మార్గాలకూ మధ్య ఉన్న అంతరం చాలా వక్రీకరణలకు దారితీసింది. కాని పాలనా యంత్రాంగంలోనికి ప్రవేశించిన వక్రీకరణలను మొట్ట మొదట సరిచేయవలసి ఉంటుంది. అలా సరిచేసినప్పుడు మాత్రమే చట్టబద్ధపాలన, రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యపు మూలసూత్రాలు సజీవ వాస్తవికతలవుతాయి' అని.

ఈ వైఖరిని చాలా తక్కువమంది అర్థం చేసుకుంటున్నారు. మా వైఖరికి వచ్చిన తప్పుడు వ్యాఖ్యానాలను సరిచేసేందుకే మేం చాలా ప్రయత్నం చేస్తున్నాం.

ఈ ప్రభుత్వం తాను ఒక రాజ్యాంగం ప్రకారం, సూత్రబద్ధంగా పనిచేస్తున్నానని చెప్పుకుంటుంది. దానికి ఒక చరిత్ర, సంప్రదాయం ఉన్నాయి. కాబట్టి అది ఒక తిరుగుబాటుదారుల బృందం లాగానో, ఒక గూండాల గుంపులాగానో ప్రవర్తించడానికి వీలులేదని మేం అనుకుంటాం. ప్రభుత్వాన్ని నడిపేవ్యక్తులు తమ ఇష్టారాజ్యంగా నేరాలు చేయడానికి వీలులేదు.

కనుక ప్రభుత్వంలో ఉన్న వ్యక్తి ఎవరయినా మొట్టమొదట చేయవలసిన పని ఏమంటే నేరస్తుడిగా మారకుండా జాగ్రత్త తీసుకోవడం.

ఈ మాట అన్నంతమాత్రాన సామాజిక మార్పుకోసం విప్లవం తేదలచుకున్నామనే వాళ్ళు చేసే నేరాలు క్షమించ దగినవని కాదు. ఆ నేరాలన్నీ విచారణకు వస్తూనే ఉన్నాయి. మన నేర విచారణా, పరిశోధనా వ్యవస్థలోని అవకతవకలవల్ల ఆ నేరాలపై సరయిన విచారణ జరగడం లేదు. ఆ నేరాలతో సంబంధంలేని ఎంతోమందిని నిందితులుగా చూపి, తప్పుడు సాక్ష్యాలు సృష్టించి అసలు కేసులు కొట్టుడుబోయేలా తయారు చేస్తున్నారు.

ఇక్కడ అర్థం చేసుకోవలసినదేమిటంటే, బ్రిటిష్ పాలనాకాలం నుంచి కూడా సాధారణ నేరాలకు శిక్షాస్మృతి ఉంది. పరిశోధనా సంస్థలు, వ్యవస్థలు ఉన్నాయి. ఆ పరిశోధన పునాదిపై ఛార్జిషీట్ తయారు చేసి, ప్రాసిక్యూషన్ నేరారోపణ, నిరూపణ చేస్తుంది. అది ఒక పద్ధతి.

మరొకటి సాధారణ పరిస్థితులకు సంబంధించనిది. రాజ్యం సంక్షోభంలో పడినప్పుడు, ప్రజలు తిరుగుబాటు చేస్తారేమోనని భయపడి కొన్ని ప్రత్యేక చట్టాలు చేసే పద్ధతిని బ్రిటిష్ పాలకులు ప్రారంభించారు. ఆ వారసత్వం మనకుంది.

అంటే చట్టబద్ధ పాలనను బాగా కుదించి, సంకుచితమైన వ్యాఖ్యానం ఇచ్చి, లాంఛనప్రాయంగా మార్చివేసి, ప్రత్యేక చట్టాలు తయారు చేసి, ఆ చట్టాల ప్రకారం పాలిస్తామంటారు.

ఇటువంటి పద్ధతి రౌలట్ చట్టం నుంచి మొదలయింది. అక్కడ మొదలయిన పద్ధతి క్రమేణా 1947 దాకా వచ్చింది. అణచివేత చట్టాలు, ప్రత్యేక నిబంధనలు, ఎటువంటి న్యాయబద్ధతలేని పద్ధతులు అమలులోకి వచ్చాయి. అది న్యాయబద్ధం కాదు అంటేనే చట్టబద్ధం కాగూడదు. కాని అది చట్టబద్ధం, న్యాయబద్ధం కాదని వాదించే అవకాశమే లేదు. ఎక్కువలో ఎక్కువ పత్రికల్లో విమర్శిస్తూ వ్యాసాలు రాసుకోవచ్చు. కాని గోడు వినేవాడెవడూ ఉండడు. చర్చించ వచ్చుకాని ఎదుర్కొనే అవకాశం ఉండదు. అసలు రాజ్యాంగమే ఉండదు.

రౌలట్ చట్టం వంటిదే, 1917లో రాజద్రోహ సమావేశాల నిరోధచట్టం ఉంది.

అసలు రాజద్రోహం అంటే ఏమిటి? మెకాలే రాజద్రోహం గురించి వివరంగా రాశాడు. కాని దాన్ని ఒక నేరంగా భారత శిక్షాస్మృతిలో చేర్చడం మరిచిపోయారు. మొదటిసారి 1860లో భారత శిక్షాస్మృతి అమలులోకి వచ్చింది కాని దానిలో రాజద్రోహం ఒక నేరంగా నమోదు కాలేదు.

ఎప్పుడయితే తిరుగుబాటు భావాలు వ్యాపించడం మొదలయిందో అప్పుడు అంటే ఇరవయో శతాబ్దపు మొదటి దశకంలో, బెంగాల్ విభజన కాలంలో, భారత శిక్షాస్మృతి లో రాజద్రోహ నేరాన్ని నమోదు చేయలేదే అని గుర్తించారు. ఎట్లా మరిచిపోయాం అని చర్చ జరిగింది.

బ్రిటిష్ పార్లమెంటులో చర్చ జరిగింది. ఒక కమిషన్ వేసి చర్చించారు. అసలు భారత శిక్షాస్మృతిని రాసిందే మెకాలే కమిషన్ గదా. ఆయనే రాజద్రోహ నేరం గురించి

రాసినవాడు గదా, శిక్షాస్మృతిలో ఎందుకు చేర్చలేదు అని చర్చ -- మరిచిపోయినారు. అంతే. ఇంకో కారణమేదీ లేదు.

వాక్స్వాతంత్ర్యాన్ని అడ్డుకునే తగిన నిబంధన పెట్టాలనుకుని అది మరిచి పోయినారన్నమాట.

అప్పుడిక 124ఎ అని అదనంగా రాజద్రోహ నేరాన్ని చేర్చారు. అట్లాగే కుట్ర నేరాన్ని నమోదు చేస్తూ 120ఎ, 120బి సెక్షన్లు కూడ చేర్చారు.

వాటితోపాటే క్రిమినల్ లా అమెండ్‌మెంట్ ఆక్ట్ 1908 అనే ప్రత్యేక చట్టాన్ని కూడా తీసుకొచ్చారు. అది ఎప్పుడు వచ్చింది? బెంగాల్‌లో అనుశీలన్, యుగాంతర్ వంటి యువ విప్లవకారుల బృందాలు ఏర్పడుతున్నప్పుడు ఆ బృందాలను అణచి వేయడానికి వచ్చింది. ఆ సంస్థలను నిషేధించడానికే ఆ ప్రత్యేక చట్టం వచ్చింది. కుట్రను, రాజద్రోహాన్ని ప్రత్యేక నేరాలుగా పరిగణించడం మొదలు పెట్టారు.

తిరుగుబాట్లు ఎక్కువయ్యేసరికి రాజ్యం మీద యుద్ధం చేయడం, రాజ్యం మీద యుద్ధానికి కుట్ర చేయడం అనే రెండు కొత్త సెక్షన్లు కూడ చేర్చారు. ఆసియాలో పక్క రాజ్యాలలో ఏమయినా తిరుగుబాట్లు జరిగినా వాటికి సహకరించగూడదని మరొక సెక్షన్ చేర్చారు. సరిగ్గా అటువంటి చట్టమే సార్క్ టెర్రరిజం చట్టం అని ఇటీవల ప్రవేశ పెట్టారు.

అంటే చెప్పడం ఏమంటే బ్రిటిష్ పాలనకూ ఇప్పటికీ ఏమీ మారలేదు. బ్రిటిష్ నేర చట్టాల చరిత్రకూ, మన నేర చట్టాల చరిత్రకూ ఏమీ తేడా లేదు. బ్రిటిష్ పాలకులు శాసనోల్లంఘనోద్యమం సందర్భంగా ప్రత్యేక చట్టాలు ప్రవేశపెట్టారు. ఆ చట్టాల ఉద్దేశ్యాలను వివరిస్తూ రాసిన ఉపోద్ఘాతంలో సామాజిక ఉద్యమాలను ప్రస్తావించి మరీ అందుకొరకే చట్టాలను తెస్తున్నామని రాశారు.

అట్లాగే సైన్యంలో చేరగూడదు అని ప్రచారం చేయడం నేరం అని చెపుతూ ఒక చట్టం, పత్రికలను అదుపులో పెట్టడానికి మరొక చట్టం - ఇట్లా అనేక చట్టాలు వచ్చాయి.

ఇవన్నీ ప్రజల తిరుగుబాట్లను అదుపులో పెట్టడానికి వచ్చిన ప్రత్యేక చట్టాలు. ఇంకా చేయిదాటిపోతే ప్రభుత్వం మీద యుద్ధం అని నేరం ఆరోపించవచ్చు. ఇవి కాకుండా ఉద్యమకారులను నేరుగా కాల్చి చంపడం ఒకటి.

అంటే ప్రభుత్వం ప్రజలతో, ఉద్యమాలతో వ్యవహరించే దానికి మూడు పద్ధతు లున్నాయన్నమాట. ఒకటి - సాధారణ పరిస్థితులలో ఒక శిక్షాస్మృతి పెట్టుకుని ప్రజలను భయపెడుతూ, ఒళ్ళు దగ్గర పెట్టుకుని బతకమని చెపుతూ ఉండడం. అది స్నేహపూరిత ఫాసిజం అన్నమాట. మనుషులను అరెస్టు చేయడం, కొట్టడం, కేసులు పెట్టడం - ఈ మాదిరిగా చేసే పనులు.

రెండు - ప్రత్యేక చట్టాలు ప్రవేశపెట్టి విచరణాక్రమాన్ని తగ్గించడం, విచారణలోంచి

న్యాయబద్ధతను తగ్గించడం.

మూడు - తక్షణమే శిక్ష విధించడం, కాల్చి పారేయడం.

బ్రిటిష్ పాలన నుంచి మనకు వారసత్వంగా అందినవవి. ఇవి మనకు అలవాటయిపోయాయి. ఏ చట్టాలనయితే మన జాతీయోద్యమాన్ని, స్వాతంత్ర్యో ద్యమాన్ని అణచడానికి ఉపయోగించారో అవే చట్టాల్ని ఇవాల్టికీ పాటిస్తున్నాం. స్వాతంత్ర్యం తర్వాత, రాజ్యాంగం రాసుకున్న తర్వాత, ప్రాథమిక హక్కులు కల్పించుకున్న తర్వాత పాత బ్రిటిష్ పద్ధతుల్ని, బ్రిటిష్ చట్టాల్ని యథాతథంగా అమలు చేస్తున్నాం.

ఇక్కడ నేను ప్రత్యేకంగా ప్రత్యేక చట్టాల గురించి చెప్పదలచుకున్నాను. పాత చట్టాలన్నిటినీ రాజ్యాంగంలోని 372 అధికరణం ప్రకారం స్వతంత్ర భారత ప్రభుత్వం అనువర్తింపజేసుకున్నది.

ఈ అనువర్తింప జేసుకోవడం కూడ చాల బుద్ధి తక్కువగా జరిగిందని నాకు అనిపిస్తుంది. ఎందుకంటే, ఎప్పుడయినా ఒక ప్రభుత్వం మారినప్పుడు, వ్యవస్థ మారినప్పుడు, రాజకీయ మార్పు జరిగినప్పుడు పాత చట్టాలను కొనసాగింపు కోసం అనువర్తింపజేసుకోవచ్చు. చట్టాలే లేకుండా సమాజాన్ని నడపడం, నిర్వహించడం కష్టమవుతుంది. ఏదయినా పాత నుంచి కొత్తకు కొనసాగింపు ఉండాలి. అయితే ఆ అనువర్తన అనేది కొత్త రాజ్యాంగ విలువలకు అనుగుణంగా మార్పులతో జరగాలి.

చిత్తరంజన్ దాస్ 1921లో గయ కాంగ్రెస్ అధ్యక్షోపన్యాసం ఇవ్వవలసి ఉండింది. ఆయనను అరెస్టు చేసినందువల్ల ఆయన వెళ్ళలేకపోయాడు. ఆయన తయారు చేసుకుని, ఇవ్వలేకపోయిన ఉపన్యాసంలో 'శాంతి భద్రతలు' అని ఒక అధ్యాయం ఉంది. ఆ ఉపన్యాసంలో ఆయన క్రిమినల్ లా అమెండ్‌మెంట్ అక్ట్, సెడిషన్ మీటింగ్స్ ప్రివెన్షన్ అక్ట్ వంటి ప్రత్యేక చట్టాలన్నిటినీ రద్దు చేయాలని రాశాడు. ఒక కమిటీ ఏర్పాటు చేసి ఈ చట్టాలన్నిటినీ ఉపసంహరించాలని ఆయన అన్నాడు.

గవర్నమెంట్ ఆఫ్ ఇండియా అక్ట్ 1935 వచ్చేముందు అప్పటి కాంగ్రెస్ నాయకుడు, పార్లమెంటరీ నిపుణుడు ఎస్ సత్యమూర్తి ఒక ప్రతిపాదన చేశారు. ఆయన ఈ దేశంలో రూపొందిన గొప్ప పార్లమెంటేరియన్లలో ఒకరు. ఇంగ్లీషులోనైనా, తమిళంలోనైనా అనర్గళంగా ఉపన్యసించేవారు. ఆయన ఈ ప్రత్యేక చట్టాలన్నీ ఉపసంహ రించుకొమ్మని బ్రిటిష్ ప్రభుత్వాన్ని కోరారు. "ఎట్లాగూ 1935 చట్టంతో భారతదేశానికి రాష్ట్రాలకు స్వతంత్ర ప్రతిపత్తి ఇస్తానని ప్రతిపాదిస్తున్నారు గదా. ఆ లోపు అత్యాచారాలు అమలు చేసే చట్టాలన్నిటినీ వెనక్కి తీసుకొండి' అని సెంట్రల్ వైస్రాయి కౌన్సిల్‌లో ఎనిమిది గంటలు వాదించారు. చాలా గొప్ప వాదన అది.

కాని మన రాజ్యాంగ నిర్ణయ సభలో దీని గురించి పట్టించుకున్నవాడు లేదు. బ్రిటిష్ ప్రభుత్వం అంతకు ముందరి తొంభై ఏళ్ళలో ఎన్నో చట్టాలు ప్రవేశపెట్టింది

గదా, వాటిని ఉంచాలా, తీసేయాలా, మార్చాలా అని చర్చించినవాడు లేడు. ఈ వ్యవహారం మొత్తాన్ని కార్యనిర్వాహక వర్గానికి వదిలేశారు.

కొన్ని చట్టాలు కొనసాగించవలసినవి ఉంటాయి. ప్రజల నిత్యజీవిత వ్యవహారాలను శాసించే, నియంత్రించే చట్టాలు - కాంట్రాక్ట్ చట్టంగాని, సివిల్ ప్రొసీజర్ కోడ్ గాని, కొన్ని మార్పులతో ఇండియన్ పీనల్ కోడ్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లను కూడ కొనసాగించ వచ్చు.

కాని మరికొన్ని చట్టాలున్నాయి. అవి ప్రవేశపెట్టడమే స్వాతంత్ర్యోద్యమాన్ని అణచ డానికి ప్రవేశపెట్టడం జరిగింది. ఆ చట్టాలను కొనసాగించడం, అనువర్తింపజేయడం తెలివి తక్కువతనమైనా కావాలి. రాజకీయ అవగాహన లోపించడమయినా కావాలి. ఈ రాజకీయ అవగాహన కూడ నేనేమీ మార్క్సిస్టు అవగాహన గురించి చెప్పడం లేదు. మీ, కాంగ్రెస్, స్వాతంత్ర్యోద్యమ రాజకీయ అవగాహన పరిధిలోనే ఆ చట్టాలను అంగీకరించడం ఎట్లా సాధ్యమవుతుంది? ఆ చట్టాలను అనువర్తింపజేసుకున్నారంటే నీ రాజకీయ అవగాహనలో ఏదో లోపం ఉందన్నమాట.

ఇక ఎన్‌కౌంటర్లు - బ్రిటిష్ పాలనా కాలంలో చంద్ర శేఖర్ ఆజాద్‌ను కాల్చేశారు. అల్లూరి సీతారామరాజును కాల్చేశారు. సీతారామరాజుది ఎన్‌కౌంటర్ అని మేజర్ గూడాల్ రాశాడు.

వాళ్ళు చంపినారు సరే, నువ్వెందుకు చంపుతున్నావు అనేది నా ప్రశ్న. మొదటి నుంచీ నా ప్రశ్న అదే. స్వాతంత్ర్యం వచ్చిందని అవి, రాజ్యాంగం రాసుకుని, అందులో ఎంతో చక్కని ఉపోద్ఘాతం రాసుకుని, ప్రాథమిక హక్కులను హామీ ఇచ్చి, నువ్వూ బ్రిటిష్ పాలకుల లాగనే ప్రజలను చంపితే ఎట్లా?

రాజ్యాంగ రచన నాటికే మానవ హక్కుల భావన ఉంది. అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటన వెలువడి ఉంది. రాజ్యాంగంలో దాని ప్రస్తావన లేకపోవచ్చు గాని రాజ్యాంగ రచన వెనుక ఆ స్ఫూర్తి ఉంది. అసలు రెండో ప్రపంచ యుద్ధం తర్వాత వలస పాలన నుంచి విముక్తమైన అన్ని దేశాలలోను ఆ యుద్ధ బీభత్సం, ఫాసిజం, నాజీజం వల్ల కోల్పోయిన మానవహక్కులు, ప్రపంచదేశాలన్నీ రాసుకున్న బిల్ ఆఫ్ రైట్స్ - ఇవన్నీ ఆలోచనల్లో ఉన్నాయి.

అసలు రెండో ప్రపంచ యుద్ధం నాటి ప్రచారమే ఎట్లా సాగిందంటే అది ప్రజాస్వామ్యం కొరకు చిట్టచివరి పోరాటం అన్నారు. ఆ యుద్ధంలో ఓడిపోతే ప్రజాస్వామ్యం అంతరించి పోతుందన్నారు. ఆ మాట చెపుతూనే 'ఇంక యుద్ధం అయిపో వచ్చింది. ఇంక జపాన్ కూడా సంధి కుదుర్చుకుంటుంది. ఇంక ఏమీ లేదు' అనిపించే సమయంలో అటంబాంబు వేసినారు. ఎవరినీ అడగకుండానే, ఎవరికీ చెప్పకుండానే అమెరికా, బ్రిటన్‌లు ఆ అటంబాంబు వేయాలని నిర్ణయం తీసుకున్నాయి. బ్రిటన్ ప్రధాని

చర్చిల్ చాలా సంతోషపడుతూ టెలిగ్రాం ఇచ్చాడు. 'ఈ బాంబు వేయక పోతే ఇంకా చాలా మంది చచ్చిపోయేవారు. బాంబు వేసి మంచి పని చేశాం' అన్నాడు.

హిరోషిమా, నాగసాకిల్లో ఆరు లక్షల యాభైవేల మంది చనిపోయారు. అంతమంది మరణాలను విస్మరించి రెండు అగ్రరాజ్యాలూ సంతోషంగా టెలిగ్రాంలు ఇచ్చుకున్నాయి.

ఆ అటంబాంబును జారవిడిచిన విమానం పైలట్‌కు తాను ఏం చేస్తున్నాడో తెలియదు. చెప్పిన పని చేసి తిరిగి పోయేటప్పుడు అతనికి తాను ఎంత మహా విధ్వంసాన్ని సృష్టించాడో అర్థమైంది. ఆ బీభత్సమంతా చూసి అతనికి మతి చలించింది. వీధుల్లో తిరుగుతూ ఎక్కడ పడితే అక్కడ ఆ విధ్వంసం గురించి మాట్లాడడం మొదలు పెట్టాడు. అతనికి పిచ్చి ఎక్కిందని చెప్పి కొంతకాలం పిచ్చి ఆస్పత్రిలో చేర్చారు. తర్వాత అక్కడి నుంచి విడుదల చేస్తే వెళ్ళి రామకృష్ణ మిషన్‌లో చేరి ఆధ్యాత్మిక మార్గంలోకి వెళ్ళాడు.

ఇదంతా ఎందుకు చెపుతున్నానంటే అధికారంలో ఉన్నవారి ద్వంద్వనీతి గురించి అర్థం చేసుకోవడానికి ఒక పక్క నుంచేమో మానవహక్కులు, అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటన, ఐక్యరాజ్య సమితి అంటూ వచ్చారు. యుద్ధాలు వద్దు అంటూ చర్చలు జరుపుతున్నారు. మరో పక్క బాంబులు వేసి లక్షలాది మంది ప్రాణాలు బలిగొంటున్నారు.

ఎన్‌కౌంటర్ల విషయంలో కూడ సరిగ్గా ఇదే నీతి అమలయింది. ఎన్‌కౌంటర్ పేరు మీద అందరినీ చంపుతూనే ఉన్నారు. మరో పక్క ఇది శాంతిభద్రతల కోసం, ప్రజల రక్షణ కోసం, ప్రభుత్వ భద్రత కోసం అని అంటూ ఉన్నారు.

ఎన్‌కౌంటర్‌లు ఎందుకు జరుగుతున్నాయి అంటే శాంతిభద్రతల కోసం అని ముప్పై ఏడేళ్ళ కింద పోలీసు అధికారి ఎంవి నారాయణరావు దగ్గరి నుంచి ఇవాల్టి పోలీసు అధికారి స్వరణ్‌జిత్ సేన్ దాకా అందరూ అదే సమాధానం చెపుతున్నారు. అప్పుడు ఆయన తెలివి తక్కువగా మాట్లాడాడు. ఇప్పుడు ఈయనా తెలివి తక్కువగానే మాట్లాడుతున్నాడు. తెలివి తక్కువతనంలో కూడా స్థాయీ భేదాలుంటాయని నాకు వీళ్ళను చూస్తేనే తెలిసింది.

ఈ శాంతి భద్రతలు, రాజ్యభద్రత, ప్రజల రక్షణ అనే మాటల విశ్లేషణ ఏమిటి? ఈ మాటలకు హద్దులు ఏమిటి?

ఈ ప్రశ్నలకు అక్కడక్కడా చట్టంలో ప్రస్తావనలున్నాయి గాని పూర్తి వివరణ ఎక్కడా లేదు. కేవలం ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టంలో రాజ్యభద్రత దెబ్బతిందని అనిపించి నప్పుడు ఆ చట్టం వాడవచ్చునని మాత్రం ఉంది. ఎవరికి అనిపించాలి, ఆ అనిపించడం నిజమైనదా, అబద్ధమైనదా చర్చ ఉండనే ఉంది.

మొత్తానికి ఈ మూడు మాటలూ రాజ్యాంగం హామీ ఇచ్చిన హక్కులను కాలరాస్తాయి, అధిగమిస్తాయి. ఈ మూడు మాటలు అనడం అంటేనే ప్రాథమిక హక్కులను ఉల్లఘించవచ్చునని చెప్పడం అన్నమాట.

దీని గురించి నోమ్ ఛామ్‌స్కీ పెద్ద ఎత్తున రాశాడు. పొలిటికల్ అనాటమీ ఆఫ హ్యూమన్‌రైట్స్ అని రెండు సంపుటాలలో చాల వివరంగా చర్చించాడు.

ఈ మానవహక్కుల, ప్రాథమిక హక్కుల ఉల్లంఘన ఎట్లా జరుగుతుంది అనేది స్వతంత్ర భారతదేశంలో మొదటి ఇరవై ఐదు సంవత్సరాలు పెద్దగా బైటపడలేదు. పోలీసు శాఖలో జరిగే అవకతవకల గురించి బైటికి రాలేదు. పుచ్చలపల్లి సుందరయ్య తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం మీద రాసిన పుస్తకంలో స్వతంత్ర భారత పాలనలోనే రెండున్నర వేలమంది కార్యకర్తలను పోలీసులు కాల్చి చంపారు అని రాశారు. ఆయన సాధారణంగా అతిశయోక్తులు రాయరు. ఆయన రాసిన అంకె నమ్మదగినదే అయి ఉంటుంది. ఆ రెండున్నర వేల మందిని ఎన్‌కౌంటర్ పేరుతోనే కాల్చి చంపారు.

ఆ ఇరవై ఐదు సంవత్సరాలు కూడా మన ప్రభుత్వం నిజమైన ప్రజాపాలన జరపలేదు. చాలా నిరంకుశంగా ప్రవర్తించింది అని ఎప్పుడు బైటికి వచ్చిందంటే ఎమర్జెన్సీలో.

నిజానికి చెప్పాలంటే ఆంధ్ర ప్రదేశ్‌లో ఎమర్జెన్సీ 1969 నాటికే వచ్చింది. ఇక్కడ ఆంధ్ర ప్రదేశ్ సప్రెషన్ ఆఫ్ డిస్టర్బెన్సెస్ ఆక్ట్ (ఆంధ్ర ప్రదేశ్ కల్లోలాల అణచివేత చట్టం) అనే చట్టం అంతకుముందు నుంచే ఉండింది. బ్రిటిష్ పాలకులు కమ్యూనిస్టులను అణచివేయడానికి తయారు చేసిన చట్టాన్ని 1967లో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం అనువర్తింప జేసుకుంది. అది ఎట్లా చెల్లుతుంది అని ప్రశ్నించినవారు లేరు. అసలు దాన్ని చదివిన వారు ఎంతమందో తెలియదు. దాన్ని అర్థం చేసుకున్నవాళ్ళు లేరు.

ఒక ఆశయం కోసం, ప్రజల కోసం పోరాడాలన్నా సమాచారం, అవగాహన సంపూర్ణంగా ఉండాలి. కాని మన దగ్గర అటువంటి సంపూర్ణ అవగాహన కోసం ప్రయత్నమే లేదు.

ఇటువంటి హక్కుల ఉల్లంఘన సంఘటనలు బయటపడినప్పుడు మాత్రం దిగ్భ్రాంతి వ్యక్తమయ్యేది. అది ఎందుకు జరుగుతున్నదో, ఎప్పటి నుంచి జరుగుతున్నదో, దాన్ని ఆపడానికి ఎటువంటి కృషి చేయాలో ఆలోచించే బదులు ఒకరకమైన కొత్త సంగతి తెలుసుకున్న దిగ్భ్రాంతి కనబడేది.

భగల్‌పూర్‌లో ఖైదీల కళ్ళు పొడిచేసిన ఘటన ఉంది. అది ఎవరు బైటికి తెచ్చారు? ఎవరో ఒక జైలరో ఎవరో చెపితే అరుణ్ శౌరి దాని గురించి పెద్ద ఎత్తున రాశాడు. దేశమంతా గగ్గోలు అయింది. కాని భగల్‌పూర్‌లో ఆ దురాగతం ఇందిరా గాంధీ చేయించిందా, ఇందిరా గాంధీ కాలంలోనే మొదలయిందా? కాదు, నెహ్రూ గారి పాలనా కాలం నుంచీ అది జరుగుతూనే ఉంది.

అట్లాగే విచారణ పేరుతో ఖైదీలు ఏళ్ళకు ఏళ్ళు జైళ్ళలో మగ్గిపోతున్న ఉదంతాలు బైటపడ్డాయి. పదకొండేళ్ళు, పన్నెండేళ్ళు ఏ విచారణా లేకుండా జైళ్ళలో ఉండిపోయిన ఖైదీలు - ఆ దారుణాలు ఇందిరా గాంధీ ప్రారంభించలేదు. ఇంకా ముందే, నెహ్రూ

పాలనలోనే మొదలయ్యాయి.

అన్ని పాపాలు ఆమె నెత్తిన రుద్దారు గాని, మానవహక్కుల ఉల్లంఘన రాజ్యాంగం హామీ ఇచ్చిన ప్రాథమిక హక్కుల పట్ల లక్ష్యం లేకపోవడం ఆమె రావడానికి చాలా ముందు నుంచే ఈ దేశంలో సాగుతూనే ఉన్నాయి.

అవన్నీ ఎమర్జెన్సీలో బైటపడ్డాయి. అట్లా హక్కుల ఉల్లంఘన వివరాలు ప్రజలకు తెలుస్తూ వచ్చాయి. అప్పుడు నక్సలైట్లే ప్రధాన బాధితులు కాబట్టి, వాళ్ళ పౌరహక్కుల గురించి మరెవరూ పట్టించుకోవడం లేదు కాబట్టి, వాళ్ళు పౌరహక్కుల సంఘం ఏర్పాటు చేసుకోవలసి వచ్చింది.

పౌరహక్కుల సంఘం లేకపోతే నక్సలైట్ల మీద చట్టవిరుద్ధంగా జరుగుతున్న చర్యలు, దారుణాలు ప్రజల దృష్టికి వచ్చేవి కావు. ఏదో కొంతమంది విప్లవ రచయితలు, సానుభూతి పరులు అంతకుముందు పట్టించుకున్నారు గాని పౌరహక్కుల సంఘం వచ్చిన తర్వాతనే ఆ దారుణాల గురించి ఆలోచించడం విస్తృతమైంది.

అంతకుముందు ఆంధ్ర ప్రదేశ్ పౌరహక్కుల సంఘం అని ఒకటి ఉండింది గాని 1964లో పార్టీ చీలిపోయినప్పుడు అక్కడ కొట్టుకోవడమే తక్కువ. ఆ తర్వాత అదీ కనబడకుండా పోయింది. మళ్ళీ 1973లో పౌరహక్కుల సంఘం ఏర్పడినప్పుడు నేను సాధారణ సభ్యునిగానే ఉన్నాను. మాకు డిఫెన్స్ కమిటీ కూడా ఒకటి ఉండింది గదా.

కాని ఈ కేసులు, నక్సలైట్ల కేసులు కూడ చేసుకుంటూ ఉన్నాను. నిజానికి నాకు అప్పటికే మిగతా కేసులు, కాంట్రాక్టు అక్ట్ కింద, కంపెనీస్ అక్ట్ కింద కేసులు, చాలా ఉండేవి. నాకు ఇదొక్కటే లిటిగేషన్ కాదు, కాని నక్సలైట్ల స్టాండింగ్ కౌన్సెల్ అని పేరు వచ్చింది.

అయితే ఈ పౌరహక్కుల ఉల్లంఘనకు సంబంధించి లోతుకు పోతున్నకొద్దీ నాకు అర్థమయినదేమంటే ఈ వ్యవస్థ చాల క్రూరమైన వ్యవస్థ అని. దానికి చట్టబద్ధపాలనతో ఎటువంటి సంబంధమూ లేదని.

అందువల్ల, ఎన్‌కౌంటర్లనేవి ఎటువంటి రాజ్యాంగ వ్యవస్థకయినా, ప్రజాస్వామ్యం గురించి మాట్లాడేపాలనలో, మాయని మచ్చ అని గుర్తించి, వాటిమీద శ్రద్ధ పెట్టాలను కున్నాను.

ఎన్‌కౌంటర్ల వంటి దారుణాల మీద ప్రజా ప్రతిస్పందన ఎందుకు ఉండడం లేదు? ఇందుకు చరిత్రలో, మన సమాజం తయారయిన పద్ధతిలో కారణాలున్నాయి. ఇతర చరిత్రలలో, ఇతర సమాజాలలో ప్రజలు అన్యాయం మీద తిరగబడిన పద్ధతిలో మన సమాజంలో ప్రజలు అన్యాయం మీద తిరగబడలేదు.

సమాజంలోని కుల విభజన అనే సంప్రదాయం కూడా అన్యాయం మీద తిరగ బడకుండా ఉండడానికి, మొత్తంగా నిర్లిప్తత వ్యాపించడానికి ఒక కారణం కావచ్చు.

అన్యాయానికి గురయిన వ్యక్తిపట్ల సానుభూతి, దయ చూపించడం ఉంది. కాని అన్యాయం చేసిన వ్యక్తిపట్ల కోపంతో తిరుగుబాట్లు లేవు. 'పాపం, మాదిగ వాణ్ణి కొట్టి చంపేసినారయ్యా' అంటాం. నిజంగా కోపం రావలసింది అట్లా చంపిన భూసామ్యవర్గాల మీద, వెలమలు, రెడ్ల మీద, కమ్మల మీద, బలసంపన్నులయిన అగ్రవర్గాల ఎదురుగా నిలబడి ప్రశ్నించడం రాదు. దెబ్బతిన్న దళితుల మీద, కింది కులాల మీద జాలి చూపడం ఉండవచ్చు.

అటువంటి సమాజంలో ఎమర్జెన్సీ విధించినప్పుడు, ఇందిరా గాంధీకి ప్రభుత్వానికి అది ఒక అనివార్య చర్య. అప్పటికి ముప్పై సంవత్సరాల దుష్పరిపాలనకు అది పరాకాష్ఠ

1947లో స్వాతంత్ర్యం వస్తే, ఎకె గోపాలన్ అప్పటికి జైలులో ఉన్నాడు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది గదా అని గోపాలన్ జైలులో త్రివర్ణ పతాకం ఎగరేశాడు. ఆ సంఘటనను నేరంగా నమోదు చేసి, బ్రిటిష్ ప్రభుత్వాన్ని కూలదోయడానికి రాజద్రోహకర ఉపన్యాసం చేశాడని కేసు పెట్టి విచారించారు. అటువంటి పరిస్థితుల్లో మనం ఉన్నాం.

దేశ విభజన ఒక మహావిషాదం. లక్షలాది మంది ఊచకోత కోయబడ్డారు. తమ స్వస్థలాల నుంచి వెళ్ళగొట్టబడ్డారు. స్త్రీల మీద అత్యాచారాలు జరిగాయి. అయితే నేనే మనుకుంటున్నానంటే, దేశ విభజన అనివార్యమవుతున్నదని ముందే గుర్తిస్తే పాలకులు, ఆ హింసను, దౌర్జన్యాన్ని ఆపి ఉండగలిగేవారు. రెండువైపులా దౌర్జన్యాలు జరిగాయి. అలా జరగకుండా ఏర్పాట్లు చేసి ఉండగలిగే వారు. తప్పని సరి పరిస్థితుల్లో ప్రజలను అటునుంచి ఇటు, ఇటునుంచి అటూ రవాణా చేయవలసి ఉంటే సురక్షితంగా రవాణా చేసే అవకాశం ఉండింది.

కాని ఆ సమయంలో ప్రజల మానసిక స్థితి ఉన్మాదానికి దగ్గరిగా ఉండింది. ఎవరో కొద్దిమంది అవగాహనాపరులను మినహాయిస్తే హిందువులలో గాని, ముస్లింలలో గాని అటువంటి మానసిక స్థితే వ్యక్తమయింది.

అంత పెద్ద ఎత్తున మానవ హననం, మారణహోమం జరగాలని ఒకరకమైన మౌన అంగీకారం అన్నివైపులా ఉన్నట్టుగా అనిపించింది. అన్ని లక్షల మందిని అట్లా ఊచకోత కోస్తూ ఉంటే నిర్లిప్తత వ్యక్తమయింది.

అందుకే నాకు ఏమనిపిస్తుందంటే, ఈ ఉపఖండంలో మనిషి జీవితం పట్లా, ప్రాణం పట్లా ఎటువంటి పట్టింపూ లేని సమూహాలు ఎన్నో ఉన్నాయి. అన్యాయం పట్ల ప్రతిస్పందన లేదు. దారుణమైన మరణాలపట్ల ప్రతిస్పందన లేదు.

ఇందిరా గాంధీ హత్య తర్వాత ఢిల్లీలోనూ, ఉత్తర భారతమంతటా సిక్కుల మీద దుర్మార్గమైన దాడులు జరిగాయి. మారణహోమం జరిగింది. దానిపట్ల పెద్దగా పట్టించు కున్నవాడు లేదు.

అట్లాగే గుజరాత్‌లో జరిగిన దారుణ మారణహోమం పట్ల రావలసిన పద్ధతిలో ప్రతిస్పందన రాలేదు. అప్పుడు కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం ఆ దారుణ మారణకాండను సమర్థించింది. సమర్థించడం మాత్రమే కాదు, అప్పటి ఉప ప్రధానమంత్రి

స్వయంగా అన్నమాట ఏమంటే, 'గత యాభై ఏళ్ళలో నరేంద్రమోడీ అంత గొప్ప ముఖ్యమంత్రి కనబడద'ని!

ఇటువంటి దేశంలో, ఇటువంటి వైఖరులతో, నిజంగా మన రాజ్యాంగంలో రాసుకున్న మానవీయ లక్ష్యాలను చేరుకోవాలంటే చాలా దూరం ప్రయాణించాలి. 'నరేంద్రమోడీ ముస్లింలకు మంచి గుణపాఠం నేర్పాడు. చాలా సంతోషం' అన్నవాళ్ళను కూడా నేను చూశాను.

ఇటువంటి మహావిషాదాలు జరిగితే కూడ ప్రజల నుంచి, సమాజం నుంచి ఉండ వలసినంత, ఆరోగ్యకరమైన ప్రతిస్పందన లేదు.

సామాజిక మార్పు, ఆ సామాజిక మార్పు కోసం ప్రభుత్వం పనిచేయడం, సమాజంలో మార్పు రావాలి. ఆర్థిక, సామాజిక అసమానతలను గుర్తించి, వాటిని తొలగించాలి. ప్రభుత్వ పనిద్వారా గాని, రాజకీయ పార్టీల ద్వారా గాని ఆ పని జరగాలి అనే ఆశయాలు, ఆశలు మన స్వతంత్ర భారత చరిత్రలో కనబడలేదు.

రాజ్యాంగం చాలా బాగా రాసుకున్నాం. ముఖ్యంగా ఉపోద్ఘాతం, ప్రాథమిక హక్కులు అధ్యాయాలు. కాని అవి కాగితం మీదనే ఉండిపోయాయి. 1950 జనవరి 26న రాజ్యాంగం అమలులోకి వస్తే నెల తిరగకుండానే ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం వచ్చింది. ఏడాదిపాటు కారణం చూపకుండా ఎవరినైనా నిర్బంధించి ఉంచవచ్చునని ప్రభుత్వం అసాధారణ అధికారాలు సంపాదించుకుంది. ఎకె గోపాలన్ ఈ చట్టాన్ని సవాలు చేస్తే న్యాయస్థానాలు ఆ చట్టం చెల్లుతుందని చెప్పాయి.

అంటే న్యాయ వ్యవస్థను బ్రిటిష్ పాలకులు ఎట్లా తయారు చేసిపెట్టి పోయారో అట్లాగే వాడుకోవడం మొదలుపెట్టాం. రాజ్యాంగంలో ప్రకటించుకున్న ఆదర్శాలకు అనుగుణంగా మన పాలనా వ్యవస్థలను, న్యాయవ్యవస్థను మార్చుకోవాలని కూడా మనం అనుకోలేదు.

తర్వాత చట్టంలో మార్పు తేవలసి వచ్చిన ముఖ్యమైన సందర్భాలలో సరైన చర్చ జరగలేదు. హిందూకోడ్ బిల్లుపై చర్చ చూస్తే, అంత కీలకసమయంలో న్యాయశాఖ మంత్రిగా ఉండిన డా.బి.ఆర్. అంబేద్కర్ రాజీనామా చేయడం చూస్తే ఈ దేశంలో రాజ్యాంగానికి ఏం జరిగిందో అర్థమవుతుంది. రాజ్యాంగం అమలవుతున్న తీరుపట్ల అసంతృప్తితోనే అంబేద్కర్ తన పదవికి రాజీనామా చేశాడు.

ఎన్‌కౌంటర్ హత్యలకు దగ్గరి సంబంధంలో ఉన్నది మరణశిక్షల గురించిన చర్చ. ఎన్‌కౌంటర్ హత్యకు చట్టబద్ధత లేదు. మరణశిక్షకు చట్టబద్ధత ఉంది - అంతే తేడా. రెండు చోట్ల కూడ రాజ్యం పౌరుల ప్రాణాలు తీస్తుంది. మరణశిక్షకు న్యాయస్థానంలో విచారణ తతంగం, చట్టబద్ధమైన ఆమోదం ఉండవచ్చునుగాని అక్కడ కూడ ఆ విచారణ సక్రమంగా జరగకపోవచ్చు. చట్టాన్ని సరిగా వ్యాఖ్యానించడం జరగకపోవచ్చు. అందువల్ల

మనదేశంలో మరణశిక్ష విధింపు గురించి చాలా చర్చ జరిగింది, జరుగుతోంది. మన రాష్ట్రం విషయానికే వస్తే 1975లో భూమయ్య, కిష్టాగౌడ్ ఉరిశిక్ష చాల పెద్దఎత్తున చర్చకు, ఆందోళనకు దారి తీసింది. నాగభూషణం పట్నాయక్, ఇంతా రమణా రెడ్డి, బర్ల యాదగిరి రాజు వంటి నక్సలైటు నాయకులకు కిందికోర్టులు మరణశిక్షలు విధించాయి. వాటిమీద పై కోర్టులలో అప్పీళ్ళు, బయట ప్రజా ఉద్యమాలు జరిగాయి. చివరికి ఆ ఉరిశిక్షలు రద్దయ్యాయి. చిలకలూరిపేట బస్సు దహనం కేసులో దళిత యువకులు చలపతి, విజయవర్ధనరావుల మీద ఉరిశిక్ష పడింది. ఆ ఉరిశిక్ష కూడ అప్పీళ్ళ వల్ల, ప్రజా ఉద్యమం వల్ల రద్దయింది.

దేశవ్యాప్తంగా కూడ సుఖా, జిందాల మరణశిక్ష దగ్గరి నుంచి మొన్న మొన్న ధనుంజయ్ మరణశిక్ష వరకు ఎంతో చర్చ జరిగింది.

ఈ నేపథ్యంలో అసలు మరణశిక్ష గురించి, రాష్ట్రంలోనూ, దేశంలోనూ చర్చకు దారితీసిన కొన్ని మరణశిక్షల గురించి, మరణశిక్షల కేసులలో నా వాదనల గురించి వివరించాలి.

మరణశిక్ష గురించి చర్చ కొత్తది కాదు. ఒక శతాబ్దానికిపైగా ఈ చర్చ జరుగుతోంది. ఏదయినా ఒక దేశం, ఒక సమాజం సంక్షోభంలో పడినప్పుడు, ఆ సంక్షోభంలో నుంచి బైట పడేందుకు కఠినమైన శిక్షలే పరిష్కారమని ప్రభుత్వం అనుకుంటుంది. కఠినమైన చట్టాలు తేవాలనుకుంటుంది.

అంటే ఒక శక్తివంతమైన ప్రభుత్వాన్ని స్థాపించాలనుకుంటారు. అయితే వాళ్ళకు అర్థం కాని విషయమేమంటే శక్తివంతమైన ప్రభుత్వమనేది ప్రజానుకూలమైన, మంచి ప్రభుత్వం కానక్కరలేదు.

ఈ కఠినమైన చట్టాలు, కఠినమైన శిక్షలలో చాల స్పష్టంగా అసమానతలు ఉంటాయి. ఆ అసమానతలు వామపక్ష కేసులలో, రాజకీయ కేసులలో సంపూర్ణంగా బయటపడతాయి. ప్రభుత్వాలు, రాజ్యాంగాలు, న్యాయవ్యవస్థ ఈ కేసులలో తీవ్రంగా వ్యవహరిస్తాయి. పార్లమెంటు గాని, న్యాయవ్యవస్థ గాని వక్రీకరణకు గురవుతాయి. టెర్రరిస్టు కేసులలో కూడ అట్లాగే జరుగుతుంది.

ఉదాహరణకు మహిందర్‌పాల్ సింగ్ అనే టెర్రరిస్టు కేసులో ఇద్దరు న్యాయమూర్తులు వాదనలు విన్నారు. ఒక న్యాయమూర్తి ఆయనను నిర్దోషిగా పరిగణించాడు. మరొక న్యాయమూర్తి దోషిగా పరిగణించి మరణదండన విధించాడు.

ఇది సాధారణంగా జరుగుతుంది. ఒక న్యాయమూర్తేమో ఆ నేరం మరణదండన లాంటి తీవ్రమైన శిక్ష విధించ గలిగిన దనుకుంటాడు. మరొక న్యాయమూర్తేమో ప్రాణాలు తీసేయవలసినంత పెద్ద నేరం కాదని, యావజ్జీవ కారాగార శిక్షో, మరొక శిక్షో విధిస్తే సరిపోతుందని అనుకుంటాడు. ఈ రెండు రకాల తీర్పుల లోని వైరుధ్యాన్ని గురించి

కొంచెం లోతుగా ఆలోచించవలసి ఉంది. ఒకే నేరం, ఒకే చట్టం, ఒకే విచారణ రెండు రకాల తీర్పులకు, అందులోనూ ఒక తీర్పు ఇక సవరించడానికి వీలు లేని తీర్పుకు ఎందుకు దారితీస్తున్నది? అంటే ఇక్కడ న్యాయమూర్తుల వ్యక్తిగత అభిప్రాయాలకూ దురభిప్రాయాలకూ దృక్పథాలకూ ఏమన్నా పాత్ర ఉందా?

అట్లా ఇద్దరు న్యాయమూర్తులు పరస్పర భిన్నమైన తీర్పులు చెప్పినప్పుడు, ఆ కేసును మూడో న్యాయమూర్తికి నివేదిస్తారు. ఆ మూడో న్యాయమూర్తి తనకంటె ముందు తీర్పులు చెప్పిన ఇద్దరు న్యాయమూర్తులు చెప్పినదే మెజారిటీ తీర్పు అవుతుంది.

అటువంటి సందర్భాలలో ఎట్లాగూ ఒక న్యాయమూర్తి మరణదండన విధించలేదు గనుక, ఆ న్యాయమూర్తి తీర్పుతోనే ఏకీభవించాలని, మరణదండనకు అనుకూలమైన తీర్పు ఇవ్వగూడదని ఒక సాధారణ సూత్రాన్ని న్యాయమూర్తులందరూ అనుసరించే వారు. కాని మనదేశంలో ఇటీవలి కాలంలో ఈ సాధారణ సూత్రాన్ని చాలా ఎక్కువగా తోసివేయడం జరుగుతోంది.

పరిస్థితులలో మార్పు వచ్చింది కాబట్టి, టెర్రరిజం అనేది సమాజంలో భయ భీతావహాన్ని వ్యాపింపజేస్తున్నది కాబట్టి ఇటువంటి తీర్పులు అవసరమే అనే వాదనలు వినబడుతున్నాయి. అంటే బయటి సమాజంలో వ్యాపిస్తున్న భయం న్యాయవ్యవస్థ లోకి కూడా ప్రవేశించిందన్నమాట. ఆ భయం ప్రవేశించినందువల్ల ఇటువంటి టెర్రరిస్టులను గాని, వామపక్ష అతివాదులను గాని, పార్లమెంటరీయేతర వామపక్ష వాదులను గాని చంపడం సరైనదేనని, అట్లా చంపినప్పుడే, ఆ శిక్ష ఉదాహరణగా కనబడి నేరం తగ్గుముఖం పడుతుందని ఒక వాదన వినబడుతుంటుంది.

అయితే ఈ వాదనలో మొట్టమొదటి లొసుగు ఏమంటే, ఈ నేరాలు చేసే వాళ్ళందరికీ తమ నేరానికి శిక్ష మరణ దండనేనని చాలా స్పష్టంగా తెలుసు. పూర్తిగా తెలిసేవాళ్ళు ఆ చర్యలకు, నేరాలకు పాల్పడుతున్నారు. కనుక 'ఇదిగో ఇంత పెద్ద శిక్ష ఉంది సుమా' అని వాళ్ళను భయపెట్టడం సాధ్యం కాదు. 'మీరు ఆ నేరాలు చేస్తే, మీ ప్రాణాలు తీసే శిక్ష పొంచి ఉంది' అని చెప్పి వాళ్ళు ఆ నేరాలు చేయకుండా ఆపలేము. మరణదండన ఒక బెదురుగా కనీసం ఇటువంటి రాజకీయ ప్రేరేపితమైన చర్యలు చేసే వాళ్ళ విషయంలో ఉపయోగపడదు. మరణశిక్ష అనేది ఒక భయంగా, బెదురుగా ఉంటుంది అనేది భ్రమ.

మితవాద రాజకీయాలలో, పార్లమెంటరీ రాజకీయాలలో ఉన్నవాళ్ళు కూడా హత్యలు చేస్తున్నారు గదా. వాళ్ళకు కూడా హత్యానేరానికి శిక్ష ఏమిటో తెలుసుగదా, వాళ్ళు న్యాయస్థానాల విచారణను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు చేస్తారు. సాక్షులను కొనివేస్తారు, బెదిరిస్తారు. తప్పుడు సాక్ష్యాలు పెడతారు. ప్రాసిక్యూషన్ సరైన చార్జిషీటు పెట్టకుండా, సరిగా వాదించకుండా చూస్తారు. చివరికి తాము బహిరంగంగా చేసిన హత్యానేరాల నుంచి కూడా తప్పించుకుంటారు. నిర్దోషులుగా విడుదల అవుతారు.

వామపక్ష రాజకీయాలలో అట్లా చేయడానికి వీలులేదు. ప్రాసిక్యూషన్‌ను,

విచారణాధికారిని వాళ్ళు ప్రభావితం చేయలేరు. ఒకవేళ ప్రభావితం చేయగలిగినా వాళ్ళమీద అనుమానాలు పెరుగుతాయి. అందువల్ల అది జరిగే అవకాశం లేదు.

కాకుంటే, డబ్బుగల వాళ్ళయితే కాస్తపెద్ద వకీలును పెట్టుకోవడం, ఆ వకీలు సలహాలను బట్టి సాక్ష్యాలు చెప్పించడం, వగైరా చేయవచ్చు.

మొత్తం మీద, ఇటువంటి హత్యానేరం కేసుల్లో, న్యాయస్థానాల విచారణ అనేది పెద్ద వకీళ్ళ చేతుల్లో ఒక క్రీడగా మారిపోయింది. న్యాయం అనేది మామూలుగా సమగ్రమైన అర్థం కల మాట. కాని ఈ క్రీడలో అది దెబ్బతిని పోతుంది.

ఇటువంటి సందర్భంలో కేవలం న్యాయస్థానాల మీదనే నిందమోపడం కాస్త అన్యాయంగా కనబడుతుంది. న్యాయస్థానాల ముందరపెట్టే వాస్తవాలు పోలీసులు విచారణ జరిపి తీసుకువచ్చి పెట్టిన వాస్తవాలే. ఆ వాస్తవాలను అర్థం చేసుకుని, విశ్లేషించి, వాటి లోటుపాట్లను తెలుసుకుని తీర్పు రాయడమనేది న్యాయమూర్తుల సొంత అభిప్రాయాల వల్లనో, వాళ్ళకు సామాజిక అంశాలను అర్థం చేసుకునే సున్నితత్వం లేకపోవడం వల్లనో తీర్పుల రచనలో లోపాలు వస్తాయి.

గుజరాత్‌లో 2002లో జరిగిన మారణకాండ విషయమే చూడండి. ఏ మాత్రం ఒక్క సాక్ష్యాధారం కూడా మిగలకుండా ఆ మారణకాండ జరిపారు. దానికి తోడు, అక్కడ పనిచేసిన న్యాయమూర్తులకు కూడా మత రాజకీయాల అవగాహన ఉండింది.

అయితే అంత మారణహోమం ప్రతిస్పందన లేకుండా ఏమీ పోలేదు. మనదేశంలో సంస్కృతి ఏమంటే అన్యాయం నెత్తిన పెట్టుకుని తిరగరు. అందుకే ఆ కేసు సుప్రీం కోర్టుకు వెళ్ళినప్పుడు విచారణ తతంగం, సాక్ష్యాధారాలు లేకపోవడం చూసి చాలా తీవ్రమైన తీర్పు రాశారు.

ఎక్కడయినా ఒక పేదవాడు నేరం చేస్తే, సరైన వకీలును పెట్టుకోకపోతే మరణ శిక్ష పడుతుంది గాని, సాధారణంగా డబ్బు గలవాళ్ళు మంచి వకీళ్ళను పెట్టుకొని మరణదండన నుంచి తప్పించుకుంటారు. అవినీతి తాండవమాడే దేశంలో విచారణను కానివేయవచ్చు. అదరినీ కొనవచ్చు. పేదవాడు అట్లా కొనలేడు. అందువల్ల సమాజం అవినీతి మయం అయింది అని అర్థమయినప్పుడు, విచారణను డబ్బులతో తారుమారు చేసే అవకాశం ఉందని తెలిసినప్పుడు ఆ విచారణ మీద ఆధారపడి మరణదండన లాంటి కఠినమైన శిక్షలు వేయగూడదు. అది ఒక సాధారణ సూత్రంలాగ పెట్టుకోవాలి.

అయితే అదే సమయంలో ప్రజలవైపు నుంచి కూడ ఒత్తిడి ఉంది. ఇటీవల కలకత్తాలో ధనుంజయ్ అనే ఉరిశిక్ష పడిన ఖైదీ ఉదంతం తీసుకోండి. అతను ఒక లిఫ్ట్ ఆపరేటర్. ఒక చిన్నారి పాపను రేప్ చేసి చంపేశాడని నేరం.

అతణ్ని పది సంవత్సరాలుగా జైలులో పెట్టి ఇప్పుడు ఉరి తీయబోతున్నారు. తలారి దొరకలేదు గనుక శిక్ష అమలును వాయిదా వేస్తూ వచ్చారు. పది సంవత్సరాల పాటు

ఉరికంబం నీడలో, ఏకాంతవాస శిక్షలో జైలులో ఉన్నాడు. హఠాత్తుగా ఉరిశిక్ష అమలు చేయబోయారు.

చిన్నపాపను రేప్ చేసి చంపేశాడు గనుక అతణ్ని చంపేయవలసిందేనని కొన్ని మహిళా సంస్థలు కోరాయి. ఆ కారణం మీద ఉరిశిక్షను సమర్థించడాన్ని నేను వ్యతిరేకించాను.

మొదటిది, నేను మరణశిక్షను మొత్తంగానే వ్యతిరేకించేవాణ్ని. ఎవరైనా గానీ మరణశిక్ష తప్పు అని నా అభిప్రాయం.

రెండోది రేప్, స్త్రీల మీద అత్యాచారాలు జరగకుండా చూడాలంటే అసలు ఈ పితృస్వామ్య సమాజాన్నే పునర్నిర్మించాలి. ఎందుకు పునర్నిర్మించాలి అంటే అది జరగకుండా స్త్రీ పురుష సమానత్వం సాధ్యం కాదు. అటువంటి సమానత్వం రాకుండా, స్త్రీ పట్ల గౌరవం, స్త్రీకి హోదా సాధ్యం కావు.

ఈ వాదనలకు విమర్శ ఎట్లా వస్తుందంటే, అయితే అంత నేరం, ఘోరం చేసిన వాడికి శిక్ష వెయ్యద్దంటావా అని అడుగుతారు.

కాని, అతని మీద శిక్ష ఉంది. శిక్ష వద్దని నేననడం లేదు. నేరం చేసిన వాడికి శిక్ష వెయ్యగూడదని నా అభిప్రాయం కాదు. కాని మరణ దండన బదులుగా యావజ్జీవ కారాగార శిక్ష వెయ్యండి అని నా వాదన.

నేరాలే లేని సమాజం భారత సమాజం ఉండడం అసాధ్యం. ఇన్ని అసమానతలు ఉన్న చోట నేరాలు సహజంగా ఉంటాయి. నేరం అంటే ఏమిటి అని ఆధిపత్య వర్గాలు నిర్ణయించి పెట్టాయి. కాబట్టి నేరాలు ఎప్పుడూ ఉంటాయి.

నా దృష్టిలో సమాజాన్ని ఒక ప్రత్యేక పద్ధతిలో పరిశీలిస్తాను. సాధారణంగా పరిపాలనా విధానాలు, రాజకీయాలు ఒక సరియైన అవగాహనకు తోడ్పడాలి. ఆ అవగాహన సమాజాన్ని పెంపొందించే విధంగా, ముందుకు తీసుకుపోయే విధంగా, ప్రతి ఒక్కరికీ న్యాయాన్ని అందజేసే విధంగా ఉండాలి. అలా పోయినప్పుడు విప్లవంలో చాలామటుకు హింస తగ్గుతుంది. పెద్ద ఎత్తున ప్రజాస్వామిక విలువలను ఏర్పరుస్తూ పోతే, మానవ గౌరవం, హోదా అనే భావనలు అందరి మనసులలో నెలకొంటె పెద్దగా హింస జరగదు అని నేననుకుంటాను. ఒకవేళ విప్లవం వచ్చే సందర్భంలో కూడా అటువంటి సామాజిక పరిస్థితులుంటే హింస పెద్దగా జరగదు.

* * *

# మరణదండనపై ఏదీ సంప్రదాయం

ప్రజల హక్కులను గుర్తిస్తే, ప్రజల హక్కుల దృక్పథంతో మనం మన వ్యవస్థను పునర్ వ్యవస్థీకరిస్తే సమాజంలో విలువలు దృఢపడతాయని నా నమ్మకం. ప్రపంచాన్ని తుపాకి గొట్టం ద్వారా అర్థం చేసుకోవడం, వ్యాఖ్యానించడం, శాసించడం అటు ప్రభుత్వం చేసినా, ఇటు విప్లవకారులు చేసినా సమాజంలో విలువలు విధ్వంసం కావడమే జరుగుతుంది.

అందువల్ల నిజమైన ప్రజాస్వామ్యం అంటే హక్కులను భంగపరిచేది కాదు. లేదా జీవితాన్ని భంగపరిచేది కాదు.

అందువల్లనే ఒక న్యాయస్థానంలో మరణ దండన విధించేటప్పుడు మనం ఆ వాదనలు చూస్తే ఎందుకు ఆ ముద్దాయిని చంపాలి అని ఒక వాదన ఉంటుంది. ఎందుకు చంపగూడదు అని మరొక వాదన ఉంటుంది. ఈ రెండు వాదనలూ విని ఇద్దరు న్యాయమూర్తులు కూచుని 'ఈ ముద్దాయిని చంపెయ్యవలసిందే' అని గనుక తీర్పు ఇచ్చారంటే అది అక్షరాలా హత్యేనని నేననుకుంటాను.

హత్యను చట్టాలు ఏమని నిర్వచిస్తాయో తెలుసునా? ఉద్దేశ్యపూర్వకంగా మనిషిని చంపడం, స్పష్టంగా తెలిసి మనిషిని చంపడం. మనిషిని ఎలా చంపాలో ఆలోచించడం. ఈ అన్ని పనులూ మరణదండన విధించడంలో కూడా ఉన్నాయి.

ఒక నేరానికి శిక్షగా హత్య అనేది లేదని చెప్పడం లేదు. మానవ చరిత్రలో మరణ దండన అనేది ఒక ముఖ్యమైన శిక్షగా ఎప్పటినుంచో ఉంది.

న్యాయ విచారణలో వ్యక్తిగత అంశ ప్రవేశించినప్పుడే, మానవ అంశ ప్రవేశించి నప్పుడే న్యాయం దెబ్బతింటుంది. దానికి అధికారం కూడా తోడయితే న్యాయం మరింతగా దెబ్బతింటుంది.

ఎప్పుడైనా బాధితుల సన్నిహితులు, కుటుంబ సభ్యులు, ఒక ప్రత్యేక వర్గానికీ, ఆలోచనా పద్ధతికీ చెందినవాళ్ళు నేరస్తులకు మరణదండనే సరైన శిక్ష అని కోరుకుంటారు.

కాని మరణదండన మీద చర్చ జరిగినప్పుడల్లా విస్మరణకు గురయ్యే అంశమే మంటే మరణశిక్షను వ్యతిరేకించే వాళ్ళెవరూ కూడా అసలు శిక్షే వద్దనడం లేదు. నిజానికి మరణశిక్షను మించిన శిక్షలున్నాయి. జీవితాంతం బాధపెట్టే శిక్షలున్నాయి. నేరస్తుడు చచ్చిపోవలసిందే అని అనుకునేవాళ్ళు ఇతర శిక్షలున్నాయని మరిచి పోతారు.

ఒకవేళ ఒక నేర విచారణలో బాధితుల బంధువుల ఆకాంక్షలకు తగినట్టుగా శిక్ష

విధించవచ్చు అనే నిబంధన గనుక చేరిస్తే అన్ని సందర్భాలలోను మరణదండనలే విధించవలసి రావచ్చు.

కాని న్యాయ విచారణ, చట్టబద్ధ విచారణ లక్ష్యమేమంటే అటువంటి స్వీయ మానసిక ఆకాంక్షలకు, వ్యక్తిగత ప్రతీకారేచ్ఛకు భిన్నంగా నిష్పాక్షిక పరిశీలన జరిపి, నిష్పాక్షికంగా శిక్ష విధించడం. అందువల్లనే ఇటువంటి నేరాలను న్యాయస్థానాలు విచారించాలని నిర్ణయించుకున్నాం. అట్లా న్యాయస్థానాలు విచారించడంలో గణనీయ మైన ప్రగతి సాధించాం. విచారణ కోసం న్యాయస్థానం ముందుకు వచ్చిన కేసుల విషయంలో వ్యక్తిగత అభిప్రాయాల పాత్రను చాలావరకు తగ్గించగలిగాం. చట్టాలు నిర్దేశించిన విచారణా పద్ధతి, నిష్పాక్షిక న్యాయమూర్తుల చేత విచారణ, ఆ న్యాయ మూర్తులు గాని, బాధితులు గాని ఇష్టారాజ్యంగా శిక్ష విధించడం కాక చట్టబద్ధంగా శిక్ష విధించడం - ఇదంతా మనం సాధించిన ప్రగతి. మానవజాతి, బహుశా అనుద్దేశ్య పూర్వకంగానే కావచ్చు, న్యాయవిచారణలో, శిక్షల విధింపులో వ్యక్తిగత అభిప్రాయాల పాత్ర తగ్గించాలని ఆశించి చేసిన ప్రయత్నంలో సాధించిన ప్రగతి ఇది.

అందుకే నేను ఎప్పుడూ ఏమనుకుంటానంటే చట్టబద్ధపాలన అనే భావన మానవ జాతికి, సమాజానికి, బూర్జువా వర్గం ఇచ్చిన గొప్ప కానుక. దాన్ని ఆ తర్వాత వాళ్ళే ధ్వంసం చేసి ఉండవచ్చు. దాన్ని పాటించడం వాళ్ళ వర్గ ప్రయోజనాలకు అనుకూలంగా లేకపోవచ్చు. .

అయినా సరే, మానవ నాగరికత అభివృద్ధిలో అది గొప్ప ముందడుగు అని నేను భావిస్తాను. ఎవరి చట్టబద్ధపాలన, ఎవరి న్యాయం అనేవి ఇక్కడ అప్రస్తుతం. ఎవరిని అనే ప్రశ్న వేసుకున్నామంటే అసలు సమస్య, న్యాయం అనే సమస్య పక్కకు పోతుంది.

ఒక్క వ్యాజ్యాన్ని, ఒక నేరాన్ని విచారించే పనిని కొందరు నిష్పాక్షిక వ్యక్తులకు అప్పగించడం, వాళ్ళు నిర్ణయం తీసుకునే క్రమంలోకి ఏ వ్యక్తిగత అభిప్రాయ, దురభిప్రాయాలను చొరబడనీయకుండా చూడడం అనేవి ముఖ్యం.

మరణదండన లేకపోతే నేరస్తులకు భయం అనేది ఉండదని, నేరాలు పెరిగి పోతాయని కొందరు వాదిస్తుంటారు. అందువల్ల మరణదండన తప్పనిసరిగా ఉండాలంటారు.

అయితే ఎక్కడా నేరస్తుడిని వదిలిపెట్టడం లేదు. నేరానికి శిక్ష లేకుండా పోదు. స్పష్టంగానే అతను హత్యానేరానికి పాల్పడ్డాడు అని నిర్ధారణ జరుగుతోంది. హత్య, అత్యాచారం రెండు నేరాలూ అతను చేశాడు, అతనికి శిక్ష విధించ వలసిందే అనే దానిలో ఏ సందేహమూ లేదు. ఆ రెండు నేరాలకూ రెండు శిక్షలు విధించవచ్చు. యావజ్జీవ కారాగార శిక్ష గాని, మరణ శిక్ష గాని విధించవచ్చు. నేననేదల్లా ఏమంటే మరణదండన బదులు యావజ్జీవ కారాగార శిక్ష విధించాలని..

భారతదేశ న్యాయశాస్త్ర చరిత్రలో అరుదైన వాటిలోకెల్లా అరుదైన సందర్భంలో మాత్రమే మరణశిక్ష విధించాలని ఒక సంప్రదాయం ఉంది. కాని ఈ 'అరుదైన వాటిలోకెల్లా అరుదైన సందర్భం' అంటే ఏమిటి? దాన్ని ఎట్లా నిర్వచిస్తారు. నిజంగా చెప్పాలంటే దాన్ని నిర్వచించడం అసాధ్యం.

అరుదయినదేమిటో కొలిచే సాధనమేదీ లేదు. అందువల్ల న్యాయమూర్తుల వ్యక్తిగత దురభిప్రాయాలే ఆ కొలిచే సాధనంగా మారిపోయాయి. కనుక తీర్పులు స్వీయ మానసిక తీర్పులయిపోయాయి. ఒకసారి న్యాయమూర్తి ఒక వ్యాజ్యంలోని నేరాన్ని అరుదయిన సందర్భంగా నిర్వచించి మరణదండన విధించిన తర్వాత, ఇక ఎవరికీ దాన్ని మార్చే అవకాశం మిగలదు.

అప్పుడిక ఆ నేరం స్వభావం ఏమిటి, అది అరుదయినదా కాదా అని చర్చించే వీలు లేదు. ఆ నేరాన్ని పక్కన పెట్టి ఇతర కారణాలు చూపుతూ శిక్షను మార్చమని అడగాలి. ఇక పార్లమెంటు గాని, రాష్ట్రపతి గాని అది అరుదయినదా కాదా అని చర్చించడం మానేసి, శిక్షను గురించి ఇతర కోణాలు ఆలోచించాలి. అందువల్ల నేరం జరగడానికి దారి తీసిన పరిస్థితులు, నేరస్తుడి సామాజిక స్థానం, నేరస్తుడి రాజకీయ, సామాజిక అభిప్రాయాలు వంటి అంశాలు పరిగణనలోకి తీసుకోవలసి వస్తుంది.

నేరం ఎట్లా జరిగింది అనే విషయాన్ని న్యాయస్థానం అప్పటికే పరిశీలించి అది అరుదయిన వాటిలోకెల్లా అరుదయినదిగా నిర్ధారించేసింది. ఆ పరిధిలోకి పోవడానికి రాష్ట్రపతికి అధికారం లేదు. రాష్ట్రపతి ఆ పరిధికి వెలుపల ఆ నేరం గురించీ, శిక్ష గురించీ ఆలోచించాలి.

అంటే రాష్ట్రపతి పరిధి ప్రధానంగా రాజకీయ పరిధి అన్నమాట. ఇక్కడ రాజకీయం అన్నప్పుడు పార్టీ రాజకీయాలు అని అర్థం చేసుకోగూడదు. అంటే రాష్ట్రపతి విభిన్న కోణాల నుంచి ఆ సమస్యను అర్థం చేసుకోవలసి ఉంటుందన్న మాట.

ఉరిశిక్ష గురించి, మరణదండన గురించి నా అభిప్రాయాలు మొదటి నుంచీ ఇంత స్పష్టతతో ఉన్నాయని చెప్పలేను. నేను మొట్టమొదటిసారిగా ఉరిశిక్ష గురించి తీవ్రంగా ఆలోచించినదీ, పని చేసినదీ భూమయ్య, కిష్టాగౌడ్‌ల ఉరిశిక్ష సందర్భంలో, అప్పుడు ఈ విషయంలో ఇంత లోతయిన అవగాహన లేదు. ఈ ముప్పై సంవత్సరాల క్రమంలో ఈ ఆలోచనలు విస్తరించాయి.

అప్పుడు, భూమయ్య - కిష్టాగౌడ్‌ల ఉరిశిక్షల సందర్భంలో, మరణదండన పట్ల నా వ్యతిరేకత ఎందుకంటే, రాజ్యం ఇటువంటి శిక్షా పద్ధతిని రాజకీయ ప్రత్యర్థుల విషయంలో అంతకంతకూ ఎక్కువగా వాడుకుంటుందేమోనని. రాజకీయ విశ్వాసాలను ఈ పద్ధతిలో మరణశిక్ష ద్వారా గాని, మరే పద్ధతిలో గాని, అణచివేయడం సరయింది కాదని నా దృఢమైన అభిప్రాయం.

కొన్ని విషయాల గురించి తాత్వికంగా ఆలోచించక తప్పని స్థితి రాష్ట్రపతికి అప్పుడప్పుడు ఏర్పడుతుంటుంది. మరణశిక్షపై క్షమాభిక్ష అనేది అటువంటి ఒక సందర్భం. ఈ విషయం నేను ఒక విజ్ఞప్తిలో రాష్ట్రపతి దృష్టికి తీసుకుపోయాను.

మన రాష్ట్రంలో భూమయ్య - కిష్టాగౌడ్‌తో మరణశిక్షల గురించి చర్చ మొదలయింది. ఆ తర్వాత కూడ రాజకీయ కేసులలో మరణశిక్షలు చాలా అరుదు. నేను వాదించడం మొదలయిన తర్వాత ఏ న్యాయస్థానంలోనూ మరణ శిక్షలు విధించడం జరగలేదు. వేరే సందర్భాలలో మరణశిక్షలు పడినప్పుడు కూడ నేను జోక్యం చేసుకుని, వాదించి వాటిని మరణశిక్షల నుంచి ఇతర శిక్షలుగా మారేలా చూశాను.

ఒక సందర్భం గురించి ప్రత్యేకంగా చెప్పాలి. మెదక్ జిల్లాలో ఒక కేసులో అత్యాచారం, హత్యకేసులో ఒక వ్యక్తికి మరణశిక్ష విధించారు. అతను చాలా పేదవాడు. ఏదో వెనుకబడిన కులానికి చెందినవాడు, పేదవాడు గనుక నేరం చేసే ఉంటాడని జిల్లా జడ్జి భావించాడు. మన సమాజంలో మామూలుగా ఉన్న అభిప్రాయమే అది. పేదవాళ్ళు నేరాలు చేస్తారు అని. పేదరికం ఆ మనుషులను నేరాలను చేయడానికి పురిగొల్పుతుంది అని. అది కొంతవరకు నిజమే కావచ్చు కూడా.

కాని మార్క్స్ రాసినట్టు నేరాలూ నేరస్తులూ లేకపోతే సమాజం నడవదు. నేరాల వల్ల కలిగే ఉద్వేగం, భయాందోళనలు సమాజ జీవితంలో సహజమైన అంశాలు.

సరే, ఆ ముద్దాయికి మరణశిక్ష విధించి, దాన్ని నిర్ధారించారు. ఆ ఖైదీ జైలు నుంచి నాకు ఓ ఉత్తరం రాశాడు. నేను వెళ్ళి అతడ్ని అడిగాను. అతను ఆ నేరం చేశాడా లేదా, చేస్తే ఎందుకు చేశాడు అని.

ఇంతకూ అతను నేరం చేశాడనడానికి స్పష్టమైన సాక్ష్యాధారాలేమీ లేవు. అతనికి అతని పక్కనే భూమి ఉన్న ఆసామితో తగాదా ఉండింది. ఆ ఆసామి ఈ భూమి తనకిమ్మని అడిగాడు. అతను చంపబడేసరికి ఈ వ్యక్తి మీద అనుమానం వచ్చింది. కేవలం ఆ అనుమానం మీద ఆధారపడి జడ్జి మరణశిక్ష విధించాడు.

ఆ కేసు జస్టిస్ రామానుజులు నాయుడు బెంచి మీదికి వచ్చింది. నేను కింది కోర్టు జడ్జిమెంటు చదివి వినిపించి, 'చూడండి, కేవలం అనుమానం మీద మరణశిక్ష విధించారు' అని చెప్పి పది నిమిషాలు నా వాదన వినిపించాను. జస్టిస్ రామానుజులు నాయుడు నా వాదనతో ఏకీభవించి కేసు కొట్టేసి అతడ్ని నిర్దోషిగా విడుదల చేశారు.

ఇక ఇంతా రమణారెడ్డి కేసు ఉంది. ఆయన మీద మరణశిక్ష విధించారు. ఆంధ్ర ప్రదేశ్‌లో రాజకీయ కేసుల్లో మరణశిక్ష పడిన సందర్భాలు ఐదు - నాగభూషణం పట్నాయక్, ఇంతా రమణారెడ్డి, భూమయ్య - కిష్టాగౌడ్, బర్ల యాదగిరి రాజు. ఇందులో యాదగిరి రాజు మీద అసలు కేసే లేదు. కాని కింది కోర్టు మరణశిక్ష విధించింది. హైకోర్టులో అది చాలా సంప్రదాయవాది అయిన జస్టిస్ రామచంద్రరాజు ముందుకు

వచ్చింది. ఆయన కూడా ఆ మరణశిక్షను కొట్టివేయక తప్పలేదు. నేను కేసు వివరాలన్నీ చెప్పి అసలది మరణశిక్షకు ఎట్లా అర్హంకాదో చెప్పాను. పదిహేను నిమిషాల్లో కేసు అయిపోయింది. ప్రాసిక్యూషన్‌ను ఈ తీర్పును మీరెట్లా సమర్థించు కుంటారో చెప్పండి అని జస్టిస్ రామచంద్రరాజు అడిగారు. శిక్షను కొట్టేశారు.

ఈ ఐదు కేసుల్లో బర్ల యాదగిరిరాజు కేసు నేను పూర్తిగా చేశాను. భూమయ్య, కిష్టాగౌడ్ కేసును ఉరిశిక్ష పడి హైకోర్టుకు వచ్చాక చేశాను. నాగభూషణం పట్నాయక్ కేసులో ఒక విచిత్రం జరిగింది.

ఆయన జైలు నుంచి తప్పించుకుపోయి ఒక గిరిజనగూడెంలో రెండు హత్యలు చేశాడని ప్రాసిక్యూషన్ నేరారోపణ. ఆదిభట్ల కైలాసం, నాగభూషణం పట్నాయక్ ఇద్దరి మీదా అట్లా జైలు నుంచి తప్పించుకుపోయి, హత్యలు చేశారనే కేసు పెట్టారు. కైలాసంను ఎన్‌కౌంటర్ పేరిట చంపేశారు.

అప్పటికే నాగభూషణం పట్నాయక్ మీద విశాఖపట్నంలో ఒక హత్య కేసు ఉంది. కెవిఎల్ నరసింహారావు అని ఒక జడ్జి ఉండేవాడు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా చేశాడు.

ఆ రోజుల్లో శ్రీకాకుళం ఉద్యమకారులు బూర్జువా కోర్టులను బహిష్కరిస్తున్నాం అనేవారు. ఆ కోర్టుల్లో మమ్మల్ని మేం సమర్థించుకుంటూ వాదనలు వినిపించం అనేవారు.

అందువల్ల ఇటువైపు నుంచి వాదనలు లేకుండానే, వాదనలు వినకుండానే జడ్జి మరణశిక్ష విధించాడు. అప్పటికే నాగభూషణం పట్నాయక్ ఆరోగ్యం బాగా చెడిపోయి ఉంది.

అప్పుడు నాగభూషణం పట్నాయక్ భార్య వెళ్ళి ఎఎన్ఆర్ చారి అనే ప్రముఖ అడ్వకేటును కలిసి ఈ కేసులో వాదించమని కోరింది. ఎఎన్ఆర్ చారి అప్పీలు చేశాడు.

ఇక పోలీసులు జైలు నుంచి తప్పించుకున్న కేసు, రెండు హత్యల కేసు కొత్తగా పెట్టారు. అయితే పార్వతీపురం కుట్రకేసులో ఈ కేసులన్నిటినీ భాగం చేశారు. పార్వతీపురం కుట్రకేసు నాటికి వీళ్ళు న్యాయస్థానాల బహిష్కరణ నినాదం వదులుకున్నారు. కోర్టులో వాదనలు జరిగాయి. ఆ తీర్పులో నాగభూషణం పట్నాయక్ నేరం చేయలేదని, సాక్ష్యాలు నమ్మదగినట్టుగా లేవని జడ్జి తీర్పు రాశాడు.

అంటే ఒకే నేరం ఒక కోర్టులో కొట్టుడు పోయిన తర్వాత మరొక పెద్దకేసులో భాగం చేశారన్నమాట.

ఇవన్నీ నేను ముందరపెట్టుకుని, 'ఒకే నేరాన్ని పరిగణనలోకి తీసుకున్న ఇద్దరు న్యాయమూర్తులు రెండు భిన్నమైన తీర్పులు ఇచ్చారు. ఒకరు మరణశిక్ష విధించగా, మరొకరు నిర్దోషిత్వం ప్రకటించారు. ఒకవేళ మరణశిక్షను అమలు చేసి ఉంటే ప్రాణం తిరిగి తెచ్చి ఇవ్వగలిగేవారా? అసలు ఇంత అపసవ్యపు తీర్పులతో అతన్ని ఇంతకాలం జైలులో నిర్బంధించి ఉంచడమే రాజ్యాంగం హామీ ఇచ్చిన 21వ అధికరణానికి భంగకరం'

అని వాదించాను.

ఇదంతా నేను రాసి సుప్రీం కోర్టుకు పంపించాను. తార్కుండేను వాదించమని కోరాను. తార్కుండే, నేనూ ఇద్దరమూ వాదించాం. 1978లో అనుకుంటాను.

సుప్రీం కోర్టులో న్యాయమూర్తి జస్టిస్ అమరేంద్రనాథ్ సేన్ ఈ కేసు వినవలసిందేనని భావించారు. కాని సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ ముర్తాజా ఫజల్ అలీఖాన్ ఇది వినవలసిన కేసు కాదని అన్నారు. తీర్పుల నిర్ధారణ స్థితి మీద మచ్చ పడుతుందని భావించారు.

తీర్పు అంతిమత్వానికీ, జీవించే స్వేచ్ఛకూ పోటీ వస్తే ఏం చేస్తారు? అతన్ని చంపేసి ఉంటే మీ తీర్పే అంతిమమని కూచునేవారా అని మేం వాదించాం. అప్పుడు జస్టిస్ ముర్తాజా ఫజల్ అలీ ఏం చేశారంటే ఖైదీని పెరోల్ మీద విడుదల చేయవచ్చు అని రాశారు. చివరికి ఆ కేసే కొట్టేశారు. రాష్ట్రపతి ఆ మరణశిక్షను రద్దు చేశారు. కాని ఖైదీని జైలు నుంచి విడుదల చేయలేదు. మొత్తం మీద ఆ కేసులో ఏవో సర్దుబాట్లు చేయడమే జరిగింది తప్ప నిజంగా న్యాయం జరగలేదు. మొత్తంమీద అన్యాయం జరిగిందని స్పష్టంగా ఉంది గనుక ఈ సర్దుబాట్లు చేయడం జరిగిందన్నమాట.

ఇంతకూ నా వ్యక్తిగత అభిప్రాయమేమంటే మరణశిక్ష కన్న యావజ్జీవ కారాగార శిక్షే ఎక్కువ కఠినమైనది. యావజ్జీవమూ ఆ ఖైదీ తాను చేసిన నేరం గురించి ఆలోచిస్తూ విచారపడుతూ ఉండవలసి వస్తుంది. ఒక్కసారే మరణశిక్ష వేసి చంపేస్తే అదేమీ ఉండదు గదా, యావజ్జీవ ఖైదు ఎక్కువ కఠినమైన శిక్ష గనుక అదే ఉండాలని నా అభిప్రాయం. అంతేకాదు, జైళ్ళు నేరస్తులను సంస్కరించాలని, పశ్చాత్తాపం కలిగించాలని ఒక వాదన ఉంది గదా. అంటే నేరస్తులకు మరణశిక్ష విధించి చంపేస్తే అందుకు అవకాశం ఉండదు. జీవిత ఖైదు ద్వారా అయితే ఖైదీకి మారడానికి, జీవితం మీద, తోటి మనుషుల మీద, నేరం మీద తన దృక్పథం మార్చుకోవడానికి అవకాశం దొరుకుతుంది.

సరే, మరణశిక్ష గురించి ఈ తాత్విక చర్చను కాసేపు పక్కన పెట్టి భూమయ్య, కిష్టాగౌడ్‌ల మరణశిక్ష వ్యవహారంలో జరిగిన చర్చలు, నేను చేసిన వాదనలు, విభిన్న రాజకీయ బృందాలు చేసిన పనులు చెప్పుకోవాలి.

భూమయ్య, కిష్టాగౌడ్ ఇద్దరూ నక్సలైటు కార్యకర్తలు. ఆదిలాబాద్ జిల్లా పెర్కపల్లి మాజీ పోలీసు పటేల్ బోదేకంటి మల్లయ్యను హత్య చేశాడనే నేరంపై గున్నాల కిష్టాగౌడ్‌కు, గిన్నెదరి గ్రామంలో లచ్చుపటేల్ అనే వ్యక్తిని హత్య చేశాడనే నేరంపై కోనుగంటి భూమయ్యకు సెషన్స్ జడ్జి వాసుదేవరావు మరణశిక్ష విధించాడు. ఈ ఉరిశిక్షలు 1972 జనవరిలో విధించగా హైకోర్టులలో కూడా నిర్ధారించబడ్డాయి. కింది కోర్టు తీర్పు వ్యక్తిగత నేరాల కన్న ఎక్కువగా నక్సలైటు ఉద్యమం గురించి, దానివల్ల ప్రమాదం గురించి చర్చించింది.

ఆ తీర్పుపైన హైకోర్టులో అప్పీలు దాఖలయింది. ఆ అప్పీలుపై పత్తిపాటి వెంకటేశ్వర్లు, రావి సుబ్బారావు వాదించారు. జస్టిస్ ఆవుల సాంబశివరావు ఆ వాదనలు విని కింది కోర్టు తీర్పును నిర్ధారించారు. అప్పటినుంచి భూమయ్య, కిష్టాగౌడ్ లిద్దరూ ఉరికంబం నీడలో, ఏకాంతవాస శిక్షలో కాలం గడిపారు. రాష్ట్రపతి క్షమాభిక్ష కొరకు విజ్ఞప్తి చేసుకున్నందువల్ల శిక్ష అమలు చేయకుండా నిలిపి ఉంచారు.

భూమయ్య, కిష్టాగౌడ్‌లు చేసిన చర్యల గురించి ఎవరికీ భిన్నాభిప్రాయం లేదు. వాళ్ళు ఆ చర్యలు చేయలేదని కూడా మేం వాదించలేదు. కాకపోతే, ఆ చర్యలను వాళ్ళు వ్యక్తిగత స్వార్థంతో చేయలేదని గుర్తించాలని మేం వాదించాం. వాళ్ళ చర్యల వెనుక గాఢమైన రాజకీయ ఉద్దేశ్యాలున్నాయని, దోపిడీ, సామాజిక అణచివేత లేని సమాజం కొరకు జరిగిన ఆచరణ, వ్యక్తీకరణగా దాన్ని గుర్తించాలని మేం అన్నాం. భారత రాజ్యాంగంలో పొందుపరచిన ఆదర్శాలు భగ్నమైనప్పుడు హింస ద్వారా సామాజిక, ఆర్థిక న్యాయాన్ని నెలకొల్పవచ్చునని ఒక తీవ్రమైన ఆకాంక్ష వాళ్ళ చర్యలలో వ్యక్తమవుతుందని మేం అన్నాం. కనుక, ఆ హత్యలను నేరాలుగా గుర్తించినప్పటికీ, వాటిలోని రాజకీయాంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని, ఈ వ్యక్తులను మామూలు నేరస్తులుగా చూడగూడదని మేం వాదించాం.

అప్పుడు మా వాదనలతో పౌరసమాజం మొత్తంగా ఏకీభవించింది. లారెన్స్ లిఫ్‌షుల్జ్ వంటి సుప్రసిద్ధ పత్రికా రచయిత, కె ఎ అబ్బాస్, మృణాళ్‌సేన్, ఉత్పల్ దత్ వంటి సినిమారంగ ప్రముఖులు, భూపేష్ గుప్తా, చండ్ర రాజేశ్వరరావు, పి.సుందరయ్య, జార్జి ఫెర్నాండెజ్ వంటి రాజకీయ నాయకులు భూమయ్య, కిష్టాగౌడ్‌ల ఉరిశిక్ష రద్దును కోరుతూ పెద్ద ఎత్తున ప్రజాస్వామిక ఉద్యమం చెలరేగింది.

మొదటిసారి రాష్ట్రపతి క్షమాభిక్ష ప్రయత్నం విఫలమయిన తర్వాత 1974 నవంబర్ 26 ఉదయం భూమయ్య, కిష్టాగౌడ్‌లను ఉరితీయాలని నిర్ణయించారు. నవంబర్ 25న ఏదో ఒక సాంకేతిక కారణం చూపి శిక్ష అమలు మీద స్టే తీసుకు వచ్చి అప్పటికి ఉరితీతను ఆపించగలిగాడు పత్తిపాటి వెంకటేశ్వర్లు.

ఇక అప్పటినుంచి అసలు ఉరిశిక్షనే రద్దు చేయించాలనే ఆందోళన ఉధృతంగా నడిచింది. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నోచోట్ల సభలు, సమావేశాలు జరిగాయి. రాజకీయ పార్టీలు, ట్రేడ్ యూనియన్లు, విద్యార్థి యువజన సంఘాలు ఉరిశిక్షను వ్యతిరేకిస్తూ ప్రచారం చేశాయి. ఈ ఆందోళన వల్ల ఉరిశిక్ష అమలు వాయిదా పడింది గాని భూమయ్య, కిష్టాగౌడ్‌ల తలల మీద ఉరితాడు వేలాడుతూనే ఉండింది.

దాదాపు ఎమర్జెన్సీ విధించడానికి ఒక నెల రోజులముందు ఆ ఉరిశిక్ష అమలు మళ్ళీ ఒకసారి వాస్తవరూపం ధరించినట్టనిపించింది.

ఆనాటి ఘటనలను వివరంగా చెప్పాలి. మామూలుగా ఎవరినైనా ఉరి తీయబోయే ముందు ఇరవై నాలుగు గంటల ముందే వాళ్ళకు ఆ విషయం చెపుతారు. అట్లా

1975 మే 10న భూమయ్య, కిష్టాగౌడ్‌లకు రేపు మిమ్మల్ని ఉరి తీయబోతున్నాము అని చెప్పారు. జైళ్ళలో ఎన్ని బ్యారకులున్నా, గోడల లోపల గోడలు, ప్రతి గోడకూ తాళాలు తలుపులూ ఎన్ని ఉన్నా, జైల్లో వార్తలు చాలావేగంగా వ్యాపిస్తాయి. ఒక ఖైదీకి ఒక విషయం తెలిసిందంటే కాసేపట్లోనే ఖైదీలందరికీ తెలిసిపోతుంది.

అట్లా భూమయ్య, కిష్టాగౌడ్‌లను ఉరితీయబోతున్నారనే వార్త కొద్దిసేపట్లోనే జైలంతా తెలిసిపోయింది. అప్పుడు రాష్ట్రం మొత్తానికీ ఉరి కొయ్య సికిందరాబాద్‌లోని ముషీరాబాదు జైలులో మాత్రమే ఉండేది. ఇప్పుడు ఆ జైలును నేలమట్టం చేసి అక్కడ గాంధీ ఆస్పత్రి కట్టారు గాని ఒకప్పుడు సికిందరాబాదు స్టేషన్ నుంచి కోఠీకి వచ్చే ఆ ప్రధాన రహదారి మీద ఒకవైపు ఆ ఎత్తయిన గోడలు, పెద్ద బురుజులు ఉండేవి.

ఆ రోడ్డుమీద ఆ రోజు ఉదయం అప్పటి పిడిఎస్‌యు నాయకులు మధుసూదన్ రాజ్, ప్రదీప్ ఇద్దరూనో, ఇద్దరిలో ఒకరో వస్తున్నారు. ఆ ఇద్దరూ అప్పటికే ఎన్నో విద్యార్థి ఆందోళనలలో జైలుకు వెళ్తూ వస్తూ ఉన్నవారే గనుక అక్కడి జవాన్లను పలకరించగానే అక్కడి జవాన్లలో ఒకరు అసలు వార్త వాళ్ళ చెవిలో వేశారు.

ఇక వెంటనే ప్రదీప్ పత్తిపాటి వెంకటేశ్వర్లు దగ్గరికి పరుగెత్తాడు. అప్పటికే ఒకసారి ఉరిశిక్ష అమలు జరపబోయి ఆగిపోయి ఉండడం వల్ల, అప్పటికి ఆరునెలలుగా ఉరిశిక్ష రద్దు కోసం ఆందోళన జరుగుతూ ఉండడం వల్ల హైదరాబాద్‌లోని విద్యార్థి యువజనులందరికీ భూమయ్య, కిష్టాగౌడ్‌ల విషయంలో చాలా శ్రద్ధాసక్తులు కలిగి ఉన్నాయి. పత్తిపాటి ఊళ్ళో లేడు. కోర్టుకు సెలవులు.

ఇక ప్రదీప్ నా దగ్గరికి వచ్చి చెప్పాడు. నేనప్పటికి లింగంపల్లిలో ఉంటున్నాను. మంచి ప్రాక్టీసే ఉంది.

ఆ మర్నాడు, అంటే మే 11న నేను జస్టిస్ గంగాధరరావును విందుకు ఆహ్వానించి ఉన్నాను. ఆయన మా నెల్లూరు వాడే.

అప్పుడు కోర్టు సెలవులు కావడం వల్ల వెకేషన్ జడ్జిలుగా జస్టిస్ చిన్నప రెడ్డి, జస్టిస్ గంగాధరరావులు ఉన్నారు. నేనిక ఒక పిటిషన్ తయారు చేసి నా జూనియర్ నరసింహాచారిని జస్టిస్ చిన్నప రెడ్డి ఇంటికి పంపించాను. జస్టిస్ చిన్నప రెడ్డి ఇల్లు బంజారా హిల్స్‌లో ఉండేది. నేను మరికొందరు మిత్రులం ముఖ్యమంత్రి జలగం వెంగళరావును కలవడానికి ప్రయత్నించాం. ఆయన కలవడానికి నిరాకరించాడు. అప్పుడు ఆక్టింగ్ గవర్నర్‌గా ఓబులరెడ్డి గారున్నారు. ఆయనను కలిసి మాట్లాడాం. ఆయన తన నిస్సహాయత వ్యక్తం చేశాడు.

మేమందరం - కొందరు న్యాయవాదులం, విద్యార్థి యువజనులు, రచయితలు- ముషీరాబాద్ జైలు దగ్గర ఎదురుచూస్తూ ఉన్నాం. 'వెకేషన్ జడ్జి దగ్గర హౌజ్ మోషన్ మూవ్ చేశాం. మాకు అనుకూలంగా తీర్పు రావచ్చు. ఉరిశిక్ష ఏర్పాట్లు చేయకండి' అని

జైలు సూపరింటెండెంట్‌కు చెప్పి ఒప్పించాలని మా ప్రయత్నం. అది కూడ వీలు కాలేదు.

ఆ ఆందోళనలో ఉండగానే నరసింహాచారి, ఒపిడిఆర్ బాధ్యుడు సి.వెంకటకృష్ణ వెంకట రెడ్డి, జస్టిస్ చిన్నపరెడ్డి దగ్గరి నుంచి స్టే ఉత్తర్వులు తీసుకుని వచ్చారు. జస్టిస్ సత్యనారాయణ రాజు గారి కొడుకు శ్రీరామరాజు అప్పుడు హైకోర్టు రిజిస్ట్రార్‌గా ఉండేవాడు. ఆయన ఆ ఉత్తర్వులు జైలు అధికారులకు అందజేశాడు.

మొత్తం మీద రెండోసారి కూడా భూమయ్య, కిష్టాగౌడ్‌లు మృత్యుముఖం నుంచి చివరి నిమిషంలో బయటపడ్డారు. ఇక ఉరిశిక్ష రద్దు ఆందోళనను ఉధృతం చేసి, మరోవైపు న్యాయపోరాటం తీవ్రతరం చేసి వారిని ఉరికంబం మీది నుంచి తప్పించాలని అనుకున్నాం.

కాని సరిగ్గా నెల తిరిగే సరికి దేశంలో ఎమర్జెన్సీ అమలులోకి వచ్చింది. ఏ విషయం మీదనైనా ఎటువంటి ప్రజాందోళన అయినా జరపలేని పరిస్థితి వచ్చింది. ఇక ఉరిశిక్ష రద్దు విషయంలో న్యాయ పోరాటం మాత్రమే మిగిలింది.

మళ్ళీ ఈ ఉరిశిక్ష అమలు కేసు జస్టిస్ మాధవ రెడ్డి, జస్టిస్ మధుసూదన్‌రావుల బెంచి ముందుకు వచ్చింది. అప్పుడిక నా వాదనలకు కేవలం చట్టపరమైన, సాంకేతిక ఆధారాల మీద సాగించవలసి వచ్చింది. వాళ్ళను రాజకీయ ఖైదీలుగా, వాళ్ళు చేసిన నేరాన్ని రాజకీయాభిప్రాయాల ప్రేరితమైనదిగా చూస్తే తప్ప ఈ కేసు పరిష్కరించలేమని నేనన్నాను. వాళ్ళను ఉరితీయడం ద్వారా వాళ్ళ రాజకీయాలను తుదముట్టించాలని ప్రయత్నం జరుగుతున్నదని, అది అసాధ్యమని వాదించాను.

నా వాదనలు ఒక రోజంతా పూర్తిగా సాగాయి.

జస్టిస్ మాధవ రెడ్డి గారు చాల ఓపికగా అవతలి పక్షం వాదనలను వినే న్యాయమూర్తి. జస్టిస్ మధుసూదనరావు గారు చాల మంచి వ్యక్తి. కాని న్యాయవాది నుంచి ఇంకా రాబట్టడానికి ప్రశ్నలు వేస్తూ ఉండేవారు.

"వాళ్ళకు రాజ్యాంగం మీద విశ్వాసం లేదు గదా, సమస్య వచ్చినప్పుడు మాత్రం రాజ్యాంగపు ఆశ్రయం ఎందుకు పొందుతారు" అని ఆయన ప్రశ్నించారు.

ఇక్కడ పరీక్షకు పెట్టబడుతున్నవి వాళ్ళ విలువలు కాదండీ, నిజంగా పరీక్షకు పెట్టబడుతున్నవి మన విలువలు, రాజ్యాంగ విలువలు, రాజ్యపు విలువలు అని చెప్పాను.

ఈ వాదనల ముందర కేంద్ర ప్రభుత్వ న్యాయవాది సుబ్రమణ్యం రెడ్డి ఎదురు చెప్పలేకపోయారు. 'ఫక్రుద్దీన్, కితాబాం జమావో' అని పుస్తకాలు సర్దమని ఆజ్ఞాపించారు.

రాష్ట్రపతి నుంచి వకీలు చప్రాసీ దాకా ఒకటే పేరు, ఫక్రుద్దీన్ అని నేను పరిహాస మాడాను.

సరే, ఈ కేసు సుప్రీం కోర్టులో జస్టిస్ కృష్ణ అయ్యర్ ముందుకు వచ్చింది. ఈ ఖైదీలిద్దరూ అప్పటికే మూడు నాలుగు సంవత్సరాలపాటు ఉరికంబం నీడలో, క్షణక్షణం

ఎప్పుడు మృత్యువు కబళిస్తుందో అని ఎదురుచూస్తూ గడిపారు. దానికదే పెద్ద శిక్ష. కనుక ఉరిశిక్షను యావజ్జీవ శిక్షగా మార్చవచ్చు అని మా వాదన.

సుప్రీం కోర్టులో సిపిఐకి చెందిన న్యాయవాది గార్గ్ ఈ కేసు వాదించారు.

జస్టిస్ కృష్ణయ్యర్‌కు ప్రగతిశీల న్యాయమూర్తిగా పేరుంది గనుక ఈ కేసులో భూమయ్య, కిష్టాగౌడ్‌లకు ఉరిశిక్ష తప్పిపోతుందని మేం ఆశించాం. కాని ఆ చట్రంలో ఇరుక్కున్న తర్వాత ఎవరూ ఏమీ చేయలేరు.

ప్రగతిశీల న్యాయమూర్తి అయినా చట్టబద్ధపాలన అనే పరిమితి లోపల ఉండవలసిందే.

అందువల్ల జస్టిస్ కృష్ణయ్యర్ రాజకీయ నేరం అనేదాన్ని మన శిక్షాస్మృతి, నేర శిక్షాస్మృతి పరిగణనలోకి తీసుకోలేదని, నేరమంటే నేరమేనని తీర్పు చెప్పారు. ఈ కేసులో మా పిటిషన్‌ను కొట్టివేశారు.

అయితే ఈ విషయంలో కూడా న్యాయమూర్తుల మధ్య చాలా భిన్నాభిప్రాయా లున్నాయి.

ఇంతా రమణారెడ్డికి ఉరిశిక్ష విధించిన కేసులో హైకోర్టుకు అప్పీలుకు వచ్చి నప్పుడు జస్టిస్ చిన్నపరెడ్డి గారు రమణారెడ్డిని కోర్టుకు పిలిచారు. జస్టిస్ జీవన్ రెడ్డిని, జస్టిస్ పిఎ చౌదరిని న్యాయమూర్తిగా సలహాదార్లుగా ఆహ్వానించారు. ఒక సూత్రాన్ని అభివృద్ధి చేయడానికి ప్రయత్నం చేశారు.

రాజకీయ నేరం అని నిర్వచించదగిన నేరాలుంటాయనే సూత్రాన్ని తయారు చేశారు. ఏ నేరంలోనయినా హత్య జరిగినప్పటికీ, వ్యక్తిగతంగా అవతల వ్యక్తిని చంపి వేయాలనే ఉద్దేశ్యం ఉండదో, వ్యక్తిగత ప్రయోజనమేమీ ఉండదో, ఒక విశాల సిద్ధాంతం మీద నమ్మకం మాత్రమే ఆ నేరానికి పురికొల్పుతుందో అటువంటి నేరాన్ని రాజకీయ నేరం అనవచ్చునని ఆయన అన్నారు.

ఈ సూత్రం జస్టిస్ భగవతి ముందుకు వెళ్ళింది. ఆయన ఇది చెల్లదని కొట్టి వేశారు. ఆ కొట్టివేసేటప్పుడు కూడ జస్టిస్ కృష్ణయ్యర్‌ను ఉటంకించారు.

చివరికి 1975 డిసెంబర్ 1 తెల్లవారుఝామున భూమయ్య, కిష్టాగౌడ్ ఇద్దరినీ ముషీరాబాద్ జైలులో ఉరితీశారు.

నాకు ఏమనిపిస్తుందంటే భూమయ్య, కిష్టాగౌడ్‌ల ఉరితీతను ఆపడంలో మేం విఫలం కావడానికి ఉన్న అనేక కారణాలలో మేం చేపట్టిన పద్ధతులు కూడ ఉన్నాయి. మేం వాళ్ళను గొప్ప, వీరోచితమైన నక్సలైట్లుగా ప్రచారం చేశాం. వాళ్ళు నక్సలైటు రాజకీయాలను నమ్మారు, ఆచరించారు. కాని వాళ్ళ ఉరిశిక్ష రద్దు చేయించడానికి వాళ్ళు నక్సలైట్లు అని చెప్పినంత మాత్రాన సరిపోదు. దాన్నే ప్రధానమని చెప్పడం వల్ల రాజ్యం వాళ్ళమీద కత్తిగట్టేట్టు చేశామని నాకనిపిస్తుంది.

ఎందుకంటే ఒక అనుభవం చెప్పాలి. భూమయ్య కిష్టాగౌడ్ ఉరిశిక్షను రద్దు చేయాలని కోరుతూ జరిగిన ఒక సభలో పత్తిపాటి వెంకటేశ్వర్లు సాయుధ పోరాటమే మా ప్రాథమిక హక్కు అని చెప్పినాడు. జి.కె.రెడ్డి ఒక వ్యాసం రాసినాడు. విప్లవ హింస పట్ల న్యాయస్థానాలు అస్పష్టమైన, సందిగ్ధమైన వైఖరి తీసుకుంటున్నాయి అని కోర్టులను విమర్శించాడు. ఇవన్నీ కోర్టు తీర్పుల మీద, న్యాయమూర్తుల మీద పనిచేశాయి.

భూమయ్య కిష్టాగౌడ్‌ల ఉరిశిక్షను ఈ పద్ధతిలో కాకుండా కొంత తగ్గుస్వరంతో వాదించి ఉంటే రద్దు చేయించగలిగి ఉండే వాళ్ళమనుకుంటాను.

భూమయ్య కిష్టాగౌడ్‌లను ఉరితీయడానికి కొద్దిరోజుల ముందు నేను మొహిత్ సేన్‌తో, చండ్ర రాజేశ్వరరావు తో మాట్లాడాను. భూపేష్ గుప్తా వెళ్ళి ఇందిరా గాంధీతో మాట్లాడటానికి ప్రయత్నించాడు. ఆమె మాట్లాడలేదు. సిపిఐ వాళ్ళు అడిగినా సరే అంగీకరించడానికి ఆమె సిద్ధంగా లేదు. ఎమర్జెన్సీ అధికారంలో ఆమె ఎవరు చెప్పినా వినదలచుకోలేదు. ఎవరినీ క్షమించదలచు కోలేదు.

అట్లా చివరిసారి కూడా ముందుగానే తెలిసినప్పటికీ ఏమీ చేయలేకపోయాం. పత్రికల వాళ్ళు వెళ్ళి ఇంటర్వ్యూలు చేసి, వాళ్ళిద్దరూ క్రైస్తవులుగా మారిపోయారని ఏదేదో చెత్త రాశారు.

ఏదేమైనా అది విచారకరమైన దినం. అసలు వాళ్ళను ఉరితీయవలసిన అవసరమే లేదు. చట్టప్రకారం సాక్ష్యాధారాలు చూపినా సరే. వాస్తవ సాక్ష్యాధారాల ప్రకారం గదా ఏదయినా శిక్ష విధించవలసింది.

మొత్తానికి ఆ తర్వాత రాజకీయ కేసుల్లో ఒక్క ఉరిశిక్ష కూడా పడలేదు. ప్రాసిక్యూషన్ ఒక్క కేసులో కూడ ముద్దాయిలు నేరం చేశారని రుజువు చేయలేక పోయింది. నిందితులను నేరస్తులుగానే రుజువు చేయలేకపోయినప్పుడు, శిక్ష, అందులోనూ మరణ శిక్ష విధించే అవకాశమే లేదు. కుట్ర కేసుల్లో ఏ ఒక్కటి కూడా రుజువు కాలేదు. అందువల్ల మరణశిక్ష దాకా పోనేలేదు.

అయితే, ప్రత్యక్షంగా రాజకీయ కేసు కానప్పటికీ, విజయవర్ధనరావు, చలపతిల మరణశిక్ష విషయంలో చాల చర్చ జరిగింది. వాళ్ళు చేసిన నేరం చిలకలూరిపేట బస్సు దహనం చాలా దారుణమైన సంఘటన. అందులో సందేహమే లేదు. ఆ నేరాన్ని నేరస్తులను సమర్థించడం చాలా కష్టం.

నేరం–శిక్షలో కులం పునాది మీద చర్చ చేయడం, ఒక రకంగా రిజర్వేషన్ విధానాన్ని పాటించడం, అంటే ఒక దళితుడిని చంపడానికి వీలు లేదనడం, అంటే ఇతరులను చంపితే ఫరవాలేదనడం సరైన వాదనలని నేననుకోను.

అందువల్ల ఆ సందర్భంలో నేను చాలా మందితో విభేదించవలసి వచ్చింది.

నేను అప్పుడు సభల్లోగాని, నిరసన ప్రదర్శనల్లో గాని పాల్గొన లేదు.

ఎందుకంటే, నేను మొదటి నుంచీ కూడ అభిప్రాయపడుతూ వస్తున్నదేమంటే

పౌరహక్కుల భావనలో మనుషులను విభజించడం కుదరదు. అట్లాగే మరణశిక్ష వ్యతిరేకమయిన ఉద్యమం కూడా అవిభాజ్యమయినదే.

ఒక శిక్ష, ఒక రూపంలో మంచిది కాదు అనుకుంటే ఎవరి విషయంలో నయినా అది మంచిది కాదనే అనుకోవాలి.

ధనుంజయ్ ఛటర్జీ బ్రాహ్మణుడు కాబట్టి బ్రాహ్మణులు అయన మీద మరణ శిక్షను ఖండించారు. ఆయన చేసిన నేరాలకూ కులానికీ సంబంధం ఏమిటనే చర్చ జరగలేదు.

అయితే రాజకీయ నేరాలకు మరణశిక్ష విధించగూడదని వాదించినట్టుగానే, నేరస్తుల సామాజిక అస్తిత్వాన్ని పరిగణనలోకి తీసుకుని మరణశిక్షలు ఖండించాలి గదా అనే వాదన వస్తుంది.

అందుకనే నేననేదేమంటే మరణశిక్ష కొందరికి వర్తిస్తుందని, కొందరికి వర్తించ గూడదని వాదించగూడదు. అలా వాదిస్తే ఏమవుతుందంటే ముక్కలుగా విడిపోయి ఉన్న సమాజంలో న్యాయం కూడ ఆ ముక్కలకు అనుగుణంగానే వర్తింపజేయాలని అడిగినట్టవుతుంది. అలా చేసిన కొద్దీ సామాజిక విభజనలు ఇంకా పెరుగుతూనే ఉంటాయి తప్ప తగ్గవు.

ఎట్లాగూ చట్టం ఎదుట సమానత్వం అనే సూత్రం అమలు కావడం లేదు గనుక కొందరికి మాత్రం మరణశిక్షలు విధించవద్దని అడుగుతాము, మరికొన్ని నేరాల విషయంలో మరణశిక్ష విధించమనే అడుగుతాము అని వాదించడం అంటే చట్టం ఎదుట సమానత్వం అనే సూత్రం పట్ల మాకు కూడ గౌరవం లేదని చెప్పడమే అవుతుంది.

విభజనను అధిగమించి, చట్టం ఎదుట సమానత్వం కావాలి, కనుక ఎవరికీ మరణశిక్ష వేయవద్దు అని వాదించవచ్చు.

అమెరికాలో ఒక కేసు ఉంది. ఒక నల్లజాతి యువకుడికి మరణశిక్ష వేశారు. అతణ్ని తీసుకెళ్ళి ఎలక్ట్రిక్ చెయిర్‌లో కూర్చోబెట్టారు. అక్కడ వోల్టేజి పడిపోయి అది పనిచేయలేదు. ఇక అతణ్ని వెనక్కి తీసుకు వచ్చి మళ్ళీ మరోసారి ఎలక్ట్రిక్ చెయిర్ దగ్గరికి తీసుకుపోయారు. మళ్ళీ వోల్టేజి పడిపోయింది. అప్పుడతను న్యాయస్థానం ముందర రిట్ వేశాడు. క్రూరమైన, అసాధారణమైన శిక్షకు నన్ను గురిచేస్తున్నారు అని ఫిర్యాదు చేశాడు. అసలు అమెరికన్ చట్టంలో మరణశిక్ష అంటే ఎలక్ట్రిక్ చెయిర్‌లో కూచోబెట్టి, దాని నుంచి విద్యుత్తు ప్రవహింపజేసి చంపివేయడం ఉంది. దాన్ని క్రూరమైన, అసాధారణమైన శిక్ష అని ఎవరూ అనుకోలేదు. ఇప్పుడు ఆ నల్లజాతి యువకుడు కూడా తన మరణశిక్షను సవాలు చేయలేదు. అది అమలు చేసిన పద్ధతి క్రూరంగా, అసాధారణంగా ఉందని ఫిర్యాదు చేశాడు.

ఎక్కువమంది న్యాయమూర్తులు ఆ మరణశిక్ష అమలు క్రూరంగానో, అసాధారణం గానో లేదని, అతణ్ని చంపవలసిందేనని తీర్పు ఇచ్చారు. ఒకే ఒక్క న్యాయమూర్తి మాత్రం

అది క్రూరమైన, అసాధారణ శిక్షేనని, దాన్ని రద్దు చేయాలని అసమ్మతి తీర్పు రాశాడు.

ప్రపంచ ప్రఖ్యాత రచయిత దాస్తోవిస్కీ ఉదాహరణ చూడండి. అది రాచరికం. దాస్తోవిస్కీకి మరణశిక్ష విధించారు. సైబీరియా పంపించారు. ఆయన చావడానికి సిద్ధపడ్డాడు. మానసికంగా మృత్యుముఖానికి వెళ్ళడానికి అన్ని ఏర్పాట్లూ చేసుకున్నాడు. ఇక కాల్చివేస్తారనగా జార్ చక్రవర్తి క్షమాభిక్ష ప్రకటించాడు. అది చట్టప్రకారమేమీ కాదు. చక్రవర్తికి ఏమయినా చేసే అధికారం ఉంది గదా. కాని చంపబడడానికి సిద్ధ పడిన వ్యక్తికి క్షమాభిక్ష దొరికి జీవితం కొనసాగితే ఎలా ఉంటోంది అని దాస్తోవిస్కీ ఇడియట్ నవలలో అద్భుతంగా రాశాడు.

ఆ రకంగా పాశ్చాత్య ప్రపంచంలో మరణశిక్ష గురించి, నేరం-శిక్షల గురించి ఇలా చర్చ జరిగింది. ఇక్కడ అదంతా ఏమీ లేదు. అమెరికాలో నైతే నేరస్తులుగా రుజువు అయి శిక్షలు పడ్డ ఖైదీలు ఎట్లా నిర్దోషులో, వారి మీద నేర నిరూపణ ఎంత అన్యాయంగా జరిగిందో బోలెడంత చర్చ జరుగుతుంది. మనదగ్గర అంత చర్చ లేదు.

నిజానికి ఇందిరా గాంధీ హత్యకేసులో కింది కోర్టు నేరస్తుడిగా భావించి ఉరిశిక్ష విధించిన బల్‌బీర్‌సింగ్‌ను హైకోర్టు నిర్దోషిగా విడుదల చేసింది. అట్లాగే కేహార్‌సింగ్‌కు ఉరిశిక్ష వేయడానికి సరిపోయిన ఆధారాలే లేవు. కాని ఉరిశిక్ష వేశారు. అది కేవలం ఒక ప్రతీకార వాంఛతో వేసిన శిక్షే తప్ప సాక్ష్యాధారాలతో వేసిన శిక్ష కాదు.

ప్రతీకారం అనే మాటే వ్యక్తిగత అభిప్రాయాలకు సూచిక. న్యాయంలో, తీర్పులో వ్యక్తిగత అభిప్రాయాలు జోక్యం చేసుకోగూడదని అంటాంగాని వాస్తవంలో వాటి పాత్ర ఉండనే ఉంటుంది.

ఉదాహరణకు జిందా, సుఖా కేసు చాలా ఆసక్తికరమైనది. వాళ్ళను పట్టుకున్నారు. వారి గురించి తెలియజెప్పడానికి ఒక వెయ్యి వస్తువులు పెట్టారు. సాక్ష్యాలు తెచ్చారు. వాళ్ళు తాగుతారని, వాళ్ళు వ్యభిచరిస్తారని, మొత్తానికి వాళ్ళు నీతిమంతులు కారు, వాళ్ళ శీలం మంచిది కాదు అని చూపడానికి ఎన్నో ఆధారాలు సమకూర్చారు.

సాధారణంగా టెర్రరిస్టుల విషయంలో, రాజకీయ ప్రత్యర్థుల విషయంలో ఇట్లాగే చేస్తారు. నిందితులు నేరం చేశారో లేదో నిరూపించే సాక్ష్యాధారాలకన్న ఎక్కువగా నిందితులు సత్ప్రవర్తన కలవారు కాదని నిరూపించే సాక్ష్యాధారాలు ప్రవేశపెడతారు.

ఈ కేసులో ఒక డిజిగ్నేటెడ్ జడ్జి ముందరికి వచ్చింది. ఆ కేసు తయారయిన పద్ధతి, విచారణ జరిగిన పద్ధతి, శిక్షలు వేసిన పద్ధతి చాలా విచిత్రంగా సాగాయి. మనదేశంలో మరణశిక్షలు విధిస్తున్న తీరు గురించి తెలుసుకోవాలంటే ఆ కేసును అధ్యయనం చేయాలి.

ఆ కేసు పదవీ విరమణ చేసిన సైనికదళాల ప్రధానాధికారి జనరల్ ఎఎస్ వైద్య హత్యకు సంబంధించినది. అమృతసర్‌లో స్వర్ణ దేవాలయం నుంచి 1984లో సిక్కు తీవ్రవాదులను ఖాళీ చేయించడానికి జరిగిన ఆపరేషన్ బ్లూ స్టార్ సమయంలో జనరల్

వైద్య సైనికదళాల ప్రధానాధికారిగా ఉన్నారు. పదవీ విరమణ తర్వాత పుణెలో భార్యతో కలిసి షాపింగ్‌కు వెళుతుండగా ఆయనను సుఖా (సుఖ్‌దేవ్ సింగ్), జిందా (హర్‌జిందర్ సింగ్) లు కాల్చి చంపారు.

ఆ కేసులో దాదాపు 200 మంది సాక్షులను విచారించారు. దాదాపు వెయ్యి పత్రాలను, వస్తువులను పరిశీలించారు. సుఖా, జిందాలు తమతో గడిపారని వేశ్యలతో సాక్ష్యాలు చెప్పించారు. విలాస పురుషుడిగా జిందాను చూపడానికి ప్రాసిక్యూషన్ సమర్పించిన ఒక ఫోటోను జడ్జి తిరస్కరించారు. "ఈ ఫోటోలో మనిషికీ, జిందాకూ పోలికలే లేవని, స్పష్టంగా కనబడుతుంటే, అది జిందాదని ఎలా నమ్మగలను" అని జడ్జి కోర్టు హాలులో బహిరంగంగా అన్నారు.

మరి ఇటువంటి సాక్ష్యాలు మీద ఆధారపడి వారికి మరణశిక్ష ఎట్లా విధించారు?

జిందా, సుఖాలు స్వయంగా తాము జనరల్ వైద్యను చంపామని న్యాయస్థానంలో ఒప్పుకున్నారు. స్వర్ణమందిరంలో అకాల్‌తఖ్త్‌ను జనరల్ వైద్య నాయకత్వంలోని సైనికులు అపవిత్రం చేశారని, అందువల్ల తమ మనసు వికలమయిందని, అందుకు కారకుడైన జనరల్ వైద్యను చంపడం తమ పవిత్ర కర్తవ్యమని అనుకున్నామని వాళ్ళు అన్నారు. తాము చేసిన పనికి తాము గర్విస్తున్నామని, తమకు మరణశిక్ష అంటే భయం లేదని, మత విశ్వాసాల కోసం ప్రాణత్యాగానికి సిద్ధంగా ఉన్నామని వాళ్ళు అన్నారు. వాళ్ళ ప్రకటనలలో ఎటువంటి పశ్చాత్తాపం కనబడలేదు.

ఇక్కడ విచిత్రమేమంటే, వాళ్ళ మీద 1985 టెర్రరిస్ట్ అండ్ డిస్రప్టివ్ ఆక్టివిటీస్ (ప్రివెన్షన్) చట్టం (టాడా పేరుతో ప్రసిద్ధమైన తీవ్రవాద, విచ్ఛిన్నకర కార్యకలాపాల (నిరోధక) చట్టం) కింద కేసు పెట్టినప్పటికీ, వారికి విధించిన మరణశిక్ష మాత్రం భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 302 (హత్య), 307 (హత్యాప్రయత్నం) ల కింద విధించారు.

భారత నేర శిక్షాస్మృతి ప్రకారం ఒక వ్యక్తికి మరణశిక్షను సెషన్స్ కోర్టు విధిస్తే, హైకోర్టులో ఇద్దరు న్యాయమూర్తుల బెంచి నిర్ధారిస్తుంది. అంటే జీవితాన్ని కొల్లగొట్టడం అనేంత పెద్ద శిక్షను ముగ్గురు తలచుకుంటే వేయవచ్చునన్నమాట. కాని, హత్యానేరాలకు కూడ యావజ్జీవ కారాగార శిక్షనే సాధారణంగా విధిస్తారు. మరణశిక్ష మినహాయింపు మాత్రమే. అరుదయిన సందర్భాలలోకెల్లా అరుదైన సందర్భాలలో మాత్రమే మరణ శిక్ష విధించాలని సుప్రీం కోర్టు ఎప్పుడో చెప్పింది.

జనరల్ వైద్య హత్యను టాడా కింద నేరంగా భావిస్తే మరణశిక్ష మాత్రమే ఏకైక శిక్ష.

అంటే, డిజిగ్నేటెడ్ కోర్టు జడ్జి ఈ నేరాన్ని శిక్ష విధించేటప్పుడు టాడా కింద నేరంగా భావించాడు. కాని భారత శిక్షాస్మృతి 302, 307ల కింద శిక్ష విధిస్తున్నానని రాశాడు.

ఇది ఎందువల్లనంటే, ఐపిసి కింద శిక్ష విధించినట్టయితే, దాన్ని మళ్ళీ విచారణకు

తీసుకువచ్చి శిక్ష న్యాయాన్యాయాలు పై కోర్టులో పరిశీలించే వీలుండేది. టాడా కోర్టులో టాడా కింద విచారిస్తే ఇంక పైకి పరిశీలనకు వెళ్ళే అవకాశం లేదు. అందువల్ల ఆ జడ్జి అటు టాడాను, ఇటు ఐపిసిని వాడుకున్నాడు. ప్రాసిక్యూషన్‌కు త్వరగా విచారణను తప్పించుకోవడానికి వీలు దొరికింది.

మొత్తం మీద తేలేదేమంటే రాజ్యాంగం చెప్పినట్టుగా, చట్టం నిర్దేశించిన పద్ధతిలో తప్ప మరొక విధంగా ప్రాణాలు తీయడానికి వీలులేదు అనే సూత్రం ఇక్కడ ఉల్లంఘించ బడింది. చట్టం నిర్దేశించిన పద్ధతి వక్రీకరణకు గురయింది.

ఈ మాట అంటున్నానంటే ఆ నిందితులిద్దరు చేసిన దారుణమైన నేరాన్ని సమర్థిస్తున్నానని కాదు. చట్టం నిర్దేశించిన పద్ధతిలో సెషన్స్ కోర్టు మరణశిక్షనే విధించి ఉన్నా, హైకోర్టులో ఇద్దరు న్యాయమూర్తులు దాన్ని నిర్ధారించినా, సుప్రీం కోర్టు కూడా నిర్ధారించినా, మరణశిక్షే అమలయి ఉండేది.

ఒక పౌరుడికి రక్షణగా నిలిచేది ఎప్పుడయినా చట్టబద్ధమైన పద్ధతి మాత్రమే. ఆ పద్ధతి ఏమిటో రాజ్యాంగంలోని 21వ అధికరణం నిర్దేశించింది. కాగా టాడా చట్టం అనేది తాత్కాలికమైనది. దాని జీవితం ఎప్పటికప్పుడు పొడిగించబడుతుంది. దాని పొడిగింపు మీద ఎటువంటి చర్చా జరగదు. సరే, ఇప్పుడైతే ఆ చట్టమే రద్దయి పోయింది. మరి ఆ చట్టం అమలులో ఉన్న రోజులలో దాని ప్రకారం మరణశిక్షలు విధించి ప్రాణాలు తీస్తే ఆ ప్రాణాలను తిరిగి తేగలమా?

అసలు ఒకసారి వాళ్ళ నేరం టాడా కిందికి రాదు అనుకోగానే దాన్ని మామూలు కోర్టుకు బదిలీ చేయాలి. అక్కడ కూడ శిక్ష అదే విధిస్తే, పైన హైకోర్టు మొత్తం విచారణ మళ్ళీ జరిపేది.

మన రాష్ట్రంలో బర్ల యాదగిరిరాజు, ఇంతా రమణా రెడ్డి వంటి వాళ్ళకు పడిన మరణశిక్షలు ఈ పునర్విచారణలోనే కొట్టివేయబడ్డాయి.

కాని టాడా కింద పునర్విచారణకు అవకాశమే లేదు. డిజిగ్నేటెడ్ కోర్టు నుంచి సుప్రీం కోర్టుకు పోతుంది. అక్కడ పునర్విచారణ జరగదు. సుఖా, జిందాలకు తీర్పును సవాలు చేయాలనే ఆసక్తి లేదు. సరైన న్యాయ సహాయం అందలేదు.

ఆ కేసు సుప్రీం కోర్టుకు వెళ్ళినప్పుడు బెంచిలో న్యాయమూర్తులు జస్టిస్ అహ్మది, జస్టిస్ రామస్వామిలు ఉన్నారు. జస్టిస్ అహ్మది మంచివాడు. ఆయనకిది నచ్చలేదు. కాని చేయగలిగిందేమీ లేదు.

నిజానికి న్యాయస్థానాలలో చాలా చర్చ చేయాలి. ఈ కేసే హైకోర్టుకు వచ్చి ఉంటే చాలా చర్చ చేయడానికి అవకాశం ఉండేది. 'మా మత విశ్వాసాలను, మా పవిత్ర స్థలాన్ని అవమాన పరిచినందువల్ల మేమీ ప్రతీకారం తీర్చుకున్నాం' అని నేరస్తులన్నారు. ఉద్దేశ్యపూర్వకంగా గాని, అనాలోచితంగా గాని అలా మానసిక ఉద్వేగాలను రెచ్చగొట్టడం

జరిగిందా, అందుకు బాధ్యులెవరు అనే చర్చ చేయాలి.

అటువంటి చర్చ లేకపోతే న్యాయమూర్తులు చాలాసార్లు చాలా నిరంకుశంగా, ఏకపక్షంగా వ్యవహరిస్తారు. తమకు అప్పటికే ఏర్పడి ఉన్న అభిప్రాయాలతో, అపోహలతో తీర్పు ఇస్తారు. అప్పటికే ఏర్పడిన దురాభిప్రాయాలేమంటే భింద్రన్ వాలా తన నేర కార్యకలాపాలకు స్వర్ణమందిరాన్ని వాడుకున్నాడని, ఆపరేషన్ బ్లూ స్టార్ ద్వారా వారిని అక్కడి నుంచి ఖాళీ చేయించడం జరిగిందని, అందువల్ల ఆ పని పట్ల ఎవరికైనా ఎందుకు మనస్థాపం కలగాలని న్యాయమూర్తులు అనుకుంటారు.

భింద్రన్‌వాలానో, ఖలిస్తానీలో నేరస్తులే అయినా, వారిని తొలగించడానికి చేసిన చర్య దేశవ్యాప్తంగా భక్తి తత్పరులైన సిక్కుల మనోవిశ్వాసాలను గాయపరిచిందనేది ఒక వాస్తవం. ఈ వాస్తవం అర్థం చేసుకుంటేగాని సుఖా, జిందాల ప్రవర్తన అర్థం కాదు. ఆ నేరాన్ని సమర్థించనక్కరలేదు గాని, తప్పనిసరిగా అర్థం చేసుకోవలసి ఉంటుంది.

ముఖ్యంగా తీర్పు ఈ మనోవిశ్వాసాలకు దెబ్బతగిలిందనే విషయాన్ని పరిశీలించడం. అలా ఉంచి, పరిగణించను కూడ పరిగణించలేదు.

సుఖా, జిందాల గురించి టాడా గురించి మాట్లాడే చాల మందికి ఈ విషయాలు తెలియవు. టాడా గురించి సమీక్షించే ఒక సమావేశంలో అప్పటి స్పీకర్ సోషలిస్టు రబీరే కూడా ఉన్నారు. టాడాను ఎందుకు తొలగించగూడదో ఆయన వాదన వినిపించాడు. "మీకు తెలుసా, సుఖా, జిందాలను టెర్రరిస్టు నేరాలకు శిక్షించారా" అని అడిగాను నేను "ఔను" అన్నాడాయాన. "కాదు, వారిని మామూలు భారత శిక్షా స్మృతి కింద శిక్షించారు. టెర్రరిస్టు నేరాలు వాళ్ళమీద కొట్టేశారు" అని చెప్పాను.

మన నాయకుల అవగాహనా స్థాయి అది.

* * *

# హక్కుల ఉద్యమంలో నేను

ఇప్పుడిక ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో పౌరహక్కుల ఉద్యమంలో నా భాగస్వామ్యం గురించి చెపుతాను. ఇక్కడ గత ముప్పై నలభై సంవత్సరాలుగా చాలా బలమైన ప్రజాస్వామిక, పౌరహక్కుల ఉద్యమం ఉన్నది. ఎన్నో పత్రికలు, పుస్తకాలు కరపత్రాలు నివేదికలు వచ్చాయి. ఎంతోమంది మామూలు మధ్య తరగతి మనుషులు కార్యకర్తలుగా, నాయకులుగా అభివృద్ధి చెందారు. గోపి రాజన్న, జాపా లక్ష్మారెడ్డి, డా॥ ఎ. రామనాథం, నర్రా ప్రభాకర్ రెడ్డి, టి. పురుషోత్తం, ఆజం అలీ లాంటి ఎంతోమంది ఈ ఉద్యమం కోసం ప్రాణాలు బలిపెట్టారు. మరెంతోమంది తమ వృత్తులను, ఉద్యోగాలను

కుటుంబాలను ఆరోగ్యాలను పణంగా పెట్టి ఈ ఉద్యమాన్ని అభివృద్ధి చేశారు. అయితే ఇప్పటికీ రాష్ట్రంలో ప్రజాస్వామిక, పౌరహక్కుల ఉద్యమం గురించి సమగ్రమైన చరిత్ర లేదు. అడపాదడపా వ్యాసాలు, అనుభవాలు వచ్చి ఉండవచ్చుగాని చరిత్ర లేదు.

ఈ నేపథ్యంలో నా అనుభవాలు ఆ చరిత్ర రచనకు ఉపయోగపడతాయి. నిజానికి 1973లో రాష్ట్రంలో ఆంధ్ర ప్రదేశ్ పౌరహక్కుల సంఘం ఏర్పడినప్పుడు నేను అందులో క్రియాశీలంగా లేను కాని 1964 నాటి నుంచి ఈ రాష్ట్రంలో సాగుతున్న పౌరహక్కుల ఆందోళనల్లో నాకు భాగం ఉంది.

మొట్టమొదట 1964లో పాత ఎంఎల్ఏ క్వార్టర్స్‌లో ఆంధ్ర ప్రదేశ్ పౌరహక్కుల సంఘం - దాన్ని అప్పుడు ఆంధ్ర ప్రదేశ్ సివిల్ లిబర్టీస్ అసోసియేషన్ ఎపిసిఎల్ఎ- అనేవాళ్ళు దాని సమావేశం జరిగింది. చైనా యుద్ధం సమయంలో అప్పటి అవిభక్త కమ్యూనిస్టు పార్టీ సభ్యులలో కొందరిని నిర్బంధంలోకి తీసుకున్నప్పుడు వారి నిర్బంధం గురించి మాట్లాడడానికి ఏర్పడిన సంఘం అది. దానికి పెద్ద నిర్మాణమేదీ లేదనుకుంటాను.

కాని 1964లో పార్టీలో చీలికవచ్చి సిపిఐ, సిపిఐ(ఎం) లుగా విడిపోయిన తర్వాత దా౧ ఫలితంగా ఎపిసిఎల్ఎ సమావేశం జరిగి అక్కడ కూడా గొడవ జరిగింది. ఆ గొడవను చూసిన తర్వాత ఇంక నాకు అందులో పనిచేయడం అర్థం లేదనిపించింది. దాని నుంచి దూరమయ్యాను. నా పని నేను చూసుకుంటున్నాను.

నక్సల్బరీ పోరాటం మొదలయిన తర్వాత అది శ్రీకాకుళానికి వ్యాపించింది. శ్రీకాకుళ పోరాటం మీద పెద్ద ఎత్తున నిర్బంధం మొదలయింది. ఆ నిర్బంధాన్ని ఖండిస్తూ తరిమెల నాగిరెడ్డి ప్రచారం మొదలు పెట్టారు. అట్లా క్రమక్రమంగా పౌరహక్కుల పరిరక్షణ ఆలోచనలున్న వాళ్ళందరూ ఒక్కచోటికి చేరడం మొదలయింది.

రావి సుబ్బారావు ద్వారా పత్తిపాటి వెంకటేశ్వర్లు పరిచయమయ్యాడు. నా జూనియర్ నరసింహాచారి ద్వారా జ్వాలాముఖి పరిచయమయ్యాడు. నిఖిలేశ్వర్ పరిచయమయ్యాడు. అందరమూ తరచుగా కలుసుకుంటూ ఉండేవాళ్ళం.

అప్పుడు డిఫెన్స్ కమిటీ అని దాని ద్వారా కొంతపని నడిచింది. అప్పటికే హైదరాబాద్ కుట్ర కేసు పార్వతీపురం కుట్రకేసుల ద్వారా నక్సలైటు కార్యకర్తల మీద నిర్బంధం సాగుతూ ఉంది. ఆ కేసులలో ఖైదీలకు న్యాయ సహాయం అందించడానికి హైదరాబాద్‌లో కొందరు న్యాయవాదులం కలిసి డిఫెన్స్ కమిటీ ఏర్పాటు చేశాం. విశాఖపట్నం లాంటి చోట్ల కూడ డిఫెన్స్ కమిటీలు ఏర్పాటయ్యాయి. శ్రీకాకుళం లోనూ, ఖమ్మం, వరంగల్ జిల్లాలలోనూ 1969-72 కాలంలో విపరీతంగా ఎన్‌కౌంటర్ హత్యలు కూడా జరిగాయి. ఆ తర్వాత వేసిన లెక్కల ప్రకారం 370 కన్న ఎక్కువ మంది నక్సలైటు కార్యకర్తలను, ఆదివాసులను పట్టుకుని చెట్లకు కట్టి కాల్చివేసి, ఎన్‌కౌంటర్ కట్టుకథలు అల్లారు పోలీసులు. రాష్ట్రంలో ఒక బీభత్స, నిరంకుశ రాజ్యం అమలయింది. రాజ్యాంగం హామీ ఇచ్చిన

ప్రాథమిక పౌరహక్కులు అడుగడుగునా ఉల్లంఘనకు గురయ్యాయి.

ఈ అప్రజాస్వామిక రాజ్యాన్ని, పౌరహక్కుల ఉల్లంఘనను ఎదిరించాలంటే కేవలం న్యాయవాదులు మాత్రమే ఉండే డిఫెన్స్ కమిటీ లాంటి నిర్మాణం సరిపోదని పౌరహక్కుల సంఘం లాంటి ఒక పటిష్టమైన నిర్మాణం రాష్ట్రవ్యాప్తంగా ఏర్పడాలని అనుకున్నాం. అలా 1973 నాటికే పత్తిపాటి వెంకటేశ్వర్లు కన్వీనర్‌గా ఒక పౌరహక్కుల కమిటీ అనే తాత్కాలిక నిర్మాణం పనిచేయడం ప్రారంభించింది.

ఆ పౌరహక్కుల కమిటీని ఇంకా విస్తృతంగా ఆంధ్ర ప్రదేశ్ పౌరహక్కుల సంఘంగా నిర్మాణం చేయాలనే ఆలోచనతో 1973 అక్టోబర్‌లో గుంటూరులో ఒక సమావేశం జరిగింది. వివిధ జిల్లాలలో పౌరహక్కుల పరిరక్షణలో, ప్రాథమిక హక్కుల గురించి చైతన్యం కలిగించడంలో భాగస్వాములుగా ఉన్న ముఖ్యులు గుంటూరులో సమావేశ మయ్యారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రజాస్వామిక పౌరహక్కుల మహాసభను 1973 డిసెంబర్ 23న గుంటూరులో జరపాలని నిర్ణయించారు. ఒక ఆహ్వాన సంఘం ఏర్పడింది. ఆ ఆహ్వాన సంఘానికి పి. శ్రీమన్నారాయణ అధ్యక్షులుగా కె. వెంకటేశ్వరరావో, గణేశుని కోటేశ్వరరావో కార్యదర్శిగా పనిచేశారు. ఆ మహాసభ సందర్భంగా ఆహ్వాన సంఘం వేసిన కరపత్రం, ఒక సావనీర్ ప్రచురణ కొరకు విడుదల చేసిన ప్రకటన ఇప్పటికీ మూడున్నర దశాబ్దాల తర్వాత కూడా చాలా తాజాగా ఇవాళ్టికీ ఉపయోగపడేటట్టుగా ఉంటాయి.

ఆ కరపత్రంలోను అప్పటి పౌరహక్కుల సంఘం పనితీరులోను విమర్శించ వలసింది సరిచేయవలసింది ఎంతో ఉంది. నిజానికి గత నలభై సంవత్సరాలలో పౌరహక్కుల అవగాహన అంచెలంచెలుగా అభివృద్ధి చెందింది. అందువల్ల తొలిరోజుల్లో తెలియక పొరపాట్లు చేసి ఉంటే ఇప్పుడు వాటిని గుర్తించి ఒప్పుకోవడం మంచిది. ఆహ్వాన సంఘం వేసిన కరపత్రం వైఖరితో నాకు భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ అది ఒక చారిత్రక పత్రం గనుక దాన్ని ఇక్కడ యధాతథంగా ఇస్తున్నాను. ఇప్పుడు నా విమర్శలు ఏమిటో తర్వాత రాస్తాను గాని అప్పటి ఆలోచన తీరుకు ఆ కరపత్రం అద్దం పడతుంది.

"కాంగ్రెస్ పరిపాలనలో నానాటికి ప్రజల బాధలు కష్టాలు పెరుగుచున్నవి. నిరుద్యోగం, పెరిగే ధరలు, దినవస్తులు, అధిక పన్నులతో ప్రజాసామాన్యం క్రుంగి పోతున్నారు. ఇందుకు పరిష్కారంగా వ్యవసాయక విప్లవ కార్యక్రమం చేపట్టి భారత దేశంలో పలు ప్రాంతాల్లో గిరిజనులు, గ్రామీణ రైతాంగం తమ సంఘటిత శక్తితో పోరాటాలు సాగిస్తున్నారు. ఇవి నక్సల్‌బరిలో ప్రారంభమై శ్రీకాకుళం, వరంగల్, ఖమ్మం, కరీంనగర్, తూర్పు గోదావరి జిల్లాలకు వ్యాప్తిచెందినవి. భూ సంస్కరణలు తాము గూడ అమలు జరుపుతామంటున్న కాంగ్రెస్ పాలకులే ఈ న్యాయమైన రైతాంగ పోరాటాలను సైన్యాన్ని దింపి రక్తపుటేరుల్లో ముంచారు. భూమి, భుక్తి, విముక్తికై సాగుచున్న

ప్రజాపోరాటాల్లో పాల్గొన్న మార్క్సిస్టు - లెనినిస్టు పార్టీ విప్లవ కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలను అరెస్టు చేసి, నానా చిత్రహింసలకు గురిచేసి, కాల్చి చంపుతున్నారు. కామ్రేడ్స్ పంచాది కృష్ణమూర్తి, నిర్మల, వెంపటాపు సత్యనారాయణ, ఆదిభట్ల కైలాసం, బత్తుల వెంకటేశ్వరరావు, సుబ్బారావు పాణిగ్రాహి, టిక్కి రాములు, చాగంటి భాస్కరరావు, దేవినేని మల్లిఖార్జునుడు, రాజా రామిరెడ్డి, అరికె సోములు, దాట్ల వెంకటరామరాజు మొదలగు సుమారు 150 మందిని యీ కసాయి కాంగ్రెస్ ప్రభుత్వం తుపాకి గుండ్లకు బలిచేసింది. గిరిజన ప్రాంతాల్లో సిఆర్‌పి ని దింపి గ్రామాలను చుట్టుముట్టి మూకుమ్మడి దాడులు జరిపి, ప్రజల ఆస్తులను దోచుకొని పంటలను ధ్వంసం చేస్తున్నారు. స్త్రీ, పురుష విచక్షణ లేకుండా చిత్రహింసలు పెట్టి బనాయింపు కేసుల్లో యిరికించి జైళ్ళలో కుక్కుతున్నారు.

న్యాయమైన తమ హక్కులకై ఉపాధ్యాయులు మొదలు ఎన్‌జిఓలు, డాక్టర్లు, యింజనీర్లు, రైల్వే ఉద్యోగులు, యుపి పోలీసులతో సహా ప్రభుత్వ వ్యతిరేక అసమ్మతి ప్రదర్శనలు చేసి దీర్ఘకాల సమ్మె పోరాటాలు సాగించారు. న్యాయమైన యీ సమ్మెలను నిషేధించి, అరెస్టులు చేసి, ఉద్యోగాల నుంచి తొలగించి భయంకర పరిస్థితులు కల్గించారు. ప్రత్యేకాంధ్ర ఉద్యమాన్ని అణచుటకు సైన్యాన్ని దింపి ఆంధ్ర ప్రదేశ్‌ను యుద్ధభూమిగా మార్చారు. విజయవాడ, గుంటూరు, నెల్లూరు మొదలగు పట్టణాల్లో సైనికులు యిండ్లలో దౌర్జన్యంగా జొరబడి లూటీ చేసి స్త్రీలతో అసభ్యంగా ప్రవర్తించారు. యీ సందర్భంగా అరెస్టులు చేసిన అనేక మంది విద్యార్థులను, యువకులను యిప్పటికీ కోర్టుల చుట్టూ తిప్పుతూ కాలయాపన చేయుచున్నారు. ఇటీవల విప్లవ రచయితలైన వరవరరావు, యంటి ఖాన్, చెరబండ రాజులను అరెస్టులు చేసి ప్రాథమిక హక్కులలో పొందుపరచబడిన కనీస పౌరహక్కులైన భావ, వాక్, పత్రికా స్వాతంత్ర్యములను కూడ హరించి వేయుచున్నదీ ప్రభుత్వం.

కేరళలో అచ్యుతమీనన్ నాయకత్వాన గల ప్రభుత్వం సమ్మెలను, ప్రజా పోరాటాలను నిర్బంధంతో అణచివేసి, విప్లవకారులను కారాగారాల్లో కుక్కి కామ్రేడ్ వర్గీసును కనుగ్రుడ్లు పీకి కాల్చివేశారు. బీహారులోని పూర్ణియా జిల్లా రుపాస్‌పూర్ చన్ద్వాలో 14 సంతాల్ కౌలుదార్లను (స్త్రీలు, పిల్లలతో సహా) కొందర్ని కాల్చివేసి, మరికొందర్ని సజీవ దహనం చేశారు. షహాబాద్‌లో యిద్దరు సోషలిస్టులను, సెలిబేరిలో 7గురు కమ్యూనిస్టులను (మితవాద), చౌరీలో 4గురు హరిజన కూలీలను, సురేంద్ర నారాయణ సింగ్‌తో సహా కాల్చి హత్యచేశారు. బెంగాల్‌లో జరిగిన చిత్రహింసలు, విషాదకర హత్యాకాండతో కలకత్తా నడివీధుల్లో రక్తం వరదలై ప్రవహించింది. అనారోగ్యంతో ఉన్న కామ్రేడ్ చారుమజుందార్ పోలీసు కార్యాలయంలో హింసకు గురై హత్య గావించబడ్డాడు. పంజాబ్ విద్యార్థులెందరో దారుణ నిర్బంధానికి, హత్యలకు గురైనారు.

భారతదేశంలోని జైళ్ళను 32,000 విప్లవకారులు, యితర రాజకీయ ఖైదీలతో

నింపారు. కుట్రకేసులు, క్రిమినల్ కేసులు బనాయించి విచారణ తంతు పేరుతో సంవత్సరాలు జరిపి, అనంతరం దీర్ఘకాల కఠిన శిక్షలు విధిస్తున్నారు. అన్నిటికీ మించిన విచిత్రమేమంటే వేలాది రాజకీయ పార్టీల కార్యకర్తలను, రాజకీయ ఖైదీలుగా పరిగణించక జైళ్ళలో క్రిమినల్సుగా పగలు, రాత్రిళ్ళు చేతులకు బేడీలు వేసి చీకటి గదుల్లో హింసిస్తున్నారు. చివరకు నాగభూషణం పట్నాయక్, భూమయ్య, కృష్ణ గౌడ్‌లను ఉరిశిక్షలకు గురిచేసిందీ కాంగ్రెస్ ఫాసిస్టు ప్రభుత్వం.

నిత్యపరిపాలనలో 144 సెక్షన్లు, కర్ఫ్యూలు, పోలీసు క్యాంపులు కల్లోలిత ప్రాంతాలు ప్రకటించుట సర్వసాధారణమైనది. సివిల్ పాలన స్థానంలో పోలీసు, మిలిటరీ జోక్యం నానాటికి పెరుగుతున్నది. ప్రభుత్వంలో నియంతృత్వ ధోరణులు తలెత్తి పరిపాలిస్తున్నవి. విప్లవకారులు ప్రథమ శ్రేణిలో నిల్చియిందుకు తమవంతు మూల్యం చెల్లిస్తున్నారు. భారత ప్రజలు, వివిధ పార్టీలు యేదోరీతిగా యీ నిర్బంధ పాలనాయంత్రానికి గురగుచున్నారు. ఇదొక నూతన ప్రత్యేక పరిస్థితి.

అందుచే వివిధ జిల్లాల ముఖ్యులు 14.10.1973న గుంటూరులో సమావేశమై పరిస్థితులను పరిశీలించి రాష్ట్ర పౌరహక్కుల మహాసభను డిసెంబర్‌లో గుంటూరులో జరుప నిర్ణయించారు. పై తేదీన గుంటూరు జిల్లా ముఖ్యుల విస్తృత సమావేశంలో ఆహ్వాన సంఘం ఎన్నికైనది. యీ మహాసభకు శ్రీశ్రీ, కుచేలన్, ప్రమోదసేన్ గుప్తా, జయశ్రీ రాణా, నవకృష్ణ చౌదరి, కర్పూరీ ఠాకూర్, మోహన్ రామ్, ఆర్.కె. గార్గ్, మోనిగుహ, సమర్‌సేన్, జార్జి ఫెర్నాండెజ్, మృణాల్‌సేన్, ఉత్పల్‌దత్, మైత్రేయీదేవి, రహబార్, భక్తిభూషణ్, పండిట్ సుందర్‌లాల్, సమద్దర్ మొదలగు వారిని ఆహ్వానించడమైనది. అంతేగాక యీ దశలో మనరాష్ట్రంలో మరణించిన మృతవీరుల సంగ్రహ జీవిత చరిత్రను పుస్తకరూపంలో ప్రకటించుటకు గూడ నిర్ణయమైనది. కాన యీ మహాసభను పై కార్యక్రమాన్ని జయప్రదం చేయుటకు ప్రజలు విరివిగా విరాళాలిచ్చి, సభలో స్వయంగా పాల్గొని అన్నివిధాల సహకరించాలని విజ్ఞప్తి చేయుచున్నాము".

ఇదీ కరపత్రం. అందులోని నక్సలైట్లకు అలవాటయిన భాషను పక్కనపెడితే దేశంలోనూ, రాష్ట్రంలోనూ ఆనాడున్న నిర్బంధ పరిస్థితిని ఆ కరపత్రం చక్కగా వివరిస్తుంది. అందులో నక్సలైట్ల మీద నిర్బంధం గురించి కూడా ఉంది. అయితే పౌరహక్కుల సంఘం అనేది కేవలం నక్సలైట్ల మీద నిర్బంధాన్ని ఖండించడానికే పుట్టుకువచ్చిందనే అపోహ, ప్రచారం అప్పటినుంచి ఇప్పటిదాకా కొనసాగుతూనే ఉన్నాయి. ఆ అపోహలను తొలగించడానికి ఇటువైపునుంచి జరిగిన ప్రయత్నం కూడా సరిపోయినంత స్థాయిలో లేదు.

ఆ మహాసభల ఆహ్వాన సంఘమే, మహాసభల నాటికి ఒక సావనీరును ప్రచురించాలని నిర్ణయించింది. అందులో అమరవీరుల జీవిత గాథలు, ఫోటోలు,

ప్రజాపోరాటాలూ, ప్రభుత్వ నిర్బంధకాండను గూర్చిన సమాచారం ఉండాలని ఆ సావనీరుకు గణేశుని కోటేశ్వరరావు, చెర్లుకూరి సత్యనారాయణలు సంపాదకులుగా ఉండాలని ఆహ్వానసంఘం నిర్ణయించింది.

నాకు గుర్తున్నంతవరకు అటువంటి సావనీర్ ఏదీ వెలువడినట్టు లేదు గాని ఆ సావనీర్‌కు సమాచారం అందించడం కోసం ఒక ప్రశ్నపత్రం తయారుచేసి అచ్చువేశారు. ఆ ప్రశ్నపత్రం ఇవాల్టికీ అవసరమైనదే. అది ఇలా ఉంటుంది.

"కావలసిన సమాచారం 1967 నుండి జిల్లా:

1. జైళ్ళలో కాకుండా కాల్చివేయబడినవారి పేరు ఫోటో

ఎ) వయస్సు బి) గ్రామం సి) ఎక్కడ చనిపోయినది డి) చనిపోయిన తేదీ

2. జైళ్ళలో కాల్చివేయబడినవారి పేరు

ఎ) వయస్సు బి) గ్రామం సి) ఎక్కడ చనిపోయినది డి) చనిపోయిన తేదీ

3. జైళ్ళలో మందులు సప్లయి సరిగా లేక చనిపోయిన వారి పేరు

ఎ) వయస్సు బి) గ్రామం సి) ఎక్కడ చనిపోయినది డి) చనిపోయిన తేదీ

4. జిల్లాలో మొత్తం విప్లవకారులపై పెట్టబడిన మొత్తం కేసుల సంఖ్య.

5. ఆ కేసులో ముద్దాయిల సంఖ్య.

6. ఎ) ఒక్కొక్క కేసు నంబరు బి) పోలీసు స్టేషను సి) ముద్దాయిల సంఖ్య డి) కేసు పెట్టబడిన తేదీ ఇ) కేసు విచారణ చేయబడినదా లేక ఎంతకాలంగా కోర్టులో నడుచు చున్నది ఎఫ్) కేసు విచారణ జరిగిన సందర్భంలో శిక్ష పడిన కాలము

7. విప్లవకారులను అరెస్టు చేసిన తరువాత కోర్టుకు హాజరు పరచకుండా ఎంతకాలము పోలీసు కస్టడీలో వుంచినది. ఏ చిత్రహింసలకు గురిచేసినది.

ఎ) పేరు బి) ఎక్కడ పట్టుకున్నది సి) ఎక్కడ పట్టుకున్నట్లు ప్రభుత్వం ప్రకటించినది డి) ఏ తేదీన అరెస్టు చేసినది ఇ) ఏ తేదీన కోర్టుకు హాజరు పరచినది.

8. కర్ఫ్యూలు, 144 సెక్షన్ అమలు జరుపబడిన సమయాల సంఖ్య

9. మీసా, టిఎస్ఎ, పిడి, ఎమర్జెన్సీ రెగ్యులేషన్ చట్టం క్రింద రాజకీయ సంబంధంగా అరెస్టు చేయబడిన వారి పేర్లు, వారి నిర్బంధకాలము.

10. పుస్తకాలు, రచనలు, సభలు, సమావేశాలపై నిషేధాలు, నిర్బంధాలు.

11. వివిధ రకాల ప్రజా వుద్యమాల సందర్భంగా పెట్టబడిన కేసులు, జైళ్ళలో నిర్బంధించిన కాలము.

ఇతరములు.... (పోలీసు క్యాంపులు వగైరా)"

ఈ ప్రశ్న పత్రం చూస్తే పౌరహక్కుల సంఘం ఏర్పడ్డానికి ముందు నుంచీ కూడ ప్రభుత్వం చేసే అక్రమాలను, పౌరహక్కుల ఉల్లంఘనలను పద్ధతి ప్రకారం నమోదు చేయడం తన బాధ్యతగా భావించిందని అనిపిస్తుంది.

గుంటూరులో జరిగిన ఆంధ్ర ప్రదేశ్ పౌర, ప్రజాస్వామిక హక్కుల మహాసభలోనే ఆంధ్ర ప్రదేశ్ పౌరహక్కుల సంఘం ఏర్పడనప్పటికీ, ఆ గుంటూరు తొలి సమావేశమే తొలి అడుగు అని చెప్పాలి. దాదాపు మూడు వేలమంది హాజరయిన ఆ మహాసభ నక్సలైట్ పార్టీల సానుభూతిపరుల చర్చలతో ఏ నిర్మాణాత్మక ఏర్పాటు లేకుండానే ముగిసింది. పౌరహక్కుల సంఘానికి ఎటువంటి కార్యక్రమం ఉండాలనే విషయంలో అప్పుడే కాదు, మూడు దశాబ్దాలు గడిచిపోయిన తర్వాత ఇప్పుడు కూడా వివాదాలు అట్లాగే ఉన్నాయి.

మొత్తానికి గుంటూరు మహాసభ ద్వారా మొదలయిన ప్రయత్నాల వల్లనే 1974 జనవరిలో మహాకవి శ్రీశ్రీ అధ్యక్షుడుగా, పత్తిపాటి వెంకటేశ్వర్లు ప్రధాన కార్యదర్శిగా ఆంధ్ర ప్రదేశ్ పౌరహక్కుల సంఘం (ఆంధ్ర ప్రదేశ్ సివిల్ లిబర్టీస్ కమిటీ - ఎపిసిఎల్‌సి) పేరుతో సంస్థ నిర్మాణ రూపం ధరించింది. 1964లో ఏర్పాటయిన ఎపిసిఆర్ఎ కు కూడా శ్రీశ్రీ యే అధ్యక్షునిగా ఉండేవారు. పౌరహక్కుల సంఘంలోకి తొలిదశలో ఎక్కువ మంది విప్లవ రచయితలు, కవులు, అధ్యాపకులు వచ్చి చేరారు.

ఎపిసిఎల్‌సి పుట్టీ పుట్టగానే దాని మీద నిర్బంధం కూడా ప్రారంభమయింది. అది అప్పటివరకూ ఏ రాజకీయ పక్షమూ తీసుకోవడానికి సాహసించని సామాజిక రాజకీయ విషయాలు తీసుకుని వాటిపై తన పోరాటం ప్రారంభించింది. జైళ్ళలో కొనసాగుతున్న అమానుష పరిస్థితులకు వ్యతిరేకంగా, ఉరిశిక్షలకు వ్యతిరేకంగా, రాజ్యహింసకు వ్యతిరేకంగా తన పోరాటం సాగించింది. పౌరహక్కుల ఉద్యమ సంస్థగా ఎపిసిఎల్‌సి ఇంకా విశాలమైన అర్థంలో హక్కులను నిర్వచించుకొని ఉండవలసింది. కాని ఆనాడున్న స్థితిలో ఎవరి హక్కులయితే అతిదారుణంగా కాలరాయ బడుతున్నాయో వారు హక్కుల పరిరక్షణ కొరకే ఎపిసిఎల్‌సి నిలబడింది.

అందువల్ల ఎపిసిఎల్‌సి మొదటి సంవత్సరం అంతా విప్లవకారుల బూటకపు ఎన్‌కౌంటర్లు, విప్లవకారులపై, విప్లవ రచయితలపై నిర్బంధం, భూమయ్య, కిష్టాగౌడ్ ఉరిశిక్షలు, జైళ్ళలో రాజకీయ ఖైదీలపై సాగుతున్న దమనకాండ వంటి అంశాలపైనే కేంద్రీకరించింది.

ఈలోగా తరిమెల నాగిరెడ్డి రాజకీయ పంథాను అభిమానించె వారు 1975 ఏప్రిల్‌లో ఆర్గనైజేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ డెమొక్రటిక్ రైట్స్ (ఒపిడిఆర్)ను స్థాపించారు. ఒపిడిఆర్ కూడ రాష్ట్రంలో పౌర, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ ఉద్యమంలో క్రియాశీలంగా పనిచేయడం ప్రారంభించింది.

కాని 1975 జూన్‌లో ఎమర్జెన్సీ విధించిన తర్వాత జరిగిన తొలి అరెస్టులలో ఒకటి ఎపిసిఎల్‌సి ప్రధాన కార్యదర్శి పత్తిపాటి వెంకటేశ్వర్లు కూడా నిర్బంధానికి గురయ్యారు. దానితో ఎమర్జెన్సీ కాలమంతా న్యాయస్థానాలలో రిట్ పిటిషన్ల ద్వారా చేసే

న్యాయపోరాటం మినహా మరే పౌరహక్కుల ఉద్యమ కార్యక్రమం లేకుండా పోయింది. ఎమర్జెన్సీ రోజులలో ఆ పని చేసినందువల్ల, ఎమర్జెన్సీ ఎత్తివేసే నాటికి రాష్ట్రంలోనూ, దేశవ్యాప్తంగానూ పౌరహక్కుల పరిరక్షణ కృషిలో ఒక ముఖ్యమైన కార్యకర్తగా నా పేరు నిలిచింది.

అప్పటికే, ఎమర్జెన్సీ ముందు నాటికే, కోర్టు కేసుల వల్ల, ఎపిసిఎల్‌సి సభ్యత్వం వల్ల నా పాత్ర పెరుగుతూ ఉండింది. అప్పటికి శ్రీశ్రీ, వెంకటేశ్వర్లు చేస్తున్న కృషి పట్ల నాకు గౌరవం ఉండింది. వాళ్ళు రాష్ట్రమంతటా పౌరహక్కుల పరిరక్షణ ఆవశ్యకతను వివరిస్తూ ఉపన్యాసాలు చేశారు. ఎక్కడ పౌరహక్కుల ఉల్లంఘనం జరిగినా పరిగెత్తుకు వెళ్ళి, ప్రకటనల ద్వారా, సభల ద్వారా ప్రచారం చేసేవారు.

అప్పుడే ఒకసారి నాగిరెడ్డి గారు నా దగ్గరికి వచ్చి ఒపిడిఆర్‌లో చేరమని అడిగారు. ఆయన అప్పటికి అజ్ఞాత వాసమే కావచ్చు. కాని నా దగ్గరికి వస్తుండేవారు. నా ఇంటి మీద పోలీసు నిఘా ఎప్పుడూ ఉండేది. నారాయణగూడ పోలీసుల ప్రోద్బలంతో చిన్నా చితకా నేరస్తులు వచ్చి నా ఇంటి ముందు నిలబడి ఎవరెవరు వచ్చిపోతున్నారో సమాచారం చేరవేస్తుండేవారు.

సరిగ్గా అదే సమయంలో భూమయ్య, కిష్టాగౌడ్‌ల ఉరిశిక్షలకు వ్యతిరేకంగా అటు న్యాయస్థానాలలోను, ఇటు సమాజంలోను పెద్ద ఎత్తున ఆందోళన జరిగింది. ఆ ఆందోళనలో నా పాత్ర గురించి ఇదివరకే చెప్పాను.

మొదటిసారి భూమయ్య, కిష్టాగౌడ్‌ల ఉరిని అపగలిగినప్పుడు ఆ రాత్రి అంతా ఏడుస్తూ ఉన్నాను. అసలు అప్పుడు వెలువడిన ఉద్వేగాలే భిన్నమైనవి. కె.ఎ. అబ్బాస్ బ్లిట్జ్ పత్రికలో రాశాడు – భూమయ్య, కిష్టాగౌడ్‌ల కళ్ళు దానం చేయాలని రాశారు. వాళ్ళ కళ్ళు వాళ్ళు కలగన్న సమాజాన్ని వీక్షిస్తాయి అని.

ఆ తర్వాత ఎమర్జెన్సీ. డిఫెన్స్ కమిటీకి కూడా నేను కన్వీనర్‌గా ఉన్నాను. ఆ కమిటీలో జీవన్ రెడ్డి, గంగాధర రావు మొదలయిన ప్రముఖ న్యాయవాదులు ఇరవై మంది పైన ఉండేవారు. ఎమర్జెన్సీలో డిఫెన్స్ కమిటీ పని చేయడానికి వీలు లేకపోయింది. కమిటీని రద్దు చేయమని నాకు సూచనలు కూడా వచ్చాయి గాని నేను ఒక్కణ్నే కమిటీ పనిచేశాను. వందలాది రిట్‌పిటిషన్లు దాఖలు చేసి వాదించాను. నేను చేసిన వాదనల వల్ల చట్టానికి ఎన్నో సవరణలు చేయవలసి వచ్చింది.

ఎమర్జెన్సీలో డిఫెన్స్ ఆఫ్ ఇండియా రూల్స్ వల్ల ఎపిసిఎల్‌సి పని చేయలేక పోయింది. ఎంతోమంది ఎపిసిఎల్‌సి సభ్యులును పిడి ఆక్ట్ కింద అరెస్టు చేశారు.

ఎమర్జెన్సీ విధించగానే శత్రుఘ్న, వీణ, రమ, సరళ్ సర్కార్ వంటి వారిని అరెస్టు చేసి నారాయణగూడ వైఎంసిఎ పోలీస్ స్టేషన్‌లో పెట్టారు. అప్పటికి నాకూ శత్రుఘ్నకూ అంత పరిచయం లేదు. అందుకని శత్రుఘ్న జీవన్ రెడ్డికి ఫోన్ చేశాడు. జీవన్ రెడ్డి

అప్పటికింకా జడ్జి కాలేదు. కాని త్వరలోనే జడ్జి కానున్నాడు. అందువల్ల జీవన్ రెడ్డి నాకు ఫోన్ చేసి "కొద్ది రోజుల్లోనే నేను జడ్జి కాబోతున్నాను. కనుక ఇప్పుడు వెళ్ళి పోలీసు నిర్బంధంలో ఉన్న మనిషిని చూస్తే బాగుండదు. మీరు వెళ్ళి శత్రుఘ్నను చూసి, ఏం చేయగలమో ఆలోచించగలరా" అని అడిగారు.

నేను సరేనని అక్కడి వెళ్ళాను. శత్రుఘ్న లుంగీ మీద, చేతులకు సంకెళ్ళతో ఉన్నాడు. అప్పుడక్కడ ఇనస్పెక్టర్ పేరు జాన్ బన్సన్ అనుకుంటాను. నేనా ఇనస్పెక్టర్‌తో 'ఇదేమిటి శత్రుఘ్న ఒక లెక్చరర్, గౌరవనీయమైన వ్యక్తి. ఆయన నిట్లా నిర్బంధించడం ఏమిటి? చేతులకు సంకెళ్ళు తీసేసి మర్యాదగా చూడండి' అన్నాను. "ఆఫ్టర్ సమ్‌టైమ్ సర్", "ఆఫ్టర్ సమ్ టైమ్ సర్" అని అదేమాట పదే పదే అంటాడు గాని ఆ పని చేయడు ఆ ఇనస్పెక్టర్. శత్రుఘ్నకేమో వచ్చిపోయే వాళ్ళముందర అట్లా బేడీలతో కూచోవడం అవమానకరంగా, ఇబ్బందిగా ఉంది. ఆ తర్వాత అక్కడికి మిగిలిన వాళ్ళను కూడ తీసుకు వచ్చారు.

అట్లాగే సెక్రటేరియట్ ఉద్యోగులను, ఎజి ఆఫీస్ ఉద్యోగులను కూడా డిఫెన్స్ ఆఫ్ ఇండియా రూల్స్ కింద అరెస్టు చేశారు.

డిఫెన్స్ ఆఫ్ ఇండియా రూల్ కింద బెయిల్‌కు అవకాశం లేదు. మెజిస్ట్రేట్ దగ్గరే విచారణ జరుగుతుంది. నేనేమో హైకోర్టులో వాదించేవాణ్ణి. కాని ఈ సంగతి తెలిసి నేనిక ఆ కేసులన్నీ చేశాను. బెయిలన్నా ఇవ్వండి, లేకపోతే కేసయినా తేల్చండి అని వాదించే వాణ్ణి. హైకోర్టులో నాలుగింటి దాకా వాదించి, అప్పుడు మెజిస్ట్రేట్ కోర్టుకు వచ్చి ఈ కేసులు వాదించేవాణ్ణి. ఈ కేసులు చూస్తే హాస్యాస్పదమనిపిస్తుంది. కాని మరోవైపు నుంచి చూస్తే రాజ్యం ఎంత క్రూరంగా, దుర్మార్గంగా ఉండగలదు అనిపిస్తుంది.

ప్రతి కేసులోనూ అబద్ధాలే. సెక్రటేరియట్ ఉద్యోగుల కేసులు వాదించేటప్పుడు ఒక విచిత్రం జరిగింది. ఆ ఉద్యోగులందరినీ వారి ఇళ్ళలోనో, కార్యాలయాలలోనో అరెస్టు చేసి తీసుకొచ్చారు. "వాళ్ళను అరెస్టు చేయడానికి ఇంటికి వెళ్ళాం. తలుపు తెరవగానే బీరువా నిండా ఎదురుగానే బోలెడంత నిషిద్ధ సాహిత్యం ఉంది" అని ఎఫ్ఐఆర్ లో రాసేవారు.

నేను వాళ్ళను బోనులో నిలబెట్టి, 'నిందితులను మీరు మీరు ఎక్కడ అరెస్టు చేశారు' అని అడిగేవాణ్ణి.

"ఇంట్లో సార్"

"ఇంట్లో కిందనా, పై అంతస్తులోనా?"

తలుపు కొట్టాం సార్, కిందనే. తలుపు తెరగానే హాలుంది. సోఫా ఉంది. ఆ సోఫా పక్కన పుస్తకాల బీరువా ఉంది."

నేనిక ఆ ఇంటిని పరీక్షించడానికి అవకాశం ఇమ్మని మెమో వేశాను. జడ్జిని,

ప్రాసిక్యూటర్‌ను తీసుకుని ఆ ఇంటికి వెళ్ళాం. ఆ ఇంట్లో కింది అంతస్తులో కారు గారేజి ఉంది. ఆ గారేజి వెనుక చిన్న గది ఒకటి ఉంది గాని అది మరుగుదొడ్డి!

ఇంక నేను ఏమీ వాదించవలసిన అవసరమే లేకపోయింది. ఎక్కడ, ఏ పుస్తకాలను జప్తు చేసి, ఆ వ్యక్తిని అరెస్టు చేశామని చెపుతున్నారో అసలు ఆ స్థలమే లేదు.

ఆ అరెస్టు చేసి, బోనెక్కి నా ప్రశ్నలకు జవాబులు చెప్పిన వాడు ఫడ్కే అనే పోలీసు అధికారి. శేషగిరిరావు అనే ఇంటిలిజెన్స్ అధికారి ఒకాయన ఉండేవాడు.

ఆ శేషగిరి రావు ఎచ్‌ఎంటిలో పని చేసే ఒక పద్దెనిమిది, పందొమ్మిదేళ్ళ అప్రెంటిస్ కుర్రవాడ్ని ఫ్యాక్టరీ నుంచి వస్తుంటే దారిలో పట్టుకున్నాడు. ఆ కుర్రవాడిని ఆంధ్రా బ్యాంకులో పట్టుకున్నామని ఎఫ్ఐఆర్‌లో రాశాడు.

ఇంటి ప్లాన్ గీసి ఎక్కడ పట్టుకున్నామో చెప్పాడు. ఏమేమి జప్తు చేశామో చెప్పాడు.

నేనాయనను బోనెక్కించి "మీరు ఆంధ్రా బ్యాంకు కాలనీలో ఉంటారు గదూ. అక్కడ అన్ని ఇళ్ళూ ఒక్కలాగనే, ఒకే ప్లాన్‌తో ఉంటాయి గదూ" అని అడిగి "మీరు ఆ కుర్రవాడ్ని అతని ఇంట్లో పట్టుకోలేదు. చాదర్‌ఘాట్ బ్రిడ్జి మీద పట్టుకున్నారు. ఇప్పుడు మీ ఇంటి ప్లాన్ గీసుకు వచ్చి, అతణ్ని అరెస్టు చేసిన ఇల్లు ఇదే అని చెపుతున్నారు" అని అడిగి ఒప్పించాను.

అవన్నీ ఇటువంటి చిన్నా చితకా కేసులే. నిందితుల జీవితాలు ధ్వంసమై పోయాయి. జడ్జిలు నవ్వడం మొదలు పెట్టారు గాని అదేమీ నవ్వే విషయం కాదు. ఆ కేసులలో నిందితులు ఉద్యోగాలు పోగొట్టుకున్నారు. ఆర్థిక స్థితి చిన్నాభిన్నమై పోయింది. జీవితం అల్లకల్లోలమై పోయింది.

ఒకసారి ఫడ్కేనో, మరో పోలీసు అధికారినో నేను క్రాస్ ఎగ్జామినేషన్ చేస్తున్నాను. ఒక ప్రశ్న వేశాను. ఆ ప్రశ్నకు జవాబు చెప్పడానికి అతను చాల వ్యవధి తీసుకున్నాడు. "మిస్టర్ ఫడ్కే - మిమ్మల్ని మీరు ఇంటిలిజెన్స్ అధికారినని చెప్పుకుంటారు. కాని మీకు కనీస ఇంటిలిజెన్స్ కూడ ఉన్నట్టు దాఖలాలు లేవు" అన్నాను.

అతనికి నా మీద చాలా కోపం వచ్చింది. కాని అప్పుడు నేను ఆధిక్య స్థానంలో ఉన్నాను. నేను అలా చాలా మంది పోలీసు అధికారులను బోను ఎక్కించి, వాళ్ళను చాలా ఇబ్బంది పెట్టాను. తీవ్రంగా మాట్లాడాను. అవమానించాను. దుర్భాషలాడాను. అంటే వాళ్ళు తాము అరెస్టు చేసిన వ్యక్తులతో ఎట్లా ప్రవర్తించి ఉంటారో అటువంటి ప్రవర్తన వాళ్ళకు రుచి చూపించాలనుకున్నాను.

శత్రుఘ్నను ఒకరోజు జడ్జి దగ్గరకు తీసుకువచ్చారు. తన చేతులకు సంకెళ్ళు లేకుండా చూడాలని ఆయన అడిగాడు. అది చేస్తే అసలు కేసు పక్కకు పోతుందని నేనన్నాను. శత్రుఘ్నకు కోపం వచ్చింది గాని చివరికి శాంత పరిచాను.

ఆ రోజుల్లో తారిఖ్ అలీ 'ఎక్స్‌ప్లోజన్ ఇన్ ది సబ్ కాంటినెంట్' అనే పుస్తకం

రాశాడు. అది పెంగ్విన్స్ ప్రచురణగా వచ్చిందనుకుంటాను. అదేదో నేరమయినట్టుగా పోలీసులు చెప్పుకొచ్చారు. అట్లాగే శత్రుఘ్న ఇంట్లో ఆ పుస్తకం జప్తుచేశామని, అదేదో నేరమయినట్టుగా పోలీసులు చెప్పుకొచ్చారు. అట్లాగే శత్రుఘ్న అప్పుడు నడుపుతుండిన బులెటిన్ "వ్యూస్ అండ్ న్యూస్ ఆన్ చైనా" కూడ జప్తు చేసి తెచ్చారు. ఆ బులెటిన్‌లో ఆయన వేరు వేరు పత్రికల్లో వచ్చిన రచనలు మళ్ళీ అచ్చువేసేవాడు.

ఆ కేసులో లక్ష్మారెడ్డి ఇన్వెస్టిగేటింగ్ ఆఫీసర్. జాన్ జన్సన్ ఒక సాక్షి.

ఆ రోజుల్లో కోర్టు విచారణలు బహిరంగసభల లాగ ఉండేవి. శత్రుఘ్న కేసు విచారణ చూడడానికి చాలా మంది వచ్చారు. జాన్ బన్సన్‌కు ఇటువంటి క్రాస్ ఎగ్జామినేషన్ కొత్త. ఎప్పుడూ ఇంతగా ప్రశ్నించే న్యాయవాదిని చూడలేదు. 'బన్సన్ సాబ్ కా చెడ్డీ భీ ఉతార్ దియే సాబ్" అని ఆ రోజు చూసినవాళ్ళు అన్నారు.

తారీఖ్ అలీ పుస్తకం నిషిద్ధ పుస్తకం కాదు. అది ఎ ఎ హుసేన్‌లో దొరుకుతుంది. అది నీకు తెలుసా? వ్యూస్ అండ్ న్యూస్ ఆన్ చైనా అంటే ఏమిటో నీకు తెలుసా? నువ్వు అది చదివావా? ఎక్కడిదాకా చదివావు? ఆ భాగం నిషేధించబడిందా? నిషేధించ బడిందని తెలిసే అరెస్టు చేశావా? అరెస్టు చేశాక నిషేధించబడిందని తెలుసుకున్నావా? ఇలా ప్రశ్నల మీద ప్రశ్నలు వేసి ఆ పోలీసు అధికారి అజ్ఞానాన్ని బయటపెట్టాను.

సాధారణంగా పోలీసులు చదవరు. వాళ్ళకు చదవడం రాదు కూడా. పోలీస్ ఇన్‌స్పెక్టర్ స్థాయిలో కూడా అరకొర చదువు వచ్చిన వాళ్ళే ఉంటారు. ఏదో కేసులు పెట్టాలి కాబట్టి పెడతారు గాని, ఆ కేసుల గురించి లోతుగా ప్రశ్నిస్తే వాళ్ళకు ఏమీ తెలియదని తెలిసిపోతుంది.

ఆ రకంగా పోలీసులు ఒక పుస్తకాన్ని నిషిద్ధ పుస్తకమని చెప్పి, అది కలిగి ఉన్నందుకు కేసు పెట్టడమంటే ఆ విషయంలో ఏమాత్రం జ్ఞానం లేకుండా పెట్టడమన్నమాట. ఆ పోలీసు అధికారి లక్ష్మారెడ్డికి తారిఖ్ అలీ ఎవరో తెలియదు. తారిఖ్ అలీ రాసిన పుస్తకాలేమిటో తెలియదు. అవి ఈ దేశంలో నిషేధించబడ్డాయో లేదో తెలియదు. ప్రపంచ పత్రికలలో వచ్చిన వార్తలనూ వ్యాసాలనూ పునర్ముద్రించే 'న్యూస్ అండ్ వ్యూస్ ఆన్ చైనా" అంటే ఏమిటో తెలియదు. దాన్ని నిషేధించవచ్చునా లేదా తెలియదు. నిషిద్ధ పుస్తకాలు అని ఎఫ్ఐఆర్‌లో, చార్జిషీట్లలో రాసి బుకాయిస్తారు గాని ఏ చట్టం కింద ఎప్పుడు నిషేధం అమలులోకి వచ్చిందో తెలియదు.

అటువంటి పోలీసు అధికారులను బోనులో నిలబెట్టి ప్రశ్నల మీద ప్రశ్నలు గుప్పించి క్రాస్ ఎగ్జామినేషన్ చేయడం సరదాగా ఉండేది. అప్పుడు కోర్టు విచారణలకు చాలా మంది జనం కూడా వస్తూ ఉండేవారు. గనుక ఆ క్రాస్ ఎగ్జామినేషన్లు, బైట పులుల్లాగ ఉండే పోలీసు అధికారులు బోన్లలో నిలబడి తడబడుతూ మాట్లాడడం చూసి జనం సంతోషపడుతుండేవాళ్ళు.

అప్పుడు ఒక పోలీసు ప్రాసిక్యూటర్ ఉండేవాడు. తారిఖ్ అలీ పుస్తకం ప్రచురణ వివరాలలో 'నాట్ ఫర్ సేల్ ఇన్ ది యుఎస్ఏ' అని ఒక వాక్యం అచ్చయి ఉండడం చూసి ఎగురుకుంటూ వచ్చాడు. 'ఇది అమెరికాలో అమ్మగూడదని ప్రకటించారు. అంటే నిషిద్ధ పుస్తకం అన్నట్టే గదా. మంచి వాదన దొరికింది' అని అనడం మొదలు పెట్టాడు.

"ఆ మాట కోర్టు హాల్లో అనబోకు, నువ్వు ఆ మాట అన్నావంటే నువ్వు ఎంత అజ్ఞానివో, నిరక్షర కుక్షివో నేను బహిరంగంగా చెప్పవలసి వస్తుంది. కాపీరైట్ చట్టాల ప్రకారం ఏ పుస్తకం ఏ ప్రచురణకర్తలకు ఏ మార్కెట్లో అమ్ముకునే అవకాశం ఉందో లేదో చెప్పేమాట అది. దాన్ని పట్టుకుని డిఫెన్స్ ఆఫ్ ఇండియా రూల్స్ నిర్బంధంలోకి తీసుకురాకు" అని చెప్పాను. అతనికి తన అజ్ఞానం అర్థమైంది. కోర్టులో ఆ ప్రస్తావన తీసుకురాలేదు.

ఇక ఆ మెజిస్ట్రేటు కోర్టులో జడ్జిలు కూడా అంతగా చదువుకున్నవాళ్ళు కాదు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన వాళ్ళు. మరి ఈ ముద్దాయి లేమో అందరూ పెద్ద పెద్ద కుటుంబాల నుంచి వచ్చి పెద్ద చదువులు చదువుకున్న వాళ్ళు. శత్రుఘ్న, సరళ సర్కార్, వీణ, రమ... అందరూ ఆధునికులు.

సరళ సర్కార్ జడ్జిల భాష గురించి తీవ్రంగా వ్యాఖ్యానించేవాడు. "వీళ్ళకు కనీసమైన భాష కూడా రాదేమిటి? అని ప్రశ్నించేవాడు.

"వాళ్ళు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చారు. మనకున్న జడ్జిలు వాళ్ళే. భాష ఎట్లా ఉన్నా, వాళ్ళు ఈ సమాజం గురించి తెలిసిన వాళ్ళు" అని నచ్చజెప్పే వాణ్ని.

నిజంగానే ఆ కేసులో జడ్జి మంచి తీర్పు రాశాడు. నేను ఆ తీర్పును ఆ తర్వాత సభల్లో కూడ వినిపించాను. అట్లా డిఐఆర్ కేసులన్నీ ఒకటి తర్వాత ఒకటి కొట్టుడుపోయాయి.

ఎమర్జెన్సీ అయిపోయిన తర్వాత నా పౌరహక్కుల కార్యాచరణ ముఖ్యంగా తార్కుండే కమిటీ, భార్గవా కమిషన్‌ల చుట్టూనే తిరిగింది. పౌరహక్కుల సంఘాన్ని పునర్నిర్మించే ప్రయత్నం ఒక పక్క జరుగు తున్నప్పటికీ, అందులో కూడ నాకు కొంత పాత్ర ఉన్నప్పటికీ, నా సమయం ఎక్కువ భాగం ఎన్‌కౌంటర్ల నిజనిర్ధారణకు, విచారణకు ఖర్చయింది. ఆ రోజుల గురించి మరొక చోట వివరంగానే చెప్పాను.

ఎమర్జెన్సీ ఎత్తివేసి, ఎన్నికలు జరిపిన తర్వాత, కేంద్రంలో జనతా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశమంతా ప్రజాస్వామ్య ఆందోళనలు, అభిప్రాయాలు, నిర్మాణాలు విస్తృతంగా వెల్లువలా వచ్చాయి.

ఆ వెల్లువలో భాగంగానే ఆంధ్ర ప్రదేశ్ పౌరహక్కుల సంఘం మహాసభలను వరంగల్‌లో జరపాలని నిర్ణయించాం. ఆ సభలు 1978 ఏప్రిల్ లో జరిగాయి. ఆ సభలలో ప్రారంభోపన్యాసం ఇవ్వడానికి సుప్రీం కోర్టులో న్యాయవాది, ఢిల్లీలో పౌర, ప్రజాస్వామిక హక్కుల ఉద్యమంలో పని చేస్తున్న గోబింద ముఖోటీతో పాటు ఉండడం,

ఆయన ఇతరులతో మాట్లాడ దలచు కున్నప్పుడు దుబాషిగా ఉండడం మినహా నాకు పెద్ద పని లేదు.

వరంగల్ వెళ్ళి ఏదో హోటల్‌లో దిగాం. గోబింద ముఖోటీతో కలిసి ఉన్నాను.

అప్పటికి 1974లో శ్రీశ్రీ అధ్యక్షుడుగా, పత్తిపాటి వెంకటేశ్వర్లు ప్రధాన కార్యదర్శిగా ఏర్పడిన పౌర హక్కుల సంఘం ఎమర్జెన్సీ వల్ల పని చేయడం మానివేసింది. ఎమర్జెన్సీలో ఒక వైపు పెద్ద ఎత్తున పౌరహక్కుల అణచివేత జరగగా, పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు ఎమర్జెన్సీని సమర్థించడం కాస్త ఇబ్బందికరంగా ఉండింది.

ఆ పరిస్థితులలో పునర్నిర్మాణమవుతున్న పౌరహక్కుల సంఘానికి కొత్త అధ్యక్షుడు ఎవరనే ప్రశ్న తలెత్తింది. హైదరాబాదుకు చెందిన ప్రముఖ వైద్యుడు, ఎంతోకాలంగా పౌరహక్కుల ఉద్యమం లోనూ, వామపక్ష ఉద్యమాలలోనూ పనిచేస్తున్న డా॥ రాజ గోపాలన్‌ను పౌరహక్కుల సంఘానికి అధ్యక్షుడిగా ఎన్నుకోబోతున్నారని అక్కడక్కడ వినిపిస్తోంది.

మరి ఏం జరిగిందో ఏమో తెలియదు వరంగల్ మహాసభల్లో డా॥ రాజగోపాలన్ అభ్యర్థిత్వం పక్కకు పోయింది. ఒక్కొక్కసారి డా॥ రాజగోపాలన్ చాల తీవ్రంగా మాట్లాడతారు. అందువల్ల ఆయన పౌరహక్కుల దృక్పథంలో ఇమడగలుగుతారా లేదా అని సందేహం వచ్చి ఉంటుంది.

ఆ సభలు వరంగల్‌లో ఆకారపు నరసింగం దేవాలయ ప్రాంగణంలో వనభోజనాల కోసం ఒక షెడ్డుండేది. దాంట్లో జరిగాయి. నాకింకా బాగా గుర్తుంది. అక్కడ మధ్యాహ్న భోజనాలు అవుతుండగా హఠాత్తుగా నేను పౌరహక్కుల సంఘం అధ్యక్షుడిగా ఉండాలనే ప్రతిపాదన వచ్చింది.

భయంకరమైన ఎండ మాడ్చేస్తోంది. కాశీపతి నా దగ్గరకొచ్చి, 'ఒక రెండు సంవత్సరాలయినా, ఒక్క టర్మ్ అయినా మీరు అధ్యక్షులుగా ఉండాలి' అని బతిమిలాడాడు. ఆ ప్రతిపాదన వెనుక డా.రామనాథం, వరవరరావు, రంగనాథం మొదలయిన వాళ్ళంతా జరుపుకున్న చర్చలు ఉన్నాయని నాకు ఆ తర్వాత తెలిసింది.

నాకు కొంత ఆశ్చర్యం కలిగింది. హఠాత్తుగా ఆ ప్రతిపాదన రావడంతో దిక్కు తోచలేదు. కొంచెం సంకోచం కూడా ఉండింది. కాని మిత్రులందరూ వచ్చి "ఈ సమయంలో మీరు ఉండడం అవసరం. రెండు సంవత్సరాలలో మీకు ఈ భారం తప్పిస్తాం. ఉండండి" అని ఒత్తిడి చేశారు.

సరేనని ఒప్పుకున్నాను.

అప్పటికే పత్తిపాటి వెంకటేశ్వర్లు కొంత వెనక్కి తగ్గడమో, ఏం జరిగిందో గాని ప్రధాన కార్యదర్శి పదవికి కొత్తగా బి. ప్రదీప్ పేరు వచ్చింది. నిజానికి అప్పటికి ప్రదీప్‌కు ఉన్న పేరంతా పిడిఎస్‌యు నాయకుడుగానే.

కాని అసలు పౌరహక్కుల సంఘం పుట్టుకనుంచీ కూడ నక్సలైట్ల పౌరహక్కుల

గురించి మరెవరూ మాట్లాడడం లేదు గనుక అదే తమపని అనుకోవడంతో రాష్ట్రంలోని నక్సలైటు పార్టీల, గ్రూపుల ప్రతినిధులందరూ అందులో చేరారు. అందువల్ల ఆయా విప్లవ సంస్థలే తమ తమ ప్రతినిధులను సంస్థలో కార్యనిర్వాహక స్థానాలకు ప్రతిపాదించేవి. సాధారణంగా అధ్యక్ష పదివికి అందరికీ ఆమోదయోగ్యుడైన వ్యక్తిని పరిగణించే వారు. అన్ని కార్య నిర్వాహక పదవులూ ఏకాభిప్రాయంతోనే జరిగేవి.

సరే, అట్లా 1978లో రెండు సంవత్సరాల కొరకు మాత్రమే అని పౌరహక్కుల సంఘం అధ్యక్ష పదవిలోకి వచ్చిన నేను పదిహేను సంవత్సరాలు ఆ పదవిలో కొనసాగవలసి వచ్చింది.

మొదటి రెండు సంవత్సరాలు జరగగానే మళ్ళీ మహాసభలు వచ్చాయి. హైదరాబాదులో సారస్వత పరిషత్ హాలులో 1980లో జరిగాయి. అందరూ వచ్చి నన్ను మరో రెండు సంవత్సరాలు కొనసాగమని అడిగారు. అంటే నేను అధ్యక్షుడిగా బాగా పనిచేశానని వాళ్ళందరి దగ్గర సర్టిఫికెట్ దొరికిందన్న మాట.

అప్పుడు చంద్ర పుల్లారెడ్డి కూడ నన్ను కలిశారు. అధ్యక్షుడిగా మరో రెండు సంవత్సరాలు కొనసాగమని విజ్ఞప్తి చేశారు. "మీరు ఆంధ్ర ప్రదేశ్ పౌరహక్కుల సంఘం ప్రతిష్ఠ చాలా పెంచారు. దాన్ని దేశ రాజకీయ చిత్రపటంలో గుర్తించదగిన సంస్థగా మార్చారు. అందువల్ల మీరు మరొక రెండు సంవత్సరాలు ఉంటే బాగుంటుంది" అని ఆయన అన్నారు.

నాతోనేమో ఇట్లా మాట్లాడి నన్ను ఒప్పించారు. నన్ను అన్ని విప్లవ సంస్థలూ ఉమ్మడి అభ్యర్థిగా భావిస్తున్నాయని నాకు అనిపించేలా చేశారు. కాని ఆయా విప్లవ సంస్థల తగాదాల్లో మాత్రం ఆయన నన్ను మరొక విప్లవ సంస్థ మనిషిగా ముద్రవేశారని తెలిసింది.

"మీ వాడిని అధ్యక్ష పదవిలో కొనసాగిస్తున్నాం కాబట్టి, మాకు ఉపాధ్యక్ష పదవి ఉండాలి" అని ఆయన పీపుల్స్ వార్‌తో వాదించారట. నాకు ఎప్పుడూ ఏ గ్రూపుతోనూ సంబంధం లేకపోయినా, ఈ వ్యవహారం వల్ల నేను పీపుల్స్ వార్ మనిషిననే పేరు వచ్చింది.

ఈ తగాదా ఎట్లా ఉన్నప్పటికీ, పౌరహక్కుల సంఘాన్ని ఈ విప్లవ పార్టీల పట్టు నుంచి విడిపించాలని నేను గట్టిగా ప్రయత్నించాను. పౌర హక్కుల పట్ల నా దృక్పథం ఎటువంటిదో ఇదివరకే చెప్పాను. పౌర హక్కులు ఎవరికి అనే ప్రశ్న కన్న పౌరహక్కులు ఎందుకు అనే ప్రశ్నే నాకు ముఖ్యమైనది.

ఆ ప్రయత్నాలలో భాగంగా పౌరహక్కుల సంఘం నుంచి వరవరరావు, ప్రదీప్ లాంటి వాళ్ళు తప్పుకోవాలని నేను సూచించాను. పౌరహక్కుల ఉద్యమ నిర్మాణంలో, విస్తరణలో వాళ్ళు చాలా కృషి చేసిన మాట నిజమే. కాని వాళ్ళకు ఇతరంగా ఉన్న పేరు ప్రఖ్యాతుల వల్ల పౌరహక్కుల సంఘం నక్సలైట్ల సంస్థ అని, నక్సలైట్ల హక్కుల కోసమే

పని చేస్తుందని అపోహలు వచ్చే ప్రమాదం ఉంది.

నాకింకా గుర్తు ఉంది. ఒకసారి డా. రామనాథం గారింట్లో వరవరరావుతో నేనీ విషయం మాట్లాడాను. పౌరహక్కుల సంఘంలో బాధ్యతాయుత స్థానాల్లో నక్సలైటు పార్టీలతో సంబంధం ఉండేవారు ఉండగూడదని, పౌరహక్కుల సంఘం స్వతంత్ర సంస్థగా మారాలనీ నేను సూచించాను.

ఆ పని నేను మా మూడో టర్మ్ నాటికి చేయగలిగాను. 1983లో ఖమ్మంలో పౌరహక్కుల సంఘం సభ జరిగే నాటికి అందులోకి చాలా మంది ఏ విప్లవ పార్టీతోనూ సంబంధం లేని, ప్రజాస్వామిక హక్కుల పట్ల అవగాహన కలిగిన వారు వచ్చారు. అది స్వతంత్ర సంస్థగా చాలా వరకు పనిచేయ గలిగింది.

పౌరహక్కుల సంఘం కేవలం నక్సలైట్ల కోసం మాత్రమే పని చేయగూడదని, మొత్తంగా సమాజంలో అణచివేతకు గురవుతున్న అన్ని వర్గాల ప్రజల హక్కుల కోసం పనిచేయాలని, అందుకొరకు అది స్వతంత్ర సంస్థగా ఉండాలని నా అభిప్రాయం.

ఖమ్మంలో 1983లో జరిగిన సభల్లో డా.కె.బాలగోపాల్ పౌరహక్కుల సంఘానికి ప్రధాన కార్యదర్శి అయ్యాడు. నేను మూడోసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యాను. మేమిద్దరం కలిసి సంఘాన్ని విస్తరించే కార్యక్రమం చేపట్టాం. అప్పటికీ విప్లవోద్యమంగాని, పౌరహక్కుల ఉద్యమం గాని ఎంతో మంది మంచి మేధావులను సృష్టించింది. వారందరూ పౌరహక్కుల సంఘాన్ని విస్తరించడానికి కృషి చేశారు.

ఇక్కడ ఒక మౌలికమైన విషయం ఉంది. పౌరహక్కుల సంఘం ఏర్పడినప్పుడు రాసుకున్న లక్ష్యాలు తీవ్రంగా రాజకీయ పరమయినవి. అందువల్ల ఒకసారి ఒక కమిటీ సమావేశంలో ఒక సమస్య తలెత్తింది.

నల్లగొండ నుంచి గురవా రెడ్డి అని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉండేవారు. నేను మొదటి టర్మ్ లేదా రెండో టర్మ్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు నల్లగొండలో ఒక సమావేశం జరుగుతోంది. అక్కడ గురవా రెడ్డి ఒక ప్రశ్న లేవనెత్తాడు.

ఒక లంచగొండితనం కేసులో పోలీసులు ఒక వ్యక్తిని కొట్టి చంపేశారు. ఆ వ్యక్తిని అరెస్టు చేసి చిత్రహింసలు పెడుతుంటే అతను ఓర్చుకోలేక కంట్రోల్ రూం మేడపైకి ఎక్కి కిందికి దూకి చనిపోయాడు. మా ఇంటి దగ్గర సెంట్రల్ డిటెక్టివ్ స్కూల్‌లో శిక్షణ కోసం వచ్చిన ఒక ఇనస్పెక్టర్ నా దగ్గరికి వచ్చి ఆ కేసు చెప్పినాడు. చనిపోయిన వ్యక్తి ఒక కానిస్టేబుల్ కొడుకు. ఆ కానిస్టేబుల్ ఈ ఇనస్పెక్టర్ దగ్గర పనిచేస్తున్నాడు. అప్పటికీ నాకు కాస్త పేరు వచ్చింది గనుక ఆ ఇనస్పెక్టర్ నా దగ్గరికి వచ్చి ఆ కేసు నేను తీసుకోవాలని అడిగాడు. నేను సరేనన్నాను.

ఆ కేసును నేను సిపిఐ నాయకులకు పంపించాను. "చనిపోయిన వాడు దొంగ కదా. మనం ఈ కేసు ఎట్లా తీసుకుంటాం?" అని వాళ్ళన్నారు. కమ్యూనిస్టులు

సాధారణంగా అట్లాగే మాట్లాడతారు.

ఇక నేనే పిటిషన్ వేశాను. అది వెంకట రామశాస్త్రి అని చాలా ఉదారవాద భావాలుండే న్యాయమూర్తి దగ్గరికి వచ్చింది.

"అట్లా ఎట్లా పడితే అట్లా మనుషుల్ని చంపడానికి పోలీసులకు అధికారం ఎక్కడి నుంచి వచ్చింది? ఇదేనా విచారణా పద్ధతి అంటే?" అని కోప్పడి నోటీసులు ఇచ్చాడు.

ఈ వ్యవహారమంతా జరిగిన తర్వాత మా నల్లగొండ సమావేశం. అక్కడ గురవా రెడ్డి కూడ "అట్లాంటి దొంగల కేసులను పౌరహక్కుల సంఘం తీసుకుంటే ఎట్లా?" అని ప్రశ్నించినాడు.

'మీకూ సిపిఐ వాళ్ళకూ ఏమీ తేడా లేనట్టుందయా. రుజువు కాకముందే వాడు దొంగ అని నువ్వెట్లా చెపుతావు? విచారణ అంతా అయి రుజువు అయినాక కదా దొంగ అని అనవలసింది. అయినా దొంగ అయితే కొట్టవచ్చునా? ఎవరినీ కొట్టి చంపడానికి వీలు·లేదు. చట్ట ప్రకారం విచారణ జరపవలసిందే' అని నేను వాదించాను.

కాని నా వాదన అంగీకరించడానికి చాలమంది సిద్ధంగా లేరు.

సరే, ఆ కేసు ఏమయిందనేది అంత ముఖ్యం కాదు గాని ఆ సంఘటన వల్ల నాకొక విషయం తెలిసి వచ్చింది.

'ఈ సంఘం, పౌరహక్కుల ఉద్యమం ఆరోగ్యకరమైన పునాదుల మీద లేదు. కేవలం తమ వాళ్ళ హక్కుల కోసం పోరాడడానికి ఇది ఉందని కొందరు అనుకుంటున్నారు?' అని నాకు అర్థమయింది.

నల్లగొండలో రాఘవ రంగారావు గారు ఉండేవారు. ఆయన ఇంకా మొండి మనిషి, ఆయనతో వాదించడమే సాధ్యం కాదు. కాకపోతే ఆయన వకీలు గనుక నా వాదనను ఆయన వ్యతిరేకించలేదు. రుజువు కాకుండా దొంగ అని ఎట్లా అంటాం అని ఆయన కూడా అన్నాడు.

బాలగోపాల్ కూడ తొలిరోజుల్లో చాల మొండిగా ఉండేవాడు. ఆయనకు కూడ ఈ అభిప్రాయాలు క్రమక్రంగా అభివృద్ధి చెందాయి గాని మొదట పౌరహక్కుల ఉద్యమ విస్తృతి గురించి ఇప్పుడున్న లాంటి ఆలోచనలు లేవు.

ఒకరకంగా ఈ చర్చ విస్తృతం కావడానికి కారణమైనది డా.రామనాథం హత్య.

పౌరహక్కుల భావనను విశాలంగా అర్థం చేసుకోవాలనే ఆలోచనకూ, పౌరహక్కుల ఉద్యమమంటే కేవలం విప్లవకారుల హక్కుల గురించి మాత్రమే మాట్లాడడం కాదనే ఆలోచనకూ డా.రామనాథం హత్య తర్వాత బలం చేకూరింది.

డా. రామనాథం నాకూ, మా కుటుంబానికీ చాలా సన్నిహితుడు. నేను పౌరహక్కుల ఉద్యమంలో ప్రవేశించనప్పటి నుంచీ ఆయనతో పరిచయం ఉంది. అది ఆ తర్వాత స్నేహంగా మారింది. నేను వరంగల్ మహాసభల్లో అధ్యక్షుడినయిన తర్వాత ఆయన

రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగానో, ఉపాధ్యక్షుడిగానో తరచుగా కలుస్తుండే వాడు.

ఆయనను పోలీసులు కాల్చి చంపిన ఘటన చాలా దురదృష్టకర మైనది. అది జరిగి ఇరవై సంవత్సరాలు గడిచిపోయినా ఆ నేరస్తులను గుర్తించడం గాని, విచారించడం గాని, శిక్షించడం గాని జరగలేదు.

డా. రామనాథం గారిని పోలీసులు కాల్చి చంపిన సంఘటన గురించి వివరంగా తెలుసుకోవాలి. వరంగల్ జిల్లాలో మొదటి నుంచీ నక్సలైటు ఉద్యమం బలంగా ఉంది. ఆ ఉద్యమాన్ని అణచడానికనే పేరుతో ఉద్యమకారుల మీద నిర్బంధకాండ కూడా మొదటి నుంచీ సాగుతోంది. ఆ క్రమంలో సాధారణ ప్రజానీకంపై కూడ అణచివేత సాగుతోంది. అటు ఉద్యమకారుల మీద నిర్బంధాన్నీ, ఇటు మామూలు ప్రజల మీద నిర్బంధాన్నీ ఖండించడంలో, పౌరహక్కుల చైతన్యాన్ని ప్రచారం చేయడంలో వరంగల్ జిల్లా పౌరహక్కుల సంఘం శాఖ చాల బాగా పని చేసింది.

డా. రామనాథం నాయకుడుగా పౌరహక్కుల సంఘం పౌరహక్కుల భావనను ఎట్లా విశాలం చేసిందో చెప్పడానికి రెండు ఉదాహరణలిస్తాను. కృష్ణా జిల్లా దివిసీమలో 1977లో ఉప్పెన వచ్చి వందలాది మంది చనిపోయినప్పుడు డా. రామనాథం, జిల్లా నుంచి పౌరహక్కుల కార్యకర్తలను, రచయితలను తీసుకుని అక్కడికి వెళ్ళి సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నాడు. ప్రకృతి వైపరీత్యానికీ, ప్రభుత్వ నిర్లక్ష్యానికీ బలి అయిన ప్రజలకు సహాయం అందించడం పౌరహక్కుల పరిరక్షణ కృషిలో భాగమేనని ఆయన అనుకున్నాడు.

అట్లాగే 1980ల మొదట్లో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ వైద్యులు సమ్మె చేసినప్పుడు, వరంగల్‌లో మహాత్మా గాంధీ మెమోరియల్ ఆస్పత్రి మూత పడింది. నిరుపేద రోగులు నాన ఇబ్బందులు పడ్డారు. డా. రామనాథం ఒకవైపు ప్రభుత్వ వైద్యుల న్యాయమైన సమ్మెను సమర్థిస్తూనే, ఆస్పత్రి గేటు ముందే వైద్య సహాయ శిబిరం ఏర్పాటు చేశాడు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సమ్మె చేస్తున్న వైద్యులను సమర్థించడం, ఆ వైద్యుల సమ్మె వల్ల ఇబ్బందులు పడుతున్న రోగులను ఆదుకోవడం ఏకకాలంలో జరగాలని ఆయన అనుకున్నాడు.

పిల్లల వైద్యుడుగా ఆయన వరంగల్ జిల్లా అంతటా పేరు ప్రఖ్యాతులు పొందాడు. మంచిమనిషిగా పేరు తెచ్చుకున్నాడు. 1980ల తర్వాత, మరీ ముఖ్యంగా 1984లో ఎన్‌టి రామారావు బర్తరఫ్‌కు గురయి, మధ్యంతర ఎన్నికలలో తిరిగి గెలిచిన తర్వాత రాష్ట్రవ్యాప్తం గానూ, ప్రత్యేకించి వరంగల్ జిల్లాలోనూ పోలీసు నిర్బంధం విపరీతంగా పెరిగిపోయింది. ప్రతి రోజూ అరెస్టులు, చిత్రహింసలు ప్రారంభమయ్యాయి. ఎన్‌కౌంటర్ హత్యలు కూడ పెరగడం ప్రారంభమయింది. ఉద్యమకారులను లాకప్‌లో కొట్టి చంపడం, అదృశ్యం చెయ్యడం కూడ మొదలయింది. ఈ నిర్బంధకాండ డా. రామనాథంను పౌరహక్కుల నాయకుడిగానే కాక, మనిషిగా కూడా లోతుగా కదిల్చి ఉండాలి.

అప్పటికి ఒకటిన్నర సంవత్సరం ముందే పౌరహక్కుల సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయిన బాలగోపాల్ కూడా వరంగల్‌లో ఉండేవాడు. ఇక డా. రామనాథం, బాలగోపాల్ కలిసి వరంగల్‌లో తమ చుట్టూ విచ్చలవిడిగా జరుగుతున్న పౌరహక్కుల ఉల్లంఘనను ఎదిరించ దలచుకున్నారు. ప్రచారం చేయడం మొదలు పెట్టారు. సహజంగానే జిల్లా పోలీసు యంత్రాంగానికి ఇది కంటగింపయింది.

డా. రామనాథంను పోలీసులు కాల్చి చంపిన ఘటన 1985 సెప్టెంబర్ 3న జరిగింది గాని ఆయన మీద కోపం పోలీసు యంత్రాంగంలో అంతకు ఎన్నోఏళ్ళ ముందు నుంచీ పేరుకుంటూ ఉంది. నాకు తెలిసినంత వరకు ఆయనను మొదటిసారి 1985 జనవరి 18న పోలీసులు ఒక తప్పుడు కేసులో ఇరికించి అరెస్టు చేశారు.

నిజానికి ఈ నిర్బంధకాండ 1984లోనే ప్రారంభ మయిందనాలి. కాని పౌరహక్కుల సంఘానికీ, డా. రామనాథానికీ సంబంధించినంత వరకు 1984 డిసెంబర్‌లో కాజీపేట పోలీసు నిర్బంధం నుంచి మాయం చెయ్యబడిన కొడవటి సుదర్శన్ గురించి ఆందోళనతో ఇది మొదలయింది.

కాజీపేటలో రైల్వే గ్యాంగ్ లేబరర్‌గా పనిచేస్తుండిన, కడిపికొండ గ్రామానికి చెందిన యువకుడు కొడవటి సుదర్శన్‌ను కాజీపేట సబ్ ఇన్స్‌పెక్టర్ యాదగిరి రెడ్డి 1984 డిసెంబర్ 18న కాజీపేట సమీపంలోని సోమిడి గ్రామంలో పట్టుకుపోయాడు. ఆ తర్వాత ఆ యువకుడు ఏమయ్యాడో ఎవరికీ తెలియదు. పోలీసులు అతణ్ని కొట్టి చంపేశారని, మృతదేహాన్ని తామే మాయం చేశారని అప్పటి పత్రికల్లో వార్తలు వచ్చాయి. ఆయనను పోలీసులు పట్టుకు పోతుండగా చూసిన ప్రత్యక్ష సాక్షులు, చివరిసారి ఆయన అద్దెకు తీసుకుపోయిన సైకిల్‌ను పోలీసుల ద్వారా తిరిగి సంపాదించుకున్న సైకిల్ టాక్సీ యజమాని పత్రికల వారికి వాంగ్మూలాలిచ్చాడు. వీరిలో కొందరు వరంగల్ ఆర్‌డిఓ జరిపిన విచారణలోను, ఆ తర్వాత ప్రభుత్వం నియమించిన న్యాయవిచారణ కమిషన్ జస్టిస్ టిఎల్ఎన్ రెడ్డి కమిషన్ ముందు కూడా తమ వాంగ్మూలాలిచ్చారు.

లాటిన్ అమెరికా సైనిక పాలనలో జరిగినట్టుగా జరిగిన ఈ యువకుడి అదృశ్యం ఘటన అప్పట్లో చాలా ఆందోళనకు దారి తీసింది. జాతీయ స్థాయిలో కూడ దానిమీద చాలా చర్చ జరిగింది. ఇలస్ట్రేటెడ్ వీక్లీలో క్లాడ్ అల్వారెస్ రాశాడు.

సరే, కొడవటి సుదర్శన్ అదృశ్యం సంఘటనకు నిరసనగా రాడికల్ విద్యార్థి యువజన సంఘాలు 1985 జనవరి 18న వరంగల్ బంద్‌కు పిలుపు ఇచ్చాయి. ఆ రోజు ఉదయాన్నే హనుమకొండ పోలీసులు వరవరరావును అరెస్టు చేసి, బట్టలు వేసుకోవడానికి కూడా వ్యవధి ఇవ్వకుండా లుంగీ, బనీను మీద హనుమకొండ చౌరస్తా నుంచి పోలీసు స్టేషన్ దాకా నడిపించుకు పోయారు. అది అరెస్టు అని మాట వరసకు అనడమే గాని అప్పటికి వారంట్ లేదు, ఎఫ్ఐఆర్ లేదు. ప్రాథమిక నేరం అభియోగం కూడా లేదు. అందువల్ల

అది అక్రమ నిర్బంధమే అనాలి.

తన భర్తను అట్లా అక్రమంగా నిర్బంధించారని వరవరరావు భార్య హేమలత జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. ఆమె ఈ విషయమై జిల్లా కలెక్టర్ ఆర్పీ సింగ్‌కు మధ్యాహ్నం 12 కు ఫిర్యాదు ఇవ్వగా, అయన ఎస్‌పి దగ్గరకు వెళ్ళమని సూచించాడు.

అప్పుడు డా. రామనాథం, కాకతీయ విశ్వవిద్యాలయంలో లెక్చరర్‌గా పనిచేస్తూ పౌరహక్కుల సంఘం కార్యకర్తగా ఉండిన కె. సీతారామారావు ఎస్‌పి దగ్గరికి వెళ్ళారు. అప్పుడు వరంగల్ ఎస్‌పి ఇప్పుడు అడిషనల్ డిజిపిగా ఉన్న కె. అరవిందరావు. ఆయన ఆ ఇద్దరు పౌరహక్కుల సంఘం బాధ్యులతో చాలా దురుసుగా మాట్లాడాడు. వాళ్ళిద్దరినీ తన కార్యాలయ ఆవరణలోనే అరెస్టు చేయించాడు.

నిజానికి వాళ్ళిద్దరూ ఎస్‌పిని కలవడానికి ముందే వాళ్ళూ, వరవరరావు, మరికొందరు కలిసి నేరం చేయబోతున్నారని తెలిసిందని, ఆ నేరాన్ని నిరోధించేందుకు సెక్షన్ 151 సిఆర్‌పిసి కింద వాళ్ళను అరెస్టు చేశామని ఎస్‌పి పత్రికా సమావేశంలో చెప్పాడు.

అరవిందరావు చేసిన ఈ అవకతవకలన్నీ, ఈ చట్ట వ్యతిరేక ప్రవర్తనంతా ఇలస్ట్రేటెడ్ వీక్లీతో సహా అప్పటి పత్రికలన్నిటి లోనూ వచ్చింది. అప్పటి నిర్బంధకాండ మీద పౌరహక్కుల సంఘం తరఫున బాలగోపాల్ లోకాయుక్తకు కూడా ఫిర్యాదు చేశాడు. అదే అరవిందరావు మీద అదే లోకాయుక్త ముందు అవే ఆరోపణలతో, చట్టం పట్ల లక్ష్యం లేకుండా ప్రవర్తిస్తున్నారనే అభియోగంతో ఇప్పుడు చలసాని ప్రసాద్ ఒక ఫిర్యాదు చేయగా ఇప్పుడది విచారణలో ఉంది. అంటే 1985కూ 2005కూ పోలీసు అధికారుల చట్టవ్యతిరేక ప్రవర్తనలో మార్పేమీ రాలేదన్న మాట.

సరే, డా. రామనాథం మీద అట్లా మొదటి అబద్ధపు కేసు పెట్టబడింది. ఆయన కొన్నాళ్ళపాటు జైలులో ఉండవలసి వచ్చింది. ఆ తర్వాత వారం తిరగకుండానే బాలగోపాల్ మీద కూడా అబద్ధపు కేసు బనాయించి జైల్లో తోసి ఏకాంతవాసంలో ఉంచారు.

ఒకవైపు వరంగల్‌లో ఈ దమనకాండ జరుగుతుండగానే జనవరి 12న కరీంనగర్ జిల్లా జగిత్యాలలో పౌరహక్కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోపి రాజన్నను ఆర్ఎస్ఎస్, ఎబివిపి సంస్థలకు చెందినవారు చంపేశారు. అప్పుడు నేను, బాలగోపాల్, కోదండరామ రెడ్డి సిరిసిల్ల తాలూకాలో గ్రామాలపై పోలీసుల దాడులను గురించి నిజనిర్ధారణలో ఉన్నాం. అప్పుడు మాకు గోపి రాజన్న హత్య వార్త తెలిసింది. పౌరహక్కుల సంఘం కార్యకర్తగా పని చేసినందుకు చంపబడిన మొదటి వ్యక్తి గోపి రాజన్న. అప్పటి నుంచి అజం అలీ దాకా అరుగురు పౌరహక్కుల కార్యకర్తలు హత్యకు గురయ్యారు.

అందుకే పౌరహక్కుల సంఘం నాయకుడు, నల్లగొండలో సీనియర్ న్యాయవాదిగా ఉండిన రాఘవ రంగారావు మరణించి నప్పుడు నేను 'పౌరహక్కుల కార్యకర్త సహజ మరణం' అని రాశాను. ఈ రాష్ట్రంలో సహజ మరణం పొందిన మొదటి పౌరహక్కుల కార్యకర్త ఆయనే అని వ్యంగ్యంగా రాశాను.

సరే, మళ్లీ డా. రామనాథం దగ్గరికి వెళ్దాం. కొడవటి సుదర్శన్ అదృశ్యం సందర్భంగా జరిపిన ఆందోళనలో మొదటిసారి డా. రామనాథం మీద వరంగల్ పోలీసులు కేసు పెట్టారు. అప్పటి నుంచీ వరంగల్ పోలీసులు చంపదలచుకున్న వ్యక్తుల జాబితాలో వరవరరావు, బాలగోపాల్ లతో పాటు రామనాథం పేరు కూడా చేరింది. ఇక ఒక సాకు కోసం వెతకడం మాత్రమే మిగిలింది.

ఆ సాకు 1985 సెప్టెంబర్ 2న కాజీపేట ఎస్ఐ ని నక్సలైట్లు కాల్చి చంపడంతో దొరికింది. కాజీపేట ఎస్ఐ యాదగిరి రెడ్డి గురించి ఇదివరకే ప్రస్తావించాను. కొడవటి సుదర్శన్ అదృశ్యం కేసులో ఆయన హస్తం ఉందని కనీసం మూడు చోట్ల విచారణల్లో బయట పడింది. డా. రామనాథం హత్యపైన ఇలస్ట్రేటెడ్ వీక్లీలో స్మితు కొఠారి రాసిన వార్తా కథనంలో "అనేక సందర్భాలలో, స్వతంత్ర పరిశోధనా నివేదికలు, యాదగిరి రెడ్డికి అనేక పోలీసు కస్టడీ మరణాలతో సంబంధం ఉందని తేల్చాయి" అని రాశాడు.

యాదగిరి రెడ్డి హత్యను సమర్థించడానికి ఈ విషయం చెప్పడం లేదు. ఒక పోలీసు అధికారి చట్ట వ్యతిరేకంగా ప్రవర్తిస్తే అతనికి శత్రువులు ఏర్పడ గలిగే అవకాశం ఉందని చెప్పడానికి మాత్రమే. యాదగిరి రెడ్డి హత్య సమర్థనీయమేమీ కాదు. ఆ వెంటనే విడుదల చేసిన పత్రికా ప్రకటనలో, ఆంధ్ర ప్రదేశ్ పౌరహక్కుల సంఘం తరఫున మేము ఏమన్నామంటే "యాదగిరి రెడ్డి హత్యను గాని, ఏ వ్యక్తిగత ప్రతీకార చర్యను గాని పౌరహక్కుల సంఘం సమర్థించదు. కాని అటువంటి నేరాలన్నిటినీ కచ్చితంగా చట్టం నిర్దేశించిన పద్ధతిలో మాత్రమే విచారించాలని పౌర హక్కుల సంఘం దృఢంగా నమ్ముతుంది".

1985 సెప్టెంబర్ 2 సాయంత్రం కాజీపేట రైల్వే స్టేషన్‌లో యాదగిరి రెడ్డిని ఆరుగురు గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి చంపారు. ఆ మర్నాడు ఉదయం పోస్ట్‌మార్టం తర్వాత ఎంజిఎం ఆస్పత్రి నుంచి యాదగిరి రెడ్డి మృతదేహాన్ని ఆయన స్వగ్రామానికి తీసుకు పోతున్నారు.

ఆ ఊరేగింపుకు అప్పటి వరంగల్ డిఐజి జనక్‌రాజ్, అప్పటి వరంగల్ ఎస్‌పి అరవిందరావు నాయకత్వం వహించారు. ఆ ఊరేగింపులో యూనిఫాంలోను, మఫ్టీలోను దాదాపు 200 మంది పోలీసు అధికారులు, కానిస్టేబుళ్ళు ఉన్నారు. ఆ ఊరేగింపు మొదటి నుంచీ కూడా నక్సలైట్లను, విప్లవ రచయితలను, పౌరహక్కుల సంఘం నాయకులను చంపుతామని నినాదాలిస్తూ సాగింది. ప్రత్యేకించి బాలగోపాల్, వరవరరావు లను చంపుతామని ఆ ఊరేగింపులో పోలీసు అధికారులు నినాదాలు చేశారు.

ఒక నేరం జరగబోతుందని తెలిస్తే ఆపడానికి తగిన అధికారాలను మన చట్టాలు పోలీసులకు ఇచ్చాయి. కాని వరంగల్ రోడ్ల మీద ఆ రోజు 200 మంది పోలీసు అధికారులు అత్యున్నత అధికారుల ముందరనే హత్యలు చేస్తామని బహిరంగ ప్రకటనలు

చేస్తుంటే, నేరాన్ని ఆపడం అలా ఉంచండి, నేరం చేస్తామనే ప్రకటనలను కూడా ఆపని చట్టబద్ధ పాలన మనది.

ఆ ఊరేగింపు అట్లా బాలగోపాల్, వరవరరావుల పేర్లు తీసుకుంది గాని ఆ ఇద్దరి ఇళ్ళూ ఆ ఊరేగింపు మార్గంలో లేవు. ఉంటే ఏమాయి ఉండేదో సులభంగానే ఊహించవచ్చు.

డా. రామనాథం ఆస్పత్రి మాత్రం ఆ ఊరేగింపు మార్గంలోనే ఉంది. ఆయన ఇల్లు కూడ ఆ మార్గంలోనే ఉంది. ముందు రోజు నగరంలో ఎస్ఐ హత్య జరిగినందువల్ల పరిస్థితి ఉద్రిక్తంగా ఉందని, ఆరోజు ఆస్పత్రికి వెళ్ళ వద్దని రామనాథంకు మిత్రులు సూచించారట కూడా.

కాని ఆయన, "నేను డాక్టర్‌ను. కానిస్టేబుళ్ళ పిల్లలకు కూడా వైద్యం చేశాను. నన్ను ఎవరేం చేస్తారు?" అంటూ ఆస్పత్రికి వెళ్ళాడట.

సరిగ్గా ఆ పోలీసుల ఊరేగింపు ఆయన ఆస్పత్రి ముందుకు రాగానే ఆ ఊరేగింపులో నుంచి 20 మంది దాకా ఆస్పత్రిలోకి చొచ్చుకు పోయి, ఆ ఆస్పత్రి ముందు గదిలో ఉండే కాంపౌండర్లనూ, రోగులనూ తోసివేస్తూ, లోపలి గదిలోకి వెళ్ళి ఆయన మీద కాల్పులు జరిపారు. ఆయన లేని వెనుక తలుపు నుంచి బైటికి పరుగెత్తబోతూ ఆ తలుపు దగ్గర కూలిపోయి చనిపోయాడు. ఆ ఇరవైమంది తమ పని ముగించుకుని మళ్ళీ వెనక్కి తిరిగి వచ్చి ఊరేగింపులో కలిశారు. ఆ ఊరేగింపు యధావిధిగా సాగిపోయింది.

'చట్టం తన పని తాను చేసుకుపోతుంది' అనేమాట విన్నప్పుడల్లా నాకు నవ్వు వస్తుంది. రామనాథం గారి హత్య కేసులో చట్టం పని చట్టం చేసుకుపోలేదు. ఆ ఊరేగింపులో నుంచి వచ్చిన వాళ్ళు ఆ హత్య చేశారు. కాబట్టి ఆ ఊరేగింపులో పాల్గొన్న వాళ్ళమీద, దానికి నాయకత్వం వహించిన వాళ్ళ మీద కేసు పెట్టాలి. పోస్ట్‌మార్టం రిపోర్టు ప్రకారం రామనాథం శరీరం మీద రెండు తూటాల గాయాలున్నాయి. అవి రెండూ కూడ సర్వీస్ రివాల్వర్ బుల్లెట్ల వల్ల, అతి దగ్గరి నుంచి కాల్చడం వల్ల ఏర్పడినవే.

డా. రామనాథం హత్యను అప్పటి ప్రతిపక్షమైన కాంగ్రెసు సభ్యులు మాత్రమే కాదు, అధికార పక్షమైన తెలుగుదేశం శాసన సభ్యులు కూడా ఖండించారు. ఆ హత్యపై న్యాయ విచారణ జరిపించాలని శాసన సభా వేదిక మీద డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు న్యాయ విచారణకు తిరస్కరించాడు. సిఐడి పరిశోధన చాలునన్నాడు. సిఐడి పరిశోధన అంటే పోలీసులు తమ మీద తాము విచారణ జరుపుకోవడమే నని, అది సరిపోదని నేను హైదరాబాద్‌లోనూ, ఢిల్లీలోనూ ఏర్పాటు చేసిన పత్రికా సమావేశాలలో అన్నాను.

రాష్ట్రంలో పౌరహక్కుల ఉద్యమ చరిత్రలోనూ, ప్రజా ఉద్యమాల చరిత్రలోనూ డా.

రామనాథం హత్య ఒక ముఖ్యమైన మైలురాయి. ఒక ఎస్‌ఐ హత్య జరిగిన వెంటనే ప్రతీకారంగా ఒక పౌరహక్కుల నాయకుడిని చంపడం మాత్రమే కాదు, పౌరహక్కుల సంఘాన్ని నక్సలైట్ల ముసుగు సంస్థగా ప్రకటిస్తూ బదనాం చెయ్యడం కూడ ఎక్కువైపోయింది. హత్య జరిగిన తర్వాతనే, రాష్ట్రంలో ప్రజల తరఫున నిలబడి, ప్రజలకు రాజ్యాంగం హామీ ఇచ్చిన ప్రాథమిక హక్కులను, ప్రజాస్వామిక హక్కులను పరిరక్షించడానికి ప్రయత్నించిన వారినెవరినైనా చంపివేస్తామని పోలీసులు డా. రామనాథం హత్యతో ప్రకటించారు. ఇవో కుంటిసాకులు, అబద్ధపు ఆరోపణలు ఆ హత్యతో పాటే ప్రచారం చెయ్యడం కూడా అప్పటి నుంచే ప్రారంభించారు.

ఆ తర్వాత జరిగిన ఇద్దరు పౌరహక్కుల నాయకుల హత్యలు అట్లా ప్రతీకార హత్య అనే సాకుతో జరిగినవే. 1987 నవంబర్ 7న కరీంనగర్ జిల్లా పౌరహక్కుల సంఘం నాయకుడు జాపా లక్ష్మా రెడ్డిని అంతకుముందు జరిగిన డిఎస్‌పి బుచ్చిరెడ్డి హత్యను సాకుగా చూపుతూ హత్య చేశారు. అట్లాగే 1991 డిసెంబర్ 7న హనుమకొండలో వరంగల్ జిల్లా పౌరహక్కుల సంఘం నాయకుడు నర్రా ప్రభాకర రెడ్డి హత్యకు అంతకు ముందు జరిగిన కాంగ్రెస్ నాయకుడు హయగ్రీవాచారి హత్యను సాకుగా చూపారు.

జాపా లక్ష్మారెడ్డి, నర్రా ప్రభాకర రెడ్డి ఇద్దరూ కూడా ప్రజాజీవనంలో ప్రముఖ స్థానంలో ఉన్నవాళ్ళు. జాపా లక్ష్మారెడ్డి వృద్ధుడు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం రోజుల నుంచీ ప్రజా ఉద్యమాలలో ఉన్నవాడు. ఎమర్జెన్సీ తర్వాత కరీంనగర్ జిల్లాలో ప్రారంభమైన రైతాంగ పోరాటాలపై ప్రభుత్వాలు ఉక్కుపాదం మోపినప్పుడు జగిత్యాల, సిరిసిల్ల తాలూకాలను కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించి నప్పుడు లక్ష్మారెడ్డి పౌరహక్కుల ఉద్యమం లోకి వచ్చాడు. తమ న్యాయమైన హక్కుల కోసం పోరాడుతున్న రైతు కూలీల మీద రాజ్యహింస జరగ గూడదని ఎలుగెత్తి ఖండించాడు. ఆయన చేసిన నేరం అదే. తమ నిరంకుశ పాలనకు ఆయన అడ్డం వస్తున్నాడని జిల్లా పోలీసు యంత్రాంగం, జిల్లాలోని పెత్తందార్లు భావించారు. ఆయన అడ్డు తొలగించుకోవాలని ప్రయత్నాలు ప్రారంభించారు. అప్పటి పీపుల్స్‌వార్ కార్యకర్తలు పెద్దపల్లిలో పోలీసు అధికారి బుచ్చిరెడ్డిని చంపివేసిన కొన్ని గంటల్లోనే పోలీసులు కరీంనగర్ సమీపంలోని అలుగునూరులో తన ఇంట్లో నిద్రిస్తున్న లక్ష్మారెడ్డిని చంపేసి పోయారు. ఆ గుర్తు తెలియని అగంతకులెవరో రాజ్యం ఇప్పటికీ గుర్తించ లేకపోయింది!

ఇక నర్రా ప్రభాకర రెడ్డి ముప్పైలలో ఉండిన యువకుడు. తన గ్రామంలో పంచాయతీ సర్పంచ్‌గా ఉండేవాడు. జిల్లా న్యాయవాదుల సంఘానికి కార్యదర్శిగా ఉండేవాడు. 1985లో రామనాథం హత్య జరిగిన తర్వాత, బాలగోపాల్ వరంగల్‌లో ఉండలేని పరిస్థితి కల్పించాక, 1985-89 నిర్బంధకాలంలో వరంగల్ పౌరహక్కుల ఉద్యమ స్ఫూర్తి మలిగి పోకుండా కాపాడాడు. ప్రజల మీద జరుగుతున్న పోలీసు నిర్బంధాన్ని

ఖండిస్తూ వచ్చాడు. నిర్బంధానికి గురయిన వారికి న్యాయ సహాయం అందించాడు. 1989 ఎన్నికలలో చెన్నారెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత పోలీసు నిర్బంధం కొంత తగ్గినప్పటికీ, ఆరు నెలల పాటు ఎన్‌కౌంటర్లు జరగకుండా ఉన్నప్పటికీ, మొత్తం మీద వరంగల్ పౌరహక్కుల ఉద్యమంలో ప్రభాకర రెడ్డి చేసిన కృషి వల్ల ఆయన వరంగల్ పోలీసు యంత్రాంగానికి కంటిలో నలుసులా మారాడు. ఆయనను చంపేసేందుకు సాకు కోసం ఎదురు చూస్తున్న పోలీసులకు హయగ్రీవాచారి హత్యతో ఆ సాకు దొరికింది. నిజానికి హయగ్రీవాచారి అప్పటికే విస్మృతిలో పడిపోతున్న కాంగ్రెస్ నాయకుడు. ఆయనను హత్య చేసి పీపుల్స్ వార్ ఆయనకు లేనిపోని ఖ్యాతిని సంపాదించి పెట్టింది. ఆయనకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరగడానికి కారణమైంది. హయగ్రీవాచారి హత్య తర్వాత కొన్ని గంటల్లోనే మళ్ళీ గుర్తు తెలియని అగంతకులు ప్రభాకర్ రెడ్డి ఇంట్లోకి ప్రవేశించి ఆయనను కాల్చి చంపారు. ఆ అగంతకుల ఆచూకీని రాజ్యం ఇవాల్టి దాకా గుర్తించలేక పోయింది.

తమ విచ్చలవిడి నిరంకుశ పాలనకు, చట్ట వ్యతిరేక ప్రవర్తనకు అడ్డు చెపుతున్న పౌరహక్కుల నాయకులను భౌతికంగా నిర్మూలించడానికి పోలీసు అధికారులు తయారు చేసిన ఈ హత్యా పథకంపై మూడు సందర్భాలలోను పీపుల్స్ వార్ చేసిన హత్యలను సాకుగా చూపింది. కాని ఆ తర్వాత అటువంటి సాకుల అవసరం లేకుండానే, తమ చేతికి మట్టి అంటకుండానే, ఒక కిరాయి హంతక వ్యవస్థను తయారు చేసి, పౌరహక్కుల నాయకులను చంపించే పనికి పోలీసు యంత్రాంగం ఒడికట్టింది. అట్లా సర్కారీ ప్రోత్సాహక హంతక ముఠాలు పౌరహక్కుల సంఘం నాయకులు టి.పురుషోత్తంను, అజం అలీని చంపేశాయి.

మొత్తం మీద దీంట్లో గుర్తించ వలసిందేమంటే ఈ రాష్ట్రంలో పోలీసు యంత్రాంగం నక్సలైట్ల మీద, ప్రజా ఉద్యమకారుల మీద మాత్రమే కాక, నక్సలైట్ల పట్ల, ప్రజా ఉద్యమాల పట్ల సానుభూతి ఉన్నదని అనుమానం ఉన్న ప్రతి ఒక్కరినీ తమ నిర్బంధానికి లక్ష్యాలుగా చేసుకుంది. నిజానికి పౌరహక్కుల సంఘాన్ని ఖచ్చితంగా నక్సలైట్ల సానుభూతి పరుల సంస్థగా గుర్తించడానికి వీలులేదు. నక్సలైట్ల పౌరహక్కులు, ప్రజా ఉద్యమకారుల పౌరహక్కులు ఎక్కువగా ఉల్లంఘనకు గురయ్యాయి. కాబట్టి పౌరహక్కుల సంఘం వారి గురించి ఎక్కువగా మాట్లాడి ఉంటుంది. పౌరహక్కుల సంఘంలో ఆ విషయాలు ఆలోచించే వాళ్ళు ఎక్కువమంది సభ్యులయి ఉంటారు. కాని పౌరహక్కుల సంఘం ప్రధాన లక్ష్యం చట్ట బద్ధ పాలన, నక్సలైట్ల పట్ల నయినా, ఎవరిపట్ల నయినా సరే, ప్రభుత్వం చట్ట ప్రకారం నడుచు కోవాలని, రాజ్యాంగం నిర్దేశించిన ప్రాథమిక హక్కులను కొల్లగొట్ట గూడదని పౌరహక్కుల సంఘం వాదిస్తుంది. కాని మన ప్రభుత్వాలకు ప్రజల ప్రశ్నల నుంచి తప్పించు కోవడానికి ఏకైక మార్గం వారి మీదికి పోలీసులను ఉసిగొల్పడం. ఆ

క్రమంలో పోలీసులు రాజ్యాంగాన్నీ, ప్రాథమిక హక్కులనూ, చట్టబద్ధ పాలననూ ఎంతగా దుర్వినియోగం చేసినా, ఉల్లంఘించినా చూసీ చూడనట్టు ఉండడం, ఆమోదించడం పాలకులకు అలవాటయింది. ఈ పద్ధతిని ప్రశ్నించి నందుకే, ప్రశ్నిస్తున్నందుకే పౌరహక్కుల ఉద్యమం పాలకులకు కంటిలో నలుసులా మారింది.

అందుకే పౌరహక్కుల సంఘం సక్రమంగా పని చేయలేని స్థితి కల్పించారు. బహిరంగ సభలు, సమావేశాలు పెట్టుకోనివ్వలేదు. వరంగల్ లో సభ పెట్టుకుందామంటే ఆ సభా స్థలం చుట్టూ వందలాది సాయుధ పోలీసులు చేరి ఎవరూ రాకుండా భయ పెట్టేవారు. సభల కోసం హాలు తీసుకుంటే ఆహాలు యజమాని దగ్గరికి వెళ్ళి బెదిరించి హాలుకు తాళాలు వేయించేవారు. ఒకసారి వరంగల్ మొగిలయ్య హాలులో ఒక సభ ఏర్పాటు చేశాం. మేం అక్కడికి వెళ్ళే సరికి హాలుకు తాళాలు వేసి ఉన్నాయి. గేటు బయట వందలాది మంది సాయుధ పోలీసులు ఉన్నారు. ఒకసారి లక్సెట్టిపేటలో ఒక పాఠశాలలో సమావేశం ఏర్పాటు చేశాం. మేం అక్కడికి వెళ్ళే సరికి ఆ పాఠశాల యజమానులను బెదిరించి తాళాలు వేసి పెట్టారు.

అప్పుడు దినేష్ రెడ్డి అక్కడి పోలీసు అధికారి. మేం పాఠశాల ముందరికి వెళ్ళి తాళాలు వేసి ఉంటే "ఏం చేయాలిరా" అనుకుంటూ ఉంటే రాజన్న అనే స్థానిక న్యాయవాది ముందుకు వచ్చి మమ్మల్ని రైలు కట్ట దగ్గరికి తీసుకుపోయి అక్కడ షామియానా వేసి సభ ఏర్పాటు చేశాడు. ఆ ఎండలో, ఆరు బయట మేం సమావేశం జరుపుకున్నాం. బహిరంగ స్థలంలో మైకు వాడడానికి అనుమతి లేదని పోలీసులు వచ్చి మైకు తీసుకు పోయారు. ఇక మైకు లేకుండానే మాట్లాడుకున్నాం.

ఇవి చిన్న ఉదాహరణలు మాత్రమే. నాయకుల హత్యల దగ్గరి నుంచి, వాక్స్వాతంత్ర్యాలను అరికట్టడం దాకా పౌరహక్కుల ఉద్యమం మీద ఎన్ని రకాల దమన నీతి అమలయిందో చూపడానికి ఇవి సరిపోతాయి. అప్పుడప్పుడే విస్తరిస్తున్న ఒక సంఘంగా పౌరహక్కుల సంఘం తొలి రోజుల్లోనే ఈ నిర్బంధకాండ నంతా అనుభవించ వలసి వచ్చింది.

ఈ క్రమంలో పౌరహక్కుల సంఘం గుర్తించిన దేమంటే, ఈ దేశంలో ఈ రాష్ట్రంలో కేవలం నక్సలైట్ల, ప్రజా ఉద్యమకారుల, నక్సలైటు సానుభూతిపరుల హక్కులకు మాత్రమే కాదు, ప్రజలందరి హక్కులకూ భంగం వాటిల్లుతోంది. ఈ సమాజంలో ఎవరి హక్కులనూ గుర్తించి గౌరవించడానికి పోలీసులు, పాలకులు సిద్ధంగా లేరు.

అందువల్ల పౌరహక్కుల ఉద్యమ పరిధి నానాటికీ విస్తరిస్తూ పోయింది. కేవలం రాజ్య హింస మాత్రమే గాక, అదీ ఉద్యమకారుల మీద మాత్రమే గాక అన్ని వర్గాల మీద, అన్ని రూపాలలో కొనసాగుతున్న ఆధిపత్య హింసను వ్యతిరేకించాలనే ఆలోచన పెరుగుతూ వచ్చింది.

అయితే సంఘంగా పౌరహక్కుల సంఘం మీద ఒత్తిడి, నిర్బంధం ఎంత పెద్ద

ఎత్తున, ఎంత సుదీర్ఘకాలం, ఎంత భయంకరంగా అమలయ్యాయంటే ప్రధాన బాధ్యతలలోకి వ్యక్తులను నియమించడానికి, ఎన్నుకోవడానికి భయపడే పరిస్థితి వచ్చింది. ఆ బాధ్యతలలో ఎవరిని పెడితే వారి ప్రాణాలకు ముప్పు వస్తుందో అని సందేహించే స్థితి. అందువల్లనే నేను కేవలం ఒక టర్మ్‌కు, అంటే రెండేళ్ళు అధ్యక్షుడిగా ఉండడానికి ఒప్పుకుని ఆ పదవి తీసుకున్నవాణ్ని పదిహేనేళ్ళపాటు ఆ బాధ్యతలలో ఉండవలసి వచ్చింది.

పరిస్థితులు అట్లా దారుణంగా మారిపోతుంటే నేను బాధ్యతల నుంచి తప్పుకుని సంస్థను వదిలేయ దలచుకోలేదు. ఏమయినా కానీ, నేను ఈ బాధ్యతలను నెరవేర్చవలసిందే అనుకున్నాను. ఎప్పుడూ రాజీనామా చేయదలచు కోలేదు. ప్రతి మహాసభలోనూ నేనే అధ్యక్షుడిగా ఎన్నికవుతూ వచ్చాను.

అట్లా పదిహేను సంవత్సరాలు పని చేసి, కర్నూలు మహాసభలో, 1993లో నేను అధ్యక్ష పదవి నుంచి తప్పుకునే నాటికి, ఆంధ్ర ప్రదేశ్ పౌరహక్కుల సంఘం, రాష్ట్రంలోనూ దేశంలోనూ మాత్రమే కాదు, అంతర్జాతీయంగా కూడా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకుంది. సంస్థను ఆ స్థాయికి తీసుకు రావడంలో నా వంతు పాత్ర నిర్వహించాను.

సరిగ్గా అప్పటికే పౌరహక్కుల ఉద్యమం రాజ్యహింసను మాత్రమే ఖండించి ఊరుకోవాలా, ఇతర హింసా రూపాలను కూడా ఖండించాలా అనే చర్చ పౌరహక్కుల సంఘంలో మొదలయింది. అది ఇక్కడ మాత్రమే కాదు అంతర్జాతీయంగా కూడ సాగుతున్న చర్చ. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ లో కూడ ఆ చర్చ జరిగింది. టెర్రరిస్టుల హింసను ఖండిస్తారా లేదా అనే ప్రశ్న ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్‌ను కూడా అడగడం మొదలు పెట్టారు.

ఆ ప్రశ్నకు జవాబు చెప్పవలసిందే. ఆ ప్రశ్నకు జవాబు చెప్పడం కోసం పౌరహక్కుల సంఘం లోపల చాలా చర్చ జరిగింది. చాలా అంతర్మథనం జరిగింది. రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు ఈ చర్చకోసం ఒక్కొక్కసారి పది గంటలు, పన్నెండు గంటలు జరిగేవి. భోజన విరామం కోసం కూడ సభ్యులు ఎక్కువ సమయం తీసుకునే వారుకాదు. 1983 తర్వాత రెండు మూడు గంటల్లో ముగిసిపోయిన సమావేశాలు నాకు గుర్తు లేనే లేవు.

ఆ చర్చలు కూడా చాలా తీవ్రంగా జరిగేవి. తీవ్రమైన భిన్నాభిప్రాయాలుండేవి. చర్చల సమయంలో అటూ ఇటూ కూడ పరుషంగా మాట్లాడుకునే వాళ్ళం. కాని అంత తీవ్రమైన చర్చలు కూడ సభ్యుల మధ్య వైమనస్యానికి, శత్రుత్వానికి దారి తీయలేదు. చాలా ప్రజాస్వామిక చర్చ జరిగేది.

నాకేమనిపించేదంటే అక్కడ వెలువడే అభిప్రాయాలతో అంగీకారం ఉందా, అనంగీకారం ఉందా అనే దానికన్న ముఖ్యంగా పరిష్కరించ వలసిన ఒక సమస్య ఉంది. దాన్ని పరిష్కరించడానికి ఉన్న అన్ని కోణాలు ఇక్కడ చర్చించ బడుతున్నాయి. ఈ చర్చ జరగవలసిందే, ఏదో ఒక మార్గం కనిపెట్టవలసిందే అనిపించేది.

ఈ చర్చ జరుగుతుండగానే గుర్తేడులో పీపుల్స్ వార్ దళాలు కొందరు ఐఎఎస్ అధికారులను కిడ్నాప్ చేశాయి. అట్లా కిడ్నాప్ అయిన వారిలో ఎస్.ఆర్. శంకరన్ కూడా ఉన్నారు. అప్పుడు తారకం వచ్చారు. నేను ఆ కిడ్నాప్ సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వ కోరిక మీద రంపచోడవరం అడవుల్లోకి వెళ్ళాను. ఆ సమస్య పరిష్కారమై, ఐఎఎస్ అధికారులు విడుదల అయి నేను హైదరాబాదుకు తిరిగి రాగానే, ఆ సమస్యలో జోక్యం చేసుకోవడానికి మీరు ఎట్లా వెళ్ళారు అని ప్రశ్న వచ్చింది.

కోదండరాం, మల్లికార్జున్ ఇద్దరూ మా ఇంటికి వచ్చి నన్ను ప్రశ్నించారు. 'మీరా ప్రశ్నను రాష్ట్ర కార్యవర్గం ముందర పెట్టండి, నేను నా వివరణ ఇచ్చుకుంటాను' అని నేనన్నాను.

ఆ తర్వాత ఖమ్మంలో కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ విషయం మీద ఆరుగంటల పాటు చర్చ జరిగింది.

"నేను ఒక న్యాయవాదిని, ప్రజా జీవితంలో ఉన్నవాడిని. 1985 నుంచి ఈ గదిలోనే, ఇదే చోట, ఈ కుర్చీలోనే కూచుంటున్నాను. నేనిక్కడ దొరుకుతానని, నా దగ్గరికి వచ్చి మాట్లాడవచ్చునని అందరికీ తెలుసు. అటువంటప్పుడు, ఒక ముఖ్యమైన సంఘటన ఏదన్నా జరిగితే ఎవరయినా వచ్చి నన్ను అడుగుతారు. శంకరన్‌ను కిడ్నాప్ చేశారు గదా మీరేం చేస్తారు అని? నేనప్పుడు మా కార్యవర్గాన్ని సమావేశ పరిచాకగాని చెప్పలేను. మా కార్యవర్గం ఆమోదించిన పనే చేస్తాను అనే అవకాశం ఉంటుందా? ఆ అవకాశం ఉండదు. అప్పటికప్పుడు నేనే ఆలోచించి ఒక నిర్ణయం తీసుకోవలసి వస్తుంది. అది తప్పని మీరనుకుంటే ఆ తర్వాత జరిగే సమావేశంలో మీరు చర్చ పెట్టవచ్చు. ఇప్పుడు చర్చిస్తున్నారు గదా, అలా చర్చించవలసిందే. నేను తప్పు చేశానంటే మీరయినా నన్ను తొలగించవచ్చు. నేనయినా రాజీనామా చేయవచ్చు. కాని ఈ సంఘం తరఫున ఈ మనిషి దొరుకుతాడు, ఈ మనిషిని ప్రశ్నిద్దాం అని బయటి జనం వచ్చినప్పుడు, ఆ మనిషి ఏదో ఒక పని చేయక తప్పదు. అది ఉద్యమ ప్రయోజనాల కోసమే" అని నేనన్నాను.

ఈ చర్చ కర్నూలు మహాసభ నాటికి చాలా ముందుకు పోయింది. కర్నూలు మహాసభ జరిగింది 1993లో. నేను ముందే చెప్పినట్టు డా. రామనాథం హత్య జరిగిన నాటి నుంచీ ఈ విషయాలు పౌరహక్కుల సంఘం నాయకులలో, సభ్యులలో చర్చలో ఉన్నాయి. అంటే చర్చ 1986 నుంచి జరుగుతున్నదన్న మాట. గుర్తేడు కిడ్నాప్ (1987) తో ఈ చర్చ మరింత పెరిగింది. కర్నూలు మహాసభ నాటికి ఇది సభ్యుల మధ్య భిన్నాభిప్రాయాల బహిరంగ ప్రకటనగా మారింది.

పౌరహక్కుల సంఘం లాంటి సంస్థలో సభ్యులకు వేరు వేరు అభిప్రాయాలు ఉండవచ్చు. అభిప్రాయ భేదాలు ఉండవచ్చు. కాని ఒక చర్చనీయాంశం మీద సభ్యులు అటూ ఇటూగా వోటు వేయడం సరయినది కాదని నేననుకుంటాను. నేను అప్పుడే

పౌరహక్కుల సంఘం బాధ్యులకు కూడా చెప్పాను. ఒక చర్చనీయాంశం తీసుకువచ్చి మీరు ఇటు వోటు వేస్తారా, అటు వోటు వేస్తారా అని అడగడం తప్పు. ఆయా అభిప్రాయాలకు ప్రాతినిధ్యం వహించే వ్యక్తులు ఉండవచ్చు. ఆ వ్యక్తులను ఎన్నుకుంటారా అని అడగవచ్చు. కాని అభిప్రాయాలు వోట్లతో గెలిచేవీ కావు, ఓడిపోయేవీ కావు. అభిప్రాయాల మీద ఎప్పుడూ చర్చ జరుగుతూ ఉండవలసిందే. ఇంకా ఇంకా కొత్త సమాచారం, కొత్త వాదనలు వస్తూ ఉండవలసిందే. ఒకరోజు వోట్లతో తేల్చివేసి ఒక అభిప్రాయాన్ని రద్దు చేయలేము. అది నా అభిప్రాయం.

కాని బాలగోపాల్ మాత్రం 'అంశాల మీద కొట్లాడవలసిందే సార్. లేకపోతే సంస్థ లక్ష్యాలేమిటనేది తేలదు' అనేవాడు. ఆయనకు ఏ విషయం మీదనైనా చాల బలమైన అభిప్రాయాలుంటాయి. అంతేకాదు, ఆ అభిప్రాయాలు ఏర్పడడానికి ఎంతగానో ఆలోచించి ఉంటాడు. ఏ విషయమైనా పూర్వాపరాలు అన్నీ ఆలోచించి, అన్ని కోణాల నుంచీ ఆలోచించి నిర్ణయం తీసుకుంటాడని నేననుకుంటాను. ఆయన అంశాల మీద వోటింగ్ జరగవలసిందేనని అంటే నేను కూడా అంగీకరించాను.

మరి తర్వాతి మహాసభలోనే, గుంటూరులో ఆంధ్ర ప్రదేశ్ పౌరహక్కుల సంఘంలో చీలిక వచ్చింది. ఆ చీలిక చాలా దురదృష్ట కరమని నేననుకుంటాను. ఇవాళ్టికి కూడా నా అభిప్రాయం అదే. పౌరహక్కుల సంఘం చీలిపోవలసింది కాదు. పౌరహక్కుల ఉద్యమ రాజకీయాలలోకి పార్టీ రాజకీయాలు ప్రవేశించి ఉండవలసింది కాదు. పౌరహక్కుల ఉద్యమంలోకి చొరబడే హక్కు ఏ రాజకీయ పక్షానికీ లేదని నా అభిప్రాయం.

కర్నూలు, గుంటూరు మహాసభల వల్ల నేను విచారపడ్డానా అంటే విచారం కన్న ఎక్కువగా అది ఒక దురదృష్టకర పరిణామమని, అది పౌరహక్కుల ఉద్యమం వెనుకంజ వేయడానికి కారణమయిందని అనుకుంటాను. అక్కడ సంతోషమా విచారమా కాదు.

ఒక ఉద్యమం ఉంది. దాని లక్ష్యాల మేరకు అది పనిచేస్తూ పోతోంది. అది ఒక మేరకు విజయం కూడా సాధించింది. అది వర్ధిల్లాలా, చీలిపోయి బలహీనపడాలా అనేది ప్రశ్న. అప్పుడు సభ్యులు చీలిపోవాలనే నిర్ణయం తీసుకున్నారు. నేనేమంటానంటే, ఒక ఉద్యమాన్ని నిర్మించి, బలోపేతం చేసిన తర్వాత దాన్ని చీలదీసి, బలహీనపరిచే హక్కు మనకు లేదు.

సరే, నేను అధ్యక్షుడిగా ఉండిన సంస్థ ఇటువంటి సమస్యలలో చిక్కుకోవడం ఒక విచారకరమైన విషయం అయితే, అప్పటి నా వ్యక్తిగత అనుభవాలు కొన్ని చెప్పాలి.

ముందే చెప్పినట్టుగా చర్చ ఐదారేళ్ళు సాగింది. అంతకాలమూ చర్చలోని రెండు పక్షాలూ నన్ను సమానంగానే గౌరవించాయి. నేను సంస్థ ఐక్యత కోసం నిలబడతానని రెండు పక్షాలకూ తెలుసు. నేను మధ్యవర్తిత్వం వహించి సంస్థ చీలకుండా చూడవలసిందేమో. అందులో నేను విజయం సాధించ గలిగేవాడ్నా? చెప్పలేను.

కాని, 1993 కర్నూలు మహాసభ వచ్చేటప్పటికే నేనూ అధ్యక్ష పదవి నుంచి తొలగిపోదలచు కున్నాను. వాళ్ళు కూడా ఈయన అధ్యక్షుడిగా లేకపోతే చీలిక సులభంగా జరిగిపోతుంది గదా అనుకున్నట్టున్నారు. కర్నూలు మహాసభలో రెండు పక్షాలూ కూడా తమ భిన్నాభిప్రాయాల చర్చ మీద ఎంత పట్టుదలగా ఉన్నాయంటే నేను దిగిపోతానంటే సులభంగా అంగీకరించారు. అంగీకరించడమే కాదు, పదిహేను సంవత్సరాలు అధ్యక్షుడిగా ఉండి వైదొలగు తున్నాడు గదా, ఈ పదిహేను సంవత్సరాలలో సంస్థ బాగా అభివృద్ధి చెందింది గదా. చివరికి ఒక కృతజ్ఞతలు చెప్పే ఉపన్యాసం ఇద్దామని కూడా ఎవరూ అనుకోలేదు. అంటే నాకు ఎపిసిఎల్‌సి నుంచి ఒక గౌరవనీయమైన, అహ్లాదకరమైన వీడ్కోలు దొరకలేదు. ఇప్పటికీ నాకు ఏమనిపిస్తుందంటే, పదిహేను సంవత్సరాలు ఒక సంస్థ బాధ్యత మోసిన తర్వాత వీడ్కోలుగా నాలుగు మంచి మాటలు, దయో, కృతజ్ఞతతో కాదు, కనీసం మంచి మాటలు లేకపోయాయే అనిపిస్తుంది. అది కేవలం లాంఛనమే కావచ్చు. కాని అది కొంత సంతృప్తినిస్తుంది.

ఆ తర్వాత జ్ఞాపక చిహ్నంగా ఏదో వస్తువు పట్టుకొచ్చి ఇవ్వబోయారు. నేను వద్దని చెప్పాను. ఆరోజు అక్కడ మీరు ఒక సరైన వీడ్కోలు ఇచ్చి ఉంటే సరిపోయి ఉండేది. అలా జరగలేదు కాబట్టి మర్నాడు పత్రికల్లో చాలా ఊహాగానాలు వచ్చాయి. కన్నబిరాన్ ఎందుకు దిగిపోయాడు అంటూ చిలువలు పలవలు రాశారు. ఒకవేళ వాళ్ళు నన్ను అక్కడ సగౌరవంగా వీడ్కోలు చెప్పి పంపించి ఉంటే ఆ ఊహాగానాలకు అవకాశం ఉండేది కాదు. నేనే ఒక చివరి ఉపన్యాసం చేసి, వాళ్ళకు చెప్పేసి వచ్చేశాను.

అటువంటి మర్యాదలు కొన్ని పాటించాలి. ఒక సంస్థలో పని చేసేటప్పుడు మొరటుదనం, కరకుదనం, ముక్కుకు సూటిగా పోయే తత్వం అన్ని వేళలా పనికిరావు. మరీ ముఖ్యంగా ఇది ఒక మానవహక్కుల ఉద్యమం. కనుక మనం మన మానవీయతను ప్రదర్శించాలి.

* * *

## అంతర్గత విషయాలు

అట్లాగే మరొక సంగతి చెప్పాలి.

ఎమర్జెన్సీ తర్వాత దేశమంతా ప్రజాస్వామిక ఆలోచనల వెల్లువ ఎట్లా వచ్చిందో ఇదివరకు చెప్పాను. ఆ వెల్లువలో దేశమంతటా పౌరహక్కుల సంఘాలు పుట్టుకొచ్చాయి. ఆంధ్ర ప్రదేశ్ పౌరహక్కుల సంఘానికి దేశవ్యాప్త పేరు ప్రఖ్యాతులు వచ్చాయి. 1978లో నేను ఢిల్లీలో ఎంవి తార్కుండే ఇంటికి వెళ్తే, ఎపిసిఎల్‌సి ప్రతినిధిగా పియుసిఎల్ (పీపుల్స్

యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ - లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ స్థాపించిన సంస్థ) జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఉండమని ఆయన నన్ను అడిగారు.

నేను అప్పటికే ఎపిసిఎల్‌సి అధ్యక్షుడిగా ఉన్నాను కనుక పియుసిఎల్‌లో ఉండలేనన్నాను.

అప్పుడు జరిగిన చర్చలో సివి సుబ్బారావు కూడా ఉన్నాడు. ఆయన తాము పియుసిఎల్ అండ్ డిఆర్‌లో ఉండబోమని, స్వతంత్ర సంస్థగా ఉంటామని అన్నాడు. సంస్థను చీలదీయడం సరైనది కాదని నేను ఆయనతో వాదించాను. ఆ తర్వాత గోవింద ముఖోటీ దగ్గరికి వెళ్ళి ఆయనతో కూడ మాట్లాడాను.

'నేనేమీ పియుసిఎల్ ప్రతినిధిగా మీ దగ్గరికి వచ్చి ఐక్యత కోసం వాదించడం లేదు. కాని చీలిక మంచిది కాదు' అన్నాను. "పాల్ఖీవాలా సభ్యుడిగా ఉండే సంస్థలో మేం ఎట్లా సభ్యులుగా ఉంటాం" అని ప్రశ్నించాడు ముఖోటీ. "పాల్ఖీవాలా ఇప్పుడున్నాడేమో గాని నిజంగా ప్రజల పౌరహక్కుల రక్షణ విషయం వచ్చేసరికి పాల్ఖీవాలాలు వెళ్ళిపోతారు. మీరూ నేనూ మాత్రమే మిగులుతాం. కనుక సంస్థను వదిలిపోవద్దు అన్నాను.

చివరికి పియుసిఎల్ డిఆర్ చీలి పోయింది. గోవింద ముఖోటీ, సివి సుబ్బారావు తదితరులు పియుడిఆర్ ఏర్పరచుకున్నారు.

అప్పుడే ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఆఫీసులో ఎక్స్‌ప్రెస్ కోసం అరుణ్‌జైట్లీ నన్ను ఇంటర్వ్యూ చేశాడు. నేనాయనతో మొట్టమొదటే చెప్పాను. "పియుసిఎల్‌లో చీలిక అనే పతాక శీర్షిక పెట్టే అవకాశం నీకివ్వను" అని.

అంటే నేను చెప్పదలచినదేమంటే, అప్పటి నుంచీ కూడ నేను ఉద్యమాన్ని మొత్తంగా, సమైక్యంగా చూడడానికే ప్రాధాన్యత నిచ్చాను. నువ్వా నేనా మరొకరా అన్నది ముఖ్యం కాదు. పౌరహక్కుల, మానవహక్కుల ఉద్యమాన్ని ఒక సమగ్రతగా చూడాలి.

అదే సమస్య మీద మన దగ్గరికి వచ్చే సరికి, నేను ఆ సంస్థను మధ్యలో వదిలి రాదలచుకోలేదు. ఆ సంస్థ పట్ల నా విధేయత మొత్తంగా మానవహక్కుల పట్ల నా అవగాహన వల్ల వచ్చింది.

ఇక పియుసిఎల్ తో నా అనుబంధం గురించి కూడా కొంచెం చెప్పాలి. ఇదివరకే చెప్పినట్టు 1978 నుంచీ తార్కుండే కోరిక మీద నేను పియుసిఎల్‌లో కొనసాగుతున్నాను. కాని ఎంవి రామమూర్తి గారికి నేను పియుసిఎల్‌లో ఉండడం నచ్చలేదు. అసలు నేను పియుసిఎల్‌లోకి ఎలా వచ్చానో ఆయనకు తెలియదనుకుంటాను. ఇక నేను ఎపిసిఎల్‌సి అధ్యక్షుడినయిన తర్వాత ఆయనకూ నాకూ సంబంధాలు మరింతగా బెడిసిపోయాయి.

నన్ను పియుసియల్ నుంచి పంపిచెయ్యాలని కూడ రామమూర్తిగారు ప్రయత్నాలు మొదలు పెట్టారు. 1979 లోనో, 1980 లోనో మద్రాసులో పియుసిఎల్ సమావేశాలు

జరిగాయి.

అక్కడ రామమూర్తి గారు ఒక తీర్మానం ప్రవేశపెట్టారు. రెండు సంస్థల కార్యనిర్వాహక వర్గంలో ఉండడం తప్పు అని రాష్ట్రం తరఫున ఒక తీర్మానం ఆమోదించి దాన్ని తీసుకుని మద్రాసు వచ్చారు. రైల్లో మేం కలిసే ప్రయాణించాం. రామమూర్తి గారు, సిరిల్ రెడ్డి, కేశవరావు జాదవ్, నేను. కాని దారిలో నాకు ఆ తీర్మానం గురించే చెప్పలేదు. రైలు దిగేటప్పుడు నా చేతికి ఆ కవర్ ఇచ్చి వెళ్ళిపోయారు.

ఇక సమావేశంలో నేను ఆ తీర్మానం చదివి ఆశ్చర్యపోయాను. సరే, ఇది నాకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడిందే. దీని మీద చర్చ జరిగేటప్పుడు నేను భాగం పంచుకోవడం మంచిది కాదు. కావాలంటే మీరు దాని మీద చర్చించేటప్పుడు బయటికైనా వెళతాను' అన్నాను.

అప్పుడు పియుసిఎల్ జాతీయ కార్యవర్గ సభ్యులు అరుణ్ శౌరి, ఎంవి తార్కుండే, జార్జి ఫెర్నాండెజ్, సురేంద్రమోహన్, చో రామస్వామి మొదలయిన వాళ్ళంతా, "లేదు, లేదు. కన్నబిరాన్ బయటకు వెళ్ళడానికి వీలులేదు" అన్నారు. అప్పుడు తార్కుండే నేను పియుసిఎల్ లోకి ఎట్లా వచ్చానో వివరించాడు. "కన్నబిరాన్ ను ఎపిసిఎల్‌సి ప్రతినిధిగా, అస్గర్ అలీ ఇంజనీర్‌ను సిపిడిఆర్ ప్రతినిధిగా మేమే పియుసిఎల్ జాతీయ కార్యవర్గంలోకి తీసుకున్నాం. వాళ్ళిద్దరూ ఆ సంస్థల కార్యవర్గ సభ్యులు, నాయకులు అని తెలిసే తీసుకున్నాం. అటువంటప్పుడు ద్వంద్వ సభ్యత్వం, ద్వంద్వ నాయకత్వం అనే ప్రశ్నే తలెత్తదు" అని తార్కుండే చెప్పాడు.

అంతేకాదు, ఆ సమావేశంలోనే నన్ను పియుసిఎల్‌కు దక్షిణాది ఆర్గనైజింగ్ సెక్రటరీగా కూడా ఎన్నుకున్నారు.

దాంతో రామమూర్తి గారికి నాకూ మనస్పర్ధలు మరింత పెరిగాయి. వ్యక్తులుగా మా ఇద్దరికీ సత్సంబంధాలు అట్లాగే ఉన్నాయి. గాని సంస్థగా పియుసిఎల్ రాష్ట్రంలో ఎదగలేక పోయింది. క్షీణించిపోయింది.

దక్షిణాది కార్యనిర్వాహక కార్యదర్శిగా నేను చేసే ఆలోచనలకూ, రాష్ట్ర పియుసిఎల్ అధ్యక్షుడిగా రామమూర్తి గారి ఆలోచనలకూ సమన్వయం కుదిరేది కాదు. అందువల్ల ఏ పనులూ జరిగేవి కావు. పియుసిఎల్ ఇప్పుడు కూడా అట్లాగే జరుగుతోంది. అది దురదృష్టకరమే గాని మొత్తానికి చాలా రాష్ట్రాలలో ఇటువంటి సమస్యల వల్లనే పియుసిఎల్ ముందుకు పోలేకపోయింది.

పియుసిఎల్ ఉద్యమ చరిత్రలో ఇటువంటి సంక్షోభాలెన్నో ఉన్నాయి.

ఉదాహరణకు పంజాబ్‌లో టెర్రరిజం వల్ల పౌరహక్కుల ఉద్యమం సంక్షోభాన్ని ఎదుర్కొంది. టెర్రరిజాన్ని అందరూ ఖండిస్తారు గాని టెర్రరిజాన్ని అణచడానికనే పేరుతో ప్రభుత్వం టాడా వంటి దుర్మార్గమైన చట్టాలను తెచ్చి ప్రజల మీద నిర్బంధకాండను

అమలు చేస్తుంటే దాని పట్ల ఎట్లా స్పందించాలి అనే చర్చ పౌరహక్కుల ఉద్యమంలో మొదలయింది.

'టెర్రరిస్టులకు మిగిలిన పౌరులకు ఉండేలాంటి హక్కులుండవు' అని ప్రభుత్వం తీసుకున్న వైఖరితో నాకు ఏకీభావం లేదు. తార్కుండేకు ఏకీభావం లేదు. మేం ఆ విషయం చర్చించిన సమావేశం నుంచి అరుణ్ శౌరి బైటికి వెళ్ళిపోయాడు. ఇక ఆ తర్వాత ఆయన పియుసిఎల్ పనుల్లో భాగం పంచుకోలేదు.

అట్లాగే బొంబాయిలో ఒక సమావేశంలో మాట్లాడుతూ పాల్కీవాలా ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం ఉండవలసిందేనని, ఆ చట్టం కింద దత్తా సామంత్‌ను అరెస్టు చేయాలని పియుసిఎల్ ఒక తీర్మానం చేయాలని అన్నాడు. మేమందరమూ వ్యతిరేకించాం. "దత్తా సామంత్ ఇక్కడ చాలా సమస్యలు సృష్టిస్తున్నాడు. అరెస్టు చేసి పారేయాల్సిందే" అని వాదించాడాయన.

"సమస్యలు సృష్టిస్తుండవచ్చు. ఆ సమస్యలను ఆపే బాధ్యత రాజ్యానిదే. కాని ఒక వ్యక్తిని అరెస్టు చెయ్యి, అతని ప్రాథమిక హక్కులు కాలరాచి వెయ్యి, అతణ్ని కారణం చూపకుండా నిర్బంధించు అని పౌరహక్కుల ఉద్యమం తరపున మనం అడగడానికి వీలు లేదు" అని మేం వాదించాం.

ఆ విధంగా ప్రతి దశాబ్దంలోనూ పౌరహక్కుల ఉద్యమం ముందుకు సమస్యలు వస్తూనే ఉన్నాయి.

అట్లాగే ప్రపంచీకరణ ఉంది. ప్రపంచీకరణ మంచిదేనని భావించేవాళ్ళు కొందరయినా పౌరహక్కుల ఉద్యమంలో ఉన్నారు. ప్రపంచీకరణ దుర్మార్గమైనదని భావించే వాళ్ళు చాలా మంది ఉన్నారు. ఈ రెండు అభిప్రాయాల మధ్య చర్చ జరిగి, అటూ ఇటూ భావ వినిమయం జరిగి, మేథోమథనం జరిగితే గాని ముందుకు పోలేం.

అదేవిధంగా సెప్టెంబర్ 11 టెర్రరిస్టు దాడులున్నాయి. దానిమీద పౌరహక్కుల ఉద్యమంలో చర్చ లేదు. ఎన్నో చోట్ల బాంబుదాడులు జరుగు తున్నాయి. చర్చలేదు. టెర్రరిస్టులకు సమర్థన ఇస్తామా, వ్యతిరేకిస్తామా అనేది కాదు సమస్య. ఆ విషయాన్ని ఎట్లా పరిష్కరిస్తాము. ఆ విషయాన్ని ఎట్లా అర్థం చేసుకుంటాము అనేది అసలు విషయం.

* * *

# చర్చలపై నా వైఖరి

సమాజంలోని సమస్యలపట్ల పౌరహక్కుల ఉద్యమపు దృక్పథం ఏమిటి అన్నది ప్రశ్న. ఆ సమస్యల గురించి మనం ఒక వైఖరి తీసుకోవాలనో, దానిలో అటువైపు ఉన్న వాళ్లనో, ఇటువైపు ఉన్న వాళ్లనో సమర్థించాలనో, ఖండించాలనో కాదు. అసలు సమస్యను

ఎట్లా చూస్తాము. ఎట్లా అర్థం చేసుకుంటాము. అవీ అసలు విషయాలు.

ఉదాహరణకు నక్సలైటు సమస్యనే ఉంది. మేం శౌరస్పందనా వేదిక - కమిటీ ఆఫ్ కన్సర్న్డ్ సిటిజెన్స్ - అని ఏర్పాటు చేశాం. అందులో పదిహేనుమందిమో, పదహారు మందిమో ఉన్నాం. అది ఏమీ ఒకే రకంగా ఆలోచించే వాళ్ల బృందం కాదు. సుదృఢమైన నిర్మాణం కాదు. మా అందరమూ ఒక్కొక్కరం ఒక్కొక్క రకమైన ఆలోచనలతో ఉన్నాం. కొందరు శాంతి మంచిదని, శాంతిని స్థాపించవచ్చునని ఆలోచనతో ఉన్నారు. నా వరకు నేను శాంతి మంచిదనే అనుకుంటాను గాని ఇప్పుడున్న పరిస్థితిలో సాధ్యం కాదని అనుకుంటాను.

ముఖ్యంగా శాంతి చర్చల గురించి నా అభిప్రాయమేమంటే, ఆ శాంతి చర్చలు తప్పనిసరిగా విఫలమవుతాయని వాటి కోసం ప్రయత్నించడంలో అర్థం లేదని. ఎందుకంటే ఆ చర్చలో పాల్గొంటున్న ఇరుపక్షాల మధ్య ఘర్షణ అనివార్యమైనది. అది నా అభిప్రాయం. అందుకే నేను మొదటి నుంచీ ఆ మాట చెబుతూనే ఉన్నాను.

అయినాగాని ఇతరులందరూ ప్రయత్నిద్దామన్నప్పుడు నేను కూడా ప్రయత్నిద్దామనే అన్నాను. ఎందుకంటే ఏదో ఒక కొత్త ప్రయత్నం జరగవలసి ఉంది. ఇటు పాలనలోనూ అటు ఉద్యమంలోనూ తలెత్తి పెరుగుతున్న వక్రీకరణలను అరికట్టవలసిన అవసరం ఉంది. ఆ వక్రీకరణలను, తప్పుడు ధోరణులను ఒక్కొసారి చూస్తే ఆశ్చర్యపోతారు.

విప్లవోద్యమం లోనూ, విప్లవం గురించి అవగాహనలోనూ నెలకొన్న తప్పుడు ధోరణులు, పాలనలోనూ, రాజ్యాంగబద్ధ పాలనలోనూ విస్తరిస్తున్న తప్పుడు ధోరణులు.

ఇదంతా కూడా ప్రజాస్వామ్యానికి సంబంధించినదే. మనం ఇప్పుడు చాలా క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నాం. ఈ తప్పుడు ధోరణులను సరి చేయవలసిన స్థితిలో ఉన్నాం.

చర్చల గురించి మొదటినుంచీ పట్టుబడుతున్నదీ ఆసక్తి చూపిస్తున్నదీ పొత్తూరి వెంకటేశ్వరరావు ఒక్కరే. ఇరుపక్షాలూ కూచుని మాట్లాడుకోవాలనీ, అది సాధ్యమేనని, తద్వారా ఏదో సాధించవచ్చుననీ ఆయన అనుకున్నారు. సైద్ధాంతికంగా అది సాధ్యమయ్యే పని కాదు అని నేననుకున్నాను. ఒక దోపిడీ వ్యవస్థలో రెండు విభిన్న వర్గాల మధ్య ఏకీభావం కుదరడం అసాధ్యం అని నేననుకున్నాను. దోపిడీ వ్యవస్థలో అధికారం చలాయిస్తున్న వాళ్లు తమ అధికారాన్ని వదులుకొని, లొంగిపోవడానికి సిద్ధపడితే తప్ప ఇటువంటి చర్చల ద్వారా సాధించగలిగినదేమీ ఉండదు.

ఎందుకంటే హృదయ పరివర్తన అనేది సాధ్యంకాదు. హృదయ పరివర్తన ఒక వ్యక్తికి సాధ్యమేమోగాని ఒక వ్యవస్థకు సాధ్యం కాదు.

అయినా సరే, మేం ప్రయత్నించాం. హరగోపాల్ ప్రొఫెసర్ గనుక అది ఒక కొత్త అడుగు అని నిర్ధారించాడు. నాకింకా అనుమానంగానే ఉంది. ఇటూ ప్రయత్నాలు ప్రారంభించాం.

మా కమిటీ తరపున కొందరు వెళ్లి విప్లవ నాయకులను కలిసి వచ్చారు. అక్కడ

నాయకులు మాట్లాడిన తీరుకు, విషయాలు వివరించిన తీరుకు, వాళ్ల స్పష్టతకు మా వాళ్లందరూ ముగ్ధులయిపోయారు. నిజంగానే విప్లవనాయకులతో మాట్లాడిన వాళ్లెవరైనా తబ్బిబ్బయిపోతారు. విప్లవ నాయకులు అటువంటి ప్రశంసలు పొందగలరు. నేనయితే కొండపల్లి సీతారామయ్య దగ్గరి నుంచి ఇప్పటి వరకూ చాలా మంది విప్లవ నాయకులతో మాట్లాడిచూశాను. వారందరూ నన్ను మెప్పించారు.

అయితే ఎక్కడో ఒక్కచోట వాళ్లు ఏదో పని చేస్తారు. అది ఆ మెప్పునంతా పోగొడుతుంది. అట్లాగే ప్రభుత్వం కూడా ఎక్కడో ఒక చోట ఒక తప్పుడు పనికి పాల్పడుతుంది. ఇరుపక్షాల మధ్య చర్చకు అవకాశం పోతుంది.

నేను ఎన్.టి. రామారావుతో కూడా మాట్లాడాను. రాజకీయాలతో ఎటువంటి సంబంధంలేని రామారావుతో మాట్లాడడం సులభమని అనిపించింది గాని దశాబ్దాల రాజకీయానుభవం ఉన్న ఇప్పటి నాయకులతో మాట్లాడడం కష్టం. ఎన్.టి. రామారావుకు లోలోపలి నుంచి మానవ సహజమైన న్యాయన్యాయ విచక్షణ ఉండేది. ప్రస్తుత నాయకులకు అటువంటి మానవ సహజమైన లక్షణాలు ఏమీ లేవు. ఉన్నదంతా కృత్రిమ ప్రవర్తనే.

సరే, శాంతి చర్చల దగ్గరికి వద్దాం. ఆలోచన బాగుంది. రెండు పక్షాల నుంచీ స్పందన బాగుంది. ఇది ఏదో ముందుకు కదిలేట్టే ఉంది అని అనిపించింది. కాని మొదటి రోజు చర్చల సరళి చూడగానే నాకు ఏమనిపించిందంటే ప్రభుత్వ ప్రతినిధులు చర్చల గురించి ముందస్తుగా ఏ పనీ చేయలేదు. వాళ్లకు సమస్య గురించి తెలియదు. అధ్యయనం చేయలేదు. చర్చలకు తయారై రాలేదు. వాళ్ళు కేవలం తమ ఎన్నికల ప్రణాళికలో చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకుంటున్నామని చూపదలచుకున్నారు అంతే.

నేను ఆ విషయం చెప్పాను కూడా. వాళ్ల మీద తీవ్రంగానే మాట్లాడాను? చర్చలు జరిపే పద్ధతి ఇది కాదు అని నా అభిప్రాయం స్పష్టంగానే చెప్పాను.

కాని చివరికి నాకు అర్థమయిందేమంటే చర్చలకు అవకాశం ఉంది అని. ఇంకా ఇరుపక్షాలూ కూచుని మాట్లాడుకోవచ్చు. కనీసం కొన్ని విషయాల లోనయినా మెరుగుదల సాధించవచ్చు. చర్చల అనుభవంతో నాకు తెలిసివచ్చిన విషయం అది.

చర్చల వల్లనే కనీసం ఒక ముప్పైవేల మందికి కొత్తగా భూమి దొరికింది. ప్రభుత్వం భూమి పంపిణీ గురించి ఆలోచించడం మొదలుపెట్టింది. అంటే చర్చలు ఆ మేరకు వృధాగా పోలేదన్న మాట. ప్రభుత్వం లక్ష మందికి భూమి పంచానంటున్నది గాని, ఆ అంకె అతిశయోక్తి అనుకున్నా కనీసం ముప్పై వేల మంది లబ్ధిపొంది ఉంటారు.

అంతే ఎంతో కొంత మెరుగుదల లేకుండాపోలేదు.

అంతేకాదు, చర్చలు ఆ ఇరుపక్షాలూ కోరుకోవడంవల్ల మాత్రమే కాదు, ప్రజలు కోరుకోవడంవల్ల జరిగాయి. నిజంగా ప్రజలు ఏదో ఒక రకమైన శాంతి చర్చలు జరగాలని,

వెసులుబాటు రావాలని కోరుకున్నారు. ఆ కోరికను విప్లవ పార్టీలు అర్థం చేసుకున్నాయి, ఆమోదించాయి. అందువల్లనే చర్చలకు సిద్ధపడ్డాయి. కాంగ్రెస్ పార్టీ కూడా ప్రజలలో ఆ కోరిక ఉందని గుర్తించింది. అందుకే ఎన్నికల ప్రణాళికలో చేర్చింది. చర్చలకు సిద్ధపడింది.

ఇప్పుడు చత్తీస్‌గడ్‌లో జరుగుతున్నదే చూడండి. మహేంద్రశర్మ నాయకత్వంలో ప్రభుత్వం, పాలకవర్గాలు గిరిజనులలోనే ఒక వర్గాన్ని వేరు చేసి మరో వర్గానికి వ్యతిరేకంగా రెచ్చగొడుతున్నారు. ఆదివాసుల మధ్య అంతర్యుద్ధం జరుగుతున్నదన్నమాట. దాన్ని తిరుగుబాటు-ప్రతీకారం అని అంటున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఈ విప్లవ వ్యతిరేక దళాలను గూండాలతో తయారు చేశారు. గూండాలను పోలీసులు కిరాయికి తీసుకుని, డబ్బులు, వాహనాలు, ఆయుధాలు సమకూర్చి విప్లవకారులను, సానుభూతి పరులను చంపడానికి వినియోగించారు.

ఈ ఆంధ్రప్రదేశ్ ప్రయోగాన్నే చత్తీస్‌గడ్‌లో మరో రకంగా అమలు చేస్తున్నారు. ఒక ఆదివాసి తెగ నాయకుడిని తీసుకుని, అతని నాయకత్వంలో ఆదివాసి యువకులను పోగు చేసి, వారికి ఆయుధాలిచ్చి జవాబుదారీ తనం లేని అధికారం ఇచ్చి, వారిని హింసాకాండకు పురిగొల్పుతున్నారు.

పంజాబ్‌లో ఖలిస్తాన్ ఉద్యమ సమయంలోనూ ప్రభుత్వం ఇటువంటి ప్రయోగమే చేసింది. భింద్రన్‌వాలే నాయకత్వంలో ఒక బృందాన్ని చేరదీసి వారికి మితిమీరిన హింసా అవకాశాలు కల్పించింది. తద్వారా ఉద్యమాన్ని అణచివేయదలచుకుంది.

భారతీయ జనతాపార్టీ నరేంద్రమోడి హత్యా రాజకీయాలను సమర్థించడంలో కూడా ఈ ఎత్తుగడే ఉంది.

నేను ఒక చిన్న మామూలు ప్రశ్న అడగదలచుకున్నాను. భింద్రన్‌వాలా, నరేంద్రమోడి, మహేంద్రశర్మ ఇటువంటి నాయకులను మీరు ఎందుకు తయారు చేస్తున్నారు. సమస్య వచ్చినప్పుడు అన్ని సంబంధిత బృందాలతో కూచుని చర్చించవచ్చు గదా. సమస్యకు పరిష్కారాలు వెతకవచ్చుగదా. ఆ సమస్యనూ పరిష్కారాలనూ పక్కనపెట్టి అంతర్యుద్ధం సృష్టించడానికి ఎందుకు ప్రయత్నిస్తున్నారు?

ఈ విషయమే నేను ఒక వివరమైన పత్రికా ప్రకటన తయారు చేసి చత్తీస్‌గడ్ పత్రికలకూ, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రికీ పంపించాను. చత్తీస్‌గడ్ రాష్ట్ర పియుసిఎల్ ద్వారా అక్కడ ఇటువంటి ఆలోచన రేకెత్తించడానికి ప్రయత్నిస్తున్నాను.

పౌరహక్కుల ఉద్యమ నిర్మాణం గురించి మాట్లాడుతూ ఎక్కడో పక్కకు పోయానని మీకు అనిపిస్తుందేమో. కాని ఇదంతా కూడా పౌరహక్కుల ఉద్యమం సంగతే. సమాజంలో జరుగుతున్న పరిణామాలలో భాగం పంచుకుని, ఆ పరిణామాలలో జరుగుతున్న హింసను తగ్గించి, మానవీయ పరిష్కారాల వైపు ప్రజల దృష్టిని మళ్లించే బాధ్యత పౌరహక్కుల ఉద్యమానిదే. అదీ పౌరహక్కుల ఉద్యమంలో భాగమే.

పౌరహక్కులు అంటే రాజ్యాంగంలో పొందుపరిచిన నీ హక్కు, నా హక్కు మాత్రమే కాదు. సామాజిక హక్కులు. సమాజం శాంతి యుతంగా, మానవీయంగా అభివృద్ధి చెందే హక్కు

ఎందుకంటే శాంతి అనేది ప్రజలందరి సామూహిక హక్కు అని నేను భావిస్తాను.

ఇప్పుడిక ఈ అధ్యాయం ముగింపుగా దేశంలోనూ, రాష్ట్రంలోనూ పౌరహక్కుల ఉద్యమ స్థితిగతుల గురించి నా అభిప్రాయాలు చెపుతాను.

ఎమర్జెన్సీ తర్వాత దేశవ్యాప్తంగా పౌరహక్కుల ఉద్యమ చైతన్యం పెల్లుబికిందని అందరికీ తెలుసు. ఆ చైతన్యమే దేశంలో ఎన్నో పౌరహక్కుల పోరాట సంస్థల ఆవిర్భావానికి కారణమయింది. అదంతా జరిగిన ముప్పై సంవత్సరాలు కావస్తోంది. అప్పటి నుంచి ఇప్పటి దాకా ఆ చైతన్యాన్ని ఆ నిర్మాణాలను అంటిపెట్టుకుని ఉన్న వ్యక్తిగా నేను ఇవాళ దాన్నంతా ఎట్లా చూస్తున్నాను?

ముప్పై ఏళ్లతర్వాత కచ్చితంగా ఆ నాటికంటే ఎక్కువ మంది ప్రజలు అన్యాయాలకు, పౌరహక్కుల ఉల్లంఘనలకు వ్యతిరేకంగా గళమెత్తుతున్నారు. పోరాడుతున్నారు. ఇవాళ ఎక్కడైనా ఒక పోలీసుస్టేషన్‌లో పౌరహక్కుల ఉల్లంఘన జరిగితే ఎక్కువ మంది ముట్టడిస్తున్నారు. ఎక్కువ మంది ప్రభుత్వ విధానాలనూ, పోలీసుల చర్యలనూ ప్రశ్నిస్తున్నారు.

ఈ ప్రజా_ఆందోళనలన్నిటికీ పౌరహక్కుల సంఘాలే నాయకత్వం వహించక పోవచ్చు. నాయకత్వం వహించాలని కూడా లేదు. పౌరహక్కుల సంఘాలు చేయ గలిగిందల్లా ఏమంటే ప్రజలు ఈ చైతన్యాన్ని పొందేలా భావప్రచారం చేయడం మాత్రమే. అంతిమంగా ఆ ఆందోళనలు చేయవలసింది ప్రజలే.

ఇవాళ ఒక ఎన్‌కౌంటర్ జరిగిందని పోలీసులు చెబితే నిజమని నమ్మేవాళ్లు ఒక్కరు కూడా లేరు.

గంగవరం కాల్పులకు వ్యతిరేక [illegible] అనేది అంతకు ముందరి మూడు దశాబ్దాల పౌరహక్కుల ఉద్యమ చైతన్య[illegible] లేదు.

అంటే మూడు దశాబ్దాలుగా సాగిన పౌరహక్కుల ఉద్యమం, పౌరహక్కుల సంఘాల పాత్రకు ప్రతిఫలం ఇప్పుడు దొరుకుతోంది. మా కృషికి ప్రతిఫలం ఏమిటో చూడడానికి మేం సాక్షీభూతులుగా ఉన్నాం.

ప్రభుత్వం కోబ్రాల పేరు మీద గూండాబలగాలను తయారు చేయడం. ప్రజా ఉద్యమాల సానుభూతిపరులను నరికి చంపడం, ప్రజలలో కొంతైనా భయం వ్యాపించడం, మాట్లాడలేకపోవడం చూసి పౌరహక్కుల ఉద్యమ చైతన్యం ఏమయిందనే ప్రశ్న రావచ్చు.

కాని ఈ పరిణామాలు కూడా ఎక్కువ రోజులు ఇట్లాగే నిలిచి ఉంటాయని నేననుకోవడం లేదు.

ప్రజలు నిజంగా తిరగబడుతున్నారు.

అంటే పౌరహక్కుల ఉద్యమ ప్రతిఫలం దొరకడం మొదలైందన్నమాట.

ఇది వరకు హెబియస్ కార్పస్ పిటిషన్లు కన్నబిరాన్ ఒక్కడే వేసే వాడు. ఇవాళ డజన్ల కొద్దీ న్యాయవాదులు అందుకు ముందుకు వస్తున్నారు. ఫుల్ బెంచి ముందర వాదించడానికి ఎందరో న్యాయవాదులున్నారు.

అందువల్ల నేనేదో నిరాశపడి, నా జీవితం వృధా అయింది అని అనుకోవడం లేదు.. ముప్పై, నలభై సంవత్సరాలు నేనుచేసిన కృషి. నా సహచరులు చేసిన కృషి ఫలప్రదమైంది. పౌరహక్కుల స్ఫూర్తి సమాజంలో విస్తరించింది.

పత్రికల్లో ఏదైనా ఇటువంటి వార్త చదివితే నాకు నా జీవితం సార్థకమయిందని పిస్తుంది. ఉదాహరణకు విద్యార్థుల మీద లాఠీఛార్జి చేసి ఉమ్మి వేసిన పోలీసు అధికారిని సస్పెండ్ చేశారనే వార్త ఉంది. పౌరహక్కుల ఉద్యమం లేకుండా ఇది సాధ్యమయి ఉండేదేనా?

పౌరహక్కుల ఉద్యమ విజయం ఇది. ప్రచార సాధనాలు ఇవాళ పౌరహక్కుల ఉల్లంఘన సమస్యలకు ఎక్కువ స్థలం కేటాయిస్తున్నాయంటే అది ఒక బలమైన పౌరహక్కుల ఉద్యమ విజయ ఫలితమే. అవన్నీ వాటంతటవే రాలేదు.

ప్రజలకు ప్రశ్నించడానికి ఉన్న శక్తి, తమ హక్కులను నిర్ధారించుకునే శక్తి కలిగాయంటే, ప్రభుత్వ విధానాలపట్ల ఆగ్రహావేశాలు, వాటిని ప్రదర్శించే శక్తి – ఇవన్నీ పౌరహక్కుల ఉద్యమం కలిగించిన చైతన్యపు ఫలితాలే.

ఆ పౌరహక్కుల ఉద్యమంలో వ్యక్తులెవరు, సంస్థలేమిటి, వాళ్ల భావజాలం ఏమిటి అనేవి ముఖ్యమైన విషయాలు కావు. ఆ ఉద్యమం ఉంది, ముందుకు పోతోంది. ప్రజలలో తమ హక్కుల గురించి చైతన్యం కలిగించింది. ప్రశ్నించడం సరైనదే అనే స్పృహ కలిగించింది అనే విషయాలు ముఖ్యం.

అవి ఎపిసిఎల్సి తరహా పౌరహక్కులా, పియుసిఎల్ తరహా పౌరహక్కులా అనేది కూడా ముఖ్యం కాదు. మొత్తం మీద పౌరహక్కులు కావాలి. అందుకే ఎన్ని సంఘాలైనా రావచ్చునని, ఒకరితో ఒకరు ఘర్షణ పడకుండా పౌరహక్కుల చైతన్య వ్యాప్తికి పని చేయాలని నేననుకుంటాను. అవి పెద్ద ఎత్తున విస్తరించాలని నేనుకుంటాను.

మనం నాయకులుగా ఉంటేనే బాగుందని, మనం నాయకత్వంలో లేకుండా జరిగే పని బాగులేదని అనుకో పని లేదు. మనం ప్రేక్షకులుగా ఉండవలసిన సమయం కూడా వస్తుంది. అప్పుడు కూచుని మనం చేసిన పని పండుతుందిరా ఇప్పుడు అని సంతోషించాలి.

* * *

# మానవతకే మచ్చ

గుజరాత్ మారణకాండ దేశ చరిత్రలోకెల్లా దారుణమైనది. స్వాతంత్ర్యానంతర భారత చరిత్రలో అంత ఘోరమైన సంఘటన మరొక్కటి మాత్రమే ఉంది. మొదటి సంఘటన 1984లో ఇందిరాగాంధీ హత్య తర్వాత సిక్కుల మీద జరిగిన హత్యాకాండ కాగా, రెండో సంఘటన గుజరాత్ మారణకాండే. అంతపెద్ద స్థాయిలో దౌర్జన్యాలు, హత్యలు జరగడం ఆ రెండు సార్లే. అంతేగాక, ఈ రెండు సందర్భాలలోనూ ఈ హత్యాకాండలను ప్రభుత్వం, రాజ్యాంగ యంత్రం ఆమోదించింది.

ఇందిరాగాంధీ హత్యానంతరం సిక్కుల మీద దాడి చేయడం, చంపడం జరిగినప్పుడు రాజ్యం మద్దతు ఇవ్వడం మాత్రమే కాదు, దేశంలోని మొత్తం మేధావి వర్గం, ఆలోచనాపరుల వర్గం మౌనసాక్షిలా ఉండి పోయింది. ఏ ఒక్కరికీ నోరెత్తి దాన్ని ఖండించడానికి ధైర్యం లేకపోయింది. అంత దారుణమైన హత్యాకాండ జరుగుతుంటే ఒక్కరు కూడా బయటికి వచ్చి నిరసన తెలపలేదు. అంతే మొత్తం జనాభా సామూహికంగా పిరికితనం ప్రదర్శించిందన్నమాట. అది చాలా దురదృష్టకరమైన సంగతి. మానవులు నివసించేచోట జరగవలసిన సంగతి కాదు. ఎంతో మంది ప్రజలు ఎన్నో చెప్పరాని బాధలు అనుభవించారు. కాని మన సామూహిక పిరికితనం, నిర్లప్తత దాన్నంతా మౌనంగా చూస్తూ ఉండిపోయింది.

ప్రజల జీవించే హక్కు మీద అంత బహిరంగంగా కత్తులు వేలాడుతుంటే, వందలాది మంది ప్రజలు అట్లా నిస్సహాయంగా బలి అయిపోతుంటే, న్యాయస్థానాలు మూగనోము పట్టాయి. జీవించే హక్కును కాపాడవలసింది న్యాయస్థానాలే. కాని అవి మాట్లాడకుండా ఉండిపోయాయి. జీవించే హక్కుకు మరొక రక్షకులు పోలీసు యంత్రాంగం. పోలీసులు ఈ విచ్చలవిడి మారణకాండను ఆపలేదు సరిగదా, హంతకులకు సహకరించారు.

ఈ మొత్తం మారణకాండ సందర్భంలో మాట్లాడినది, ఆ దౌర్జన్యానికి వ్యతిరేకంగా గొంతెత్తినది పౌరహక్కుల ఉద్యమం మాత్రమే. పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ (పియుసిఎల్), పీపుల్స్ యూనియన్ ఫర్ డెమొక్రటిక్ రైట్స్ (పియుడిఆర్) రెండూ సంయుక్తంగా ఒక నివేదికను దేశం ముందు ఉంచాయి. 'హు ఆర్ ది గిల్టీ' అనే పేరుతో వెలువడిన ఆ నివేదిక చాలా ప్రాచుర్యాన్ని పొందింది. ఆ నివేదిక చాలా వివరంగా ఢిల్లీలో ఏయే ప్రాంతాలలో ఎంతెంత మంది సిక్కుల మీద హత్యలు, అత్యాచారాలు, గృహదహనాలు, ఆస్తి విధ్వంసాలు జరిగాయో నమోదు చేసింది. ఏయే కాలనీలలో ఎన్నెన్ని ఘోరాలు జరిగాయో లెక్కలు చెప్పింది. అక్కడి స్థానిక ప్రజల నుంచి, ప్రత్యక్ష సాక్షుల నుంచి సేకరించిన సమాచారంతో ఎక్కడెక్కడ దోషులెవరో కూడా ఆ నివేదిక పేర్లు ప్రకటించింది. అంటే మామూలుగా రాజ్యం, పోలీసులు, అధికారులు,

న్యాయస్థానాలు చేయవలసిన పనిని పౌరహక్కుల సంఘాలు చేశాయి.

ఆ నివేదికలో దోషులుగా పేర్లు ఉదహరించబడిన వాళ్లు అల్లరి మూకలను వెంటవేసుకుని సిక్కుల ఇళ్ల మీద దాడి చేసి హత్యలకూ అత్యాచారాలకూ పాల్పడ్డారని అందరికీ తెలుసు. కాని ఈ నివేదిక వచ్చిన తర్వాత, ఆ హత్యాకాండకు కారకులలో ఒకడైన లలిత్ మాకెన్‌ను ఎవరో కాల్చి చంపితే ఈ నివేదిక వల్లనే ఆ పని జరిగిందని పౌరహక్కుల సంఘాల మీద, నివేదిక మీద దుమ్మెత్తిపోశారు. అర్జున్ దాస్ అని మరొక నిందితుడు ఉన్నాడు. అతనికి బెదిరింపు ఫోన్‌కాల్స్ వచ్చాయి. మళ్లీ పియుసిఎల్, పియుడిఆర్‌ల మీద దాడి మొదలైంది. సరిగ్గా ఆ సమయంలో నేను ఢిల్లీలోనే ఉన్నాను. అప్పటి పియుడిఆర్ అధ్యక్షుడు గోవింద ముఖోటీ కంగారు పడ్డాడు. "మేం నివేదికలో దోషుల పేర్లు ప్రకటించకపోవలసిందా" అని సందేహం వెలిబుచ్చాడు. నిజంగానే అప్పుడు ఢిల్లీలో పౌరహక్కుల నాయకులందరికీ ప్రాణహాని ప్రమాదం వచ్చి పడింది.

ఇది ఎందుకు జరుగుతుందంటే, నిజంగా ఆ బాధ్యత తీసుకుని, దోషులను గుర్తించి, బోనెక్కించవలసిన రాజ్యాంగ యంత్ర విభాగాలు ఆ పని చేయనప్పుడు, స్వతంత్రంగా, ఏవైనా పౌర, ప్రజా సంస్థలు ఆ బాధ్యతకు పూనుకున్నప్పుడు నిజంగానే నేరస్తులకు కోపం రావడం, తమ పేర్లు బయట పెట్టిన వాళ్ల మీద ప్రతీకారం తీర్చుకోవాలని అనుకోవడం జరుగుతుంది. రాజ్యాంగ యంత్రం సక్రమంగా సామాజికంగా అమలు చేయనప్పుడు, ఇక వ్యక్తులు విడివిడిగా తమకు న్యాయమని తోచిన దాన్ని అమలు చేసుకుంటారు. దానిలో ఒక్కొక్కసారి న్యాయం ఉండవచ్చు. ఒక్కొక్కసారి అన్యాయం ఉండవచ్చు. కాని గుర్తించవలసిన విషయమేమంటే, ప్రభుత్వాలు, రాజ్యాలు, అధికార యంత్రాంగాలు న్యాయం చేయనప్పుడు, లేదా అన్యాయానికి సహకరించినప్పుడు ఇటువంటి ధోరణులు తలెత్తుతాయి.

అంటే న్యాయస్థానాలు స్పందించకఉండా ఉన్నప్పుడు, ప్రజా ప్రయోజన వ్యాజ్యం, ఎవరూ ఫిర్యాదు చేయకుండానే సుమోటోగా న్యాయస్థానాలు జోక్యం చేసుకోవచ్చునని ఆలోచనలు వచ్చిన తర్వాత కూడా ఇంత పెద్దఎత్తున మానవ హననం, దారుణ మారణకాండలు జరిగిపోతుంటే, దేశంలోని అత్యున్నత న్యాయస్థానాలు పెదవి విప్పకుండా కూచుంటే, ఏ పనీ చేయకుండా ఉంటే తప్పుపట్టవలసిందెవరిని? ఆ మారణకాండలను ఆపగలవాళ్లందరూ మౌనం వహించారు. ప్రభుత్వం మాట్లాడలేదు. న్యాయస్థానాలు మాట్లాడలేదు. మేధావులు మాట్లాడలేదు.

ఆ తర్వాత కొన్ని కంటి తుడుపు చర్యలు చేపట్టారు. కేసులు నమోదు చేయడం, విచారణ జరపడం చేశారు. మొత్తం మీద సిక్కుల హత్యాకాండ మీద పదకొండో, పన్నెండో విచారణ కమిషన్లు వేశారు. ఇంత వరకూ ఒక్క కమిషన్ నివేదిక కూడా వెలుగు చూడలేదు. బృందా గ్రోవర్ అని ఒక సుప్రీంకోర్టు న్యాయవాది ఉన్నారు. ఆమె

నా స్నేహితురాలే. ఆమె 'క్వెస్ట్ ఫర్ జస్టిస్" అనే శీర్షికతో రెండు సంపుటాల పుస్తకం ఒకటి తీసుకొచ్చారు. ఆమె నమోదు చేసిన సంఘటనలలో ఒక సంఘటన గురించి చెప్పాలి. కౌర్ అని ఒక సిక్కు మహిళ భర్తను, కుటుంబ సభ్యులను 1984 హత్యాకాండలో చంపేశారు. ఆ మొత్తం దారుణానికి ప్రత్యక్షసాక్షి, ఇంకా సజీవంగా ఉన్న ఏకైక సాక్షి ఆమె ఒక్కరే. ఆమె ఒక్కరు మాత్రమే జరిగిన దారుణం గురించి మాట్లాడగలరు. ఆమెను ప్రభుత్వం ఇప్పుడు సాయుధ రక్షణ ఇచ్చి కాపాడవలసి వస్తోంది.

ఈ స్థితి ఎందుకు వచ్చింది? మన సమాజంలో ప్రభుత్వాలు సోషల్ కాంట్రాక్ట్‌ను గౌరవించనందువల్ల. ఆధునిక సమాజాలన్నీ ఒక సామాజిక కట్టుబాటు (సోషల్ కాంట్రాక్ట్)కు లోబడి ఉన్నాయి. వేర్వేరు ప్రజా సమూహాల మధ్య ఎవరెవరు ఏమేమిచేయాలో, విధులు, బాధ్యతలు ఏమిటో ఒక కట్టుబాటు ఉంటుంది. అది కేవలం పాశ్చాత్య సమాజాలకు సంబంధించిన సిద్ధాంతం మాత్రమే కాదు. ఒక కుల వర్గీకరణ ఉన్న సమాజంలో కూడా, వర్గీకరణలు, చీలికలు, అంతరాలు ఎట్లా ఉన్నప్పటికీ, ప్రజలందరి మధ్యా ఒక ఒప్పందం ఏమంటే, కొన్ని విషయాలకు సామాజిక ఆమోదం లేదు. ఫలానా ఫలానా పనులు జరిగాయంటే సమాజ మనుగడ మిగలదు. అవి మౌలికమైన, కనీసమైన సంగతులు. వాటిని ఎవరూ ఉల్లంఘించడానికి వీలు లేదు.

1984 సిక్కుల హత్యాకాండ అటువంటి ఉల్లంఘన. అది ఈ దేశంలో అతి పెద్ద ఎత్తున మైనారిటీల మీద జరిగిన హత్యాకాండ. అంతకుముందు మైనారిటీల మీద అత్యాచారాలు జరుగుతున్నాయి గాని, విస్తృతిలోనూ, రాజ్యపు మద్దతులోనూ 1984 హత్యాకాండ ఒక మైలురాయి.

ఇక్కడ ఇంకొక వివక్షను కూడా చూడాలి. ఇందిరాగాంధీ హత్యకేసులో విచారణ చాలా వేగంగా జరిగింది. కోర్టు విచారణ కూడా అతి తక్కువ సమయంలో జరిగిపోయింది. నిందితులలో కొందరిని నేరస్తులుగా గుర్తించారు. శిక్షలు వేశారు. ఆ హత్య జరిగిన తర్వాత వారం రోజులపాటు దేశవ్యాప్తంగా సిక్కుల ఊచకోత జరిగితే, వేలాది మంది హత్యకు గురయితే విచారణలు లేవు. విచారణ కోసం వేసిన కమిషన్లు తమ పనిపూర్తి చేయకపోతే అడిగినవాడులేడు. ఆ కమిషన్ల పనికి ఆటంకాలను ప్రభుత్వాలే కలిగించాయి. కోర్టు కేసులు లేవు. వేలాది నేరాలకు గాను ఒక డజను కేసులు కూడా కోర్టులలో పూర్తిస్థాయి విచారణను పూర్తి చేసుకోలేదు. ఈ వివక్ష ఎందుకు? ఒక కేసులోనేమో విచారణ తొందర తొందరగా పూర్తి చేయాలని, మరొక కేసులో విచారణ జరగకూడదని రాజకీయ నాయకులు ఎందుకు అనుకున్నారు?

భారత రాజకీయాలలో రోజురోజుకీ స్పష్టంగా బయట పడుతున్నదేమంటే, ప్రభుత్వం తనకు ఉండవలసిన మౌలిక లక్షణమైన నిష్పాక్షికతను పోగొట్టుకుంటోంది. నానాటికీ అది ఒక పక్షానికి అనుకూలంగా ప్రవర్తిస్తోంది. అంటే, రాజ్యం రాజ్యాంగానికి అనుగుణంగా

పరిపాలన నడపడం లేదన్నమాట. అంటే అధికారంలో ఉన్న వారు తమ ఇష్టాయిష్టాల ప్రకారం, తమ అభిప్రాయ దురభిప్రాయాల ప్రకారం పరిపాలన సాగిస్తున్నారన్నమాట. అటువంటి సమయంలోనే ప్రభుత్వం తన సాధికారతను కోల్పోతుంది.

అయితే ప్రభుత్వం సాధికారతను కోరుకోవడం కూడా ఎప్పుడు జరుగుతుందంటే, తన అధికారానికి సవాళ్లు ఎదురైనప్పుడు. ప్రజల నుంచి ప్రశ్నలు, నిరసనలు ఎదురైనప్పుడు.

సిక్కులు ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రారంభించారు. భారతదేశం నుంచి వేరయిపోవాలని కూడా కొందరు భావించారు. తమకు మైనారిటీ హక్కులు, పరిరక్షణ కావాలని కోరుకున్నారు. పరిపాలన గురించి మనకు ఎంత తప్పుడు అభిప్రాయాలు ఏర్పడి ఉన్నాయంటే, ప్రజల నుంచి నిరసన, ప్రశ్నలు తలెత్తినప్పుడు, ప్రభుత్వం వాటిని తన పాలనలో సవరించుకోవలసిన అంశాల మీద ప్రమాద సూచనలుగా గ్రహించడం లేదు. 'మేం ప్రభుత్వంలో ఉన్నాం. మేం పరిపాలన సాగిస్తున్నాం. మాకు పరిపాలన గురించి పూర్తిగా తెలుసు. మాకు పరిపాలించే హక్కు ఉంది. ఎవరైనా నిరసన ప్రకటిస్తున్నారంటే వాళ్లు మా శత్రువులే' - ఇదీ అధికారంలో ఉన్నవాళ్ల ఆలోచన. ఇంతే గాని, పరిపాలన అంటే ఏమిటి, అధికారంలో ఉన్న వారికి అంటే ఏమిటి, అధికారంలో ఉన్న వారికి పరిపాలనాధికారం ఎట్లా వచ్చింది. దాన్నివారికి ఎవరు ఇచ్చారు. ఆ పరిపాలనా స్వభావం ఏమిటి, ఆ పరిపాలనా పరిమితులు ఏమిటి - ఈ ప్రశ్నలేవీ మన పాలకులకు ఎప్పుడూ తట్టవు.

ఒక రాజకీయ పార్టీ ఎన్నికలలో ఎగలిచి ప్రజలను పాలించడానికి అధికారం, హక్కు పొందిందంటే, ఆ పాలన స్వభావం ఏమిటి? ఆ హక్కు నీకు రాజ్యాంగానికి అనుగుణంగా పాలించే అధికారాన్ని ఇస్తుందా, లేక, రాజ్యాంగాన్ని పక్కనపెట్టి నీ ఇష్టారాజ్యంగా అధికారం చలాయించే హక్కు ఇస్తుందా?

ఈ దేశంలో ఈ అర్థంలో ఎప్పుడూ పరిపాలన సక్రమంగా జరగలేదు. ఎప్పుడూ దుష్పరిపాలనే సాగుతూ వచ్చింది. 1950ల నుంచీ కూడా దుష్పరిపాలన చిన్న చిన్నగా మొదలై. 1970ల నాటికి అత్యున్నత స్థానాలకు చేరింది. ఈ మొత్తం చరిత్రలో సరైన పాలన ఎప్పుడో ఒకసారి మినహాయింపుగానే జరిగింది.

ఇటువంటి దుష్పరిపాలనవల్ల ఒక మైనారిటీని లక్ష్యంగా చేసుకుని దాడులు జరిగినప్పుడు, రాజ్యానికి ఆ దాడులను ఆపే శక్తి లేకపోయింది. రాజ్యం నేరస్తులతో భాగం పంచుకుంది. దళితులను ఒక సమూహంగా లక్ష్యంగా చేసుకోవడం ఎప్పటి నుంచో జరుగుతూనే ఉంది. ఇప్పుడిక ఒక మత సమూహం మీద దాడి మొదలైంది. ఈ దేశంలోని మేధావి వర్గం, ఆలోచించి, రాసి, మాట్లాడి, తమ అభిప్రాయాలు వ్యక్తీకరించగలిగిన అవకాశం ఉన్న వర్గం పూర్తిగా గొంతెత్తి ఆ దుర్మార్గాన్ని ఖండించలేదు.

ఎటువంటి పాలన సాగుతున్నప్పుడైనా ఈ రకమైన దౌర్జన్యం జరగడానికి వీలు లేదు అని ఈ దేశంలోని ఏ ఒక్క సంఘటిత వర్గం కూడా తన నిరసన ప్రకటించలేదు. అంటే పాలనా పద్ధతుల మీద మన అవగాహనా రాహిత్యానికి అది చిహ్నం.

అటువంటి దౌర్జన్యాలు, దుర్మార్గాలు జరుగుతున్నప్పుడుగాని, జరిగిపోయిన తర్వాతగాని పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన జరగలేదు. కార్మికవర్గం నిరసన తెలపలేదు. విద్యార్థివర్గం నిరసన తెలపలేదు. ఏ సంఘటితవర్గం కూడా తమ నిరసనను ప్రకటించలేదు.

నిరసన ప్రదర్శన అంటే కేవలం సభలు, సమావేశాలు జరపడం మాత్రమే కాదు. ప్రజలు విస్తృతంగా వీధుల్లోకి వచ్చి "ఇటువంటి ఘటనలు జరగడానికి వీలు లేదు. మేం ఇటువంటివి జరగనివ్వం" అని ప్రదర్శనలు జరపడం. తమ ప్రతిఘటనను మొత్తంగా లోకానికి తెలియజేయడం "ఇది ప్రజా స్వామ్యం కాదు, ఇది రాజ్యాంగబద్ధమైన, చట్టబద్ధమైన పాలన కాదు" అని బహిరంగంగా ప్రకటించడం. ఆ పని ఎవరూ చేయలేదు.

1984లో సిక్కుల మీద జరిగిన మారణకాండపై దేశవ్యాప్తంగా పెద్దఎత్తున నిరసన ప్రదర్శనలు జరగనందువల్ల, ఇక మైనారిటీల మీద దాడులు, దౌర్జన్యాలు, అత్యాచారాలు, హింసాకాండ సర్వసాధారణమైపోయాయి. దళితులు మైనారిటీలు కాకపోయినప్పటికీ వారి మీద కూడా దాడులు పెరిగిపోయాయి. నిజానికి హిందూత్వ వాదుల ప్రకారం దళితులు కూడా హిందూ ధర్మంలో భాగమే. కాని వారి మీద కూడా దౌర్జన్యాలు పెరిగిపోయాయి. డా. అంబేద్కర్ దళితులకు మైనారిటీ ప్రతిపత్తి కావాలని కోరాడు. బహుశా అదే కొంత మెరుగుగా ఉండేదేమో.

ఇక 1987లో ఒక సమస్య వచ్చింది. కాలేజీలు పెట్టుకోవడం ఒక వ్యాపారమైపోయి, ఆ లాభసాటి వ్యాపారాన్ని ఎవరు నిర్వహించాలి. ఆ వ్యాపారం ఎవరి చేతుల్లో ఉండాలి అనే విషయంలో ఘర్షణ వచ్చి అది మైనారిటీల మీద దాడిగా పరిణమించింది. కర్నాటకలోని బీదర్ పట్టణంలో ఒక గురుద్వారా ఉంది. అక్కడ కొన్ని కాపిటేషన్ విద్యా సంస్థలున్నాయి. ఒక సంస్థను జోగాసింగ్ అనే ఎ క్లాస్ కంట్రాక్టర్ నడుపుతున్నాడు. అక్కడి గురునానక్ ట్రస్ట్ పేరుతో ఆ సంస్థలు నడుపుతున్నాడు. అతను అక్కడ చాలా పెద్ద మనిషి. అతను తనకు ఉన్న విద్యా సంస్థలకు తోడుగా ఒక మెడికల్ కాలేజి పెట్టాలనుకున్నాడు. అతనికి ఇంకా చాలా విద్యా సంస్థలున్నాయి. గనుక, సిక్కుల సంస్థగా పేరుంది. గనుక చాలా మంది విద్యార్థులే వస్తారు. మరి అతని సంస్థను దెబ్బ తీయడం ఎట్లా? సరిగ్గా అప్పుడే పంజాబులో కల్లోలం జరుగుతోంది గనుక, చాలా మంది విద్యార్థులు పంజాబ్ నుంచి బీదర్‌కు చదువుకోవడానికి వస్తుండే వారు. అంతేకాదు, ఈ జోగాసింగ్‌కు రామకృష్ణహెగ్డేతో దగ్గరి సంబంధాలు ఉండేవి. ఆ సంబంధాలవల్ల మెడికల్ కాలేజి అనుమతి సంపాదించడం సులభమైంది. ఆ అనుమతి దొరికి కాలేజి

ఏర్పాటయిన తర్వాత బీదర్‌లోని హిందూ మతవాదులకు అది కేన్ద్రగా మారింది. అప్పటికే ఢిల్లీలోనూ, దేశవ్యాప్తంగానూ సిక్కుల మీద అత్యాచారాలు, మారణకాండ జరిగి వాళ్లకు ఒక ఉదాహరణ దొరికి ఉంది.

అప్పటి వరకు మన దేశంలో మైనారిటీ అంటే ముస్లిములు మాత్రమేననే ఒక అభిప్రాయం ఉండేది. హిందూ - ముస్లిం మత ఘర్షణలు అనే పేరుతో ఆ ఘర్షణలన్నిటినీ మామూలు ఘటనలుగా చూడడం మనకు అలవాటయిపోయింది. హిందూ - ముస్లిం మత ఘర్షణలు అనేవి మనకు ఎంత మామూలు అయిపోయాయంటే, మన శరీరం మీద కురుపు వచ్చినట్టన్నమాట. అది గడ్డలాగ వస్తుంది. చీము పడుతుంది. ఆ తర్వాత మానిపోతుంది. అంతే చాలా మంది ప్రజలు ఈ మత ఘర్షణలనబడే వాటి విషయంలో తీసుకున్న వైఖరి ఇదే.

1984లో మొదటిసారి మరొక మైనారిటీ మీద మారణకాండ జరిగి మనకు వేరే మైనారిటీలు కూడా ఉన్నారనే స్పృహ కలిగింది. ఇక అది ఉదాహరణగా తీసుకుని, అన్ని చోట్లా సిక్కుల మీద దాడులు మొదలయ్యాయి. చాలాచోట్ల మతం కన్నా ముఖ్యంగా ఇతర కారణాలు ఉన్నాయి. బీదర్‌లో విద్యా సంస్థల వ్యాపార పోటీ హిందూ - సిక్కు మత ఘర్షణ రూపం తీసుకుంది.

బీదర్‌లో దాదాపు ఇరవై మంది సిక్కు విద్యార్థులను చంపేశారు. అందరూ తమ యవ్వనంలో ప్రవేశిస్తున్న చిన్న పిల్లలు. చంపి కొన్ని శవాలను ఒక బావిలో వేశారు. అక్కడ పోలీసు సూపరింటెండెంట్ ఈ హత్యాకాండలో ప్రధాన పాత్ర వహించాడు. అది ఒక దారుణమైన సంఘటన. ఇద్దరు సిక్కు పిల్లల జడలు ముడివేసి ఎస్‌పి ఇంటి ఆవరణలో మారు మూల ఉండే ఒక బావిలో పడేశారు. ఆ ఇద్దరూ అన్నదమ్ములు. వాళ్ల తల్లిదండ్రులకు వాళ్లిద్దరే పిల్లలు. ఆ తల్లిదండ్రులకు మళ్లీ పిల్లలు పుట్టే అవకాశం లేదు. మరికొందరిని తగలబెట్టి చంపేశారు.

మరొకవైపు నుంచి చూస్తే ఆ సిక్కు విద్యార్థులు వచ్చిన తర్వాత బీదర్ ఆర్థిక వ్యవస్థలో చాలా మార్పులు జరిగాయి. చలనం వచ్చింది. కొత్త భవనాలు జరిగాయి. కొత్త హోటళ్లు వచ్చాయి. పట్టణంలో ఇళ్ల అద్దెలు పెరిగిపోయాయి. అంటే ఆ పట్టణంలో వీళ్లు ప్రత్యేకంగా కనబడే పరిస్థితి వచ్చిందన్నమాట. అందువల్ల ఆ విద్యార్థులను ఏరి ఏరి లక్ష్యంగా పెట్టుకుని చంపేశారు.

ఆ మారణకాండ ఒక వినాయక చవితి రోజున జరిగింది. ఆ హత్యాకాండపై జస్టిస్ శ్యాంసుందర్ అని ఒక హైకోర్టు జడ్జి చేత న్యాయవిచారణ కమిషన్ వేశారు. అప్పుడు హెగ్డే కర్నాటక ముఖ్యమంత్రి. ఆయనే శ్యాంసుందర్ ఏకసభ్య విచారణ కమిషన్ నియమించారు. ఆ కమిషన్‌లో నన్ను తమ తరఫున వాదించమని జోగాసింగ్ వచ్చి అడిగాడు. నేనూ, గురుద్వారా తరఫున చమన్‌సింగ్ అనే మరొక న్యాయవాది ఆ కమిషన్

ముందు వాదనలు వినిపించాం.

ఆ కమిషన్ విచారణ గురించి ప్రత్యేకంగా తెలుసుకోవాలి. ఎందుకంటే, మనకు మామూలుగా 'హిందువులు చాలా సాత్వికులు, చీమకు కూడా అపకారం తలపెట్టనివాళ్లు అందరితోనూ సహనంగా ఉంటారు" అని చెప్తుంటారు గదా. "చాలా నెమ్మదస్తులు, శాకాహారులు, అహింసాపరులు, ఆచార పరాయణులు" అని చెప్తుంటారు గదా. అవన్నీ పచ్చి అబద్ధాలు. హిందువులలో హింసకు దిగేవాళ్లు ఎంత హింసాత్మకంగా ఉంటారో, ఎంత దుర్మార్గంగా ఉంటారో చెప్పలేం. బీదర్‌లో అది బయటపడింది.

బీదర్‌లో వినాయక చవితి రోజు ఈ సిక్కు విద్యార్థులు తమ లంగర్ (భోజనశాల) నుంచి తిండి తిని తమ గదులకు పోతున్నారు. అందరికీ తెలిసిన సంగతే. సాధారణంగా గణేష్ మండపాలన్నీ రౌడీలు, దాదాలు ఏర్పాటు చేస్తుంటారు. పాపం ఆ దేవుడికి ఇప్పుడు రౌడీలే పోషకులు అయిపోయారు. ఏది చేసినా వాళ్లే చేయాలి.

ఆ విద్యార్థులు ఒక మండపం ముందునుంచి పోతుంటే, అక్కడ కూచున్న రౌడీలు, "పీకే జారే దేఖో మాకేలౌడే" అన్నారు. సిక్కు విద్యార్థులు ఆ మాట విని అప్పుడే ఏమీ జవాబు చెప్పకుండా హాస్టల్‌కు వెళ్లిపోయి, ఇతర విద్యార్థులను తీసుకుని, హాకీ స్టిక్కులు పట్టుకుని తిరిగి వచ్చి ఆ మండపంలో ఉన్న వారికి దేహశుద్ధి చేసి వెళ్లిపోయారు. ఇది మాకు ఎట్లా తెలిసిందంటే, కమిషన్ విచారణ సందర్భంగా, పాప్లై అని ఒక డిఐజి ఉన్నాడు. ఆ డిఐజికి ఒక టెలిప్రింటర్ మెస్సేజ్ వెళ్లింది. ఆ మెసేజిలో ఈ ఘర్షణ ఎట్లా ప్రారంభమైందో వివరాలు రాసి ఉన్నాయి. మొదటి సిక్కు విద్యార్థులను రెచ్చగొట్టినది మండపంలోని కూచున్న వాళ్లే అని ఆ మెసేజిలో స్పష్టంగా ఉంది.

బీదర్‌లో సిక్కు విద్యార్థుల జనాభా వెయ్యిన్నర ఉంటుంది. విచారణ సందర్భంగా ఎస్‌పిని ప్రశ్నించాం. ఆ ఎస్‌పి బాగా చదువుకున్నవాడు. ఆంత్రోపాలజీలో పిహెచ్‌డి చేశాడు. సిక్కు విద్యార్థులు దొమ్మీకి వచ్చినందువల్లనే ఘర్షణ జరిగిందని అతని వాదన. ఇటు నుంచి ఐదువందల మంది వచ్చారు.అటు నుంచి మరొక ఐదువందల మంది వచ్చారు. ఇంకొక వైపు నుంచి ఇంకొక ఐదువందల మంది వచ్చారు... అని చెపుతూ పోయాడు. ఆ లెక్కన బీదర్‌లో సిక్కు విద్యార్థుల సంఖ్య ఏ రెండున్నర వేలకో చేరుతుందీ. అప్పుడు నేను అతడిని అడిగాను. బీదర్‌లో సిక్కు విద్యార్థుల జనాభా ఎంత ఉండవచ్చు అని మరి బయటి నుంచి ఎవరన్నా వచ్చారా అని అడిగాను. ఎస్‌పి చెబుతున్నది అబద్ధమని అక్కడికక్కడ తేలిపోయింది.

ఆ హత్యలు కూడా ఎంత క్రూరంగా చేసినారంటే నరికి పోగులు పెట్టారు. వెంటబడి వేటాడి జంతువులను చంపినట్టు చంపారు. బంటీ అని ఒకపదిహేడేళ్ల కుర్రవాడిని ఆ హత్యాకాండకు ప్రత్యక్షసాక్షి. ఆ కుర్రవాడిని గంజ్‌లో రోడ్డు మీద పడుకోబెట్టి అతని మీద స్కూటర్ ఎక్కించాలని చూసినారు. అది ఎక్కకపోతే, 5 హెచ్‌పి మోటార్ సైకిల్

ఎక్కించాలని చూసినారు. అది కూడా వాళ్లకు సాధ్యం కాలే ఎ. దానితో, పక్కనే ఒకకలపకోత మిషన్ ఉంటే ఆ మిషన్ మీద పడుకోబెట్టినారు. అదృష్టవశాత్తో, దురదృష్టవశాత్తో గాని కరెంటుపోయింది. అతను బతికిపోయాడు. శ్యాంసుందర్ కమిషన్ ముందర తన అనుభవం చెప్పడానికి వాంగ్మూలం వినిపించడానికి వచ్చాడు.

అది అతనికి బతుకు నిలిపింది గనుక అదృష్టం అని అనుకోవచ్చుగాని, నేనయితే కమిషన్ ముందర అది దురదృష్టం అనే వాదించాను. ఎందుకంటే, ఆ పదిహేడేళ్ల కుర్రవాడు ఇక జీవితాంతం ఈ భయంకర జ్ఞాపకంతో జీవించవలసి ఉంటుంది. అది అతడి జీవితాన్ని సర్వనాశనం చేస్తుంది.

"ఒక వేళ ఈ యువకుడు పెద్ద పెరిగి టెర్రరిస్టుగా మారితే, మీరు అతడిని తప్పుపట్టగలరా" అని నేను కమిషన్‌ను ప్రశ్నించాను.

నాలుగు శవాలను పోలీసు సూపరింటెండెంటు ఇంట్లో బావిలోనే పడేశారంటే ఈ ఘాతుకం ఎంత బహిరంగంగా జరిగిందో చూడండి. ఎస్‌పి వాళ్ల రక్షణకు రాలేదు. ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేటు వాళ్ల రక్షణకు రాలేదు. ఏ ఒక్కరూ ఆ దారుణ మారణకాండకు బలి అయిన వాళ్లను రక్షించడానికి రాలేదు. ఇదంతా కమిషన్ విచారణలో స్పష్టంగా బయటపడింది.

దీనిలో ఒక హాస్యాస్పదమైన సంగతి కూడా ఉంది. మన వ్యవస్థలలోని చీడకు అది అద్దం పడుతుంది. విచారణ సందర్భంలో ఒక సిక్కు ప్రొఫెసర్ తన వాంగ్మూలంలో భాగంగా కర్నాటకలోని కాపిటేషన్ కాలేజీల వ్యాపారాన్ని విమర్శించాడు. జస్టిస్ శ్యాంసుందర్‌కు చాలా కోపం వచ్చింది. కర్నాటక ఆ కాపిటేషన్ కాలేజీలవల్ల ఎంత దేశసేవ చేస్తున్నదో, కర్ణాటకకు అని ఎంత గర్వకారణమో ఉపన్యాసం ఇచ్చాడు. మొత్తం మీద కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం విధానాలను పొగుడుకున్నాడు. నేను వింటూ గమ్మున ఉండిపోయాను.

ఆ తర్వాత, ఆ సిక్కు ప్రొఫెసర్ బీదర్‌లో భద్రత గురించి మాట్లాడుతూ, "ఇక్కడ భద్రత లేదు. నేను మా రాష్ట్ర ప్రభుత్వానికి కూడా రాశాను. కాని ఏమీ జరగలేదు" అని అన్నాడు. మీ రాష్ట్ర ప్రభుత్వం అంటే ఏమిటి అని శ్యాంసుందర్ అడిగాడు. పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం అని ఆ ప్రొఫెసర్ అన్నాడు. జడ్జి నవ్వాడు.

అప్పుడు నేను లేచి, "నవ్వకండి. మీ ప్రభుత్వం మీద నమ్మకం లేదు కాబట్టి తన ప్రభుత్వానికి రాశానని చెబుతున్నాడు. చూడండి ఈ దేశంలో పాలన ఏ స్థితికి వచ్చిందో. ఇక్కడ రాజ్యాంగ ప్రకారం ఎవరైనా ఎక్కడికైనా వెళ్లి బతకవచ్చు. అక్కడ భద్రతలేదని అనిపిస్తే స్థానిక ప్రభుత్వానిదే బాధ్యత. అక్కడి శాంతి భద్రతలు అక్కడి స్థానిక అధికారుల బాధ్యత మాత్రమే. కాని ఈ ప్రొఫెసర్‌గారు తన భద్రత తను పుట్టిన రాష్ట్రంలో పాలకుల బాధ్యత అనుకోవలసిన స్థితి వచ్చింది. కాపిటేషన్ కాలేజీలను ఆయన విమర్శిస్తే మీకు

కోపం వచ్చింది. మీరు ఒకన్యాయమూర్తి స్థానంలో కూచుని మీ రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ఎవరైనా విమర్శిస్తే భరించలేని స్థితిలో ఉన్నారు. ఈ దేశం ఇవాళ్టికి ఇక్కడికి చేరిందన్నమాట" అని చెప్పాను.

మామూలుగా ఇటువంటి ఘర్షణలు జరిగేటప్పుడు వాటిని నివారించడానికి, 144 సెక్షన్ విధించడానికి గాని, కాల్పులకు ఉత్తర్వులు ఇవ్వడానికిగాని ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ రావాలి గదా. ఆయన అంతా అయిపోయాక, అందరినీ చంపేసిన తర్వాత వచ్చాడు. ఎందుకయ్యా అంటే, "నేను గణేశ్ పూజలో తీరికలేకుండా ఉన్నాను. పూజ ముగించుకుని వచ్చేసరికి ఇది జరిగిపోయింది" అని కమిషన్ ముందర చెప్పాడు.

సరిగ్గా రోము నగరం తగలబడిపోతుంటే నీరో చక్రవర్తి ఫిడేలు వాయించుకుంటూ కూచున్నాడనే దానికి సరిగ్గా సరిపోతుంది అన్నాను నేను.

నేను చేసిన ఆ వ్యాఖ్యను జస్టిస్ శ్యాంసుందర్ తన నివేదికలో యథాతథంగా ఉటంకించాడు. "విజ్ఞుడైన సీనియర్ కౌన్సిల్ చెప్పినట్టుగా, రోము నగరం తగలబడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేలు వాయించుకుంటూ కూచున్నట్టు, జిల్లా అధికార యంత్రాంగం ప్రవర్తించింది" అని విచారణ కమిషన్ నివేదికలో రాశారు. జిల్లా అధికారులు తమ విధ్యుక్త ధర్మాలను నిర్వహించడంలో విఫలమయ్యారని తీవ్రంగా విమర్శిస్తూ రాశారు. హిందూ మతోన్మాదులను విమర్శించలేదనుకోండి. అది వేరే కథ. ఘర్షణలను, హత్యాకాండను ఆపడానికి అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదనేది ఒక వాస్తవం. తనకు సమాచారం అందిందని చెప్పిన పాష్టే కూడా ఘర్షణలను ఆపడానికి రాలేదు.

అందుకే నేను పదేపదే చెప్పేదేమంటే, ఈ సమాజంలో మనకు ఒక అన్యాయాన్ని అన్యాయంగా గుర్తించే అలవాటు లేకుండా పోయింది. ఒక విషయం అన్యాయం అని గుర్తిస్తే దానికి గురయినవాళ్లు ఏ కులానికి చెందినా, ఏ మతానికి చెందినా, ఏ సామాజిక వర్గానికి చెందినా అన్యాయమే కావాలి. కాని మన సమాజంలో అలవాటేమిటంటే ప్రతి ఉదాత్త ఆదర్శాన్ని కూడా విభజించి చూడవచ్చుననుకుంటాం. ప్రతి ఉన్నత ప్రమాణాన్ని కూడా విభజించి చూసి, ఆ రకంగా మన వైఖరిని ప్రదర్శిస్తుంటాం.

అసలు ఈ కేసులో సాక్ష్యాలు ఎంత గందరగోళంగా ప్రవేశపెట్టారంటే వాటిని బట్టి ఏదైనా తేల్చి చెప్పడం అసాధ్యం. అక్కడ మొత్తం గొడవ ఐదుగురు రౌడీలవల్ల జరిగింది. ఆ రౌడీ ముఠాను నేనీ అని పిలిచేవాళ్లు. వాళ్లను అరెస్టు చేయనేలేదు. ఆ రౌడీలలో ఒకరు వచ్చి కమిషన్ ముందర సాక్ష్యం ఇచ్చాడు. ప్రాసిక్యూషన్ అతడిని విచారించింది. అతను సిక్కు విద్యార్థులు ఎట్లా వీధుల్లో చిల్లరగా ప్రవర్తిస్తుండే వారో, ఎట్లా హిందూ అమ్మాయిలను ముద్దు పెట్టుకుంటుండేవారో చెప్పారు. కాని ఆ ఆరోపణల్లో ఏ ఒక్కదానికీ ఆధారం లేదు. అతను ఏమి చెబితే అది నమ్మవలసిందేనన్న మాట. ఒక్క సందర్భంలోనైనా సాక్ష్యం లేదు. నేనతడిని ఒక ప్రశ్న వేశాను. "నువ్వింత బాధ్యతాయుతమైన పౌరుడివి

కదా, ఎప్పుడైనా ఒక్కసారయినా ఆ సిక్కు యువకులను మందలించావా? పట్టుకుని అడిగినావా? వాళ్ల పేర్లు తెలుసుకున్నావా? ఎందుకురా, ఇట్లా హిందూ స్త్రీలతో తప్పుడుగా ప్రవర్తిస్తావు అని నిలదీసినావా?' అతని దగ్గర జవాబులేమీ లేవు. మైనారిటీకి సంబంధించిన వారి మీద నిరాధారంగా ఏ ఆరోపణ అయినా చేయవచ్చునన్న మాట. ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర స్కూటర్ మీద హిందూ జంట ఆగిపోయినప్పుడు సిక్కు యువకులు వెళ్లి ఆ స్త్రీతో అనుచితంగా ప్రవర్తించారని అన్నాడతను. బాధితులెవరు, సాక్షులెవరు, ఫిర్యాదు నమోదయిందా, నిందితులను విచారించడం జరిగిందా? అతని దగ్గర జావాబులేమీ లేవు.

మరి హిందూ యువకులు ఇటువంటి పనులు చేయలేదా? హిందూ యువకులు రోడ్ల మీద స్త్రీలతో తప్పుడుగా ప్రవర్తించడంలేదా? వేధించడం లేదా? వాళ్లనేమీ నరికేయలేదే? అని అడిగాను. జస్టిస్ శ్యాంసుందర్ ఈ ప్రశ్నకు జవాబును నమోదు చేయలేనన్నాడు. "ఒక పని చేసినందుకు శిక్షగా చంపానని అతనే చెబుతున్నాడు. అటువంటి పనే మరొకరు చేస్తే చంపుతావా అని అడుగుతున్నాను, ఇందులో తప్పేముంది" అని నేను ప్రశ్నించాను.

సిక్కు యువకులు స్త్రీలతో తప్పుడుగా ప్రవర్తించినందుకే చంపానని అతడే చెవుతున్నాడుగదా, అటువంటప్పుడు, అలా ప్రవర్తించినవారందరితోనూ అలాగే వ్యవహరించావా అని అడగవచ్చు గదా. బెంగుళూరులో స్త్రీల వేధింపులను విచారించడానికే రెండు న్యాయస్థానాలున్నాయని, అవి ఎప్పుడూ కిక్కిరిసి ఉంటాయని నేను న్యాయమూర్తికి గుర్తు చేశాను.

ఈ నిరాధార ఆరోపణలను నమ్మేవాళ్లు కూడా చాలా మంది ఉన్నారు. స్వయంగా ముఖ్యమంత్రి రామకృష్ణ హెగ్డే నాకు ఈ విషయం చెప్పాడు. జస్టిస్ శ్యాంసుందర్ కమిషన్ ముందర వచ్చి వాంగ్మూలం ఇవ్వవలసిందిగా ఆయనను కూడా అడిగాం. ఆయన రాలేనన్నాడు. అప్పుడు నేనే వెళ్లి ఆయనను కలిశాను. ఆయన కూడా ఈ పనికిమాలిన వాదనలను నమ్ముతున్నాడు.

కర్నాటక పియుసిఎల్‌లో హీరేమఠ్ అని ఉండేవాడు. ఆయన బీదర్ హత్యాకాండ మీద ఒక నివేదిక ప్రచురించాడు. అందులో కూడా సిక్కు యువకులు స్త్రీలతో అనుచితంగా ప్రవర్తించేవారని, అందువల్లనే వారిని చంపేశారని రాశాడు. నేను ఆయనను నిలదీశాను. ఇలా రాయడానికి నీకు ఆధారం ఏమిటి అని అడిగాను. ఆయనకు ఆధారం బీదర్‌లో చలామణిలో ఉన్న వదంతులు.

సరే, ఆ సిక్కు యువకుల ప్రవర్తన స్త్రీలపట్ల అనుచితంగానే ఉందని వాదనకు అంగీకరిద్దాం. అందుకు వారిని ఊచకోత కోయవచ్చా? అప్పుడు కూడా మీకు కచ్చితంగా ఎవరు అనుచితంగా ప్రవర్తించారో తెలుసునా? కచ్చితంగా వాళ్లనే నరికి చంపేశారా?

లేక, ఆ జాతి వాళ్లు, ఆ సమూహానికి చెందిన వాళ్లు ఎవరు దొరికితే వారిని నరికి చంపేశారా?

ఈ రకమైన మానసిక ధోరణి మనను ప్రతి సందర్భంలోనూ అన్యాయానికి వ్యతిరేకంగా గొంతెత్తకుండా చేసింది. ఏదయినా ఒక ఘటన చూసీ చూడగానే సమర్థించడానికి వీలు లేనిదయినా, ఇటువంటి మానసిక ధోరణివల్ల సమర్థన పొందుతుంది.

చుండూరు హత్యాకాండ విచారణలో కూడా, జస్టిస్ గంగాధర రావు విచారణ కమిషన్ నివేదికలో, చుండూరు దళిత యువకులు ఆ ఊరి అగ్రవర్ణ యువతులతో అనుచితంగా ప్రవర్తించారని రాశారు. అది రాయడమే అనవసరం. అయినా, స్త్రీలతో అనుచితంగా ప్రవర్తించే వాడినల్లా చంపవచ్చు అని మనం అనుకుంటే, మొత్తం మగ జాతినే చంపిపారేయాలి.

అది ఒక సమర్థన అయిపోతుంది. అది చలామణీలోకి వస్తుంది. ఒక సమర్థన అయినా హేతుబద్ధంగా ఉండాలి. కాని ఇటువంటి సమర్థనవల్ల, హేతుబద్ధంకాని ప్రమాణాలను ప్రవేశపెడుతున్నారు. ఆ పునాది మీదనే సమర్థిస్తున్నారు. అందుకే నేనుమనుకుంటానంటే, కొన్ని ఆదర్శాలు, ప్రమాణాలు, విలువలు అందరికీ వర్తించేవి ఉంటాయి అనే విషయాన్ని మనం మొట్టమొదట అంగీకరించాలి. వాటిని మనలో లోపలికి జీర్ణం చేసుకోవాలి.

సరే, జస్టిస్ శ్యాంసుందర్ కమిషన్ విచారణ పూర్తయి, ఏదో డెబ్బై పేజీలో, ఎనభై పేజీలో నివేదిక సమర్పించారు. అందులో ఎవరిని విచారించారో, ఎవరిని దోషులుగా గుర్తించారో ఏమీ లేదు. ఎవరి మీద ఏ చర్య తీసుకోవాలో ఏ సిఫారుసులూ లేవు.

నేను చెప్పదలచుకున్న ముఖ్యమైన విషయమేమంటే దానిపట్ల సమాజానికి పెద్ద ఆసక్తి లేకుండా పోయిందనేది. ఆ విచారణలో నేను భాగం పంచుకున్నాను. బెంగుళూరులో విచారణ జరిగేటప్పుడు చంద్రమౌళి అని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ విలేకరి రోజూ ఆ కమిషన్ విచారణ గురించి వార్తలు రాయడానికి వచ్చేవాడు. అతను ఒక్కడే ప్రతి రోజూ వచ్చేవాడు. కాని మిగిలిన వాళ్లకు ఆ విషయంలో ఆసక్తి లేనేలేదు. ఎవరో ఒకరిద్దరు తప్ప మరెవరూ ఆసక్తి చూపనే లేదు. ఇక బీదర్‌లో విచారణ జరిగేటప్పుడు కొంచెం ఎక్కువ మందే వచ్చేవారు గాని అక్కడ కూడా ఎక్కువ మంది సర్దార్జీలే వచ్చేవారు. సరే హిందూ రౌడీలు కూడా వచ్చేవారు. మరెవరికీ ఈ విషయంలో ఆసక్తి లేదన్నమాట. జస్టిస్ శ్యాంసుందర్ ఒకసారి నన్ను హెచ్చరించాడు కూడా. 'మీరు వీళ్లను ఇట్లా ఇబ్బంది పెట్టే ప్రశ్నలు అడుగుతున్నారు. జాగ్రత్త అని ఏం కాదు, నాకిటువంటివి అలవాటే' అన్నాను.

* * *

# జాతిహనన చర్య

ఇక 1992 తర్వాత పెద్ద ఎత్తున మైనారిటీల మీద దాడి చేయడం మొదలయింది. ఆ మసీదును కూల్చవలసిన అవసరమే లేకుండింది. చరిత్రను ఇట్లా మీరు మీ ఇష్టానుసారం మారుస్తూ పోలేరు. చరిత్రలో అట్లా చాలా మంది ప్రయత్నం చేశారు. కాని అది సాధ్యం కాదు. అది చాలా వ్యతిరేక ప్రభావాలను కూడా కలిగిస్తుంది.

బాబ్రీ మసీదు విధ్వంసం చరిత్రను తిరగరాయడానికి జరిగిన ప్రయత్నం. అది దేశంలో జరిగిన అతి పెద్ద సాంస్కృతిక జాతి హనన చర్య అని నా అభిప్రాయం. అది ఒక నాంది. ఈ జాతి హనన కాండను భారతీయ జనతా పార్టీ, సంఘ్ పరివార్ శక్తులు ప్రారంభించాయి. ఉర్దూ భాష మీద వ్యతిరేకత, దాన్ని బోధించకూడదనడం ఇవన్నీ జాతి హననానికి సూచనలే.

అవతలి వాళ్లను మన అభిప్రాయాలతో ఒప్పించడాన్ని అర్థం చేసుకోవచ్చు. కాని అది చర్చ ద్వారా, ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా జరగలవలసిందేగాని, బలవంతాన అవతలి వాళ్లను చంపివేసి, చంపుతామని భయపెట్టి, వాళ్ల సాంస్కృతిక చిహ్నాలను ధ్వంసం చేసి చేయవలసిన పని కాదు. కాళోజీ రాశాడు ఒప్పుకోనివాడి పీకనొక్కు సిద్ధాంతం ఫాసిజం అని. సంఘ్ పరివార్ శక్తులు మొదటి నుంచీ కూడా భారతదేశాన్ని ఇటువంటి ఫాసిజంతో మతోన్మాదమయం చేయాలని ప్రయత్నిస్తూ వస్తున్నాయి.

గాంధీజీ హత్య జరిగిన సందర్భమే తీసుకోండి. అప్పుడేమీ మత కల్లోలాలు జరగలేదు. నాకు బాగా గుర్తు. ఆ రోజు లోకయ్య అని నా స్నేహితుడి పెళ్లికి వెళుతున్నాను. అప్పుడే గాంధీజీ హత్య వార్త తెలిసింది. అప్పుడు గాంధీజీని ఎవరు చంపారనే విషయం మొదటి నుంచీ తక్కువగా చెప్పడం మొదలు పెట్టారు. మొదట అందరూ ఆ పని సాయెబులే చేసి ఉంటారని అనుకున్నారు. మద్రాసులోనైతే సాయెబుల మీద దాడులు కూడా మొదలయ్యాయి.

హిందూ ధర్మంలో ఇంట్లో దేని గురించయినా అది చెడు అని విమర్శించుకోవచ్చుగాని, బహిరంగంగా వచ్చి నిరసన తెలియజేయడానికి వీలు లేదు. అందువల్లనే గాంధీజీ హత్య నాథూరాం గాడ్సే చేశాడని తెలిసిన తర్వాత కూడా హిందువుల మీద ఎటువంటి నిరసనా రాలేదు. బహుశా, కొంత వరకు ప్రజాభిప్రాయం చీలిపోయి కూడా ఉందనుకుంటాను. హిందువులలోనే అది సరయినదా కాదా అనే విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి. సరే, మొత్తానికి గాంధీజీ హత్య దేశంలో పెద్దఎత్తున కల్లోలానికి కారణం కాలేదు.

బొంబాయి మారణకాండ విషయమే తీసుకోండి. ఈ మారణకాండలు జరుపుతున్న రాజకీయ నాయకత్వం ఎంత పిరికిదంటే, దానికి తానుచేస్తున్న పనులను బహిరంగంగా ఒప్పుకుని సమర్థించుకునే ధైర్యం కూడా లేదు. బాబ్రీ మసీదు విధ్వంసం విషయంలో భారతీయ జనతా పార్టీ, బహిరంగంగా బయటికి వచ్చి, "అవును, మేమే ఈ పని చేశాం. మా కార్యకర్తలకు ఈ పని చేయాలని మేమే పిలుపిచ్చాం." అని ఎక్కడా ఒప్పుకోలేదు. అలా ఒప్పుకోవడానికి దానికి ఎన్నో వేదికలున్నాయి.

ఈ దేశంలో ప్రధానమైన సమస్య అదేనని నేననుకుంటాను. తమ విశ్వాసాల కోసం ధైర్యంగా నిలబడే నిబద్ధత ఈ దేశంలో పూర్తిగా కొరవడింది. ఈ దేశంలో 1984 నుంచి కొనసాగుతున్న మత ఘర్షణల, మతోన్మాదపు చరిత్రను చూస్తే, దాన్ని హిట్లర్ అమలు చేసిన జాతీయోన్మాదంతో పోల్చి చూస్తే, కనీసం హిట్లర్‌కు తన విశ్వాసాలను బహిరంగంగా ప్రకటించే నిబద్ధత ఉండింది. "యూదులు ఆర్యులకు వ్యతిరేకులు, వారిని నిర్మూలించదలచుకున్నాను" అని హిట్లర్ ప్రకటించాడు. ఆ పని చేయడానికి పూనుకున్నాడు.

మన దేశంలోని ఫాసిస్టులకు తమ విశ్వాసాల మీద ఆ మాత్రం నిబద్ధత కూడా లేదు. వీళ్లూ ఫాసిస్టులే. వీళ్లూ జాతి హననానికి పాల్పడుతున్నారు. వీళ్లూ జాతియోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారు. వాళ్లకు తమ రాజకీయాల మీద, తాము చేస్తున్న పని మీద విశ్వాసం ఉంటే, అదే సరైన రాజకీయ పంథా అని అనుకుంటే, ఆ మాట స్పష్టంగా చెప్పవచ్చు. కాని ఇక్కడ జరిగిన మత కల్లోలాలు వేటిలోనూ అటువంటి ప్రకటనలు లేవు.

'ఒక మహావృక్షం కూలిపోయినప్పుడు భూమి కంపిస్తుందిగదా" అని ఇందిరాగాంధీ హత్య తర్వాత మతకల్లోలాను రాజీవ్‌గాంధీ సమర్థించాడు. అటువంటి అతితెలివి ప్రకటనలు అక్కరలేదు. ఇందిరాగాంధీ ఏమీ మహాత్మా గాంధీ కన్నా పెద్ద మహా వృక్షమేమీ కాదు. కాని గాంధీజీ చనిపోయినప్పుడు అటువంటిదేమీ జరగలేదు. గాంధీజీని ఒక బ్రాహ్మణుడు చంపాడు గనుక, బ్రాహ్మణులందరినీ కనబడినవాడిని కనబడినట్టుగా చంపాలని ఎవరూ అనుకోలేదు. కాని ఇప్పుడు మాత్రం, ఇందిరాగాంధీని ఒక సిక్కు చంపాడనే పేరుతో సిక్కుల మీద మారణకాండ జరిపారు. సిక్కులు ఒక మైనారిటీ గనుక వారితో ఏమి చేసినా చెల్లుతుందనే అభిప్రాయం ఉందన్నమాట.

ఇక బాబ్రీ మసీదు విధ్వంసం సంగతి చూద్దాం. 1992 డిసెంబర్ 6న బాబ్రీ మసీదు విధ్వంసం జరిగిన తర్వాత సహజంగానే దేశ వ్యాప్తంగా నిరసనలు చెలరేగాయి. హైదరాబాద్‌లో కూడా నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఆ నిరసనకారుల మీద పోలీసులు కాల్పులు కూడా జరిపారు. ఆ కాల్పులపైన నిజనిర్ధారణ జరపడానికి మేం వెళ్లాం. బాధితులందరూ చెప్పిన విషయం ఒకటి ఉంది. స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌కు చెందిన పోలీసులు అయ్యప్ప దీక్ష తీసుకుని ఉన్న వాళ్లు. నల్ల లుంగీలలో, నల్ల చొక్కాలతో, కాళ్లకు చెప్పులు

లేకుండా ఉన్న వాళ్లు తమ మీద కాల్పులు జరిపారని ఎందరో ప్రదర్శనకారులు చెప్పారు.

బాబ్రీ మసీదు విధ్వంసం జరిగినప్పుడు పి.వి. నరసింహారావు గారు అధికారంలో ఉన్నారు. ఆయనకు మహా మేధావి అనీ, పండితుడనీ పేరు. బాగా చదువుకున్న వాడు. అయితే సమాజానికి ఉపయోగపడనప్పుడు చదువు ఎంత చదువుకున్నా ప్రయోజనం లేదు. ఆయనేమన్నారు? "నేను భారతీయ జనతా పార్టీతో పోరాడగలను. కాని నేను నా రాముడితో పోరాడలేను" అని. ఈ ప్రకటన బహిరంగంగా చేసినది. ఆ క్రమంలో ఆయన రాముడికీ, భారతీయ జనతా పార్టీకి మధ్య తేడా చూడడంలో విఫలమయ్యారు. రాముడిని సమర్థిస్తున్నాననుకుని భారతీయ జనతా పార్టీని సమర్థించారు. మౌనంగా ఉండిపోయారు. విధ్వంసానికి పరోక్షంగా మద్దతు పలికారు. సుప్రీం కోర్టులో కూడా అట్లాగే అయింది. అక్కడికి ఈ వ్యాజ్యం వచ్చినప్పుడు, న్యాయమూర్తి జస్టిస్ వెంకటాచలయ్యతో ప్రముఖ న్యాయవాది కె. కె వేణుగోపాల్ ఏమన్నారంటే, కరసేవ అంటే మరేమీ కాదు. హింస కాదు, సంకీర్తనలు పాడుతారు అంతే అన్నాడు. ఆ సమయంలో కోర్టులు, న్యాయవాదులు, అవతలి వాళ్లు ఏదంటే దానికి వ్యతిరేకమయినది అనాలనే ప్రత్యర్థి వ్యూహాలను అనుసరించకుండా ఉండవలసింది.

ఎందుకంటే అప్పుడు అక్కడ విచారణకు వచ్చినది ఒక ముఖ్యమైన విషయం. ఈ దేశ సంకీర్ణ సంస్కృతికి సంబంధించిన విషయం. చరిత్రకు సంబంధించిన విషయం. అందువల్ల సుప్రీం కోర్టులోని న్యాయవాదులందరూ, ఒకరికి వ్యతిరేకంగా ఒకరు వాదించడం కాకుండా, బాబ్రీ మసీదు విధ్వంసం జరగకుండా ఆ చారిత్రక కట్టడాన్ని కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో పెట్టండి. దాని రక్షణ కోసం సైనిక బలగాలను పంపించండి అని కోర్టు ముందర వాదించి ఉండవలసింది. అట్లా ఆ సమస్య పరిష్కారమై ఉండేది. అప్పుడప్పుడు ఆ వివాదంలో దూకుడుగా ముందుకు వస్తున్న పార్టీ అధికారంలో ఉంది. ఆ పార్టీకి చెందిన కళ్యాణ్‌సింగ్ ముఖ్యమంత్రిగా ఉన్నాడు. అటువంటప్పుడు, ఆ రాష్ట్ర ప్రభుత్వానికే అధికారం ఇవ్వడం స్పష్టంగా విధ్వంసానికి అనుమతి ఇవ్వడమే.

అంతే కాదు. మతభావాలను ప్రేరేపించి మహాజన సమూహాన్ని అక్కడ పోగేశారు. అలా పోగైన ఒక సముదాయం చిన్న ప్రేరణతో కూడా ఆ చారిత్రక కట్టడాన్ని కూల్చి వేస్తుందని అందరికీ తెలుసు. అంటే ఆ సమూహం అక్కడికి కేవలం సంకీర్తనలు పాడడానికి మాత్రమే రాలేదు.

ఈ మొత్తం వ్యవహారాన్ని చూస్తే, ఈ దేశానికి, సమాజానికి సంబంధించిన కీలక సమస్యల విషయంలో, తప్పుదారిన నడుస్తున్నప్పుడు రావలసినంత నిరసన, ప్రతిఘటన రావడంలేదు. ఎక్కడో ఒక మూల ఎంతో కొంత ప్రతిఘటన, నిరసన వచ్చినప్పటికీ, అది మనకు అలవాటయినదిగానే ఉంటున్నది. ఎవరు ఎక్కడ నిరసన తెలుపుతారో మనకు తెలుసు. బాబ్రీ మసీదుకు వ్యతిరేకంగా దేశంలో జరిగిన నిరసన ప్రదర్శనలను చూస్తే అవి పెద్ద ఎత్తున జరగలేదు. నిరసనకారులందరూ తెలిసిన వారే.

దేశంలో ఎన్నో బౌద్ధ ఆరామాలను, ఆలయాలను హిందువులు ఆక్రమించుకుని తమ దేవాలయాలుగా మార్చుకున్నారు. చరిత్రలో ఇది అంతటా జరిగిందే. స్పెయిన్‌లో కార్డొబాలో ఒక పురాతన మసీదు నిర్మించారు. నేను అది చూసివచ్చాను. ఒక విశాలమైన మసీదును చర్చిగా మార్చినట్టు మనకు అక్కడ నిర్మాణం చూడగానే తెలిసి పోతుంది. మన దేశంలో కూడా అటువంటివెన్నో జరిగాయి. దేశాల మీద దండయాత్రలు చేసిన వాళ్లు ఆ దేశాలలో ఇటువంటి పనులు చేశారు. బాబర్ కూడా అట్లాగే ఒక విజేతగా విధ్వంసాలు, నిర్మాణాలు చేసి ఉంటాడుగాని, అక్కడ హిందువులనీ లేదు, ముస్లింలనీ లేదు. అదంతా ఏదో హిందూ వ్యతిరేకతగా ఇవాళ్టి ఆలోచనలతో చూడడం అనవసరం. ఇవాళ గోల్వాల్కర్ చెప్పిన లక్ష్యాల కోసం వాళ్లు భారతదేశానికి రాలేదు.

సరే, బాబ్రీ మసీదు విధ్వంసం తర్వాత, దేశ వ్యాప్తంగా ముస్లింల నిరసనలు జరిగాయి. మళ్లీ ఒకసారి ముస్లింమీద మారణకాండ జరిగింది. బొంబాయిలో జరిగిన అటువంటి హత్యాకాండను విచారించడానికి జస్టిస్ శ్రీకృష్ణ కమిషన్ నియమించారు. అక్కడ కూడా పోలీసులు ప్రజలను రక్షించడానికి ఏ ప్రయత్నమూ చేయలేదు. అక్కడ హిందూ మతస్తులకు నాయకుడు ఎవరు? శంకరాచార్య కాదు, జయేంద్ర సరస్వతి కాదు ఏదో ఒక మఠాధిపతి కాదు. అక్కడి హిందువులకు నాయకుడు బాల్‌థాక్రే.

మతంతో ఏమి చేయాలో చెప్పేవాడు ఒక నేర ప్రపంచం నాయకుడన్నమాట. అంటే ఒక మతాన్ని అందరికన్నా ఎక్కువగా పరిరక్షించే దెవరయ్యా అంటే ఒక మాఫియా నాయకుడు. ఇదీ హిందూ మత దుస్థితి. మన మతాచారాలను రక్షించుకోవడానికి ఎటువంటి రాజకీయ వ్యూహాలు పాటించాలో మాఫియా చెబుతుందన్నమాట.

ఏ ఒక్క సందర్భంలోనూ మన ప్రభుత్వాలు, పాలనా యంత్రాంగాలు, పాలనా వ్యవహారాలలో అన్ని మతాలతోనూ సమాన దూరాన్ని పాటించాలని అనుకోవడం లేదు. నిజానికి మన ప్రభుత్వ అధికారులకు ఇచ్చే శిక్షణలోనే పాలనాపరమైన తటస్థత అనేది ఒకటుంటుందని మనం నేర్పడం లేదు. చట్టబద్ధ పాలన అనేది ఒకటి ఉందని మనం నేర్పడం లేదు. అది లేకపోవడంవల్ల ప్రతి అధికారీ తమ ఇష్టారాజ్యంగా తమ మత విశ్వాసాల ప్రకారం పాలనా వ్యవహారాలు నడుపుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎక్కడ పెట్టినా తిరుపతి వెంకటేశ్వరస్వామి ఫోటోలు, ఎక్కడ చూసినా గుళ్లు, చర్చిలు, మసీదులు, దర్గాలు కనబడుతున్నాయి. ఈ రకంగా పాలన సాగుతుంటే, ఒక దేశంలో ప్రజలు ఐక్యమవుతారనీ, చిన్న చిన్న సమూహాల మీద ఇటువంటి అత్యాచారాలు జరుగుతుంటే ఖండిస్తారని ఎట్లా అనుకుంటాం?

సరే, శ్రీకృష్ణ కమిషన్ విచారణ ముందుకు సాగకుండా ఆపివేయాలని వాళ్లు ప్రయత్నించారు. ఆ కమిషన్ వల్ల ఏమి జరిగింది? అంతకు ముందు సిక్కుల ఊచకోత మీద పదకొండు కమిషన్లు నియమించారు. ఆ కమిషన్లు ఏమీ తేల్చలేదు. ఇక్కడ

శ్రీకృష్ణకమిషన్ కూడా ఏమీ తేల్చలేదు. ఇదంతా ఎంత శోచనీయమైన విషయమంటే, బొంబాయిలో తరతరాలుగా నివసించినవారు, బొంబాయి పౌరులు తమ సొంత నగరంలో భయం భయంగా బతకవలసి వచ్చింది. వాళ్ళ రక్షణ కోసం గుంపులు గుంపులుగా వెళ్లడం మొదలయింది. నిస్సహాయంగా ఎక్కడ న్యాయం దొరుకుతుందా అని వేచిచూడడం మొదలయింది.

శ్రీకృష్ణ కమిషన్ విచారణను అప్పటి మహారాష్ట్ర ముఖ్యమంత్రి మనోహర్ జోషి నిలిపివేయించాడు. "ఇది ఇట్లా మధ్యంతరంగా, అన్యాయంగా ఆపివేయిస్తున్నారు. మేం నిరసన ప్రదర్శన చేస్తున్నాం. మీరు కూడా రండి" అని నాకు పిలుపు వస్తే నేను బొంబాయి వెళ్లాను. సుప్రసిద్ధ న్యాయవాది పాల్కీవాలా. గోద్రెజ్ కంపెనీల యజమాని మొదలైన పెద్దలంతా అక్కడ రోడ్డు మీద కూర్చుని ఉన్నారు. మేమంతా ఆ విచారణను ఆపివేయడం మీద నిరసన తెలిపాం. ఆ తర్వాత శ్రీకృష్ణ కమిషన్ తిరిగి పని మొదలుపెట్టింది. చివరికి ఆయన ఒక మంచి తీర్పు ఇచ్చాడు. మనమంతా ఎంత మంచి తీర్పు ఇచ్చినాడు అని చదివాం. కాని దానివల్ల ఏమయింది?

పదకొండు కమిషన్లు అక్కడ వేస్తే ఏమీ జరగలేదు. ఎఫ్ఐఆర్ ఆలస్యంగా వేసినారనే కారణంతో కేసులు నమోదు చేసుకోవడానికి నిరాకరించారు. కేసులు కొట్టేశారు. ఎఫ్ఐఆర్ ఎందుకు ఆలస్యంగా దాఖలు చేయవలసి వచ్చింది? అసలు ఇటువంటి కేసుల విషయంలో ప్రతి సంఘటన గురించీ పత్రికలలో వచ్చింది గదా, ఇవి సమాజానికి అంతా సంబంధించిన నేరాలు కాబట్టి, ప్రత్యేక పరిస్థితులో జరిగిన నేరాలు కాబట్టి, పత్రికా వార్తను ఎఫ్ఐఆర్‌గా అంగీకరించి ఆ తర్వాత దర్యాప్తు జరపవచ్చు అని ఒక సూత్రం తయారు చేస్తే బాగుండేది గదా. ఈ దేశంలో అంతా గజం మిథ్య, పలాయనం మిథ్య అనే వ్యవహారమే జరుగుతుంది. పత్రికలలో వచ్చింది. కాని దాన్ని అంగీకరించరు.

అంటే, ఈ దేశంలో కోర్టులు ఎవరి కోసం ఉన్నాయంటే, పెద్ద ఎత్తున ఈ మాదిరి హత్యాకాండలు, కల్లోలాలు జరుపుతున్నారు గదా, వారిని విచారించదానికిగాని, బాధితులకు న్యాయం అందించడానికి గాని మన న్యాయస్థానాలు సిద్ధంగా లేవు. మన న్యాయస్థానాలకు ఆ విషయంలో ఎట్లా వ్యవహరించాలో తెలియదు. అంతేకాదు, మన న్యాయస్థానాలు రోజు రోజుకూ, అటు ప్రాసిక్యూషన్‌కూ, ఇటు డిఫెన్స్‌కూ మధ్య ఒక వాదనా క్రీడగా మారిపోయాయి.

ఇక్కడ ఏ వ్యవస్థను తీసుకొచ్చి పెట్టినా ఈ మాదిరిగా మారిపోతుంది. మాలిమత్ గారు మన న్యాయవ్యవస్థకు కొన్ని సూచనలు చేశారు. సత్యాన్వేషణే మన న్యాయస్థానాల ప్రధాన లక్ష్యం కావాలన్నారు. కాని ఏ మాత్రం పెట్టినా అంతిమంగా ఇట్లాగే మారిపోతుంది. సత్యాన్వేషణ జరుగుతుందిగాని, ఎవరి సత్యం అనే ప్రశ్న అట్లాగే మిగిలిపోతుంది.

బాల్ థాక్రే గారి మీద విచారణ సందర్భంగా ఏమయింది? అసలు ఆయన మీద విచారణ జరపడానికే వీలులేదని బయటి నుంచి ప్రకటనలు వస్తూ ఉన్నాయి. అంతే, కోర్టు కూడా ఆ ప్రకటనలకు అనుకూలమైన తీర్పు ఇచ్చేసింది. కోర్టును స్వతంత్రంగా పని చేయనిచ్చింది ఎక్కడ?

మొత్తంగా చెప్పవచ్చిందేమంటే, మన కోర్టులు, మన న్యాయం, మన చట్టాలు సమాజహితాన్ని అందించడంలో విఫలమైపోయాయి. వాటిని స్వతంత్రంగా నడపడంలో, వాటిని చట్టబద్ధపాలనా సూత్రాల ప్రకారం నడపడంలో మనం విఫలమైపోయాం. ముఖ్యంగా భారీ ఎత్తున, సమూహాలకు సమూహాలనే ఊచకోత కోసే నేరాల విషయంలో, దేశంలోని సర్వోన్నత న్యాయస్థానం కూడా ఎటువంటి ముందడుగు వేయలేకపోయింది. కనీసం ఇటువంటి విషయాలలో ప్రభుత్వం ఏమి చేయవలసి ఉంటుందో కూడా అది చెప్పలేక పోయింది. అంటే మన దేశంలో పాలన, ప్రభుత్వం ఎంత మాత్రం సృజనాత్మకత లేని పద్ధతిలో, మొరటుగా నడపబడుతున్నాయి.

మన శాసనసభ్యులు పరిటాల రవి హత్య విషయంలో చేసిన గోల లాంటిది, ఎప్పుడైనా మరే హత్యాకాండ విషయంలోనైనా, మరీ ముఖ్యంగా, మత కల్లోలాల విషయంలో చేసి ఉన్నారా? కనీసం రాయలసీమలో జరుగుతూ ఉన్న ముఠాహత్యల విషయంలో వందలాది మంది పేద ప్రజలు చనిపోతున్నప్పుడు, ఈ మాదిరి జరుగుతూ ఉంది. మనం ఏవైనా ప్రత్యేక చర్యలు చేపట్టాలి' అని ఈ శాసనసభ్యులు ఎప్పుడైనా అనుకున్నారా?

ఏదయినా ఒక కేసులో పి.డబ్ల్యు 1-అంటే ప్రాసిక్యూషన్ వారి మొదటి సాక్షి-వచ్చినాడంటే వాణ్ని నరికిపారేస్తారు. ఇక దానితో మిగిలిన ప్రాసిక్యూషన్ సాక్షులందరూ హోస్టయిల్ అయిపోతారు. తాము అంతకు ముందు చెప్పిన సాక్ష్యానికి భిన్నమైన సాక్ష్యం చెబుతారు. దానితో కోర్టులో కేసు నిలవదు. ఇక కోర్టులు కేసులన్నీ కొట్టేస్తున్నాయి. నేరస్తులను వదిలి పెడుతున్నాయి. అని ఒక ప్రచారం మొదలు పెడతారు. ఇదంతా ఎందుకు జరుగుతున్నది? ఎందుకంటే మన సమాజంలోని వ్యవస్థలన్నిటినీ ఒక పద్ధతి ప్రకారం నిర్వీర్యం చేయడం, బలహీన పరచడం జరుగుతున్నది. ఇది ఫాసిజానికి మార్గం.

నిజానికి కోర్టులు వదిలేయడం లేదు. ప్రాసిక్యూషన్ వారి సాక్ష్యాధారాలే ఎట్లా ఉంటున్నాయంటే, వాటి ఆధారంగా ఎవరినీ ఏమీ చేసే దానికి వీలులేదు. సాక్షులందరూ అడ్డం తిరిగిపోతారు. అసలు ఇంత ముఖ్యమైన కేసులలో ఎందుకింత మంది సాక్షులు అడ్డం తిరిగిపోతున్నారు అని ఒక ఆలోచన లేదు. ఇంత వరకూ ఈ విషయమై ఒక విచారణలేదు. ప్రతి కేసులోనూ సాక్షులు అడ్డం తిరుగుతున్నారంటే దీనిలో లోపాలు ఏవైనా ఉన్నాయా? అసలు మనం సాక్ష్యాలే తప్పుగా రాసుకుంటున్నామా, లేక వాళ్లను ఎవరైనా బెదిరిస్తున్నారా? వాళ్లను ఎవరు బెదిరిస్తున్నారు. ఎందుకు బెదిరిస్తున్నారు?

ఇకముందైనా మనం సాక్షులను కాపాడదానికి ఏమి చేయగలం? ఈ ఆలోచనలే లేవు.

ఈ సమస్య నుంచి బయట పడడానికి పోలీసులకు తెలిసిన మార్గం ఒకటే. నిందితులకు బెయిల్ రాకుండా చేసి, సాక్షులందరినీ కుప్పవేసి వాళ్లతో సాక్ష్యం చెప్పించడం. ఇదంతా చాలా ఫాసిస్టు పద్ధతి. కాని ఇది తప్ప మన పోలీసులకు మరొక పద్ధతి తెలియదు. వాళ్లకు నేరపరిశోధన అంటే ఏమిటో తెలియదు. విచారణ అంటే ఏమిటో తెలియదు. చట్టబద్ధ పాలన అంటే ఏమిటో తెలియదు. ఇటువంటి పరిస్థితులలో, ఈ మాదిరి పెద్ద నేరాలు, సామూహిక నేరాలు జరిగినప్పుడు, బొంబాయిలో జనవరి 1993లో జరిగినట్టు, గుజరాత్‌లో జరిగినట్టు మైనారిటీల మీద అత్యాచారాలు, హింసాకాండ జరిగినప్పుడు ఏమి చేయాలో కోర్టులకుగానీ, పోలీసులకు గానీ, ఎవరికీ ఏమీ తెలియడం లేదు.

అటువంటప్పుడు ఏదో ఒక పద్ధతి ఉండాలి. ఒక నిర్దిష్టమైన పద్ధతి ఉండాలి. "మన దగ్గర ఒక కచ్చితమైన న్యాయ వ్యవస్థ ఉన్నది. ఇటువంటి నేరాలను అరికట్టగలుగుతుంది" అని ప్రజలకు నమ్మకం ఇచ్చేటటువంటి పద్ధతి ఉండాలి. అది పౌరుల భద్రతకు హామీ ఇస్తుంది.

## శాంతి భద్రతల వైఫల్యం గుజరాత్ మారణకాండ

2002 ఫిబ్రవరి 28న గుజరాత్‌లోని గోద్రాలో సాబర్మతి ఎక్స్‌ప్రెస్‌లో ఒక బోగి తగలబడిపోయింది. తర్వాత మూడు రోజులపాటు బంద్ ప్రకటించారు. అన్ని దుకాణాలు మూతబడిపోయాయి. పోలీసులు కూడా తమ పనులు మానేసి సెలవు అనుభవించారు. మార్చి 1న సరిగ్గా 11 గంటలకు, తమ సెల్‌ఫోన్లు వాడుతూ వందలాది మంది అల్లరి మూకలు వీధుల్లోకి వచ్చి హత్యాకాండ, అత్యాచారాలు, ఆస్తుల దహనాలు ప్రారంభించారు. ఎంతో మందిని చంపేశారు. ఇటువంటి మైనారిటీల మీద హత్యాకాండలన్నింటిలోనూ ఒక సాధారణ అంశమేమంటే, మృతుల జాబితా, లెక్క ఎక్కడా నమోదు చేయరు. ఏ ఇంట్లో, ఏ కుటుంబంలో, ఎంత మంది చచ్చిపోయారో లెక్క ఉండదు. మామూలుగానే పేద ప్రజలు, ఎక్కువ సంఖ్యలో ప్రజలు చనిపోయినప్పుడు మనం కచ్చితంగా లెక్కలు నమోదు చేయం. అది చాలా దారుణమైన విషయమే. కాని అదే జరుగుతున్నది. ఎప్పుడైనా లెక్కలు చెప్పి నప్పుడు కూడా సరైన లెక్కలు చెప్పరు.

గుజరాత్ మారణకాండ మీద విచారణ జరపడానికి దేశంలోని ప్రముఖులు కొందరు కలిసి ఒక ప్రజా న్యాయవిచారణ సంఘాన్ని నియమించారు. ఈ ప్రజా న్యాయ విచారణకు జస్టిస్ వి ఆర్ కృష్ణ అయ్యర్ అధ్యక్షుడు. మరొక సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పి.బి. సావంత్, ఇద్దరు హైకోర్టు మాజీ న్యాయమూర్తులు, కొందరు విద్యావేత్తలు, ఒక మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు, పౌరహక్కుల ఉద్యమకారులతో ఆ విచారణ

సంఘం ఏర్పడింది.

శాంతి భద్రతల యంత్రాంగం విఫలం కావడమంటే ఏమిటి అనే దానికి గుజరాత్ మారణకాండ ఒక పెద్ద నిదర్శనం. రాల్ఫ్ డాహ్రెన్ డార్ఫ్ అని ఒక ప్రపంచ ప్రఖ్యాత సామాజిక శాస్త్రవేత్త ఉన్నాడు. ఆయన శాంతిభద్రతల యంత్రాంగం విఫలం కావడం గురించి 1985లో హామ్లిన్ లెక్చర్స్‌లో భాగంగా చర్చించాడు. ఆ ప్రసంగాల ప్రారంభంలోనే ఆయన 1945 ఏప్రిల్‌లో తాను బెర్లిన్ నగరంలో ఉన్నప్పటి అనుభవాల నుంచి మొదలు పెట్టాడు. అప్పటి నాజీ జర్మనీలో అడాల్ఫ్ హిట్లర్ చనిపోయాడని ఒక వదంతి వచ్చిందట. అప్పుడిక ఎవరు ఎవరిని ఎందుకు కాల్చి చంపుతున్నారో తెలియని స్థితి ఏర్పడిందట. దుకాణాలు వదిలిపెట్టి యజమానులు, గుమస్తాలు పారిపోతే, జనం ఆ దుకాణాల్లోకి జొరబడి ఎవరికి ఏది దొరికితే అది పట్టుకు పోతున్నారట. డాహ్రెన్ డార్ఫ్ కూడా ఒక పుస్తకాల దుకాణంలోకి వెళ్లి తనకు ఇష్టమైన ప్రేమకవిత్వం పుస్తకాలు పట్టుకుని వచ్చేశాడట. దాన్ని దొంగతనం అని అనడానికి కూడా వీలు లేదని, అది అసలు దొంగతనం అనే మాటకే అర్థం రద్దయిపోయిన స్థితి అని డాహ్రెన్ డార్ఫ్ రాశాడు. నిన్న పరమశాసనంగా కనబడినది ఇవాళ పరమ అన్యాయంగా మారిపోతుంది. ఎవరికీ ఎవరూ జవాబుదారీగా ఉండని స్థితి వస్తుంది. అదే శాంతిభద్రతల వైఫల్యం.

సరిగ్గా ఆ సామాజిక శాస్త్రవేత్త చేసిన నిర్ధారణలన్నీ గుజరాత్‌లో వాస్తవ రూపం ధరించాయి. అక్కడ శాంతిభద్రతల యంత్రాంగం పూర్తిగా కుప్పకూలిపోయింది. వీధుల్లో హింసా దౌర్జన్యాలు వికటాట్టహాసం చేశాయి. వాటిని అరికట్టే యంత్రాంగం కరువైపోయింది. గుజరాత్‌లో మొదటిసారిగా, మధ్యతరగతి జనం యజమానులు, గుమస్తాలు లేని దుకాణాల్లోకి ప్రవేశించి చేతికి అందిన వస్తువులు పట్టుకుని బయటికి వచ్చారు. అన్ని రకాల వస్తువులు పట్టుకు పోయారు.

అటువంటి స్థితిలో మానవత్వం కరువైపోతుంది. అది దిగ్భ్రాంతికరమైన విషయం. అదంతా ఎంత క్రమబద్ధంగా జరిగిందంటే, మేం వెళ్లి అడిగిన ప్రతిచోటా, "టోలా గ్యారా బజేకూ ఆయా" అన్నారు. టోలా అంటే అల్లరిమూక. అది అన్ని చోట్లా సరిగ్గా పదకొండు గంటలకు దిగిందంటే, అదంతా ఒక పద్ధతి ప్రకారం జరిగిందన్నమాట. వాళ్లు సియారామ్ అని నినాదాలిస్తూ వచ్చారు. కనబడిన స్త్రీలను చెరుస్తూ, అత్యాచారాలు చేస్తూ పోయారు. స్త్రీలను, పురుషులను చంపారు. ముస్లిముల ఇళ్లను, ఆస్తులను తగలబెట్టారు.

ఇన్నిన్ని ఘోరాలు జరిగిపోతుంటే ఈ దేశపు ప్రతిస్పందన ఏమిటి? మానవీయ ప్రతిస్పందనలు లేకపోగా, కొందరు ఏమన్నారంటే, "ఈ దేశంలో ముస్లిములకు ఒక పాఠం నేర్పవలసి ఉండింది. నరేంద్ర మోడీ ఆ పాఠం నేర్పాడు" అని. అసలు మనిషయిన వాడెవడయినా ఇటువంటి మాట ఎట్లా అనగలడా అని నాకు దిగ్భ్రాంతి కలుగుతుంది.

నేను ఆ మాట విని మ్రాన్పడిపోయాను. ఒక న్యాయవాదుల సమావేశంలో నేనీ మాట విన్నాను. బహుశా ఇటువంటి మాటలు, వ్యాఖ్యలు ఇంకా చాలా చోట్లనే వచ్చి ఉంటాయి. ఒక బహిరంగ హత్యాకాండను సమర్థించేంత అమానవీయ స్థితికి మన సమాజం చేరుకున్నదన్నమాట.

## కరువైన మానవీయ ప్రతిస్పందన

ఇంకా విచిత్రమైన విషయమేమంటే, ఈ దేశంలో ఏ ఒక్క విద్యా సంస్థ, విద్యావంతుల వేదిక ఈ ఘోరకలిని ఖండిస్తూ సమావేశం ఏర్పాటు చేయలేదు. ఒక్క న్యాయవాదుల సమావేశం, ఒక్క కార్మిక  సంఘం సమావేశం, ఒక్క విద్యార్థి సమూహం ఈ సంఘటనను ఖండిస్తూ ఒక ప్రదర్శన నిర్వహించలేదు. ఆ ఘటన ఒక దుర్మార్గం.అది ఒక మహా విషాదం. అది ఒక జాతీయ అవమానం. అటువంటప్పుడు దాన్ని ఖండించవలసిన అవసరం ప్రతి ఒక్కరి ముందూ ఉంది. కాని ఏ ఒక్కరూ ముందుకు వచ్చి ఖండించలేదు. అందుకు భిన్నంగా, నరేంద్ర మోడీ ముఖ్యమంత్రిగా కొనసాగుతాడు. భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉన్నప్పుడూ, లేనప్పుడూ కూడా ఈ మారణకాండను సమర్థించే ప్రయత్నం చేస్తుంది. కాని యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా అనే ఒక క్రైస్తవ మత ఛాందసత్వానికీ మరొక మత ఛాందసత్వానికీ ఘర్షణ తప్ప మరేమీ కాదు. గుజరాత్ ప్రజలకు న్యాయం కలగజేసిందెవరు? జార్జి బుష్షా? నాకు చాలా ఆశ్చర్యం కలుగుతుంది.

ఖాద్రీ అని ఒక హైకోర్టు జడ్జి ఆ సమయంలో భయపడిపోయి, ప్రాణరక్షణ కోసం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఇంటికి వెళ్లి తలదాచుకున్నాడు. ఆ ప్రధాన న్యాయమూర్తి ఒక్క రాత్రి మాత్రం అతనికి రక్షణ ఇచ్చి మర్నాడు పొద్దున్నే అహ్మదాబాద్‌లో ముస్లిములు ఎక్కువగా నివసించే జువాపురాకు పంపించేశాడు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఈ ఘోరాన్ని ఆపడానికి ఉత్తర్వులు ఇచ్చి ఉండవచ్చు. సువో మోటో వ్యాజ్యంగా స్వీకరించవచ్చు. స్వయంగా సహన్యాయమూర్తి ఇటువంటి దారుణానికి గురయితే, అల్లరి మూకల నుంచి అంతటి వాడు వస్తే, ప్రధాన న్యాయమూర్తి అంతటివాడు ఇంత అన్యాయంగా ప్రవర్తించాడు.

మరి సుప్రీం కోర్టు ఏమి చేస్తోంది? ఇద్దరు న్యాయమూర్తులు ఇట్లా శరణార్థులుగా మారి అక్కడా ఇక్కడా తలదాచుకుంటుంటే, ఈ దేశంలోని సర్వోచ్ఛ న్యాయస్థానానికి పట్టనే లేదు. ప్రభుత్వం ఏం చేస్తోంది? రాష్ట్రపతి ఏం చేస్తున్నాడు? ఇటువంటి జాతీయ విపత్తు, విషాదం జరిగిపోతుంటే, ఈ దేశంలో శాంతి భద్రతలను పరిరక్షించవలసిన వ్యవస్థలన్నీ ఏం చేస్తున్నాయి?

ఇంత పెద్ద ఎత్తున నేరాలు జరిగినప్పుడు ఎట్లా ప్రవర్తించాలో మన న్యాయవ్యవస్థకు తెలియదు. ఇటువంటి నేరాలు జరిగినప్పుడు తమ తమ కులాలు, మతాలు,

దురభిప్రాయాలు, అపోహలు వదిలి ఒక ఉదాత్తస్థితి నుంచి ఆలోచించగలిగే శిక్షణను మనం మన న్యాయ, శాంతిభద్రతా వ్యవస్థలకు ఇవ్వలేదు. చట్టబద్ధపాలన మాత్రమే ప్రాతిపదికగా ఉండే స్థితిని మనం కల్పించలేదు.

అంతేకాదు, ఈ దేశంలో ఇంకొక విచిత్ర స్థితి కూడా తలెత్తింది. ఒక చోట నేరం జరిగితే అక్కడే విచారణ జరిపే, తప్పొప్పులు నిర్ధారించే స్థితి కూడా లేదు. కోర్టు పారిపోయి మరొక చోట కూచుని విచారణ జరపవలసి వస్తోంది. చట్టబద్ధపాలన కూడా శరణార్థి అయిపోయి ఒక చోటి నుంచి మరొక చోటికి పరుగెత్తుకుని పోతోంది.

జయలలిత మీద కేసులు ఉంటే, తమిళనాడులో విచారణ జరపడానికి వీలు లేదు. అంటే ఒక ప్రభుత్వాధికారంలో ఉన్న వ్యక్తి మీద కేసు నడపాలంటే సాధ్యం కాదని, కోర్టే అక్కడి నుంచి మరొక చోటికి పారిపోవలసి వస్తున్నదన్న మాట. చట్టబద్ధపాలన అన్ని చోట్లా అమలయ్యే బదులు, చట్టమే ఒక చోట తనకు ప్రమాదం ఉందని మరొక చోటికి పారిపోతున్నదన్నమాట. ఇంత కన్నా దుర్గతి వేరే ఉండదు.

జస్టిస్ ప్రభాశంకర్ మిశ్రా ఇక్కడ ప్రధాన న్యాయమూర్తిగా ఉండే రోజుల్లో, నా మిత్రుడు న్యాయవాది బాల్‌రెడ్డి అక్కడ సాక్షులందరినీ చంపుతున్నారు. బెదిరిస్తున్నారు. కనుక హత్య కేసులను హైదరాబాద్‌కు బదిలీ చేయాలి అని వాదిస్తే, నేను వ్యతిరేకించాను. "ఈ మాదిరిగా హత్య కేసులన్నిటినీ కడప నుంచి, అనంతపురం నుంచి, కర్నూలు నుంచి హైదరాబాద్‌కు బదిలీ చేయకూడదు. అప్పుడిక హైదరాబాద్‌లో కూడా సాక్షులను బెదిరిస్తే ఏం చేస్తారు? అసలు న్యాయదేవత ఇట్లా పరుగెత్తి పోకూడదు. ఆమె ఉన్నచోటనే ఉండి న్యాయం చెప్పాలి. ఆమె శరణార్థి అయిపోగూడదు. ఏ ధర్మస్థానంలో నిలబడి ఉందో అక్కడే ఉండి న్యాయం చెప్పాల్సిందే తప్ప పారిపోగూడదు" అన్నాను. "అక్కడి కోర్టుకు బలం కలిగించండి. న్యాయమూర్తికీ, సాక్షులకూ రక్షణ కలిగించండి. న్యాయ వ్యవస్థనూ, విచారణ క్రమాన్నీ బలోపేతం చేయండి. అంతేగాని ఇట్లా పరుగెత్తించడం మంచిది కాదు" అన్నాను.

మోడీ ముఖ్యమంత్రిగా ఉన్నాడు గనుక అక్కడ కోర్టు విచారణ జరపడం కష్టం అని కోర్టును బదిలీ చేసే బదులు, అసలు ఈ కేసుల విచారణ అయిపోయే వరకూ ఈ ఆరోపణలు ఎదుర్కొంటున్న వాళ్లు అధికార పీఠాల మీద ఉండగూడదు అనో, మరొకటో ఏదో ఒక కొత్త పద్ధతి కనిపెట్టవచ్చు. అలా కనిపెట్టే బాధ్యత సుప్రీం కోర్టుదే. చట్టబద్ధ పాలనను శరణార్థిగా మార్చేబదులు అటువంటి సృజనాత్మక పరిష్కారం కనిపెట్టవచ్చు.

ఎందుకంటే మన దగ్గర ప్రత్యర్థి రాజకీయ వాద ప్రతివాదాలే. రభసలే అన్నిటినీ శాసిస్తున్నాయి. నేనేమీ ప్రత్యర్థి రాజకీయాలకు వ్యతిరేకం కాదు. కాని, మన దేశంలో ఈ ప్రత్యర్థి రాజకీయాలనబడేవి ఎంత చిల్లర స్థాయికి దిగజారిపోయాయంటే చెప్పడానికి వీలు లేదు. అవి ఒక ఉన్మాదంగా, పిచ్చితనంగా మారిపోయాయి.

అందువల్ల ప్రత్యర్థి రాజకీయాలకు కూడా ఒక పరిమితి ఉందని, ఒక హద్దుకన్నా దిగజారి ఎవరూ పని చేయగూడదని, మాట్లాడగూడదని ఈ రాజకీయాలలో, ఈ వ్యవస్థలలో పని చేసే వారందరికీ తెలియజెప్పవలసి ఉంది. ఈ ప్రత్యర్థి రాజకీయాలు అసలు మొత్తంగా వ్యవస్థనే భ్రష్టు పట్టించే మాదిరిగా ఉండగూడదని, అవి వ్యవస్థను ధ్వంసం చేసే దానికి వీలు లేదని తెలియజెప్పవలసి ఉంది. అదే విధంగా పాలనా వ్యవహారాలలో కూడా కొన్ని హద్దులున్నాయని చెప్పవలసి ఉంది. ఇటువంటి సామూహిక హత్యలు, మహాఘోరాలు, దారుణ మారణకాండలు జరిగినప్పుడు, అధికారంలో ఉన్న వారు మన పార్టీ వారైనా సరే. పదవిలో కొనసాగించడానికి వీలు లేదని నియమం పెట్టుకోవాలి.

మన రాజకీయ నాయకులు అటువంటి మర్యాద పాటించడం లేదు సరిగదా, అంతటి మారణకాండకు బాధ్యుడైన వ్యక్తిని ఈ యాభై ఏళ్లలో ఇంత గొప్ప ముఖ్యమంత్రి లేడు అని కితాబులిస్తూ ఉన్నారు. ఆ మారణకాండకు బాధ్యులైన వారు, దానికి అర్హులు కారు అని స్పష్టంగా చెప్పవలసిన సమయం వచ్చింది. ఆ మాట అనవలసింది ప్రజలు. ఈ దేశ ప్రజలు ఆ నిర్ణయం తీసుకోవాలి. మనం ఈ దేశ ప్రజలు ఆ నిర్ణయం తీసుకునేలా చైతన్యవంతులను చేయాలి.

న్యాయవ్యవస్థను సక్రమంగా నడపకపోవడం వల్ల అందులోకి మానవ అంశ, ఇష్టాయిష్టాలు, అభిప్రాయ దురభిప్రాయాలు ప్రవేశిస్తాయి. అందువల్ల కేసులను ఒక చోటి నుంచి మరొక చోటికి, ఒక రాష్ట్రం నుంచి మరొక రాష్ట్రానికి బదిలీ చేయమనే కోరిక న్యాయమైనదనే అనిపిస్తుంది. ఉదాహరణకు శంకరాచార్య కేసునే తీసుకోండి. ఆయన ఏమి చేశాడో, శంకరరామన్ హత్య కేసులో ఆయన పాత్ర ఎంతోగాని, ఆయనకు తమిళనాడులోని కోర్టులో న్యాయం జరగడం సాధ్యం కాదనే అనిపిస్తుంది.

న్యాయవ్యవస్థ ఇట్లా శరణార్థిగా మారినందువల్లనే పార్లమెంటరీ సంస్థలు సక్రమంగా పని చేయవలసి ఉంటుంది. ఇప్పుడు సోమనాథ్ ఛటర్జీ కోర్టులు తమ హద్దులు దాటి వ్యాఖ్యలు చేస్తున్నాయని, పార్లమెంటు వ్యవహారాలలో జోక్యం చేసుకుంటున్నాయని అంటున్నాడు. ఒక వేళ పార్లమెంటరీ సంస్థలే సక్రమంగా పని చేస్తే ఇటువంటి స్థితి ఎందుకు వచ్చేది? ఈ దేశంలో ఏ వ్యవస్థా సక్రమంగా పని చేయడం లేదు గనుక, ఇక ప్రతి రోజు ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు దాకా పని చేస్తున్నట్టు కనిపిస్తున్న వ్యవస్థ ఒకే ఒకటి ఉన్నది - అది న్యాయ వ్యవస్థ. అక్కడ ఏమైనా పరిష్కారం దొరుకుతుందేమోనని ప్రజలు అక్కడికి పరుగెత్తిపోతున్నారు.

### కనీస రాజకీయ ప్రమాణాలు

మొట్టమొదట జరగవలసిందేమిటంటే, కొన్ని రాజకీయ సంప్రదాయాలు నెలకొల్ప

ఐడాలి. అవి దేశ సామాజిక, ఆర్థిక, పాలనా వ్యవస్థలను నడిపే కనీస సంప్రదాయాలు కావాలి. వాటి కన్నా దిగజారి ఎవరూ ప్రవర్తించగూడదు. ఆ సంప్రదాయాలను, ప్రమాణాలను ఎవరైనా పాటించకపోతే వారు అందుకు ఫలితాన్ని, శిక్షను అనుభవించవలసిందే. ఒక కనీస స్థాయి పని విధానం అనేది లేనట్లయితే మనం ఒక రకమైన అరాచకత్వంలోకి పడిపోతాం. అంతిమంగా సమాజమే ధ్వంసమైపోతుంది. అది ఒక నిరంకుశత్వపు అడవిలోకి సమాజాన్ని నడిపిస్తుంది. ఇప్పటికే మన సమాజం కుల వ్యవస్థ వల్ల అంతరాలవల్ల అటువంటి అధ్వాన్నపు అడవిలోనే ఉంది. ఇప్పుడిక కనీస పాలనా ప్రమాణాలు లేకపోతే, ఆ అడవి మరింత నిరకుంశ అడవి అయిపోతుంది.

దానితో ఇష్టారాజ్యంగా జనహననం జరిగిపోతుంది. నిజంగా జరుగుతున్నది జాతిహననమే గాని మనో ఎవరికీ దాన్ని ఆ పేరుతో పిలవడం ఇష్టంలేదు. జరుగుతున్నది. పెద్ద ఎత్తున సామూహిక మారణకాండలే. మైనారిటీల మీద అదే జరుగుతోంది. దళితుల మీద అదే జరుగుతోంది. దళితుల మీద ఇట్లా పెద్ద ఎత్తున అత్యాచారాలు జరుగుతున్నాయి. వాటిని అరికట్టాలి అని ఒక చట్టం తెస్తే, దాన్ని అమలు చేయడంలో, దాన్ని వ్యాఖ్యానించడంలో ఎన్నోలోపాలతో దాన్ని పనికి రాకుండా చేసిపెట్టాం. దానికి ఒక వికృత స్వరూపం ఇచ్చాం.

పార్లమెంటరీ సంస్థలకు, కోర్టులకూ మధ్య ఘర్షణ ఎంత దూరం పోయిందంటే, మీరు చేసే చట్టం మీరు చేయండి, దాన్ని విశ్లేషించేటప్పుడు, వ్యాఖ్యానించేటప్పుడు మేం మా తడాఖా చూపుతాం. దాన్ని మా ఇష్టం వచ్చినట్టు విశ్లేషిస్తాం అని కోర్టులంటున్నాయి. అంటే, ఒకే పాలనలోని వేర్వేరు యంత్రాంగాల మధ్య ఉండవలసిన క్రమశిక్షణ లోపిస్తోంది. అసలు రాజ్యాంగం ఏమిటి, అన్ని యంత్రాంగాలూ కలిసి ఆ రాజ్యాంగ స్ఫూర్తిని ఎట్లా కాపాడాలి అనే విషయంలో ఒక ఉమ్మడి అవగాహన లేదు. ఏ ఒక్క యంత్రాంగంలోనూ అంతర్గత క్రమశిక్షణ లేదు. యంత్రాంగాల మధ్య ఉండవలసిన సమన్వయంతో కూడిన క్రమశిక్షణ లేదు.

ఏ సమాజంలోనైనా జీవించాలంటే కొన్ని వ్యవస్థలు, నిర్మాణాలు అత్యవసరం. అటు పాలకుల పనితీరునూ ప్రవర్తననూ, ఇటు పాలితుల పని తీరునూ ప్రవర్తననూ నిర్ణయించే, ప్రమాణాలు విధించే వ్యవస్థలు తప్పనిసరిగా ఉండవలసి ఉంటుంది. అసలు ఎటువంటి నిర్మాణాలూ లేకుండా ఒక సమాజం మనుగడ సాగించడం అసాధ్యం.

## రాజ్యాంగం తెలుసా?

రాజ్యాంగాన్ని కేవలం చట్ట పద్ధతిలో అధ్యయనం చేసినంత మాత్రాన సరిపోదు. ఎప్పుడైనా రాజ్యాంగానికి ఒక నైతిక కోణం ఉంటుంది. రాజ్యాంగానికి అనేక కోణాలుంటాయి. అవన్నీ వదిలేసి దాన్ని ఒక చట్టంగా మాత్రమే చూసి దాన్ని ఎందుకూ

పనికిరాని పుస్తకంగా మార్చేశారు. అంటే, రాజ్యాంగాన్నిగాని, ఈ వ్యవస్థలను గాని వాడుకుని పని చేయదలచుకున్న వాళ్లకు రాజ్యాంగం గురించి కనీస అవగాహన లేదన్నమాట. మన అవగాహనాలు, దృక్పథాలు ఏవయినప్పటికీ, ఒకసారి రాజ్యాంగ బద్ధమైన పదవిలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగం చెప్పినట్టు నడుచుకోవలసిందే తప్ప, మన దృక్పథానికి అనుకూలంగా రాజ్యాంగాన్ని అటూ ఇటూ తిప్పడం కుదరదు. కాని 1950 నుంచీ కూడా ఈ దేశంలో జరుగుతున్నది అదే. అధికారంలోకి వచ్చిన వారు, రాజ్యాంగం ప్రకారం పని చేయలేదు. ఇవాళ చాలా తీవ్రంగా ఆలోచించవలసిన సమస్యఇది. వెంటనే పరిష్కరించవలసిన సమస్య ఇది. ఇది కేవలం ఒక బూర్జువా వ్యవస్థ మంచిదా కాదా అనే చర్చ కాదు. చాలా చోట్ల బూర్జువా వ్యవస్థలు కూడా బాగానే పని చేశాయి. ఇక్కడ ఆ బూర్జువా వ్యవస్థను కూడా పద్ధతి ప్రకారం పని చేయనివ్వడం లేదు. క్రమశిక్షణ అనేది నేర్పితే వచ్చేది కాదు. అది అవగాహనవల్ల రావలసిందే. ఆ అవగాహన కల్పించడంలో ముఖ్యంగా రాజ్యాంగబద్ధమైన పదవులను అధిష్టించేవారిలో, కల్పించడంలో మన సమాజం ఘోరంగా విఫలమైంది.

## కొన్ని ఉదాహరణలు

మన యంత్రాంగాలు ఎట్లా పని చేస్తున్నాయో చూడడానికి వళ్లీ ఒకసారి బీదర్ హత్యాకాండ సంగతే చూద్దాం. ఆ కేసులో పోలీసులు రాసిన ఎఫ్ఐఆర్ ఏమి చెబుతుందంటే, "విద్యాసాగర్ ప్రాంతంలో ఉంటున్న సిక్కు విద్యార్థులకూ, ఆ ప్రశాంత నివాసులకూ అంతకముందు నుంచే తగాదాలు ఉన్నాయి. సిక్కు విద్యార్థులు స్థానిక ప్రజలతో అనుచితంగా ప్రవర్తించేవారు. సిక్కు మతస్తులు తమ ప్రాంతంలో ఒక ఇంజనీరింగ్ కాలేజి తెరిచారనీ, మరొక మెడికల్ కాలేజి కొరకు ప్రయత్నిస్తున్నారని సాధారణంగా బీదర్ ప్రజలు సిక్కు మతస్తుల మీద కోపంతో ఉన్నారు".

ఈ ప్రకటనలోని అనుచిత ప్రవర్తన అనే దానికి సాక్ష్యాధారాలు ఏమీ లేవని ఇది వరకే చెప్పాను. అట్లాగే అసలు ఘర్షణ ఎట్లా ప్రారంభమయిందో, ఒక పోలీసు అధికారి పంపిన టెలిప్రింటర్ మెసేజి ఏమి చెప్పిందో ఇది వరకే చెప్పాను. స్థానికులే దుర్భాషలాడడం మొదలు పెట్టారని ఆ మెసేజిలో సాక్ష్యం ఉంది.

ఇక ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు మామూలుగా పౌరహక్కుల, ప్రజాస్వామిక హక్కుల ఉద్యమాలు న్యాయ విచారణ కమిషన్ నియమించమని అడుగుతాయి. మళ్లీ బీదర్ సంగతే చూద్దాం. ఆ కమిషన్ 1990 జనవరిలో తన నివేదిక ఇచ్చింది. ఆ నివేదికలో, పాలనా యంత్రాంగం విఫలమైందని, ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ తన బాధ్యతలు నిర్వర్తించలేదని రాశారు. అయినా ఏమి జరగలేదు. ఎవరి మీదా ఏ చర్యలూ తీసుకోలేదు. కమిషన్ గురించి అడగడంలోగాని, ఆ తర్వాత కమిషన్

నివేదిక మీద ఏ చర్చలు తీసుకున్నారని వెంటపడక పోవడంలో గాని కొంత వరకు ఈ ఉద్యమాల వైఫల్యం, బహుశా కొంత అజ్ఞానం కూడా ఉన్నదనుకుంటాను.

ఇక వామపక్ష విశ్లేషణ చూస్తే, ఇదే బీహార్ సంఘటనకు సంబంధించి, అశోక్ జైట్లీ అనే ఐఎఎస్ అధికారి ఒక వైపు, సుమంతో బెనర్జీ మరొక వైపు విశ్లేషణలు చేశారు. వాళ్లిద్దరూ కూడా ఎ క్లాస్ కంట్రాక్టర్ జోగాసింగ్‌కు వామపక్ష దృక్పథం ఉండాలని, ఆశించినట్టున్నారు. ఆ అవగాహన లేనందుకు ఆయనను తప్పుబట్టారు. జోగాసింగ్ ఒక వ్యాపారవేత్త, ఎ క్లాస్ కాంట్రాక్టర్ అంటేనే పెద్ద గుణవంతుడు కాదని చెప్పవచ్చు. కాంట్రాక్టులు పొందేందుకు ప్రభుత్వాధికారులకు, అధికారంలో ఉన్నవారికి లంచాలు ఇస్తూనే ఉన్నాడు. అట్లా లంచాలు ఇస్తూనే మెడికల్ కాలేజి అనుమతి తెచ్చుకుని ఉంటాడు. తన ఆవరణలో ఖాళీ భవనాలు ఉన్నాయి గనుక కాలేజి పెట్టాడు. మొత్తం మీద అది హిందూ,మైనారిటీ విద్యా వ్యాపార సంస్థల మధ్యఉన్న తగాదా. దానికి విద్యార్థుల అనుచిత ప్రవర్తన, స్త్రీలపట్ల వేధింపులు లాంటి రంగు అంతా పూయడం జరిగింది.

## అనుచిత ప్రవర్తన రంగు

ఇది అన్ని చోట్లా ఉన్నదే. అసలు విషయాన్ని పక్కనపెట్టి, స్త్రీలపట్ల అనుచిత ప్రవర్తన అన్న దాన్ని తీసుకురావడం. మైనారిటీలకు సహజంగానే స్త్రీలపట్ల అనుచితంగా ప్రవర్తించే ఒక రకమైన స్వభావం ఉంటుందన్నట్టు వ్యాఖ్యానించడం. దళితుల విషయంలో కూడా ఇటువంటి ఆరోపణలు ఉన్నాయి. జస్టిస్ గంగాధరరావు కమిషన్ విచారణలో చుండూరు ఘటన విషయంలో కూడా దళిత యువకుల అనుచిత ప్రవర్తన గురించి రాశారు. దళితులనగానే అనుచితంగా ప్రవర్తిస్తారన్న మాట. రెడ్లు అనుచితంగా ప్రవర్తించరా, బ్రాహ్మణులు అనుచితంగా ప్రవర్తించరా, కమ్మలు అనుచితంగా ప్రవర్తించరా?

సరే, మొత్తం మీద ఇటువంటి సామూహిక హత్యాకాండలు జరిగినప్పుడు ప్రభుత్వం ప్రవర్తించవలసినట్టుగా ప్రవర్తించలేదు. అయితే మొదటి నుంచీ కూడా చట్టబద్ధ పాలన గురించీ, రాజ్యాంగ బద్ధమైన ప్రవర్తన గురించీ మన సమాజం సక్రమంగా ఆలోచించడం లేదు.

మనం మన రాజ్యాంగం రాసుకున్నప్పుడు ఇది ఒక బహుమతా, బహుకులాల వ్యవస్థ అనీ అందువల్ల దీనితో వ్యవహరించేటప్పుడు విశాల దృక్పథం అవసరమనీ గుర్తించలేకపోయాం. అసలు మన సమాజంలో ఇటువంటి దాడులు ఎందుకు జరుగుతున్నాయని, ప్రత్యేకించి దళితుల మీద దాడులు ఎందుకు జరుగుతున్నాయని మనం సరిగా అర్థం చేసుకోలేదు. మనకు ఆ సమస్యే సరిగా అర్థం కానప్పుడు దాన్ని ఎట్లా పరిష్కరించాలో కూడా తెలియదు.

## దళితుల మీద దాడులు

ఆంధ్రప్రదేశ్‌లో దళితుల మీద దాడుల గురించే చూడండి. వాళ్ల మీద దాడులు ఎప్పటి నుంచి పెద్ద ఎత్తున జరుగుతున్నాయంటే, వాళ్లు ప్రశ్నలు అడగడం మొదలు పెట్టినప్పటి నుంచి, దళితుల ఉద్యమం పెరిగి, వాళ్లు అధికారం కావాలనీ, నిర్ణయాధికారంలో తమకూ న్యాయమైన భాగస్వామ్యం కావాలని అడగడం మొదలు పెట్టిన తర్వాత వాళ్ల మీద దాడులు పెరిగిపోయాయి. వాళ్లు సమాజంలో ఇతరుల నుంచి సానుభూతి, సంఘీభావం పొందడం మొదలయ్యాక వాళ్ల ప్రాధాన్యత బాగా పెరిగిపోయింది. ఎందుకంటే అదంతా ఒక కుప్పగా, వోట్‌బ్యాంకుగా పనికి వస్తుందని అన్ని రాజకీయ పక్షాలు ఆలోచించడం మొదలుపెట్టాయి. దళితుల వోటు హక్కు అనేది కాంగ్రెస్ పార్టీ గుత్తసొమ్ముగా, సొంత ఆస్తిగా మారిపోయింది. అందువల్ల కాంగ్రెస్ దళితులలో యజమానిలాగా ప్రవర్తించడం మొదలుపెట్టింది. ఇతర పార్టీలు కూడా ఆ ఆస్తి కోసం తగాదా పడం మొదలుపెట్టాయి. దళితుల అస్తిత్వం, దళితుల వోటుహక్కు అనేవి రాజకీయ పక్షాలు కొట్లాడుకునే ఆస్తులుగా మారిపోయాయి.

అందులో భాగమే 1983 పదిరికుప్పం దాడి. అక్కడ ఎంత ఘోరంగా జరిగిందంటే, దళితులకు చెందిన గేదెలను కూడా పెట్రోలు పోసి తగులబెట్టారు. తర్వాత ఏమయింది? ఏమీ కాలేదు. నేరస్తులెవరికీ శిక్షలు పడలేదు. ఏకసభ్య విచారణ కమిషన్ వేశారు గాని ఆ నివేదికను పట్టించుకున్న వారేలేదు.

ఆ తర్వాత కారంచేడు జరిగింది. అక్కడ దళితులు చేసిననేరమల్లా, ఒక దళిత స్త్రీ ధైర్యంగా, మేం మంచినీళ్లు తాగే చెరువులో గేదెలు కడగబాకండయ్యా అని అనడమే. ఆ మురికి నీళ్లు తాగి, అవి తాగనిచ్చినందుకు కృతజ్ఞత చూపడం కాకుండా, ఎదురు మాట్లాడే ధైర్యం చేస్తావా అని కమ్మ భూస్వాములకు కోపం వచ్చింది. ప్రతీకారంగా దళితులను తెగనరికారు. ఆ తర్వాత ఒక కమిషన్ విచారణ జరిగింది.

కారంచేడు హత్యాకాండ జరిగేనాటికి ఇంకా దళితులు అనేమాట ప్రాచుర్యంలోకి రాలేదు. అప్పటి పత్రికలు చూస్తే బాధితులను హరిజనులు అనో, మాదిగలు అనో ప్రస్తావించడం జరిగింది. ఆ మారణకాండ గురించి ఇలస్ట్రేటెడ్ వీక్లీ తరఫున ఇవాన్ ఫేరా వచ్చి ఒక మంచి రిపోర్టు రాశాడు. కారంచేడు బాధితకుటుంబాలు అక్కడి నుంచి బయటికి వచ్చి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో విజయనగర్ అనే కాలనీ నిర్మించుకుని ఉన్నప్పుడు వాళ్లను అక్కడ నుంచి వెనక్కి కారంచేడుకు పంపించడానికి చాలా ప్రయత్నాలు జరిగాయి. దళితులు ససేమిరా వెళ్లమన్నారు. "మాదిగల వాదన పూర్తిగా సమంజసం. వాళ్ల మీద దాడులు ఎన్నోసార్లు లెక్కలేనన్ని జరిగాయి. ప్రతిసారీ వాళ్లను వెనక్కి తీసుకుపోవడానికి ప్రయత్నం జరుగుతుంది. అది ఒక ఎర. వాళ్లు వెనక్కి వెళ్లిపోయారంటే, ప్రత్యక్షసాక్షులను చాలా సులభంగా కొనివేసి, మాట్లాడకుండా చేయవచ్చు. వాళ్ల విషయంలో వెనక్కి వెళ్లడమంటే మామూలు జీవితంలోకి వెళ్లడం కాదు. పీడన లోకి

వెళ్లడం" అని నేనప్పుడన్నానని ఇహాన్ ఫెరా రాశాడు.

కారంచేడు ఘటన జరగగానే మేం పౌరహక్కుల సంఘం తరపున అక్కడికి వెళ్ళాం. ఎక్కడ పౌర, ప్రజాస్వామిక హక్కుల ఉల్లంఘన జరిగినా వెంటనే అక్కడికి పరుగెత్తుకుని పోవడం మాకు అలవాటయింది గదా. మేం మాత్రమే కాదు, గత రెండు మూడు దశాబ్దాలలో ఇటువంటి సంఘటనలు ఎక్కడ జరిగినా అక్కడికి ఒక జాతరలాగ జనం వెళ్లడం, బాధితులను పరామర్శించడం జరుగుతూనే ఉంది. కాని ఇప్పుడు వెనక్కి తిరిగి చూస్తే ఈ బయటి నుంచి వెళ్లి బాధితులను పరామర్శించడం, ఉద్యమం నిర్మించడం సరిగా జరగలేదనిపిస్తుంది. పదిరికుప్పంలో ఒక నాయకుడు, రాజ్‌కుమార్ అనుకుంటాను. ఉద్యమం నడిపాడు. ఆ తర్వాత ఆయన పేరే, ఎక్కడా వినిపించలేదు. కారంచేడు సందర్భంలో బాధితులను ఊరి నుంచి బయటికి తీసుకు వచ్చి విజయనగర్ అని ఒక కొత్త కాలనీ నిర్మించి కొంత కాలం ఉద్యమం నడపడం జరిగింది. నీరుకొండ ఘటన మీద అందోళన ఒక వారం రోజులలోపలే ముగిసిపోయింది. చుండూరు మారణకాండ విషయంలోనూ అంతే.

## చుండూరు మారణకాండ

నిజానికి చుండూరు మారణకాండ చాలా దుర్మార్గమైన, అమానుషమైన హత్యాకాండ, హిందు సమాజం, ముఖ్యంగా రెడ్డి కులస్తులు, ఇంత క్రూరంగా ప్రవర్తిస్తారా అని ఊహించడానికి కూడా వీలుగానంత ఘోరంగా సంఘటన అది. అక్కడ దళితులను చంపడం మాత్రమే కాదు. ముక్కలు ముక్కలుగా నరికారు. గోనె సంచుల్లో నింపారు. కాలువలో విసిరేశారు. సమీపంలోని గుంటూరులో కలెక్టర్ కార్యాలయం ఉంది. పోలీసు సూపరింటెండెంట్ కార్యాలయం ఉంది. ఎవరూ ఏ పనీ చేయలేదు. అక్కడ ఏమి జరుగుతున్నదో కనుక్కోవడానికి కూడా జిల్లా యంత్రాంగం, గూఢచార యంత్రాంగం ఏమీ పని చేయలేదు.

ఒకసారి కొత్త దాను అబిడ్స్‌లో కొన్ని దుకాణాల మీద దాడి చేసి అద్దాలు పగలగొట్టాడు. పోలీసులు ఆ విధ్వంసకాండ అయిపోయేదాకా అక్కడికి రానేలేదు. అక్కడికి రాబోయిన పోలీసు వ్యాను టైరు పంక్చర్ అయింది. ఆ సంఘటన తర్వాత గజ్జెల మల్లారెడ్డి "దొంగలు పడ్డ ఆరు నెల్లకు కుక్క మొరిగినట్టు కాదు, దొంగలు పడ్డ సమయానికి కుక్కకు దొడ్డికి వచ్చినట్టు" అని రాశాడు. ఆ మాదిరిగా, చుండూరు మారణకాండ జరుగుతుంటే పోలీసులు అటువైపు వెళ్లడానికి ఏ ప్రయత్నమూ చేయలేదు.

నా సొంత అనుభవం నుంచి మరొక ఘటన చెబుతాను. పోలీసులు నేరాలు జరిగే విషయం తెలిసినప్పుడు కూడా ఎంత నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తారో, ఎట్లా ఆలస్యం చేస్తారో నేను ప్రత్యక్షంగా చూసిన ఘటన అది. ఇక్కడ మా ఇంటి ముందు ఒక ఇల్లు ఉంది. అది

ఒక కోర్టు అమీన్ ఇల్లు. ఆయన చనిపోయినాడు. ఆయన కొడుకు ఆ ఇంటిని కొట్లుగా మార్చి కిరాయికి ఇచ్చి బతుకుతున్నారు. కిరాయికి ఉన్న వాళ్ళు ఖాళీ చేయమని అనడంతో సమస్య వచ్చింది ఇంటి యజమాని డేవిడ్ రాజ్ అని సికింద్రాబాద్‌లో పేరు మోసిన వాడికి ఆ కిరాయిదారులను ఖాళీ చేయించే పని అప్పజెప్పాడు. పవర్ ఆఫ్ అటార్నీ రాసి ఇచ్చాడు ఆ డేవిడ్‌రాజ్ వచ్చి కిరాయికు ఉన్న వాళ్లను బెదిరించడం మొదలుపెట్టాడు. గ్యాంగుతో కలిసి వచ్చి వీళ్ల మీద దౌర్జన్యం మొదలుపెట్టాడు. కొంత భయానక వాతావరణం తయారు చేసి పెట్టాడు. కిరాయిదార్లందరూ వణికిపోతున్నారు. ఎందుకంటే ఈ డేవిడ్ రాజ్ ఒక్కటేసారి ఏడుగురిని చంపేశాడు. నా మిత్రుడు, న్యాయవాది చల్లా రామకృష్ణారెడ్డి వల్ల కోర్టులో కేసు కొట్టుడుబోయిందనుకోండి.

నేనతణ్ని పిలిచి "ఇదంతా కుటుంబాలు ఉండే ప్రాంతం, నువ్విక్కడ ఇట్లా అల్లరి చేయడం బాగుండదు" అని చెప్పాను. డీజీపీకీ ఫోన్ చేసి చెప్పాను. అది పై నుంచి ఈ ప్రాంతం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దాకా వచ్చింది. ఆ సీఐ అంటాడుగదా, "ఆ ప్రాంతానికి పోవలసినంతగా లా అండ్ ఆర్డర్ సిచ్చువేషన్ రైపెన్ కాలేదు సార్" అని. రైపెన్ కావడం అంటే ఏమిటి? తలకాయలు పగలడమా? పగిలిన తర్వాత పోలీసులు వచ్చి చేసేదేముంది?

అదీ పోలీసుల వైఖరి. లా అండ్ ఆర్డర్ సిచ్చువేషన్ రైపెన్ అయి, హత్యలు దౌర్జన్యాలు అన్నీ అయిపోయినాకనే వస్తారు.

అట్లా చుండూరులో కూడా దళితులను చంపి, ముక్కలుగా నరికి, గోనె బస్తాల్లో కూరి, కాలువలో పడేసినాక పోలీసులు అక్కడికి వచ్చారు. ఇప్పుడు విచారణ మొదలైంది. యాభై మందినో అరవై మందినో సాక్షులను విచారించడం ఇటీవలే అయిపోయింది. ఆ కేసులో ఎన్ని మెలికలు వేస్తున్నారంటే ఆ వాదనలన్నీ సిగ్గులేని వాదనలు. "చుండూరు బాధితులు క్రైస్తవులు గనుక వాళ్లను షెడ్యూల్డ్ కాస్ట్ అని గుర్తించడానికి వీల్లేదు. అందువల్ల ఎస్.సి. ఎస్టి అట్రాసిటీస్ చట్టం వర్తించదు" అని ఒక వాదన. కోర్టులలో మా వకీళ్లం సిగ్గులేకుండా వాదనలు పెడతాం. జడ్జీలు కూడా చానా ఓపిగ్గా వింటారు. దళితుడు క్రిస్టియానిటీ లోకో, బుద్ధిజం లోకో మారితే దళితుడు కాకుండా పోతాడు. వెంటనే ఫార్వర్డ్ కాస్ట్ అయిపోతాడు అని ఒక తర్కం. ఇంతగా అంతరాలను పెంచిపోషించే వ్యవస్థ ఎప్పటికైనా ఎట్లా ప్రజాస్వామికం అవుతుంది. ఎప్పటికైనా ఎట్లా న్యాయబద్ధం అవుతుంది. అనే ప్రశ్నలు వస్తాయి.

ఒక సారేమో క్రిస్టియన్లు కాబట్టి ఆ చట్టం వర్తించదు అని వాదన పెట్టారు. అది ఒక ఆరు నెలలు సాగదీయడానికి పనికి వచ్చింది. అది అయిపోయిన తర్వాత, విచారణ చుండూరులోనే జరగాలి అని ఒక దరఖాస్తు వస్తే జిల్లా జడ్జి సరే అని ఉత్తర్వులిచ్చాడు. ఇక జిల్లా జడ్జికి మమ్మల్ని వినకుండా, ఇటువంటి ఉత్తర్వులిచ్చే అధికారంలేదు అని

మరొక వివాదం లేవదీసినారు. ఆ వాదన వచ్చినప్పుడు నేను ఆ కోర్టులోనే ఉన్నాను. వాదనలకు వచ్చినప్పుడు నేనే వాదించాను. రెడ్డప్ప రెడ్డి ఉన్నాడు. అది ఒక అధికారిక ఉత్తర్వు గనుక మీరు ఒప్పుకోవలసిందేనండీ అన్నాను. కానీ ఆయన నాకు వ్యతిరేకంగా తీర్పిచ్చినాడు. మళ్లీ హైకోర్టు చుండూరులోనే విచారణ జరగాలని రెండోసారి తీర్పు ఇచ్చింది. అప్పుడు కూడా మళ్లీ దాన్ని మార్చమని కోరితే, అప్పుడు కూడా నేను వాదించి ఆ పిటిషన్‌ను కొట్టేయించాను.

మొత్తానికి చెప్పవచ్చిందేమంటే, ఒక దళిత వర్గం మీద, ఒక వెనుకబడిన వర్గం మీద, ఒక మైనారిటీ సమూహం మీద ఒక కేసు వస్తే, దాని న్యాయపరమైన వివాదపు స్వభావమే పూర్తి భిన్నంగా ఉంటుంది. అది ఒక అడుగు ముందుకుపోదు. దాన్ని పోనివ్వరు.

**చట్ట విశ్లేషణ**

కారంచేడు తర్వాతనే, ఇటువంటి అత్యాచారాలు జరుగుతున్నాయి. వీటిని అరికట్టాలి అని ఒక చట్టం ప్రవేశపెట్టినారు. కాని దాన్ని విశ్లేషించేవాడు. వ్యాఖ్యానించేవాడు. అమలు చేయవలసిన వాడు పెద్ద కులాలకు చెందిన వాడు. ఇక కుల తారతమ్యాల మీద ఆధారపడి విశ్లేషణే జరుగుతుంది. అసలు విశ్లేషణ అట్లా ఉండకూడదు. గతంలో అట్లా ఉండేది కాదు. ఇప్పుడట్లా ఉంటోంది.

ఒక సమస్యను కనిపెడతాం. దీన్ని పరిష్కరించడానికి, అరికట్టడానికి ఒక చట్టం చేస్తాం. మరి ఆ చట్టం విశ్లేషించేటప్పుడు, ఆ సమస్యను, ఆ మూల కారణాన్ని దృష్టిలో ఉంచుకొని విశ్లేషణ చేయాలా, అసలు ఆ సమస్యను పక్కన పెట్టి చట్టాన్ని మన ఇష్టం వచ్చినట్టు విశ్లేషణ చేయాలా? సమస్యను పక్కనపెట్టి ఆ చట్టాన్ని భాషాపరంగా, వ్యాకరణపరంగా అర్థం చేసుకోవడం మొదలుపెట్టినామంటే, ఆ చట్టం ముందుకుపోనే పోదు.

అటువంటి తప్పుడు విశ్లేషణలు ఈ చట్టంలోకి గూడా జొరబడినాయి. ఎస్‌సి, ఎస్‌టి అత్యాచారాల నిరోధ చట్టంలో ప్రత్యేకంగా స్పెషల్ కోర్టుగా, నేరుగా సెషన్స్ కోర్టు విచారణ జరిపే వీలు కల్పించినారు. ఎందుకంటే, ఇటువంటి అత్యాచారాల మీద విచారణ ఆలస్యం జరగకూడదు, తొందరగా అయిపోవాలి అని. కాని మళ్లీ ఇక్కడ కూడా మొదట మెజిస్ట్రేట్ కోర్టుకు పోయి, అక్కడ కమిట్ చేయించి ఆ తర్వాతనే సెషన్స్‌కు పోవాలి అని విశ్లేషణ చేశారు.

మానవహక్కుల పరిరక్షణ చట్టంలో కూడా అంతే. ఆ చట్టం ప్రకారం సెషన్స్ కోర్టు మానవ హక్కుల కోర్టుగా వ్యవహరించాలి అని నిబంధన పెట్టారు. దానికి కూడా ఒక మెలిక పెట్టారు. స్పెషల్ కోర్టు అన్నారు గాని కమిటల్ స్టేజి లేదనలేదు. కాబట్టి కింది కోర్టులో కమిటల్ కావలసిందే అన్నారు.

ఈ వివాదాలన్నిటి ఉద్దేశ్యం ఏమిటంటే, విచారణ సంవత్సరాల తరబడి ఆలస్యం

చేయడమే. ఒక వేళ కమిటల్ స్టేజిని ఎంత తగ్గించి నిబంధనలు విధించినప్పటికి, మొత్తం న్యాయ వ్యవస్థలోని అన్ని విభాగాలూ ఆ దశను ఒక వాదవివాద క్రీడగా మార్చి వీలైనంత ఎక్కువ ఆలస్యం చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. మరీ ముఖ్యంగా అది మానవ హక్కుల ఉల్లంఘనకు సంబంధించినదయినప్పుడు తప్పకుండా అది ఒక క్రీడ అయిపోతుంది. అది కేవలం బాధితులకు మాత్రమే క్రీడ కాదు, వాళ్లకది ఒక నిత్య నిర్బంధం, హింసాభరితమైన కాలయాపన. మిగిలిన వాళ్లందరికి అది క్రీడే. పోలీసులకు న్యాయవాదులకు, ప్రాసిక్యూటర్లకు, న్యాయమూర్తులకు అందరికీ అది క్రీడే.

అంటే ఏ ఒక్కరికీ ఉండవలసినంత నిబద్ధత లేదు. రాజ్యాంగస్ఫూర్తిపట్ల, రాజ్యాంగ నియమాలపట్ల నిబద్ధత ఉండాలి. ఆ రాజ్యాంగ నియమాల వెలుగులో అధికారిక సూత్రాలను వ్యాఖ్యానించాలనే నిబద్ధతుండాలి. కాని ఇప్పుడు జరుగుతున్నదేమంటే అధికారులు తమకు వీలయిన సూత్రాలు తయారు చేస్తారు. వాటిని సమర్థించేలా రాజ్యాంగ నియమాలను వ్యాఖ్యానిస్తారు.

కింది వర్గాల నుంచి పైకి వచ్చి అధికారిక స్థానాలలో కూచున్న వారికి కూడా ఆ బద్ధత ఉండడంలేదు. ఒక కారణం అట్లా వచ్చిన వారు తమ తోటి వారు అనుభవించినంత పీడనను అనుభవించకనైనా పోయి ఉండాలి. లేదా, అట్లా అధికారి స్థానాలకు వచ్చిన వాళ్లు అక్కడికి రావడానికి పెద్ద కులాల వాళ్లు ఎంత అవినీతికి పాల్పడతారో వీళ్లూ అంతగా అవినీతికి పాల్పడి వచ్చి ఉండాలి. అలా కాకపోతే వాళ్లు ఆ స్థానానికే రారు.

కింది వర్గాల నుంచి పైకి ఎదిగి వచ్చి అత్యున్నత అధికార పీఠాలు చేపట్టిన వాళ్లు ఎవరయినా ఉంటే, చాలా సందర్భాలలో వాళ్లు నిజంగా పీడనను, వేదనను అనుభవించి వచ్చినవాళ్లు కాదు. అగ్రవర్ణాల వాళ్లు ఎంత పైరవీ చేసి ఆ పదవులకు వస్తారో వీళ్లు కూడా అంత పైరవీ చేయడం నేను చూశాను. ఒకవేళ వాళ్లు అంత పైరవీ కార్లు కానట్టయితే ఆ స్థానానికి రావడమే కష్టం.

సమస్య ఏమంటే, ఒక ప్రత్యేక వ్యక్తిని, ఉదాహరణకు ఒక షెడ్యూల్డ్ కులానికి చెందిన వ్యక్తిని, ఒక ఉన్నత పదవికి సిఫారసు చేయాలనుకోండి, ఆ ఉన్నత పదవిలో నియమించాలనుకోండి. సాధారణంగా ఈ పైరవి అంశమే పనిచేస్తుంది. నిజంగా ఉన్నత పదవికి అవసరమైన నిబద్ధత, సామర్థ్యం గల వ్యక్తిని ఎంచుకునే బదులు ఆ వృత్తిని తీసుకుంటారు. ఎటువంటి సమర్థత లేకపోయినా పబ్లిక్ ప్రాసిక్యూటర్ అయి, జడ్జి అయి, సుప్రీం కోర్టు జడ్జి అయి... ఇదంతా ఒక వరుసలో జరిగిపోతుంది. ఇవన్నీ నిబద్ధతగల వ్యక్తులకు ఇస్తున్నవి కాదు. అవన్నీ కూడా అప్పటికే అగ్రవర్ణాలకు చెందిన ఒక వ్యక్తి పదవిలో పైకి పోవడానికి ఏమేమి చేస్తాడో అవన్నీ చేయడం నేర్చుకుని, అవే పనులు చేసిన సంపాదించుకున్న పదోన్నతులు.

నేను ఒక వాస్తవ ఉదాహరణ చెపుతాను. ఒక షెడ్యూల్డ్ కులానికి చెందిన వ్యక్తిని

జడ్జి పదవికి ఎంపిక చేయాలనుకోండి. ఆ నిర్ణయం చేసే అవకాశం నాకు ఉంటే, నేను బొజ్జా తారకం గారిని ఆ పదవికి సూచిస్తాను. నిజానికి ఆయన జడ్జిని చేయడం చాలా అనివార్యమైన ఎంపిక, ఆ పదవికి ఆయనకంటే సమర్థులు దొరకరు. కాని ఇప్పుడున్న పద్ధతిలో ఎవరినో ఒకరిని వెతికి పట్టుకుని నియమిస్తారు.

అసలు ఇట్లా వెతికి పట్టుకుని పదవిలో నియమించడమనేదే ఒక తప్పుడు పద్ధతి. విశ్వవిద్యాలయాల వైస్ చాన్సలర్ పదవికి చూడండి. ఒక విసిని నియమించాలంటే, సర్చ్ కమిటీ అని ఒకటి వేసి వెతకడం మొదలుపెడతారు. వైస్ చాన్సలర్ పదవికి నియమించబడే వారి కోసం వెతకాలా, చూడగానే కనబడరా? ఆ విశ్వవిద్యాలయంలోనో, మొత్తంగా అకడమిక్ కమ్యూనిటీలోనే అందరికీ తెలిసిన సమర్థులు ఉండరా?

అట్లాగే ఒక హైకోర్టు జడ్జి పదవికి ఎవరినైనా ఎంపిక చేయాలంటే, కళ్ల ఎదురుగా ఉన్న వ్యక్తులందరినీ వదిలేస్తారు. ఓపెన్ కోర్టులో తెలుస్తుందిగదా, ఏ న్యాయవాది ఎంత బాగా వాదించగలడు, ఎంత నీతిమంతుడు, ఎంత మంచి ప్రాక్టీసు ఉంది, ఎంత శక్తి ఉంది, అందరికీ తెలుసు. జడ్జీలకు తెలుస్తుంది. కేవలం వాళ్ల వాదనలు వినడం ద్వారానే జడ్జీలకు ఏ న్యాయవాది సమర్థుడో ఎవరు కాదో స్పష్టంగా తెలిసిపోతుంది. కాని వాళ్లనే వదిలివేస్తారు.

జడ్జీల నియామకాలు జరిగినప్పుడల్లా తప్పుడు ఎంపికలే కనబడుతుంటాయి. ఒక పది మంది జడ్జీలను నియమించారంటే అందులో ఎనిమిది మంది అల్లాటప్పాగా వచ్చిన వాళ్లే ఉండి ఉంటారు.

అంటే ఈ నియామకాలలో చాలా లోపాయికారీ వ్యవహారాలు జరుగుతాయన్నమాట. బ్రిటిషర్లకు జడ్జీలవల్ల ఏమి జరుగుతుందో తెలుసు. వాళ్లు మంచి జడ్జీలు ఉండాలని అనుకునే వాళ్లు. అందుకే వాళ్లు సమర్థులైన న్యాయవాదులను ఏరి కోరి జడ్జీలుగా నియమించే వాళ్లు. సాధారణంగా ఇటువంటి వ్యవహారాలలో ఆ రోజుల్లో బ్రాహ్మణులు తెలివిగా ఉండే వాళ్లు కాబట్టి అప్పుడు వచ్చిన జడ్జీలంతా బ్రాహ్మణులే అయ్యారు. అయితే విషయమేమంటే బ్రిటిష్ వాళ్లెప్పుడూ చెడ్డ, అసమర్థుడైన బ్రాహ్మణుడిని ఆ పదవికి ఎంపిక చేయలేదు.

కనుక ఇప్పుడు కూడా నేను ఎస్‌సి, ఎస్‌టి వ్యక్తులను ఉన్న పదవుల్లో నియమించాలన్నప్పుడు అసమర్థులైన వాళ్లను నియమించమని అడగడం లేదు. వాళ్లలో మంచి వారిని, సమర్థులైనవారిని, ఆ పదవికి అవసరమైన ప్రతిభ కనబరిచే వారిని నియమించమని అడుగుతున్నాను.

## న్యాయమూర్తుల అభిప్రాయాలు

ఇప్పటి వరకూ నేను వివరించినటువంటి కేసులలో న్యాయం చెప్పాలంటే హైకోర్టు

జడ్జీగా ఒక ఛాందసుడు, మూఢ విశ్వాసాలు గలవాడు జడ్జిగా ఉంటే ఏం ప్రయోజనం? ఒక వేళ అటువంటి వాడు అక్కడి జడ్జీగా ఉన్నాడనుకోండి. కులంపట్ల తప్పుడు అభిప్రాయాలు ఉన్నవాడు, దళితులు అణగి ఉండవలసిందే అనుకునేవాడు, అగ్రవర్ణాలకు కింది కులాల వారి మీదెంత దౌర్జన్యం అయినా జరిపేందుకు హక్కు ఉన్నదనుకునే వాడు జడ్జీగా ఉంటే ఎటువంటి తీర్పు వచ్చే అవకాశం ఉంది? ఎటువంటి న్యాయం జరిగే అవకాశం ఉంది?

మొత్తం మీద నేను చెప్పేదేమంటే, 1984 సిక్కుల ఊచకోత కానీయండి, బాబ్రీమసీదు అనంతరం ముస్లింల మీద జరుగుతున్న దౌర్జన్యాలు కానీయండి, గుజరాత్ మారణకాండ కానీండి, దళితుల మీద ఎడతెగకుండా జరుగుతున్న హింస కానీయండి, ఇటువంటి దారుణ దమనకాండల విషయంలో ఈ దేశంలో న్యాయవ్యవస్థ న్యాయం అందించడంలో విఫలమైంది. ఈ ఘటనలలో బాధితులకు న్యాయసహాయం అందించడంలో మన న్యాయ వ్యవస్థ సంపూర్ణంగా పనికి రాకుండాపోయింది.

ఈ అన్యాయంలో ఎంత ఉద్దేశ్య పూర్వకంగా జరిగిందని, ఎంత అనుకోకుండా జరిగిందని కూడా చర్చ ఉంది. ఇది ఉద్దేశ్యపూర్వకమే అని అంటే, ఎక్కడ కుట్ర జరిగింది, ఎవరెవరు కుట్రపన్నారు అనే ప్రశ్నలు రావచ్చు. అవి మనం కనిపెట్టలేకపోవచ్చు కూడా. కాని, నేనుమనుకుంటానంటే, మన పెంపకంలోనే, పిల్లలకుకొన్ని అభిప్రాయాలు కలగజేస్తాం. ఆ అభిప్రాయాలు సాధారణంగా, ఎప్పటి నుంచో వస్తున్న సాంప్రదాయక భావనలే ఉంటాయి. ఆ సాంప్రదాయిక భావనలో ఒకటి ప్రతిభ అనేది.

ప్రతిభ అనగానే, అది బ్రాహ్మలకు మాత్రమే ఉంటుందనే ఒక తప్పుడు అభిప్రాయం కొనసాగుతూ ఉంటుంది. చదువుకునే పాండిత్యం సంపాదించే సమర్థత బ్రాహ్మలకు మాత్రమే ఉన్నదనే ఒక అభిప్రాయం ఉంటుంది. అందువల్ల ఏ పదవికైనా వాళ్లను ఎంచుకోవాలి అనిపిస్తుంది. ఒకసారి వాళ్లు ఆ పదవికి చేరాక, ఇక అది వాళ్ల గుత్త సొమ్ము అయిపోతుంది. ఇకవాళ్లు దాన్ని మరెవరికీ ఇవ్వడానికిగాని, మరెవరితోనైనా పంచుకోవడానికి గాని అంగీకరించరు.

ఆ తర్వాత రెడ్లు ఉన్నారు. మద్రాసు రాష్ట్రంలో కమ్యూనల్ జీవో అని వెనుకబడిన కులాల వాళ్లకు అవకాశాలు కల్పించే చట్టం 1930ల నుంచీ అమల్లో ఉంది. అక్కడా చట్టం సహాయంతో బ్రాహ్మణుల ఆధిపత్యం తగ్గించడానికి ప్రయత్నిస్తూ వచ్చారు. ఆ తర్వాత ఆ జీవోను కొట్టేశారుగాని దాన్ని కొట్టేసే సమయానికే, రెడ్లు కొంత స్థానం సంపాదించారు. పార్థసారధి రెడ్డి, సంజీవరెడ్డి వగైరా అప్పటికే తయారయిపోయారు. కమ్యూనల్ జీవో వల్ల బ్రాహ్మణేతర అగ్రకులాల ప్రాబల్యం ప్రారంభమయింది.

ఇక వాళ్లు తమకు జడ్జిలుగా ఉండే శక్తి సామర్థ్యాలు ఉన్నాయని భావించడం మొదలుపెట్టారు. కుల వ్యవస్థ మీద నమ్మకం మనిషిలో ఎటువంటి అభిప్రాయాలు

కల్పిస్తుందంటే, నేను అగ్రకులానికి చెందిన వాడిని గనుక నా మెదడు ఇతర వ్యక్తుల మెదడు కన్నా సమర్థంగా పని చేస్తుందనీ, ఇతరులకన్నా నేను ఎక్కువ తెలివైన వాణ్ననీ, నాకు ఎక్కువ సమర్థత ఉన్నదనీ అగ్రకులాలకు చెందిన వ్యక్తులు అనుకునే పరిస్థితి వస్తుంది. . .

అప్పుడప్పుడు ఎక్కడో ఒక చోట కిందికులాల్లో కూడా సమర్థులు ఉన్నారని ఒప్పుకుంటుంటారు. అది కేవలం ఒక ఉదాహరణంగా చూపడానికి మాత్రమే. ఉదాహరణకు అంబేద్కర్‌ను ఒప్పుకున్నట్టుగా. ఒక ప్రదర్శన వస్తువుగా తయారు చేసి, మా కుల వ్యవస్థ ఎంత ప్రజాస్వామికంగా, ఎంత ఉదారంగా ఉన్నదో చూడండి అని చూపెట్టడానికి వాడుకుంటారు. అయితే అంబేద్కర్ విషయంలో ఆయన కేవలం ఒక ప్రదర్శనా వస్తువుగా మిగిలిపోలేదు. ఆయన కుల వ్యవస్థను సంపూర్ణంగా అర్థం చేసుకుని, దాన్ని ఎత్తిచూపడానికి తన శక్తి మేరకు ప్రయత్నించాడు.

భారతదేశంలో ఒక విచిత్ర స్థితి ఏమంటే, ఎంతో మంది సంఘసంస్కర్తలు పుట్టుకొచ్చారు. వాళ్లలో చాలా మంది కుల వ్యవస్థను విమర్శించారు కూడా. కాని ఈ కుల వ్యతిరేకులైన సంస్కర్తలు కూడా మత వ్యతిరేకులు కారు. వాళ్లు మతాన్ని విమర్శించలేదు.

## విచారణ కమిషన్ల తంతు

ఇటువంటి సామాజిక స్థితివల్ల, ఇటువంటి న్యాయ వ్యవస్థ వల్ల, ఎప్పుడైనా, దారుణమారణకాండలు సంభవించినప్పుడు మనకు వాటితో వ్యవహరించడం ఎట్లాగో తెలియదు. ఇక వెంటనే ఒక విచారణ కమిషన్ నియమిస్తాము. విచారణ కమిషన్ నియమించమని ప్రజా ఉద్యమాలు కూడా అడుగుతుంటాయి. విచారణ కమిషన్ల చట్టం ఎంత పనికిమాలిన చట్టం అంటే, ఆ కమిషన్ విచారణ నివేదిక మీద ప్రభుత్వం ఎటువంటి చర్య తీసుకోకపోయినా చేయగలిగేదేమీ లేదు. నిజంగా ప్రభుత్వం ఆ కమిషన్ నివేదికను అమలు చేయదలచుకుంటే, ఆ ప్రభుత్వం గనుక చట్టబద్ధపాలన మీద, ప్రజాస్వామ్యం మీద, ఉదారవాద భావాల మీద విశ్వాసం ఉన్నదయితే, జరిగిన అన్యాయాన్ని నవరించదలచుకున్నదయితే, కమిషన్ సిఫారసులను తీవ్రంగా పరిగణించవచ్చు. చర్యలు తీసుకోవచ్చు.

అట్లా కాకుండా, ఏదైనా ఒక ఘటన మీద ప్రదర్శనలు ఎక్కువగా జరిగితే, బాధితుల ఆగ్రహావేశాల మీద చన్నీళ్లు చల్లదలచుకుంటే, వెంటనే ఒక రిటైర్డ్ హైకోర్టు జడ్జీ నాయకత్వంలో ఒక కమిషన్‌ను నియమించడం ప్రభుత్వాలకు అలవాటయిపోయింది. ఆ కమిషన్ నియామకం వార్త రాగానే ఆందోళనలు ఆగిపోతాయి.

ఇప్పటి వరకూ ఎన్ని కమిషన్లు వేయబడ్డాయో, వాటి సిఫారసులవల్ల మన సామాజిక

రాజకీయ వ్యవస్థలో వచ్చిన మార్పులు ఏమిటో పరిశీలిస్తే చాలా దిగ్భ్రాంతికరమైన విషయాలు బయటపడతాయి. ఆ నివేదికలన్నీ కలిసి మన రాజకీయ, పాలనా వ్యవస్థల పని తీరును ఏమైనా మార్చాయా? ఏమయినా మెరుగుదల కనబడుతుందా? దానివల్ల మన న్యాయ వ్యవస్థలోని సిబ్బంది భావాలలో నియామకాలలో ఏమైనా తేడాలువచ్చాయా?

కమిషన్ వేస్తారు. అది ఒక నివేదిక ఇస్తుంది. ఆ నివేదిక ప్రచురించమని, బయటపెట్టమని ప్రజలు ఆందోళన చేస్తారు. కాని ప్రభుత్వం దాన్ని ప్రచురించదు. శ్రీమతి ఇందిరాగాంధీ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక చట్టపరమైన సవరణ కూడా తెచ్చారు. ఏమని అంటే, జాతి ప్రయోజనాల రీత్యా, దేశ భద్రత దృష్ట్యా ఒక కమిషన్ నివేదిక ప్రచురించడం మంచిదికాదు అని ప్రభుత్వం అనుకుంటే బయటపెట్టకుండా ఉండవచ్చు అని. అప్పుడే హిందూలో నేను ఒక వ్యాసం రాశాను.

ఇదంతా సమాజంపట్ల, వ్యవస్థ పట్ల బ్రాహ్మణీయ అవగాహన అని నా అభిప్రాయం. మనలో బ్రాహ్మణీయ అవగాహన ఎంతగా దిగిపోయి ఉందంటే, ఆచారాలు, క్రతువులు, తంతులు ముఖ్యమనీ, మనుషులు ముఖ్యం కాదనీ బ్రాహ్మణ్యం అనుకుంటుంది. మనుషులను పక్కకు తోసేసి, ఆచార వ్యవహారాలకు, మూర్ఖపు పద్ధతులకు ప్రాధాన్యత ఇస్తుంది. ఇప్పుడు మన ప్రభుత్వాలు కూడా వేర్వేరు ఆచారపు తంతులు నడుపుతూ ఉంటాయి. ప్రజలు తిరగబడకుండా, ప్రభుత్వాన్ని విమర్శించకుండా, ప్రభుత్వం చేసేది అర్థం చేసుకోకుండా ఈ తంతులు అడ్డం పడుతూ ఉంటాయి. నిజంగా ప్రజలకు న్యాయం ఇవ్వాలనే ఆలోచనకు మన రాజకీయాల్లో చోటు లేనేలేదు.

* * *

# శంకర్ గుహ నియోగి

ప్రజల మీద, ప్రజానాయకుల మీద, ఉద్యమకారుల మీద జరిగే దౌర్జన్యాలను, నేరాలను, అత్యాచారాలను సక్రమంగా పరిశోధించడంగాని, న్యాయస్థానాలలో సరిగా విచారణ జరపడంగాని, నేరస్తులకు తగిన శిక్షలు విధించడంగాని జరగదని మొత్తంగా ఒక అభిప్రాయం ఉంది. అది నిజమే కూడా. కాని ప్రతి సూత్రానికీ ఒక మినహాయింపు ఉన్నట్టుగానే, ఈ అభిప్రాయానికి కూడా ఒక మినహాయింపు ఉంది. అది శంకర్ గుహ నియోగి హత్యకేసు, ఆ కేసులో నేను ప్రాసిక్యూషన్ తరపున వాదించాను గనుక ఆ కేసు గురించి కొంచెం వివరంగా చెప్పుకోవాలి. చత్తీస్‌ఘర్ ముక్తి మోర్చా అప్పటి ప్రధాన మంత్రి ఐకె గుజ్రాల్‌కు ఒక విజ్ఞప్తి చేసింది. సీనియర్ న్యాయవాదిగా, ప్రాసిక్యూషన్ తరపున వాదించడానికి కె.జి. కన్నబిరాన్‌ను నియమించండి అని. నేను అటువైపు నుంచి

వాదించిన కేసు అది ఒక్కటే.

చత్తీస్‌ఘర్ మైన్స్ శ్రామిక్ సంఘ్ నాయకుడు శంకర్ గుహ నియోగిని అక్కడి పరిశ్రమల, వ్యాపార సంస్థల యజమానులు హత్య చేయించారు. కిరాయి హంతకులను ఏర్పాటు చేసి ఆ హత్య చేయించారు. ఆ హత్యకేసును పోలీసులు సరిగానే పరిశోధించారు. కింది కోర్టు యజమానులకు యావజ్జీవ శిక్ష విధించింది. కిరాయి హంతుకుడు పల్టన్ మల్లాకు మరణశిక్ష విధించింది. ఆ విచారణ జరిగినంత కాలం న్యాయవాది నందితా హక్సర్ ఆ విచారణ వాయిదా పడకుండా, అనవసర వివాదాలు రేకెత్తి పక్కదారి పట్టకుండా కాపలా కాశారు. చివరికి సిబిఐ కూడా తన బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించి ఒక మంచి ప్రాసిక్యూటర్ వాదనలు జరిపేలా, సాక్షులందరూ సాక్ష్యం చెప్పేలా చూసింది. ఆశ్చర్యకరంగా సాక్షులందరూ కూడా తాము అంతకు ముందు పోలీసులకు ఏమిచెప్పారో పొల్లుపోకుండా తిరిగి అదే చెప్పారు. ఈ మొత్తం క్రమంవల్ల నేరస్తులకు శిక్షలు పడడం సులభమైంది.

బహుశా మన దేశంలోని కార్మిక ఉద్యమాల చరిత్ర మొత్తంలోనూ ఒక కార్మిక నాయకుడిని హత్య చేయించినందుకు యజమానులకు శిక్ష పడిన సందర్భం ఇది ఒక్కటేననుకుంటాను.

శంకర్ నియోగి హత్య జరగడానికి చాలా ముందునుంచీ చాలా కాలంగా నాకు తెలుసు. ఆయన నన్ను ఒకసారి చత్తీస్‌ఘర్ పార్లమెంటు నియోజక వర్గానికి పోటీచేయమని కూడా అడిగాడు. నేను నిరాకరించాను. ఆయన చాలా మృదుస్వభావి, స్నేహశీలి. చాలా మంచి కార్యకర్త. ఒక ఆదివాసి యువతిని పెళ్లి చేసుకున్నాడు.

అప్పుడు చత్తీస్‌ఘర్ మధ్యప్రదేశ్‌లో భాగంగా ఉండేది గదా. అర్జున్‌సింగ్ ముఖ్యమంత్రిగా ఉండే కాలంలో అక్కడి కార్మికులందరిచేతా, నియోగి మద్యపానానికి వ్యతిరేకంగా ప్రమాణం చేయించాడు. అక్కడ సంపూర్ణంగా మద్యనిషేధం అమలైంది. కార్మికులు తమంత తామే స్వచ్ఛందంగా తమలో ఎవరైనా తాగితే జరిమానాలు విధించడం ప్రారంభించారు. దానితో అక్కడి ఎక్సైజ్ కాంట్రాక్టర్ల వ్యాపారం నిలిచిపోయింది. ప్రతి రాష్ట్రంలోనూ ఎక్సైజ్ కాంట్రాక్టర్లదే రాజ్యం గదా. అందువల్ల ఆ కాంట్రాక్టర్లు నియోగిని జాతీయ భద్రతా చట్టం కింద అరెస్టు చేయించారు. మన ప్రభుత్వాలు అటువంటివి.

నియోగి మన దేశ కార్మికోద్యమ చరిత్రలో కొన్ని విశిష్టమైన సంప్రదాయాలు ప్రవేశపెట్టాడు. మన ట్రేడ్ యూనియన్లకు సాధారణంగా సంఘటితంగా కార్మికులను సమీకరించడం. వారికి నాయకత్వం వహించడం మీద ఉన్న శ్రద్ధ అసంఘటిత రంగ కార్మికుల మీద ఉండదు. కాని నియోగి మొదటి నుంచీ కూడా అసంఘటిత రంగ కార్మికుల మీద కేంద్రీకరించి పని చేశాడు. నిజానికి అప్పటికే అన్ని ప్రభుత్వ రంగ సంస్థలలోనూ

అసంఘటిత కార్మికులున్నారు. కాంట్రాక్టు, కాజువల్, తాత్కాలిక కార్మికులుగా వాళ్లు పని చేస్తుండేవారు. వారిని సంఘటిత పరచాలని, వారి సమస్యల పరిష్కారం కొరకు పోరాడాలని మన పెద్ద ట్రేడ్ యూనియన్లు ఎప్పుడూ ఆలోచించలేదు. మన జాతీయ ట్రేడ్ యూనియన్లన్నీ కూడా పర్మినెంట్, రెగ్యులర్ కార్మికుల సమస్యల మీదనే పనిచేస్తూ వచ్చాయి. ఆ తప్పుడు పద్ధతిని వ్యతిరేకిస్తూ, శంకర్ గుహనియోగి దల్లి - రాజ్ హరా ఇనుప ఖనిజం గనుల ప్రాంతంలో అసంఘటిత రంగ కార్మికులను సమీకరించాడు. వారి కోసం ఒక కార్మిక సంఘం స్థాపించాడు. వారి సమస్యలపై వారి పని పరిస్థితుల మెరుగుదల కోసం పోరాటాలు ప్రారంభించాడు.

ఆయన సాగించిన కార్మికోద్యమ, సాంఘికోద్యమ కృషి వల్ల ఆయన అక్కడి పెత్తందార్లకు కంటిలో నలుసుగా మారాడు. అక్కడి పరిశ్రమల యజమానులు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు, పోలీసులు ఆయనను అంతం చేయదలచుకున్నారు.

సింప్లెక్స్ గ్రూప్ అనే పారిశ్రామిక సంస్థల యజమానులైన షా లు ఆ ప్రాంతంలో కార్పొరేట్ పులులుగా మాఫియా సాయంతో, గూండాల సాయంతో నడువు కొస్తున్నారు. వాళ్లు పల్టన్ మల్లా అనే కిరాయి హంతకుడికి నియోగిని చంపే పని అప్పగించారు. అప్పటికి ఎన్నో రోజుల నుంచీ వాళ్లు ఆయనను బదనాం చేయడానికి, అక్కడి కార్మికులలో ఆయన పరపతి తగ్గించడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తూ వచ్చారు. ఆయన వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ కరపత్రాలు వేశారు. ఆయన మీద కేసులు పెట్టించారు. ఆయన నక్సలైట్ అని ఫిర్యాదు చేశారు. అవన్నీ విఫలమైన తర్వాత ఇక ఆయనను భౌతికంగా నిర్మూలించాలనుకున్నారు. ఒక రాత్రి ఆయన నిద్రిస్తుండగా ఆయన మీద దాడి చేసి చంపేశారు.

ఆయన మీద ఎన్నో చోట్ల ఎన్నో కేసులు పెట్టారు. వాటి విచారణ కోసం ఆయన ఒక కోర్టు నుంచి మరో కోర్టుకు తిరుగుతూ ఉండవలసి వచ్చేది. ఒక చోట పారిశ్రామిక వివాదాల ట్రిబ్యునల్, మరో చోట కోర్టు... ఇలా ఆయన తిరుగుతూ ఉండేవారు. నిజానికి అక్కడ అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు చాలా చిన్నవి. వారి జీతభత్యాలు గాని, పని పరిస్థితులుగాని, వారికి సౌకర్యాలు గాని పెద్ద విషయాలు కావు. ఆ సమస్యలన్నిటినీ ప్రజాస్వామికంగా, సామరస్యపూర్వకంగా పరిష్కరించడం సాధ్యమే. కాని యాజమాన్యాలు ఆ సమస్యలకు సులభ పరిష్కారం వెతికే బదులు, కార్మికులను బెదిరించి, లొంగదీసి, బానిసల్లా పని చేయించుకోవాలని, వారికి నాయకత్వం వహిస్తున్న నియోగిని వేధించి అక్కడి నుంచి తప్పించాలని ప్రయత్నాలు చేశాయి. అందుకే పనికిరాని చిల్లర మల్లర వివాదాలలో ఆయనను పదేపదే కోర్టులకు ఈడ్చేవి. ఒక సమస్య పారిశ్రామిక వివాదం అవుతుందా కాదా, ఆ సమస్య పరిష్కారానికి అధికారం ఎవరికి ఉంది అనే

చిన్న చిన్న సమస్యల మీద ఏళ్లకు ఏళ్లు, దశాబ్దాలకు దశాబ్దాలు గడిచిపోయాయి. సంఘటిత కార్మిక సంఘాల మద్దతు లేని స్థితిలో,నియోగి మహాశక్తివంతులైన యజమానులతో ఒంటరి పోరాటం చేశాడు.

ఆ క్రమంలో ఆయనను హత్య చేయించడానికి యాజమాన్యాలు ప్రయత్నిస్తున్నాయని అర్థమైన తర్వాత, నియోగి తన భద్రత గురించి స్వయంగా రాష్ట్రపతికి ఫిర్యాదు చేయడానికి ఢిల్లీకి వచ్చాడు. ఆ సమయంలో నేను ఢిల్లీలోనే ఉన్నాను. ఆయనను కలిశాను. చత్తీస్‌ఘర్‌లో తనకు రక్షణ ఎట్లా కరువైపోయిందో ఆయన నాకు వివరించాడు.

రాష్ట్రపతికి ఫిర్యాదు చేసిన తర్వాత కూడా స్థానిక అధికార యంత్రాంగం ఎటువంటి జాగ్రత్తలూ తీసుకోలేదు. ఎటువంటి రక్షణా కల్పించలేదు. చివరికి ఆయన యజమానుల చేతిలో హత్యకు గురయ్యాడు. భిలాయిలో తన గదిలో నిద్రిస్తుండగా 1991 సెప్టెంబర్ 28 తెల్లవారుజామున ఆయనను చంపేశారు. ఆయన హత్యవార్త వచ్చిన రోజు, ప్రఖ్యాత బెంగాలీ రచయిత్రి మహాశ్వేతాదేవి ఇక్కడ హైదరాబాద్‌లో ఉన్నారు. రమా మేల్కొటె మమ్మల్ని భోజనానికి పిలిచింది. మేము అక్కడ ఉండగా ఆ హత్యా వార్త తెలిసింది.

ఆ హత్య దేశవ్యాప్తంగా కలిగించిన సంచలనంవల్ల ఆ హత్య పరిశోధనను కేంద్ర నేరపరిశోధక శాఖ (సిబిఐ)కు అప్పగించారు. చత్తీస్‌ఘర్ ముక్తి మోర్చా కోరికమేరకు సిబిఐ నన్ను ఆ నేర విచారణలో భాగం పంచుకొమ్మని కోరింది. మొట్టమొదటిసారిగా యజమానులను నిందితులుగా చూపించిన చరిత్రాత్మకమైన కేసు గనుక నేను సిబిఐ కోరికను మన్నించాను. ఆ విచారణ కూడా సక్రమంగా జరగకుండా ఎన్నో ఆటంకాలు కల్పించబడ్డాయి.

అడ్వకేట్ డా. వి. సురేష్‌ను సహాయకుడిగా పెట్టుకుని నా వాదనలు వినిపించాను. సిబిఐ తరఫున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వై.కె. సక్సేనా వాదించాడు. దుర్గ్‌లోనిరెండో అదనపు సెషన్స్ జడ్జి దగ్గర ఆ విచారణ జరిగింది. ఆ జడ్జి సింప్లెక్స్ గ్రూపుకు చెందిన ఐదుగురు యజమానులను - చంద్రకాంత్ షా, జ్ఞాన్ ప్రకాశ్ మిశ్రా, అవధేష్ రాయ్,. అభయ్ కుమార్ సింగ్, మూల్ చంద్ షాలకు యావజ్జీవ కారాగారశిక్ష విధించాడు. కిరాయి హంతకుడు పల్టన్ మల్లాకు మరణశిక్ష విధించాడు. ఆ తీర్పు 1997 జూన్ 23న వెలువడింది.

దుర్గ్‌లో నేను సిబిఐ తరఫున అధికారిక న్యాయవాదిని గనుక నాకు ఫీ ఇస్తామన్నారు. గాని సురేష్‌కు ఇవ్వలేమన్నారు. నాకు మాత్రం రోజుకు పది వేల రూపాయలు, హోటల్ గదికి రోజుకు నాలుగు వేల రూపాయలు ఇస్తామన్నారు. నేను హోటల్‌లో ఉండడానికి నిరాకరించి, అక్కడ క్రైస్తవ మిషనరీల గెస్ట్‌హౌస్‌లో ఉన్నాను. ఆ విచారణలో నా వాదనలు జరిగిన నెల రోజులపాటు అక్కడే ఉన్నాము. అక్కడి బిషప్ భార్య ఒక రోజు నన్ను ఇద్దరు ఆగంతకులు మోటార్ సైకిల్ మీద వెంబడిస్తున్నారని చెప్పింది. "నియోగి కేసు వాదిస్తున్న

న్యాయవాది కన్నబిరాన్‌ను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు చంపి పడేశారని వార్త వస్తే ఆశ్చర్యపోకండి" అని నేనామెకు చెప్పాను.

నిందితులు కింది కోర్టు తీర్పు మీద అప్పీలుకు వెళ్లినప్పుడు, జబల్పూరులోని మధ్యప్రదేశ్ హైకోర్టు డివిజన్ బెంచి, 1998 జూన్ 26న ఆ తీర్పును మొత్తంగా కొట్టివేసి నిందితులందరినీ నిర్దోషులుగా విడుదల చేసింది. ఈ కేసు అరుదయినదిగా భావించిన కింది కోర్టు కఠినమైన శిక్షలు విధించగా, హైకోర్టు మాత్రం, ఆ శిక్షలు విధించడానికి తగిన సాక్ష్యాధారాలు లేవనే పేరుతో అందరినీ నిర్దోషులుగా ప్రకటించింది.

హైకోర్టు తీర్పు మీద సిబిఐ సుప్రీంకోర్టుకు అప్పీలుకు వెళ్లింది. సుప్రీంకోర్టులో జస్టిస్ కె.జి. బాలకృష్ణన్, జస్టిస్ డా ఎ ఆర్ లక్ష్మణన్‌ల ధర్మాసనం 2005 జనవరి 20న ఇచ్చిన తీర్పులో పల్టన్ మల్లా విషయంలో హైకోర్టులో తీర్పును తప్పుపట్టింది. యజమానుల విషయంలో మాత్రం హైకోర్టు తీర్పుతో ఏకీభవించింది. పల్టన్ మల్లా నేరస్తుడేనని నిర్ధారిస్తూ, నేరం జరిగిన చాలా సంవత్సరాలు అయిపోయినందువల్ల నేరస్తుడికి మరణశిక్ష బదులు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తే సరిపోతుందని భావించింది.

నేను ఆ తర్వాత సిబిఐకి రాసిన ఉత్తరంలో పేర్కొన్నట్టు "ఆ కేసులో కుట్ర, హత్య జరిగిన పద్ధతిని సిబిఐ సమర్థవంతంగా నిరూపించింది. ఆ కేసును విచారించిన కింది కోర్టు న్యాయమూర్తి ఇంకా వ్యవస్థలోని వక్రీకరణలకు లొంగిపోయినవాడు కాదు గనుక మంచి తీర్పు ఇచ్చాడు. ఒక వేళ అయన ఆ రకంగా వ్యవస్థకు లోబడినవాడే అయితే, కేవలం కిరాయి హంతకుడికి మాత్రమే శిక్ష వేసి ఉండేవాడు. కాని న్యాయవ్యవస్థలో పైకి పోయినకొద్దీ ఒక ట్రేడ్ యూనియన్ నాయకుడిని, పేదల, పీడితుల నాయకులను హత్య చేయించినందుకు ధనవంతులను, శక్తివంతులను శిక్షించాలని, జైలుకు పంపించాలని ఆలోచించే పద్ధతిలో లేవు."

శంకర్ గుహ నియోగి కేసులో సెషన్స్ కోర్టు, హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పులు చదివితే మనకు ఏమి అర్థమవుతుందంటే, ఒకే రకమైన సాక్ష్యాధారాలతో భిన్నమైన న్యాయస్థానాలు భిన్నమైన తీర్పులు ఇవ్వవచ్చునన్నమాట. ఒక న్యాయస్థానం ఐదుగురు నిందితులను నేరస్తులుగా భావించి శిక్షలు విధిస్తుంది. అవే సాక్ష్యాధారాలు చూసి, విని హైకోర్టు ఆ నిందితులందరినీ నిర్దోషులుగా భావించి విడుదల చేస్తుంది. అవే సాక్ష్యాధారాలతో సుప్రీంకోర్టు ఎ 1 నుంచి ఎ 8 దాకా నిర్దోషులుగా విడుదల చేయవచ్చునని, ఎ 9 మాత్రం నేరస్తుడే గాని, కింది రోర్టు విధించినట్టుగా మరణశిక్ష విధించనక్కరలేదని, యావజ్జీవ శిక్ష చాలునని భావిస్తుంది. మామూలు లోకజ్ఞానంతో ఆలోచిస్తే ఇవి అంతుబట్టని నిర్ణయాల్లా అనిపిస్తాయి. ఒకే ఆధారంతో ఇంత పరస్పర వ్యతిరేకమైన నిర్ధారణకు రావడం ఎట్లా సాధ్యం అని ప్రశ్న వస్తుంది. కాని ఈ తీర్పులలో ప్రతి తీర్పుకూ కూడా సమర్థనీయమైన తర్కం ఉంది. న్యాయసూత్రాలలో ఒక ప్రముఖమైన

సూత్రం ఏమంటే, ఒక విషయాన్ని రెండు రకాలుగా వ్యాఖ్యానించడానికి అవకాశం ఉంటే, నిందితుడికి మేలు చేకూర్చే వ్యాఖ్యానాన్నే పరిగణనలోకి తీసుకోవాలి అని.

అది చాలా మంచి సూత్రమే. అయితే సమస్య ఏమంటే, ఈ సూత్రాన్ని న్యాయస్థానాలు అన్ని సందర్భాలలోనూ ఉపయోగించడం లేదు. మరీ ముఖ్యంగా నిందితులు ధనికులు, పరపతి గలవాళ్లు అయినప్పుడు మాత్రమే న్యాయస్థానాలకు ఈ సూత్రం గుర్తుకు వస్తుంది. నిందితులు గనుక పేదవాళ్లో, ప్రభుత్వాన్ని, వ్యవస్థను వ్యతిరేకించేవాళ్లో అయినప్పుడు మన న్యాయమూర్తులకు ఈ సూత్రం గుర్తుకు రానేరాదు. అక్కడ మాత్రం తప్పనిసరిగా నిందితులకు వ్యతిరేకమైన వ్యాఖ్యానాన్ని మాత్రమే చూస్తారు.

మరొక సమస్య కూడా ఉంది. పైకి పోయే కొద్దీ ఏమవుతుందంటే, కింద నిజంగా విచారణ జరిపిన కోర్టు ఇచ్చిన తీర్పు చదివి విశ్లేషణ జరుపుదామని సుప్రీంకోర్టు అనుకోవడం లేదు. అక్కడ వాళ్లు చదివేది హైకోర్టు తీర్పు మాత్రమే. నిజానికి కింది కోర్టు మాత్రమే రెండు వైపుల వాదనలు విని ఎవరి వాదనలో ఎంత బలం ఉందో బేరీజు వేసి చివరికి ఒక తీర్పు ప్రకటిస్తుంది. మరి ఆ తీర్పు మీద హైకోర్టుకు అప్పీలు వెళ్లారంటేనే ఆ తీర్పులో ఏదో తప్పు ఉన్నట్టుగదా. ఆ తప్పును సవరించడానికే హైకోర్టు మరొక తీర్పు ఇచ్చింది గదా, ఇక ఆ తీర్పునే ప్రమాణంగా తీసుకుని ఆ తీర్పు మంచిచెడులు విశ్లేషించడానికి మాత్రం పరిమితమవుదాం అని సుప్రీంకోర్టు అనుకుంటుంది.

ఈ వాదనలు హైకోర్టులను సమర్థించుకోవడానికి పెట్టుకుని మాత్రమేగాని నిజం కావాలని ఏమీ లేదు. నిజంగా విచారణ జరిపిన సెషన్స్ జడ్జి, హైకోర్టు న్యాయమూర్తుల కన్నా పూర్తిగా భిన్నమైన నిర్ధారణకు వచ్చాడంటే, తప్పనిసరిగా ఏవో కారణాలు ఉండి ఉండాలి. ఆయన ఆ తీర్పుకు రావడానికి కారణమైన అంశాలేమిటో పై కోర్టులు తప్పనిసరిగా ఆలోచించవలసి ఉంటుంది.

## న్యాయవ్యవస్థ - రాజకీయాలు

ఈ సాంకేతిక అంశాలకు తోడు, అసలు మన న్యాయ వ్యవస్థ మొత్తంగానే పేదవారికి, పేదవారి రాజకీయాలకు వ్యతిరేక అభిప్రాయాలతో నిండి ఉంది. న్యాయవ్యవస్థకు రాజకీయాలకు సంబంధంలేదని అంటూ ఉంటారు గాని అది వాస్తవం కాదు. న్యాయ వ్యవస్థ చేసేదల్లా కొన్ని రాజకీయ డిమాండ్లు నియంత్రించడం కొరకు కొన్ని తటస్థ సూత్రాలను తయారు చేయడం మాత్రమే.

ఈ దేశంలో భూసంస్కరణలు అమలు చేయాలని, ఒక గరిష్ఠ భూపరిమితి విధించి, అంతకన్నా ఎక్కువ ఉన్న వారి నుంచి భూమి స్వాధీనం చేసుకుని, భూమిలేని నిరుపేదలకు పంచాలని అనుకోవడం ఒక రాజకీయ నిర్ణయం. ఆ రాజకీయ నిర్ణయాన్ని గౌరవిస్తూనే చట్టాలు ప్రవేశపెట్టడం జరిగింది. న్యాయ వ్యవస్థ ఆ చట్టాలను పాటిస్తుంది. వాటికి

వ్యాఖ్యానం చెబుతుంది. వాటి ప్రకారమే నడుస్తుంది. కనుక, న్యాయ వ్యవస్థకు రాజకీయాలతో సంబంధం లేదని, అవి తటస్థమైనవని చేసే వాదన ఉందే, అది చాలా కపటత్వంతో కూడుకుని ఉన్న తప్పుడు వాదన.

ఒక న్యాయస్థానంలో నిజమైన తటస్థత ఎప్పుడు కనబడుతుందంటే, ఆ న్యాయస్థానం ఇద్దరు వ్యక్తుల మధ్య వివాదాన్ని పరిష్కరిస్తున్నప్పుడు అది తటస్థంగా ఉండే అవకాశం ఉంది. కాని ఇతర సందర్భాలలో ఆ తటస్థతకు అవకాశమే లేదు. ఆ వివాదంలో రాజ్యం ఒక కక్షిదారుగా గనుక ఉన్నదంటే, న్యాయవ్యవస్థ తప్పనిసరిగా రాజ్యానికే అనుకూలంగా మాట్లాడుతుంది. అన్ని వ్యాఖ్యాన సంప్రదాయాలు, అన్ని పద్ధతులు, అన్ని సూత్రాలు, అన్ని రాజ్యాంగ నియమాలు రాజ్యానికి అనుకూలంగానే మలచబడతాయి.

న్యాయశాస్త్రం, చట్టం సాధారణంగా ప్రజలకు అనుకూలంగానే ఉండవచ్చు. కాని మినహాయింపులు సాధారణంగా ప్రజలకు వ్యతిరేకంగానే ఉంటాయి. అందువల్ల చట్టాలను ఎట్లా వ్యాఖ్యానిస్తారు. ఎట్లా విశ్లేషిస్తారు అనే విషయంలో సమానత్వం గురించి మాట్లాడే సమాజంలో అవి ఎట్లా జరగాలి అనేది పెద్దగా చర్చ జరగలేదు. అసలు న్యాయశాస్త్రమే ఆ రంగంలో తగినంత అభివృద్ధి చెందలేదు.

నియోగి కేసులో సుప్రీంకోర్టు తీర్పు చూసినప్పుడు నేను అప్పటికి ఏడు సంవత్సరాల కింద కేంద్ర నేర పరిశోధన శాఖకు రాసిన ఉత్తరంలో జరగనున్న విషయాలను ఎంత కచ్చితంగా ఊహించానో చూసి ఆశ్చర్యపోయాను. నేను ముందే చెప్పినట్టు ఆ హత్య 1991 సెప్టెంబరోలో 28న జరిగింది. దాని మీద విచారణ జరిపిన దుర్గ్ రెండో అదనపు సెషన్స్ కోర్టు 1997 జూన్ 23న తీర్పు ఇచ్చింది. ఆ తీర్పు మీద అప్పీలును విన్న జబల్పూరులోని హైకోర్టు డివిజన్ బెంచి 1998 జూన్ 26న తీర్పు చెప్పింది.

నేను సిబిఐకి రాసిన ఉత్తరం 1998 మార్చి 6న. అప్పటికి నేను హైకోర్టు ముందర వాదించడం అయిపోయింది. అందుకని సిబిఐకి ఆ విషయం తెలియజేస్తూ కృతజ్ఞతలు చెబుతూ రాసిన ఉత్తరం అది. పైకి పోయినకొద్దీ మన న్యాయస్థానాలు ధనవంతులను, శక్తివంతులను శిక్షించాలని, జైలుకు పంపించాలని ఆలోచించే పద్ధతిలో లేవు అని నేను రాశాను. కిరాయి హంతకుడు పల్టన్ మల్లాకు శిక్ష విధించవచ్చు గాని ఆ హంతకుడిని కిరాయికి పెట్టుకున్న పారిశ్రామికవేత్తలను శిక్షించే స్థితిలో మన న్యాయస్థానాలు లేవు అని రాశాను. నా మాటలను నిజం చేస్తూ, హైకోర్టు మూడు నెలల తర్వాత ఇచ్చిన తీర్పులో అందరినీ నిర్దోషులుగా విడుదల చేసింది. హైకోర్టు పల్టన్ మల్లాను కూడా విడుదల చేసింది. సుప్రీంకోర్టు 2005 జనవరిలో ఇచ్చిన తీర్పులో నా 1998 నిర్ధారణను నిజం చేస్తూ పల్టన్ మల్లాకు మాత్రం శిక్షను ఖరారు చేసి, సంపన్నులందరినీ నిర్దోషులుగా విడుదల చేసింది.

అంటే, మన న్యాయస్థానాలకు చాలా కాలంగా అలవాటయిన సంప్రదాయం

ఏమంటే, అసలు మనుషులను శిక్షించడం కాదు, వారి తరఫున పని చేసిన వారిని మాత్రం శిక్షించడం. ఒక పల్టన్ మల్లాను బలిపశువుగా మార్చడం, అతడిని శిక్షించడం మన న్యాయస్థానాలకు చాలా సులభం. పల్టన్ మల్లాతో యజమానులకు సంబంధం ఉన్నదని చూపడానికి తగిన సాక్ష్యాధారాలు ఉన్నప్పటికీ, వాటిని తోసిపుచ్చి, వారికి వ్యతిరేకంగా సాక్ష్యాధారాలు లేవు అనడం న్యాయస్థానాల సంప్రదాయం ప్రకారం సరైనదే అనిపిస్తుంది. అయితే, ఒక నూతన సమాజ నిర్మాణ క్రమంలో మనం ఈ వ్యవహారాలన్నిటినీ ఎట్లా విశ్లేషించాలి అని ఆలోచించాలి.

## సామాజిక పరివర్తన - న్యాయం

పేదలు చేసిన నేరాలపట్ల పెట్టుబడిదారీ, ధనస్వామ్య సమాజపు అవగాహన ఏమిటి? న్యాయశాస్త్రం,చట్టం ఆ సమాజాన్ని ఒక మెరుగైన సమసమాజం వైపుగా తీసుకు వెళ్లే క్రమంలో ఆ నేరాలను ఎట్లాచూడాలి? అసలు ఈ విషయాలను మనం ఇంత కాలంగా పట్టించుకోలేదు. ఇవి మారాలి అనీ మనం అనుకోలేదు. సమాజం మారవలసి ఉంది అని మొట్టమొదట గుర్తించిన వాడు, సామాజిక పరివర్తన గురించి మాట్లాడిన వాడు కారల్ మార్క్స్. "ఇప్పటిదాకా తత్వవేత్తలందరూ సమాజాన్ని వ్యాఖ్యానించారు కాని అసలు జరగవలసింది" దాన్ని మార్చడం" అని సుప్రసిద్ధ వాక్యం రాసిన వాడు ఆయనే. అప్పటి వరకూ ఆ వాక్యంలోని రెండో భాగం గురించి పట్టించుకోలేదు. వ్యాఖ్యానం ఏ పద్ధతిలో జరపాలంటే, ఆ వ్యాఖ్యానంవల్ల సమాజాన్ని మార్చే అవకాశం కలగాలి.

న్యాయం, చట్టం సమాజంలో యథాస్థితిని కొనసాగించడానికే ఉంటుంది. అదేమీ సామాజిక మార్పుకు, పరివర్తనకు సాధనం కాదు. ఆ మాట నిజమే. కాని చట్టాన్ని కూడా ఎట్లా వ్యాఖ్యానించవచ్చునంటే, ఎట్లా అన్వయించవచ్చునంటే, అది సామాజిక పరివర్తనకు మార్గం సుగమం చేసే పరిస్థితులు కల్పించగలుగుతుంది.

మనకు స్వాతంత్ర్యం వచ్చిన రోజుల్లో పెట్టుబడిదారీ ఆర్థిక శాస్త్రం కూడా చాలా మార్పులకు గురయింది. కీన్స్ ప్రవచించిన కొత్త ఆర్థిక సూత్రాలు ప్రచారంలోకి వచ్చాయి. పెట్టుబడిదారీ ఆధిపత్యాన్ని, యథాస్థితి వాదాన్ని సమర్థించేదే అయినప్పటికీ, రాజ్యానికి ఎక్కువ వెలుసుబాటును కల్పించింది. సంక్షేమ అర్థశాస్త్ర భావనల గురించి మాట్లాడింది. ప్రధాన ఉద్దేశ్యం పెట్టుబడిదారీ దోపిడీని కొనసాగించడమే అయినప్పటికీ, పేదలకు సంక్షేమం కల్పించడం, పేదల కొనుగోలు శక్తిని పెంచడం అనే భావనలు అమలులోకి వచ్చాయి.

మొత్తం మీద నేను చెప్పదలచిందేమంటే, 1947 తర్వాత మన వ్యవస్థకు పునాదిగా ఉన్నది సంక్షేమ రాజ్య భావన. అసంఖ్యాక పేద ప్రజానీకం ఉన్న చోట ఇటువంటి సంక్షేమ రాజ్య భావనకు, సామాజిక మార్పుకు అవకాశం కల్పించకపోతే, హింసాత్మక

మార్పు రాకతప్పదు. ఆ అవగాహన అప్పటి పాలకులకు ఉండింది. మన రాజ్యాంగం అమలులోకి వచ్చే సమయానికి ప్రపంచమంతటా కమ్యూనిస్టు రాజ్యాలు ఏర్పడుతూ ఉన్నాయి. సోవియట్ యూనియన్ ప్రపంచ యుద్ధాన్ని కూడా దాటుకుని పురోగమిస్తూ ఉన్నది. చైనా విప్లవ విజయంతో కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడింది. ఆ నేపథ్యంలో ఆ సమాజాలన్నీ సైద్ధాంతికంగానైనా, తమ రాజ్యాంగాలను సమానత్వ ప్రాతిపదికపై ఏర్పాటు చేసుకోవడం మొదలుపెట్టాయి.

అట్లాగే అప్పుడే అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటన వచ్చింది. ఆ ప్రకటన ఉద్దేశ్యాలలో ఒక దాన్ని చూస్తే, నిరంకుశ పాలనలను, విప్లవాలను నిరోధించాలంటే ఇటువంటి అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటన అవసరమవుతుంది అని వాళ్లు రాశారు.

సరిగ్గా ఆ నేపథ్యంలో, ప్రపంచ జనాభాలో మూడో వంతు జనాభా కమ్యూనిజం పాలన కింద ఉండిన రోజుల్లో మన రాజ్యాంగంలోని సమానత్వ సూత్రాలు వచ్చి చేరాయి.

ఇదంతా ఏదో కమ్యూనిజం బూచిని పారదోలడానికి మాత్రమే చేసిన ప్రయత్నమని కూడా అనుకోవడానికి వీలు లేదు. అప్పటికే మన జాతీయోద్యమ నాయకత్వంలో ఉదారవాద, ప్రజాస్వామిక భావాలు ఉన్నాయి. అది కూడా ఒక విచిత్రమైన సన్నివేశం. మన జాతీయోద్యమ నాయకులు బ్రిటిష్ సంప్రదాయాల నుంచే ఉదారవాదం నేర్చుకున్నారు. ఆ ఉదారవాదాన్ని మన జాతీయోద్యమంలో చాలా తిరుగుబాటు స్వభావంతో వాడారు.

అలా ఉదారవాద సూత్రాలు ఉన్నాయి. కాని అవి ఆ జాతీయోద్యమంలోనే ఉన్న మితవాద, అభివృద్ధి నిరోధక భావాలతో తగినంతగా సంఘర్షించలేదు. ఉదారవాదాన్ని ఎత్తిపట్టవలసినంతగా ఎత్తిపట్టలేదు. అందువల్ల కమ్యూనిస్టు ఉద్యమం మొత్తంగానే ఉదారవాద భావాలను తిరస్కరించడం మొదలుపెట్టింది. అది దురదృష్టకరం. ఎందువల్ల నంటే, ఉదారవాద భావాలలో కమ్యూనిస్టులు ఆమోదించి సొంతం చేసుకోవలసిన భావాలు ఉన్నాయి. సోవియట్ యూనియన్ పతనానికిగల కారణాలలో ఒకటి అక్కడి కమ్యూనిస్టులకు మానవ హక్కులు వంటి ఉదారవాద భావాలపట్ల గౌరవం లేకపోవడమే. ప్రజలను పూర్తిగా బానిసలుగా, శ్రామికులుగా భావించి పాలన నడపడం అంత ఉపయోగకరం కాదు.

పెట్టుబడిదారీ విధానంలో, బూర్జువా పాలనా పద్ధతులలో, మానవ నాగరికత తప్పని సరిగా గుర్తించవలసిన ప్రయోజనకర అంశం చట్టబద్ధపాలన అనే సూత్రం అని నేను అనుకుంటాను.

చట్టబద్ధపాలన అనే ఆదర్శం పాలనలో నిరంకుశత్వాన్ని, ఇష్టారాజ్యాన్ని తగ్గిస్తుంది. పాలన నడిపే ప్రతి వ్యక్తీ కూడా ఏ నిర్దిష్ట సూత్రాలను అనుసరించి పని చేయాలో

నిర్దేశిస్తుంది. ప్రభుత్వమంటే మనుషులతో ఏర్పడేది కాదు. చట్టాలతో ఏర్పడేది అని సూత్రరీత్యా చెప్పడం ద్వారా పాలనా క్రమంలో అధికారులలో వచ్చే నిరంకుశత్వాన్ని తగ్గించడానికి ప్రయత్నం జరుగుతుంది.

సరే, ఈ చట్టబద్ధపాలన అనే ఆదర్శం ఆచరణలో సరిగ్గా జరగలేదనేది, జరగడం లేదనేది, చాలా వక్రీకరణలు వచ్చాయనేది వేరే కథ, చట్టబద్ధ పాలన అమలు జరుపుతామని అధికారంలోకి వచ్చిన వారెవరూ దాన్ని సక్రమంగా అమలు పరచడం లేదనేది పూర్తిగా వేరే విషయం.

ఇందుకు మూలం అధికారంలో ఉన్నదనుకుంటాను. ప్రాచీన కాలంలోని చట్టాల, క్రోడీకరణల నాటి నుంచి ఇవాళ్టి వరకు కూడా అందరి దృష్టి అధికారం మీదనే ఉన్నది. ఆ అధికారాన్ని వాడుకుని, ఆ అధికారాన్ని దుర్వినియోగం చేసి, నిరంకుశులైన వాళ్లు ఎందరో ఉన్నారు. వారిని ఎదిరించి పోరాడిన వాళ్లు కూడా ఎందరో ఉన్నారు. అయినా ఇన్ని వేల ఏళ్లు గడిచినప్పటికీ ఇంకా అధికారం అనేదే ప్రధాన ప్రశ్న. అధికారాన్ని అనుభవించడం అనేది చట్టబద్ధపాలనను వ్యతిరేక ఆలోచనలకు దారి తీస్తుంది.

కాని మార్క్స్ ఈ అధికారం మీద ఎక్కువ ఆసక్తి చూపించలేదు. హింస మార్పుకు మంత్రసాని అని మాత్రం అన్నాడు. మార్పు మీదనే ఎక్కువ దృష్టి పెట్టాడు. అక్కడి నుంచి మనం తుపాకి గొట్టం ద్వారానే రాజ్యాధికారం వస్తుంది అనే దగ్గరికి వచ్చాం. అయితే ప్రశ్న ఏమంటే, తుపాకి గొట్టానికి ఎటువైపు అధికారం ఉంటుంది అనేదే.

ఇటువంటి స్థితిలో ఆలోచించవలసిన విషయం హక్కుల ఆధారిత దృక్పథం. మన విలువలనూ, పాలననూ ఒక హక్కుల ఆధారిత దృక్పథం మీద పునర్నిర్మించడం సాధ్యమేనా? అసలు మొత్తం సమాజాన్ని అధికారం పునాదిగా కాకుండా హక్కుల పునాది మీద పునర్నిర్మించగలమా?

ఈ మధ్య నేను ఒక ఆసక్తికరమైన పుస్తకం చదివాను. సామాజిక కట్టుబాటు - సోషల్ కాంట్రాక్ట్ - మీద సమాజం నిర్మాణమయింది గదా. అసలు ఆ సామాజిక కట్టుబాటు స్వభావం పితృస్వామ్యం కాదా అని ఆ రచయిత ప్రశ్నించారు. ఈ సామాజిక కట్టుబాటు సిద్ధాంతం పురుషుల స్వేచ్ఛ గురించి మాట్లాడుతుంది. అంటే స్త్రీల బానిసత్వం గురించి మాట్లాడినట్టుకాదా? ఆ విశ్లేషణ నన్ను నిజంగా అబ్బుర పరిచింది. ఇంత కాలమూ మనం ఈ విషయం ఎందుకు గుర్తించలేకపోయాం అనిపిస్తుంది. నిజంగానే యూరోపియన్ ఆలోచనాధార అంతా కూడా సామాజిక కట్టుబాటు సిద్ధాంతం మీద ఆధారపడి ఉంది. మార్క్స్ రంగం మీదికి వచ్చే వరకూ ఆ సిద్ధాంతమే కొనసాగుతూ ఉండింది.

ఫ్రెంచి విప్లవానికి ఆధారం ఆ సామాజిక కట్టుబాటు సిద్ధాంతమే. సర్ హెన్రీ మేయిన్ సమాజం హోదా నుంచి కట్టుబాటు వైపు ప్రయాణిస్తున్నాని రాశాడు. ఇదంతా

పెట్టుబడిదారీ విధానానికి పునాది వేయడానికి జరిగిన ప్రయత్నం. అయితే ఇదంతా జరిగేటప్పుడు జనాభాలో సగం మందికి ఆ సిద్ధాంతాలేవీ వర్తించనేలేదు. అసలు ఆ సిద్ధాంతాలు ఆ సగం మంది గురించి ఆలోచించనే లేదు.

భారతదేశంలోనైతే తాత్విక దృక్పథం అనేది ఉందా అని అనుమానించాలి. తాత్విక దృక్పథం గురించీ చర్చల గురించీ ఆలోచిస్తే గౌతమబుద్ధుడు మినహా మరొకరెవరూ తాత్విక విషయాలు చర్చించనేలేదు. చైనాలో కన్ ఫ్యూషియన్ గురించి చర్చించారు. ఆసియన్ దేశాలలో బుద్ధుడి గురించి చర్చించారు. భారతదేశంలో మొదటి, చివరి తత్వవేత్త బుద్ధుడేననుకుంటాను.

అందువల్ల అసలు మొత్తం వ్యవస్థను, ఆలోచనలను మొదటి నుంచీ మౌలికంగా పునర్నిర్మించవలసిన అవసరం ఉంది. అసలు రాజకీయ వ్యవస్థనే హక్కుల ఆధారిత వ్యవస్థగా పునర్వ్యవస్థీకరించవలసి ఉంది. అంటే ప్రతిమనిషికీ హక్కులు ఉన్నాయని గుర్తించవలసి ఉంది. అలా గుర్తించినప్పుడు మన సమాజంలో తోటి మనిషిపట్ల ఉన్నంత దుర్మార్గమైన ప్రవర్తనకు అవకాశం ఉండదు.

ఇన్ని శతాబ్దాలు గడిచి ఇరవై ఒకటో శతాబ్దంలో ప్రవేశించాం. ఎన్నో తత్వశాస్త్ర ఆలోచనలు వచ్చిపోయాయి. మార్క్సిస్టు పాలనలు కూలిపోవడం మాత్రమే కాదు, సమాజంలో ప్రజాస్వామిక వ్యవస్థలూ, విలువలూ ధ్వంసమైపోవడం మనం చూస్తున్నాం. ఇది ఇంకెంత మాత్రమూ వ్యవస్థల మధ్య పోరాటం కాదు, ఇది నాగరికత మధ్య పోరాటం అని హంటింగ్ టన్ వాదిస్తున్నాడు. ఇది ఇట్లాగే కొనసాగితే అసలు హక్కులు, హక్కుల ఆధారిత సామాజిక వ్యవస్థ అనే ఆలోచనలే విస్మరించబడతాయేమోనని నాకు సందేహం కలుగుతున్నది.

## పరిశోధించవలసిన ప్రశ్నలు

కనుక మనం మార్క్సియన్ ఆలోచనలు ఎందుకు విఫలమయ్యాయో తీవ్రంగా ఆలోచించవలసి ఉంది. అసలు మార్క్స్ ఆలోచనలు విఫలమయ్యాయా, మనమే మార్క్స్‌ను విఫలం చేశామో ఆలోచించవలసి ఉన్నది. నాకు వ్యక్తిగతంగా ఏమనిపిస్తుందంటే, ఛాందసవాదం, అది ఏ పేరు పెట్టుకున్నారే, ప్రమాదరకమైనది. కమ్యూనిస్టు వ్యవస్థలలో కూడా ఛాందసవాదం వల్లనే ఘర్షణలు, చీలికలు వచ్చాయి. ప్రస్తుత, భవిష్యత్ తరాలు తీవ్రంగా పరిశోధించవలసిన ప్రశ్నలు ఇవేనని నేనుకుంటాను. ఎందువల్ల ఉదారవాద, ప్రజాస్వామిక, సమిష్టివాద, ప్రగతిశీల పాలనలు కూలిపోయాయి, విఫలమయ్యాయి? ఆలోచించవలసి ఉంది.

అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటన మీద సంతకం చేసిన దేశాలలో ఏ ఒక్కటీ మానవ హక్కులను గౌరవించడం లేదు. ఏ ఒక్కరికీ మానవ హక్కులలో నమ్మకం లేదు.

ఇటువంటి స్థితిలో మానవ హక్కుల మీద ఆధారపడిన ఏ ఆలోచనైనా సరైనదని అనిపిస్తుందా అనేది అనుమానమే.

ఐతే గుర్తించవలసిన సంగతి ఏమంటే ఇప్పటికీ చర్చ, పోరాటం సాగుతూనే ఉన్నాయి. మనం ఇంకా హక్కుల గురించి మాట్లాడుతూనే ఉన్నాం. కాని రేపు ఎవరైనా, అసలు మానవ హక్కుల ప్రకటన రచయితలకే మానవ హక్కుల మీద విశ్వాసం లేనప్పుడు అసలు ఆ భావనకు అర్థం ఉందా అని ప్రశ్నించవచ్చు.

ఈ ఆలోచనలన్నీ నేను శంకర్ గుహనియోగి హత్యకేసులో కిరాయి హంతకుడికి మాత్రం శిక్షపడి, సంపన్నులకు శిక్షలు పడకపోయిన సందర్భంలో చేస్తున్నాను. ఇవన్నీ చట్టబద్ధపాలనకు సంబంధించినవే. చట్టబద్ధపాలన లేనప్పుడు, హక్కుల ఆధారిత దృక్పథం లేనప్పుడు, అధికారం మీద ఆధారపడిన పాలనా వ్యవహారాలు సాగుతున్నప్పుడు, పల్టన్ మల్లా లాంటి వారికి మాత్రమే శిక్షలు పడతాయి. అతడిని కిరాయికి పెట్టుకున్న వ్యాపారవేత్తలకు శిక్షలు పడవు. అది పూర్తిగా ఊహించదగినదే. ఆ శిక్షకు చాలా లోతైన కారణాలున్నాయి. ఆ కారణాలు మన న్యాయ వ్యవస్థలో ఎక్కడబడితే అక్కడ కనబడతాయి.

ఇదంతా ఏదో నిరాశకు దారి తీస్తుందనుకోనక్కరలేదు. హక్కుల ఆధారిత దృక్పథం గురించి మరింత నిబద్ధతతో పని చేయడానికి ఈ చర్చ అవసరం. అయితే హక్కుల ఆధారిత దృక్పథాన్ని హింసాయుత విప్లవం ద్వారా తేవడం. సాధ్యం కాదని కూడా నాకనిపిస్తుంది.

ప్రాబ్లమ్స్ ఆఫ్ చైనా అని బెర్ట్రాండ్ రస్సెల్ ఒక పుస్తకం రాశాడు. ఆ పుస్తకం, రాసింది 1920లలో చైనాలో 1949లో విప్లవం వచ్చిన తర్వాత ఆ పుస్తకాన్ని పునర్ముద్రించారు. అప్పటికి రస్సెల్ ఇంకా బతికి ఉన్నాడు. 'ఈ పుస్తకాన్ని మార్చి రాయవలసిన, సవరించవలసిన అవసరమేమీ కనబడడం లేదు.' అన్నాడు. మావో నాయకత్వంలోని విప్లవం గురించి రస్సెల్ మూడు అభ్యంతరాలు చెప్పాడు. ఆశ్చర్యకరమైన విషయం తెలుసునా, మావోదానికి జవాబు రాశాడు. మన దగ్గర అయితే "బూర్జువా మేధావి, తలచెడిన మేధావి, ఎటు నీ ప్రయాణం, అతని రాతలకు జవాబిచ్చేది ఏమిటి" అంటారు గదా, కాని మావో మాత్రం జవాబు రాశాడు.

రస్సెల్ లేవనెత్తిన ఒక్కొక్క అంశానికీ మావో వరుసగా జవాబిస్తూ పోయాడు. ఎందువల్ల ఈ మార్పు హింసాత్మకంగా ఉండవలసి వస్తుంది అని జవాబు రాశాడు. అయితే ఆ తర్వాత ఆయన కూడా విఫలమయ్యాడనుకోండి. అది వేరే సంగతి, మావో చేసిన వాటన్నిటినీ డెంగ్ సియావో పింగ్ మార్చివేశాడు.

ఇదంతా జరుగుతూనే ఉంటుంది. సమాజం ఎప్పుడూ స్థిరంగా ఉండదు. శాస్త్ర సాంకేతిక అభివృద్ధి తెచ్చిన మార్పులు వాటితోపాటు అనేక వైరుధ్యాలను తీసుకొస్తాయి. ఆ వైరుధ్యాలు ప్రజలను మరింత పేదరికంలోకి నెడుతాయి. మనం ఇప్పటికే ఆ మార్పులు

చూస్తున్నాం. పెట్టుబడిదారీ విధానం ఎట్లా ప్రపంచ వ్యాప్తమయిందో దానికి ప్రతి ఘటన కూడా అట్లాగే ప్రపంచ వ్యాప్తమయింది. ఈ ప్రపంచ వ్యాప్త ప్రతి ఘటన నిర్మాణాల మీద విశ్వాసం ఉన్నది కాదు. కాని సమాజాన్ని ఏ విధంగా పునర్నిర్మిస్తే అది మెరుగయినదిగా ఉంటుంది, ఆ మార్పుకు మార్గదర్శకంగా ఉండే సూత్రాలేమిటి ఆలోచించవలసిన సమయం ఇదే.

ఎందుకంటే ఇవాళ ఎవరూ తమ రాజకీయ తాత్విక దృక్పథం గురించి ఇదే ఇక అంతిమం అని చెప్పగలిగే పరిస్థితి లేదు. అది చాలా కష్టతరమైన విషయమై పోయింది. ఆ రాజకీయ తాత్విక దృక్పథం ఎంత సరయినదయినప్పటికీ అది కాలం చెల్లినదయితే దాన్ని ఇవాళ యథాతథంగా అమలు చేస్తామని అనడం కుదురదు.

ఉదాహరణకు ఈ మధ్య అనంతపురం జిల్లాలో ఒక వ్యక్తిని ఇన్ఫార్మర్ అనే పేరుతో చంపేశారు. ఆ వ్యక్తి భార్య ధర్నాకు కూచుంది. ఈ వాస్తవాన్ని మీరు గుర్తించక పోతే సాధించగలిగినది ఉండదు. నేను ఈ విషయమై రాస్తూనే ఉన్నాను. మీరు మీ ప్రభావ పరిధిని పెంచుకోదలచుకుంటే ఇటువంటి పద్ధతులు వదిలివేయాలని చెబుతూనే ఉన్నాను.

ఈ మధ్య వరంగల్ ఎస్ పి స్టీఫెన్ రవీంద్ర చేసిన ఒక ప్రకటన చూశాను. వరవరరావు, కళ్యాణరావు, గద్దర్ ఇతర నక్సలైటు నాయకులు సరెండర్ కావాలని ఆయన ప్రకటన చేశాడు. ఇరవై ఏళ్ల కిందగాని, పది ఏళ్లకిందగాని ఇటువంటి ప్రకటన వచ్చే అవకాశం లేదు. దీని అర్థం ఏమంటే, మీ పద్ధతులు క్రమక్రమంగా అసందర్భంగా మారిపోతున్నాయన్నమాట. అందువల్ల మీ కార్యక్రమాలను, సమస్యల పట్ల వైఖరులను పునరాలోచించుకోవలసి ఉంది. పునర్నిర్మించుకోవలసి ఉంది. కొత్తగా ఆలోచించవలసి ఉంది.

కొంత కాలం కింద "ఇన్ఫార్మర్లను చంపి శవాలను మాయం చేయండి" అని పోలీసులు పార్టీ పేరు మీద ఒక తప్పుడు ప్రకటన చేశారుగదా. అది ఎందువల్ల వచ్చింది? అటువంటి దురాలోచనను పోలీసులు తామే కనిపెట్టలేదు. ఒక ప్రజారాజకీయ పార్టీ తన వైఖరులలో వెనులుబాటు ప్రదర్శించలేదు గనుక, మొండిగా, మొరటుగా తన పద్ధతులు పాటిస్తూ పోయింది గనుక, పోలీసులకు ఆ ప్రకటన చేయడం సులభమయింది.

ఇది చెపుతుంటే, నాకు ఒక పాత సంఘటన జ్ఞాపకం వస్తోంది. గిరాయిపల్లిలో బూటకపు ఎన్‌కౌంటర్ జరిపిన మెదక్ ఎస్‌పి సుభాష్‌చంద్రబోస్ ఉన్నాడు గదా, భార్గవ కమిషన్ విచారణలో భాగంగా నేను ఆయనను ప్రశ్నిస్తూ ఉన్నాను. పోలీసులు మూస ప్రకటనలు చేస్తుంటారు గదా. వాటిని నేను విప్పిచెప్పడానికి ప్రయత్నిస్తూ ఉన్నాను.

"మీరు ఒక వ్యక్తిని నిర్బంధంలోకి తీసుకుని లాకప్‌లో పెట్టారనుకోండి. అతని మీద నేరారోపణ చేయాలి. అతను నక్సలైటుఅని, అతను చేసినది నక్సలైటు నేరమని మీరు ఎట్లా నిర్ధారిస్తారు?" అని అడిగాను.

"ఒక మారణాయుధం, కొన్ని విప్లవ సాహిత్య పుస్తకాలు, కొన్ని నాటు బాంబులు ...న్న చేతిసంచి అతని దగ్గర గాని, ఆ నేరస్థలంలో గాని దొరుకుతుంది. కాబట్టి అతడిని ...క్సలైటుగా గుర్తిస్తాము" అని ఆ ఎస్‌పి చెప్పాడు.

"అంటే ఈ ఆధారాలు ఎక్కడ దొరికినా అది నక్సలైటు నేరమన్నట్టేనా, ఆ పరిసరాలలో ...న్న వారు నక్సలైట్లు అన్నట్టేనా?" అని నేనడిగాను.

ఒక రాజకీయ పార్టీ తన విధానాలను సామాజిక మార్పులకు అనుగుణంగా ...ప్పటికప్పుడు మార్చుకోలేకపోతే అది ఒక రకమైన నకిలీగా మారిపోతుంది. వంద ...రూపాయల దొంగనోటు ఎట్లా చలామణీ అవుతుందో చూడండి. అసలు నోటుకూ ...కిలీ నోటుకూ తేడా తెలియకుండా పోతుంది. నకిలీ నోటు అసలు నోటులాగ చలామణీ ...యిపోతుంది. ఎప్పుడో ఒకసారి పట్టుబడిపోతుంది తప్ప సాధారణంగా అది అన్ని ...ట్లా చెల్లుతుంది. ఈ విషయం మనం తప్పనిసరిగా గుర్తించవలసి ఉంది. మన ...ధానాలు, పద్ధతులు కాలం చెల్లిపోయాయని గుర్తించి ఎప్పటికప్పుడు కొత్త విధానాలను, ...ద్ధతులను, నినాదాలను రూపొందించుకోవలసి ఉంది. పాత వాటిని ప్రజలు ...ంగీకరించడంలేదు. అవి కనీసం ప్రజలలో భయాన్ని కూడా కలిగించడం లేదు. దీన్ని ...హించవలసి ఉంది. ఎందుకంటే ఒక రాజకీయ పార్టీ అనేది సామాజిక చలనానికి ...సమితిలా పని చేస్తుందని, చేయాలని నేను అనుకుంటాను. సమాజంలో వచ్చే ...దలికలను అది గుర్తించాలి. ఒక వేళ ప్రజలతో, సమాజంతో ఆ సజీవ సంబంధం ...ుక తెగిపోయినట్టయితే ఇటువంటి పరిణామాలు సంభవిస్తాయి. అందువల్ల మనం ...రంతరం ఇటువంటి విషయాల గురించి ఆలోచిస్తుండాలి.

ఈ వ్యవహారాలన్నీ ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే, విచారణ కమిషన్లు ...యమించమని అడిగేటప్పుడు కూడా మనం ఇదే విధమైన పొరపాటు చేస్తున్నాం. ...రిస్థితులు ఏ రకంగా మరిపోయాయో గుర్తించకుండా పాత పద్ధతిలోనే ఏదయినా ...రం జరిగినప్పుడల్లా విచారణ కమిషన్ నియమించమని అడుగుతూ విచారణ కమిషన్ ...యమించమని అడుగుతూ విచారణ కమిషన్ నియమించమని అడుగుతూపోతున్నాం. ...లా యాంత్రికంగా న్యాయ విచారణ కమిషన్ నియమించమని అడుగుతూ పోతున్నాం. ...లా యాంత్రికంగా న్యాయ విచారణ జరపమనీ, పదవీ విరమణ చేసిన హైకోర్టు ...జ్జిచేతనో, సుప్రీంకోర్టు జడ్జి చేతనో, పదవిలో ఉన్న హైకోర్టు జడ్జిచేతనో, సుప్రీం కోర్టు ...జ్జి చేతనో విచారణ జరిపించమని పదేపదే అడుగుతున్నాం. కాని ఇంత వరకూ ...టువంటి న్యాయ విచారణ కమిషన్ల నివేదికలన్నిటికీ ఏమయిందో మనకు పట్టడం ...దు. అసలు చట్టం ఏమి చెబుతున్నదో మనకు పట్టడం లేదు. చట్టంపట్ల మన అసంతృప్తి, ...సం ఉండవచ్చుగాని, అసలు ఆ శాసన నిర్మాణం సమాజం మీద ఎటువంటి ప్రభావం ...పిస్తున్నదో మనకు తెలిసి ఉండాలి. దాన్ని విస్మరించగూడదు.

దీన్నిలో కొన్ని తప్పుడు అభిప్రాయాలున్నాయి. ఒకటి - జడ్జి అనగానే ఏదో ఉన్న స్థాయి మనిషి అయినట్టు, ఒక జడ్జికి న్యాయాన్యాయాలు గుర్తించగలిగే ప్రజ్ఞ ఏదో ఉన్నట్టు ఒక అభిప్రాయం ఉంది. అది పూర్తిగా తప్పు. ఒక వంద మంది జడ్జీలను తీసుకుంటే వారిలో దాదాపు అరవై, డెబ్బై మంది పెద్ద తెలివయిన వాళ్లు కాదు, సాదాసీదా మనుషులు.

న్యాయమూర్తి కావడం అనేది ఏదో ఆ మనిషిలోని ప్రతిభను గుర్తించి ఇచ్చే పదవి కాదు. నిజానికి పోటీతత్వం కూడా ఒక దశలో ప్రతిభను, తెలివిని గుర్తించడానికి పనికి వస్తుంది. కాని, తర్వాత తర్వాత ఈ పోటీ అనేది, ఫలితాన్ని చూడాలనేది లావాదేవీలకు దారి తీస్తుంది. అన్ని రకాల తప్పుడు పనులు రంగంలోకి వస్తాయి. పోటీ వ్యవస్థలో లావాదేవీలనేవి ప్రతిభను చంపేస్తాయి. లావాదేవీలు ఎవరు ఎక్కువగా చేయగలిగితే వారు జడ్జీలవుతారు. అంటే చాలాసార్లు నిజమైన ప్రతిభ, తెలివి ఉన్నప్పటికీ జడ్జి అయ్యే అవకాశం లేదు. అందువల్లనే మనకు కృష్ణయ్యర్, చంద్రచూడ్, చిన్నపరెడ్డి లాంటి వాళ్లు జడ్జీలు కావడం మినహాయింపే గాని సూత్రం కాదు. ఎక్కడో ఒక చోట నిజంగా ఇట్లా ప్రతిభ ఉన్న వాళ్లు జడ్జీలవుతారు. మొత్తం మీద మాత్రం తిమ్మిని బమ్మి చేయగలవాళ్లే జడ్జీలవుతారు.

అటువంటి జడ్జీలతో వ్యవహరించడం నాకు చాలా సరదాగా ఉండేది. వాళ్లకు చట్టంలోగాని, న్యాయశాస్త్రంలోగాని, ఇతర విషయాలలోగాని ప్రావీణ్యం ఉండదు.

పి వి రాజమన్నార్ లాగా అటు న్యాయ శాస్త్రంలోనూ, చట్టంలోనూ, సాహిత్యంలోనూ నిష్ణాతులైన వాళ్లు చాలా అరుదు. అట్లాగే కొంత మంది న్యాయ వ్యవస్థకు మాత్రమే పరిమితమైన నిపుణులున్నారు. ఇటువంటి ప్రవీణులైన న్యాయమూర్తులు కొంత మంది ఉండడం మొత్తంగా వ్యవస్థకు మంచి పేరు తెచ్చిపెడుతుంది. వ్యవస్థకు సమర్థన ఇస్తుంది.

ఈ అరుదైన వాళ్లు ప్రమాదవశాత్తు ఎంపికయిన వాళ్లే. వాళ్లు మొత్తం న్యాయమూర్తుల ఎంపిక వ్యవస్థకే మంచిపేరు తేగలుగుతారు. అది చాలా దురదృష్టకరం. ఎందుకంటే ఒక వ్యవస్థ దాని నిరంతర నియమాలవల్ల, పద్ధతులవల్ల పేరు తెచ్చుకోవాలిగాని, ఎక్కడో ఒకసారి ప్రమాదవశాత్తూ జరిగిన ఘటనలవల్ల కాదు.

నేను ఒకసారి ఒక వ్యాసం రాశాను. మనకు ఎప్పుడైనా ఒక మంచి న్యాయమూర్తి వచ్చారంటే అది కేలం పొరపాటువల్లనే, అది కూడా శిక్షార్హమైన పొరపాటువల్లనే అని నేను ఆ వ్యాసంలో రాశాను.

జడ్జీ అనగానే అతడిని తీసుకొచ్చి అతనికి తెలియని విషయాల మీద కూడా మాట్లాడమనడం జరుగుతుంటుంది. ఆధ్యాత్మిక విషయాల మీద జరిగే సభలకు అధ్యక్షత వహించి మాట్లాడమంటుంటారు. నాకు ఒక సంఘటన జ్ఞాపకం వస్తోంది. జస్టిస్ ఏ

ాజగోపాల అయ్యంగార్ అని మద్రాసులో ఒక జడ్జి ఉండేవారు. ఆయన చాలా తెలియవైన నిషి. ఆయన మా వీధిలో ఏదో ఒక ఆధ్యాత్మిక సమావేశం ప్రారంభించడానికి వచ్చాడు. ట్టిగదా అని ఆయనను పిలిచారు. ఆయన రామాయణం గురించి ఇంగ్లీషులో ఒక ోటరాసుకుని వచ్చి చదవడం మొదలు పెట్టాడు. జడ్జీ అనగానే ఏదైనా మాట్లాడగలడు ః అనుకుని, సైన్స్ మీద సమావేశం అంటే అతడిని పిలిచేది, తత్వశాస్త్రం మీద మావేశం అంటే అతనినే పిలిచేది. మొత్తం మీద జడ్జీ అనేవాడు సర్వజ్ఞుడు అని మనలో క అభిప్రాయం ఉంది. అది సరైనది కాదు. జడ్జీలుసర్వజ్ఞులు కారు. చాలాసార్లు తెలివైన ాళ్లు కూడా కాదు. అసలు ఈ రోజుల్లో అటువంటి బహుముఖ, విస్తృత ప్రతిభ న్నవాళ్లే కరువయ్యారు. బహుశా కృష్ణయ్యర్ మాత్రమే ఇటీవలి కాలంలో అటువంటి తిభను కనబరిచాడు.

### ారణ కమిషన్ పరిమితులు

సరే, విచారణ కమిషన్ వేయమని అడగడం, దానికి ఒక జడ్జీని నియమించమని గడం ప్రజా ఉద్యమాలకు, సంఘాలకు, పార్టీలకు బాగా అలవాటయింది. అసలు విచారణ కమిషన్ల చట్టం అనేదాన్ని ఎందుకు ప్రవేశపెట్టారు. దాని ప్రయోజనం ంటి అని తెలుసుకోవాలి. ఆ చట్టంలో కొన్నే సెక్షన్లు ఉన్నాయి. అది ఒక నిర్ధారితమైన ు ఇవ్వజాలదు. అది ఎవరికీ శిక్ష విధించజాలదు. అది కేవలం ప్రాసిక్యూషన్‌కు హా ఇవ్వగలుగుతుంది. కొన్ని ముఖ్యమైన కేసులలో, సమర్థులైన న్యాయమూర్తులచే ి అటువంటి కమిషన్ విచారణ ఒక నివేదికకు దారి తీయవచ్చు. ఆ నివేదిక రంగా ప్రభుత్వం కొన్ని మార్గదర్శక పాలనా సూత్రాలను తయారు చేయవచ్చు. కొన్ని మార్గదర్శక సూత్రాలను మార్చడానికి వీలు కల్పించవచ్చు.

అసలు విచారణ కమిషన్లు నియామకపు చట్టం ప్రకారం ఈ కమిషన్లను యమూర్తులచేతనే హోదాను కల్పించలేదు. అవి సివిల్ కోర్టులలాగనే సాక్ష్యాధారాల రణలు నిర్వహిస్తాయి. కాని వాటి పని ఆ కేసులో లేవనెత్తబడిన ముఖ్యమైన విషయాల ప్రభుత్వానికి సలహా ఇవ్వడం మాత్రమే. అందువల్ల కమిషన్ ప్రభుత్వానికి తాను ట్టిన అంశాల మీద ఒక నివేదిక మాత్రం సమర్పిస్తుంది. ఈ క్రమంలో అనేక హాలు ఉన్నాయి. అవన్నీ ఆ తర్వాత కాలంలో సక్రమంగా అమలులోకి రాలేదు. ో ఒకటి ఏమంటే, ప్రభుత్వం ఈ విచారణ కమిషన్ నివేదికను పార్లమెంటు దరగాని, అసెంబ్లీ ముందరగాని ఉంచాలి. దానితోపాటే ఒక అక్షన్ టేకెన్ రిపోర్టు న్న చర్యల మీద నివేదిక)ను కూడా సమర్పించాలి. అంటే, కమిషన్ నివేదికలో సిఫారసులలో వేటిని అంగీకరించారో, వేటిని అంగీకరించలేదో, అంగీకరించిన సుల మీద తీసుకున్న చర్యలేమిటో చట్టసభల ముందర నివేదించాలి. ఆ చర్యలకు మైన చట్ట సవరణలను తీసుకురావడంగాని, కొత్తచట్టాలను ప్రవేశపెట్టడంగాని

చేయాలి. తద్వారా విచారణ కమిషన్లు మెరుగైన పాలనకు ఉపయోగపడతాయి
భావించడం జరిగింది.

ఉదాహరణకు పోలీసు కస్టడీలో మృతి అనేది ఉంది. అసలు లాకప్ మరణ అంటేనే హత్య అని అర్థం. దాని మీద మళ్లీ ఒక న్యాయ విచారణ కమిషన్ ఎందుకు! నేరశిక్షాస్మృతిలో అవసరమైన సవరణ చేసుకునే బదులు, ఏ పోలీసుస్టేషన్‌లో లాక మృతి సంభవించిందో ఆ పోలీసు స్టేషన్ మొత్తాన్నీ, ఆ సమయానికి విధి నిర్వహణ ఉన్న వారందరినీ ఆ హత్యకు బాధ్యులను చేసే బదులు, ఒకపదవీ విరమణ చేసి న్యాయమూర్తిని విచారణ కమిషన్ వేయడం ఎందుకు? పదవీ విమరణ చేసి ఇంట కూచున్న న్యాయమూర్తికి విచారణ జరిగినన్ని రోజులూ పూర్తి వేతనం ఇవ్వడం ఎందుక

ఈ విచారణ కమిషన్లనేవి జిల్లా జడ్జీలకు పదవీ విరమణ తర్వాత ఆదాయ వనరులుగా మారిపోయాయి. హైకోర్టు న్యాయమూర్తులకు జీవనోపాధి సౌకర్యాలయిపోయాయి.

చుండూరు హత్యాకాండ విషయంలో గంగాధరరావు కమిషన్ వేశారు. ఏ సాధించారు? బీదర్ హత్యాకాండకు సంబంధించి శ్యాంసుందర్ కమిషన్ వేశారు పాలనాపరమైన లోపాల గురించి ఆయన ఎత్తిచూపిన అంశాలను ఏమైనా సరిచేశారు ఎమర్జెన్సీ తర్వాత నుంచీ మన రాజకీయాలలో ఈ విచారణ కమిషన్ల చట్టం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఈ కమిషన్లన్నీ ఇంత అసమర్థంగా పని చేస్తూ ఉండగా ఊదా ఇంకా మన విచారణ కమిషన్లు వేయమని ఎందుకు డిమాండ్ చేస్తున్నాం. నేను ఈ ప్రశ్న లేవతనెత్తుతూనే ఉన్నాను. విచారణ కమిషన్ల చట్టం ఒక క్రిమినల్ ప్రాసిక్యూషన్‌కు కోర్టులో జరిగే నేర విచారణకు ప్రత్యామ్నాయం అవుతుందా అని రాశాను. అది నే విచారణ, న్యాయవ్యవస్థలో భాగం కాదు. చట్టం ప్రకారం ఒక వేళ పదవిలో ఉన్న సెషన్స్ జడ్జిని నియమించి విచారణ జరిపినప్పటికీ, ఆయన సెషన్స్ జడ్జిగా అనుభవిం అధికారాలు విచారణ కమిషన్ జడ్జిగా అనుభవించలేడు. ప్రజాప్రయోజనాని సంబంధించిన సమాచారాన్ని సేకరించడానికి ప్రభుత్వానికి అందుబాటులో ఉన్న ఒ పద్ధతి విచారణ కమిషన్ నియామకం అని చట్టం చెబుతుంది. అది ఆ విషయాన్ని ఒ కోర్టు విచారించినట్టుగా విచారించజాలదు. అది భారత నేర శిక్షాస్మృతి ప్రకారం జరి విచారణకు ప్రత్యామ్నాయం కాదు అని చట్టం స్పష్టంగా చెబుతుంది.

## ముక్తధర్ కమిషన్

ఈ నేపథ్యంలో ముక్తధర్ కమిషన్ గురించి కొంచెం వివరంగా అర్థం చేసుకోవా రమీజాబీ ఉదంతంగా ప్రచారంలోకి వచ్చిన పోలీసు అత్యాచారాల గురించి విచార

జరపడానికి ముక్తధర్ కమిషన్‌ను నియమించడం జరిగింది.

ముక్తధర్ ఒక మంచి న్యాయమూర్తి. ఆయన పదవిలో ఉండగానే ఈ విచారణ కమిషన్‌కు నియమించబడ్డారు. ఆయన తన పనిని తీవ్రంగా పట్టించుకున్నాడు. ఆయనకు పోలీసులు చేసే దారుణాల గురించి అంతగా తెలియదు. ఆయన న్యాయవాదిగా చాలా కాలం పని చేశాడుగాని ఆ రోజుల్లో ఆయనకు పోలీసుల దుర్మార్గాల గురించి తెలియలేదు.

రమీజాబీ, ఆమె భర్త ఒక సినిమా రెండో ఆట చూసి తిరిగి వస్తున్నారు. వారిని నల్లకుంట పోలీసులు పట్టుకుని భర్తను కొట్టి చంపేశారు. రమీజాబీని రేప్ చేశారు. రాష్ట్రమంతా పెద్దఎత్తున నిరసన చెలరేగింది. అప్పుడు చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నాడు. ఆ ఘర్షణలు ప్రభుత్వ వ్యతిరేక కల్లోలాలుగా పరిణమించాయి. అప్పుడే భార్గవా కమిషన్ విచారణ చివరి దశలో ఉంది. ముక్తధర్ కమిషన్ నియామకం గురించి ప్రకటన రాగానే అప్పటి విమోచన పార్టీ నాయకుడు మధుసూదన్ రాజ్ నా దగ్గరికి వచ్చి నాకు వకాలత్ నామ ఇచ్చాడు. ఆ విచారణలో సిపిఎం కూడా పాల్గొన్నది. సిపిఐ ఆ విచారణలో పాల్గొనలేదు.

ముక్తధర్ కమిషన్ విచారణ జరిగేటప్పుడు ప్రతి రోజు వెయ్యి. పదిహేనువందల మంది హాజరవుతూ ఉండేవారు. హైకోర్టులో ఆ విచారణ జరిగేది.

ముక్తధర్ కమిషన్ విచారణలో గుర్తించవల్సిన అంశమేమిటని నేననుకుంటానంటే ఆ విచారణ క్రమంలో పోలీసులకూ, వ్యభిచార వృత్తిలో ఉన్న వారికి, వ్యభిచార వృత్తికి సహాయపడే బ్రోకర్లకూ ఉన్న సంబంధం స్పష్టంగా బయటపడింది. నిజానికి నేను ముక్తధర్‌తో ఆ విచారణ క్రమంలో నిండు కోర్టులోనే ఆ మాటన్నాను. ఇదంతా పోలీసులకూ వేశ్యలకూ తార్పుడుగాళ్లకూ సంబంధించిన ఒకచట్రపు వ్యవహారం అని.

రమీజాబీ ఇరవై ఏళ్ల లోపు యువతి. ఎం ఎ బారి ఆమె తరపున వాదించారు. పోలీసులు బహిరంగంగానే నిందితులైన పోలీసు అధికారులకు సహకరించారు. అంతేకాదు, పోలీసులు విచారణ కమిషన్‌కు అవసరమైన కనీస వసతులు కూడా కల్పించలేదు. ఆ విషయం నేను బహిరంగంగానే ఫిర్యాదు చేశాను. మొత్తం మీద నాకు అనిపించేదేమంటే, పోలీసులు కొంత స్వతంత్ర ప్రవృత్తిని సంపాదించుకున్నారు.

నల్లకుంట పోలీసు స్టేషన్‌కు సంబంధించిన పోలీసులు అహ్మద్ హుస్సేన్ అనే వ్యక్తిని అక్రమంగా నిర్బంధించి కొట్టి చంపడం, ఆయన భార్య రమీజాబీపై అత్యాచారం జరపడం రాష్ట్రంలో పెద్ద కల్లోలాన్ని సృష్టించింది. ఆ సంఘటనపై న్యాయవిచారణ జరపడానికి ఏర్పాటైన ముక్తధర్ కమిషన్‌కు పోలీసులు ఉద్దేశ్యపూర్వకంగానే ఎటువంటి సహాయమూ చేయలేదు. కమిషన్‌కు చట్టప్రకారం అందించవలసిన సహాయసహకారాలు కూడా అందించలేదు. పద్ధతి ప్రకారం కల్పించవలసిన సౌకర్యాలు కల్పించలేదు. మరోవైపు ఆ అత్యాచారం సంఘటనలో నిందితులైన పోలీసు అధికారులకు మాత్రం పోలీసులు

బహిరంగంగానే సహాయం చేశారు. విచారణ క్రమంలో నేను ఆ విషయం గు
సూటిగానే ప్రశ్నించాను.

కాని ప్రశ్నించినా మారేవాళ్లు ఉంటేగదా! పోలీసులు వేర్వేరు స్థాయిలలో ఒక స్వ
సంస్థగా ప్రవర్తించడం సాగిస్తున్నారు. ఒక ప్రభుత్వ శాఖగా పోలీసుశాఖ మీద ప్రభు
ఉండవలసిన కనీస అదుపు కూడా ఉందా లేదా అనేట్టుగా ప్రవర్తిస్తున్నా
ప్రభుత్వాధికారంలోకి వస్తున్న రాజకీయ నాయకులకు కూడా ఈ పోలీసుల స్వ
ప్రవర్తనను అరికట్టి వారిని చట్టపరిధిలోకి తీసుకురావాలనే పట్టింపు లేదు.

రమీజాబీ భర్త అహ్మద్ హుస్సేన్ శవపరీక్ష నివేదికలో ఆయన గుండె పో
చనిపోయాడని రాశారు. ఆయన శరీరం మీద ఉన్న గాయాల గురించి, దెబ్బల గు
మాట్లాడనే లేదు. మరణానికి మరొక కారణమేదయినా ఉండవచ్చునా అని క
పరిశీలించలేదు. ఖండేల్కర్ అని ఒక ఫోరెన్సిక్ నిపుణుడు ఆ నివేదిక రాశాడు. ఆ
ఈ మొత్తం నేరంలో పూర్తిగా పోలీసులతో చేతులు కలిపాడు. విచారణలో భా
ఆయనను నేను ప్రశ్నించాను.

సమస్య ఏమంటే, ఈ దేశంలో నేరస్తులను విచారించడంలో ప్రజలకు గాని న్యా
వ్యవస్థకుగాని సహకరించవలసిన సంస్థలన్నీ పూర్తిగా నేరస్తులకే సహాయపడుతున్నా
అవి నేరస్తులతో చేతులు కలుపుతున్నాయి. ఒక వేళ నేరస్తుడు పోలీసు అధికారి అ
ఇక పోలీసు వ్యవస్థ తన అసలు పని అయిన నేర విచారణ చేసే బదులు ఆ పో
అధికారిని ఆ నేరం నుంచి తప్పించడం ఎట్లా అని సకల ప్రయత్నాలు చేస్తుంది. ఏ
సాక్ష్యాధారాలను మార్చడం ద్వారా, తారుమారు చేయడం ద్వారా నేరస్తుడైన పో
అధికారిని రక్షించవచ్చునా అని ఫోరెన్సిక్ శాఖ ఆలోచిస్తుంది. రమీజాబీ - అ
హుస్సేన్ కేసులో ఖండేల్కర్ చేసిన పని కూడా అదే.

నాగరాజ్ అని ఒక వైద్యుడు శవపరీక్ష చేశాడు. క్రాస్ ఎగ్జామినేషన్‌లో ఎంత త
పడ్డాడంటే కమిషన్ ఆయన ప్రవర్తన మీద చివాట్లు పెడుతూ వ్యాఖ్యలు కూడా చే
ఆయనను మందలించింది.

రమణారెడ్డి అని కాచిగూడ పోలీసుస్టేషన్‌ల ఒక సర్కిల్ ఇనస్పెక్టర్ ఉండే
ఆయన విచారణ క్రమంలో ఒక విచిత్రమైన ప్రకటన చేశాడు. నేను చాలా మామూ
ఒక ప్రశ్న వేస్తే దానికి జవాబు ఇస్తూ పోలీసు స్టేషన్లలో నిర్వహించే జనరల్‌డై
ప్రైవేటు ప్రచురణకర్తలు అచ్చువేస్తారని ఆయన అన్నాడు. ఆ డైరీ మీద ప్రభుత్వ ము
ఉంటుంది. పోలీసులకు, శాంతిభద్రతల నిర్వహణకు సంబంధించినంతకు ఈ జ
డైరీ అనేది చాలా ముఖ్యమైనది. నేరాల గురించి పోలీసులకు తెలిసినది తెలిసినట్లె
నమోదు చేసే ఖాతా పుస్తకం లాంటిది అది. దానితో వరుసగా నేరాలను నమో
చేయవలసిందే తప్ప ముందు వెనుకలు చేయడానికి వీలు లేదు. ఆ డైరీని ప్రభు

భద్రతతో అచ్చువేసి పోలీసు అధికారులకు అందజేస్తుంది. కాని అది బయట మార్కెట్లో కొనుక్కుంటే దొరుకుతుందని, దాన్ని ప్రైవేటు ప్రచురణ కర్తలు అచ్చు వేస్తారని ఆయన అన్నాడు.

ఆ విచారణ క్రమంలో మొత్తంగా ప్రభుత్వ, పోలీసు సాక్షులందరూ కూడా చెప్పడానికి ప్రయత్నించిందేమంటే రమీజాబీ ఒక వేశ్య అని. నా వాదన ఏమంటే ఆమె వేశ్య అయినా కూడా ఆమెతో, ఆమె భర్తతో ఈ విధంగా ప్రవర్తించడానికి పోలీసులకు హక్కులేదు అని.

ఆ కమిషన్ విచారణలో ఇంకొక విచిత్రమైన విషయం జరిగింది. అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలోకి వచ్చే తార్పుడుగాళ్లను, బ్రోకర్లను వ్యభిచారులను తీసుకొచ్చి పోలీసులు సాక్ష్యాలు చెప్పించారు. వాళ్లందరు కూడా ఏకకంఠంతో రమీజాబీ వేశ్య అని చెప్పడానికి ప్రయత్నించారు. ఇది గుర్తు చేసుకుంటుంటే, ఒక హాస్యాస్పదమైన సంగతి గుర్తుకు వస్తోంది. అఫ్జల్ గంజ్ పోలీసు స్టేషన్ పరిధి నుంచి ఒక తార్పుడుగాడిని తీసుకొచ్చారు. అతడి వాంగ్మూలం అందరినీ నవ్వుల్లో ముంచెత్తింది.

అతడిని క్రాస్ ఎగ్జామిన్ చేస్తూ మీ వృత్తి ఏమిటి ("ఆప్‌కా దందా క్యా హై") అని నేనడిగాను.

"దందా కర్తాహు సాబ్" (వ్యాపారం చేస్తాను సార్ అన్నాడతను. అంటే స్త్రీలను వేశ్యావృత్తిలోకి దించడం అన్నమాట. అటువంటి వాడు మన పోలీసులు ప్రవేశపెట్టిన "గౌరవనీయ సాక్షి"

"హమారా కస్టమర్స్ బడే బడే ఆఫ్సర్ లోగ్ హై సాబ్ అన్నాడతను. ఆ మాట బహిరంగంగా, నిస్సిగ్గుగా చెప్పాడు. "పోలీసు అధికారులు కూడా వస్తారా" అని నేనడిగాను. "హా ఆతే సాబ్, బడే బడే పోలీస్ ఆఫ్సర్స్ ఆతే సాబ్" అన్నాడతను.

అప్పుడు ముక్తధర్, "కన్నబిరాన్, ఆస్క్ హిమ్ వెదర్ ఐ వాజ్ హిజ్ కస్టమర్ ఎట్ ఏనీ టైమ్" అన్నాడు నవ్వుతూ.

ఆయన చాలా మృదుస్వభావి, చాలా హాస్యప్రియుడు చాలా మంచి వ్యక్తి.

ఇటువంటి సాక్షులను హాజరుపరిచి, వాళ్ల వాంగ్మూలాల ద్వారా రమీజాబీ వేశ్య అని రుజువు చేయడానికి ప్రయత్నించారు పోలీసులు. నిజానికి అది అసలు విషయమే కాదు. ఆమె వేశ్యనా కాదా అనే విషయానికీ, అక్కడ జరుగుతున్న విచారణకూ ఏమీ సంబంధం లేదు. ఇది పక్కదారి పట్టించే ఎత్తుగడ అని కొందరు అనుకుంటారు. అది నిజానికి ఒక మూర్ఖపు ఎత్తుగడ. తెలివి తక్కువ ఎత్తుగడ. అది ఎందుకూ పనికిరాని తెలివి మాలినతనం అని నేననుకుంటాను.

సుఖా, జిందాల సంగతే తీసుకోండి. వాళ్లను టెర్రరిస్టులుగా అభివర్ణించారు. టెర్రరిస్టులంటే నీతిలేని వాళ్లు అని చూపాలని పోలీసుల ఉద్దేశ్యం. అందుకే వాళ్లు

తాగుబోతులనీ, తిరుగుబోతులనీ చూపడానికి చాలా ప్రయత్నం చేశారు. నిజానికి చర్చ ఉన్న విషయానికీ, ఈ అభివర్ణనకూ సంధమే లేదు.

పోలీసులు ఎవరినైనా చంపినప్పుడు ఎందుకు చంపారు అని అడిగితే "వాడూ! సార్ అంటారు. రౌడీ అయితే చంపవచ్చునా అనే ప్రశ్న రాదనీ రాకూడదనీ వా ఉద్దేశ్యం.

ఆ విచారణ అయిపోయాక ముక్తధర్ ఒక మంచి నివేదిక ఇచ్చాడు. కాని విషయ ఏమంటే, ఆ నివేదికను శాసనసభలో సమర్పించినప్పటికీ దాని వల్ల ఏమీ జరగలేదు సుందర్ సింగ్ అనే పోలీసు అధికారి మీద కోర్టులో విచారణ మొదలైంది. ఆ కేసు రాయచూరు జిల్లా సెషన్స్ దగ్గరికి బదిలీ చేశారు.

ఆ కేసులో శ్రీపతి రావు పబ్లిక్ ప్రాసిక్యూటర్గా, సీతాపతి నిందితుడి తరఫు న్యాయవాదిగా పని చేశారు. వాళ్లు రాయచూరుకు వెళ్లివచ్చేవారు. వాళ్లందరూ కలి నాగార్జునసాగర్కు వెళ్లివిందు చేసుకున్నారని కూడా వార్తలు వచ్చాయి. మొత్తానికి నిందితుడి మీద నేరనిర్ధారణ జరగలేదని నిర్దోషిగా విడుదల చేయడం జరిగింది. కేసుకొ వేయడం జరిగింది. అంటే, విచారణ కమిషన్ తన విచారణ క్రమంలో సేకరించి సాక్ష్యాధారాలన్నీ ఎందుకూ పనికి రాకుండా పోయాయి, అపహాస్యమైపోయాయి, నిందితులు వదిలిపెట్టబడ్డారు.

ఒక రోజు నేను ఢిల్లీ వెళుతుండగా, విమానాశ్రయంలో ఒక పోలీసు ఇన్స్పెక్ట నాకు సెల్యూట్ చేశాడు. ఎవరా అని నేను చూస్తుండగా, "క్యా సాబ్ మై యాద్ నహీ హై ఆప్ కో, ఆప్ మేరే ఖిలాఫ్ లడేథేనా, సాబ్, వోరమీజాబీ కీ కేస్ మే, మై సుందర్సిం అక్విట్ హోగయా సాబ్" అన్నాడు.

చెప్పవచ్చిందేమంటే, ఈ విచారణ కమిషన్ల వ్యవహారం ఇంత హాస్యాస్పదంగా దారుణంగా ముగిసిపోతుంది. ఇప్పుడు ఠక్కర్ నటరాజన్ కమిషన్ గురించి ఎవరైనా అయ్యో పాపం అనుకోవలసిందే. వాళ్ల కమిషన్ నివేదికకు ఏ గతి పట్టిందో గదా ఇప్పుడు.

ఠక్కర్ నటరాజన్ కమిషన్ నివేదికలో వాళ్లు తమ కమిషన్కు ఏ అధికారాలూ లేనందుకు చాలా చింతించారు. తాము చేసిన నిష్ఫల ప్రయత్నంలో సమయం, వనరులు వృథా అయినందుకు విచారణ కమిషన్ల చట్టం అసమర్థతకు వాళ్లు తమ సంతాపం ప్రకటించారు. విచారణ కమిషన్ల చట్టంలో తగిన సవరణలు చేసి మరిన్ని అధికారాలు కల్పించే వరకూ ఆ నియామకాన్ని అంగీకరించడం ఏ సుప్రీంకోర్టు న్యాయమూర్తికిగానీ హైకోర్టు న్యాయమూర్తికిగానీ గౌరవప్రదం కాదు అని వాళ్లు తమ నివేదికలో రాశారు.

దేశంలో జరిగిన ఆర్థిక నేరాలను విచారించడానికి ఫేర్ ఫాక్స్ అనే విదేశీ సంస్థను నియమించడంలో, ఆర్థిక కుంభకోణం జరిగిందనే ఆరోపణలు పార్లమెంటులో వెల్లువెత్తినప్పుడు ఈ ఇద్దరు సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో 1987లో కమిషన్ వేశారు

ఆ కమిషన్ నివేదికలో ఒక అధ్యాయం మొత్తం కమిషన్ల నియామకపు చట్టం ఎంత అసమగ్రమైనదో వివరించడానికి ప్రయత్నించారు. ఆ కమిషన్ విచారణ క్రమంలో దాని మీద కొన్ని పత్రికలు, కమిషన్ సమన్లకు ప్రతిస్పందించిన కొందరు వ్యక్తులు పెద్ద ఎత్తున నీచమైన దాడులకు పాల్పడ్డారు. అందువల్ల కమిషన్ నివేదికలో న్యాయమూర్తులకు ఎక్కువ అధికారాలు, మామూలు న్యాయమూర్తులకు ఉండే అధికారాలు ఉండాలని వాదించారు. ఆ నివేదిక మీద కూడా ఏమీ జరగలేదు.

ఏదో ఒకటి జరగబోతుందని ప్రజలకు భ్రమలు కల్పించి ప్రజాందోళనలను చల్లార్చడానికి తప్ప విచారణ కమిషన్ నియామకం మరెందుకూ ఉపయోగపడదు.

సరే రమీజాబీ కేసు కొట్టివేయడం మీద అప్పీలుకు పోవడం జరిగింది. కాని అక్కడ ఏమీ జరగలేదు. ఆమె పాపం ఇప్పుడు ఎక్కడ ఉందో. ఇప్పుడు యాభై అరవై ఏళ్ల వయసు వచ్చి ఉంటుంది. ఆమెకు ఎక్కడా న్యాయం జరగపోవడానికి మూడు కారణాలున్నాయి. ఒకటి ఆమె చాలా పేదరాలు, రెండు - ఆమె ఒక స్త్రీ, మూడు - ఆమె ఒక వేశ్యగా ముద్ర పడింది. ఈ దేశంలో మన సమాజంలో ఏ న్యాయస్థానం కూడా అటువంటి వ్యక్తికి న్యాయం స్థానం కూడా అటువంటి వ్యక్తికి న్యాయం ఇవ్వడానికి ముందుకురాదు.

కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ చట్టం చాలా చిన్న చట్టం. అందులో 32 సెక్షన్లు మాత్రమే ఉన్నాయి. ఇందులో కొన్ని సవరణలు తీసుకురావడానికి ఇందిరాగాంధీ ప్రయత్నించింది. కమిషన్ నివేదిక ప్రజాప్రయోజనాలకు భంగకరమైనట్టయితే దాని నివేదికను ప్రచురించకుండా ఉండవచ్చని ఆమె ఒక సవరణ ప్రవేశపెట్టింది.

ఆమె చేసిన మరొక పని ప్రత్యేక కోర్టుల ఏర్పాటు గురించి ఒక చట్టం తయారు చేయడం. కొన్ని నేరాల మీద విచారణ జరపడానికి ప్రత్యేక కోర్టులు కావాలని ఆ చట్టం నిర్దేశిస్తుంది. ఆ చట్టం కింద ఆమె మీద నాలుగు ఎఫ్ఐఆర్‌లు దాఖలు అయినాయి. అప్పుడు ఆ చట్టాన్ని రాష్ట్రపతి సుప్రీంకోర్టు పరిశీలనకు పంపించారు. ఆ చట్టం సమంజసమైనదేనా అని ప్రశ్నించారు.

సుప్రీంకోర్టులో జడ్జిలు వేర్వేరు రకంగా స్పందించారు. ఒక ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేయడం చాలా సాహసోపేతమైన, చరిత్రాత్మకమైన చర్య అని, గత కాలపు స్వర్ణయుగం తిరిగివచ్చినట్టుందని చంద్రచూడ్ గొప్పగా రాశాడు. కృష్ణయ్యర్ కూడా ఇంకా ముందుకు వెళ్లి చాలా పొగిడాడు.

* * *

# చెర, లోచన్‌లపై ముఖ్యమైన తీర్పు

జస్టిస్ ముక్తధర్ గురించి మాట్లాడేటప్పుడు ఆయన, జస్టిస్ కొండా మాధవరెడ్డి సంయుక్తంగా ఇచ్చిన ఒక ముఖ్యమైన తీర్పు గురించి చెప్పాలి. అది విప్లవ రచయితలు చెరబండరాజు, రాజలోచన్‌లను వారి ఉద్యోగాల నుంచి తొలగిస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేస్తూ ఇచ్చిన తీర్పు. ఆ ఉద్యోగాల తొలగింపు ఉత్తర్వులు రాజ్యాంగంలోని అధికరణం కింద జారీ అయిన ఉత్తర్వులను న్యాయస్థానంలో ప్రశ్నించడానికి, సవాలు చేయడానికి వీలులేదు. కాని ఆ ఇద్దరి మీద వెలువడిన తొలగింపు ఉత్తర్వులను నేను హైకోర్టులో సవాలు చేశాను. ఆ అధికరణాన్ని ఈ సందర్భంలో ఉపయోగించడానికి వీలు లేదని వాదించాను. జస్టిస్ మాధవరెడ్డి, జస్టిస్ ముక్తధర్‌లు నా వాదనతో అంగీకరిస్తూ, ఆ ఉత్తర్వులను కొట్టి వేసి, చెరబండరాజును, రాజలోచన్‌ను ఉద్యోగాలలో పునర్నియమించాలని ఆదేశించారు.

ఒక ప్రభుత్వోద్యోగిని ఎప్పుడు పడితే అప్పుడు, కారణాలు చూపకుండా తీసివేయడానికి ప్రభుత్వానికి కూడా అధికారంలేదని, చివరికి రాజ్యాంగ అధికరణం 311(2)(సి) కూడా ఆ అధికారం ఇవ్వదని ఈ చరిత్రాత్మకమైన తీర్పు స్పష్టం చేసింది.

రాజ్యాంగంలోని 311 అధికరణం లోని రెండో పరిచ్ఛేదం "ఏ ప్రభుత్వోద్యోగినీ తగిన కారణాలు చూపకుండా, విచారణ జరపకుండా, తన మీద ఆరోపణలకు ఆ ఉద్యోగి తరఫు నుంచి వాదనలు వినిపించుకునే అవకాశం ఇవ్వకుండా ఉద్యోగం నుంచి తొలగించడానికి వీలులేదు" అని చెబుతుంది. కాని ఈ పరిచ్ఛేదం వర్తించని సందర్భాల గురించి చెబుతూ, అందులోనే (సి) అనే భాగం "అటువంటి విచారణ జరపకపోవడం రాజ్యభద్రతా ప్రయోజనాలకు అవసరమని రాష్ట్రపతిగాని, గవర్నర్ గాని సంతృప్తి చెందితే" ఈ విచారణ అవసరంలేదని అంటుంది. అంటే, ఈ అధికరణాన్ని చూపి ఏ ప్రభుత్వోద్యోగినైనా ఏ కారణాలు చూపకుండా, ఎటువంటి విచారణ లేకుండా ఉద్యోగం నుంచి తొలగించడానికి ప్రభుత్వానికి ఒక అవకాశం దొరుకుతుందన్నమాట.

చెరబండరాజు, రాజలోచన్ ఇద్దరూ ప్రభుత్వోద్యోగంలో ఉన్న ఉపాధ్యాయులు గనుక ఈ అధికరణం సహాయంతో కారణం చూపకుండా, విచారణ అవసరం లేకుండా వారిద్దరినీ ఉద్యోగాల నుంచి తొలగించవచ్చునని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. 1980 మార్చి 18న జారీ చేసిన జి.వో నెం.ఎస్ 214 ద్వారా చెరబండరాజును, జి.వో. ఎం.ఎస్.215 ద్వారా జి రాజలోచన్‌ను ఉద్యోగాల నుంచి తొలగించింది. అప్పటికి చెరబండరాజు హైదరాబాద్‌లో గ్రేడ్-1 తెలుగు పండిట్‌గా, రాజలోచన్ వరంగల్‌లో అసిస్టెంటు (తెలుగు)గా పని చేస్తున్నారు.

ఆ ఉత్తర్వులు రెండూ అప్రజాస్వామికమైనవని, చట్ట వ్యతిరేకమైనవని, కనుక వాటిని

కొట్టివేసి వారిద్దరినీ తిరిగి ఉద్యోగాలలో నియమించమని ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ వారి తరపున నేను హైకోర్టులో వేర్వేరు రిట్ పిటిషన్లు దాఖలు చేశాను. జస్టిస్ మాధవరెడ్డి, జస్టిస్ ముక్తధర్‌లు ఆ పిటిషన్లపై నా వాదనలను, ప్రభుత్వ ప్లీడర్ల వాదనలను జులై 9 నుంచి జులై 15 వరకు విని, జులై 17న తీర్పు ప్రకటించారు.

చెరబండరాజుగా దిగంబరకవిగా, విప్లవ కవిగా ప్రఖ్యాతుడైన బి. భాస్కరరెడ్డి హైదరాబాద్‌లో మలక్‌పేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గ్రేడ్-1 తెలుగు పండిట్‌గా పని చేస్తుండేవాడు. ఆయన 1966 జనవరి నుంచి ప్రభుత్వ కొలువులో ఉన్నాడు. విప్లవ రచయితల సంఘం స్థాపకులలో ఒకడిగా ఆయన సుప్రసిద్ధుడు. కొంత మంది విప్లవ రచయితలను, కొంత మంది విప్లవ కార్యకర్తలను కలిపి సికింద్రాబాద్ కుట్రకేసు అని ఒక కేసును పోలీసులు 1974 మేలో నమోదు చేశారు. ఆ కేసులో చెరబండరాజును 1974 మే 18న అరెస్టు చేశారు. ఆ అరెస్టుతో చెరబండరాజును అరెస్టయిన నాటి నుంచి తాత్కాలికంగా ఉద్యోగం నుంచి తొలగిస్తూ (సస్పెండ్ చేస్తూ) హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి 1974 జూన్ 6న ఒక ఉత్తర్వు జారీ చేశారు.

సికింద్రాబాద్ కుట్రకేసులో బెయిల్‌పై చెరబండరాజు 1975లో విడుదలయ్యాడుగాని, అప్పటికి ఎమర్జెన్సీ మొదలయింది. దాదాపు వెంటనే ఆయనను అంతరంగిక భద్రతా చట్టం (మీసా) కింద మళ్లీ అరెస్టు చేశారు. ఎమర్జెన్సీ కాలమంతా ఆయన జైలులోనే ఉన్నాడు. ఉద్యోగం నుంచి సస్పెన్షన్‌లో ఉన్నాడు.

ఎమర్జెన్సీ తర్వాత ఆయన విడుదలయిన తర్వాత, జిల్లా విద్యాశాఖాధికారి 1977 ఏప్రిల్ 19న ఇచ్చిన ఒక ఉత్తర్వులో పాత సస్పెన్షన్ ఉత్తర్వులను రద్దు చేస్తూ ఆయనను సీతాఫల్ మండిలోని ఉన్నత పాఠశాలలో నియమించారు. కాని మూడు రోజులు కూడా గడవకముందే, ఏప్రిల్ 22న ఇచ్చిన మరొక ఉత్తర్వులో తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకూ ఏప్రిల్ 19 ఉత్తర్వులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. చెరబండరాజు ఆంధ్రప్రదేశ్ అడ్మినిస్ట్రేషన్ ట్రిబ్యునల్‌లో ఆ ఉత్తర్వులను సవాలు చేశాడు.

ట్రిబ్యునల్ నోటీసుకు జవాబుగా జిల్లా విద్యాశాఖాధికారి ఇచ్చిన జవాబు చాలా చిత్రమైనది. తనకు ఏప్రిల్ 20న డిప్యూటీ ఇనస్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు (ఇంటిలిజెన్స్) నుంచి ఒక ఉత్తరం వచ్చిందని అందులో సికింద్రాబాద్ కుట్రకేసు మరొక ఏడాదిలో అయిపోతుందని, అందువల్ల ఆ కుట్రకేసు నిందితులను ఉద్యోగాలలో పునర్నియామకం ఉత్తర్వులను నిలిపివేశానని ఆ విద్యాశాఖాధికారి ట్రిబ్యునల్‌కు నివేదించాడు.

ఈ రాష్ట్రాన్ని పాలిస్తున్నది ప్రజా ప్రతినిధులా, ప్రభుత్వమా, ఇంటిలిజెన్సు డిఐజీనా అని నేను చాలా కాలంగా అడుగుతున్నాను. అసలు ఒక జిల్లా విద్యాశాఖాధికారిని ఆదేశించడానికి ఇంటిలిజెన్సు డిఐజి ఎవరు? ఆ ఆదేశాన్ని జిల్లా విద్యాశాఖాధికారి ఎందుకు పాటించాలి?

ఇది ఒక వైపు జరుగుతుండగానే చెరబండరాజు విషయంలో చెప్పవలసిన సంగతి

మరొకటి ఉంది. ఆయన ముందు సికింద్రాబాద్ కుట్రకేసులోనూ, ఆ తర్వాత ఎమర్జెన్సీలోనూ సుదీర్ఘ కాలం జైలులో ఉండడంవల్ల ఆరోగ్యం పూర్తి చెడిపోయింది. జైలులో ఉండగానే అయనకు బ్రెయిన్ ట్యూమర్ వ్యాధి మొదలైంది. అది క్యాన్సర్‌గా ముదిరి పోయింది అప్పటికే ఎన్నోసార్లు శస్త్ర చికిత్సలు జరిగి ఆయన ఎక్కువకాలం జీవించి ఉంటాడా అని సందేహాలు మొదలయ్యాయి. ఆయన ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అయినా ఆయనను ఉద్యోగంలో పునర్నియమించాలని ఆయన మిత్రులు, ఉపాధ్యాయ సంఘాలు, ప్రజాసంఘాలు ప్రభుత్వాన్ని కోరడం మొదలుపెట్టాయి. నిజంగానే అయన ఆ తర్వాత రెండు సంవత్సరాలలో మరణించాడు. ఆ చివరిరోజుల్లో ఆయనపట్ల ప్రభుత్వం క్రూరంగా ప్రవర్తించింది.

ఆయన మీద సస్పెన్షన్ ఎత్తివేయాలని ఒకవైపు కోరికలు వస్తుంటే, ప్రభుత్వం ఆ మానవతావాద ఆకాంక్షలకు ప్రతిస్పందించలేదు సరిగదా, సరిగ్గా ఆయన మృత్యుశయ్యపై ఉన్నప్పుడే ఆయనను 311(2)(సి) కింద జవాబు చెప్పనక్కరలేకుండా ఉద్యోగం నుంచి తొలగించాలని నిర్ణయించింది.

ఆయన మీద ప్రభుత్వం ఇలా కక్ష కట్టడం ఆయన రచనల మీద, ఆయన సహ రచయితల రచనల మీద కక్షతోనే. అసలు సికింద్రాబాద్ కుట్రకేసును రచయితల మీద బనాయించడమే కుట్ర పూరితంగా జరిగింది. విప్లవ రచయితలు తమ మార్క్సిస్టు భావాలకు అనుగుణంగా సామాజిక వాస్తవాలను తమ రచనలో ప్రతిబింబిస్తూ వచ్చారు గనుక ఆ భావాలను జీర్ణించుకోలేని ప్రభుత్వం వారిని వేధించేందుకే ఇటువంటి అక్రమ కేసులలో వారిని బనాయిస్తోంది. వారిని ఈ విధంగా ఉద్యోగాల నుంచి తొలగిస్తోంది అని నేను కోర్టులో వాదించాను.

సికింద్రాబాద్ కుట్రకేసులో ఈ రచయితలను తప్పుడుగా ఇరికించడం జరిగిందని నేను చేసిన వాదనను ప్రభుత్వ న్యాయవాదులు ఖండించారు. "ప్రభుత్వాన్ని సాయుధ విప్లవం ద్వారా కూలదోసేందుకు, హింసకు పాల్పడేందుకు ప్రజలను, ముఖ్యంగా విద్యార్థులను రెచ్చగొట్టేందుకు తమ రచనల ద్వారా, ఉపన్యాసాల ద్వారా ఈ విప్లవ రచయితలు ఒక పద్ధతి ప్రకారం పని చేస్తున్నారని" అన్నారు. హత్యలూ, దోపిడీలూ చేస్తున్న, హింసను నమ్మే నక్సలైటు కార్యకర్తలతో చెరబండరాజు చేతులు కలుపుతున్నాడని అన్నారు. కలం మాది కత్తి మీది అనే నినాదంతో ఈ విప్లవ రచయితలు నక్సలైట్లు కార్యకర్తలకు మద్దతు ఇస్తున్నారని అన్నారు. చెరబండరాజు ఇంకా హింసను ప్రబోధిస్తూనే ఉన్నాడని అందువల్ల ఆయనను పునర్నియమించడం సాధ్యంకాదని అన్నారు. ఏది ఏమైనా, ఆంతరంగిక భద్రతా కారణాల దృష్ట్యా, విచారణ జరపకుండానే చెరబండరాజును ఉద్యోగం నుంచి తొలగించాలనే అభిప్రాయానికి గవర్నర్ సంతృప్తి చెందారని, గవర్నర్ నిర్ణయాన్ని సవాలు చేయడానికి వీలులేదని ప్రభుత్వ న్యాయవాది వాదించాడు.

ఇక జి రాజలోచన్ విషయంలో ఆయన 1955 నుంచీ ప్రభుత్వ కొలువులో ఉన్నాడు. ఉద్యోగం నుంచి తొలగించే సమయానికి హనుమకొండలోని వడ్డేపల్లిలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఇంగ్లీషు, తెలుగు బోధించే ఉపాధ్యాయుడుగా ఉన్నాడు. ఆయన లోచన్ పేరుతో కవిత్వం రాసేవాడు, విప్లవ రచయితల సంఘం సభ్యుడు. ఆయన రచనలు దేశంలో ఉనికిలో ఉన్న విద్యావిధానాన్ని విమర్శిస్తూ నక్సలైటు భావాలను ప్రచారం చేస్తున్నాయని అందువల్ల అవి ప్రభుత్వోద్యోగుల సర్వీసు నిబంధనలకు వ్యతిరేకమని, కనుక సంజాయిషీ కోరుతున్నామని జిల్లా విద్యాశాఖాధికారి ఆయనకు 1975 ఆగస్టు 4న ఒక లేఖ పంపించాడు. లోచన్ తన వివరణ రాసిన తర్వాత, జిల్లా విద్యాశాఖాధికారి 1976 ఫిబ్రవరి 3న ఉద్యోగ హోదాను ఎందుకు తగ్గించకూడదో సంజాయిషీ కోరుతూ రెండో లేఖ రాశాడు. లోచన్ రాసిన వివరణలనే తప్పిదాల ఒప్పుకోలుగా పరిగణిస్తూ 1976-77 ఆర్థిక సంవత్సరంలో ఇంక్రిమెంట్లు తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అప్పుడు కొనసాగుతున్న ఎమర్జెన్సీ వల్ల లోచన్ ఈ ఉత్తర్వును సవాలు చేయలేకపోయాడు.

ఇది ఇలా ఉండగా, ఎమర్జెన్సీలో అన్ని చోట్లా జరిగినట్టుగానే వరంగల్‌లో 1976 జూన్ 20న యాభై మంది రచయితలను, కవులను, మేధావులను, ఉపాధ్యాయులను విద్యార్థులను నిర్బంధంలోకి తీసుకుని రెండు, మూడు వారాలపాటు ఒక నిర్బంధ శిబిరంలో పెట్టి చిత్రహింసలకు గురి చేశారు. అలా నిర్బంధంలో చిత్రహింసలకు గురైన వారిలో లోచన్ కూడా ఒకరు. పదహారురోజులపాటు ఆ చిత్రహింసల తర్వాత, 1976 జులై 10న ఆయనను అంతరంగిక భద్రతా చట్టం కింద జైలుకు పంపారు. ఎమర్జెన్సీ ఎత్తివేసే వరకూ ఆయన జైలు నిర్బంధంలోనే గడిపారు. ఎమర్జెన్సీ ఎత్తివేసిన తర్వాత విడుదల అయిన వెంటనే 1977 మార్చి 23న మళ్లీ ఆయనను నిర్బంధంలోకి తీసుకున్నారు. ఆయన సికింద్రాబాద్ కుట్రకేసులో నిందితుడని తప్పుడు ఆరోపణ మోపారు. సృజన పత్రికకు రచనలు చేసేవాడని, హనుమకొండలో లెనిన్ జయంతి, మేడే సభలు జరిపాడని ఆరోపించారు. ఈసారి నిర్బంధం నుంచి కొద్ది రోజులలోనే విడుదల చేశారు. కాని 1980 మార్చి 21న ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

లోచన్ విషయంలో ఈ వాస్తవాలు చెబుతూ ఆయన మీద ప్రభుత్వం ఎట్లా కక్ష సాధింపు ధోరణితో ఉన్నదో నేను కోర్టుకు వివరించాను. ఆయనను ఉద్యోగం నుంచి తొలగించడం అప్రజాస్వామికమనీ, చట్టవ్యతిరేకమనీ వాదించాను.

లోచన్‌కు సంబంధించి నా వాదనలను ఖండిస్తూ ప్రభుత్వ న్యాయవాది చేసిన ప్రతి వాదనలు చిత్రంగా ఉన్నాయి. లోచన్ ప్రజలను సాయుధ విప్లవానికి రెచ్చగొడుతూ చాలా విస్ఫోటకమైన కవితలు రాశాడని, అదే విధమైన ఉపన్యాసాలు ఇచ్చాడని ఆ

ప్లీడరు అన్నారు. ప్రభుత్వోద్యోగుల ప్రవర్తనా నియమావళికి భిన్నంగా ఆయన ప్రజలను, విద్యార్థులను హింసకు పురికొల్పుతున్నాడని అన్నాడు.

ప్రభుత్వ న్యాయవాది చెప్పిన ప్రకారమే ఈ ఇద్దరు చేసిన నేరాలు కవిత్వం రాయడం, ఉపన్యాసాలు చేయడం. మరొక కోర్టులో విచారణలో ఉన్న కేసులో ముద్దాయిలు కావడం మాత్రమే అయితే అవి రాజ్యాంగ అధికరణం 311(2)(సి) కింద ఉద్యోగం నుంచి తొలగించడానికి సరిపోయినవి కావని నేను వాదించాను. అవే నేరాలు అయితే అవి విచారణ అవసరం లేని నిబంధనలకు అవకాశం ఇవ్వవని, అవే నేరాలపై మరొక సెషన్స్ కోర్టు బహిరంగ విచారణ జరుపుతున్నప్పుడు, ఈ సందర్భంలో మాత్రం విచారణ జరపడం భద్రతా కారణాల రీత్యా కుదరని పని ఎలా అవుతుందని నేను ప్రశ్నించాను. అలాగే, ఏ ఉద్యోగి మీదనైనా శాఖాపరమైన విచారణ దేశభద్రత దృష్ట్యా ప్రమాదకరమైనదని అనడానికి వీలు లేదని నేను వాదించాను.

ఈ వాదనలన్నీ విన్న న్యాయమూర్తులు తమ 17 పేజీల తీర్పులో ప్రభుత్వ వాదనలను తిరస్కరించారు.

మొట్టమొదట, రాజలోచన్ సికింద్రాబాద్ కుట్రకేసులో నిందితుడా కాదా అన్నది అప్పటికప్పుడు పరీక్షించగలిగిన వాస్తవం. ఆ కేసు అప్పటికి ఆరు సంవత్సరాలుగా నడుస్తున్నది. చార్జి షీటు దాఖలైంది. ఆ కేసులోని 600 మంది సాక్షులలో అప్పటికే 40 మంది సాక్షులను విచారించడం కూడా అయిపోయింది. అంత సులభంగా చార్జిషీటు చూసి దానిలో రాజలోచన్ పేరులేదని గుర్తించగలిగిన విషయంలో కూడా పోలీసు ప్లీడరు ఎందుకు అబద్ధం చెప్పాడో నాకు అర్థం కాదు. పోలీసులు, పోలీసు ప్లీడర్లు ఇదే మాదిరిగా చాలా సులభంగా ధృవీకరించుకోగలిగిన విషయాలలో కూడా అబద్ధాలు ఆడుతుంటారు. తమను ఎవరూ తప్పుపట్టరని తప్పుపట్టగూడదని వాళ్ల ఉద్దేశ్యం. జస్టిస్ మాధవరెడ్డి, జస్టిస్ ముక్తధర్‌లు మొట్టమొదట అది అబద్ధమని, రాజలోచన్ ఆ కేసులో నిందితుడు కాడని స్పష్టం చేశారు.

ఆ తీర్పు మొదట రాజలోచన్ గురించి ప్రభుత్వం చేసిన తప్పుడు ఆరోపణను తిరస్కరించిన తర్వాత, వారిని రాజ్యాంగ అధికరణం 311(2)(సి) కింద విచారణ లేకుండా తొలగించవచ్చునా లేదా అనే విషయం చర్చకు తీసుకుంది.

ఏ ప్రభుత్వోద్యోగి అయినా ఏదైనా అనుచితమైన పనికి పాల్పడ్డారని, క్రమశిక్షణను ఉల్లంఘించాడని ఆరోపణలు వచ్చినప్పుడు ఆ ఆరోపణలపై విచారణ జరపవలసి ఉంటుందని రాజ్యాంగంలోని 311 అధికరణం చెబుతుంది. ఆ విచారణలో తన మీద వచ్చిన ఆరోపణలకు జవాబు చెప్పుకునే అవకాశం ఆ ఉద్యోగికి కల్పించబడుతుందని, ఆ ఉద్యోగి తన మీద వచ్చిన ఆరోపణలకు వ్యతిరేకంగా, తనకు సమర్థనగా సాక్ష్యాధారాలు సకూర్చుకోవచ్చునని, తన మీద విధించిన లేదా విధించనున్న శిక్ష ఏ విధంగా తప్పుడుదో వాదించుకోవచ్చునని రాజ్యాంగం చెబుతుందని న్యాయమూర్తులు ముందుగా

వివరించారు. రాజ్యాంగంలోని అధికరణం 311 ప్రభుత్వోద్యోగులకు ఇటువంటి రక్షణ కల్పించడానికే ఏర్పాటయిందని వివరించారు. ఆ విచారణ రక్షణకు అధికరణం 311(2) లో ఉప నిబంధన (సి) కింద ఒక మినహాయింపు కూడా అధికరణం 311లోని ఒక్క నిబంధన అయినా అన్వయించినప్పుడు మాత్రమే వర్తిస్తుందని అన్నారు. రాజ్య భద్రతా ప్రయోజనాల దృష్ట్యా విచారణ జరపడం క్షేమకరం కాదని రాష్ట్రపతిగాని గవర్నర్‌గాని సంతృప్తి చెందినపుడు విచారణ అవసరంలేదని ఆ మినహాయింపు చెబుతుంది.

ఇక్కడ గవర్నర్ సంతృప్తి పడడం అంటే ఏమిటో నిర్ధారించడానికి న్యాయమూర్తులు ప్రయత్నించారు. గవర్నర్ సంతృప్తి పడడం అంటే, తొలగించబడుతున్న ఉద్యోగి మీద వచ్చిన ఆరోపణలు తొలగించడానికి తగినవే అని సంతృప్తిపడడం అని అర్థం చేసుకోగూడదని, కేవలం విచారణ అవసరంలేదనే విషయానికి సంతృప్తి పడడం మాత్రమేనని న్యాయమూర్తులు అన్నారు. "ప్రభుత్వోద్యోగి మీద వచ్చిన అభియోగాల స్వభావం ఏమయినప్పటికీ, గవర్నర్ సంతృప్తి అనేది రాజ్యాంగ అధికరణం 311(2)(సి) ప్రకారం విచారణ జరపడం సముచితం కాదన్నంత వరకే" అని వాళ్లు స్పష్టం చేశారు.

అంతకన్న ముఖ్యంగా "కేవలం ప్రభుత్వోద్యోగి వచ్చిన అభియోగాలు అతడిని తొలగించడానికి సరిపోతాయని సంతృప్తి చెందిన ఫలితంగానే గవర్నర్ విచారణను మినహాయించడానికి వీలులేదు. అట్లాగే, విచారణ జరపడం ఇతర కారణాలవల్ల సాధ్యం కాదని కూడా గవర్నర్ విచారణను మినహాయించడానికి వీలులేదు. రాజ్యాంగ అధికరణం ఇచ్చిన హక్కు ప్రకారం కేవలం విచారణ జరపడం రాజ్య భద్రతా ప్రయోజనాలను దెబ్బతీస్తుందని సంతృప్తి చెందినపుడు మాత్రమే గవర్నర్‌కు ఈ అధికరణాన్ని వాడడానికి అవకాశం ఉంది" అని కూడ న్యాయమూర్తులు రాశారు.

ఈ రాజ్యాంగ పరిధిని నిర్ణయించిన తర్వాత ఆ తీర్పు ప్రత్యేకంగా ఈ కేసులో ఆ అధికారణాన్ని వాడవచ్చునా అనికూడ చర్చించింది. ఈ ఇద్దరు ప్రభుత్వోద్యోగులమీద, ముఖ్యంగా చెరబండరాజు మీద ఇవే అభియోగాలపై సికిందరాబాదు కుట్రకేసులో ఒక సెషన్స్ కోర్టు బహిరంగ విచారణ జరుపుతున్నప్పుడు ఇక్కడ శాఖా పరమైనవిచారణవల్ల రాజ్య భద్రతా ప్రయోజనాలు దెబ్బతినబోతున్నాయని వాదించడం అసమంజసమని న్యాయమూర్తులు అన్నారు. అంతేకాదు, శాఖాపరమైన విచారణ ఏదయినా బహిరంగం కూడా జరగదు. అది పూర్తిగా అభియోగాలు ఎదుర్కొంటున్న ఉద్యోగికీ, విచారణాధికారికీ మధ్యజరిగే విచారణ కార్యక్రమం మాత్రమే. ఆ విచారణలో అభియోగాలు, వాటిని ఖండిస్తూ వచ్చే వాదనలు సాక్ష్యాధారాలు అన్నీకూడా అంతరంగికంగానే ఉంటాయి. మరి ఆ సమాచారం, అంతకంటే ఎక్కువ సమాచారం కూడా బహిరంగ విచారణ జరుపుతున్న కోర్టుకు సమర్పించినప్పుడు, ఈ శాఖాపరమైన విచారణను మినహాయించడానికి ఈ రాజ్యాంగ అధికరణాన్ని ఉపయోగించు కోవడం అర్థరహితమని

న్యాయమూర్తులు అన్నారు. అటువంటి శాఖాపరమైన విచారణ రాజ్య భద్రతా ప్రయోజనాలకు వ్యతిరేకమనే వాదనను తాము అర్థం చేసుకోలేకపోతున్నా మని అన్నారు.

ఇక రాజలోచన్ విషయానికి వస్తే ఆయన సికిందరాబాదు కుట్రకేసులో నిందితుడు కూడా కాదు. అసలు ఈ వాస్తవం గవర్నర్ దృష్టికి వచ్చినట్టే లేదని న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు.

ఇక ఇద్దరు నిందితులకు వ్యతిరేకంగా ఉమ్మడిగా వచ్చిన అభియోగం ఆ ఇద్దరూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆయుధాలు ధరించి పోరాడమని ప్రజలను రెచ్చగొడుతూ ఉద్రేకపూరితమైప ఉపన్యాసాలు చేస్తున్నారని, రచనలు చేస్తున్నారని. ఇవే ఆరోపణలు సికిందరాబాదు కుట్రకేసులో కూడ ఉన్నాయి. సహజంగానే ఆ ఉపన్యాసాలను, రచనలను అక్కడ న్యాయస్థానం విచారిస్తుంది. అట్లాగే కేవలం చెరబండరాజు రాసిన రెండు కవితలు మినహా మరి ఏ ఇతర రచననూ ప్రభుత్వం ఇప్పటిదాకా నిషేధించలేదు. వారు ప్రచారంచేస్తున్నారని చెపుతున్న రాజకీయ భావజాలం మార్క్సిస్టులెనినిస్టు లేదా నక్సలైటు భావజాలానికి చెందినది. అది ఏమయినా, చెరబండరాజుకు సంబంధించినంతవరకు ఆ రచనలూ ఉపన్యాసాలూ అన్నీ సికిందరాబాదు కుట్రకేసు (కేసు సం10-1975)లో ఒక సెషన్స్ కోర్టు విచారణలో ఉన్నాయి. రాజలోచన్‌కు సంబంధించినంతవరకు. ఆయన సికిందరాబాదు కుట్రకేసులో నిందితుడు కానప్పటికీ, ఆయన మీద అభియోగంలో ఉన్న ఉపన్యాసాలు, రచనలు, కవితల్లో ఉన్నలాంటి విషయమే ఉన్న రచనలను సికిందరాబాదు కుట్రకేసులో న్యాయస్థానం విచారిస్తోంది. ఆయన చేసిన రచనలు వేటినీ ప్రభుత్వం నిషేధించలేదు.

ఇద్దరు నిందితులు కూడ తాము అటువంటి రచనలు, ఉపన్యాసాలు చేయలేదని అనడం లేదు. వాస్తవానికి భారతదేశ పౌరులుగా తమకు నచ్చిన రాజకీయ భావజాలాన్ని ప్రచారం చేయడం తమ ప్రాథమిక హక్కు అని వాదిస్తున్నారు. ఒక శాఖాపరమైన క్రమశిక్షణా చర్య తీసుకోవడానికి ఇటువంటి అభియోగం మోపవచ్చునా అనే విషయం ఈ న్యాయస్థానం పరిధిలోది కాదు.

ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ (కాండక్ట్) రూల్స్ 1964 ప్రకారం ఏ ప్రభుత్వోద్యోగి అయినా సాహిత్య, కళాత్మక, శాస్త్రీయ స్వభావం లేని రచన ఏదయినా చేయదలచు కున్నట్టయితే ప్రచురించదలచుకున్నట్టయితే ప్రభుత్వ అనుమతి పొందకపోతే అది క్రమశిక్షణను ఉల్లంఘించినట్టే అవుతుందని ప్రభుత్వ న్యాయవాది వాదించారు. ఆయన ఈ సందర్భంలో ఆ నిబంధనావళిలోని 13, 16, 17,19 నిబంధనలను ఉటంకించారు. న్యాయమూర్తులు తమ తీర్పులో ఆ నాలుగు నిబంధనలను మొత్తంగా పునరుల్లేఖించి అవి ఈ సందర్భంలో వర్తిస్తాయా లేదా చర్చించారు.

ఒకవేళ ఈ ప్రభుత్వోద్యోగులు తాము ఏదయినా పుస్తకాన్ని రచనను

ప్రచురించేటప్పుడు అవసరమయిన ప్రభుత్వ అనుమతి తీసుకోలేదని అది సర్వీను నిబందనలు ఉల్లంఘున అని ప్రభుత్వం అనుకుంటే, ఆ విషయంపైనే ప్రత్యేకంగా శాఖాపరమైన విచారణ జరపవచ్చు. ఆ అభియోగం నిజమేనని కాని ఆ విచారణ రాజ భద్రతా ప్రయోజనాలకు భంగకరమని వాదించడం కుదురదు, అని న్యాయమూర్తులు అన్నారు.

ఇక ఒక గవర్నర్ సంతృప్తి చెందిన విషయాన్ని తిరగదోడడానికి ఈ న్యాయస్థానానికి అధికారం లేదని ప్రభుత్వ ప్లీడర్ చేసిన వాదనను న్యాయమూర్తులు చర్చించారు. అసలు ఆ ప్రశ్నలోకి వెళ్లవలసి వస్తే గరవ్నర్ అలా సంతృప్తి పడడానికి తగిన సమాచారాన్ని ఆయన ముందు ఉంచడం జరిగిందా అనే విషయంలోకి వెళ్లవలసి ఉంటుంది. ఆ సమాచారం అధికరణం 311 (2)(సి) ప్రకారం విచారణను మినహాయించడానికి సరిపోతుందా అని కూడా చర్చించవలసి ఉంటుంది అని న్యాయమూర్తులు అన్నారు.

ఒక వేళ గవర్నర్ ఆ సమాచారమంతా విచారణను మినహాయించడానికి సరిపోతుందని సంతృప్తి చెందినట్టయితే, ఆ సమాచారాన్ని ఈ న్యాయస్థానం పరిశీలించడం కూడా రాజ్యభద్రతా ప్రయోజనాలకు భంగకరమే అవుతుంది. ఒకసారి గవర్నర్ అధికరణం 311(2)(సి) ఉపయోగించి ఒక ఉత్తర్వు ఇచ్చినట్లయితే, దాన్ని పరిశీలించడానికి గాని, దాని సంబద్ధతను నిర్ధారించడానికిగాని న్యాయస్థానానికి కూడా అధికారం ఉండదు. ఈ వ్యవహారంలో దేశంలోని న్యాయస్థానాలలో ఎన్నో కేసులు విచారణకు వచ్చాయి. ఎన్నో రకాలైన తీర్పులు వెలువడ్డాయి. జస్టిస్ మాధవరెడ్డి, జస్టిస్ ముక్తధర్‌లు ఆ తీర్పులలో కొన్ని ముఖ్యమైన తీర్పులను ఉటంకించి తమ నిర్ధారణను కొనసాగించారు. జగదీష్ దాజిబా కూ, బొంబాయి అకౌంటెంట్ జనరల్‌కూ మధ్య బొంబాయి హైకోర్టులో జరిగిన కేసులో 1958లో వెలువడిన తీర్పు రాష్ట్రపతి, గవర్నర్ల ఉత్తర్వులను న్యాయస్థానం చర్చించడానికి వీలులేదని చెప్పింది. అలాగే 1958లోనే మహమ్మద్ అజం వర్సస్ స్టేట్ ఆఫ్ హైదరాబాద్ అనే కేసులో జస్టిస్ జగన్మోహరెడ్డి ఇచ్చిన తీర్పు కూడా రాష్ట్రపతి, గవర్నర్, రాజప్రముఖ్‌లు ఇచ్చిన ఉత్వర్వులు కోర్టులలో ప్రశ్నించడానికి వీలు లేనివని ప్రకటించింది.

ఈ రెండు తీర్పులను ఉటంకిస్తూనే, ఇవి రెండూ కూడా 1963 రాజ్యాంగ (పదిహేవన) సవరణ కన్నా ముందువని, కోర్టుల సమీక్షా పరిధి ఏమిటో నిర్వచించిన 1974 సుప్రీం కోర్టు తీర్పు (షంషేర్ సింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్) కన్నా ముందువని న్యాయమూర్తులు అన్నారు. ఈ 1974 తీర్పు ప్రకారం రాష్ట్రపతి, గవర్నర్లకు ఉండే వ్యక్తిగత విచక్షణాధికారాలకూ, వారి మంత్రివర్గ సహచరుల నిర్ణయం మేరకు తీసుకునే పాలనా పరమైన చర్యలకూ. మధ్య విభజన రేఖ ఉందని స్పష్టం చేయడం జరిగింది. మంత్రివర్గం ఇచ్చిన

సలహా మేరకు రాష్ట్రపతిగాని, గవర్నర్‌గాని తీసుకునే చర్య పాలనాపరమైన చర్య అవుతుందని అందువల్ల అది న్యాయస్థానాల సమీక్షా పరిధిలోకి వస్తుందని సుప్రీంకోర్టు తీర్పు ప్రకటించింది. అందువల్ల 311(2)(సి)ని వినియోగించి ఒక ప్రభుత్వోద్యోగిని తొలగించడం అనేది గరవ్నర్ వ్యక్తిగత సంతృప్తి పరిధిలోని విషయం కాదని, అది మంత్రివర్గ సలహా మేరకు జరిగేదేనని, ఆ ఉత్తర్వుకు సలహా మేరకు జరిగేదేనని, ఆ ఉత్తర్వుకు దారితీసిన సమాచారాన్ని న్యాయస్థానం పరిశీలించవచ్చునని నిర్ధారణ అయింది.

ఈ న్యాయశాస్త్ర చర్చ అంతా చేసిన తర్వాత జస్టిస్ మాధవరెడ్డి, జస్టిక్ ముక్తధర్‌లు చెరబండరాజు తన పిటిషన్‌లో తన రచనలు, కవితలు, ---- తనను సికింద్రాబాద్ కుట్ర కేసులో నిందితుడిగా చేశాయనీ, ప్రస్తుతం తనను ఉద్యోగం నుంచి తొలగించడానికి కూడా అవే ఏకైక ఆధారమని వాదించారు. దీనికి ప్రతిగా ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌లో కూడా ఆయన మీద మరేదైనా ఆధారం ఉన్నదని అనలేదు. విచారణ క్రమంలో ప్రభుత్వ ప్లీడర్ మరికొంత సమాచారం ఉన్నదని అన్నారు. ఆ సమాచారం ఏమిటో న్యాయస్థానం దృష్టికి తేవాలని అన్నప్పుడు, చెరబండరాజు కొన్ని రహస్య సమావేశాలలో పాల్గొని హింసను ప్రోత్సహించాడని ఆధారాలున్నాయని ప్రభుత్వ ప్లీడర్ అన్నారు. అటువంటి సమాచారం ఉంటే దాన్ని న్యాయస్థానం ముందు పెట్టి, దాన్ని పరిశీలించే అవకాశం నిందితులకు కూడా ఇచ్చి, వారు దాన్ని ఖండించి తమను తాము సమర్థించుకునే అవకాశం ఇవ్వాలి. కాని వీటికి ప్రభుత్వ ప్లీడర్ అంగీకరించలేదు. నిందితుడికి చూపని సమాచారం ఆధారంగా శిక్ష విధించడం సహజ న్యాయసూత్రాలకు వ్యతిరేకం.

ఇక రాజలోచన్ విషయంలోనైతే గవర్నర్ ముందర ఆయన సికింద్రాబాద్ కుట్రకేసులో నిందితుడనే తప్పుడు సమాచారం పెట్టి ఆ ఉత్తర్వు తీసుకొచ్చారనేది స్పష్టమే అంటే గవర్నర్ ఆ నిర్ణయం తీసుకోవడం వెనుక ఈ తప్పుడు సమాచార ప్రభావం ఉండి ఉంటుంది. అంటే ఆధార రహితమైన సమాచారం సహాయంతో తయారైన గరవ్నర్ నిర్ణయం పూర్తిగా అసమంజసమైనది. అందువల్ల ఆయనను తొలగించడం, విచారణ అవసరం లేదనడం చెల్లదు.

ఇక ఈ ఇద్దరినీ వారి రచనలు, ఉపన్యాసాల కారణంగా తొలగించామనడం ప్రాథమిక హక్కులకు వ్యతిరేకమే. ఎవరైనా ప్రభుత్వోద్యోగి అయినంత మాత్రాన తమ ప్రాథమిక హక్కులను పోగొట్టుకోరు.

ఈ చర్చంతా చేసిన జస్టిస్ మాధవరెడ్డి, జస్టిస్ ముక్తధర్‌లు చెరబండరాజు, రాజలోచన్‌లను రాజ్యాంగ అధికరణం 311(2)(సి) కింద విచారణ అవసరంలేకుండా ఉద్యోగాల నుంచి తొలగించడం చెల్లదని, ఒక వేళ వారు ఏదైనా క్రమశిక్షణా ఉల్లంఘనలకు పాల్పడ్డారని ప్రభుత్వం భావిస్తే, వారి మీద మరేవయినా అభియోగాలుంటే, వారి మీద చట్టం ఆమోదించిన మేరకు చర్యలు తీసుకోవచ్చునని తీర్పు చెప్పారు.

రాష్ట్ర చరిత్రలో ముఖ్యమైన ఆ తీర్పు ప్రభుత్వపు నిరంకుశ అధికారానికి చెంపపెట్టు

రాష్ట్రంలో నక్సలైటు ఉద్యమ చరిత్ర చదవదలచుకున్న వాళ్లెవరైనా ప్రభుత్వం పెట్టిన అనేక కుట్ర కేసుల ఛార్జిషీట్లను వరుసగా చదివితే సరిపోతుంది. అంటే విచారణ జరిపి ఛార్జిషీట్లు తయారు చేసిన పోలీసు అధికారులే నక్సలైటు ఉద్యమానికి అధికారిక చరిత్ర కారులన్నమాట. పార్వతీపురం కుట్ర కేసు, హైదరాబాద్ కుట్రకేసు, సికింద్రాబాద్ కుట్రకేసు, చిత్తూరు కుట్రకేసు, రాంనగర్ కుట్రకేసు, బెంగళూరు కుట్రకేసు లాంటి ప్రధానమైన కేసులు తీసుకున్నా నక్సలైటు ఉద్యమ పరిణామాన్ని అవి చిత్రిస్తాయి. ఈ కేసులన్నిటితోనూ నాకు సంబంధం ఉంది. వీటిలో సికింద్రాబాద్, రాంనగర్, బెంగళూరు కుట్ర కేసులను పూర్తిగా నేనే వాదించాను. లేదా నా ఆఫీసులోని సహచరులు వాదించారు. మిగిలిన కేసులలో అప్పుడప్పుడైనా నేను జోక్యం చేసుకున్నాను.

వీటిలో సికింద్రాబాద్ కుట్ర కేసు, రాంనగర్ కుట్రకేసు సుదీర్ఘ కాలం నడిచిన కేసులు. మొదటిది 1974లో మొదలై పదిహేను సంవత్సరాలు, రెండోది 1985లో మొదలై పదహారు సంవత్సరాలు నడిచాయి. సికింద్రాబాద్ కుట్రకేసు వాదించడం నాకు 45 ఏళ్ల వయస్సున్నప్పుడు ప్రారంభించాను. చివరి వాదనలు నడుస్తున్నప్పుడు నా వయస్సు అరవై సంవత్సరాలు. న్యాయమూర్తికి ఆ విషయం చెప్పి ఇప్పటికైనా ఈ కేసును ముగించండి అని కోరాను.

కుట్రకేసుల వాదనలతో నా సంబంధం 1972లో పార్వతీపురం కుట్రకేసుతో మొదలై 2002లో రాంనగర్ కుట్రకేసు తీర్పుతో ముగిసింది. అంటే నా ఐదు దశాబ్దాలకు పైబడిన న్యాయవాద వృత్తిలో మూడు దశాబ్దాలు కుట్రకేసులతోనే గడిచి పోయాయి.

నక్సలైటు ఉద్యమాన్ని అణచడానికి ప్రభుత్వం పన్నిన ఒక నిరంతర వ్యూహంలో ఈ కుట్రకేసులు ఒక ముఖ్యమైన భాగం. నిజంగా ప్రభుత్వం రూల్ ఆఫ్ లాను సక్రమంగా అమలు చేసి ఉంటే, తు.చ. తప్పకుండా కట్టుబడి ఉంటే అసలు నక్సలైటు ఉద్యమం పెరిగి ఉండేది కాదని నాకనిపిస్తుంది. రూల్ ఆఫ్ లా పాటించడమంటే రాజకీయంగా నక్సలైటు ఉద్యమం లేవనెత్తిన సమస్యలేమిటో గుర్తించి వాటిని రాజకీయంగా పరిష్కరించగలమా అని వెతకడానికి ప్రయత్నించడం. రూల్ ఆఫ్ లా అనే మాటకు సరిగ్గా సరిపోయే మాట ఏమిటని నేను వెతుకుతూ ఉన్నాను. చట్టబద్ధపాలన అని అనువాదం చేస్తున్నారు గాని ఆ మాటతో ఇంగ్లీషు మాటలో ఉన్న అర్థం అంతా కాదు. ఆ చర్చ మరొకసారి చేద్దాం.

రాజ్యాంగంలోనే మార్పుకు కొంచెం స్థలం ఉంది. అయితే ఆ మార్పును వదిలిపెట్టి రూల్ ఆఫ్ లాను ధ్వంసం చేయడానికి మొదలుపెట్టినారు. ఈ పని ఈ ఒక్క ప్రభుత్వమే చేసిందని కాదు. ప్రపంచ వ్యాప్తంగానే అన్ని ప్రభుత్వాలు, అధికారంలో ఉన్న వాళ్లందరూ అదే మాదిరిగా ప్రవర్తించినారు. సోవియట్ కమ్యూనిస్టు పార్టీ కూడా అదేపని చేసింది.

అధికారంలో ఉన్న పార్టీ తనపట్ల ఉండే అసమ్మతిని అణచివేస్తుంది. అనేక విధాలా అణచివేస్తుంది.

ఈ అణచివేత కోర్టుల ద్వారా కూడా అమలవుతుంది. కోర్టుల ద్వారా అమలయినప్పుడు దానికి సాధికారత దొరుకుతుంది. స్టాలిన్ హయాంలో కూడా విచారణలనేవి జరిగాయి. బుఖారిన్ వగైరాలందరినీ తీసుకొచ్చి విచారణ అనేది జరిపి కాల్చి చంపారు. ఇటువంటి పనులను సమర్థించడం అసాధ్యం. ఎప్పుడైనా ప్రజాస్వామిక పద్ధతి, రూల్ ఆఫ్ లా ముఖ్యం. రూల్ ఆఫ్ లాను మీరు మీ ఇష్టం వచ్చినట్టు నిర్వచించుకోవచ్చు. సోషలిస్టు రూల్ ఆఫ్ లా అని కూడా అనవచ్చు. ఒకసారి దాన్ని కచ్చితంగా నిర్వచించి, నిర్వచించినట్టుగా పాటిస్తే ఈ ముప్పంతా వచ్చేది కాదు. అరవై సంవత్సరాల పాలన కుప్పకూలిపోయేది కాదు.

మన దేశంలో రూల్ ఆఫ్ లా చరిత్ర చూద్దాం. నెహ్రూ పాలన దాకా కాస్తమెరుగ్గా ఉండిందది. చైనాతో యుద్ధం, నెహ్రూ మరణం... ఇక పరిస్థితులు దిగజారిపోయాయి. గోవిందదాస్ అని ఒకతను ఒక మంచి పుస్తకం రాసినాడు. దాంట్లో నెహ్రూను భారతదేశానికి ఉండిన ఏకైక స్థిరాస్తి అని రాసినాడు. ఆ స్థిరాస్తి కరిగిపోయిన తర్వాత మొత్తం పాలననంతా తిప్పేసినారు. ఒక పక్క మితవాద శక్తులు, మరొక పక్క ప్రగతిశీల శక్తులు వీరి మధ్య ఘర్షణలోనే దేశంలో ఎన్నో ఉద్యమాలు రూపు దిద్దుకున్నాయి.

ఈ పరిణామాల తర్వాత ఈ దేశపాలనా వ్యవస్థకు ఏమో అయిపోయింది. ఆయా ప్రాంతాలలో కమ్యూనిస్టుల ప్రాబల్యాన్ని అణచడానికి గవర్నర్ల వ్యవస్థను దుర్వినియోగం చేయడం మొదలైంది. ఆంధ్ర రాష్ట్రంలో ప్రకాశాన్ని పడగొట్టడానికి, కేరళ రాష్ట్రంలో నంబూద్రిపాద్‌ను పడగొట్టడానికి ఈ పద్ధతిని ఎంచుకున్నారు. ఎప్పుడూ ఎన్నికలలో గెలవని సి రాజగోపాలాచారిని ఎం ఎల్ సిగా నామినేట్ చేసి చివరికి ముఖ్యమంత్రిని కూడా చేశారు. ఆయన అతి భయంకరమైన కమ్యూనిస్టు వ్యతిరేకి. ఇటువంటి పనులు నెహ్రూ ఉన్నప్పుడే ప్రారంభమయ్యాయి. కాని నెహ్రూ వాటిని కొంత వరకు అదుపులో పెట్టగలిగినాడనుకుంటాను. నెహ్రూకు ప్రజల్లోనూ, అంతర్జాతీయంగానూ చాలా పలుకుబడి ఉండేది గదా. నెహ్రూను వ్యతిరేకిస్తే జనం తిరగబడతారని భయమైనా ఉండేది. ఆ రకంగా నెహ్రూ కొన్ని పనులు చేయగలిగాడు. కొన్ని పాలనా సూత్రాలు ఏర్పరచగలిగాడు. అందువల్ల దేశంలో ఒక రకమైన శాంతిని స్థాపించగలిగాడు. అయితే ఆయన కూడా ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం లాంటి అప్రజాస్వామిక చట్టాలు లేకుండా పాలన కొనసాగించలేకపోయాడు.

1960 చివరికి వచ్చేసరికి ఆ శాంతి అంతా భగ్నమైపోయింది. పంచవర్ష ప్రణాళికలన్నీ విఫలమైపోయాయి. ప్లాన్ హాలిడే ప్రకటించవలసి వచ్చింది. లైసెన్సింగ్ పద్ధతి వల్ల ధనవంతులు మరింత ధనవంతులైపోయారు అని మహలనోబిస్ రాసినాడు.

సరిగ్గా అప్పుడే నక్సల్బరీ ఉద్యమం వచ్చింది. సిద్ధార్థా శంకర్ రే కేంద్ర ప్రభుత్వంలో ఏ మంత్రిత్వ శాఖలేని మంత్రిగా ఉన్నాడు. అప్పుడు ఆయన కలకత్తా వస్తే కలకత్తా వీధుల్లో ఎంతో మంది యువకులను కాల్చి చంపారు. దారుణమైన నిర్బంధం అమలైంది.

నక్సల్బరీ ఉద్యమం వెంటనే దేశ వ్యాప్తంగా ఎందరో యువకులను ఆకర్షించింది. ఎందుకంటే ఆ ఉద్యమానికి గొప్ప భవిష్యత్ దృష్టి ఉండింది. ఇక్కడ నేను స్పష్టంగా చెప్పదలచుకున్నదేమంటే, నక్సలైటు ఉద్యమానికి వచ్చిన అపారమైన మద్దతు దాని రాజకీయ, విప్లవ వ్యూహంవల్ల ఎత్తుగడల వల్ల వచ్చినదికాదు. ఆ మద్దతు అంతా దాని భవిష్యత్ స్వప్నాలవల్ల వచ్చింది.

నాకు బాగా గుర్తు 1968లో నేను, వసంత కలకత్తా చూడదానికి వెళ్లాం. అప్పుడు ఏదో ఆర్బిట్రేషన్ కేసు కోసం ఎ.ఎస్.ఆర్.చారి కూడా వచ్చి ఉన్నాడు. ఆయన గ్రాండ్ హోటల్లో ఉన్నాడు. ఆయనను కలవడానికి మేం వెళ్తుంటే, ఫుట్‌పాత్ మీద చేగువేరా గెరిల్లా యుద్ధం గురించి రాసిన పుస్తకం, హిట్లర్ ఆత్మకథ మెయిన్ కాంఫ్ కుప్పలు కుప్పలుగా పోసి ఉన్నాయి. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. ఇదేమిట్రా, చేగువేరాను, హిట్లర్‌ను కలిపి అమ్ముతున్నారే అని. ఏమో, చేగువేరా విజయం సాధిస్తే మెయిన్ కాంఫ్ తయారయ్యేదేమో! తిరిగి వెనక్కి వచ్చేటప్పుడు కొనుక్కుందాం అనుకుని హోటల్‌కు వెళ్లి తిరిగి వచ్చేటప్పటికి ఆ పుస్తకాలన్నీ అయిపోయినాయి. ఆ ఉద్యమం ప్రభావం అటువంటిదన్న మాట.

ఆ ఉద్యమం ఆ విధంగా ఒక కార్చిచ్చులాగా శ్రీకాకుళం వచ్చింది. శ్రీకాకుళంలో గిరిజన రైతాంగ ఉద్యమం మొదలైంది. ఆ సమయంలోనే ఇక్కడ తెలంగాణా ప్రత్యేక రాష్ట్రం కోరుతూ యువకులు, విద్యార్థులు ఉద్యోగులు ఆందోళన ప్రారంభించారు. అప్పటికి రాష్ట్రంలో ఉన్న కమ్యూనిస్టు నాయకులలో చాలా మంది శ్రీకాకుళం ఉద్యమంలో భాగం పంచుకున్నారు. శ్రీకాకుళం ఉద్యమం స్వయంగా చాలా మంది గొప్ప నాయకులను సృష్టించుకున్నది.

ఆ మాదిరి నాయకులు వంద సంవత్సరాలకొకసారి వస్తారని సుందరయ్య స్వయంగా నాతో అన్నాడు. భార్గవా కమిషన్ విచారణ సమయంలో పుచ్చలపల్లి సుందరయ్య నాకు తరచుగా కలుస్తుండేవాడే. ఒక రోజు నేను ఆయనను అడిగాను. “సుందరయ్యగారూ, మీరు మీ జీవితానుభవాల నుంచి ఒప్పులేమిటో, తప్పులేమిటో లెక్కలు వేయవలసిన సమయం వచ్చింది గడిచిన జీవితం మీద మీరు ఇప్పుడేమంటారు? మీ బాలెన్స్ షీట్ మీరు ఏమని రాస్తారు?

దానికి జవాబు చెబుతున్నప్పుడు ఆయన కళ్లలో నీళ్లు తిరిగాయి. “వెంపటాపు సత్యనారాయణ, ఆదిభట్ల కైలాసం వంటి నాయకులు ఏ రోజుకాజు పుట్టకు రారు. ప్రజల నుంచి అటువంటి నాయకులు లేచి నిలబడాలంటే దాదాపు యాభై నుంచి

వంద సంవత్సరాలు పడుతుంది" అన్నాడు. అప్పుడు ఆయన రాజకీయ విషయాల మీద కొండపల్లి సీతారామయ్యతో చర్చించడానికి తనకు అభ్యంతరం లేదని కూడా అన్నాడు. చంద్రపుల్లారెడ్డితో మాత్రం మాట్లాడనన్నాడు. అది మరో కథ. మరోసారి చెబుతాను.

ఆ విధంగా దేశంలోనూ రాష్ట్రంలోనూ నక్సలైటు ఉద్యమం మొదలైంది. ఎందుకంటే అప్పటికే పాలన స్తబ్దుగా నిలిచిపోయింది. అవినీతి పెరిగిపోవడం ప్రారంభమయింది. దేశంలో అవినీతి మీద వేసిన మొట్టమొదటి కమిటీ సంతానం కమిటీ నివేదిక 1963లోనే వచ్చింది. అటువంటి పరిస్థితుల్ల ఉద్యమాలు చాలా సహజంగా వస్తాయి.

ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైనందువల్ల ఉద్యమాలు వస్తే, వాటికి ప్రతిగా ప్రభుత్వాలు ఏమి చేశాయంటే, ఉద్యమాలను అణచి వేయడానికి రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులను రద్దు చేయదలచాయి.

మన రాష్ట్రంలోనే తీసుకుంటే, శ్రీకాకుళ ఉద్యమానికి ప్రతి స్పందనగా ప్రభుత్వం సభలు, సమావేశాలు పెట్టుకునే, సంఘాలు ఏర్పరచుకునే హక్కును కాలరాచివేయడానికి ప్రయత్నించింది. మొట్టమొదట ప్రభుత్వం కోరన్న, మంగన్న అనే ఇద్దరు శ్రీకాకుళం ఆదివాసులను కాల్చి చంపింది. వారు చేసిన నేరం ఏమిటి? వారు ఒక గిరిజన సంఘం సభకు వెళ్తున్నారు. మైదాన ప్రాంతాల నుంచి వచ్చిన భూస్వాములు, షావుకార్లు, వడ్డీ వ్యాపారులు తమ మీద సాగిస్తున్న దోపిడీని ఎదిరించడానికి ఒక సంఘంగా రూపొందాలని గిరిజనులు అనుకోవడమే ప్రభుత్వానికి కంటగింపయింది. ప్రభుత్వ మద్దతున్న మేడిద సత్యం అనే భూస్వామి గిరిజనుల ఊరేగింపు మీద కాల్పులు జరిపి ఈ ఇద్దరు గిరిజనులను చంపేశారు.

అంతకు ముందు నుంచే గిరిజనులలో అసంతృప్తి గూడు కట్టుకుంటున్నప్పటికీ, గిరిజనులు పోరాటాలకు సిద్ధమవుతున్నప్పటికీ, కోరన్న మంగన్నల త్యాగాల పోరాట ప్రజ్వలనకు తక్షణ కారణంగా నిలిచింది. అది ఆ పోరాటానికి ఆజ్యం పోసింది. వెంటనే ఆ జిల్లాలోని ఇతర ప్రాంతాలలోనూ, పొరుగు జిల్లాలోనూ రైతాంగాన్ని, ప్రజలను నక్సలైట్లు కదిలించడం మొదలుపెట్టారు. వారు బాధిత ప్రజల అసంతృప్తులను పరిష్కరించడం మాత్రమే కాదు. భూస్వాములను వ్యక్తిగతంగా నిర్మూలించడం ద్వారా సమస్యలు పరిష్కరించవచ్చుననే పంథా తీసుకున్నారు. ఇటువంటి వర్గశత్రు నిర్మూలనా యుద్ధం ద్వారా విప్లవాన్ని త్వరితం చేయవచ్చునని వారు అనుకున్నారు.

## అది సైద్ధాంతికంగా తప్పు. నేను అప్పుడే చెప్పాను

క్రమంగా ఆ ఉద్యమం మొత్తం రాష్ట్రానికి పాకిపోయింది. పోలీసులు వందలాది మందిని చంపారు. వేలాది మందిని అక్రమంగానూ, చట్టబద్ధంగానూ నిర్బంధించారు.

అయితే పెద్ద ఎత్తున చట్టవ్యతిరేకంగా నిర్బంధం కొనసాగించడానికి ప్రభుత్వం కూడా కొంత వరకు భయపడిందనుకుంటాను. స్వాతంత్ర్యం వచ్చి, రాజ్యాంగం రాసుకుని అప్పటికి నిండా ఇరవై ఏళ్లు కూడా కాలేదు. జాతీయోద్యమం గురించీ, బ్రిటిష్ వ్యతిరేక తిరుగుబాట్ల గురించీ, ఉద్యమకారుల మీద బ్రిటిష్ పోలీసుల దారుణ నిర్బంధం గురించీ ప్రజల జ్ఞాపకాలు ఇంకా చెరిగిపోలేదు.

అందువల్ల 1948 మద్రాస్ సప్రెషన్ ఆఫ్ డిస్టర్బెన్సెస్ ఆక్ట్ అనే పాత చట్టాన్ని వాడుకుని కొన్ని ప్రాంతాలను కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించారు. ఈ మాదిరిగా నోటిఫై చేసిన ప్రాంతంలో ఐదుగురికన్నా ఎక్కువ ప్రజలు గుమిగూడి ఉన్నప్పుడు, చెదిరిపొమ్మని హెచ్చరించినా చెదిరిపోనప్పుడు ఒక పోలీసు అధికారికి వారి మీద కాల్పులు జరిపే అధికారం వస్తుంది.

ఇది కచ్చితంగా రాజ్యాంగంలో జీవించే స్వేచ్ఛను హామీ ఇచ్చే అధికరణం 21కి వ్యతిరేకం. ఇంతకూ ఆ చట్టం రాజ్యాంగం ఉనికిలోకి రావడానికి ముందు వచ్చిన చట్టం. స్వాతంత్ర్యం తర్వాతనే, తెలంగాణ ప్రాంతంలో రైతాంగ సాయుధ పోరాటం జరుగుతున్నప్పుడు, ఇక్కడి నుంచి కార్యకర్తలు, గెరిల్లాలు మద్రాసు రాష్ట్రంలోని ఆంధ్ర ప్రాంతానికి వెళ్లి ఆశ్రమం తీసుకుంటున్నారని, వారిని అరికట్టడానికి ఒక ప్రత్యేక చట్టం కావాలని ఆ చట్టం తీసుకు వచ్చారు. ఇప్పుడు ఆ చట్టాన్ని వాడుకుని రాష్ట్రంలో శ్రీకాకుళం నుంచి కరీంనగర్ దాకా అడవి ప్రాంతాన్నంతా కల్లోలిత ప్రాంతంగా నోటిఫై చేశారు.

ఆ మాదిరిగా అటు కొసన శ్రీకాకుళం నుంచి ఇటు కరీంనగర్ దాకా అడవి ప్రాంతాన్నంతా కల్లోలిత ప్రాంతంగా ప్రకటించారు. ఇక బయట మైదాన ప్రాంతాల నుంచి మనుషులను, విప్లవ కార్యకర్తలను గానీ, సానుభూతి పరులను గానీ, మామూలు ప్రజలనుగాని పట్టుకుపోయి ఆ అడవిలోకి తీసుకు వెళ్లి కాల్చిచంపడం మొదలుపెట్టారు. ఆ మాదిరిగా చంపడం ద్వారా కాస్త పైపైన అయినా చట్టబద్ధతను సాధించవచ్చునని ప్రభుత్వం అనుకుంది. ఆ కల్లోలిత ప్రాంతాలలో పోలీసులకు ప్రజలను కాల్చిచంపేదానికి ఎక్కువ అధికారాలు లభిస్తాయి కనుక, ఆ అధికారాలను ఉపయోగించుకుని కాల్చి చంపుతున్నామని ఒక అభాసను కల్పించారన్న మాట. ఆ రోజుల్లో కనీసం అటువంటి సాకునైనా వెతుక్కునే వారు, ఏదో ఒక రకమైన చట్టాన్ని పాటిస్తున్నామని చూపుకునే వారు. ఆ విధంగా ఏడెనిమిది వందల మందిని కాల్చి చంపారు.

నాకు ఒక సంఘటన బాగా గుర్తు. తాబేలు నాయుడు అని ఒక నక్సలైటు నాయకుడి కుటుంబంలో పన్నెండు మందిని అట్లా చంపారు. ఆ హత్యలన్నిటినీ ఎదురు కాల్పులుగా, ఎన్‌కౌంటర్లుగా నమోదు చేశారు.

ఒక పక్కనేమో ఇట్లా కాల్చిచంపడం, మరో పక్క నుంచి కుట్ర కేసులు పెట్టడం. ఆ కుట్ర కేసుల ద్వారా ఉద్యమం మీద, ఉద్యమ నాయకుల మీద దుష్ప్రచారం చేసే

విధంగా తప్పుడు ఆరోపణలు చేయడం ఇదీ ప్రభుత్వ వ్యూహం.

పార్వతీపురం కుట్రకేసు పెట్టినప్పుడు మొదట 240 మంది మీద పెట్టారు. కేసు విచారణ అవుతుండగానే అందులో సగం మందిని కాల్చివేశారు. చివరికి మొత్తం మీద 75 మంది మీద మాత్రమే నేరారోపణలు చేశారు. అంటే ఛార్జిషీటు పెట్టారు. ఆ కేసు విచారణ జరపకుండా అట్లా సాగదీస్తున్నప్పుడు మేం ఇక్కడ రిట్ పిటిషన్లు వేశాం. చివరికి ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి 1974లో మొదలు పెట్టి 1978 కల్లా విచారణ ముగించి 75 మందిలో కొందరికి శిక్షలు వేసినారు. కొందరికి యావజ్జీవ శిక్షలు, మరికొందరికి కొన్ని సంవత్సరాల శిక్షలు. కొందరి మీద కేసు కొట్టేసినారు. దాదాపు 250 మంది సాక్షులను విచారించారు. దాదాపు వెయ్యి పత్రాలు పరిశీలించారు. మొత్తం మీ విచారణ సాఫీగానే జరిగింది. అక్కడ పి.ఎల్. నాయుడు, రాచకొండ విశ్వనాథశాస్త్రి, భువనమోహన పట్నాయక్, అచంట లక్ష్మణరావు వగైరా న్యాయవాదులు ఆ కేసు చేసే వారు. రావి సుబ్బారావు ఇక్కడి నుంచి అప్పుడప్పుడు వెళ్తుండేవారు.

ఆ కింది కోర్టు తీర్పు మీద హైకోర్టుకు అప్పీలు వచ్చింది. న్యాయస్థానాలకు ఎంతగా బయటి ప్రపంచంతో సంబంధం లేదని అనుకున్నప్పటికీ, బయట జరుగతున్న సామాజిక మార్పుల ప్రభావం న్యాయ స్థానాల మీద ఎట్లా ఉంటుందో మనం తెలుసుకోవాలి.

పార్వతీపురం కుట్రకేసులో పద్నాలుగో పదిహేనో సమావేశాలు ప్రస్తావించారు. గుత్తికొండ బిలం సమావేశం కూడా అక్కడ నేరారోపణలలో ఒకటి. కాని సెషన్స్ జడ్జి గుత్తికొండబిలం సమావేశాన్ని కుట్రగా పరిగణించలేదు.

ఆ కేసు పత్రాలన్నీ చదివితే ఏమనిపిస్తుందంటే, అసలు నక్సలైటు రాజకీయాలే నేరమనే దృక్పథంతో ఆ కేసు తయారు చేశారు. అప్పుడు జలగం వెంగళరావు హోం మంత్రి. ఆయన నేతృత్వంలో రెండు వ్యూహాలు తయారయినాయి. ఒకటి చంపడం, రెండు నేరారోపణ, న్యాయవిచారణ. చంపడమేమో నక్సలైటు రాజకీయాలను నమ్మేవాళ్లందరినీ భౌతికంగా నిర్మూలించడం. నేరారోపణలేమో నక్సలైటు రాజకీయాలను అభిమానించేవాళ్లందరినీ కుట్ర కేసుల్లో ఇరికించడం.

అంటే ఒక రకమైన రాజకీయాభిప్రాయాలను కలిగి ఉండడం, నమ్మడం, వాటిని అచరణలో పెట్టడం అనేదే కుట్ర, నేరం అనే అభిప్రాయానికి ప్రభుత్వం వచ్చిందన్నమాట. ఇటువంటి అభిప్రాయానికి రావడమంటే ప్రజాస్వామ్యాన్ని పాతిపెట్టడమే. రాజకీయాలే నేరం అని ఒక ప్రభుత్వం అనుకున్నదంటే ఆ ప్రభుత్వం ప్రజాస్వామిక మార్గం నుంచి పట్టాలు తప్పిందన్నమాట.

నేను ఆ విషయాన్నే తీవ్రంగా పరిగణిస్తున్నాను. రూరల్ ఆఫ్ లాను ఏ కారణంతోనైనా సరే పక్కనపెట్టడానికి వీలులేదని నమ్మేవాణ్నినేను. ఈ దేశంలో రూల్ ఆఫ్ లాను పాక్షికంగానే అమలు చేస్తున్నారని, కొందరి విషయంలోనే కొన్ని సందర్భాలలోనే రూల్

అఫ్ లా అమలు అవుతున్నదని నా అభిప్రాయం. మిగతావాళ్లకు రూల్ అఫ్ లా పాక్షికంగా ఉపసంహరణ కూడా చాలా ప్రమాదకరమైనదని భావిస్తాను. ఎందుకంటే ఒకసారి పాక్షిక ఉపసంహరణ మొదలైన తర్వాత ఇది ఇతర రంగాలకు వ్యాపిస్తుంది.

సరే, పార్వతీపురం కుట్ర కేసు సమయంలో ఎన్ వీరనారాయణరెడ్డి క్రైం బ్రాంచి సి ఐ డిలో డిప్యూటీ సూపరింటెండెంట్ అఫ్ పోలీసు. పార్వతీపురం కుట్రకేసులో ఆయన పరిశోధనాధికారి, ఆయనే అంతకుముందే ఒక ప్రైవేటు కంప్లెయింటు వేశాడు. ఒక పోలీసు అధికారిగా ఉండిన ఆయన పూర్తిగా రాజకీయ అభిప్రాయాలతో నిండిన ప్రైవేటు కంప్లెయింటు వేశాడు. ఆ తర్వాత ఆయనే పరిశోధనాకారిగా ప్రభుత్వం తరఫున ఛార్జిషీటు దాఖలు చేశాడు. ఆ ప్రైవేటు ఫిర్యాదులోనూ, ఈ ప్రభుత్వ ఛార్జిషీటులోనూ, నిందితుల మీద నేరారోపణ ఏమంటే, వారు రాజ్యం మీద యుద్ధానికి సన్నద్ధమయ్యారు అని.

నా వాదన ఏమంటే, ఒక పోలీసు అధికారికి, వ్యక్తిగతంగా గాని, పోలీసు అధికారి హోదాలోగాని, ఎవరి మీదనైనా రాజ్యం మీద యుద్ధానికి సన్నద్ధమవుతున్నారని నేరారోపణ చేయడానికి అధికారం ఉంటుందా? అని, ఆయన ఎవరికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు? ఇప్పుడు అనుమతి ఇవ్వండి అని తీసుకున్నారా? లేక ముందే అనుమతి తీసుకోవలసి ఉంటుందా? ఆ ప్రాతినిధ్యపు స్థాయి ఏమిటి? అసలు ఒకసారి ప్రైవేటు ఫిర్యాదు దాఖలు చేసిన తర్వాత, మళ్లీ పరిశోధించి ఛార్జిషీటు వేయడానికి అనుమతి అవసరమా లేదా, ఆ అనుమతి తీసుకున్నారా? లేదా అని ముందే పరిశోధించి, ఆ మాదిరి పరిశోధించాను.

అయితే మనకు రూల్ అఫ్ లాను పాక్షికంగా ఉపసంహరించుకోవడం అలవాటే కాబట్టి ఈ విషయంలో రూల్ అఫ్ లా అవసరంలేదు అని కోర్టు భావించింది. పరిశోధన జరపడానికి అనుమతి ఎప్పుడైనా తీసుకోవచ్చు అని కోర్టు చెప్పేసింది. మనం రూల్ అఫ్ లాను అర్థం చేసుకున్న పద్ధతి, అమలు చేస్తున్న పద్ధతి అది. ఈ మాదిరిగా చెయ్యడాన్ని ఫెయిట్ అకాంప్లి అంటారు. అంటే తర్వాత చెయ్యబోయే పనిని ముందే చేసెయ్యడం, ముందు తీసుకోవలసిన అనుమతిని తర్వాత తీసుకోవడం. సవరించడానికి వీలులేని విధంగా చేయడం ఈ దేశంలో రాజకీయాలు, పరిపాలన అంతా ఫెయిట్ అకాంప్లీ రాజకీయాలు, ఫెయిట్ అకాంప్లీ పాలన అయిపోయాయి.

ఇది చాలా అన్యాయం, రూల్ అఫ లాకు వ్యతిరేకం. కాని కోర్టే దానికి మార్గం వేసింది. ఈ సూత్రం కోర్టే రూపొందించింది. ఒక వ్యక్తిని, లేదా కొందరు వ్యక్తులను ఏవైనా నేరాలు చేశారని ప్రాసిక్యూట్ చేయడం నేరపరిశోధన పూర్తికాకముందే ప్రారంభించవచ్చు అని అంటే, పూర్తి పరిశోధన లేకుండానే ఎవరిమీదనైనా పోలీసులు నేరం ఆరోపించి విచారణ ప్రారంభించి, ఆ తర్వాత తమ ఆరోపణలకు తగిన సాక్ష్యాధారాలు సమకూర్చుకోవచ్చు. అసలు ఒకరు నేరం చేశారా లేదా అనేది పరిశోధన ద్వారా తేలాలి అనే సహజ న్యాయ సూత్రం రద్దయిపోయింది. రూల్ అఫ్ లా పట్ల

ఇటువంటి వైఖరి ఉండడంవల్లనే మన న్యాయస్థానాలు కూడా ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేయడంలో తమ వంతు పాత్ర నిర్వహించాయి.

ఒక పక్క ఎన్‌కౌంటర్ హత్యలు, ఎఫ్.ఐ.ఆర్. తయారవుతుండగానే, ఛార్జిషీట్ పెండింగులో ఉండగానే, ఎఫ్.ఐ.ఆర్. కాల వ్యవధి పెంచి ఆ ఎఫ్.ఐ.ఆర్.లో పేర్కొనే వ్యక్తులను ఎన్‌కౌంటర్ల పేరిట కాల్చి చంపుతారు. ఛార్జిషీట్ సమర్పిస్తుండగానే ఆ ఛార్జిషీట్‌లో పేర్కొన్న వ్యక్తులను చంపేస్తారు. విచారణ జరుగుతుండగానే నిందితులను కాల్చి చంపుతారు.

పార్వతీపురం కుట్రకేసులో ఒక విచిత్రమైన సంగతి జరిగింది. ఆదిభట్ల కైలాసం, నాగభూషణం పట్నాయక్ ఇద్దరూ విచారణ జరుగుతుండగా జైలు నుంచి తప్పించుకుని పోయారు. అలా తప్పించుకుని పోయి వాళ్లు ఇద్దరు వ్యక్తులను హత్య చేశారని మరొక కేసులో నేరారోపణ దాఖలైంది. ఆదిభట్ల కైలాసం ఒక ఎన్‌కౌంటర్ అనబడేదానిలో కాల్చి చంపబడ్డాడు గనుక ఆ రెండో కేసు విచారణకు గాని, మొదట ఉన్న పార్వతీ పురం కుట్రకేసు విచారణకు గాని హాజరు కాలేదు. నాగభూషణం పట్నాయక్ మాత్రం అరెస్టయి మళ్లీ న్యాయస్థానం ముందుకు తీసుకు రాబడ్డాడు.

నాగభూషణం పట్నాయక్ పై చట్టబద్ధమైన జైలుకస్టడీ నుంచి తప్పించుకున్న నేరంపై విచారణ జరిపారు. ఆ న్యాయస్థానం ఆయన నిర్దోషి అని తీర్పు చెప్పింది. అంటే ఆయన తప్పించుకుపోయాడని ప్రాసిక్యూషన్ రుజువు చేయలేకపోయింది.

అసలు ఆయన జైలు నుంచి పారిపోయాడనే నిరూపించలేకపోయినప్పుడు, ఆ తర్వాత రెండు హత్యలు చేశాడనే ఆరోపణకు అర్థం లేదు. అందువల్ల ఆ జంట హత్యల కేసులో ఛార్జిషీటు వేయడానికే వీలు కాలేదు. ఆ కేసు విచారణ జరగలేదు.

సరే, పార్వతీపురం కుట్ర కేసులో కింది కోర్టు విధించిన శిక్షల మీద అప్పీలు హైకోర్టుకు వచ్చిందని చెప్పానుగదా. అది సరిగ్గా ఎమర్జెన్సీ ఎత్తివేసిన కొద్దికాలం తర్వాత. అప్పుడు మొత్తంగా సమాజంలోనే గొప్ప ప్రజాస్వామిక వాతావరణం కనబడుతుంది. ప్రజలందరూ హఠాత్తుగా తమకు రాజ్యాంగం హామీ ఇచ్చిన ప్రాథమిక హక్కులున్నాయని గుర్తింపు పొందారు. ప్రభుత్వం రూల్ ఆఫ్ లాను ఉల్లంఘిస్తూ వచ్చిందని, గౌరవించడంలేని ప్రజలు హఠాత్తుగా కళ్లుతెరిచారు.

నిజానికి ఇందిరాగాంధీ పాలనకు చాలా ముందు నుంచే ఈ దేశంలో రూల్ ఆఫ్ లాను ఉల్లంఘించడం ప్రారంభమయింది. ఆమె పాలనకన్నా ముందే బీహార్‌లో విచారణలో ఉన్న ఖైదీలు పదకొండు సంవత్సరాలపాటు జైళ్లలో మగ్గిపోయారు. దానికి ఇందిరాగాంధీ బాధ్యత ఏమీ లేదు. అంతకాలం విచారణ సాగుతున్నా ఖైదీలను విడిచిపెట్టలేదంటే దానికి బాధ్యత మన న్యాయస్థానాలు వహించాలి.

అప్పుడే బీహార్‌లో భాగల్పూర్ ఖైదీల కళ్లలో ఆసిడ్ పోసి అంధులను చేసిన ఉదంతాలు,

బయటపడ్డాయి. దానిలో కూడా ఇందిరాగాంధీ బాధ్యత ఏమీ లేదు. ఇది ఇందిరాగాంధీ కన్నా ముందునుంచే జరుగుతూ వచ్చిన దారుణం. మన వ్యవస్థ, సమాజం అంతకు ముందునుంచే కుళ్లుతూ వస్తూ ఉన్నాయన్నమాట.

సరే, అట్లా ప్రజాస్వామిక వాతావరణం ఉన్న సమయంలో పార్వతీపురం అప్పీలు వచ్చింది. పత్తిపాటి వెంకటేశ్వర్లు చాలా మంది వకీళ్లచేత మెమో ఆఫ్ అప్పియరెన్స్ వేయించాడు. కాని చాలా మంది కోర్టుకు వచ్చి నిందితుల తరఫున వకాల్తా చేయనేలేదు.

ఒకవైపు ఆ పరిస్థితి ఉండగా, మరొక వైపు, పార్వతీపురం కుట్రకేసులో నిందితులుగా ఉన్న కార్యకర్తలలో చీలికలు, విభేదాలే వచ్చాయి. వారు తమకు ఫలానా న్యాయవాది అయితేనే వాదించాలని, ఫలానా వారు అయితే వద్దని అనడం మొదలుపెట్టారు. అంతకుముందే డిఫెన్స్ కమిటీ పని చేస్తున్న రోజుల్లో తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు నా దగ్గరికి వచ్చి "మా కేసు పత్తిపాటి వెంకటేశ్వర్లు మాత్రం చేయగూడదండి" అని నాకు చెప్పారు.

అందువల్ల పార్వతీపురం అప్పీలు విచారణ మొదలు కాగానే నేను ఆ నిందితులందరికీ, మీ తరఫున ఎట్లా వాదించాలో ఎవరు వాదించాలో మీ చీలికలవైపు నుంచి చూసి చెప్పడానికి ప్రయత్నించకండి. అదంతా మాకు వదిలేయండి. ఎవరు వాదిస్తే, ఎట్లా వాదిస్తే మేలు జరుగుతుందో మేం ఆలోచిస్తాం అని చెప్పాను.

చౌదరి తేజేశ్వరరావు పెద్ద మనిషి. మంచివాడు. ఆయన సరే అని ఒప్పుకున్నాడు. ఆయన అప్పుడు చాలా ప్రముఖుడు. ఆయన మీద కూడా ఆరోపణలు ఉండేవనుకోండి. ఆయన అరెస్టు పెద్ద సంచలనం అయితే ఆయన ఏర్పాట్లన్నీ చేసుకుని అరెస్టయ్యాడని ఒక వదంతి ఉండేది. జస్టిస్ రామచంద్రరాజు కూడా ఆ మాటన్నారు. నేను అభ్యంతరం చెప్పాను. జడ్జి తన మాట వెనక్కి తీసుకున్నాడు.

నక్సలైటు రాజకీయాలలో వచ్చిన చీలికలను ఈ కేసు వాదనలలోకి కూడా తీసుకురావడానికి ప్రయత్నం జరిగింది. ఒకరిద్దరు న్యాయవాదులు కూడా ఆ మాదిరిగానే ఆలోచించడం మొదలుపెట్టారు. అప్పుడు నేను పద్మనాభరెడ్డికి ఫోన్ చేసి మాట్లాడాను. "మనమంతా కలిసి ఉమ్మడిగానే వాదనలు పెడదాము. కుట్ర అని ఆరోపించడానికి తగిన ఆధారమైన, 'కుట్రదారుల మధ్య ఒప్పందం' అనేది లేదు అని మీరు వాదించి ఆ విషయం నిర్ధారించండి. ఆ తార్వత చట్టపరమైన వాదనలు నేను వినిపిస్తాను" అని చెప్పాను.

ఆ రకంగానే మా ఇద్దరి వాదనలు సాగాయి. జస్టిస్ సీతారామరెడ్డి కుట్ర జరగడానికి అవసరమైన ఒప్పందం లేదని నిరూపణ అయిపోయింది గనుక ఇక సాక్షుల విచారణ అవసరం లేదు అనే నిర్ధారణకు వచ్చేశారు. ఆయన అప్పుడే జడ్జిగా నియమితులయ్యారు. మరొక జడ్జి జస్టిస్ రామచంద్రరాజు మాత్రం పదమూడు, పద్నాలుగా మంది నిందితులు

నేరం చేశారని నిర్ధారించి శిక్షలు విధించారు. అంటే ఇద్దరు న్యాయమూర్తులు ఒకరితో మరొకరు విభేదించారు. అప్పుడిక ఆ కేసు మూడో జడ్జి పరిశీలనకు వెళ్లింది. ఆ మూడో జడ్జి జస్టిస్ ముక్తధర్.

సరిగ్గా అప్పుడే లాకప్‌లో అహ్మద్ హుస్సేన్ హత్య, రమీజాబీ రేప్, వాటి మీద ఆందోళన చెలరేగడం జరిగాయి. దాని మీద జస్టిస్ ముక్తధర్ న్యాయవిచారణ కూడా జరిగింది. ఆ న్యాయవిచారణలో సిపిఐ(ఎం), సిపిఐ(ఎంఎల్) చురుగ్గా పాల్గొన్నాయి. ఆ విచారణ చాలా విస్తృతంగా జరిగింది. ఆ విచారణ క్రమంలోనే పోలీసులు ఎంత అక్రమంగా, చట్టవ్యతిరేకంగా ప్రవర్తిస్తారో జస్టిస్ ముక్తధర్‌కు చాలా బాగా అర్థమయింది.

అంటే ఆ అనుభవంతో, ఆ అవగాహనతో ఆయన పార్వతీపురం కుట్రకేసు విచారణకు వచ్చాడు. ఆయన మా వాదనలన్నీ విన్నాడు. ఆయన ఒక్కడే అయినప్పటికీ, ఆయన ఇవ్వబోయే తీర్పు అంతిమం. ఇక అక్కడ మెజారిటీ, మైనారిటీ అనే మాట లేదు. ఆయన ఆ కుట్ర కేసులోని నిందితులందరినీ వదిలి పెట్టాలని తీర్పు ఇచ్చాడు. కుట్ర జరిగిందని ప్రాసిక్యూషన్ నిరూపించలేక పోయిందని తీర్పు ఇచ్చాడు. తీర్పు ప్రకటించిన తర్వాత, "కన్నబీ, ఆ రమీజాబీ విచారణలో నాతో ఒక సుదీర్ఘ నివేదిక రాయించారు. ఇప్పుడు ఈ కేసులో మరొక సుదీర్ఘమైన ఎందు వందల పేజీలపైన తీర్పు రాయించారు" అన్నాడు.

పార్వతీపురం కుట్రకేసులో నేరాలు చేయడానికి, హత్యలు, దొమ్మీలుచేయడానికి, రాజ్యం మీద యుద్ధం చేయడానికి కుట్ర చేశారనేది, యుద్ధం చేసే ఉద్దేశ్యాన్ని దాచి ఉంచారనేది, రహస్యంగా సంచరించారనేది అభియోగాలు. ఈ నేరారోపణలన్నిటికీ భారత శిక్షాస్మృతిలోని 120 బి, 121 ఎ, 122, 123, 124 ఎ దాకా వర్తిస్తాయి.

వాటిలో దాచి ఉంచడం, రహస్యంగా సంచరించడం అనే అభియోగాలను ప్రాసిక్యూషన్ ఎంత హాస్యాస్పదంగా వాదించిందంటే, నిందితులు తమ పత్రాలలో, ఉత్తరాలలో వివిఎస్ (వెంపటాపు సత్యనారాయణ), సిటిఆర్ (చౌదరి తేజేశ్వరరావు), పికె (పంచాది కృష్ణమూర్తి), కెఎస్ (కొండపల్లి సీతారామయ్య) అని పొడి పేర్లు వాడడం రహస్యంగా ఉండడానికే అని ప్రాసిక్యూషన్ వాదించింది.

"న్యాయమూర్తిగారూ, మీ చప్రాసీలు మిమ్మల్ని మీ పొడిపేర్లతోనే పిలుస్తారు. మా గురించి మీకు చెప్పేటప్పుడుగాని, మీ గురించి మాకు చెప్పేటప్పుడుగాని పొడిపేర్లు ఉపయోగిస్తారు. మేము కూడా మిమ్మల్ని పొడిపేర్లతోనే సంబోధిస్తాము. ఇదేమీ రహస్యంగా ఉంచాలని కాదుగదా" అని నేనడిగాను. జస్టిస్ ముక్తధర్ అంగీకరించారు.

అయితే ప్రాసిక్యూషన్ ఎంత సమర్థంగా వాదించినా కుట్ర కేసులో ఒక ముఖ్యమైన సమస్యఉంది. ఏమంటే, ఒక కుట్రకేసులో ఎంత మందినంటే అంత మందిని ఇరికించడం చాలా సులభం. కాని వారి ఒప్పుదల వాంగ్మూలాలు లేకుండా వారి కుట్రలో

భాగస్వాములయ్యారని చెప్పడం చాలా కష్టం. మరి ఆ ఒప్పుదల వాంగ్మూలాలేమో న్యాయస్థానంలో చెల్లవు. ఎందుకు చెల్లవు అంటే పోలీసు అధికారి ముందర ఇచ్చిన ఒప్పుదల వాంగ్మూలాలు కావడంవల్ల కాదు, ఆ ఒప్పుదలలు కుట్రంతా అయిపోయినాక చేసినవి గనుక చెల్లవు.

ఎప్పుడైనా న్యాయస్థానపు విచారణలో సాక్ష్యాధారాల పరిశీలన అంతా ఇండియన్ ఎవిడెన్స్ ఆక్ట్ ప్రకారం జరుగుతుంది. ఆ ఎవిడెన్స్ చట్టంలోని సెక్షన్ 10 ప్రకారం, ఒక కుట్ర జరిగిందని అనడానికి ముందర కుట్రదారుల మధ్య ఒక ఒప్పందం జరిగిందని నిరూపించాలి. చట్ట వ్యతిరేకత పని చేయడానికిగాని, చట్టబద్ధమైన పనినయినా చట్టవ్యతిరేకంగా చేయడానికిగాని ఒప్పందం జరిగిందని రుజువు చేయాలి. ఆ తర్వాత, అంటే ఒకసారి ఒప్పందం జరిగిన తర్వాత, ఆ కుట్రదారులలో ఏ ఒక్కరైనా చేసిన ఏ ఒక్క పనయినా వారందరికీ సమానంగా వర్తిస్తుంది. ఒప్పందం అనే దాన్ని పరిస్థితుల సాక్ష్యం ద్వారా కూడా రుజువు చేయవచ్చు.

కాని సెక్షన్ 10ని సక్రమంగా వినియోగించుకుని తాము చేసిన నేరారోపణలను రుజువు చేసే శక్తి సామర్థ్యాలు ప్రాసిక్యూషన్‌కు లేకుండాపోయాయి. ప్రధానమైన సమస్య ఏమంటే ఒకకుట్ర ఒప్పందం జరిగినప్పుడు గాని, చర్యలు జరిగినప్పుడుగాని సమకాలీన సాక్ష్యాధారాలు ఉండాలి. సంఘటన జరిగినప్పుడు బయటపడిన సాక్ష్యాధారాలు ఉండాలి. ఆ పని అంతా జరిగిపోయిన తర్వాత అందులో పాల్గొన్న వాళ్లయినా సరే చేసిన ఒప్పుకోలు ప్రకటనల ద్వారా వాటిని గుర్తించడానికి వీలు లేదు.

ప్రతి కుట్ర కేసులోనూ ఎన్నో ఒప్పుకోలు ప్రకటనలనూ, అప్రూవర్ ప్రకటనలనూ తయారు చేశారు. కాని వాటన్నిటినీ విచారణలో పక్కన పెట్టవలసిందే. ఒక వేళ ఈ రక్షణ, ఈ మినహాయింపు లేనట్టయితే ఎవరి మీదనయినా కుట్రకేసు బనాయించవచ్చు. ఎవరితోనైనా ఒప్పుదల ప్రకటన ఇప్పించవచ్చు.

రెండో ఆశ్చర్యకరమైన విషయమేమంటే, అసలు కుట్ర అనేదే భారత శిక్షాస్మృతి ప్రకారం నేరం అయినప్పుడు, మన రాష్ట్ర పోలీసులు వేర్వేరు ఇతరకేసులను కలిపి కుట్రకేసులు తయారు చేయడం మొదలు పెట్టారు. ఆ కేసులలో ప్రాసిక్యూషన్ సాగుతూనే ఉండింది. అక్కడి సాక్ష్యాధారాలనే మళ్లీ ఇక్కడ కుట్రకేసుల్లో చూపించారు.

పార్వతీపురం కుట్రకేసులో ఇంకొక తమాషా జరిగింది. విశాఖపట్నం జిల్లాలోనో ఎక్కడో నక్సలైట్లు ఒక వ్యక్తి గొంతుకోసి ఉట్టిలో పెట్టారు. అప్పుడు ఇటువంటి తప్పు పనులు కొన్నిచేశారు. దాన్ని నేను కాళికా పూజ అని పిలిచాను. ఆ కేసులో నాగభూషణం పట్నాయక్‌కు మరణశిక్ష వేశారు. ఆ మరణశిక్ష విధించిన సెషన్స్ జడ్జి కెవిఎల్ నరసింహారావు.అతను మున్సిఫ్ నుంచి జిల్లా జడ్జిగా పదోన్నతి పొందాడు. అప్పుడు నక్సలైట్లు బూర్జువా కోర్టులను తాము బహిష్కరిస్తున్నామని, తమ మీద కేసులను

వాదించుకోబోమని అనే వారు. అందువల్ల నాగభూషణం పట్నాయక్ తరఫున వాదనలు జరగలేదు. అంటే జడ్జి ఎక్స్ పార్టీ తీర్పుగా మరణశిక్ష వేశాడు. ఆ తీర్పు ప్రకటించదానికి ముందురోజే పోలీసులకు కబురు పంపారని కూడా నాకు తెలిసింది.

ఆ మరణశిక్షను చాలా రోజుల వరకూ అమలు చేయలేదు. అప్పుడు పట్నాయక్ చాలా జబ్బుపడి ఉన్నాడు. ఉరితీయాలంటే సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలి. పడిశం కూడా పట్టగూడదు. అంటే పూర్తి ఆరోగ్యంతో, కేవలం ఉరితాడువల్లనే ఖైదీ మరణించాడు అని అనిపించాలన్నమాట.

ఆ తర్వాత పార్వతీపురం కుట్రకేసు విచారణ వచ్చింది. ఇక్కడ మళ్లీ ఆ హత్యకేసు విచారణకు వచ్చింది. ఇక్కడ క్రాస్ ఎగ్జామినేషన్ జరిగింది. ఆ విచారణలో న్యాయమూర్తి నిర్ధారించినదేమంటే ఆ హత్యలో నాగభూషణం పట్నాయక్‌కు పాత్ర లేదని.

దాని మీద నేను ఒక దరఖాస్తు తయారు చేశాను. పార్వతీపురం కుట్రకేసు తీర్పు ఉటంకిస్తూ, ఈ మాదిరిగా నిర్దోషిగా ఒక న్యాయస్థానం నిర్ధారించినందువల్ల, నాగభూషణం పట్నాయక్ ఇంకా జైలులో మగ్గిపోతూ ఉండడం అధికరణ 12 ప్రకారం ఆయనకు ఉన్న జీవించేహక్కుకు ఉల్లంఘనే అని సుప్రీం కోర్టులో కేసు వేశాను. ఆ కేసు విఎం తార్కుండే, నేనూ వాదించాం.

అప్పుడు జస్టిస్ ముర్తుజా ఫజల్ అలీ, జస్టిస్ అమరేంద్రనాథ్ సేన్‌ల ముందుకు ఆ కేసు వచ్చింది. అమరేంద్రనాథ్ సేన్‌కు ఈ కేసులో చాలా ఆసక్తి కలిగింది. ఈ సమస్యను ఎట్లా పరిష్కరించగలం అని ఈ కేసును అనుమతించాలని అన్నాడు. రావ్ రామ్ అండ్ రెడ్డి అని ఒక న్యాయవాదుల బృందం ఉంది. దాని తరఫున రెడ్డి వచ్చి, "ఇది ఒక తుది తీర్పు వచ్చిన కేసు. ఇందులో అంతిమత్వాన్ని తిరగదోడడం మొదలుపెడితే ఇది పెద్ద గందరగోళానికి దారి తీస్తుంది. ఇక నుంచి అంతిమ తీర్పులను మార్చమని కోరుతూ ఈ కోర్టుకు జనం తండోపతండాలుగా వస్తారు" అని వాదించాడు.

దానితో ముర్తుజా ఫజల్ అలీ కేసును కొట్టివేస్తూ ఖైదీని పెరోల్ మీద విడుదల చేయవచ్చు అని రాశాడు.అది ఒక సులభమైన మార్గం అనుకున్నాడాయన.

ఆ కేసు సంగతి అట్లా ఉంచి, అసలు కుట్రకేసుల గురించి కొంచెం మాట్లాడాలి. నిజానికి నా న్యాయవాద జీవితంలో అత్యధిక భాగం కుట్రకేసుల చుట్టూనే తిరిగింది గనుక నేను కుట్ర కేసుల స్వభావం గురించీ, వాటిలోని వాదనల గురించి, విచారణా పద్ధతి గురించీ చాలా ఆలోచించాను. పార్వతీపురం కుట్రకేసు, సికింద్రాబాద్ కుట్రకేసు, రాంనగర్ కుట్రకేసు, బెంగళూరు కుట్రకేసుల సందర్భంగా నా వాదనలలో నా ఆలోచనలు వ్యక్తం చేసే అవకాశం వచ్చింది.

బెంగుళూరు కుట్రకేసులో నా వాదనలను లిఖితపూర్వకంగా కూడా సమర్పించాను. ముప్పై పేజీలకు పైగా సాగిన ఆ వాదనలు అన్నీ ఇక్కడ అప్రస్తుతంగానీ, కుట్రకేసులకు

సంబంధించి నేను లేవనెత్తిన అంశాలు ఇక్కడ మళ్లీ చెప్పాలి.

న్యాయస్థానం ముందు ఉంచిన సమాచారం వివిధ వ్యక్తుల మధ్య ఒక చట్టవ్యతిరేకమైన చర్య చేయడానికిగాని, చట్టబద్ధమైన చర్యను చట్టవ్యతిరేక పద్ధతులలోగాని చేయడానికి ఒక ఒప్పందం కుదిరిందని స్పష్టం చేయవలసి ఉంటుందని ఎవిడెన్స్ చట్టంలోని సెక్షన్ 10 చెబుతుంది. ఆ సెక్షన్ ప్రకారం ఇద్దరుగాని అంతకన్నా ఎక్కువ మందిగాని ఒక తప్పుడు పని చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నారని నమ్మడానికి సరైన ఆధారాలు ఉన్నప్పుడే అది కుట్రగా లెక్కించబడుతుంది. ఒక కుట్ర జరగడానికి ప్రారంభంలోగాని, అది జరుగుతున్నప్పుడు గాని కలిసి ఉన్న వారినే, ఆ సమయంలో అన్న మాటలే చేసిన పనులనే తగిన ఆధారాలతో కుట్రగా భావించడం జరుగుతుందిగాని, ఆ సంఘటనలన్నీ జరిగిపోయిన తర్వాత చేసిన పనులు, రాసిన రాతలు అందుకు సరిపోవు. సహ నిందితులు లేనప్పుడు జరిగిన పాత చర్యల గురించి ఒక నిందితుడు ఆ తర్వాత చేసే ప్రకటన సెక్షన్ 10 ప్రకారం చెల్లుబాటు కాదు.

సెక్షన్ 10లోని ఉమ్మడి ఉద్దేశ్యం అనే వ్యక్తీకరణకు అర్థం ఆ కుట్రకు సంబంధించిన పని, మాట, రాతలలో అందరు నిందితుల ఉమ్మడి ఉద్దేశ్యాన్ని సూచిస్తుంది. కుట్ర జరుగుతున్నప్పుడు అన్న మాటలు, చేసిన పనులు రాసిన రాతలు ఉమ్మడి ఉద్దేశ్యాన్ని నిస్సందేహంగా రుజువు చేయాలి. కాని ఆ ఉమ్మడి ఉద్దేశ్యం అయిపోయిన తర్వాతగాని, కుట్ర ముగిసిపోయిన తర్వాత గాని ఒక వ్యక్తి మరొక వ్యక్తి గురించి చేసిన ప్రకటన, చెప్పిన కథనం. ఒప్పుకోలును అవతలి వ్యక్తి మీద సాక్ష్యాధారంగా భావించడం అసంగతం. బెంగుళూరు కుట్రకేసులో నమోదు చేసిన ఒప్పుకోలు ప్రకటనలన్నీ గతంలో ఎప్పుడో నిందితులు చేసిన పనుల గురించి ఒప్పుకోలు ప్రకటనలే. అందువల్ల అవి కుట్ర సూచిస్తున్నాయని నమ్మకం పెట్టుకోవడానికి ఎంత మాత్రం వీలులేదు.

ఇక ఈ కేసులో కొంత మంది ఆయుధాల వ్యాపారులను కూడా నిందితులుగా చూపారు. వారు తమ దగ్గరికి ఎవరు వస్తే వారికి ఆయుధాలు అమ్మేవారే గాని ఆ కొనుగోలుదారుల రాజకీయ ఉద్దేశ్యాలు వారికి తెలియవు. వారిని కుట్రలో భాగస్వాములుగా చూపడమంటే, వారి ఒప్పందానికి ఉండే పరిమితులను వారు అర్థం చేసుకున్న దాని కన్నా చాలా దూరం సాగలాగడమే.

ఇట్లా సాగలాగితే ఏమవుతుందో ప్రఖ్యాత అమెరికన్ న్యాయమూర్తి బిల్లింగ్స్ లర్నెడ్ హాండ్ (1872-1961) చాలా బాగా వివరించాడు. దాన్ని ట్రాఫిక్ లైట్ ఉదాహరణ అంటారు. ఉదాహరణకు ఒక వ్యక్తి ట్రాఫిక్ లైట్‌ను ఉల్లంఘించిన నేరం చేశాడనుకోండి. కాని అతనికి అక్కడ ట్రాఫిక్ లైట్ ఉన్నదని తెలియదనుకోండి. అప్పుడతను ఆ లైట్‌ను ఉల్లంఘించడానికి కుట్ర చేశాడని అనడం సాధ్యంకాదు. ఎందుకంటే, అక్కడ ఒక లైట్ ఉన్నదనే తెలియని వాడు దాన్ని ఉల్లంఘించాలనే నిర్ణయం కూడా తీసుకోలేదు" అన్నాడు

లర్నెడ్ హాండ్.

బెంగుళూరు కుట్ర కేసులో ప్రాసిక్యూషన్ సమర్పించిన సాక్ష్యాధారాలు, ఒప్పుకోలు ప్రకటనలు అన్నీ కూడా ఆంధ్రప్రదేశ్‌కు బయట ఆయుధాలు, మందుగుండు కొనుగోలు చేసినట్టు చూపుతాయి. అలా కొన్నంత మాత్రాన అభియోగపత్రంలో పేర్కొన్న నేరాలన్నీ చేయడానికి కుట్ర జరిగి ఉంటుందనే నిర్ధారణకు రావడానికి వీలు లేదు. అంతేగాక ఆ ఒప్పుకోలు ప్రకటనలన్నీ ఆంధ్రప్రదేశ్‌కు వెలుపల జరిగిన సంఘటనలను గురించి మాత్రమే ప్రస్తావించాయి. కనుక ఏ కోణం నుంచి చూసినా ఆ అభియోగాలు విచారించే పరిధి ఆ న్యాయస్థానానికి లేదని నేను వాదించాను.

ఇక అసలు కుట్ర అనబడే దాని గురించి వాదిస్తూ 1949లో అమెరికన్ సుప్రీం కోర్టులో క్రూల్ విచ్ వర్సస్ యునైటెడ్ స్టేట్స్ అనే సుప్రసిద్ధ కేసులో ఇచ్చిన తీర్పును ఉటంకించాను. ఆ తీర్పులో న్యాయమూర్తులేమన్నారంటే, 'కుట్ర అనే ఆధునిక నేరం ఎంత అస్పష్టమైనదంటే, దానికి నిర్వచనం ఇవ్వడం అసాధ్యం, కొన్ని నిర్దిష్టమైన ప్రాథమిక, కీలక అంశాలు ఉన్నప్పటికీ, కుట్ర అనే దాన్ని ఏ ప్రత్యేక, స్వతంత్ర నేరాలతో కలిపి ఆరోపిస్తారో ఆ నేరాల రంగులు అద్దుకునే ఊసరవెల్లి తత్వం దానికి ఉంది. కుట్ర అనేది ఎల్లప్పుడూ ప్రధానంగా మానసిక స్థితివల్ల రూపొందేదే. ఎందువల్లనంటే అది ప్రాథమికంగా అభిప్రాయాల కలయిక వల్ల, ఉద్దేశ్యం వల్ల జరిగేదే.

అమెరికన్ రాజ్యాంగానికి జరిగిన ఆరవ సవరణ ప్రకారం నేరం ఏ రాష్ట్రంలో, ఏ జిల్లాలో జరిగిందో ఆ రాష్ట్రంలో, ఆ జిల్లాలో నిష్పాక్షికమైన న్యాయమూర్తుల చేత విచారణ జరగాలని కోరే హక్కు' ఒక నిందితుడికి ఉంటుంది. కాని ప్రాసిక్యూషన్ మీద ఉన్న ఈ పరిమితి కుట్ర అనే నేరారోపణ అభూత కల్పనగా మార్చివేస్తుంది. ఎందుకంటే కుట్ర అనే దానికి ఎంత విశాలమైన అర్థం ఉటుందంటే, దాని లక్ష్యాన్ని నెరవేర్చడం కోసం కుట్రదారులలో ఏ ఒక్కరైనా, ఏ జిల్లాలోనైనా, ఏ ఒక్క చర్యనైనా ఎంత అమాయకంగా చేసినా ఆ నేరం ఆరోపించవచ్చు. ఒక సహ కుట్రదారుడు ఏదో ఒక చిన్న పనిని, అమాయకంగానే అయినా ఏదో సుదూర జిల్లాలో చేసినప్పటికీ, తాను ఎన్నడూ ఆ ప్రాంతానికి వెళ్లకపోయినా, ఇప్పుడు మాత్రం అంత దూరం వెళ్లి తనను తాను సమర్థించుకునే వాదనలు వినిపించుకోవాలని ఒక నిందితుడిని ప్రభుత్వం నిర్బంధపెట్టవచ్చు. పెడుతోంది కూడా...

విచారణ మొదలయిన తర్వాతనే నిందితుడికి కుట్ర వ్యూహపు పూర్తి ప్రభావం తెలిసి వస్తుంది. కచ్చితంగా చెప్పాలంటే, ప్రాసిక్యూషన్ ఎప్పుడైనా మొట్టమొదట కుట్ర జరిగిందని రుజువు చేయాలి. కుట్రదారులను గుర్తించాలి. దాని తర్వాతనే ఆ కుట్ర అమలయ్యే క్రమంలో ఒక్కొక్క నిందితుడి చర్యల గురించి ప్రకటనల గురించి సాక్ష్యాధారాలు సమర్పించాలి. ఒకరి మీద సాక్ష్యాధారాలు అందరికీ వర్తిస్తాయని రుజువు

చేయాలి. అయితే ఇంత విశాలమైన నేరారోపణలో ఈ సాక్ష్యాధారాల వరుస క్రమాన్ని కచ్చితంగా పాటించేలా చూడడం న్యాయమూర్తికి కష్టవుతుంది. వాస్తవంగా ఏమి జరుగుతుందంటే, ఒక నిందితుడి ముందర ఇతరులు చేసిన చర్యలు, ప్రకటనల కలగాపులగపు ముద్దను పెడతారు. వాటిలో ఏ చర్యలనూ, ప్రకటనలనూ తాను అంగీకరించాడో, ఉద్దేశించాడో, అసలు తనకు తెలుసునో లేదో తెలియదు. కాని ఆ సాక్ష్యాధారాలపైన ఆధారపడి న్యాయమూర్తులు ఒక కుట్ర జరిగిందని నమ్మవలసి వస్తుంది. దీన్నంతా మరొక మాటల్లో చెప్పాలంటే, సాధారణంగా ఒక కుట్రను రుజువు చేయదానికి ఉపయోగించి సాక్ష్యాధారాలు, కుట్ర జరిగిందనే నమ్మకం మీద సేకరించినవే అయి ఉంటాయి. అంటే, కుట్ర జరిగిందని రుజువు చేయక ముందే కుట్ర జరిగిందని నమ్మడం జరుగుతుందన్నమాట. ఇటువంటి కేసులో జాగ్రత్తగా వ్యవహరించమని న్యాయమూర్తులకు సూచనలు ఇవ్వడం ద్వారా కుట్ర కేసుల విచారణలో ఈ దుష్ఫలితాల నుంచి బయటపడవచ్చునని అమాయకమైన నమ్మకం ఒకటి ఉంది గాని అది నికార్సైన కల్పన అని న్యాయవాదులందరికీ తెలుసు. కుట్ర అనే నేరారోపణను విచారించడం ప్రాసిక్యూషన్‌కు చాలా శ్రమతో కూడుకున్నదనేది నిజమే. కాని నిందితుడికి అది ఇంకా సంక్లిష్టమైన భారం. సాక్ష్యాలకు సంబంధించిన నిబంధనలను అలవోకగా అన్వయించడంవల్ల వచ్చే ఇబ్బంది ప్రభుత్వం కుప్పలుతెప్పలుగా విచారణలు జరిపించడంవల్ల మరింత పెరుగుతుంది.

ఒక కుట్ర విచారణలో సహ నిందితుడ్ని పాత్ర చాలా అసౌకర్యాపూరితమైనది. ఎవరో ఒకరు తప్పులు చేశారనే దానికి సాధారణంగా ఆధారం ఉండనే ఉంటుంది. అప్పుడు తాను ఏ తప్పు చేయలేదని న్యాయమూర్తులను ఒప్పించడం ఒక నిందితుడికి అసాధ్యమవుతుంది. ఆ న్యాయమూర్తుల మనసులో సహ నిందితులందరూ ఒకే గూటి పక్షులనీ కనుక ఒకరు తప్పు చేయలేదన్నా నమ్మలేమని అనుకునే పరిస్థితి ఉంటుంది. ఒక నిందితుడు మౌనంగా ఉండిపోతే తన నేరాన్ని ఒప్పుకున్నట్టే, లేదా చాలా సందర్భాలలో జరిగినట్టుగా ఒక నిందితుడు మరొక నిందితుడి మీద అభియోగాలు మోపేట్టుగా చేస్తారు. లేదా అవతలి వారి ఆరోపణలను ఖండించేట్టుగా చేస్తారు. తద్వారా వారు ఒకరు నేరం చేశారని మరొకరు చెప్పినట్టవుతుంది.

క్రూల్ విచ్ కేసులోని ఈ తీర్పు భాగాలను నేను నా వాదనలకు మద్దతుగా వాడుకున్నాను. అభియోగాలు నిర్ధారించడానికి ముందు ఒకసారి, వాద ప్రతివాదాలలో భాగంగా ఒకసారి నేను లిఖితపూర్వక వాదనలు సమర్పించాను. మొదటిసారి వాదనలను గురించి ఇది వరకే చెప్పాను గదా, రెండోసారి నా జూనియర్ ఆర్. మహదేవన్‌తో కలిసి 1999లో సమర్పించిన లిఖిత వాదనలు 64 పేజీలు.

ఈ సందర్భంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పోలీసులు ఈ కుట్ర కేసులను ఏ

విధంగా ఒక పద్ధతి ప్రకారం పెడుతున్నారో మరొకసారి వివరించాను. ఆ కుట్ర కేసులన్నీ ఆంధ్రప్రదేశ్‌లో మార్క్సిస్టు, లెనినిస్టు ఉద్యమం ప్రారంభమైనప్పటి నుంచీ దానికి సమాంతరంగా నడుస్తూ ఉన్నాయి. జగలం వెంగళరావు రాష్ట్ర హోం మంత్రిగా ఉండినప్పుడు ప్రారంభమైన ఈ కుట్ర కేసుల సంప్రదాయం అప్పటికీ కొనసాగుతున్నదని 1999లో చెప్పాను. ఆ తర్వాత పెద్ద ఎత్తున కుట్ర కేసులు పెట్టలేదుగాని, వేర్వేరు కేసులలో కుట్ర ఒక ప్రధాన నేరారోపణగా ఉంటూనే ఉంది.

వెంగళరావు కాలంలో 1969 నుంచి 1975 మధ్యరాష్ట్రంలో 22 కుట్ర కేసులు నమోదయ్యాయి. దాదాపు అన్ని కేసులలోనూ ప్రాసిక్యూషన్ విఫలమైంది. నిందితులను న్యాయస్థానాలు నిర్దోషులుగా విడిచిపెట్టాయి. అయినా 1975 తర్వాత కూడా పోలీసులు కుట్ర కేసులు పెడుతూనే వచ్చారు. కుట్ర కేసుల పద్ధతి విఫలమైనప్పటికీ ప్రభుత్వం ఆ పద్ధతిని వదిలిపెట్టలేదు.

గుంటూరు జిల్లా నరసరావుపేట తాలూకా గుత్తికొండ బిలంలో 1969 ఫిబ్రవరి 28 నుంచి మార్చి 2 వరకు జరిగిన ఒక రహస్య సమావేశంలో కుట్ర జరిగిందని, ఆ కుట్ర ఫలితంగా 1969, 1970లలో అనేక నేరాలు జరిగాయని, ఆ నేరాలన్నింటినీ కలిపి పార్వతీపురం కుట్ర కేసు (క్రైం.నెం.3/1970, పార్వతీపురం తాలూకా పోలీసుస్టేషన్, శ్రీకాకుళం జిల్లా) పెట్టారు. అది మొదట విశాఖపట్నం రెండవ అదనపు సెషన్స్ జడ్జి ముందు విచారణకు వచ్చింది. ఆ విచారణలో 503 మంది సాక్షులను విచారించారు. 1144 ఆధారాలను పరిశీలించారు. బరిసెలు, కత్తులు, బాణాలు, తుపాకులు వంటి 127 వస్తువులను పరీక్షించారు. తొలుత అభియోగ పత్రంలో 250 మంది నిందితుల పేర్లు ఉన్నప్పటికీ, వారిలో 100 మందికి పైగా బూటకపు ఎన్‌కౌంటర్లలో చంపేశారు. చివరికి 75 మంది మీద విచారణ జరగగా, వారిలో 15 మందిని మాత్రం సెషన్స్ కోర్టు నేరస్తులుగా భావించి శిక్షలు వేసింది. ఆ తీర్పు మీద అప్పీలుకు వెళ్లగా, హైకోర్టు వారిని కూడా నిర్దోషులుగా విడిచిపెట్టింది. ఆ కేసు అధికారికంగా 1970 అక్టోబర్ 12న మొదలై,తొలి తీర్పు 1976 ఆగస్టు 30న రాగా, హైకోర్టు తీర్పు 1978లో వచ్చింది.

పార్వతీపురం కుట్ర కేసులో నిందితులలో వెంపటాపు సత్యనారాయణ, ఆదిభట్ల కైలాసం, నాగభూషణం పట్నాయక్, సుబ్బారావు పాణిగ్రాహి, చౌదరి తేజేశ్వరరావు, పంచాది కృష్ణమూర్తి, పంచాది నిర్మల మొదలైన వారందరూ ఉన్నారు.

దానితో సమాంతరంగా నడిచినది హైదరాబాద్ కుట్ర కేసుగానూ, నాగిరెడ్డి కుట్రకేసుగానూ సుప్రసిద్ధమైన కేసు. కృష్ణా జిల్లా తిరువూరు తాలూకా అట్లప్రగడ గ్రామంలోని నిమ్మతోటలో 1969 ఏప్రిల్ 10-12 మధ్య ఒక రహస్య సమావేశం జరిగిందనీ, ఆ సమావేశ నిర్ణయాల ప్రకారం రాష్ట్రంలో అనేక చోట్ల నేరాలు జరిగాయనీ ఈ కుట్ర కేసు

పెట్టారు. ఆ కేసులో నిందితులు తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, చల్లపల్లి శ్రీనివాసరావు, నెక్కలపూడి రామారావు, మాదాల నారాయణస్వామి వనంతాడ రామలింగాచారి, మొగిలి సోమాచారి, ఎన్.వి.కృష్ణయ్య, వై.కాశీపతి, బంద్రు నరసింహులు తదితరులు. ఆ కేసులో మొత్తం నిందితులు 47 మంది సాక్షులు 324 మంది, పరిశీలించిన ఆధారాలు వెయ్యిపైన, ఆ కేసు కూడా మూడు నాలుగు సంవత్సరాలు నడిచింది. సెషన్స్ కోర్టు కొంత మందికి శిక్షలు విధించినప్పటికీ హైకోర్టు అందరినీ నిర్దోషులుగా విడుదల చేసింది. ఇంతకీ ఆ కేసులో ప్రాసిక్యూషన్ నిరూపించగలిగినదల్లా నిందితులు అనుమతిలేని ప్రదేశంలోకి జొరబడడానికి కుట్ర చేశారని మాత్రమే.

ఇక సుప్రసిద్ధమైన సికింద్రాబాద్ కుట్ర కేసు ఉంది. క్రైం.నెం. 10/75గా నమోదయైన ఈ కేసులో ప్రాథమిక సమాచార నివేదిక మే 1974లో దాఖలైంది. పార్వతీపురం కుట్ర కేసులో ఫిర్యాదీ, పరిశోధనాధికారి ఒకరే (వీరనారాయణరెడ్డి) ఉన్నట్టుగానే, ఈ కేసులో కూడా ఆల్ఫ్రెడ్ అనే పోలీసు అధికారి ఫిర్యాది గానూ, పరిశోధనాధికారిగానూ ఉన్నాడు. వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన బహిరంగ సభలు, సమావేశాలు, వాటికి ముందు వెనుకలుగా జరిగిన నేరాలను కలిపి ఈ కుట్ర కేసు తయారు చేశారు. కొండపల్లి సీతారామయ్య, కె.జి. సత్యమూర్తి, ఇంగువ మల్లిఖార్జున శర్మ, బర్ల యాదగిరిరాజు, మందడి రవీంద్రరెడ్డి వంటి వారితోపాటు కె.వి. రమణారెడ్డి, త్రిపురనేని మధుసూదనరావు, చెరబండ రాజు, పి. వరవరరావు, ఎం.టి.ఖాన్, ఎం. రంగనాథంలను ఈ కేసులో మొదటిసారిగా విప్లవ రచయితలను కూడా, విప్లవ కార్యకర్తలతో కలిపి నిందితులుగా చూపారు. ఆ కేసులో సెషన్స్ కోర్టు నిందితులందరినీ నిర్దోషులుగా విడిచిపెడుతూ 1989ఫిబ్రవరి 27న తీర్పు చెప్పింది. దానితోపాటుగానే విప్లవ కార్యకర్తలను, విప్లవ రచయితలను కలిపి చిత్తూరు కుట్రకేసు నమోదు చేశారు. దానిలో కూడా నిందితులందరినీ న్యాయస్థానం నిర్దోషులుగా విడుదల చేసింది.

ఆ తర్వాత సికింద్రాబాద్ కుట్ర కేసు నాటి నుంచీ 1986 వరకూ జరిగిన నేరాలన్నిటినీ కలిపి రాంనగర్‌లో ఒక ఇంటిపై దాడి చేసి నల్లా ఆదిరెడ్డి తదితరులను అరెస్టు చేసి, ఆ ఇంట్లో దొరికాయని చెప్పబడుతున్న ఆయుధాలు, మందుగుండు సామాగ్రి, పేలుడు పదార్థాలు, విప్లవ సాహిత్యం పత్రాల ఆధారంగా అంతకు ముందు జరిగిన నేరాలన్నింటినీ కలిపి ఈ కుట్ర కేసు తయారు చేశారు. క్రైం.నెం.92/86 అనే ఈ కేసును హైదరాబాద్ సిటీ క్రైం స్టేషన్ పోలీసులు నమోదు చేశారు. కొండపల్లి సీతారామయ్య, కె.జి. సత్యమూర్తి,ముక్కు సుబ్బారెడ్డి, నల్లా ఆదిరెడ్డి, పులి అంజయ్య, మల్లోజుల కోటేశ్వరరావు వంటి విప్లవ నాయకులతోపాటు వరవరరావు, ఎన్. సుధాకర్, గద్దర్, కె.వి. రమణారెడ్డి వంటి ప్రజాసంఘాల నాయకులను కూడా ఈ కేసులో నిందితులుగా మొదట ఎఫ్ఐఆర్‌లో చూపారు. ఆ తర్వాత 30 మంది మీద దాఖలైన

ఛార్జిషీటులో విప్లవ నాయకులతోపాటు వరవరరావు, గద్దర్, సుధాకర్‌ల పేర్లు మాత్రమే చేర్చారు. ఆ తర్వాత కొందరు సరెండరైన నాయకుల మీద కేసు ఉపసంహరించుకున్నారు. సీతారామయ్య ఆరోగ్య పరిస్థితి వల్ల ఆయన మీద కూడా కేసు ఉపసంహరించుకున్నారు. చివరికి, విప్ల నాయకులలో కొందరు ఎన్‌కౌంటర్లలో చనిపోవడం, కొందరు అజ్ఞాతంలో ఉండడంవల్ల వరవరరావు, సుధాకర్‌ల మీద మాత్రం విచారణ జరిగి వారిద్దరినీ న్యాయస్థానం నిర్దోషులుగా విడిచిపెట్టింది. 1986లో ప్రారంభమైన ఈ కేసులో ఆ ఇద్దరి మీద 18 సంవత్సరాల తర్వాత 2003 సెప్టెంబర్ 29న తీర్పు వెలువడింది. ముప్పై మంది మీద పెట్టిన ఈ కేసులో 11 మందిని ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్లలో చంపి వేసింది. పదకొండు మంది మీద కేసును ఉపసంహరించుకుంది. చార్జిషీట్‌లో 253 మంది సాక్షుల పేర్లు ఉన్నప్పటికీ కేవలం 13 మంది సాక్షులను విచారించారు. చార్జిషీట్‌లో 300 ఆయుధాలు దొరికాయని చెప్పినప్పటికీ ఒక్క ఆయుధాన్ని కూడా న్యాయస్థానం ముందు ప్రదర్శించలేదు.

ఇక నేను ప్రస్తుతం వివరిస్తున్న బెంగుళూరు కుట్ర కేసు మరింత విచిత్రమైనది. కర్ణాటకలోని శ్రావణ బెలగొళలో 1991లో కొందరు నక్సలైటు నాయకులు సమావేశమయ్యారనీ, దాని ఫలితంగా కొన్ని నేరాలు జరిగాయనీ ఆ కేసు చెబుతుంది. బెంగుళూరులో నక్సలైటు నాయకుడు పటేల్ సుధాకర్‌రెడ్డి అరెస్టు కావడంతో, ఆయన ఇంట్లో పెద్ద ఎత్తున ఆయుధాలు, మందుగుండు సామాగ్రి దొరకడంతో 1992 ఏప్రిల్ 6న ఈ కేసు ప్రారంభమైంది.

బెంగుళూరు కుట్ర కేసులో ఒక విచిత్రం జరిగింది. ఇళ్ల మీద దాడులు, సోదాలు, అరెస్టులు, ఆయుధాల, మందుగుండు, విప్లవ సాహిత్యం స్వాధీనం మొదట బెంగుళూరులో ఏప్రిల్ 6న జరిగాయి. ఆ తర్వాత చిత్రదుర్గ, బళ్లారి, కోలార్, గోవాలలో జరిగాయి గానీ ఈ పనులన్నీ చేసినవాళ్లు ఆంధ్రప్రదేశ్ పోలీసులు. వాళ్లకు బెంగుళూరులో కేసు నమోదు చేసే అధికారం లేదు. అది వాళ్ల అధికార పరిధిలోకి రాదు. అందుకని వాళ్లు తప్పుడు పద్ధతిలో హైదరాబాద్‌లో ఒక అరెస్టు చూపించి మొత్తం కేసును తమ పరిధిలోకి తీసుకోదలచుకున్నారు. ఇటువంటి అబద్ధాల మీద, తప్పుడు ఆరోపణల మీద కేసులు బనాయించడం పోలీసులకు బాగా అలవాటు.

అందువల్ల దాదాపు రెండు వారాల తర్వాత ఏప్రిల్ 20న సికింద్రాబాద్‌లోని జూబిలీ బస్‌స్టేషన్‌లో గొర్ల కుమారస్వామి అనే వ్యక్తిని అరెస్టు చేసినట్టు, ఆయన దగ్గర ఒక డబుల్ బారెల్ తుపాకి, 25 తూటాలు దొరికినట్టు ఒక కట్టు కథ అల్లారు. ఆ తర్వాత సమాచారం ప్రకారం ఇతర చోట్ల దాడులు జరిపినట్టు కథ అల్లి హైదరాబాద్ స్పెషల్ ఇంటిలిజెన్స్ బ్రాంచ్‌లోని ఇన్వెస్టిగేషన్ సెల్ పోలీసుస్టేషన్‌లో క్రైం.నెం. 1/1992గా ఆ కేసు నమోదు చేశారు.

ఏప్రిల్ 1992 నుంచి మార్చ్ 1993 మధ్య అరెస్టు చేసిన 24 మంది విప్లవ కార్యకర్తలను, సానుభూతిపరులను, చివరికి ఆయుధ వ్యాపారులను కలిపి ఈ కేసులో నిందితులుగా చూపారు. నేర స్వభావం గల కుట్ర (భారత శిక్షాస్మృతి సెక్షన్ 120 బి), ప్రభుత్వానికి వ్యతిరేకంగా యుద్ధం చేయడం (121), ఆ యుద్ధం కొరకు ఆయుధాలు సేకరించడం (122), ఆ యుద్ధం కొరకు రహస్యంగా ఉండడం (123) రాజద్రోహం (124ఎ), 1987 తీవ్రవాద కార్యకలాపాల (నిరోధక) చట్టం (టాడా)లోని సెక్షన్లు 3(1)(3), 4,5,6 ఆయుధాల చట్టంలోని సెక్షన్లు 25, 27 వంట నేరాలెన్నో మోపారు. ఇంటిలిజెన్స్ విభాగంలోని స్పెషల్ ఆపరేషన్ సెల్‌లో అదనపు సూపరింటెండెంట్‌గా పని చేస్తుండిన ఎం. వెంకటరెడ్డి నేతృత్వంలోని పరిశోధక విభాగం, ఆయనే సొంతంగా చేసిన ఫిర్యాదు మీద పరిశోధన జరిపి 1993 ఏప్రిల్ 19న 47 మంది నిందితుల మీద మొదటి చార్జిషీటు పెట్టింది. ఈ కేసులో టాడా నేరాలు కూడా ఉన్నాయి గనుక, టాడా ప్రకారం ఒక ప్రత్యేక న్యాయస్థానం ఈ విచారణను చేపట్టింది.

ఆ తర్వాత మరికొంత పరిశోధన జరిపామని చెప్పి 1994 ఏప్రిల్ 12న చివరి చార్జిషీటు సమర్పించినప్పుడు దానిలో మొత్తం 63 మంది నిందితులను చూపారు. ఈ కేసులో మొత్తం 236 మంది సాక్షులను చూపినప్పటికీ ప్రాసిక్యూషన్ 104 మంది సాక్షులను మాత్రమే న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టింది. అభియోగాలకు ఆధారాలుగా 611 వస్తువులను చూపారు.

అయితే వేర్వేరు చోట్ల పోలీసులు ఆయుధాలు, మందుగుండు స్వాధీనం చేసుకున్నప్పుడు సాక్షులుగా ఉన్నామని చెప్పిన పంచ్‌లను న్యాయస్థానం నమ్మలేదు. ఆ పంచ్‌లతో పంచనామా రాయించేటపుడు, సాక్షి సంతకాలు పెట్టించేటప్పుడు, పరిశోధనాధికారి వెంకటరెడ్డి చట్టపరమైన నిబంధనలు పాటించలేదని, భారత నేర శిక్షాస్మృతి, ఆయుధాల చట్టం, తీవ్రవాద కార్యకలాపాల చట్టాలను ఉల్లంఘించారని న్యాయస్థానం అభిప్రాయపడింది.

న్యాయస్థానం విచారించిన ఆయుధ వ్యాపారులందరూ కూడా ఇతర నిందితులతో తాము జరిపిన చట్టబద్ధమైన లావాదేవీల గురించే మాట్లాడారు గాని, ఆయుధాల చట్టాన్నో, తీవ్రవాద కార్యకలాపాల (నిరోధ) చట్టాన్నో ఉల్లంఘించామని ఒప్పుకోలేదు. వారందరూ లైసెన్స్ పొందిన ఆయుధ వ్యాపారులే. వారిని నిందితులుగా చూపిన ప్రాసిక్యూషన్ వారు నేరం చేశారని రుజువు చేయడంలో దారుణంగా విఫలమైంది. అట్లాగే లైసెన్సు లేకుండా తుపాకుల వ్యాపారం చేసే వారిని, మధ్య దళారీలను, బ్రోకర్లను నిందితులుగా చూపిన ప్రాసిక్యూషన్ వారి మీద నేరాలను రుజువు చేయడానికి సరిపోయే ఒక్క విశ్వసనీయమైన సాక్ష్యాధారాన్ని కూడా న్యాయస్థానం ముందు ఉంచలేకపోయింది. దానితోపాటు జరగడంతో విచారిస్తున్న న్యాయస్థానపు అధికార పరిధి సమస్యలు కూడా

వచ్చాయి.

ఇక ఆ కేసులో ప్రధాన ముద్దాయిలైన నక్సలైట్ల విషయానికి వస్తే, అసలు స్పెషల్ పబ్లిక ప్రాసిక్యూటర్ ఎం. రామకిషన్‌రావు వాదనలు ప్రారంభిస్తున్నప్పుడే, ప్రథమ స్థాయి ముద్దాయిలుగా చూపిన నక్సలైటు నాయకులు పటేల్ సుధాకర్‌రెడ్డి, శాఖమూరి అప్పారావు, మోడెం బాలకృష్ణ తదితరుల మీద కుట్ర అభియోగాన్ని రుజువు చేయడానికి తమ దగ్గర సాక్ష్యాధారాలు లేవని అన్నాడు. స్వాధీనం చేసుకున్నామని చెపుతున్న ఆయుధాలు మందుగుండు సామాగ్రి ఆంధ్రప్రదేశ్‌కు బయట స్వాధీనం అయిందని చెప్పడంవల్ల తనకు అధికార పరిధి లేకపోవడం వల్ల ప్రత్యేక న్యాయస్థానం ఆ స్వాధీనాలను నమ్మలేదు.

ప్రాసిక్యూషన్ అసమర్థత ఎంతగా ఉండిందంటే, నిందితులను నిర్బంధంలోకి తీసుకోవడానికి వెళ్లినప్పుడు, ఆయుధాలు మందుగుండు స్వాధీనం చేసుకున్నప్పుడు వెంకటరెడ్డితోపాటు వెళ్లిన, సహకరించిన స్పెషల్ ఇంటిలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబి) సిబ్బంది ఎవరో ప్రాసిక్యూషన్ చెప్పలేకపోయింది. వారిని న్యాయస్థానం ముందు హాజరు పరచలేకపోయింది. అంతేకాదు, వెంకటరెడ్డి ఆ సోదాలు, జప్తులు చేసినప్పుడు ఆ ప్రాంతం ఎవరి అధికార పరిధి కిందకి వస్తుందో ఆ కర్ణాటక పోలీసు అధికారులు ఆయన వెంట ఉన్నారో లేరో ప్రాసిక్యూషన్ చెప్పలేకపోయింది. వారిలో ఎవరినీ హాజరు పరచలేకపోయింది. తాను ఆయుధాల జప్తు చేసినట్టుగా చెబుతున్న బెంగుళూరు, బళ్లారి, చిత్రదుర్గ,కోలార్, గోవా తదితర ప్రాంతాలు టాడా చట్టంలోని సెక్షన్ 5 ప్రకారం ప్రకటిత ప్రాంతాలు అవునోకాదో కూడా వెంకటరెడ్డి చెప్పలేకపోయాడు. భారత నేర శిక్షాస్మృతి సెక్షన్ 197 ప్రకారం పరిశోధనాధికారి ఆయా రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రాసిక్యూషన్‌కు అనుమతిస్తూ ఉత్తర్వులు తీసుకోవలసి ఉండగా, వెంకటరెడ్డి గోవా, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోలేదు.

బెంగళూరు, చిత్రదుర్గ, బళ్లారి వంటి అనేక చోట్ల స్వాధీనం చేసుకున్న ఆయుధాలను, మందుగుండు సామగ్రిని, ఆ జప్తులు ఎవరి అధికార పరిధి కిందకి వస్తాయో ఆ సంబంధిత వెంకటరెడ్డి ఒప్పుకున్నాడు. అంతేకాదు, నిందితులను అదుపులోకి తీసుకున్న తర్వాత మెజిస్ట్రేట్ల దగ్గర హాజరు పరిచినప్పుడు, వారి దగ్గర జప్తు చేసిన వస్తువులన్నింటినీ ఆ మెజిస్ట్రేట్ల దగ్గర సమర్పించలేదని కూడా ఆయన చెప్పాడు. అసలు నిందితులను నిర్బంధించిన తర్వాత ఏ స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేటు దగ్గర హాజరుపరిచాడో, ఆ మెజిస్ట్రేటు పేరు ఏమిటో, ఏ ఊళ్లో హాజరుపరిచాడో కూడా వెంకటరెడ్డి న్యాయస్థానం ముందుంచిన పత్రాలలోనూ చెప్పలేదు. విచారణ క్రమంలో ప్రశ్నించినప్పుడు కూడా చెప్పలేకపోయాడు.

చిట్టచివరికి చివరి చార్జిషీటు సమర్పించినప్పుడయినా, తాను జప్తు చేసిన

వస్తువులన్నింటినీ ప్రత్యేక న్యాయస్థానానికి సమర్పించలేదు. పోనీ, ఆ వస్తువులను తనతోనే ఉంచుకోవడానికి న్యాయస్థానం నుంచి లిఖిత పూర్వక అనుమతినైనా పొందలేదు.

ఒక్కమాటలో చెప్పాలంటే ఇంత భారీగా తయారు చేసిన ఈ కుట్ర కేసులో పోలీసులు, ప్రాసిక్యూషన్ ఎంత మాత్రం చట్టబద్ధంగా వ్యవహరించలేదన్నమాట. వారు చట్టాన్ని ఎన్నో రకాలుగా ఉల్లంఘించారన్నమాట.

1969 నుంచీ ఈ మాదిరిగా నక్సలైట్లు జరిపిన సమావేశాలను ఆధారంగా చేసుకుని వారి మీద కుట్ర కేసులు పెట్టడం ఆనవాయితీయేనని న్యాయస్థానంలో విచారణ జరుగుతున్నప్పుడు ఒక ప్రశ్నకు జవాబుగా వెంకటరెడ్డి చెప్పాడు. ముప్పాళ లక్ష్మణరావు (గణపతి), నల్లా ఆదిరెడ్డి (శ్యాం), ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డి (మహేష్)లతో సహా ఈ బెంగళూరు కుట్ర కేసులో నిందితులందరూ అంతకు ముందు రాంనగర్ కుట్ర కేసులో కూడా నిందితులేనని చెప్పాడు. బెంగళూరు కుట్ర కేసు నిందితులలో ఏడుగురు ఆ తర్వాత జరిగిన ఎన్‌కౌంటర్లలో చనిపోయారని కూడా చెప్పాడు. ఆ కేసులో నిందితులుగా చూపిన నలుగురు నక్సలైటు నాయకులు ప్రభుత్వం ముందు లొంగిపోయారని, కాని ప్రభుత్వం వారి మీద కేసును ఎత్తివేసుకోలేదని కూడా ఆయన చెప్పాడు.

ఈ కేసు విచారణ సందర్భంగా నేను మరొక విషయం రుజువు చేయగలిగాను. బెంగళూరు కుట్ర కేసులో జప్తు చేశామంటున్న ఆయుధాల గురించి ప్రశ్నించినప్పుడు అటువంటి ఆయుధాలనే, మందుగుండు సామగ్రినే 1987 నుంచి 1992 మధ్య కూడా అదే ఎన్‌కౌంటర్ సందర్భాలలో దొరికినట్లు చూపడం జరిగింది కదా అన్నప్పుడు వెంకటరెడ్డి అవునన్నాడు.

నిజానికి ఎన్‌కౌంటర్ ఘటన దగ్గర కొన్ని ఆయుధాలు దొరికినట్టు చూపించడం, వాటిని చట్టప్రకారంగా, సరైన న్యాయస్థానాలలో ప్రవేశ పెట్టకపోవడం, మళ్లీ మళ్లీ అవే ఆయుధాలను వేర్వేరు కేసులలోనూ, ఎన్‌కౌంటర్లలోనూ చూపడం పోలీసులకు ఒక క్రమం తప్పని అలవాటు అయిపోయింది.

బెంగళూరు కుట్ర కేసులో నిందితుల ఒప్పుకోలు ప్రకటనలు అనబడే వాటిని కూడా న్యాయస్థానం అంగీకరించలేదు. నమ్మలేదు. నిందితులలో చాలా మంది సుదీర్ఘ కాలం అక్రమ పోలీసు నిర్బంధంలో గడిపారు. గనుక ఆ ప్రకటనలలో విశ్వసనీయతలేదని న్యాయస్థానం భావించింది.

ఆయుధాలు స్వాధీనం చేసుకున్నప్పుడు చట్టప్రకారం వాటి కాల్పుల శక్తిని, సామర్థ్యాన్ని పని చేయగల స్థితిలో ఉన్నాయా లేదా అనే విషయాన్ని ఫోరెన్సిక్ సైన్సెస్ ప్రయోగశాలలో పరీక్షింపచేసి, ఆ ప్రయోగశాల ఇచ్చిన నివేదికను న్యాయస్థానం ముందుంచాలి. కాని ఈ కేసులో చూపిన ఏ ఆయుధాన్ని, మందుగుండు సామగ్రిని ఫోరెన్సిక్ లాబరేటరీకి పంపించనేలేదు.

ఎనిమిది మంది లొంగిపోయిన నక్సలైట్లను ఈకేసులో ప్రాసిక్యూషన్ సాక్షులుగా చూపించారు. వారి చేత నక్సలైట్ల కుట్ర గురించీ, ఇతర కార్యకలాపాల గురించీ చెప్పించారు. కాని ఆ సాక్షులను బహిరంగ పరచలేదు. వారి పేర్లను రహస్యంగా ఉంచారు. వారిలో ఏ ఒక్కరినీ విచారణ సమయంలో న్యాయస్థానం ముందు హాజరు పరచలేదు. వారిని విచారించే, ప్రశ్నించే అవకాశం న్యాయస్థానానికి, నిందితుల తరఫున న్యాయవాదులకూ దొరకనేలేదు. చివరికి వారు ఎవరి మీద ఆరోపణలు చేస్తున్నారో ఆ నిందితులకు కూడా వారెవరో తెలియజేయలేదు.

సుప్రసిద్ధమైన ఈ బెంగుళూరు కుట్ర కేసు ఇంత గందరగోళంగా తయారైంది గనుక, 1999 ఏప్రిల్ 4న ఇచ్చిన తీర్పులో టాడా కింద ప్రత్యేక న్యాయస్థానంగా గుర్తించబడిన రెండవ అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి అభియోగాలు మోపబడిన మొత్తం 17 మంది నిందితులనూ నిర్దోషులుగా ప్రకటించారు. ఈ తీర్పు సరియైనది కాదంటూ ప్రాసిక్యూషన్ క్రిమినల్ అప్పీలు నెం.795/99 ద్వారా సుప్రీంకోర్టులో అభ్యర్థన దాఖలు చేసింది. కాని సుప్రీంకోర్టు కూడా 2000 డిసెంబర్ 21న ఇచ్చిన తీర్పులో కింది కోర్టు తీర్పు సరియైనదేనని నిర్ధారిస్తూ మొత్తం 17 మంది నిందితులనూ నిర్దోషులుగా ప్రకటించింది.

కాని అప్పటికే ఈ కేసులో చాలా మంది నిందితులు నాలుగైదు సంవత్సరాలపాటు జైలులో మగ్గిపోయిన తర్వాతనే బెయిల్ మీద బయటికి వచ్చారు. సగం మంది బూటకపు ఎన్‌కౌంటర్లలో బలి అయిపోయారు.

ఈ కేసులో ప్రాసిక్యూషన్ విఫలం కావడానికి మరొక కారణమేమంటే, నేరాలు చేయడానికి కుట్ర చేశారని ఆరోపిస్తున్న నక్సలైట్లనూ, ఆ నేరాలు చేయడానికి అవసరమైన ఆయుధాలు, మందుగుండు సామగ్రి అమ్మారనే ఆరోపణతో ఆయుధవ్యాపారులనూ ఒకే కుట్రలో భాగం చెయ్యడం. అదంతా చాలా తెలివి తక్కువపని. ఆ ఆయుధ వ్యాపారులు తమ దగ్గరికి ఎవరు ఆయుధాలు కొనడానికి వచ్చినా అమ్ముతారు. ఆ కొనుగోలు దారుల దగ్గర ఆయుధాలు ఉంచుకోవడానికి లైసెన్స్ లేకపోతే అలా అమ్మడం ఆయుధాల చట్టం ప్రకారం నేరమే అవుతుంది. కాని అది రాజ్యాన్ని కూలదోసే కుట్రలో భాగం కాదు. అసలూ ఆయుధం అమ్మేటప్పుడు కొనుగోలుదారు రాజ్యాన్ని కూలదోసేందుకే ఆ ఆయుధం కొంటున్నాడని వ్యాపారికి తెలియదు. ఒకవేళ కొనుగోలుదారు నిజంగా కుట్రపూరితంగానే ఆ ఆయుధం కొన్నప్పటికీ, వ్యాపారికి ఆ కుట్రలో భాగం ఉండనవసరం లేదు. కాని ప్రాసిక్యూషన్ మాత్రం వారిని కూడా కుట్రలో భాగస్తులుగా, నిందితులుగా చూపెట్టింది.

ఇంత జరిగినా కుట్రకేసులు పెట్టడం నిరర్థకమని ప్రభుత్వానికి తెలిసిరాలేదు. బెంగళూరు కుట్ర కేసులో నిర్దోషిగా బయటపడిన పటేల్ సుధాకర్‌రెడ్డి తీర్పుకన్నా ముందే బెయిల్ మీద బయటికి వెళ్లి అజ్ఞాతవాసానికి వెళ్లాడు. చంద్రబాబునాయుడును హత్య

చేయడానికి అలిపిరిలో జరిగిన ప్రయత్నంలో కుట్రదారుగా ఆయన మీద మళ్లీ కేసు పెట్టారు.

* * *

# వలస చట్టాల ప్రభావం

ఇప్పటిదాకా చెబుతున్న కుట్ర కేసుల వ్యవహారం చూస్తే ఇదంతా ఏదో ఆంధ్రప్రదేశ్ సంగతి మాత్రమేనని అనిపిస్తుందేమో. కాని రాజకీయంగా భిన్నాభిప్రాయాలున్న వాళ్ల మీద 1947 నుంచీ కూడా భారత ప్రభుత్వం, అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న వైఖరి అదే. భారత ప్రజలమైన మనకు మనం రాజ్యాంగం ద్వారా ప్రాథమిక హక్కులకు హామీ 1950 జనవరిలో ఇచ్చుకున్నాం గాని, అంతకు ముందు నుంచే మన ప్రాథమిక హక్కులను ప్రభుత్వాలు ఉల్లంఘించడం మొదలుపెట్టాయి.

1947 ఆగస్టు 15న మద్రాసు రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ ఖైదీలందరినీ విడుదల చేసింది. కాని అప్పటికి జైలులో ఉన్న ఎ కె గోపాలన్‌ను మాత్రం విడుదల చేయలేదు. ఆగస్టు 14న ఆయన ఒక చెరసాలలో ఏకాంతవాస శిక్షను అనుభవిస్తున్నాడు. ఆ మర్నాడు స్వాతంత్ర్య దినోత్సవాన్ని జైలు ఆవరణలోనే జరుపుకోవాలని ఆయన నిశ్చయించుకున్నాడు. కొందరు తోటి ఖైదీలు వెంటరాగా ఆయన ఆ ఆగస్టు 15 ఉదయం జైలు ఆవరణలోనే జాతీయ పతాకం పట్టుకుని ఊరేగింపు జరిపాడు. మూడో బ్లాకు పైకప్పు మీద జెండా ఎగురేసి జెండా వందనం కూడా జరిపాడు. అక్కడ గూమిగూడిన ఖైదీలను ఉద్దేశించి ఆయన ఓ నాలుగైదు నిమిషాలు ఉపన్యాసం కూడా చేశాడు. ఈ పని చేసినందుకుగాను ఆయనను కాలికట్ అదనపు జిల్లా మెజిస్ట్రేటు ముందు హాజరుపరిచి రాజద్రోహం నేరం ఆరోపించారు. మహాఘనత వహించిన చక్రవర్తికి వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టే రాజద్రోహానికి పాల్పడ్డాడని ఆయన మీద నేరం ఆరోపించారు. అప్పటికి చక్రవర్తి ప్రభుత్వం పడిపోయింది, స్వతంత్ర ప్రభుత్వం అధికారానికి వచ్చింది. కాని మన న్యాయవ్యవస్థకు ఈ మార్పులతో ఏ సంబంధమూ లేదు.

ఆ నేరారోపణకు జవాబు చెబుతూ ఎ కె గోపాలన్ న్యాయస్థానం ముందు చేసిన ప్రకటన చాలా ముఖ్యమైనది. ఎందుకంటే స్వతంత్ర భారత ప్రభుత్వం కూడా వలసవాద పాలనా సంప్రదాయాలనే పాటించబోతున్నదని ఆ ప్రకటన స్పష్టం చేసింది.

"చట్టబద్ధంగా ఏర్పడిన బ్రిటిష్ భారత సామ్రాజ్య చక్రవర్తికి వ్యతిరేకంగా శత్రుత్వ భావాలు రెచ్చగొడుతున్నాననే నేరం మీద విచారణ ఎదుర్కోవడం నాకు చాలా గర్వకారణంగా ఉన్నది. ఈ దేశంలోని స్వేచ్ఛాప్రియులందరూ, స్వాతంత్ర్యోద్యమ

ప్రారంభం నుంచీ గాంధీ, నెహ్రూల దాకా నాయకులందరూ ఈ చక్రవర్తి ప్రభుత్వానికి వ్యతిరేకంగా అటువంటి శత్రుత్వభావనను కల్పించేందుకే ప్రయత్నించారు. ఆ లక్ష్యం కోసం పని చేసినందుకే మహాత్మాగాంధీని భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 124-ఎ కింద రాజద్రోహ నేరం ఆరోపించి విచారించారు.

దానంతటి ఫలితంగానే ఈ రోజున మహాఘనత వహించిన ప్రభుత్వం, బ్రిటిష్ ఇండియా అంతర్ధానమైపోయాయి. నాతోపాటు ఆ నేరం చేసిన నా సహకార్యకర్తలెందరో ఇవాళ మంత్రులుగా, గవర్నర్లు ఉన్నారు. సరిగ్గా మనం స్వాతంత్ర్యం సంపాదించిన ఈ సమయంలో నా మీద ఈ నేరం ఆరోపించడంలో కొంచెం అనౌచిత్యం ఉందని నా కనిపిస్తోంది" అని ఎ కె గోపాలన్ అన్నాడు.

ఈ కేసులో ప్రభుత్వం తరఫున కాంగ్రెస్ నాయకుడు, న్యాయవాది కె పి రామున్ని మీనన్ వాదించాడు. మొత్తానికి ఆ కేసు నుంచి ఆయనను 1947 అక్టోబర్ 12న విడుదల చేశారు. కాని రెండు నెలల తిరగకుండానే డిసెంబర్ 17న ఆయనను మళ్లీ అరెస్టు చేశారు. ఈసారి మరొక చట్టం సాయంతో ఆయనను అరెస్టు చేశారు. ఆ చట్టం పేరు ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం. ఆయనను ఈసారి ఒక జైలు నుంచి మరొక జైలుకు మారుస్తూపోయారు. మన రాజ్యాంగం 1950 జనవరి 26న అమలులోకి వచ్చింది. ఎ కె గోపాలన్ మాత్రం జైలులోనే ఉండిపోయాడు. రాజ్యాంగం ఇచ్చిన అధికారాలతో స్వతంత్రభారత ప్రభుత్వం 1950 ఫిబ్రవరి 26న ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టాన్ని పకడ్బందీగా తీసుకు వచ్చింది. ఎ కె గోపాలన్‌ను ఇప్పుడు ఈ కొత్త చట్టం కింద నిర్బంధించారు.

నిర్బంధపూరిత పాలనా యంత్రాంగం వలసవాదుల సంప్రదాయాలను యథాతథంగా కొనసాగించడం మొదలుపెట్టింది. న్యాయస్థానాలు కూడా ఆ వలసవాద సంప్రదాయాన్నే కొనసాగించాయి. రాజ్యాంగం ఏర్పాటు చేసిన పాలనా వ్యవస్థలపై రాజ్యాంగ ప్రభావం ఏమిటో అర్థం చేసుకోవాలంటే 1947 ఆగస్టు 15 తర్వాత కూడా ఎ కె గోపాలన్ జైలులో ఉండవలసి వచ్చిందంటే వాస్తవాన్ని గమనంలో ఉంచుకోవాలి. భారత స్వాతంత్ర్యోద్యమాన్ని అణచడానికి, చేసిన చట్టాలతో సహా బ్రిటిష్ ఇండియాలోని అన్ని చట్టాలూ స్వతంత్ర భారతదేశంలో యథాతథంగా అమలయ్యే చట్టాలయిపోయాయి. అందువల్ల సహజంగానే వలస వాద చట్ట, న్యాయ వ్యవస్థ స్వతంత్ర భారత చట్ట, న్యాయ వ్యవస్థ అయిపోయింది.

రాజ్యాంగంలోని ఉపోద్ఘాతంలో రాసిన ఆదర్శాలను వాస్తవీకరించేందుకు అవసరమైన చట్ట, న్యాయ వ్యవస్థను రూపొందించాలనే ప్రయత్నమే జరగలేదు. బహుశా అటువంటి న్యాయ వ్యవస్థను తయారు చేసి ఉన్నట్లయితే, ప్రభుత్వం తన మౌలిక కర్తవ్యాలను నెరవేర్చేలా న్యాయస్థానాలయినా ప్రయత్నించి ఉండేవి. అటువంటి పని, న్యాయస్థానాలు కల్పించుకుని ప్రభుత్వాల కర్తవ్యాలను గుర్తు చేసే పని 1970లలో జరిగిందిగాని అప్పుడు

కూడా ఎక్కువగా జరిగినది వాగాడంబరమే తప్ప నిజమైన న్యాయవ్యవస్థ నిర్మాణం కాదు.

అసలు మొత్తం సుప్రీంకోర్టు చరిత్రలోనే, దేశ పాలనా వ్యవస్థలో మార్పు తేవడం రాజ్యాంగ లక్ష్యమనే వాస్తవాన్ని గుర్తించిన న్యాయమూర్తి ఒకే ఒక్కరున్నారు. రాజ్యాంగం ప్రజలకు ఏమి చేస్తుందో, అందువల్ల అది రాజ్యాంగ,పాలనా వ్యవస్థలకు ఏమి చేయాలో, రాజ్యాంగంలోని ప్రవేశికలో చెప్పిన లక్ష్యాలను ఏ విధంగా అమలులోకి తేవాలో గుర్తించిన ఆ న్యాయమూర్తి జస్టిస్ వివియన్ బోస్. ఎస్ కృష్ణన్ వర్సస్ స్టేట్ మద్రాస్ అనే కేసులో ప్రివెంటివ్ డిటెన్షన్ గురించి ఆయన చెప్పిన మాటలు తప్పనిసరిగా గమనించవలసినవి.

"భారత ప్రజలు తమకు తాము స్వతంత్ర జీవన విధానాన్ని ఎంచుకున్నారు. తమ అభిప్రాయాలకు ప్రాతినిధ్యం వహించే పార్లమెంటుకు వారు ఆ జీవన విధానానికి హామీ పడే బాధ్యతను అప్పజెప్పారు. ప్రజలు తమకు తాము ఇచ్చుకున్న స్వేచ్ఛలపైన ఏవయినా పరిమితులు విధించవలసి వస్తే, పార్లమెంటు అతిజాగ్రత్తగా ఆ పరిమితులను నిర్ణయించాలని వారు భావించారు. రాజ్యాంగంలో పొందుపరచిన స్వేచ్ఛలు, హక్కులు ఊహాజనితమైనవని, అర్థరహితమైనవని రాజ్యాంగ నిర్మాతలు భావించి ఉంటారనుకోను. ఆ హక్కులను ఎవరో ఒక వ్యక్తి ఆటబొమ్మలాగ వాడుకుంటారని కూడా వాళ్లు ఊహించి ఉండరు. మన రాజ్యాంగ నిర్మాతలు భారత ప్రజలపైన ఒక నిర్దాక్షిణ్యమైన, నిర్జీవమైన, జడమైన, ఎటుపడితే అటువంచగల ముద్దను రుద్దారని నేననుకోవడంలేదు. వారు ఒక సజీవ రాజ్యాంగాన్ని సృష్టించారు. దానిలో ప్రాణం నింపారు. దానికి ఒక లక్ష్యాన్ని, శక్తిని కల్పించారు. అది స్వతంత్ర పద్ధతిలో అంటే ప్రజాస్వామిక జీవన విధానంలో ఆరోగ్యవంతంగా, దృఢంగా ఎదగాలని వారు సంకల్పించారు.

యుద్ధమో, అత్యవసర పరిస్థితితో వచ్చినప్పుడు తయారయ్యే శాసనాలలో ఆ హడావుడివల్ల భాష, వ్యక్తీకరణలు సక్రమంగా ఉండవని వచ్చే వాదనలు ఈ సందర్భంలో వర్తిస్తాయని నేను అంగీకరించదలచుకోలేదు. నేను ప్రస్తుతం మాట్లాడుతున్నది రాజ్యాంగం గురించి. అది చాలా గంభీరమైన, ఉద్దేశ్యపూర్వకమైన, జాగరూకమైన చర్చ ద్వారా ఆమోదం పొందింది. అందువల్ల ఎప్పుడైనా అస్పష్టతగాని సందేహంగాని ఉంటే, సర్వసత్తాక ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యపు స్వతంత్ర జీవన విధానానికి అనుకూలమైన నిర్ణయం తీసుకోవాలని నేననుకుంటాను. అసలు విషయానికొస్తే ఈ రాజ్యాంగాన్ని రచించినవారెవరు? ఎవరి ప్రయోజనాల కోసం ఈ రాజ్యాంగం రూపకల్పన జరిగింది? ఏదో కొద్ది కాలం అధికారంలో ఉండే వారి కొరకు కాదు. న్యాయవాదుల కోసమో, తార్కికుల కోసమో కాదు. రాజ్యాంగం తయారయినది భారతదేశంలోని సాధారణ ప్రజల కొరకు. అందువల్ల ఆ అధికరణాల భాష గురించి శషభిషలకు పోకుండా దాన్ని చాలా మామూలుగా సూటిగా వ్యాఖ్యానించవలసి ఉంటుంది. అంటే వీధుల్లో తిరుగాడే

మనిషికి అర్థమయ్యేలా దాన్ని వ్యాఖ్యానించవలసి ఉంటుంది. ఆ రకంగా సాధారణ ప్రజానీకం రాజ్యాంగపు భావాన్ని అర్థం చేసుకోగలరు, దాన్ని పాటించగలరు" అని వివియన్ బోస్ అన్నాడు.

నిజానికి మన న్యాయ వ్యవస్థ తన ఆలోచనలను రాజ్యాంగం దగ్గర ప్రారంభించాలని అనుకోవడంలేదు. స్వాతంత్ర్యం తర్వాత, రాజ్యాంగం ఉనికిలోకి వచ్చిన తర్వాత కూడా ఎ కె గోపాలన్ నిర్బంధంలోనే ఉండడం, ఆయన హెబియస్ కార్పస్ రిట్ దరఖాస్తుపై తీర్పు అన్నీ కూడా బ్రిటిష్ వలసవాద సంప్రదాయానికి కొనసాగింపే. ఆ మధ్యలో రాజ్యాంగం అమలులోకి వచ్చిందని, అందువల్ల అసలు న్యాయ వ్యవస్థ పని తీరులోనే తేడా రావలసి ఉంటుందని న్యాయమూర్తులు గుర్తించనే లేదనడానికి ఆయన కేసులో న్యాయమూర్తుల తీర్పులే నిదర్శనం.

ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం, 1950 రాజ్యాంగంలోని 19, 21 అధికరణాలను భంగపరుస్తున్నదని, అందువల్ల దాన్ని రాజ్యాంగంలోని అధికరణం 13(2) కింద కొట్టివేయవచ్చునని, ఆ చట్ట నిబంధనలు అధికరణం 22 స్ఫూర్తికి వ్యతిరేకమని అనేక వాదనలు వచ్చాయి. అసలు ఆ నిర్బంధ ఉత్తర్వులను అధికార దుర్వినియోగం గుర్తించాలని కూడా వాదనలు జరిగాయి.

అసలు ఈ ముందస్తు నిర్బంధం అనేది ఇంగ్లండులో మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో అమలులోకి వచ్చిందని, అది కేవలం యుద్ధ పరిస్థితులవల్ల వచ్చిన చట్టమని కనుక యుద్ధం తర్వాత అది చెల్లనేరదని జస్టిస్ మహాజన్ అభిప్రాయపడ్డారు. భారతదేశంలోనైతే ఈ ముందస్తు నిర్బంధానికి తగిన మూలాలు లేవని ఆయన అన్నాడు.కాని వాస్తవాలు మరొకరకంగా ఉన్నాయి. కారణాలు చూపకుండా మనిషిని నిర్బంధంలో ఉంచడమనే బ్రిటిష్ కాలపు పాలనా పద్ధతి పందొమ్మిదో శతాబ్దపు తొలి రోజుల నుంచీ అమలులో ఉంది. 1818లో అమలులోకి వచ్చిన బెంగాల్ రెగ్యులేషన్, బొంబాయి, మద్రాసు ప్రెసిడెన్సీలలో వచ్చిన అదే మాదిరి చట్టాలు ఏ వ్యక్తినైనా కారణం చూపకుండా, ముందస్తుగా నిర్బంధించే అధికారాన్ని ప్రభుత్వానికి ఇచ్చాయి. రౌలట్ చట్టంలో భాగమైన 1919 అరాచక, విప్లవ నేరాలచట్టం అనేది ఆ దిశలో మరొక అడుగు. ఇవన్నీ వ్యక్తిగత స్వేచ్ఛ మీద నిర్దయాత్మకమైన దాడులు.

ఆ తర్వాత రౌలట్ కమిటీ నివేదిక ఆధారంగా మూడు బిల్లులను ప్రవేశపెట్టడం జరిగింది. అవి, ఒకటి పత్రికలను అదుపులో పెట్టడానికి ఉద్దేశించినది, రెండవది, రాజకీయ నేరస్తులను న్యాయపీఠం లేకుండానే విచారించడానికి వీలు కల్పించేది, మూడవది తిరుగుబాటు లక్ష్యాలు కలిగి ఉన్నారనే అనుమానం ఉన్న వారికి దేశాంతరవాస, బహిష్కార శిక్షలు విధించడానికి వీలు కల్పించేది. చివరికి 1935 భారత ప్రభుత్వ చట్టం వచ్చే నాటికి, ప్రివెంటివ్ డిటెక్షన్ అనేది శాంతి సమయంలో కూడా ఉపయోగపడే

ఆధునిక శాసనం అయిపోయింది. న్యాయశాస్త్ర ప్రపంచంలో, ముందస్తు శిక్షకూ, విచారణ తరువాత శిక్షకూ మధ్య తేడా చెరిగిపోయేంతగా మెరుగుపెట్టడం జరిగింది. ఆ రెండు పదాల ఏకైక లక్ష్యం ఒక సమాజాభివృద్ధికీ, ప్రజల అభివృద్ధికీ అత్యవసరమైన స్వేచ్ఛ మీద ఆంక్షలు విధించడమే అయిపోయింది.

1784 ఈస్టిండియా కంపెనీ చట్టం నాటి నుంచీ కూడా బ్రిటిష్ పాలకులు నేరశిక్షాస్మృతి, చట్టం అనే వాటిని భారత ప్రజానీకాన్ని అదుపులో ఉంచే, అణచి ఉంచే సాధనాలుగానే భావించారు. భారత ప్రజానీకంలో బ్రిటిష్ పాలనపై అసంతృప్తి, ప్రతిఘటన పెరిగినకొద్దీ కొత్త కొత్త చట్టాలు రావడం మొదలైంది.

మన రాజ్యాంగ రూపకల్పనకు కూచున్నప్పుడు మన రాజ్యాంగంలోని మాటలను మన పోరాటాలు నిర్వహించే బదులు, మనం కూడా పాత బ్రిటిష్ వలసవాద నిర్బంధపూరిత పాలనా, న్యాయ వ్యవస్థలను ఔదల దాల్చడానికే ఉత్సాహం చూపించాము. ఒక కార్యనిర్వాహక వర్గానికి దాని పుట్టుక ఇంగ్లీషుదా, భారతీయమైనదా అనే దానితో నిమిత్తంలేదు. దాని స్వభావం ఆ కారణంవల్ల మారిపోదు. దాని పని తీరును నిర్ణయించే మార్గదర్శక సూత్రాలే దాని స్వభావాన్ని నిర్ణయిస్తాయి. ప్రజలు నడిపిన పోరాటాల ఆదర్శాలన్నిటినీ ఆ మార్గదర్శక సూత్రాలలోకి రచించవలసి ఉంటుంది.

ప్రాథమిక హక్కులు, ప్రివెంటివ్ డిటెన్షన్ అనే అంశాల మీద మన రాజ్యాంగ నిర్ణయసభ చర్చలను ఒక్కసారి పరిశీలిస్తే, భారతదేశంలోని వేర్వేరు ప్రాంతాలలో జరిగిన ఘటనల వల్ల, అత్యవసర పరిస్థితులలో, రాజ్యభద్రత ప్రమాదంలో పడిన సందర్భాలలో ప్రజల హక్కులపై తీవ్రమైన ఆంక్షలు విధించాలని అనిపిస్తున్నదని ఆ సభలో నామినేటెడ్ సభ్యుడైన అల్లాడి కృష్ణస్వామి అయ్యర్ అన్నాడు. వర్గద్వేషాన్ని రెచ్చగొట్టేట్టయితే భావ ప్రకటనా స్వేచ్ఛపై కూడా పరిమితులు విధించాలని ఆయన అన్నాడు.

రాజ్యాంగ ముసాయిదాలో ప్రాథమిక హక్కుల అధ్యాయం చర్చించేటప్పుడు రాజ్యాంగ నిర్ణయసభ సభ్యులు అమెరికన్ రాజ్యాంగం నుంచి "చట్ట విహిత క్రమం" అనే మాట సాయం తీసుకున్నారు. ఒక వ్యక్తి జీవితానికిగాని, స్వేచ్ఛకు గాని భంగం కలిగించేటప్పుడు చట్ట విహిత క్రమంలో తప్ప మరొక రకంగా ఆ పని జరగకూడదని వారు అన్నారు. స్వాతంత్ర్యోద్యమ క్రమంలో బ్రిటిష్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక నిర్బంధ చట్టాల గురించి అవగాహన ఉన్న సభ్యులు ఆ సభలో చాలా మంది ఉన్నారు. గనుక వారి వ్యక్తిగత స్వేచ్ఛ మళ్లీ అటువంటి దాడులకు బలికావద్దని కోరుకున్నారు. సభలో అత్యధిక సభ్యులు ఈ "చట్ట విహిత క్రమం" అనే నిబంధనను చేర్చాలని పట్టుబట్టారు. కె ఎం మున్షీ కూడా ఈ నిబంధన ఉండాలని వాదించారు.

అల్లాడి కృష్ణస్వామి అయ్యర్ ఒక్కరు మాత్రం "చట్టం నిర్దేశించిన పద్ధతి" అనే వ్యక్తీకరణ ఉండాలని వాదించారు. "చట్ట విహితక్రమం" అనేమాటను స్వార్థపరశక్తులు

తమకు అనువుగా వ్యాఖ్యానించవచ్చునని, తమ ప్రయోజనాలు కాపాడుకోవడానికి వాడుకోవచ్చునని ఆయన తన అనుమానాన్ని వ్యక్తం చేశారు. మొత్తానికి జరిగింది అదేననేది వేరే విషయం. అమెరికాలో ఆ మాటు న్యాయవాదులు ఎన్నెన్ని వైపుల వక్రీకరించి ఉపయోగించారో, అది ఎన్ని రకాల వ్యాఖ్యానాలకు దారి తీసిందో వివరించడానికి ఆయన చాలా ప్రయత్నించార. "భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తులు అమెరికన్ న్యాయవ్యవస్థలో జరిగినట్టు కాకుండా, మరీ ముఖ్యంగా తొలిదశలో, భారత పరిస్థితులకు తగినట్టుగా, దేశపు ప్రగతికీ, సౌభాగ్యానికీ తగినట్టుగా వ్యాఖ్యానించగలిగితే ఈ మాట తగినంత సంతృప్తికరంగానే ఉంటుంది" అని ఆయన భావించారు.

అంటే స్వతంత్ర భారత న్యాయవ్యవస్థ అనేది ఒకటి ఆవిర్భవించాలని, ఆవిర్భవించబోతున్నదని ఆయన కోరుకున్నారన్నమాట. ఈ సమస్యను చర్చించేటప్పుడు రాజ్యాంగ నిర్ణయసభ భారతదేశపు భవిష్యత్ ప్రగతిని దృష్టిలో పెట్టుకోవాలని ఆయన అన్నారు. "ఒక నిర్ణయానికి వచ్చే ముందు రాజ్యపు సౌభాగ్యాన్నీ, సుస్థిరతనూ, కనీస స్వేచ్ఛను కాపాడవలసిన అవసరాన్ని, సామాజిక నియంత్రణనూ, వ్యక్తిగత స్వేచ్ఛనూ సమన్వయం చేయవలసిన అవసరాన్ని" దృష్టిలో పెట్టుకోవాలని ఆయన అన్నారు. చట్టవిహితక్రమం అంటే ఏమిటో ముగ్గురో ఐదుగురో నిర్ణయించడం కన్నా, ప్రజా ప్రతినిధులు లేదా అటువంటి ప్రజాప్రతినిధులకు బాధ్యత వహించే కార్యనిర్వాహక వర్గం అభిప్రాయాల ద్వారా నిర్ణయించడం ఎక్కువ ప్రజాస్వామికమని ఆయన అన్నారు.

అయితే ఈ వ్యవస్థలు, యంత్రాంగాలు ఎట్లా పని చేస్తామోనన్న విషయమై ఇదంతా ఎక్కువగా సైద్ధాంతిక అభిప్రాయమే తప్ప ఆచరణాత్మకమైన వ్యక్తీకరణ కాదు. సరిగ్గా ఈ చర్చ సాగుతున్నప్పుడే, యూరప్‌లో నాజీ, ఫాసిస్టు శక్తులు పెద్ద ఎత్తున మూకుమ్మడిగా, ప్రజాస్వామిక వ్యవస్థల పని తీరును ఎంతగా వక్రీకరించగలనో మనం ప్రత్యక్షంగా చూశాం. అందువల్లనే, "చట్లవిహిత క్రమం" అనాలా అని వాదనలు జరుగుతున్నప్పుడు ఆ చర్చ జరుపుతున్న వారందరి మనసులలోనూ ఒక ఆందోళన ఉండింది. యూరప్‌లో అప్పుడప్పుడే జరిగిన సంఘటనలు వారి మనసులలో తాజాగా ఉన్నాయి. మన జాతీయ విముక్తి కొరకు జరిగిన పోరాటాన్ని అణచి వేయడానికి బ్రిటిష్ పాలకులు అమలు చేసిన దమన నీతి కూడా వారికి ఇంకా గుర్తుంది.

నిజానికి రాజ్యాంగ నిర్ణయసభలో ఒక హక్కుల పత్రం వెలువరించాలనే ఆకాంక్ష చాలా బలంగా ముందుకు వచ్చింది. హెబియస్ కార్పస్ రిట్ ద్వారా న్యాయ స్థానాన్ని ఆశ్రయించే హక్కు పౌరులకు కల్పించాలని, అటువంటి హక్కును అటు కార్యనిర్వహక వర్గానికి గాని, ఇటు శాసనాధికార వ్యవస్థకుగాని ఇవ్వగూడదని కూడా అభిప్రాయాలు వచ్చాయి.

అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ చట్టసభలను పూర్తిగా తన మనుషులతో, తన

సమర్థకులతో నింపవచ్చుగదా, తన ఇష్టం వచ్చిన చట్టాలు చేయవచ్చుగదా అనే ప్రశ్న కూడా ఆ చర్చల క్రమంలో వచ్చింది. అటువంటి అవకాశం ఉండవచ్చునని అంబేద్కర్ కూడా అంగీకరించారు. న్యాయమూర్తులు ముందే ఏర్పరచుకున్న దురభిప్రాయాలు, దురభిమానాలు లేకుండా ప్రవర్తిస్తారని తను అనుకోవడంలేదని కూడా అంబేద్కర్ అన్నారు. "ఇది ముందు నుయ్యి, వెనక గొయ్యి లాంటి పరిస్థితి అందువల్ల నేనేమీ చెప్పను" అని ఆయన అన్నారు.

రాజ్యాంగ నిర్ణయ సభలో చాలా మంది అధికరణం 15 ముసాయిదా (ప్రస్తుత రాజ్యాంగంలోని అధికరణం 21) పార్లమెంటుకు నిరంకుశంగా మనిషిని నిర్బంధంలోకి తీసుకునే అధికారం ఇస్తున్నదని, అందువల్ల ఆ పద్ధతి ఏమిటో నిర్దేశించే మరొక శాసనం కావాలని కోరుకున్నారు. అందువల్లనే ఆ ముసాయిదా అధికరణం 15కు ఎ అనే అదనపు నిబంధన (ప్రస్తుత రాజ్యాంగంలోని అధికరణం 22) చేర్చవలసి వచ్చింది.

ఒక రాజ్యాంగ పత్రంలో ముందస్తు నిర్బంధం గురించిన నిబంధనను ప్రవేశపెట్టడం గురించి అప్పుడే చాలా విమర్శలు వచ్చాయి. బక్షీ టేక్ చంద్ ఈ అధికరణాన్ని అత్యంత అభివృద్ధి నిరోధకమైనదిగా అభివర్ణించారు. నిర్ణీత సాధారణ వ్యవధిలోపల విచారణ జరపకుండా వ్యక్తులను నిర్బంధంలో ఉంచే నిబంధనలను తనలో ఇముడ్చుకున్న లిఖిత రాజ్యాంగం ప్రపంచం మొత్తంలో ఇది ఒక్కటేననీ అందువల్ల ఇది ప్రతీఘాతుకమైనదని ఆయన విమర్శించారు. ఈ నిబంధనను ఆమోదించడమంటే ప్రాథమిక హక్కుల మీద ఉన్న అధ్యాయాన్ని ఒక శిక్షాస్మృతిగా మార్చినట్టే అవుతుందని, అటువంటప్పుడు అది పాత బ్రిటీష్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిఫెన్స్ ఆఫ్ ఇండియా రూల్స్ కన్నా ఘోరమైన పని అవుతుందని మహావీర్ త్యాగి అన్నారు. రాజ్యాంగ నిర్ణయసభ సమావేశమైనది ప్రజలకు హక్కులను హామీ ఇవ్వడానికే తప్ప. ప్రజలనుంచి వారి హక్కులను లాగి వేయడానికి కాదని ఆయన అన్నారు.

ఈ రెండు నిబంధనలు వ్యక్తిగత స్వేచ్ఛ మీద గుదిబండలుగా మారిపోయాయి. రాజ్యాంగం అమలులోకి వచ్చిన ఈ యాభై ఏడు సంవత్సరాలుగా మోసుకుంటూ, లాక్కుంటూ రావలసి వస్తోంది. అంబేద్కర్ అనుమానించినట్టుగానే చట్టసభలలో అధికారపార్టీ సమర్థకులు నిండిపోయి శాంతి సమయంలో కూడా ఒక ముందస్తు నిర్బంధ (ప్రివెంటివ్ డిటెన్షన్) చట్టాన్ని ఆమోదింపజేశారు. ఆ చట్టాన్ని వ్యాఖ్యానించే సమయంలో న్యాయస్థానం కూడా రాజ్యాంగ నిర్మాణానికి ఉన్న చరిత్రను విస్మరించింది. రాజ్యాంగాన్ని కేవలం ఒక రాజకీయ పత్రంగా పరిగణించింది. రాజ్యాంగంలోని పదాల అర్థాన్ని వివరించడం మొదలు పెట్టింది.

అందువల్లనే స్వతంత్ర భారతంలో మొదటి ప్రధానకేసు అయిన, 1950లో వచ్చిన ఎ కె గోపాలన్ కేసులో వ్యక్తిగత స్వేచ్ఛ సారాంశం గురించి, వ్యక్తిగత స్వేచ్ఛ అనే

వ్యక్తీకరణకు ఏ అర్థం చెప్పాలనే దాని గురించి చర్చ జరగలేదు. మొత్తంగా వ్యక్తిగత స్వేచ్ఛను దాని మీద విధించే ఆంక్షల, పరిమితుల దృష్టి నుంచే నిర్వచించే ప్రయత్నం జరిగింది.

ఎ కె గోపాలన్ కేసులో 1950 ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం రాజ్యాంగబద్ధత గురించి పరిశీలన జరిగినప్పుడు చర్చ జరిగినదీ, బహుశా అప్పటికి పరిష్కృతమైనదీ ఏమంటే ఒక మనిషికి ఉండే ప్రయాణ స్వేచ్ఛ, ఇష్టం వచ్చిన చోటికి వెళ్లగలిగే స్వేచ్ఛ మీద పరిమితులు విధించవచ్చునా లేదా అనేది మాత్రమే. కాని నిజంగా చర్చించి ఉండవలసినది ఏమంటే, స్వాతంత్ర్యోద్యమానికి వ్యక్తిగత స్వేచ్ఛకూ మధ్య ఉన్న సంబంధం ఏమిటనేది.

స్వాతంత్ర్యసాధన రాజ్యాంగం గురించిన మన దూరదృష్టినీ, అవగాహననూ మసకబార్చింది. అప్పుడప్పుడే పుట్టిన భారత రాజ్యం ఒక వికలాంగ శిశువుగా జన్మించింది. రాజ్యాంగంలోని ప్రవేశికలో స్పష్టమైన వ్యక్తీకరణ పొంది రాజకీయ స్వాతంత్ర్యం ద్వారా మనం సాధించలేకపోయినవేవో మన రాజ్యాంగ ఆదర్శాలుగా రాసుకున్నాం.

అవి సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం, మానవ గౌరవం, సౌభ్రాతృత్వం. అస్పృశ్యతను, బాల కార్మిక వ్యవస్థను, వెట్టిచాకిరిని రద్దు చేసిన, శిక్షార్హమైన నేరంగా పరిగణించిన ప్రాథమిక హక్కుల అధ్యాయం. మన రాజ్యాంగం అధికరణం 15 కింద బహిరంగ బావులలో, చెరువులలో, భోజనశాలలో, బహిరంగ ప్రదేశాలలో వెలి, అటువంటి అసమానతలను పాటించడాన్ని నిషేధించింది. అత్యల్ప సంఖ్యాక వర్గాలకు తమ జీవితంలోని అన్ని అంశాలలో అవసరమైన హక్కులు కల్పించింది. ఒక సమసమాజాన్ని నెలకొల్పే బాధ్యతను ప్రభుత్వం మీద పెట్టి ఒక మౌలిక లక్ష్యాన్ని కల్పించింది.

ఇదంతా రాజకీయ సమాజానికీ పౌర సమాజానికీ మధ్య ఉన్న అఖాతాన్ని పూడ్చివేసే ఒక బృహత్తర ప్రయత్నం. రాజకీయ సమాజమైన రాజ్యానికీ పౌర సమాజానికీ ఈ ఐక్యతను సాధించే ప్రయత్నాన్ని రాజ్యాంగం నిర్దేశించాలనీ, ఆ రాజ్యాంగ కర్తవ్యాలను రాజ్యం పాటించాలనీ నిర్ణయించడం జరిగింది. రాజ్యాంగం మొత్తంలో రాజ్యాన్ని ఎక్కడా దాని హక్కులు, అధికారాల ద్వారా నిర్వచించడం జరగలేదు. కేవలం దాని పరిమితుల ద్వారా నిర్వచించడం జరిగింది. ఈ పరిమితుల లోపల పని చేయవలసిన రాజ్యంలో చట్టసభలు కూడా భాగమే.

ఒక రాజకీయ సమాజంలో నివసించే మనిషి తనను తాను సామూహిక మానవునిగా భావించుకుంటాడు. కాని సొంత వ్యక్తిత్వంతో ఒంటరి మనిషిగా క్రియాశీలంగా జీవించే పౌర సమాజంలో మనిషి ఇతర మనుషులందరినీ అమానవీయంగా సాధనాలుగా

భావిస్తాడు. తనను తాను కూడా ఒక సాధనంగా భావించుకుంటాడు. అతీత శక్తులచేతిలో ఆటబొమ్మగా మారిపోతాడు అని మార్క్స్ ఆన్ ది జ్యూయిష్ క్వశ్చన్ అనే వ్యాసంలో రాశాడు.

ఈ రకమైన అమానవీయతను మార్చడానికే మన ఆదేశిక సూత్రాలు, ప్రాథమిక హక్కులు ఉద్దేశించబడ్డాయి. రాజ్యాంగంలో ఈ నిబంధనలు ఉన్నాయంటే అర్థమేమంటే, ప్రజలు తమ ఏ అధికారాలను రాజ్యాంగం సృష్టించిన వ్యవస్థలకు అప్పగించారో అధికారాలన్నిటినీ వెనక్కి తీసుకునే అధికారం కూడా వారికి ఉంది అని.

రాజ్యాంగంలో అంత స్పష్టంగా ప్రకటితమైన మహత్తర కర్తవ్యంపట్ల న్యాయస్థానాలు అవగాహనను కలిగి ఉండవలసింది. దానికి బదులుగా న్యాయస్థానాలు రాజ్యాంగాన్ని ప్రజలకు వ్యతిరేకంగా నిలబడిన అధికారానికి అనువుగా వ్యాఖ్యానించడం అనే వలసవాద సంప్రదాయానికి కట్టుబడి పోయాయి. అదీ అసలు సమస్య.

* * *

# క్రమంలేని నా జీవిత పథం

నా జీవిత కథ ఒక క్రమపద్ధతిలో సాగడం లేదని కొందరు అంటున్నారు. అవును. నా జీవితమే కాదు, ఎవరి జీవితమైనా ఒక నిర్దిష్ట పద్ధతిలో, క్రమబద్ధంగా ఉండదు. మామూలుగా జీవిత చరిత్రలు, ఆత్మకథలు రాసుకునే వాళ్లు ఒక పద్ధతి ప్రకారం తమ జీవితం గడిచినట్టు చెప్పడానికి ప్రయత్నిస్తారు. ఫలానాచోట ఫలానా సమయంలో పుట్టిన దగ్గరి నుంచి క్రమక్రమంగా ఏ పనులు చేస్తూ వచ్చారో కాలక్రమంలో చెబుతారు. నేను ఆ పద్ధతి ఎంచుకోలేదు. నా జీవితంలో ముఖ్యమైనవని నేను అనుకుంటున్న అనుభవాలు, నా జీవిత దృక్పథాన్ని తీర్చిదిద్దిన సంఘటనలు, నా మీద ప్రభావం వేసిన వ్యక్తులు, ఉద్యమాలు ఇవన్నీ నాకు తోచినపద్ధతిలో చెప్పుకుంటూపోతున్నాను. ఇప్పటికే కొన్ని ముఖ్యమైన కేసుల గురించి చెప్పినప్పటికీ, ఇప్పటి నుంచి కొన్ని వారాలపాటు ప్రత్యేకంగా న్యాయవాదిగా నా అనుభవాలు చెపుదామనుకుంటున్నాను.

న్యాయవాద వృత్తిని నిర్వహించడం నిజానికి చాలా కష్టం. చాలాసార్లు నైతిక ప్రశ్నలు వస్తాయి. కాని నేను నా కేసులను తీసుకోవడంలో చాలా జాగ్రత్తగా ఉన్నాను. ముందే చెప్పినట్టు నేను నా వృత్తి జీవితం మొదట్లోనే పిచ్చిపిచ్చిగా డబ్బులు చేయనక్కరలేదు అని నిర్ణయించుకున్నాను గనుక డబ్బుల కోసమే ఏకేసయినా సరే అని తీసుకోలేదు. నా అవసరాలకన్నా ఎక్కువగా డబ్బు సంపాదించే పనిలో నేను ఎప్పుడూ లేను.

నేను ఈ యాభై సంవత్సరాలకు మించిన న్యాయవాద వృత్తిలో వేలాది కేసులు

చేసి ఉంటాను. ఇందులో అన్ని రకాల కేసులు చేశాను. క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, ఉద్యోగుల కేసులు, రాజకీయ కేసులు మొదలైన అన్ని రకాల కేసులు నాకు వచ్చాయి.

క్రిమినల్ కేసుల విషయంలో నేను అటు ఒరిజినల్ క్రిమినల్ సెషన్స్ కేసులు చేశాను. ఇటు క్రిమినల్ అప్పీల్ కేసులు కూడా చేశాను. అయితే, క్రిమినల్ అప్పీల్ విషయంలో నేను చాలా ఎక్కువగా జైలు నుంచి ఖైదీలు నాకు రాసినప్పుడు వాళ్ల కేసులు చేపట్టాను. క్రిమినల్ అప్పీళ్లలో నేరుగా వచ్చినవి తక్కువే. అసలు క్రిమినల్ కేసులలో కూడా ఎక్కువగా మార్క్సిస్టు - లెనినిస్టు ఉద్యమానికి సంబంధించిన కేసులే.

ఒక న్యాయవాది జీవిత గమనంలో ఇటువంటి కేసులే చేస్తాను. ఇటువంటి కేసులు చేయను అని నియమం పెట్టుకోవడం కష్టం. ఉదాహరణకు నా దగ్గరికి ఒక క్రిమినల్ కేసు వస్తే. దాన్ని నేను నిరాకరించడం కష్టం.

నాకు వృత్తిలో వచ్చిన పేరు ఎటువంటిదంటే, నా దగ్గరికి వచ్చిన కేసులు సర్వ సాధారణంగా అత్యవసరంగా న్యాయం అవసరమైన కేసులే. అందువల్ల నేను ఎప్పుడూ కేసుల వెంటబడి పోలేదు. అంతేకాదు, ఎప్పుడూ నేను ఎవరితోనూ ఇటువంటి కేసులు కావాలి అని కోరలేదు. ఆ కేసులే నన్ను వెతుక్కుంటూ వచ్చాయి. నేను వాటిని తీసుకుని, వాదించి న్యాయం జరిగేలా చూడకతప్పలేదు. కేసులు నన్ను వెతుక్కుంటూ వచ్చాయన్నమాట.

ఇటీవలి ఉదాహరణ చెప్పాలంటే, పార్లమెంటు మీద దాడి కేసు నేను చేయాలని, చేస్తానని నేననుకోలేదు. కాని ఆ కేసులో ఎవరూ వాదించగూడదని ఢిల్లీలో న్యాయవాదులందరూ నిషేధిస్తూ తీర్మానం చేసినందువల్ల, గౌతమ్ నవ్లాఖా, నిత్యా రామకృష్ణన్‌లు నా దగ్గరికి వచ్చి వాదిస్తారా అని అడిగినప్పుడు నేను సిద్ధపడ్డాను.

కొన్ని సందర్భాలలో నా దగ్గరికి కేసులు ఎందుకు వచ్చాయంటే, అవతలి పక్షం ప్రలోభాలు చూపితే అమ్ముడుపోని న్యాయవాది కావాలని ఒక పక్షం అనుకున్నప్పుడు నా పేరు వచ్చింది. ఆ మాదిరిగా కొన్ని కేసులు వచ్చాయి.

ఈ యాభై సంవత్సరాలలో ఎన్ని కేసులు చేసి ఉంటానో లెక్కలేదు. వేల కేసులు చేసి ఉంటానేమో. నిజంగా ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే చాలా ఎక్కువ పని చేశాననిపిస్తుంది. ఒకానొక సమయంలో నా ఆఫీసులో ఏడుగురు జూనియర్లు ఉండేవారు. వాళ్లందరికీ తగిన జీతాలు ఇవ్వగలిగినంత పని ఉండేది. అట్లాగే ఆ జూనియర్లను నేను చేసేలాంటి పనే చేయమని నేను ఎప్పుడూ నిర్బంధించలేదు. నేను రాజకీయ సంబంధమైన కేసులు చేస్తున్నప్పుడు కూడా వాళ్లు మామూలు కేసులే చేస్తుండేవాళ్లు. నేనేదో వాళ్లను నా పనికి ఉపయోగించుకుంటున్నానని వాళ్లు అనుకోగూడదని నాకు ఉండేది.

నా జూనియర్లందరిలోనూ ప్రకాశ్ ఒక్కడే ఇష్టపూర్వకంగా సికింద్రాబాద్ కుట్ర కేసు పనిలో నాకు సహకరించాడు. మిగిలిన జూనియర్లను నేను ఎప్పుడూ ఈ కుట్ర కేసులపని,

నక్సలైటు కేసులపని చూడమని అడగలేదు. పోలీసులు వాళ్లను తప్పుడు కేసుల్లో ఇరికించడం వంటి వేధింపులకు ఎక్కడ గురి చేస్తారోనని నాకు సందేహం ఉండేది. చట్టపరమైన, న్యాయశాస్త్రపరమైన విషయాలలో నేను వాళ్లందరితోనూ చర్చింస్తుండేవాడిని కాని వాళ్లకు ఈ కేసులపని ఎప్పుడూ అప్పగించలేదు. భార్గవా కమిషన్ పనిలో కూడా వాళ్లను భాగస్తులను చేయలేదు. అంతకు ముందు బోనాల కృష్ణారావుతో కలిసి పని చేస్తున్నప్పటి నుంచే ఇటువంటి కేసులు చేయడం అలవాటు ఉంది కనుక మహదేవన్ మాత్రం బెంగుళూరు కుట్రకేసులో సహాయపడ్డాడు. నేను కూడా ఈ కేసువల్ల తనకు కాస్త పేరు వస్తుంది గదా అని అందులో భాగస్తుడిని చేశాను.

సాధారణంగా నక్సలైట్ల కేసులు, రాజకీయ సంబంధమైన కేసులు చేసే న్యాయవాదులకు చాలా పేరు ప్రఖ్యాతులు వస్తాయి. అది వాళ్లకు ఆ తర్వాత న్యాయవాదవృత్తిలో ఉపయోకరంగా ఉంటుంది. అయితే నా విషయంలో ఈ కేసులవల్లనే నాకు పేరు వచ్చిందని నేను అనుకోవడంలేదు. ఎందుకంటే నేను ఈ కేసులు చేపట్టకముందే, 1969-70 నాటికే న్యాయవాదిగా నాకు తగినంత పేరు వచ్చింది. ఆ రోజుల్లోనే నేను నెలకు ఐదు వేల రూపాయలు సంపాదించగలుగుతుండేవాణ్ని. ఆ రోజుల్లో అది చాలా ఎక్కువ. అయితే ఆ కేసులు చేయడంవల్ల నా జీవిత గమనంలో చాలాముఖ్యమైన మార్పు వచ్చింది. ఈ కేసులు చేయకపోయి ఉన్నట్లయితే నేను ఎట్లా ఉండే వాడినో నేను చెప్పలేను. ఈ కేసులు చేయడం వల్ల జీవితంలో ఒక ఆదర్శం, ఒక నిబద్ధత ఏర్పడ్డాయి. ఇప్పటికీ నేను ఆ నిబద్ధతతోనే ఉన్నాను.

దేశంలోనూ రాష్ట్రంలోనూ అనేక న్యాయస్థానాలలో నేను వాదించాను. తమిళనాడులో చాలా కేసులు చేశాను. కలకత్తా హైకోర్టుకు వెళ్లి 1968-69లలో జరిగిన ఎన్‌కౌంటర్ హత్యల కేసులు, సరోజ్ దత్తా అదృశ్యం కేసు వాదించాను. చారు మజుందార్ కొడుకు వచ్చి ఆ కేసు చేయమని నన్నుకోరాడు. ఆ కేసే సుప్రీం కోర్టులో కూడా వాదించాను. అలహాబాద్ హైకోర్టులో కూడా ఒక కేసు వాదించాను. ఉత్తరప్రదేశ్ మానవ హక్కుల కమిషన్‌ను ఏర్పరచాలని రవి కిరణ్ జైన్ ఒక ప్రైవేటు కంప్లెయింటు దాఖలు చేస్తే నేను వాదించాను. జబల్‌పూర్ హైకోర్టులో వాదించాను. ఎక్కడి నుంచి ఎవరు వచ్చి పిలిచినా అది ఒక ముఖ్యమైన కేసు అనుకుంటే, న్యాయం జరగవలసి ఉందనుకుంటే వెళ్లి వాదించాను.

కోయంబత్తూరు బాంబు పేలుళ్ల కేసు వాదించాను. అట్లాగే మద్రాసులో రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ కార్యాలయంలో పేలుళ్లు జరిగినప్పుడు ఆ కేసు వాదించమని కూడా నన్ను కోరారు. అప్పుడు పరిశోధనాధికారి విజయరామారావు. తొలి రోజుల్లో ఆ కేసు నేను వాదించిన తర్వాత వెంకటరామన్ అనే మరొక న్యాయవాది ఆ కేసు చూశారు.

ఆర్.ఎస్.ఎస్. కార్యాలయం మీద దాడిని తీవ్రవాద నేరంగా పరిగణించడానికి

వీలు లేదని, టెర్రరిస్టు చట్టం కింద కేసు పెట్టగూడదని నేను వాదించాను. ఎందుకంటే, ఒక రాజకీయ, సాంస్కృతిక సంస్థ కార్యాలయం మీద దాడిని టెర్రరిస్టు నేరంగా పరిగణిస్తూపోతే ఇక ప్రతి రాజకీయ ఘర్షణ కూడా టెర్రరిస్టు నేరంగా మారిపోతుంది అని నేను వాదించాను. అటువంటి వ్యాఖ్యానం ఇవ్వడం మొదలు పెడితే అసలు రాజకీయ కార్యాచరణే టెర్రరిజం అయిపోతుంది అని వాదించాను. ఆ వాదనలు సుప్రీంకోర్టుకు కూడా తీసుకుపోయాను. నా వాదనల సారాంశాన్ని జస్టిస్ వర్మ అర్థం చేసుకున్నారు. అప్పటికి ఆయన ఇంకా ప్రధాన న్యాయమూర్తి కాలేదు. మొత్తానికి ఆ నేరారోపణను ఉపసంహరించుకున్నారు.

అట్లాగే టాంగ్ నోవా అని ఒక పడవ ఉండింది. దాని మీద ఒక కేసు నడిచింది. అది శ్రీలంక తమిళులకు చెందిన పడవ. అది కూడా ఎట్లా టెర్రరిస్టు నేరం అనడానికి వీలు లేదో నేను వాదించాను. అదే మాదిరిగా బొంబాయిలో శ్రీ లంకకు చెందిన తమిళుడు ఇలాంగో నటరాజన్ కేసు చేయడానికి బొంబాయి కోర్టుకు వెళ్లాను. చార్జెస్ ఫ్రేమ్ అయ్యేటప్పుడు వెళ్లి వాదించాను. ఆ తర్వాత అక్కడే ఎవరో చేశారు. ఆ కేసులో ఆయనకు పది సంవత్సరాలు శిక్షపడితే మళ్లీ సుప్రీం కోర్టుకు వెళ్లి వాదించి, ఆ శిక్ష తగ్గేలా చూశాను. అప్పటిదాకా ఆయన జైలులో గడిపిన కాలానికి ఆ శిక్ష తగ్గించారు.

నేను ఆ కేసును డిజిగ్నేటెడ్ కోర్టులో న్యాయమూర్తి గైక్వాడ్ దగ్గర వాదిస్తున్నప్పుడు పక్కన ప్రిన్సిపల్ డిజిగ్నేటెడ్ కోర్టులో న్యాయమూర్తి పటేల్ దగ్గర సంజయ్‌దత్‌ను హాజరుపరిచారు. అక్కడ కోర్టు హాలులో సంజయ్‌దత్ ఏడ్చేశాడు. అప్పుడే దాని మీద ఇన్ డిఫెన్స్ ఆఫ్ సంజయ్ దత్ అని ఒక వ్యాసం రాశాను.

ఆ క్రమంలోనే కోయంబత్తూరులో పేలుళ్ల కేసు వాదించడానికి వెళ్లాను. అక్కడ ఎంత ఘోరం జరుగుతున్నదో బయటి ప్రపంచానికి తెలియదు. అక్కడ ఆ కేసు 167 మంది నిందితుల మీద నడుస్తున్నది. వాళ్ల మీద ఉన్నవి సాధారణ భారత శిక్షాస్మృతికి సంబంధించిన నేరాలే. అవే టెర్రరిస్టు నేరాలు కూడా కాదు. అయినా ఇప్పటి వరకూ వాళ్లకు బెయిల్ రాలేదు. సుప్రీం కోర్టు దాకా కూడా వెళ్లి విఫలమయ్యారు.

అక్కడ జైలులోపల ఒక న్యాయస్థానం కట్టారు. న్యాయమూర్తి ఒక పది అడుగుల పైన కూచుని ఉంటాడు. మిగతా వాళ్లందరూ పది అడుగుల కింద ఉండాలి. న్యాయవాదులు కూచోవడానికి ఒక చిన్న గది కట్టారు. ఆ న్యాయస్థానం హాలుకు వెనుకవైపు ఒక బోను కట్టారు. ఈ నూట అరవై ఏడు మంది నిందితులు జైలు లోపలి నుంచి ఆ బోనులోపలకి వస్తారు. అక్కడ ఉంటారు వాళ్లు. ఇక మరెవరినీ ఆ న్యాయస్థానం లోపలకి అనుమతించరు. ఇంత అన్యాయం జరుగుతుంటే ఎవరూ దాని గురించి మాట్లాడనే లేదు. నిరసన తెలపలేదు. నేను అక్కడికి వెళ్లి ఇది చూసి దిగ్భ్రాంతి చెందాను. ఇట్లా ఉండగూడదని చెప్పి అక్కడే కోయంబత్తూరులో ఒక పత్రికా సమావేశం ఏర్పాటు

చేసి ఆ పద్ధతిని ఎదిరించాను. నేను వాదనలు మొదలుపెట్టిన తర్వాత పత్రికల వాళ్లను జైలులోని న్యాయస్థానంలోకి రానిచ్చారు.

ఇదంతా ఎప్పుడో పాతకథ కాదు. గత నెల ఈ కేసులో వాదించడానికి రమ్మని కోయంబత్తూరు పియుసిఎల్ వాళ్లు నన్ను పిలిచినప్పుడు ఇదంతా నా దృష్టికి వచ్చింది. నేను నిందితులతో మాట్లాడడానికి జైలు లోపలికి వెళ్లాను. నా పేరు చూసి జైలు అధికారులు లోపలికి అనుమతించారు. అప్పుడు నాకు ఈ దారుణం తెలిసివచ్చింది. టెర్రరిస్టు నేరం కూడా కాకుండా కేవలం భారత శిక్షాస్మృతి కింది నేరాలను విచారించడానికి జైలు లోపల ఒక న్యాయస్థానం, న్యాయస్థానం లోపల ఒక జైలు నిర్మించారు. ఇది ఒక ప్రజాస్వామ్య వ్యవస్థలో, బహిరంగ విచారణ జరగవలసిన చోట అక్రమం అని పత్రికా సమావేశం పెట్టి చెప్పాను. ఆ నూటదెబ్బై మంది కుటుంబాల వాళ్లు నన్ను కలవాలని అనుకున్నారు. ఒక హాలులో వాళ్లతో ఒక సమావేశం ఏర్పాటు చేస్తే వెయ్యి మంది వచ్చి కలిశారు.

కోయంబత్తూరులో బాంబు పేలుళ్లు 1998లో జరిగాయి. ఆ బాంబు పేలుళ్లకు కొన్ని రోజుల ముందు అక్కడ హిందూ - ముస్లిం ఘర్షణలు జరిగాయి. కొన్ని కోట్ల రూపాయల విలువైన ముస్లింల ఆస్తుల విధ్వంసం జరిగింది. ఇరవై రెండు మంది ముస్లింలను హత్య చేశారు. ఆ సమయంలో కూడా నేను అక్కడికి వెళ్లాను. అది ఘోరమైన మారణకాండ, ఆ హత్యాకాండ మీద పరిశోధన, విచారణ ఏమీ జరగలేదు. ఆ 22 హత్యలకు కారకులైన నేరస్తులపై ఎటువంటి చర్యలు తీసుకోవడం జరగలేదు. క్రమబద్ధమైన విచారణ జరగలేదు. ఇవన్నీ నేను కల్పించి చెబుతున్నవి కాదు. ఆ తర్వాత కోయంబత్తూరులో అద్వానీ వచ్చినప్పుడు బాంబు పేలుళ్లు జరిగాయి. వాటి మీద మాత్రం కేసు పెట్టారు. అంతకు ముందరి హత్యల మీద ఎటువటి క్రమబద్ధమైన విచారణ జరగలేదని ఆ బాంబు పేలుళ్ల కేసువిచారణలో విచారణాధికారే స్వయంగా ఒప్పుకున్నారు.

* * *

# కోయంబత్తూరు కేసు

కోయంబత్తూరు కేసు గురించి మాట్లాడేటప్పుడు అసలు అది నా చేతికి ఎట్లా వచ్చిందో చెప్పాలి. నాకు వచ్చిన, నేను చేసిన కేసులలో కూడా ఒక క్రమపద్ధతిని చూడడం కష్టమేననుకుంటాను. మన జీవితం ఏ మాదిరిగా గడవబోతోందో మనకు ముందే తెలిసి ఉండడం కష్టం కనుక దాన్ని ఒక క్రమపద్ధతిలో, పట్టిక వేసినట్టుగా నడపడం

అసాధ్యం. నా న్యాయవాద వృత్తి జీవితం కూడా అంతే.

అసలు నా న్యాయవాద వృత్తి జీవితంలో నేను ప్రత్యేకమైన కోరికలేవీ పెట్టుకోలేదు. కాని చాలా కలలు మాత్రం ఉండేవి. నిజానికి నేను న్యాయవాదిని కావాలనే అనుకోలేదు. అదొక పరాన్నభుక్కు వృత్తి అని దానిపట్ల నాకు ఒక చిన్నచూపు ఉండేది. కాని నన్ను చదివించిన మా అన్న న్యాయవాది గనుక ఆయన నన్ను న్యాయవాదిని చేయాలని అనుకున్నాడు. గనుక ఆయన కోరికను నేను తిరస్కరించలేకపోయాను. ఈ విషయాలు ఇది వరకు చెప్పానేమోగాని ఆయనే నన్ను మద్రాసు హైకోర్టులో 1954 నవంబర్‌లో న్యాయవాదిగా నమోదు చేయించాడు. రెండు నెలల తర్వాత ఆయన విమానప్రమాదంలో మరణించాడు. ఇక నేను న్యాయవాదిగా కొనసాగక తప్పలేదు.

నెల్లూరులో బెజవాడ శివకోటారెడ్డి అని ఒక పండితుడు ఉండేవాడు. ఆయన జ్యోతిష్య శాస్త్రంలోనూ, సంఖ్యాశాస్త్రంలోనూ దిట్ట. ఆయనను నేను ఒకసారి నెల్లూరులో వి అనంతరామయ్య గారి ఇంట్లో కలిశాను. ఆయన నన్ను చూసి, "నువ్వు ఐ ఎ ఎస్‌కు ఎంపిక అయినా కూడా దానికి రాజీనామా చేస్తావు. న్యాయవాదిగా పని చేస్తావు. ఆ వృత్తిలోనే పేరు ప్రఖ్యాతులు సంపాదిస్తావు" అని చెప్పాడు. అది నిజమయిందో ఏమో గాని నేను న్యాయవాద వృత్తికే అంకితమైపోయాను.

నేను మద్రాసులో ఉండగానే మద్రాసు రాష్ట్రం నుంచి మా నెల్లూరుతో సహా తెలుగు ప్రాంతాలు విడిపోయి ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కావడం చూశాను. ఆ తర్వాత ఆంధ్ర రాష్ట్రం, హైదరాబాద్ రాష్ట్రంలోని తెలుగు ప్రాంతాలు కలిపి ఆంధ్రప్రదేశ్ ఏర్పడడం చూశాను. ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు తర్వాత నాలుగు సంవత్సరాలకు ఈ కొత్త రాష్ట్రానికి వచ్చి స్థిరపడ్డాను. ఇదంతా చెప్పడం ఎందుకంటే, జీవిత గమనం ఒక పద్ధతి ప్రకారం, పట్టిక వేసుకున్నట్టుగా నడవదని, నడవలేదని చూపడానికే. నా న్యాయవాద వృత్తిలో నేను చేసిన కేసుల కథా అంతే. నా చేతికి ఏ కేసులు ఎందుకు ఎట్లా వచ్చాయో క్రమపద్ధతి ఏమీ లేదు. కోయంబత్తూరు బాంబు పేలుళ్ల కేసు కూడా ఆ మాదిరిగా నా చేతికి వచ్చిందే.

కోయంబత్తూరు బాంబు పేలుళ్లకు రెండు వారాల ముందు అక్కడ ముస్లింల మీద హిందూమూకలు అత్యంత దారుణమైన దాడులు చేశారు. హింసాకాండకు పాల్పడ్డారు. సెల్వరాజ్ అనే పోలీసు కానిస్టేబుల్ హత్య ఆ మత కల్లోలాలకు ఒక సాకు. హిందువులమని చెప్పుకున్న గూండాలు మొత్తంగా 22 మంది ముస్లింలను ఊచకోత కోశారు. కోట్ల రూపాయల సరుకులు, ఆస్తిబుగ్గిపాలు చేశారు. ఇంత పెద్దఎత్తున హత్యలు, లూటీలు, దహనకాండ జరిగితే నేరస్తుల అరెస్టు జరగలేదు. ఎటువంటి నేరపరిశోధన, విచారణ జరగలేదు. పియుసిఎల్ నిజనిర్ధారణలో భాగంగా నేను ఆ దారుణాలు జరిగిన ప్రాంతాలన్నీ సందర్శించాను.

అంతకు ముందు నుంచి కూడా తమిళనాడులో కేసులు చేసిన అనుభవం నాకు ఉంది. అటువంటి కేసులలో మద్రాసు ఆర్.ఎస్.ఎస్. భవనంలో పేలుడు కేసు ఒకటి. ఆ కేసు సందర్భంగా ఆ కేసులో ప్రధాన నిందితులలో ఒకరైన భాషతో నాకు పరిచయమయింది. మళ్లీ ఆయనను కోయంబత్తూరు బాంబు పేలుళ్ల కేసులో కూడా నిందితుడిగా చూపించి నేరారోపణ చేశారు.

ఆ మాదిరిగా నాకు కోయంబత్తూరుతో, కోయంబత్తూరులో అన్యాయానికి గురయిన ముస్లింలతో సంబంధం ఏర్పడింది గనుక, అక్కడ బాంబు పేలుళ్లు జరగగానే అక్కడ ముస్లింల మీద మళ్లీ కక్ష సాధింపు జరుగుతుందనే అనుమానంతో నేను వాళ్ల గురించి కనుక్కోవడం మొదలు పెట్టాను. సెషన్స్ కోర్టులో అభియోగాల దాఖలు జరిగిన తర్వాత, ఆ కేసులో అప్పటికే పని చేస్తున్న ఇద్దరు న్యాయవాదులు భవానికి చెందిన మోహన్, ఈరోడ్‌కు చెందిన తిరుమలరాజన్ నేను కూడా ఆ కేసులో వాదించడానికి వస్తే బాగుంటుందని సూచించారు. నేను వస్తానని, కాని మొత్తం విచారణ జరిపే శక్తిలేదని, కనుక ముఖ్యమైన వాదనల సందర్భంలో మాత్రం వస్తానని అన్నాను.

బహుశా 2005లో అనుకుంటాను కోయంబత్తూరులో ఒక సభ ఏర్పాటు చేసి నన్ను పిలిచారు. ఆ సమయంలోనే నేను జైలుకు వెళ్లి ఆ కేసు నిందితులను కలిశాను. అప్పుడే జైలు లోపల నిర్మించిన న్యాయస్థానాన్ని కూడా చూశాను. అప్పటికి బైటి ప్రజలు ఎవరూ ఆ న్యాయస్థానాన్ని చూడలేదు. ఆ కేసును వాదించబోతున్న న్యాయవాదిగా, న్యాయమూర్తి అనుమతితోనే నేను ఆ న్యాయస్థానానికి వెళ్లాను. ఇక బైటికి రాగానే ఒక పెద్ద పత్రికా సమావేశం పెద్దఎత్తున ప్రాచుర్యం వచ్చింది. తద్వారా ఎటువంటి శిక్షా పడకుండానే, కేసు విచారణలో ఉండగానే ఏడు సంవత్సరాలుగా జైలులో మగ్గిపోతున్న ఆ అభాగ్యుల గురించి బయటి ప్రపంచానికి తెలిసి వచ్చింది.

ఇక నిందితుల తరపున వాదనలు మొదలైన సందర్భంలో 2006 ఆగస్టులో నేను అక్కడ ఐదు రోజులు ఉండి నా వాదనలు వినిపించాను. ఈ కేసులో 170మంది నిందితుల మీద ఇంత కఠినంగా విచారణ, జైలు నిర్బంధం అమలవుతుండగా, ఆ పేలుళ్ల కన్న ముందు జరిగిన 22 హత్యల, ఆస్తి విధ్వంసాల సంఘటనల విషయంలో మెజారిటీ మతస్తుల మీద ఎటువంటి కేసులూ లేవు. విచారణా లేదు.

నేను ఆలోచనా పరులందరి దృష్టికీ తేదలచుకున్న ముఖ్యమైన విషయం ఇదే. ఈ దేశంలో కొన్ని సందర్భాలలోనేమో చట్టబద్ధ పాలన చాలా కచ్చితంగా, కఠినంగా, తు.చ. తప్పకుండా అమలవుతుంది. మరికొన్ని సందర్భాలలోనేమో చట్టబద్ధపాలన తాత్కాలికంగా ఉపసంహరించబడుతుంది. చట్టం ఎదుట సమానత్వం అనే సూత్రానికీ ఇటువంటి అసమాన పద్ధతికీ పొంతన ఎక్కడ అనేదే నా ప్రశ్న.

కోయంబత్తూరులో బాంబు పేలుళ్లు 1998 ఫిబ్రవరి 14 సాయంత్రం జరిగాయి.

ఆ పేలుళ్లు నిజంగా దురదృష్టకరమైనవే. ఆ పేలుళ్లలో 57 మంది అమాయకులు బలి అయిపోయారు. ఆ మారణకాండకు బాధ్యులైన వాళ్లను విచారించి శిక్షించవలసిందే. కాని దాని అర్థం మొత్తం ముస్లిం మతస్తులందరినీ బోనెక్కించి అనుమానంతో చూడాలని కాదు. అట్లాగే, ఇంత పెద్ద నేరం జరిగింది కనుక ప్రభుత్వం రాజ్యాంగ నియమాలను, చట్టబద్ధ పాలనా నియమాలను, న్యాయ సూత్రాలను పక్కపెట్టి కక్ష తీర్చుకోవచ్చునని కాదు. కాని కోయంబత్తూరు పేలుళ్ల కేసులో నిజంగా జరిగినది అదే.

ఇందిరాగాంధీ హత్య తర్వాత 1984లో ఢిల్లీలోనూ ఉత్తర భారతంలో అనేక ప్రాంతాలలోనూ సిక్కు మతస్తుల మీద జరిగిన మారణకాండ విషయంలో కూడా జరిగిందదే. ఇందిరా గాంధీని చంపినది సిక్కులు అని తెలియగానే సిక్కులను ఊచకోత కోయడం ప్రారంభించారు. మరి ఆ హంతకులు సిక్కులు మాత్రమేగాక హోంగార్డులు కూడా కదా. మరి హోంగార్డులందరి మీదా కక్ష తీర్చుకోవచ్చునా?

సరే, కోయంబత్తూరు బాంబు పేలుళ్ల కేసులో వేర్వేరు నేరాలకుగాను మొత్తం 167 మందిని నిందితులుగా చూపారు. ఆరోజే అరెస్టులు ప్రారంభమయ్యాయి. మొత్తం 167 మందిని జుడీషియల్ కస్టడీలో రిమాండ్‌లో నిర్బంధించారు. వారిలో చట్టబద్ధపాలన మీద నమ్మకం ఉన్న వాళ్లు, న్యాయస్థానాల చుట్టూ తిరిగే శక్తి ఉన్న వాళ్లు బెయిల్‌కోసం దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా న్యాయస్థానం, రాష్ట్ర హైకోర్టు కూడా ఆ బెయిల్ దరఖాస్తులను కొట్టివేశాయి. వారిలో కొందరు సుప్రీం కోర్టుకు కూడా వెళ్లగలిగారు గాని అక్కడ కూడా వారి దరఖాస్తులు కొట్టివేయబడ్డాయి. అయితే అసలు విషయమేమంటే, ఆ 167 మందిలో అత్యధిక సంఖ్యాకులు అసలు బెయిల్ కొరకు అభ్యర్థించలేదు. వారందరూ, బెయిల్ కోరుకున్న వాళ్లూ, కోరుకోలేకపోయిన వాళ్లూ కూడా గత తొమ్మిది సంవత్సరాలుగా జైల్లో మగ్గిపోతూనే ఉన్నారు. ఈ కేసు విచారణ క్రమంలో వెయ్యిమందికిపైగా సాక్షులను విచారించడం జరిగింది. ప్రాసిక్యూషన్ తన వాదనలను వినిపించింది. నిందితుల తరఫున వాదనలు త్వరలో పూర్తి కానున్నాయి.

కాని రిమాండ్ కస్టడీలో తొమ్మిది సంవత్సరాలు ఉంచడం సర్వసాధారణంగా ఎప్పుడూ జరగదు. ఇది న్యాయశాస్త్రంలో ఎక్కడా లేని శిక్ష. విధింపుకన్నా ముందే అమలు చేసిన శిక్ష. పదేపదే యాంత్రికంగా బెయిల్ దరఖాస్తులను కొట్టివేయడం అనేది ఎంతగా న్యాయమూర్తుల విజ్ఞతాపూర్వకమైన నిర్ణయం అయినప్పటికీ చట్టంపేరు మీద జరిగే హింస అని చెప్పక తప్పదు. ఇటువంటి చట్టం, హింస విషయంలోనే మేనకాగాంధీ కేసు (1978)లోనూ ఇతర సందర్భాలలోన చట్టం ఎదుట సమానత్వం అంటే నిరంకుశ నిర్ణయాలు లేకపోవడం కూడా అని నిర్వచించడం జరిగింది. చట్టాన్ని అక్రమంగా, అన్యాయంగా అన్వయించడం సరయినదికాదని తీర్పులున్నాయి. ఇటువంటి చట్టహింస జరగకుండా ఉండాలనే అధికరణం 21 నిర్దేశిస్తుంది. న్యాయస్థానాలే స్వయంగా ఈ

సూత్రాలను ఉల్లంఘిస్తే అవి న్యాయదేవతలుగా మిగలవు. కార్యనిర్వాహక వర్గం కన్నా ఎక్కువ నిరంకుశంగా మారిపోతాయి. తమ ముందుకు వచ్చిన అనుమానితులను విచారణ లేకుండానే శిక్షించే పనికి న్యాయస్థానాలు పూనుకుంటే అది ప్రజాస్వామిక సూత్రాలు పెద్ద ఎత్తున ఉల్లంఘనకు గురికావడానికి దారి తీస్తుంది.

ఈ కేసులో ఒక ముఖ్యమైన విషయమేమంటే ఇందులోని నిందితులందరి మీద ఉన్న అభియోగాలు భారత శిక్షాస్మృతికి, పేలుడు పదార్థాల చట్టానికి, ఆయుధాల చట్టానికి సంబంధించినవే. అంటే బ్రిటిష్ సామ్రాజ్యం రోజుల నుంచీ తరతరాలుగా అమలులో ఉన్నచట్టాల పరిధిలోనివే. అంటే విచారణలో కొత్త పద్ధతులేమీ పాటించనక్కరలేదు. ఆ నేరాలు ప్రత్యేక చట్టమయిన పోటా కిందికి రావు. పాత 1967 చట్ట వ్యతిరేక కార్యకలాపాల (నిరోధ) చట్టాన్ని 2004లో సవరించి, దాన్ని పోటాతో సమానం చేసి యుపిఏ ప్రభుత్వం తెచ్చిన చట్టం కిందికి రావు. ఈ సవరణ చట్టంలో 1987 టాడాలో బెయిల్‌కు సంబంధించి ఉన్న నిబంధనలన్నిటినీ ప్రవేశపెట్టారు.

ఒక్క మాటలో చెప్పాలంటే కోయంబత్తూరు విచారణ భవిష్యత్తులో ఇస్లామిక్ తీవ్రవాదులని పేరు పెట్టిన వారందరి మీద అమలు జరపబోయే విచారణకు రంగం సిద్ధం చేస్తున్నట్టుంది. మావోయిస్టుల వంటి రాజకీయ మిలిటెంట్లను ఏ విచారణా లేకుండా చంపివేస్తారు. అప్పటికే అపఖ్యాతిపాలైన చరిత్ర ఉన్న న్యాయమూర్తులను, పోలీసు అధికారులను మానవ హక్కుల కమిషన్లలో నియమించి వారి చేత ఈ హత్యలకు ఆమోదాలు పొందుతారు. ఇక ఇస్లామిక్ తీవ్రవాదులనబడేవారిని కోయంబత్తూరు తరహా చట్టబద్ధపాలనతో నిర్మూలిస్తారు. వేధిస్తారు.

చట్టబద్ధపాలన అనే సంస్కృతిని మనలో చాలా మంది, ముఖ్యంగా న్యాయవాదులు తమలో సంలీనం చేసుకుని దాని ద్వారానే రాజ్యాంగాన్ని నిర్వహించాలని అనుకోకపోవడం నిజంగా దురదృష్టకరం. రాజ్యాంగంలోని ప్రవేశికలో ప్రకటించుకున్న ఉదాత్త ఆదర్శాల గురించి న్యాయవాదులలో తగినంత అవగాహన లేకపోవడంవల్ల వాళ్లే ఆ తర్వాతి కాలంలో న్యాయమూర్తులుగా మారినప్పుడు గుడ్డిగా ఒక పక్షం తీసుకుంటున్నారు. తమ మనసులలోని హేతురహితమైన అభిప్రాయాలు, అపోహలు వదుల్చుకోకుండానే, సాంప్రదాయిక ముసుగులతోపాటే వారు న్యాయపీఠాలు అధిరోహించినప్పుడు రాజ్యాంగానికీ ప్రజాస్వామ్యానికీ చెప్పరాని నష్టం సంభవిస్తుంది. కోయంబత్తూరు జైలులో ముస్లింల విచారణలో బయటపడినది అదే.

ఈ నిందితులను విచారణ జరుపుతున్న న్యాయస్థానం కోయంబత్తరు సెంట్రల్ జైలు లోపల ప్రత్యేకంగా నిర్మించబడింది. అది ఒక బ్రహ్మాండమైన నిర్మాణంగా చూపరులను ఆకర్షిస్తుంది. దానిలోకి గాలీ వెలుతురూ ధారాళంగా వస్తాయి ఘోరమైన నేరాలుచేసిన వారినీ, రాజకీయ నేరాలు చేసిన వారినీ ఈ మాదిరిగా ఎవరికీ కనబడకుండా

విచారించడం చాలా బాగుందని అని కొందరు అనవచ్చు. ఇటువంటి అనుమానితులను ఈ విధంగా వేరు చేసి విచారించడం ద్వారా నేరాన్ని ఇతరులతో కలవకుండా వేరుగా ఉంచినట్టు అవుతుందని కూడా వారు అనవచ్చు. ఇప్పటికే నేర విచారణలో ఇలా విడిగా ఉంచే క్వారంటైన్ అనే పద్ధతి ఉందిగాని అది చాలా అరుదుగా మాత్రమే వాడతారు.

ప్రతి న్యాయస్థానం హాలులోనూ ఒక కొసన కాట్రగడ కట్టి ఉంటుంది. నిందితులను ఆ కాట్రగడ వెనుక వరుసగా నిలబెడతారు. వారు ఆ ప్రదేశాన్ని దాటి న్యాయస్థానంలో అటూ ఇటూ తిరగడానికి వీలులేదు. చార్జిషీటులో ఇచ్చిన వరుస ప్రకారం నిందితులు ఆ కాట్రగడ వెనుక నిలబడవలసి ఉంటుంది. నిందితులను గుర్తుపట్టే ప్రక్రియ కోసం ప్రాసిక్యూషన్ వారు ఈ పద్ధతిని పూర్తిగా వినియోగించుకుంటారు. అసలు ఈ గుర్తింపు ప్రక్రియ ప్రాసిక్యూషన్ వాదనలను రుజువు చేయడంలో చాలా ముఖ్యమైన ప్రక్రియ, సాక్షులు తడబడకుండా, పొరబడకుండా తామునేరస్తులనుకున్న వారిని ఈ నిందితుల లోపలి నుంచి గుర్తుపట్టాలి. ఆ మాదిరిగా వారు కచ్చితంగా గుర్తుపట్టడం మీదనే నిందితుల నేర నిరూపణ ఆధారపడుతుంది. కాని దాన్ని ఈ మాదిరిగా, నిందితులను వరుసగా నిలబెట్టడం ద్వారా, దుర్వినియోగం చేస్తారన్న మాట.

సరే. ఆ కోయంబత్తూరు జైలు లోపల చాలా ప్రజాధనాన్ని వెచ్చించి ఒక న్యాయస్థానం కట్టారు. న్యాయం మీద ఒక దౌర్జన్య చిహ్నంగా జరిగిన ఈ నిర్మాణంలో చాలా క్రమబద్ధమైన పద్ధతి ఉంది. చీమలు ఊడా దొరబడడానికి వీలు లేని ఆ పకడ్బందీ చెరసాలలోపల, ఎవరినీ బయటికి తప్పించుకుపోనీయని మహా బలమైన ద్వారాల వెనుక నిర్మాణమైన ఆ చట్టబద్ధపాలనా మూర్తీభవ రూపాన్ని ఎంత అద్భుతంగా నిర్మించారంటే ఆ భవనాన్ని చూస్తుంటే మీరు చట్టబద్ధ పాలన లక్ష్యాన్ని మరిచిపోయి, దాన్ని కుదించి నిర్మించిన ఈ భవనపు బ్రహ్మాండత్వంలో మైమరిచిపోతారు. ఆ న్యాయస్థానం హాలు లోపల ఎత్తయిన న్యాయమూర్తి పీఠానికి ఎదురుగా మరొక చిన్న చెరసాలను నిర్మించారు. ఆ చిన్న చెరసాలకూ న్యాయమూర్తి పీఠానికీ మధ్య న్యాయవాదులు, సాక్షులు ఉండడానికి ఏర్పాటు చేశారు. అంటే నిందితులు, న్యాయవాదులు, న్యాయమూర్తి, చివరికి విచారణ కూడా చట్టబద్ధ పాలనను దారుణంగా నిర్బంధించిన సందర్భంలో ఉన్నాయన్నమాట. అసలు ఆ చిన్న చెరసాల జంతుప్రదర్శనశాలల్లో పులులనూ సింహాలనూ బంధించి పెట్టే బోనులాగ ఉంది.

చట్టబద్ధపాలనలో ప్రముఖ్యంగా ఉండే విషయమేమంటే నిందితుల విచారణ అన్ని సందర్భాలలోను బహిరంగ న్యాయస్థానంలో, ఆసక్తిగల ప్రజలు ఎవరయినా వచ్చి విచారణ క్రమాన్ని చూడడానికి వీలుగా జరుగుతూ ఉండాలి. ఇది 'న్యాయం జరగడం

మాత్రమే కాదు, జరిగినట్టుగా అనిపించాలి కూడా' అనే సహజ న్యాయసూత్రంలో భాగమైన అంశం. న్యాయం జరగడం, జరిగినట్టుగా కనిపించడం - ఈ రెండూ సమానమైనవే, ఒకటి తక్కువా కాదు మరొకటి ఎక్కువా కాదు. మన న్యాయవ్యవస్థలో ఇందిరాగాంధీ హత్య కేసు విచారణలో ఈ అంశం మీద చాలా ఉద్రేకపూరితమైన చర్చ జరిగింది. బహిరంగ న్యాయస్థానం, బహిరంగ విచారణ అనేవి రాజ్యాంగ బద్ధమైన ప్రాథమిక హక్కులలో భాగం కావనే మాట నిజమే. కాని అధికరణం 21ని విస్తరించినప్పుడు అవి అందులో భాగమవుతాయి. రాజ్యాంగంలోని అధికరణం 21 'చట్టం ద్వారా స్థాపితమైన పద్ధతిలో తప్ప మరొకరకంగా స్వేచ్ఛనుగాని, ప్రాణాన్ని గాని కొల్లగొట్టడానికి వీలులేదు' అని నిర్దేశిస్తుంది. 1975 తర్వాత సుప్రీంకోర్టు ప్రాయశ్చిత్తం చేసుకునే స్థితిలో పడింది గనుక ఈ 'చట్టం ద్వారా స్థాపితమైన పద్ధతి' అనే దాన్ని సక్రమమైన, న్యాయబద్ధమైన పద్ధతి అని పునర్నిర్వచించింది. నిజం చెప్పాలంటే అత్యవసర పరిస్థితిలో ప్రజలను ఘోరంగా వంచించిన న్యాయస్థానమే జైళ్లలో నిర్బంధానికి గురైన ప్రజలకు ఏయే హక్కులు ఉన్నాయో సుదీర్ఘంగా వివరించడం మొదలు పెట్టింది.

* * *

## బహిరంగ విచారణ ప్రాముఖ్యం

రాజ్యాంగంలో బహిరంగ విచారణ స్థానం ఏమిటనే విషయం ఇందిరాగాంధీ హత్యకేసులో నిందితులు కేహార్ సింగ్ తదితరుల విచారణ సమయంలో చర్చకు వచ్చింది. బ్రిటిష్ పాలకులు రూపొందించిన క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 1898 ప్రకారం బహిరంగ విచారణ అనే సూత్రం ఉంది. కాని ఆ తర్వాత భారత స్వాతంత్ర్యోద్యమాన్ని అణచడానికి ప్రవేశపెట్టిన ప్రత్యేక చట్టాలలో ఈ హక్కును బ్రిటిష్ పాలకులు నిరాకరించారు. 1973 క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లో కూడా బహిరంగ విచారణ సూత్రాన్ని భాగం చేయడం జరిగింది. కాని ఇక్కడ ఒక ప్రత్యేక నిబంధనలో ఒక విచారణకు ప్రజలను బహిరంగంగా అనుమతించకూడదని గాని, ప్రత్యేకంగా ఒక వ్యక్తిని అనుమతించకూడదని గాని ఒక న్యాయస్థానం భావించినప్పుడు తప్ప సర్వసాధారణంగా న్యాయస్థానంలో విచారణ బహిరంగంగా ఉండవలసిందేనని అన్నారు. అంటే బ్రిటిష్ పాలనలోని సామ్రాజ్యవాద ఉదారవాద దృక్పథాన్ని మనం పాటించినట్టు కనబడుతుంది. చట్టబద్ధ పాలన సూత్రాన్ని గురించి రాసిన న్యాయశాస్త్ర కోవిదులందరూ బహిరంగ న్యాయస్థానం అనేది ఎంత విలువయినదో రాశారు. కేహార్ సింగ్ విచారణలో న్యాయమూర్తి జగన్నాథ్ శెట్టి బహిరంగ

విచారణ గురించి సుదీర్ఘంగా వివరించారు గాని అక్కడ ఆ మినహాయింపును సమర్థించుకోవడానికి సాధారణ సూత్రాన్ని కావలసినదాని కన్నా ఎక్కువ వివరించారు.

న్యాయ వ్యవస్థ నిర్వహణలో ప్రజాస్వామ్యం కొనసాగాలి. ప్రజాస్వామ్యం కొనసాగుతున్నదని నమ్మకం కలగాలంటే విచారణ బహిరంగంగా ఉండాలి. న్యాయ నిర్వహణ సక్రమంగా, చట్టబద్ధంగా జరుగుతున్నదా లేదా, సాక్షుల విచారణ, సాక్ష్యాధారాల నిరూపణ సక్రమంగా, న్యాయబద్ధంగా జరుగుతున్నదా లేదా అని చూసే అధికారం ప్రజలకు ఉండాలి.

అసలు ఇంతకీ నేరాల విచారణ బహిరంగంగా ఎందుకు జరగాలి? జస్టిస్ శెట్టి తన తీర్పులో అమెరికన్ న్యాయశాస్త్ర కోవిదుడు కూలీ వాదనలను ఉదహరించారు. "సాక్షుల వాంగ్మూలాలను మెరుగుపరిచే ప్రక్రియ ద్వారా కచ్చితంగా నిజనిర్ధారణ జరిపే ప్రజల భాగస్వామ్యపు పాత్ర కూడా విచారణ సక్రమంగా ఉండడం అనే బాధ్యతతోపాటే కలిసి సాగవలసి ఉంటుంది. దీన్ని మూడు పద్ధతులలో జరుపవచ్చును. వాస్తవమేమిటో తెలిసి ఉండే అవకాశం ఉన్న సాధారణ ప్రజానీకాన్ని న్యాయస్థానంలో ప్రవేశించనివ్వడం ద్వారా ఒక సాక్షి అబద్ధపు సాక్ష్యం ఇవ్వకుండా నివారించడం. రెండు, ప్రజల సమక్షంలో ఇతర భాగస్వాములందరిలాగనే సాక్షి కూడా చిత్తశుద్ధితో సాక్ష్యం చెప్పేలా చూసి తద్వారా వాంగ్మూలాల స్థాయిని, ప్రమాణాలను మెరుగుపరచడం. మూడు, విచారణ క్రమం గురించి బహిరంగంగా ప్రకటించడం ద్వారా అప్పటికి బయటపడని సాక్షులు తమంత తామే ముందుకు వచ్చి వాంగ్మూలాలు ఇచ్చేలా ప్రోత్సహించడం."

"అంతేకాదు, విచారణలో ప్రజలు బహిరంగంగా పాల్గొనేలా చేయడం ద్వారా ప్రజలకు నేర విచారణ, పరిశోధన ఎలా జరుగుతాయో అవగాహన పెరగడానికి దోహదం చేయడం కూడా ముఖ్యమే. న్యాయ విచారణా క్రమం ఏ మాదిరిగా నడుస్తుందో ప్రజలకు అవగాహన కలిగించడం విజ్ఞానవంతమైన పౌరచర్చకు అత్యవసరం. అందువల్ల ఒక ప్రత్యేక కేసు విచారణలో మాత్రమేగాక, అవతల గణనీయమైన ప్రభావం వేయగల అంశాలలో విధాన నిర్ణయాలు తీసుకోవడానికి కూడా ఇది ఉపయోగపడుతుంది. అసాధారణమైన సాక్ష్యాధారాల నియమాల వంటి వాటి మీద బహిరంగ ప్రజాచర్చ జరిగితే ఆ నియమాలు వాస్తవ విచారణల మీద ఎటువంటి ప్రభావాలు వేస్తున్నాయో ప్రజలు గుర్తించి మార్పు కోసం చర్చిస్తారు. నేర విచారణలలో ప్రజలను ఎక్కువగా పాల్గొననిస్తే పోలీసులు, ప్రాసిక్యూటర్లు, న్యాయవాదులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు ఎటువంటి కార్యకలాపాలకు పాల్పడుతున్నారో ప్రజలకు తెలిసివస్తుంది. నేర విచారణా వ్యవస్థలో ఎటువంటి లోపాలు జరుగుతున్నాయో, వాటిని ఎట్లా పరిష్కరించవచ్చునో ప్రజలు అవగాహనతో నిర్ణయాలు తీసుకుంటారు."

"చివరిగా, నేర విచారణలకు ప్రజలను విరివిగా రానిస్తే అది ఒక ముఖ్యమైన

సూర్యకాంతి బాధ్యతను - అంటే క్రమక్రమంగా వెలుగులు విరజిమ్మే పనిని - నిర్వహిస్తుంది. రహస్య విచారణలు, మరీ ముఖ్యంగా అవి ఒక కేసులో ఏకైక న్యాయ విచారణా క్రమాలు అయినప్పుడు, లేదా అవి తదనంతర న్యాయ విచారణలను ప్రభావితం చేయగలిగినవి అయినప్పుడు, తప్పనిసరిగా న్యాయవ్యవస్థను సంబంధించి అపనమ్మకానికి వీలు కలిగిస్తాయి."

న్యాయ విచారణ బహిరంగంగా ఉండడం ఏ లక్ష్యాల కొరకు,ఏ అవసరాల కొరకు అవశ్యకమో ఇంత అద్భుతమైన న్యాయశాస్త్ర కోవిదుడు కూలీ వాదనలను ఉటంకించిన తర్వాత కూడా మన అత్యున్నత న్యాయస్థానం బహిరంగ విచారణను పక్కనబెట్టి రహస్య విచారణను ఎట్లా ఎంచుకున్నదో చూడండి. కేహార్‌సింగ్ తదితర నిందితుల విచారణను ఢిల్లీలోని తిహార్ జైలు లోపల మాత్రమే జరపాలని న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు హైకోర్టులోనూ, సుప్రీంకోర్టులోనూ కూడా చర్చకు వచ్చింది.

మొట్టమొదట న్యాయమూర్తులు జైలు లోపల న్యాయస్థానం ఎట్లా ఉంటుందో తెలుసుకోవాలనుకున్నారు. అప్పుడు ప్రాసిక్యూషన్ చెరసాలలోపల న్యాయస్థానం ఎట్లా ఉండబోతుందో ఒక నమూనా చిత్రపటాన్ని అందజేసింది. తిహార్ జైలులోని సిబ్బంది కార్యాలయాన్ని న్యాయస్థానం హాలుగా వాడతామని చెప్పారు. అది జైలు ఆవరణలో స్వతంత్రంగా కొద్ది దూరాన ఉన్న ఒక ఒంటరి భవనం. జైలుకూ ఆ భవనానికీ మధ్య కాస్త మైదానం ఉంది. ఆ మైదానంలోకి ప్రవేశించిన వారెవరయినా నేరుగా ఆ న్యాయస్థానం హాలు దగ్గరికి వెళ్లవచ్చు. వారు జైలు ఆవరణలోకి ప్రవేశించనక్కరలేదు.

ఆ భవనంలో ఒక న్యాయస్థానపు హాలు ఉంది. ఒక న్యాయవాదుల గది ఉంది. న్యాయమూర్తికి ఒక ప్రత్యేక ఛాంబర్ ఉంది. ఆ న్యాయస్థానంలో కూర్చుని విచారణ చూడడానికి యాభై మంది పట్టే సందర్శకుల గది ఉంది. ఆ గదిలో మరికొంత మంది నిలబడడానికి కూడా చోటు ఉంది. నిందితుల కోసం బుల్లెట్ ప్రూఫ్ గదిని కూడా ఏర్పాటు చేశారు. ఆ విచారణ చూడడానికి కొందరు అంతర్జాతీయ పాత్రికేయులను కూడా అనుమతించారు. కాకపోతే ఈ ప్రవేశం మీద పరిమితులు ఉండినాయి. ఈ ఏర్పాట్లన్నీ చూసిన న్యాయమూర్తులు సంతృప్తి చెందారు. పైన ఉటంకించిన కూలీ చెప్పిన ప్రమాణాలన్నీ ఇక్కడ సరిపోయాయని వాళ్లు భావించారు.

కాని ఒక జైలు ప్రాంగణంలోపల ఉండే న్యాయస్థానం ప్రజలు రావడానికి అనుకూలంగా ఉంటుందా? అటువంటి న్యాయ స్థానంలోకి స్వేచ్ఛగా, సౌకర్యంగా సందర్శకులు ప్రవేశించగలరా? అటువంటి సందర్శకుల మీద నిఘా ఉండదా? అక్కడ జరిగే న్యాయ విచారణను నివేదించి విలేకరులు స్వేచ్ఛగా ఆ పని చేయగలరా?

ఎప్పుడూ కుతర్కంతో నిర్ణయాలు చేయడం కుదరదు. కాని న్యాయస్థానం ఆమోదించిన ఈ కుతర్కం వల్లనే ఆ తర్వాతి కాలంలో బహిరంగ విచారణ అవసరం లేదనే సూత్రాన్ని

టెర్రరిస్టు చట్టాలలో భాగం చేయడం వీలైంది. బహిరంగ విచారణ అనే సూత్రాన్ని ఎంతగా అపహాస్యం చేయడం జరిగిందంటే, మాజీ ప్రధాని పి వి నరసింహారావు మీద విచారణను విజ్ఞాన్‌భవన్ ప్రాంగణంలో బహిరంగంగానే జరిపారు. కాని అంత విశాల స్థలం ఆయన చుట్టూ ఉండే రక్షణ సిబ్బంది కోసం పనికి వచ్చింది. తప్ప ఆ విచారణ మామూలు ప్రజలు పాల్గొనడానికి జరిగిన బహిరంగ విచారణ కాదు.

ప్రజాస్వామ్యమంటే అప్పటికి అధికారంలో ఉండే ప్రభుత్వం తాత్కాలికంగా నిర్వచించేది కాదు. రాజ్యాంగం సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని ఒక ఆదర్శంగా పాటించవలసిన బాధ్యతగా కూడా ప్రకటించింది. ప్రజాస్వామ్యానికి మూలం అనవరతమైన జాగరూకతే అన్నప్పుడు అది అరిగిపోయిన మాటకాదు. అది ప్రజాస్వామ్యం మనుగడ సాగించడానికి ఒక అవశ్యకత.

* * *

# ప్రాథమిక హక్కుల కోసం నల్లకామన్ పోరాటం

నేను కోయంబత్తూరు కేసు వాదించడానికి వెళుతున్న సమయంలోనే నాకు మదురైకి సంబంధించిన నల్లకామన్ కేసు గురించి తెలిసింది. ఒక రకంగా అది యాదృచ్ఛికంగా నా దృష్టికి వచ్చింది. అది మదురైలోని చిన్నకేసని, దాంట్లో నేను వాదిస్తే బాగుంటుందని అక్కడి న్యాయవాదులు మోహన్, రాజు తదితరులు నాతో అన్నారు. పైకి చూడడానికి వ్యక్తిగతమైన కేసులాగ కనబడుతుంది గాని అది నిజానికి ఒక ప్రత్యేకమైన, అసాధారణమైన మానవ హక్కుల కేసు. అసలు నాకు ఏమనిపిస్తుందంటే నల్లకామన్‌కు మానవ హక్కుల అవార్డు ఇవ్వాల్సి ఉంది. ఎందుకంటే నల్లకామన్ తన ప్రాథమిక హక్కుల కోసం వ్యక్తిగత స్థాయిలో చేసిన పోరాటం అవిశ్రాంతంగా ఇరవై ఐదు సంవత్సరాలపాటు సాగింది. ఆ నల్లకామన్ ఉదంతం ఏమిటో కాస్త వివరంగా చెప్పాలి,.

అది ఒక విచిత్రమైన కేసు. ఒకే సంఘటనకు సంబంధించి మూడు రకాల విచారణలు నడిచాయి. అందువల్ల మూడు రకాల తీర్పులు వచ్చాయి. ఆ మూడు విచారణలలో ఒకటి మదురైలోని వాడిపట్టి పోలీసుస్టేషన్‌లో అప్పుడు సబిన్‌స్పెక్టర్‌గా పని చేస్తుండిన ప్రేమ్ కుమార్ మీద నల్లకామన్ వేసిన ప్రైవేటు కంప్లెయింట్. రెండవది వాడిపట్టి పోలీసుస్టేషన్‌లో నమోదైన నేరానికి సంబంధించి నల్లకామన్ మీద పోలీసులు పెట్టిన కేసు. ఆ కేసు సందర్భంగా నల్లకామన్ మీద జరిగిన హింసను నిరసిస్తూ పెద్దఎత్తున స్థానిక ప్రజాందోళన జరిగింది గనుక అప్పటి రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ విచారణ

జరిపి సబిన‌స్పెక్టర్ ప్రేమ్‌కుమార్ మీద, మరొక ముగ్గురు కానిస్టేబుళ్ల మీద ప్రాసిక్యూషన్ విచారణ జరపాలని నివేదిక ఇచ్చినందువల్ల జరిగిన కేసు మరొకటి.

వీటిలో మొదటి కేసులో ప్రేమ్‌కుమార్ తదితరులు నిర్దోషులని న్యాయస్థానం తీర్పు చెప్పడంతో నల్లకామన్ ఆ తీర్పును సవాలు చేస్తూ పై కోర్టుకు అప్పీలు చేశాడు. అట్లాగే రెండో కేసులో తన మీద విధించిన శిక్షను సవాలు చేస్తూ కూడా నల్లకామన్ హైకోర్టుకు అప్పీలుకు వెళ్ళాడు. మూడవ కేసులో ప్రేమ్‌కుమార్, తదితరులు తన మీద విధించిన శిక్షను సవాలు చేస్తూ అప్పీలుకు వెళ్లారు. ఆ మాదిరిగా ఈ మూడు కేసులు హైకోర్టులో విచారణకు వచ్చాయి. ఈ మధ్యలో మరికొన్ని వివాదాలు కూడా జరిగి ఈ మూడు కేసులను కలిపి విచారించాలని హైకోర్టు, సుప్రీంకోర్టు కూడా ఆదేశాలు ఇచ్చాయి.

అది 1982 జనవరి లోనో ఫిబ్రవరిలోనో ప్రారంభమైన కేసు నల్లకామన్ పదవీ విరమణ చేసిన ఒక సైనిక అధికారి. ఆయన భైరవ్ సింగ్ అనే ఒక రిజర్వ్ సబ్ ఇనస్పెక్టర్‌కు ఐదు వేల రూపాయలు అప్పు ఇచ్చాడు. ఆ ప్రాంతంలో ఒక పద్ధతి ఏమంటే ఆ మాదిరిగా ఇచ్చిన అప్పుకుగాను అప్పు తీసుకున్న వ్యక్తికి చెందిన ఇంట్లో అద్దె ఇవ్వకుండా ఉండవచ్చు. ఆ అప్పుకు వడ్డీ ఉండదు. తమిళంలో దన్ని ఒత్తి అంటారు. అట్లా వాడిపట్టిలో భైరవ్ సింగ్‌కు చెందిన ఇంట్లో నల్లకామన్ ఉండేవాడు.

ఎప్పుడైనా భైరవ్‌సింగ్ తన బాకీ తీర్చివేసి, నల్లకామన్‌ను ఇల్లు ఖాళీ చేయమని అడగవచ్చు. కాని భైవర్‌సింగ్ తన బాకీ తీర్చేసి నల్లకామన్‌కు ఇల్లు ఖాళీ చేయమని అడగడానికి బదులు, నల్లకామన్ తన ఇంటిని ఖాళీ చేయడం లేదని స్థానిక వాడిపట్టి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆ ఫిర్యాదు మీద అక్కడి సబ్ ఇనస్పెక్టర్ ప్రేమ్‌కుమార్ వెంటనే నల్లకామన్‌ను పట్టుకురమ్మని పోలీసులను పంపించాడు. ఆ ప్రేమ్‌కుమార్ ఇప్పుడు ఎస్పీ స్థాయికి యెదిగి మొన్న శంకరాచార్య కేసులో విచారణాధికారిగా పనిచేసి ప్రముఖుడయ్యాడు. పోలీసులు వెళ్లి నల్లకామన్ మీద ఒత్తిడి చేస్తామని కాగితం తీసుకొచ్చారు. ఆ క్రమంలో నల్లకామన్‌ను కొట్టారు. సంకెళ్ళు వేసి వీధుల్లో తిప్పారు. నల్లకామన్‌ను 1982 జనవరిలోనో ఫిబ్రవరిలోనో కొడితే, అదే పోలనులు అదే సంవత్సరం అక్టోబర్‌లో నన్ను, తార్కుండేను కూడా కొట్టారు.

నిజానికి నల్లకామన్‌కు, భైరవ్‌సింగ్‌కు మధ్య వచ్చిన వివాదం సివిల్ వివాదం. ఈ వివాదాన్ని సివిల్ న్యాయస్థానానికి నివేదించడం తప్ప ప్రేమ్‌కుమార్ మరొక పని చేసి ఉండగూడదు. కాని అందరు పోలీసు అధకారులలాగనే ప్రేమ్‌కుమార్ తన అధికారాన్ని, హోదాను దుర్వినియోగం చేసి నల్లకామన్ మీద హింసను, దౌర్జన్యాన్ని ప్రయోగించాడు. దానితో నల్లకామన్ తనను ఎక్కడ అరెస్టు చేస్తారోననే భయంతో ముందస్తు బెయిల్ కూడా సంపాదించి పెట్టుకున్నాడు.

ఒకవైపు సివిల్ కేసును క్రిమినల్ కేసులాగ పోలీసు అధకారి మార్చజూస్తుండగా

నల్లకామన్ దాన్ని పూర్తిగా సివిల్ కేసుగానే చూశాడు. తాను అప్పు ఇచ్చిన మొత్తాన్ని తనకు తిరిగి ఇప్పించే ప్రయత్నాలు చేయవలసిందిగా మాజీ సైనికుల సంక్షేమ బోర్డుకు ఒక వినతి పత్రం ఇచ్చాడు. ఆ బోర్డుకు చెందిన అసిస్టెంట్ డైరెక్టర్ వెంటనే తన యూనిఫారం వేసుకుని, రైఫిల్ పట్టుకుని భైరవ్‌సింగ్ మీద యుద్ధానికి బయల్దేరలేదు. దానికి బదులుగా, తన అధికారాన్ని దుర్వినియోగం చేయని పౌరులందరూ చేసినట్టుగానే స్థానిక పోలీసు అధికారికి ఒక ఫిర్యాదు పంపించాడు. మళ్లీ ఆ స్థానిక పోలీసు అధికారి ప్రేమ్‌కుమారే. ఒత్తి అప్పు భైరవ్‌సింగ్ నుంచి నల్లకామన్‌కు వెనక్కి వచ్చేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని, ఒక క్రమశిక్షణ గల సైనికుడిగా తాను చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకోదలచలేదని, చట్టబద్ధంగా ఈ సమస్యను పరిష్కరించమని ఆ అసిస్టెంటు డైరెక్టర్ రాశాడు.

అటువంటి విజ్ఞప్తి రాగానే ఒక పోలీసు అధికారి చేయవలసిందల్లా ఆ ఫిర్యాదును పరిశీలించి, విచారణ జరపదగిన నేరం జరిగిందా లేదా ధృవపరచుకుని, అభియోగాన్ని నమోదు చేయాలి. ఆ నమోదు చేయడానికి, ఆ తర్వాత పరిశోధన జరపడానికి ఏ పద్ధతులను అనుసరించాలో క్రిమినల్‌ప్రొసీజర్ కోడ్ చాలా స్పష్టంగా నిర్దేశించింది. ఆ పని చేసేటప్పుడు అనుమానితుడి ప్రాణాన్ని, స్వేచ్ఛను భంగపరచడకూడదని, అంటే భౌతికంగా గాయాలు గాని, శారీరక హానిగాని జరగని పద్ధతిలోనే ఆ పరిశోధన జరగాలని క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ నిర్దేశించింది. రాజ్యాంగంలోని అధికరణం 14, 21లను ఆ రకంగానే అర్థం చేసుకోవాలి. ఒక అనుమానితుడికి అరెస్టయిన క్షణం నుంచీ కూడా తన పక్కన తన న్యాయవాదిని ఉంచుకునే హక్కు ఉందని అధికరణం 22 (1)(2) నిర్దేశిస్తుంది. ప్రఖ్యాతమైన నందినీ శతపథి కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఈ విషయాన్ని పునరుద్ఘాటించింది. అనుమానితుడు కూడా ఒక పౌరుడేనని, అతని హోదా ఏమయినప్పటికీ ఒక మనిషిగా అతనికి సముచిత గౌరవం అందించవలసిందేనని గుర్తించవలసి ఉంది.

ఒక అనుమానితుడికి చేతులకు సంకెళ్లు వేయడం, గొలుసులతో కట్టి గుంజుకోవడం ఏ స్థాయిలోని పోలీసు అధికారి అయినా చేయగూడని పనులు. ఈ విషయం మన న్యాయస్థానాలలో అనేకసార్లు చర్చకు వచ్చింది. సేన్ గుప్తా తదితరుల కేసులో జస్టిస్ రత్నవేలు పాండియన్ 1990లో ఈ చర్చనంతా అద్భుతంగా సమీక్షించి నిర్దేశక సూత్రాలు ప్రకటించారు. అయినా చేతులకు సంకెళ్లు వేయడం, గొలుసులతో కట్టడం, వీధుల్లో నడిపించడం వంటి హింసాత్మక చర్యలు దేశమంతా అమల్లో ఉన్నాయి. చేతులకు బేడీలు వేయడం ఎందుకంటే తన మీద జరిగే హింసను అడ్డుకునే అవకాశం నిర్బంధితుడికి లేకుండా చేయడానికి.

ఈ కేసులో కూడా నల్లకామన్‌ను పోలీసు స్టేషన్‌కు రప్పించారు. అంగీ విడిపించి,

చేతులకు బేడీలు తొడిగి, అర్ధనగ్నంగా వీధుల్లో నడిపించారు... నల్లకామన్ అలా వీధుల్లో నడిపిస్తుంటే ప్రజలందరూ చూశారు. మధ్యలోనే నల్లకామన్ భార్య, ఉపాధ్యాయురాలు సీని అమ్మాళ్‌ను కూడా పోలీసు స్టేషన్‌కు పిలిపించారు. వాళ్ల అబ్బాయిని కూడా స్టేషన్‌కు తీసుకపోయారు. అందరినీ కొట్టారు. ఇవన్నీ ఆ కుటుంబం మీద అధికారికంగా పోలీసులు, ప్రత్యేకించి సబినస్పెక్టర్ జరిపిన అత్యాచారాలు, మానవ హక్కుల ఉల్లంఘనలు.

ఇదంతా జరిగిన తర్వాత నల్లకామన్ తనను కొట్టిన పోలీసుల మీద ఒక ప్రైవేటు కంప్లెయింటు దాఖలు చేశాడు.

మరోవైపు, ఈ దౌర్జన్యం అంతా సాగుతుండగా చూసిన జనం పెద్దఎత్తున నిరసన తెలిపినారు. సబినస్పెక్టర్కు వ్యతిరేకంగా ఒక ఊరేగింపు జరిగింది. ఆ నిరసన ప్రదర్శనలు కలెక్టర్ దృష్టికి వచ్చాయి. అందుకని ఒక విచారణ జరపమని ఆర్డీవోను ఆదేశించాడు. ఈలోగా ఎస్ఐ ప్రేమ్‌కుమార్ కూడా నల్లకామన్ మీద ఒక కేసు నమోదు చేశాడు. ఒక ప్రభుత్వోద్యోగి విధులు నిర్వహించకుండా నల్లకామన్ అడ్డుకున్నాడని, హత్యాయత్నం చేసినాడని ఆ కేసులో అభియోగాలు మోపాడు. మరొకవైపు ఆర్డీవో విచారణ నివేదికను కలెక్టర్ ప్రభుత్వానికి పంపించాడు. ప్రభుత్వం ప్రేమ్‌కుమార్ మీద కేసు నడపవచ్చునని ఆదేశించింది.

అంటే సంఘటన ఒకటేగాని మూడు కేసులు నమోదయ్యాయి. జపనీస్ చిత్ర దర్శకుడు అకిరాకురసోవా తీసిన ప్రఖ్యాత చిత్రం రోషోమన్ కథమాదిరి అయిందన్నమాట. ఆ సినిమాలో కూడా ఒక వాస్తవ ఘటనకు ఎన్ని వైపుల కథనాలుంటాయో చూపడానికి కురసోవా ప్రయత్నించాడు.

నల్లకామన్ శరీరం మీద 19 గాయాలు, కొడుకు శరీరం మీద 5 గాయాలు ఉన్నాయని గుర్తించారు. పోలీసు స్టేషన్‌కు రమ్మని పిలుపు రాగానే నల్లకామన్ తనను పోలీసులు ఏమైనా చేస్తారనే అనుమానంతో తనకు, తన భార్యకు ముందస్తు బెయిల్ కోసం న్యాయస్థానాన్ని అభ్యర్థించి, సంపాదించుకున్నాడు. ఆ బెయిల్ ఉండగా కూడా ప్రేమ్‌కుమార్ ఈ అక్రమ నిర్బంధం, కొట్టడం, సంకెళ్లు వేసి వీధుల్లో నడిపించడం చేశాడు.

కలెక్టర్ దాఖలు చేసిన అభియోగాలు చెల్లవని ప్రేమ్‌కుమార్ హైకోర్టులో ఒక పిటిషన్ వేశాడు. ఊరికే కేసులో కాలయాపన జరగాలని ఒక దాని మీద ఒకటిగా పిటిషన్లు వేస్తూ పోయాడు. హైకోర్టులో ఈ కొట్టివేత పిటిషన్‌ను అనుమతించారు. అలా అనుమతించడం తప్పని నల్లకామన్ సుప్రీంకోర్టుకు అప్పీలుకు వెళ్లాడు.

సుప్రీం కోర్టులో అలా కొట్టి వేయడం తప్పని చెబుతూ ఈ మూడు కలిపి విచారించాలని తీర్పు చెప్పారు. అప్పుడు ప్రేమ్‌కుమార్ తన మీద ఈ కేసులు ఉండడంవల్ల,కేసులలో జాప్యంవల్ల తన ఉద్యోగ విధులు నిర్వహించడం

కష్టమవుతున్నదని, కనుక ఈ కేసులను తొందరగా తేల్చివేయాలని మరొక పిటిషన్ వేశాడు. కాని ఈసారి ప్రతివాదులు జాబితాలో నల్లకామన్ పేరు చేర్చలేదు. నల్లకామన్ తనను కూడా ప్రతివాదిగా గుర్తించాలని జోక్యం చేసుకున్నాడు. అక్కడ నల్లకామన్ అసలు విషయాలు చెప్పాడు. కేసు ఆలస్యం కావడానికి ప్రేమ్‌కుమార్ కారణమని, కేసు తన వల్ల ఆలస్యం కాలేదని, కేసును తప్పుదారి పట్టించడానికే ప్రేమ్‌కుమార్ ఈ మాదిరి రిట్ వేశాడని వాదించాడు. హైకోర్టు ఆ వాదనలు అంగీకరించి ప్రేమ్ కుమార్‌ను చివాట్లు కూడా పెట్టింది. అయితే ఈ కాలమంతా ప్రేమ్‌కుమార్‌ను సస్పెండ్ చేయలేదు సరిగదా ప్రమోషన్ల మీద ప్రమోషన్లు ఇస్తూనే పోయారు. అతను ఎస్‌పి స్థాయికి ఎదిగి, శంకరాచార్య కేసు చేసి, డిఐజి ప్రమోషన్ పొందడానికి సిద్ధంగా ఉన్నాడు.

మొత్తానికి ఏదో ఒక సాకు చెబుతూ, అడ్డంకి కల్పిస్తూ, పై కోర్టులకు వెళుతూ కేసు ఆలస్యమపోయి, నల్లకామన్ తనంతటతానే విసుగువచ్చి విరమించుకునేలా చేయాలని ప్రేమ్‌కుమార్ చాలా ప్రయత్నించాడు.

ఆ ప్రయత్నాలన్నీ విఫలం కాగా, చివరికి తనను మళ్లీ మదురైకి ఎస్పీగా బదిలీ చేసేలా చూసుకున్నాడు. మదురైకి రాగానే కేసును తారుమారు చేయడానికి ప్రయత్నించాడు. చివరికి 2000లో మూడు కేసుల మీద సెషన్స్ కోర్టు తీర్పులు చెప్పింది. ప్రేమ్‌కుమార్ వేసిన కేసులో ప్రభుత్వాధికారి విధులు నిర్వర్తించకుండా అడ్డుకున్నందువల్ల నల్లకామన్ నేరస్తుడేనని సెషన్స్ న్యాయమూర్తి అన్నాడు. కాని ప్రొబేషన్ ఆఫ్ అఫెండర్స్ చట్టం కింద శిక్ష విధించకుండా వదిలేశాడు. కలెక్టర్ దాఖలు చేసిన కేసులో ప్రేమ్‌కుమార్ నేరస్తుడేనని నిర్ధారించి మళ్లీ ప్రొబేషన్ ఆఫ్ అఫెండర్స్ చట్టం కింద శిక్ష విధించకుండా వదిలేశాడు. నల్లకామన్ వేసిన కేసును మాత్రం కొట్టేసినాడు.

ఈ సెషన్స్ తీర్పుల మీద పునర్విచారణ జరపాలని అప్పీళ్లు దాఖలయ్యాయి. ఆ అప్పీళ్లు జస్టిస్ జయపాలన్ ముందుకువచ్చాయి. ఆయన వాదనలు విని, విచారణ జరిపాడుగాని తీర్పు చెప్పకుండానే మద్రాసుకు బదిలీ అయి వెళ్లిపోయాడు. ఆ తర్వాత నేను వాదించాను. మళ్లీ ఆ న్యాయమూర్తి కూడా తీర్పు చెప్పకుండానే వెళ్లిపోయాడు. మరొక న్యాయమూర్తి ముందు మళ్లీ నేను వాదించవలసి వచ్చింది.

ఆ విధంగా నల్లకామన్ కేసులో వాదించడానికి మద్రాసు హైకోర్టుకు చెందిన మదురై బెంచి ముందుకు నేను వెళ్లాను. 2007 మార్చి 13న నేను రెండు మూడు గంటలు వాదించాను. మార్చి 16న నా వాదనలు లిఖిత పూర్వకంగా సమర్పించాను.

ఒక వేళ చట్టవ్యతిరేకంగా గుమికూడడం (అన్ లాఫుల్ అసెంబ్లీ) అనే నేరం జరిగిందని చెప్పడానికి తగిన ఆధారాలున్నాయి. ఎందుకంటే సబ్ ఇనస్పెక్టర్ ప్రేమ్‌కుమార్, ఇద్దరు, ముగ్గురు కానిస్టేబుళ్లు ఉన్నారని సాక్షులందరూ చెబుతున్నారు. భైరవ్‌సింగ్ కూడా అక్కడే ఉన్నాడు. అతను అక్కడ ఉన్నాడని, అతను రెచ్చగొట్టడం వల్లనే, అతని ప్రోద్బలం మీదనే ఈ ఘర్షణ జరిగిందని అందరికీ తెలుసు. కాని, అతని పేరును ఎవరూ ఎక్కడా

ప్రస్తావించలేదు. నల్లకామన్ మాత్రమే తన ఫిర్యాదులో అతని పేరు ప్రస్తావించాడు. భైరవ్ సింగ్‌ను ఒక నిందితుడిగా చూపాడు. భైరవ్‌సింగే పోలీసులను రెచ్చగొట్టి నల్లకామన్‌ను, అతని భార్యను, కొడుకును కొట్టేలా చేశాడు. కనుక అక్కడ ఐదుగురికన్నా ఎక్కువ మంది ఉన్నారనేది స్పష్టంగా రుజువవుతోంది. అంటే దాన్ని అన్ లాఫుల్ అసెంబ్లీగా గుర్తించి అందుకు తగిన శిక్ష విధించవలసిందేగాని, దాన్ని విస్మరించడం కుదరదు అని నేను వాదించాను.

అది ఒక విడి సంఘటన కాదని, దానికి వ్యతిరేకంగా మొత్తం పట్టణమే నిరసన ప్రకటించింది గనుక దాన్ని ప్రజా ఆగ్రహానికి చిహ్నంగా చూడాలని నేను వాదించాను. అందువల్ల అది తప్పనిసరిగా మానవ హక్కుల ఉల్లంఘన అవుతుంది. ఒక పోలీసు అధికారి మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడితే దానికి అతనికి శిక్ష వేసి కూడా ప్రొబేషన్ ఆఫ్ అఫెండర్స్ చట్టం కింద మినహాయింపు ఎట్లా ఇస్తారు అని నేను ప్రశ్నించాను.

ఒక పోలీసు అధికారిని ప్రొబేషన్ ఆఫ్ అఫెండర్స్ చట్టం కింద వదిలిపెట్టడానికి వీలే లేదని నేను వాదించాను. మేధాపాట్కర్ నడిపిన నర్మదా బచావో ఆందోళన తొలి రోజుల్లో ఇట్లాగే ఒక వ్యక్తిని అరెస్టు చేసి గొలుసులు వేసి లాక్కుపోతే, దాని మీద సుప్రీంకోర్టులో జస్టిస్ సేన్ గుప్తా ఇచ్చిన తీర్పు ఒకటి ఉంది. అట్లాగే రత్నవేలు పాండియన్ అని వాళ్ల హైకోర్టు న్యాయమూర్తి ఇచ్చిన తీర్పు ఒకటి ఉంది. నేనవి ఉటంకించి చట్టపరమైన వైఖరి ఏ మాదిరిగా ఉండాలో వివరించాను.

ఇదంతా ఏదో న్యాయవాదులకే తెలిసిన, వాళ్లు మాత్రమే మాట్లాడగలిగిన సాంకేతిక వ్యవహారం కాదు. ఇది మామూలు ప్రజలందరూ తెలుసుకోవలసిన విషయం. న్యాయశాస్త్ర పరిభాషను కాసేపటికి పక్కనపెట్టి అయినా ఈ నల్లకామన్ కేసు గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. ఈ కేసు పైకి చూడడానికి ఒక అప్పు తిరిగి చెల్లించకపోవడం కేసులాగ, సివిల్ తగాదా లాగ కనబడుతుందిగాని, దీనిలో ప్రాథమిక హక్కులు, మానవ హక్కులు, పోలీసు అత్యాచారాలు, పోలీసుల అనుచిత ప్రవర్తన, ప్రజల నిరసన, న్యాయస్థానాల నిర్లక్ష్యం, ఒక వ్యక్తి పట్టువదలని పోరాటం మొదలైన విషయాలెన్నో ఉన్నాయి.

మొదటిసారి, 1982 ఫిబ్రవరిలో నల్లకామన్‌ను పోలీసు స్టేషన్‌కు తీసుకు వచ్చి బెదిరించిన సందర్భంలో, సబ్ ఇనస్పెక్టర్ ఇల్లు ఖాళీ చేయమని బెదిరించినప్పుడు కూడా నల్లకామన్ తన అప్పు తిరిగి చెల్లిస్తేనే ఇల్లు ఖాళీ చేస్తానని మొండికేశాడు. అప్పుడు తమ సబ్ ఇనస్పెక్టర్‌కు ఎదురు తిరిగిన నల్లకామన్‌ను ముగ్గురు కానిస్టేబుళ్లు చితక బాదడం మొదలుపెట్టారు. ఆ దెబ్బల గాయాలు 19 చోట్ల ఉన్నాయని నమోదయింది.

ఆ తర్వాత నల్లకామన్ భార్య సీని అమ్మాళ్‌ను తీసుకురమ్మని ప్రేమ్ కుమార్ కానిస్టేబుళ్లను పంపించాడు. ముగ్గురు మహిళా కానిస్టేబుళ్లు సీని అమ్మాళ్ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న పాఠశాలకు వెళ్లి ఆమెను తీసుకువచ్చారు. ఇల్లు ఖాళీ

చేసి బైరవ్‌సింగ్‌కు ఎందుకు అప్పగించలేదని ఆమెను కూడా ప్రశ్నించారు. ఇచ్చిన అప్పు వెనక్కి తిరిగి రాలేదు గనుక ఇల్లు ఖాళీ చేయలేదని ఆమె అన్నప్పుడు ప్రేమ్‌కుమార్ బూతులు తిట్టడం మొదలుపెట్టాడు. ఆమెను లంజా అని తిట్టాడు. తనకు అతని తల్లి వయసు ఉందని, ఒక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తూ గౌరవప్రదమైన జీవితం గడుపుతున్నానని, తనతో అటువంటి భాషలో మాట్లాడడం తగదని ఆమె మర్యాదగా చెప్పింది.

దానితో ప్రేమ్‌కుమార్ బూతులు పెంచడం మాత్రమేగాక, ఆమె చీరలాగి, వీపు మీద లాఠీతో కొట్టడం మొదలు పెట్టాడు. అక్కడే ఉన్న నల్లకామన్ అడ్డుకోవడానికి ప్రయత్నించాడు. అప్పుడిక ప్రేమ్ కుమార్ ఇద్దరినీ కొట్టి, చేతులకు సంకెళ్లు వేసి లాకప్ లోకి తోశాడు. తల్లినీ తండ్రినీ పోలీసుస్టేషన్‌కు తీసుకుపోయారని తెలిసి కొడుకు మధివనన్ అక్కడికి పరుగెత్తుకొచ్చాడు. అతడిని కూడా పోలీసులు విపరీతంగా కొట్టారు.

ఆ తర్వాత నల్లకామన్‌ను చేతులకు సంకెళ్లతో, గొలుసులతో వాడి పట్టి ప్రధాన వీధిలో బస్టాండ్ దాకా నడిపించారు. ఆ దారంతా నల్లకామన్ వంటి నుంచి నెత్తురోడుతూ ఉండింది. దారిలో కూడా అతనిని కొడుతూ తిప్పుతూ మళ్లీ పోలీసుస్టేషన్‌కు తీసుకుపోయారు. అదంతా 1982 ఫిబ్రవరి 1న జరిగింది.

ఈ ఘటన తర్వాతి రోజున 500 మంది పంచాయత్ యూనియన్ ఉపాధ్యాయులు ఈ పోలీసు అత్యాచారానికి వ్యతిరేకంగా ఒక ఊరేగింపు తీశారు. న్యాయం జరగాలని డిమాండ్ చేశారు. ఈ ఊరేగింపు శాంతియుతంగా జరిగింది. ఈ మర్నాడు, అంటే ఫిబ్రవరి 3న స్థానిక రాజకీయ పార్టీలన్నీ వాడిపట్టిలో బంద్ నిర్వహించాయి. ఆ మర్నాడు కూడా ఉపాధ్యాయులు మరొక ఊరేగింపు, నిరసన ప్రదర్శన జరిపారు. ఈ మర్నాడు ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడి నాయకత్వంలో ఒక ఊరేగింపు వెళ్లి కలెక్టర్‌ను కలిసి తమ డిమాండ్ల పత్రం అందజేసింది. ఆ మర్నాడు అన్ని రాజకీయ పార్టీలు ఒక పెద్ద ఊరేగింపు తీసి సభ నిర్వహించాయి.

ఈ నేపథ్యంలో మదురై జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించాడు. ఫిబ్రవరి 17న తమిళ దినపత్రికలలో ఈ విచారణ గురించిన ప్రకటన అచ్చయింది. నల్లకామన్ కుటుంబం మీద జరిగిన పోలీసు హింసకు సంబంధించిన సమాచారం ఉన్న వారెవరయినా విచారణాధికారిగా ఉన్న ఉసిలంపట్టి ఆర్‌డిఓ వద్ద తమ పేర్లు నమోదు చేయించుకోవాలని ఆ ప్రకటనలో తెలియజేశారు. మొత్తం 289 మంది వాంగ్మూలాలు ఇస్తామని పేర్లు నమోదు చేయించుకున్నారు. విచారణ జరిగినప్పుడు 212 మంది హాజరయిన తమ వాంగ్మూలాలు ఇచ్చారు.

ఈ ఘటన క్రమమంతా చూస్తే ఆ సంఘటన ఆ పట్టణంలో ఎంత సంచలనానికి దారితీసిందో అర్థమవుతుంది.

విచారణ జరిపిన ఆర్‌డిఓ ఒక వివరమైన నివేదికను కలెక్టర్‌కు పంపాడు. నల్లకామన్‌ను, అతని కుటుంబ సభ్యులను స్థానిక సబ్ ఇనస్పెక్టర్, కానిస్టేబుళ్లు పోలీసు స్టేషన్ లోనూ, బయటా కూడా చిత్రహింసలకు గురిచేశారని ఆ నివేదికలో నిర్ధారించారు. ఆ నివేదికను, కలెక్టర్ ఉత్తర్వులను అనుసరించి, ఆర్‌డిఓ 1983 ఎస్‌ఐ ప్రేమ్‌కుమార్ మీద, ముగ్గురు కానిస్టేబుళ్ల మీద నేరారోపణలతో ఫిర్యాదు దాఖలు చేశాడు.

ఆ ఆర్‌డిఓ నివేదిక చాలా వివరమైన విచారణ తర్వాతనే రాయబడిందిగనుక నా వాదనలలో ఆ నివేదిక మీదనే ఎక్కువగా ఆధారపడ్డాను.

ఈ సంఘటన జరిగినప్పుడు పోలీసు సబ్ ఇనస్పెక్టర్‌గా ఉండిన ప్రేమ్‌కుమార్ ప్రభుత్వోద్యోగి లాగా ప్రవర్తించలేదు. నల్లకామన్‌కు భైరవ్‌సింగ్‌కు మధ్య జరిగినది ఒక సివిల్ తగాదా. భైరవ్‌సింగ్ పక్షాన్నే న్యాయం ఉన్నదని ప్రేమ్‌సింగ్ అనుకున్నా న్యాయం కోసం భైరవ్‌సింగ్ ఒక సివిల్ న్యాయస్థానాన్ని ఆశ్రయించవలసి ఉంటుందని ఒక పోలీసు అధికారిగా ప్రేమ్‌కుమార్ చెప్పి ఉండవల్సింది.దానికి బదులు, ప్రేమ్ కుమార్ పోలీసు అధికారిగా తన అధికారాన్ని, హోదాను ఉపయోగించి భైరవ్‌సింగ్‌కు ప్రయోజనం చేకూర్చాలని అనుకున్నాడు. హింసను ప్రయోగించి సమస్యను పరిష్కరించాలని అనుకున్నాడు.

ఈ ఘటన జరిగేనాటికి భైరవ్‌సింగ్ ఎటువంటి క్రిమినల్ ఫిర్యాదు చేయలేదు. వాడిపట్టి పోలీసుస్టేషన్‌లో నల్లకామన్‌పైనగాని, సీని అమ్మాళ్‌పైన గాని ఎటువంటి ఫిర్యాదు పెండింగ్‌లో లేదు. అంటే ప్రేమ్‌కుమార్ తనకు అధికారం లేని వ్యవహారంలో, తన పరిధిలోలేని విషయంలో అవసర జోక్యం చేసుకున్నాడన్నమాట. తనకు అధికారంలేని విషయంలో జోక్యం చేసుకున్నాడు కాబట్టి అది ప్రభుత్వోద్యోగిగా తన విధి నిర్వహణలో భాగం కాదు.

అట్లాగే ప్రభుత్వమే విచారణకు ఆదేశించి, ఆ తర్వాత క్రిమినల్ నేరారోపణలు కూడా చేసినందువల్ల ప్రేమ్‌కుమార్‌కు ప్రభుత్వోద్యోగిగా విధి నిర్వహణలో భాగంగానే ఆ పనులు చేశానని రక్షణ పొందడానికి కూడా అవకాశం లేదు. ప్రభుత్వోద్యోగులకు కొన్ని పనుల విషయంలో శిక్షాస్మృతులు మినహాయింపులు ఇచ్చాయిగాని ఆ మినహాయింపు పొందాలంటే ఆ అధికారి చేసిన పని తన విధి నిర్వహణలో భాగంగా అందిన అధికారాల లోపల జరిగిందని తేలాలి. ప్రేమ్ కుమార్ చేసిన పనులు ఆ పరిమితులలోపల జరగలేదు.

ప్రేమ్‌కుమార్, ఇతర నిందితులు తమ అధికారపరిధిలోపల విధి నిర్వహించక పోవడం మాత్రమేకాదు, తమ అధికారాన్ని అతిక్రమించడం మాత్రమే కాదు. వీధి రౌడీల్లా ప్రవర్తించారు. ప్రభుత్వం అంతకుముందే వారి మీద తీసుకున్న చర్యలు చూస్తే ప్రభుత్వం కూడా వారు తమ అధికారాన్ని అతిక్రమించారని అంగీకరించినట్టు స్పష్టమవుతుంది.

కింది కోర్టు ప్రేమ్‌కుమార్ నేరం చేశాడని నిర్ధారిస్తూనే అతడిని ప్రొబేషన్ ఆఫ్ అఫెండర్స్ చట్టం సెక్షన్ 3 కింద వదిలి పెట్టవచ్చునని తీర్పు చెప్పింది. కాని మానవ హక్కులను ఉల్లంఘించిన ఒక పోలీసు అధికారికి ఈ ప్రొబేషన్ ఆఫ్ అఫెండర్స్ చట్టాన్ని వర్తింప చేయవచ్చునా? పౌర, రాజకీయ హక్కులపై అంతర్జాతీయ ప్రకటన (1976) వంటి అంతర్జాతీయ న్యాయసూత్రాలపై సంతకం చేసిన దేశంలో ప్రభుత్వోద్యోగులు చేసిన హింసాత్మక నేరాల విషయంలో ఆ అంతర్జాతీయ ప్రకటనలను విస్మరించవచ్చునా? చట్టాల అమలు సమయంలో భౌతిక హింసను అమలు చేయడానికి అవకాశం ఉన్న ప్రభుత్వోద్యోగులు ఫిర్యాదులేని నేర ప్రవర్తనకు తలపడినప్పుడు దాన్ని అడ్డుకోవాలంటే చట్టాలను సక్రమంగా అమలు చేయడం ఒక్కటే మార్గమని సుప్రీంకోర్టు అనేకసార్లు చెప్పింది.

ఈ వాదనలు చేసే క్రమంలోనే ప్రేమ్ కుమార్‌కు వ్యతిరేకంగా మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం. కర్పగవినాయగం చేసిన వ్యాఖ్యలను పరిగణనలోకి తీసుకోవడం అవసరం. నల్లకామన్ వల్ల తన కేసు ఆలస్యం జరుగుతోందని కనుక వెంటనే కేసును ముగించి తనకు విముక్తి కలిగించాలని ప్రేమ్‌కుమార్ వేసిన కేసులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

"ఆలస్యం నల్లకామన్ వల్ల జరగలేదనేది వాస్తవం. కేసు ఆలస్యం కావడానికి అనేక కారణాలున్నాయి. వాటికి ప్రేమ్‌కుమారే మూలం. నల్లకామన్‌కు వ్యతిరేకంగా ఆరోపణలు వచ్చినప్పటికీ, ఈ కోర్టు, సుప్రీం కోర్టు కూడా అన్ని కేసులనూ కలిపి విచారించాలని తీర్పు ఇచ్చాయి. కేసుకొట్టివేయమని ప్రేమ్‌కుమార్ వేసిన ఈ దరఖాస్తులో నల్లకామన్ పేరును ప్రతివాదుల్లో చేర్చలేదు. ఈ కోర్టు చెప్పిన మీదటనే నల్లకామన్‌ను రెండవ ప్రతివాదిగా చేర్చడం జరిగింది. నల్లకామన్ ఇచ్చిన వివరాలపై జారీ అయిన నాన్ బెయిలబుల్ వారెంటు 2001 ఏప్రిల్ 23 నుంచి అమలు కాకుండా ఉన్నదని తెలుస్తోంది. అంటే ఒక సంవత్సరంపాటు ఆ వారెంటు అలా అమలు కాకుండా నిలిచి ఉన్నదన్నమాట. దానికి ఏకైక కారణం ఆ వారెంటును అమలు చేయవలసిన అధికారుల కన్నా పై స్థానంలో, పోలీసు సూపరింటెండెంట్‌గా ప్రేమ్‌కుమార్ ఉండడమే" అని ఆయన వ్యాఖ్యానించారు.

ఆ మాదిరిగా కేసు విచారణ ఆలస్యం కావడానికి ప్రేమ్‌కుమార్ ఆరోపించినట్టుగా నల్లకామన్ కారణం కాదనీ, నిజానికి ప్రేమ్‌కుమార్ ప్రవర్తనవల్లనే ఆ ఆలస్యం జరిగిందనీ న్యాయస్థానం కూడా అంగీకరించింది.

అసలు ప్రేమ్‌కుమార్‌కు వ్యతిరేకంగా బెయిల్ ఇవ్వడానికి వీలులేని వారెంటు (నాన్ బెయిలబుల్ వారెంటు -ఎన్ బి డబ్ల్యు) ఎన్నోసార్లు జారీ అయిందనీ, ఇటువంటి ఏ ఒక్క సందర్భంలోనూ పోలీసులు ఆ వారెంటును అమలు చేసి ప్రేమ్‌కుమార్‌ను అరెస్టు

చేయలేదనీ న్యాయస్థానం ముందర నమోదయింది. 1995 సెప్టెంబర్ నుంచి 2003 మార్చి మధ్యలో పదమూడు సార్లు అటువంటి నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ అయ్యాయని న్యాయస్థానం నమోదు చేసింది. అటువంటి వారెంటు ఒకటి 2003 మార్చి 13న జారీ అయిన తర్వాతనే, మార్చి 28న ఆలస్యం జరిగిందనే తర్వాతనే, మార్చి 28న ఆలస్యం జరిగిందనే కారణంతో అసలు విచారణే రద్దు చేయమని ప్రేమ్‌కుమార్ ఉన్నత న్యాయస్థానాన్ని కోరాడు.

ఇదంతా చూస్తే పోలీసు అధికారి ప్రేమ్‌కుమార్‌కు చట్టం పట్ల, సత్యంపట్ల కనీస గౌరవ మర్యాదలు లేవని రుజువవుతున్నదని న్యాయస్థానం వ్యాఖ్యానించింది.

మరొక పక్క ఈ కేసులో ప్రధాన పాత్రధారి అయిన నల్లకామన్ పేరయినా ప్రస్తావించకుండా, తప్పుడు కారణాలు చూపుతూ ప్రేమ్‌కుమార్ దొడ్డిదారిన కేసు విచారణ రద్దు చేయించుకోవడానికి ప్రయత్నించాడు. న్యాయస్థానం ఆదేశించినమీదటనే నల్లకామన్ కూడా ప్రతివాదిగా ఈ కేసులో ప్రవేశించాడు. ఆలస్యానికి ఆయన కారణం కాదనే విషయం నల్లకామన్ వాంగ్మూలాన్ని బట్టి తేటతెల్లమయింది. అంటే న్యాయస్థానాన్ని తప్పుదారి పట్టించడానికి ప్రేమ్‌కుమార్ తన తప్పుడు వాంగ్మూలం ద్వారా ప్రయత్నించాడనేది వాస్తవం. అందువల్ల ఈ కేసు విచారణ ప్రతిరోజూ జరిగి త్వరలో పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవలసిన బాధ్యత ఈ న్యాయస్థానం మీదనే ఉంది అని నేను వాదించాను.

ఇదిలా ఉండగా ప్రేమ్‌కుమార్‌కు శిక్ష విధించి, మినహాయింపు కూడా ఇచ్చిన కింది న్యాయస్థానం ఆ ప్రేమ్‌కుమార్ విచారణలో న్యాయస్థానంతో సహకరించలేదన్న విషయాన్ని, న్యాయస్థానం జారీ చేసిన నాన్ బెయిలబుల్ వారెంట్లు కాకుండా చూడడంలో తన అధికారాన్ని దుర్వినియోగం చేశాడనే విషయాన్ని గుర్తించడంలో విఫలమైంది. ప్రేమ్‌కుమార్‌కు తనపై విచారణ జరుపుతున్న న్యాయస్థానం పట్ల గౌరవం గాని, దాని ప్రతిష్టను గుర్తించాలనే మర్యాదగాని లేవు. ఆ కారణాలవల్లనే ప్రేమ్‌కుమార్‌కు ప్రొబేషన్ ఆఫ్ అఫెండర్స్ చట్టం కింద శిక్షలో రాయితీ, మినహాయింపు ఇవ్వడం సరైనది కాదు.

అంతేకాదు, ప్రేమ్‌కుమార్‌కు, ఇతర ముద్దాయిలకు వారు చేసిన తీవ్రమైన నేరాలకు, వారు చేసిన చిత్రహింసలకు, అత్యాచారాలకు తగిన శిక్ష విధించడంలో కూడా కింది న్యాయస్థానం విఫలమైంది. పోలీసు అధికారులు చిత్రహింసలకు, మానవ హక్కుల, ప్రాథమిక హక్కుల ఉల్లంఘనలకు పాల్పడినప్పుడు ఎంత తీవ్రంగా ప్రతిస్పందించవలసి ఉంటుందో వివిధ హైకోర్టులు, సుప్రీంకోర్టు ఇచ్చిన అనేక తీర్పులను కింది న్యాయస్థానం పరిగణనలోకి తీసుకోలేదు. అట్లాగే ఇచ్చిన రాయితీ కూడా ఆ చట్టం పరిధికి మించినది. మానవ హక్కులను ఉల్లంఘించిన పోలీసు అధికారికి ప్రొబేషన్ ఆఫ్ అఫెండర్స్ చట్టం ఇచ్చే రాయితీలను అనువర్తింప చేయవచ్చునా అనేది వివాదాస్పద అంశం. ఇటువంటి

రాజ్యాంగ వ్యతిరేకమైన ప్రవర్తనను క్షమించినట్టుగా రాయితీలు ఇవ్వడం న్యాయస్థానాలకు విరుద్ధం.

ఇంతకుముందే చెప్పినట్టు ఈ విషయాలన్నీ ఏదో న్యాయశాస్త్రానికి, చట్టానికి సంబంధించిన, న్యాయవాదులు మాత్రమే మాట్లాడవలసిన వ్యవహారాలు కావు. ఇందులో ఇమిడి ఉన్న అంశాల దృష్ట్యా ఇవన్నీ మన దేశంలో న్యాయపాలనకు, చట్టబద్ధ పాలనకు, పోలీసుల ప్రవర్తనకు సంబంధించిన విషయాలు. అంటే మన పౌరుల నిత్యజీవితానికి సంబంధించిన విషయాలు. ప్రజలలో ఇద్దరు వ్యక్తుల మధ్య ఒక సివిల్ తగాదా వస్తే పోలీసులు జోక్యం చేసుకోవచ్చునా, జోక్యం చేసుకుంటే ఎట్లా జోక్యం చేసుకోవాలి. ఆ జోక్యంలో తమ అధికారాన్ని దుర్వినియోగం చేయవచ్చునా, ఆ తగాదా పడిన వారిలో ఒకరి పక్షం తీసుకుని మరొక పక్షానికి చెందిన వ్యక్తుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగించవచ్చునా, వారిని చిత్రహింసలు పెట్టవచ్చునా, వారి మీద తప్పుడు కేసులు నమోదు చేయవచ్చునా, వారి మీద తప్పుడు నేరారోపణలతో న్యాయస్థానాల్ని తప్పుదారి పట్టించవచ్చునా, అధికారాన్ని ఉపయోగించుకుని కోర్టు విచారణ ప్రక్రియలో అడ్డంకులు సృష్టించవచ్చునా - ఇటువంటి ఎన్నో ప్రశ్నలు ఈ నల్లకామన్ కేసు సందర్భంగా తలెత్తుతాయి. అందులోనూ నల్లకామన్ ఈ వ్యవస్థను, చట్టాన్ని ప్రశ్నించిన వాడేమీ కాదు. నక్సలైట్లలాగ ఈ చట్టాన్ని ధిక్కరించాలనుకున్నవాడు కాదు. చట్టాన్ని పాటించాలనుకునే విధేయ పౌరుడు. మాజీ సైనికోద్యోగి.

అందువల్ల ఈ కేసు ఈ దేశంలో పౌరహక్కుల స్థితికి మంచి నిదర్శనం అని నేననుకుంటాను.

సరే, మార్చి రెండో వారంలో నేను నా వాదనలు వినిపించి, లిఖిత పూర్వక వాదనలు కూడా సమర్పించి వచ్చిన తర్వాత ఏప్రిల్‌లో మదురై బెంచి హైకోర్టు తన తీర్పును వెలువరించింది.

ఆ తీర్పులో మూడు కేసుల గురించి మూడు రకాల నిర్ధారణలకు వచ్చారు. నల్లకామన్ మీద విధించిన శిక్ష చెల్లదు అని నేను వాదనను ఒప్పుకోలేదు గాని అంతకు ముందు కింది కోర్టు ప్రొబేషన్ ఆఫ్ అఫెండర్స్ చట్టం కింద నల్లకామన్‌కు ఇచ్చిన రాయితీని సమర్థించారు. అంటే నల్లకామన్ ఏ శిక్షా అనుభవించనక్కరలేదన్నమాట. ఆ తర్వాత, ప్రేమ్‌కుమార్‌కు ప్రొబేషన్ ఆఫ్ అఫెండర్స్ చట్టం వర్తించదని నేను చేసిన వాదన అంగీకరించారు. ఒకనెల శిక్ష విధించారు. ప్రేమ్‌కుమార్‌కు ఇంకా ఎక్కువ శిక్ష విధించాలని నల్లకామన్ వేసిన దరఖాస్తును కొట్టివేశారు.

మొత్తం మీద ఈ తీర్పు మెరుగయినదే. ప్రేమ్‌కుమార్‌కు ఒక నెల శిక్ష విధించారు. కాబట్టి ఇప్పుడతను జైలుకు వెళ్లవలసి ఉంటుంది. అంటే అతడిని ఉద్యోగం నుంచి తొలగించవలసి ఉంటుంది. ఈ శిక్ష ఒక ప్రేమ్‌కుమార్ మీద మాత్రమే కాదు. ఈ

మాదిరిగా పౌరుల మీద చిత్రహింసలకు, అత్యాచారాలకు పాల్పడిన పోలీసు అధికారులు ఎందరో ఉన్నారు. వాళ్లందరికీ ఇది ఒక హెచ్చరికగా ఉంటుంది. నన్నూ, తార్కుండేనూ మదురైలో కొట్టిన అదనపు ఎస్పీ ఉన్నాడు మహమ్మదాలీ అని. అతను ఆ తర్వాత డిఐజీ అయి మొన్న జయలలిత హయాంలో కరుణానిధిని అరెస్టు చేయడానికి వెళ్లికొట్టినాడు. అటువంటి వాళ్లందరికీ ఈ తీర్పు ఒక బెదురుగా పనికొస్తుంది.

ఇప్పుడు కూడా నల్లకామన్ మళ్లీ కోర్టుకు పోదలచుకున్నాడు. హైకోర్టు తన నేరాన్ని నిర్ధారించి తన మీద శిక్షను ఖరారు చేసినందుకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు పోదలచుకున్నాడు. తనకు ప్రొబేషన్ ఆఫ్ అఫెండర్స్ చట్టం కింద రాయితీ ఇచ్చినప్పటికీ అసలు తనను నేరస్తుడిగా నిర్ధారించినందుకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టుకు పోదలిచాడు. అంతకన్నా ముఖ్యంగా ప్రేమ్‌కుమార్‌కు వేసిన శిక్ష సరిపోదని, అతను చేసిన నేరానికి అతనికి అంతకన్నా ఎక్కువ శిక్ష వేయాలని అభ్యర్థిస్తూ సుప్రీంకోర్టుకు పోదలచుకున్నాడు.

ఎట్లాగూ తన శిక్షను రద్దు చేయాలని ప్రేమ్‌కుమార్ సుప్రీంకోర్టుకు వెళతాడు. అలా వెళ్లకపోతే, అతను ఉద్యోగం కోల్పోవలసి వస్తుంది. మొత్తం ఉద్యోగ జీవితమే నాశనమైపోతుంది. అతను వెళ్లినా, వెళ్లకపోయినా, ఆ శిక్షను ఇంకా పెంచాలని నల్లకామన్ మాత్రం సుప్రీంకోర్టుకు వెళ్లదలచుకున్నాడు.

ఈ మొత్తంలో గుర్తించవలసిన విషయమేమంటే నల్లకామన్ అనే ఒక సాధారణ వ్యక్తి సాగించిన పోరాటం. అతని పట్టువదలని తత్వం. అది కూడా ప్రేమ్‌కుమార్ అనే వ్యక్తికి వ్యతిరేకంగా మాత్రమే కాదు. ఈ దేశంలో పోలీసులకు దఖలు పడిన శిక్షాతీత నేరప్రవృత్తి ఏదయితే ఉన్నదో దానికి వ్యతిరేకంగా ఇరవై ఐదు సంవత్సరాలు సుదీర్ఘంగా ఎడతెగని, పట్టువదలని పోరాటం చేశాడు నల్లకామన్. తాము ఎటువంటి నేరం చేసినా, పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగించినా, మానవ హక్కులను ఉల్లంఘించినా తమకు ఎటువంటి శిక్షా ఉండబోదనే ధీమాతో పోలీసులు చేస్తూ వస్తున్న ఘోరమైన నేరాలకు చట్టపరమైన అడ్డంకి ఉన్నదని చూపడంలో నల్లకామన్ విజయం సాధించాడు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఒక పోలీసు అధికారికి వ్యతిరేకంగా చట్టాన్ని రక్షించడం కోసం న్యాయస్థానాలలో పోరాడాడు.

ఈ కేసుల క్రమంలోనే నల్లకామన్ భార్య సీనిఅమ్మాళ్ మరణించింది. ఇప్పుడాయన వయసు అరవైఐదు దాటి ఉండవచ్చు. ఒక కొడుకు ఇప్పుడు న్యాయవాదిగా పని చేస్తున్నాడు. మరొక కొడుకు సైన్యంలో పని చేస్తున్నాడు. తండ్రి ఈ వయసులో ఇట్లా న్యాయపోరాటం చేయడం కొడుకులకు కూడా ఇష్టంలేదు. అది మొండితనం అని వాళ్లనుకుంటారు. "మీరు నాతోమరేదయినా విషయం మాట్లాడవచ్చు. నన్ను ఈ కేసు నుంచి తప్పుకొమ్మని అడిగితే మాత్రం మీరు నాతో మాట్లాడనక్కరలేదు". అని వాళ్లతో ఆయన ఖరాఖండిగా చెప్పేశాడు.

ఇటువంటి పనిని ప్రతిఒక్కరూ క్రమబద్ధంగా, పద్ధతి ప్రకారం చేయగలిగితే ఈ దేశంలో శిక్షాతీత నేర ప్రవృత్తిని తగ్గించవచ్చు. ఫలితం ఏమైనా సరే అని ఈ పోరాటం సాగించాలి. మధ్య దారిలో వదిలేయకుండా ఈ మాదిరిగా సుదీర్ఘమైన పట్టువదలని పోరాటం సాగిస్తే, ఈ దేశంలో పోలీసు సంస్కరణలే అక్కరలేదు. పోలీసు వ్యవస్థ దానికదే బాగుపడే పరిస్థితి వస్తుంది. అసలు దక్షిణ భారతదేశంలో మానవ హక్కుల అవార్డు ఎవరికైనా ఇవ్వదలచుకుంటే అది నల్లకామన్‌కే ఇవ్వాలని నాకు అనిపిస్తోంది.

అట్లా నల్లకామన్ వ్యవహారం నేను కోయంబత్తూరు కేసు చేసుకున్నప్పుడు అనుకోకుండా నా దృష్టికి వచ్చింది. ఆ కేసులో నేను చేయగలిగినదేదో చేశాను. మొత్తానికి నల్లకామన్ మన దేశంలో పౌరహక్కులను కాపాడడంలో, పోలీసుల శిక్షాతీత నేర ప్రవృత్తిని న్యాయస్థానాల దృష్టికి తేవడంలో ఒక ముఖ్యమైన పాత్ర పోషించాడు.

ఇక మళ్లీ కోయింబత్తూరు కేసు విషయంలోకి వెళితే, అది మన న్యాయపాలన, చట్టబద్ధ పాలనకు అవసరమైన కీలకమైన పాఠాలు నేర్పుతుంది. ఈ సంఘటన ద్వారా మనం ఎందువల్ల మైనారిటీలు అంతకంతకూ ఎక్కువగా సొంత న్యాయం వైపు చూస్తున్నారో అర్థం చేసుకోగలుగుతాయి. దేశంలో ఉండవలసిన చట్టబద్ధ పాలన, న్యాయపాలన వాళ్లకు అందినప్పుడు, అది వారిని విఫలం చేసినప్పుడు ఇక మిగిలినది తమ సొంత న్యాయమే అని వాళ్లు అనుకునే అవకాశం ఉంది.

నష్టపరిహారం ఇచ్చినంత మాత్రాన న్యాయం జరిగిందని ప్రజలు అనుకోరు. మైనారిటీలను ఊచకోత కోసి నష్టపరిహారం ఇస్తే దానితో న్యాయం జరిగినట్టుగా వాళ్లు భావించరు. న్యాయం జరగలేదు, డబ్బులు మాత్రం ఇచ్చారు అని అనుకుంటారు. డబ్బులు ఇవ్వడం ద్వారా వాళ్లలో కొందరు వ్యక్తులను లొంగదీయవచ్చు. కాని న్యాయం జరగకుండా కేవలం నష్టపరిహారాలు ఇచ్చినంత మాత్రాన ఆ న్యాయం జరగలేదనే భావన అట్లానే ఉండిపోతుంది. ఎప్పుడో ఒకసారి అది మళ్లీ విస్ఫోటనమవుతుంది. అది అవకాశం కోసం ఎదురు చూస్తూ ఉంటుంది.

కోయంబత్తూరులో బాంబు పేలుళ్ల విచారణ తర్వాత జరిగినది అదే.

మైనారిటీల విషయంలో అన్ని చోట్లా జరిగినది అదే. సిక్కుల ఊచకోత విషయంలో తొమ్మిదో, పదో కమిషన్లు వేశారు. విచారణలు జరిపారు. నేరస్తులను శిక్షించడం జరగలేదు. బాధితులకు న్యాయం జరగలేదు. గుజరాత్ లోనయితే పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, చట్టబద్ధ పాలన, రాజ్యాంగ వ్యవస్థలు కుప్పకూలిపోయాయి.

మైనారిటీలను గుర్తించకుండా, వాళ్ల సమస్యలను పరిష్కరించకుండా మన సమాజం వంటి బహుళ సమాజంలో తలెత్తే ఏ ఒక్క సమస్యను కూడా పరిష్కరించడం సాధ్యంకాదు. సమానత్వం అనే భావనకు, రాజ్యాంగ అధికరణం 14కు ఈ కేసు వ్యతిరేకం అని నేను వాదించానంటే ఈ కేసు కొట్టివేయండి అని నేను వాదించడంలేదు. కొన్ని వాదనలు ఏ

మాదిరిగా పెట్టవలసి వస్తుందంటే, న్యాయమూర్తి విజ్ఞత ప్రదర్శించేలా కొన్ని అంశాలు ముందుకు తీసుకురావలసి వస్తుంది. న్యాయమూర్తి ఆలోచనను ప్రేరేపించేలా చేయడానికి ఇటువంటి వాదనలు పెట్టవలసి వస్తుంది. చట్టబద్ధ పాలనను కొన్ని సందర్భాలలో విస్మరించడం జరిగిందనీ, మరికొన్ని సందర్భాలలో దాన్ని కచ్చితంగా ఉపయోగించడం జరిగిందనీ న్యాయమూర్తి దృష్టికి తేవడం ఈ కేసును ఒక సరైన నేపథ్యంలో ఉంచడానికి మాత్రమే.

కొయంబత్తూరు కేసులు మనకు నేర్పే పాఠమేమంటే ఏదో ఒక రోజున మనం రాజ్యాంగ స్ఫూర్తి గురించి, రాజ్యాంగ విలువల గురించి ఆలోచించవలసి వస్తుంది రాజ్యాంగ విలువలు అనేవి ఈ దేశంలోని సామాజిక బహుళత్వాన్ని దృష్టిలో పెట్టుకున్నవి. రాజ్యాంగ విలువలను గౌరవించడం అంటే ఆ బహుళత్వం కొనసాగేలా చూడడం.

ఇక నల్లకామన్ కేసు మానవ హక్కుల కార్యకర్తలందరికీ ఒక ముఖ్యమైన పాఠం నేర్పుతుందని నేననుకుంటాను. మానవ హక్కుల కార్యకర్తలు కేవలం పత్రికా ప్రకటనల మీద, పత్రికల మీద, ఖండనల మీద ఆధారపడి ఉండగూడదని, ఎడతెగకుండా క్రియాశీలంగా మానవ హక్కుల సాధన కోసం పని చేయవలసి ఉంటుందని, మానవ హక్కుల ఉల్లంఘనకు వ్యతిరేకంగా పని చేయవలసి ఉంటుందని ఆ కేసు చెపుతుంది. తద్వారా మానవ హక్కుల సంస్కృతిని సమాజంలో పెంపొందించగలుగుతాము. ప్రజాపాలనలో ఉన్న అధికారులలోనూ, సిబ్బందిలోనూ మానవ హక్కుల సంస్కృతినీ, మానవ హక్కులపట్ల గౌరవాన్ని కలిగించడంలో ఎంతో కొంత విజయం సాధించగలుగుతాము. నల్లకామన్ సాధించింది అదే.

ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించినంత వరకు నక్సలైట్లు అదృష్టవంతులేననుకుంటాను. ఎందుకంటే విప్లవోద్యమం మొత్తం రాష్ట్రంలోనే, సామాజిక ఆలోచనలలోనే తనదైన స్థానాన్ని సృష్టించుకుంది. అధికారులలో, పోలీసులలో న్యాయపాలనా భావన లేనప్పటికీ, సమాజంలో ఆ భావన పెరిగింది. అందువల్లనే జిల్లా జడ్జీలు కూడా నక్సలైట్ల కేసులలో ప్రాసిక్యూషన్ ఆరోపణలను అంగీకరించలేదు. పార్వతీపురం కుట్రకేసు వంటి కొన్ని కేసులలో మినహా విప్లవకారులను, సానుభూతిపరులను నిర్దోషులుగా భావించి కేసులు కొట్టివేయడం జరిగింది.

* * *

# సాధారణీకరించడం సాధ్యం కాదు

నిజంగా న్యాయస్థానాల గురించీ సాధారణీకరించడం సాధ్యంకాదు. మొత్తం మీద

అవి అభివృద్ధి నిరోధకంగా, కొత్తను ఆహ్వానించకుండా ఉంటాయనేది నిజమే. కాని కొన్ని సందర్భాలలో అవి చాలా విచిత్రంగా పని చేస్తాయి.. వాటి ప్రవర్తన ఆశ్చర్యకరంగా సంతోషదాయకంగా ఉంటుంది. ఏమంటే, నేను గెలిచిన కొన్ని కేసులు కేవలం నా పేరు వల్ల గెలిచాననుకుంటాను. అక్కడ వాదనలకన్నా, న్యాయాన్యాయాలకన్నా న్యాయవాది పేరే ప్రధాన పాత్ర వహిస్తుంది. ఉదాహరణకు, ఎమర్జెన్సీలో నెల్లూరు స్పిన్నింగ్ అర్ వీవింగ్ మిల్స్ కేసు వచ్చింది. ఎమర్జెన్సీలో ఆ కంపెనీ కార్మికులు ఎనభై మందిని తొలగించారు. ఆ కార్మికులు సిపిఎంకు చెందిన వాళ్లు. అది కో-ఆపరేటివ్ సంస్థ.

దాని మీద ఒక జూనియర్ న్యాయవాది రిట్ వేసినాడు. ఆయన కూడా కార్మిక నాయకుడే. పోస్టల్ ఉద్యోగ సంఘంలో పని చేస్తూ పదవీ విరమణ తర్వాత లాయర్‌గా పనిచేస్తున్నాడు. ఎమర్జెన్సీ అయిపోగానే ఈ కేసు వచ్చింది. అసలు ఆ కంపెనీ ఒక కో-ఆపరేటివ్ సొసైటీగాను దానికి రిట్ వర్తిస్తుందా లేదా, అని సాంకేతిక కారణాల కింద చర్చ జరిగింది.

దానితో న్యాయమూర్తి అల్లాడి కుప్పుస్వామికే సందేహం వచ్చి బెంచికి రిఫర్ చేశాడు. అప్పుడు ఒక చట్టం ఉండింది. ఇండస్ట్రీయల్ అండర్ టేకింగ్స్ రిలీఫ్ అగెనెస్ట్ అనెంప్లాయిమెంట్ అని అది ఒక చిన్న చట్టం. దాని కింద ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ ప్రకటించి ఒక సంస్థను తన పరిధిలోకి తీసుకుని దాన్ని రిలీఫ్ అండర్ టేకింగ్‌గా ప్రకటించవచ్చు. ఇక ఆ సంస్థకు పారిశ్రామిక వివాదాల చట్టంగాని, ఇండస్ట్రీయల్ స్టాండింగ్ ఆర్డర్స్ గాని వర్తించవు. అంటే కార్మికులు సమ్మెకు దిగడానికి వీలులేదు. యాజమాన్యం నుంచి తమ హక్కులు డిమాండ్ చేయడానికి వీలులేదు. దాన్ని ఉపయోగించుకుని యాజమాన్యం ఎనభై మంది కార్మికులను తొలగించింది.

ఆ తొలగింపుకు వ్యతిరేకంగా రిట్ దరఖాస్తు దాఖలైతే అసలు అటువంటి వ్యవహారంలో రిట్ వర్తిస్తుందా అని చర్చ వచ్చింది. ఇక ఆ జూనియర్ లాయర్ నన్ను వాదించమని అడిగాడు.

నేను ఆ చట్టం తీసుకుని ఒక చిన్న వాదన ముందుకు పెట్టాను. న్యాయశాస్త్రంలో ఒక చిన్న భావం ఉంది. ఏదైయినా ఒక సంస్థ ప్రభుత్వ విధులు గనుక నిర్వహిస్తున్నట్టయితే ప్రభుత్వంతో సమానమే అని ఆ సూత్రం చెబుతుంది. ఒక రవాణా సంస్థ కావచ్చు. ఒక బ్యాంకు కావచ్చు. ఒక కార్యాలయం కావచ్చు. ఒక కంపెనీ కావచ్చు. అది ప్రభుత్వం నిర్వహించేలాంటి విధులు నిర్వహిస్తున్నదా లేదా అనేదే ప్రశ్న. భారత రాజ్యాంగంలోని అధికరణం 12 స్టేట్ అంటే ఏమిటో నిర్వహించింది. దాన్ని సృజనాత్మకంగా అన్వయిస్తే, ప్రభుత్వ విధులు నిర్వహించే ఇతర సంస్థలను కూడా ప్రభుత్వం అనే భావన కిందికి తీసుకురావచ్చు.

కో-ఆపరేటివ్ సంస్థలకు రిట్ వర్తించదు అని నాకు తెలుసు. కనుక నేను ఆ వాదనలోకి పోకుండా "ఈ స్పిన్నింగ్ అండ్ వీవింగ్ మిల్లు ఒక వ్యాపార సంస్థ కాదు.

నిరుద్యోగం నుంచి కార్మికులకు ఉపశమనం కలిగించేందుకే ఈ సంస్థ ఏర్పడింది. ఈ నిరుద్యోగం నుంచి ఉపశమనం - రిలీఫ్ అగెనెస్ట్ అనెంప్లాయిమెంట్ - అనేది ఇవ్వడానికి కేవలం ప్రభుత్వానికి మాత్రమే అధికారం ఉంది. అంటే ఈ సంస్థ ప్రభుత్వ అధికారాలు నిర్వర్తిస్తున్నదన్నమాట. కనుక ఈ సంస్థకు వ్యతిరేకంగా రిట్ దాఖలు చేయవచ్చు" అని వాదించాను. ఇది ఒక వ్యాఖ్యానం.

ఆ వ్యాఖ్యానం తర్వాత, "మాకు నోటీసుగాని, ముందస్తు హెచ్చరిక గాని ఇవ్వకుండా మా ఉద్యోగాలు తొలగించారు. అంటే మాకు రాజ్యాంగ అధికరణం 14 ఇచ్చే హక్కును ఈ యాజమాన్యం ఉల్లంఘిస్తున్నది" అని వాదించాను.

యాజమాన్యం తరపున వాదించినది శ్రీనివాసమూర్తి, యాజమాన్య విషయాలలో చాలా నిపుణుడు. కాని నా వాదనకు ఆయన దగ్గర జవాబు లేదు. ఆయన ఎన్నో పుస్తకాలు తీసుకుని వచ్చి "కో-ఆపరేటివ్ సంస్థకు రిట్ వర్తించదు కనుక ఆ ఉద్యోగుల తొలగింపు చెల్లదు అని రిట్ ఇవ్వడానికి వీల్లేదు" అని వాదించబోయాడు. నేను తీసుకుపోయినవి "ఆ చిన్న చట్టం, స్టేట్ అంటే ఏమిటి" అని మాథ్యూ ఇచ్చిన నిర్వచనం-అంతే. ఆ నిర్వచనం ప్రభుత్వం ఎన్ని రకాల బాధ్యతలు నిర్వహిస్తుందో వివరించింది.

ఏదయినా ఒక వ్యాపార సంస్థ నిరుద్యోగుల ఉపశమనం కొరకు పని చేయదు. అందువల్ల ఇది వ్యాపార సంస్థ కాదు. అది వ్యాపార సంస్థ కాకపోతే మరి ఏమిటి? అది ఒక ప్రభుత్వ నోటిఫికేషన్ ప్రకారం పని చేస్తున్నది కనుక, దానికి ప్రభుత్వ బాధ్యతను ప్రభుత్వం ఈ సంస్థకు అప్పగించిందన్న మాట. అంటే ఈ సంస్థను ప్రభుత్వంతో సమానంగా చూడవచ్చునన్నమాట. అంటే కార్మికుల తొలగింపుకు వ్యతిరేకంగా రిట్‌ను ఆమోదించవచ్చునన్నమాట.

నా వాదనను న్యాయస్థానం అంగీకరించింది. ఆ ఎనభై మంది కార్మికులను తిరిగి ఉద్యోగాలలోకి తీసుకుంది. ఆ నిర్ణయం ఒక మౌలిక మార్పుకు దారి తీసింది. ఒక్కొక్కసారి అట్లా అవుతుంది.

చెరబండరాజు తొలగింపు విషయం కూడా అంతే. చెరబండరాజును లేదా ఎవరైనా ఒక ప్రభుత్వోద్యోగిని కారణం చూపకుండా తొలగించే అధికారం గవర్నర్‌కు ఉన్నదా లేదా అనే విషయం నేను ఎత్తు కోలేదు. నేను అన్నదల్లా ఇవే అభియోగాలపై, మరొక బహిరంగ న్యాయస్థానంలో విచారణ జరుగుతున్నప్పుడు ఇక్కడ కారణాలు చెబితే దేశ భద్రతకు భంగకరమవుతుందనే ప్రాతిపదికపై ఉద్యోగం తొలగించడం వైరుధ్య భరితం కాదా అని వాదించాను. దానికి ప్రాసిక్యూషన్ దగ్గర జవాబు లేదు.

ఆ మాదిరిగా కొన్ని కేసులు ఉంటాయి. మనను ఒక చివరి దాకా నెట్టినప్పుడు అటువంటి కొత్త ఆలోచనలు వస్తాయి.

ఈ సందర్భంలోనే నేను నేరుగా వాదించకపోయినా, నేను పరోక్షంగా పాల్గొన్న

ఒక కేసు గురించి చెప్పాలి. ఆ కేసు మన న్యాయవ్యవస్థ గురించి, న్యాయవాదుల గురించి, న్యాయవాదుల గురించి కొన్ని తెలుసుకోవలసిన విషయాలు వివరిస్తుంది. అది ప్రేమానంద అనే స్వామీజి కేసు.

* * *

# ఆధ్యాత్మికత - ప్రేమానంద

ఆ ప్రేమానంద 1989లో తమిళనాడులోని పుదుక్కొట్టై జిల్లాలో ప్రేమానంద ఆశ్రమం స్థాపించాడు. నిజానికి ఆయన ఇటువంటి ఆశ్రమాన్ని శ్రీలంకలో నిర్వహిస్తుండేవాడు. శ్రీలంకలో ప్రారంభమైన జాతి కలహాలవల్ల 1984లో అక్కడ దుకాణం మూసేసి తమిళనాడు వచ్చాడు. త్వరలోనే ఇక్కడ కూడా ఆయనకు శిష్యులు పెరిగారు. ప్రభుత్వం నుంచో, ప్రభుత్వ ప్రాపకం ఉన్న ధనికులనుంచో భూములు, ఆస్తులు సంపాదించి ఆశ్రమం నిర్మించుకున్నాడు. స్వాతంత్ర్యానంతరం దేశంలో ఇటువంటి దొంగ స్వాముల, బాబాల పరపతి బాగా పెరిపోయింది. వాళ్ల ఆశ్రమాల మీద ఎటువంటి నియంత్రణా లేదు. ఎక్కడైనా ప్రభుత్వ, చట్టపరమైన నియంత్రణలను అమలు చేయవలసి వచ్చిన అధికారులు కూడా ఎన్నో సంజాయిషీలతో, క్షమాపణలు వేడుకుంటూ ఆ ఆశ్రమాలలో ప్రవేశిస్తారు. చివరికి ఆశ్రమాల వ్యవహారాలను పర్యవేక్షించవలసిన అధికారులు ఆ బాబాల, స్వాముల భక్తులుగా మారిపోయి, వారు చేసే దొంగపనులన్నిటినీ మాఫీ చేస్తూ వారిని కాపాడుతూ ఉంటారు.

భారతదేశంలోనూ, శ్రీలంకలోనూ ఉన్న ఇటువంటి దొంగస్వాముల, బాబాల బండారం బయటపెడుతూ అబ్రహాం కోవూర్ గొప్ప ఉద్యమం నడిపారు. ప్రజల మీద బ్రాహ్మణులు రుద్దిన ఇటువంటి మూఢాచారాల తప్పుడు పనుల మత వ్యవహారాల మీద తమిళనాడులో పెరియార్ ఇ వి రామస్వామి నాయకర్ మేధోస్థాయిలో పెద్ద అందోళన చేశారు. ఆయన నడిపిన ఆత్మగౌరవ ఉద్యమం ఇటువంటి మూఢాచారాలకు వ్యతిరేకంగానే. ఆ తర్వాత అన్నాదొరై కూడా ఆ ఉద్యమపు ప్రభావాన్ని కొనసాగించారు. తమిళనాడులో ప్రేమానందకు వ్యతిరేకంగా న్యాయపోరాటం నడవగలిగిన నేపథ్యం ఉండింది. అందువల్లనే బాలారిష్టాలన్నీ దాటుకుని ప్రేమానంద కేసు ముందుకు నడిచింది. నిజానికి అటువంటి దొంగస్వాముల మీద కేసు నమోదు చేయడం, ఆ కేసు విచారణను ముందుకు నడిపించడం చాలా కష్టసాధ్యమన, అసాధ్యమైన పనులు.

ఈ కేసులో వాస్తవాలు చాలా సులభమైనవి. జీవితం నిండా ఎన్నో అనిశ్చితలు.

ఎంతో అశాంతి నిండి ఉన్న మధ్య తరగతి ప్రజలు ఎందరో తమ భవిష్యత్తు గురించి తెలుసుకోవాలని, తమ అశాంతిని పోగొట్టుకోవాలని బాబాలదగ్గరికి, స్వాముల దగ్గరికి వెళుతూ ఉంటారు. వారి జీవితాలలో ఎప్పుడూ ఉండే అభద్రతా భావం వారిని అనివార్యంగా బాబాల, స్వాముల పాదాల దగ్గరికి చేరుస్తుంది. ఇటువంటి ప్రజానీకానికి ఉపశాంతిని కలిగించడంలో, ఊరట ఇవ్వడంలో సాంప్రదాయిక మతాలు, పాత మతాచారాలు, గుళ్లూ గోపురాలూ ఇటీవల విఫలమవుతున్నాయి. ఇక రామకృష్ణ మిషన్, స్వామి దయానంద, చిన్మయ మిషన్ వంటి ప్రయత్నాలేమో వారికి హిందూ తత్వశాస్త్రాన్ని బోధిస్తూ జీవితంపట్ల తాత్విక దృక్పథం ఏర్పరచుకొమ్మని చెబుతున్నాయి. కాని సాధారణ ప్రజానీకానికి ఈ తాత్విక దృక్పథం తలకెక్కడం కష్టం. అదంతా సుదీర్ఘ కాలంపట్టే వ్యవహారం. ఆ సుదీర్ఘ కాలంలో మనం చచ్చి ఊరుకుంటాం.

అందువల్ల ఇటువంటి ప్రజల కోసం తక్షణ ఉపశమనాలు ఇచ్చే, ఆరోగ్యాలు బాగు చేసే, ఆర్థిక వృద్ధికి దారి తీసే ఉపదేశాలు కావాలి. ఆ తక్షణ మత అవసరం నుంచే దొంగస్వాములు, అమ్మలు, బాబాలు పుట్టుకొస్తున్నారు. ఆ విధంగానే ఎన్నో ఆధ్యాత్మిక కేంద్రాలు పుట్టుకొస్తున్నాయి. ఆ కేంద్రాలన్నీ కిక్కిరిసిపోతున్నాయి. ఆ కేంద్రాలకు పరుగులుపెట్టే భక్తులు ఆ కేంద్రాల సంపదను కూడా పెంచుతున్నారు. అందువల్ల ఆ కేంద్రాలలో భక్తులకు సహాకరించడానికి అత్యాధునిక సౌకర్యాలు కూడా తయారవుతున్నాయి. ఆ కేంద్రాలు వైద్యులను, ఇతర నిపుణులను కూడా సమకూర్చుకుని భక్తులకు అన్ని రకాల సేవలూ అందిస్తున్నాయి.

ఈ మత, ఆధ్యాత్మిక, ధార్మిక సంస్థలకు కూడా దేశంలోని సివిల్, క్రిమినల్ చట్టాలన్నీ వర్తిస్తాయని ప్రత్యేకంగా చెప్పనవసరంలేదు. కాని అవి చట్టానికీ, అధికారానికి అతీతమైన సంస్థలన్నట్టుగా ప్రవర్తిస్తుంటాయి.

ఈ మత, ధార్మిక, ఆధ్యాత్మిక సంస్థలుగా పేరు పెట్టుకున్న ఫక్తు వ్యాపార సంస్థలు దేశంలోని అన్ని సివిల్, క్రిమినల్ చట్టాలకు లోబడి పని చేయవలసి ఉన్నప్పటికీ, అవి తమకు చట్టమంటే లెక్కలేనట్టు ప్రవర్తిస్తుంటాయి. ఎందుకంటే ఈ సంస్థల అధిపతులు రాజకీయ, పాలనా రంగాలలోని ప్రముఖుల మీద తిరుగులేని అధికారాన్ని చలాయిస్తుంటారు. ఈ సంస్థల లోపల ఉండే భక్తుల మీద, అనుచరుల మీద, సిబ్బంది మీద ఈ సంస్థల అధిపతులకు సంపూర్ణ అధికారం ఉంటుంది. అందువల్ల ఈ సంస్థల లోపల దారుణమైన అన్యాయాలు, క్రూరత్వ సంఘటనలు వెలుగు చూసినప్పుడు ప్రభుత్వ సంస్థలేమో ఆ మతాధిపతులను సాధారణ చట్టాల ప్రకారం విచారించక తప్పదు. న్యాయస్థానాలు ఆ నేరాలను సాధారణ నేరాలుగా పరిగణించి విచారించక తప్పదు. బలమైన సాక్ష్యాధారాలుంటే శిక్షలు విధించకా తప్పదు. ఐతే ముఖ్యమంత్రులు, ప్రధాన మంత్రులు, రాష్ట్రాల గవర్నర్లు, కింది కోర్టుల నుంచి సుప్రీం కోర్టు దాకా ఎందరో

న్యాయమూర్తులు మాత్రమే కాదు, ఈ దేశానికి రాష్ట్రపతులుగా పని చేసిన వారందరూ ఈ ఆధ్యాత్మిక గురువుల భక్తపరమాణువులే గనుక ఆ ఆధ్యాత్మిక గురువులు ఎటువంటి నేరాల నుంచి అయినా తప్పించుకోగలుగుతున్నారు.

న్యాయశాస్త్ర భావనల వైపు నుంచి చూసినప్పుడు ఒక ఆధ్యాత్మిక కేంద్రంలో అధిపతికీ, భక్తులకూ మధ్య అసమాన సంబంధం కొనసాగుతుంది. ఆ అసమాన సంబంధంలో భక్తులకు గురువుపట్ల మితిమీరిన నమ్మకం ఉండగా, గురువుకు మాత్రం ఆ నమ్మకాన్ని తన స్వప్రయోజనాల కొరకు వినియోగించుకునే అపారమైన ప్రభావం కనపడతాయి. ఈ అసమాన సంబంధం వల్ల అక్కడ జరిగే ఏ పని అయినా ఆ ప్రభావపు మాయ చేత కప్పబడి ఉంటుంది. మొత్తానికి ఇటువంటి సంబంధాన్ని పరస్పర నమ్మకం గల సంబంధంగా న్యాయశాస్త్రం భావిస్తుంది. ఈ పరస్పర నమ్మకంలో ఒక పక్షం మితి మీరిన ప్రభావాన్ని కలగచేసినప్పుడు ఆ పక్షం దాన్ని తన స్వప్రయోజనాల కొరకు, అనుచితంగా వినియోగించుకునే అవకాశం ఉంది. ఇటువంటి సంస్థల గురించి ఆలోచించేటప్పుడు ఆ అసమాన సంబంధం గురించి, అందువల్ల అక్కడ జరిగే పనుల అసహజత్వం గురించి తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది. అయితే ఇంత వరకూ అటువంటి పరిగణన జరగలేదు. ప్రేమానంద ఆశ్రమంలో రెండు రకాల సంబంధాలు కొనసాగుతుండేవి. తన దగ్గరికి వచ్చిన దేశీ, విదేశీ భక్తులతో ఆయన చాలా నాగరికమైన సంబంధాలు పాటించేవాడు. ఆయన ప్రదర్శిస్తున్న నైతిక వర్తనను, రుజువర్తనను, సర్వసంగ పరిత్యాగాన్ని చూసి ఆ భక్తులందరూ తన్మయులైనపోయేవారు. కాని ఆ ఆశ్రమంలోనే ఉండే భక్తులుగా, సిబ్బందిగా పని చేసే బాలికలతో, యువతులతో ఆయన తన వికృతమైన కామవాంఛలు తీర్చుకునే వాడు. ఆ యువతులు, బాలికలు సాధారణంగా అనాథలు, నిరాశ్రితులు.

ప్రేమానంద ఆశ్రమంలో ఉండిన మహిళా భక్తుల విషయంలో ఈ అసమాన సంబంధం తప్పనిసరిగా పట్టించుకోవలసిన అంశం. ఆ ఆశ్రమంలో శ్రీలంకకు చెందిన దాదాపు రెండు వందల మంది యువకులు, "యవ్వనంలో ఉన్న బాలికలు" ఉండేవారు. ఈ వ్యవహారంలో ప్రేమానంద ఆశ్రమం పని తీరు బహుశా అత్యంత దారుణమైనది. ఈ కేసును విచారించిన పుదుక్కోట్టై సెషన్స్ న్యాయస్థానం న్యాయమూర్తి ఒక మహిళ, ఆర్ భానుమతి, ఆమె ఆ తరువాత హైకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి కూడా పొందారు.

ప్రేమానంద ఆశ్రమంలో జరుగుతున్న ఘోరాల గురించి బైటికి పొక్కడం మొదలైన తర్వాత అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆ నేరాల గురించి ప్రచారం చేసి, నేరస్తులను శిక్షించాలనే డిమాండ్‌తో ఆందోళన చేపట్టింది. ఆ మహిళా సంఘం ఒత్తిడి వల్ల పోలీసులు ఆ కేసును తగిన విధంగా విచారించి, సరైన చార్జిషీటు దాఖలు చేశారు.

సంస్థ అధిపతి తనకు ఉండగల అనుచిత ప్రభావంతో ఎటువంటి పనులు చేయగలడో

ఈ ఉదంతం మంచి ఉదాహరణ. ఆశ్రమంలో పని చేస్తున్న వారు తమ మీద జరుగుతున్న అత్యాచారాలకు అంగీకరించడం ఎప్పుడూ స్వచ్ఛందంగా జరుగదు. అది ఎప్పుడైనా బయటికి కనబడని ఒత్తిడి వల్లనే జరుగుతుంది. తమ మధ్య ఒప్పందం సక్రమంగానే, న్యాయంగానే జరిగిందని, అవతలి పక్షానికి తన మీద ఉన్న మితిమీరిన నమ్మకంవల్ల, తాను వారి మీద అమలు చేసిన మితిమీరిన ప్రభావంవల్ల ఆ ఒప్పందం అనుచితంగా తయారు కాలేదని ఆ ప్రభావం నెరవుతున్నవారే రుజువు చేసుకోవలసి ఉంటుంది. ఎందువల్లనంటే ఇటువంటి సంబంధంలోని లావాదేవీలలో మోసానికి చాలా అవకాశం ఉంటుంది.

మరీ ముఖ్యంగా స్త్రీలు, యువతులు ఉన్న సంస్థలలో ఇటువంటి అనుచిత లావాదేవీల అవకాశం ఎక్కువగా ఉంటుందని క్రిమినల్ లా (అమెండ్‌మెంట్) చట్టం 1983 కూడా గుర్తించింది. సెక్షన్ 376(2)(సి) అనే ప్రత్యేక నిబంధన ద్వారా మహిళలు, పిల్లలు ఉండే సంస్థలను నిర్వచించి, వారు అనుచిత లావాదేవీకి గురికాగల అవకాశాలను వివరించింది.

ఆ నిర్వచనం ప్రకారం ప్రేమానంద ఆశ్రమం ఒక మహిళా సంస్థగా ఆ చట్ట పరిధిలోకి వస్తుంది. ఆధ్యాత్మిక ఆశ్రమాలు మహిళా సంస్థల స్వభావాన్ని కలిగి ఉండవని అందువల్ల ఆ చట్ట పరిధిలోకి రావని వాదించడం కుతర్కమే అవుతుంది. ఏ ఆధ్యాత్మిక సంస్థకైనా ఎన్నో రకాల పనులు ఉంటాయి. ఆ పనుల స్వభావాన్ని గుర్తించడం, తత్సంబంధిత చట్ట పరిధిలోకి తీసుకురావడం న్యాయవ్యవస్థ చేయవలసిన పని. తమిళనాడులోని తిరుచిరాపల్లి సమీపంలోని ప్రేమానంద ఆశ్రమంలో జరిగిన అక్రమాల గురించి 1994లో మొదటిసారి బయట పడింది. ఆ ఆశ్రమానికి అప్పటివరకూ ఒక అనాథాశ్రమంగా, ప్రత్యేకించి అనాథ బాలికలకు ఆశ్రయం కల్పించే ఆశ్రమంగా పేరుండేది. అక్కడ తమిళ బాలికలను,శ్రీలంక శరణార్థుల బాలికలను తీసుకునే వారు.

మూడు సంవత్సరాలపాటు నడిచిన కోర్టుకేసు తర్వాత 1997లో న్యాయమూర్తి భానుమతి 13 మంది ఆశ్రమ వాసులైన బాలికలపై అత్యాచారం చేసినందుకు, ఆ అత్యాచారాలను ప్రశ్నించిన ఒక పురుష భక్తుడిని హత్య చేసినందుకు రెండు యావజ్జీవ శిక్షలు, రు.66 లక్షల జరిమానా విధించారు. ఆ జరిమానాను, 13 మంది అత్యాచార బాధితులకు తలా రు.5 లక్షల చొప్పున చెల్లించాలని ఆదేశించారు. ఆ జరిమానా చెల్లించకపోతే ప్రేమానంద మరొక 32 సంవత్సరాల జైలు శిక్ష అనుభవించవలసి ఉంటుందని తీర్పు చెప్పారు.

ఈ కేసులో ప్రేమానంద తరపున సుప్రసిద్ధ న్యాయవాది రామ్ జెత్మలానీ వాదించారు. "స్వామీజీ నిర్దోషిత్వం న్యాయవ్యవస్థకు అతీతమైనది" అని ఆయన వ్యాఖ్యానించారు. కింది కోర్టు తీర్పును మద్రాసు హైకోర్టు డిసెంబర్ 2002 లో ధ్రువీకరించగా, సుప్రీంకోర్టు ఏప్రిల్2005లో ధృవీకరించింది. జడ్జి భానుమతి ఇచ్చిన తీర్పులో ముఖ్యమైన అంశం

బాధితులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిందితులు దుర్వినియోగం చేసి, తమకు అతీతశక్తులున్నాయని మోసం చేసి వారిపై లైంగికంగా అత్యాచారం జరిపారనే నేరాన్ని నిర్ధారించడం. ఆ అత్యాచారాలవల్ల గర్భవతులైన యువతులకు బలవంతంగా గర్భస్రావాలు చేయించడం, ఆ అత్యాచారాలను ప్రశ్నించిన ఒక పురుష భక్తుడిని హత్య చేయడం మాత్రమే గాక, ఆ మృతదేహాన్ని మాయం చేసి, ఆశ్రమ ప్రాంగణంలోనే పూడ్చి పెట్టడం ఇతర నేరాలు.

మొత్తం ఎనిమిది మందిని నిందితులుగా గుర్తించి అభియోగాలు దాఖలు చేయగా అందులో ఆరుగురు పురుషులు, ఒక స్త్రీ విచారణను ఎదుర్కొన్నారు. మరొక స్త్రీ పోలీసులకు దొరకకుండా తప్పించుకుని పోయింది. నిందితులలో ఇద్దరు పురుషులు అప్రూవర్లుగా మారి తమ నేరాన్ని అంగీకరించారు. ప్రేమానందపై మొత్తం ఏడు అభియోగాలు మోపడం జరిగింది.

ప్రేమానంద తరపున వాదించిన రామ్ జత్మలానీ ఆయనకున్న లోకాతీతశక్తుల గురించి న్యాయస్థానాన్ని ఒప్పించడానికి ప్రయత్నించారు. కాని "నిందితుల తరపు న్యాయవాది మొదటి నిందితుడికిగల లోకాతీతశక్తుల గురించి, ఆధ్యాత్మిక వైఖరి గురించి చాల వాదనలు ముందుకు తెచ్చారు. గనుక, ఆ అబద్ధాన్ని బద్దలు చేయడం మొట్టమొదటి అవశ్యకతగా ఉంది" అని జడ్జి అన్నారు.

కనికట్టు, గారడీ, అవతలి వ్యక్తులను సమ్మోహపరచడం ద్వారా తమకు ఆధ్యాత్మిక శక్తులున్నాయని నమ్మించడం ఈ దొంగ బాబాలకు అలవాటయిపోయింది. ప్రేమానందకు కూడా చాతనయినదదే. ఇటువంటి ఇంద్రజాల విద్యలో స్వాములందరూ సిద్ధహస్తులే. ప్రేమానంద చేసే ఇటువంటి పెద్ద కనికట్టు విద్య మహాశివరాత్రి రోజున నోట్లోంచి శివలింగాన్ని వెలికి తీయడం. దాన్ని లింగోద్భవం అంటారు. అట్లాగే శూన్యం నుంచి విభూతి సృష్టించడం.

ఆంధ్రప్రదేశ్‌లో కూడా అందరికన్నా పెద్దబాబా ఇటువంటి ఇంద్రజాల విద్యలు ప్రదర్శించడం మనం గత నాలుగైదు దశాబ్దాలుగా చూస్తూనే ఉన్నాం. నిజానికి ఒకసారి ఈ బాబా అటువంటి అద్భుతం జరుపుతుండగా పత్రికా ఫొటోగ్రాఫర్లు, వీడియో కెమెరామన్లు ఆ అద్భుతం వెనుక ఉన్న మోసాన్ని బహిరంగంగా పట్టుకున్నారు. నా మిత్రుడైన ఒక న్యాయవాది, ఆ తర్వాత ఆయన న్యాయమూర్తి కూడా అయ్యారు. ఒకసారి బాబా అతీత శక్తుల గురించి నన్ను ఒప్పించానికి ప్రయత్నిస్తూ ఒక సంఘటన చెప్పారు. ఒకసారి తనకోసం ఎదురు చూస్తున్న ఒక పెద్ద భక్త జనసమూహంలో మాట్లాడుతూ బాబా ప్రత్యేకించి ఎవరివైపు చూడకుండానే తన పేరు పిలిచారట. అంత పెద్ద సమూహంలో తాను ఉన్నానని బాబాకు ఎలా తెలిసిందనీ, తనను గుర్తించడం బాబా అతీంద్రియ శక్తులను నిరర్థనమేనని ఆయన చెప్పుకొచ్చారు.

అయితే అసలు సంగతేమంటే, నా మిత్రుడి పేరు తెలుగువాళ్లలో, ప్రత్యేకించి

దక్షిణకోస్తా జిల్లాలలో సర్వసాధారణమైనపేరు. నన్ను నా అపనమ్మకం నుంచి పక్కకు లాగడానికి ఆయన ఈ సంఘటన చెప్పారు. ఆయన ఈ సంగతి చెబుతున్నప్పటికి నాకు ఇప్పటంత పేరు లేదు. అందువల్ల నేనేమన్నానంటే "మీ బాబా నా పేరు పిలుస్తాడేమో చూద్దాం" అని అన్నాను. ఒక గుంపులో ఆయన పేరు పిలవడం చాలా సులభమనీ, ఎంత చిన్న గుంపులోనైనా ఆ పేరు గలవాళ్లు కనీసం కొందరైనా ఉంటారనీ వివరించారు. చాలా రోజుల వరకు కన్నబిరాన్ అనే పేరు ఒకటి వినబడుతుండేది. అందువల్ల ఈ ప్రాంతంలో ఆ పేరు పిలిస్తే పలికేవాళ్లెవరూ ఉండరు.

ప్రేమానంద కేసు విషయానికి వస్తే, ముఖ్యమైన విషయమేమంటే, ఇటువంటి అతీంద్రియ శక్తి ఒక బూటకమని న్యాయస్థానంలో నిరూపించడం. జడ్జి భానుమతి ఈ పనిని విచారణ క్రమంలో సమర్థంగా చేసి చూపారు. "ఏ మతంలోనైనా, ఉత్తి ఆచారాల ద్వారా, తంతుల ద్వారా, మానవ ప్రవర్తనను మంచి వైపు మరల్చడం కష్టం. తమను తాము భగవదవతారంగా చెప్పుకునే వాళ్లు చాలా మంది, ఆధ్యాత్మికతను ప్రచారం చేసే బదులు, బాహిర వ్యక్తీకరణల ద్వారా, అంటే విభూతి సృష్టించడం, ఇతర భౌతిక పదార్థాలు తయారు చేయడం ద్వారా ప్రజల మనసులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. ఒకసారి మనసు ఇటువంటి వాటిని నమ్మడం మొదలుపెట్టిన తర్వాత, ఇక కొత్త భావాలను, ఆలోచనను లోపలికి రానిచ్చే మనో కవాటాలు మూసుకుపోతాయి" అని ఆమె రాశారు. ఇది చాలా తెలివైన పద్ధతి. తరతరాలుగా వృత్తులలో ఉన్న వారు ప్రత్యర్థులను దెబ్బతీయడానికి ఉపయోగిస్తున్న పద్ధతి ఇదే. న్యాయవాదులం కూడా ఈ పద్ధతి చాలాఎక్కువగా వాడతాం. ఇది మన వృత్తిలో మనం నిలిచి ఉండడానికి, ఇతరులను ఓడించడానికి ఒక మార్గం. ఆ క్రమంలో ఆ వ్యక్తి చుట్టూ ఏర్పాటు చేసుకునే బృందం ఆయనను ఆధ్యాత్మిక గురువు, మనసు నుంచి అజ్ఞానపు పొరలను తొలగించే సమర్థుడనీ పిలుస్తుంటారు.

ప్రేమానందకు తెలిసిన లింగోద్భవ విద్య నిజానికి కొత్తదేమీ కాదు. కడుపులో నుంచి లింగాలు పుట్టించడం చాలా ప్రఖ్యాతమైన విద్య. ఆయనకన్నా ముందు ఎందరో స్వాములు ఈ మాదిరిగానే లింగాలను సృష్టించారు.

ఈ లింగోద్భవం గురించి 1970లో ప్రఖ్యాతమైన సంఘటన ఒకటి ఉంది. అప్పుడు నీలకంఠ బాబా అని ఒక బాబా ఉండేవాడు. ఆయన తన కడుపులో నుంచి ఒక లింగాన్ని సృష్టించి అప్పటి ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌కు ఇచ్చానని ప్రకటించుకున్నాడు. ఆ మాదిరిగానే శూన్యం నుంచి స్ఫటిక లింగాలను సృష్టించి అప్పటి మాజీ రాష్ట్రపతి డా.సర్వేపల్లి రాధాకృష్ణన్‌కూ, ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరాగాంధీకి చెరి ఒకటి బహూకరించానని చెప్పుకున్నాడు. వాళ్లిద్దరూ తనను దర్శించుకున్నప్పుడు ఈ బహుమానాలు ఇచ్చానని కూడా అన్నాడు. ఈ విషయం వాస్తవమేనా స్పష్టం చేయవలసిందిగా కోరుతూ సుప్రసిద్ధ హేతువాది డా.అబ్రహాం కోవూర్ 1973 నవంబర్ 18న శ్రీమతి ఇందిరాగాంధీ ఒక

లేఖ రాశారు. ఆమెకు అప్పుడు వ్యక్తిగత కార్యదర్శిగా ఉండిన టి.ఎన్. శేషన్ ఆ లేఖకు నవంబర్ 22న జవాబు రాశారు. "ప్రధాన మంత్రి నీలకంఠ బాబాజీని కలిశారనే కథతోగాని, ఆయన శూన్యం నుంచి లింగాన్ని సృష్టించి ఆమెకు ఇచ్చారనే కథలోగాని వాస్తవం లేదని మీకు జవాబు రాయమని ప్రధాన మంత్రి నన్ను ఆదేశించారు" అని ఆ జవాబు. దొంగబాబాల ప్రగల్భాలు ఇట్లా ఉంటాయన్నమాట!

చుట్టూ ఉన్న పరిస్థితులు సాధారణంగా హేతుబద్ధంగా ఉండే వారికి కూడా మతి పోగొట్టేలా ఉన్నప్పుడు సాంప్రదాయక మత విశ్వాసాలు ఘోరంగా విఫలమవుతున్నప్పుడు ప్రేమానంద ఆశ్రమం ఒక నిరాశాపూరితమైన, చీకటి నిండిన తాత్విక దృక్పథాన్ని ప్రచారం చేసిందని న్యాయమూర్తి భానుమతి అన్నారు. ప్రేమానంద ప్రకటించుకున్న ఆధ్యాత్మిక శక్తులనబడే వాటి బండారం బట్ట బయలు చేయడానికి న్యాయమూర్తి మరుదుముత్తు అనే ఒక ఇంద్రజాలికుడిని పిలిపించి న్యాయస్థానంలో లింగోద్భవం ప్రదర్శన ఏర్పాటు చేయించారు. ఆ ఇంద్రజాలికుడు భగవంతుడి అవతారమని చెప్పుకోవడం లేదు. కాని లింగోద్భవం చేయగలడు. నిండు న్యాయస్థానంలో మరుదుముత్తు తన కడుపులో నుంచి లింగాన్ని సృష్టించాడు. ఖాళీగా ఉన్న అరచేతుల్లో నుంచి విభూతి సృష్టించాడు. అదంతా గారడీ విద్య మాత్రమేనని చెప్పాడు.

మరుదముత్తు ఈ గారడీ ఎట్లా చేశాడు? ఆయన మొదట రెండు కుంకుమ నింపిన కాప్సూల్లను మింగాడు. ఆ తర్వాత ఒక మూడు అంగుళాల లింగాన్ని ఒక అరటిపండు లోపల కనపడకుండా దాచి పెట్టి ఆ అరటిపండును మింగేశాడు. తర్వాత అరగంట సేపు విశ్రాంతి తీసుకుని కుంకుమ అంటుకున్న లింగాన్ని బయటికి తీశాడు.

ఈ ప్రదర్శన న్యాయస్థానంలో అందరూ చూస్తుండగానే జరిగింది. ఆధ్యాత్మిక శక్తులు అనబడే వాటి వెనుక ఉన్న అబద్ధాన్ని ఈ పద్ధతిలో బహిరంగంగా ప్రదర్శించి బట్టబయలు చేయకుండా ఉంటే ప్రేమానంద విచారణ సక్రమంగా జరిగి ఉండేది కాదు. ఇటువంటి చర్య వల్లనే ఇతర సాక్షులు కూడా ధైర్యంగా నిలబడి తమ సాక్ష్యం చెప్పగలిగారు.

మన న్యాయవ్యవస్థలో అతి తక్కువ మంది న్యాయమూర్తులకు ఇటువంటి ప్రదర్శన జరపాలని అనిపించి ఉంటుంది. అలా అనిపించిన వాళ్లలో కూడా ధైర్యంగా దాన్ని అమలులో పెట్టేవాళ్లు ఇంకా తక్కువ మంది న్యాయమూర్తులు ఇటువంటి ప్రదర్శనలను న్యాయస్థానం హాలులోపల అనుమతిస్తారు. ఈ సందర్భంలో న్యాయ విచారణాక్రమంలో న్యాయమూర్తి ఆధ్యాత్మికతను, మత విశ్వాసాలను ప్రశ్నించకుండానే, విశ్వాసానికి, సంబంధించిన వ్యవహారాలతో న్యాయస్థానంలోపలనే ఒక సృజనాత్మక సంభాషణలోకి దిగారు. ఆధ్యాత్మిక శక్తి అనబడేదాన్ని నిరాయుధం చేసి దానికీ నేర ప్రవర్తనకూ సంబంధాన్ని నిర్ధారించారు.

అసలు ప్రేమానంద ఆశ్రమానికి సంబంధించిన దారుణాల కథ ఇద్దరు యువతులు

అక్కడి నుంచి తప్పించుకుని వచ్చి చెన్నైలోని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య (ఎఐడిడబ్ల్యుఎ) సభ్యుల సహాయం కోరడంతో మొదలైంది. పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ (పియుసిఎల్) న్యాయవాదులు సుధా రామలింగం, నాగశైల, వి సురేష్ ఆ బాధితులకు సహాయం అందించడమే గాక ప్రాసిక్యూషన్‌కు కూడా సహకరించారు. వీరిలో సుదా రామలింగం మహిళా సమాఖ్య సభ్యురాలు కూడా.

ఆ ఆశ్రమంలోని యువతులలో ఏడుగురు శ్రీలంకకు చెందిన వాళ్లు కాగా మిగిలిన వాళ్లందరూ తమిళనాడుకు చెందిన వాళ్లు. వాళ్లందరూ రజస్వల కాకముందే ఆశ్రమంలో చేర్చబడ్డారు. వారు రజస్వల కాగానే వారిని ఆశ్రమంలో నిర్బంధంలో ఉంచి, ఆ తర్వాత ప్రేమానంద దగ్గరికి పంపేవారు. ఆ ఆశ్రమంలో కొందరు మధ్య వయసు స్త్రీలు కూడా పని చేసేవారు గాని లైంగిక అత్యాచారాల ఫిర్యాదులన్నీ ప్రధానంగా యువతుల నుంచి, బాలికల నుంచి మాత్రమే వచ్చాయి. వాళ్లందరూ అనాథలు, పూర్తిగా ఆశ్రమం మీదనే ఆధారపడి ఉన్నవారు.

వారి వయసు రీత్యా, ఆశ్రమంలో అనాథలుగా ఉన్న స్థితి దృష్ట్యా వారికి తమ మీద జరుగుతున్న అత్యాచారాలను ప్రతిఘటించే అవకాశం లేదు. కాని వారిలో కొందరు ప్రతిఘటించారు. అందుకు శిక్షగా ఒక బాలికను గుడ్డలూడదీసి మిగిలిన వారందరి ముందూ నగ్నంగా నిలబెట్టారు. అందరి ముందూ అవమానించారు.మరొక బాలికను అన్నం, నీళ్లు ఇవ్వకుండా కుక్కల దొడ్డిలో నిర్బంధించారు. మరొక బాలికను భోజనశాలలో అందరి ముందూ కొట్టారు. కృష్ణవేణి అనే బాలిక ఆశ్రమం నుంచి పారిపోవడానికి ప్రయత్నించినప్పుడు ఆమెను ఒక దూడకు కలిపి కట్టి ఆశ్రమంలో పరుగెత్తించారు.

మరొక బాలిక సురేష్ కుమారి భగవదవతారం ఇటువంటి దారుణాలకు పాల్పడడమేమిటని ప్రశ్నిస్తే "నేను మీ తండ్రి వంటి వాడిని. నేను మీతో సంభోగిస్తే మీకు గర్భం రాదు" అని ప్రేమానంద జవాబు చెప్పాడు. "నేను భగవంతుడి అవతారాన్ని. నేను నిన్ను ముట్టుకుంటున్నా నంటే నువ్వు గత జన్మలో పుణ్యం చేసుకున్నావన్నమాట." అని మరొక యువతితో అన్నాడు.

ప్రేమానంద చేసిన అకృత్యాలకు అద్దం పట్టే ఇటువంటి వాస్తవాలు ఎన్నో ఉన్నాయని, వాటన్నింటినీ తన తీర్పులో వివరించడమంటే అది బూతు పురాణం అవుతుందనే భయంతో మానేస్తున్నానని న్యాయమూర్తి భానుమతి రాశారు. రవి అనే శ్రీలంకకు చెందిన యువకుడిని అక్రమంగా నిర్బంధించి చివరికి కొట్టి చంపేశారు. ఆశ్రమంలో ఉన్న బాలికల, యువతుల రుతుక్రమం పరిశీలించడానికి, అవసరమైతే గర్భస్రావాలు జరపడానికి ప్రత్యేకంగా ఆశ్రమంలో ఒక మహిళా వైద్యురాలు ఉండేది.

కేసు మొదలై, ఆశ్రమంలోని బాలికలందరినీ అక్కడి నుంచి ప్రభుత్వాధీనంలోకి తీసుకొని ఒక మహిళా సంస్థ పర్యవేక్షణలో ఆశ్రయం కల్పించిన తర్వాత అరుళ్ జ్యోతి

అనే బాలిక గర్భిణి అని బయట పడింది. ఆమె అంగీకారం మీదనే ఆమెకు గర్భస్రావం జరిపి, ఆ పిండం నమూనాను, ఆ బాలిక రక్తాన్ని, ప్రేమానంద రక్తాన్ని డిఎన్ఎ పరీక్షల కోసం హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సిసిఎంబి)కి పంపడం జరిగింది. ఆ పరీక్షలలో గర్భస్థ శిశువుకు తండ్రి నిస్సందేహంగా ప్రేమానందేనని రుజువు అయింది.

న్యాయమూర్తి భానుమతి ఈ కేసులో నిందితులందరికీ వేర్వేరు శిక్షలు విధించారు. కాని ప్రేమానంద విషయంలో చేసిన నేరనిర్ధారణ, విధించిన శిక్షలు తప్పనిసరిగా చెప్పుకోవలసినవి. అతనికి రెండు యావజ్జీవ కారాగారవాస శిక్షలు విధించి, అవి ఒక దాని తర్వాత ఒకటి జరగాలని ఆమె తీర్పు ఇచ్చారు. అట్లాగే ఇంద్రజాలికుడు మరుదుముత్తు సాక్ష్యం ప్రకారం, శూన్యం నుంచి కుంకుమ, విభూతి, చిన్న విగ్రహాలు సృష్టించి భగవదవతారంగా చెప్పుకునే గారడీ వాళ్లందరూ మోసానికి పాల్పడుతున్నట్టేనని, వారిని దగా అనే నేరం కింద విచారించవచ్చునని ఆమె అన్నారు. ఈ నిర్ధారణను సుప్రీంకోర్టు కూడా ధృవీకరించింది. భగవదవతారంగా చెప్పుకునే వారిపట్ల వ్యవహరించవలసిన ప్రమాణంగా ఇది అంగీకరించబడింది. ఇటువంటి కింది కోర్టు తీర్పును హైకోర్టుకు తీసుకు వచ్చినప్పుడు, అక్కడ కేసును నడపడం, కింది కోర్టు తీర్పును ధృవీకరించడం బ్రహ్మ ప్రళయమయిపోతుంది. హైకోర్టులలో ఉండే న్యాయమూర్తులు విభిన్న నేపథ్యాల నుంచి వచ్చినవాళ్లు, విచిత్రమైన వాళ్లు ఉంటారు. వలసపాలనా కాలంలో ప్రభుత్వం న్యాయవాదులను ఎంపిక చేసి న్యాయమూర్తులుగా నియమించేది. న్యాయవాదులలో ఇంగ్లీష్ భాష, సాహిత్యం ఎవరికి బాగా తెలుసునో, ఎవరు తిరుగుబాటు భావాలు లేకుండా ఉంటారో ప్రభుత్వానికి బాగా తెలిసి ఉండేది. ఆ మాదిరిగా రంగూ రుచీ లేని న్యాయ వాదులను హైకోర్టు న్యాయమూర్తులుగా నియమించి పదోన్నతి కల్పించేవారు. మచ్చలేని వారిని, మంచివారిని, సమర్థులను, బాగా చదువుకున్న వారిని, నిపుణులను న్యాయమూర్తులుగా నియమించడం జరుగుతుండేది. అప్పుడు కూడా ఆశ్రిత పక్షపాతంతో న్యాయమూర్తులను నియమించడం జరుగుతుండేది.

మేం పని లేకుండా ఖాళీగా కూచున్నప్పుడు మాకంటే వయసులో పెద్దవారయిన న్యాయవాదులతో కూచున్నప్పుడు మా వృత్తికి సంబంధించిన రసవత్తరమైన కథలెన్నో మా చెవిన పడుతుండేవి. ఆ కథల్లో ఇటువంటి న్యాయవాదుల, న్యాయమూర్తుల కథలు కూడా ఉండేవి. వాటిలో ఒకటి జస్టిస్ కె.పి. లక్ష్మణ రావు న్యాయమూర్తిగా ఎలా నియమించబడ్డారనే కథ. ఆయన మంచి టెన్నిస్ ఆటగాడు. ఆ క్రమంలో అయనకు అప్పటి గవర్నర్ భార్య లేడీ హోప్‌తో టెన్నిస్ ఆడే అవకాశం దొరికిందట. ఆమెతో టెన్నిస్ ఆడడమే ఏకైక అర్హతగా ఆయన న్యాయమూర్తిగా నియమితులయ్యారట.

సరే, సుదీర్ఘమైన స్వాతంత్ర్య పోరాటం తర్వాత, రాజ్యాంగం కూడా రచించుకున్న

తర్వాత న్యాయమూర్తుల ఎంపికలో పాత వలసవాద పద్ధతులనే కొనసాగించాలని మనం నిర్ణయించుకున్నాం. అలా న్యాయమూర్తులుగా నియమించబడేవారికి ప్రపంచం గురించిన అవగాహన లేదు. చివరికి వారు రాజ్యాంగానికీ దాని తాత్విక దృక్పథానికీ, రాజ్యాంగ విలువలకూ ఏ మాత్రం కట్టుబడని వారు. రాజ్యాంగాన్ని అమలు చేయడానికి, రాజ్యాంగబద్ధంగా నియమించబడే వ్యక్తులకు ఎటువంటి నైపుణ్యం, అర్హత ఉండనక్కరలేని ఏకైక వ్యవస్థ ఇదే.

ప్రతి న్యాయమూర్తి న్యాయవాదిగా తాను గడిపిన గతాన్ని వదులుకోవలసి, మరచిపోవలసి ఉంటుంది. న్యాయమూర్తిగా తన విధులను, బాధ్యతలను రాజ్యాంగంతో సంవదించుకోవలసి ఉంటుంది. తన అధికారాన్ని అంచనా వేసుకోవలసి ఉంటుంది. కార్యనిర్వాహక వ్యవస్థ, శాసన నిర్మాణ వ్యవస్థ అనే రెండు సమస్కంధమైన నిర్మాణాల నిర్ణయాలను సమీక్షించడానికి తన అధికారం ఎంత వరకు ఉపయోగించవచ్చునో తేల్చుకోవలసి ఉంటుంది. అంటే ఒక న్యాయమూర్తి రాజ్యాంగ విలువల వ్యవస్థను అతిక్రమించని, వ్యతిరేకించని ఒక న్యాయ సంవిధానాన్ని తయారు చేసుకోవలసి ఉంటుంది. కాని ఇటువంటి ఆదర్శవంతమైన స్థితి దురదృష్ట వశాత్తూ ప్రస్తుతం ఉనికిలో లేదు. ఒక న్యాయమూర్తి వేర్వేరు కేసులలో ఎటువంటి వైఖరి తీసుకుంటారో దాదాపు అందరు న్యాయవాదులకూ తెలుసు. ఇదంతా ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా అధ్యయనం చేసి, గమనంలో పెట్టుకుంటారు. నిజానికి కక్షిదారులు కూడా ఇటువంటి సమాచారాన్నంతా న్యాయవాదుల నుంచి అయినా అడిగి తెలుసుకుంటారు. అందువల్ల ఒక కేసు వాదించడం సంక్లిష్ట వ్యవహారం అయిపోతుంది. ఒక కేసు వాదించడానికి సరైన న్యాయమూర్తి ఎప్పుడు వస్తారో అని ఎదురు చూస్తూ ఉండవలసి వస్తుంది.

ప్రేమానంద కేసులో జిల్లా సెషన్స్ జడ్జి న్యాయస్థానంలో ఈ కేసు వచ్చినప్పుడే ప్రేమానంద తరపున వాదించడానికి రామ్ జెత్మలానీని ఏర్పాటు చేసుకున్నారు. అంటే అప్పటికే ప్రాసిక్యూషన్‌కు లంచం పెట్టి కేసును మాఫీ చేసుకోవడం, తప్పుడు వాదనలు పెట్టేలా చూసుకోవడం కుదరని స్థితి వచ్చిందన్నమాట. అసలు రామ్ జెత్మలానీలాంటి సుప్రసిద్ధ న్యాయవాదిని పెట్టుకోవడం ఎందుకు జరుగుతుందంటే, అప్పుడు చిన్నస్థాయి న్యాయమూర్తిని బెదరగొట్టవచ్చు. అటువంటి చిన్న న్యాయస్థానాల్లో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు ఉండే పరపతిని దెబ్బతీయవచ్చు.

ప్రేమానంద కేసు సెషన్స్ కోర్టులో విచారణ సాగుతుండగానే ఆ వ్యవహారం మీద హైకోర్టుకు అప్పీళ్లు వచ్చాయి. ఆ అప్పీళ్ల ద్వారా కింది కోర్టు విచారణను ఆలస్యం చేయడానికి ప్రయత్నం జరిగింది. ఆ సమయంలో న్యాయవాదులు సుధా రామలింగం, నాగశైల నాకు ఆ విషయం చెప్పి నన్ను "హైకోర్టులో వాదించగలవా" అని అడిగారు. అవతలివైపు, ప్రేమానంద తరపున, రామ్ జత్మలానీ వంటి సుప్రసిద్ధ న్యాయవాది

వాదిస్తున్నాడు గనుక, ప్రత్యర్థి వాదనలు వినిపించడానికి నాకు వీలవుతుందా అని వాళ్లు అడిగారు.

సాధారణంగానే క్రిమినల్ కేసులలో డిఫెన్స్ న్యాయవాది ఎద్దులాగ అవతలి వాదనలను కుమ్మేయవలసి ఉంటుంది. తుత్తునియలు చేయవలసి ఉంటుంది. సాక్ష్యాలను చీల్చి చెండాడవలసి వుంటుంది. రామ్ జత్మలానీ అటువంటి పనులలో సిద్ధహస్తుడు. ఆయన వాదనలు వింటుంటేనే మతి పోతుంది. ఇక అప్పటికి బాధితుల తరఫున నాగశైల వాదిస్తుండింది. ఆమెకు వయసూ చిన్నదే. వృత్తిలో అనుభవమూ తక్కువే. కాని ఆమె చాలా సమర్థురాలు. తన వాదనలను స్పష్టంగా వినిపిస్తుండేది. మామూలుగా ఇటువంటి అసమాన స్థితిలో ఉన్న న్యాయవాదులు జరిపే వాదప్రతివాదనలలో కొందరు న్యాయమూర్తులు జూనియర్ న్యాయవాదుల పట్ల కాస్త ఔదార్యంతో ప్రవర్తిస్తారు. రక్షిస్తూ ఉంటారు.

ఈ సంగతి తెలుసు గనుక నేను ఆ వాదనలకు రానక్కరలేదని చెబుతూ ఆ ఇద్దరికీ ఎటువంటి వాదనలు పెట్టాలో వివరంగా సూచనలు ఇచ్చాను. చివరికి వాళ్ల వాదనలే నెగ్గాయి. ఆ భగవదవతారం అని చెప్పుకున్న వాడికి వ్యతిరేకంగా తీర్పు ఇచ్చింది.

ఇక ఆ తీర్పును పునఃపరిశీలించాలని హైకోర్టులో చేసుకున్న అప్పీలు మరొక సంగతి. క్రిమినల్ అప్పీలు అంటే వాస్తవాల మీద పునర్విచారణ అన్నమాట. విచారణ జరిపిన న్యాయమూర్తి చాలా సాహసంతో ఆ ఆధ్యాత్మిక గురువు బండారాన్ని బట్టబయలు చేసినప్పుడు, ఆ భగవదవతారానికి కఠినమైన శిక్షలు విధించినప్పుడు ఇక హైకోర్టులో అప్పీలుకు మరింత ప్రాధాన్యత వస్తుంది. అసలు కింది కోర్టు విధించిన శిక్షలు చూడండి. దేశ దేశాలలో భక్తకోటి ఉన్న, ముఖ్యంగా గణనీయమైన సంఖ్యలో విదేశీ భక్తులు ఉన్న స్వామి ప్రేమానందకు న్యాయమూర్తి రెండు యావజ్జీవ కారాగార వాస శిక్షలు విధించారు. అవి రెండూ ఒకదాని తర్వాత ఒకటి అమలు కావాలని తీర్పు చెప్పారు. ఆ శిక్షలతోపాటు అరవై ఆరు లక్షల రూపాయల జరిమానా విధించారు. ఆ జరిమానా చెల్లించకలేకపోతే 32 సంవత్సరాలపాటు జైలు శిక్షను అనుభవించాలని తీర్పు చెప్పారు. లింగోద్భవం, శూన్యం నుంచి విభూతి, కుంకుమ సృష్టించడం వంటి వీధి గారడీవాళ్లు ప్రదర్శించే కనికట్టు విద్యలను ప్రదర్శించి చూపి వాటిని ఆధ్యాత్మిక శక్తులుగా చలామణీ చేయడం దగాతో, మోసంతో సమానమని అందువల్ల అతను నేరస్తుడని న్యాయమూర్తి అన్నారు. అతనికి సహచరులుగా ఉండిన ముగ్గురికి కూడా యావజ్జీవ కారాగార శిక్షలు విధించారు.

ఇంత తీవ్రమైన శిక్షలను అది వరకు ఏ న్యాయస్థానమూ విధించి ఉండలేదు. ఆ నేర నిర్ధారణలకూ, శిక్షలనూ ధ్రువీకరింపచేయడానికి చాలా కృషి అవసరమవుతుంది. అందువల్ల చెన్నైలోని మహిళా సమాఖ్య నాయకులు, పియుసిఎల్ న్యాయవాదులు బాధితుల తరఫున నన్ను వాదించమని కోరారు. అటువంటి వాదనలు వినిపించడమంటే

హైదరాబాద్ వదిలి చెన్నైలో చాలా కాలం మకాం పెట్టవలసి ఉంటుంది గదా అని నేను మొదట సందేహించాను.

కాని హైకోర్టుకు వచ్చేసరికి యు ఆర్ లలిత్ అనే రాష్ట్రీయ స్వయం సేవకసంఘ్‌కు చెందిన న్యాయవాది ప్రేమానంద తరపున వాదించడం మొదలు పెట్టారు. ఆయన ఒకప్పుడు ఢిల్లీలో పియుసిఎల్‌లో ఉండేవాడు. ఎమర్జెన్సీ అనంతర ప్రజాస్వామిక వాతావరణం చెదిరిపోయేవరకూ ఆయన పియుసిఎల్‌లో ఉన్నాడు. నాకు ఆయన వ్యక్తిగతంగా పరిచితుడే. ఆయన ఆ తర్వాత కాలంలో టాడా కేసులను సమర్థిస్తూ కూడా వాదనలు వినిపించాడు. ఆయన చాలా సమర్థుడైన, ప్రతిభావంతుడైన న్యాయవాది. ఆయన ప్రేమానంద తరపున ఒక నెల రోజులపాటు వాదనలు వినిపించాడు.

క్రిమినల్ కేసులలో కింది కోర్టు, సెషన్స్ కోర్టు తీర్పు వచ్చిన తర్వాత, ఆ తీర్పును ధ్రువీకరించడానికి హైకోర్టులో వాదనలు జరుగుతున్నప్పుడు సాధారణంగా బాధితుల తరపున వాదనలు వినిపించే అవకాశం లేదు. అక్కడ బాధితుల తరపున జోక్యం ఉండదు. కాని ఆ సాధారణ సూత్రానికి కొన్నిసార్లు మినహాయింపులు కూడా ఉంటాయి. అందువల్ల ఒక వేళ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సరైన పద్ధతిలో వాదనలు పెట్టకపోతే నావైపు నుంచి వాదనలు వినిపించడానికి నేను సిద్ధమైపోయాను. నేను వాదించడానికి అంగీకరించాలా లేదా అనేది న్యాయమూర్తుల ఇష్టాయిష్టాలనుబట్టి ఉంటుంది. యు ఆర్ లలిత్ తన వాదనలను మూడు వాయిదాలలో వినిపించాడు. గనుక నాకు కూడా పని సులువయింది. నేను హైదరాబాద్‌కూ మద్రాసుకూ మధ్య తిరుగుతూ ఆ వాదనలను వినగలిగాను.

నేను అక్కడ కూర్చొని డిఫెన్స్ న్యాయవాది వాదనలు వింటూ ఉండడం, అప్పటికే న్యాయవాదిగా నా పేరు ప్రఖ్యాతులు తెలిసి ఉండడంవల్ల పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు ఇది చాలా తీవ్రంగా ఘర్షణ సాగే కేసు అని అర్థమైపోయింది. తన వంతు వచ్చినప్పుడు ప్రాసిక్యూటర్ కూడా పది పదిహేను రోజులపాటు చాలా సమర్థంగా వాదనలు వినిపించాడు. ఆయన ఆ కేసుకు సంబంధించిన ప్రతి ఒక్క అంశాన్నీ కూలంకషంగా చర్చించాడు. దానితో ఆ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెట్టిన అద్భుతమైన వాదనలకు అదనంగా నేను చేర్చవలసినదేమీ లేదని న్యాయస్థానానికి చెప్పాను.

ఆ కేసు జస్టిస్ షణ్ముగన్, జస్టిస్ చొక్క లింగంల ధర్మాసనం ముందు జరిగింది. ఆ ఇద్దరు న్యాయమూర్తులూ న్యాయవాదిని ఎప్పుడూ తొందరపెట్టలేదు. వాదనలన్నిటినీ జాగ్రత్తగా విన్నారు. దుష్టులనూ దుర్మార్గులనూ సమర్థిస్తూ వాదనలు వినిపించడం చాలా కష్టం. కాని యు ఆర్ లలిత్ చాలా మంచి వాదనలు వినిపించాడు. సాక్ష్యాధారాలు సరిగా ఉన్న ఇబ్బందికరమైన విషయాలను జాగ్రత్తగా దాటవేశాడు.

ఆ కేసు ఎటువంటి ముందస్తు దురభిప్రాయాలు లేని ధర్మాసనం ముందుకు వచ్చినందుకు మేం చాలా సంతోషించాం. నిజానికి ఒక న్యాయమూర్తుల ధర్మాసనాన్ని

నిర్ణయించుకోవడం ఒక బ్రహ్మ ప్రయత్నం అవుతుంది. మొట్టమొదట ఈ కేసు ఒక ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనం ముందుకు వచ్చింది. ఆ ఇద్దరిలో ఒకరు సీనియర్ న్యాయమూర్తి. అయనకు ఏమంత మంచి పేరు లేదు. మరొకరు జూనియర్ న్యాయమూర్తి. ఆయన ప్రేమానంద భక్తుడని లోకానికంతా తెలుసు.

అసలు ఈ స్వామీజీలతో ఇదే సమస్య. సత్యసాయిబాబా వ్యవహారమే తీసుకోండి. ఆయన మీద ఒక కేసు విచారణలో ఉండే అది నిష్పాక్షికంగా వినడానికి ఒక స్వతంత్ర న్యాయమూర్తి మనకు దొరకనే దొరకడు. రాష్ట్రాలలో వేర్వేరు స్థాయిలలో ఉన్న న్యాయమూర్తులు. అన్ని రాష్ట్రాల హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు, ముఖ్యమంత్రులు, ప్రధాన మంత్రులు, రాష్ట్రపతులు అందరూ సత్యసాయిబాబా భక్తులే. ప్రతిసారీ న్యాయమూర్తులను ఎంపిక చేసే సందర్భంలో సత్యసాయిబాబా కోటా ఉంటుంది. ప్రభుత్వాధినేతలకు సాయిబాబా తన కోటాలో ఎవరిని న్యాయమూర్తులుగా నియమించాలో చెబుతాడు. ఇక సాయిబాబా ఆశ్రమంలో జరిగే నేరాలూ ఎట్లా విచారణకు వస్తాయి? వాటి మీద సరైన న్యాయవిచారణ జరిగి నిజమైన నేరస్తులకు శిక్షలు ఎట్లా పడతాయి? చివరికి అందిరికీ తెలిసి బహిరంగంగా సాయిబాబా ఆశ్రమంలో జరిగిన హత్యల కేసు కూడా ఎటువంటి విచారణ జరగకుండానే ముగిసిపోయింది. అంటే సత్యసాయిబాబా గాని, భగవదవతారంగా చెప్పుకునే ఇతర స్వామీజీలు, గురువులు, అమ్మలు, బాబాలుగాని ఎక్కడా లిఖితపూర్వకంగా లేకుండానే శిక్షాతీత, విచారణాతీత స్థితిని అనుభవిస్తున్నారన్నమాట. వాళ్లు చట్టపరిధిలోకి రారన్నమాట.

సరే, ప్రేమానంద కేసులో మొదట ఒక ధర్మాసనం ముందుకు వెళ్లగానే బాధితుల తరఫున న్యాయవాదులు ప్రధాన న్యాయమూర్తి దగ్గరికి వెళ్లి ఈ కేసును మరొక ధర్మాసనానికి బదిలీ చేయాలని అభ్యర్థించారు. ప్రధాన న్యాయమూర్తి ఆ అభ్యర్థనను మన్నించి ఆ జూనియర్ న్యాయమూర్తి స్థానంలో మరొక న్యాయమూర్తిని నియమించారు. ఆ విషయంలో జోక్యం చేసుకుని నిష్పాక్షికమైన న్యాయమూర్తులను నియమించాలని కోరుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికీ, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికీ వందలాది విన్నపాలు, ఉత్తరాలు వెళ్లాయని నాకు తెలిసింది. ఇంత పెద్ద ఎత్తున నిరసనలపై వెల్లువ సాగిన తర్వాత, ఆ కేసు జస్టిస్ షణ్ముగన్, జస్టిస్ చొక్కలింగం బెంచి ముందుకు వచ్చింది.

2001 డిసెంబర్ 13న ఈ హైకోర్టు బెంచి కింది కోర్టు చేసిన నేర నిర్ధారణను, విధించిన శిక్షలను ధ్రువీకరించింది. శిక్షలను మార్చడంగాని, తగ్గించడం గాని చేయలేదు. కేవలం అరవై ఆరు లక్షల రూపాయల జరిమానాను అరవై ఒక్క లక్షలకు మాత్రం తగ్గించింది. కాని జరిమానా చెల్లించకపోతే విధించే శిక్షను 32 సంవత్సరాల నుంచి తగ్గించలేదు. తర్వాత ఈ కేసు సుప్రీంకోర్టు ముందుకు కూడా వచ్చింది. సుప్రీంకోర్టు

కూడా శిక్షలను ఏ మార్పూ, తగ్గింపూ లేకుండా ధ్రువీకరించింది. జరిమానా మొత్తాన్ని పదకొండు మంది బాధిత బాలికలకు సమానంగా చెల్లించాలని పేర్కొంది. గత సంవత్సరం ఏప్రిల్‌లో సుప్రీం కోర్టు తీర్పు ప్రకటించిన తర్వాత కూడా రామ్ జత్మలానీ ప్రేమానంద పక్షాన వాదిస్తూనే పోయారు. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత ఆయన పత్రికలతో మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును తప్పుపట్టారు. నాగశైల పత్రికలకు ఖండన పంపించింది.

ఈ కేసులో న్యాయమూర్తి భానుమతి విధించిన శిక్ష ఒక హెచ్చరిక. ఇటువంటి హెచ్చరిక మిళితమైన తీర్పు అంతకు ముందు ఏ న్యాయమూర్తీ ప్రకటించి ఉండలేదు. నిజానికి, అరుదైన సందర్భాలలోకెల్లా అరుదైన సందర్భంగా కూడా ప్రేమానంద నేరం మరణశిక్షకు కూడా అర్హమైనదే. కాని మరణ శిక్ష అనేది ఎంత వేగంగా జరిగిపోతుందంటే ఆ నేరస్తుడి గురించి ప్రజల జ్ఞాపకాలు కూడా అంతే త్వరగా మాసిపోతాయి.

కాని యావజ్జీవ కారాగార శిక్ష అయితే, అదీ ఒక దాని తర్వాత ఒకటిగా రెండు యావజ్జీవ కారాగార శిక్షలు అయితే, దాని హెచ్చరిక శక్తి అపారం. అటువంటి నేరాలు చేసేవాళ్లు ఈ శిక్షలు చూసి భయపడే అవకాశం ఉంటుంది. వారికి అటువంటి నేరాలు చేసే అవకాశాలు, వసతులు దొరకకుండా ఉంటాయి. విటులు, మధ్యదళారీలు, బ్రోకర్లు అసలే మాయమయిపోతారని కాదు. కాని బహిరంగంగా అటువంటి పనులు చేస్తున్న సంస్థలతో కలిసి పని చేసేందుకు వాళ్లు భయపడతారు. ఎప్పుడైనా నేరస్తుడికి శిక్షపడుతుంది గాని హెచ్చరిక అనేది సమాజానికి ఎక్కుపెట్టబడుతుంది. అందువల్ల ఈ హెచ్చరిక శిక్షలు ప్రభావశీలంగా ఉండాలంటే, తీర్పులోని ఈ హెచ్చరిక అంశం గురించి పెద్ద ఎత్తున ప్రచారం జరగాలి.

ఈ తీర్పులో నొక్కి చెప్పిన ఒక ముఖ్యమైన సూత్రం ఏమంటే విభూతి, కుంకుమ, పూలు, చిన్న లింగాలు వంటి వస్తువులను సృష్టించడం మోసపూరితమైనది. ఇటువంటి పనులకు పాల్పడే భగవదవతారాలు తమ అనుచరులనూ భక్తులనూ మోసపుచ్చుతున్నారు. ఇక్కడ ముఖ్యమైనది ఒక బాలిక మీద అత్యాచారం, రేప్ అనబడే నేరం కాదు. అంతకన్నా ముఖ్యమైనది ఆ నేరాన్ని చేయడానికి కవచంగా వాడుకున్న ఆధ్యాత్మిక భావన. ఆ కవచాన్ని అనుమానంతో చూడాలి. ప్రజలు మతాన్ని, మూఢాచార తంతులను వేరు చేసి చూడగలిగారు. ఈ మూఢాచారతంతులే ఇటువంటి దొంగ బాబాలకు, మోసగాళ్లకు అవకాశమిస్తున్నాయి. దాదాపు భగవదవతారంగా చెప్పుకునే వాళ్లందరూ ఆధ్యాత్మిక శాంతి అనే ఎక్కడా దొరకని సరుకును అమ్మే వ్యాపారులుగా మారిపోయారు.

ఈ అంశాలన్నిటినీ న్యాయమూర్తి భానుమతి తీర్పు స్పష్టంగా వివరించింది. సెషన్స్ న్యాయమూర్తుల స్థాయిలో ఉన్న వారిలో అతి తక్కువ మంది మాత్రమే చిరకాలం గుర్తుంచుకోదగిన తీర్పులను వెలువరిస్తారు. న్యాయమూర్తి భానుమతి తీర్పు అటువంటి అరుదైన తీర్పులలో ఒకటి.

* * *

# కమిషన్ల నిర్వాపకత్వం

ఇన్ని దశాబ్దాల ప్రజాజీవనం తర్వాత, ఎన్నో ఉద్యమాలతో, ఎంతో మంది ఉద్యమకారులతో సన్నిహిత అనుబంధం తర్వాత నాకు ఏమనిపిస్తున్నదంటే రాజకీయాలలో మనందరమూ సంపూర్ణంగా విఫలమయ్యాము. అసమర్ధంగా మిగిలిపోయాము. మన రాజకీయ జీవితాలను నియంత్రించే అంతర్గత నైతిక సూత్రాలన్నీ అదృశ్యమయిపోయాయి.

ప్రభుత్వం అనేది ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తుంటుందని మనం అనుకుంటాం. చట్టాలనేవి మనం నివసిస్తున్న సమాజాన్ని మరింత మెరుగైన సమాజంగా మార్చే పరివర్తనా ఉద్దేశ్యంతో రూపొందిస్తారని మనం అనుకుంటాం. ప్రజాప్రతినిధులతో ఏర్పాటయిన ప్రభుత్వం చట్టాలను సక్రమంగా అమలు చేయడానికి అవసరమైన మార్గదర్శక సూత్రాలను తయారు చేస్తుందని మవం అనుకుంటాం. ప్రభుత్వం క్రమశిక్షణతో పని చేసేలా, నిరంకుశంగా మారకుండా చూసేలా ప్రజా ప్రతినిధులు బాధ్యత వహిస్తారని మనం అనుకుంటాం. అన్ని ప్రాతినిధ్య సంస్థలూ, ప్రభుత్వమూ దారి తప్పకుండా చూసేందుకు స్వతంత్ర న్యాయమూర్తులతో కూడిన ఒక నిష్పాక్షిక, ఉదాత్త న్యాయ వ్యవస్థ ఉంటుందని మనం అనుకుంటాం.

ప్రజాప్రతినిధులుగా, న్యాయ వ్యవస్థ నిర్వాహకులుగా ఉండే వ్యక్తుల నుంచి మనం నిరాడంబరత్వాన్ని, గంభీరమైన సాదాతనాన్ని ఆశిస్తాం. ప్రజలను పాలించే అధికారం వచ్చినందువల్ల తమను తాము అధికులుగా భావించుకోని వినయశీలురుగా వారు ఉండాలని కోరుకుంటాం.

కాని ఈ ఊహలన్నీ మన రాజకీయ స్వాతంత్ర్యపు మొదటి పాతికేళ్ల లోపలే క్రమక్రమంగా కరిగిపోవడం మొదలైంది. ఈ కలల కోత, పాలనా శైథిల్యం ఎంత పెద్ద ఎత్తున జరిగిపోయిందో జూన్ 1975లో ఎమర్జెన్సీ విధింపుతో అందరికీ తెలిసి వచ్చింది. నిష్పాక్షిక, స్వతంత్ర సంస్థగా ఉండవలసిన న్యాయస్థానం కూడా 1975 జూన్‌లో నిరంకుశ అధికారానికి బలి అయిపోయింది.

ఇటువంటి పరిస్థితులలో, ఎమర్జెన్సీ తర్వాత జనతా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆ కాలంలో 1956 విచారణ కమిషన్ల చట్టం కింద అనేక విచారణ కమిషన్లు నియమించడం జరిగింది. వేర్వేరు స్థాయిలలో రాజ్యాంగ యంత్రపు సంస్థలలో, విధానాలలో అంత పెద్ద ఎత్తున దిగజారుడు తనం ఎలా ప్రవేశించి బలపడిందో అర్థం చేసుకోవడానికి ఈ కమిషన్ల నియామకం జరిగింది. దేశ వ్యాప్తంగా అంత పెద్ద ఎత్తున

సమగ్ర విచారణలు జరపడానికి ఈ కమిషన్ల నియామకం తగిన పనే అని అప్పుడు అనిపించింది. అప్పుడు ఈ కమిషన్ల నియామకం వెనుక ఉద్దేశ్యం పాలనను పునరుద్ధరించడమే గాని రాజ్యాంగంపై పునరాలోచించడం కాదు. పాలనను పునరుద్ధరించడానికి ఆయా కమిషన్ల నివేదికలను వాడుకోవాలని అప్పటి ప్రభుత్వం భావించింది.

కాని ఆ పని జరగలేదు. కాకపోగా ప్రతి సందర్భంలోనూ న్యాయవిచారణ కమిషన్ వేయమని యాంత్రికంగా కోరే అలవాటు మాత్రం ఒక రాజకీయ డిమాండ్‌గా నిలిచిపోయింది. ఎవరికైనా రాజకీయ నిరసనలనూ ఆందోళనలనూ నిరవధికంగా నిర్వహించడం సాధ్యం కాదు. రాజకీయ పక్షాలకూ, బృందాలకూ సుదీర్ఘ కాలం ఆందోళన చేసే ఓపిక గాని, శక్తిగాని ఉండవు. దీర్ఘకాలం నడిచినా నడవకపోయినా ఏ ఆందోళనకయినా ఒక ముగింపు ఉండక తప్పదు. మన సమాజంలో ఒక రాజకీయ సంప్రదాయం ఏమంటే ప్రతి ఆందోళననూ నిరసననూ ఒక డిమాండ్‌తో ముగించడం, ప్రజానీకంలో బహిరంగంగా గాని, లోలోపల గాని వ్యక్తమయిన ఆగ్రహాన్ని చల్లార్చాలంటే ఒక ఆచరణ సాధ్యమైన డిమాండ్ ప్రకటించడం అవసరం. న్యాయవిచారణ డిమాండ్ అటువంటి ఆచరణ సాధ్యమైన డిమాండ్ అవుతుంది. ఎంత మొండి, మొరటు ప్రభుత్వమయినా ఆ డిమాండ్‌ను అంగీకరించే అవకాశం సాధారణంగా ఉంటుంది.

కాని ఇక్కడ ఒక మౌలిక ప్రశ్న వేసుకోవలసి ఉంది. ఆ విచారణ కమిషన్ల చట్టం అనేది న్యాయస్థానాల్లో జరిగే నేర విచారణకు ప్రత్యామ్నాయం అవుతుందా? ఎట్టి పరిస్థితుల్లోనూ కాదు. విచారణ కమిషన్ అనేది న్యాయవ్యవస్థలో భాగం కాదు. ఒక పదవిలో ఉన్న సెషన్స్‌లో భాగం కాదు. ఒక పదవిలో ఉన్న సెషన్స్ న్యాయమూర్తిని నియమించి విచారణ జరిపించినప్పటికీ చట్టప్రకారం ఆ న్యాయమూర్తికి ఆ సమయంలో తన సెషన్స్ న్యాయమూర్తి పదవిలో ఉండే అధికారాలు ఉండవు. ఆ విచారణ కమిషన్ల చట్టం అనేది ఒకానొక ప్రజా ప్రాముఖ్యత గల అంశంలో సమాచారం సేకరించేందుకు ప్రభుత్వం చేతిలో ఉన్న ఒక సాధనం మాత్రమే. ఆ సాధనం ఏ విషయాన్నయినా ఒక న్యాయస్థానం నిర్ధారించినట్టుగా నిర్ధారించజాలదు.

అంతేకాదు, నేరశిక్షాస్మృతి నిబంధనల ప్రకారం జరిగే పరిశోధనలు కూడా ఒక విచారణ కమిషన్ ప్రత్యామ్నాయం కాజాలదు. అంటే అటువంటి పరిశోధన చేయమని కూడా విచారణ కమిషన్‌ను కోరలేము. సమాజంలో జరిగే ప్రతినేరాన్నీ పరిశోధించి, నేరస్తులను న్యాయస్థానం ముందర హాజరుపరచడం రాజ్యపు బాధ్యత. ఇక ఆ న్యాయస్థానం చట్టప్రకారం స్థాపితమైన పద్ధతి ద్వారా విచారణ జరిపి ఆ వ్యక్తులు నేరస్తులని తేలితే వారి జీవనాన్నిగాని, స్వేచ్ఛనుగాని రద్దు చెయ్యవచ్చు. ఒక నేరం జరగగానే ఈ నేర నిర్ధారణా న్యాయ వ్యవస్థ పనిని ప్రారంభించే బాధ్యత మరెవరికైనా బదిలీ చేయడానికిగాని,

అసలే లేకుండా చెయ్యడానికి గాని వీలు లేదు.

జస్టిస్ భార్గవ, జస్టిస్ ముక్తధర్ కమిషన్ల నాటి నుంచి, ప్రభుత్వం నియమించిన ప్రతి విచారణ కమిషన్ ముందర వాదనలు వినిపించడం హే పని అయింది. అసాధారణంగా ప్రజల న్యాయమైన నిరసనల మీద పోలీసులు చేసిన అత్యాచారాలకు వ్యతిరేకంగా ప్రజా ఆందోళనలు జరిగినప్పుడు ప్రభుత్వం ఇటువంటి కమిషన్లను నియమిస్తుంది. అసలు అటువంటి నిరసన వెల్లువెత్తడమే రాజ్యం మీద తిరుగుబాటుగా ప్రభుత్వం భావిస్తుంది. అందువల్ల ప్రతి ప్రజా నిరసననూ అణచివేయడానికి అత్యంత క్రూరంగా ప్రవర్తించమని ప్రభుత్వం పోలీసులను ఆదేశిస్తుంది. కాని మన ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం ప్రజలకు ఆ మాదిరిగా నిరసన తెలిపే హక్కును ప్రాథమిక హక్కుగా హామీ ఇచ్చింది. ప్రజల సమస్యలను రాజకీయంగా పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యతగా ప్రకటించింది.

రెండు దశాబ్దాల కింద ఒక సందర్భంలో ఒంగోలులో పొగాకు రైతులు తమ జీవితాలను మెరుగుపరచుకునే ఉద్దేశ్యంతో ఒక ప్రదర్శన నిర్వహించారు. ఆ ప్రదర్శనకారులు మొదట నిరాహార దీక్షలకు కూచున్నారు. ఆ క్రమంలో వారిలో అశాంతి పెరిగింది. సహజంగానే వారు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించడానికి వారితో చర్చలు జరపడానికి ప్రభుత్వం ముందుకు రాకపోయేసరికి వారికి ఇక మిగిలిన దారి హింసా మార్గం మాత్రమే. అక్కడికి ఆ గుంపును చెదరగొట్టడానికి వెళ్లిన పోలీసులు ఒక ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేటును వెంటబెట్టుకుని వెళ్లారు. సాధారణంగా ఇటువంటి ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ కింది స్థాయి రెవెన్యూ అధికారి అయి ఉంటాడు. అంతకన్నా పైస్థాయి అధికారి అయితే ఏదో పెద్ద తేడా ఉంటుందని కాదు. ఎవరైనా కాల్పులు జరపాలని పోలీసులు తీసుకునే నిర్ణయాన్ని ఆమోదించడానికే. మన పోలీసులకు సాధారణంగా ప్రజాస్వామ్య ప్రక్రియలను దాట వేయడానికి శిక్షణ ఇవ్వబడుతుంది. అందువల్లనే చాలా ఎక్కువగా తుపాకి కాల్పులు జరుగుతాయి. ఒంగోలులో కూడా ఇదే జరిగింది.

మన దేశంలో రాజ్యాంగం పని చేసే తీరు చూడడం ఆసక్తికరంగా ఉంటుంది. ప్రజలు ఒక సమస్యను గుర్తించి పరిష్కరించమని అడుగుతారు. ఆ విషయంలో ఒక మహజరు సమర్పించుకోమని స్థానిక నాయకులు సలహా ఇస్తారు. ప్రజలు సమర్పించే మహజరు తక్షణమే దగ్గరిలోని చెత్తబుట్టకు చేరుతుంది. సమస్య పరిష్కారం కోసం, కనీసం తమ మహజరుకు జవాబు కోసం చాలా కాలం వేచి చూసిన ప్రజలు సంఘటితం కావాలని, నిరసన తెలపాలని నిర్ణయించుకుంటారు. ప్రజల నిరసన వ్యక్తీకరణ పొందుతుంది. ఆ నిరసనను పోలీసులు ఊహించశక్యంకాని హింసతో అణచివేస్తారు. ప్రజలు తమ జీవించే హక్కు కోసమో, జీవనం కోసమో డిమాండ్ చేస్తారు కాని ఆ క్రమంలో వాళ్లలో కొందరు తమ ప్రాణాలే పోగొట్టుకోవలసి వస్తుంది. అది కూడా

చట్టం ద్వారా స్థాపితమైన పద్ధతిలో జరగదు.

శాంతిభద్రతలు అనే ఎక్కడా నిర్వచించబడని శక్తివంతమైన మాట అధికరణం 21 హామీ ఇచ్చే జీవించే స్వేచ్ఛను అన్యాయంగా, అనధికారికంగా రద్దు చేసి వేస్తుంది.

ఇక్కడ ఒక పాత సంగతి చెప్పాలి. తిరువాన్కూరు - కొచ్చిన్ రాష్ట్రంలో సోషలిస్టు పార్టీ ప్రభుత్వానికి పానంపల్లి గోవింద మీనన్ నాయకత్వం వహిస్తున్నప్పుడు ఆయన ఏదో తప్పు చేశాడు. వెంటనే ప్రభుత్వాధికారం నుంచి దిగిపొమ్మని, రాజీనామా చేయమని పార్లమెంటరీ పార్టీ నాయకుడు రామమనోహర్ లోహియా ఆదేశించాడు. బహుశా అటువంటి ఆదేశం ఇచ్చిన నాయకుడు ఆయన ఒక్కడే కావచ్చు.

ఆ తర్వాత తమ పార్టీ నాయకులు ఎన్ని తప్పులు చేసినా, ప్రభుత్వాలు కొనసాగితే చాలునన్నట్టు వాళ్లను సమర్థించిన వారేతప్ప బహిరంగంగా విమర్శించిన వారు ఎవరూలేరు. నందిగ్రామ్ ఉదాహరణ చూడండి ! ముఖ్యమంత్రి కామ్రేడ్ బుద్ధదేవ్ భట్టాచార్య ఇస్తున్న వివరణలు, సంజాయిషీలు, ఆయన కోసం ఇతరులు ఇస్తున్న వివరణలు, సంజాయిషీలు చూడండి. ఒక కమ్యూనిస్టు పార్టీ, అది రాడికల్ పార్టీ అయినా, రివిజనిస్టు పార్టీ అయినా, దాని పోలిట్‌బ్యూరో గనుక తమ పార్టీకి చెందిన ముఖ్యమంత్రి తన పాలనా క్రమంలో అంత ఘోరమైన మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడితే అతడిని వెనక్కి పిలవగలిగిన రోజున మాత్రమే ఈ దేశంలో వామపక్ష భావజాలం విస్తరిస్తుంది. అంత వరకూ అది జరగదు. దశాబ్దాలుగా బూర్జువా ముఖ్యమంత్రులందరూ శాంతిభద్రతల పేరు మీద ఏమిచేస్తూ వస్తున్నారో అదే పని కామ్రేడ్ బుద్ధదేవ్ చేశాడు.

నిజానికి ఈ దేశం తయారు చేసిన రాజకీయ నాయకులలోకెల్లా అతి సున్నితమైన వాడు రామ్ మనోహర్ లోహియా. ఆయన మన నేర శిక్షా స్మృతిలోని ప్రజాభద్రత నిబంధనలను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో చరిత్రాత్మక సమరం సాగించాడు. ఆయన శాంతిభద్రతలు, ప్రజాభద్రత, రాజ్య సురక్షితత్వం అనే మాటల నిర్వచనాలేమిటని ప్రశ్నించాడు. సుప్రీం కోర్టు కూడా ఆ మాటలను నిర్వచించడంలో విఫలమైంది. చివరికి వాటిని నిర్వచించలేక అవన్నీ ఒక వృత్తమని, ఆ వృత్తానికి బైటివలయంలో రాజ్యం సురక్షితత్వం ఉంటుందని ప్రకటించింది.

సరే, ఒంగోలు పోలీసు కాల్పుల విషయంలో విచారించడానికి చాలా నెమ్మదస్తుడు, మంచివాడు, ఎవరికీ అపకారం తలపెట్టని వాడు జస్టిస్ హెచ్.ఎ.అయ్యర్‌ను విచారణ కమిషన్ల చట్టం కింద న్యాయమూర్తిగా నియమించారు. ఆ విచారణలు ఒంగోలు పట్టణంలో ఒక చిన్న గుట్టమీద జరుగుతుండేవి. ఆ విచారణకు మేము వెళుతున్నప్పుడు దారిలో ఎంతో మంది మఫ్టీ దుస్తుల పోలీసులు ప్రజలను భయపెడుతూ, విచారణ కమిషన్ ముందుకు రాకుండా బెదరగొడుతూ కనిపించారు. అక్కడి నుంచి మేం విచారణ జరుగుతున్న హాలులోకి ప్రవేశించేసరికి, న్యాయమూర్తి ఎదుట మొదటి ఐదు వరుసల్ల

కూర్చున్న వాళ్లు మఫ్టీలో ఉన్న స్పెషల్ బ్రాంచి పోలీసులని మాకు స్థానికులు చెప్పారు. మేం ఆ విషయం చెప్పగానే న్యాయమూర్తి వారిని బయటికి పంపక ముందే వాళ్లందరూ లేచి వెళ్లిపోయారు.

ఇటువంటి అనుభవం అదే మొదటిసారి కాదు. జస్టిస్ భార్గవ కమిషన్ తన మొదటి దఫా విచారణ లేక్ వ్యూ గెస్ట్ హౌస్‌లో జరుపుతున్నప్పుడు పురుషోత్తమరెడ్డి అనే కిందిస్థాయి న్యాయమూర్తి సాక్ష్యం చెప్పడానికి లేక్ వ్యూ గెస్ట్ హౌస్‌కు వస్తున్నాడు. గేటు దగ్గరే ఆయన కారు ఆపి వెనక్కి వెళ్లపొమ్మని ఒక పోలీసు అధికారి బెదిరించాడు. ఆయన ఆ మాట వినకుండా ముందుకే వెళ్లి సాక్ష్యం చెప్పి తన ఇంటికి తిరిగి వెళ్లేసరికి ఆయన అద్దెకు ఉంటున్న ఇంటి యజమాని ఆయనను ఇల్లు ఖాళీ చేయించాడు. ఆ ఇంటి యజమాని ఒక పోలీసు అధికారి.

డాక్టర్ రామనాథంను పోలీసులు కాల్చి చంపిన తర్వాత ఆయన అంత్యక్రియలో భాగంగా పదవరోజున కర్మకు హాజరు కావడానికి కొందరు బంధువులు కాజీపేట రైల్వే స్టేషన్‌లో దిగగానే వారిని పోలీసులు అటకాయించారు. ఆ బంధువులలో ఉన్న సివిఎల్ నరసింహారావు ఆ తర్వాత జడ్జి కూడా అయ్యారు. వారందరినీ పోలీసులు స్టేషన్‌లోనే ఆపివేసి, రైల్లోనో బస్సులోనో హైదరాబాద్ తిరిగి వెళ్లిపొమ్మని పంపించేశారు.

ఈ దేశ రాజ్యాంగం హామీ ఇచ్చిన భావప్రకటనా స్వేచ్ఛను రద్దు చేయడానికి పోలీసులు ఎటువంటి పద్ధతులు ఉపయోగిస్తారో తెలుసుకోవడానికి ఈ మాత్రం ఉదాహరణలు చాలు.

సరే, ఒంగోలులో పోలీసు కాల్పులపై విచారణ జరుపుతున్న అయ్యర్ కమిషన్ గురించి చెబుతున్నాను గదా. పోలీసు కాల్పులు అనివార్యమైన పరిస్థితులలోనే జరిగాయని, నిరసనకారులలో ఎవరూ తమపై కాల్పులు జరిపిన పోలీసులు గుర్తించలేదని జస్టిస్ అయ్యర్ మిగిలిన న్యాయమూర్తులందరి లాగే నివేదిక రాశారు. ఆ కమిషన్ విచారణ మొత్తంలో జరిగినదేమంటే నాకు జస్టిస్ అయ్యర్‌తో దగ్గరి పరిచయం ఏర్పడింది. అయ్యర్ తన అనుభవాలూ ఇతర సంగతులూ ఆసక్తికరంగా కథలు కథలుగా చెబుతుండే వారు. ఆయన తన ఉద్యోగంలో శిక్షణ పొందే రోజుల్లో రూథర్‌ఫర్డ్ దగ్గర పని చేశారు. రూథర్‌ఫర్డ్ అంటే అల్లూరి సీతారామరాజు నడిపిన ఉద్యమాన్ని అణచివేసిన అధికారి. ఆనాటి సంగతులన్నీ అయ్యర్ చెప్పేవారు. అయితే జస్టిస్ అయ్యర్ ఎవరికీ ఉద్దేశ్యపూర్వకంగా అపకారం చేశారనుకోను. ఆయన చాలా మంచివాడు. హాస్యప్రియుడు, సంభాషణా చతురుడు.

నేను ఒంగోలులో ఆయనతో గడిపిన సాయంకాలాలలో ఒక రోజున ఆయన తాను ప్రభుత్వ న్యాయశాఖ కార్యదర్శిగా ఉన్నప్పుడు తన దగ్గర ఉండిన ఇద్దరు సహాయ కార్యదర్శుల మధ్య వచ్చిన తగాదా గురించి చెప్పారు. ఆ ఇద్దరిలో ఒకరు పెద్ద అవినీతి

పరుడని మరొకరు బహిరంగంగా ఫిర్యాదు చేశారట. ఆ ఫిర్యాదు లిఖిత పూర్వకంగా వచ్చిందట. ఆ రోజుల్లోని ఆనవాయితీ ప్రకారం ఆ ఫిర్యాదు చివర ఆ సహాయ కార్యదర్శి "దురదృష్టవశాత్తూ ఇవన్నీ చూసేందుకే కాబోలు భగవంతుడు నాకు కళ్లు ఇచ్చాడు. మరి ఇక నేను చూడకుండా ఎలా ఉండగలను?" అని రాసి ముగించాడట. ఆ ఫిర్యాదు తిరిగి తిరిగి అయ్యర్ దగ్గరికి వచ్చిందట. "నీకు కళ్లు ఇచ్చిన ఆ భగవంతుడే, అపార కరుణామయుడై ఆ కళ్లకు రెప్పలు కూడా పెట్టాడు. కావాలంటే నీవు వాటిని మూసుకోవచ్చు" అని రాశారట అయ్యర్. ఆ ఫిర్యాదుల యుద్ధం అలా ముగిసిందట.

వివాదాలు తలెత్తినప్పుడు చాలా మంది తీసుకునేది ఇటువంటి వైఖరే. సమస్యలను చూడకపోతే సరిపోతుంది అని వాళ్లు భావిస్తారు.

విచారణ కమిషన్లు నియమించడం, వాటిలో సాధారణ ప్రజానీకానికి భాగస్వామ్యం కల్పించడం అనే పద్ధతే సంబంధిత విషయాలలో ఎక్కువ మందికి ప్రజలకు అవగాహన కల్పించడం కోసం, ప్రచారం చేయడం కోసం ఉద్దేశించినది. కాని మన రాజకీయ ప్రక్రియలో అసలు విచారణ కమిషన్ల మౌలిక ఉద్దేశ్యమే తిరగదోడడం జరిగింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో తక్షణ పరిష్కారం అవసరమైన విషయాలపై నిర్ణయాలను వాయిదా వేయడానికి, నాన్చడానికి ఒక సాధనంగా విచారణ కమిషన్ల నియామకం జరుగుతోంది.

తాజా ఉదాహరణ చూడాలంటే షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్‌లో మాదిగలకు, ఇతర ఉపకులాలకు ఎంతెంత వాటా ఇవ్వాలని తేల్చడానికి ఒక కమిషన్‌ను నియమించారు. ఆ విషయం తేల్చడానికి ఒక కమిషన్ అవసరమా? షెడ్యూల్డ్ కులాల జాబితాలో ఉన్న ఉపకులాలలో ఒక ప్రధాన కులం అన్యాయంగా ఆ రిజర్వేషన్ ప్రయోజనం మొత్తాన్ని అనుభవిస్తున్నప్పుడు ఆ చర్యను ఆపడానికి ఒక కార్యనిర్వాహక ఉత్తర్వు సరిపోదా? అందరికందరూ అగ్రవర్ణాల వారు నిండి ఉండే ఒక న్యాయమూర్తుల బెంచికి అస్పృశ్యులందరూ ఒకటేననిపిస్తుంది. షెడ్యూల్డ్ కులాల జాబితాలో అందరూ అస్పృశ్యులేగదా అనీ, వారి మధ్య తేడాలు చూసే అధికారం రాష్ట్రపతికి తప్ప మరెవరికీ లేదనీ వాళ్లకు అనిపించింది. కాని ఆ న్యాయమూర్తులు ఈ నిర్ధారణకు రావడానికి ఉపయోగించిన పద్ధతి ఏమిటో ఎవరి ఊహకూ అంతుపట్టనిది.

ప్రజా ప్రాధాన్యత గల అంశాలలో విచారణ కోసం నియమించిన అనేక కమిషన్ల ముందు హాజరైన నా అనుభవంతో చెప్పగలదేమంటే, ఈ కమిషన్ల నియామకాలు ప్రభుత్వంగాని, చట్టాన్ని అమలు చేయవలసిన సంస్థలుగాని సమస్యలను పక్కదారి పట్టించడానికి ఉపయోగించే ఎత్తుగడలు మాత్రమే. ఈ విచారణ కమిషన్ల ముందు సాక్షులు సాక్ష్యాధారాలు సమర్పించకుండా అడ్డుకోవడానికి ప్రభుత్వం, శాసనాధికార వ్యవస్థలు అన్ని ప్రయత్నాలూ చేస్తాయి. ఇందులో శక్తివంతులైన ప్రైవేటు వ్యక్తుల, స్వార్థపరశక్తుల పాత్ర కూడా ఉంటుంది. వీళ్లందరూ కలిసి అధికారులు తమను తాము

సమర్థించుకోవడానికిగాని, ప్రభుత్వ తప్పిదాల నుంచి దృష్టి మరల్చడానికిగాని, ప్రభుత్వాధికారంలో ఉన్న వ్యక్తులు చేసిన అకృత్యాలను కప్పి పెట్టడానికిగాని ప్రయత్నిస్తారు.

ఈ సందర్భంలో మరొక సంఘటన గురించి చెప్పాలి. అది న్యాయవాదులు తమ నల్లకోటు వేసుకుని అంటే బాధ్యతా నిర్వహణలో భాగంగా, హైదరాబాద్‌లో జరిపిన ఊరేగింపు. ఆ న్యాయవాదుల ఊరేగింపు పబ్లిక్ గార్డెన్ ఎదురుగా ఉన్న పోలీసు కంట్రోల్ రూం దగ్గరికి చేరగానే దాన్ని పోలీసులు ఆపివేశారు. న్యాయవాదులను యూనిఫారంలో ఉన్న పోలీసు అధికారులు కొట్టారు. ఆ సమయంలో ఆ పోలీసు అధికారుల వంటి మీద ఖాకీ చొక్కాలు ఉన్నాయి గాని వాటి మీద వారిపేర్లు, నంబర్లు, భుజాల మీద వారి బలగం పేర్లు, పట్టీలు లేవు. ఈ సంఘటన మీద విచారణ జరపడానికి ఒక కమిషన్‌ను నియమించడం జరిగిందిగాని ఆ వివరాలు తెలియకపోవడం వల్ల న్యాయవాదులను కొట్టిన పోలీసు అధికారులు ఎవరో గుర్తించడం అసాధ్యమైపోయింది. అంటే కమిషన్ నియామకం అవతలి వ్యక్తులను బోల్తా కొట్టించడానికి ఒక తెలివైన ఎత్తుగడగా కనబడుతుందిగాని, దాని ఫలితం ఏమిటి?

విచారణ కమిషన్ల చట్టం 1956 గురించి జనతా ప్రభుత్వం అందరికీ తెలిసేలా చేసింది. కాని ఇప్పుడు ఆ విచారణ కమిషన్ల నియామకం ప్రజలను మోసపుచ్చడానికి, ఏదో ఒకటి జరుగుతుందని నమ్మి ప్రజలు మౌనంగా ఉండడానికి ఒక సాధనంగా ఉపయోగపడతోంది. అందువల్లనే జస్టిస్ ఠక్కర్, జస్టిస్ నటరాజన్ కమిషన్ విచారణ కమిషన్ల చట్టం ఎంత అసమర్థంగా మారిపోయిందో వాపోయారు. ఈ నిష్ఫల కసరత్తులవల్ల ఎంత సమయం శక్తి, వనరులు వ్యర్థమైపోతున్నాయో ఆ న్యాయమూర్తులిద్దరూ వివాదం ప్రకటించారు. ఈ ఇద్దరు సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో ఒక విచారణ కమిషన్ నియమించిన చరిత్ర తెలుసుకోవలసినది.

కొన్ని వ్యాపార సంస్థలు జరిపిన లావాదేవీలలో జరిగిన ఆర్థిక నేరాల గురించిన ఆరోపణలను విచారించడానికి ఫేర్ ఫాక్స్ గ్రూప్ ఇన్ కార్పోరేటెడ్ అనే విదేశీ పరిశోధనా సంస్థను నియమించడంలో అక్రమాలు జరిగాయని పార్లమెంటులో చర్చ జరిగింది. దానితో 1987లో ఆ ఇద్దరు న్యాయమూర్తులతో ఒక విచారణ కమిషన్‌ను నియమించారు. జస్టిస్ ఠక్కర్, జస్టిస్ నటరాజన్‌లు తమ నివేదికలో 1956 విచారణ కమిషన్ల చట్టం "అసమర్థమైనదని, కోరలు లేనిదని" అభివర్ణించారు. ఆ చట్టంలోని అసమగ్రతలను వివరించడానికి వారి నివేదికలో ఒక పూర్తి అధ్యాయం కేటాయించారు. వారి విచారణ క్రమంలో వారి మీద కొన్ని వార్తాపత్రికలు అన్యాయమైన దాడి, దుష్ప్రచారం సాగించాయి. ఆ కమిషన్ ఇచ్చిన సమన్లను కొందరు వ్యక్తులు ఖాతరు చేయలేదు. అప్పటికి ఇంకా పదవిలోనే ఉన్న న్యాయమూర్తులుగా వారికి ఈ విచారణ సందర్భంలో కూడా కోర్టు ధిక్కరణ నేరం కింద తమ ఆదేశాలను బేఖాతరు చేసిన వారిని విచారించేందుకు అధికారం

ఉంటుందని వారు వాదించారు. తమ ఆదేశాలను ధిక్కరించిన వారిని శిక్షాస్మృతి ప్రకారం విచారించి శిక్షలు విధించే అధికారం కూడా తమకు ఉండాలని వారు వాదించారు. ఇటువంటి ప్రజ అధికారి ఆదేశాలను ఉద్దేశ్యపూర్వకంగా ఉల్లంఘించే వారిపై హెచ్చరికగా నిలిచే శిక్షలు అమలు చేయాలని వారు వాదించారు.

వారి ఈ నిరాశాభరితమైన వాదనలలో గుర్తించవలసిన విషయమేమంటే అప్పుడప్పుడే తలెత్తుతున్న ధోరణులపట్ల వారిలో వ్యక్తమైన నిరాశ. అంటే ప్రభుత్వాన్ని, పాలనను సంస్కరించాలని, పునర్నిర్మించాలని ప్రారంభమైన ప్రయత్నం అత్యంత దారుణంగా విఫలమయి పోయింది. ఆ వైఫల్యం మరింత బహిరంగంగా, నిస్సిగ్గుగా పద్ధతులను ఉల్లంఘించడానికి అధికారగణం నేరస్తులకు సహకరించడానికి, ప్రోత్సహించడానికి, మిలాఖత్తు కావడానికి దారి తీసింది. తద్వారా అధికారగణం తనంతట తానుగాని, నేరస్తుల ద్వారా గాని శిక్షాతీత నేరప్రవృత్తిని పెంపొందించుకుంది.

అయినా విచారణ కమిషన్‌ను నియమించమని అడగడం ఒక రాజకీయ ఆకాంక్షగా అలవాటుగా మారిపోయింది. అది దాదాపు యాంత్రికంగా వచ్చేస్తుంది. ఇక మానవ హక్కుల, పౌరహక్కుల బృందాలకయితే ఈ విచారణ కమిషన్లనేవే హక్కుల ఉల్లంఘనలను బయటపెట్టే, ప్రభుత్వం చేత జవాబుదారీ బాధ్యత వహించేలా చేసే సాధనాలుగా ఉన్నాయి. కాని మానవ హక్కులను గౌరవించడమేనేది ప్రభుత్వాధికారులకు సాధారణ ప్రవర్తనగా మారాలంటే మొత్తం సమాజమే పెద్దఎత్తున చాలా లోతుగా పునర్నిర్మాణం జరగవలసి ఉంటుంది.కాని రోజులన్నీ ఒక్క రాత్రిలో జరిగిపోవుగనుక చిన్నచిన్న పనులకే మనం సంతృప్తి పడవలసి ఉంటుంది. సమాజాన్ని మెరుగైన ప్రపంచంగా మార్చడానికి జరుగుతున్న చిన్న ప్రయత్నాలతోనే సంతృప్తి పడవలసి ఉంటుంది. ఆ మెరుగైన ప్రపంచం వచ్చే లోపల ప్రజాజీవితం మరీ దుర్భరంగా మారకుండా ఉండేలా, జీవనయోగ్యమైనదిగా ఉండేలా చిన్నచిన్న పనులు చేయడమే మన కర్తవ్యం.

అటువంటి పనులలో భాగమే పౌర హక్కుల కృషి. ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘానికి నా కన్నా ముందు మహాకవి శ్రీశ్రీ అధ్యక్షుడిగా ఉండేవారు. హైకోర్టు న్యాయవాది పత్తిపాటి వెంకటేశ్వర్లు ప్రధాన కార్యదర్శిగా ఉండేవారు. వారిద్దరూ నిజనిర్ధారణ బృందంగా ఏర్పడి రాష్ట్రంలో పోలీసు అత్యాచారాలు జరిగినప్రాంతాలెన్నో తిరిగారు. ఎక్కడ ఎన్‌కౌంటర్ పేరిట హత్య జరిగితే అక్కడికి వెళ్లి వాస్తవాలు సేకరించి పత్రికలకు, ప్రజలకు తెలియజేశారు.

శ్రీశ్రీ, పత్తిపాటి వెంకటేశ్వర్లు చేసిన పని అంతా ఒక దోపిడీ సామాజిక వ్యవస్థ అణచివేతకు వ్యతిరేకంగా పోరాడుతున్న వారి మౌలిక మానవ హక్కుల గురించి ఎలుగెత్తడమే. కాని వారు చేసిన ఈ పనికి వారిని చాలా తప్పుడు పద్ధతిలో నక్సలైట్ల మద్దతుదారులుగా రాజ్యం ముద్రవేసింది. మొదట నక్సలైట్ల హక్కుల అణచివేతగా

ప్రారంభమైనది క్రమక్రమంగా ఇతర వర్గాల ప్రజల హక్కుల అణచివేతగా మారడంతో పౌర హక్కుల అణచివేతగా మారడంతో పౌరహక్కుల సంఘం ఆయా వర్గాల ప్రజల హక్కుల కోసం కూడా మాట్లాడవలసి వచ్చింది. భూస్వాములు కూడా గ్రామసీమలలో రాజ్యంతో సమానమైన అధికారబలం కలిగి ఉన్నందువల్ల వారు చేసిన హక్కుల అణచివేతను కూడా పౌరహక్కుల కృషిలో భాగం చేయవలసి వచ్చింది. ఈ అత్యాచారాలు సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక హక్కులకు కూడా విస్తరించడంతో పౌరహక్కుల కృషి ఆయా రంగాలకు కూడా వ్యాపించింది. నిజానికి ఈ సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక హక్కుల పరిరక్షణకు భారత ప్రభుత్వం సంతకం చేసిన అంతర్జాతీయ ఒడంబడికలు హామీ ఇచ్చాయి. రాజ్యాంగంలోని 17, 23, 24 అధికరణాలు హామీ ఇచ్చాయి. అధికరణం 17 అస్పృశ్యత గురించి మాట్లాడితే దాన్నే 1956 పౌరహక్కుల చట్టం, 1986 షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల అత్యాచారాల నిరోధ చట్టం విస్తరించాయి. అధికరణం 23 నిర్బంధ, వెట్టిచాకిరీ గురించి, అధికరణం 24 బాలల హక్కుల గురించి మాట్లాడాయి. రాజకీయంగా అమలులో పెట్టదగిన రాజ్యాంగంలోని నాలుగో భాగం మొత్తం ఈ మానవ హక్కుల గురించే ప్రస్తావించింది. అధికరణం 51 ఎ లో పొందుపరిచిన ప్రాథమిక బాధ్యతలు మానవ హక్కుల ఉద్యమం ఎంతగా విస్తరించవచ్చునో స్పష్టం చేశాయి.

* * *

# గుజరాత్ హననకాండ నేపథ్యం - శ్రీకృష్ణ కమిషన్

ఆ అధికరణం ప్రకారం, మత, భాషా, ప్రాంత, బృంద విభిన్నతలను అధిగమించి భారత ప్రజలందరి మధ్య సామరస్యాన్ని, సౌభ్రాతృత్వస్ఫూర్తిని పెంపొందించడం, మహిళల గౌరవాన్ని భంగపరిచే అన్నిరకాల ఆచారాలను నిర్మూలించడం ఒక ప్రాథమిక బాధ్యత. అడవులు, సరస్సులు, నదులు, పశు పక్ష్యాదులు వంటి సహజ పర్యావరణాన్ని సంరక్షించడం, మెరుగుపరచడం, సకల జీవజాతులపట్ల ప్రేమాదరాలను చూపడం మరొక ప్రాథమిక బాధ్యత.

ఈ రెండు ప్రాథమిక బాధ్యతలూ, మిగిలిన నిబంధనలతోపాటు, మానవ హక్కుల ఉద్యమపు పరిధిని విస్తరిస్తాయి. మహిళల హక్కుల కొరకు పోరాడడం మానవ హక్కుల ఉద్యమ పరిధిలోకి వస్తుందా రాదా అని ఎవరికైనా అనుమానం ఉంటే "మహిళల గౌరవాన్ని భంగపరిచే అన్ని రకాల ఆచారాలను నిర్మూలించడం" అనే మాట చేర్చడం

ద్వారా రాజ్యాంగమే ఆ అనుమానాలన్నిటినీ తొలగించింది. ఆ మాట ఒక క్రమశిక్షణనూ చెబుతుంది. ఒక భవిష్యత్ ఆదేశాన్నీ ఇస్తుంది.

సరే, మానవ హక్కుల ఉద్యమం విస్తరణలో భాగంగా మొదట పాలనాపరమైన అంశాలపై విచారణ కమిషన్లలో పాల్గొనడం ద్వారా మానవ హక్కుల ఉల్లంఘనలపై ప్రచారం సాగించవచ్చునని భావించాం. కాని ఒక దశ గడిచేసరికి ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో ఈ విచారణ కమిషన్లలో భాగస్వామ్యానికి ఏమంత ప్రయోజనం లేదని అర్థమయింది. అప్పుడిక ప్రజలతోనే విచారణ జరిపించాలని, ప్రజా ట్రిబ్యునళ్లు ఏర్పాటు చేయాలని ఆలోచన వచ్చింది.

ప్రజల హక్కుల ఉల్లంఘనలపైన విచారణ జరపడానికి విచారణ కమిషన్ల చట్టం కింద న్యాయవిచారణలు నియమితమవుతాయి. కాని అవి విఫలం కావడం పెరిగిపోయిన తర్వాత అటువంటి విచారణలు ప్రజలవైపు నుంచి జరపాలనే ఆలోచన మొదలైంది. వివిధ రంగాల నుంచి ప్రముఖులతో, ప్రజానుకూల మేధావులతో, చాలాసార్లు న్యాయమూర్తులతో ప్రజా ట్రిబ్యునళ్ల ఏర్పాటు మొదలైంది. అటువంటి ప్రజా ట్రిబ్యునళ్లలో గుజరాత్ మారణకాండ మీద విచారణ జరపడానికి ఏర్పడిన ట్రిబ్యునల్ చాలా ముఖ్యమైనది. అయితే ఈ ప్రజా ట్రిబ్యునళ్ల ఏర్పాటు కన్నా ముందు అసలు ఈ దేశంలో మత కల్లోలాల చరిత్రను కాస్త చూడవలసి ఉంటుంది.

భారతదేశాన్ని ఒక మతరాజ్యంగా మార్చాలనే సిద్ధాంతం వ్యాపించే అవకాశం ఉన్నదని చాలా ముందుగా పసిగట్టినది శ్రీమతి ఇందిరాగాంధీ ప్రభుత్వం. ఆ పని మాత్రం భారతీయ జనతాపార్టీ నాయకత్వంలోని ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాతనే మొదలైంది. ఆ ప్రభుత్వహయాంలో రాజ్యాంగ సమీక్షా సంఘం ఏర్పాటు చేయడం అటువంటి ప్రయత్నాలలో ఒకటి. ఆ ప్రయత్నంలో విఫలమైన భారతీయ జనతా పార్టీ ఆ సమీక్షా సంఘ నివేదికను నిశ్శబ్దంగా పక్కనపడవేసింది. ఆ తర్వాత ఆ ప్రభుత్వమే మాలిమత్ కమిటీని నియమించింది.

కర్నాటక, కేరళ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వివిఎస్ మాలిమత్ అధ్యక్షతన నవంబర్ 2000లో ఏర్పాటయిన ఈ కమిషన్ పని దేశంలో నేరవిచారణా న్యాయవ్యవస్థను పునర్నిర్మించేందుకు అవసరమైన సిఫార్సులు చేయడం. రాజ్యాంగ నిబంధనలతో సహా నేరవిచారణ మౌలిక సూత్రాలను పరీక్షించడం, ఆ సూత్రాలలో ఏవైనా మార్పులు అవసరమైతే సూచించడం, భారత శిక్షాస్మృతిని, భారత నేరశిక్షాస్మృతిని తిరగరాయవలసిన అవసరం ఉన్నదేమో పరిశీలించి సూచనలు చేయడం ఈ కమిటీ పనులు. ఈ కమిటీ అంతిమంగా ఇచ్చిన నివేదికలో ఇప్పటి వరకు దేశంలో న్యాయవ్యవస్థ చాలా మృదువుగా ఉన్నదని, ఇంకా కఠినంగా ఉండాలని తేల్చి చెప్పింది. మొత్తం మీద ప్రాథమిక హక్కులకు, కనీస మానవ హక్కులకు భంగం కలిగే రీతిలో ఆ కమిటీ సిఫారసులు

ఉన్నాయి. మాలిమత్ కమిటీ సూచనలపై దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున విమర్శలు చెలరేగాయి. దానితో ఆ సిఫారసులను బహిరంగంగా చర్చించకుండా, దొడ్డిదారిన చట్ట సవరణల రూపంలో ప్రజాపాలనా విధానాలలోకి తీసుకువచ్చే ప్రయత్నం మొదలైంది.

మాలిమత్ కమిటీ సిఫారసులు వెలువడిన వెంటనే అతి తీవ్రంగా విమర్శించిన వారిలో నేనూ ఉన్నాను. న్యాయశాస్త్ర కోవిదుడు ఉపేంద్ర బక్షీ కూడా అటువంటి విమర్శలే చేశారు. నన్నడిగితే అసలు హిందుత్వ రాజకీయాల ప్రాతిపదికపై పని చేసే అర్హతే లేదు. అటువంటి పార్టీ దేశం మీద చేయతలపెట్టిన ప్రయోగాలలో ఒకటి ఆ మాలిమత్ కమిటీ. ఆ పార్టీ మరిన్ని పార్టీలతో ఒక అతుకుల బొంతను తయారు చేసి అధికారంలోకి వచ్చింది. ఈ మాదిరిగా ప్రభుత్వాధికారానికి రావడానికన్నా ముందు లాల్ కృష్ణ అద్వానీ జరిపిన రథయాత్రలు ఆయనకు ఉప ప్రధాని పదవిని సంపాదించిపెట్టాయి. ఇక వాళ్లు యావత్తు దేశాన్ని హిందుత్వ రాజకీయాలకు ప్రయోగశాలగా మార్చివేయడానికి ప్రయత్నాలు మొదలుపెట్టారు.

అంతకు ముందు నుంచే హిందుత్వ శక్తులన్నీ అయోధ్య మీద కేంద్రీకరించాయి. అక్కడ బాబ్రీ మసీదు ఉండేది. దాని సమీపంలో ఒక రామాలయం ఉండేది. ఈ రామాలయమే హిందుత్వ రాజకీయాలు విస్తరించడానికి బీజంగా పని చేసింది. ఆ విషబీజాలను 1855లో బాబ్రీ మసీదు ప్రాంగణంలో రామ్ చబూత్రా, సీతా రసోయి అనేకట్టడాలను నిర్మించడం ద్వారా విత్తడం జరిగింది. ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామంగా పేరు పొందిన సిపాయిల తిరుగుబాటు తర్వాత సరిగ్గా సంవత్సరానికి ఈ కట్టడాల గురించిన వివాదం మొదలయి 1992 డిసెంబర్ 6 దాకా జరిగింది. ఆ రోజున అక్కడ గుమిగూడిన వేలాది మందిలో కొందరు బాబ్రీ మసీదును కూలగొట్టారు.

హిందుత్వ శక్తులు తీసుకున్న ఈ నిర్ణయానికి సర్వసమ్మతి ఉన్నదని నేననుకోను. దేశంలోని విభిన్న ప్రాంతాల్లో రాముడిని గురించి విభిన్నమైన కథలూ గాథలూ ఉండవచ్చు. కాని చరిత్రలో ఎక్కడా రాముడికి విధ్వంసకుడిగా, దౌర్జన్యపరుడిగా చిత్రణ లేదనుకుంటాను. తెలంగాణలోనయితే భక్తుడు ఇబ్బందుల్లో పడినప్పుడు భక్తుడి అప్పు తీర్చి గట్టెక్కించిన భగవంతుడిగా రాముడిని చూస్తారు. గోల్కొండ నవాబు ఖజానాకు చేరవలసిన ధనాన్ని వాడుకుని భక్తరామదాసు రాముడికి ఆలయం నిర్మించాడు. ప్రభుత్వ నగదు ప్రభుత్వానికి ముట్టచెప్పమని నవాబు రామదాసు మీద ఒత్తిడి తెచ్చాడు. చెరసాలలో బంధించాడు. అప్పుడు రాముడు మారువేషంలో వచ్చి ఆ అప్పు చెల్లించాడేగాని నవాబును మట్టుపెట్టలేదు. మొత్తానికి పురాణ ప్రతీకలను తిరగదోడడం, తప్పుడుగా వ్యాఖ్యానించడం ఇటీవలి హిందుత్వ తీవ్రవాద రాజకీయాలకు బాగా అలవాటయింది. ఆ నేపథ్యంలోనే 1992 డిసెంబరు 6న బాబ్రీ మసీదును నేలమట్టం చేయడం జరిగింది. ఆ ఘటనతో దేశం యావత్తూ దిగ్భ్రాంతికి లోనయింది. దేశంలో అనేకచోట్ల మతఘర్షణలు జరిగాయి.

ఆ ఘటన తర్వాతనే హిందుత్వ శక్తులకు జాతిహననం జరిపే ధైర్యం వచ్చింది.

నిజానికి శ్రీమతి ఇందిరాగాంధీ మరణానంతరం సిక్కుల ఊచకోత జరిగినప్పటి నుంచే ఈ దేశంలో మత మైనారిటీల మీద భయానకమైన దౌర్జన్యాలు, జాతిహననం జరగడం మొదలయింది. అప్పుడే మొదటిసారి దేశంలో చాలా మందికి మత మైనారిటీలంటే ముస్లిములు మాత్రమే కాదని, సిక్కులు కూడా మత మైనారిటీలేనని తెలిసివచ్చింది. ఆ సిక్కుల ఊచకోత, స్త్రీల మీద అత్యాచారాలు, గృహదహనాలు, ఆస్తుల విధ్వంసం జరుగుతుంటే శ్రీమతి ఇందిరాగాంధీ కుమారుడు, ఆమె తర్వాత ప్రధాన మంత్రి అయినవాడు రాజీవ్‌గాంధీ ఎంత బాధ్యతా రహితంగా, ఎంత దుర్మార్గంగా వ్యాఖ్యానించాడో తెలుసునా? "ఒక మహావృక్షం నేలకూలినప్పుడు, ఆ వృక్షం కింది ఉన్న వారు అణగిపోక తప్పదు" అన్నాడాయన. ఆ వ్యాఖ్యానం చాలా మందికి నచ్చినట్టుంది. కాని మరణించినది ఆ వృక్షం నీడను అనుభవించిన వారుకాదు, వాళ్లే ఆ హత్యాకాండను జరిపించారు. అమాయక సిక్కు మత సమూహాన్ని లక్ష్యంగా చేసుకుని ఆ దారుణ మారణకాండ అమలైంది. అటువంటి జనహననంతో సమానమైన మారణకాండలతో వ్యవహరించడమెలాగో మన పరిశోధనా వ్యవస్థలకు, న్యాయ వ్యవస్థలకు తెలియదు. అటువంటి సందర్భాల్లో ఎట్లా ప్రవర్తించాలో మన ప్రభుత్వాలకు తెలియదు.

ఆ తర్వాత ఎనిమిది సంవత్సరాలకు మళ్లీ అటువంటి సందర్భం వచ్చింది. మధ్యయుగాల చారిత్రక చిహ్నామైన బాబ్రీ మసీదును కూలగొట్టడం పట్ల ముస్లిములు తమ అసంతృప్తిని, ఆగ్రహాన్ని ప్రకటించినప్పుడు, శివసేన ముంబయిలో ముస్లిములకు వ్యతిరేకంగా మున్నెన్నడూ కనీవినీ ఎరగని స్థాయిలో హింసాకాండను ప్రయోగించింది. ముస్లిం ప్రజానీకం దశాబ్దాలుగా నివసిస్తున్న నగరంలోనే నిలువనీడలేని కాందిశీకులుగా, శరణార్థులుగా మారిపోవలసి వచ్చింది. ఈ మారణకాండ ఎట్లా జరిగిందో జస్టిస్ శ్రీకృష్ణ కమిషన్ వివరంగా నమోదు చేసింది. సరిగ్గా ఆ దాడులు జరుగుతున్నప్పుడే సంజయ్ దత్‌ను అరెస్టు చేయడం జరిగింది. నిజానికి సంజయ్‌దత్ అరెస్టు అనేది లౌకిక విలువల్లో అచంచల విశ్వాసం ఉన్న సునీల్‌దత్ మీద, అటువంటి వారి మీద చేయదలచిన బెదిరింపులలో భాగమే.

అప్పుడు జరుగుతున్న దాడుల్లో భాగంగా తమ కుటుంబం మీద దాడి జరగవచ్చుననే భయంతో సంజయ్‌దత్ ఆత్మరక్షణకోసం ఒక తుపాకి, అది ఎ కె 47 గాని, మరొకటిగాని, కొనుక్కున్నాడు. అది కేసు అయింది. ముంబయిలో ఈ కేసులను విచారించడానికి ఏర్పాటైన ప్రత్యేక న్యాయస్థానంలో సంజయ్‌దత్‌ను హాజరు పరచిన రోజున నేను అదే భవనంలో ఉన్నాను. ఆ రోజు నేను అక్కడ ఒక శ్రీలంక తమిళుల కేసు వాదిస్తున్నాను. శ్రీలంక తమిళుల మీద తీవ్రవాద కార్యకలాపాల నిరోధక చట్టం కింద ఉండిన ఆ కేసును

న్యాయమూర్తి గయక్వాడ్ దగ్గర వాదిస్తున్నాను. సంజయ్‌దత్ న్యాయస్థానంలో అందరి ఎదుటా బహిరంగం గానే కుప్పకూలి విలపించాడు. ఆ సంఘటన చూసి ఇంటికి వచ్చిన తర్వాత ముంబై మారణకాండ పై సిపిడిఆర్ (కమిటీ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ డెమొక్రటిక్ రైట్స్ - ముంబయిలోని పౌర హక్కుల పరిరక్షణ సంస్థ) నివేదిక ఆధారంగా వాస్తవ సమాచారం పోగుచేసి, పత్రికలలో అచ్చయిన సునీల్ దత్, శత్రుఘ్నసిన్హాల ప్రకటనల ఆధారంగా ఒక డిఫెన్స్ వాదన తయారు చేశాను. ఆ వాదనను ముంబయి నుంచి వెలువడే ది సండే అబ్జర్వర్ పత్రికకు పంపించాను. ఊహించినట్టుగానే ఆ పత్రిక ఆ వ్యాసాన్ని ప్రచురించలేదు. ఒక నెలో రెండు నెలలో వేచి చూసి నేనిక ఆ వ్యాసాన్ని ఢిల్లీ నుంచి వెలువడే, మెయిన్ స్ట్రీమ్ పత్రికకు పంపించాను. "ఇన్ డిఫెన్స్ ఆఫ్ సంజయ్ దత్ -ఎ స్టేట్‌మెంట్ ఇన్ ఫస్ట్ పర్సన్" (సంజయ్‌దత్ సమర్థనలో - ఒక ఉత్తమ పురుష ప్రకటన) అనే పేరుతో ఆ వ్యాసం అచ్చయింది.

ముంబయి మారణకాండకు సంబంధించినంత వరకు శ్రీ కృష్ణ కమిషన్ నివేదిక మినహా మరేమీ జరగలేదు. ఆ మారణకాండలో బాధితులైన వారికి ఎటువంటి ఉపశమనమూ దొరకలేదు. ఒక్క నేరస్తుడికి కూడా శిక్షలు పడలేదు. అసలు విచారణే జరగలేదు. ఒక్క మాటలో చెప్పాలంటే ఆ మారణకాండకు సంబంధించినంత వరకు చట్టబద్ధ పాలన, రాజ్యాంగ అధికరణాలు 14, 21 అన్నీ రద్దయిపోయాయి. ఈ మాదిరిగా చట్టబద్ధపాలన అప్పుడప్పుడు రద్దయిపోవడం అంతిమంగా వ్యక్తిగత స్థాయిలో తమంతట తామే న్యాయం అమలు చేయాలని అనుకోవడానికి దారితీస్తుంది. దాన్నే తీవ్రవాదమనీ, టెర్రరిజమనీ పిలవడం మనకు అలవాటు. అందువల్ల తప్పనిసరిగా గుర్తుంచుకోవలసిన విషయమేమంటే చట్టబద్ధపాలనను ఈ మాదిరిగా పాక్షికంగా ఉపసంహరిస్తూపోతే అప్పుడు చట్టాన్ని అసమానంగా అమలు చేసినట్టే అవుతుంది. దాన్ని ఎప్పటికప్పుడు సరిద్దిదకపోతే అసలుచట్టాన్నే, చట్టబద్ధ సంస్థలనే హాస్యాస్పదం చేసినట్టవుతుంది.

డిసెంబర్ 6, 1992 తర్వాత నుంచీ, మసీదు విధ్వంసం వల్ల అయోధ్యకు ప్రాముఖ్యత చాలా పెరిగిపోయింది. బాబ్రీ మసీదు విధ్వంసాన్ని ఏదో తేలికపాటి వ్యవహారంగా చూపడానికి అది ఒక శిథిలభవనం పడగొట్టడం లాంటిదని అద్వానీ వ్యాఖ్యానించాడు. కాని అది ఒక శిథిల భవనం మీద దాడి మాత్రమే కాదు. అది ఈ దేశపు రాజ్యాంగం మీద, చట్టాల మీద, చట్టబద్ధ సంస్థల మీద ఒక అసాధారణమైన, అంతకు ముందెప్పుడూ జరగనటువంటి దాడి. జలియన్‌వాలాబాగ్ దురంతం లాగా ఇది కూడా ఒక సాంస్కృతిక జన హననానికి, జాతి హత్యాకాండకు ఒక చిహ్నం. నిజానికి అది అప్పటి వరకూ ఆ నిర్మాణం అనుభవిస్తుండిన చారిత్రక ప్రాధాన్యతకు ఎన్నో రెట్ల పెద్ద దాడి.

ఆ దాడిపట్ల దేశంలో చాలా మంది ప్రముఖులు తమ తీవ్రమైన ఆందోళన వ్యక్తం చేశారు. చాలా సంస్థలు ఆ ఆందోళనలో భాగం పంచుకున్నాయి. ఆ సంస్థలు, వ్యక్తులు

అందరూ కలిసి అయోధ్యపై ఒక పౌర ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని ఆలోచించారు. ఆ ట్రిబ్యునల్‌లో ఉండడానికి సుప్రసిద్ధ న్యాయమూర్తులు జస్టిస్ డి ఎ దేశాయ్, జస్టిస్ ఒ చిన్నపరెడ్డి, జస్టిస్‌డి ఎస్ తెవాటియా ఒప్పుకున్నారు. వారు చేసిన చర్చల ఫలితంగా ఒక అనధికార విచారణ సంఘాన్ని నియమించడం ఉచితమని నిర్ధారణకు వచ్చారు. ఆ విచారణ సంఘం పోగు చేసిన సమాచారాన్ని ఈ ట్రిబ్యునల్ ముందు ఉంచాలని నిర్ణయించారు. ఆ ట్రిబ్యునల్ ఆ సాక్ష్యాధారాలను పరిశీలించి, తన తుది నివేదిక సమర్పించాలని నిర్ణయించారు.

అలా ఏర్పడిన విచారణ కమిషన్‌లో కమలాప్రసాద్ అధ్యక్షులుగా వ్యవహరించగా, డా కమలా మిత్ర షెనాయ్, కీర్తి సింగ్, ప్రొ. దినేష్ మోహన్, సాగరి చాబ్రా, ప్రొ. ఎస్ సి శుక్లా సభ్యులుగా ఉన్నారు. ఈ సంఘం 1993 ఫిబ్రవరిలో బాబ్రీ మసీదు విధ్వంసానికి సంబంధించిన సమాచారాన్ని సేకరించింది. వాంగ్మూలాల్ని నమోదు చేసింది. ఆ తర్వాత ట్రిబ్యునల్ విచారణలు ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషనల్ క్లబ్‌లో జరిగాయి. ఆ విచారణల్లో నేను రెండు రోజులు పాల్గొన్నాను. ట్రిబ్యునల్ పనిలో సహాయం చేసేందుకు సుప్రసిద్ధ న్యాయవాది ఎ జి నూరాని ముంబయి నుంచి వచ్చారు. చివరికి ఆ ట్రిబ్యునల్ నివేదిక 1993 జూలైలో వెలువడింది.

బాబ్రీ మసీదు విధ్వంసంపై ఏర్పడిన అనధికార ప్రజా ట్రిబ్యునల్ తన నివేదికలో ప్రకటించిన విషయాలు. ఆ విధ్వంస సమయంలో ప్రభుత్వం ఏమి చేసి ఉండవలసిందో మనకు తెలియజెపుతాయి.

పార్లమెంటులో అత్యధిక స్థానాలు కలిగిన రాజకీయ పక్షం ఏర్పరచిన ప్రభుత్వం తన రాజ్యాంగ బద్ధమైన బాధ్యతలు నిర్వర్తించేందుకు ఏమి చేయవలసి ఉండింది? తప్పు చేసిన పార్లమెంటు సభ్యుల మీద ఏ చర్యలు తీసుకోవడం సముచితంగా ఉంటుంది? ఈ ప్రశ్నలు చాలా సున్నితమైనవి. ఈ దేశంలో రాజ్యాంగ బద్ధమైన పరిపాలనకూ ప్రజాస్వామ్యానికీ సంబంధించినంత వరకు అవి చాలా లోతైన ప్రభావాన్ని కలగజేసే ప్రశ్నలు. కాని మనం ప్రస్తుతం పరిశీలిస్తున్న సంఘటనలు భవిష్యత్తుకు సూచికలు అనుకుంటే ఈ కీలక ప్రశ్నలకు ఇంక ఎంత మాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే జవాబు చెప్పుకోవలసి ఉంటుంది. డిసెంబర్ 6, 1992న, ఆ తర్వాత జరిగిన విషాదకర ఘటనలకు రూపకల్పన చేసిన, ఏర్పాట్లు చేసిన, సాధికారికం చేసిన వరిష్ఠ నాయకులపట్ల ప్రభుత్వం ఔదార్యం చూపింది. అందువల్ల అంతిమంగా ఆ నాయకులు ఎంతో కాలంగా చేస్తున్న జాతి వ్యతిరేక, చట్టవ్యతిరేక చర్యలకు వాళ్లు కోరుతున్న సాధికారత దొరికినట్టయింది. దానితో ఇతరులకు కూడా ఆ పనులే చేయడానికి ధైర్యం వచ్చింది. అటువంటి పరిస్థితి ఏ విధ్వంసకర, ప్రమాదకర ఫలితాలకు దారితీస్తుందో అందరికీ స్పష్టమే. దాని మీద మరొక వ్యాఖ్య అవసరంలేదు.

డిసెంబర్ 6కు ముందు, ఆ రోజున, ఆ తర్వాత జరిగిన సంఘటనలు చరిత్రలో ఒక కొత్త, అత్యంత ప్రమాదకరమైన దశను సూచిస్తున్నాయి అని ఆ నివేదిక ముగింపులో చెప్పారు. ఆ నూతన చారిత్రక దశ పరిణామాలు మన సామాజిక ఐక్యతను, సమగ్రతను, రాజకీయ సుస్థిరతను తీవ్రంగా దెబ్బతీస్తాయని చెప్పారు. మన లౌకిక సంప్రదాయానికి, ప్రజాస్వామ్యానికి వస్తున్న ఈ కొత్త సవాళ్లకు, లేదా మళ్లీ తలెత్తుతున్న సవాళ్లకు వెంటనే జవాబు చెప్పకపోతే అవి మనందరినీ ముంచెత్తుతాయని ఆ నివేదిక హెచ్చరించింది. అందువల్ల ఆ సవాళ్లను ఎదుర్కోవడం మన పౌరులందరి బాధ్యత అని ఆ నివేదిక రాసింది.

ప్రజల్లో చైతన్యాన్ని, అవగాహనను పెంచడానికి, తద్వారా వారు సంఘటితమైన మానవీయ, ప్రజాస్వామిక విలువల పతనాన్ని అరికట్టే చర్యలకు పూనుకోవడానికి ప్రపంచంలో మరెక్కడైనా, మరేమానవ హక్కుల ఉద్యమమైనా ఇంతకన్నా ఎక్కువ పనిచేసిందనుకోను.

ఆ నివేదిక వెలువడి ఒక దశాబ్దం కూడా గడవక మునుపే ఆ నివేదిక హెచ్చరించిన మతఛాందసవాద, రాజ్యాంగ వ్యతిరేక, అప్రజాస్వామిక శక్తులు దేశంలో పెచ్చరిల్లి పోయాయి. అటువంటి పరిస్థితి వస్తుందని మానవ హక్కుల ఉద్యమం నియమించిన అయోధ్య ప్రజా ట్రిబ్యునల్ మనను హెచ్చరించింది. కాని ఆ పాఠాలను మనం నేర్చుకోకుండా ఉండి పోయాం. ఈసారి ఆ దుర్మార్గానికి గుజరాత్ వేదిక అయింది.

* * *

# గుజరాత్ హననకాండ

గుజరాత్ దారుణమారణకాండకు బీజం గోద్రా రైల్వేస్టేషన్‌లో పడింది. అహ్మదాబాద్ వెళ్లేదారిలో ఒక స్టేషన్ గోద్రా. 2002 ఫిబ్రవరి 27న ఆ స్టేషన్‌లో ఒక సంఘటన జరిగింది. అయోధ్య నుంచి వస్తున్న కరసేవకులు అహ్మదాబాద్‌కు తిరిగి వెళ్తున్నప్పుడు వారు ప్రయాణిస్తున్న సాబర్మతి ఎక్స్‌ప్రెస్ గోద్రా రైల్వేస్టేషన్‌లో ఆగింది. అక్కడ ఘర్షణ ప్రారంభమయింది. అన్ని సందర్భాలలో లాగానే ఆ ఘర్షణ ఎట్లాప్రారంభమయిందనే విషయంలో రెండు కథనాలున్నాయి. అది ఎట్లా ప్రారంభమయినప్పటికీ, వాస్తవమేమంటే ఆ రైల్లో ఒక బోగీలో మంట అంటుకుంది. ఆ బోగీ కిటికీలు, తలుపులు మూసేసి ఉండడంతో అందులో యాభై ఎనిమిది మంది ప్రయాణికులు చనిపోయారు. ఆ ప్రయాణికుల మృతదేహాలు మాడి మసిఅయిపోయి గుర్తుపట్టడానికి వీల్లేని స్థితిలో

దొరికాయి. విచిత్రంగా ఆ మంట అటుపక్క గాని ఇటు పక్కగాని బోగీలకు అంటుకోలేదు.

ఆ ఘనటకు సంబంధించి వాస్తవాలను పరిశోధించడానికి ఎటువంటి ప్రయత్నమూ జరపకపోగా, ఆ ఘనటకు నిరసనగా నరేంద్ర మోడి ప్రభుత్వం అధికారిక బంద్ ప్రకటించింది. రాజ్యాంగాన్ని అమలులో పెడతానని ప్రమాణం చేసిన ప్రభుత్వం ఈ మాదిరిగా బంద్ పిలుపు ఇవ్వడం ఏమిటని మానవ హక్కుల ఉద్యమం నియమించిన ప్రజా ట్రిబ్యునల్ ప్రశ్నించింది. ఆ బంద్‌ను ఆసరాగా తీసుకుని రాష్ట్ర వ్యాప్తంగా లూటీలు, దాడులు, గృహదహనాలు, స్త్రీలపై అత్యాచారాలు, హత్యలు హత్యా ప్రయత్నాలు ఒక్క మాటలో చెప్పాలంటే దారుణ మారణకాండ సంభవించింది. ఈ హత్యాకాండ, బీభత్సం అంతా స్పష్టంగా ముస్లింలకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడింది.

ఆ దారుణమారణకాండ ఎంత పెద్ద ఎత్తున సంభవించిందంటే కొన్ని వేల మంది హత్యకు గురయ్యారు. సజీవంగా దహనమయ్యారు. కొన్ని వందల మంది గుజరాత్ నుంచి పారిపోయి దేశాలు పట్టుకుని తిరుగుతున్నారు. ఆ దుర్మార్గం చూసి దేశంలో అనేక మంది దిగ్భ్రాంతికి లోనయ్యారు. అటువంటి ఆలోచనాపరులు కొందరు కలిసి ఈ మారణకాండ పైన పౌరులే రూపొందించిన ప్రజా ట్రిబ్యునల్ ఒకటి విచారణ జరిపితే బాగుంటుందని ఆలోచించారు. తత్ఫలితంగా సిటిజెన్స్ ఫర్ జస్టిస్ అండ్ పీస్ (న్యాయం కొరకూ, శాంతికొరకు పౌరుల బృందం) అనే సంస్థ ఏర్పడింది. ఆ సంస్థ ఒక ట్రిబ్యునల్‌ను నియమించి, గోద్రా ఘటననూ, తదనంతర పరిణామాలనూ విచారించమని కోరింది.

సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వి ఆర్ కృష్ణయ్యర్, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పి.బి. సావంత్, ముంబై హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ హోస్బెట్ సురేష్, మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ నాయకురాలు అరుణారాయ్, మాజీ డైరెక్టరన్ జనరల్ ఆఫ్ పోలీసు డా. కె. ఎస్. సుబ్రమణి ఎన్, జవహర్లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు ఘనశ్యామ్ షా, తనీకా సర్కార్‌లతో (పియుసిఎల్) జాతీయ అధ్యక్షుడిగా నేను ఆ ట్రిబ్యునల్‌లో ఉన్నాం.

ఆ విచారణలో భాగంగా నేను ఇరవై రెండు, ఇరవై మూడు రోజులపాటు గుజరాత్‌లో ఉండవలసి వచ్చింది. మా ట్రిబ్యునల్ మొత్తం 2,400 మంది సాక్షులను విచారించింది. వారి వాంగ్మూలాలను నమోదు చేసింది. ఆ వాంగ్మూలాలను బట్టి చూస్తే ఆ రాష్ట్రంలో ఆ సమయంలో రాజ్యాంగ యంత్రాంగం కుప్పకూలిపోయిందనీ, ఏమీ పని చేయలేదనీ నిర్ధారణకు రావలసి వస్తుంది. దాన్ని మరోమాటలో చెప్పాలంటే గుజరాత్ భారత రాజ్యాంగాన్నీ, ప్రజాస్వామిక పాలననూ రద్దు చేసి హిందుత్వ ప్రయోగశాలగా మారి పోయింది. గుజరాత్‌లో ఈ ప్రయోగాలను మొదట అద్వానీ జరిపాడు, ఆ తర్వాత నరేంద్రమోడీ కొనసాగించాడు.

ఇది చెప్పేటప్పుడు నాకు రెండో ప్రపంచ యుద్ధం నాటి సంగతి ఒకటి గుర్తుకొస్తున్నది. అది 1944 శిశిర రుతువు. ఇక యుద్ధం ముగిసిపోతున్నదని అందరికీ తెలిసిపోయింది. ఆష్విజ్‌లో అప్పటిదాకా నాజీలు నడుపుతుండిన భయంకర చిత్రహింసల కేంద్రాన్ని మూసివేయవలసిన పరిస్థితి వచ్చింది. అప్పుడు చిత్రహింసల శిబిరాలు నడుపుతుండిన అడాల్ఫ్ ఐష్మన్‌తో నాజీల సైనిక బలగాల అధిపతి హెన్రిక్ హిమ్లర్ "ఇప్పటి దాకా యూదులను చంపిపారేయడంలో నువ్వు తలమునకలుగా ఉన్నావు. ఇక నుంచి నువ్వు యూదులను చాలా జాగ్రత్తగా చూసుకోవాలి. వారి బాగోగులు చూడాలి. ఇది నా ఆదేశం" అన్నాడట.

సరిగ్గా గుజరాత్‌లో ఇప్పుడు జరుగుతున్నదిదే. సరిగ్గా అప్పుడు హిమ్లర్ ఐష్మన్‌కు చెప్పిన మాటనే ఇప్పుడు వాజ్‌పేయి మోడీకి చెప్పినట్టున్నాడు.

ఒక రాష్ట్రాన్ని ఆ రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా నడపలేకపోయినప్పుడు, అంతర్గత కల్లోలాలు పెరిగిపోయినప్పుడు కేంద్ర ప్రభుత్వం ప్రయోగించవలసిన రాజ్యాంగ అధికరణం 355ను అమలు చేయడానికి బదులు ఆ రాష్ట్రానికి మాజీ పోలీసు అధికారి కెపిఎస్ గిల్‌ను పంపించారు. అక్కడ ప్రస్తుతం ఒక శాంతి ప్రయత్నం పెద్ద ఎత్తున జరుగుతున్నది. అన్ని శాంతి ప్రయత్నాలలాగనే ఈ ప్రయత్నం కూడా చాలా అస్పష్టంగా తయారయింది. ఈ శాంతి ప్రక్రియలో గతంలో ప్రజలు అనుభవించిన కష్టాలకు పరిహారమేదీ ఉండదు. న్యాయం జరగదు. లెక్కలేనంత దయ కురిపించబడుతుంది. ఆ మహా ప్రయోగంలో బాధితులైనవాళ్లపట్ల, బలి అయిపోయిన వాళ్లపట్ల జాలి మాత్రం చూపించబడుతుంది.

ఆ నాలుగు నెలలు - 2002 ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే - జరిగిన ఘటనలను హిందుత్వ ప్రయోగంగా అభివర్ణించడం నా వ్యాఖ్యానం కాదు. గుజరాత్ అనేది హిందూ రాష్ట్రపు ప్రయోగశాల అని స్వయంగా రాష్ట్రీయ స్వయం సేవక్‌సంఘ్ ప్రకటించింది. గుజరాత్‌లో ఎన్నికలలో అధికారం సంపాదించిన నాటి నుంచీ వాళ్లు ఈ ప్రకటనకు సంపూర్ణంగా కట్టుబడి ఉన్నారు. ప్రభుత్వోద్యోగులు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లో సభ్యులుగా ఉండకూడదని అంత వరకూ ఉన్న నిషేధాజ్ఞలను రద్దు చేయడం ద్వారా గుజరాత్ ప్రభుత్వం వివాదాస్పదమైంది. ఆ నిషేధాన్ని ఎత్తివేయడానికి, వేర్వేరు స్థాయిలలో ఉన్న ప్రభుత్వ సిబ్బంది హిందుత్వ సైనికులుగా పని చేయడానికి ఉన్న సంబంధాన్ని అర్థం చేసుకుంటే గుజరాత్ హింసాకాండ అసలు స్వరూపం అర్థమవుతుంది. అంటే అక్కడ రాష్ట్రప్రభుత్వం స్వయంగా, అధికారికంగా హిందుత్వ ప్రయోగం కోసం మనుషులను సిద్ధం చేయడం ప్రారంభించిందన్నమాట.

అయితే ఈ దుశ్చర్యలు సాధ్యం కావడానికి కారణం శ్రీమతి ఇందిరాగాంధీ అమలు చేసిన విధానలే. ఆమె రాజ్యాంగ బద్ధమైన సంస్థలను ఒక్కొక్కదాన్నీ విచ్ఛిన్నం చేసి,

శిథిలంచేసి, దిగజార్చిన నేపథ్యంలోనే ఈ పనులు జరిగాయి. ఆమె రాజ్యాంగ యంత్రాన్ని నిరంకుశం చేసిన క్రమంలోనే ఆమె తర్వాత నాయకులందరూ ఒకే ఒక్క ఆకాంక్షతో పని చేయడం మొదలు పెట్టారు. ఆ ఆకాంక్ష ఏమంటే ఈ దేశానికి ప్రధాన మంత్రి కావాలనేది. ఆ ప్రధాన మంత్రి గద్దె మీద కూచోవడం కొద్ది రోజుల కొరకైనా కావచ్చు, అయినా సరే, ఆ నిరంకుశాధికారాన్ని అనుభవించడానికి ఆ గద్దె ఎక్కాలి. మన రాజకీయ నాయకుల కార్యక్రమం ఇంత సంకుచిత కోరికగా మారిపోయింది. అందువల్లనే ఎవరికీ ఆధిక్యతలేని పార్లమెంటులు అనేకం ఒక దాని తర్వాత ఒకటిగా ఏర్పడ్డాయి. భారతీయ జనతాపార్టీ దాని పాత అవతారమైన జనసంఘ్‌గా ఉండిన రోజుల్లో దానికి పార్లమెంటరీ రాజకీయ క్రమంలో అసలు ఉనికే ఉండేది కాదు. దేశంలో ఎమర్జెన్సీ విధించిన తర్వాత, 1975 తర్వాత మాత్రమే, వారు జయప్రకాశ్ నారాయణ్ ఉద్యమంలో చేరి పార్లమెంటరీ రాజకీయాల మార్గం పట్టారు. ఎమర్జెన్సీలో కాంగ్రెస్ చిత్తుగా ఓడిపోయి, మొరార్జీ దేశాయి నాయకత్వాన ఏర్పడిన జనతాపార్టీలో భాగంగా వారు కొన్ని స్థానాలు గెలుచుకోగలిగారు. మొరార్జీ నాయకత్వంలోని ఆ అతుకులబొంత ప్రభుత్వం భారతీయ జనతాపార్టీ నాయకులకు అధికార పీఠాలు అధిరోహించే అవకాశాన్నిచ్చింది. ఇక అప్పటి నుంచి రాజ్యాంగ చట్రంలోపల తన కుతంత్రాలు సాగించడానికి ఫాసిజానికి అవకాశం దొరికింది. రాజ్యాంగాన్ని ఎత్తిపడుతున్నాననే ముసుగుకింద తన దుశ్చర్యలు సాగించడానికి అవకాశం దొరికింది. ఆ తర్వాత రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలోనూ, అయోధ్య రథయాత్రలోనూ రాజ్యాంగం మీద, ప్రజాస్వామిక విలువల మీద దాడి చేయడానికి భారతీయ జనతాపార్టీ పెద్దఎత్తున ప్రయత్నం చేసింది.

అసలు అద్వానీ నడిపిన అయోధ్య రథ యాత్ర కూడా నరేంద్రమోడీ బుర్రలో పుట్టిన ఆలోచనేనని నాకు గుజరాత్‌లో ఉన్న రోజుల్లో అర్థమైంది. గుజరాత్‌లో నెలకొని ఉన్న రాజకీయ స్థితిలో, కనీస ప్రజాస్వామిక, సంక్షేమ చర్యలలో ప్రభుత్వం విఫలమయినప్పుడు వామపక్షాల నుంచి ఏ ప్రమాదమూ లేనప్పుడు, అత్యధిక సంఖ్యాకులలో ఉన్న మత విశ్వాసాలను రెచ్చగొట్టడం ద్వారా, వారిని తమ వెంట గుడ్డిగా నడిచే అనుచరులుగా చేయడం ద్వారా అధికారపీఠాల హామీ దొరుకుతుందని మోడీ సిద్ధాంతం.

దేశ ప్రధాన మంత్రి వి పి సింగ్ దిగిపోయిన తర్వాత వచ్చిన ప్రధాన మంత్రులందరూ వరుసగా భారతీయ జనతాపార్టీ నాయకత్వంలోని మతవాదశక్తులు కేంద్ర ప్రభుత్వ అధికారం చేపట్టడానికి అనువైన పరిస్థితులను కల్పించారు. నిజానికి స్వతంత్ర భారతంలో తొలి పది సంవత్సరాలు మినహాయిస్తే మనం ఇవాళ చూస్తున్నంత విచ్చలవిడిగా పౌర అధికారుల, ప్రజాప్రతినిధుల మతాచారాల ప్రదర్శన పెరిగిపోయింది. ఆ ప్రదర్శన పెరిగిపోయేకొద్దీ లౌకిక విలువలకు కాలం చెల్లిపోయింది. ప్రతికూల విభజన, మత విభజన ఎన్నికల రాజకీయాలకు చమురుగా మారిపోయాయి. రాజకీయ నాయకులలో,

అధికారవర్గంలో సామాజిక పరివర్తన పట్ల నిబద్ధత దిగజారుతూపోయింది. ఎన్నికల క్రమానికీ ప్రజలకూ అసలు సంబంధం లేకుండాపోయింది. ఇక ఎన్నికల ప్రచారంలో సరుకుగా మిగిలినవి ప్రత్యర్థి రాజకీయాల కొరకు అవసరమైన కుల, మత అంశాలు మాత్రమే. మొత్తం సమాజంలోనే దిగజారుడు ప్రారంభమయింది. దిక్కులు పిక్కటిల్లేలా దళిత ఉద్యమం విజయం సాధించినప్పటికీ రాజకీయాలలో ప్రజాస్వామిక, లౌకిక భావనలు మాత్రం బలోపేతం కాలేదు.

గతంలో, పందొమ్మిదో శతాబ్దంలో హిందువుల మధ్య ఐక్యతను సాధించడానికి సాంఘిక సంస్కరణలను ఒక సాధనంగా వాడే ప్రయత్నం జరిగింది. కులవిభజనలను రద్దు చేయడం ద్వారా ఆ ఐక్యతను సాధించడానికి సంస్కర్తలు ప్రయత్నించారు. హిందూ సమాజంలో వందల సంవత్సరాలుగా పెరుగుతూ వచ్చిన అవలక్షణాలను, తప్పుడు ధోరణులను, అనాచారాలను సవరించడానికి జరగిన మహా ప్రయత్నమిది. హిందూ సమాజంలోని ఆ అవలక్షణాలు గణనీయమైన జనాభాను తనలో భాగంగా కాకుండా, అసలు మనుషులుగానే చూడకుండా చేశాయి. కానీ ఇవాళ్టి రాజకీయాలలో అటువంటి ఆదర్శవాద సంఘ సంస్కరణ భావాలను కూడా చోటు లేకుండా పోయింది.

అయితే ఇవాళ్టి మతతత్వ రాజకీయాలు ఎక్కడో ఆకాశం నుంచి హఠాత్తుగా ఊడిపడలేదు. అవి మనతో చాలాకాలంగా ఉంటూ వచ్చాయి. రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్ స్థాపన తర్వాత ఆ రాజకీయాలకు ఒక భావజాల భూమిక సమకూరింది. నిజానికి ఈ మతతత్వ రాజకీయాల పరిధులు చాలా స్పష్టంగానే రూపొందాయి. దేశ విభజన తర్వాత ఈ మతతత్వ రాజకీయాలు బాగా బలం పుంజుకున్నాయి.

మా విచారణలో భాగంగా అహ్మదాబాద్‌లో కర్ణావతి క్లబ్‌లో మమ్మల్ని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌కు చెందిన ప్రచార విభాగం విశ్వసంవాద్ కేంద్ర నుంచి ఇద్దరు ప్రతినిధులు వచ్చి కలిశారు. అహ్మదాబాద్ ఘర్షణల గురించి ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చిన కథనాలదే అసలు తప్పంతా అని వారు అన్నారు. ఎలక్ట్రానిక్ మీడియాలో ఎక్కడో ఒక జిల్లాలో ఎవరో ఒకరిని ఇంటర్వ్యూ చేసి ఆయన చెప్పిన ప్రకారమే రాష్ట్రమంతటా పరిస్థితి ఉన్నదని చూపుతారని వారన్నారు. వారు తాము నడిపే పత్రిక ప్రతి ఒకటి మాకు ఇచ్చారు. దానిలో గోద్రా సంఘటన గురించి చాలా వివరంగా రాశారు. కాని ఆ గోద్రా ఘటన అంతరం జరిగిన కల్లోలం గురించి ఒక్కముక్క కూడా రాయలేదు. ఆ పత్రిక ఆ కల్లోలం అయిపోయాక చాలా రోజుల తర్వాతనే వెలువడింది.

గుజరాత్‌లో హింసకు మూలాలు 1947 నుంచీ, అంటే దేశ విభజన నుంచి ఉన్నాయని వారు అన్నారు. అంటే ఇక ఆ హింసాకాండ మీద చర్చించవలసినదేమీ లేదని అర్థం. వారు మమ్మల్ని నాథూరాం గాడ్సే కాలానికీ, అతను గాంధీజీని కాల్చి చంపడానికి దారి తీసిన కారణాల దగ్గరికీ తీసుకుపోయారు. నిజానికి న్యాయస్థానం

ముందర ఇచ్చిన వాంగ్మూలంలో నాథూరాం గాడ్సే ఎటువంటి పశ్చాత్తాపం లేకుండా గాంధీజీని చంపడానికి తనకు ఉండిన కారణాలను వివరించాడు. ఆ కారణాలలో ఆదర్శవంతమైనవీ లోతయినవీ ఏవీ లేవు. గాడ్సే చెప్పిన కారణాల తర్కం అంతా అతను నమ్ముకున్న మతోన్మాద భావజాలానికి సంబంధించినదే. అసలు మతోన్మాద రాజకీయాలను భావజాలం స్థాయికి ఎత్తి మాట్లాడవచ్చునా అని నా అనుమానం.

అటువంటి సంకుచితమైన ఆలోచనా చట్రం నుంచి గాంధీజీని, సమాజంపట్ల ఆయనకు ఉన్న దృక్పథాన్ని అర్థం చేసుకోవడమే సాధ్యంకాదు. కల్లోలాలు, హింస నిండిన నౌఖాలీ ప్రాంతం నుండి ఆయన సాగించిన చరిత్రాత్మక యాత్ర సందర్భంగా గాంధీజీకి బీహార్‌లో జరుగుతున్న ప్రతీకార దాడుల గురించి సమాచారం అందింది.

"తమ మధ్యనే నివసిస్తున్న ఒక పిడికెడు మంది ముస్లిం స్త్రీలపై, పురుషులపై, పిల్లలపై వెయ్యిమంది హిందువులు విరుచుకుపడడం ప్రతీకారదాడి కాజాలదు. అది కేవలం పాశవికత్వం అవుతుంది. ఎప్పుడయినా బలహీనులను, అసహాయులను పరిరక్షించడమే ఆయుధాల కర్తవ్యం. తమ మధ్య జీవిస్తున్న ముస్లిం ప్రజానీకానికి తమ ప్రాణాలు అడ్డుపెట్టి అయినా సరే సంపూర్ణ రక్షణ కల్పించడమే తూర్పు బెంగాల్‌లో బాధితులయిన హిందువులకు బీహార్ అందించగలిగిన ఉత్తమ ఉపశమనం. అటువంటి ఉదాహరణే చెప్పుకోదగినదిగా ఉండేది" అన్నారు గాంధీజీ.

కాని స్వాతంత్ర్యానంతర భారతదేశంలో అటువంటి తీవ్రమైన రాజకీయ హింస పెచ్చరిల్లిన సమయాలలో గాంధీజీలాగ సమర్థవంతంగా జోక్యం చేసుకోగలిగిన నైతిక స్థాయి ఉన్న రాజకీయ నాయకులు ఒక్కరు కూడా లేకుండాపోయారు. 1984లో వీధుల్లో, రహదార్ల మీద, సందుగొందుల్లో ఎక్కడబడితే అక్కడ జరిగిన సిక్కుల మారణకాండ ఇప్పటికీ పరిహారాన్ని, న్యాయాన్ని కోరుతూనే ఉంది. అటువంటి హింసాకాండ జరిగినప్పుడు తక్షణమే. న్యాయబద్ధంగా ప్రతిస్పందించగలిగేలా మనం మన రాజ్యాంగ సంస్థలను కూడా పదును పెట్టుకోలేకపోయాం. ఆ మాదిరిగా సంస్థలను బలోపేతం చేసుకోగలిగి ఉంటే ప్రజలు చట్టాన్ని, చట్టబద్ధ అధికారాన్ని గౌరవించేలా క్రమశిక్షణ నేర్పగలిగి ఉండేవాళ్లం. న్యాయమూర్తులు, అధికార యంత్రాంగం, న్యాయవాదులు, చదువుకున్న పెద్దమనుషులు, వైద్యులు, రాజ్యాంగ యంత్రాన్ని, పౌర సమాజాన్ని నడిపే పెద్దలందరూ - అందరికీ వారి వారి వ్యక్తిగత కార్యక్రమాలున్నాయి. వారి ప్రత్యేక తత్వశాస్త్రాలున్నాయి. ఆ కార్యక్రమాల ప్రకారం, ఆ తాత్విక దృక్పథాల ప్రకారం వారి నిర్ణయాలు, వైఖరులు సాగుతుంటాయి. మామూలు సమయాలలోనైనా, సంక్షోభ సమయాలలోనైనా వారి వైఖరి అదే మాదిరిగా ఉంటుంది.

ఎమర్జెన్సీలో వ్యక్తిగత స్వేచ్ఛను కాపాడడానికి అణుమాత్రం కూడా ప్రయత్నించని న్యాయస్థానాలు ఆ నిర్బంధ కాలమంతా అయిపోయిన తర్వాత మాత్రం మన స్వేచ్ఛా

స్వాతంత్ర్యాల గురించి విపరీతంగా ప్రశంసించాయి.

మతకల్లోలాలు ఎందుకు పదేపదే పునరావృతమవుతున్నాయో వివరించే అద్భుతమైన విశ్లేషణలెన్నో ఉన్నాయి. అవన్నీ కూడా సంఘటనలు జరిగిపోయాక వాటిని సరిగా అర్థం చేసుకోవడంలో చాలా ఉపయోగపడ్డాయి. కాని అసలు విషయమేమంటే ఒక స్థితిని వ్యాఖ్యానించడం కాదు, ఆ స్థితిని మార్చడం ఎట్లా అన్నదే లౌకికవాద రాజకీయాలలో లోపించినదే అది.

వి పి సింగ్ ప్రభుత్వం కూలిపోయిన తర్వాత రాజ్యాంగాన్ని క్రియాశీలంగా, నిబద్ధంగా పరిరక్షించే నాయకులే లేకుండా పోయారు. రాజ్యాంగ విలువలకు కట్టుబడిన సంస్థ ఏదీలేకుండా పోయింది. రాజ్యాంగంతో ఎటువంటి సంబంధమూలేని భారతీయ జనతాపార్టీ, నిజం చెప్పాలంటే హిట్లర్ తరహా రాజకీయాలలో విశ్వాసం ఉన్న పార్టీ అధికారానికి వచ్చి రాజ్యాంగాన్ని లోలోపలి నుంచే తొలిచివేయడం మొదలుపెట్టింది.

వాళ్లు రాజ్యాంగం అసమగ్రంగా ఉన్నదని ప్రకటించి దాన్ని సమీక్షించడానికి పూనుకున్నారు. మనం అంతకాలంగా చూస్తూ వస్తున్న మతకల్లోలాలకన్న గుణాత్మకంగా విభిన్నమైన కల్లోలాలను చూడడానికి దేశం సిద్ధపడవలసి వచ్చింది. ఈ ధోరణికి కొట్టవచ్చినట్టు కనబడే ఉదాహరణ అయోధ్య రథయాత్ర. అది సోమనాథ్ నుంచి ప్రారంభమైందనేది గుర్తించవలసిన విషయం. అప్పటి నుంచీ హిందుత్వను ఒక రాజకీయ భావజాలంగా దేశం ముందుకు తీసుకురావడం జరిగింది. రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళన, అంబేద్కర్ మీద విషప్రచారం దానికి రంగం సిద్ధం చేశాయి. బాబ్రీ మసీదు విధ్వంసం లౌకిక విలువల మీద ఒకబహిరంగ దాడి. హిందూమతం ఇతర మతాలకన్నా ఎక్కువ సమానమైనదని రాష్ట్రీయ స్వయంసేవక్‌సంఘ్, దాని రాజకీయ సంస్థ అయిన భారతీయ జనతాపార్టీ ప్రకటించాయి.

అవిధంగా హిందుత్వ చేసిన మొదటి ప్రయోగం విజయవంతమైంది. తమ రాజకీయ కార్యక్రమాన్ని నిర్ధారించడంలో తమ ఎన్నికల బలం ఎంత ఉందని వాళ్లు ఎప్పుడూ ఆలోచించలేదు. రామాలయం సమస్యను సజీవంగా ఉంచడం ద్వారా తమ రాజకీయ కార్యక్రమం సజీవంగా ఉంటుందని వాళ్లు భావించారు. న్యూయార్క్‌లో ప్రపంచ వాణిజ్య సంస్థ మీద జరిగిన దాడి కూడా కొంత వరకు వారి రాజకీయాలకు బలం ఇచ్చింది. తీవ్రవాదానికి వ్యతిరేకంగా యుద్ధం అనే పనికిమాలిన ప్రేలాపనలకు భారతీయ జనతాపార్టీ నుంచి మద్దతు దొరికింది. దేశంలోపలి ఇస్లామిక్ తీవ్రవాదాన్నీ, లౌకిక, ప్రజాస్వామిక అసమ్మతినీ తొక్కిపెట్టడానికి తీవ్రవాద నిరోధక చట్టం (పోటా) వంటివి ప్రవేశపెడుతూ వాళ్లు తమ హిందుత్వ ఎజెండాను ముందుకు తోశారు. వారి పాలనకు అలిఖిత పునాదిగా హిందూమత రాజ్యభావన నిలిచింది.

ఒక వైపు న్యాయస్థానంలో శిలాన్యాస్ ఉచితానుచితాల మీద చర్చ జరుగుతుండగానే

బైట తమ బలప్రదర్శన కొరకు వారు అన్ని ఏర్పాట్లూ చేసుకున్నారనడానికి గుజరాత్ హింసాకాండే నిదర్శనం. నిజానికి అప్పటికి వారికి ఎన్నికల రాజకీయాలలో గణనీయమైన బలం లేదు. అంటే గుజరాత్‌లో మైనారిటీలను నిర్దాక్షిణ్యంగా ఊచకోతకోస్తున్నప్పుడు వారు నిజానికి చేస్తున్నది దేశవ్యాప్తంగా ఉన్న హిందూ ఉదారవాద, లౌకిక సమాజపు పీక పిసకడమే.

గాంధీజీ గుజరాత్‌లోనే జన్మించారు. గుజరాత్‌లోనే తనాదర్శాల మీద పోరాటం ప్రారంభించారు. కాని ఆయన తన జీవితమంతా ఏ ఆదర్శాల కోసం నిలబడ్డాడో, పోరాడాడో, ప్రాణాలు బలిపెట్టాడో ఆ ఆదర్శాలన్నీ ఫిబ్రవరి 28నా, ఆ తర్వాతా గుజరాత్‌లో జరిగిన ఘటనలలో పూర్వపక్షం చేయబడినాయి. ఆయన ఒక్కడి విలువలు మాత్రమే కాదు, మన స్వాతంత్ర్యం కోసం జరిగిన సుదీర్ఘ పోరాటంలో దేశం ఏ విలువల కోసం పోరాడిందో ఆ విలువలన్నీ గుజరాత్ మారణకాండలో ధ్వంసమై పోయాయి.

గోద్రా అనేది గుజరాత్‌లోని పాంచ్ మహల్ జిల్లాలో ఒకపట్టణం. అయోధ్య నుంచి రామసేవకులను అహ్మదాబాద్ తీసుకువెళుతున్న సాబర్మతి ఎక్స్‌ప్రెస్ గోద్రా మీదుగా వెళ్లవలసి ఉంది. నిజానికి అయోధ్యలో శిలాన్యాస్ జరగలేదు. గనుక ఆ రామ సేవకులు అయోధ్యలో తమ శక్తులను పూర్తిగా వెచ్చించలేకపోయారు.

ఆ రామసేవకులు తప్పనిసరిగా యువకులూ ఉత్సాహవంతులూ అయి ఉంటారు. సాధారణంగా విశ్వహిందూ పరిషత్‌లోనూ, భజరంగదళ్ లోనూచేరిన ఈ యువకులు నిరుద్యోగ నిర్వ్యాపక వర్గాల నుంచే వచ్చి ఉంటారు. వారందరికీ తలా ఒక త్రిశూలం, ఒక కత్తి ఇవ్వబడ్డాయి. నిరంతరం జరిగిన సమావేశాలు వారిలో ఒకసామూహిక భావనను, కొంత గర్వాన్నీ పెంచాయి. వారిలో చాలా మంది చాతుర్వర్ణ వ్యవస్థలో కింద కులాలవాళ్లు కూడా. కాని ఈ సమావేశాలలో భాగంగా పెద్దకులాల వారితో, నాయకులతో భుజాలు కలిపి తిరగడం, సన్నిహితంగా ఉండడం, ఒక ఆశయం కోసం పని చేస్తున్నామనే భావం వారిని మత్తెక్కించాయి.

ఈ హిందుత్వ పదాతిదళం నిజానికి కుల అంతరాల వ్యవస్థలో అట్టడుగున ఉండే వాళ్లు. హిందుత్వ నాయకులేమో ఎప్పుడూ అంబేద్కర్ మీద దుమ్మెత్తిపోస్తూ, అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని సవరిస్తామని అంటుండే వాళ్లు. ఆ రాజ్యాంగం అట్టడుగు కులాలకు ఇచ్చిన రిజర్వేషన్ హక్కును తొలగించాలని, అంటే వారికి అందిన ఒక సమానత్వ అవకాశాన్ని తొలగించాలని అంటుండేవాళ్లు.

గుజరాత్ మారణకాండలో ముస్లింలను చంపడానికి, ఆస్తులు ధ్వంసం చేయడానికి, దోచుకోవడానికి సంఘ పరివారం ఎక్కువగా వాడుకున్నది దళితులనూ, ఆదివాసులనూ అని చూసినప్పుడు ఆశ్చర్యం కలుగుతుంది. నిజానికి హిందుత్వకూ దళితులకూ ఉన్న

సాంస్కృతిక బంధం సంక్షుభితమైనది. వారి మధ్య ఉన్నది ఒక అస్పష్ట మత సంబంధం. అది దళితులను అస్పృశ్యులుగా చూసి అవతలపెట్టేది. వారిపట్ల అంతులేని హింసను ప్రయోగించేది. అయినా ముస్లిముల మీద దౌర్జన్య పూరితమైన ధర్మయుద్ధం చేయాలనుకునేసరికి మాత్రం హిందుత్వకు కావలసి వచ్చేది దళిత బహుజన జనాభానే. అందుకే అది వారితో లేని సంబంధాన్ని వెతికిపట్టుకుని వారిని సమీకరించదలచు కుంటుంది. నిజానికి ఆ దాడులకు లక్ష్యంగా ఉండే ముస్లిములు కూడా దళిత బహుజనులలో అత్యధికులలాగ వెనుకబడి ఉన్నవారే.

సరే, ఆ రోజు సాబర్మతి ఎక్స్‌ప్రెస్‌లో మొత్తం 1200 మంది ప్రయాణీకులున్నారు. అంటే ఆ రైలు కిక్కిరిసి ఉందన్నమాట. రిజర్వ్‌డ్ బోగీలలోని ప్రయాణీకులు కూడా తమ బోగీలలోకి జొరబడిన రామసేవకుల గుంపులకు స్థలం ఇచ్చి సర్దుకుపోవలసి వచ్చింది. రిజర్వ్ చేసుకున్న ప్రయాణీకులకు ఆ మాదిరిగా బోగీలలోకి ప్రవేశించిన మూకల పట్ల ఎంత ఇబ్బంది కలిగి ఉంటుందో, వారికి ఎంత అసహనం కలిగి ఉంటుందో ఎవరైనా ఊహించగలరు.

కాని అది ఆ ప్రయాణికుల రైలుకాదు, రామసేవకుల రైలే. ఎందుకంటే అప్పుడు రైల్వే మంత్రిగా ఉండిన నితిష్‌కుమార్ సంఘ పరివారంలో సభ్యుడే. వాళ్లంతా తమ పార్టీ పని మీదనే అయోధ్యకు తరలివెళ్లారు. అప్పుడు కేంద్రంలో వారి ప్రభుత్వమే ఉన్నది. రాష్ట్రంలో వారి ప్రభుత్వమే ఉన్నది. రైళ్లను వారి పార్టీయే నడుపుతున్నది. రాజకీయ పార్టీలు నిర్వహించే మేళాలకు వెళ్లే, ఆ మేళాల నుంచి తిరిగి వచ్చే కార్యకర్తలందరూ ఆ మాదిరిగానే ఆలోచిస్తారు., ప్రవర్తిస్తారు. అందులో ఏమీ ఆశ్చర్యం లేదు.

అప్పుడప్పుడు ఇటువంటి ప్రవర్తనమీద ప్రయాణికులు తమ అసంతృప్తిని కూడా వ్యక్తం చేస్తుంటారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదులు కూడా చేస్తుంటారు. ఈ రామసేవకుల ప్రయాణం మీద కూడా వాళ్లు అయోధ్యకు వెళ్లేటప్పుడు, ఫిబ్రవరి 27న తిరిగి వచ్చేటప్పుడు ఫిర్యాదులు నమోదయ్యాయి. ఆ రామసేవకులు తమ ప్రయాణంలో రిజర్వ్ బోగీలలోని హిందూ ప్రయాణికుల మీద కూడా జబర్దస్తీ చేసే ఉంటారు. రైలుస్టేషన్లలో ఆగినప్పుడు రామసేవకులు తీసుకున్న అల్పాహారాలకూ, ఛాయ్‌లకూ డబ్బులు ఇవ్వకపోవడం, వ్యాపారుల మీద జబర్దస్తీ చేయడం గురించి కూడా ఫిర్యాదులు నమోదయ్యాయి. ప్రత్యేకంగా ఆ వ్యాపారులు ముస్లింలైతే ఇటువంటి జబర్దస్తీ ఎక్కువగా సాగింది.

గోద్రా స్టేషన్‌లో కూడా ముస్లిం వ్యాపారస్తులతో రామసేవకులు దురుసుగా ప్రవర్తించారు. ఛాయ్‌లు, తినుబండారాలు అమ్మడంలో ఆ వ్యాపారస్తులకు సహకరిస్తున్న స్త్రీలపట్ల అసభ్యంగా కూడా ప్రవర్తించారు. ఈ క్రమంలో రామసేవకులకూ ముస్లిం

వ్యాపారులకూ మధ్య ఘర్షణ జరిగింది. ఆ ఘర్షణలో ప్లాట్ ఫారం మీద ఉన్న హిందూ ముస్లిం ఘర్షణకాదు.

సరే, ఈ గొడవంతా ముగిసి, రైలు ప్లాట్ ఫారం వదిలింది. కాని ఎవరో చైను లాగడంతో రైలు మళ్లీ నిలిచిపోయింది. ఆ రైలు ఆగిన ప్రాంతాన్ని సిగ్నల్ ఫాలియా అంటారు. అది ముస్లిం జనాభా ఎక్కువగా ఉండే ప్రాంతం. అప్పుడు ఆగి ఉన్న రైలులని ఎస్ 6 బోగీ మీద దాడి జరిగింది. అంతకు ముందు జరిగిన ఘర్షణను సాకుగా తీసుకుని ఆ ముస్లిం ప్రాంతంలోని సంఘ వ్యతిరేక శక్తులు దాన్ని మత కల్లోలంగా మార్చడానికి ప్రయత్నించి ఉంటారనేది  ఒక ఊహ. అంత పథకం ఏమీ లేకుండానే అది అప్పటికప్పుడు జరిగిన ఆందోళన కావచ్చుననేది కూడా ఒక కథనం.

బైటి నుంచి ఆ బోగీ మీద రాళ్లు విసిరారు. కొద్ది సెకన్లలో ఆ బోగీకి నిప్పంటుకుంది. అతి త్వరలోనే విపరీతంగా మంటలు వ్యాపించాయి. అంతకు ముందు జరిగిన రాళ్ల దాడికి ఆ బోగీ కిటికీలన్నీ మూసేసి ఉంటారు. కాని బయటి నుంచి విసిరిన ఒక నిప్పు బంతి లోపల మంటలకు కారణమై ఉండవచ్చునని ఒక ఊహాగానం. కాని సిగ్నల్ ఫాలియా దగ్గర రైలు పట్టాలు 12 నుంచి 15 అడుగుల ఎత్తున ఉన్నాయి. ఆ రైలు కిటికీలకు అడ్డంగా మూడు నాలుగు ఇనుపకడ్డీలతో రక్షణ ఉంది. కిటికీల నుంచి దొంగతనాలు జరగకుండా కాపాడేందుకు ఆ ఇనుప చువ్వలు పెట్టారు. బైటి నుంచి విసిరిన నిప్పు బంతులు ఆ ఇనుప చువ్వల అడ్డంకిని దాటుకుని లోపల పడి ఉండడానికి అవకాశం ఉంది. కాని బోగీ బైటి వైపు ఎక్కడా కాలిన గుర్తులే లేవు. కిటికీల మీద మాత్రం లోపలి నుంచి మంటలు చాచిన నాల్కల గుర్తులు ఉన్నాయి. మొత్తం మీద ఎస్ 6 బోగీలోపల మాత్రం సంపూర్ణంగా కాలిపోయింది. లోపల వాడిన ఉక్కు, ఇతర లోహాలు మెలితిరిగి పోయాయంటే ఆ మంటలు ఎంత ఎక్కువగా, ఎంత ఉష్ణోగ్రతతో వచ్చి ఉంటాయో ఊహించవచ్చు. విషాదమేమంటే ఈ మంటల్లో యాభై, అరవై మంది ప్రయాణికులు పూర్తిగా బుగ్గి అయిపోయారు. వారికి అయోధ్యలోనూ దేశంలోనూ జరుగుతున్న పరిణామాలతో ఎటువంటి సంబంధమూ లేదు. ఇటువంటి దారుణ నేరాలు చేసిన వారు ఎవరైనా సరే శిక్షలు పడకుండా తప్పించుకోగూడదు.

అయితే ఎస్ 6 బోగీలో రగిలిన మంటలు అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. బాబ్రీ మసీదు విధ్వంసం తర్వాత దేశంలో ఏమి జరిగిందో అప్పటి హోంశాఖ మంత్రికి వ్యక్తి గతంగా చాలా స్పష్టంగా తెలుసు. మరి శిలాన్యాస్ కార్యక్రమ అనంతర పరిణామాలలో దేశంలోని అనేక ప్రాంతాలలో మత కల్లోలాలు జరిగే అవకాశం ఉంటుందని ఊహించగలిగిన ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకున్నది? శాంతిభద్రతల పరిరక్షణ రాజ్యాంగం ప్రకారం రాష్ట్రాల బాధ్యత అని తప్పించుకోజూడడం బాధ్యతాయుత ప్రవర్తన కాదు. అయోధ్య శిలాన్యాస్ తప్పనిసరిగా దేశంలో ప్రజాభద్రతను భంగపరచగల

అవకాశాలున్న కార్యక్రమం. ప్రభుత్వం తీవ్రవాద హింసపట్ల ఏ మాదిరిగా స్పందించిందో అదే మాదిరిగా మెజారిటీ మతం జరపనున్న హింసపట్ల కూడా స్పందించవలసి ఉండింది.

గోద్రా విషాదం తర్వాత, ఆ విషాద పరిణామంగానూ, ఆ విషాదంతో సంబంధం లేకుండానూ గుజరాత్‌లోని ముస్లిం ప్రజానీకం మీద ఒక జాతి హననకాండ అమలైంది. వేలాది మందిని ఊచకోత కోసిన దారుణ మారణకాండ జరిగింది. గోద్రా దారుణం జరిగిన మర్నాడే అంటే ఫిబ్రవరి 28న రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ముస్లింల మీద దాడులు మొదలయ్యాయి. ఆ దాడులన్నీ దాదాపు ఒకే సమయానికి జరగడం ఒక కచ్చితమైన ప్రణాళిక ప్రకారమే. ఈ దాడుల గురించి, హింస గురించి స్వయంగా నరేంద్రమోడీ ఒక విభజన చేశాడు. ఒక మత హింస జరగగానే లౌకిక హింస జరుగుతుందట. ఈ హింస అంతా పద్ధతి ప్రకారం, ఒక పథక రచనతో జరిగిందనీ, గోద్రా ఘటనకూ దీనికీ సంబంధం ఉండకపోవచ్చుననీ అనడానికి చాలా ఆధారాలున్నాయి. ఆ ఆధారాలన్నీ మా విచారణలో వెలుగులోకి వచ్చాయి. ఆ కల్లోలాలలో బాధితులు, రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేసిన మతతత్వ రాజకీయాలలో విశ్వాసం లేని వారు, ఆ కల్లోలం జరుగుతున్నప్పుడు అక్కడ తిరుగుతూ ప్రత్యక్ష సాక్షులుగా ఉన్న వాళ్లు ఎందరో ఆ హింసాపథక రచన గురించి మాకు వివరించారు.

అంతకు ముందే శిలాన్యాస్‌ను సమర్థించడానికి ఎన్నో ఏర్పాట్లు జరిగాయి. మతతత్వ ప్రణాళికను అమలు చేయడానికి జరిగిన ప్రయత్నాలు బహిరంగంగానే జరిగాయి. విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ తొగాడియా, విశ్వహిందూ పరిషత్ సీనియర్ ఉపాధ్యక్షుడు ఆచార్య గిరిరాజ్ కిషోర్, భజరంగదళ్ జాతీయ కన్వీనర్ ఎస్ కె జైన్ తదితరులు ఫిబ్రవరిలో చేసిన ఉపన్యాసాలు ఈ మారణకాండకు సూచనలు వదిలాయి. ఆ ప్రకటనలు ఆలయ నిర్మాణం గురించే అయినప్పటికీ రెచ్చగొట్టేట్టుగా ఉన్నాయి. ఆ ప్రకటనలలోని సందేశం స్పష్టంగానే ఉండింది.

ఫిబ్రవరి 7న ముంబయి నుంచి వెలువడే ఏషియన్ ఏజ్ పత్రికలో వెలువడిన ప్రవీణ్ తొగాడియా ప్రకటన చూడండి. "పాకిస్తాన్ కావాలా మందిర్ కావాలా తేల్చుకోవలసిందే. నాలుగువందల యాభై ఏళ్లకింద బాబర్ రామాలయాన్ని ధ్వంసం చేసి మసీదును నిర్మించిన సంఘటన, న్యూయార్క్‌లోని ప్రపంచ వాణిజ్య కేంద్రం మీద సెప్టెంబర్ 11న జరిగినదాడి రెండూ ఇస్లామిక్ జిహాద్ చిహ్నాలే. అందువల్ల ఇవాళ ఇస్లామిక్ తీవ్రవాదులను ఎదిరించి పోరాడడానికి భారతదేశం,యూదులు, పాశ్చాత్య ప్రపంచం ఒక్క తాటి మీదికి వచ్చి కలిసికట్టుగా పని చేయవలసి ఉంది" అని తొగాడియా అన్నాడు. ఇటువంటి ప్రకటనలు మన మధ్య జీవిస్తున్న ముస్లిం మైనారిటీలను ఊచకోత కోయడానికి పురికొల్పుతాయి.

మరొక ప్రకటనలో భజరంగదళ్‌నేత రామాలయ నిర్మాణాన్ని ముస్లిం సంస్థలు

అడ్డగిస్తే తాము ఢిల్లీ జామా మసీదులో హనుమాన్ చాలీసా పఠనం కొనసాగిస్తామన్నాడు. అంతకు ముందు వాళ్లే కరసేవకులు శాంతియుతమైన స్వచ్ఛంద కార్యకర్తలని, వారు అక్కడే కేవలం దైవ సంకీర్తనలు గానం చేస్తారనీ స్వయంగా సుప్రీం కోర్టు ముందర ప్రకటించారు. అందువల్లనే వారిని మసీదు ప్రాంగణంలోకి అనుమతించడం జరిగింది. ఆ తర్వాత బాబ్రీ మసీదుకు ఏమయిందో అందరికీ తెలిసిన చరిత్రే. గుజరాత్‌లో జరిగిన దాన్ని బట్టి దేశంలో ఇతర ప్రాంతాల్లో కూడా సంఘ పరివార శక్తులు ఎటువంటి ఏర్పాట్లు చేసుకుని ఉంటాయో ఊహించవచ్చు. వాళ్ల ఏర్పాట్లు ఎంత పెద్ద ఎత్తున జరిగాయో గోద్రా విషాదం తర్వాత జరిగిన మారణకాండతోనే బయట పడింది.

పోలీసు ఇన్‌స్పెక్టర్లను ఎక్కడ నియమించాలి. ఎక్కడికి బదిలీ చేయాలి అనే హక్కు ప్రభుత్వానికే ఉంటుంది. గుజరాత్‌లో నరేంద్రమోడి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించగానే ఏయే ప్రాంతాల్లో ఏయే ఇనస్పెక్టర్లను నియమించాలో, ఎవరిని బదిలీ చేయాలో పకడ్బందీ నిర్ణయాలు జరిగాయి. ఆయన అహ్మదాబాద్‌కు తనకు ఇష్టమైన ఒక పోలీసు కమిషనర్‌ను నియమించాడు. ఆ కమిషనరే ఈ హింసాకాండ అంతటినీ పర్యవేక్షించాడు. ముస్లిం పోలీసు అధికారులకు ఏ ముఖ్యమైన బాధ్యతలూ ఇవ్వలేదు. వారిని కార్యనిర్వాహక బాధ్యతల నుంచి తప్పించి సిబ్బంది వ్యవహారాల శాఖలకు బదిలీ చేశారు. సంఘ పరివారానికి చెందిన తీవ్రవాద సంస్థలైన విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్‌లు రాష్ట్రంలో తమ ప్రభావాన్ని విపరీతంగా వ్యాపింపచేశాయి. సంఘపరివార శక్తులు మరీ ముఖ్యంగా ఆదివాసుల మధ్య పని చేస్తూ తమ వ్యాప్తికి వారిని సమర్థంగా వాడుకున్నాయి. వారు తమ కార్యకర్తలకు ఆయుధ శిక్షణ కూడా ఇచ్చి సాయుధం చేశారు. వారి సమావేశాలు రాష్ట్ర మంతటా చాలా తరచుగా జరుగుతూ వచ్చాయని మా విచారణలో తేలింది.

నిజానికి గోద్రా పట్టణానికి కూడా అంతకు ముందు మతకల్లోలాలు జరిగిన చరిత్ర ఉంది. ఈ కారణం వల్లనైనా గోద్రాలో అధికార యంత్రాంగం తగిన ముందు జాగ్రత్తలు చర్యలు తీసుకోవలసి ఉంది. కాని స్వయంగా మోడీ మంత్రివర్గ సహచరులే ఆ హింసాకాండలో పాల్గొంటూ ఉండడంతో అధికార యంత్రాంగం వారి మీద ఎటువంటి చర్యలు తీసుకోలేకపోయింది. స్వయంగా మంత్రులే మారణకాండలను, దోపిడీలను, ఆస్తుల విధ్వంసాలను పర్యవేక్షిస్తూ ఉన్నారు. మంత్రులు అశోక్‌భట్, బదేజాలు గాంధీనగర్‌లోనూ అహ్మదాబాద్‌లోనూ పోలీసు కంట్రోల్ రూములలో కూచుని ఎక్కడెక్కడ హింసాకాండ జరపాలో ఆదేశాలు ఇస్తూ ఉన్నారు. రెవెన్యూ మంత్రి హిరేన్ పాండ్యా స్వయంగా అల్లరి మూకలకు నాయకత్వం వహిస్తూ ముస్లిం ఆస్తులను భస్మీపటలం చేయడంలో, ముస్లింలను చంపడంలో ముందు నిలబడ్డాడు. ఆ హింసాకాండ ఈ మాదిరిగా జరిగిందని ఎంతో మంది ప్రజలు మా విచారణలో చెప్పిన విషయాలను ఆ

రాష్ట్ర హైకోర్టుకు మాజీ ప్రధాన న్యాయమూర్తి కూడా ధృవీకరించారు. ఫిబ్రవరి 28వ, ఆ తర్వాత రాష్ట్రంలో రాజ్యాంగం, ఇతరచట్టాలు తాత్కాలికంగా ఉపసంహారణకు గురయ్యాయని ఆయన అన్నారు.

మానవత్వం మచ్చుకైనా లేని మనిషిలా నరేంద్రమోడీ తనకు మాత్రమే తాను స్పందించే మనిషిలా, ఎవరికీ జవాబుదారీ తనంలేని మనిషిలా ప్రవర్తించాడు. అటువంటి మనిషి ఇంకా ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నాడు. ఆయన ఇంకా ముఖ్యమంత్రిగా కొనసాగడానికి వీలుకల్పించడమంటే, ఆయన అంత చట్టంపట్ల గౌరవం లేకుండా ప్రవర్తించినా అధికారంలో కొనసాగనివ్వడమంటే అదంతా హిందుత్వ దేశవ్యాప్తంగా విస్తరించే ప్రయత్నమే.

గుజరాత్ మారణకాండకు సంబంధించి చెప్పుకోవలసిన విషయమేమంటే రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాలలో, సంబంధంలేని సుదూర ప్రాంతాలలో కూడా ముస్లింల మీద దాడులు ఒకేసారి జరిగాయి. అంటే అదంతా ప్రణాళిక వేసుకుని ఒకపద్ధతి ప్రకారం జరిగిందన్నమాట. అట్లాగే ముస్లింలను చంపిన పద్ధతి కూడా అన్ని చోట్లా ఒక్కలాగనే ఉంది. అన్ని చోట్లా బాధితులను చంపడం, నరకడం, సజీవ దహనం చేయడం ఒక్కలాగానే జరిగాయి. స్థానిక పరిభాషలో టోలా అని పిలిచే పదివేల మంది మూక ముస్లిం బాధితులను వేటాడింది. ప్రాణభయంతో పరుగులు తీస్తున్న ముస్లిం బాధితులకు అడ్డంగా పోలీసు బలగాలు నిలబడి వారు పారిపోకుండా, హిందుత్వ మూకల కత్తులకు ఎర అయ్యేలా చూశారు. ఒకవైపు పోలీసులు గోడ కట్టి ఉండగా మధ్యలో చిక్కుబడిపోయిన ముస్లింలపై హిందుత్వ మూకలు విరుచుకుపడి వారిని ముక్కలుగా నరికారు. తన కుటుంబసభ్యులు పది మందిని వాళ్లు అట్లా నరకగా తాను కళ్లారా చూశానని ఒక పిల్లవాడు మాకు చెప్పాడు. జాఫ్రీని, కౌసర్‌ను, గీతాబెన్‌ను అల్లరిమూకలు ఎట్లా చంపాయో ఇప్పుడు దేశమంతా తెలిసిన కథలే. అల్లరిమూకల్లో ప్రతి ఒక్కరూ తమ నుదుటికి అడ్డంగా జై సియారాం అని రాసిన రిబ్బన్లు కట్టుకున్నారు. టోలా నాయకులు కొన్నిసార్లు బాధితులను జైసియారాం అని నినాదాలు ఇవ్వమని కూడా ఆదేశించారు. అలా నినాదాలు ఇవ్వడానికి నిరాకరించిన వాళ్లను నరికి చంపారు. అంటే ఆ హిందూత్వ మూకలు శ్రీరాముడిని ఒక మానసిక వ్యాధి పీడితుల దేవుడిగా, రక్తపిపాస దేవుడిగా మార్చేశాయన్న మాట.

గుజరాత్‌లో అప్పుడు జరిగిన హింసాకాండ కేవలం హత్యలతో ఆగిపోలేదు. చనిపోయిన వ్యక్తుల ఆనవాలు లేకుండా చేయడానికి కూడా ప్రయత్నం జరిగింది. ఆ హత్యాకాండలో అన్ని వర్గాల వారిని చంపారు. ధనికులను కూడా చంపారు. ప్రతి మొహల్లాలోనూ కాపురముంటున్న ముస్లింల జాబితాలు పట్టుకుని వచ్చారు. ప్రతి వార్డులోనూ, మొహల్లాలోనూ ఉన్న ముస్లింల ఆస్తుల వివరాలు కూడా వాళ్లదగ్గర

ఉన్నాయి. ఆ అల్లరిమూకలు ఇద్దరు హైకోర్టు న్యాయమూర్తుల ఇళ్లమీద కూడా దాడి చేశాయి. ఆ ఇద్దరిలో ఒకరు ఇంకా పదవిలో ఉన్న న్యాయమూర్తి కూడా. ఆ ఇద్దరు న్యాయమూర్తుల ఇళ్లను ధ్వంసం చేశారు. ఆ న్యాయమూర్తులిద్దరూ న్యాయమూర్తుల వీధి నుంచి పారిపోయి ఒక ముస్లిం కాలనీలో ఆశ్రయం తీసుకోవలసి వచ్చింది. ఇద్దరు హైకోర్టు న్యాయమూర్తులు దాడికి గురయ్యారనే విషయాన్ని చివరికి సుప్రీంకోర్టు కూడా పరిగణనలోకి తీసుకోలేదు. వారిని కాపాడడానికి ముందుకు రాలేదు.

ఇది చెపుతుంటే నాకు పాత విషయం ఒకటి గుర్తుకొస్తోంది. ఎవడో ఒక వెర్రివాడు సుప్రీం కోర్టులో జస్టిస్ గ్రోవర్ మీదికి కత్తి విసిరాడు. ఇందిరాగాంధీ దేశంలో ఎమర్జెన్సీ విధించడానికి చూపిన కారణాలలో ఈ న్యాయమూర్తి మీదికి కత్తి విసరడం కూడా ఒకటి. ఒక న్యాయమూర్తి మీదికి పిచ్చివాడు కత్తి విసరడం ఎమర్జెన్సీ విధించడానికి కారణమవుతుంది. గాని హైకోర్టు న్యాయమూర్తులు ప్రాణభయంతో అల్లరిమూకల నుంచి తప్పించుకుంటూ పరుగెత్తడం సుప్రీంకోర్టుకు కూడా పట్టదు.

టోలాలో ప్రతి ఒక్కరూ ఉన్మాదంతో ఊగిపోతూ ఉన్నారు. అందరూ చూస్తూ ఉండగా ముస్లిం స్త్రీల మీద లైంగిక అత్యాచారాలు జరిగాయి. గర్భిణి స్త్రీలను చంపారు. వాళ్ల గర్భాలలోంచి పిండాలను బయటకు లాగారు. ఆ పిండాలను ముక్కలుగా నరికారు. మతాంతర వివాహం చేసుకున్న దంపతులు ఎవరున్నారో నాయకులు గుర్తించారు. అల్లరిమూకలు ఆ భార్యాభర్తలను చంపేశాయి. వాళ్ల పిల్లలను కూడ వదిలిపెట్టలేదు. ముస్లింలకు చెందిన ఆస్తులను, వ్యాపార సంస్థలను పద్ధతి ప్రకారం ధ్వంసం చేశారు. చివరికి ఆ వ్యాపార సంస్థల భాగస్వాములలో ఒక్కరు ముస్లిం అయి ఉన్నా సరే ఆ సంస్థలను నాశనం చేశారు. లెక్కలేనన్ని మత స్థలాలను, ప్రార్థనా స్థలాలను నేలమట్టం చేశారు.

ఇంత విస్తృతమైన హింసనూ, విధ్వంసాన్ని ఎవరు ఎట్లా వివరించగలరు? ఒకవేళ ఇదంతా ఉన్మాదం అనుకుంటే, ఉన్మాదం ఇంతగా నిరాటంకంగా సాగుతుందా? మధ్యలో గుర్తించదగిన విరామాలు లేకుండా ఉంటుందా? మనిషికి ఉన్న విధ్వంసకశక్తి గురించి ఎరిక్ ఫ్రామ్ చేసిన విశ్లేషణ కొంత వరకు ఈ ప్రశ్నకు జవాబు చెప్పగలుగుతుందనుకుంటాను. "ఒక వ్యక్తికి ఉన్న శక్తులను ఎంత మేరకు అడ్డగించడం జరుగుతుందో అంత మేరకు, ఆ నిష్పత్తిలోనే ఆ వ్యక్తిలో విధ్వంసకశక్తి ఉంటుంది. ఒక మనిషికి ఎదగడానికి, జీవించడానికి ఉన్న ఆకాంక్ష ఎంత వరకు ఆటంకపరచబడుతుందో ఆ మాదిరిగా అడ్డగించబడిన శక్తి ఒక పరిణామానికి లోనవుతుంది. అది విధ్వంసక శక్తిగా పరిణమిస్తుంది. లేకపోయిన జీవితానికి ఫలితమే' అన్నాడు మనస్తత్వ శాస్త్రవేత్త ఎరిక్ ఫ్రామ్.

గుజరాత్‌లో జరిగిన ప్రభుత్వమే స్వయంగా ప్రయోగించిన, ఆదేశించిన, సమర్థించిన

హింసాకాండ, ఆ హింసాకాండలో వెయ్యి మంది ప్రాణాలు కోల్పోయారు. హంతకులు హతుల సంఖ్య కూడా కనబడకుండా, లెక్క తేలకుండా చేశారు. హతుల గుర్తులు చెరిపివేశారు. అప్పుడు కేంద్రంలో పాలిస్తున్న పార్టీ, రాష్ట్రంలో పాలిస్తున్న పార్టీ ఒకటే.

గుజరాత్‌లో జరిగిన నేరాలతో పోల్చదగినవి న్యూరెంబర్గ్ నేరాలు మాత్రమే. నాజీ నేతలు జరిపిన నేరాలను, యూదుజాతిని హననం చేయడానికి జరిపిన దుష్ప్రయత్నాలను, దుర్మార్గాన్ని విచారించడానికి యుద్ధానంతరం న్యూరెంబర్గ్‌లో ఒక ప్రయత్నం జరిగింది. ఆ నేరాలను న్యూరెంబర్గ్ నేరాలు అని పిలవడం ఆనవాయితీ అయింది.

సరిగ్గా జర్మనీలో హిట్లర్ చేసిన జాతి హననం లాగానే గుజరాత్ హత్యాకాండకు కూడా జాతి హననానికి సంబంధించిన అన్ని లక్షణాలూ ఉన్నాయి. అయితే ఇటువంటి జాతి హననకాండ ఈ దేశంలో జరగడం ఇదే మొదటిసారి కాదు. ఇందిరాగాంధీ హత్యానంతరం కాంగ్రెస్ నాయకులు జరిపిన సిక్కుల ఊచకోతను కేవలం మత ఘర్షణలుగా అభివర్ణించడానికి వీలులేదు. అది కూడా జాతి హననకాండే. 1987 సెప్టెంబర్‌లో బీదర్‌లో సిక్కు విద్యార్థులను చంపడం కూడా ఒక మామూలు కల్లోలం కాదు. ఈ ఘటనలు, పరిణామాలు అన్నీ ఒక మత సమూహాన్ని ఉద్దేశ్యపూర్వకంగా లక్ష్యంగా పెట్టుకున్నవే. హిట్లర్ చెప్పిన అంతిమ పరిష్కారం అనేపేరుగల ప్రయోగం ఇదే.

రెండవ ప్రపంచ యుద్ధం అనంతరం 1948 డిసెంబర్ 9న ఒక అంతర్జాతీయ ఒడంబడిక ఉనికిలోకి వచ్చింది. జాతిహననం అనే నేరాన్ని నిరోధించడానికి, దానికి బాధ్యులైన వారిని శిక్షించడానికి, ఒక అది ఉనికిలోకి వచ్చింది. ఆ ఒడంబడికలో 19 అధికరణాలున్నాయి. అందులో రెండో అధికరణం, మూడో అధికరణం చాలా ముఖ్యమైనవి. యూదులను నామరూపాలు లేకుండా చేయడానికి ప్రయత్నించిన జర్మన్ ప్రయోగాన్ని ప్రయత్నిస్తూ ఆ రెండో అధికరణం జతి హనన నేరాన్ని నిర్వహించింది. "జాతి హననకాండ అంటే ఒక ప్రత్యేకమైన జాతికి, నరవర్గానికి, తెగకు, మతసమూహానికి చెందిన ప్రజలను మొత్తంగాగాని, పాక్షికంగాగాని, రూపుమాపడానికి ఉద్దేశించిన ఈ కింది ప్రకటించిన నేరాలన్నీ వస్తాయి అవి :

అ. ఆ సమూహానికి చెందిన వ్యక్తులను చంపడం.

ఆ. ఆ సమూహానికి చెందిన వ్యక్తులకు తీవ్రమైన శారీరక, మానసిక హాని కలిగించడం.

ఇ. ఆ సమూహం సంపూర్ణంగా గాని, పాక్షికంగాగాని ధ్వంసమైపోయేలా ఉద్దేశ్యపూర్వకంగా గాయపరచడం.

ఈ. ఆ సమూహంలో శిశు జననాలను అరికట్టే ఉద్దేశ్యంతో చర్యలు తీసుకోవడం.

ఉ. ఒక సమూహపు శిశువులను మరొక సమూహానికి బలవంతంగా బదిలీ చేయడం.

అంతే కాదు, ఆ ఒడంబడిక శిక్షార్హమైన నేరాలను కూడా గుర్తించింది. అవి.

అ. జాతి హనన మారణకాండ.

ఆ. జాతి హననకాండ జరపడానికి కుట్ర చేయడం.

ఇ. జాతి హననకాండ జరిపేందుకు బహిరంగంగా, నేరుగా రెచ్చగొట్టడం.

ఈ. జాతి హననం చేయడంలో సహకరించడం.

ప్రస్తుతం జాతిహనన నేరాలపై ప్రత్యేకంగా చట్టమేదీ లేదు. ప్రస్తుతం రూపొందే చట్టం ఏదైనా గతంలో జరిగిన నేరాల నుంచి అమలు చేయడానికి వీలులేదు. కాని జాతిహననం మీద కుదుర్చుకున్న ఈ ఒడంబడికను అమలులో ఉన్న చట్టంగా గుర్తించవచ్చునని నేననుకుంటాను. అది ప్రస్తుతం అమలులో ఉన్న ఏ చట్టానికీ వ్యతిరేకం కూడా కాదు. అటువంటి వ్యాఖ్యానం ఇచ్చుకోవచ్చు.

నిజానికి అటువంటి వ్యాఖ్యానం గనుక ఇచ్చుకునేట్టయితే జాతీయ మానవహక్కుల కమిషన్ ఈ నేరాల మీద ఒక వివరమైన పరిశోధన జరిపి ప్రభుత్వానికీ, దేశానికీ ఒక వివరమైన నివేదికను సమర్పించడం వీలవుతుంది. గుజరాత్ మారణకాండ మీద అది ఇచ్చిన నివేదికలో ప్రస్తావించిన వాస్తవాలు కచ్చితంగా జాతిహననకాండ అనే నేరాన్ని రుజువు చేసే సాక్ష్యాధారాలవుతాయి. కమిషన్‌కు ప్రజలపట్ల ఒక బాధ్యత ఉంది. భవిష్యత్తుపట్ల ఒక బాధ్యత ఉంది. ఆ బాధ్యత ఏమంటే గుజరాత్ హింసాకాండ గురించి పరిశోధన జరిపి తన నిర్ధారణలన్నిటినీ ప్రజల ముందుంచడం. తద్వారా భవిష్యత్తులో ఏ రాజకీయ పార్టీగాని, ఏ ప్రభుత్వంగాని ఇటువంటి దుర్మార్గ పద్ధతులకు పాల్పడకుండా జాగ్రత్త తీసుకునేలా చూడడం ఆ బాధ్యత.

ఈ బాధ్యతలో భాగంగానే జాతీయ మానవహక్కుల కమిషన్ జాతిహననంపై ఒక నమూనా చట్టాన్ని తయారు చేయవలసి ఉంది. తద్వారా ఈ దేశంలో మత, జాతి, భాషా అల్పసంఖ్యాక వర్గాల మీద దాడులు జరగకుండా తగిన ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవడం వీలవుతుంది. నా దృష్టిలో ఈ చర్య అత్యవసరమైనది. అనుల్లంఘనీయమైనది. ఎందుకంటే అంతర్జాతీయ నేరశిక్షాస్మృతిలో జాతిహననాన్ని, మానవత్వానికి వ్యతిరేకంగా జరిగే నేరాలను శిక్షార్హమైన నేరాలుగా గుర్తించడం జరిగింది. రాజ్యాధికారంలో భాగమైన వారు ఈ శిక్షాస్మృతిని పాటించక పోవచ్చు. కాని ఎక్కడెక్కడయితే, ఏయే దేశాల్లోనయితే మానవ హక్కుల కమిషన్లను స్థాపించడం జరిగిందో అక్కడల్లా వాటి చట్టపరిధి ఎంత స్వల్పమైనదయినప్పటికీ అవి ఆ శిక్షాస్మృతిని పాటించవలసి ఉంది. "జాతి హననం అంటే మానవ వైవిధ్యం మీద దాడి. అంటే మానవ లక్షణాల మీద దాడి. ఆ దాడి జరుగుతున్నదంటే మానవజాతి, మానవత్వం అనే మాటలకే అర్థం లేకుండా పోతుంది" అని సామాజిక శాస్త్రవేత్త హన్నా ఆరెండ్ట్ అన్నారు.

మధ్య, తూర్పు యూరప్‌లలో సోషలిస్టు దేశాలు కుప్పకూలిపోయి 1989 తర్వాత

ఆ దేశాలన్నిటిలో భిన్న జాతుల మధ్య, ముఖ్యంగా అల్ప సంఖ్యాక వర్గాల మీద హింసాయుత ఘర్షణలు జరిగాయి. అంతకు పూర్వం యుగొస్లావియాగా ఉండిన దేశంలో క్రొయేషియా, బోస్నియా, సెర్బియా ప్రాంతాల్లో, వొజ్వొదెనా, కొసావో ప్రాంతాల్లోని వేలాది మంది ఊచకోతకు గురయ్యారు. ఇరవై లక్షల మంది నిరాశ్రయులయ్యారు. ఆ హింసాకాండ కాకసస్‌కు, మోల్డావియాకు కూడా వ్యాపించింది. పాత సోవియట్ యూనియన్‌కు కూడా వ్యాపిస్తుందేమోననిపించింది. ఆ సమయంలోనే ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభలో 1992 డిసెంబర్ 12న ఒక తీర్మానం ఆమోదించారు. జాతి, నరవర్గ, మత, భాషా అల్పసంఖ్యాక సమూహాలకు చెందిన వ్యక్తుల హక్కుల ప్రకటన అని ఆ తీర్మానం పేరు. అల్ప సంఖ్యాకవర్గాల పరిరక్షణ గురించి ఆ తీర్మానం ప్రత్యేకంగా వ్యక్తీకరించింది. ఆ ప్రకటనలో ఉన్న విషయాలన్నిటినీ మనరాజ్యాంగం కూడా అంతకుముందే గుర్తించింది. మరి జాతిహననం అంటే అల్పసంఖ్యాక వర్గాలకు ఉన్న ఈ హక్కులన్నిటినీ కాలరాయడమే.

* * *

# లౌకిక విలువలు - రాజ్యాంగం

మన రాజ్యాంగ నిర్ణయసభలో ఉన్న వ్యక్తులందరికీ తాము సమాజంతో వ్యవహరించబోతున్నామని తెలుసు. అందువల్లనే వారు లౌకికవాదాన్ని ఒక రాజ్యాంగ విలువగా వ్యక్తీకరించారు.కాని మన రాజ్యాంగానికి ప్రాతిపదికగా ఉన్న ఆ విలువ 42వ రాజ్యాంగ సవరణ నాటి వరకూ స్పష్టంగా ప్రకటితం కాకుండానే ఉండిపోయింది. పెట్టుబడిదారీ విధానం తొలిదశలో పని పరిస్థితులు నియంత్రణ లేకుండా ఉన్నందువల్ల దుర్భరమైన పరిస్థితులలో బతకవలసి వచ్చిన పేదల బతుకులకు ప్రతిస్పందనగా ఈ లౌకికవాదం అనే విలువ వచ్చింది.

లౌకికవాదం (సెక్యులరిజం) అనే విలువను మనదేశంలో అంటు కట్టి ప్రచారం చేస్తున్నప్పుడు మనం దాన్ని సరిగానే అర్థం చేసుకుని అమలు చేస్తున్నామా అనే సందేహం వస్తుంది. ఎందుకంటే దానికి ప్రస్తుతం ఉనికిలో ఉన్న నిర్వచనాలలో చాలా అపసవ్యతలు, వక్రీకరణలు ఉన్నాయి. నైతికతా స్ఫూర్తి దైవభావన మీదనో, భవిష్యత్తులో ఏర్పడబోయే రాజ్య భావనమీదనో కాక వర్తమాన జీవితంలోని బాగోగుల మీద మాత్రమే ఆధారపడి ఉండడమే లౌకికవాదం అని నిఘంటువు నిర్వచిస్తుంది. ఆ నిర్వచనాన్ని కూడా ఇంకా విస్తరించవలసి ఉంది. కాని ఆ తర్వాత విస్తరించిన సోషలిస్టు, సామ్యవాద ఆలోచనలు

లౌకిక భావన గురించి పూర్తి స్థాయిలో చర్చ జరగకుండా అడ్డుపడ్డాయని నాకనిపిస్తుంది.

ఇక లౌకికవాదాన్ని భారత సమాజ నేపథ్యంలో ఏ విధంగా అర్థం చేసుకోవాలనే విషయంలో చాలా పెద్ద చర్చ జరిగింది. జరుగుతున్నది. దేశంలో లౌకికవాదం గురించి రెండు పెద్ద తప్పుడు వాదనలు మన ఆలోచనలను అడ్డుకుంటున్నాయి. 'లౌకికవాదమనే దాన్ని మనసు లోలోపలి నుంచి నమ్మడం, మనిషి తన లోపల అంతర్లీనం చేసుకోవడం సాధ్యం కాదు. అదే సమస్య. అందువల్లనే లౌకికవాదాన్ని నిజంగా అమలు చేయడం సాధ్యంకాదు' అని ఒక వాదన చెబుతుంది. అట్లాగే లౌకికవాదమంటే అన్ని మతాలనూ సమానంగా చూడడం అనే తప్పుడు నిర్వచనం కూడా మన దగ్గర చాలా కాలంగా రాజ్యమేలుతోంది.

నిర్వచనంలోనే ఈ గందరగోళం ఉండగా, రాజకీయవాదులు, మేధావులు, సామాజిక శాస్త్రవేత్తలు మన దేశంలో లౌకికవాదం గురించి చాలా చర్చ చేశారు. సుప్రీంకోర్టులోనూ, వివిధ రాష్ట్రాల హైకోర్టులలోనూ ఎందరో న్యాయమూర్తులు ఆ భావనను వివరించడానికి, విశ్లేషించడానికి ప్రయత్నించారు. లౌకిక భావన భారత రాజ్యాంగపు మౌలిక ప్రాతిపదికలలో ఒకటి అవునా కాదా అని ఎన్నో న్యాయస్థానాల తీర్పులలో చర్చ జరిగింది. సుప్రీంకోర్టు 1962లో సర్దార్ తాహెరుద్దీన్ సయద్నా సాహెబ్ వర్సస్ స్టేట్ ఆఫ్ బొంబాయి కేసులో ఇచ్చిన తీర్పులోనూ, 1973లో కేశవానంద భారతి వర్సస్ స్టేట్ ఆఫ్ కేరళ కేసులో ఇచ్చిన తీర్పులోనూ లౌకికవాదం భారత రాజ్యాంగపు మౌలిక నిర్మాణంలో భాగమేనని చెప్పింది. ఆ తర్వాత కూడా అనేక కేసుల తీర్పులలో ఈ వైఖరి అటూ ఇటూ జరిగిన తర్వాత, ఎస్ ఆర్ బొమ్మై వర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో 1994లో సుప్రీంకోర్టు ఇచ్చిన నిర్వచనం ఎట్లా అర్థం చేసుకోవాలో స్పష్టం చేసింది. లౌకికవాదం అనే దానిలో మన రాజ్యాంగ ప్రవేశికలో ప్రకటించుకున్న ఆదర్శాలన్నీ కలిసి ఉన్నాయని ఆ తీర్పు చెప్పింది. అస్పృశ్యతను, నిర్బంధ చాకిరీని, బాల కార్మిక వ్యవస్థను రద్దు చేస్తామని రాసుకున్న అధికరణం కూడా భారత దేశపు లౌకిక వాదంలో భాగమే అవుతుందని ఆ తీర్పు చెప్పింది. ఆ నిర్వచనం రామ జన్మభూమి-అయోధ్య వివాద సందర్భంలో తయారయింది.

'ఇప్పుడు లౌకికవాదాన్ని భారతదేశంలో మాత్రమే కాదు, అంతర్జాతీయంగానే కొత్తగా నిర్వచించుకోవలసి ఉంది. ప్రపంచ వ్యాప్తంగా జాతికల్లోలాలు, ఘర్షణలు జరుగుతున్నాయి. గనుక, అంతర్జాతీయ సంస్థలు ఒక ఒడంబడికను తయారు చేసుకోవలసి ఉంది. బహుళ సమాజాలున్న రాజ్యాలలోపల లౌకికవాద ప్రత్యేకత గురించి ఒక అంతర్జాతీయ ఒడంబడిక తయారు చేసుకోవలసి ఉన్నది.

నరేంద్ర మోడీ, తదితరులు తమ హిందుత్వను వ్యాపింపచేసే పథకంలో భాగంగా చేస్తున్న నేరాలను అరికట్టడానికి ఏం చేయవలసి ఉంది? అటువంటి భారీ స్థాయి

సాంఘిక హింసపట్ల ఎలా వ్యవహరించాలో మన దేశంలోని న్యాయస్థానాలకు తెలియదు. మన దేశంలో చట్టం, న్యాయస్థానాలు మొత్తం న్యాయవిచారణాక్రమాన్ని ఒక ఆటలాగ మార్చివేశాయి. నిందితులైనా, ఫిర్యాదుదారులయినా అసలు సంబంధితులు, బాధితులు ఆ ఆటలో ప్రధాన ఆటగాళ్లు కాదు, ఆ ఆట ఆడేదెవరయ్యా అంటే న్యాయవాదులు మాత్రమే. వాళ్లు పెద్ద పెద్ద మొత్తాలకు జూదమాడుతారు. నిజానికి ఈ న్యాయవ్యవస్థ పోషకులు ఈ వృత్తి పరవర్గంలో విజయం సాధించిన వాళ్లు మాత్రమే. అంటే విపరీతంగా డబ్బులు చేసుకున్న వాళ్లు మాత్రమే. ఇంకో మాటలో చెప్పాలంటే న్యాయ వ్యవస్థను ఏ లక్ష్యంతో సృష్టించడం జరిగిందో ఆ లక్ష్యానికి సంపూర్ణంగా తూట్లు పొడవడం కూడా జరిగింది. దాన్ని ఒక వ్యక్తిగత ఆస్తిగా, సంస్థానంగా మార్చివేయడం జరిగింది.

నేరాలను నమోదు చేసే దగ్గరి నుంచి ఈ క్రమం మొదలవుతుంది. నేరాన్ని నమోదు చేయడంలో మొట్టమొదటి మౌలికమైన, ముఖ్యమైన పత్రం ప్రాథమిక సమాచార నివేదిక - ఎఫ్ ఐ ఆర్‌గా అందరికీ తెలిసిన ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు. ప్రభుత్వ పోలీసు శాఖకు ఆ నేరాలతో భాగస్వామ్యం ఉంది కనుక ఆ ఎఫ్ ఐ ఆర్‌లు తయారు చేయడంలోనే తప్పులు, వక్రీకరణలు జరుగుతాయి. ఇక ఆ తర్వాత న్యాయమైన, సరైన పరిశోధన జరుగుతుందని ఎవరైనా హామీ ఇవ్వగలరా?

గుజరాత్‌లో జరిగిన నేరాల విషయానికి వస్తే, అసలు ఎఫ్ ఐ ఆర్‌ల తయారీలోనే వక్రీకరణలు జరిగాయని, కనుక ఒక ప్రత్యేక పరిశోధనా బృందం ఏదైనా మానవ హక్కుల చట్టం రక్షణ కింద స్వతంత్రంగా పని చేసి, కొత్తగా పరిశోధన జరిపి, కొత్తగా చార్జిషీట్లు దాఖలు చేయవలసి ఉంటుందని జాతీయ మానవహక్కుల కమిషన్ వంటి సంస్థ ఆదేశించగలుగుతుందా?

గుజరాత్‌లోని ముస్లింలకు మన దయాజాలీ అవసరం లేదు. వాళ్లకు కావలసింది న్యాయం. రాజ్యాంగ ప్రవేశికలో చెప్పిన అన్ని కోణాలలోనూ న్యాయం వాళ్లకు కావాలి. అది వాళ్ల హక్కు. వాళ్లకు కావలసింది మన ధర్మమో, నష్టపరిహారాలో కాదు. వాళ్లకు కావలసింది మొట్టమొదటి రాజకీయ న్యాయం. అంటే నేరస్తులను చట్టబద్ధంగా విచారణ జరపడం. అది మాత్రమే వాళ్ల గౌరవాన్ని కాపాడుతుంది. వాళ్లకు ఈ వ్యవస్థలో విశ్వాసాన్ని కలగజేస్తుంది. ఒక అల్ప సంఖ్యాకవర్గంగా వ్యక్తిగతంగానూ, సామూహికంగానూ తమ హక్కులకు పరిరక్షణ ఉన్నదని వాళ్లలో నమ్మకాన్ని పెంచుతుంది.

న్యాయాన్ని నిజంగా సజీవంగా ఉంచడమంటే చట్టంపట్ల లాంఛన ప్రాయమైన గౌరవం ఉంచడం కాదు. చట్టక్రమాన్ని మొక్కుబడిగా పాటించడం కాదు. రాజ్యాంగ యంత్రపు అన్ని నిర్మాణాలలోనూ రాజకీయ, సామాజిక, ఆర్థిక న్యాయం కొనసాగుతుందని రాజ్యాంగంలోని ఒక అధికరణం చెబుతుంది. లౌకిక ప్రజాస్వామ్యం కొరకు మనం జరిపే ప్రచారం, పోరాటం ఈ అధికరణం నుంచే ప్రారంభం కావాలని నేననుకుంటాను.

* * *

# దళితుల రాజ్యం - న్యాయ వ్యవస్థ

నరేంద్ర మోడీ నాయకత్వంలో గుజరాత్‌లో పెచ్చరిల్లిన హిందుత్వ హింసా ప్రయోగాల గురించి ఇక్కడ ఆపేసి, ఇక దళితులపట్ల ఈ రాజ్యం, న్యాయవ్యవస్థ వ్యవహరిస్తున్న తీరు గురించి మాట్లాడాలనుకుంటున్నాను. ఈ వ్యవహారంలో కూడా న్యాయవాద వృత్తిలోనూ, పౌరహక్కుల ఉద్యమంలోనూ నా అనుభవం సుదీర్ఘమైనది. ఒక రకంగా విషాదభరితమైనది. దళితుల పట్ల చట్టం ఎంత నిర్లిప్తంగా ఉంటుందో, దళితుల మీద అత్యాచారాలకూ, అవమానాలకూ, హింసకూ పాల్పడే అగ్రవర్ణాల వ్యక్తులు, పెత్తందార్లు ఎంత నిర్భీతితో చట్టాన్ని ఉల్లంఘిస్తారో, అయినా న్యాయవ్యవస్థ ఆ నేరస్తులను ఎట్లా చూసీ చూడనట్టు వదిలేస్తుందో నా అనుభవం నుంచి వందలాది కథలు చెప్పగలను.

మొదట మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన ఒక సంఘటన దగ్గర ప్రారంభిస్తాను.

మహబూబ్ నగర్ జిల్లా కొడంగల్ తాలూకాలో ఒక చిన్న గ్రామం గుండుమల్. అది హైదరాబాద్ నుంచి 147 కిలోమీటర్లు. మహబూబ్‌నగర్ నుంచి 57కిలోమీటర్లు ఉంటుంది. దళితులను వేరుగా ఉంచడం, వారి పట్ల అస్పృశ్యతను పాటించడం అనేది మన ప్రభుత్వ విధానాలలో కూడా విడదీయరాని భాగమైన సంగతి అందరికీ తెలుసు. అందుకే దళితులకు ఇళ్లు కట్టించి ఇవ్వడానికి ప్రభుత్వం భూమి సేకరించినప్పుడు కూడా ఊరవతలనే సేకరిస్తుంది. వారికి అక్కడే ఇళ్లు కట్టించి ఇచ్చి ఊరికీ వారికీ దూరాన్ని యథాతథంగా కొనసాగిస్తుంది. గుండుమల్‌లో కూడా అదే జరిగింది.

గుండుమల్‌లో ఊరికి దూరంగా అరకిలో మీటరు అవతల ఒకపాత కోట శిథిలాల మధ్య మాల, మాదిగల గుడిసెలున్నాయి. ఆ ఊళ్లో పదిహేను ఛాయ్, టిఫిన్లు అమ్మే హోటళ్ల లాంటివి ఉన్నాయి. వాటిలో ఒకే ఒక్కటి ఒక ముస్లింది కాగా మిగిలిన పద్నాలుగు హిందువులవే. ఆ హోటళ్లన్నిటిలోనూ దళితులకు గ్లాసులు, పళ్లాలు వేరుగా ఉంటాయి. అక్కడ దళితులు ఏదన్నా తినాలన్నా, ఛాయ్ తాగాలన్నా తమ పళ్లాన్నో, గ్లాసునో తామే తీసుకుని తినడమో, తాగడమో అయిపోయిన తర్వాత అవి కడిగి అక్కడే వేరుగా పెట్టాలి.

1984 మే 8న సోలాపురపు వెంకటయ్య, బొర్ర బాలప్ప, బొర్ర ఆశప్ప అనే ముగ్గురు దళితులు మరొక ఇద్దరు స్నేహితులతో కలిసి గ్రామంలోకి వెళ్లి ఒక హోటల్లో ఛాయి అడిగారు. వేరే కప్పులు తీసుకుంటే పోస్తామని హోటల్ యజమాని చెబితే వాళ్లు అందుకు నిరాకరించారు. ఊళ్లో అందరికీ పోసినట్టే తమకూ పోయాలని, తాము వేరే కప్పుల్లో తాగమని అన్నారు. ఆ ఒక్క హోటల్‌లోనే కాక ఏ హోటల్‌లోనూ వారి కోరిక

సాగలేదు. చివరికి ఆ ఐదుగురూ ముస్లిం హోటల్‌కు వచ్చారు. అక్కడ కూడా వాళ్లకు వేరే గ్లాసుల్లోనే ఛాయి ఇస్తామన్నారు. కాకపోతే ఆ హోటల్ యజమాని హాషిం దళితులు పందిని తింటారు గనుక వారికి వేరే గ్లాసుల్లో ఇస్తామన్నాడు.

ఇక ఆ ఐదుగురు దళితులు అక్కడి నుంచి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోస్గి పోలీసుస్టేషన్‌కు వెళ్లారు. హాషింకు, మరొక ఐదుగురు హోటల్ యజమానులకు వ్యతిరేకంగా పోలీసుస్టేషన్‌లో ఒక ఫిర్యాదు ఇచ్చారు. ఆ ఆరుగురూ అస్పృశ్యతను పాటిస్తున్నారని, అది పౌరహక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం బెయిల్ ఇవ్వడానికి వీలు లేని నేరమని ఫిర్యాదు చేశారు.

మర్నాడు విచారణ జరపడానికి కోస్గి పోలీసు స్టేషన్ సబ్‌ఇన్‌స్పెక్టర్, హెడ్ కానిస్టేబుల్ కలిసి ఒక మోటార్ సైకిల్ మీద గ్రామానికి వచ్చారు. హాషిం నడిపే హోటల్‌లో రెండు గ్లాసుల పద్ధతి ఉందని వాళ్లు గుర్తించారు. దళితుల కోసం విడిగా పెట్టిన పాత్రలను జప్తు చేశారు. హాషింను, అతని తమ్ముడిని, మరొక నలుగురిని కూడా వాళ్లు అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి తాముస్వాధీనం చేసుకున్న వస్తువుల పంచనామా రాసేందుకు గ్రామ పంచాయతీ కార్యాలయానికి బయల్దేరారు.

నిమిషాల్లోనే ఐదువందల మంది గ్రామస్తుల గుంపు ఆ ఇద్దరు పోలీసు అధికారులను చుట్టుముటింది. దళితులు తమ గ్రామస్తులకు వ్యతిరేకంగా ఇచ్చిన ఫిర్యాదును తమకు వెనక్కి ఇచ్చేయాలని ఆ గుంపు పోలీసు అధికారులను కోరింది. ఈ లోగా మరికొందరు గ్రామస్తులు ఆ పోలీసులు వచ్చిన మోటారు సైకిల్ చక్రాల నుంచి గాలి తీసేశారు. ఈ పరాభవంతో ఆ పోలీసు అధికారులిద్దరూ వెంటనే తమ పోలీసు స్టేషన్‌కు తిరిగి వచ్చారు. తాము అదుపులోకి తీసుకున్న వారిని గ్రామంలోనే వదిలివేశారు. ఇక్కడ చెప్పుకోవలసిన విషయమేమంటే ఆ సబిన్‌స్పెక్టర్ కూడా దళిత కులానికి చెందిన వ్యక్తే.

ఆ మరుసటి రోజు నారాయణపేటకు చెందిన డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు తనతోపాటు తహసీల్దారునూ, ఆ సబిన్‌స్పెక్టర్‌నూ తీసుకుని గ్రామానికి వెళ్లాడు. అస్పృశ్యతను పాటించడం నేరమని, రెండు గ్లాసుల పద్ధతిని వదిలివెయ్యాలని గ్రామస్తులకు నచ్చజెప్పడానికి ఆ అధికారులు ప్రయత్నించారు. అంటే వాళ్లు అక్కడ చట్టాన్ని స్థాపించేబదులు గ్రామస్తులను బతిమిలాడడానికి ప్రయత్నించారన్నమాట. గ్రామస్తులు మాత్రం తమకు చట్టం అంటే, అధికారం అంటే లెక్క లేదని, తాము అస్పృశ్యతను పాటిస్తూనే ఉంటామని మొండికేశారు. పోలీసు అధికారులు చిట్టచివరికి ఆ ఆరుగురినీ అరెస్టు చేసి కోస్గి పోలీసుస్టేషన్‌కు తీసుకు వెళ్లగలిగారు గాని ఆ నిందితులందరినీ ఆ సాయంత్రానికే వదిలేశారు.

ఆ దళిత యువకులు తమ ఊళ్లో హోటల్ నడిపే ముస్లిం హాషింకు వ్యతిరేకంగా మాత్రమే ఫిర్యాదు చేశారు గాని దళితులపట్ల వివక్ష ఆ ఊళ్లో ఉన్న 15 హోటళ్లలోనూ

అమలవుతోంది. ఆ రోజు దళిత యువకులు అన్ని హోటళ్లలోనూ అదే అనుభవం ఎదుర్కొన్నారు. అయినా హిందువులు నడిపే హోటళ్లన్నిటినీ మినహాయించి ముస్లిం మీద మాత్రమే ఫిర్యాదు ఇచ్చారంటే, ఆ మాదిరిగా చేయడం ద్వారా తమ ఫిర్యాదుకు హిందువుల నుంచి మద్దతు అందుతుందనే భ్రమ కారణం కావచ్చు. కాని తదనంతర పరిణామాలు వాళ్లు ఆశించినట్టు జరగలేదు.

ఆ ఊరి సర్పంచ్ ఇందిరా కాంగ్రెస్‌కు చెందిన పెద్ద భూస్వామి గోపాల్‌రెడ్డి. ఈ సంఘటనలు జరగగానే ఆయన ఊరి వారందరినీ సమావేశపరిచాడు. ఇటువంటి పనులు చేసినందుకుగాను, అంటే తమ మీద అస్పృశ్యత అమలైతే మౌనంగా అంగీకరించకుండా పోలీసులకు ఫిర్యాదు చేసి, ఊరివాళ్లను అరెస్టు చేయించినందుకుగాను, దళితులను ఊరి నుంచి వెలివేయాలని, దళితుల పట్ల సంఘ బహిష్కారం విధించాలని ఆ సమావేశంలో నిర్ణయించారు. దళితులకు ఏ సరుకులూ అమ్మగూడదని నిషేధం విధించారు. దళితులకు ఎవరూ ఎటువంటి పనులూ చేయగూడదని కట్టడి చేశారు. డబ్బులు తీసుకుని అయినా సరే దళితులకు ఏ పనీ చేయకూడదని అందరినీ నిర్బంధించారు. చివరికి దళితులకు బీడీలు, కల్లు వంటివి కూడా అమ్మగూడదని ఆంక్షలు విధించారు. ఈ విధిని నిషేధాలను ఉల్లంఘించిన వారికి రు.500 జరిమానా విధింపబడుతుందని తీర్మానించారు. ఈ ఆంక్షలు ఫలితంగా దళితులు తమ నిత్యావసర వస్తువులు కొనుక్కోవడానికి 12 కిలోమీటర్ల దూరంలోని కోస్గికి వెళ్లవలసి వచ్చింది.

ఆ గ్రామస్తులకు వారం వారం జరిగే సంత చాలా ముఖ్యమైనవి. ఆ సంత ప్రతి శుక్రవారం జరుగుతుంది. ఆ వారం కూడా మే 11న సంత జరిగే రోజు. సర్పంచ్ విధించిన ఆంక్షలు పూర్తి స్థాయిలో అమలవుతున్నాయి. ఆరోజు దళితవాడలో ఐదు పెళ్లిళ్లు జరుగుతున్నాయి. ఆ పెళ్లిళ్లకు రవికలు, చొక్కాలు, ప్యాంట్లు కుట్టడానికి ఊళ్లో దర్జీకి అంతకు ముందు బట్ట ఇవ్వడం జరిగింది. ఆ పెళ్లిళ్ల మంగళసూత్రాలు తయారు చేయడానికి ఊళ్లోని కంసాలీలకు అంతకుముందే బంగారం ఇవ్వడం జరిగింది. సర్పంచి ఆజ్ఞతో దర్జీ ఆ కత్తిరించిన బట్టను అట్లాగే దళితులకు తిరిగి ఇచ్చేశాడు. కంసాలి నగలు చేయకుండానే బంగారం వాపస్ చేశాడు. పెళ్లికి వచ్చిన అతిథులకు భోజనం పెట్టడానికి ఊళ్లో విస్తరాకులు, అరటి ఆకులు కూడా దొరకకుండా చేశారు. గ్రామంలోని బస్సుస్టాండులో దళితులు, వారి బంధువులు బస్సులు కూడా ఎక్కడానికి వీల్లేదని కట్టడి చేశారు. చివరికి దళితులు గ్రామంలోకి ప్రవేశించడానికి వీలులేదని ఆంక్షలు పెట్టారు.

ఆ బహిష్కార శిక్షను ధిక్కరిస్తే తమ మీద భౌతిక దాడులు జరుగుతాయని దళితులు భయపడ్డారు. మామూలుగా జరిగే మాదిరిగానే నుంచీ ఏ సహాయము అందలేదు. జిల్లా స్థాయిలో ప్రభుత్వ యంత్రాంగం వారికి ఎటువైపు నుంచీ ఏ సహాయం అందలేదు. జిల్లా స్థాయిలో ప్రభుత్వ యంత్రాంగం వారికి ఎటువంటి ఉపశమనం కల్పించలేక పోయింది. పౌరహక్కుల పరిరక్షణా చట్టం 1955 నిబంధనల కింద దళితుల న్యాయమైన

హక్కులను కాపాడటంలో జిల్లా ప్రభుత్వ యంత్రాంగం చాలా మందకొడిగా వ్యవహరించింది. విఫలమైంది.

కొద్ది నెలల ముందే అదే జిల్లాలో బాలానగర్ దగ్గర చింతగూడెంలో మరింత హింసాత్మకమైన సంఘటన జరిగింది. అక్కడ భూస్వామి, అతని గుండాలు దళితులను వాళ్ల భూముల నుండి వెళ్లగొట్టారు. వాళ్ల మీద దాడి చేసి తరిమేశారు. నిజానికి ఆ భూములను ఆ భూస్వామి తండ్రే రెండు దశాబ్దాల కింద భూదానంగా దళితులకు ఇచ్చాడు.కాని ఆ భూమి దళితుల స్వాధీనంలోకి రావడానికి ప్రభుత్వ స్థాయిలో సుదీర్ఘ పోరాటం చేయాల్సి వచ్చింది. ఈ పోరాటం తర్వాతనే దళితులకు ఆ భూమి మీద అధికారాన్ని ఖరారు చేస్తూ ప్రభుత్వ పత్రాలు అందాయి. ఈ దాడి .జరగగానే పత్రాలు అందాయి. ఈ దాడి జరగగానే దళితులు తమ భూమి కోల్పోవడం మాత్రమే కాదు. గ్రామంలోని దళితులందరినీ పోలీసులునిర్బంధంలోకి కూడా తీసుకున్నారు. ఆ గ్రామంలోని భూస్వామి, అతని మనుషులు తక్కువ సంఖ్యలో ఉన్నారు. గనుక వారికి రక్షణ కల్పించడం కోసం దళితులను నిర్బంధించిక తప్పలేదని సబ్ ఇన్స్పెక్టర్ సమర్థించుకున్నాడు.

మరి, సుదీర్ఘ కాలం కిందనే రాజ్యాంగంలో డాక్టర్ అంబేద్కర్ అధికరణం 17ను ప్రతిపాదించినప్పుడు 'మహాత్మాగాంధీకి జై' అనే నినాదాల మధ్య అందరూ ఆ అధికరణాన్ని ఆమోదించారు. 'అధికరణం 17తో, అస్పృశ్యత రద్దవుతుంది. ఏ రూపంలో దాన్ని ఆచరించడమైనా నిషిద్ధం. అస్పృశ్యత నుంచి తలెత్తే ఏ అవకాశాల నిరాకరణ అయినా చట్టబద్ధంగా శిక్షార్హమైన నేరం, అని ఆ అధికరణ చెప్తుంది. రాజ్యాంగ నిర్ణయసభలో షెడ్యూల్డు కులాలకు చెందిన సభ్యులు ఈ అధికరణాన్ని చారిత్రాత్మకమైనదిగా అభివర్ణించి స్వాగతించారు. ఒక పెద్ద సామాజిక అనాచారాన్ని ఈ అధికరణం రద్దు చేస్తుందని వాళ్లు భావించారు. రాజ్యాంగంలోని ఆ అధికరణం 17 మాత్రమే కాదు. దాని కన్నా ముందే అధికరణం 15(2) ఉంది.

అధికరణం 15 పుట్టుకతో వచ్చిన మతం, జాతి, కులం లింగం ప్రాంతం ప్రాతిపదిక మీద ఏ ఒక్క పౌరుడిపట్ల వివక్ష చూపగూడదని చెబుతుంది. అందులో రెండో నిబంధన ప్రత్యేకంగా 'మతం, జాతి, కులం, లింగం పుట్టిన ప్రాంతం వంటి ప్రాతిపదికలతో ఏ ఒక్క దాని మీదనైనా ఆధారపడి ఏ పౌరుడినీ ఎటువంటి నిరాకరణకు, ఇబ్బందికి, అంక్షకు నిర్బంధానికి గురి చేయగూడదు' అని చెబుతూ సందర్భాలను కూడా వివరించింది. అవి.

దుకాణాలు, బహిరంగ భోజన, పానీయశాలలు, బహిరంగ వినోద స్థలాల్లో ప్రవేశాన్ని నిరాకరించడం.

పూర్తిగాగాని, పాక్షికంగాగాని ప్రభుత్వ నిధులతో నిర్వహించబడుతున్న లేదా సాధారణ

ప్రజానీకపు అవసరాల కోసం నిర్దేశించిన బావులను, చెరువులను స్నానవాటికలను, రహదారులను, ప్రజా విశ్రాంతి స్థలాలను వాడుకోవడాన్ని నిరాకరించడం.

ఈ రాజ్యాంగ అధికరణాలు మాత్రమే కాదు. 1955 నుంచి పౌర హక్కుల పరిరక్షణా చట్టం (ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ యాక్ట్) కూడా మన చట్టాల్లో చేరింది. ఈ చట్టం ప్రతిపాదించిన శిక్షలు మరీ తీవ్రమైనవి కానప్పటికీ, అస్పృశ్యతను అరికట్టే ఉద్దేశ్యంతో ఆ చట్టం ప్రభుత్వ యంత్రాంగానికి విస్తృతమైన అధికారాలను ఇచ్చింది. ఇటువంటి కేసుల్లో న్యాయమైన విచారణ జరగడానికి వీలుగా సాక్ష్యాధారాల చట్టంలో ఒక ప్రత్యేక నిబంధనను చేర్చడం కూడా జరిగింది. అంటే సాధారణమైన పద్ధతిలో నిందితుడు నేరం చేశాడని ప్రాసిక్యూషన్ రుజువు చేయడానికి బదులుగా, నిందితుడు నేరం చేసే ఉంటాడని నమ్మే నిబంధనను చేర్చడం జరిగింది. అంటే సాధారణమైన పద్ధతిలో నిందితుడు నేరం చేశాడని ప్రాసిక్యూషన్ రుజువు చేయడానికి బదులుగా, నిందితుడు నేరం చేసే ఉంటాడని నమ్మే నిబంధనను చేర్చడం జరిగింది. తాను నేరం చేయలేదని రుజువు చేసుకోవాల్సిన బాధ్యతను నిందితుడి మీదనే పెట్టడం జరిగింది. ఒక వేళ గ్రామస్థులు మూకుమ్మడిగా అస్పృశ్యతా నేరం పాటించారని తేలితే మొత్తం గ్రామం మీదనే సామూహిక జరిమానా విధించే అధికారాన్ని ప్రభుత్వం సంతరించుకుంది.

ఐనా దళితుల మీద హింసాకాండ పెరిగిపోతూనే ఉంది. చివరకు దళితుల విద్యా ఉద్యోగావకాశాల కొరకు కల్పించిన రిజర్వేషన్ పద్ధతి మీద కూడా నిరసనలు మొదలయ్యాయి. ప్రభుత్వోద్యోగాల అవకాశాలు విపరీతంగా తగ్గిపోవడంతో భయంకరైన పోటీ ప్రవేశించి, తమకు అవకాశాలు.

దక్కకపోవడానికి కింది కులాలకు కల్పించిన రిజర్వేషన్లే కారణమనే అపోహలు అగ్రవర్ణాలలో పెరిగాయి. ఈ అభిప్రాయాన్ని ఎన్నో రాజకీయ పార్టీలు పెంచి పోషిస్తున్నాయి. తమ ప్రయోజనాల కొరకు వాడుకుంటున్నాయి. అగ్రవర్ణ భూస్వాములకు, దళిత శ్రామికులకు మధ్య తలెత్తుతున్న ఆర్థిక సమస్యలన్నిటినీ కూడా భూస్వాములు 'కుల సమస్యలు'గా మార్చి దారుణమైన హింసాత్మకమైన నిర్బంధకాండకు తలపడుతున్నారు. ఈ సమస్యలను కులసమస్యలుగా చూస్తున్న ఇతర పీడిత వర్గాలు కూడా పీడిత దళితులతో చేతులు కలపడంలో విఫలమవుతున్నారు.

దళితులపై ఈ విధంగా పెచ్చురిల్లుతున్న హింసను పరిగణనలోకి తీసుకున్న పార్లమెంటు 1989లో షెడ్యూల్డ కులాల, షెడ్యూల్డ్ తెగల (అత్యాచారాల నిరోధక) చట్టాన్ని ఆమోదించింది. ఈ చట్టం దళితుల మీద, ఆదివాసుల మీద జరిగే అత్యాచారాలను ప్రత్యేక నేరాలుగా గుర్తించింది. అందువల్ల ఆ నేరాలను విచారించే అధికారాన్ని ప్రత్యేక న్యాయస్థానాలకు అప్పగించింది.

మన సమాజంలో ఎటువంటి అనాచారాలు అమలవుతున్నాయో, ఏ అనాచారాలను

పార్లమెంటు తన దృష్టిలోకి తీసుకుందో, ఈ చట్టం ప్రకారం నేరాలుగా ఎటువంటి అనాచారాల జాబితా తయారు చేసిందో తెలుసుకోవడానికి ఎవరైనా ఈ చట్టం చూసి తీరాలి. ఈ చట్టంలో 'అత్యాచారం' అనే మాటకు ఏ నిర్వచనం ఇచ్చారో చాలా తక్కువ మందికి తెలిసి ఉంటుంది. మన సమాజంలో దళితులు, ఆదివాసులు నిత్యం ఎటువంటి అవమానాలకు గురవుతన్నారో ఎవరూ కనీ వినీ ఉండరు. అందువల్లనే ఈ చట్టం అటువంటి అనాచారాలనూ అవమానాలనూ నిరాకరణలనూ దాడులనూ 'అత్యాచారాలు'గా గుర్తించింది.

అయితే సాధారణంగా దళితుల వ్యవహారానికి వచ్చేసరికి చాలా మంది దయాధర్మంగా, కరుణతో ప్రవర్తిస్తుంటారు గాని సంస్కరణ దృష్టితోనే, సవరించే దృష్టితోనో కాదు. మరి ఈ వ్యవహారాలలో సంఘసంస్కర్తలు కూడా విఫలమైనచోట, మాట్లాడే ప్రతిమాటనూ చేతల్లో చూపకపోతే రాజ్యాంగం కూడా విజయం సాధించలేకపోవచ్చు.

షెడ్యూల్డ కులాల, షెడ్యూల్డ్ తెగల (అత్యాచారాల నిరోధ) చట్టం 1989లోని సెక్షన్ 3 మొత్తం 32 రకాల అత్యాచారాల ఇచ్చి వాటన్నిటినీ శిక్షార్హమైన నేరాలుగా ప్రకటించింది. ఈ జాబితాను మనం సవివరంగా, జాగ్రత్తగా చదివితేగాని, ఎందువల్ల డా. అంబేద్కర్ హిందూమత వ్యవస్థ నుంచి బయటికి వెళ్లిపోవాలని కోరుకున్నాడో అర్థం చేసుకోలేం. ఎందువల్ల దళితులు అగ్రవర్ణ ప్రవర్తనను ఒక అంతర్జాతీయ సమస్యగా మార్చాలని, తమ మీద జరిగే వివక్షను, హింసను జాతివివక్షతో సమానంగా చూడాలని కోరుకుంటున్నారో అర్థం చేసుకోలేం.

ఈ నేరాల - అత్యాచారాల - జాబితా ఎవరి ఊహాసృష్టీ కాదు. అది పూర్తిగా, దృఢంగా ప్రస్తుతం దేశంలో కొనసాగుతున్న ఆచారాల మీద ఆధారపడింది మాత్రమే. అవి ఏమిటో ఒకసారి చూద్దాం.

1. షెడ్యూల్డ్ కులానికి, తెగకు చెందిన వ్యక్తిచేత తాగడానికి తినడానికి వీలులేని, విషపూరితమైన పదార్థాన్ని బలవంతంగా తాగించడం, తినిపించడం.
2. షెడ్యూల్డ్ కులానికి, తెగకు చెందిన వారిని గాయపరిచే, అవమానించే, భయపెట్టే ఉద్దేశ్యంతో ఆ వ్యక్తి ఆవరణలోగాని, పరిసరాల్లోగాని మలాన్ని, చెత్తను, మృతకళేబరాలను, ఇతర అసహ్యకర పదార్థాలను పడవేయడం.
3. వంటి మీది దుస్తులను బలవంతంగా ఊడలాగి వారిని నగ్నంగా గాని, ముఖం మీద, వంటి మీద రంగులు పూసిగాని వీధుల్లో నడిపించడం, లేదా మానవ గౌరవానికి అవమానకరమైన అటువంటి పని ఏదయినా చేయడం.
4. షెడ్యూల్డ్ కులానికి, తెగకు చెందిన వారి సొంత భూముల్లోగాని, వారికి కేటాయించబడిన భూముల్లోగాని, నిర్ణీత అధికారి చేత వారికి అప్పగించబడిన భూముల్లోగాని బలవంతాన ఆక్రమించుకుని తిష్టవేయడం, సాగుచేయడం, లేదా ఆ భూమిని

తమ పేరు మీదికి బలవంతాన బదిలీ చేయించుకోవడం.

5. షెడ్యూల్డ్ కులానికి, తెగకు చెందిన వారిని వారి భూమి నుంచి గాని, ఇంటి నుంచి గాని బలవంతంగా వెళ్లగొట్టడం, లేదా వారికి ఆ భూమిని అవసరము, వీటిని అనుభవించేందుకు ఉన్న అధికారంలో జోక్యం చేసుకోవడం.

6. షెడ్యూల్డ్ కులాలకు గాని షెడ్యూల్డ్ తెగలకుగాని చెందిన వ్యక్తిని బిచ్చం ఎత్తుకునేందుకు, లేదా అటువంటి నిర్బంధ కట్టుబానిస శ్రమ రూపాలకు నిర్బంధించడం, ప్రోత్సహించడం, ప్రజా అవసరాల కొరకు ప్రభుత్వం విధించే నిర్బంధ సేవలు ఈ పరిధిలోకి రావు.

7. షెడ్యూల్డ్ కులాలకుగాని షెడ్యూల్డ్ తెగలకు గాని చెందిన వ్యక్తిని వోటు వెయ్యకుండా, లేదా ఒక ప్రత్యేక అభ్యర్థికే వోటు వేసేలా, లేదా చట్టం నిర్దేశించిన పద్ధతిలో కాక మరొక విధంగా వోటు వేసేలా బలవంతపెట్టడం, బెదిరించడం.

8. షెడ్యూల్డ్ కులాలకు గాని షెడ్యూల్డ్ తెగలకుగాని చెందిన వ్యక్తికి వ్యతిరేకంగా తప్పుడు, దురుద్దేశపూరితమైన, ఇబ్బందిపెట్టే వ్యాజ్యాలు నడపడం, నేరారోపణలతో లేదా ఇతరంగా న్యాయపరమైన విచారణలు జరపడం.

9. ఒక ప్రభుత్వోద్యోగికి తప్పుడు సమాచారం ఇచ్చిగాని, నిరర్ధకమైన సమాచారం ఇచ్చిగాని ఆ సమాచారం ద్వారా ఆ ప్రభుత్వోద్యోగి తన చట్టబద్ధమైన అధికారాన్ని ఉపయోగించి షెడ్యూల్డ్ కులాలకుగాని షెడ్యూల్డ్ తెగలకు గాని చెందిన వ్యక్తిని గాయపరిచేటట్టు, భయపెట్టేటట్లు చేయడం.

10. షెడ్యూల్డ్ కులాలకుగాని షెడ్యూల్డ్ తెగలకుగాని చెందిన వ్యక్తిని బహిరంగ స్థలంలో, ప్రజలందరూ చూస్తుండగా ఉద్దేశ్యపూర్వకంగా, అవమానించడం, లేదా అవమానించే ఉద్దేశ్యంతో బెదిరించడం.

11. షెడ్యూల్డ్ కులాలకుగాని షెడ్యూల్డ్ తెగలకుగాని చెందిన మహిళపై అవమానించే, లేదా ఆమె మర్యాదను భంగపరిచే ఉద్దేశ్యంతో దాడి చేయడం లేదా బలప్రయోగం చేయడం.

12. షెడ్యూల్డ్ కులాలకుగాని షెడ్యూల్డ్ తెగలకు గాని చెందిన మహిళపై అధికారం చెలాయించగలిగిన స్థానంలో ఉండి, ఆ స్థానంలో లేకపోతే ఆమె అందుకు అంగీకరించని పరిస్థితి ఉన్నప్పుడు, ఆ స్థానాన్ని ఉపయోగించుకని ఆమెపై లైంగికంగా అత్యాచారం చేయడం.

13. షెడ్యూల్డ్ కులాలకుగాని షెడ్యూల్డ్ తెగలకుగాని చెందిన వ్యక్తులు సాధారణంగా వినియోగించుకునే ఊట లేదా జలాశయం లేదా ఇతర నీటి వనరులను వారు సాధారణంగా వాడుకునేందుకు వీలు లేని విధంగా చెడగొట్టడం, అసహ్యకరమైన పదార్థాలు కలపడం.

14. ఒక బహిరంగ ప్రజా వినోద స్థలానికి వెళ్లేగారిని షెడ్యూల్డ్ కులాలకు గాని షెడ్యూల్డ్

తెగలకుగాని చెందిన వ్యక్తికి నిరాకరించడం. లేదా ఇతర ప్రజలు ఎవరైనా వాడుకోవడానికి అవకాశం ఉన్న స్థలానికి వెళ్లకుండా షెడ్యూల్డ్ కులాలకుగాని షెడ్యూల్డ్ తెగలకుగాని చెందిన వ్యక్తిని అడ్డుకోవడం.

15. షెడ్యూల్డ్ కులాలకుగాని షెడ్యూల్డ్ తెగలకు గాని చెందిన వ్యక్తిని తన ఇంటి నుంచి లేదా గ్రామం నుంచి లేదా నివాసస్థలం నుంచి బలవంతాన వెళ్లిపోయేలా చేయడం.

ఈ నేరాలన్నీ ఆరు నెలలకు తక్కువ కాకుండా ఐదు సంవత్సరాల వరకు జైలు శిక్ష, దానితోపాటు జరిమానా విధించగలిగిన నేరాలుగా చట్టం ప్రకటించింది.

పై నేరాలతో పాటు చట్టం మరికొన్ని నేరాలను కూడా గుర్తించింది. అవి

1. తాను చెప్పే సాక్ష్యంవల్ల షెడ్యూల్డ్ కులాలకుగాని, షెడ్యూల్డ్ తెగలకుగాని చెందిన వ్యక్తికి మరణశిక్ష పడాలనే ఉద్దేశ్యంతో, శిక్ష పడవచ్చునని తెలిసి కూడా అటువంటి తప్పుడు సాక్ష్యం ఇవ్వడం, తయారు చేయడం గనుక చేస్తే ఆ నేరానికి యావజ్జీవ శిక్ష, జరిమానా విధించవచ్చు. అటువంటి తప్పుడు సాక్ష్యంవల్ల షెడ్యూల్డ్ కులాలకుగాని షెడ్యూల్డ్ తెగలకు గాని చెందిన వ్యక్తికి శిక్షపడి ఉన్నట్లయితే అటువంటి తప్పుడు సాక్ష్యం ఇచ్చిన నేరస్తుడికి మరణశిక్ష విధించవచ్చు.
2. తాను చెప్పే సాక్ష్యంవల్ల షెడ్యూల్డ్ కులాలకుగాని షెడ్యూల్డ్ తెగలకుగాని చెందిన వ్యక్తికి మరణశిక్ష కాకపోయినా, ఏడు సంవత్సరాలుగాని, అంతకన్నా ఎక్కువగాని శిక్షపడాలనే ఉద్దేశ్యంతో, శిక్షపడవచ్చునని తెలిసి కూడా అటువంటి తప్పుడు సాక్ష్యం ఇవ్వడం, తయారు చేయడం గనుక చేస్తే ఆ నేరానికి ఆరు నెలలకు తక్కువకాకుండా, ఏడు సంవత్సరాలు గాని అంతకన్నా ఎక్కువగాని జైలు శిక్ష, జరిమానా విధించవచ్చు.
3. తాను నిప్పుతోగాని, ఇతర పేలుడు పదార్థాలతోగాని చేసిన దుశ్చర్యవల్ల షెడ్యూల్డ్ కులాలకుగాని షెడ్యూల్డ్ తెగలకుగాని చెందిన వ్యక్తి ఆస్తికి ప్రమాదం జరుగుతుందని తెలిసి ఆ పని చేసిన వ్యక్తికి ఆరునెలలకు తక్కువ కాకుండా, ఏడు సంవత్సరాల జైలుశిక్ష, జరిమానా విధించవచ్చు.
4. తాను నిప్పుతోగాని, ఇతర పేలుడు పదార్థాలతోగాని చేసిన దుశ్చర్యవల్ల షెడ్యూల్డ్ కులాలకుగాని షెడ్యూల్డ్ తెగలకు గాని చెందిన వ్యక్తికి చెందిన ప్రార్థనాస్థలంగాని, నివాసస్థలంగాని, ఆస్తిగాని ధ్వంసమైపోతుందని తెలిసి కూడా ఆ పని చేసిన వ్యక్తికి యావజ్జీవ కారాగార శిక్ష, దానితోపాటు జరిమానా విధించవచ్చు.
5. అవతలి వ్యక్తి షెడ్యూల్డ్ కులాలకుగాని షెడ్యూల్డ్ తెగలకుగాని చెందిన వ్యక్తి అని తెలిసి ఉండి లేదా ఒక ఆస్తి షెడ్యూల్డ్ కులాలకు గాని షెడ్యూల్డ్ తెగలకు గాని చెందిన వ్యక్తిదని తెలిసి ఉండి ఆ వ్యక్తికి, ఆ ఆస్తికి వ్యతిరేకంగా భారత శిక్షాస్మృతిలో ప్రకటించిన నేరం ఏదైనా చేసినట్టయితే దానికి యావజ్జీవ కారాగార శిక్ష దానితోపాటు జరిమానా విధించవచ్చు.

6. ఈ చట్టంలో ప్రకటించిన నేరాలు జరిగాయని తెలిసి కూడా, నమ్మే అవకాశం ఉన్నప్పుడు కూడా ఆ నేరస్తుడిని చట్టపరమైన శిక్ష నుంచి తప్పించే ఉద్దేశ్యంతో ఆ నేరం జరిగిందని చెప్పడానికి ఉన్న ఆధారాలను మాయం చేయడం, లేదా ఆ నేరం జరగలేదనే తప్పుడు సమాచారం ఇవ్వడం వంటి వాటికి ఆ నేరాలకు ఉన్నంత శిక్షనే విధించవచ్చు.

7. ప్రభుత్వోద్యోగి అయి ఉండి ఈ చట్టం కింద చెప్పబడిన నేరం ఏదయినా చేస్తే ఒక సంవత్సరం కన్నా తక్కువ కాకుండా ఆ నేరానికి ఇవ్వగల గరిష్ట శిక్ష వరకూ శిక్ష విధించవచ్చు.

పార్లమెంటు గుర్తించిన ఈ అత్యాచారాలన్నీ కూడా షెడ్యూల్డ్ కులాలకు లేదా షెడ్యూల్డ్ తెగలకు సంబంధించిన వ్యక్తుల మీద జరిగినప్పుడు మాత్రమే. ఈ చట్టంలోనే మొట్టమొదటిసారిగా 'అత్యాచారం' అనే దాన్ని ఒక చట్టపరమైన అంశంగా గుర్తించి నిర్వచించడం జరిగింది.

ఈ చట్టాన్ని త్వరితగతిన న్యాయం అందించడం కొరకు ఉద్దేశించారు. ఇక్కడ త్వరితగతి అనేది అటువంటి నేరాలు మళ్లీ మళ్లీ జరగకుండా హెచ్చరికగా ఉపయోగపడాలని ఆశించారు. కాని ఈ చట్టాన్ని నేరుగా ధిక్కరించనవసరం లేకుండానే ఈ చట్టపరిధి నుంచి తప్పించుకోవడం, తద్వారా చట్టాన్ని ఓడించడం చాలా సులభమైపోయింది. అంతేకాదు కొన్ని సందర్భాలలో నేరస్తుల మీద వ్యాజ్యాలు కొట్టివేసి వారిని నిర్దోషులుగా విడుదల చేయడం ద్వారా దళితుల మీద అత్యాచారాలకు సాధికారత కూడా దొరికింది. అంటే న్యాయస్థానాలలో జరిగిన వ్యాఖ్యాన వ్యాయామాలు ఈ ప్రత్యేక చట్టాన్ని ఓడించడానికి పనికొచ్చాయి. ఈ చట్టం కింద నేరాలను ఒక ప్రత్యేక న్యాయస్థానం మాత్రమే విచారించాలని, ఆ న్యాయస్థానానికి ఒకసెషన్స్ న్యాయమూర్తి నేతృత్వం వహించాలని చట్టం చెబుతుంది. రాజ్యాంగంలోని అధికరణం 21ని అనుసరించి త్వరితగతి విచారణ కొరకు ప్రత్యేక న్యాయస్థానాలను ఏర్పాటు చేయడం జరిగింది. కాని ఈ నిబంధనను సర్వోన్నత న్యాయస్థానం ఏమని వ్యాఖ్యానించిందంటే, మిగిలిన అన్ని క్రిమినల్ నేరాలలాగనే దళితులకు వ్యతిరేకంగా జరిగే నేరాలు కూడా మొదట ఒక మెజిస్ట్రేటు ముందు విచారణకు వచ్చి అక్కడ నుంచి సెషన్స్‌కు బదిలీ కావాలి. అంటే 1989 చట్టం ఇప్పుడు కేవలం మన చట్టాల పుస్తకంలో చేరింది. త్వరలోనే అది నిరుపయోగమైపోతుంది. అమెరికాలో లాగ ప్రత్యేకాభిప్రాయాలున్న న్యాయమూర్తుల అవసరం లేకుండానే ఇదంతా జరిగిపోయింది.

ఇదిలా ఉండగా సమర్థులైన అటార్నీ జనరల్‌లు అంతర్జాతీయ సంస్థల ముందు మన చట్టాలు, ప్రత్యేక రాష్ట్రపతి కమిషన్లను రూపొందించడానికి వీలు ఉన్న రాజ్యాంగ నిబంధనలు చూపి మన దేశంలో దళితుల స్థితి ఇతర దేశాలలోని జాతి వివక్షతో

సమానమైనది కాదని చెబుతారు.

ప్రతి ఒక్కరూ ఏదో ఒక కులంలోనే పుట్టకతప్పని మన దేశంలో కులంవల్ల వచ్చే నిరాదరణను వదుల్చుకోవడం సాధ్యం కాదు. ఒక అగ్రవర్ణ వ్యక్తి మరొక మతంలోకి మారినప్పటికీ అతను తన పాత మతంలో తనకన్నా తక్కువ స్థాయిలో ఉన్న కులంపైన తాను నెరపే ఆధిపత్యాన్ని వదులుకోవడానికి సిద్ధపడదు. అంబేద్కర్ చెప్పినట్లుగా ఇక్కడ మనం వ్యవహరిస్తున్నది వంశపారంపర్యమైన అస్పృశ్యతతో దళితులు ఒక ప్రత్యేక జాతిలక్షణాలు కలిగి లేనప్పటికీ, షెడ్యూల్డ్ కులాలను నిర్వహించిన రాజ్యాంగ అధికరణాలు 341, 366 కూడా కులాన్నీ జాతినీ సమానార్థకాలుగా వాడాయి. వాటిలో ఏ ఒక్కటిగాని, రెండూ గాని షెడ్యూల్డ్ కులాల జాబితాలో చేరడానికి తగినవన్నట్టుగా ప్రస్తావించాయి.

దళిత అస్తిత్వాన్ని కులాచారాలే నిర్ణయిస్తాయి. వారి అంటు సోకి అగ్రవర్ణాలవారు మైలపడకుండా వారి వాడలను ఊరికి దూరంగా ఉంచుతారు. వారు ఊరికి సమానం కాదని, ఊరి కన్నా తక్కువ స్థితిలో ఉండాలని వారికి గుర్తు చేసేందుకే ఈ ఏర్పాటు. ఈ ఆధిపత్య సంస్కృతి ప్రతి ఒక్కరికీ తెలిసేలా బహిరంగంగానే ఉంది. కులం, జాతి అనే వాటి విషయంలో న్యాయపరమైన, సామాజిక శాస్త్రపరమైన వివరణలకూ ఈ చర్చకూ సంబంధం లేదు. ఇక్కడ గుర్తించవలసిందల్లా వివక్ష, తత్సంబంధిత అసహిష్ణుత మాత్రమే.

నిజానికి, 1936 షెడ్యూల్డ్ కులాల జాబితాలో చేర్చిన కులాలను అల్పసంఖ్యాక వర్గాలుగా (మైనారిటీలుగా) ప్రకటించాలని అంబేద్కర్ కోరారు. ఈ బృందానికి మైనారిటీకి ఉండే లక్షణాలన్నీ ఉన్నాయని ఆయన చూపారు. మైనారిటీగా గుర్తించబడమంటే దళితులను హిందూ శిబిరం నుంచి బయటికి తీసుకువచ్చి వారికి ఒక ప్రత్యేక, గుర్తించదగిన బృందం స్థాయిని ఇవ్వడమేనని, అందువల్ల వారిని మైనారిటీగా గుర్తించాలని అంబేద్కర్ చాలా ప్రయత్నించారు.

నల్లవాళ్ల స్థితి గురించి ప్రఖ్యాత ఆఫ్రికన్ - అమెరికన్ రచయిత జేమ్స్ బాల్డ్విన్ ఇచ్చిన వివరణ భారతదేశంలోని అస్పృశ్యులకు సరిగ్గా సరిపోతుంది.

'మీరు ఎక్కడో ఒక చోట పుట్టారు. ఏదో ఒక భవిష్యత్తును పొందారు. ఆ పుట్టుక, ఆ భవిష్యత్తు కేవలం మీరు నల్లవాళ్లయి నందువల్లనే మాత్రమేగాని మరేకారణంవల్ల కాదు. అంటే మీ ఆశల పరిమితి శాశ్వతంగా నిర్ధారణ అయిపోయింది. మీరు ఒక నిరర్థకమైన మానవజీవి అని మీరు పుట్టిన సమాజం వీలయినన్ని విధాలుగా పాశవికమైన స్పష్టతతో ప్రకటించింది. మీరు ప్రతిభా సామర్థ్యాలను సాధించడానికి వీలులేదు. మీరు సాదాసీదా జీవితం గడపడానికి సిద్ధపడాలి'.

సరిగ్గా మన కులవ్యవస్థ కూడా అస్పృశ్యులకు చెప్పేదిదే. బానిసలను అమెరికా సంయుక్త రాష్ట్రాలకు తీసుకుపోయినది వారికి ప్రజాస్వామ్యం ఇవ్వడానికి కాదు. భారత దేశంలో కూడా రాజ్యాంగంలో బ్రహ్మాండమైన వాగాడంబర ప్రకటనలు ఉన్నప్పటికీ

పుట్టుక, వంశపారంపర్యం అనేవే ప్రధానాంశాలు. ఈ 16 కోట్ల సమూహాన్ని గుర్తించడం కష్టమేమీ కాదు. అసలు వారిని గుర్తించడం సమస్యే కాదు. నల్లవాళ్లు తమకు కేటాయించబడిన బానిస స్థితి నుంచి పైకి ఎదగడానికి ప్రయత్నిస్తే వారిపట్ల జాతి వివక్ష అమలవుతుంది. వాళ్లూ దళితులూ కూడా పొలాల్లో పని చేయడానికి, నీచమైన వృత్తులు చేయడానికి అవసరం. తమకు ఇవ్వబడిన పనులు సక్రమంగా చేయడానికి వారికి ప్రత్యేక నివేశన స్థలాలు కల్పిస్తారు. వారిని అదృశ్యంగా ఉంచుతారు. ప్రతి సమాజంలోనూ ఈ మాదిరిగా వివక్షకూ హింసకూ గురి చేయబడుతున్న సమూహాలున్నాయి. అటువంటి సమూహాన్ని కొనసాగించడం వంశపారంపర్యం ద్వారా మాత్రమే సాధ్యం. ఇక్కడ ప్రధానమైనది అధికారం అనేదేగాని, కులానికి ఇవ్వగల సామాజిక శాస్త్ర నిర్వచనం లేదా వివరణ జాతి నిర్వచనంతో సరిపోతుందా లేదా అని కాదు.

* * *

# అసంబద్ధ వాదన

మానవ హక్కులనూ, గౌరవాన్నీ భంగపరుస్తూ మన దేశంలో అమలవుతున్న దుర్మార్గమైన, మూఢాచారభరితమైన అలవాట్లను బైటి దేశాల వాళ్లు, అంతర్జాతీయ సంస్థలు పరిశీలించానికి వస్తామన్నప్పుడు అడ్డుకోవడానికి భారత ప్రభుత్వం సార్వభౌమాధికారం అనేవాదనను తీసుకొస్తుంది. ఆ వాదన చాలా అసంబద్ధం. అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటన తర్వాత మానవ హక్కుల ఉల్లంఘన అనే దాన్ని దాని అన్ని ప్రత్యేక రూపాలలోనూ అధ్యయనం చేయాలి. వేర్వేరు సమాజాలలో అది ఎట్లా వ్యక్తమవుతుందో చూడాలి. తమ తమ దేశాల లోపల కొనసాగుతున్న అధికార సంబంధాలు అస్తవ్యస్తమవుతాయనే కారణంతో సభ్యదేశాలు తమ దేశాలలోపల అటువంటి మానవ హక్కుల ఉల్లంఘనలను రద్దు చేయడానికి ప్రయత్నించడం లేదు. ఆ తప్పులను అంతర్జాతీయ సమాజం ఎత్తి చూపడానికి కూడా ఆయా దేశాల ప్రభుత్వాలు సమ్మతించడం లేదు. భారతదేశంలో కులవ్యవస్థ కూడా అటువంటిదే. అది వంశపారంపర్య అస్పృశ్యతకు దారి తీస్తున్నది. దానివల్ల తలెత్తుతున్న హేతురహిత, హింసాపూరిత అనాచారాలను అంతర్జాతీయ నేర విచారణా న్యాయస్థానం రోమ్ ప్రకటన ప్రకారం మానవజాతికి వ్యతిరేకమైన నేరాలుగా గుర్తించవలసి ఉంది.

మన హిందూ సంప్రదాయాలకు, లౌకిక రాజ్యాంగ ఆదర్శాలకు మధ్య ఉన్న వైరుధ్యానికి మన సమాజం చెల్లించవలసి వచ్చిన మూల్యం మొదటి నుంచీ కూడా చాలా ఎక్కువగానే ఉంది. చాలా హింసాత్మకంగా కూడా ఉంది. ఈ వైరుధ్యాలను రాజ్యాంగబద్ధమైన పద్ధతుల ద్వారా పరిష్కరించడం సాధ్యమవుతుందనే నమ్మకం

కోల్పోయేంత హింసాత్మకంగా ఉంది. శతాబ్దాల తరబడిగా కొనసాగుతున్న హిందూ వర్ణవివక్ష పద్ధతిని రాజ్యాంగబద్ధమైన పద్ధతుల ద్వారా రద్దు చేయాలంటే దానికి ఒక నిరంతరాయమైన ప్రచార కార్యక్రమం కావాలి. బహుశా ఒక సాంస్కృతిక విప్లవం కావాలి.

మనం సమానత్వాన్ని సరళరేఖలాగ నిర్వచించలేదు. లాంఛనంగా నిర్వచించలేదు. దాన్ని మనం సామాజిక అసమానతను, నిరాకరణను రద్దు చేసేదిగా, హోదాలో సమానతను ప్రసాదించేదిగా చూశాం. సమాన ప్రతిపత్తి హక్కుకు, సమానంగా గుర్తించబడే హక్కుకు తేడాను చూడాలని హక్కుల సిద్ధాంతకర్త రొనాల్డ్ డ్వోర్కిన్ అన్నారు. మొదటి హక్కు అంటే మానవ ప్రతిపత్తి హక్కు ఒక మనిషికి ఒక వోటు అనే దాని ద్వారా వ్యక్తమవుతుంది. రెండో హక్కులో, అంటే మనిషిగా సమానంగా చూడబడే హక్కులో సామాజిక, ఆర్థిక సారాంశం ఉంది. ఇతర అన్ని సమూహాలకు దక్కినట్టుగానే షెడ్యూల్డ్ కులాలకు కూడా వోటు వేసే హక్కు వచ్చింది. రాజ్యాంగం ఉనికిలోకి వచ్చే వరకు దళితుల పౌరహక్కులకు గుర్తింపు కూడా లేదు. అంటే అప్పటి వరకు వారు మనుషులు గానే గుర్తింపు పొందలేదన్నమాట.

తరతరాలుగా హిందూ వర్ణ వివక్ష పద్ధతి అమలు కావడం వల్ల వారు పొందిన సామాజిక నిరాదరణ, దాని ఫలితంగా వచ్చిన ఆర్థిక నిరాదరణల నేపథ్యంలో వారిని సమానులుగా చూడడం అనే హక్కు చాలా ముఖ్యమైనదవుతుంది. ఆ హక్కు చాలా సంక్లిష్ట కోణాల్ని సంతరించుకుంటుంది. ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి, సమానులుగా చూడబడే హక్కును ఇవ్వడానికి రాజ్యాంగ అధికరణం 17 అస్పృశ్యతను ఒక శిక్షార్హమైన నేరంగా ప్రకటించి నిషేధించింది. ఇక నుంచి కుల వ్యవస్థలోని ఈ అస్పృశ్యత వంటి అనాచారాలు ఎంత మాత్రం ఉండగూడదని నిర్ద్వంద్వంగా ప్రకటించింది. నేను ఇది వరకే చెప్పినట్టు ఈ అధికరణాన్ని ఆమోదించినప్పుడు రాజ్యాంగ నిర్ణయసభ గాంధీ మహాత్మా కీ జై అనే నినాదాలతో మార్మోగిపోయింది. బహుశా ఆ ముసలాయనకు మనం ఇచ్చిన చివరి నివాళి అదేనేమో.

కాని కుల కట్టుబాట్లు అంత తొందరగా సమసిపోవు. అస్పృశ్యత అనే తప్పుడు ఆచారాన్నిరద్దు చేయడానికి 1955లో పార్లమెంటు పౌర హక్కుల పరిరక్షణా చట్టాన్ని ఆమోదించింది. అంటే దళితులు మనుషులే అని వారికి మనుషుల హోదాను కల్పిస్తూ చట్టబద్ధంగా గుర్తించడం జరిగిందన్నమాట. అంతకు ముందే అస్పృశ్యత నేరమని రాజ్యాంగమే స్వయంగా ప్రకటించడం ఎటువంటి ఫలితాన్ని సాధించలేదు. దళితులు ఇంకా మనుషులు కాకుండానే ఉండిపోయారు. దళితులు మనుషులే అని రాజ్యాంగం గుర్తించిన ఐదు సంవత్సరాల తర్వాత కూడా వారు తాము మనుషులుగా గుర్తింపు పొందడానికి ఎదురు చూస్తూనే ఉండవలసి వచ్చింది.

భారతదేశంలో ప్రతి ఒక్కరికి అంటరానితనం అంటే ఏమిటో తెలుసు. అందువల్ల ఆ 1995 చట్టం ఆ మాటను నిర్వచించవలసిన అవసరం లేకపోయింది. కాని అస్పృశ్యత పేరు మీద అమలయ్యే దారుణమైన అలవాట్లు ఏవేవో ఆ చట్టం నమోదు చేసి వాటిని శిక్షార్హమైన నేరాలుగా ప్రకటించింది. ఆ శిక్షలు అంత పెద్దవి కాకపోయినా ఆ శిక్షలు ఉండడమే హెచ్చరికగా పనిచేసి కాలక్రమంలో ఆ సామాజిక అలవాట్లలో మార్పులు తీసుకు రావడానికి ఉపయోగపడతాయని భావించారు. భారతీయులు వాదనాపరులు మాత్రమే కాదు, విసుగెత్తించేంతగా కుతర్కాలలో, వాద వివాదాలలో గడపగలరు. అందుకే అస్పృశ్యతను నిర్వచించలేదనే సాకును వాడుకుని పెద్ద చర్చలు, వివాదాలు జరిగాయి.

చండాలుల మధ్యనే స్పష్టమైన తేడా ఉన్నదని జాతి చండాలులు వేరనీ, కర్మచండాలులు వేరనీ చర్చ జరిగింది. జాతి చండాలులంటే పుట్టుకతో చండాలులుగా పుట్టిన వారనీ, కర్మచండాలులంటే తమ ప్రవర్తన చేత, పనుల చేత చండాలులు అయిన వారనీ వాదనలు జరిగాయి. ఈ రెండు రకాల మధ్య రాజ్యాంగం గాని, 1955 చట్టంగాని తేడా చూడలేదు గనుక అది అస్పష్టంగా మారిపోయిందనీ అందువల్ల 1955 చట్టాన్ని కొట్టివేయాలనీ వాదనలు జరిగాయి. ఈ ఆశ్చర్యకరమైన దుర్మార్గ వాదన ఒరిస్సాలో ఒక వ్యాజ్యంలో (ఆలిండియా రిపోర్టర్ 1961 ఒరిస్సా 33) మొదలైంది. ఈ కూట వ్యాఖ్యానాన్ని న్యాయమూర్తి తిరస్కరించారు. న్యాయస్థానంలో ఓడిపోయినప్పటికీ తమ దుర్మార్గ విలువల కోసం పోరాడడానికి హిందువులు ఎటువంటి పద్ధతులు ఉపయోగిస్తారో మనకు ఈ వాదనతో తేటతెల్లమవుతుంది.

1955 చట్టం పౌరహక్కులు అనే మాట నిర్వచించలేదనే మాట నిజమే. కాని రాజ్యాంగ అధికరణం 17 ప్రకారం అంటరానితనం రద్దయిన తర్వాత ఆ కారణంగా ఒక మనిషికి ఒనగూరే హక్కులన్నీ, ఏ హక్కయినా పౌరహక్కే అని అది నిర్వచించింది. మరి ఈ పౌరహక్కులంటే ఏమిటి? ఒక్కమాటలో చెప్పాలంటే అవి ప్రతి మనిషికీ ఉండే హక్కులు. గ్రామంలోని బావిలో నీళ్లు వాడుకునే హక్కు గ్రామంలోని పాఠశాలలో ప్రవేశించే హక్కు ఊరి చెరువును, హోటళ్లను, ఆహార పానీయాలు అమ్మేచోట్లను, ప్రజావినోదం కొరకు ఏర్పాటైన చోట్లను వాడుకునే హక్కు. ఈ హక్కులన్నిటినీ అధికరణం 15 (2)లో, 17లో పొందుపరచడం జరిగింది. అయితే ఆలయాలలో ప్రవేశించే హక్కును వీటిలో భాగం చేయలేదు. కాని ఏదైనా ఒక ఆలయంలోకి కాని, ప్రజాస్వభావం ఉన్న మరేదయినా సంస్థలోకి గాని షెడ్యూల్డ్ కులాల వ్యక్తులను ప్రవేశించనివ్వడానికి చర్యలు తీసుకుని వారి హక్కును గుర్తించవచ్చునని ప్రభుత్వానికి అధికారం ఇచ్చారు.

ఈ మాదిరిగా పౌరహక్కుల చట్టంలో ప్రవేశపెట్టిన చర్చలతోపాటుగా రాజ్యాంగంలో ప్రతిపాదించిన సమానత్వ ప్రాతిపదికతో విద్యలో, ఉద్యోగాలలో రిజర్వేషన్‌కు వీలు

కల్పించారు. షెడ్యూల్డ్ కులాలకు ఇతర కులాలతో సమానస్థితిని సాధించేందుకు అధికరణం 15,16లలో వీలు కల్పించారు. వారికి ఇతరులతో సమానంలో చూడబడే హక్కును కల్పించేందుకు జరిగిన కొన్ని ప్రాథమిక చర్యలివి. హిందూ తాత్విక దృక్పథపు విశిష్టత అయిన ఉదాత్తమైన ఆశయాలు, అద్భుతమైన ప్రవచనాలు హిందూ అనాచారాలలో ఇవాళ్టికి కూడా ఎటువంటి మార్పూ తేలేకపోయాయి. నిజం చెప్పాలంటే కాలం చెల్లిపోయాయనుకుంటున్న మూఢాచారాలెన్నో ఇవాళ మళ్లీ పునరుద్ధరించబడుతున్నాయి. అవి ఇంకా ఎక్కువ హింసతో, పాశవికమైన శక్తితో పునరుద్ధరింపబడుతున్నాయి.

ఇవాళ ముందుకొస్తున్న అన్ని వాదనలు రాజ్యాంగ నిర్ణయ సభ చర్చల నాటికే ఉన్నాయి. వాటన్నిటినీ చర్చించిన తర్వాతనే రాజ్యాంగ నిర్ణయసభలో అస్పృశ్యత గురించి, బాల కార్మికుల గురించి, వెట్టి చాకిరీ గురించి, కట్టుబానిసత్వం గురించి రాజ్యాంగ ఏకాభిప్రాయం కుదిరింది. అప్పుడే అవన్నీ నేరాలని రాజ్యాంగం గుర్తించింది. విద్య, ఉద్యోగం అర్థవంతమైనవిగా ఉండాలంటే విద్యావకాశాలను, ఉద్యోగావకాశాలను అందరికీ సమానంగా అందుబాటులోకి తేవాలంటే రిజర్వేషన్లు కల్పించవలసిందేనని రాజ్యాంగ నిర్ణయసభ ఆమోదించింది. ఆ విధంగా 1950లో ఏకాభిప్రాయంతో ఉనికిలోకి వచ్చిన రాజ్యాంగ ఆదర్శాల మీద ప్రస్తుతం ఎడతెగని దాడి జరుగుతున్నది. రాజ్యాంగం ఏమి చెప్పినా, శాసన నిర్మాణ సంస్థలు ఏమిచెప్పినా, ఆ ఆదర్శాలను ఎట్లా అర్థం చేసుకోవాలో న్యాయస్థానాలు చెబుతాయి. రాజ్యాంగాన్ని వ్యాఖ్యానించడంలో న్యాయస్థానాలకు సహకరించే న్యాయవాదుల సహాయంతో న్యాయస్థానాలు ఆ వివరణనిస్తాయి.

దళితులకు, వెనుకబడిన కులాలకు విద్యలో, ఉద్యోగాలలో రిజర్వేషన్ కల్పించడమంటే అగ్రవర్ణాలకు దొరికే విద్యావకాశాలు, ఉద్యోగావకాశాలు తగ్గిపోవడమన్న మాటే. అలా తమ అవకాశాలు తగ్గిపోవడమనేది అగ్రవర్ణాలకు చరిత్ర పొడవునా ఎన్నడూ జరగలేదు. బహిరంగ ప్రజాజీవితంలో అవకాశాలను వాడుకోవడంలో అగ్రవర్ణాలు ఇంతకాలమూ నిరాటంకమైన సామ్రాజ్యాన్ని అనుభవించారు. చరిత్రలో మొదటిసారిగా, స్వాతంత్ర్యానంతరం, రాజ్యాంగం ఉనికిలోకి వచ్చిన తర్వాత వారికి ఈ అవకాశాలలో కోత మొదలైంది. వాళ్లు అంత వరకూ రాజకీయ సమానత్వం గురించి మాత్రమే అర్థం చేసుకున్నారు గాని మొత్తం హిందూ సమాజానికి పుట్టిన కులం అనే రాచపుండును తొలగించవలసి వస్తుందనీ, సమాజమే ఇంతగా మౌలిక సామాజిక పునర్నిర్మాణానికి గురి కావలసి వస్తుందనీ వాళ్లెరగరు. ఒకసారి రాజకీయ అధికారం చేతికందిన తర్వాత ఈ ఉపఖండంలోనే నివసిస్తున్న ఇతర కులాలతో దాన్ని పంచుకోవాలంటే కష్టం ఉంటుంది.

అగ్రవర్ణ విద్యావంతులు, మేధావులు ఒక వాదన పదే పదే చేస్తుంటారు. కులాల

అంతరాల వ్యవస్థలో అట్టడుగున ఉన్న వాళ్లు చారిత్రికంగా పొందిన అన్యాయాలకు తమను బాధ్యులను చేస్తే ఎట్లా అని ఆక్రోశిస్తుంటారు. తమ పూర్వీకులు చేసిన అన్యాయాలకు తమ మీద శిక్ష విధిస్తే ఎట్లా అని వాళ్లు అడుగుతుంటారు. ఆ చారిత్రక తప్పిదాలు తమ ప్రస్తుత జీవితాలను ఇబ్బంది పెట్టకూడదని వాళ్లంటారు. సమానత్వ సూత్రంపై రూపొందిన రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా వాళ్ల వాదనలోని ప్రధానాంశం ఇది. దళితులు పొందిన చారిత్రక అవమానాల గురించి వాళ్లకు కలిగిన ఈ అవగాహన వాళ్లలో ఏ చైతన్యాన్నీ నింపదు. వాళ్లు పాటిస్తున్న కాలంచెల్లిన కుల మూఢాచారాలలో మార్పులు చేసుకోవడం అవసరమని వాళ్లకు అనిపించదు. ఇంత కాలమూ ఏ అడ్డంకులూ లేకుండా తాము అనుభవిస్తూ వచ్చిన అవకాశాలను యథాతథంగా కొనసాగించాలనే కోరికతో మాత్రమే వాళ్లు ఈ వాదనలు పెడుతున్నాయి.

ఆశ్చర్యకరంగా ఇటువంటి వాదనలు చేసేవాళ్లు అవే వాదనలను ముస్లింలకు కూడా వర్తింపచేయాలని మాత్రం అనుకోరు. ముస్లింలు చేసిన అన్యాయాలకు మాత్రం ప్రతీకారం తీర్చుకోవలసిందే. సోమనాథ్ విషయంలో, బాబ్రీ మసీదు విషయంలో ముస్లిం దురాక్రమణదారులు ఎప్పుడో వందల ఏళ్లకింద చేసిన దాడులకు మాత్రం ఇప్పుడు ప్రతీకారం తీర్చుకోవాలని ద్వేషాన్ని రెచ్చగొడుతారు. ముస్లిం మైనారిటీ ప్రజానీకం మీద కోపావేశాలను రెచ్చగొట్టి ఆ తర్వాత జాతిహనన మారణకాండలు జరుపుతారు. ఒక పక్కనేమో దళితులు, వెనుకబడిన కులాలు కులవ్యవస్థవల్ల తరతరాలుగా గురి అయిన చారిత్రక అన్యాయాలకు తాము బాధ్యత వహించవలసి ఉంటుందనే విషయాన్ని అంగీకరించని అగ్రవర్ణాలు, మరొక పక్కనేమో మొఘల్ పాలకులు చేశారని, చారిత్రక అన్యాయాలకు మాత్రం ఇవాళ్టి ముస్లింలను బాధ్యులను చేసి శిక్షించాలని మూర్ఖంగా వాదిస్తారు.

రాజకీయాధికారాన్ని చేపట్టడానికన్నా ముందే సామాజిక పునర్నిర్మాణం జరగాలని డా. అంబేద్కర్ భావించారు. నిజానికి ఆయన కుల నిర్మూలన పుస్తకం ఆ అవగాహనతోనే ప్రారంభమవుతుంది. పందొమ్మిదో శతాబ్దం చివరిలో భారత జాతీయ కాంగ్రెస్ లోపల జరిగిన చర్చను ఆయన ప్రస్తావిస్తారు. మొదట మనం సంఘ సంస్కరణలను చేపట్టాలా, మొదట రాజకీయాధికారాన్ని చేపట్టే పోరాటం చేసి ఆ తర్వాత సాంఘిక సంస్కరణలను అమలు చేయాలా అని ఆ చర్చ జరిగింది. నిజానికి 1895 దాకా కాంగ్రెస్ సాంఘిక పునర్నిర్మాణం మీదనే ఎక్కువ దృష్టి పెట్టింది. రాజకీయాధికారంలో బ్రిటిషర్ల దగ్గరినుంచి కొంత కోటా కోసం ప్రయత్నించాలని మాత్రమే అనుకుంది. అధ్యక్షుడుగా ఉమేష్ చంద్ర బెనర్జీ వచ్చిన తర్వాత, అంటే 1895లో, కాంగ్రెస్ తన ప్రాధాన్యతగల జాబితాలోంచి సామాజిక పునర్నిర్మాణాన్ని తొలగించింది. రాజ్యాంగ రచన పూర్తయిన తర్వాత, రాజ్యాంగాన్ని ఆమోదించిన సమావేశంలో ఉపన్యసిస్తూ డా. అంబేద్కర్ ఈ సామాజిక

పునర్నిర్మాణ అంశంపై మళ్లీ దృష్టి మరల్చారు.

రాజ్యాంగ రచన పూర్తయిన తర్వాత రాజ్యాంగ నిర్ణయసభలో డా. అంబేద్కర్ చేసిన ఉపన్యాసం చూడండి.

"1950 జనవరి 26న రాజ్యాంగాన్ని ఆమోదించడంతో మనం ఒక వైరుధ్యమయమైన జీవితంలోకి ప్రవేశించబోతున్నాం. ఇప్పటి నుంచి మనం రాజకీయాలలో సమానత్వాన్ని సాధిస్తాం. కాని సామాజిక ఆర్థిక జీవనంలో అసమానత కొనసాగుతూనే ఉంటుంది. రాజకీయాలలో మనం ఒక మనిషికి ఒక వోటు అనే సూత్రాన్ని గుర్తించబోతున్నాం. ప్రతి ఒక్క వోటుకూ సమానమైన విలువనే ఇవ్వబోతున్నాం. కాని కొనసాగుతున్న సామాజిక ఆర్థిక వ్యవస్థవల్ల సామాజిక ఆర్థిక జీవనంలో మాత్రం మనుషులందరికీ సమాన విలువ అనే సూత్రాన్ని నిరాకరించబోతున్నాం. ఆ వైరుధ్య మయమైన జీవితాన్ని మనం ఎంత కాలం కొనసాగించగలం? మన సామాజిక ఆర్థిక జీవితంలో సమానత్వాన్ని నిరాకరించే పని మనం ఎంతకాలం కొనసాగించగలం? మనం గనుక దీన్ని మరింత ఎక్కువ కాలం కొనసాగిస్తే మన రాజకీయ ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుంది. వీలయినంత త్వరలోనే మనం ఈ వైరుధ్యాన్ని తొలగించవలసి ఉంది. ఒక వేళ అలా తొలగించలేకపోయినట్టయితే అసమానతతో నలిగిపోతున్న వాళ్లు ఈ రాజ్యాంగ నిర్ణయసభ ఎంతో శ్రమకోర్చి నిర్మించిన ఈ మన రాజకీయ ప్రజాస్వామ్య సౌధాన్ని బద్దలు కొడతారు" అన్నారు. డా. అంబేద్కర్.

ఆ రాజ్యాంగం ఉనికిలోకి వచ్చిన ఆరు దశాబ్దాల తర్వాత కూడా స్వాతంత్ర్యోద్యమ సమయాన మన దగ్గర ఉండిన సామాజిక వ్యవస్థ యథాతథంగా ఉన్నది. రాజ్యాంగం ఎటువంటి సామాజిక మార్పునూ సాధించలేకపోయింది. అంటరానితనాన్ని స్వయంగా రాజ్యాంగమే శిక్షార్హమైన నేరంగా ప్రకటించినప్పటికీ ఆ అనాచారం ఇవాళ్టికి కూడా అమలులోనే ఉంది. కులవ్యవస్థలోని అట్టడుగు అంతస్తులలో కొనసాగుతున్న దురాచారాలు చాలా ఆందోళనకరంగా ఉన్నాయి.

మహబూబ్‌నగర్ జిల్లాలో ఉనికిలో ఉన్న కుల మూఢాచారాల విషయంలో మూడు దశాబ్దాల కింద ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం పరిశోధన జరిపింది. ఆ పరిశోధనలలో స్పష్టంగా బయటపడినదేమంటే ఆ జిల్లాలో అంటరానితనం వంటి దురాచారాలు బహిరంగంగా అమలులో ఉన్నాయి. అక్కడ గ్రామాలలో చిన్న ఛాయి అంగళ్లలో మిగిలిన కులాల వారు వాడుకునే గ్లాసులకు భిన్నంగా దళితుల కోసం వేరే గ్లాసులు ఉన్నాయి. సామాజికంగా ఇటువంటి వివక్ష చూపడం 1956 పౌరహక్కుల పరిరక్షణా చట్టం ప్రకారం నేరం అయినప్పటికీ ఆ దురాచారాన్ని పాటించిన వారి మీద ఎప్పుడూ ఎటువంటి చర్యా అమలు కాలేదు. ఆ చట్టాన్ని గనుక కచ్చితంగా, పద్ధతి ప్రకారం ఉపయోగించినట్టయితే, అటువంటి దురాచారాలకు పాల్పడిన వారు సంస్కరించబడేవారో

లేదో గాని, కనీసం న్యాయమూర్తులకూ, పోలీసు అధికారులకూ కొంత చైతన్యం వచ్చేది. మన న్యాయవ్యవస్థలో ఒక ప్రజాస్వామిక, సమాన సంస్కృతి నెలకొనడానికి వీలు కలిగేది. కాని దురదృష్టవశాత్తూ అటువంటిదేమీ జరగలేదు.

సమాజానికి క్రమశిక్షణ నేర్పి, ప్రజలను వారు నిర్దేశించుకున్న సామాజిక పరివర్తన వైపు సుముఖులుగా చేయడమే ఏ సమాజంలోనైనా రాజ్యాంగ, చట్టబద్ధ వ్యవస్థ లక్ష్యం. ఒకవేళ ఈ క్రమం గనుక దెబ్బతింటే, సక్రమంగా అమలు జరగకపోతే అది అసలు ప్రజాస్వామ్యాన్నే రద్దు చేసి వేస్తుంది. ఎందుకంటే అసలు ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పడానికే మనం ఒక రాజ్యాంగం రచించుకున్నాం.

నిజం చెప్పాలంటే రాజ్యాంగ నిర్ణయసభ చివరి సమావేశంలో డా. అంబేద్కర్ ఏ భయ సందేహాలను వెలిబుచ్చారో అవి నిజమవుతున్నాయి. స్వాతంత్ర్యం మన దేశంలో వయోజన వోటుహక్కును ప్రవేశపెట్టింది. విశాల ప్రజా బాహుళ్యంలో ప్రవేశపెట్టింది. విశాల ప్రజాబాహుళ్యంలో అత్యధికులు సామాజికంగానూ, ఆర్థికంగానూ, తరతరాలుగా నిరాదరణకూ హక్కుల నిరాకరణకూ గురవుతున్న చోట, నిరక్షరాస్యులుగా ఉన్న చోట, వారు ఆ దారిద్ర్యం నుంచి బయటపడి ఈ మహత్తర ప్రజాస్వామిక ప్రయోగంలో తమ పాత్రను సమర్థంగా నిర్వహించగలరా అని ఆ రోజే చాలా మంది అనుమానించారు. ఆ అనుమానాలకు సమాధానాలు చెప్పడం అలా ఉంచి, ఒక మనిషికి ఒక వోటు అనే కార్యక్రమాన్ని పాలకవర్గాలు సంపూర్ణంగా తమ బాగు కొరకే ఉపయోగించుకున్నాయి. తమ అధికారమూ సంపదా ఇబ్బడిముబ్బడిగా పెంచుకోవడానికే ఉపయోగించుకున్నాము. సంవత్సరాల తరబడి పాలకులు ఈ పనే చేస్తూ పోయారు గాని కులవ్యవస్థను మెరుగుపరచాలనో, కుల వివక్షనూ అసమానతనూ రద్దు చేసి సమానత్వసూత్రానికి మార్గం సుగమం చేయాలనో అనుకోలేదు.

నరజాతి, కులం, లింగం, మతం వంటి భిన్నత్వాన్ని పట్టించుకోకుండా పౌరులందరికీ వయోజన వోటు హక్కును విస్తరించడం అనే కార్యక్రమం జరిగినప్పటికీ దళిత జనాభా విషయంలో మాత్రం వారి దైనందిన జీవితాలలో హిందూ వర్ణ వివక్ష కొనసాగుతూనే వచ్చింది. ఎంతో మంది అగ్రవర్ణ రాజకీయ వేత్తలు శాసనసభ్యులుగానో, పార్లమెంటు సభ్యులుగానో ఎన్నిక కావడానికి ఉపయోగపడినది మాత్రం ఆ దళితుల వోట్లే. అధికారం మీద కాంగ్రెస్ గుత్తాధిపత్యం కొనసాగినన్ని రోజులూ దళితులు అయితే కాంగ్రెస్ అభ్యర్థికైనా వోటు వేయవలసి ఉండేది, లేదా అసలు వోటు వెయ్యకుండా వారిని నిరోధించే వారు.

ఆ తర్వాత బహుళ పార్టీల వ్యవస్థ బలపడుతున్న కొద్ది తొలి రోజుల్లో కాంగ్రెస్ అనుభవించిన ఏకశిలాసదృశ అధికారం కరిగిపోవడం మొదలైంది. ఇక ఒక మనిషికి ఒక వోటు అనే సూత్రం దళిత జనాభాకు సమస్యలను సృష్టించడం మొదలైంది. రాజకీయ వ్యవస్థలో బహుళ పార్టీల పద్ధతి ఉనికిలోకి వచ్చిన తర్వాత పోటీపడే పార్టీల ప్రత్యర్థి

ఆగ్రహావేశాలు దళితుల మీద దాడులుగా పరిణమించాయి. ఎందుకంటే దళితులను కాంగ్రెస్‌కు బలమైన వోటు బ్యాంకుగా చూడడం జరిగింది.

* * *

# పదిరి కుప్పం

ఎన్‌టి రామారావు నాయకత్వంలో 1983లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిన వెన్వెంటనే ఎన్నికల ప్రక్రియ జరుగుతుండగానే పదిరికుప్పంలో దళితుల మీది దాడి జరిగింది. అప్పటి వరకూ ఈ రాష్ట్రంలో అటువంటి దౌర్జన్యపూరిత సంఘటనల గురించి వినలేదు. అప్పటి వరకూ అందరికీ తెలిసినది తమిళనాడులోని కీలవేన్మణిలో 1967లో భూస్వామి గోపాలకృష్ణమనాయుడు నలభై మంది దళితులను సజీవ దహనం చేసిన సంఘటన మాత్రమే.

ఇతరులందరికీ ఉన్న హక్కులే తమకు కూడా ఉన్నాయని గుర్తించిన దళితులు ఆ హక్కులను అనుభవించాలని ప్రయత్నించడం ప్రారంభించగానే వారి మీద దాడులు మొదలయ్యాయి. చిత్తూరు జిల్లా పదిరికుప్పంలో ఆ దౌర్జన్య ఘటన జరిగిన మూడో రోజున నేను అక్కడికి వెళ్ళాను. అక్కడ అగ్రవర్ణ పెత్తందార్లు దళితుల గుడిసెలను ధ్వంసం చేశారు. వారికి ఉన్న కొద్దోగొప్పో లూటీ చేశారు. అక్కడ ఒక గుడిసె ముందు కట్టేసి ఉన్న ఒక ఆవు మీద కిరోసిన్ పోసి తగులబెట్టారు. ఆవు అనేది ఏ మినహాయింపులూ లేకుండా హిందువు లందరికీ పవిత్రమైనది. కాని అక్కడ చెలరేగిన విద్వేషంలో ఆ స్పృహే లేదు. దళితులు కాంగ్రెస్‌కు వోటు వేస్తారనే విద్వేషం అది. అంటే దళితులకు తమ ఇష్టానుసారం వోటు వేసే కనీస హక్కు వచ్చినందుకు అగ్రవర్ణాలు ప్రకటించిన నిరసన అది. హిందూ అగ్రవర్ణాలు చేసిన ఈ పాశవికమైన దాడిపట్ల ఏ హిందూ నేతలూ ఖండన ప్రకటించగా నేనుచూడలేదు. ఇంత దౌర్జన్యం జరిగితే ఎక్కడి నుంచీ న్యాయమైన అగ్రహం వ్యక్తం కాలేదు. అంటే దళితులకు మనతో సమానులుగా ఏ అడ్డంకులూ లేని స్వయం నిర్ణాయాధికారం ఉండగూడదని మనలో గాఢమైన విశ్వాసం ఉందన్నమాట.

న్యాయంపట్ల, చట్టబద్ధ పాలన పట్ల హిందూ విశ్వాసం చాలా పాక్షికమైనది, కొందరికి మాత్రమే వర్తించేది. మనం బ్రిటిష్ వారి నుంచి స్వీకరించిన పాశ్చాత్య ఉదారవాదాన్ని మన రాజకీయాలలో పాలనలో హిందూ పరిభాషలోనే పునర్వ్యాఖ్యానించుకున్నాం.

పరిస్థితులు ఇలా ఉన్నప్పుడు చాలా తరచుగా వ్యక్తులు తమ సొంత పద్ధతిలో

న్యాయాన్ని అమలు చేయదలచుకుంటారు. తమ పరిష్కారాలు తామే వెతుక్కుంటారు. కీలవేన్మణిలో గోపాలకృష్ణమనాయుడుకు వ్యతిరేకంగా దళితులపై అత్యాచారాల కేసులో ప్రాసిక్యూషన్ వాదన ఓడిపోయింది. గోపాల కృష్ణమ నాయుడిని నిర్దోషిగా న్యాయస్థానం వదిలిపెట్టింది. 'ఇంత గౌరవనీయుడైన మనిషిపై ఇటువంటి నేరం ఆరోపిస్తారా' అని న్యాయమూర్తి ఆశ్చర్యం ప్రకటించాడు. ఆ తర్వాత ఎన్నో ఏళ్లకు గోపాల కృష్ణమ నాయుడిని ఒక రాడికల్ బృందం కాల్చి చంపింది. తమిళనాడు రాష్ట్రంలో నిర్దాక్షిణ్యమైన పోలీసు అధికారి వాల్టర్ దేవారాం ఈ రాడికల్ బృందం విస్తరించకుండా ఒక్కొక్కరిని పట్టుకుని భౌతికంగా నిర్మూలించాడు. ఆ దుర్మార్గాల కథ ఈ దేశ పోలీసు చరిత్రలో మరొక పాశవికమైన రికార్డు. అది మరొకసారి చెప్పుకోవచ్చు.

పదిరికుప్పం నుంచి నేను తిరుపతికి వెళ్లాను. అక్కడి రాడికల్ విద్యార్థి సంఘం మహాసభల సందర్భంగా జరిగిన పెద్ద బహిరంగ సభలో నేను పదిరికుప్పం దౌర్జన్యం గురించి మాట్లాడాను. అక్కడ సభలోనే నేను కామ్రేడ్ వద్మాపురం చంద్రమౌళిని మొదటిసారి కలిశాను. అయనను ఇటీవలే పోలీసులు ఒక బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపారు. తిరుపతిలో 1983 సభల తర్వాత ఆయనను నేను మళ్లీ 1987లో రంపచోడవరం పోలీసు లాకప్‌లో కలిశాను. అప్పుడు ఎస్ ఆర్ శంకరన్‌తోపాటు  కొంత మంది ప్రభుత్వ అధికారులను నక్సలైట్లు అపహరించుకుపోయారు. రాజధానిలోని ప్రభుత్వాధికారులు ఎస్.ఆర్. శంకరన్‌ను, ఇతర అధికారులను విడిపించడానికి నా సహాయం అవసరమని భావించారు. సీనియర్ ఐఎఎస్ అధికారి యుగంధర్ ఒక అర్ధరాత్రి ఒంటిగంటకు నాకు ఫోన్ చేసి నేను ఆ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరి నన్ను ఒప్పించారు. నేను ఆ పని మీద రాజమండ్రి వెళ్లేసరికి రాజమండ్రి రైల్వేస్టేషన్‌లో నాకు స్వాగతం పలకడానికి హెచ్‌జె దొర వచ్చాడు. అపహృత ప్రభుత్వాధికారులను విడుదల చేయాలంటే చంద్రమౌళిని, మరికొందరిని విడుదల  చేయాలని నక్సలైట్లు కోరారు. అప్పుడు చంద్రమౌళిని తీసుకువచ్చి రంపచోడవరం పోలీసుస్టేషన్‌లో లాకప్‌లో పెట్టారు. అక్కడ లాకప్‌లో ఉన్నవారందరినీ గుర్తేడుకు తీసుకు వెళ్లి వారిని విడుదల చేస్తే వారికి బదులుగా ప్రభుత్వాధికారులను వదిలి పెడతామని నక్సలైట్లు చెప్పారు.

అక్కడ లాకప్‌లో ఉన్న చంద్రమౌళితో మాట్లాడుతున్నప్పుడు తాను నన్ను మొదటిసారి తిరుపతి సభలో కలిశానని చంద్రమౌళి చెప్పాడు. ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవడానికి నాపై పోలీసులవైపు నుంచి గాని, ప్రభుత్వం వైపు నుంచి గాని ఏమన్నా నిర్బంధం ఉందా అని అడిగాడు. నేను ఆయన అనుమానాలు నివృత్తి చేశాను. నాకు జ్ఞాపకం ఉన్నంత వరకు దొర ఆ ఖైదీలందరినీ మాకు అప్పగించిన తర్వాత  ఆ రాత్రి మేమందరం కలిసి ఒక జీపులో గుర్తేడుకు వెళ్లాం. గుర్తేడులో మేం చాలా సేపు వేచి చూడవలసి వచ్చింది. ప్రభుత్వాధికారులను మా దగ్గరికి తీసుకురావలిన కనకయ్య దళం రావడం

చాలా ఆలస్యమయింది. ఇంకా ఎక్కువ ఆలస్యమయితే వెనక్కి రాజమండ్రికి వెళ్లిపోవచ్చునని, తమను మళ్లీ రాజమండ్రి జైలులో అప్పగించవచ్చునని చంద్రమౌళి నాతో అన్నాడు. అప్పుడు ప్రభుత్వాధికారులను మాకు తెచ్చి అప్పగించిన దళ నాయకుడు కనకయ్యను పోలీసులు ఆ సంఘటన జరిగిన ఆరు నెలలోనే కాల్చి చంపారు. దళితుల మీద అత్యాచారాల గురించి చెబుతూ ప్రస్తావన వశాత్తూ చంద్రమౌళి గురించి చెప్పకుండా ఉండలేకపోయాను. ఎందుకంటే చంద్రమౌళిని విడుదల చేయించింది నేనే గనుక ఆయన మరణం ఇటీవల జరిగింది గనుక ఈ విషయం నేను ఇక్కడ చెప్పకతప్పదు.

సరే, మొత్తానికి ఈ రాష్ట్రంలో దళితులు తమ హక్కుల కోసం పట్టుబడితే, నిలబడితే వారి హక్కులను కాలరాచివేయడానికి వారి మీద దౌర్జన్యం జరపడం అనే పద్ధతి పదిరి కుప్పంలో మొదలైంది. రాజ్యాంగం తమకు హామీ ఇచ్చిన హక్కులను దళితులు అనుభవించడానికి ప్రయత్నించడం తమ అధికారానికి సవాలుగా అగ్రవర్ణ భూస్వాములు తల పోయడం మొదలుపెట్టారు. దానికి ప్రతిగా వారి మీద, మొత్తంగా వారు కులం మీద మరణశిక్ష విధించి అమలు చేయడమే మార్గమని అనుకున్నారు. పదిరికుప్పం సంఘటనకు కొనసాగింపుగానే, అప్పటికే రాజకీయాధికారంలో పైకి ఎగబాకుతున్న తెలుగుదేశం, కమ్మలు తమ కింద ఉన్న దళితులు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉండడాన్ని సహించలేకపోయారు. ఆ విద్వేషం 1985 జులై 17న కారంచేడు మారణకాండ రూపంలో బయటపడింది.

* * *

# కారంచేడు

కారంచేడు మారణకాండ 1985 జులై 17న జరిగింది. ఆ రోజున కారంచేడులో తాము మంచినీళ్ల కోసం వాడుకునే చెరువులో ఒక అగ్రవర్ణ యువకుడు పశువులు కడుగుతుంటే తేళ్ల సువార్తమ్మ అనే దళిత స్త్రీ అభ్యంతరం తెలియజేసింది.

సరిగ్గా ఇటువంటి సాంఘిక ఆచారాలను రద్దుచేయడానికి రాజ్యాంగ రచన జరిగింది. రాజ్యాంగంలోని ఆ అధికరణాలను గౌరవించాలంటే మనకు వేల సంవత్సరాలుగా బోధించబడుతున్న దాన్నంతా వదిలిపెట్టవలసి వస్తుంది. ఇటువంటి దురాచారాల విషయంలో రాజ్యాంగ అధికరణం 15(2) ఏమి చెపుతుందో ఇదివరకే వివరించాను. ఆ అధికరణం మనం నివసిస్తున్న సమాజ స్వభావమేమిటో మనకు తెలియజెపుతుంది. కొందరు న్యాయమూర్తులకూ, అధికారులకూ ఈ సమానత్వ భావనను వ్యాఖ్యానించి

పరిరక్షించే బాధ్యత ఇచ్చి, వాళ్ల కర్తవ్యమేమిటో కూడా రాజ్యాంగం స్పష్టం చేసింది. కాని ఈ సమానత్వ భావనను అర్థం చేసుకోవడంలోనూ, వ్యాఖ్యానించడంలోనూ న్యాయమూర్తులు విఫలమయ్యారు. ఆ వైఫల్యం అటు రిజర్వేషన్ల మీద వైఖరిలోనూ కనబడింది. ఇటు షెడ్యూల్డ్ కులాల, తెగల మీద జరిగిన భౌతిక దాడుల విషయంలోనూ కనబడింది.

అగ్రవర్ణ యువకుడు చేస్తుండిన తప్పుడు పనిని సువార్తమ్మ అభ్యంతరం పెట్టేసరికి, భూస్వాములకు చాలా కోపం వచ్చింది. వాళ్లు పెద్ద ఎత్తున పరిగెత్తుకొచ్చారు. అట్టడుగున పడి ఉండవలసిన వాళ్లు మాకు ఎదురుచెపుతారా అని ఆవేశపడ్డారు. బ్రాహ్మణ వర్ణాశ్రమ ధర్మాన్ని కాపాడే పనిని ఇటీవలి కాలంలో అధికార పగ్గాలు చేపట్టిన కొన్ని శూద్ర కులాలు చేయడం మొదలు పెట్టాయి. వర్ణాశ్రమ ధర్మాన్ని ఉల్లంఘించినందుకు, అంటే అగ్రవర్ణ యువకుడిని ఒక దళిత స్త్రీ అడ్డుకున్నందుకు శిక్ష విధించవలసిందేననుకున్నారు. ఆ శిక్ష చాలా వేగంగా జరిగిపోయింది. ఆ శిక్షవల్ల ఆ గ్రామంలోని దళితులందరూ మూకుమ్మడిగా ఊరు వదిలిపెట్టి వెళ్లిపోయి శరణార్థులుగా చీరాలలోని ఒక చర్చిలో ఆశ్రయం పొందవలసి వచ్చింది. తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇది రెండవ పెద్ద దాడి కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన చెలరేగింది.

కారంచేడు ఘటనను విచారించడానికి ఒక విచారణ కమిషన్‌ను కూడా నియమించడం జరిగింది. నిజానికి అంతకుముందే పదిరి కుప్పం దౌర్జన్యకాండ మీద కూడా జస్టిస్ వెంకటేశ్వరరావు నాయకత్వంలో ఒక విచారణ సంఘం నియామకమై నివేదికను కూడా సమర్పించింది. ఆ నివేదిక సిరా తడి ఆరకముందే కారంచేడు మారణకాండ జరిగింది. కారంచేడు దురంతం దళిత అస్తిత్వ రాజకీయాలకు, దళిత ఉద్యమానికి కూడా నాంది పలికింది. ఆ దారుణ మారణకాండ దళిత సంస్కృతీ, సాహిత్యాల పునరుజ్జీవనం చాల శక్తివంతమైనది. తన వాటా కోసం ఎలుగెత్తి ప్రకటించినది.

ఒక కులంగా బ్రాహ్మణులు తమ ఆధిపత్యాన్ని కోల్పోయినప్పటికీ, దేవతల ద్వారా, గుడుల ద్వారా, భగవదవతారాల ద్వారా బ్రాహ్మణ్యం ఇంకా తన ప్రాబల్యాన్ని కాపాడు కుంటూనే ఉంది. ఇతర కులాలు బ్రాహ్మణుల నుంచి అధికారం కైవసం చేసుకున్నట్టు కనబడుతున్నది. బ్రాహ్మణ ధర్మం ఎన్నో తరాల కింద స్థాపించిన కులాచారాలను, పాత కాలపు పాశవికత్వంతోనే అమలు చేస్తామని కొత్త ఆధిపత్య వర్గాలు వాగ్దానం చేసినట్టున్నది.

కారంచేడు దళితులు తమకు జరిగిన అన్యాయానికి పరిహారం కావాలని కోరుతున్నప్పటికీ, ఆ హింసాకాండ ఎంత పెద్దఎత్తున జరిగిందో దానికి తగిన స్థాయిలో, త్వరితగతిలో పాలకుల నుంచి స్పందన కనబడలేదు. ప్రభుత్వం తగిన చర్య తీసుకునేందుకు వీలుగా దళితులు ఒక సవివరమైన ప్రైవేటు ఫిర్యాదులోని సాక్షులలో కొందరిని విచారించాను. ఆ తర్వాత ఆ ప్రైవేటు ఫిర్యాదునూ, ప్రభుత్వం నమోదు చేసి

పరిశోధన జరిపిన కేసునూ కలిపి విచారణ జరపాలని నిర్ణయించాను. ఆ కేసును ఒక దశలో బొజ్జా తారకం వాదించారు.

గుంటూరులోని జిల్లా న్యాయ స్థానంలో కొందరు నిందితుల నేరాలను నిర్ధారించారు. ఆ నేర నిర్ధారణను ధ్రువీకరించి శిక్షలు వేసి ఉంటే బహుశా చుండూరు మారణకాండ జరిగి ఉండేది కాదేమో. ఆ రోజు బెంచికి నేతృత్వం వహించిన జస్టిస్ రెడ్డప్ప రెడ్డికి తాను బాధ్యత వహిస్తున్న న్యాయమూర్తిత్వం ఏ సామాజిక బాధ్యత వహించవలసి ఉంటుందో అవగాహన ఉండి ఉంటే బాగుండేదేమో. ఆ తర్వాత ప్రవేశ పెట్టిన షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల (అత్యాచారం నిరోధ) చట్టం అప్పటికే మన చట్టాలలో భాగమై ఉంటే ఏమన్నా తేడా ఉండేదేమో... ఇటువంటి ప్రకటనలు ఎన్నయినా వేసుకోవచ్చును గాని, అంతకు రెండు దశాబ్దాల ముందు తంజావూరు జిల్లా కీలవేన్మణిలో జరిగినట్టుగానే అధికారికంగా న్యాయం దొరకనపుడు ప్రైవేటు న్యాయమే జరిగింది. దగ్గుబాటి చెంచురామయ్యను కాల్చి చంపారు.

చట్టబద్ధపాలనా సూత్రం ఏమి చెపుతుందంటే ఒక నేరానికి జవాబును మరొక నేరం ద్వారా ఇవ్వలేము. న్యాయాన్ని ఆ మాదిరిగా అంకగణితంలాగ, కూడికలు తీసివేతలు లాగ చూడడం నిజంగా పరిష్కారమూ కాదు, అది న్యాయమూ కాదు. మెదక్ జిల్లాలో కాజిపూర్ గాలిరెడ్డి విషయంలో చేసినట్టుగా ప్రజలందరూ సామూహికంగా సంఘటితమై ఒక పీడక భూస్వామిని పడగొట్టడం వేరే కథ. అది ఒక సామాజిక ఆగ్రహ ప్రతిఫలనం.

* * *

# చుండూరు

మరొక నాలుగేళ్లు తిరిగేసరికి అదే గుంటూరు జిల్లా చుండూరులో దళితుల మీద దాడి జరిగింది. అటువంటి దాడులలో కెల్లా ఇది చాలా పెద్దది. ఈ మారణకాండ పెద్దది మాత్రమే కాక చాలా దారుణంగా జరిగింది. ఆ మారణకాండ 1991 ఆగస్టు 6న అంటే హిరోషిమా దినాన జరిగింది. గ్రామంలోని దళితుల మీద దాదాపు 400 మంది రెడ్లు, తెలగలు మధ్యాహ్నం పూట దాడిచేశారు. దళితులను వెంటాడి, తరుముతూ మొత్తం ఎనిమిది మందిని చంపివేశారు. రెండు మృత దేహాలు గోనెసంచులలో కుక్కబడి దొరికాయి. ఒక మృతదేహం కనుగుడ్లు పెరికివేయబడి దొరికింది. మృతదేహాలన్నిటినీ గ్రామం పక్కనే పారుతున్న తుంగభద్ర కాలువలోనూ, హౌరా మద్రాసు రైల్వే మార్గానికి సమాంతరంగా ఉన్న కొత్త కాలువలోనూ విసిరేశారు.

ఈ హత్యాకాండ జరిగిన మూడు రోజుల తర్వాత పదో తేదీన అనుకుంటాను, కత్తి

పద్మారావు మృతదేహాలను గ్రామానికి ఊరేగింపుగా తీసుకువచ్చాడు. నేనూ, హరగోపాల్, న్యాయవాది చంద్రశేఖర్‌తో కలసి అక్కడికి వెళ్లాం. అక్కడ జన సందోహంలో మా వాహనాలలో వెళ్ళడానికి వీలు లేకపోయింది. నడిచి వెళ్లవలసి వచ్చింది. అప్పుడే గ్రామంలో కొన్ని గుడిసెలను తగులబెట్టడంతో మేం మృతదేహాలను ఉంచి అంత్యక్రియలు జరుపుతున్న చోటికి వెళ్లలేకపోయాము. సాయంత్రం 6 గంటల సమయంలో ఆ మృతదేహాలను ఖననం చేయడం జరిగింది. ఆ ఖనన స్థలాన్ని రక్త క్షేత్రం అని పిలుస్తారు. అది ఇప్పటికీ ఉంది. ప్రజలు అక్కడికి తిరణాలలాగ వెళ్లి తమ నిరసన ప్రకటించి రావడం నాకింకా గుర్తుంది.

దళితులకు వ్యతిరేకంగా జరిగే ఈ నేరాలను అత్యాచారాలుగా పరిగణించాలని కృష్ణన్ కృషి వల్ల అప్పటికే ఒక చట్టం రావడంతో చుండూరు హత్యాకాండ అత్యాచారం నమోదయింది. ఇరవయో శతాబ్దం చివరిలో వచ్చిన ఈ చట్టం హిందూ సమాజం ఎంత క్రూరమైందో, ఎటువంటి దురాచారాలను పాటిస్తున్నదో తెలియజెప్పి జాబితా ఇవ్వడం గర్వకారణమేమీ కాదు. ఆ చట్టం సెక్షన్ 3వలో ఇచ్చిన జాబితా చూస్తే హిందూ జీవితాలు ఎంతా అమానవీయంగా ఉన్నాయో, మన సమాజంలో మానవ జీవన ఔన్నత్యం ఎంతగా కుదించబడి ఉన్నదో అర్థమవుతుంది.

ఈ హత్యలవల్ల తలెత్తనున్న పరిణామాలతో, సమస్యలతో వ్యవహరించడానికి ఆర్‌సి మీనాను నియమించారు. చుండూరు మారణకాండ బాధితుల కొరకు పద్మారావు ఏర్పాటుచేసిన శిబిరంలో పోలీసులు కాల్పులు జరిపి ఆగస్టు 11న ఒక దళిత కార్యకర్తలను చంపివేశారు. అందువల్ల నేను రెండోసారి అక్కడికి వెళ్లవలసి వచ్చింది. ఆ దళిత కార్యకర్త పేరు అనిల్‌కుమార్, ఆయన మీద పరిశోధనాధికారి రాయలయ్య కాల్పులు జరిపి ఉద్దేశపూర్వకంగానే చంపివేశాడని ప్రజలు ఇప్పటికీ నమ్ముతున్నారు. ప్రత్యేకాధికారి ఆర్‌పి మీనాకు కూడా అందులో పాత్ర ఉందనీ నమ్ముతున్నారు. నిజానికి ఇటువంటి ఘటనలు, నేరాలు జరిగినపుడు సరైన పరిశోధన, విచారణ జరపలేకపోతే అవి ప్రజల జ్ఞాపకంలో ఒక అనుమానంగా మిగిలిపోతాయి. మొదట్లో అనుమానంగా ఉన్నదల్లా కాలం గడిచేకొద్దీ ఒక నమ్మకంగా గద్దకడుతుంది. అందువల్లనే మనుషులు పోయినా వాళ్లు చేసిన చెడు మిగిలిపోతుందంటారు.

## చుండూరులో కోర్టు

చుండూరు దళితులపై జరిగిన మారణకాండను విచారించడానికి, అప్పటి హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తి జస్టిస్ ఎ గంగాధరరావుతో ఒక ఏక సభ్య కమిషన్ వేశారు. ఆ మారణకాండలో చనిపోయిన వారిని గ్రామం మధ్యలో ఖననం చేయడాన్ని ఆయన తప్పుపట్టాడని, దానిపై తగిన చర్య తీసుకొమ్మని అప్పటి జిల్లా కలెక్టర్ నాగార్జునకు

సిఫారసు చేశాడని నేను విన్నాను. అందువల్ల గంగాధరరావు ఊళ్లోకి ప్రవేశించడానికి వీలులేదని గ్రామ దళితులు పట్టుబట్టారు. ఇటువంటి కమిషన్ల నివేదికల నుంచి నేర్చుకోవడానికేమీ ఉండదు. గనుక నేను ఆ కమిషన్ నివేదికను చదవను కూడా చదవలేదు. ఉదాహరణకు బీదర్‌లో హత్యాకాండకు గురైన సిక్కు విద్యార్థుల విషయంలోనూ, చుండూరులో దళిత యువకుల విషయంలోనూ కూడా వాళ్లు స్త్రీలను వేధించడమే ఆ హత్యాకారణమని నివేదికలు రాశాయి.

బీదర్ హత్యాకాండ విషయంలో ఇటువంటి అర్థంలేని, పిచ్చి ఆరోపణ అసలు విచారణలో భాగం కాకుండా చూడడానికి నేను ప్రయత్నించాను. మైనారిటీల విషయంలోనూ, దళితుల విషయంలోనూ ఇటుంటి ఆరోపణ చేయడం చాలా సులభం. బీదర్‌లో నేనీ పేరుతో పనిచేసే ఒక మాఫియా నాయకుడిని బోనెక్కించి ప్రశ్నించేటపుడు స్త్రీలను వేధించే పని హిందూ యువకులు కూడా చేస్తుంటారని నేను చెప్పించాను. మరి వారిని చంపారా అని నేను ప్రశ్నించినపుడు ఆ ప్రశ్నను న్యాయమూర్తే అంగీకరించలేదు. కాని మైనారిటీల విషయంలో, దళితుల విషయంలో అది ఒక సర్వసాధారణ ఆరోపణ అవుతుంది. హత్య చేయవచ్చునన్నంత బలమైన కారణం కూడా అవుతుంది. కాని అటువంటి ఆరోపణ చేయడం ఎంత సులభమో న్యాయమూర్తికి ప్రదర్శించడానికే నేను ఆ ప్రశ్నలు వేశాను.

అనిల్ కుమార్ హత్య జరిగిన తర్వాత గుంటూరులో దిగీదిగగానే వెళ్లి మీనాను కలిశాను. ఆయనను నేను కేవలం మర్యాద పూర్వకంగా మాత్రమే కలుస్తున్నానని, చుండూరు వెళ్లడానికి నాకు ఆయన దగ్గర అనుమతి తీసుకోవలసిన అవసరంలేదని చెప్పాను. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో చుండూరు వెళ్లాను. కాని పోలీసులే అనిల్ కుమార్ అంత్యక్రియలు నిర్వహించి, అవి పూర్తయిన తర్వాత మాత్రమే మమ్మల్ని గ్రామంలోకి ప్రవేశించనిచ్చారు. అంతకుముందరి దళితుల హత్యాకాండకు సాక్షిగా ఉండిన అనిల్‌కుమార్‌ను పరిశోధనాధికారి రాయలయ్యే అంతకుముందు విచారించాడు. ఆ రాయలయ్యే ఆ తర్వాత గురిచూసి అనిల్‌కుమార్‌ను కాల్చిచంపాడని ప్రజలు నమ్ముతున్నారు.

చుండూరు గ్రామంలోకి వాహనాల ప్రవేశాన్ని నిరోధించినప్పటికీ మేము గ్రామంలోకి నడిచివెళ్ళాం. నాకు గుర్తున్నంతవరకు నాతోపాటు విరసం కవి విమల, అరుణోదయ గాయకుడు రామారావు, నా న్యాయవాద సహచరుడు బొజ్జాతారకం, రచయిత, రాజనీతి శాస్త్రవేత్త ఐలయ్య ఉన్నారు. అప్పుడు గ్రామం చాలా ఉద్రిక్తంగా ఉండింది. అందువల్ల ఆ భయంతో గ్రామం నుంచి చాలమంది బయటి ఊళ్ళకు పారిపోయారు. ఆ తర్వాత గుంటూరు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి ముందర ఆ కేసు వాదించవలసివచ్చినప్పుడు మరొకసారి నేను ఆ గ్రామానికి వెళ్లాను. అలా చుండూరుతో నా సంబంధం ఆ కేసు

విచారణకూ, ఇతర వాదనలకూ విస్తరించింది.

తమ గ్రామంలోనే న్యాయస్థానం ఏర్పాటుచేసి విచారణ జరపాలని చుండూరు దళితులు వాదించారు. అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధనరెడ్డి ఆ డిమాండ్‌కు అంగీకరించాడు. అక్కడ ఒక ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటయిందని ప్రకటన వెలువడింది. చుండూరులో న్యాయస్థానం మొదలయింది.

అప్పుడిక ప్రాసిక్యూషన్ విచారణ పూర్తి చేయడానికి అభ్యంతరాలు మొదలయ్యాయి. న్యాయవ్యవస్థ మీద, న్యాయస్థానంలో కేసులు పేరుకుపోవడం మీద సదస్సులలో ఉపన్యాసాలు ఇచ్చేవారు గుర్తించనిసత్యం ఒకటుంది. అదేమంటే అసలు న్యాయ వ్యవస్థలోనే అంతర్గర్భితంగా ఉన్న ఒక అపసవ్యత, ఒక న్యాయవాదిని నియమించుకునే కక్షిదారుకు ఈ విషయం బాగా తెలును. ఒకసారి ఒక మధ్యంతర ఉత్తర్వు సంపాదించుకున్న తర్వాత ఇక విచారణ క్రమాన్ని ఆలస్యం చేస్తూ పోవచ్చు. అవతలి పక్షం ప్రభుత్వం గనుక అయితే ప్రభుత్వ న్యాయవాది సహకారం పొందడం ఏమంత కష్టం కాదు. ఒక రుణ గ్రహీత తన న్యాయవాదితో కేసును వీలయినంత ఎక్కువ కాలం సాగదీయమని చెపుతాడు. స్థలం ఖాళీ చేయమని వచ్చిన ఉత్తర్వు మీద మధ్యంతర వాయిదా తెచ్చుకున్న కౌలుదారు తన న్యాయవాదితో ఆ కేసును వీలయినంతెక్కువ కాలం సాగదీయమని కోరతాడు. న్యాయవాదులందరూ తమ కక్షిదారులు చెప్పినట్టు చేయడానికి శిక్షణ పొందుతారు. అందుకే న్యాయవాదులు తమ కక్షిదారుల విచారణ క్రమాన్ని పొడిగించడానికి ఎన్నో మధ్యంతర దరఖాస్తులు చేస్తూ పోతారు. మరొక న్యాయవాదితో సాగించే వాదక్రీడలో ఒక న్యాయవాది తన దగ్గర ఉన్న ఎత్తుజిత్తులన్నీ ప్రయోగిస్తాడు. న్యాయవాదుల దగ్గర ఉండే ఎత్తులకూ జిత్తులకూ కొదవలేదు. న్యాయవాదులను సంస్కరించవలసి ఉన్నదనే ఆలోచనే మా న్యాయవాదులకు ఎప్పుడూ రాదు. న్యాయవాదుల దృష్టిలో నీతి అంటే తమ కక్షిదారుల నీతి మాత్రమే.

నేను బార్ కౌన్సిల్ రెండుసార్లు సభ్యుడిగా ఉన్నాను. బార్ కౌన్సిల్‌కు సంబంధించిన క్రమశిక్షాన సంఘంలో కూడా ఉన్నాను. ఒక స్వతంత్ర వ్యవస్థ చేత విచరాణ గనుక జరిపించినట్టయితే న్యాయవాదులందరూ తమ వృత్తి నుంచి కనీనం కొన్ని సంవత్సరాలయినా బహిష్కరణకు గురయ్యేవారేననిపిస్తుంది. ఒకానొక కాలంలో చాలా సమర్థంగా వాదించగలిగిన న్యాయవాదులుండేవారు. చాలా విషయాలు తెలిసినవారుండేవారు. కొందరు పండితులు కూడా ఉండేవారు. వారు తమ వృత్తికి ఒక నైతిక రుజువర్తనను కూడా కల్పించారు. కాని వారిదగ్గరికి ఒక కక్షిదారు వచ్చి ఒక కేసును అప్పగించినపుడు ఆ కక్షిదారు చేసిన అనైతిక పనులపట్ల వాళ్లు కళ్లు మూసుకునేవారు. తమ చేతికి వచ్చిన కేసును వాదించేవారు. వాళ్ళు న్యాయస్థానంలో పందెం కోడి పుంజుల్లాగ పోట్లాడేవారే. కాని ఆ కోడిపుంజుల పోట్లాట ఒక భ్రమాజనితమైన

పోట్లాటే. అది న్యాయాన్యాయాల మధ్య పోట్లాట కాదు. అలా చాలా సంవత్సరాలపాటు తమ కక్షిదారుల అనైతిక ప్రవర్తనను సమర్థిస్తూ వాదనలు చేసిన న్యాయవాదులు చివరికి న్యాయస్థానం బయట కూడా అనైతిక ప్రవర్తనను సమర్థించే స్థితికి చేరుకుంటారు. అనైతిక పోట్లాటలో ప్రతినిధులుగా చాలా కాలం పనిచేసిన న్యాయవాదులు చివరికి తమ జీవితాలలో కూడా అనైతికంగా మారిపోయి, మనుషుల గురించీ, విషయాల గురించీ తమ వాదనలలో చాలా సమర్థమైన కపటత్వాన్ని ప్రదర్శించగలుగుతారు. ఈ కపట ప్రవర్తనే న్యాయవాదులను చాలా అసంబద్ధంగా మార్చివేసింది. న్యాయవాదులు సంపద పోగుచేసుకోవడంలో పైకి పోయిన కొద్దీ ఈ కపట ప్రవర్తన మరింత ఎక్కువగా కనిపిస్తుంది.

మామూలుగా ఒక న్యాయస్థానంలో ఒక నేర విచారణ న్యాయం కోసం అన్వేషణా ప్రయత్నంగా మొదలవుతుంది. కాని కాలక్రమంలో అది నేరస్తులు తమ న్యాయవాదుల ద్వారా న్యాయాన్ని ఓడించడం కోసం జరిపే నైపుణ్యంతో కూడిన క్రీడగా మారిపోతుంది. ఏ కేసులోనైనా ఒక నేరస్తుడి, నేరం నమోదు చేసిన పత్రాలు చదవగానే ఒక న్యాయవాది ఆ నేరస్తుడిని లొంగిపొమ్మని అయినా చెప్పవలసి ఉంటుంది. లేదా యావజ్జీవమో, మరొకటో శిక్ష విధించడం కోసం వాదనలు అయినా పెట్టవలసి ఉంటుంది.

ఈ మాదరిగా న్యాయవాదులు నిర్వహించే ప్రహసనపు పాత్ర ఒకవైపు ఉండగా, ఏ దేశంలోనైనా స్వాతంత్ర్యానికి ఒక ముఖ్యమైన సూచికగా న్యాయవ్యవస్థ కీలకమైన పాత్ర వహించడం మొదలయింది. నిజానికి న్యాయవ్యవస్థ పరిణామక్రమం చాలా సుదీర్ఘమైనది. ఆ వ్యవస్థ చివరికి ఒక చట్టబద్ధపాలనా నిర్మాణంగా పరిణమించింది. ఆ సమయానికి న్యాయ, చట్టపరమైన ఆలోచనా వ్యవస్థలలో చాలా ప్రగతి కనబడింది. సరిగ్గా ఈ చట్టబద్ధ పాలన అనే దగ్గరనే న్యాయ వ్యవస్థ అంతకు ముందరి భూస్వామ్య నిరంకుశత్వం నుంచి దూరం జరిగింది. అది ఏ ఒక్కరితోనూ వారి హోదాను బట్టి వ్యవహరించగూడదని, అందరినీ సామాజిక కట్టుబాటు ప్రకారం సమానంగా చూడవలసిందేననీ చెప్పింది. కాని ఆ చట్టబద్ధపాలనా వ్యవస్థ పాత్ర క్రమక్రమంగా మారుతూ వచ్చింది. అయితే ఆసక్తికరమైన విషయమేమంటే, న్యాయస్థానాలలో ప్రత్యర్థి వాదనల వ్యవస్థ స్వేచ్ఛా వ్యాపార సూత్రం మీద నిర్మాణమయింది. న్యాయవాద వృత్తే ఈ సూత్రం మీద నిర్మాణమయింది. అందువల్లనే న్యాయవాద వృత్తిలో ఆ స్వేచ్ఛా వ్యాపారానికి సంబంధించిన భీషణమైన ఘర్షణా ప్రవృత్తి మిగిలిపోయింది. పెరిగిపోయింది. అమెరికన్ హాస్య రచయిత డామన్ రన్యన్ నేర విచారణకు ముష్టిఘాతాల కుస్తీపోటీ గానూ, న్యాయవాదులను పశుబలం ప్రదర్శించేవారిగానూ పోల్చాడు.

అయితే చరిత్రలో చాలా గొప్ప న్యాయవాదులు కొందరు, చాలా గొప్ప విచారణలు కొన్ని ఉన్నమాట నిజమే. అమెరికాలో దైవ దూషణ విచారణలలో వాదనలు వినిపించిన

క్లారెన్స్‌డారో చాలా గొప్ప న్యాయవాదిగా పేరు తెచ్చుకొన్నారు. ఈ కాలంలోనే ఆయన రైలు మార్గాలు నిర్మించిన కార్మికుల తరపున కూడా వాదనలుచేశారు.

ఆయన నిందితుల తరపున న్యాయవాదిగా చాలా ఘనత పొందారు. ఇంగ్లాండ్‌లో కూడా ఆ మాదిరిగా ప్రముఖులైన న్యాయవాదులెందరో ఉన్నారు. ఇతర దేశాలలో కూడా అటువంటి న్యాయవాదులు ఉండే ఉంటారు. భారత న్యాయ వ్యవస్థలో కూడా సమర్థులైన న్యాయవాదులెందరో ఉన్నారు. వారి జీవిత కథలు ఇక్కడ చెప్పనక్కరలేదు. వారి జీవితాలు దళితుల మీద అత్యాచారాల కేసుల విచారణకు సంబంధించి పెద్ద వెలుగును కూడా ప్రసరించలేకపోవచ్చు.

బహుశా అమెరికాలో నల్లజాతివారి రక్షణ కోసం పోరాడిన కొందరు అమెరికన్ న్యాయవాదుల ఉదాహరణలు మనకు ఉపయోగపడవచ్చునేమో, అటువంటి న్యాయవాదుల మీద అనేక తప్పుడు ఆరోపణలు వచ్చాయి. వారిపై ఎన్నో మానవ హక్కుల ఉల్లంఘనలు కూడా జరిగాయి. మరింతగా దిగజార్చివేసింది. ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి ఒక సంపూర్ణ పునర్నిర్మాణం జరగనట్టయితే, అసలు న్యాయమే ధ్వంసమైపోతుంది. సరిగ్గా పదిరికుప్పం, కారంచేడు, నీరుకొండ దళితుల మీద అత్యాచారాల విషయంలో జరిగిందిదే, చుండూరు కేసులో కూడా అదే సాచివేత వైఖరిని ప్రదర్శించడానికి చాలా ప్రయత్నం జరిగింది.

మొట్టమొదటి ఆటంకం చుండూరులో విచారణ జరపడం మీద అభ్యంతరం రూపంలో వచ్చింది. చుండూరులో న్యాయస్థానం ఏర్పాటు చేసి విచారణ జరిపేందుకు తీసుకున్న పాలనాపరమైన నిర్ణయాన్ని సవాలు చేస్తూ ఒక క్రిమినల్ దరఖాస్తు దాఖలయింది. ఆ దరఖాస్తు మీద జస్టిస్ రెడ్డప్పరెడ్డి ముందర వాదనలు జరిగాయి. తాను హైకోర్టు తీసుకున్న ఆ పాలనా పరమైన నిర్ణయాన్ని పాటించనక్కరలేదని ఆయన అన్నారు. మా ఇద్దరి మధ్య చాలా వాడి వేడి చర్చ జరిగింది. ఆయన చివరికి ఆ నిర్ణయం ప్రకటించిన ఫైలు తమ దగ్గరికి తీసుకురమ్మని రిజిస్ట్రార్‌ను ఆదేశించారు. మొత్తానికి ఆయన ఆ నిర్ణయాన్ని కొట్టివేయలేకపోయారు. ఆ నిర్ణయాన్ని మళ్లీ జిల్లా న్యాయస్థానానికే పంపించాడు. ఈ వ్యవహారమంతా విచారణను ఆలస్యం చేసే ప్రయత్నంమే. విచారణ గనుక ఒకటి రెండు వారాలు వాయిదా పడినా సాక్షులను కొనివేసే వీలు కలుగుతుంది. సాక్షులను ప్రలోభపెట్టో, బెదరగొట్టో తమ సాక్ష్యాల నుంచి ఉపసంహరించుకునేలా చేయడానికి సమయం దొరుకుతుంది.

విచారణ చుండూరులోనే జరగాలని జిల్లా న్యాయమూర్తి ఇచ్చిన తీర్పు మీద రెండోసారి నిందితులు మళ్లీ హైకోర్టుకు వచ్చారు. ఈసారి అది న్యాయమూర్తి సోమయాజులు ముందుకు వచ్చింది. ఈ దరఖాస్తును విచారించి నిర్ణయం తీసుకోవడానికి మరికొంత సమయం పట్టింది. నిందితుల తరపు న్యాయవాది చాలా బలంగా తమ

వాదనలు వినిపించాడు. చుండూరు దళితులు న్యాయస్థానం ఎట్లా మసలుకోవాలో ఆదేశిస్తున్నారని ఆయన వాదించాడు. దళితులు ఈ దేశంలో న్యాయస్థానం ఎలా పనిచేయాలో శాసిస్తారా? ఆయన అసలు ప్రశ్న అది. ఆయన వాదన కూడా అట్లాగే సాగింది. ఆ రోజు వాదనలు విన్న సోమయాజులు నిందితుల దరఖాస్తును కొట్టివేశారు.

మూడోసారి కూడా నిందితులు హైకోర్టు దగ్గరికి వచ్చారు. ఈ కేసు విచారణ ఒక దళిత న్యాయమూర్తి చేస్తున్నారని, అందువల్ల తమకు న్యాయం జరగదని, ఆయనను మార్చాలని ఈసారి వారి అభ్యర్థన. నిజానికి ఆ న్యాయమూర్తి మామూలు బదిలీలలో భాగంగానే ఈ ప్రత్యేక న్యాయస్థానానికి వచ్చారు. కాని నిందితులు ఆయన మీద చేసిన ఆరోపణలను గనుక జాగ్రత్తగా గమనిస్తే అవి షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల అత్యాచారాల నిరోధక చట్టం పరిధిలోకి వచ్చేవే. ఆ న్యాయస్థానం ఒక దళిత న్యాయమూర్తి అధిపత్యం వహిస్తే నిందితులకు జరగబోయేది అన్యాయమేనని నిందితులు హైకోర్టు ముందు వాదించారు. దాదాపు ఇదే భాషనూ వాదనలనూ ఉపయోగిస్తూ నిందితులు హైకోర్టులోని పాలనాపరమైన విభాగానికి కూడా ఒక ఫిర్యాదు పంపారు.

ఈ ఫిర్యాదుల మీద హైకోర్టులో నేను వాదించాను. కొంత భాగం వాదనను జస్టిస్ సుదర్శన్‌రెడ్డి విన్నారు. ఆయన అప్పటికి గుంటూరుకు సంబంధించిన కేసులను చూసే న్యాయమూర్తిగా ఉన్నారు. అక్కడి నుంచి దళిత న్యాయమూర్తిని బదిలీ చేయడమే మంచిదని ఆయన సిఫారసు చేసినట్టున్నారు. అటువంటి నిర్ణయాలు అసలు మొత్తం వ్యవస్థనే దెబ్బతీస్తాయి. నిజానికి జస్టిస్ సుదర్శన రెడ్డి చాలా ప్రతిభావంతుడైన న్యాయమూర్తి. ఆయనకు సామ్యవాద భావాలు కూడా ఉన్నాయి. ఆయన అటువంటి నిర్ణయం ప్రకటించడం నాకు కాస్త ఆశ్చర్యం కలిగించింది. ఆ వాదనలోని మంచి చెడులను పక్కనపెట్టి, ఆ నిర్ణయం సరైన స్ఫూర్తితో జరగలేదని నాకు అనిపించింది. తమకు జరిగిన అన్యాయాలకు, అవమానాలకు పరిహారం పొందడానికి దళితులకు అరవై సంవత్సరాల స్వాతంత్ర్యం తర్వాత కూడా హక్కులేదా?

ఆ అభ్యంతరాలు, ఆటంకాలు అన్నీ అయిపోయి చుండూరు హత్యాకాండ కేసు విచారణ చుండూరులోనే ప్రత్యేక న్యాయస్థానంలోనే 2004 జనవరి 21న మొదలయింది. ప్రాసిక్యూషన్ దాఖలు చేసిన అభియోగ పత్రంలో మొత్తం 219 మంది నిందితులున్నారు. విచారణ జరిగే క్రమంలో అందులో 33 మంది చనిపోయారు. ఏడుగురు అరెస్టు కాకుండా తప్పించుకు తిరుగుతుండడంతో వారిని ఇతరులనుండి వేరు చేసి విచారణను కొనసాగించడం జరిగింది. చిట్టచివరికి 179 మంది నిందితుల మీద విచారణ జరిగింది. ప్రాసిక్యూషన్ 70 మంది సాక్షులను విచారించింది. తొమ్మింది మంది సాక్షులను నిందితుల తరపున విచారించడం జరిగింది. ప్రాసిక్యూషన్ తరపున 261 వస్తువులను, నిందితుల తరపున 287 వస్తువులను ప్రదర్శించడం జరిగింది. మొత్తం మీద

ప్రాసిక్యూటర్ ఇరవై గంటలపాటు, నిందితుల తరపు న్యాయవాదులు యాభై గంటలపాటు వాదించారు.

చుండూరు హత్యాకాండ కేసుకు సంబంధించిన ఈ వాస్తవ సమాచారమంతా నాకు గుంటూరు మిత్రుడు, యువ న్యాయవాది బి చంద్రశేఖర్ అందజేశాడు. ఆయన ఆ కేసులో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేశాడు. తమ మీద జరిగిన అత్యాచారాల కేసును నడపడానికి చంద్రశేఖర్‌ను తమ తరపున ప్రత్యేక ప్రాసిక్యూటర్‌గా నియమించమని కోరుతూ చుండూరు దళితులు ప్రభుత్వానికి ఒక లిఖిత అభ్యర్థన పంపారు. ప్రభుత్వం ఆయనను నియమించింది.

అది చాలా ధైర్య సాహసాలతో నడిచిన కేసు. ఒక న్యాయవాదికి వృత్తిపరంగా అటువంటి సంతృప్తికరమైన కేసు దొరకడం చాలా అరుదు. తమ వ్యాజ్యాలు గెలవడంలో అద్భుతమైన ప్రతిభను కనబరచిన న్యాయవాదుల జీవిత చరిత్రలు కూడా ఇటువంటి కేసు ఉదాహరణ ముందు చిన్నబోతాయి. స్వయంగా ఒక బాధితుల సమూహం ప్రభుత్వానికి లిఖితపూర్వకమైన అభ్యర్థన చేస్తూ ఫలానా న్యాయవాది తమ తరపున వాదించాలని కోరడం ఆ వ్యక్తిపట్ల ఆ సమూహానికి ఉన్న నమ్మకానికి గొప్ప ఉదాహరణ. ఆ నమ్మకాన్ని ఆయన విజయవంతంగా నిలబెట్టుకున్నాడు.

చుండూరు కేసులో నిందితులకు శిక్షలు పడడమే దానికి నిదర్శనం. ఎనిమిది మంది దళితులను చంపిన కేసులో ఇరవై ఒక్క మంది ముద్దాయిలకు యావజ్జీవ శిక్షలు పడ్డాయి. మరొక 35 మంది ముద్దాయిలకు దౌర్జన్యానికి పాల్పడినందుకు, అందులో ఐదుగురికి గాయపరిచినందుకు శిక్షలు పడ్డాయి.

దళితులకు వ్యతిరేకంగా జరిగిన నేరాల చరిత్ర వేంపెంటలో మావోయిస్టులు చేసిన హింస గురించి చెప్పకపోతే సంపూర్ణం కాదు. దళితుల మీద వాళ్లు జరిపిన అత్యాచారాలు తక్కువేమీ కావు. వాళ్లుచట్టానికి బయట ఉంటారు గనుక వాళ్లు చేసిన నేరాలకు పరిహారం కూడా సాధ్యం కాదు. పశ్చాత్తాపం కూడా ప్రకటించని వామపక్ష ఉద్యమం పేద ప్రజల కోసం వాగ్దానం చేస్తున్న సమాజాన్ని తీసుకురాజాలదు.

* * *

# మేళవలపు దురంతాలు

తమిళనాడులో మధురై జిల్లా మేళవలపు గ్రామ పంచాయతీ బోర్డు సభ్యులుగా ఉన్న దళితులను ఊచకోత కోసిన సంఘటన మరొక దుర్మార్గమైన ఉదంతం. ఇప్పటి

వరకూ చెప్పిన అత్యాచారాలన్నీ దళితులు తమకు రాజ్యాంగం హామీ ఇచ్చిన సామాజిక సమానత్వాన్ని కోరినందుకు జరిగినవి కాగా, మేళవలవులో రిజర్వ్ అయిన పంచాయితీ బోర్డు స్థానాలకు ఎన్నిక అయినందుకుగాను దళితుల మీద అత్యాచారాలు, ఊచకోత జరిగాయి. రాజకీయ సమానత్వం కోరడమే అక్కడ ప్రధాన సమస్య అయింది. ఆ కేసు విచారణ మధురైలో జరగడానికి వీలు లేకపోయింది. ఆ విచారణ సేలం న్యాయస్థానానికి బదిలీ అయింది. తమిళనాడు హైకోర్టుకు చెందిన రతినం ప్రాణాలకు తెగించి ఆ విచారణను జరపవలసి వచ్చింది.

మేళవలపు పంచాయితీ బోర్డును షెడ్యూల్డ్ కులాలవారికి రిజర్వ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఎన్నికలు 1996 డిసెంబరు 28న జరగవలసి ఉండినాయి. ఇతర కులాలకు చెందిన ప్రజలు, ముఖ్యంగా కల్లర్ కులం వారు ఈ ఉత్తర్వుకు సమ్మతించలేదు. అందువల్ల ఎన్నికలు రెండుసార్లు వాయిదా పడవలసివచ్చింది. చివరికి మూడోసారి 31 డిసెంబరున ఎన్నికలు జరిగాయి. ఎన్నికలు రెండుసార్లు వాయిదాపడటానికి పైకి చూపిన కారణమేమంటే ఆ రెండుసార్లు కూడా షెడ్యూల్డ్ కులాల అభ్యర్థులెవరూ నామినేషన్ పత్రాలు దాఖలు చేయలేదు అని. మూడోసారికి, గ్రామంలోని ఇతర కులాల ప్రజలు ఎంతగా అభ్యంతరపెట్టినప్పటికీ మురుగేశన్ అనే దళితుడు తన నామినేషన్ పత్రాలు దాఖలు చేశాడు. అయనే మేళవలపు పంచాయత్ బోర్డు అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. కాని ఆయన తన బాధ్యతలు సాఫీగా నెరవేర్చడానికి వీలులేకపోయింది.

ఎన్నికలు ఆరు నెలలు గడిచిన తర్వాత 1997 జూన్ 30న అధ్యక్షుడు మురగేశన్, ఉపాధ్యక్షుడు మూకన్, సభ్యులు సెల్లాదురై, సేవగమూర్తి, నితియానంద్, పండియమ్మాళ్, కంచివనంలతో కలిసి మధురై కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. తమ గ్రామంలో అగ్నికి ఆహుతి అయిపోయిన ఇళ్లకుగాను ముగ్గురు వ్యక్తులకు నష్టపరిహారం తీసుకురావడానికి వాళ్లు వెళ్లారు. వాళ్లు వెళ్లిన సమయానికి కలెక్టర్ కార్యాలయంలో లేదు. దానితో కంచివనం మినహా మిగిలినవారందరూ గ్రామానికి తిరిగి వెళ్లడానికి మధురైలోని కెఎన్ఆర్ బస్‌స్టాండుకు చేరుకున్నారు. కలెక్టర్ ఎప్పుడు వస్తే అప్పుడు కలుసుకోవడానికి కంచివనం ఆ కార్యాలయంలోనే ఉండిపోయాడు.

వాళ్లందరూ బస్‌స్టాండుకు వెళ్తుండగా మనోహరన్ అనే వ్యక్తి వాళ్లు ఎటువెళ్తున్నారని నితియానందును అడిగాడు. తాము మధురై నుండి కెఎన్ఆర్ బస్సులో తమ గ్రామానికి వెళ్లబోతున్నామని నితియానందం చెప్పగానే ఆ విషయం మరెవరికో చెప్పడానికి మనోహరన్ దగ్గరలోని టెలిఫోన్ బూత్ దగ్గరికి వెళ్లాడు. వీటన్నిటికీ సాక్ష్యాలున్నాయి. మేళవలపు దళిత ప్రజా ప్రతినిధులందరూ బస్సు ఎక్కగానే అళగరస్వామి, దురైపాండి, మణికండన్, జోతి, మణివానగం, జయరామన్ అనే వాళ్లు కూడా ఆ బస్సు ఎక్కారు. ఆ బస్సు కొంతసేపు ప్రయాణించి అగ్రహారం కల్లుకడై మేడు దగ్గరికి చేరగానే దురైపాండి

బస్సు ఆపమని డ్రైవరుకు కేక వేశాడు. బస్సు ఆగిందోలేదో రామర్ నాయకత్వంలో ఒక అల్లరిమూక బస్సును చుట్టుముట్టింది. అప్పుడు అళగరస్వామి మురగేశన్ తలనరికి తల చేతిలో పుట్టకుని పరుగెత్తాడు. అక్కడే షెడ్యూల్డ్ కులానికి చెందిన మరొక ఐదుగురిని, మూకన్, సేవగమూర్తి, బూపతి, సెల్లాదురై, రాజూలను కూడా నరికి చంపారు.

ఆ సాక్ష్యాధారాలను, విచారణను గురించి తెలుసుకునే ముందు, రాజ్యాంగ 73వ సవరణ గురించి తెలుసుకోవడం అవసరం. గ్రామీణ ప్రాంతాలలోని షెడ్యూల్డ్ కులాలకు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన వ్యక్తులకు సాధికారత కల్పించడం కోసం 73వ సవరణ ద్వారా ఒక రాజ్యాంగ బద్ధమైన ప్రయత్నం జరిగింది. దాని ప్రకారం గ్రామీణ స్వయం పాలనా సంస్థలలో షెడ్యూల్డ్ కులాలకు, షెడ్యూల్డ్ తెగలకు కొన్ని స్థానాలను రిజర్వ్ చేయడం తప్పనిసరి అయింది. అందువల్లనే మేళవలపు గ్రామ పంచాయత్ రిజర్వ్ పంచాయత్‌గా మారింది. సామాజికంగా అణగారిన వర్గాలకు చెందినవారికి ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలనే నిబంధన వచ్చిన తర్వాత ఎన్నికయిన మొట్టమొదటి అధ్యక్షుడు మురుగేశన్. కాగా ఈ హత్యాకాండ కేసులో మొదటి ముద్దాయి కల్లర్ కులానికి చెందిన అళగరస్వామి. ఆ గ్రామానికి అంతకుముందు వరకూ అధ్యక్షుడిగా పనిచేసినవాడు. ఒక షెడ్యూల్డ్ కులానికి చెందిన వ్యక్తికి సర్పంచ్ పదవి ఇస్తారా అని చాలా వివాదం అంతకుముందే నడిచింది.

ఇక్కడ ఒక్కసారి 1989 షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల అత్యాచారాల (నిరోధ) చట్టంలోని కొన్ని నిబంధనలను గుర్తుచేసుకోవడం అవసరం. ఆ చట్టం 1989లో తయారయినప్పటికీ, అది 1990 జనవరి 30 నుండి అమలులోకి రావడం మొదలయింది. మరి రాజ్యాంగానికి 73వ సవరణ 1992లో ప్రవేశపెట్టబడగా, 1993 జనవరి 1 నుండి అమలులోకి వచ్చింది.

ఆ అత్యాచారాల నిరోధ చట్టం ప్రవేశపెట్టే ముందు చేసిన లక్ష్యాల, కారణాల ప్రకటన ఒకసారి చూడండి.

"షెడ్యూల్డ్ కులాలకు, షెడ్యూల్డ్ తెగలకు చెందినవారి సామాజికార్థిక స్థితిగతులను మెరుగుపరిచేటందుకు ఎన్నో చర్యలు తీసుకోబడినప్పటికీ, వారి మీద దౌర్జన్యాలు సాగుతూనే ఉన్నాయి. వారి పౌర హక్కులు ఉల్లంఘించబడుతున్నాయి. వారివల్ల ఎన్నో రకాల నేరాలు, అగౌరవాలు, అవమానాలు, వేధింపులు జరుగుతూనే ఉన్నాయి. ఎన్నో పాశవిక సంఘటనలలో వారి ప్రాణాలనూ ఆస్తులనూ కొల్లగొట్టడం జరుగుతున్నది. విభిన్నమైన చారిత్రక, సామాజిక, ఆర్థిక కారణాలవల్ల వారి మీద తీవ్రమైన నేరాలెన్నో జరుగుతున్నాయి.

విద్యావ్యాప్తి ద్వారా, ఇతర అంశాల ద్వారా షెడ్యూల్డ్ కులాలకు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన వారిలో చైతన్యం పెరిగినందువల్ల, వారు తమ హక్కులను నిలబెట్టుకున్నందు

వల్ల వారు తలెత్తుకుని తిరగడాన్ని ఇతరులు సహించలేకపోతున్నారు. వారు తమ హక్కులకోసం నిలబడినప్పుడల్లా, తమపట్ల అస్పృశ్యత వంటి అనాచారాలను ప్రతిటించినప్పుడల్లా, చట్టబద్ధంగా తమకు రావలసిన కనీస వేతనాలను అడిగినప్పుడల్లా, లేదా ఏ రకమైన వెట్టిచాకిరీని, నిర్బంధ పూరితమైన శ్రమను వారు ప్రతిఘటించినప్పుడల్లా, స్వార్థపరశక్తులు వారిని లొంగదీయడానికి, భయోత్పాతంలో ముంచడానికి ప్రయత్నిస్తున్నాయి. షెడ్యూల్డ్ కులాలకు చెందినవారు తమ ఆత్మగౌరవాన్ని, తమ స్త్రీల మర్యాదను కాపాడుకోవడానికి ప్రయత్నించినప్పుడల్లా పెత్తందార్లకూ, కలిగినవారికీ అది కంటగింపు అవుతోంది. షెడ్యూల్డ్ కులాలవారు, షెడ్యూల్డ్ తెగలవారు చివరికి ప్రభుత్వం కేటాయించిన భూముల్లోనైనా ఉండడం, వ్యవసాయం చేసుకోవడం స్వార్థపరశక్తులు సహించలేకపోతున్నాయి. చాలా సందర్భాలలో ఆ కారణంగానే వారి మీద దాడులు జరుగుతున్నాయి. ఇటీవలి కాలంలో ఆందోళనా భరితమైన అత్యాచారాలు చాలా పెరిగిపోతున్నాయి. షెడ్యూల్డ్ కులాల వారిచేత బలవంతంగా మలం లాంటి తినరాని పదార్థాలు తినిపించడం, నిస్సహాయులైన షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల వ్యక్తులపై దాడి చేయడం, చంపివేయడం, వారి స్త్రీల మీద అత్యాచారాలు చేయడం పెరిగిపోతున్నాయి. ఈ పరిస్థితులలో 1915 పౌర హక్కుల పరిరక్షణా చట్టం వంటి చట్టాలు, భారత శిక్షాస్మృతి నిబంధనలు ఈ నేరాలను అరికట్టడానికి సరిపోవని తేలుతున్నది. షెడ్యూల్డ్ కులాలకు, షెడ్యూల్డ్ తెగలకు చెందినవారిపై ఈ నేరాలను అరికట్టడానికి, అదుపుచేయడానికి ఒక ప్రత్యేక చట్టాన్ని ప్రవేశపెట్టవలసిన అవసరం ఏర్పడింది".

అంటే ఈ ప్రత్యేక కారణాలవల్ల,ఈ ప్రత్యేక లక్ష్యాలతో ఆ అత్యాచారాల నిరోధ చట్టం ఉనికిలోకి వచ్చింది.

ఇపుడు మళ్లీ మేళవలపు హత్యాకాండ విషయం చూస్తే, ఈ హత్యాకాండ ఆ గ్రామ పంచాయత్‌ను రిజర్వ్ పంచాయత్‌గా ప్రకటించిన తర్వాత, తలెత్తిన ఎన్నికల తగాదావల్ల జరిగింది. పరిశోధనాధికారి ఆ తగాదా ఏమిటో, మురగేశన్‌ను ఆ గ్రామ పంచాయత్ అధ్యక్ష పదవి స్వీకరించకుండా చూడడానికి ఏమేమి జరిగాయో, చివరికి ఆ ప్రయత్నాలన్నీ ఆయన హత్యకు ఎట్లా దారితీశాయో వివరించాడు. ఆ కేసులో మనోహరన్, భారతీదాసన్ అనే ఇద్దరు ముద్దాయిలు మినహా మిగిలిన ముద్దాయిలందరూ కల్లర్ కులానికి చెందినవారే. మొదటి ముద్దాయి అళగర స్వామి ఆ గ్రామ పంచాయత్ రిజర్వ్ పంచాయత్‌గా ప్రకటించబడేవరకూ ఆ గ్రామ పంచాయత్ అధ్యక్షుడిగా ఉన్నాడనేది ముఖ్యమైన విషయం. ఆ మొదటి ముద్దాయి మురుగేశన్ తల నరికాడని, ఆ తలపట్టుకుని పరిగెత్తాడని బలమైన సాక్ష్యాధారాలున్నాయి. అంటే ఎన్నికల ద్వారా తామే ఏమి సాధించలేకపోయారో, అది సాధించడానికి కల్లర్ కులస్తులు ఈ మార్గాన్ని, హత్యాకాండను

ఎంచుకున్నారన్నమాట.

మొత్తం మీద ఈ కేసులో పదిహేడు మంది ముద్దాయిల మీద విచారణ జరిగింది. వారందరూ దొమ్మీలోనూ హత్యలోనూ పాల్గొన్నారని నిర్ధారణ అయింది. విచిత్రంగా ఆ విచారణ జరిపిన న్యాయమూర్తి ఆ ముద్దాయిలకు ముందస్తు ఉద్దేశ్యం లేకపోవచ్చునని, ఉద్దేశ్యపూర్వకంగా ఆ నేరాలు చేసి ఉండకపోవచ్చునని అన్నాడు. అందులోనూ ఆ గ్రామ పంచాయత్‌ను రిజర్వ్ చేయడంతో, ఆ తర్వాత జరిగిన ఎన్నికలతో అపార్థం వల్లనే ఆ నేరం జరిగిందనడానికి వీలులేదన్నాడు. ఈ నిర్ధారణ మీదనే ముద్దాయిలను పై కోర్టులో నిర్దోషులుగా విడిచిపెట్టవచ్చు. ఒక క్రిమినల్ కేసులో సాక్ష్యాధారాలను ఎట్లా అర్థం చేసుకోవాలనే విషయంలో పొరపాటు దొర్లిందనేది ఇక్కడ స్పష్టమే.

విచారణ జరిపిన న్యాయమూర్తి ఆ ముద్దాయిలను దొమ్మీ చేసినందుకు, హత్య చేసినందుకు నేరస్తులుగా నిర్ధారించాడు.వారికి యావజ్జీవ కారాగార శిక్షలు వేశాడు. కాని వారి మీద సెక్షన్ 148, సెక్షన్ 302 కింద నేరాలను మాత్రం నిర్ధారించలేదు. అలాగే అత్యాచారాల నిరోధ చట్టంలోని సెక్షన్ 3(ఎ)నూ భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 149నీ కలిపివేసి సుస్పష్టంగా కనబడే సెక్షన్ 149 నేరం నుండి కూడా వారిని వదిలివేశాడు. చాలా విచిత్రంగా వారిని దొమ్మీ నేరస్తులుగా నిర్ధారించి, ముందస్తు ఆలోచనేమీ లేకుండా దొమ్మీ చేశారని అంటాడు. దొమ్మీ అంటేనే ముందే కూడబలుక్కోవడం, చట్టవ్యతిరేకంగా గుమిగూడడం. ఈ అవకతవకలన్నీ చూస్తే ఈ కేసుపై కోర్టులలో కొట్టుడుబోవడానికి మార్గం సుగమం చేసినట్టు కనబడుతుంది. అందుకే ముద్దాయిలు కుట్రచేశారనే అభియోగాన్ని కూడా ఆయన కొట్టివేశాడు.

ఆ నేరస్తులు చేసిన నేరాలను నిర్ధారించడానికి, వారిని నిర్దోషులుగా ప్రకటించిన తీర్పును తిరగదోడడానికి న్యాయశాస్త్ర సూత్రాలనే పునర్వ్యాఖ్యానించవలసి వుంటుంది. భారత శిక్షాస్మృతిలోని కొన్ని సెక్షన్ల గురించి బాధితులకు అనుకూలమైన నిర్వచనాలు ఇవ్వవలసి ఉంటుంది. ఇద్దరు లేదా ముగ్గురు వ్యక్తులు ఒక ఉమ్మడి ఉద్దేశ్యంతో నేరం చేసినట్లయితే, ఐదుగురు లేదా అంతకన్న ఎక్కువ వ్యక్తులు తమంతట తాము చట్ట వ్యతిరేకంగా సమావేశమై, హింసకు పాల్పడినట్లయితే, నేరం చేయడానికి నిర్ణయించు కున్నట్లయితే వారందరికీ నేరంలో భాగం ఉన్నట్టే అనే మౌలిక న్యాయశాస్త్ర సూత్రాన్ని పునర్వ్యాఖ్యానించ వలసి ఉంటుంది. నేరంలో భాగం ఉండడం క్రిమినల్ లయబిలిటీ-అనేదాన్ని ఎలా అర్థం చేసుకోవాలో పునర్వచించవలసి ఉంటుంది.

"క్రిమినల్ లయబిలిటీ అనే సాధారణ సూత్రం ప్రాథమికంగా చెప్పేదేమంటే, వాస్తవం ఒక నేరం చేసిన వ్యక్తికి నేరంతో ఉండే సంబంధం ఎటువంటిదో అది చెపుతుంది. ఆ నేరానికి ఆ వ్యక్తినే ఎందుకు బాధ్యుడిని చేయవలసి ఉంటుందో, ఎందుకు శిక్షించవలసి ఉంటుందో చెపుతుంది. సెక్షన్ 34, 149లు నేరాచరణ అంటే ఏమిటో వివరిస్తాయి.

సెక్షన్ 149 ఒక నిర్దిష్ట నేరం గురించి చెప్పి, ఒక ఉద్దేశ్యంగల ఐదుగురు వ్యక్తుల సమావేశాన్ని నిర్వచిస్తుంది. ఒక నేరంలో ఒకరికన్న ఎక్కువ మంది పాల్గొన్నప్పుడు నేరాచరణలో సహభాగస్వామ్యాన్ని నిర్ధారించే సూత్రాన్ని సెక్షన్ 34 ప్రవేశపెట్టింది. సెక్షన్ 120-బిలో చెప్పిన నేరం చేయడానికి జరిగే కుట్ర కూడా ఇటువంటిదే. అది ఒక నేరం చేయడానికి ఇద్దరు లేదా అంతకన్న ఎక్కువ మంది మధ్య ఒప్పందం కుదరడం గురించి మాట్లాడుతుంది. అయితే, ఈ సెక్షన్లను వర్తింపజేయవచ్చునా లేదా అనేది తేల్చుకోవడానికి ముందు, న్యాయస్థానం ఆ నేరంలో ఇద్దరికన్న ఎక్కువ పాల్గొన్నారనే విషయాన్ని నిస్సందేహంగా తేల్చుకోవలసి ఉంటుంది. వారికి ఉమ్మడి ఉద్దేశ్యం ఉన్నదా అని తేల్చుకోవలసి ఉంటుంది. లేదా ఐదుగురు వ్యక్తులు ఒకే లక్ష్యాన్ని కలిగి ఉన్నారా, ఇద్దరు వ్యక్తులు ఒక ఒప్పందం చేసుకున్నారా తేల్చుకోవలసి ఉంటుంది". అని బ్రాతి వర్సస్ స్టేట్ ఆఫ్ పంజాబ్ కేసులో 1991లో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

ఈ చర్చలో ఉమ్మడి ఉద్దేశ్యమంటే ఏమిటనే ప్రశ్న కూడా వచ్చింది. ఆంగ్ల మహాకవి మిల్టన్ రాసిన 'ఆన్ హిజ్ బ్లైండ్‌నెస్' అనే కవితలోంచి ఒక అందమైన వాక్యాన్ని ఉటంకించి ఆ నిర్వచనం ఇవ్వడానికి ప్రయత్నం జరిగింది. తన చుట్టూ కమ్ముకొస్తున్న గుడ్డితనం గురించి ప్రస్తావిస్తూ భగవంతుడికి సేవ చేయడానికి నిరీక్షిస్తున్న వారుకూడా భగవంతుడికి సేవ చేస్తున్నట్టే అని ఆ వాక్యం చెపుతుంది.

1925లో వీరేంద్ర కుమార్ ఘోష్ వర్సస్ ఎంపరర్ అనే కేసులో లార్డ్ సమ్మర్ తీర్పు చెపుతూ ఈ వ్యాక్యాన్ని ఉటంకించి ఉమ్మడి ఉద్దేశ్యంతో నేరం చేయడం అనేదానికి ఉండే న్యాయపరమైన పర్యవసానాల గురించి చర్చించారు. మనుషులమధ్య ఒక ఉమ్మడి ఉద్దేశ్యం సద్యోజనితంగా రూపొందవచ్చునని, ఆ విధంగా తయారయిన సమూహం ఒక నేరపూరిత చర్యకు పాల్పడవచ్చునని, వారిలో కొందరు తమ ప్రత్యర్థుల తలల మీద దెబ్బలు కొట్టవచ్చునని, కొందరు ఆ తలలు పగులగొట్టవచ్చునని, మరికొందరు నెత్తురు చిందించవచ్చునని లార్డ్ సమ్మర్ వ్యాఖ్యానించాడు. అంటే నేరం అనేది ఆ ఉద్దేశ్య సామూహికతతో, చర్యలో భాగస్వామ్యంతో కలిసి సాగుతుంది.

శిక్షాస్మృతి చాలా మామూలుగా చెప్పే శిక్షా ప్రయోజనాన్ని దెబ్బతీయడానికి ఎటువంటి న్యాయశాస్త్ర సున్నిత సూత్రాలను ఉపయోగించినా ప్రయోజనం లేదు అని 1955లో శ్రీకంఠయ్య రామయ్య మునిపల్లి వర్సస్ స్టేట్ ఆఫ్ బొంబాయి అనే కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. నిందితులలో ఒకరు పొరపాటున వైని చంపేబదులు ఎక్స్‌ని చంపితే, ఆ చంపడమే చర్య ముందే ఏర్పాటుచేసుకున్న ప్రణాళికలో భాగమే ననడానికి సాక్ష్యాధారాలు ఉంటే, అందువల్ల ఉమ్మడి ఉద్దేశ్యానికి మార్పేమీ రాదు. ఈ సంగతి కూడా 1970లో హేతుబ్బా వర్సస్ స్టేట్ ఆఫ్ గుజరాత్ అనే కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో వెల్లడయింది.

ఉమ్మడి ఉద్దేశ్యం అనే విషయంలో న్యాయశాస్త్రం లార్డ్ సమ్మర్ రోజుల నుంచీ ఏమీ మారలేదు. 2003లో స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వర్సస్ కె శ్రీనివాసులు రెడ్డి అనే కేసులో సుప్రీంకోర్టు అంతకుముందరి హైకోర్టు తీర్పును తప్పుపట్టింది. ఆ సందర్భంలో కింది కోర్టు సెక్షన్ 302 కింద విధించిన శిక్షను హైకోర్టు సెక్షన్ 326 కిందికి మార్చివేసింది. కాని సుప్రీంకోర్టు తీర్పు చెపుతూ హైకోర్టు ఇచ్చిన తీర్పు తార్కికంగా సరయినది కాదని, నేర విచారణా న్యాయశాస్త్రంలో ఇప్పటికే నిర్ధారణ అయిన ఏ సూత్రాలకూ అనుగుణంగా లేదని అన్నది. ఆ సంఘటన ముందూ వెనకా జరిగిన సంఘటనలను, విచక్షణా రహితంగా జరిగిన దాడులను, పెద్ద ఎత్తున వాడిన ఆయుధాలను, హతుల సమీపంలో పడి ఉన్న ఆయుధాలను చూస్తే అక్కడ ముందే ఏర్పరచుకున్న ఉమ్మడి ఉద్దేశ్యం ఉందని రుజువవుతున్నదని అందువల్ల సెక్షన్ 34 వర్తిస్తుందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

అప్పుడు సుప్రీంకోర్టు 1956లో జరిగిన విలియం స్టేన్లీ కేసును ఉదహరించింది. ఆ కేసులో "భారత శిక్షాస్మృతిలోని సెక్షన్లు 34, 114, 149లలో ప్రతిపాదించిన నేరాచరణ బాధ్యతను ఒక నేరపూర్వక సంఘటనలో వాస్తవంగా భాగస్వాములయిన వాళ్లవైపు నుంచి, ఒక ఉమ్మడి లక్ష్యంతోగాని, ఉద్దేశ్యంతోగాని పనిచేసి వారివైపు నుంచి, విభిన్న కోణాల నుంచి చూడవచ్చు. అపుడు ఈ అభియోగం ప్రత్యక్ష బాధ్యతను ఒకే చోట కలిపేసింది. ఎవరు నేరుగా బాధ్యులు, ఎవరు ఆ నేరం జరగడానికి సహకారులు అనే విభజనను చేయలేదు. అటువంటి స్థితిలో, నేర బాధ్యతలోని విభిన్న అంగాలకింద ఒకరి మీద అభియోగం రాలేదంటే అదే అంతిమం కాదు అని వాదించనక్కరలేదు. అందువల్ల ఒక నేర నిర్ధారణను కొట్టివేసేముందు, వారి మీద ఆ నేరం ఆరోపించేందుకు ముందస్తు అభిప్రాయం ఉన్నదని తేల్చవలసి ఉంటుంది" అని ఆ తీర్పు ప్రకటించింది. ఇటువంటి కేసులలో అన్ని అంశాలపైన సంపూర్ణ సాక్ష్యం అందుబాటులో ఉండాలని న్యాయస్థానం అన్నది.

ఇప్పుడిక భారత శిక్షాస్మృతి సెక్షన్ 149 కింద చట్ట వ్యతిరేకంగా గుమిగూడడం అనే నేరం విషయం చూద్దాం. ఇక్కడ చట్ట వ్యతిరేకంగా గుమిగూడడం అనే నేరాన్ని నిర్వచించిన సెక్షన్ 141 నిఉదాహరించడం అవసరం. ఐదుగురు గాని అంతకన్న ఎక్కువగాని వ్యక్తుల సమూహం, తమలో తాము ఇతర విషయాలతోపాటు తమ నేర సామర్థ్యాన్ని ఉపయోగించి, లేదా బల ప్రయోగం చేసి, అవతలి వ్యక్తులను బెదరగొట్టాలని ఉమ్మడిగా ఉద్దేశించుకున్నట్లయితే.." అని నిర్వచిస్తుంది. ఆ అవతలి వ్యక్తులు చట్టబద్ధ అధికారాన్ని నిర్వహిస్తున్న ప్రభుత్వాధికారులు కావచ్చు.

మేళవలపు కేసులో వచ్చిన సాక్ష్యాధారాలలో ఆ పంచాయత్‌ను రిజర్వ్ పంచాయత్‌గా మార్చినందుకు వచ్చిన అభ్యంతరాల ప్రస్తావన ఉంది. మొదటి హతుడు ఒక షెడ్యూల్డ్ కులానికి చెందిన వ్యక్తి. ఆయన గ్రామ పంచాయత్ అధ్యక్ష పదవికి పోటీ చేసి

గెలుపొందాడు. ఆ వ్యక్తి చట్టబద్ధంగా పొందిన అధికారాన్ని వినియోగించకుండా అడ్డుకోవడానికి నేర శక్తిని, బలప్రయోగాన్ని వాడడం జరిగింది. అంటే సెక్షన్ 141 నిర్వచించిన నేరపూరిత చర్య జరిగిందని చూపడానికి ఇక్కడ హతుడు ప్రభుత్వోద్యోగిగా తన బాధ్యతలు నిర్వహించకుండా చూసేందుకు చివరిదాకా ప్రయత్నాలు జరిగాయని చూపేందుకు ఆధారాలున్నాయి. ఈ వాస్తవాలకూ, చట్ట వ్యతిరేకంగా గుమిగూడడానికీ మధ్య కొట్టవచ్చినట్టుగా ఉన్న సంబంధాన్ని చూడడంలో న్యాయమూర్తి విఫలమయ్యాడు. ఇక్కడ కీలకమైన ప్రశ్న ఈ గుమిగూడిన వారు ఐదుగురికన్న ఎక్కువ ఉన్నారా లేదా అనేది. దానితోపాటే వారందరూ సెక్షన్ 141 కింద సూచించిన ఉమ్మడి లక్ష్యాన్ని కలగి ఉన్నారా లేదా అనేది.

చట్ట వ్యతిరేకంగా గుమిగూడడం అనే నేరానికి రెండు భాగాలున్నాయని సుప్రీంకోర్టు అన్నది. దానిలో మొదటి భాగాన్ని సెక్షన్ 149తో కలిసి చూడాలని, అంటే, ఆ నేరాన్ని ఒక ఉమ్మడి లక్ష్యం సాధించడం కోసం జరిగిన గుమిగూడడంగా చూడాలని అన్నది. ఈ సమూహంలో నిందితుడు పాలుపంచుకొన్నాడని నిరూపించవలసి ఉంటుందన్నమాట. ఒకవేళ ఆ గుమిగూడిన సమూహం తీసుకున్న ఉమ్మడి లక్ష్యానికి ఆ నేరం ప్రత్యక్ష సంబంధంలో లేనిదయినప్పటికీ, అది సెక్షన్ 141 కిందికే వస్తుంది. ప్రతి నేరస్తుడు, ప్రతి ముద్దాయి ప్రతి ఒక్క నేరమూ చేశాడని రుజువు చేయనక్కరలేదు. ఆ ముద్దాయి ఒక గుంపులో ఉంటే ఆ గుంపు చట్టవ్యతిరేకమైన గుంపు అయితే, ఆ గుంపు ఒక ఉమ్మడి ఉద్దేశ్యంతో ఒక నేరం చేస్తే, ఆ గుంపులో ఉన్న ప్రతి ఒక్కరికీ ఆ నేరంతో సంబంధం ఉన్నట్టే. ఆ వ్యక్తి మనసులో ఉన్న లక్ష్యం ఏమిటో సందర్భాన్ని బట్టి ఊహించి తేల్చవలసిందే తప్ప, ఆ గుంపులోని వ్యక్తులు వాడిన భాష వల్ల తేల్చవలసిందే తప్ప, దాడికి ముందు జరిగిన ఘటనలనుంచీ, దాడి ఫలితాల నుంచీ తేల్చవలసిందే తప్ప విడిగా రుజువు చేయడం సాధ్యం కాదు.

సెక్షన్ 34లో వాడిన ఉమ్మడి లక్ష్యం, ఉమ్మడి ఉద్దేశ్యం అనే పదాల మధ్య కూడ సుప్రీంకోర్టు తేడాను చూసింది. ఉమ్మడి ఉద్దేశ్యం అనే దానికి దాడికి ముందే కలుసుకోవడం, చర్చించుకోవడం అవసరంలేదని చందా వర్సస్ స్టేట్ ఆఫ్ యుపి అనే కేసులో 2004లో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

మొదటి హతుడు ఎన్నికయిన గ్రామ పంచాయత్ అధ్యక్షుడు. షెడ్యూల్డ్ కులానికి చెందినవాడు. 73వ రాజ్యాంగ సవరణ తర్వాత ఆ గ్రామ పంచాయత్ రిజర్వ్ కేటగిరీగా ప్రకటించబడిన తర్వాత జరిగిన ఎన్నికలో ఆయన విజయం సాధించాడు. ఆ రాజ్యాంగ సవరణ 1992లో అమలులోకి వచ్చింది. మేళవలపు పంచాయతీని జూన్ 1996లో రిజర్వ్ పంచాయత్‌గా ప్రకటించడం జరిగింది. అక్కడ ఎన్నికలు డిసెంబరు 28, 1996న జరిగాయి. ఈ ఎన్నికల విషయంలో గ్రామంలోని షెడ్యూల్డ్ కులానికి చెందిన వ్యక్తులకూ,

కళ్లర్ కులానికి చెందిన వ్యక్తులకూ మధ్య ఘర్షణలు జరిగాయని కింది కోర్టు దగ్గర సాక్ష్యాధారాలున్నాయి. ఎన్నికలు జరగకుండా అడ్డుకోవడం జరిగింది. చివరికి ఎన్నికలు జరిగినప్పుడు షెడ్యూల్డ్ కులానికి చెందిన వారు తమ ఓటు హక్కు వినియోగించుకోకుండా అడ్డుకోవడం జరిగింది. కింది కోర్టు విచారణలో పరిశోధనాధికారి, ఇతర సాక్షులు ఇచ్చిన వాంగ్మూలాలు ఈ విషయాన్ని తెలియజెపుతాయి. ఆ సాక్ష్యాధారాలను ఎవరూ కాదనలేదు. నిజానికి కింది కోర్టు న్యాయమూర్తి తన తీర్పులో ఈ విషయాలన్నీ పొందుపరిచాడు కూడా. ఆ న్యాయమూర్తి రాసిన నిర్ధారణలకూ విచారణ క్రమంలో నమోదు అయిన సాక్ష్యాధారాలకూ సంబంధంలేదు. ప్రాసిక్యూషన్ తొలి సాక్షి చెప్పిన వాంగ్మూలాన్నంతా ఆ న్యాయమూర్తి నమ్మశక్యం కానిదనే పేరుతో కొట్టివేశాడు. మొదటి హతుడు బస్సు ఎక్కినప్పుడు ఆ బస్సులోనే నలుగురు ముద్దాయిలు, హతుడు జయరామన్ ఎక్కారనే సాక్ష్యం ఉంది. బస్సు కల్లుకడై మేడు దగ్గరికి రాగానే ఒక ముద్దాయి బస్సును ఆపమని కేకవేశాడని సాక్ష్యం ఉంది. బస్సు ఆగగానే బస్సులోపల ఉన్న ముద్దాయిలు ఒక్కుమ్మడిగా లేచారని, బయటి నుంచి కూడ ముద్దాయిలు బస్సును చుట్టుముట్టారని, దాడి చేశారని సాక్ష్యాలున్నాయి. ఆ దాడిలో షెడ్యూల్డ్ కులానికి చెందిన ఆరుగురిని చంపివేశారు. ముద్దాయిలలో ఒక్కరు కూడా షెడ్యూల్డ్ కులానికి చెందినవారు లేదు. ఇద్దరు మినహా ముద్దాయిలందరూ కళ్లర్ కులానికి చెందిన వారే.

ఈ నేరారోపణలో 1989 షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల అత్యాచారాల నిరోధ చట్టం 3(2) (వి)ను భారత శిక్షాస్మృతి సెక్షన్ 149తో కలిపి వర్తింపజేయాలని విజ్ఞుడైన న్యాయమూర్తి అభియోగపత్రాన్ని సరిగ్గానే నమోదు చేశారు. కాని హతులలో మొదటివాడయిన మురుగేశన్ షెడ్యూల్డ్ కులానికి చెందినవారు మాత్రమే గాక, ఒక ప్రజా ప్రతినిధికూడానని, అంటే ప్రభుత్వోద్యోగిగా గుర్తించవచ్చునని, ఆ ప్రభుత్వోద్యోగి తన విధులు నిర్వహించకుండా అడ్డుకోవడంలో ఆ ముద్దాయిలు చట్టవ్యతిరేకమైన అల్లరిమూకగా తయారయ్యారని ఆయన గుర్తించలేదు. అలా గుర్తించి ఉంటే ఆయన ఆ నేరానికి అత్యాచారాల నిరోధ చట్టం సెక్షన్ 3(వి) (2)తోపాటు భారత శిక్షాస్మృతి సెక్షన్ 149ని కూడా వర్తింపజేయాలని అనుకుని ఉండేవారు. ఆ చట్టంలో జాబితా ఇచ్చిన నేరాలను, అత్యాచారాలను గనుక ఆ న్యాయమూర్తి ఒక్కసారి పరికించి ఉంటే షెడ్యూల్డ్ కులాలకు, తెగలకు చెందిన అభాగ్యులు నేటి సమాజంలో ఎటువంటి దుస్థితిని గడుపుతున్నారో తెలిసి ఉండేది.

ఇటువంటి కేసులలో సాక్ష్యాధారాలను పరిశీలించేటపుడు న్యాయమూర్తులు, న్యాయ వ్యవస్థ తప్పనిసరిగా ఈ చారిత్రక వాస్తవాన్ని తమ గమనంలోకి తీసుకోవలసి ఉంటుంది. కాని విచారణ జరిపిన న్యాయమూర్తికి ఆ నేరాన్ని అత్యాచారాల నిరోధక చట్టం కింద నేరంగా గుర్తించడానికి విముఖత ఉండింది. అందువల్లనే ఆయన సెక్షన్ 8లో చెప్పిన

ప్రాతిపదికను అంగీకరించలేమని నిర్ధారణ ప్రకటించారు. కాని ఆయన చేసిన ఆ నిర్ధారణ తప్పు అనడానికి రెండు కారణాలున్నాయి.

మొదటిది, హతులను ముద్దాయిలు చంపడానికి ఏకైక కారణం వారు దళితులుగా తమకు రావలసిన పంచాయత్ అధికార స్థానాలు కావాలని వాదించడమే. ఘటనకు ముందు జరిగిన ఘర్షణలకు, తత్ఫలితంగా జరిగిన ఘటనకు మధ్య ఉన్న కార్యకారణ సంబంధంతో దీన్ని రుజువు చేయవచ్చును.

రెండవది, అలా కాకపోయినప్పటికీ, అత్యాచారాల నిరోధ చట్టంలోని సెక్షన్ 6 ప్రకారం చూసినా ఇక్కడ సెక్షన్ 8 వర్తింపజేయడానికి ప్రాతిపదిక ఉన్నదని వాదించవచ్చు. ఆ చట్టంలోని సెక్షన్ 8(బి) ఏమి చెపుతుందంటే, ఒకవేళ ఒక గుంపు ఒక నేరానికి పాల్పడిందని రుజువు అయినట్టయితే, ఆ నేరం అంతకుముందు జరిగిన ఘర్షణ పర్యవసానంగానే జరిగిందని రుజువు అయినట్టయితే అపుడు ఆ గుంపుకంతా ఒక ఉమ్మడి ఉద్దేశ్యం ఉన్నదని, తమ ఉమ్మడి లక్ష్యానికి అనుగుణంగానే వారు ఆ నేరం చేశారని నమ్మడానికి ఆధారం ఉన్నట్టే.

ముద్దాయిలు 40 మందిలో, ఒక్కరంటే ఒక్కరు కూడా షెడ్యూల్డ్ కులానికి చెందినవారు కారు. ఎనిమిదో నిందితుడు మనోహరన్, 31వ నిందితుడు భారతీదాసన్ మినహా మిగిలిన ముద్దాయిలందరూ కల్లర్ కులానికి చెందినవారే. దాడి జరిగిందనే విషయంలో భిన్నాభిప్రాయాలేమీ లేవు. మేలూర్ తాలూకా తహశీల్దార్ పుల్లాని సాక్ష్యం ఇస్తూ దాడి జరిగిన ప్రదేశాన్ని తాను ఆ రాత్రే సందర్శించానని, అప్పటికి అక్కడ ఆరు మృతదేహాలు పడి ఉన్నాయని చెప్పాడు. దాడి ఎలా జరిగిందో చెప్పడానికి ఎన్నో ప్రత్యక్ష సాక్ష్యాలున్నాయి. గాయపడిన వ్యక్తులు కూడా సాక్ష్యం చెప్పారు.

ఇంత బలంగా సాక్ష్యాధారాలు ఉన్నప్పటికీ, విచారణ జరిపిన కింది న్యాయస్థానం పైన అప్పీలుకు వెళితే కేసు కొట్టుడుపోయేలా తీర్పు రాసింది. ఆ తీర్పులో ఆ న్యాయమూర్తి ఇలా అన్నారు.

"తాము షెడ్యూల్డ్ కులానికి చెందిన వారందరినీ గాని, లేదా ఇప్పుడు హతులయిన వారిని గాని చంపుతామని ముద్దాయిలు మాటల్లోగాని, హావభావాల్లోగాని ప్రకటించారనడానికి ఎటువంటి నిర్దిష్ట, ప్రత్యక్ష సాక్ష్యాధారాలులేవు. ముద్దాయిలందరూ కలుసుకుని షెడ్యూల్డ్ కులానికి చెందిన వారినిచంపడానికి బహిరంగంగాగాని, రహస్యంగాగాని కుట్ర చేశారని చెప్పడానికి నమ్మదగిన ఆధారాలను ప్రాసిక్యూషన్ సమకూర్చలేకపోయింది.

హతులపట్ల ముద్దాయిలకు ఎటువంటి వ్యక్తిగతమైన, సంపూర్ణమైన శత్రుత్వంగాని, దురుద్దేశ్యంగాని ఉందని చెప్పడానికి ఆధారాలులేవు. పంచాయత్ బోర్డును రిజర్వు తరగతిగా మార్చినందుకు కొంత అసంతృప్తి ఉందనే కారణం తప్ప మరో కారణంలేదు.

అందువల్ల ఈ దాడి మరొక పరిస్థితివల్లగానీ, పరిణామం వల్లగాని జరిగి ఉండవచ్చును. ముద్దాయిలకు ఈ నేరాలు చేయడానికి ముందస్తు ఉద్దేశ్యంగాని, లక్ష్యంగాని ఉన్నాయని అనడానికి వీలులేదు. అది కూడా రిజర్వు తరగతిగా మార్చినందువల్ల కలిగిన అపార్థంగాని, ఆ తర్వాత జరిగిన ఎన్నిక కాని కారణం కావడానికి వీలులేదు" అని ఆ తీర్పు రాశారు.

ఒక్క మంచి విషయమేమిటంటే పై కోర్టులలో గట్టి న్యాయమూర్తులుగనుక ఉంటే ఇటువంటి కింది కోర్టుల తీర్పులను అడ్డుకుంటారు. దళితులకు వ్యతిరేకంగా అగ్రవర్ణాల హింసాకాండను ఎంతో కొంత ఆపడానికి ప్రయత్నిస్తారు. కాని తేవర్లకు అనుకూలమైన ప్రభుత్వం ఈ కేసులో అగ్రవర్ణ ముద్దాయిల మీద ఎన్నో అభియోగాలను కొట్టివేసిన తీర్పుకు వ్యతిరేకంగా హైకోర్టుకు అప్పీలుకు పోవడానికి సిద్ధపడలేదు. అందువల్ల ఈ కేసుల్లో పూర్తి న్యాయం చేయడానికి హైకోర్టుకు అవకాశం దక్కనేలేదు.

హైకోర్టులో ఈ కేసు విచారణకు వచ్చినపుడు ప్రాసిక్యూషన్ తరపున వాదించడానికి నన్ను రమ్మని దళితులు అడిగారు, నేను ఒప్పుకున్నాను. కాని ప్రభుత్వం దళితుల విజ్ఞప్తిని అంగీకరించలేదు. మేళవలపుకు చెందిన దళితులు నన్ను ప్రాసిక్యూషన్ తరపున సీనియర్ న్యాయవాదిగా నియమించాలని కోరుతూ ఒక దరఖాస్తు పెట్టారు. ఆ పిటిషన్ పరిశీలనకు వచ్చినపుడు ప్రభుత్వ న్యాయవాది లేచి ప్రాసిక్యూషన్ తరపున స్వయంగా రాష్ట్ర ప్రభుత్వం అడ్వకేటు జనరల్ వాదిస్తాడని, అందువల్ల ఇంకెవరూ అక్కరలేదని న్యాయస్థానానికి నివేదించాడు. దళితుల దరఖాస్తును కొట్టివేశారు. నా పేరును ప్రాసిక్యూషన్ న్యాయవాదిగా నిర్ధారించడం ఆ మర్నాడు 'హిందూ' పత్రికలో ప్రధాన వార్త అయింది.

* * *

## ఒకానొక అత్యాచారం

సరే మేళవలపు నుంచి మన రాష్ట్రంలోనే ఒక రెండు దశాబ్దాల కింద జరిగిన ఒక దళిత అత్యాచారం కేసు సంగతి చూద్దాం. ఇంకా షెడ్యూల్డ్ కులాల, తెగల అత్యాచారాల నిరోధ చట్టం అమలులోకి వచ్చినట్టులేదు. కడపజిల్లా సిద్ధిపేట మండలం లింగంపల్లికి చెందినది ఆ కేసు. అయితే ఆ కేసు గురించి తెలుసుకునే ముందర కొంచెం ఉపోద్ఘాతం కూడా కావాలి.

మన సమాజంలో ఒక కులానికి చెందిన వ్యక్తులను హీనంగా, అసమానంగా చూస్తూ ఉండడంపట్ల ఎవరికీ ఎటువంటి చింతాలేదు. పైగా ఈ సమాజంలో ఒక న్యాయ వ్యవస్థ ఉన్నదని, అది న్యాయం జరుపుతున్నదని కూడా మనం అనుకుంటూ ఉంటాం.

కాని ఎవరయినా కాస్త పనిగట్టుకుని న్యాయమూర్తుల స్పందనలను, న్యాయస్థానాలలో వారి ప్రవచనాలను చూస్తే ఎంత అన్యాయమైన, దుర్మార్గమైన విషయాలు వారి నోటివెంట ఎంత లోతైన సత్యాలుగా వెలువడుతాయో చూసి దిమ్మతిరిగిపోతారు. పౌర హక్కుల పరిరక్షణా చట్టానికి జరిగిన ఉల్లంఘనల గురించి దళితులు ఫిర్యాదు చేస్తే, స్థానిక పోలీసు అధికారి ఎంత అయిష్టంగా దాన్ని నేరంగా నమోదు చేసినా, అది న్యాయస్థానానికి వచ్చే సరికి న్యాయమూర్తులు ఆ ఉల్లంఘనలను నమ్మనే నమ్మరు. దళతులపై జరిగిన ఎన్నో అత్యాచారాల సంఘటనలను వారు కొట్టిపడేస్తున్నారు. గౌరవనీయులైన అగ్రవర్ణ వ్యక్తులుగాని, భూమీ, అర్థబలం ఉన్న వెనుకబడిన కులాలవారు గాని దళితులపైన ఇటువంటి నేరాలకు పాల్పడబోరని వారు ముందే ప్రకటించేస్తారు. వారికి కోపం తెప్పించే పని ఏదో దళితులు చేసే ఉంటారనే ప్రాతిపదికమీద మాట్లాడతారు. అధికారులు 1989 షెడ్యూల్డ్ కులాల షెడ్యూల్డ్ తెగల అత్యాచారాల నిరోధ చట్టాన్ని చాలా అరుదుగా వాడతారు. ఒకవేళ అధికారులు ఆ చట్టాన్ని వాడినా న్యాయస్థానాలు ఆ చట్టం కింద నేరాలను నిర్ధారించి శిక్షలు విధించవు. నేనింతకు ముందే మేళవలపు విషయంలో చెప్పినట్టు, ముద్దాయిలు నేరం చేశారని అంగీకరించినప్పటికీ ఆ నేరాన్ని అత్యాచారాల నిరోధ చట్టం కింద కాక మామూలు భారత శిక్షాస్మృతి కింద పరిగణిస్తాయి.

అంతేకాదు, ఈ న్యాయస్థానాలు సాధారణంగా సమానత్వం విషయం వచ్చేసరికి రాజ్యాంగంలోని అధికరణం 15(1)ని గుర్తుతెచ్చుకుంటాయిగాని, అధికరణం 15(2)ను చదవను కూడా చదవవు. ఆ అధికరణంలోని ఉప నిబంధనలు 1 నీ 2 నూ కలిపి చదవాలని అంగీకరించవు. ఈ దేశంలో రిజర్వేషన్లు అవసరమనే సిద్ధాంతం రాజ్యాంగ నిర్ణయ సభలో ఎంతో చర్చ మీదట రూపొందిన ఏకాభిప్రాయం ద్వారా అమలులోకి వచ్చింది. అలా ఏకాభిప్రాయం ద్వారా ఈ సిద్ధాంతం ఉనికిలోకి వచ్చినప్పటికీ, ఇప్పటికీ దానికి ఎన్నో ఆటంకాలు ఎదురవుతూనే ఉన్నాయి. అయినా అగ్రవర్ణ పురుషుల దృష్టిలో దళితులు, స్త్రీలు, ఇతర అల్ప సంఖ్యాక వర్గాలు ఇంతకాలమూ అసలు మనుషులుగా గుర్తింపు పొందడంలేదనే విషయం మన బుర్రకు తట్టనే తట్టదు.

ఎన్నో తరాలు వేచి చూసిన మీదట ఆ అల్ప సంఖ్యాక వర్గాల వారు తమ సమానత్వ హక్కు కోసం సమాజాన్ని నిలదీశారు. పాలనా వ్యవస్థలతోనూ, బహిరంగ ప్రజాజీవితంలోనూ వారు పోరాటం ప్రారంభించారు. అయినా ఆ పోరాటం ఇంకా విజయం సాధించలేదు. ఈ అసమాన సామాజిక స్థితిని యథాతథంగా కొనసాగించడంలో మనలో బ్రహ్మాండమైన మొండితనం ఉన్నది. చాలా స్వార్థ ప్రయోజనం ఉన్నది. అసలు ఈ విషయాలు చర్చించడానికి కూడా మనలో లోతయిన విముఖత ఉన్నది. ఈ సమస్యలు ఎంత గంభీరమైనవో చర్చించకుండానే పక్కకు తోసివేస్తాం. న్యాయమూర్తులు, ఉన్నత రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్నవాళ్లు బహిరంగంగా కులం అనేమాట ఉచ్చరించడానికే

ఇష్టపడరు. కాని మన సమాజంలో పైపైకి ఎదగాలంటే, అది రాజకీయ, పాలనాపరమైన, న్యాయపరమైన ఏ నియామకమైనా సరే, కులమే ఒక నిచ్చెనగా ఉంటూ వస్తున్నది. ప్రతి ఒక్క న్యాయమూర్తి ఎదుగుదల వెనుక కుల సమీకరణాలు ఎలా ఉన్నాయో చెప్పవచ్చు. సామాజిక ఊర్ధ్వచలనంలో సమానత్వ సూత్రం కేవలం పెదాలపై ఉచ్చరించబడుతుంది. అంతే, కులమే అసలైన నిచ్చెన. సుప్రీంకోర్టులో ఒక న్యాయమూర్తి మన రాజ్యాంగంలో మైనారిటీ అంటే ఏమిటో నిర్వచించలేదని కూడా వాపోయాడు. ఇటువంటి మాటల ముసుగును చీల్చి అసలు అర్థాలను పరిశీలించాలి. కచ్చితంగా రాజ్యాంగం ఒక నిఘంటువులాగ ఉండాలని ఆ న్యాయమూర్తి కోరుతున్నాడనుకోను. కాని ఇటువంటి వైఖరుల ద్వారా మన న్యాయమూర్తులు చట్టబద్ధపాలన అనేదాన్ని ఒక క్రీడగా మార్చేశారు. కేసులలో తీర్పులు ఇచ్చేటప్పుడు కూడా ఇటువంటి మానసిక స్థితే పనిచేస్తుంటుంది.

1980ల చివరిలోనో, 1990ల మొదట్లోనో నేను ఒక రోజు జస్టిస్ జీవన్‌రెడ్డి కోర్టులో నా కేసు ఒకటి అనుమతి పొందుతుందాలేదా అని ఎదురుచూస్తూ కూర్చున్నాను. నా మిత్రుడు, సీనియర్ న్యాయవాది ఎల్లారెడ్డి కూడా తన కేసు పిలుస్తారని ఎదురుచూస్తూ కూచున్నాడు. జాబితాలో ఆయన పేరు నా పేరుపైన ఉంది. ఆ కేసు ఏమిటో చెపుతూ ఎల్లారెడ్డి చెప్పిన విషయాలు నన్ను ఆకర్షించాయి. ఆయన కడప జిల్లాలో ఒక జాయింట్ కలెక్టర్ మీద ఫిర్యాదు కేసు వాదిస్తున్నాడు. ఆ జాయింట్ కలెక్టర్ ఒక రెడ్డి భూస్వామిని తన భూమిలోకి వెళ్ళకుండా అడ్డుకున్నాడట. అలా అడ్డుకోవడానికి కారణం దళితులు ఇచ్చిన ఫిర్యాదు అట. వాళ్లు తమ భూముల నుండి వెళ్లగొట్టబడ్డామని ఫిర్యాదు ఇచ్చారట. ఆ జాయింట్ కలెక్టర్ కూడా దళితుడేనని, అందువల్లనే దళితుల ఫిర్యాదుల మీద స్పందించి రెడ్డి భూస్వామిని అడ్డుకున్నాడని ఫిర్యాదు చేస్తూ హైకోర్టుకు వచ్చారు. ఆ కేసులో మధ్యంతర ఉత్తర్వులు వెలువడి ప్రస్తుతం చివరి తీర్పు కోసం ఉంది. ఆ భూస్వామి పేరు ఓబుల్ రెడ్డి. ఎప్పుడూ అర్థబలం, అంగబలం ఉన్నవాళ్లు న్యాయస్థానాలను ఇట్లాగే వాడుకుంటారు. ఈ న్యాయస్థానాల వ్యవహారమంతా బంతి మీద నృత్యం లాంటిది. అది దళితుడినయితే పడగొడుతుంది. అగ్రవర్ణాలకయితే దాని మీద ఎలా నృత్యం చేయాలో తెలుస్తుంది.

అసలు కథలోకి వెళ్ళబోయే ముందు, దీంట్లో వినోదం కల్పించిన సంగతి ఒకటి చెప్పాలి. ఓబుల్ రెడ్డి తరఫున వాదిస్తున్న ఎల్లారెడ్డి జస్టిస్ జీవన్‌రెడ్డికి ఏమని చెపుతున్నాడంటే జాయింట్ కలెక్టర్ దళితుడు గనుక దళితులకు సహాయం చేశాడని, 'అవునుసార్, ఆ అధికారికి కులపిచ్చి సార్' అంటున్నాడన్నమాట. ఆ అభ్యర్థన చేసేటపుడు స్వయంగా తాను ఎటువంటి హాస్యస్ఫోరక స్థితిలో ఉన్నాడో నా మిత్రుడు గుర్తించనే లేదు.

లోహియా రాజకీయాలలో విశ్వాసం ఉన్న ఎల్లారెడ్డికిగాని, వామపక్ష భావాలు ఉన్న న్యాయమూర్తి జస్టిస్ జీవన్‌రెడ్డికిగాని కుల విషయంలో పట్టింపు ఉందని గాని,

మూఢాభిప్రాయాలున్నాయని గాని ఎవరూ ఆరోపించలేరు. కాని న్యాయవాదిగా మా వృత్తి ఎటువంటిదంటే, అటువంటి హాస్యాస్పద విన్నపాలు చేయడానికి, అలా చేసేటపుడు ఆ అభ్యర్ధనలలోని హాస్యాస్పదతను విస్మరించడానికి మా వృత్తి వీలు కల్పిస్తుంది. నిజంగానే సాధారణంగా న్యాయవాదులకు తమ కక్షిదారుల ప్రయోజనాలతో అంతగా మమేకత ఏర్పడుతుంది. కక్షిదారుల ప్రాపంచిక దృక్పథాన్ని నక్సలైట్ల ప్రాపంచిక దృక్పథం బలోపేతం చేసింది. వాళ్ళ రాజకీయాలలో నమ్మకం కాదు.

సరే, ఓబుల్‌రెడ్డి కేసు వివరాలు చర్చించడం చాలా విషయాలను వివరిస్తుంది.

కడప జిల్లా సిద్ధవటం మండలంలోని లింగంపల్లి గ్రామంలో అణగారిన కులాలకు చెందిన కొందరు వ్యక్తులకు ప్రభుత్వం కొంత భూమిని పంపిణీ చేసింది. ఆ అసైన్డ్ భూములు ఆ గ్రామంలో పేదలకు, దళజతులకు ఇవ్వడానికి తీసిపెట్టిన మొత్తం అసైన్డ్ భూములలో భాగమే. రెవెన్యూ శాఖలో సవరించిన అసైన్‌మెంట్ విధానం కింద జూన్ 18, 1954న విడుదల అయిన జీఓ ఎంఎస్ 1142 ప్రకారం ఆ భూముల అసైన్‌మెంట్ జరిగింది. ఆ జీవో ప్రకారం గాలి రామయ్యకు సర్వే నెంబరు 126లో 4.53 ఎకరాలు, బి పాలకొండయ్యకు సర్వే నంబరు 127/2లో 2.92 ఎకరాలు, గాలి చిన్న ఓబయ్యకు సర్వే నెం. 131/2లో 1.34 ఎకరాలు, జాడ పెద్ద కిష్టయ్యకు సర్వే నం. 131/4లో 1.32 ఎకరాలు, జాడ చిన్నయ్యకు సర్వే నెంబరు 131/5లో 1.40 ఎకరాలు ఇచ్చారు. ఆ భూములను ఆయా వ్యక్తులకు 1955 మార్చి నుండి ఆగస్టు మధ్యలో పంపిణీ చేశారు.

మొదట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి ఆ తర్వాత న్యాయవాదిగా మారిన సి ఓబుల్ రెడ్డి అనే వ్యక్తి ఈ అసైన్డ్ భూములు పొందిన వ్యక్తులను కలిసి, ఆ వ్యక్తులు తనకు ఆ భూములను కౌలుకు ఇస్తే తాను వాటిని అభివృద్ధి చేస్తానని అడిగాడు. తమ భూముల అభివృద్ధి కోసం తామే పనిచేసి అందుకు కూలి కూడ తీసుకోవచ్చునని చెప్పాడు. ఈ ప్రతిపాదనకు ఒప్పుకున్న ఆ దళితులు ఆ భూమి మీద యాజమాన్య హక్కును తాము ఉంచుకుంటూనే, ఆ భూమిని ఓబుల్ రెడ్డికి కౌలుకు ఇచ్చి తమ భూముల మీద తాము కూలీలుగా మారిపోయారు.

కాలక్రమంలో ఆ ఓబుల్ రెడ్డి ఆ దళితులతో కొన్ని తెల్లకాగితాల మీద వేలి ముద్రలు వేయించుకున్నాడు. ఆ కాగితాలు విక్రయదస్తావేజులని ఆ తర్వాత తేలింది. ఆ మాదిరిగా ఆ బూమిని వారు అమ్మినట్టు పత్రాలు సృష్టించిన ఓబుల్‌రెడ్డి, ఆ దళితులు పొందిన డి.ఫార్మ్ పట్టాలలోని నిబంధనలకు వ్యతిరేకంగా తమ భూములు అమ్ముకున్నారని అధికారులకు ఫిర్యాదుచేశాడు. ఆ ప్రాతిపదికమీద వారికి ఇచ్చిన అసైన్‌మెంట్ రద్దు చేయించాడు.

అలా కొంతకాలం గడిచిన తర్వాత ఓబుల్‌రెడ్డి మరొక ముగ్గురు తన మనుషులను

రంగ ప్రవేశం చేయించాడు. అలా వచ్చిన బుద్దన పెద్ద వెంకట సుబ్బయ్య, గుమ్మడి రంగయ్య, వొర్కం ఓబయ్య అనే వ్యక్తులకు ఆ భూమిని తిరిగి అసైన్ చేయించాడు. ఈ కొత్త అసైన్‌మెంట్ 1957 ఫిబ్రవరిలో జరిగింది. మొదట భూమి మీద హక్కుదారులమే అని నమ్మేలా చేయడానికి ఈ రెండు దశాబ్దాల కాలం అవసరమయింది. చివరికెప్పుడో వాళ్ళు మేలుకుని తమ హక్కు కోసం పోరాడే సమయానికి వారికి తమ హక్కులను నిర్ధారించుకోవడం చాలా ఆలస్యమయిపోతుంది.

నిజానికి ఈ కొత్తగా భూములు పొందిన వాళ్ళు మరొక గ్రామానికి, కడపాయపల్లికి చెందినవాళ్లు. ఈ కొత్త భూమి సొంతార్లు తమ భూమిని సిద్ధవటం వ్యవసాయ అభివృద్ధి బ్యాంకుకు 1976లో తనఖా పెట్టి రుణాలు పొందారు. ఈ రుణాలు తిరిగి చెల్లించకపోవడం వల్ల ఆ బ్యాంకు ఆ భూములను 1979 ఏప్రిల్ 26న బహిరంగ వేలంలో విక్రయించింది. ఆ బహిరంగ వేలంలో ఆ భూములను ఓబుల్‌రెడ్డి కొన్నాడు. ఆ తర్వాత ఏడాదికి గాని మొదట భూమి పొందిన దళితులకు జరిగిన వ్యవహారమంతా తెలిసిరాలేదు. ఇంతకాలమూ తమ కళ్లు కప్పి, పూర్తిగా చట్టబద్ధమైన పద్ధతులలోనే తమ భూమిని ఓబుల్‌రెడ్డి అక్రమించాడని వాళ్లు తెలుసుకునేసరికి చాలా కాలం గడిచిపోయింది.

దళితులు ఈ విషయాన్ని తెలిసి చాలా ఆందోళన పడ్డారు. ఇదంతా జరిగి, వారికి తెలిసివచ్చే సరికి వారి బిడ్డలు ఎదిగివచ్చారు. కొత్తతరం తయారయింది. ఇక ఆ కొత్త తరం ఈ విషయాన్ని ఊరికే వదిలిపెట్టదలచలేదు. వాళ్ళు ఒక మహజరు రాసి జాయింట్ కలెక్టరు దగ్గరికి వెళ్లారు. అప్పటికి ఆ జాయింట్ కలెక్టరు కూడా దళితుడేనని విన్నాను. ఆ అధికారి కొంత పరిశోధన జరిపి, జరిగిన మోసాన్ని గుర్తించి చివరికి 1985 జనవరి 23న ఒక ఉత్తర్వు ఇచ్చాడు. ఆ భూమిని మొదటి అసైన్డ్ పట్టాదారులకు తిరిగి ఇవ్వాలని, సహకార రిజిస్ట్రారు ఆ భూములకు బహిరంగ వేలంలో అమ్మడం చెల్లదని ఆయన ఉత్తర్వులు ఇచ్చాడు.

జాయింట్ కలెక్టరు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఓబుల్ రెడ్డి హైకోర్టులో ఒక రిట్ దరఖాస్తు 1984లో దాఖలయింది. ఆ దరఖాస్తును అనుమతించిన హైకోర్టు జాయింట్ కలెక్టర్ ఉత్తర్వుల అమలును తాత్కాలికంగా నిలిపివేసింది. ఈలోగా మొదటి అసైన్డ్ పట్టాదారులు ఒక దరఖాస్తు వేసి, తాము నిరాశ్రితులమయ్యామని, అందువల్ల న్యాయస్థానం ఇచ్చే ఏ ఉత్తర్వు వల్లనైనా తమ మీదనే ప్రభావం ఉంటుంది గనుక తమనే తప్పనిసరి కక్షిదారులుగా గుర్తించాలని కోరారు. వాళ్లు ఆ తాత్కాలిక నిలుపుదల ఉత్తర్వులను ఎత్తివేయాలని కోరుతూ మరొక దరఖాస్తు దాఖలుచేశారు. ఈ దరఖాస్తులన్నీ చూసిన హైకోర్టు సంబంధిత పక్షాలన్నిటికీ సరయిన నోటీసులు ఇచ్చి విచారణను పూర్తి చేయవలసిందిగా జాయింట్ కలెక్టర్‌ను ఆదేశించింది. ఈ చివరి ఉత్తర్వు 1987 జనవరి 21న వెలువడింది. ఈ ఉత్తర్వు వచ్చే సమయంలో ఆ విచారణాధికారం జాయింట్

కలెక్టర్‌కు ఇవ్వవద్దని, మండల రెవెన్యూ అధికారికి ఇవ్వాలని కూడా అభ్యర్థనలు వచ్చాయి. అప్పటికి ఇంకా ఆ పాత జాయింట్ కలెక్టరే ఉన్నాడనే ఉద్దేశ్యంతో హైకోర్టు కూడా మండల రెవెన్యూ అధికారి విచారణ జరిపాలని ఆదేశించింది.

ఆ భూములను వెనక్కి తీసుకోవడం 1975లో జరిగిందని కాని దళితులు 1983 నుంచి తమ ఆందోళన మొదలు పెట్టారని ఆ మండల రెవెన్యూ అధికారి రాశాడు. వాళ్లు అలా ఎనిమిది సంవత్సరాలపాటు మౌనంగా ఉండిపోవలసింది కాదని, అన్ని రోజుల తర్వాత మళ్లీ ఆ కేసును తిరిగి తెరవడం సాధ్యం కాదని ఆయన అన్నాడు. "ఇప్పటికే కాలాతీతమయిపోయింది. చాలా సంఘటనలు జరిగిపోయాయి" అని ఆయన రాశాడు. ఓబుల్ రెడ్డి పేరిట విక్రయాన్ని ఖరారు చేస్తూ వెలువడిన పత్రాలు కూడా 1970 మే 21న జారీ అయిన జీఓ ఎంఎస్ 1033ను ఉల్లంఘించాయని కూడా ఆయన రాశాడు. ఆ జీఓ ప్రకారం ఇటువంటి అసైన్డ్ భూముల క్రయవిక్రయాలకు కలెక్టర్ అనుమతి తీసుకోవలసి ఉంటుందని, అటువంటి అనుమతి తీసుకోకుండా విక్రయం జరిగింది గనుక ఆ భూమి వెనక్కు తీసుకోవడం సక్రమమేనని ఆయన రాశాడు. ఇంతకూ ఈ మండల రెవెన్యూ అధికారి విచారణలో మొదటగా భూములు పొందిన దళితులనుగాని, ఆ తర్వాత భూమి పొందిన వ్యక్తులను గాని పిలవను కూడా పిలవలేదు. ఆ మండల రెవెన్యూ అధికారి తన ఆదేశాలను 1988 సెప్టెంబరు 3న జారీ చేశాడు. ఆ ఎంఆర్ఓ 1987 21న వెలువడిన పాత ఆదేశాల ప్రకారం పనిచేస్తున్నాడని, ఆ ఆదేశాలను సవరించవలసి ఉందని దళితులు మరొక అభ్యర్థన పెట్టుకున్నారు. ఆ అభ్యర్థన మార్చి 1న దాఖలయింది. చివరికి 1988 ఆగస్టు 1న హైకోర్టు ఏ జాయింట్ కలెక్టర్‌కు వ్యతిరేకంగా ఫిర్యాదులు వచ్చాయో ఆయన అప్పటికే బదిలీ అయిపోయాడని, అందువల్ల ప్రస్తుతం ఉన్న జాయింట్ కలెక్టరే విచారణ చేయడం సమంజసమని తీర్పు ఇచ్చింది.

మళ్లీ జరిగిన విచారణలో జాయింట్ కలెక్టర్ కనిపెట్టిన విషయమేమంటే 4.43 ఎకరాల భూమి పొందిన ఎల్లటూరు నర్సయ్య అనే వ్యక్తి నిజానికి ఓబుల్‌రెడ్డి దగ్గర జీతగాడిగా పనిచేస్తుండేవాడని, అందువల్ల ఆయన నుంచి ఓబుల్‌రెడ్డి విక్రయపత్రం సంపాదించాడని, ఆ విక్రయ పత్రం ఆధారంగా అసైన్‌మెంట్ చెల్లదని ఉత్తర్వులు తీసుకువచ్చాడని, "అమాయకులు, నిరక్షరాస్యులు అయిన దళితులకు చెందిన భూములన్నిటినీ న్యాయవాది సి ఓబుల్‌రెడ్డి, ఆయన కొడుకులు కబ్జా చేశారు. తద్వారా, పేదలకు సహాయం చేయడం కోసం ప్రభుత్వం ప్రారంభించిన భూ పంపిణీ పథకపు లక్ష్యాలకు తూట్లు పొడిచారు. ఆ భూ ఆక్రమణదారులు కేవలం కాలయాపన జరపడంకోసం న్యాయస్థానాలలో దరఖాస్తులు, అప్పీళ్ళు దాఖలు చేశారు. ఆ రకంగా తమ అక్రమ అధీనంలో ఉన్న భూమిని తమ దగ్గరే ఉంచుకోవడానికి ప్రయత్నించారు" అని జాయింట్ కలెక్టర్ నివేదిక రాసింది.

జాయింట్ కలెక్టర్ నివేదికలో ఈ మాదిరిగా ఆ భూముల విషయమై సరయిన వైఖరే తీసుకున్నప్పటికీ, అయన కూడా ఆ భూమిని మళ్లీ దళితులకు ఇవ్వాలని ఆదేశించలేదు. అంటే అయన నివేదిక అటు దళితులకు, ఇటు భూ అక్రమణ దారులకు ప్రతికూలంగానే వెలువడిందన్నమాట. మొత్తం మీద భూమిని ప్రభుత్వానికే దక్కేలా చేసిన ఆదేశం అది.

ఆ ఉత్తర్వు రెండు పక్షాలకూ వ్యతిరేకంగానే వచ్చింది. గనుక, సాంకేతికంగా చూస్తే మరొక కొత్త విచారణలో ఒక కక్షిదారు మరొక కక్షిదారును చేర్చనక్కరలేదు. ఈ కేసులో అదే జరిగింది. ఎంఆర్ఓ ఉత్తర్వులు వెలువడగానే ఆ ఉత్తర్వులను సవాలు చేస్తూ ఓబుల్‌రెడ్డి హైకోర్టులో ఒక రిట్ దరఖాస్తు దాఖలు చేశాడు. బహిరంగ వేలంలో భూములను అమ్మడం సక్రమమేనంటూ హైకోర్టు ఆ దరఖాస్తును అనుమతించింది. అప్పటి వరకూ విచారణలో భాగస్వాములైన దళితులతో సంబంధంలేకుండా ఈ రిట్ దరఖాస్తును అనుమతించడంలోని అపసవ్యత హైకోర్టు దృష్టికి రానేలేదు.

ఇంతకుముందు చెప్పిన 1970 మే 21న జారీ అయిన జీఓ ఎంఎస్ 1033 ప్రకారం ఇలా భూ పంపిణీలో భాగంగా అసైన్ అయిన భూములను భూ తనఖా బ్యాంకుకు తాకట్టు పెట్టడంపై పరిమితులున్నాయి. బాకీ తీర్చుకోవడం కోసం అలా తాకట్టుపడిన భూములను అమ్మడాన్ని, వేలం వేయడాన్ని నిషేధిస్తూ కూడా ఆ జీఓ నిబంధనలున్నాయి. అలా చేసినప్పుడు కూడా జిల్లా కలెక్టర్ అనుమతి తీసుకుని చేయవచ్చునని ఆ జీఓ చెపుతుంది. అలా అమ్మడం తప్పనిసరి అయిన పక్షంలో కూడా మొదట అసైన్ అయినరోజు నుంచి పది సంవత్సరాలు గడవకపోతే ఆ భూమిని షెడ్యూల్డ్ కులాలవారికి అమ్మాలని కూడా ఆ జీఓ చెబుతుంది. సహకార సబ్ రిజిస్ట్రార్ బహిరంగ వేలంలో ఆ భూమిని అమ్మడం ఆ జీఓ నిబంధనలను ఉల్లంఘించడమేనని ఎంఆర్ఓ తన నివేదికలో రాశాడు. అయితే అప్పటికే రాష్ట్ర శాసనసభ ఆమోదించిన ఆంధ్రప్రదేశ్ అసైన్డ్ భూముల (పరాయీకరణ నిరోధ) చట్టం 1977 ప్రకారం అంతకుముందరి అధికారిక నిబంధనలన్నీ రద్దయిపోయినట్టేనని ఎమ్మార్వో దృష్టికి తీసుకురావడం జరిగింది. ఆ చట్టం అసలు అసైన్డ్ భూముల పరాయీకరణపై ఆంక్షలు విధించింది. కాని సహకార సంఘాలకు తాకట్టుపెట్టడాన్ని చట్టం అంగీకరిస్తుందని ఎంఆర్ఓ భావించాడు. ఆ తర్వాత జరిగిన విచారణలో జాయింట్ కలెక్టర్ ఎంఆర్ఓ ఆదేశాలను సమర్థించనూలేదు, వ్యతిరేకించనూలేదు.

ఈ మొత్తం గందరగోళం వల్ల ఓబుల్ రెడ్డికి ఒక రిట్ దరఖాస్తుతో హైకోర్టును ఆశ్రయించే అవకాశం వచ్చింది. ఆ రిట్ దరఖాస్తును హైకోర్టు కూడా ఆమోదించింది. మరి ఆ తర్వాత దళితులు మరొక రిట్ దరఖాస్తు దాఖలు చేసేసరికి అంతకుముందు ఓబుల్ రెడ్డికి అనుకూలంగా హైకోర్టు ఇచ్చిన తీర్పు వెలవెలబోయింది. అంతకుముందరి

తీర్పు ఆ తర్వాతి తీర్పు మీద షరతుగా పనిచేయనప్పటికీ, దాని ప్రభావం మాత్రం ఉండకపోదు. దళితులు ఆ విషయంలో ఎనిమిది సంవత్సరాలు మౌనంగా ఉండి కాలయాపన చేశారని ఎంఆర్ఓ చేసిన నిర్ధారణను జాయింట్ కలెక్టర్ కూడా సమర్థించాడు. అసలు మొత్తం వ్యవహారంలో అనేక అవకతవకలు, మోసాలు జరిగాయని న్యాయస్థానం ఒప్పుకుంటే తప్ప .......... దళితులకు న్యాయం జరగదు.

ఆ మాదిరిగా 1954 నుండి 1975 వరకు దళితులు ఆ భూమికి నామ మాత్రపు యజమానులుగా మత్రమే ఉన్నారు. కాని ఆ భూమి మీదనే రోజు కూలీలుగా పనిచేస్తూ ఉన్నారు కూడా. ఆ తర్వాత 1975 నుంచి 1983 వరకు వాళ్ల జీవిత మంతా ఆ భూమికి సంబంధించిన వివరాల సేకరణలో, కలెక్టర్‌కు, ఇతర అధికారులకు మహజరులు సమర్పించుకోవడంలోనే గడిచిపోయింది. వాళ్ల దగ్గర ఉన్న వనరులతో వాళ్లు పోగలిగినది అంత దూరం మాత్రమే. 1984 తర్వాత మంచి వాళ్లు ఆ భూమి కొరకు న్యాయస్థానంలో పోరాడడం ప్రారంభించారు. మొదటిసారి అసైన్‌మెంట్ పొందిన వారి వారసులు ఆ పోరాటాన్ని కొనసాగించారు. ఒకవైపు ఈ పోరాటం సాగుతుండగానే న్యాయాన్ని, పాలనాధికారులను, న్యాయ వ్యవస్థను ఓబుల్‌రెడ్డి ఒక పద్ధతి ప్రకారం తారుమారు చేశారు. తమ పోరాటంలో దళితులు ఎనిమిది సంవత్సరాలు వెనకబడిపోయారు గనుక వారికి అన్ని చోట్లా నిరాదరణే ఎదురయింది. న్యాయ వ్యవస్థా క్రమాలలో ఉన్న ఈ కుట్రలకూ కుహకాలకూ ఒకటే సమాధానం ఉంది. అటువంటి పరిస్థితులలోనే విప్లవానికి ఆపుకోలేనంత సమ్మోహక శక్తి వస్తుంది.

రాజ్యాంగ రచన జరిగి ఆరు దశాబ్దాలు గడిచిన తర్వాత కూడా ఈ దేశంలోని అగ్రవర్ణాల వాళ్లు సామాజిక ఆధిపత్యానికి తమకు ఉన్న హక్కును వదులుకోవడంలేదు. చారిత్రకంగా అమలయిన వివక్ష ఇవాళ్టికీ కొనసాగుతోంది గాని ఇప్పుడది సమానత్వ ఆకాంక్ష పేరు మీదనే సాగుతోంది. ఈ ఘర్షణ ఇపుడు ప్రపంచీకరణ పూర్వరంగంలో కూడా జరుగుతోంది. ఒక భిన్నమైన దార్శనికత ఉన్న రాజ్యాంగం నీడలో జరుగుతోంది.

అధికారవర్గానికీ, న్యాయవ్యవస్థకూ మధ్య గతంలో ఆస్తి హక్కు విషయమై ఘర్షణ జరిగింది. అప్పుడు ఆ ఘర్షణ పైననే న్యాయ మూర్తులకు వారి అనుభవంతో సంబంధం లేకుండా పదోన్నతి ఇవ్వడం జరిగింది. కాకపోతే అప్పుడు పైకి చెప్పబడిన కారణం ప్రజాస్వామ్య పరిరక్షణ. ఇపుడు పాత తీర్పులు, పదోన్నతులు ఎలా ఉన్నప్పటికీ ఆస్తే ఇతర ప్రాథమిక హక్కులకన్న ఎక్కువ ప్రాథమిక హక్కు అయిపోయింది. రాజ్యాంగంలో ప్రాథమిక హక్కుల అధ్యాయం నుంచి ఆస్తి హక్కును తొలగించడం, సమాజంలోనూ, సామాజిక సంస్థలలోనూ, ఆస్తికి ఉన్న ప్రాధాన్యతను ఇసుమంతయినా తగ్గించలేదు.

అప్పుడు ఆస్తి హక్కు ప్రధానాంశమైతే, ఇప్పుడు సమానత్వ భావన పునాది పైననే రిజర్వేషన్‌ను వ్యతిరేకించడం జరుగుతోంది. రాజ్యాంగ రచనలోనిఒక ముఖ్యమైన కోణం,

ప్రధానమైన కోణం అయిన 'సమానత్వం' భావనపై మొత్తం వివాదం నడుస్తోంది. కాని రిజర్వేషన్‌ను సమానత్వ సమస్యగా, సాధికారతా సమస్యగా మాత్రమే చూడగూడదు. అది మన జనాభాలో అత్యధిక భాగానికి జీవించే స్వేచ్ఛ సమస్యగా, సాధికారితా సమస్యగా కూడా ఉంది. ఈ ఘర్షణ అంత సులభతరమైనదేమీ కాదు. ఈ ఘర్షణ ప్రస్తుతం ప్రతి ఒక్కరికీ ప్రత్యర్థుల భీకర పోరులా కనబడుతోంది. ఆ ఘర్షణలో ఒక పక్కన న్యాయ వ్యవస్థ ఉంది. ఆ న్యాయ వ్యవస్థ అగ్రవర్ణ ప్రయోజనాలను పరిరక్షించడానికి నిలబడుతోంది. గతంలో కూడా అటువంటి ఘర్షణ వచ్చినపుడు న్యాయ వ్యవస్థ ఆస్తిపర వర్గా లప్రయోజనాలను పరిరక్షించడానికి నిలబడింది. కాని ఆ వ్యవస్థ అగ్రవర్ణాల ప్రయోజనాల కోసం నిలబడినా, లేదా కనీసం నిలబడినట్లు కనిపించినా అది ఆ వ్యవస్థ అంతానికే దారితీస్తుంది.

* * *

# ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు

నా మిత్రుడు, పియుసిఎల్ నాయకుడు రాజిందర్ సచార్ కొంతకాలం కింద ఒక వ్యాసం రాశాడు. కాంట్రాక్టులు ఇచ్చేటప్పుడు కూడా రిజర్వేషన్ పద్ధతిని పాటించాలని, తద్వారా అట్టడుగు కులాలవారికి సాధికారత దక్కుతుందని ఆయన ఆ వ్యాసంలో ప్రతిపాదించాడు. అసమానత వెర్రితలలు వేసి ఉన్న సమాజంలో ఇటువంటి చర్చలు అత్యవసరం. రాజ్యాంగం ఉనికిలోకి వచ్చినప్పుడు ప్రభుత్వమే పెద్ద ఉద్యోగ కల్పనా సంస్థగా ఉండేది. మన ఆర్థిక వ్యవస్థను మార్కెట్ శక్తులు ఆక్రమించిన తర్వాత, రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులకింద, రాజ్య విధాన ఆదేశిక సూత్రాల కింద ప్రభుత్వానికి ఇవ్వబడిన బాధ్యతలన్నిటినీ ప్రయివేటు వ్యాపారవేత్తలకు బదలాయించడం జరిగింది. వాటిని ఇపుడు కార్పొరేట్ బాధ్యతలు అని పిలుస్తున్నారు. రాజ్య పాత్ర బాగా తగ్గిపోయి ఉన్న స్థితిలో ఇపుడు కార్పొరేట్ సంస్థలే గతంలో రాజ్యం నిర్వహించిన పాత్రకు వారసత్వం వహిస్తున్నాయి.

ఇటీవలిదాకా రిజర్వేషన్ విధానానికి వ్యతిరేకంగా గళమెత్తిన శక్తులే, డాక్టర్లు, వైద్య పట్టభద్రులు, ఈ కొత్త భావనలను కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వారి నిరసనలను దేశంలోని అత్యున్నత న్యాయస్థానం ఆమోదిస్తున్నది. రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనకు మద్దతుగా తీర్పులు వెలువరిస్తున్నది. రిజర్వేషన్ పద్ధతిని రద్దుచేయమని కోరుతూ ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలయింది. వాదన మళ్లీ పాతదే. రిజర్వేషన్ పద్ధతిని విద్యకూ,

ప్రభుత్వోద్యోగాలకూ, ప్రభుత్వ సహాయంతో నడిచే సంస్థలలో ఉద్యోగాలకూ పరిమితం చేయాలిగాని, ఇతర రంగాలకు వర్తింపజేయగూడదని, అంటే ఒక్క మాటలో చెప్పాలంటే ప్రభుత్వమే ఉద్యోగాలు కల్పించాలన్న మాట. ఆ బాధ్యతను ప్రయివేటు వ్యాపార సంస్థలకు గాని, ఆ వ్యాపార సంస్థలు నడిపే నిర్మాణాలకుగాని వర్తింపచేయగూడదన్నమాట.

మన న్యాయస్థానాలను నిర్వహిస్తున్న వ్యక్తులు మొదటి నుంచీ కూడా రిజర్వేషన్ వ్యతిరేకులే. అతి కొద్దికాలం మాత్రమే రిజర్వేషన్లకు అనుకూలంగా సమర్థంగా వాదించిన న్యాయమూర్తులు డిఎ దేశాయి, విఆర్ కృష్ణయ్యర్, చిన్నప్పరెడ్డి వంటి వారున్నారు. ఆ తర్వాత కొంతకాలం అంత ప్రతిభావంతంగా వాదించనప్పటికీ రిజర్వేషన్లను సమర్థించిన జీవన్‌రెడ్డి, పిబి సావంత్, రామస్వామి వంటి న్యాయమూర్తులు వచ్చారు. కాని ఇంత చేసినా అత్యవసరంగా మారవలసిన సాంస్కృతిక వైఖరిలో మార్పులు రానేలేదు. అసలు రిజర్వేషన్లు అనేవి సమానతా సూత్రానికి ఒక మినహాయింపు కాదని, అది సమానత్వ సూత్రానికి ఒక ముఖం అని గుర్తించడానికి మన న్యాయస్థానాలకు చాలా రోజులు పట్టింది. సుప్రీంకోర్టులో 1952లో చంపకం దొరైరాజన్ కేసులో తీర్పు వెలువడినపుడు, ఆ న్యాయమూర్తులు తమ తీర్పులో వాడిన వాదనల భాషాపాటవానికి అచ్చెరువొందారు గాని, రాజ్యాంగంలోని అధికరణం 15 ఏ పూర్వరంగంలో వ్యక్తీకరణ పొందిందో గుర్తించలేకపోయారు. దక్షిణ భారత దేశంలో జరిగిన కుల ఉద్యమాల, పోరాటాల చారిత్రక నేపథ్యంలో మాత్రమే అధికరణం 15ను అర్థం చేసుకోవలసి ఉంటుంది. కాని ఆ తీర్పు అధికరణం 15 (1) వరకు చదివి అక్కడే ఆగిపోయింది. ఆ కిందనే ఉన్న అధికరణం 15 (2)ను చదివి ఉంటే న్యాయస్థానం సమానత్వం అనే భావనకు ఎన్నో కోణాలు ఉన్నాయని గుర్తించి ఉండేది. తాము నిర్వచించినట్టుగా ఏకముఖ నిర్వచనం ఇవ్వడం సాధ్యంకాదని అర్థం చేసుకుని ఉండేది.

మొత్తం మీద చెప్పాలంటే అగ్రవర్ణాలు తాము ఇన్నాళ్ళుగా నేర్చుకున్న దాన్ని వదిలివేయడానికి సిద్ధపడే ప్రయత్నం చేయవలసి ఉంది. రాజ్యాంగ ప్రమాణాల ప్రకారం సమానత్వం అంటే ఏమిటో కొత్తగా నేర్చుకోవలసి ఉంది. మన సమాజంలో సరయిన విధంగా ఆలోచంచేవారందరి మీద ఈ కర్తవ్యాన్ని చేపట్టడం అనే చారిత్రక బాధ్యత ఉన్నదని నేను అనుకుంటాను. మావోయిస్టులు కూడా ఇటీవలి తమ సమావేశాల్లో కులసమస్య ఉపరితల సమస్యకాదని, పునాది సమస్యేనని గుర్తించినట్టు తెలుస్తుంది. ఈ వివేకం వారికి కొంత ముందుకు కలిగి ఉంటే వేంపెంట సంఘటన జరిగి ఉండేది కాదు.

ఈ అసమాన వ్యవస్థ ఉండడం మంచిదేనని వెయ్యి సంవత్సరాలుగా కొనసాగుతున్న దురభిప్రాయాల, నమ్మకాల వ్యవస్థను తొలగించడానికి కేవలం యాభై సంవత్సరాల రాజ్యాంగం సరిపోదు. ఈ దురభిప్రాయాల వ్యవస్థ ఎంత బలమైనదంటే ఈ దేశంలో

ఒక హైకోర్టు ఆవరణలో మనువు విగ్రహం ఉన్నది. ఈ దురభిప్రాయాల మీద పోరాటాన్ని రాజ్యాంగ స్థాయిలో న్యాయస్థానాలలోనూ, వాదనల ద్వారా బయటా సాగించవలసి ఉన్నదని నేననుకుంటాను. రాజ్యాంగ న్యాయ చర్చా పద్ధతిని ప్రత్యర్థి వాదనల పద్ధతి నాశనం చేసిందని నేననుకుంటాను. అందువల్ల ఒక కొత్త దృక్పథం అవసరముంది.

ప్రభుత్వ పాలనలో నిరంకుశత్వాన్ని తగ్గించడానికి ఉద్దేశించిన చట్టాలను ప్రభుత్వాలు అమలు చేయవనేది అందరికీ తెలిసిన సత్యమే. అది 1975 జూన్‌లో ఎమర్జెన్సీ విధించడంతో మరింత స్పష్టమైపోయింది. ఆంధ్రప్రదేశ్‌లో జలగం వెంగళరావు ప్రభుత్వం మనచేత ఈ వాస్తవాన్ని గుర్తింపజేసింది. ఆయన దుష్పరిపాలనే ఒక పద్ధతిగా అభివృద్ధి చేశారు. నక్సలైటు ఉద్యమం విస్తరించడానికి కారణాలేమిటో గుర్తించడానికి నిరాకరించిన వెంగళరావు దాన్ని అణచివేయడానికి ఉక్కుపాదాన్ని వాడాడు. నక్సలైట్ల పెరుగుదల అనే విషయం రాజకీయ పక్షాల అధ్యయనానికిగాక, పోలీసుల అధ్యయనానికి సంబంధించిన విషయంగా ఆయన చూశాడు. పార్టీ రాజకీయాల పరిమితులలోపల రాజకీయ క్రీడలు, ఎత్తుగడలు జరపడానికి మాత్రమే పార్టీలు పరిమితమైపోయాయి. రాజకీయ అసమ్మతిని కేవలం శాంతియుత సమస్యగా మాత్రమే చూస్తామనే సందేశం స్పష్టంగా పోలీసులకు చేరింది. రాజ్యాంగ యంత్రానికి బయట, అంగీకరించిన పార్లమెంటరీ సమరాంగణానికి బయట అసమ్మతిని సహించడానికి వీలులేదని సందేశం ఇవ్వబడింది. కనీస వేతనాల కొరకు బీడీ కార్మికులు చేసిన పోరాటం వంటి న్యాయబద్ధమైన పోరాటాలను కూడా నక్సలైట్లు సృష్టించిన, బలపరచిన పోరాటాలుగా చిత్రించడం జరిగింది. ఆ మాదిరిగా ఆ పోరాటాలను కూడా అజ్ఞాత వాసానికి పంపడం జరిగింది. అటువంటి నిరసనలను నిరోధించడానికి తీసుకున్న చర్యలను చూస్తే అపుడు రాజ్యం ఫాసిస్టు స్వభావాన్ని సంతరించుకున్నదని అనడం కూడా చాలా చిన్నమాట అవుతుంది.

ఎమర్జెన్సీ తర్వాత, 1978లో ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం పనిని పునరుద్ధరించినపుడు రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణ పేరు మీద జరిగిన దుర్మార్గాలను ప్రజలకు విప్పి చెప్పాలని ఏకగ్రీవ నిర్ణయం తీసుకోవడం జరిగింది. మొదటి జస్టిస్ భార్గవ కమిషన్ విచారణ సందర్భంలోనూ, ఆ తర్వాత ముక్తధర్ కమిషన్ విచారణ సందర్భంలోనూ ఈ ప్రయత్నం చాలా బాగా జరిగింది. రాష్ట్రంలో దుష్పరిపాలన ఏ మాదిరిగా జరుగుతున్నదో ప్రతి ఒక్క నిజ నిర్ధారణ కమిటీ నివేదిక బయటపెట్టింది. ఆ నివేదికకు పత్రికలలో చాలా ప్రాచుర్యం దొరికింది. ఆ నివేదికల విశ్వసనీయత ఎప్పుడూ ప్రశ్నార్థకం కాలేదు. రాజ్యం మాత్రం పౌరహక్కుల కార్యకర్తలు నక్సలైట్ల సమర్థకులనే ఏకైక ఆరోపణ వెనుక దాక్కుంది. అయితే ప్రభుత్వం సాగిస్తున్న ఆ దుర్మార్గాలను తగ్గించడం మాత్రం జరగలేదు.

అసలు పార్లమెంటరీ రాజకీయాలే ఆశించినంత మెరుగ్గా సాగడంలేదని చాలా

మందికి అర్థమైపోయింది. ఆ దేశంలో, రాష్ట్రంలో రాజకీయాలు కొనసాగుతున్న పద్ధతి. ప్రజల జీవన స్థితిగతులలో ఏ మాత్రం మెరుగుదలను సాధించలేకపోయాము. ప్రజలు తమ జీవనం మెరుగుపరుచుకోవడానికి వేసిన ప్రతి ప్రయత్నాన్నీ నక్సలైట్లు అశాంతి సృష్టించడానికి చేసే ప్రయత్నంగా ముద్రవేయడం మొదలయింది. ఆ ప్రయత్నాల మీద నిర్బంధకాండ మొదలయింది. ప్రజల ఆకాంక్షల న్యాయబద్ధత గురించి ఎవరూ ప్రశ్నించనేలేదు. ప్రజల జీవనాలలో మెరుగుదల అనేది ఎన్నికల రాజకీయాలతో, ఎన్నికల వాగ్దానాలతో ముడిపడిన విషయమై పోయింది. ఈ నేపథ్యంలోనే పౌర హక్కుల సంఘపు రాజకీయ దృక్పథం కేవలం రాజ్యహింసకు మాత్రమే సంబంధించిన విషయం గానూ, ఇతర విషయాలపట్ల శ్రద్ధలేనట్లుగాను కనబడడం మొదలయింది. రాజ్యహింస, దుర్మార్గం నక్సలైట్లకు మాత్రమే సంబంధించిన విషయంగా కనబడడం మొదలయింది. కాని పేద ప్రజానీకపు సామాజిక ఆర్థిక స్థితిలో ఏ మాత్రం మెరుగుదల కనబడడంలేదు గనుక, రాజ్య హింసను ఆపినట్టయితే, ఆ పేద ప్రజలు తమ అభ్యున్నతి గురించి మాట్లాడడానికి అవకాశం వస్తుందని మేం భావించాం.

నిజానికి సామాజిక ఆర్థిక జీవన స్థితి అనేది చాలా ముఖ్యమైన విషయం. కాని మేం వ్యక్తిగత స్వేచ్ఛ గురించి ఆందోళనలు చేపట్టిన పద్ధతిలో ఎవరూ ఆ సామాజిక ఆర్థిక అంశాల గురించి పట్టించుకోలేదు. పౌర హక్కుల సంఘానికి గొప్ప పేరు ప్రఖ్యాతులు వచ్చాయి. దేశవ్యాప్తంగా పౌరహక్కుల సంఘం పేరు అందరికీ తెలిసింది. అందువల్ల కొద్ది సంవత్సరాలలోనే మాకు ఇతర అసమానతల గురించి ఫిర్యాదులు రావడం మొదలయింది. ............ కొన్ని ప్రజా ప్రయోజన వ్యాజ్యాలుగా మారాయి.

* * *

# పులికాట్ కేసు

అటువంటి ప్రజా ప్రయోజన వ్యాజ్యాలలో ఒకటి పులికాట్ సరస్సుకు సంబంధించినది. ఆ సరస్సు నెల్లూరు జిల్లాలో సూళ్లూరుపేట సమీపంలో ఉంది. అది దాదాపు పదకొండువేల ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఆ సువిశాల సరస్సు లోపల; చుట్టుపట్ల చాలా మత్స్యకారుల గ్రామాలు, దిబ్బలు ఉన్నాయి. అది బంగాళాఖాతానికి చేరువలో ఉంది గాని సగటు సముద్ర మట్టానికన్న తక్కువ లోతులో ఉంది. ఆ సరస్సును ఒక చిన్న కాలువ సముద్రంతో కలుపుతుంది. సముద్రానికి పోటు వచ్చినప్పుడు ఆ కాలువలో నుంచి ఉప్పునీరు సరస్సులోకి ప్రవేశిస్తుంది. వర్షాకాలంలో సముద్ర తీరం

నుండి వెచ్చని సముద్ర జలాలు సరస్సులోకి ప్రవహించడంవల్ల ఆ సరస్సు జలాలు రొయ్యల పెంపకానికి బాగా అనువయినవిగా ఉంటాయి. పులికాట్ సరస్సు తీరంలోనూ ఆ చుట్టుపక్కలా నివసించే మత్స్యకారులకు ఆ రొయ్యల నుంచి మంచి ఆదాయం వస్తుందని అంటారు.

నేను అప్పటికింకా హైదర్‌గూడ ఇంట్లోనే ఉన్నాను. మారేడుపల్లికి మారలేదు. అపుడు ఒక రోజున అంగవస్త్రం మాత్రమే చుట్టుకున్న ఒక ఎత్తయిన వృద్ధుడు మా ఆఫీసుకు వచ్చాడు. ఆయన వెంట మరొక ఇద్దరు యువకులు కూడా ఉన్నారు. ఆయన ఆ పులికాట్ సరస్సు మీద ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారుడు. ఆయన ఆ సరస్సు గురించి, దానిలోనూ, దగ్గరి సముద్రంలోనూ చేపలుపట్టి బతుకు వెళ్లదీసుకునే మత్స్యకారుల జీవితాల గురించి నాకు చాలా వివరంగా చెప్పాడు.

ఆ సరస్సు విస్తీర్ణం మొత్తాన్ని, పదకొండువేల ఎకరాలనూ రాష్ట్ర ప్రభుత్వం శ్యాంసుందరరెడ్డి అనే వ్యక్తికి తొంభై తొమ్మిది సంవత్సరాలపాటు లీజుకు ఇచ్చింది. అది కూడా ఏడాదికి ఎకరాకు వందరూపాయలకు లీజుకు ఇచ్చింది. ఆ వృద్ధ మత్స్యకారుడు నాకు ఆ వివరాలన్నీ చెప్పి తన దగ్గర దాచుకున్న ఒక ముడతలుపడి నలిగిపోయిన కాగితం తీసి ఇచ్చాడు. అది ఆ లీజు గురించి ప్రకటిస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వు కాగితం.

ఆ శ్యాంసుందర్‌రెడ్డికి ప్రభుత్వం ఇచ్చిన కానుక చూసి నా మతిపోయింది. అప్పుడు ఆ ప్రభుత్వాజ్ఞ జారీ చేయడానికి అధికారం ఉన్న మంత్రి నేదురుమల్లి జనార్ధనరెడ్డి. అదే జిల్లాకు చెందిన రెడ్డి నాయకుడు. తమపట్ల విశ్వాసంతో, విధేయంగా ఉండే వారికి జమీందారీలు రాసి ఇవ్వడంలో బ్రిటిష్ పాలకులు కూడా ఎప్పుడూ ఇంత ఔదార్యంతో ప్రవర్తించలేదు. ఇంత పెద్ద ఎత్తున, అప్పనంగా ఆస్తులు అప్పగించలేదు. ఆ ప్రభుత్వాజ్ఞ ద్వారా నేదురుమల్లి జనార్ధనరెడ్డి తన ఆశ్రితుడికి సహాయం చేయడం మాత్రమేకాదు, కొన్నివేల మంది మత్స్యకార కుటుంబాలను నిరాశ్రయులను చేశాడు. వారి బతుకుదెరువు అగమ్యగోచరం చేశాడు.

న్యాయవాద వృత్తిలో ఉండే అవకాశమూ, పరిమితీ ఇవే. ఒక మనిషి జీవితం ఎట్లా గడుస్తున్నదో, ఒక సమాజ జీవితం ఎట్లా గడుస్తున్నదో తెలుసుకునే అవకాశం న్యాయవాదికి సులభంగా దొరుకుతుంది. అయితే, న్యాయవాది అనేవాడు "తటస్థం" గా ఉండాలనీ, తన దగ్గరికి వచ్చిన వ్యాజ్యాలను "శాస్త్రీయమైన నిర్మమత్వం"తో పరిశీలించాలనీ శిక్షణ ఇస్తుంటారు. అందువల్ల న్యాయవాదులు సాధారణంగా తమ న్యాయవాదిత్వపు సామాజిక పర్యవసానాల గురించి పరీక్షించుకోవడం ఉండదు. న్యాయవాదుల స్వతంత్ర ప్రతిపత్తి అనబడేదానివల్ల నిజంగా ఏమి జరుగుతుందంటే తమ వృత్తిపరమైన పనుల్లో కొందరు మాత్రమే కొంతమేరకు సామాజిక శ్రేయస్సు

కోసం పనిచేస్తారుగాని, మిగిలినవాళ్లందరూ సామాజిక శ్రేయస్సును బలి చేసి అయినా సరే తమ శ్రేయస్సును పెంచుకుంటారు. తమ ఆస్తులు పెంచుకుంటారు. ఒక్కసారి న్యాయవాద వృత్తికి ఉన్న ఆదర్శాలను, ప్రాతిపదికలను చూడండి.

నేదురుమల్లి జనార్ధనరెడ్డి అనే వ్యక్తి రాజ్యాంగం ప్రకారం ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధి. ఆయన రాజ్యాంగానికి బద్ధుడైన పనిచేస్తానని శపథం తీసుకుని తన పదవిలోకి వచ్చి ఉంటాడు. ఆయనకు, ఆయన లాంటి రాజకీయ వేత్తలకు రాజ్యాంగంలోని కొన్ని భాగాలు అధికారాన్ని ఇస్తాయి. ఒకసారి అధికారం వచ్చిన తర్వాత రాజ్యాంగం గురించి ఆయన ఏ ప్రస్తావన చేసినా అదంతా ఆయన వెనుక ఉండి మాట్లాడే వాళ్లమాటలేగాని ఆయన మాటలుకావు.

కాని న్యాయవాదులకు అటువంటి భేషజాలేమీలేవు. న్యాయవాద వృత్తే స్వేచ్ఛా వ్యాపారపోటీ సూత్రం మీద తయారయినది. ఈ వృత్తిలో ఉండే తీవ్రమైన పోటీకి కారణం అదే. న్యాయవాది ఎప్పుడూ ఫలితాలు ఏమిటనే దానిమీద ఆధారపడి మాత్రమే తన ప్రవర్తనను చూసుకుంటాడు. అసలు న్యాయవాదులు రాజ్యాంగాన్ని తమ వృత్తికి అవసరమైనమేరకు అక్కడక్కడా ముక్కలు ముక్కలుగానే చదువుతారు గాని రాజ్యాంగ స్ఫూర్తి ఏమిటనేది పూర్తిగా తెలిసేలా చదవరు.

అందువల్ల న్యాయవాద వృత్తిలోని ప్రధాన జీవన స్రవంతి నుంచి బయటపడటానికి ఎవరయినా బ్రహ్మాండమైన ప్రయత్నం చేయవలసి ఉంటుంది. ప్రధాన జీవన స్రవంతి నుంచి బయటపడిన న్యాయవాదిగా నేను నిజంగా న్యాయవాది తలచుకుంటే సమాజానికి ఎంత సేవ చేయగలడో గుర్తించి ఆశ్చర్యపోయాను. ప్రధాన స్రవంతి నుంచి బయటపడిన న్యాయవాది రాజ్యాంగ విలువల వ్యవస్థను బలోపేతం చేయడానికి ఏ మాదిరిగా ప్రయత్నించే అవకాశం ఉందో గుర్తించాను.

కొంతమంది న్యాయవాదులు ఒక బృందంగా ఏర్పడి న్యాయవ్యవస్థలోకి ప్రజానుకూల దృక్పథాన్ని ప్రవేశపెట్టడానికి ప్రయత్నించడం తప్పనిసరిగా చేయదగిన ప్రయోగమని నాకు ఎప్పుడూ అనిపిస్తుంది. అయితే ఆ మాట చెపుతూనే నేను ఒక జాగ్రత్త కూడా చెప్పవలసి ఉంది. ఏ ఇద్దరు న్యాయవాదులు కూడా ఎక్కువ కాలం కలసి పనిచేయడం సాధ్యంకాదు. ఎందుకంటే, అసలు న్యాయవాద వృత్తికి మౌలిక ప్రాతిపదికనే ఏమంటే సంప్రదాయక న్యాయవాది ఎవరయినా చాలా అహంకార పూరితంగా ఉంటారు. అవతలి వ్యక్తి మీదికి దూకుతానన్నట్టుంటారు. ప్రత్యర్థి పోరాటంలో అవతలి వ్యక్తిని చాలా సులభంగా ఒప్పించగలిగిన శక్తి సామర్థ్యాలు ఉంటాయి.

సరే, పులికాట్ సరస్సు కేసు విషయానికి మళ్లీ వద్దాం. ప్రభుత్వం ఆ మాదిరిగా శాం సుందరరెడ్డికి అనుకూలంగా ఉత్తర్వులు వెలువరించగలిగింది గాని ఆ ఉత్తర్వులు అమలులోకి రాలేదు. ఈలోగా వరల్డ్ వైల్డ్ లైఫ్ అనే స్వచ్ఛంద సంస్థ రంగంలోకి

దిగింది. సూళ్లూరుపేట కొన్ని ఋతువులలో ప్రపంచం నలుమూలల నుంచి వలస వచ్చే పక్షుల అభయారణ్యం గనుక, అటువంటి ప్రభుత్వ ఉత్తర్వులు ఇవ్వడానికి వీలులేదని, ఆ అభయారణ్యాన్ని యథాతథంగా పరిరక్షించవలసిందేనని సవాలు చేసింది. బాధితులు, వారి సమర్థకులు ఇటువంటి వాదనలు చేయడం, వాటిని న్యాయస్థానాలు తిరస్కరించడం చాలామంది న్యాయమూర్తులకు చాలా ఇష్టమైన క్రీడ. ఈ రాష్ట్రంలో వామపక్ష ఉద్యమం సుదర్ఘీకాలంగా సాగుతున్నప్పటికీ, ఉదారవాద రాజకీయాలను గాని, పాలననుగాని ప్రభావితం చేయడంలో అవి విఫలమయ్యాయనిపిస్తుంది. రాష్ట్రంలోని సంపన్నమైన వనరులను దోపిడీ చేయడం చాలా సులభంగా జరిగిపోతున్నది. ఏ సగటు కాంగ్రెస్ రాజకీయవేత్తనయినా ఆరోపణలు వచ్చినపుడు ప్రభుత్వం సాగించే దమనకాండ, అసలు మొత్తంగానే అన్నిరకాల రాజకీయాధికార దుర్వినియోగానికీ వర్తిస్తుంది. పౌరహక్కుల సంఘానికి సంబంధించిన కృషిని దెబ్బతీయడానికి, పౌరహక్కుల కార్యకర్తలు వెలికితీసి నిజాలను ఖండించడానికి ఏకైక మార్గం పౌరహక్కుల సంఘం నక్సలైట్ల ముసుగు సంస్థ అని ఆరోపించడం, ఆ ఆరోపణ చేస్తే చాలు, ఇక ప్రస్తావించిన ప్రత్యేక అంశాలకు జవాబు చెప్పనక్కరలేదు.

ఆ స్థితిలో ఆ పులికాట్ సమస్యను కేవలం మేమే పైకి ఎత్తితే సరిపోదని, దాన్ని రాజకీయ స్థాయిలో చర్చించాలని నేను అనుకున్నాను. ఆ రోజుల్లో నాకు పుచ్చలపల్లి సుందరయ్యగారితో సత్సంబంధాలు ఉండేవి గనుక ఆయన దగ్గర ఆ వివరాలన్నీ ప్రస్తావించాను. ఆయన ఆ వాస్తవాలను రాష్ట్ర శాసనసభలో లేవనెత్తుతాడని ఆశించాను. ఆయన ఆ విషయాలు ప్రస్తావించనేలేదు. ఆ శాసనసభ సమావేశాలు ముగిసిపోయాయి. తర్వాత కొంతకాలనికి సుందరయ్యతో మాట్లాడే అవకాశం వచ్చినప్పుడు నేను ఆయనను ఆ విషయం అడిగాను. పులికాట్ సరస్సు లీజును తాము పొందదలచుకున్న కొందరు స్మగ్లర్లు ఈ వివాదాన్ని రేకెత్తిస్తున్నారని తాను విన్నానని సుందరయ్య అన్నారు. నేదురుమల్లి జనార్దనరెడ్డి చేసిన పనికి ఇది సమర్థన కాజాలదని, నా వెనుక నక్సలైట్లు ఉన్నారనే మామూలు ఆరోపణతో జనార్థనరెడ్డి తాను చేసినపని నుంచి తప్పించుకోజాలడని నేను సుందరయ్యకు చెప్పాను. భారత ప్రభుత్వానికి మానవ హక్కుల మీద ఎంత శ్రద్ధ ఉన్నదో వినిపించడానికి వియన్నాకో అటువంటి అంతర్జాతీయ వేదికకో భారత ప్రభుత్వం తరపున ఈ జనార్థనరెడ్డినే పంపించాలని పివి నరసింహారావు అనుకున్నాడంటే మన రాజకీయాల స్థితి ఎట్లా ఉందో తెలుస్తుంది.

ఈ సందర్భంలోనే, ఇటు చివరి నెల్లూరు నుంచి అటు శ్రీకాకుళం వెళ్లి మరొక ఉదాహరణ చెప్పాలని అనిపిస్తున్నది. అవి ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కు సంపాదకుడుగా అరుణ్‌శౌరి ఉన్న రోజులు. ఆయన హైదరాబాద్‌లో ఇండియన్ ఎక్స్‌ప్రెస్ విలేకరి మధుసూదనరావును ఒక వార్త పరిశోధించి రాయమని అడిగాడు. ఆ సంఘటన శ్రీకాకుళం

జిల్లా పార్వతీపురానికి సమీపంలో ఉన్న కంబారిగాం అనే గ్రామంలో జరిగింది. పార్వతీపురం ప్రాంతం నక్సలైటు ఉద్యమానికి గుండెకాయ వంటిదని అందరికీ తెలుసు. ఆ విలేకరి రాసిన, ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో మూడు భాగాలుగా అచ్చయిన వార్తాకథనం చదివినవారు ఎవరయినా ఆశ్చర్యపోతారు. అక్కడ వాస్తవాలు బయటపెట్టాడు. వర్గశత్రు నిర్మూలన విధానం చాలా సమర్థంగా పనిచేస్తుందని చెప్పుకున్నప్పటికీ, అది వాస్తవంలో ఎన్నో తప్పులకు దారితీసింది. చిన్న వ్యాపారులు, మధ్య తరగతి భూ యజమానులు, తప్పని స్థితిలో పోలీసు ఇన్‌ఫార్మర్లుగా మారిన వ్యక్తులు, అణగారిన కులాలవాళ్ళు వర్గ శత్రు నిర్మూలనలో బలి అయిపోయారు. ఈ విషయం బయట పెట్టాడంటే ఆ విలేకరి వీరిని కాక మరెవరినయినా వర్గ శత్రువుగా గుర్తించి నిర్మూలించవచ్చునని అంటున్నాడని కాదు, ఉద్యమ క్రమంలో జరిగిన తప్పుల గురించి, పొరపాట్ల గురించి వివరిస్తున్నాడన్న మాట. అంతేకాదు, ఆయన చెప్పిన విషయాలు విప్లవోద్యమంలో కూడా స్వార్థ పరశక్తులు ఎట్లా పైరవీలకు ప్రయత్నించడానికి వీలుందో చెపుతాయి.

కంబారిగాం గ్రామం తర్ల జమిందారీకి చెందినది. అది పాత సైనిక ఇనాం లాగనిపిస్తుంది. అది మొదట పరశురామ చౌదరి అనే వ్యక్తికి దక్కింది. ఆయన ఆ ప్రాంతాల్లో ప్రధానమైన కళింగ కులానికి చెందినవాడు. ఆ కులస్తులు అధికార యంత్రాంగంలో, పోలీసు శాఖలో ఎక్కువగా ఉన్నారు. రాజకీయాల్లోకి కూడా ప్రవేశించి రాష్ట్రంలో ఎన్నికల రాజకీయాల్లో బలంగా ఉన్నారు. తర్ల జమిందారుకూ పరశురామ చౌదరికీ మధ్య దాదాపు అర్ధ శతాబ్దంపాటు న్యాయస్థానాలలో వివాదం చెలరేగింది. జమిందారు ఆ భూమి తనదేనని, దాన్ని తనకు తిరిగి ఇప్పించాలని న్యాయస్థానాలను ఆశ్రయించాడు. పరశురామ చౌదరి ఆ భూమి తనకు చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా దక్కిందని, దాని మీద సర్వాధికారాలు తనవేనని వాదించాడు. కొన్ని దశాబ్దాలపాటు నడిచిన ఈ వ్యాజ్యంలో మొదటి బ్రిటిష్ ప్రభుత్వం జమిందారీని ఏ ప్రాతిపదికగా ఆమోదించడం జరిగిందో వాస్తవాలు వెల్లడికాలేదు. తర్ల జమిందారు ఉద్దేశ్యపూర్వకంగానే తన జమిందారీ ఆమోద వివరాలను న్యాయస్థానం ముందు ఉంచలేదు. ఎందుకంటే ఆ జమిందారీ ఆమోదంలోని కొన్ని నిబంధనల ప్రకారం ఆ భూమి జమిందారుకు దక్కే అవకాశం లేదు. ఆ అసలు ఆమోద పత్రాన్ని ప్రవేశపెట్టలేకపోవడంవల్ల తన అధీనంలోని భూమికి ప్రమాదం రాదు గనుక, ఆ పత్రాన్ని సమర్పించాలని పరశురామ చౌదరి కూడా పట్టుబట్టలేదు. చట్ట వ్యవహారాలలోని ఈ భాగం చాలా ఆసక్తికరమైనది. ఎందుకంటే వాది, ప్రతివాది కూడా ఒకే విషయాన్ని దాచడానికి ప్రయత్నించారు. ఆ భూదాన పత్రాలు ఎంత అక్రమమైనవో, వాస్తవ జగత్తుకూ న్యాయశాస్త్రానికి మధ్య ఎంత అంతరం ఉంటుందో కూడా ఈ వ్యవహారం బయటపడుతుంది.

కంబారిగాం జమిందారుకూ, నిజమైన భూమిసాగుదార్లకూ మధ్య స్థానంలో వివాదం

ముగిసిపోయిన తర్వాత, అప్పటి వరకూ బ్రిటిష్ ప్రభుత్వం జమీందార్లకు భూమిని దానం చేస్తూ ఇచ్చిన అనుమతులను, చట్టాలపై చర్చ మొదలయింది. ఆ దాన పత్రాలు సాధారణంగా బ్రిటిష్ పాలకులకు విధేయంగా, విశ్వాసపాత్రంగా ఉన్నందువల్ల అందినవి. ఆ దానపత్రాలు పొందినవారందరూ బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా స్థానిక ప్రజలు చేసిన తిరుగుబాట్లకు విద్రోహం చేసినవారు. లేదా నిర్ణీత కాల వ్యవధిలో బ్రిటిష్ ప్రభుత్వానికి కప్పం కట్టడానికి ఆమోదించినవారు. లేదా స్థానికులకు వ్యతిరేకంగా బ్రిటిష్ పాలకులు సాగించిన యుద్ధాలలో సైనికులను సమకూర్చడానికి ఒప్పుకున్నవారు.

దక్షిణాదిలోని పుదుక్కోటై అనే చిన్న రాజ్యానికి కత్తి కొడుత సీమై అని పేరు. ఆ తమిళ మాటకు అర్థం కుట్ర చేసిన దేశం అని, తిరుగుబాటుదారు అయిన జమిందారు కట్టబొమ్మన్ చేసిన పోరాట నేపథ్యంలో ఈ రాజ్యం దానం జరిగింది.

వాస్తవంగా ఇటువంటి బ్రిటిస్ దానపత్రాలను, భూదానాలను, జమీందారీలను స్వతంత్ర భారత ప్రభుత్వం అనుమతించనక్కరలేదు. ఆ భూముల సొంతదార్లను అసలైన, సాధికారికమైన యజమానులుగా గుర్తించనక్కరలేదు. ఎందువల్లనంటే, ఆ రాజ్యాలన్నీ ఈ దేశంలో వలసవాదాన్ని, బ్రిటిష్ సామ్రాజ్యాన్ని కాపాడడానికి, కాపాడినందువల్ల వచ్చినవే. అవన్నీ బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా రాజకీయంగా అనైతికమైనవి. భారత స్వాతంత్ర్యానికి వ్యతిరేకమైనవి. అందువల్ల స్వతంత్ర భారతంలో ఆస్తి హక్కును పునర్నిర్వచించేటప్పుడు ఈ రాజ్యాలను మినహాయించడం సాధ్యమూ అవసరమూ కూడ.

కాని మన రాజకీయ వ్యవస్థ ఒక క్రమ పరిణామంలో అభివృద్ధి చెందుతుందనే అవగాహనలోనే చాలా లోపాలున్నాయి. ఒక సామ్రాజ్యవాద వలస దేశం స్థానం నుంచి భారతదేశం ఒక స్వతంత్ర దేశంగా ఎదగగలగడమనేది అంత సులభసాధ్యమైన విషయం కాదు. ఆ పని జరగాలంటే గతంలో కచ్చితమైన, స్పష్టమైన విభజన ఉండాలి. గతంతో బంధం తెగిపోవాలి. తెగదెంపులు జరగాలి. నిజానికి వంద సంవత్సరాలకు పైగా జరిగిన పోరాట క్రమంలో ఆ తెగగొట్టుకునే ప్రయత్నం జరిగి ఉండవలసింది. ఆ క్రమ పరిణామం సవ్యంగా జరగలేదు సరిగదా, భారత స్వాతంత్ర్య చట్టం అనేదాన్ని ఆమోదించడం ఆ క్రమాన్ని సహజమైనది కాకుండా చేసింది.

ఒక సామ్రాజ్యవాద వలసను స్వతంత్ర భారతంగా మార్చడం అనే అవగాహన అనేక సమస్యలకు కారణమైంది. అంతమాత్రమే కాదు, ఒకవైపు ఒక కొత్త రాజ్యాంగాన్ని రచించుకుంటూనే, బ్రిటిష్ పాలకులు ప్రవేశపెట్టిన అనేక చట్టాలను యథాతథంగా కొనసాగించడం కూడా ప్రారంభించాం. ఆ పని కూడా చాలా గందరగోళంగా, అస్తవ్యస్తంగా చేశాం. రాజ్యాంగంలోని అధికరణం 327 నిస్సందేహంగా అటువంటి వైఖరిని ప్రకటిస్తుంది. కాని అదే సమయంలో అది అట్లా చట్టాలను యథాతథంగా ఆమోదించడానికి ఒక మినహాయింపును కూడా ప్రకటించింది. అప్పటివరకూ ఉన్న చట్టాలను యథాతథంగా

కొనసాగించాలని అంటూనే, ఆ అధికరణం ఉన్న చట్టాలన్నిటినీ ఒకసారి సమీక్షించాలని కూడా ప్రకటించింది. ఆ సమీక్ష తర్వాత వాటిని రాజ్యాంగానికి అనుకూలంగా ఆమోదించడం గాని, మార్చి ఆమోదించడం గాని చేయాలని ఆ అధికరణం అంటుంది.

ఆ అధికరణాన్ని మరొక మాటల్లో చెప్పాలంటే, ఈ దేశంలో అమలయ్యే చట్టాలన్నీ రాజ్యాంగ విలువల చట్రానికి లోబడి మాత్రమే ఉండాలని అర్థం. కాని ఈ దృక్కోణాన్ని ఆ తర్వాతి కాలంలో ప్రతి ఒక్కరూ సంపూర్ణంగా విస్మరించారు. ఒక్క ఉదాహరణ చెప్పాలంటే, పాత బ్రిటిష్ చట్టాలలో ఉన్న క్రిమినల్ లా అమెండ్‌మెంట్ చట్టాలన్నీ, రాజద్రోహకర సమావేశాల చట్టం వంటి దుర్మార్గ చట్టాలన్నీ ఈ దేశంలో బ్రిటిష్ వ్యతిరేక స్వాతంత్ర్యోద్యమాన్ని అణచివేసే ఉద్దేశ్యంతో చేసినవే అని ఆ చట్టాల కారణాలు, ఉద్దేశ్యాల ప్రకటనలు తెలుపుతాయి. కాని స్వతంత్ర భారత ప్రభుత్వం ఆ చట్టాలను ఏ మార్పులూ లేకుండా యథాతథంగా అనువర్తింపజేసుకుంది. అటువంటి ఘోరమైన చట్టాలను ఎటువంటి చర్చా, సవరణలూ లేకుండా రాష్ట్రపతి ఉత్తర్వులతో అమలులోకి తేవడం జరిగింది. అలా చేయడం ద్వారా అసలు ప్రజల దృష్టికే రాకుండా ఆ చట్టాలు అమలులోకి వచ్చేశాయి. ఒకవేళ బ్రిటిష్ ప్రభుత్వ చట్టాలుగా వాటిని మొదట రద్దుచేసి, ఆ తర్వాత మార్పులతో ప్రవేశపెట్టదలచినప్పటికీ, ప్రజలనుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత వచ్చి ఉండేది.

ఈ నేపథ్యంలో కంబారిగాం వివాదాన్ని మళ్లీ పరిశీలించవలసి ఉంది. స్వాతంత్ర్యానికి ముందు ఉన్న చట్టాలను గుడ్డిగా యథాతథంగా అమలులోకి తేవడం వల్ల, పాత పరశురామచౌదరి వారసుడైన కొత్త పరశురామ చౌదరి న్యాయస్థానాలను ఆశ్రయించి వ్యాజ్యం నడపగలిగిన అవకాశం వచ్చింది. బ్రిటిష్ ప్రభువులు తనకు ఇచ్చిన దానపత్రాల సాధికారమైనవేనంటూ ఆయన స్వతంత్ర భారత న్యాయ వ్యవస్థను ఆశ్రయించాడు. అయితే విచిత్రమైన విషయమేమంటే ఆయన వంశీకులకు బ్రిటిష్ పాలకులు ఇచ్చిన అసలు దానపత్రం ప్రస్తుతం దొరకడం లేదన్నాడు. అందువల్ల న్యాయశాస్త్రంలో అమలులో ఉన్న ఒక మార్మిక సూత్రం "అదృశ్యమైన దానపత్రంలో ఉన్నట్టుగా" అనేదాన్ని దాదాపు అందరు దానగ్రహీతలు, జమీందార్లు వాడుకున్నారు. ఈ ఊహల మీద ఆధారపడిన నమ్మకాలు సాధారణంగా జమీందార్ల పక్షానికే మేలు చేశాయి. అట్లాగే ఈ దానం శాశ్వత భూమిశిస్తు అమలులోకి రాకముందు జరిగినది అని మరొక సూత్రం కూడా ఉంది. ఇది ఎంత అబద్ధపు సూత్రమో చెప్పనక్కరలేదు. కాని పరశురామ చౌదరివంటి కక్షిదార్లు ఈ సూత్రాలను తమ స్వప్రయోజనాల కొరకు సమర్థంగా వాడుకున్నారు. అంటే అన్యాయాన్ని కొనసాగించడానికి వాళ్లు న్యాయవ్యవస్థను సమర్థంగా, తెలివిగా వాడుకున్నారు. మొత్తం మీద పరశురామ చౌదరికి అనుకూలంగానూ, కౌలుదార్లకు వ్యతిరేకంగానూ న్యాయస్థానాల తీర్పులు వెలువడ్డాయి. ఈ మాదిరిగా ఆ భూ వివాదం ఎల్లకాలానికి సమసిపోయినట్టే కనబడింది. కాని మధుసూదనరావు వార్తా

కథనాలవల్ల కంబారిగాం వివాదమంతా మళ్లీ ఒకసారి తెరపైకి వచ్చింది.

కంబారిగాం భూస్వామి పరశురామ చౌదరి స్వాధీనంలో ప్రభుత్వ సర్వే జరగని 450 ఎకరాల భూమి ఉండింది. అందువల్ల ప్రభుత్వం భూమి సర్వే జరపనంతవరకూ భూ గరిష్ఠ పరిమితి చట్టాన్ని అమలు చేయడానికి వీలులేదని ఆ భూస్వామి వాదించాడు. ఆ వాదనను అంగీకరించి రాష్ట్ర హైకోర్టు కూడా ఆ భూమి స్వాధీనం చేసుకోకుండా స్టే ఇచ్చింది. ఆ భూమి మధ్యగా ఒక పంటకాలువ ప్రవహిస్తోంది. ఆ కాలువ తన భూమిలో ప్రవహిస్తున్నందువల్ల తాను ఆ నీటికి నీటి తీరువా కట్టనక్కరలేదని ఆ భూస్వామి న్యాయస్థానంలో వాదించాడు. ఆ రోజుల్లో భూస్వాములందరూ వాదించినట్టుగానే ఆయన కూడా ఆ భూమి అంతా తన స్వాధీనంలోనే ఉన్నట్టు, తానే సాగు చేయిస్తున్నట్టు, తాను జీతానికి పెట్టుకున్న రైతు కూలీలెవరూ కౌలుదారులుగా హక్కు కోరడానికి వీలులేదన్నట్టు వాదించాడు.

కంబారిగాం భారతదేశం మధ్యలో ఒక ద్వీపంలాగున్నదని, అక్కడ భారత రాజ్యాంగం గాని, మరే భారత చట్టాలు గాని చెల్లవన్నట్టు కనబడుతున్నదని మధుసూదనరావు రాశాడు. ఆ గ్రామంలో ఒక లయన్స్ క్లబ్ శాఖ మాత్రం ఉన్నది. అది మాత్రమే అక్కడ ఆధునిక నాగరికతా చిహ్నం. అటువంటి పరిస్థితుల్లో అక్కడి రైతు కూలీలు తమ జీవన పరిస్థితులు మెరుగుపరచుకోవడానికి, భూమిని దున్నే రైతులుఆ తమ కౌలుదారు హక్కులను పరిరక్షించుకోవడానికి పోరాటానికి పూనుకోవడం చాలా సహజమైన విషయమే. ఆ గ్రామంలో బహుశా లయన్స్ క్లబ్ పర్యవేక్షణలో ఒక పాఠశాల కూడా నడుస్తుండేది. ఆ పాఠశాల ఉపాధ్యాయుడే ఆ గ్రామంలో పోస్టుమాస్టర్‌గా కూడా పనిచేస్తుండేవాడు. ఆ పాఠశాల, ఆ పోస్టాఫీసు ఆ గ్రామంలోకి ఎంతో కొంత నాగరికత ప్రవేశించిందనడానికి చిహ్నాలు. ఆ గ్రామంలో జరుగుతున్న కౌలుదార్ల పోరాటాన్ని రాష్ట్రంలోని రాజ్యాంగ బద్ధ ప్రభుత్వం గుర్తించింది. ఆ గుర్తింపు ఫలితంగా, రాష్ట్రంలోని ఉత్తమమైన అధికారులలో ఒకరయిన, అప్పటి శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న గిర్‌గ్లానిని నివేదిక సమర్పించవలసిందిగా ప్రభుత్వం ఆదేశించింది. ఆ గ్రామంలో చట్టవ్యతిరేకంగా ఆందోళనకారులు గుమిగూడడం జరిగిందా, పోలీసు అధికారులు తమ అధికారాన్ని దుర్వినియోగం చేశారా అని విచారించడం ఆయన పని. గిర్‌గ్లాని నివేదికలోని ఒక వాక్యం నాకు ఇంకా గుర్తుంది. ఆ గ్రామంలో పోలీసులు భూస్వామి సొంత సైన్యంగా పనిచేస్తున్నారని ఆయన రాశాడు. ఇపుడు దేశ పోలీసు వ్యవస్థలో అత్యున్నత స్థానంలో ఉన్న హెచ్.జె. దొర ఆ రోజుల్లో రాష్ట్రంలో పోలీసు వ్యవస్థలో అత్యున్నత స్థానంలో ఉండేవాడు. ఆయన కంబారిగాం భూస్వామి చౌదరికి పూర్తి రక్షణ కల్పించాడు.

మధుసూదనరావుతో కలసి నేను చాలాసార్లు శ్రీకాకుళం పర్యటించాను. అటువంటి పర్యటనల్లో భాగంగా ఒకసారి మధుసూదనరావు వ్యాసాలు అచ్చయిన కొద్దిరోజులకే

నేను అప్పటి నా యువమిత్రుడు జె హరినారాయణను కలిశాను. ఆయన అప్పుడు శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. మేం కంబారిగాం సమస్యను చర్చించాం. అదృశ్యమైన దానపత్రం అనేసూత్రం ఒక అబద్దమని, అప్పుడు ప్రముఖంగా వినియోగంలో ఉన్న ఆ సూత్రాన్ని వదిలేయాలని, ఆ సూత్రంవల్లనే ఒక భూస్వామికి విస్తారమైన ఆస్తులను తన ఆధీనంలో పెట్టుకునే అవకాశం వస్తున్నదని నేను వాదించాను. లేదా ఆ సూత్రం ఆధారంగానే పాత భూస్వాములు లెక్కలేనంత నష్టపరిహారాన్ని కోరడం జరుగుతున్నదని నేను వాదించాను. అయినా నేను అలా గంటల తరబడి చర్చించుకున్నాం.

ఆ చర్చ క్రమంలోనే ఆ దానపత్రం, సంబంధిత పత్రాలు ఒకవేళ ఒరిస్సాలోని పురాపత్ర భాండాగారంలో ఉండవచ్చునని అనిపించింది. ఎందుకంటే ఆ వివాదంలో కొంత భాగం బరంపురం న్యాయస్థానాల్లో జరిగింది. లేదా అప్పుడు ఆ ప్రాంతం మీద అధికారం ఉండిన మద్రాసు హైకోర్టులోనైనా ఆ కాగితాలు దొరకవచ్చునని, లేదా తర్ల జమీందారీ కార్యాలయంలోనైనా అది దొరకవచ్చునని నాకు అనిపించింది.

హరినారాయణ వెంటనే తన స్టెనోను పిలిచి తర్ల జమీందార్ కార్యాలయానికి ఒక లేఖ రాయించాడు. తర్ల జమీందారీ దానపత్రాన్నీ వెంటనే తనకు దాఖలు చేయవలసిందిగా ఉత్తర్వు జారీ చేశాడు. ఆశ్చర్యకరంగా కొద్ది రోజుల్లోనే తర్ల జమీందారీ కార్యాలయం ఆ కాగితాన్ని కలెక్టర్‌కు సమర్పించింది. ఆ దానపత్రం ఏ మాత్రం చెడిపోకుండా మంచి స్థితిలో ఉంది. దాని మీద దస్తూరీ కూడా చాలా స్పష్టంగా ఉంది. ఆ దానపత్రం ఏ షరతులకు, నిబంధనలకు లోబడి ఇవ్వడుతున్నదో చాలా స్పష్టంగా ఉంది. ఆ భూమి మీద కౌలుదార్లు ఉన్నారని కూడా ఆ దానపత్రం గుర్తించింది. ఆ దానపత్రం మీద అప్పటి గవర్నరో, వైస్రాయో సంతకం పెట్టారు. ఆ పత్రం మీద తేదీ 1803 అని ఉన్నట్టు గుర్తు. హరినారాయణ ఆ పత్రం నకలు ఒకదాన్ని నాకు అందజేశాడు. దాన్ని నేను ఆ న్యాయ వివాదంలో ఉపయోగించుకున్నాను.

అప్పటికే ఆ వివాదంలో తుది తీర్పు వచ్చి ఉంది. నిజంగా సాగుదార్లయిన రైతులు, కౌలుదార్లు ఆ వివాదంలో భాగం కానప్పటికీ న్యాయస్థానం తన తుది తీర్పు ఇచ్చేసింది. ఆ తీర్పుకు ఆధారమైన దానపత్రం అదృశ్యం అనేది వాస్తవం కానప్పటికీ ఆ తీర్పు అంతిమం అయిపోయింది.

అందువల్లనే నేను మళ్లీ మళ్లీ చెప్పేదేమంటే మన రాజ్యాంగం, ప్రత్యేకించి ప్రవేశిక, ఎటువంటి సామాజిక మార్పును ఆశించిందో ఆ మార్పు దృష్ట్యా చూసినప్పుడు మన చట్టాలు, వాటి వ్యాఖ్యానాలు అర్థరహితమైపోతాయి. అవన్నీ సామాజిక యథాతథ స్థితిని కాపాడడానికి మాత్రమే ఉపయోగపడతాయి. అందువల్ల వాటిని మౌలికంగా పునరాలోచించవలసి ఉంది. ఒక్క ఉదాహరణ చెప్పాలంటే ఆస్తి హక్కేమో బదిలీ చేయడానికి వీలులేని అవిభాజ్యమైన హక్కుగా ఉంది. కాని వ్యక్తిగత స్వచ్ఛా హక్కు

మాత్రం అంత అవిభాజ్యంగాలేదు. ఆ ఆస్తి ఒక దానం గనుక దాన్ని ఉపసంహరించుకోవచ్చు. ఆస్తిహక్కుపై సాగిన వివాదాల చరిత్రను, వ్యక్తిగత స్వేచ్ఛపై సాగిన వివాదాల చరిత్రను మనం అధ్యయనం చేసినట్టయితే, పోల్చి చూసినట్టయితే ఈ రెంటిలో ఏది మౌలికమైనదో, ప్రాథమికమైనదో అర్థమవుతుంది. కాని ప్రతి సందర్భంలోనూ వ్యాఖ్యానంలో ఇమిడి ఉన్న నిరంకుశత్వమే మానవ సహజ పురోమనానికి అడ్డంకిగా మారుతోంది. ఇక ఆ న్యాయ వివాదాన్ని పక్కనపెట్టి ఈ కంబారిగాం వ్యవహారంలో ఏమయినా చేయవలసిందిగా కోరడానికి నేను భారత కమ్యూనిస్టుపార్టీకి చెందిన దాసరి నాగభూషణరావును కలిసి ఆ విషయం చర్చించాను. ఆ తర్వాత ఆయన ఆ బాధితులతో కలసి ఒక సమావేశం ఏర్పాటుచేసి పోరాటం ప్రారంభించారు.

ఈ కంబారిగాం భూ వివాదాన్ని నడిపిన పరశురామ చౌదరి తర్ల జమీందారీ కింద ఒక ఇనాందారు. ఆ తర్ల జమీందారీని బ్రిటిష్ ప్రభుత్వం తయారుచేసింది. ఆ ఇనాములను బ్రిటిష్ ప్రభుత్వమే ఇచ్చింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత తర్ల జమీందారీ వంటి భూస్వామ్య నిర్మాణాలన్నిటినీ చట్ట ప్రకారం రద్దు చేయడం జరిగింది గాని ఈ ఇనాములు మాత్రం చెక్కుచెదరకుండా ఉండిపోయాయి. కాగితం మీద జమీందారీ రద్దయిపోయిందిగాని కంబారిగాం ఇనాం మాత్రం మారడానికి నిరాకరించింది.

న్యాయస్థానాలలో కుటిలపన్నాగాలు పన్నుతూ ఆ నాలుగు వందల ఎకరాల ఇనాము సంస్థానం బ్రిటిష్ పాలనా కాలంలోనూ, స్వాతంత్ర్యం తర్వాత కూడా యథాతథంగా ఉండిపోయింది. కంబారిగాంలోని ఆ భూమి తన జమీందారీలో భాగమే గనుక తనకు వెనక్కి ఇప్పించాలని తర్ల జమీందారు, అది తమ పూర్వీకులకు ఇనాముగా వచ్చింది గనుక తనకే దక్కాలని కళింగ కులానికి చెందిన పరశురామ చౌదరి న్యాయస్థానంలో ఎడతెరిపిలేని పోరాటం చేశారు. అయితే నాలుగు దశాబ్దాలపాటు నడిచిన ఆ వివాదంలో అటు జమీందారుగాని, ఇటు పరశురామ చౌదరిగారి తర్ల జమీందారీని ఏర్పాటుచేస్తూ బ్రిటిష్ ప్రభుత్వం ఇచ్చిన అసలు దానపత్రాన్ని న్యాయస్థానం ముందు ఉంచలేకపోయారు. ఆ తొలి దానపత్రం లేదుగనుక అసలు ఆ జమీందారీ ఏమిటో, దానిలో ఏయే గ్రామాలున్నాయో, ఆ దానం ఏ షరతుల కింద ఇవ్వబడిందో, ఆ జమీందారీ స్వభావం గాని, ప్రయోజనం గాని ఏమిటో, ఆ జమీందారీ గ్రామాలలో నివసించే ప్రజల హక్కులు, హోదాలు ఏమిటో, జమీందారుకూ, ఆ జమీందారీలోని గ్రామాలలో నివసించే ప్రజలకూ మధ్య సంబంధం ఏమిటో ఎవరూ చెప్పలేని స్థితి నెలకొంది. తనకు అందిన సేవలకుగాను జమీందారీ ఆ గ్రామాలను మళ్లీ ఎవరికయినా దానం ఇవ్వవచ్చునా, అలా ఇచ్చినపుడు ఆ మధ్య వర్తులకూ ప్రజలకూ మధ్య సంబంధాలు ఎలా ఉంటాయి అనేవి ఎవరికీ తెలియదు. ఆ భూ వివాదాన్ని విచారిస్తున్న న్యాయ స్థానాల దృష్టికి ఈ విషయాలేవీ

రాలేదు. జమీందారు కబంధ హస్తాల నుంచి బయటపడే ఉద్దేశ్యంతో, అసలు దానపత్రం లభ్యం కాకపోవడమే తనకు ప్రయోజనమన్నట్టు పరశురామ చౌదరి భావించాడు.

ఒకరి ఆధీనంలో భూమి ఉంటే వారి అధికారాన్ని సమర్థించడానికి న్యాయశాస్త్రంలో అనేక భ్రమలు, కల్పనలు, ఊహలు ఉన్నాయి. న్యాయశాస్త్ర విద్యలో ప్రవేశించగానే మా అందిరకీ ఆస్తి మీద అధికారాన్ని సమర్థించే తొమ్మిది సూత్రాలు నేర్పుతారు. ఒక వ్యక్తి ఆస్తి మీద అధికారం ఏ విధంగా సంపాదించినప్పటికీ అది ఆ వ్యక్తినుంచి వేరుచేయడానికి వీలులేనిదని భావిస్తారు. ఒక ఆస్తి మీ అదుపులో ఉంటే దాని మీద మీకు అధికారం ఉన్నట్టే. ఒక భూమికి నిజంగా సొంతదారు ఎవరయినప్పటికీ మీరు ఆ భూమి మీద పన్నెండు సంవత్సరాలపాటు ఉంటే ఇక ఆ భూమి ఆ దురదృష్టవంతుడిది కాదు, మీదే. ఎవరయినా ఒక భూమి మీద అధికారాన్ని ఎన్నికల్పనలతోనైనా సరే స్థాపించుకోవచ్చు. భారత స్వాతంత్ర్యోద్యమం నిరంతరాయంగా కాకపోయినా అప్పుడప్పుడూ అయినా దున్నేవారిదే భూమి అనే నినాదాన్ని ఇచ్చింది. ఆ నినాదం ప్రజల స్వాతంత్ర్యానికి ఒక చిహ్నంగా ఉండింది. ఆ నినాదం ద్వారా జమీందార్లనుంచీ, ఇనాందార్ల నుంచీ, అటువంటి భూస్వామ్య రాచరిక అవశేషాలన్నిటి నుంచీ తమకు విముక్తి దొరుకుతుందని ప్రజలు ఆశించారు. కాని రాజ్యాంగం వచ్చి ఆస్తిని ఒక ప్రాథమిక హక్కుగా గుర్తించేసరికి, జమీందార్లు తమ జమీందారీలను కూడా ప్రాథమిక హక్కుగా వాదించడం మొదలుపెట్టారు. ఎంతోమంది న్యాయవాదులు, చివరికి రాజ్యాంగ నిర్ణయసభలో సభ్యులుగా ఉండిన న్యాయవాదులు కూడా ఈ జమీందార్ల హక్కుల పరిరక్షణ కొరకు వాదించడం మొదలుపెట్టారు. దేశంలో ఎన్నో చట్టాలు ఈ జమీందార్ల చెర నుంచి భూమిని విడిపించడానికి ప్రయత్నించినప్పటికీ, ఆ చట్టాలను ఈ న్యాయవాదులు సవాలు చేశారు.

కంబారిగాంలో పరుశురామ చౌదరి మరొక వివాదాన్ని కూడా రేకెత్తించాడు. తనకు అందిన భూమి ఇనాం భూమి అని, అందువల్ల దానిలో మరొకరికి భాగం ఇవ్వడం కుదరదని, తాను ఆ భూమిని కౌలుదార్లెవరికీ ఇవ్వలేదని, మొత్తం 400 ఎకరాల చిల్లర తన ఆధీనంలోనే, తన సొంత సాగులోనే ఉన్నదని వాదించాడు. నాలుగు వందల ఎకరాల భూమిని ఆయన ఒక్కడే సాగుచేస్తున్నాడని న్యాయవాదులు వాదించగలరు. న్యాయస్థానాలు కూడా అది నిజమేనని నిర్ధారించగలవు. తీర్పులివ్వగలవు. ఒకవైపు ప్రగతిశీలమైన భూ సంస్కరణ చట్టాలు అమలులోకి వస్తుండగానే ఆ చట్టాలు తన భూమికి మాత్రం వర్తించవని ఆయన వాదించగలడు. తన భూములు సర్వే పూర్తికాలేదుగనుక తన భూమి గరిష్ట పరిమితికి మించి ఉన్నదని చెప్పడం న్యాయబద్ధం కాదని కూడా ఆయన వాదించగలడు. తన భూమిలో నుంచి ప్రవహించే కాలువలోకి నీరు ప్రభుత్వం ప్రజాధనంతో నిర్మించిన నీటి పారుదల ప్రాజెక్టు నుంచి వచ్చినా సరే,

ఆ కాలువ తన సొంతమని, అందువల్ల ఆ నీటికి తనాఉ నీటి తీరువా కట్టనక్కరలేదని కూడా ఆయన వాదించగలడు. ఒకవేళ ఆ భూమికి భూ గరిష్ట పరిమితి చట్టాలు వర్తిస్తాయని ఎవరయినా వాదిస్తే అయినా, ఆయన భార్యా విడాకులు తీసుకున్నారుగనుక తాము రెండు యూనిట్లు గనుక తమ దగ్గర రెట్టింపు భూమి ఉండవచ్చునని వాదిస్తారు. విడాకుల తర్వాత వారికి శిశువు జన్మించాడని ఆధారాలు ఉన్నాసరే.

ఈ విషయాలన్నీ ఆయన ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కు, విలేకరి మధుసూదనరావుకు వ్యతిరేకంగా దాఖలుచేసిన వ్యాజ్యం విచారణ సందర్భంగా నా క్రాస్ ఎగ్జామినేషన్‌లో బయటపడ్డాయి. కంబారిగాం వివాదంలో ఇది ఒక కొత్త కోణం. ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో వచ్చిన వార్తా కథనాలు తనకు పరవునష్టం కలిగిస్తున్నాయని దావా వేయమని పరశురామ చౌదరికి ఆయన న్యాయవాదులు సలహా ఇచ్చినట్టున్నారు. విలేకరి మధుసూధనరావు మీద మాత్రమేగాక ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక యాజమాన్యం మీద కూడా ఆయన ఆ దావా వేశాడు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నన్ను వాదించమని కోరింది. నేను దాఖలుచేసిన లిఖితపూర్వక వాదనలలో ఇద్దరు పరశురామ చౌదరులు చేసిన న్యాయపరమైన వివాద చరిత్ర, సర్ విలియం బెంటింక్ సంతకం చేసిన దానపత్రపు షరతులు, ఇతర ఆధారాలు సమకూర్చాను.

న్యాయస్థానానికి వెళ్లేవారెవరయిన తమ వైఖరిని సంపూర్ణంగా సకల ఆధారలతో వెల్లడించాలి. అయినా గణితశాస్త్రంలో లాగ ఫలితం కచ్చితంగా వెలువడుతుందనే నమ్మకంలేదు. వాస్తవానికీ విచారణకూ సంబంధం ఏమంటే విచారణ వల్ల నిర్ణయ క్రమంలో నిరంకుశత్వం, పాక్షికత్వం లేదని చెప్పడానికి వీలవుతుంది. అంతే విచారణ క్రమం రెండు పక్షాల వాదానలలోనూ ఉండగల తప్పుల గురించి తెలియజేస్తుంది. ఎలా జరగడానికి వీలున్నదో ఊహిస్తుంది. అందువల్ల నిర్ణయానికి రావడం నిరంకుశంగా జరగదు. అసలు ఎప్పుడైనా ఒక అనిశ్చితతకు అవకాశం మిగిలి ఉంటుందని కూడా ఈ విచరాణలో నిర్ణయక్రమం గుర్తిస్తుంది. నిజానికి మనుషులు చేసే అన్ని నిర్ణయాలలోనూ ఈ మాదిరి అనిశ్చితతకు అవకాశం ఉంటుంది. సాక్ష్యం చెప్పబోయే ముందు దేవుడిమీదనో, ఏదయినా మత గ్రంథం మీదనో ప్రమాణం చేయడం మినహా మిగిలిన విచారణ అంతా మతవాసనలేకుండా లౌకిక పద్ధతిలోనే జరుగుతుంది. నిజానికి సత్యం అనేది కూడా ఒక మత వ్యక్తీకరణే అని నేననుకుంటాను. ఇంగ్లండ్‌లో సాక్ష్యాధారాల చట్టం అభివృద్ధి కావడానికి పూర్వరంగాన్ని సిద్ధం చేసినవి పునరుద్ధరణ ఉద్యమం, మత విచారణలు అయినప్పటికీ, ఆ సాక్ష్యాధారాల సేకరణలో మతభావనలు ఏవీ లేకపోవడం ఆశ్చర్యకరం. అలాగే భారతదేశంలో అమలులో ఉన్న సాక్ష్యాధారాల చట్టం కూడా మతభావనలు లేనిదే. అది సత్యం గురించి మాట్లాడదు. అది కూవలం సంబంధిత వాస్తవాల గురించి మాత్రమే పట్టించుకుంటుంది. అది మంచిచెడులగురించి పట్టించు

కోదు. నిర్ణయం తీసుకునే క్రమానికి మంచి చెడులతో సంబంధంలేనప్పటికీ ఈ మొత్తం వ్యవహారపు లక్ష్యం మాత్రం ఒక పక్షపు న్యాయబద్ధతను చెప్పడమే.

రెండు రోజులపాటు ఎనిమిది గంటలు పరశురామ చౌదరిని బోనులో నిలబెట్టి నేను క్రాస్ ఎగ్జామినేషన్ చేశాను. ఆ భూమి తన సొంత సాగులో లేదని, కౌలుదార్లు ఉన్నారని ఆయన ఒప్పుకున్నారు. నా క్రాస్ ఎగ్జామినేషన్‌లో ఈ మాదిరిగా అన్ని విషయాలూ ఒప్పుకున్న తర్వాత ఆయన నా దగ్గరికి వచ్చి రాజీ కుదుర్చుకుందామని అడిగాడు. ఏ వ్యాజ్యంలోనైనా, ఆ వ్యాజ్యం స్వభావం గనుక అనుమతిస్తే న్యాయ స్థానానికి బయట రాజీకి నేను ఒప్పుకున్నాను. జస్టిస్ పున్నయ్య మధ్యవర్తిగా పరిష్కరించుకుందామని నేను ప్రతిపాదించగా పరశురామ చౌదరి ఒప్పుకున్నాడు. ఆయన తన మనసు మార్చుకునేలోగా ఆ మధ్యవర్తిత్వం, న్యాయస్థానం బయట వివాద పరిష్కారం పక్కా చేయాలని నేననుకున్నాను. తన అధీనంలో ఉన్న భూమిలో నుంచి కనీసం మూడు వందల ఎకరాలను కౌలుదార్లు ఇవవ్వడానికి అంగీకరిస్తేనే ఆ పరిష్కారానికి, మధ్యవర్తిత్వానికి ఒప్పుకుంటానని నేనన్నాను. అప్పటికే ఆ కౌలుదార్ల పోరాటం ఎంతో కాలంగా నడుస్తున్నది. ఆ పోరాటానికి నాయకత్వం వహిస్తుండిన గ్రామ ఉపాధ్యాయుడు - పోస్టు మాస్టర్ హత్య కూడా అప్పటికే జరిగిపోయింది. నేను ఆ ప్రతిపాదన పెడితే పరశురామ చౌదరి మాత్రం మధ్యవర్తి పరిష్కారానికి అంగీకరిస్తున్నాను అని మాత్రం అన్నాడు.

ఆ మరుసటిరోజు శ్రీకాకుళం నుంచి ఏమంత ఎక్కువ దూరంలోని కావలికి వెళ్లాం. ఆ గ్రామానికి మోటారు వాహనాలు వెళ్లగలిగిన రోడ్డు లేదు. మధుసూదనరావు, నేను ఒక టాక్సీ తీసుకుని అది వెళ్లగలిగినంతదూరం దానిలో వెళ్లాం, ఇక అది వెళ్లలేనప్పుడు అక్కడ దాన్ని ఆపేసి అక్కడి నుంచి ఎనిమిది పది కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామానికి నడిచాం. అప్పుడు దసరా సెలవులు. పున్నయ్యగారు ఇంట్లోనే ఉన్నారు. ఆయన కూతురు ప్రతిభా భారతి కూడా అప్పుడు అక్కడే ఉంది. మేం ఆయనకు పరిస్థితి వివరించాం. ఆయన మధ్యవర్తిగా ఉండటానికి అంగీకరించారు. అక్కడి నుంచి జస్టిస్ పున్నయ్య మమ్మల్ని తన జోడెడ్ల బండి ఎక్కించి మా టాక్సీ ఆగి ఉన్న చోటిదాకా పంపించారు. ఆ తర్వాత పరశురామ చౌదరి తన మాట నుంచి వెనక్కి పోయాడు. బహుశా ఆయన న్యాయవాది ఆయనకు కలిగిన ఆలోచనను తొలగించి ఉంటాడు. అప్పటిదాకా వచ్చిన అన్ని తీర్పులూ ఆయనకు అనుకూలంగా వచ్చాయి గనుక ఆయన అధికారాన్ని నిర్ధారించాయి గనుకిప్పుడు న్యాయస్థానం బయట పరిష్కారం ఎందుకని న్యాయవాది ఆయనను ఒప్పించి ఉంటాడు. మన న్యాయ వ్యవస్థలోని మరొక విచిత్రమైన అంశమేమంటే ఏది ఎక్కడ అంతమవుతుందో ఏది తుది తీర్పో ఎవరూ చెప్పలేరు.

మొత్తం మీద ఈ దేశంలో గత ఇరవై సంవత్సరాలలో పేదలకు ఎప్పుడూ

వాగాడంబరంతో కూడిన వాగ్దానాలు మాత్రమే దక్కుతున్నాయి గాని న్యాయస్థానాలు మాత్రం యథాతథ స్థితిని నిలబెడుతూ, కొనసాగిస్తూ వస్తున్నాయి. రాజ్యాంగంలోని ప్రవేశిక, ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు ఎన్ని మాటలు చెప్పినప్పటికీ వాస్తవం ఇది. నిజానికి సమాజంలో యథాతథ స్థితి కొనసాగాలని రాజ్యాంగం ఆశించలేదు. అది నిస్సందేహంగా సామాజిక పరివర్తనను ఆశించింది. అందువల్ల న్యాయవాద వృత్తినీ, న్యాయమూర్తుల ఆలోచనాధోరణినీ, న్యాయ వ్యవస్థనూ ఆ రాజ్యాంగ నిర్దేశిత ఆశయాలవైపుగా తీర్చిదిద్దడం అవసరం. అది జరగాలంటే రాజ్యాంగం గతం నుంచి కచ్చితంగా తెగదెంపులు చేసుకోవలసి ఉంటుంది. స్వాతంత్ర్యోద్యమ విలువలను వాస్తవికతలోకి అనువదించగల న్యాయ, చట్ట వ్యవస్థ అమలులోకి రావాలి. ఎప్పుడైనా న్యాయవ్యవస్థ సామాజిక పరివర్తనను వెన్నంటి సాగవలసిందే.

శంకర్ గుహ నియోగి కేసులో లాగే కంబారిగాంలో కూడా ఉద్యమ నాయకుడైన ఉపాధ్యాయుడు హత్యకు గురయ్యాడు. అక్కడ హత్య చేయించిన మూల్ చంద్ షాను శిక్షించడంలో విఫలమయినట్టుగానే ఇక్కడ కూడా హత్య చేయించిన భూస్వామిని శిక్షించడంలో న్యాయవ్యవస్థ విఫలమయింది.

ఆ మాదిరిగా పోరాటాలూ, హక్కుల ఉల్లంఘనలూ యథావిధిగా జరిగిపోతూనే ఉంటాయి. అలా సాగిపోవడానికి ప్రభుత్వం సహకరిస్తుంటుంది. చాలా ప్రాంతాల్లో చాలా మంది భూస్వాములకు వ్యతిరేకంగా చిన్నచిన్న పోరాటాలుగా కాక రాజ్యాంగం అమలులో లోపాలుగా చూస్తూ ఉంటారు. మంచి అధికారులు వస్తే ఆ లోపాలు సరి అవుతాయని నమ్ముతూ ఉంటారు. కాని ఏమీ జరగదు. సామ్యవాద న్యాయ వ్యవస్థ కూడా దానంతటదే విప్లవం తర్వాత ఒక్కసారిగా హఠాత్తుగా ఊడిపడదు. బతికివున్న తరాల మీద చనిపోయిన వ్యవస్థల పీడకలల బరువు కొనసాగుతూనే ఉంటుందని మార్క్స్ అన్న మాట ప్రతి సమాజం విషయంలోనూ నిజమే. ఈ దేశంలో పనిచేస్తున్న విప్లవ పార్టీలు కూడా గుర్తించవలసిన అంశం ఇది.

ఈ నా ఆత్మ కథాత్మక సామాజిక చిత్రాన్ని ఈ మాదిరిగా వేరు వేరు సందర్భాల జ్ఞాపకాల రూపంలో చెప్పడానికి ఎంచుకోవడంలోనే, ఒక క్రమపద్ధతిలో కాలక్రమంలో తారీఖులు, దస్తావేజులతో చెప్పకుండా ఉండడంలోనే ఒక అవకాశమూ ఉంది. ఒక పరిమితీ ఉంది. ఈ రకమైన జ్ఞాపకాల తలపోత వల్ల నాకు నా ఇష్టం వచ్చినట్టుగా అటూ ఇటూ ప్రయాణించడానికి, స్థలకాలాల పట్టింపు లేకుండా మాట్లాడడానికి అవకాశం వచ్చింది. కాని దీనికంతా ఒక క్రమపద్ధతి లేదు. బహుశా పద్ధతి గురించి ఆలోచించే, నా జీవిత కథను ఒక వరుసలో పునర్నిర్మించాలని ఆలోచించే సంపాదకులకు నా పద్ధతి చాలా చికాకు కలిగించవచ్చు.

నేను నా ఆత్మ కథాత్మక సామాజిక చిత్రాన్ని ప్రకటించాలని ఆలోచన వచ్చినప్పుడు

నాకు ఆయా సందర్భాలలో గుర్తు వచ్చిన జ్ఞాపకాలు ఇవి. ఆ పని మొదలు పెట్టాక నేను దీన్ని వాయిదాల పద్ధతిలో, అప్పుడప్పుడూ చెబుతూ, రాస్తూ వచ్చాను. కనీసం న్యాయవాదిగా నేను ఒక క్రమబద్ధమైన దినచర్య రాసి పెట్టుకుని ఉన్నా ఈ జీవిత కథను కొంత కాలక్రమ పద్ధతిలో రాయగలిగి ఉండేవాణ్నేమో. కాని నేను అటువంటి దినచర్య-డైరీ-రాయడం కాక ఎప్పటికప్పుడు ఆయా కేసుల ఫైళ్ల మీదనే వాయిదాల తేదీలు వేసుకునేవాణ్ని. ఆ ఫైళ్లన్నిటినీ ఆ తేదీల ప్రకారం వరుసగా పెట్టుకునే వాణ్ని. వివిధ న్యాయస్థానాల, వ్యాజ్యాల నివేదికలకు, పత్రికలకు చందాలు కట్టడం మొదలుపెట్టిన తర్వాత ఆ పత్రికలు రాగానే వెంటనే చదివి, నేను చేస్తున్న కేసులకు సంబంధించిన ఉపయోగకరమైన తీర్పులో, వాదనలో ఎక్కడయినా కనిపించగానే ఆ కేసు ఫైలు తీసి ఆ ఫైలు మీదనే దాన్ని ఎత్తి రాసుకుంటూ ఉండే వాణ్ని. ఈ పద్ధతి వల్ల నాకు నా వాదనలు తయారు చేసుకోవడంలో చాలా సమయం కలిసివచ్చేది. బహుశా ప్రతి న్యాయవాదీ ఈ పద్ధతే పాటిస్తారు కాబోలు. లేదా వాళ్ల సమయం పొదుపుగా వాడడానికి మరేదో పద్ధతి తయారు చేసుకుంటారేమో సోమరిపోతులకు మాత్రమే తమ వాదనలు తయారు చేసుకోవడానికి చాలా ఎక్కువ సమయం పడుతుంది. ఇదంతా న్యాయవాద వృత్తిలో నా ప్రతిభ గురించి చెప్పడానికి కాదు. 1968 తర్వాత నుంచీ నా సమయంలో ఎక్కువ భాగాన్ని పౌరహక్కుల ఉద్యమంలో వెచ్చించడానికి నాకు ఈ పద్ధతి ఉపయోగపడిందని చెప్పడానికే.

గత ఆరు దశాబ్దాల న్యాయవాద వృత్తిలో నేను కనీసం లక్ష కేసులు వాదించి ఉంటానేమో. లెక్కలేదు. నాకై నేను ఎప్పుడూ లెక్కపెట్టుకోలేదు. వాటిలో చెప్పుకోదగిన కేసులు కొన్ని వేలు అయినా ఉంటాయి. వాటి వివరాలు కూడా ఆయా కేసుల కాగితాలు చూస్తేగాని చెప్పలేను. రెండు మూడు డజన్ల కేసులు మాత్రం అన్ని వివరాలతో మనసులో జ్ఞాపకం ఉండి ఉంటాయి.

నా పౌర హక్కుల కృషి 1968లో మొదలయింది. అప్పటికే, అంటే హైదరబాద్‌కు మారిన తర్వాత, పెద్ద కృషి ఏమీ లేకుండానే నా దగ్గరికి చాలా కేసులే వచ్చాయి. అంతకు ముందు నేను ప్రస్తుతం ఉన్న మారేడుపల్లి ఇంట్లోనే ఉండేవాణ్ని. కాకపోతే అప్పుడు ఈ ఇంటికి మొదటి అంతస్తు ఉండేది కాదు. 1962లో నేను మరొక ఇద్దరు న్యాయవాదులతో కలసి న్యాయవాద కార్యాలయం ప్రారంభించాను. అక్కడ మాకు చాలా కేసులు వచ్చాయి. మా ఆఫీసుకు ఆల్ ఇండియా రిపోర్టర్ (వివిధ న్యాయ స్థానాల తీర్పులు, కేసుల గురించి నివేదికలు ప్రకటించే పత్రిక-ప్రతి న్యాయవాదికి చాలా అవసరమైన పత్రిక) మొత్తం సెట్టు కొనుక్కోగలిగాము. ఆ రోజుల్లో సుప్రసిద్ధమైన పానీస్ బార్ వెనుక ఉన్న భవనంలో మేం ఒక పెద్ద మడిగను బాడుగకు తీసుకున్నాం. ఆ భవనం సర్దార్ పటేల్ రోడ్డును సరోజినీ దేవి రోడ్డుతో కలిపే సందులో ఉండేది.

మేం ఆ ఆఫీసులో పనిచేస్తున్నప్పుడే ఒక పిటిషన్ విషయంలో ఐఎన్‌టియుసి నన్ను సంప్రదించింది. డా. సియాదుతుల్లా ఖాన్ అధ్యక్షతన ఉన్న పారిశ్రామిక వివాదాల ట్రిబ్యునల్ కొత్తగూడెంలోని సింగరేణి గని కార్మికులకు వ్యతిరేకంగా ఒక తీర్పు ప్రకటిస్తే ఆ తీర్పును సవాలు చేయడం కోసం వాళ్లు నన్ను సంప్రదించారు. అప్పుడు ఆ యూనియన్‌కు కార్యదర్శిగా ఉండిన శ్రీనివాసన్ నన్ను కలిశాడు. నాకు గుర్తున్నంతవరకు గని కార్మికులకు అప్పటివరకు ఇస్తుండిన ఐదు రూపాయల అదనపు వేతనాన్ని రద్దు చేసిన యాజమాన్య చర్య గురించి వివాదం అది. కొన్ని సంవత్సరాలపాటు ఆ అదనపు వేతనాన్ని ఇచ్చిన యాజమాన్యం హఠాత్తుగా దాన్ని ఆపివేసింది. ఆ చర్యను సవాలు చేస్తూ కార్మికులు ట్రిబ్యునల్‌కు ఫిర్యాదుచేశారు. ట్రిబ్యునల్‌లో యాజమాన్యానికి అనుకూలంగా తీర్పు వచ్చింది.

ఆ రోజుల్లో సింగరేణి కాలరీస్ యాజమాన్యం తరఫున నర్సింగ్ అనే న్యాయవాది వాదిస్తుండేవాడు. ఆయన ధన్‌బాద్‌కు చెందిన న్యాయవాది. ఆయన గనులకు సంబంధించిన చట్టాలలో నిష్ణాతుడు. ధన్‌బాద్ చుట్టుపట్ల ఉన్న గనుల యాజమాన్యాల తరఫున వాదిస్తుండేవాడు.

ఇక నేను కూడా ఒక పిటిషన్ తయారుచేసి దాఖలు చేశాను. ఆ కేసులో వాదనలు వినిపించే సమయానికి ఆ న్యాయస్థానం నాకు చాలా కొత్త. జస్టిస్ గోపాలరావు ఎక్బోటె ముందుకు ఆ కేసు వచ్చింది. ఆయన అప్పటికే పార్లమెంటు సభ్యుడుగా ఉన్నారు. వృత్తిపరంగానూ సామాజిక హోదాలోనూ ఆయన సాధించిన అభివృద్ధి అసాధారణమైనది. ఆయన జీవితం ఒక వకీలు ఉమస్తాగా ప్రారంభమయింది. ఉపాధ్యాయుడిగా, న్యాయవాదిగా, హైదరాబాద్ రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రిగా, పార్లమెంటు సభ్యుడిగా హైకోర్టు న్యాయమూర్తిగా ఎదుగుతూ వచ్చారు. న్యాయమూర్తిగా ప్రతిభావంతుడిగాపేరు తెచ్చుకుని చివరికి ప్రధాన న్యాయమూర్తిగా కూడా పనిచేశారు.

గని కార్మికుల అదనపు వేతనంపై రిట్ పిటిషన్ చివరి వాదనలు జస్టిస్ గోపాలరావు ఎక్బోటె ముందు జరిగాయి. అలా అదనపు వేతనాన్ని రద్దుచేయడమనేది గని కార్మికులకు పెద్ద సమస్యగా ఉండింది. తాము ఎంతో కాలంగా అనుభవిస్తున్న సదుపాయాన్ని రద్దుచేయడమేమిటని గని కార్మికులు వాదించారు. అంతేకాదు అంతకుముందు వరకూ యాజమాన్యం చేస్తున్న ఎన్నో చెల్లింపులలో తత్సమానమైన కోతకు కూడా ఇది దారితీసింది. మా రిట్ పటిషన్‌ను యాజమాన్యం తీవ్రంగా ప్రతిఘటించింది. కాని మా కేసు చాలా సులభంగా, సూటిగా ఉండింది. ఆ అదనపు వేతనాన్ని కార్మికులు అడగకుండానే, ఏ వివాదం లేకుండానే యాజమాన్యం ఇవ్వడం మొదలు పెట్టింది. ఆ అదనపు వేతనం కార్మికుల అసలు వేతనంలో భాగంగా మారిపోయింది. అందువల్ల వేతనాల చెల్లింపు చట్టం గాని, అటువంటి మరేదయినా చట్టంగాని అనుమతించిన కోతలు తప్ప మరే రకమైన కోతలు విధించడానికి యాజమాన్యానికి హక్కులేదని నేను వాదించాను.

అట్లాగే మామూలు పౌర న్యాయసూత్రాల ప్రకారం ఆ అదనపు వేతనం ఒక కానుక వంటిదని, కానుక అనేదేదయినా ఏ షరతులూ లేకుండా, అంతిమంగా ఉంటుందని నేను వాదించాను. అందువల్ల ఆ కోణం నుంచి చూసినా ఈ అదనపు వేతనాన్ని రద్దుచేయడానికి యాజమాన్యానికి హక్కులేదని వాదించాను. నా వాదనను న్యాయమూర్తి జస్టిస్ ఎక్బోటె అంగీకరించారు. ట్రిబ్యునల్ తీర్పును కొట్టివేశారు.

ఆ తీర్పుపై యాజమాన్యం మళ్లీ అప్పీలుకు వెళ్లింది. అది హైకోర్టులో మొదటి బెంచి ముందుకు వచ్చింది. అంటే ఆ బెంచిలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మనోహర్ పర్షాద్, జస్టిస్ మహమ్మద్ మీర్జా ఉన్నారు.

ఇక్కడ ఆ న్యాయమూర్తుల గురించి కొంచెం చెప్పాలి. మనోహర్ పర్షాద్ అంతకుముందరి హైదరాబాద్ రాష్ట్రంలో న్యాయమూర్తిగా ఉండేవారు. ఆయనను కొనసాగించాలా లేదా అనే విషయంలో ఇద్దరు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు పరీక్షించి, కొనసాగవచ్చునని తీర్మానించారు. ఆ పరీక్షా క్రమంలో సయాదత్ అలీఖాన్ మాత్రం విఫలమయ్యారు. అందువల్ల ఆయనను పారిశ్రామిక వివాదాల ట్రిబ్యునల్ అధ్యక్షుడిగా నియమించారు. నిజానికి సయాదత్ అలీఖాన్‌కు కూడా మనోహర్ పర్షాద్‌కు ఉన్నంత న్యాయశాస్త్ర పరిజ్ఞానం ఉంది. ఆయన మనోహర్ పర్షాద్ కన్న ఎక్కువ పండితుడే. ఆ పరీక్షా క్రమంలోనే జస్టిస్ జగన్మోహన్‌రెడ్డి కూడా ఉత్తీర్ణులయి న్యాయమూర్తులుగా కొనసాగారు.

సింగరేణి యాజమాన్యం వేసిన అప్పీలు అలా మళ్లీ విచారణ కొరకు మొదటి బెంచి ముందుకు వచ్చేసరికి ఆ బెంచి గురించీ, అందులోని న్యాయమూర్తుల గురించీ, వారి మధ్య ఉన్న అభిప్రాయ భేదాలు, వైమనస్యాల గురించీ నాకు తెలిసింది. వారి మధ్య మనస్పర్థలు ఎంత తీవ్రంగా ఉండేవంటే న్యాయమూర్తులు రెండు ముఠాలుగా విడిపోయారు.

జస్టిస్ మనోహర్ పర్షాద్‌కు జస్టిస్ గోపాలరావు ఎక్బోటె అంటే చాలా వ్యతిరేకత ఉండేది. ఆ వ్యతిరేకత ఈ కేసులో స్పష్టంగా బయటపడింది. కాని సమస్య ఏమంటే ఆ ఇద్దరు న్యాయమూర్తులు కూడా కింది న్యాయస్థానం ఇచ్చిన తీర్పును తిరగదోడే తీర్పు రావడానికి తగినంత న్యాయశాస్త్ర పరిజ్ఞానం ఉన్నవారు కాదు. ఒక రోజు కూలీ అన్ని సందర్భాలలోనూ తాత్కాలిక కూలీ కానక్కరలేదనే విషయం కూడా వాళ్లకు తెలియదు. ఆ కూలీ తాత్కాలికంగా పనిచేస్తున్నాడా, శాశ్వత ఉద్యోగ భద్రతతో ఉన్నాడా అనే విషయంతో సంబంధం లేకుండా రోజునుబట్టి పనిని కొలిచి దానికి వేతనం లెక్క కట్టడం రోజు కూలీలో ప్రధానాంశం. న్యాయశాస్త్రంలోని ఈ విభాగపు అంశాలపై సరయిన అవగాహన లేనందువల్ల వారు పాత తీర్పును రద్దుచేసే తీర్పు ఇవ్వలేకపోయారు. కాని జస్టిస్ ఎక్బోటె ఇచ్చిన తీర్పును ఎందుకు ఎట్లా రద్దు చేయవలసి ఉన్నదో తీర్పు రాయాలని

వాళ్లు అనుకున్నారు. ఆ సమయంలో సుప్రీంకోర్టులో న్యాయశాస్త్రంలో దిగ్గజాలయిన వారు ఉండేవారు.

నిజానికి బూర్జువా న్యాయశాస్త్రం అంతా తప్పుడుది కాదు. ఆ న్యాయశాస్త్రాన్ని వాడుకుంటూనే ఒక వ్యాజ్యంలో తగ్గిన వాదనలు వినిపించి కార్మికులకు అనుకూలమైన తీర్పు సాధించవచ్చు. బూర్జువా న్యాయశాస్త్రం సుదీర్ఘకాలంమీద అభివృద్ధి చెందింది. ఆ మాటకొస్తే న్యాయశాస్త్రం ఎప్పుడైనా సమాజం పెరిగిన కొద్దీ పెరుగుతుంది. అభివృద్ధి చెందుతుంది. సామాజిక అభివృద్ధి క్రమంలో ఏదో ఒక దశలో న్యాయశాస్త్రాన్ని ఎవరో ఒకరు కనిపెట్టడమో, ఎవరో ఒకరు ఇతరుల మీద రుద్దడమో జరగలేదు.

అందువల్ల బూర్జువా న్యాయశాస్త్రం గురించీ, చట్టాల గురించీ, చట్టపరమైన వాదనల గురించి ఎటువంటి పిడివాదం పనికిరాదు. నిజానికి బోల్షివిక్ విప్లవం అనే మొట్టమొదటి మహత్తర ప్రయోగం గురించి రాస్తూ దాన్ని ఆవరించి ఉన్న చారిత్రక పరిస్థితుల గురించి లెనిన్ చాలా వివరంగా చెప్పాడు.

రష్యా దేశానికి చెందిన గత చరిత్ర, దాని అలవాట్లు, దాని సువిశాలమైన రైతాంగ వాతావరణం, ప్రజాస్వామిక చైతన్యాన్ని, సంప్రదాయాన్ని సాధించవలసిన కర్తవ్యం. గ్రామీణ ప్రజలలో ఉండే వెనుకబాటుతనం, ఇతర కారణాలులాంటి వాటినన్నిటినీ లెనిన్ జాబితా చెప్పాడు. అవన్నీ పరిగణనలోకి తీసుకోవలసిందేనన్నాడు. విప్లవం ఒక మౌలిక మార్పును తెచ్చిన తర్వాత తక్షణమే ఆ సామ్యవాద ప్రయోగం ఒక సామ్యవాద న్యాయ వ్యవస్థను తీసుకురావాలదని లెనిన్ గుర్తించాడు. ఫ్రాన్స్‌లో అంతర్యుద్ధాలు గురించీ, పారిస్ కమ్యూన్ గురించీ రాస్తున్నప్పుడు మార్క్స్ కూడా ఈ విషయాలను గుర్తించి వాటి మీద విశ్లేషణలు ప్రకటించాడు. కమ్యూన్ ఏర్పడిన, నడిచిన స్వల్ప కాలంలో రూపొందించిన అతి తక్కువ సూత్రాలను అధ్యయనం చేసి వాటి మీద విశ్లేషణలు ప్రకటించడం జరిగింది. అయినా విప్లవ నిర్మాణ క్రమంలోగాని, సామ్యవాద వ్యవస్థ నిర్మాణ క్రమంలోగాని ఆ సూత్రాలను అభివృద్ధి చేయడానికి తగిన ప్రయత్నాలు జరగలేదు. సోవియట్ రాజ్యాంగంలో సామ్యవాద న్యాయవ్యవస్థ రాజ్యాంగంలో సామ్యవాద న్యాయవ్యవస్థ గురించిన ప్రస్తావన ఉన్నప్పటికీ, 1930లలో జరిగిన సోవియట్ విచారణలకూ న్యాయ విచారణ పద్ధతికీ ఏమీ సంబంధంలేదు. అందువల్ల మరొక మహా తప్పిదం జరగకముందే ఈ విషయాలు లోతుగా అధ్యయనం చేయవలసి ఉంది.

అంతకు ముందరి తీర్పును తిరగరాయడం సులభం కాదని తెలిసిన తర్వాత మనోహర్ పర్షాద్ ఆ వ్యాజ్యాన్ని రాజీ ద్వారా పరిష్కరించుకొమ్మని నా మీద ఒత్తిడి మొదలుపెట్టారు. ఒకవేళ ఆ వ్యాజ్యం రాజీ చేసుకోవడానికి వీలయినదే అయితే రాజీకి సిద్ధపడడంలో అందరి కంటే ముందు ఉంటానని నేను ఆయనకు చెప్పాను. అప్పటికి ఆ కేసు వాయిదా పడింది. ఆ రోజుల్లోనే ఒకసారి మేం సింగరేణి కాలరీస్‌కు వెళ్లాము. యాజమాన్యంతో చర్చలు జరపడానికి రాజ బహదూర్ గౌర్ కూడా మా వెంట వచ్చారు.

కాని యాజమాన్యంతో చర్చలు జరపడం సాధ్యమే కాలేదు. మేము తిరిగి వచ్చి చర్చలు జరపడంలో విఫలమయ్యామని న్యాయమూర్తికి చెప్పగానే ఆయనకు చాలా కోపం వచ్చింది. ఆయనకేమో పాత తీర్పును తిరగదోడుతూ తీర్పు రాయడం ఇష్టం లేదు. ఇక హఠాత్తుగా ఐదు లక్షల రూపాయలు యాజమాన్యం నుంచి ఇప్పిస్తానని, దాన్ని అర్హులైన కార్మికులందరికీ వాటాలు వేసి పంచవచ్చునని సలహా ఇచ్చాడు.

ఆ తర్వాత మేం చేసిన పెద్ద పని జాతీయ బొగ్గు వేతన బోర్డు నిర్ణయించిన వేతనాల నిర్ణయం, ఉద్యోగాల ఖరారు విషయంలో కార్మికులు లేవనెత్తిన వివాదానికి సంబంధించినది. రెండో పంచవర్ష ప్రణళిక సిఫారసులకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం బొగ్గు గని కార్మికుల ఉద్యోగాలను, వేతనాలను నిర్ధారించడానికి ఒక జాతీయ కోల్ వేజ్ బోర్డును నియమించింది. ఆ జాతీయ కోల్ వేజ్ బోర్డు ఒక నివేదికను వెలువరించింది. కాని సింగరేణి గని కార్మికుల జీతాలను, ఉద్యోగాలను మాత్రం పునర్నిర్ధారించడం జరగలేదు. ఎవరు ఏ తరగతి ఉద్యోగులో నిర్ధారించలేదు. ఎందువల్లనంటే ఆ జాతీయ వేజ్ బోర్డు ప్రకటించిన ఉద్యోగ తరగతులకు, సింగరేణిలో అమలులో ఉన్న తరగతులకు చాలా తేడా ఉండింది. ఆ వేజ్ బోర్డు సిఫారసులను తమ ఉద్యోగులకు, కార్మికులకు అనువర్తింపజేసే బాధ్యతను పూర్తిగా సింగరేణి యాజమాన్యం మీదనే వదిలిపెడితే అవి నిరంకుశంగా నిర్ధారింపబడి ఉండేవి.

ఐఎన్‌టియుసికి చెందిన శ్రీనివాసన్ ఆ విషయంలో మళ్లీ నన్ను కలిశాడు. తమ యూనియన్ తయారుచేసే కోర్కెల పత్రాన్ని మద్రాసుకు చెందిన న్యాయవాది విజి రావు మధ్యవర్తిగా నిర్ధారిస్తే బాగుంటుందని సలహా ఇచ్చాడు. విజి రావు అప్పటికి మద్రాసులోని రావు అండ్ రెడ్డి అనే ప్రఖ్యాత న్యాయవాద సంస్థలో నుంచి పదవీ విరమణ చేసి బెంగళూరులో విశ్రాంత జీవితం గడుపుతున్నారు. టెలిఫోన్ మీద ఆయనతో అపాయింట్‌మెంటు కుదిరింది. కాని మేం రైల్లో బెంగళూరుకు బయల్దేరే సమయానికి ఇంకా మా కోర్కెల పత్రం తయారుచేయడం కానేలేదు. శ్రీనివాసన్ మంచి స్టెనోగ్రాఫర్ గనుక ఆయనను టైప్ రైటర్, కాగితాలు తెచ్చుకొమ్మని చెప్పాను. కోర్కెల పత్రాన్ని రైల్లోనే డిక్టేట్ చేస్తానని చెప్పాను. రైలులో ఆరు నుంచి ఎనిమిది గంటలపాటు పని చేసుకోవచ్చుగనుక, ఆ కోర్కెల పత్రాన్ని అక్కడే తాయరుచేసుకోవచ్చునని అనుకున్నాం. అలా పూర్తి చేశాం కూడా. విజి రావు ఆ రోజు ఉదయమంతా మాతోనే గడిపారు. అక్కడక్కడా వివరణలు అడిగారు. మొత్తం మీద పెద్ద సవరణలు లేకుండానే ఆ పత్రాన్ని ఆమోదించారు.

అప్పుడు ట్రిబ్యునల్‌కు అధ్యక్షుడిగా ఉన్న వ్యక్తి తరిమెల చంద్రశేఖరరెడ్డి తరిమెల నాగిరెడ్డికి జ్ఞాతి. ఆయన తన చిన్నతనంలో భారత జాతీయ కాంగ్రెస్‌లో కార్యకర్తగా పనిచేశారు. పాత కాంగ్రెస్‌వాదులు చాలామంది బాగానే ఆయన కూడా ఉదారవాద

రాజకీయాలకు, విలువలకు కట్టుబడి ఉండేవారు. ఒక న్యాయమూర్తిగా చాలా హుందాగా ఉండేవారు. ఎవరితోనూ కలుపుగా మాట్లాడేవారు కాదు. కోపంగా ఉండేవారు కాదు. న్యాయవాది వాదనలను ఎప్పుడూ తృణీకరించేవారు కాదు. ఈ వేజ్ బోర్డు వివాదం జరిగిన సమయంలో ఎక్కువ కాలం ఆయనే ట్రిబ్యునల్ అధ్యక్షుడిగా ఉన్నారు.

ఉద్యోగులకూ నైపుణ్యాలకూ చేసే పనులకూ పొంతన సక్రమంగా కుదిరిందా లేదా అని వాదించడం, నిరూపించడం చాలా కష్టసాధ్యమైన పని. అది చేయాలంటే కార్మికులలో వేరు వేరు విభాగాల వాళ్లు ఏయే పనులు చేస్తారో, వారి నైపుణ్యాలేవో, వారి ఉద్యోగాలేవో జాగ్రత్తగా అధ్యయనం చేయాలి. అందుకోసం నేను సింగరేణి బొగ్గు గనులకు చాలాసార్లు వెళ్లవలసి వచ్చింది. కార్మికులు పనిచేస్తున్నప్పుడు వారిని గమనించాను. వారి పని స్థలాలను పరిశీలించాను. వారి చుట్టూ ఉన్న పరిసరాల స్థితిగతలను పరిశీలించాను. గనిలోపల బొగ్గు టన్నులలో బొగ్గు నింపే ఫిల్లర్ల పని ఎటువంటిదో నాకు ఇంకా గుర్తుకువస్తోంది. అది చాలా కష్టభరితమైనపని. బొగ్గు పొరను పేల్చి పగులగొట్టిన (బ్లాస్ట్ చేసిన) తర్వాత ఈ పని మొదలవుతుంది. ఆ పేలుడు జరిగిన తర్వాత అక్కడంతా పడిన బొగ్గును ఏరి, టబ్బులలో నింపడం జరుగుతుంది. ఆ టబ్బులు రైలు పట్టాల మీద ఉంటాయి.

ఈ పేలుడు కన్నముందు మైనింగ్ సర్దార్ అనబడే ఉద్యోగులు పేల్చవలసిన బొగ్గుపొరను సిద్ధం చేస్తారు. ఆ గోడలో అక్కడక్కడా తవ్వి తొలి పెడతారు. ఆ తర్వాత షాట్ ఫైరర్స్ అనే ఉద్యోగులు ఆ తొలిని పేలుస్తారు. ఇలా తవ్వి టబ్బులకెత్తిన బొగ్గును పట్టాలమీద కోల్ స్క్రీనింగ్ ప్లాంటు అనే దగ్గరికి చేరుస్తారు. అక్కడ ఆ బొగ్గును సైజులవారీగా విభజిస్తారు. మొత్తం గని పని అంతా చాలా ప్రమాదభరితమైనదే, అక్కడ ప్రాణాల భద్రతకు హామీ లేదు. ప్రాణహాని సమస్యతోపాటు, ఆ బొగ్గుగనిలో గాని, కనీసం స్క్రీనింగ్ ప్లాంట్ దగ్గరగాని కొద్దిసేపు ఉన్నా, రెండు మూడు రోజులపాటు ఉండి ఆ గాలి పీల్చినా ముక్కుల్లో నుంచి పొగే వచ్చినట్టు అనిపిస్తుంది. ఆ రోజుల్లో గని కార్మికులందరూ బొగ్గు బావిలోంచి బయటికి రాగానే స్నానం చేయాలనే నిబంధన ఉండేది. అక్కడ మంచి సౌకర్యాలు కూడా ఉండేవి కాని ఆ సౌకర్యాలను ఎవరూ వాడుకునే వాళ్లు కాదు. భూగర్భంలోపల ఐదారు గంటలపాటు శ్రమ ఎంత దారుణమైనదంటే ఆ బొగ్గు పొక్కలో నుంచి బయటపడగానే కార్మికులందరూ ఆ కష్టాన్ని మరచిపోవడానికి పక్కనే ఉన్న కల్లు అంగడికి పరుగెత్తేవారు. మద్రాసులో గడిపిన తొలి రోజుల్లో నేను కొన్ని అర్వెల్ రాసిన రోటు వుగన్ పైర్ చదివాను. దాంట్లో ఆయన గని కార్మికుల జీవితాల గురించి చాలా వివరంగా రాశాడు. సరిగ్గా అటువంటి జీవితాన్నే సింగరేణి బొగ్గుగని కార్మికులలో నేను చూశాను.

ఆ వ్యాజ్యంలో భాగంగా ప్రతి తరగతి ఉద్యోగులలో కొందరిని పరీక్షించాలని నేను

నిర్ణయించుకున్నాను. కొత్తగూడెంలో ఒకటి రెండుసార్లు విచారణ జరపవలసిందని న్యాయమూర్తిని కోరాను. మొదటిసారి విచారణ జరిపినపుడు నేను వంద మందినో, నూట పదిమందినో విచారణ జరపానని గుర్తు. ఆ సాక్షుల విచారణ మూడు రోజులపాటు జరిగింది. చంద్రశేఖరరెడ్డి, కె శ్రీనివాసమూర్తి కంపనీ గెస్ట్ హైస్‌లో బసచేశారు. కార్మికులు నా బస ఒక హోటల్‌లో ఏర్పాటుచేసి, నేను అక్కడే ఉండాలని కోరారు. నిజానికి అది హోటల్ కూడా కాదు. ఒక పాత భవనం. దాన్ని లాడ్జింగ్ హౌస్‌గా మార్చారు. అక్కడ రెండు గదులు పక్కపక్కనే ఉండేవి. ఆ రెండు గదుల మధ్య ఒక తలుపు కూడా ఉండేది. ఒక గది నా వినియోగానికి, మరొక గది కార్మికులనుకలుసుకోవడానికి అన్నమాట. పక్కనే ఉన్న ఒక హోటల్ నుంచి కాఫీ, ఉపాహారం తెచ్చిపెట్టేవారు. సరే ఆ రోజుల్లోనే భద్రాచల రాముడిని కూడా చూడక తప్పలేదు. అటువంటిది నా జీవితంలోనూ, నా ప్రయాణాలలోనూ ఎప్పుడూ లేదు గనుక నేను అయిష్టంగానే ఒప్పుకోవలసి వచ్చింది. నేను తన వెంట భద్రాచలం సందర్శించాలని చంద్రశేరరెడ్డి కోరారు. అలా భద్రాచల రామాలయం చూసి మేము హైదరాబాదు తిరిగివచ్చాం.

ఈ వ్యాజ్యం జరుగుతుండగా మధ్యలోనే అది చేతులు మారింది. ఐఎన్‌టియుసికి చెందిన శ్రీనివాసన్ నుంచి అది ఎఐటియుసికి చెందిన కొమరయ్య చూడడం మొదలు పెట్టాడు. అప్పటి నుంచి 1975లో ఎమర్జెన్సీ విధించిన దాకా నేను ఎఐటియుసికి చెందిన యూనియన్ వ్యాజ్యాలన్నీ చూస్తూ ఉన్నాను. ఆ వ్యాజ్యం జరుగుతుండగా టబ్ ఫిల్లర్లు ఒకసారి మెరుపు సమ్మె చేశారు. యాజమాన్యం వెంటనే లాకౌట్ ప్రకటించింది. లాకౌట్ ప్రకటించమని యాజమాన్యానికి తానే సలహా ఇచ్చానని శ్రీనివాస మూర్తి నాకు చెప్పాడు. 'చాలా మంచి పని చేశావు' అని మెచ్చుకున్నాను. తయారయిన బొగ్గు నిలువలను వెంటవెంటనే బయటికి తెచ్చి అమ్ముకోకపోతే కంపెనీకి చాలా నష్టాలు వస్తాయి. అందువల్ల యాజమాన్యం టబ్ ఫిల్లర్లతో ఒప్పందం చేసుకోవడానికి దిగిరాక తప్పలేదు. వారి కోరికలను అంగీకరించి వారిని వెంటనే పనిలో దిగమని కోరింది. ఈ ఉదాహరణ చూసిన తార్వత నేను కొమురయ్యకు ఒక సలహా ఇచ్చాను. ఈ ట్రిబ్యునల్‌లో వ్యాజ్యం ఎప్పుడు తేలేనోగాని, ఒక్కొక్క సెక్షన్‌లో కార్మికులు సమ్మెలు చేస్తూపోతే యాజమాన్యం దిగివచ్చి ఆ సెక్షన్ కార్మికుల కోర్కెలు అంగీకరిస్తూ ఒప్పందాలు చేసుకుంటుందని చెప్పాను. అలా మొత్తం మీద ట్రిబ్యునల్‌లో ఏమీ తేలకముందే నేను అనుకున్న దానికన్న త్వరగానే మొత్తం సమస్య పరిష్కారమయిపోయింది.

కార్మిక రంగానికి సంబంధించిన కేసులతోనూ, ఎఐటియుసితోనూ, సిపిఐతోనూ అంతగా సంబంధం ఉన్నప్పటికీ దేశంలో ఎమర్జెన్సీ విధింపు తర్వాత నేను వాళ్ల న్యాయవాదిగా కొనసాగలేకపోయాను. సిపిఐ ఎమర్జెన్సీకి మద్దతు ఇచ్చింది. ఒక న్యాయవాదిగా స్వేచ్ఛకు సంబంధించిన విషయాలలో తటస్థంగా ఉండలేకపోయాను.

అప్పుడు ఏర్పడిన సంక్షోభాన్ని సిపిఐ వర్గాల సమీకరణలుగా భావించింది. ఇందిరాగాంధీ సోవియట్ అనుకూల ధోరణిని ప్రగతిశీల లక్షణంగా లెక్కించింది. ఆ సమయంలో ముందస్తు నిర్బంధానికి గురయిన వారి పక్షాన వాదించడాన్ని వ్యతిరేకించింది. ఎమర్జెన్సీని ఊరికే సమర్థించడం కూడా కాక అత్యుత్సాహంగా దాన్ని బలపరుస్తూ, శ్రీమతి ఇందిరాగాంధీ తీసుకున్న చర్యలన్నిటికీ మద్దతు మొదలుపెట్టింది.

ఎమర్జెన్సీ నాటికి నేను న్యాయస్థానాలలో నక్సలైట్ల కేసులు వాదిస్తున్నాను. వారి హక్కుల కోసం పోరాడుతున్నాను. ఆ పని మొదట నేను వ్యక్తిగతంగా చేశాను. ఆ తర్వాత డిఫెన్స్ కమిటీ కన్వీనర్‌గానూ చేశాను. ఆంధ్రప్రదేశ్‌లో ఎమర్జెన్సీ తర్వాత పౌరహక్కుల పరిస్థితి మరింత దారుణంగా మారింది. నక్సలైట్లను అదుపు చేయడానికనే పేరుతో మొదలయిన నిర్బంధకాండ ఎమర్జెన్సీలో సాధారణ ప్రజానీకం మీద, పౌరుల మీద విరుచుకుపడింది. రాజ్యహింస వీధుల్లో విలయనాట్యం ప్రారంభించింది. ప్రజలు నోరెత్తకుండా చేసింది. అక్రమ నిర్బంధాలకు, లెక్కలేకుండా పోయింది.

ఈ సందర్భంగా ఒక సంగతి చెప్పాలి. వాదారి వెంకటరమణయ్య అని ఒక న్యాయవాది ఉండేవారు. ఆ తర్వాత ఆయన అడ్వకేట్ జనరల్ కూడా అయ్యారు. ఆ సమయంలో ఆయన ఆర్గనైజేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ డెమోక్రటిక్ రైట్స్ (ఓపిడిఆర్)కు ఉపాధ్యక్షుడిగా ఉండేవారు. ఎమర్జెన్సీ విధించగానే ఆయన దగ్గరికి ఇంటెలిజెన్స్ పోలీసులు వెళ్ళారు. ఆయన ఒపిడిఆర్‌లో తన పదవికి రాజీనామాచేసి, సిపిఐ సహాయంతో ఆ కేసు నుండి బయటపడ్డారు.

ఎమర్జెన్సీ విధించిన కొద్ది రోజులకు సిపిఐకి దగ్గరగా ఉండే న్యాయవాదులు కొందరు క్రొవ్విడి నరసింహం ఇంట్లో ఒక సమావేశానికి పిలిచారు. ఆ సమావేశానికి వెంకటరమణయ్య కూడా వచ్చారు. నేనూ ఆ సమావేశానికి వెళ్ళాను. ఎందుకంటే అప్పటిదాకా ప్రతి శనివారం డా. పరాంజపే ఇంట్లో జరిగే సిపిఐ సన్నిహితుల సమావేశాలకు నేను వెళ్తుండేవాడిని. అక్కడికి చాలామంది మేధావులు వస్తూండేవారు. ప్రతివారం సిపిఐ నుంచి ఎవరో ఒకరు ఏదో ఒక విషయం మీద మాట్లాడేవారు. అక్కడికి పిఎం భార్గవ కూడా క్రమం తప్పకుండా వచ్చేవారు.

సరే నరసింహం ఇంట్లో సమావేశంలో తమ్మారెడ్డి సత్యనారాయణ ఎమర్జెన్సీ గురించి వివరించి దాన్ని పొగడడం మొదలుపెట్టారు. మరి భావ ప్రకటనా స్వేచ్ఛ సంగతేమిటి అని వెంకటరమణయ్య అడగగానే తమ్మారెడ్డి ఆయన వైపు తిరిగారు. అటువంటి పెటీ బూర్జువా ప్రశ్న అడిగినందుకు ముఖంలో స్పష్టంగా కనిపించే వెటకారంతో, కోపంతో 'ఎవరి గురించి మాట్లాడటానికి స్వేచ్ఛ' అని ఎదురు ప్రశ్న వేశారు. ఆ ప్రశ్నకు వెంకటరమణయ్య జవాబు చెప్పలేక పోయారు. మాట్లాడే స్వేచ్ఛ అనేదాన్ని ఎప్పుడూ మాట్లాడే వ్యక్తితో కలిపి చూడనక్కరలేదని, అన్ని ప్రాథమిక హక్కులు లక్ష్యానికి

సంబంధించినవే తప్ప ప్రత్యేకమైన మనుషులకు సంబంధించినవి కాదని నేను చెప్పాను. ఒకవేళ ఆంక్షలు విధించదలచుకున్నా ఆ ఆంక్షలకు సమర్థన, న్యాయబద్ధత ఉండాలని అన్నాను. నా వరకు నేను ఎమర్జెన్సీని సవాలు చేస్తూ, అంతరంగిక భద్రతా చట్టం నిబంధనలను, ఎమర్జెన్సీ తర్వాత సవరణలను సవాలు చేస్తూ పత్తిపాటి వెంకటేశ్వర్లు కేసులో వాదిస్తున్నానని చెప్పాను. నేను వారితో ఏకీభవించడంలేదని చెప్పి ఆ చర్చ నుంచి బయటికి వచ్చేశాను. దానితో సిపిఐతో నా సంబంధం తెగిపోయింది. అప్పటి వరకూ నేను సిపిఐకి చెందిన ఒక పూర్తికాలం కార్యకర్తకు ఆర్థిక సహాయం చేస్తుండేవాడిని. వారితో ఇలా విభేదించిన తర్వాత వారు ఆ ఆర్థిక సహాయానికి కూడా రావడం మానేశారు. ఆ సంబంధం తెగిపోయిందిగాని, అదేమీ విచారకరంగా జరగలేదు. ఇతరులందరిలాగనే. వారితో కూడా నా సంబంధం తెగిపోయినా అది శత్రుపూరితంగా మారలేదు.

సింగరేణి బొగ్గు గనుల్లో ఎఐటియుసి కేసులు చూస్తున్నప్పుడు నాకు అర్థమయినదేమంటే కార్మిక సంఘ నాయకులందరూ కార్మిక చట్టాల విషయంలో, నిబంధనల విషయంలో చాలా నిపుణులయిపోయారు. వేతనాల నిర్ణాయక అధికారుల ముందర వాళ్లు తమ అభిప్రాయాలను, తమ కోర్కెలు, తమ న్యాయబద్ధమైన హక్కులను చాలా స్పష్టంగానూ, చట్టబద్ధమైన నిబంధనలను ఉటంకిస్తూ ప్రకటిస్తుండేవారు. ఆ అధికారులు ఈ వ్యవహారాలను పరిష్కరించడానికి తరచుగా కొత్తగూడెంలోనో, బెల్లం పల్లిలోనో సమావేశమవుతూ ఉండేవారు.

అలా క్రమక్రమంగా ఆ కార్మిక నాయకులే తమ కేసులను కార్మిక న్యాయ స్థానాలలోనూ, పారిశ్రామిక వివాదాల ట్రిబ్యునల్ ఎదుటా వాదించుకోవడం మొదలుపెట్టారు. పారిశ్రామిక వివాదాల ట్రిబ్యునల్‌లో ఎప్పుడూ శ్రీనివాసమూర్తే యాజమాన్యపు న్యాయవాదిగా ఉండేవారు. ఆయన ఈ కార్మిక చట్టపు విషయాలలో చాలా నిపుణుడు.

పారిశ్రామిక వివాదాల చట్టం ప్రకారం కార్మికుల వివాదాలను వాదించడానికి ఏ న్యాయవాదికైనా సహజమైన హక్కు ఉండదు. ఈ నిషేధం మీద చాలా వివాదం నడిచింది. ప్రధానంగా యాజమాన్యాల న్యాయవాదులు ఆ వివాదాలు నడిపారు. చిట్టచివరికి వాళ్లు ఆ చట్టంలో కొన్ని మార్పులు తీసుకురాగలిగారు. ఆ మార్పుల ప్రకారం ట్రిబ్యునల్‌లో వాదించాలంటే న్యాయవాదులు చాంబర్స్ ఆఫ్ కామర్స్ (వ్యాపారవేత్తల మండలులుల)లో నమోదు చేయించుకోవలసి ఉంటుంది. కార్మికులు తమ తరపున వాదించడానికి ఒక న్యాయవాదిని నియమించుకోవాలనుకుంటే కార్మిక న్యాయస్థానం ముందుగాని, ట్రిబ్యునల్ ముందుగాని ఆ అనుమతి కోరుతూ దరఖాస్తు చేయాలి. అక్కడ వాదనలు, బేరసారాలు జరిగిన తర్వాత న్యాయవాదులను అనుమతించడం జరుగుతుంది.

సాధారణ న్యాయవాదులందరినీ ఈ కార్మిక న్యాయస్థానాలలో, పారిశ్రామిక వివాదాల ట్రిబ్యునల్‌లలో అనుమతించకపోవడం వెనుక ఒక కారణం ఉంది. అలా అనుమతిస్తూ

పోతే పారిశ్రామిక సంబంధాల రంగంలో అనవసర వివాదాలు, వ్యాజ్యాలు పెరిగి పోతాయని భావించి వాటిని అడ్డుకోదలచారు. ఈ చట్ట నిబంధన నిజంగా విజయ వంతమై ఉంటే, కార్మిక సంఘాలు చాలా బలపడి ఉండేవి. యాజమాన్యానికి ఇప్పటిలాగా తప్పించుకునే మార్గం ఉండేది కాదు. న్యాయవాద వృత్తి ఇప్పటిలాగ పూర్తిగా పరాన్న భుక్కులాగ అసహ్యకరంగా మారి ఉండేది కాదు.

పరిశ్రమలో రెండు ప్రత్యర్థి వర్గాల మధ్య సామరస్య పూర్వకమైన పరిష్కారం కుదుర్చడానికి పారిశ్రామిక వివాదాల చట్టం అన్ని ఏర్పాట్లు చేసింది. కార్మికులు తమ సామూహిక బేరసారాలు నడపకుండా చాల శక్తివంతంగా అడ్డుకుంది. ఎప్పుడైనా ఒక వివాదం వచ్చినపుడు దాన్ని వెంటనే మధ్యవర్తి పరిష్కార సంస్థకు అప్పగించడం ద్వారా కార్మికుల చేతులు కట్టివేయడం జరుగుతుంది. వాళ్ల సామూహిక కార్యాచరణకు దిగకుండా నిరోధించడం జరుగుతుంది. యాజమాన్యం ఏదో ఒక మౌలిక సమస్య మీద న్యాయస్థానానికి పోతుంది. అసలు వచ్చిన వివాదం కానే కాదని యాజమాన్యం వాదిస్తుంది. ఆ వేదిక హైకోర్టులోనే ఉంటుంది. సాధారణంగా అది ఒక సింగిల్ జడ్జి బెంచిగా ఉంటుంది. ఈ వివాదం ఏడాదో రెండేళ్లో ఎటూ తేలకుండా ఉండిపోతుంది. ఒకవేళ ఒక నిర్ణయం ఏదన్నా వచ్చినా దానిమీద అప్పీలుకు అదే హైకోర్టులో ఇద్దరు జడ్జిల బెంచి దగ్గరికి పోవచ్చు. అక్కడా ఆ వివాదం మళ్లీ మరికొన్ని సంవత్సరాలు సాగుతుంది. ఆ తర్వాత సుప్రీంకోర్టు కూడా ఉండనే ఉంది. ఇదంతా నడిచేసరికి అసలు వివాదం అర్థరహితమైపోతుంది. కార్మికులలో కింది కోర్టుల్లో పోరాడినప్పుడు ఉన్న ఆసక్తి ఉత్సాహమూ నీరుగారిపోతాయి.

న్యాయమూర్తులు ఇప్పటికే రాసి ఉన్న తీర్పుల ఉద్గ్రంథాల నుంచి న్యాయవాదులు అక్కడొక అంశం ఇక్కడొక అంశం ఎట్లా పీకి వాదిస్తారంటే అది సరిగ్గా కోతులు తోటి కోతుల వంటిమీది నుంచి పేలను ఏరినట్టుగా ఉంటుంది. ఈ క్రమంలో చట్టం, న్యాయం అనేవి చాలా అస్పష్టంగా మారిపోతాయి. చట్టం, న్యాయం అనే వాటి స్థానంలో న్యాయమూర్తులు తెచ్చిపెట్టిన ఆ గందరగోళం నుంచి బయటపడాలంటే తప్పనిసరిగా కక్షిదారుకు ఒక నిపుణుడైన న్యాయవాది సహాయం అవసరమవుతుంది.

అంటే న్యాయవాదులే అవసరంలేదనే స్థితి నుంచి 1960లు వచ్చే సరికల్లా మనం న్యాయవాదులు లేకుండా పని గడవని స్థితికి చేరామన్నమాట. ఇక ఈ న్యాయవాదులు తమ దగ్గరికి వచ్చిన కక్షిదారుకు చట్టం ఎక్కడ లోపభూయిష్టంగా ఉన్నదో, చట్టాన్ని ఎట్లా ఉల్లంఘించవచ్చునో చెపుతారు. ఇళ్ల అద్దెలపై పరిమితులు విధించిన రెంట్ కంట్రోల్ చట్టానికి ఎట్లా తూట్లు పొడవాలి. ఆ చట్టాన్ని అధిగమించడం ఎట్లా, భూ సంస్కరణల చట్టాన్ని పనికిరాకుండా ఎట్లా చేయాలి, పేదలకు పంపిణీ చేసిన భూములను వారి నుండి ఎట్లా గుంజుకోవచ్చు. భూమిమీద తమ అక్రమ స్వాధీనాన్ని ఎట్లా

పరిరక్షించుకోవచ్చు. ఆదాయపు పన్నును, అమ్మకపు పన్నును, కస్టమ్స్ సుంకాన్ని ఎట్లా ఎగ్గొట్టవచ్చు. ఎక్సైజ్ చట్టాన్ని ఎట్లా పరిమార్చవచ్చు - ఒక వేళ ఈ పనులేవీ సాధ్యం కాకపోతే చివరి ఆయుధంగా సంబంధిత అధికారికి ఎట్లా లంచం పెట్టి పనులు సాధించుకోవచ్చు.

మన దేశంలో సంపన్న వర్గాలకు వెన్నతో పెట్టిన విద్య ఒకటి ఉంది. అదేమంటే వాళ్లు తమ కావలి కుక్కలుగా కొందరిని ఉపయోగించుకుని, ఆ క్రమంలో ఆ కావలి కుక్కలకు కూడా ఏమీ దక్కపోయినా తమ పనులు చేయించుకుంటారు. వాళ్లు ఒక పక్క మొత్తం వ్యవస్థను అవినీతిమయం చేస్తూనే వ్యవస్థ అవినీతిమయం అయిపోందని విమర్శిస్తూ ఉంటారు. ఇటువంటి చట్టవిరుద్ధపు పనులన్నీ అలవాటుగా మారిపోయేదాకా శిక్షణ ఇచ్చినందుకు ఈ వృత్తిపర వర్గాలు కూడా పెద్ద మొత్తంలోనే వెనకేశాయి. మొత్తానికి దేశంలో నిజాయితీపరులుగా మిగిలిందెవరయ్యా అంటే నిరుపేద ప్రజానీకం మాత్రమే. వాళ్లు కొనే ప్రతి వస్తువుపైనా ఉన్న పరోక్ష పన్నులన్నీ చెల్లిస్తుంటారు. అవి బీడీలు కావచ్చు. చౌక సిగరెట్లు కావచ్చు. అగ్గిపెట్టెలు కావచ్చు. ఉప్పు, కిరోసిన్ వంటి ఇతర అవసరాలు కావచ్చు. తమ ఇబ్బందులు ప్రకటించే మార్గాలేవీ వాళ్లకు మిగలలేదు. వాళ్లు తమ నిరసన ప్రకటించడానికి వీలు లేదు. ఆందోళన చేయడానికి వీల్లేదు. ఒక బంద్ నిర్వహించాలని సామూహికంగా పిలుపు ఇవ్వడానికి వీల్లేదు.

ఇటువంటి చట్ట వ్యతిరేక పనుల అలవాటే ఈ దేశాన్ని 1960లలో ఒక పెద్ద సంక్షోభంలోకి నెట్టింది. సాధారణ ప్రజానీకపు జీవనాన్ని మెరుగుపరచడానికి తీసుకున్న ఏ ఒక్క చర్యా, ఏ ఒక్క సంస్కరణా అమలుకాలేదు. పంచవర్ష ప్రణాళికలు, ప్రతి రంగంలోనూ అత్యద్భుతమైన మనుషులు ఎవరూ పనికిరాలేదు.'వనరులన్నిటినీ సంపన్న వర్గాల ప్రయోజనాల కొరకే మళ్లించడం జరిగింది. ఉన్నత వర్గాలే ఉన్న వనరులన్నింటి మీదా అధిపత్యం చలాయించాయి. మన ప్రణాళికాబద్ధ ఆర్థిక వ్యవస్థ కొంత మేరకయినా ఆర్థికశక్తిని కొందరి చేతుల్లో కేంద్రీకరించడానికే పనికి వచ్చిందనే విషయంలో సందేహం లేదని మహలనోబిస్ కమిటీ అభిప్రాయపడింది. ఆ ప్రణాళికాబద్ధ ఆర్థిక వ్యవస్థ దేశంలో బడా వ్యాపార సంస్థలకు సహకరించింది. మార్గం సుగమం చేసింది. ప్రణాళికాబద్ధ పెట్టుబడుల నుంచీ, పెరిగిపోయిన ప్రభుత్వ వ్యయం నుంచీ వచ్చిన లాభాలు అంతకంతకూ ఎక్కువగా ఉన్నత వర్గాల రంగంలోనే ప్రవహించాయి" అని 'సుప్రీంకోర్టు ఇన్ క్రైస్ట్ ఆఫ్ ఐడెంటిటీ' అనే పుస్తకంలో గోబింద్ దాస్ రాశారు.

ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందంటే కార్మిక వర్గ నాయకులు, ఇతర ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ పనితీరుపై ప్రజల తరపున పరీక్షకులుగా వ్యవహరించ లేకపోయారు. మొదటి ఎన్నికల సంరంభంలో కమ్యూనిస్టు పార్టీ ప్రజలపట్ల కమ్యూనిస్టులు ఎట్లా ప్రవర్తించాలో అట్లా ప్రవర్తిస్తానని వాగ్దానంచేసింది. కాని ఆ వాగ్దానం నెరవేరలేదు. చట్ట సభలలో

ప్రాతినిధ్యం అనేది సామాజిక పరివర్తనకు ఒక సాధనం, ఒక మార్గం కావాలని ఉండగా ఎన్నికల్లో గెలవడమే ఏకైక లక్ష్యం అయిపోయింది. వారికి అంతకుముందు ఉండిన భవిష్యత్ దృష్టి స్థానంలో ఏదో ఒక రకంగా ఎన్నికల్లోగెలవడమే ఏకైక లక్ష్యం అయిపోయింది.

చాలా రోజుల తర్వాత నేను కామ్రేడ్ ఎఎస్‌కె అయ్యంగార్‌ను కలిసినపుడు హార్బర్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో మేం చాలా సేపు మాట్లాడుకున్నాం. నక్సలైటు రాజకీయాల గురించి విమర్శనాత్మకంగా మాట్లాడుకుంటున్నప్పుడు ఆయన ఒక మాటన్నారు. కమ్యూనిస్టులు ప్రజా ప్రతినిధ్య చట్ట సంస్థలలోకి ప్రవేశించేటప్పుడు ఆ స్థానాన్ని ఉపయోగించుకుని తమ ప్రజా పునాది పెంచుకోవాలని ఆశించారు. కాని ఒకసారి ఆ చట్టసభలలో ప్రవేశించిన తర్వాత ఒక ఎన్నిక నుంచి మరొక ఎన్నికకు ఆ స్థానాన్ని కాపాడుకోవడం ఎట్లా, అలా కాపాడుకునేందుకు ప్రజా పునాదిని ఉపయోగించుకోవడం ఎట్లా అనే చింత పెరిగిపోయింది. వారిలో చాలా మందికి చట్ట సభల వ్యవహారం ఒక అలవాటు కింద మారిపోయి కొనసాగుతోంది. అది దాదాపుగా మనం పుట్టిన కులంతో మనకు ఉండే అనుబంధంలాంటిది. ఎప్పుడో ఒకసారి వాస్తవం గుర్తుకొస్తుంటుంది. కాని మిగిలిన సమయమంతా ఆ కుల అనుబంధం యాంత్రికంగా కొనసాగుతుంది.

మొదటి రోజుల్లో అప్పుడే విముక్తి పొందిన దేశంగా కొంత ఉత్సాహం ఉండింది. దున్నేవారికే భూమి నినాదాన్ని కాంగ్రెస్ పార్టీ కూడా కొనసాగించింది. దేశ నాయకులందరి మనసులలోనూ దేశ సామాజిక నిర్మాణాన్ని మార్చాలనే ఆలోచన ఉండింది. కాని సోషలిజమే మన గమ్యం అని ప్రకటించడానికి భయం ఉండింది. ఆ మాదిరిగా ప్రకటించడం అంత సమంజసం కాదేమో అనే అభిప్రాయం ఉండింది. అప్పటికే ఒక సోషలిస్టు దేశంలో జరుగుతున్న ఘోరమైన అకృత్యాల గురించి ఈ దేశ ఉదారవాద మేధావుల మధ్య చర్చ జరుగుతూ ఉండింది. అందువల్లనే ఆవడి కాంగ్రెస్ మహాసభ సోషలిస్టు తరహా సమాజం అనే కొత్త మాటతో కాస్త వాస్తవిక వైఖరి తీసుకుంది.

మంత్రివర్గం ఏర్పాటు చేయకుండా టంగుటూరు ప్రకాశాన్ని నిరోధించడం, రాజాజీని శాసనమండలికి నామినేట్ చేసి అప్పుడు మంత్రివర్గం ఏర్పాటుచేయమని ఆహ్వానించడం, తద్వారా కమ్యూనిస్టుల ప్రాబల్యాన్ని నిరోధించడం, కొన్ని సంవత్సరాల తర్వాత కేరళలో కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని కూలదోయడం - ఇవీన్న మన రాజకీయాలు ఏ దిశగా పయనిస్తున్నాయో చెప్పడానికి సూచనలు.

మన రాజకీయాలు చివరికి ఉదారవాద భావాల నుంచి కూడా దూరం జరుగుతూ వచ్చాయి. కమ్యూనిస్టు రాజకీయాలలో ఉన్న పిడివాదం వల్ల, పార్టీ వైఖరికి కట్టుబడి ఉండాలి. వగైరాల వల్ల నేను ఎప్పుడూ ఆ రాజకీయాలని పెద్దగా అభిమానించిన

వాణ్నికాను. కాని వారి ప్రజా సమీకరణ శక్తి, వారు తీసుకున్న సమస్యల మీద వారు నడిపిన శక్తివంతమైన పోరాటాలు చూసినపుడు కార్మికుల సమస్యలపట్ల వారి వైఖరితో నాకు ఎప్పుడూ భిన్నాభిప్రాయం ప్రకటించాలని అనిపించలేదు.

ఇంతకుముందు కార్మిక సంఘాల పోరాటం, కార్మిక న్యాయస్థానాలు, పారిశ్రామిక వివాదాల ట్రిబ్యునల్‌ల గురించి చెపుతున్నానే, సరిగ్గా ఆ సమయంలోనే నేను పైన చెప్పిన మార్పులు కూడా రావడం మొదలయింది. కార్మిక నాయకులు చట్టబద్ధ చిక్కులలో చిక్కుకోవడం మొదలయింది. తమ జీవిత సమస్యలను, తమ పని పరిస్థితుల సమస్యలను పరిష్కరించడంలో న్యాయస్థానాలు, ప్రభుత్వ సంస్థలు తమకేదో సాయం చేస్తాయని, తమకు అనుకూలమైన తీర్పులు ఇస్తాయని ఎదురు చూడడం మొదలయిరది.

నిజానికి సంస్థాగత స్థాయిలో కార్మిక వర్గం కొరకు గాని, నిరాదరణకు గురయిన వర్గాల కొరకు గాని పోరాటాన్ని కొనసాగించాలంటే అందుకు కావలసిన శక్తి సామర్థ్యాలన్నిటినీ సమకూర్చుకోవాలి. మొత్తంగా చట్టబద్ధ పాలనా క్షేత్రంలో వలనే ఒక రకమైన సంఘటితమైన తిరుగుబాటు న్యాయశాస్త్రాన్ని తయారుచేయడానికి ఇది దారితీయాలి. బ్రిటిష్ పాలనా కాలంలోనూ, హైదరాబాద్ రాజ్యంలో నిజాం పాలనా కాలంలోనూ వామపక్షానికి చెందిన క్రిమినల్ న్యాయవాదుల సంప్రదాయం ఒకటి మొదలయింది. ఆ సంప్రదాయం క్రమక్రమంగా అదృశ్యమైపోయింది. న్యాయవాదుల వృత్తి స్వేచ్ఛా విపణిలో సరుకయిపోయింది. ఇప్పటి పరిస్థితీ ఇదే. ఇప్పుడు సంపన్న వర్గాల వారి తరపున వాదించడానికి దేశంలో చాలా మంది న్యాయవాదులున్నారు. ఆ న్యాయవాదుల బృందంలో చేరడానికి ఎదురుచూస్తున్న న్యాయవాదులు కూడా చాలా మందే ఉన్నారు. కాని పేదవారి కొరకు, నిరాదరణకు గురయిన వారి కొరకు వాదించానికి ఎక్కువ మంది న్యావయాదులు లేరు. కేవలం పేదల కొరకు మాత్రమే వాదించే న్యాయవాదుల సంఖ్య నానాటికీ తగ్గిపోతోంది.

గత శతాబ్దంలోని అరవైలలో భారత సమాజంలో తలెత్తిన సంక్షోభంలోని అంశాల గురించి నిశితమైన, లోతయిన ఆందోళనలేవీ జరగలేదు. అప్పుడే శ్రీమతి ఇందిరాగాంధీ, ఆమె అనుచరులు ఈ దేశంలో పేదలున్నారని, పేదరికం అనేది అధికార రాజకీయాలకు ఒక సాధనంగా ఉపయోగపడుతుందని గుర్తించారు. ఉన్నత వర్గాలలోనూ మేధావి వర్గాలలోనూ చాలా మంది ఆమె మాటల్లోని ఔచిత్యాన్ని అంగీకరించారు. ఆమెను సమర్థించడం ద్వారా ఆమెలో కొత్తగా పేదలపట్ల కలిగిన ఆదరణకు సాధికారత కల్పించారు.

అప్పటి సమాజం అట్టుడికినట్టు ఉండింది గనుక అప్పటి న్యాయవాదికి సామాజిక న్యాయ సమస్యల గురించి ఆలోచించవలసిన అవసరం చాలా తీవ్రంగా ఉండింది. ఈ ఘర్షణలో, ఆ ఘర్షణను పరిష్కరించడంలో ఒక సమగ్రమైన సమానత్వ న్యాయశాస్త్ర

అవసరం ఉండింది. అసలు మనం న్యాయం గురించి ఎప్పుడు మాట్లాడినా మన రాజ్యాంగ ప్రవేశికలో ప్రస్తావించిన మూడు రకాల న్యాయాల గురించి ఆలోచించవలసి ఉంటుంది. ఆ ప్రవేశిక న్యాయాన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో గుర్తించింది. అంటే అది మానవ గౌరవం అనే భావనను గుర్తించిందన్న మాట. అసలు సౌభ్రాతృత్వం అనే భావనలోనే మానవ గౌరవం అనే అంశం ఇమిడి ఉంది.

రాజ్యాంగంలోని మూడవ భాగంలో పొందుపరచిన హక్కుల భావనలో ఇమిడి ఉన్నదేమంటే ప్రజల మధ్య, పౌరుల మధ్య అంతకుముందే సమానత్వం ఉన్నదని, కాని ఈ స్ఫూర్తికి అనుగుణమైన, అత్యధిక ప్రజాబాహుళ్యానికి అవసరమైన, సామాజిక పరివర్తనకు దారితీయగల న్యాయశాస్త్రం అద్భుతమైపోయింది. న్యాయశాస్త్రం మీద, చట్టం మీద రాసే రచనలు ఏవయినా చూడండి. వాటిలో చాలా భాగం ఎంత మాత్రం విమర్శనాత్మకంగా లేకుండా మిగిలిపోయాయి. ఆ రచనలు వెలువడిన వచ్చిన తీర్పుల పరిమితులను అంతిమంగా భావిస్తాయి. అటువంటి రచనలు చదివే న్యాయవాది ఎవరయినా ఒక కొత్త దృష్టిని అన్వయిద్దామని, ఒక కొత్త రాజ్యాంగ దృక్పథం నుంచి న్యాయశాస్త్రాన్ని, చట్టాలను అవలోకించాలని ఆలోచించడానికి వీలులేనట్టుగా ఆ పుస్తకాలు ఉంటాయి.

మన న్యాయశాస్త్ర రచనలలోని ఈ కొరత వల్ల అసలు రాసినదానికంటే ఆ రచనలో ఉటంకించిన పాద సూచికలు, ఉదహరించిన కేసులు ముఖ్యమైనవి అయిపోతాయి. అది కేవలం అటువంటి ప్రస్తావనల జాబితాగా మాత్రమే ఉపయోగపడుతుంది.

సామాజిక పరివర్తనను సాధించాలని అనుకుంటూ శ్రీమతి ఇందిరాగాంధీ ఆ పనిని సమర్థంగా చేయలేకపోయింది. అప్పటికి ఉన్న న్యాయ, చట్ట వ్యవస్థ యథాతథ స్థితిని కాపాడేందుకు తయారయి ఉన్నందువల్ల ఆమె చేయదలచుకున్న పనులు చేయడం కూడా సాధ్యం కాలేదు. న్యాయ, చట్ట వ్యవస్థ సామాజిక స్థితిని ఉన్నది ఉన్నట్టుగా వివరించాయిగాని, ఎలా ఉండాలో, ఏ మార్పులు రావాలో చూపలేకపోయాయి. అందువల్ల ఆమె మోహన కుమారమంగళం వంటి సుప్రసిద్ధ వామపక్ష వాదులను కాంగ్రెస్ శిబిరంలోకి తీసుకుంది. ఆ మాదిరిగానే వామపక్ష యోధుడిగా పేరుపొందిన గార్గ్‌ను కాంగ్రెస్‌లోకి తీసుకుంది. ఎఎస్ఆర్ చారి అప్పటికే మరణించారు.

ఒకసారి కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం నుండి బయటపడి, పూర్తికాలం కార్యకర్తల స్థానం నుంచి స్వతంత్ర న్యాయవాదులుగా మారగానే వారి అపారమైన ప్రతిభ వెలుగులోకి వచ్చింది. వారి న్యాయవాద నైపుణ్యాన్ని ఉపయోగించుకోవడానికి సంపన్న వర్గాలు బారులు తీరి నిలబడ్డాయి.

తమ పోరాటాన్ని పార్లమెంటులో, న్యాయవ్యవస్థలో, న్యాయవాద వృత్తిలో, వైద్య వృత్తితో సహా అన్ని వృత్తులలో, అన్ని స్థాయిలలో కొనసాగించాలని కమ్యూనిస్టు పార్టీ గుర్తించలేకపోయింది. ఇక అరవైల చివరికి వచ్చేసరికి కమ్యూనిస్టు పార్టీ రెండుగా

చీలిపోయింది. ఆ రెండు ముక్కలూ రాజ్యాంగ పరిమితుల లోపల మాత్రమే పోరాడాలని నిర్ణయించుకున్నాయి. మరొక ప్రధాన చీలిక వచ్చి, ఆ చీలిక మరెన్నో చీలికలకు దారితీసి ఆ బృందాలన్నీ విప్లవాన్ని కొనసాగించాలని నిర్ణయించుకున్నాయి. ఆ ముక్కలన్నీ భారతదేశంలో విప్లవానికి చైనా విప్లవ మార్గాన్ని అనుసరించాలని అనుకున్నాయి. అంతేకాదు, చైనా ఛైర్మనే మా ఛైర్మన్ అని కూడా ప్రకటించాయి.

ఎమర్జెన్సీ తొలిరోజుల్లో భారత కమ్యూనిస్టు పార్టీ ఇందిరాగాంధీకి, కాంగ్రెస్‌కు తమ పూర్తి మద్దతును ప్రకటించింది. వాళ్లు ఎమర్జెన్సీ ప్రకటనకు మద్దతు ఇచ్చారు. ఎమర్జెన్సీని సమర్థించే నినాదాలు తయారుచేశారు. కాంగ్రెస్ వాటిని సొంతం చేసుకుంది. లేదా అంతకుముందే కమ్యూనిస్టు పార్టీ తయారుచేసిన నినాదాలను కాంగ్రెస్ తన నినాదాలుగా ప్రచారం చేసుకుంది. ఎమర్జెన్సీ వల్ల ముందస్తు నిర్బంధంలో ఉన్న ఎంతో మందిని విడిపించడంలో కమ్యూనిస్టు పార్టీ నాయకులు గణనీయమైన కృషి చేసినందువల్ల వారి పరపతి పెరిగింది.

ఆ రోజుల్లో మఖ్దూమ్ భవన్‌లో న్యాయవాదుల సమావేశం ఒకటి జరిగితే దానిలో గార్గ్ ప్రసంగించాడు. ప్రభుత్వ రంగసంస్థల కార్మిక సంఘాల తరపున అప్పటికి వాదిస్తున్న న్యాయవాదులను తొలగించి, కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను సమర్థించే న్యాయవాదులకు ఆ కేసులు అప్పగించాలని అక్కడ ప్రతిపాదనలు వచ్చాయి. కాని ఎందువల్లనో ఆ ప్రతిపాదనలు ముందుకు కదలలేదు. అదే మాదిరిగా నిబద్ధులయిన న్యాయ మూర్తులను (అంటే ఇందిరాగాంధీని సమర్థించే, ప్రగతిశీల భావాలుగల న్యాయమూర్తులను) నియమించాలని, మొండి ఘటాలుగా ఉన్న న్యాయ మూర్తులను బదిలీ చేయవచ్చునని కూడా అక్కడ వక్తలు మాట్లాడారు. ఆ ప్రతిపాదనలను నేను వ్యతిరేకించాను. అటువంటి చర్యలు తప్పనిసరిగా నిరంకుశ పాలనకు దారితీస్తాయని నేను భావించాను.

అప్పుడు మొత్తం వ్యవహారాన్ని న్యాయవ్యవస్థకు, కార్యనిర్వాహక వ్యవస్థకు మధ్య ఘర్షణగా చిత్రించడం జరిగింది. న్యాయవ్యవస్థ మొత్తంగానో, కనీసం దానిలో అత్యధికులు సమాజంలోని అభివృద్ధి నిరోధక శక్తులకు, మితవాద శక్తులకు మద్దతు ఇస్తున్నట్టుగా శ్రీమతి ఇందిరాగాంధీ భావించింది. అట్లాగే న్యాయస్థానాల బయట తనమీద పోరాటం చేస్తున్నవారిని సమాజంలో యథాతథస్థితి రాజకీయాల పరిరక్షకులుగా ఆమె చిత్రించింది. న్యాయమూర్తులను, మొరార్జీ దేశాయిని, ఆయన అనుచరులను, కాంగ్రెస్ నుంచి చీలిపోయిన బలమైన సిండికేట్ వర్గాన్ని ఆమె ఈ గాటన కట్టివేసింది. మరొకవైపు ఆ మితవాదులేమో ఆమె పూర్తిగా నిరంకుశ, కమ్యూనిస్టు పాలనను స్థాపిస్తోందని, సోవియట్ యూనియన్‌తో మిలాఖత్తవుతోందని అపోహలతో బతకడం మొదలుపెట్టారు. అలా మితవాదులకు, శ్రీమతి ఇందిరాగాంధీకి మధ్య జరిగిన తగాదాలో న్యాయస్థానాలు మితవాద రాజకీయాలకు ప్రాతినిధ్యం వహించాయి. కాకపోతే ఆ మితవాద రాజకీయాలకు

ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ అనే పంచదార పూత పూశాయి.

కాని స్వేచ్ఛ గురించి అంతగా మాట్లాడిన ఆ ఆ న్యాయ వ్యవస్థే సందర్భం మారిపోయి, ఆ వ్యక్తి వేలాది మందిని ఏ కారణంలేకుండా ముందస్తు నిర్బంధంలోకి తీసుకున్నప్పుడు ఆ నిరంకుశాధికారాన్ని సమర్థించింది. వ్యక్తిగత స్వేచ్ఛను పరిరక్షించానికి అవసరమైన న్యాయశాస్త్రపరమైన సాధనాలను కనిపెట్టాలనే అన్వేషణ తపన న్యాయస్థానాలలో కరువయింది. వ్యక్తిగత స్వేచ్ఛ అనేది ఏ మనిషికయినా మౌలిక హక్కు. ఆ హక్కు మనిషి పుట్టినప్పుడే పుట్టింది. ఆ మాటకొస్తే ఆస్తి హక్కు అనేది ఎన్నో శతాబ్దాల తర్వాత ఉనికిలోకి వచ్చింది.

అరవైలలో, డెబ్బైలలో జరిగిన ఈ చర్చలో శ్రీమతి ఇందిరాగాంధీ లేవనెత్తిన అంశాలు చాలా ముఖ్యమైనవి. కాని ఆమె చేపట్టిన ప్రతి చర్య వెనుకా ఉన్న రాజకీయ ఉద్దేశ్యాలు ఆ చర్య ప్రాముఖ్యతనంతా రద్దుచేశాయి. ఆమె తరపున ప్రచారం చేసినవారికి సాధికారత లేదు. వాళ్లు కేవలం కీలుబొమ్మ పాత్రలుగా తమ వంతు నటించేవాళ్లే తప్ప ఆ పాత్రలలో జీవించగలిగిన వాళ్లు కాదు. శ్రీమతి ఇందిరాగాంధీని వ్యతిరేకించదలచిన న్యాయమూర్తులు సమాజంలోని మితవాద, అభివృద్ధి నిరోధక ప్రయోజనాలను కాపాడేందుకు చట్టాన్ని సాగలాగి వ్యాఖ్యానించవచ్చునని భావించారు. నిజానికి రాజభరణాల గురించిన చర్చనే చూడండి. అక్కడ న్యాయస్థానం చేసిన చర్చ అంతా న్యాయశాస్త్ర పదజాలం అనే ముసుగు కింద ఒక అన్యాయమైన ప్రయోజనాన్ని సమర్థించడానికి జరిగిన ప్రయత్నమే. నిజానికి రాజ్యాంగ ప్రవేశికలో ఉన్న స్ఫూర్తి ప్రకారం ఇటువంటి సాగలాగుడు వ్యాఖ్యానం అవసరం లేదు, సముచితం కాదు.

నిబద్ధులైన న్యాయమూర్తులు ఉండాలనేది సరయిన వాదనే. ఎందుకంటే వాళ్లు మాత్రమే చట్టాన్ని సరిగా వ్యాఖ్యానించగలరు. కానీ అదే సమయంలో రాజ్యాంగ ప్రవేశికలో పొందుపరచిన విలువలను విస్మరించడం తగదు. ఒక ర్పవేశికను వ్యాఖ్యానించడం అనేది ఎట్లా జరగాలో సంపూర్ణమైన అవగాహనతోనే నేను ఈ మాట అంటున్నాను. ఒకసారి రాజ్యాంగ చలన సూత్రాలను వివరించాలి. రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని తాము చేసిన ప్రతిజ్ఞ ఏదో అలవోకగా చేసినట్టు, ఆ తర్వాత తమ ఇష్టారాజ్యంగా వ్యవహరించ వచ్చునన్నట్టు ప్రవర్తించగూడదు. ఒక వ్యక్తి రాజ్యాంగ బద్ధమైన, ప్రజా జీవితంలోని పదవిని నిర్వహిస్తున్నప్పుడు, అతను తన వ్యక్తిగత జీవితంలో ప్రవర్తించినట్టు ప్రవర్తిస్తానంటే కుదరదు. ఇక్కడ వ్యక్తిగతం కూడా అధికారకమైనదే అవుతుంది. అందువల్ల అది కూడా బహిరంగ ప్రజా పర్యవేక్షణకు లోబడే ఉండవలసి వస్తుంది. అందువల్ల ఆ పదవిలో ఉన్నవారు ప్రజలకు జవాబుదారీ కాకతప్పదు.

మొత్తం మీద ఒక వైపున మితవాద బృందాలు మరొకవైపున జనాకర్షక బృందాలు కలిసి రాజ్యాంగ బద్ధమైన ప్రతి సంస్థనూ ధ్వంసం చేసివేశాయి. న్యాయ వ్యవస్థ ఇటు హైకోర్టుల స్థాయిలోనూ, అటు సుప్రీంకోర్టు స్థాయిలోనూ అల్లకల్లోలమైపోయింది. అందుకు

మన రాష్ట్ర హైకోర్టు కూడా మినహాయింపు కాదు. కాని ఎమర్జెన్సీ కాలంలో ప్రతి హైకోర్టులోనూ కొంతమంది అయినా ఎమర్జెన్సీ మాయలో పడని న్యాయమూర్తులు ఉండేవారు.

ఈ సందర్భంలో ఎమర్జెన్సీలో నేను చేసిన నెల్లూరు స్పిన్నింగ్ మిల్లు కార్మికుల కేసు విషయం చెప్పాలి.

నెల్లూరులోని సహకార స్పిన్నింగ్, వీవింగ్ మిల్స్‌లోని కార్మికులలో రెండు వర్గాలు 1975 మే 23 రాత్రి ఘర్షణకు తలపడ్డాయి. ఈ ఘర్షణ ఫలితంగా ఒక కార్మికుడు చనిపోయాడు. మరెంతోమంది కార్మికులు గాయపడ్డారు. అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారిపోయింది. మిల్లును మామూలుగా నడపడం సాధ్యం కాదని మిల్లు యాజమాన్యం భావించింది. మే 24న ఇచ్చిన ఒక ప్రకటనలో మిల్లు యాజమాన్యం ఈ వివరాలన్నీ రాసి అంతరంగిక, బహిరంగ శాంతిని దృష్టిలో పెట్టుకుని మిల్లును మూసివేయడం జరుగుతున్నదని ప్రకటించింది. హత్యానేరం కింద, దొమ్మీ నేరం కింద పోలీసులు కార్మికుల మీద అభియోగాలు మోపారు. ఆ విచారణ జరుగుతూ ఉండింది.

ఈలోగా ఎమర్జెన్సీ వచ్చింది.

నెల్లూరు సహకార స్పిన్నింగ్ అండ్ వీవింగ్ మిల్స్‌లో కార్మికుల మధ్య అప్పటికే జరుగుతున్న ఘర్షణలను సాకుగా చేసుకుని, ఎమర్జెన్సీ విధించగానే ఆంధ్రప్రదేశ్ రిలీఫ్ అండర్ టేకింగ్స్ (స్పెషల్ ప్రొవిజన్స్) అక్ట్ సహాయంతో ఆ మిల్లు కార్మికులను తొలగించారు. ఈ రిలీఫ్ అండర్ టేకింగ్స్ చట్టం పారిశ్రామిక వివాదాల చట్టాన్ని, పారిశ్రామిక ఉద్యోగాల (స్టాండింగ్ ఆర్డర్స్) చట్టాన్ని తాత్కాలికంగా రద్దుచేస్తుంది. ఆ రిలీఫ్ అండర్ టేకింగ్ చట్టం ప్రకారం ప్రభుత్వం ఏదయినా ఒక పరిశ్రమను పునరుద్ధరించదలచుకున్నప్పుడు, పునరుద్ధరించిన తర్వాత, నిరుద్యోగం నుంచి ఉపశమనం కలిగించే ఉద్దేశ్యంతో కొందరికి ఉద్యోగ కల్పన చేయడానికి ప్రభుత్వానికి అధికారం వస్తుంది. నిజానికి ఈ చట్టానికి చాలా ఉదాత్తమైన, ఆహ్వానించదగిన లక్ష్యం ఉంది. ఒక సంక్షేమ రాజ్యం నిర్వహించవలసిన విధులను ఈ చట్టం ప్రభుత్వానికి కట్టబెట్టింది.

కాని ఆ చట్ట ప్రకారమే, ప్రభుత్వం ఇలాంటి ప్రకటన చేసేటపుడు ఆ పరిశ్రమలో కొన్ని పాత చట్టాలు తాత్కాలికంగా పనిచేయవని కూడా ప్రకటించవచ్చు. ఆ చట్టాల పేర్లను కూడా రిలీఫ్ చట్టం షెడ్యూల్‌లో పేర్కొన్నారు. ఆ జాబితాలో ఒకటి పారిశ్రామిక వివాదాల చట్టం. ఈ పారిశ్రామిక వివాదాల చట్టం ప్రకారం కార్మికులకు తమ జీతభత్యాలకు, పని పరిస్థితులకు సంబంధించిన కోర్కెలను లేవనెత్తే హక్కు ఉంది. ఆ కోర్కెలు పరిశ్రమ స్థాయిలో పరిష్కారం కానట్టయితే, వాటిని మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించడానికి ఆ సంస్థల దగ్గరికి తీసుకుపోయే హక్కు కూడా కార్మికులకు ఉంది. ఈ చట్టం ప్రకారం సమ్మె చేయడం కార్మికుల హక్కు. సామూహిక బేరసారాలకు కూడా

ఈ చట్టం అనుమతిస్తుంది. కాని రిలీఫ్ చట్టం అమలులోకి వస్తే పారిశ్రామిక వివాదాల చట్టం తాత్కాలికంగా రద్దవుతుంది.

ఇక పారిశ్రామిక ఉద్యోగాల స్టాండింగ్ ఆర్డర్స్ చట్టం ఇతర నిబంధనలతోపాటు కార్మికులతో వ్యవహరించే విధానాలలో పాటించవలసిన క్రమశిక్షణా పరిధులు ఏమిటో వివరిస్తుంది. ఈ చట్టం కూడా రిలీఫ్ చట్టం అమలుతో రద్దవుతుంది. నెల్లూరు మిల్లును ఒక రిలీఫ్ అండర్ టేకింగ్‌గా ప్రకటించగానే, ఆ రెండు చట్టాలు రద్దుకాగానే, ఆ మిల్లులో సిపిఐ(ఎం)కు చెందిన కార్మికులందరినీ ఉద్యోగాల నుండి తొలగించారు.

కార్మికులకు ఎటువంటి ఉపశమన అవకాశం లేని స్థితి అది. వారిని ఉద్యోగాల నుండి తొలగించారు. వారి ఫిర్యాదును వినడానికిగాని, వారికి న్యాయం కలగజేయడానికిగాని ఏ ఒక్క వ్యక్తి, సంస్థా లేని స్థితి అది. అంతకు ముందు పోస్టల్ ఉద్యోగుల సంఘంలో పనిచేస్తూ న్యాయవాదిగా మారిన జయంత్ ఆ కేసు తీసుకుని హైకోర్టులో ఒక రిట్ దాఖలు చేశాడు. ఆ రిట్ జస్టిస్ కుప్పుస్వామి ముందుకు వచ్చింది. ఆ రిట్‌లో వాదించిన అంశాలు ఆమోదనీయమని హైకోర్టు భావించలేదు గనుక అది ఒక చిక్కుముడిలో చిక్కుకుంది. ఒక సహకార సంస్థపైన రిట్ దాఖలు చేసేందుకు వీలుందా లేదా అనే ప్రశ్న ముందుకు వచ్చింది. సహకార సంస్థ అనేది ఒక ప్రయివేటు వ్యాపార సంస్థ కాబట్టి ఒక ప్రభుత్వ సంస్థ విషయంలో లాగ రిట్ చెల్లనేరదనే వాదన వచ్చింది. ఈ వాదనలన్నీ విన్న తర్వాత ఆ న్యాయమూర్తి ఆ విచారణను ఇద్దరు న్యాయమూర్తుల బెంచి ముందుకు బదిలీ చేశారు. బహుశా ఒక తల కన్న రెండు తలలు ఎక్కువ ఆలోచించగలవనే పాత నమ్మకం వల్ల కావచ్చు.

ఆ తర్వాత జయంత్ నా దగ్గరికి వచ్చి, ఆ కేసులో నన్ను వాదించమని అడిగాడు. అలా ఆ కేసు నా దగ్గరికి వచ్చింది.

జస్టిస్ అల్లాడి కుప్పుస్వామి, జస్టిస్ వేముగంటి మాధవరావులు న్యాయమూర్తులుగా ఉన్న డివిజన్ బెంచి ముందుకు ఆ వాదనలు వచ్చాయి. ఈ న్యాయ స్థానానికి అసాధారణ అధికారాలను ఉపయోగించే యోగ్యత, సామర్థ్యం ఉన్నాయా అనే వాదనలోకి వెళితే మా కేసులో విజయం సాధించజాలమని మాకు తెలుసు. ఇటువంటి వివాదాస్పద చిక్కుముడులు న్యాయస్థానాలలో పనిచేసే వారికి తప్ప బయటివారికి అర్థం కావు. మనుషుల రోజువారీ గృహ వ్యవహారాలలో వారికి చిక్కులు తెచ్చిపెట్టిన దేవతలను ప్రసన్నం చేసుకుని ఆ చిక్కుల నుంచి తప్పించే ప్రయత్నాలు చేస్తామని మంత్రాలు చదివే పురోహితవర్గం చేసే పని లాంటిది ఇది. ఒక సహకార సంస్థ విషయంలో రిట్ దాఖలు చేయవచ్చునని న్యాయస్థానాన్ని ఒప్పించడం అసాధ్యమనిపించింది.

రాజ్యాంగంలోని మూడో భాగంలో అధికరణం 12లో ఉపయోగించిన భావనకు విస్తరించిన నిర్వచనాన్ని వాడుకోవచ్చునని నాకు హఠాత్తుగా తట్టింది. మూడో భాగంలోని

ప్రాథమిక హక్కులకు నాలుగో భాగంలోని రాజ్యవిధాన ఆదేశిక సూత్రాలకు ఎటువంటి పరిమితులు విధించగూడదని రాజ్యాంగ నిర్ణయ సభ భావించింది. అట్లాగే అధికరణం 12 రాజ్యం అంటే ఒక విస్తృత నిర్వచనం ఇచ్చింది. అధికరణం 12 ప్రకారం రాజ్యం అంటే భారత ప్రభుత్వం, భారత పార్లమెంటు. ప్రతి రాష్ట్రానికి సంబంధించిన ప్రభుత్వాలు శాసనసభలు, భారత ప్రభుత్వ భౌగోళిక పరిధిలోపలి అన్ని స్థానిక, ఇతర పాలక సంస్థలు, లేదా భారత ప్రభుత్వ అధీనంలోని సంస్థలు అనే నిర్వచనం, రాజ్యం నిర్వచనాన్ని విస్తరించాలని న్యాయవాదులు నిరంతరం వాదిస్తూ వచ్చారు. అలా విభిన్న ప్రాంతాలకు క్షేత్రాలకు ఆ పరిధి విస్తరించింది. న్యాయవాదులు చేసిన గణనీయమైన దోహదం ఇది. ఈ పరిస్థితిని నేను నిశితంగా పరిశీలించినప్పుడు నేను లేవనెత్త దలుచుకున్న ప్రశ్న అప్పటిదాకా తలెత్తలేదని అర్థమయింది. కాని అప్పటికే మార్గదర్శక సూత్రాలను స్థాపించిన న్యాయశాస్త్ర కోవిదుల వాదనలు నాకు సహాయంగా ఉన్నాయి.

ఆ మిల్లును ప్రభుత్వం ఒక రిలీఫ్ అండర్ టేకింగ్‌గా ప్రకటించింది. అక్కడ రిలీఫ్ అనే మాట, ఉపశమనం అనే మాట, నిరుద్యోగం నుంచి ఉపశమనం కలిగించడం అనే అర్థంలో వాడడం జరిగింది. మరి మిల్లు కేవలం ఒక వ్యాపార సంస్థ అయి ఉన్నట్టయితే దానికి ఈ ఉపశమన లక్ష్యం ఉండే అవకాశమే లేదు. నిరుద్యోగం నుంచి ఉపశమనం అనే కార్యక్రమం భారత ప్రభుత్వం వంటి సంక్షేమ రాజ్యం మాత్రమే చేయగలిగిన పని.

నిరంతరం వలయాలుగా వచ్చే వ్యాపార ఒడిదుడుకుల నుంచి, 1928 మహా సంక్షోభం నుంచి పెట్టుబడిదారీ వ్యవస్థను కాపాడదానికే కీనీషియన్ అర్థశాస్త్ర భావనలు, సంక్షేమ రాజ్య భావనలు ఉనికిలోకి వచ్చాయి. 1928లో తలెత్తినటువంటి సంక్షోభం లాంటిదాన్ని నిరోధించాలంటే ప్రజల చేతికి కొనుగోలు శక్తిని ఇవ్వాలనేది కీన్స్ చెప్పిన ప్రాథమిక సూత్రం. ఆ కొనుగొలు శక్తి వల్ల సమాజంలో సమర్థమైన డిమాండ్ పెరుగుతూ ఉంటుంది. ఆ కొనుగోలు శక్తి ఇవ్వాలంటే, ప్రజలకు పని కల్పించాలని, వారిచేత గుంటలు తవ్వించి, మళ్ళీ పూడ్పించే పని అయినా తప్పదని ఆయన అన్నాడు. అసలు ఒక ప్రజాస్వామిక పాలనలో యుద్ధం మాత్రమే పూర్తి ఉద్యోగం ఇవ్వగలదని సర్ విలియం బెవెరిడ్జ్ రాశాడు.

మన రాజ్యాంగ రచన మిశ్రమ ఆర్థిక విధాన నమూనాలో జరిగింది. ఆ నమూనాలో భారీ ప్రభుత్వ రంగ సంస్థలను ఏర్పాటుచేసి వాటిలో పెద్ద ఎత్తున ఉద్యోగ కల్ప చేయాలని నిర్ణయం జరిగింది. మనకు ప్రయివేటు రంగం కూడా ఉండింది. అది మిశ్రమ ఆర్థిక వ్యవస్థను సక్రమంగా దాని శక్తి మేరకు పనిచేయకుండా ఆటంకపరిచింది. అలా మన ప్రభుత్వ రంగం పక్కదారి పట్టింది. నేను ఈ అంశాన్ని ఎత్తిచూపి, మిల్లును కూడా రాజ్య నిర్వచనం కిందికి తేవచ్చునని వాదించాను. అప్పటివరకు వచ్చిన ముఖ్యమైన నిర్ణయాలను, తీర్పును న్యాయమూర్తుల ముందు ఉంచాను. అక్కడ ప్రతిపాదిస్తున్న

సూత్రంలోని సామంజస్యాన్ని న్యాయమూర్తులు అంగీకరించారు. అవతలివైపు వాదించిన న్యాయవాది కార్మిక చట్టాల విషయంలో నిష్ణాతుడైనప్పటికీ, న్యాయమూర్తులు ఏర్పరచుకున్న అభిప్రాయాన్ని తారుమారు చేయలేకపోయారు. చివరికి నెల్లూరు మిల్లులో ఉద్యోగాల నుంచి తొలగించబడిన వారిని తిరిగి ఉద్యోగాలలోకి తీసుకోవాలని తీర్పు వచ్చింది.

చెరబండరాజును, రాజులోచన్‌ను ఉద్యోగాల నుంచి తొలగించినపుడు కూడా సరిగ్గా ఇదే విధంగా జరిగింది. వారిని ఉద్యోగాల నుంచి తొలిగించిన చట్టంలోని ఒక నిబంధనను అప్పటి వరకు న్యాయస్థానాలు కూడా ఎత్తిపట్టాయి. రాజ్యభద్రతా కారణాలరీత్యా విచారణ జరపకుండానే ఒక ప్రభుత్వోద్యోగిని ఉద్యోగం నుంచి తొలగించవచ్చునని గనుక గవర్నర్ సంతృప్తి చెందితే ఆ ఉద్యోగిని నేరుగా ఉద్యోగం నుంచి తొలగించవచ్చు. ఈ సమస్యపైన ఎన్నో తీర్పులు వెలువడి ఉన్నాయి. వాటిలో అత్యధికం సుప్రీంకోర్టు స్వయంగా ఇచ్చినవే కూడా. అవన్నీ ఉద్యోగులకు వ్యతిరేకంగానూ ప్రభుత్వ ఉత్తర్వులను నిర్ధారిస్తూవచ్చినవే.

ఈ కేసు హైకోర్టులో న్యాయ మూర్తులు జస్టిస్ మాధవరెడ్డి, జస్టిస్ ముక్తధర్‌ల ముందుకు వచ్చింది. నేను ఈ కేసులో గెలుస్తారనే నమ్మకం లేకుండింది. కనీసం చెరబండరాజు, లోచన్‌లకు రిటైర్‌మెంట్ సదుపాయాలయినా ఇప్పించగలిగితే చాలునని అనుకున్నాను.

అదే సమయంలో చెరబండరాజు మీద సికిందరాబాదు కుట్ర కేసు నడుస్తున్నది. అది బహిరంగంగా నడుస్తున్న విచారణ. ప్రభుత్వం ఇక్కడ దాఖలు చేసిన ప్రతివాదనలో కూడా సికిందరాబాదు కుట్ర కేసు విచారణ బహిరంగ విచారణ జరిగితే అడ్డం రాని రాజ్య భద్రతా కారణాలు, ఇక్కడ చెరబండరాజు మీద శాఖాపరమైన విచారణ జరిపితే ఎలా రాజ్యభద్రతకు భంగం వాటిల్లుతుందని ప్రశ్నించాను. ఈ ప్రశ్నకు అడ్వకేట్ జనరల్ జవాబు చెప్పలేకపోయాడు. ఆయన అప్పటివరకు వచ్చిన తీర్పును సమర్థించడానికి వచ్చాడుగాని, అటువంటి అధికారాలను పొందడానికి ఉన్న కారణాలు ఎలా సవ్యమైనవో వివరించడానికి సిద్ధం కాలేదు. మొత్తానికి చెరబండరాజును ఉద్యోగం నుంచి తొలగించిన ఉత్తర్వులను న్యాయస్థానం కొట్టివేసింది. ఇక లోచన్ విషయంలోనైతే, ఆయన కొండపల్లి సీతారామయ్యతో పాటు సికిందరాబాదు కుట్ర కేసులో నిందితుడని ప్రభుత్వం చేసిన ఆరోపణ తప్పు అని రుజువు చెయ్యడం కష్టం కాలేదు. ఎందుకంటే లోచన్ అసలు సికిందరాబాదు కుట్ర కేసులో నిందితుడు కూడా కాదు.

జీతభత్యాల సమస్యపైన సాధారణంగా వివిధ కార్మిక సంఘాలు కలిసి ఉమ్మడిగా పోరాడే సంప్రదాయం ఉంది. కాని కొన్నిసార్లు, కార్మికులలోని కొందరు తమ కొరకు ఇతర కోర్కెలతో, పోటీ సంఘం కన్నా తాము భిన్నమైన వారమని చూపుకోవడానికి పోరాడడం కూడా ఉంది. ఇక్కడ పోటీ సంఘం అనే మాట చాలా ముఖ్యమైనది. ఆ

మాట వల్లనే తప్పనిసరిగా అవతలి సంఘం తీసుకున్న వైఖరి కన్న భిన్నమైన వైఖరిని, ప్రత్యర్థి వైఖరిని తీసుకోవాలనే అభిప్రాయం కలుగుతుంది. కాని కార్మికవర్గ ప్రయోజనాలు ఎప్పుడూ ఒకటే. వారిలో కొందరి ప్రయోజనాలు మరికొందరి ప్రయోజనాలతో శత్రుపూరితంగా ఉండవు.

న్యాయమూర్తి సుబ్రహ్మణ్యం ఆ కేసులో వాదనలు వినేదాకా ఉండలేదు. ఆయన బదిలీ అయి మల్లికార్జున్ అనే మరొక న్యాయమూర్తి వచ్చారు. ఆయన ముందర నేను వాదనలు వినిపించవలసి వచ్చింది. నా వాదనలు వినిపించడానికి లేచి నిలబడి నేను చెప్పిన మొదటి వ్యాక్యం నాకింకా గుర్తుంది.

"శ్రీపతిరావు సహజ మరణం పొందాడు" అని నేను నా వాదనలను ప్రారంభించాను.

ఆ మాట విని న్యాయమూర్తి అవాక్కయ్యాడు. జరుగుతున్నది శ్రీపతి రావు హత్యకేసు. అతణ్ని హత్య చేశారని ఇరవై ఎనిమిది మంది మీద అభియోగం దాఖలై విచారణ జరుగుతున్నది. నేనేమో అది సహజ మరణం అంటున్నాను.

ఒక్కక్షణం విరామం ఇచ్చి హతుడు మరొకరకంగా మరణించే అవకాశం లేదు అని నా వాదన కొనసాగించాను. ఆయన తన మరణం ఎలా ఉండాలో తానే నిర్ణయించుకున్నాడు. మృత్యువును ఆహ్వానించాడు. అంటూ ఆయన హత్యకు దారితీసిన పరిణామాలను వివరంగా తెలియజేస్తూ నిందితులలో ఏ ఒక్కరూ దోషులు కాదని నా వాదనలు పెట్టాను. ప్రాసిక్యూషన్ అభియోగాలు ఏ సహేతుకమైన పరీక్షకూ నిలవబోవని చూపుతూ, ఒకవేళ ఆ అభియోగాల ఆధారంగా శిక్షలు విధించగలిగినా పదిమంది కన్న ఎక్కువ మంది మీద శిక్ష విధించే అవకాశం లేదని వాదించాను.

మొత్తానికి ఆ న్యాయమూర్తి సరిగ్గా ఎంతమందికి శిక్షలు విధించాడో నాకిప్పుడు గుర్తు లేదుగాని పది మందికో పన్నెండుమందికో శిక్షలు విధించి, మిగిలిన వాళ్లందరినీ నిర్దోషులుగా విడుదల చేసినట్టు ఉన్నారు. మునీర్‌కు, అశోక్ కుమార్ దాస్‌కు మరికొంత మందికి శిక్షలు పడ్డట్టున్నాయిగాని ఆ తర్వాత హైకోర్టు వారిని కూడా నిర్దోషులుగా విడుదల చేసింది. సాధారణంగా సెషన్స్ న్యాయస్థానంలో వాదించిన కేసునే మళ్ళీ హైకోర్టులో కూడా వాదించడం నాకు ఇష్టం ఉండదు. గనుక హైకోర్టులో ఆ కేసును పద్మనాభరెడ్డి వాదించారు.

ట్రేడ్ యూనియన్ల కేసులను గురించి చెపుతున్న ఈ సందర్భంలోనే గ్రామీణ బ్యాంకు ఉద్యోగులకు సంబంధించిన ఒక కేసు వ్యవహారం కూడా చెప్పాలి.

మన దేశపు దురదృష్టమేమంటే మన సమాజంలోని ప్రతి రంగంలోని ఉద్యోగులూ కూడా సామాజిక న్యాయం పట్ల, ప్రజలలో అత్యధిక సంఖ్యాకుల జీవించే స్వేచ్ఛపట్ల చాలా నిర్లక్ష్యంతో, ఔదాసీన్యంతో ఉంటారు. జీవించే స్వేచ్ఛ గురించి మాట్లాడే చట్టాలు చాలా ఉన్నాయి. కాని మన కార్మిక సంఘాలకు ఎప్పుడూ సంక్షేమ రాజ్య భావన అనే

రాజ్యాంగ ఆర్థిక సూత్రం మన ప్రజారాశుల జీవితాలకు సంబంధించినది. మన స్వాతంత్ర్యోద్యమ నాయకులు తమ కళాశాలల్లో చదువుకున్న బ్రిటిష్ ఉదారవాద విలువలను బ్రిటిష్ వారి మీద పోరాటంలో వారికి వ్యతిరేకంగా వాదుకున్నట్లుగా, ఈ రాజ్యాంగ ఆర్థిక సూత్రాన్ని ప్రజల కోసం వాడుకోవాలనే విషయం మన కార్మిక సంఘాల నాయకులు నేర్చుకోలేదు. ఒకవేళ మన కార్మిక సంఘాలు అటువంటి వైఖరి తీసుకుని ఉంటే, ఆ విషయాల మీద దృష్టిపెట్టి ఉంటే వారి రాజకీయ పోరాటాలలో, దుర్భరమైన పని పరిస్థితులకు వ్యతిరేకంగా వారు చేసిన పోరాటాలలో వారికి అపారమైన ప్రజా మద్దతు దొరికి ఉండేది. ప్రస్తుతం జరుగుతున్నట్టుగా వారు శుష్కమైన ఆర్థికవాదంలోకి దిగజారి ఉండేవారు కాదు. కార్మికవర్గ రాజకీయాల పదును మొద్దుబారి ఉండేది కాదు.

దేశవ్యాప్తంగా ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల ఉద్యోగులు తమ వేతన విధానం వాణిజ్య బ్యాంకుల ఉద్యోగులు తమ వేతన విధానం వాణిజ్య బ్యాంకుల వేతన విధానంతో సమానంగా ఉండాలనే సమస్యను లేవనెత్తినప్పుడు ఈ గ్రామీణ బ్యాంకుల సమస్య ముందుకు వచ్చింది. బ్యాంకింగ్ రంగంలో ఉన్న ఉద్యోగులందరికీ సమానమైన వేతన విధానం ఉండాలనేది గ్రామీణ బ్యాంకు ఉద్యోగులు లేవనెత్తిన వాదన. గ్రామీణ బ్యాంకులు అనబడేవి రాజ్యాంగ బద్ధంగా రూపొందినవి. వాటిని గ్రామీణ రంగానికి సేవ చేసేందుకు రూపొందించారు. గ్రామీణ ప్రాంతాలలో బ్యాంకింగ్ పరపతి సౌకర్యాలను కల్పించడానికి ఉద్దేశించారు. అప్పటికీ గ్రామీణ రంగంలో పనిచేస్తున్న సహకార బ్యాంకుల పనికి అదనంగా మరింత కృషి చేసేందుకు ఇవి ఉపయోగపడాలని ఆశించారు. ఈ గ్రామీణ బ్యాంకులను వ్యవసాయదారులకు రుణ, పరపతి సౌకర్యాలను కల్పించాలని ఉద్దేశించారు. నిజంగా ఈ గ్రామీణ బ్యాంకులు సక్రమంగా పనిచేసి, రైతులకు అవసరమైన రుణ, పరపతి సౌకర్యాలను కల్పించి ఉంటే ఇపుడు జరుగుతున్న రైతుల ఆత్మహత్యలు జరిగేవి కావేమో.

గ్రామీణ ప్రాంతాలలో రుణ, పరపతి సౌకర్యాల కల్పనకు వీలు కల్పించే చర్యలలో మొట్టమొదటిదీ, ఉత్తమమైనదీ 1981లో వెలువడిన నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ ఆక్ట్ అనే చట్టం. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు గ్రామీణాభివృద్ధికి అవసరమైన సౌకర్యాలను కల్పించాలని, ఆ పనిని నాబార్డు పర్యవేక్షించాలని ఈ చట్టం ద్వారా ఆశించారు. నిజానికి ఈ చర్యలన్నీ రాజ్యాంగంలోని నాలుగో భాగంలో చెప్పుకున్న ప్రాథమిక విధుల కొనసాగింపే. నాబార్డును స్థాపిస్తూ చేసిన చట్టంలోని లక్ష్య ప్రకటనలో మూడో పరిచ్ఛేదం ఏమి చెపుతుందో చూడండి.

'గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయాన్ని చిన్న తరహా పరిశ్రమలను, కుటీర పరిశ్రమలను, గ్రామీణ పరిశ్రమలను, హస్తకళలను, ఇతర అనుబంధ కార్యకలాపాలను ప్రోత్సహించడం కొరకు ఇచ్చే పరపతి సౌకర్యాల విధానాన్ని ప్రణాళికలను, నిర్వహణ అంశాలను నిర్ధారించేందుకు అత్యున్నత సంస్థగా ఈ జాతీయ బ్యాంకు పనిచేస్తుంది. ఈ

రంగాలలో కార్యకలాపాలను ప్రోత్సహించేందుకు స్వల్పకాలిక రుణ సౌకర్యం అందించేందుకు, మళ్లీ మళ్లీ నిధులు అందజేసే సంస్థగా ఈ జాతీయ బ్యాంకు పనిచేస్తుంది. అదేవిధంగా వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి రంగాలలో నిర్ణీత కాల రుణ సౌకర్యం కల్పించేందుకు విభిన్న బ్యాంకులకు నిధులు అందజేసే బాధ్యతను కూడా ఈ జాతీయ బ్యాంకు తీసుకుంటుంది".

కాని ఈ లక్ష్యాలన్నీ తారుమారు అయిపోయాయి. అసలు గ్రామీణ ప్రజల శ్రేయస్సు కోసం ఏర్పాటు చేయబడిన సంస్థలన్నీ రాజకీయ వేత్తల శిక్షణా కేంద్రాలుగా మారి పోయాయి. రాజకీయవేత్తలు తమ తమ రాష్ట్ర రాజకీయాలలో పైకి ఎదగడానికి ఈ శిక్షణా కేంద్రాలను వాడుకున్నారు. ఆర్థిక, ద్రవ్య రంగాలలో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మిక సంఘాలలో ఏ ఒక్కటీ గ్రామీణ రంగాలలో ఆత్మహత్యలు ఎందుకు జరుగు తున్నాయో, వారికి ఏ రకంగా సహాయపడవచ్చునో ఆలోచించినట్టు నాకు తెలియదు. నిజానికి రైతుల ఆత్మహత్యలకు ప్రధాన కారణాలలో ఒకటి రుణ, పరపతి సౌకర్యాల లేమి అయినప్పుడు ఆ రంంలోని కార్మిక సంఘాలకు ఈ అధ్యయనం ఒక తప్పనిసరి బాధ్యత అయి ఉండవలసింది. తమ తమ యాజమాన్యాల నిర్ణయాలను, వైఖరులను మార్చు కొమ్మని, రైతులకు అనుకూల విధానాలు అవలంభించమని కార్మిక, ఉద్యోగ సంఘాలు తమ యాజమాన్యాల మీద వత్తిడి తేవలసి ఉండింది. ప్రభుత్వం ప్రకటిస్తున్న పెద్ద ఎత్తున నష్టపరిహారం వల్లనే, ఆ పరిహారం మీద ఆశతోనే రైతులు ఆత్మహత్యలకు సిద్ధపడుతున్నారని చంద్రబాబు నాయుడు రాష్ట్ర శాసనసభా వేదిక మీద నిస్సిగ్గుగా ప్రకటించాడు.

సరే, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు ఉద్యోగులు లేవనెత్తిన సమస్య ఒక అఖిల భారత వివాదంగా మారింది. అక్కడ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రధాన ఉద్యోగ సంఘంగా ఉండింది. ఆ వివాదంలో సిపిఐ, బిజెపి సంఘాలు కూడా పాల్గొన్నాయి. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఒక ఏకసభ్య ట్రిబ్యునల్ కూడా వేయడం జరిగింది. ఆ విచారణలో భాగంగా దేశంలోని రాష్ట్ర రాజధానులన్నిటికీ వెళ్లవలసిన అవసరం పడింది.

అప్పటికి చాలా కాలంగా నేను రిజర్వు బ్యాంకు ఉద్యోగుల సంఘానికి న్యాయవాదిగా పనిచేస్తున్నాను. గనుక వాళ్ల యూనియన్ వచ్చి నన్ను ఈ వ్యాజ్యంలో కూడా వాదించమని కోరింది. భారతీయ జనతాపార్టీ యూనియన్ తరపున వి రామారావు వాదించారు. ప్రస్తుత హైకోర్టు న్యాయమూర్తి వర్మ సిపిఐ యూనియన్ తరపున వాదించారు. యాజమాన్యం తరపున, నాబార్డు తరపున శ్రీనివాసమూర్తి వాదించారు. ఈ వ్యాజ్యం విచారణలో మధ్యవర్తిగా జస్టిస్ ఓబుల్‌రెడ్డి వ్యవహరించిన తీరు నాకు చాలా ముచ్చట కలిగించింది. ఆయన పదవీ విరమణ చేసిన తర్వాత దాదాపు పది సంవత్సరాలకు

ఆయనను ఏకసభ్య ట్రిబ్యునల్‌గా ఉండమని కోరారు. 1987 నవంబర్ 26న ఒక ఉత్తర్వు ద్వారా ఆయనను ఏకసభ్య ట్రిబ్యునల్ న్యాయమూర్తిగా నియమించారు. ముందే చెప్పినట్టు ఈ ట్రిబ్యునల్ విచారణ కోసం రాష్ట్ర రాజధానులన్నీ తిరగవలసి ఉండింది. ఆయన 1988లోనూ 1989 ఆగస్టు వరకూ రెండు సంవత్సరాలూ దేశంలోని అనేక రాష్ట్ర రాజధానుల్లో సమావేశాలు జరిపి మొత్తం మీద 313 మంది సాక్షుల నుంచి వాంగ్మూలాలు సేకరించారు. 1989 సెప్టెంబరు నుండి డిసెంబరు వరకూ ఇరుపక్షాల వాదనలు విన్నారు. చివరికి 1990 ఏప్రిల్ 30న తన తీర్పు ప్రకటించారు. దాదాపు పది సంవత్సరాల తర్వాత కూడా ఆయన న్యాయమూర్తిగా పదవిలో ఉన్నప్పుడు ఉన్నట్టుగానే ఉన్నారు. తనకు అప్పగించబడిన పనిని సరిగ్గా సమయానికి పూర్తి చేయాలనే తపనతో కాలాన్ని లెక్కపెట్టకుండా పనిచేశారు. ఆ పని పూర్తయ్యేవరకూ తాను విశ్రాంతి తీసుకోలేదు. మమ్మల్ని విశ్రాంతి తీసికోనివ్వలేదు. మాకు న్యాయమూర్తిగా తెలిసిన ఓబుల్‌రెడ్డి కూడా అట్లాగే ఉండేవారు. తాను పనిచేసే సంస్థలో క్రమశిక్షణను కల్పించడానికి ఆయన పడే తపన, ఆ సంస్థలో నిజాయితీ నింపడానికి ఆయన కృషి చిరస్మరణీయమైనవి.

న్యాయమూర్తి కావాలంటే జీవితంలో సాధించిన వాటి జాబితా ముఖ్యం. న్యాయమూర్తి అయిన తర్వాత ఇచ్చిన తీర్పులు, మధ్యవర్తిత్వ క్రమంలో వారు తీసుకున్న దృక్పథం, ఒక సంస్థతో వ్యవహరించేటప్పుడు ఆ సంస్థ లక్ష్యాల గురించి వారికి ఉండే అవగాహన, ఆ సంస్థ లక్ష్యాలను ముందుకు తీసుకుపోవడంలో వారి పాత్ర, మొదలయిన అంశాలన్నీ వారు సాధించిన వాటిలో భాగమవుతాయి. ఒక న్యాయమూర్తిగా పనిచేసిన కాలంలో ఏమి చేశారు అనే దాన్నిబట్టి సమాజానికి, ఆ సంస్థకూ వారి అవసరం ఎంత ఉందో నిర్ణయమవుతుంది.

కాని చాలా మందికి రాసుకోవడానికి ఏమీ ఉండదు. వాళ్లు రాయవలసినంత ఘన కార్యాలేమీ చేసి ఉండరు. వాళ్లు కేవలం న్యాయపీఠం మీద కూచుని ఉంటారు. మధ్యవర్తిగా కూడా ఉండి ఉండరు. కాని తాము నిర్వహించిన సంస్థల లక్ష్యాలను అభివృద్ధి చేయడంలో ఎటువంటి పాత్రా నిర్వహించి ఉండరు. న్యాయమూర్తులలో చాలా మంది అనామకులు, ఎటువంటి ప్రత్యేకతా లేకుండానే పదవిలో కొనసాగి విరమణచేసినవారు. కేవలం ఆ పదవీ కాలంలో ఆ పదవిలో దొరికే సౌకర్యాలూ వసతులూ, ప్రతిఫలాలూ అనుభవించిన వాళ్లు. ఒక పదవి నుంచి దిగిపోయేటప్పుడు ఆ పదవిలో దొరికిన సౌకర్యాల లాంటివే మళ్లీ ఏ పదవిలో దొరుకుతాయో ఆ పదవి కోసం ఎదురుచూస్తుంటారు. అటువంటి న్యాయమూర్తులు కూడా వివాదాలలో మధ్య వర్తిత్వం వహిస్తూనే ఉంటారు. తీర్పులు ప్రకటిస్తూనే ఉంటారు. తాము నిర్వహించే సంస్థల సాధారణ సూత్రాలను యాంత్రికంగా తు.చ. తప్పకుండా పాటిస్తూనే ఉంటారు. వాళ్లు ఈ సూత్రాలను పాటించడం కూడా ఎంత యాంత్రికంగా జరుగుతుందంటే, ఆ క్రమంలో వాళ్లు ఆ సంస్థ జీవ ధాతువుల్ని

మాయం చేస్తారు. మరికొందరు తాము నిర్వహించే సంస్థల సూత్రాల పట్ల ఎంత నిర్లక్ష్యంగా, ఎంత నిస్పృహతో ఉంటారంటే వాళ్లు ఆ సంస్థల సూత్రాలను తమ వ్యక్తిగత అవసరాల కోసం ఇష్టం వచ్చినట్టుగా మార్చేస్తారు. తద్వారా ఆ సంస్థల సాధికారతను, విశ్వసనీయతను దెబ్బతీస్తారు.

కార్మికులలో ఒక స్థిరమైన ఓటు బ్యాంకును సృష్టించుకునే ఉద్దేశ్యంతోనే ప్రతి రాజకీయ పార్టీ కూడా ప్రధానంగా ట్రేడ్ యూనియన్ ఉద్యమంలోకి ప్రవేశిస్తుంది. ఆ క్రమంలోనే రాజకీయ పార్టీలు పారిశ్రామిక వివాదాలకు పరిష్కారాలు కనిపెట్టే పని కూడా మొదలు పెడతాయి. కొంతకాలం ఒక న్యాయవాది సహాయంతో ఆ పని చేస్తాయి. న్యాయవాది అవసరం లేకుండా తమ పని చేసుకోగలిగిన తర్వాత న్యాయవాదులను కూడా వదిలేస్తాయి.

చాలా మంది సభ్యులున్న, కేంద్ర యూనియన్ల రాజకీయ పదును మొద్దుబారిన తర్వాత, అవి కేవలం కార్మిక వర్గపు ఆర్థిక కోర్కెల మీద మాత్రమే పని చేయడం మొదలయింది. ఒక పరిశ్రమలోని కార్మికులందరూ ఏదో ఒక యూనియన్‌లో సభ్యులుగా ఉండని పరిస్థితి కూడా మొదలయింది. కార్మికవర్గానికి సాధారణంగా ఉండే సామూహికంగా బేరసారాలాడే శక్తి అంతకంతకూ బలహీనమూ అసమర్థమూ అయిపోయింది. కార్మికుల మధ్య ఘర్షణలు, హింస అరాచక హింసగా మారిపోయింది. యూనియన్లను చీల్చడానికీ, లెక్కలేనన్ని యూనియన్లను ఏర్పరచడానికి యాజమాన్యాలు ప్రయత్నించడం మొదలయింది. కాలక్రమంలో ఎటువంటి సిద్ధాంత అవగాహనా లేని కార్మికవర్గ సంస్థలు పుట్టుకొచ్చి, నాయకత్వమే వృత్తిగాగల నాయకులు వాటిని నడపడం మొదలు పెట్టారు. ఆ నాయకులకు జీవితమంతా సుఖంగా గడపగల వనరులను కార్మిక సంఘం సమకూర్చడం మొదలు పెట్టింది. వారిలో అత్యధికులు రాజకీయాలను సుదూరం నుంచి కూడా ముట్టుకోని వాళ్లు అయిపోయారు. వాళ్ల ఏకైక వృత్తి కార్మికుల ఆర్థికపరమైన డిమాండ్ల గురించి మాట్లాడడమే అయిపోయింది. ఆ చిన్న స్థాయి, స్థానిక నాయకులు తమ కేంద్ర ట్రేడ్ యూనియన్ల నాయకత్వాన్ని ధిక్కరించడం, వదిలివేయడం మొదలుపెట్టినప్పుడు ఈ పరిణామమంతా సమస్యాత్మకమైనదనే గుర్తించడం మొదలయింది.

ఈ సందర్భం మందమర్రిలో వచ్చింది. శ్రీపతిరావు అనే ఆరడుగుల ఎత్తయిన, దిట్టమైన వ్యక్తి బెల్లంపల్లి, మంచిర్యాల ప్రాంతాల నుంచి బొగ్గు రవాణా వ్యాపారం చేస్తుండేవాడు. ఆయనకు తన సొంత ట్రేడ్ యూనియన్ పెట్టాలనే ఆలోచన వచ్చింది. అప్పటికే ట్రేడ్ యూనియన్ ఏర్పాటు చేయడం వృత్తిగా, వ్యాపారంగా మారిపోయి ఉంది. ధన్‌బాద్‌లో నడుస్తుండిన మాఫియా యూనియన్లు ఒక నమూనాగా మారి పోయాయి. ఈ శ్రీపతిరావు కూడా ఒక లాభసాటి ట్రేడ్ యూనియన్ ఏర్పాటు

చేసుకునేటందుకు తన కార్మిక సంఘానికి మార్గం సుగమం చేసుకునేటందుకు, మొదట అక్కడ అప్పటికి బలంగా ఉన్న సిపిఐ ట్రేడ్ యూనియన్‌ను లేకుండా చేయాలని ఆలోచించాడు. అందుకని స్థానిక సిపిఐ నాయకుల మీద దాడులు చేయడం మొదలు పెట్టాడు. స్థానిక సిపిఐ నాయకులతో గిల్లికజ్జాలు పెట్టుకుని వారిని నిరంతరం వేధిస్తూ, తంతూ ఉండడానికి స్థానిక నిరుద్యోగ, అరాచక, సంఘ వ్యతిరేక శక్తులను కూడగట్టాడు.

అలా కాలం గడుస్తున్న కొద్దీ ఈ హింస సిపిఐ భరించలేని స్థాయికి చేరింది. ఇంతకూ ఈ శ్రీపతిరావు ఆ ప్రాంతంలో శాసనసభ్యుడిగా కూడా ఉండిన శక్తిమంతుడైన వెలమ భూస్వామి మాధవరావు కొడుకు, ఆ భూస్వామి నిర్దాక్షిణ్యపు పనుల గురించి, దౌర్జన్యం గురించి అక్కడ కథలు కథలుగా చెప్పుకునేవారు. ఆయన ఇంటి ముందు నుంచి ఎవరయినా చెప్పులు వేసుకుని నడవడం నిషిద్ధం. ఆయన మాటకు ఎదురాడిన వాళ్లకు ఎటువంటి గతి పడుతుందో ఆ ప్రాంతంలో ఎన్నో కథలు ఉండేవి.

సాధారణంగా ఇటువంటి హింసను ఎదిరిస్తే ఏ పరిణామాలుంటాయో అనే భయంతోనే ఆ హింసను ప్రజలు భరిస్తూ ఉంటారు. కాని ఎప్పుడైతే ఆ పరిణామాలకన్న ఇపుడు భరించే హింసే ఎక్కువ అని గుర్తిస్తారో అప్పుడు, ఆ హింసా దౌర్జన్యాల నుంచి ఉపశమనాన్ని కలిగించే శక్తిగాని, కోరికగాని న్యాయవ్యవస్థకు, అధికార యంత్రాంగానికి లేవని గుర్తించినపుడు ఇక ప్రజలు తిరగబడక తప్పదని అనుకుంటారు. అప్పుడిక వ్యక్తిగత స్థాయిలో ప్రతీకారం మొదలవుతుంది. ఎంత హేతుబద్ధవాదనతోనైనా అటువంటి ప్రతీకారాన్ని ఆపడం అసాధ్యం కాదు. మందమర్రిలో కూడా అటువంటి సందర్భం వచ్చింది. సిపిఐకి చెందిన యువ కార్యకర్తలు శ్రీపతిరావు గూండాయిజానికి సమాధానం చెప్పాలనుకున్నారు. అతని అడ్డు తొలగించుకోక తప్పదని అనుకున్నారు.

శ్రీపతిరావు ప్రతిరోజూ సాయంత్రం బజార్‌లో సర్దార్జీ బట్టల దుకాణానికి వస్తుంటాడని వాళ్లు తెలుసుకున్నారు. బహుశా విద్యుత్ ఉద్యోగులతో ఒప్పందం చేసుకుని ఆ సమయంలో ఆ ప్రాంతంలో విద్యుత్తు లేకుండా చూసుకున్నారు. అక్కడ అతని కోసం కాపుకాసి తన పథకాన్ని విజయవంతంగా అమలు జరిపారు. అతని మీద పడిగొడ్డళ్లతో నరికారు. పొడవాటి టేకు చెట్టును నరికినట్టుగా ఆ పొడవాటి మనిషిని కూల్చేశారు. ఈ మాదిరిగా ఒక దుర్మార్గుడైన మనిషిని ఊరు ఊరంతా సామూహికంగా వధించిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఉదాహరణకు మెదక్ జిల్లాలో కాజీపూర్ గాలిరెడ్డిని అలాగే చంపారు. అతను ఆ గ్రామ సర్పంచ్ సోదరుడు. ఆ కేసులో నిందితుల తరపున నేను సంగారెడ్డి సెషన్స్ న్యాయస్థానంలో వాదిస్తున్నాను. కేసులో హతుడి ప్రవర్తన ఎంత భయంకరమైనదంటే, గ్రామస్తులకు భౌతికంగా నిర్మూలించాలని నిర్ణయించడం తప్ప మరొక గత్యంతరం మిగలలేదు. రాజకీయ నాయకులు, పోలీసులు హతులైన సంఘటనలో ఎన్నో ఇటువంటివే కావచ్చు. ఒక హతుడి స్వభావం, నేర చరిత్ర ఆ హత్యాఘటనకు

పురికొల్పిన కారణాలయి ఉండవచ్చునని ఆలోచించి, వాటిని పరిగణనలోకి తీసుకునేంత అవగాహన మన న్యాయస్థానాలకు ఇంకా రాలేదు.

సరే, శ్రీపతిరావు హత్య కేసులో పోలీసులు దర్యాప్తు జరిపి ఆ స్థానంలో పనిచేస్తున్న సిపిఐ కార్యకర్తల మీద అభియోగాలు మోపారు. హతుడు క్రమం తప్పకుండా వస్తుండిన బట్టల దుకాణం యజమానిని కూడా కేసులో చేర్చారు. మొత్తం మీద ఇరవై ఎనిమిది మంది మీద ఆ కేసు నమోదయింది. అందరినీ అరెస్టు చేశారు. కేసు ఆదిలాబాదు సెషన్స్ కోర్టులో విచారణ జరగవలసి ఉండింది. అక్కడ అభియోగం సాధారణ హత్యా నేరమే. హతుడి శరీరం మీద గాయాలు కూడ ఉన్నాయి గాని, ఆ గాయపరచిన నేరాలను కూడా ముద్దాయిలందరి మీద సమానంగా మోపారు. ఒకవేళ నిందితులు ఐదుగురికన్న ఎక్కువ ఉన్నట్టయితే, సాధారణంగానే వారి మీద కుట్ర అభియోగం మోపుతారు. చట్టవ్యతిరేకంగా గుమికూడడం, దొమ్మీ నేరాలు కూడా మోపుతారు. సాధారణంగా ప్రాసిక్యూషన్ వారు నడిపే కేసు ధోరణి ఇది.

ఇక శ్రీపతిరావు హత్య కేసులో, అతని కుటుంబం చాలా పేరు ప్రఖ్యాతులు, ప్రాబల్యం ఉన్న కుటుంబం గనుక, ఆ కేసు ఆదిలాబాద్‌లో నడిస్తే తమకు న్యాయం జరగదని, మరొక చోటికి బదిలీ చేయాలని నిందితులు పెట్టుకున్న దరఖాస్తుల మీద హైకోర్టు ఆ కేసు విచారణను వరంగల్ సెషన్స్ కోర్టుకు బదిలీ చేసింది. చాలా రోజుల వరకూ అరెస్టయిన నిందితులెవరూ బెయిల్ కోసం కూడా అభ్యర్థించినట్టులేదు. తమను బెయిల్‌పై విడిపించడం గురించి పార్టీ ఏమీ పట్టించుకోవడం లేదని నిందితులు బాధపడ్డారని నాకు తెలిసింది. కాని అది సరైన అభిప్రాయం కాకపోవచ్చు. జైలు నిర్బంధంలో ఉన్నవారెవరయినా అందరూ తమను గురించి పట్టించుకోవాలని అనుకుంటారేమో, సమస్త ప్రపంచం తమ కోసం తిరగబడాలని అనుకుంటారేమో, లేదా వారి బంధువులను చూడడానికి వారిని అనుమతించకపోయి ఉండవచ్చు. కారణం ఏదయినా గానీ వారి బెయిల్ దరఖాస్తులు కూడా దాఖలు కాలేదనేది నిజం.

ఆ నిందితులలో ఒకరయిన మునీర్ అనే వ్యక్తి ఆ నిందితులందరి తరపున తమ దుస్థితిని వివరిస్తూ నాకు ఒక ఉత్తరం రాశాడు. కేసులో వారి తరపున నేను వాదిస్తే బాగుంటుందని విజ్ఞప్తి చేశాడు. తొలి అడుగున నేను ఆ ఇరవై ఎనిమిది మంది నిందితులకు బెయిల్ దరఖాస్తు దాఖలు చేశాను.

అప్పుడు సెషన్స్ న్యాయమూర్తి రూపేందర్ పర్షాద్ సైగల్, ప్రాసిక్యూషన్‌కు నోటీసు వెళ్లిన తర్వాత కేసు విచారణకు వచ్చింది. నిందితులందరినీ న్యాయస్థానానికి తీసుకువచ్చారు. నాకు ఆ నిందితులందరూ అక్కడే పరిచయమయ్యారు. వారందరినీ అనవసరంగా జైలు నిర్బంధంలో ఉంచుతున్నారనీ, వారు నేరం రుజువయ్యే వరకూ వారిని జైలులో నిర్బంధించనక్కరలేదనీ నేను దృఢంగా నమ్మాను. ఒక వ్యక్తిని నిర్బంధంలో

ఉంచడం అంటే ఆ కుటుంబపు జీవించే హక్కును కాలరాయడమే. ఎందుకంటే చాలా సందర్భాలలో ఆ నిర్బంధంలో ఉన్న వ్యక్తే ఆ కుటుంబానికి ఏకైక జీవనాధారం అయి ఉంటాడు. అతనికి బడికి వెళ్ళి చదువుకునే వయసున్న పిల్లలు ఉండి ఉంటారు. ఆ నిర్బంధం ఆ పిల్లల మానసిక స్థితి మీద ప్రభావం వస్తుంది. అంతేకాక వారిని నిర్బంధంలోనే ఉంచవలసినంత అసాధారణ పరిస్థితులేమీ ఈ కేసులో లేవు. నిందితులకు బెయిల్ ఇవ్వడమే సాధారణ న్యాయవ్యవస్థ పద్ధతి. భారత శిక్షా స్మృతిలోగాని, మరే చట్టంలోగాని బెయిల్ మీద ఆంక్షలకు సంబంధించిన ప్రత్యేక నిబంధనలు ఏమీ లేనపుడు కూడా ఒక నిందితుడికి బెయిల్ నిరాకరించడమంటే ఆ వ్యక్తికి రాజ్యాంగంలో అధికరణం 21 కింద హామీ ఉన్న జీవించే హక్కును నిరాకరించడమే అవుతుంది. ఆ వ్యక్తికి నమ్మకం ఉన్న న్యాయవాదిని కలుసుకోవడానికి, సంప్రదించడానికి, తన తరపున వాదించేందుకు నియమించుకోవడానికి అవకాశం కూడా దక్కకపోతే అది కూడా ఆ రాజ్యాంగ అధికరణ ఉల్లంఘనే.

మామూలుగానే ఒక నిందితుడికి బెయిల్ ఇవ్వాలని అభ్యర్థించేటపుడు ఈ వాదనలన్నీ పెడతాం. ఈ వాదనల మధ్యలో ఆ ప్రత్యేక కేసుకు సంబంధించిన వాస్తవాలు కూడా కలుపుతాం. అక్కడ న్యాయమూర్తి వాదనలు వినే మనిషిలా, మంచివాడిలా ఉన్నాడు. నా వాదనలను అంగీకరించాడు. తీర్పు వాయిదా కూడా వేయకుండా వెంటనే మా బెయిల్ అభ్యర్థనను అంగీకరించాడు. అప్పటికే మధ్యాహ్నం 3.30 అయింది. వాళ్లను వెంటనే విడుదల చేయించడం అవసరమని నాకు అనిపించింది. నేను నాగదికి వచ్చాను. అప్పటికే అక్కడ ఉన్న కార్మిక సంఘ బాధ్యుడు బీర్ తాగి, భోజనం చేసి పడుకున్నట్టున్నాడు. వరంగల్ ఎండవేడి ఎంత ఎక్కువగా ఉండిందంటే నాకూ ఒక 'బీర్ తాగితే బాగుంటుందని పించింది. నేను ఆ కార్మికుడిని నిద్రలేపి, బెయిల్ వ్యవహారం జరుగుతున్నప్పుడు న్యాయస్థానంలో లేనందుకు అతని మీద అరిచాను. వెంటనే పరుగెత్తి ఆ బెయిల్ కోసం జమానతుదారులను తీసుకురమ్మని, సాయంత్రానికల్లా వాళ్లను విడుదలయ్యేలా చూడమని అతనికి చెప్పాను. అనుకున్నట్టుగానే ఈ బెయిల్ రద్దు చేయాలని కోరుతూ ప్రతివాదులు హైకోర్టులో దరఖాస్తు వేశారు. అదృష్టవశాత్తూ నిందితులందరూ కూడా క్రమం తప్పకుండా పోలీసు స్టేషన్‌లో సంతకాలు పెడుతూ బెయిల్ షరతులన్నిటినీ తు.చ. తప్పకుండా పాటించారు. గనుక హైకోర్టులో బెయిల్ రద్దు దరఖాస్తు కొట్టుడుపోయింది.

ఇక ఆ కేసు విచారణ మొదలయ్యేటప్పటికి పోలీసు పరిశోధనాధికారి సాక్షులను బెదిరించడం మొదలుపెట్టాడు. కోర్టు హాలు బయట నిలబడి కిటికీలోంచి బోనులోని సాక్షిని బెదిరించడం, అటు సాక్షి చూశాడు. ఇటు న్యాయమూర్తి దృష్టికి కూడా వచ్చింది. న్యాయమూర్తి సుబ్రహ్మణ్యం మాత్రం డిఫెన్స్ న్యాయవాదుల క్రాస్ ఎగ్జామినేషన్‌ను ఎక్కడా అనవసరంగా అడ్డుకోలేదు. అటువంటి అడ్డంకులేవీ రాలేదు. నిజానికి ప్రాసిక్యూషన్

ప్రత్యర్థి పాత్ర వహించగూడదు. ప్రాసిక్యూషన్ పని అల్లా సత్యాన్ని వెలికితీయడానికి సహకరించడమే. గడిచిపోయిన పాతరోజుల్లో అటువంటి మంచి పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఉండేవారు. మద్రాసు హైకోర్టులో విటి రంగస్వామి అయ్యంగార్ పబ్లిక్ ప్రాసిక్యూటర్గా ఉండేవారు. ఎప్పుడైనా ఒక నిందితుడు అన్యాయంగా శిక్షకు గురియతే, డిఫెన్స్ న్యావాది కన్న ఎక్కువగా ఆయనే లేని ఆ నిందితులను నిర్దోషులుగా ఎందుకు వదిలెయ్యాలో వివరించేవాడు. ఆంధ్రా హైకోర్టులో కూడా చిన్నప్పరెడ్డి ప్రాసిక్యూషన్ తరపున వాదిస్తున్నప్పుడు కూడా నిందితులను ఎందుకు నిర్దోషులుగా వదిలెయ్యాలో వివరించేవాడు. చాలా తక్కువ కాలం పబ్లిక్ ప్రాసిక్యూటర్గా పనిచేసిన జి చంద్రశేఖరరెడ్డి కూడా ఆ మాదిరిగానే పని చేసేవారు.

కాని అప్పుడప్పుడు, అక్కడక్కడ కొందరు న్యాయమూర్తులుంటారు. వారికి తాము పనిచేసే సంస్థ కొరకు యావచ్ఛక్తితోనూ, సామర్థ్యంతోనూ పనిచేయాలనే అపారమైన కాంక్ష ఉంటుంది. వారు తాము అధిరోహించిన న్యాయమూర్తి పీఠాన్ని ఏదో ఒక పదవిలాగనో, ఏదో ఒక కార్యాలయం లాగనో భావించరు. దాన్ని వారు తాము విజయవంతంగా పరిపూర్తి చేయవలసిన ఒక కీలక కర్తవ్యంగా భావిస్తారు. తాము ఒక తీర్పు రాస్తున్నప్పుడు తాము ఒక ఉత్కృష్ట కార్యాన్ని నిర్వహిస్తున్నామని, దానికి ఒక అనన్యసాధ్యమైన విశిష్టత ఉన్నదని వారు సంపూర్ణంగా అవగాహన చేసుకుని ఉంటారు. అందువల్ల వారు ఆ పదవిని నిర్వహించిన కాలమంతా ఒక నిరంతర అధ్యయన క్రమంగా భావించి ఆ భావన ప్రేరణతోనే ముందుకు కదులుతారు. వారిలో కొందరు ఆ పదవికి వచ్చేటప్పటికే అందుకు తగిన శిక్షణ పొంది, అవసరమైన అర్హత సంపాదించి వస్తారు. మరికొందరు ఆ పదవిలో చేరిన తర్వాత ఆ యోగ్యత సంపాదిస్తారు.

అయినా న్యాయమూర్తులందరినీ లోకం గుర్తు పెట్టుకోదు. అమెరికన్ న్యాయమూర్తుల గురించి మాట్లాడేటప్పుడు ఇప్పటికీ ఒక హోల్మ్సను, ఒక కార్డొజొను, ఒక విలియం ఓ డగ్లస్ను, ఒక బ్రాండీస్ను, ఒక ఎర్ల్ వారెన్ను, ఒక థర్గూడ్ మార్షల్ను మాత్రమే జ్ఞాపకం చేసుకుంటారు. మన దగ్గరికి వస్తే ఒక కోకా సుబ్బారావును, ఒక సిక్రిని, ఒక షాను, ఒక షెలాత్ను, ఒక ఖన్నాను ఒకవైపునా, ఒక కృష్ణ అయ్యర్ను, ఒక దేశాయిని, ఒక చిన్నప్పరెడ్డిని మరొక వైపున గుర్తు పెట్టుకుంటారు. వారిలో మితవాదులుండవచ్చు, ప్రజానుకూలమైన వారుండవచ్చు. అదేమీ పెద్ద విషయం కాదు. కాని వాళ్లందరూ తాము నిర్వహిస్తున్న వ్యవస్థ ఒక సుదీర్ఘ కాలపు సంక్షోభంలో చిక్కుకుని ఉన్నప్పుడు రాజ్యాంగ బద్ధమైన విలువల వ్యవస్థను నమ్మి దాన్ని కాపాడడానికి నిలబడ్డారు. దేశవ్యాప్తంగా ప్రజల పౌర హక్కులు పెద్ద ఎత్తున కొల్లగొట్టబడుతున్నప్పుడు ప్రజల గళానికి ప్రాతినిధ్యం వహిస్తూ అసమ్మతి ప్రకటించినందుకుగాను ఖన్నాను ఈ దేశం ఎల్లప్పుడూ గుర్తు పెట్టుకుంటుంది.

మరి కొందరు న్యాయమూర్తులున్నారు. వారు పెద్ద పండితులు కాకపోవచ్చు. కాని వారు పదవిలో ఉన్నప్పుడు చాల కష్టపడి పనిచేశారు. తాము నిర్వహించిన వ్యవస్థను చాల గౌరవించారు. చాలా కష్టపడి పనిచేశారు. ఆ రకమైన కృషి కేవలం అధ్యయనం వల్ల మాత్రమే రాదు. వాళ్ల దృష్టిలో న్యాయవ్యవస్థ అంటే హైకోర్టు అనే ఒకానొక నిర్మాణం మాత్రమే కాదు. వాళ్ళు న్యాయవ్యవస్థను మొత్తంగా సమగ్రంగా చూశారు. కింది స్థాయి న్యాయవ్యవస్థలో కూడా నిజాయితీని, ప్రతిభను కాపాడడం అనే విలువకు వాళ్లు చాలా ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. న్యాయ వ్యవస్థ పై నుంచి కింది దాకా ఒకే రకంగా సక్రమంగా పనిచేయాలని, ఎటువంటి రాగద్వేషాలు లేకుండా, ఎవరిపట్లా అవసరమైన భయంగాని, ప్రీతిగాని లేకుండా ప్రజలందరికీ సమానంగా న్యాయాన్ని అందించడమే లక్ష్యంగా పనిచేయాలని వాళ్లు అనుకున్నారు.

అటువంటి న్యాయమూర్తులకు ఉదాహరణగా జస్టిస్ ఓబుల్‌రెడ్డి గురించి చెప్పుకోవాలి. ఒక జిల్లా న్యాయ వ్యవస్థకు అధిపతిగా జిల్లా జడ్జిగా ఉన్నప్పుడు గాని, సిటీ సివిల్ కోర్టులో చీఫ్ జడ్జిగా ఉన్నప్పుడుగాని, ఆయన ఒక్క రోజు కూడా న్యాయ స్థానానికి ఆలస్యంగా రాలేదు. తాను ఉదాహరణ ప్రాయంగా నిలిచి తన సహచరులందరిలోనూ, కింది స్థాయి న్యాయ వ్యవస్థ సిబ్బందిలోనూ క్రమశిక్షణను నెలకొల్పారు. నిర్ణీత వేళలను పాటించడం అనేది పని నిజాయితీలో ముఖ్యమైన భాగం అని ఆయన భావించేవారు. అంతేకాదు కోర్టు హాలులో న్యాయమూర్తి కోసం వేచి చూస్తూ కూచున్న న్యాయవాదుల పట్ల మర్యాద పాటించాలంటే సమయాన్ని పాటించాలని ఆయన అనుకునేవారు. ఆయన న్యాయమూర్తిగా పనిచేసిన మొత్తం కాలంలో, జిల్లా జడ్జిగా గాని, చీఫ్ జడ్జిగాగాని, హైకోర్టు రిజిస్ట్రార్‌గాగాని, చీఫ్ జస్టిస్‌గాగాని, ఆయన న్యాయ వ్యవస్థలో అవినీతికి వ్యతిరేకంగా ఏకవ్యక్తి సైన్యంగా పనిచేశారు. న్యాయ వ్యవస్థ స్వతంత్రంగా ఉండడం అంటే అది అవినీతికి తావు లేకుండా ఉన్నప్పుడే సాధ్యమవుతుందని ఆయన నమ్మారు.

ఎమర్జెన్సీ విధించిన తర్వాత, అంటే 1975లో, నాకు కొందరు అకౌంటెంట్ జనరల్ కార్యాలయ సిబ్బందితో పరిచయం ఏర్పడింది. వారిలో నాగేందర్ రెడ్డి, సాలమన్ రాజు, నారాయణరావు, నాయర్ లాంటి వాళ్ల పేర్లు నాకింకా గుర్తున్నాయి. వారి తరపున నేను కేసులు వాదించి గెలిచాను. ఎమర్జెన్సీలో ప్రభుత్వం అనుమానంతో వేధించిన ఉద్యోగులలో వీరు కొందరు. అప్పుడే కొందరు సెక్రటేరియట్ ఉద్యోగులను కూడా అదే విధంగా వేధిస్తూ డిఫెన్స్ ఆఫ్ ఇండియా రూల్స్ కింద అరెస్టు చేశారు.

ఎమర్జెన్సీ అరెస్టులలో మొట్టమొదట అరెస్టయిన వారిలో శత్రుఘ్న ఒకరు. ఆయన పేరుతో పాటు చార్జిషీటులో రమా మెల్కోటె, సరళ సర్కార్‌ల పేర్లుకూడా ఉన్నాయి గాని వాళ్లను ఎందుకో అరెస్టు చేయలేదు. వాళ్లందరినీ కలిపి విచారణ చేశారు. వాళ్ళందరూ

కూడా విద్యావేత్తలు. చాలా తెలిసినవారు. అప్పటికి అలవాటులో ఉన్న అర్థంలో వాళ్లను కార్యకర్తలు అని కూడా పిలవలేము. వాళ్లు భారత చైనా మిత్రమండలి అనే సంస్థను స్థాపించి నడుపుతుండేవాళ్లు. వాళ్లకు జీవన్‌రెడ్డితో కూడా న్యాయవాదిగా ఉన్నప్పుడు మంచి సంబంధాలుండేవి. ఆ జీవన్‌రెడ్డి ఆ తర్వాత ఎమర్జెన్సీ కాలంలో న్యాయమూర్తిగా నియమితులయ్యారు. వాళ్లు అప్పటికి న్యూస్ అండ్ వ్యూస్ అనే ఆన్ చైనా అని ఒక పత్రిక కూడా నడుపుతుండేవాళ్లు. వాళ్లకు నక్సలైట్లలో చంద్రపుల్లారెడ్డి వర్గంతో సబంధాలున్నాయని పోలీసులు అనుమానిస్తుండేవారు. మొత్తానికి ఈ విచిత్రమైన కారణాల వల్ల శత్రుఘ్న ఒక్కడిని మాత్రం ఎమర్జెన్సీ విధించగానే అరెస్టు చేశారు.

అలా శత్రుఘ్నను అరెస్టు చేయగానే ఆయన మిత్రులు జీవన్‌రెడ్డిని కలిసి ఏదయినా చేయమని అడిగినట్టున్నారు. జీవన్‌రెడ్డి నాకు ఫోన్ చేసి శత్రుఘ్న అరెస్టు వార్త చెప్పి, నన్ను ఏమయినా చేయమని కోరారు. అప్పుడు ఉన్న వాతావరణంలో బెయిల్ సంపాదించడం దాదాపు అసాధ్యమైనపనే. ఆ ముగ్గురి కేసు మెజిస్ట్రేటు బ్రహ్మానందం ముందుకు వచ్చింది. ఆయన ఇంగ్లీషు మాట్లాడే పద్ధతి చూసి ఆ ముగ్గురికి ఆయన మీద ఒక అభిప్రాయం ఏర్పడినప్పటికీ, ఆయనతో చాలాకాలంగా సంబంధంలో ఉన్నందువల్ల ఆయన న్యాయశాస్త్రం తెలిసినవాడేనని నాకు తెలుసు. పోలీసులు ఎటువంటి అబద్ధపు, తప్పుడు, చట్టవ్యతిరేక పనులు చేస్తారో కూడా ఆయనకు తెలుసునని నాకు తెలుసు.

శత్రుఘ్నను గొలుసులతో బంధించి, చేతులకు బేడీలు వేసి కోర్టుకు తీసుకువచ్చారు. కోర్టు హాలులోకి తీసుకువచ్చే ముందు అవి తొలగించారు. లోపలికి పిలవకముందు తనను అలా బంధించి ఉంచడం గురించి శత్రుఘ్న గట్టిగా ప్రతిఘటిస్తూ కేకలు వేస్తున్నాడు. తనకు అది అవమానమని, తన ప్రతిష్టకు భంగకరమని గొడవ పద్దారు. ఆయన నిరసనలను నేను మౌనంగా భరించవలసి వచ్చింది. నేను ప్రతిరోజూ హైకోర్టులో వాడి వేడి వాదనల తర్వాతనే అక్కడికి వస్తున్నానని ఆయనకు తెలియదు. నాకు అప్పటికే ప్రతిరోజు అక్రమ నిర్బంధాల వార్తలు వస్తున్నాయి. ఎన్‌కౌంటర్ల పేరు మీద నిర్బంధితులను చంపే అవకాశం ఉందని కూడా నాకు తెలుసు.

ఈ మొత్తం వ్యవహారంలో వినోదదాయకమైనది శత్రుఘ్న మీద జరిగిన విచారణ. ముషీరాబాద్ పోలీసు స్టేషన్ ఇన్స్‌పెక్టర్ లక్ష్మారెడ్డి శత్రుఘ్న ఇంటి మీద దాడిచేసి సోదా చేశాడు. అమెరికా నుంచీ, ఇంగ్లండ్ నుంచీ వెలువడే పత్రిక బ్రాడ్ షీట్ ప్రతులు కొన్నిటిని, న్యూస్ అండ్ వ్యూస్ ఆన్ చైనా పత్రిక కొన్ని ప్రతులను ఆయన అక్కడి నుంచి జప్తు చేసి తీసుకు వచ్చాడు. అలాగే తారీక్ రాసిన ఎక్స్‌ప్లోజన్ ఇన్ సబ్ కాంటినెంట్ అనే పుస్తకం కూడా స్వాధీనం చేసుకుని వచ్చాడు. శత్రుఘ్న విప్లవ కార్యకలాపాలలో పాల్గొంటున్నాడనేందుకు సాక్ష్యాధారాలుగా పోలీసులు ఈ సాహిత్యాన్ని కోర్టు ముందు

పెట్టారు. నేను ఆ పోలీసు పరిశోధనాధికారులను బోనెక్కించి చాలా గట్టి క్రాస్ ఎగ్జామినేషన్ చేశాను. ఆ క్రమంలోనే శత్రుఘ్నను అరెస్టు చేసిన నారాయణగూడా పోలీసు స్టేషన్ సబ్ ఇన్స్‌పెక్టర్ జాన్ బన్యన్‌ను కూడా నేను క్రాస్ ఎగ్జామినేషన్ ముగించగానే అక్కడ ఉన్నవాళ్లు 'సాబ్ బన్యన్ కా చడ్డీ భీ ఉతార్ దియే' అని అన్నారు. ఆ మాటలు నాకింకా గుర్తున్నాయి.

అలాగే జయరాముడు, ఆయన సహచరుల మీద పెట్టిన కేసు ఇంకా విచిత్రమైనది. వాళ్లను జయరాముడి ఇంట్లో అరెస్టు చేశామని, అక్కడ హాలులో ఉన్న అల్మారాలోంచి నక్సలైటు సాహిత్యాన్ని జప్తు చేశామని ప్రాసిక్యూషన్ వారు చెప్పారు. ఆయన ఇల్లు ఒక ఆవరణలో కింది అంతస్తులో ఉన్నదని వాళ్లు అన్నారు. ఆ క్రమంలో ఇంటిలిజెన్స్ పోలీసులను కాసేపు క్రాస్ ఎగ్జామినేషన్ చేసిన తర్వాత నేను న్యాయమూర్తి ముందర ఒక దరఖాస్తు చేశాను. ఏ ఇంటి నుంచి ఈ అరెస్టులు, సోదాలు, జప్తులు చేశామని పోలీసులు చెపుతున్నారో ఆ ఇంటిని న్యాయమూర్తి స్వయంగా చూస్తే బాగుంటుందని నేను ఆ దరఖాస్తులో కోరాను. న్యాయమూర్తి అంగీకరించి మాతోపాటు వచ్చారు.

తీరా అక్కడికి వెళ్లి చూస్తే ఆ ఆవరణలో కింది అంతస్తులో ఒక కారు గారేజి, ఒక మరుగుదొడ్డి మాత్రమే ఉన్నాయి. పోలీసులు చెప్పినట్టు హాలుగాని, దాంట్లో అల్మారాగాని, అందులో పుస్తకాలుగాని ఏమీలేవు. అంతా కట్టుకథ అన్నమాట. ఆ మాదిరిగా న్యాయమూర్తిని అక్కడికి తీసుకుపోతానని పోలీసులు ఊహించి ఉండరు. ఎక్కడో అరెస్టు చేసి, మరెక్కడో సంపాదించిన పుస్తకాలతో కలిపి, అబద్ధపు ఎఫ్ఐఆర్‌లు, చార్జిషీట్లు తయారు చేయడం పోలీసుల ఆనవాయితీ.

ఇక మరొక కేసు ఉంది. కుర్రవాడిని అరెస్టు చేశారు. ఆ కుర్రవాడు హెచ్ఎంటిలో అప్రెంటిస్‌గా పనిచేస్తుండేవాడు. అరెస్టు కావడంతో అతనికి ఆ పని పోయింది. ఆ అబ్బాయి మలక్‌పేటలో ఆంధ్రాబ్యాంకు కాలనీలో నివసిస్తుండేవాడు. ప్రాసిక్యూషన్ తరపున ఒకే ఒక్క సాక్షి శేషగిరిరావు అనే పరిశోధనాధికారి ఉన్న ఒకే ఒక్క సాక్ష్యాధారం ఆ కుర్రవాడి దగ్గర అతని ఇంట్లో దొరికిందని చెప్పబడిన నక్సలైటు సాహిత్యం. ఆ ఇల్లు ఎలా ఉంటుందని క్రాస్ ఎగ్జామినేషన్ సందర్భంగా శేషగిరిరావును ప్రశ్నించాను. ఆ కుర్రవాడు, అతని తల్లిదండ్రులు ఉంటున్న ఇంటి అనుపానులన్నీ శేషగిరిరావు పొల్లు పోకుండా చెప్పాడు. కచ్చితంగా ఆ ఇంటికి వెళ్లి చూశావా, లేక ఆ కాలనీలో అన్ని ఇళ్లూ ఒకేలాగా ఉంటాయా అని అడిగితే అన్ని ఇళ్లూ ఒకేలాగ ఉంటాయని చెప్పాడు. ఆ తర్వాత ఆయన ఎక్కడ ఉంటాడని అడిగితే ఆయన కూడా అదే కాలనీలో మరొక ఇంట్లో ఉంటున్నానని చెప్పాడు. అంటే ఆయన తన ఇంటి అనుపానులనే ఆ కుర్రవాడి ఇల్లుగా వర్ణించాడన్నమాట. ఆ తర్వాత ఆ కుర్రవాడి మీద కేసు కొట్టేశారు.

నాకు ఎప్పుడూ ఏమనిపిస్తుందంటే ప్రాసిక్యూషన్‌కు, పోలీసులకు ఎప్పుడైనా ఒక కేసు గెలుస్తామా, ఓడిపోతామా అనేదానిలో ఆసక్తి ఉండదు. ఆ కేసు అలా ఎడతెగకుండా

సాగుతూ ఉండాలని మాత్రమే వాళ్ల కోరిక. నిందితులకు నిజంగా శిక్ష పడేలా కేసును తయారుచేయాలని కూడా వాళ్లు అనుకోరు. అసలు అది సాధ్యం కాదని కూడా వాళ్లకు తెలుసు. కేసు చాలా సంవత్సరాలు జరిగి నిందితులు కోర్టుకు తిరుగుతూ విసుగెత్తాలని, అలా వాళ్లను వేధించడమే వాళ్లకు తగిన శిక్ష అని పోలీసులు అనుకుంటారు. కేసు ఎలాగూ కొట్టుడు పోయేదే అయినా పోలీసులు మొదట నిందితులుగా చూపిన వాళ్లందరినీ అరెస్టు చేయగలుగుతారు. ఆ అరెస్టుతో వాళ్లను కొంతకాలం నిర్బంధంలో ఉంచగలుగుతారు. ఒకవేళ కేసు విచారణ ఎక్కువకాలం సాగిందంటే, పోలీసుల ఉద్దేశ్యం నెరవేరినట్టే. అసలు ఈ సుదర్ఘీ విచారణ ప్రభావం నిందితుల మీద ఎట్లా ఉంటుందన్నది కూడా కాదు. ఆ నిందితుల పరిసరాలలో ఉండే ప్రజల మీద, పరిచయస్తుల మీద ఈ విచారణ. వేధింపు ఏ ప్రభావం కలగజేస్తుందన్నదే పోలీసులకు ఎక్కువ ఆసక్తి. ఒక నిందితుడిని వేధించడం ద్వారా అతని చుట్టూ ఉన్న రాజకీయేతర వ్యక్తుల మీద ఎటువంటి ప్రభావం వేయగలుగుతామన్నదే పోలీసుల దృష్టి.

ఎపుడైనా రాజకీయ కర్యాకర్తల మీద ఒక చర్యకు పాల్పడినప్పుడు పోలీసుల దృష్టి ఆ రాజకీయ కార్యకర్తల చుట్టూ ఉండే రాజకీయేతర వ్యక్తుల మీద ఆ చర్య ద్వారా ఏ ప్రభావం చేయగలుగుతామనే దాని మీదనే ఉంటుంది. ఒక సంస్థను నిషేధించడం ద్వారా, వాక్ స్వాతంత్ర్యాలను అరికట్టిన కేసులను హైకోర్టులో సాగదీయడం ద్వారా కన్న ఎక్కువగా పురుషోత్తం, ఆజం అలీ, కనకాచారిలను హత్య చేయడం ద్వారా పోలీసులు వాక్ స్వాతంత్ర్యాలను సమర్థంగా అడ్డుకోగలిగారు. ఇటువంటి హత్యల ద్వారా అభిప్రాయ వ్యక్తీకరణను అడ్డుకోవడం పాలకులకు సులభమవుతుంది. చంపడం ద్వారా ఎటువంటి భిన్నాభిప్రాయాన్నయినా మాయం చేయవచ్చు. ఆ భిన్నాభిప్రాయం ఇక ఎల్లకాలానికి మూగవోతుంది. ఆ అభిప్రాయాలు ప్రకటించే వ్యక్తి గొంతు ఆగిపోవడం మాత్రమే కాదు. ఆ వ్యక్తిలాగ ఆలోచించే వాళ్లందరినీ కూడా ఆ హత్య మౌనంలోకి నెట్టేస్తుంది. ఇతరులు ఆ హత్యకు కారణాలను వెదకడం మొదలు పెడతారు. ఏ సామాజిక కారణాలు తాము మౌనంగా ఉండడానికి దారితీశాయో వివరణ ఇవ్వడం కొరకు ఆ కారణాలు వెతుకుతారు. హత్యకు గురయిన వ్యక్తి చాలా దుడుకుగా ఉండేవాడని, అతని ప్రత్యర్థి రాజకీయాల వల్లనే అతను హత్యకు గురయ్యాడనీ తమకు తాము సమాధానం చెప్పుకుంటారు.

ఎప్పుడయినా మనం తటస్థంగా ఉన్నామంటే మన వాస్తవిక, నిష్పాక్షిక అవగాహనలవల్ల కాదు, కేవలం మన మానసిక వైఖరుల వల్ల. భయం వల్ల, మనుగడ, సాగించాలనే కోరికవల్ల మాత్రమే అలా ఉంటాము.

ఇప్పుడిక ప్రభుత్వాలు అధికరణం 19కి ఉన్న ఉప నిబంధనలను లేవనెత్తవలసిన అవసరమే లేదు, కొత్త చట్టాలు వేయవలసిన అవసరమే లేదు. చివరికి దారుణమైన

అత్యవసర పరిస్థితిని కూడా విధించనక్కరలేదు. లాంఛన ప్రాయమైన చట్టబద్ధచట్రాన్ని వదిలిపెట్టకుండానే పాలనను దిగజార్చే పనిని ప్రభుత్వాలిప్పుడు నేర్చుకున్నాయి. ఇరవై ఒకటో శతాబ్దం వచ్చే సరికి మానవజాతి ఒక పూర్తి వలయం తిరిగి వచ్చిందన్న మాట.

మనం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు చేశాం. అభద్రతకు వ్యతిరేకంగా పోరాటాలు చేశాం. క్రమబద్ధమైన పరిణామం ద్వారా మనం మన జీవితాలలోకి ఒక విధమైన పద్ధతిని, భద్రతను తెచ్చుకున్నాం. మనను మనం పరిపాలించుకోవడానికి కొన్ని సూత్రాలు, పద్ధతులు, నియమాలు రూపొందించుకున్నాం. శతాబ్దాల తరబడి సాగిన పోరాటం ద్వారా మనం ఈ స్థితికి చేరుకున్నాం. అన్ని రూపాలలోని ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాటాలు సలిపాం. ప్రపంచాన్ని మార్చడానికి, మెరుగుపరచడానికి ఒక తత్వ శాస్త్రాన్ని కూడా రూపొందించుకున్నాం. ఈ ప్రగతి పథంలో సాగుతున్న క్రమంలోనే మనం రాజ్యాంగాలు రచించుకున్నాం. అసలు రాజ్యాంగ రచనే పారదర్శక పరిపాలనా దిశలో ఒక కీలకమైన ముందడుగు. ఆధిపత్యం నుంచి మనను మనం విముక్తి చేసుకునే క్రమంలోనే మనం రాజ్యాంగాన్ని సంపాదించుకున్నాం. ఎపుడైతే అధికారం, ఆధిపత్యం ఉనికిలోకి వచ్చాయో అప్పుడే తత్సంబంధిత స్వేచ్ఛలు కూడా ఉనికిలోకి వచ్చాయి.

ఈ క్రమ పరిణామమంతా ప్రస్తుతం రద్దయి పోయినట్టు కనబడుతోంది. రాజ్యాంగ యంత్రం కన్న ముందు ఉండే ప్రకృతి స్థితిలో మానవ జీవితం 'చిల్లరగా, పశుప్రాయంగా, కురచగా' ఉంటుందని థామస్ హాబ్స్ అన్నాడు. మనిషి అంటే తోడేలులాంటి మనిషి అన్నాడు. ఇపుడదే జరుగుతూ ఇన్ని వందల సంవత్సరాలుగా మనం సాధిస్తూ వచ్చిన ప్రగతి అంతా ఆగిపోయినట్టు కనబడుతోంది.

ఈ రాష్ట్రంలో పోలీసుల అత్యాచారాల మీద పౌరహక్కుల ఉద్యమం ఎగతెరకుండా విమర్శ చేస్తూ వచ్చింది. అటువంటి పౌరహక్కుల పరిరక్షకులను కిరాయి హంతకుల చేత చంపించే పనికి, అంటే హత్యలను ప్రయివేటీకరించే పనికి, పూనుకోకముందు పోలీసులే స్వయంగా చేసిన హత్య నర్రా ప్రభాకరరెడ్డిది. ఆయన వరంగల్ న్యాయస్థానంలో పనిచేస్తుండిన యువ న్యాయవాది. ఆయనను పోలీసులు హత్య చేసే సమయానికి, 1991లో ఆయన జిల్లా బార్ అసోసియేషన్ కార్యదర్శిగా ఉన్నాడు. ఆ సంవత్సరమే చివరి, అసలు నక్సలైటు ఉద్యమంతో సంబంధంలేని, ఒకవేళ ఉన్నా కేవలం జర్నలిస్టు వృత్తివల్ల మాత్రమే ఉన్న వ్యక్తి, అతనితోపాటు ఉన్నందుకు మరొక వ్యక్తిని పోలీసులు బూటకపు ఎన్‌కౌంటర్‌లో చంపేశారు. ఆ జర్నలిస్టు పేరు గులాం రసూల్. ఆయనతోపాటు చంపివేయబడిన ఆయన స్నేహితుడు విజయప్రసాద్. అపుడు డిఎస్పీగా పనిచేస్తున్న రాజయ్య ఆ బూటకపు ఎన్‌కౌంటర్‌కు సూత్రధారి. ఎన్‌టిఆర్ నగర్‌లో గుడిసెలు తగులబెట్టించడంలో కూడా ఆ డిఎస్పీకి సంబంధం ఉంది.

అంతకుముందు టెర్రరిస్టు కార్యకలాపాల నిరోధ చట్టం (టాడా) రాగానే 1987లో

ఇక్రిసాట్‌లోని ట్రేడ్ యూనియన్ నాయకులను ఆ చట్టం కింద అరెస్టు చేసింది కూడా ఆ డిఎస్పీనే. అపుడు ప్రిన్సిపల్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి విద్యాసాగరరావు దగ్గర నేను బెయిల్ దరఖాస్తు మీద వాదనలు వినిపించాను. అక్కడ బెయిల్ నిరాకరించబడిన తర్వాత నేను న్యాయమూర్తి జయచంద్రారెడ్డి దగ్గర కూడా మళ్లీ వాదనలు వినిపించి అక్కడ బెయిల్ సంపాదించాను. ఆ తర్వాత అసలు టాడా కేసులలో బెయిల్ ఇచ్చే అధికారం హైకోర్టులకు కూడా లేదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. అలా ఎన్‌టిఆర్ నగర్ భూ కబ్జాతో సబంధం ఉన్న ఆ డిఎస్పీ ఏదో సందర్భంలో ఒక పత్రికా సమావేశం ఏర్పాటుచేసి ఆ సమావేశం వార్త దక్కన్ క్రానికల్‌లో పతాక శీర్షికగా వచ్చేట్టు ఏర్పాటుచేసుకున్నాడు. ఆ పతాక శీర్షికలో ఆయన నన్ను బార్ కౌన్సిల్ నుంచి తొలగించడానికి ప్రయత్నాలు చేస్తున్నట్టు చెప్పుకున్నాడు. అపుడు నేను దక్కన్ క్రానికల్ యజమాని చంద్రశేఖరరెడ్డికి న్యాయ సలహాదారుగా కూడా ఉన్నాను. వార్తల విషయంలో ఆయన నా సలహా అడుగుతుండేవాడే. కాని ఈ వార్త ప్రచురించే ముందు కనసీం ఈ వార్తలో నిజానిజాలేమిటని నన్ను అడగడం కూడా జరగలేదు.

సరే ఆ తర్వాత గులాం రసూల్, విజయ ప్రసాద్‌ల బూటకపు ఎన్‌కౌంటర్‌పై ప్రభుత్వం న్యాయవిచారణకు ఆదేశించింది. జస్టిస్ టిఎల్ఎన్ రెడ్డి కమిషన్ విచారణ జరిపింది. ఆ కమిషన్ డిఎస్‌పి రాజయ్య చెప్పిన నిస్సారమైన కాకమ్మ కథ నిజమేనని నమ్మింది. రాజయ్య చూపిన సాక్ష్యాధారాలను, బూటకత్వాన్ని ఎదిరించడానికి పౌర హక్కుల సంఘం, వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ చేసిన అభ్యర్థనలను తోసిపుచ్చింది. నిజానికి జస్టిస్ టిఎల్ఎన్‌రెడ్డి చాలా మంచి న్యాయమూర్తి. కాని రాజ్యహింసకు బలి అయిన వారి విషయంలో ఎంత మంచి న్యాయమూర్తి అయినా ఏమీ చేయలేదు. ఆ కేసులో కెవి రంగారెడ్డి కొడుకుకు పాత్ర ఉందని, ఆయన కూడా సాక్షినని, కమిషన్ విచారణను నార్నె రంగారావు ప్రభావితం చేశాడని చాలా వదంతులు అపుడు వ్యాపించాయి. ఆ వందతులకు నేనంతగా ప్రాధాన్యత ఇవ్వలేదు. ఎందుకంటే నేను అప్పటికింకా రాజ్యహింసను, నిరంకుశత్వాన్ని అడ్డుకోగల శక్తి వ్యక్తిగతంగా గాని, సామూహికంగాగాని భారతీయ న్యాయ వ్యవస్థకు ఉందని నమ్ముతున్నాను. ఆ పని అత్యవసర పరిస్థితిలో జరిగింది కూడా. అటు నుంచి కాల్పులు జరిగాయని, దానికి ప్రతిగానే పోలీసులు కాల్పులు జరిపారని పోలీసులు కథ చెప్పారు. ఆ ఇద్దరు హతులు పడిపోయిన స్థలాన్ని చిత్రాలలో చూపెట్టి స్త్రీ శక్తి సంఘటనకు చెందిన ఆర్కిటెక్ట్ విజయ ఆ కథంతా ఎంత అబద్ధమో రుజువు చేశారు. కాని సాధారణంగా కల్పనలే, అది కూడా తప్పుడు కల్పనలే సత్యంగా చలామణీ అవుతుంటాయి.

ఇక పార్లమెంటు భవనం మీద దాడి కేసు చూద్దాం. ఆ భవనం మీద దాడి జరిగే సమయానికి ఆ వ్యవస్థ ఏ లక్ష్యం కోసం ఏర్పడిందో ఆ లక్ష్యం చనిపోయింది. పార్లమెంటు

సభ్యులను కొనడానికి పివి నరసింహారావు చేసిన ప్రయత్నాన్ని గుర్తు తెచ్చుకోండి. తన మీద ఆ పార్లమెంటులో వచ్చిన అవిశ్వాస తీర్మానాన్ని ఓడించేందుకు జార్ఖండ్ నుంచి ఎన్నికయిన పార్లమెంటు సభ్యులను కొనివెయ్యడానికి నరసింహారావు ప్రయత్నించాడు. ఆ కేసులో ఆయన దోషి అని న్యాయస్థానం తీర్పు చెప్పింది. ఒక కింది స్థాయి మేజిస్ట్రేటు ఈ దేశపు ప్రధానమంత్రి దోషి అని చెప్పగలిగాడని చూసి నాకు చాలా సంతోషం కలిగింది. అయనంతటి పెద్దమనిషి ఈ స్థాయికి దిగజారాడని చూసి నాకు విచారం కూడా కలిగింది. నెహ్రూ తర్వాత అంతగా పండితుడైన ప్రధానమంత్రి నరసింహారావే, ఆయనతోపాటు బూటాసింగ్‌ను కూడా దోషిగా తేల్చారు. ఆ తీర్పు మీద అప్పీలుకు వెళ్ళే ముందు రెండో అభిప్రాయం కొరకు ఒక స్నేహితుడి కొడుకు ద్వారా నరసింహారావు ఆ ఫైలును నాకు పంపారు. ఆ కేసు ఫైలును జాగ్రత్తగా చదివి నేను ఆయనకు 2000 అక్టోబర్ 28న ఒక నోట్ రాసి పంపాను. అది యథాతథంగా ఇక్కడ ఇస్తున్నాను.

ఒక కుట్ర అభియోగాన్ని రుజువు చేయాలంటే సాక్ష్యాధారాలేమీ అవసరం లేదనీ, కొన్ని రాజకీయాభిప్రాయాలుండి మన మాట వినే న్యాయమూర్తి ఉంటే చాలుననీ చూపడానికి పివి నరసింహారావు కేసు ఒక బ్రహ్మాండమైన ఉదాహరణ. ఒక నిర్దిష్ట నేరానికి కుట్ర అంటే ఇచ్చిన నిర్వచనం అతి విశాలంగా, అస్పష్టంగా ఉండి, బ్రిటిష్ వాళ్లు వెళ్ళిపోయిన తర్వాత కూడా ఈ దేశంలో ఒక రాజకీయ ఆయుధంగా చాలా బాగా ఉపయోగపడుతుంది. నిజానికి ఈ కుట్ర అనే పదానికి మూలం స్టార్ చాంబర్‌లో ఉంది. ఆ నేరానికి నిర్వచనం అనేది ఇవ్వడం సాధ్యం కాదనే విషయం పివి నరసింహారావు కేసులో సుస్పష్టంగా బయటపడుతోంది. మన న్యాయ వ్యవస్థా నిర్వహణలో సామంజస్యానికి అది పెద్ద సాకు అనే విషయంలో నాకు సందేహమే లేదు. అమెరికాలో కూడా క్రూల్ విచ్ వర్సస్ యునైటెడ్ స్టేట్స్ అనే కేసులో కుట్ర అభియోగం మీద జస్టిస్ జాక్సన్ తీర్పులో చాల వివరమైన చర్చ జరిగింది.

పివి నరసింహారావు కేసులో న్యాయమూర్తి ఒక కచ్చితమైన అభియోగాన్ని నిర్ధారించారు. కొందరి పేర్లను స్పష్టంగా చెప్పి, వారు కుట్ర చేశారని నిర్ధారించారు. ఆ కుట్రలో పాల్గొన్న వారి పేర్లు న్యాయస్థానం నమోదు చేసింది. తన మీద 1993 జులై 26న ప్రవేశపెట్టబడిన అవిశ్వాస తీర్మానాన్ని ఓడించడానికి తన సహ ముద్దాయిలతో కలిసి కుట్ర పూరితంగా ఒక కచ్చితమైన ఒప్పందం కుదుర్చుకున్నారని న్యాయస్థానం ప్రకటించింది. ఈ నేరారోపణ లంచం ఇచ్చిన వారికి వ్యతిరేకమైనది. మరొక నేరారోపణ ఆ లంచం తీసుకున్నవారి మీద నమోదయినది. కుట్ర జరిగినది అవిశ్వాస తీర్మానాన్ని ఓడించే ఉద్దేశ్యంతో. కుట్ర జరిగిన సమయం 1993 జులై, ఆగస్టుల మధ్య.

ప్రభుత్వం పడిపోతుందేమోననే భయమే ఈ కుట్రకు హేతువును కల్పిస్తుంది గాని,

అవిశ్వాస తీర్మానం దాని కదిగా కాదని న్యాయమూర్తి అభిప్రాయపడ్డాడు. కుట్ర అనేదేమో ఆ అవిశ్వాస తీర్మానాన్ని చట్ట వ్యతిరేక పద్ధతుల ద్వారా ఓడించడానికి సంబంధించినది. అధికారంలో ఉన్న పార్టీ ఏదయినా తన మీద వచ్చే అవిశ్వాస తీర్మానాన్ని ఓడించడానికి ప్రయత్నిస్తుంది. ఆ తీర్మానాన్ని ఓడించడానికి పాలకపక్షం చేసే ప్రయత్నం వల్ల పార్లమెంటులోని అధికార ప్రతిపక్ష బృందాలు రెండూ తన వైపు వీలయినంతమందిని రాబట్టుకునే ప్రయత్నం చేస్తాయి. అలా రాబట్టుకోవడానికి సభ్యులను కలుసుకోవడం కుట్ర అనే నిర్ధారణకు రావడానికి దారి తీయదు. ఆ ప్రయత్నంలో భాగంగా రహస్య సమావేశాలు కూడా జరగవచ్చును. అలాంటి సమావేశాలను నేర ఉద్దేశ్యంతో జరిగినవిగా భావించనక్కరలేదు. అందువల్ల అవిశ్వాస తీర్మానం అనేది అసలు సమస్య కాదు. లేదా పార్లమెంటులో ఎవరు ఏమన్నారనేది, తీర్మానంపై ఓటింగు జరిగిన రోజున ఎటువైపు ఓటు వేశారన్నది ముఖ్యం కాదు. ఇక్కడ మొత్తం సమస్య పార్లమెంటు సభ్యులకు ఇవ్వజూపిన చట్టవ్యతిరేక లంచం, దానికి ముందు జరిగిన కుట్ర మాత్రమే.

ఆ కేసులో పి.వి. నరసింహారావు, బూటా సింగ్ మినహా మిగిలిన నిందితులందరినీ నిర్దోషులుగా నిర్ధారించి వారి మీద నేరారోపణలను కొట్టివేశారు. ఆ ఇద్దరి మీద నేరాలను నిర్ధారించారు గాని ఆ నేరాలు అంతకుముందు న్యాయస్థానం ప్రకటించిన నిర్దిష్ట అభియోగాలకు సంబంధించినవి కావు. అపరిచిత వ్యక్తులతో కలిసి కుట్రకు పాల్పడ్డారనే కొత్త నేరాన్ని వారి మీద నిర్ధారించారు. నిజానికి ఈ నేరం మొదట అభియోగ పత్రంలో లేదు. వారికి అందిన డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయో మూలాన్ని నిరూపించడంలో ప్రాసిక్యూషన్ విఫలమయిందని కూడా విజ్ఞుడయిన న్యాయమూర్తి అభిప్రాయపడ్డాడు. ఈ డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందో రుజువు చేయడమే ఈ కేసులో కీలకమయిన విషయం. నేరం చేసే లక్ష్యంతో డబ్బు సమీకరించడం గురించి ప్రాసిక్యూషన్ అభియోగం చేసింది. కాని ఆ అభియోగాన్ని రుజువు చేయలేకపోయింది. ఆ సందర్భంలో ప్రాసిక్యూషన్ కొరకు మరొక అభియోగాన్ని, మరొక కేసును తయారుచేయడం న్యాయస్థానం పనికాదు. అంతిమంగా ఆ న్యాయమూర్తి తీర్పు అంతా ఆ కేసులో అప్రూవర్ల (ప్రాసిక్యూషన్ పక్షానికి తిరిగిపోయిన నిందితులు) సాక్ష్యం మీదనే ఆధారపడింది. కాని న్యాయ శాస్త్రం ప్రకారం ఏ నేరనిర్ధారణ అయినా అప్రూవర్ల సాక్ష్యాల మీద, అప్రూవర్లుగా మారిన తర్వాత ఇచ్చే ప్రకటనల మీద ఆధారపడి చేయడం కుదరదు.

భారత సాక్ష్యాధారాల చట్టంలోని సెక్షన్ 10 ప్రకారం, ఇద్దరుగాని అంతకంటే ఎక్కువ మంది గాని చట్టవ్యతిరేక పద్ధతుల ద్వారా చట్టబద్ధమైన పనులను చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నారని నమ్మడానికి విశ్వసనీయమైన ఆధారాలుండాలి. అటువంటి ఆధారాలున్న తర్వాత ఆ ఒప్పందంలో పాల్గొన్న ఏ ఒక్కరయినా ఇతరులకు వ్యతిరేకంగా చెప్పే సాక్ష్యం చెల్లుతుంది. ఆ కుట్రపూరిత ఒప్పందంలో ఆ తర్వాత చేరేవారయినా

సరే ఆ కుట్రను ముందుకు తీసుకుపోయే క్రమంలో ఇతరులు అడిన మాటలకు, చేసిన పనులకు బాధ్యత వహించవలసిందే. ఇతరులు అడిన మాటలో, చేసిన పనిలో ఆ సహనిందితుడు భాగస్తుడు కావాలని ఏమీ లేదు.

కుట్ర ఆరోపణకు ఉన్న ఈ అస్పష్ట స్వభావాన్ని అరికట్టడానికి న్యాయస్థానాలు ఈ భారత సాక్ష్యాధారాల చట్టం సెక్షన్ 10ని నిర్వహించడానికి ప్రయత్నించాయి. ఒకరి సాక్ష్యాన్ని అంగీకరించాలంటే వారికి ఒప్పందంలో భాగం ఉన్నదని, అసలు ఒప్పందం ఉన్నదని రుజువు చేయవలసి ఉంటుంది. అలా రుజువు చేయలేకపోతే ఆ సాక్ష్యాన్ని ఆమోదించనక్కరలేదు. అట్లాగే అన్నమాట గాని, చేసిన పని గాని కుట్రను ముందుకు తీసుకుపోయేదిగా ఉండాలి. మాట్లాడిన మాటగాని, రాసిన రాతగాని ఒక చర్యతో కలగలిపి చేసిన ప్రకటనగా ఉండాలి. ఆ చర్య స్వభావాన్ని తెలిపేవిగా ఆ ప్రకటనలు ఉండాలి. లేదా కుట్ర అమలులో భాగంగా చేసిన చర్యలు గానో, మాట్లాడిన మాటలుగానో వాటంతట అవిగా కనబడాలి అందువల్ల కుట్ర అనేదాన్ని, లేదా కుట్రలో భాగమయిన మాటలను, రాతలను ఎట్లా పడితే అట్లాగాని, విశాలంగా గాని నిర్వహించడం కుదరదు. మాట్లాడిన మాటల, చేసిన పనుల ఉమ్మడి ఉద్దేశ్యానికి ఒక సమకాలీన స్వభావం ఉండాలి. ఉమ్మడి ఉద్దేశ్యం ముగిసిపోయిన తర్వాతనో, కుట్ర ముగిసిపోయిన తర్వాతనో మరొక మూడవ వ్యక్తితో చెప్పిన సంగతిగాని, చేసిన ప్రకటన గాని ఒక కుట్ర ఉండిందని చెప్పడానికి ఆమోదయోగ్యమైన రుజువు కాదు. న్యాయశాస్త్రం ప్రకారం ఉన్న స్థితి ఇది. ఈ న్యాయశాస్త్ర సూత్రం 1940లో మీర్జా అక్బర్ కేసులో ప్రీవీ కౌన్సిల్ ఇచ్చిన తీర్పులోనూ, 1988లో కేహార్ సింగ్ కేసులో, 1999లో నళిని కేసులో న్యాయమూర్తులు థామస్, వాధ్వాలు ఇచ్చిన తీర్పుల లోనూ స్థాపితమయింది.

పి.వి. నరసింహారావు కేసులో కుట్ర జరిగిందని చెప్పబడుతున్న 1993 అగస్టు గడిచిపోయిన తర్వాత చూపే ఏ పత్రాలయిన, ఏ ప్రకటనలయినా సాక్ష్యాధారాల చట్టం ప్రకారం ఆమోదయోగ్యంకావు. అక్కడ తీర్పు ఇచ్చిన విజ్ఞుడైన న్యాయమూర్తి ప్రాసిక్యూషన్ ప్రథమ సాక్షి ప్రకటనల మీద చాలా ఎక్కువగా ఆధారపడ్డారు. కాని ఆ ప్రకటనలన్నీ ఆ కుట్ర ముగిసిపోవడంతో నిరర్థకమైపోతాయి. పార్లమెంటులో అవిశ్వాస తీర్మానం వీగిపోయినపుడే ఆ కుట్ర ముగిసిపోయింది. లేదా న్యాయస్థానంలో ఆమోదించిన అభియోగ పత్రంలో ప్రస్తావించినట్టుగా అగస్టు 1993లోనే ఆ కుట్ర అంతమైపోయింది. ప్రాసిక్యూషన్ ప్రథమ సాక్షి అప్రూవర్‌గా క్షమాభిక్ష కోరి భారత నేర శిక్షాస్మృతి సెక్షన్ 164 కింద న్యాయస్థానంలో ప్రకటన చేస్తూ అవిశ్వాస తీర్మానం వీగిపోవడానికి దారితీసిన వాస్తవాలన్నిటినీ సంపూర్ణంగా వివరించాడు. ఆ ప్రకటనను పరిగణనలోకి తీసుకున్న తర్వాత ప్రత్యేక న్యాయమూర్తి 1997 ఏప్రిల్ 5న అతనికి క్షమాభిక్ష ప్రసాదించాడు. ఈ కారణం వల్ల భారత సాక్ష్యాధారాల చట్టం సెక్షన్ 10 ప్రకారం గత పరిణామాలను

వివరించిన ఆ అప్రూవర్ సాక్ష్యం ఆమోదయోగ్యం కాకూడదు. సెక్షన్ 10 విధించే ఈ పరిమితిని విజ్ఞుడైన న్యాయమూర్తి విస్మరించినట్లు స్పష్టంగా కనబడుతుంది.

ఈ కేసు విషయమై లేవనెత్తగలిగిన న్యాయపరమైన ప్రశ్నలన్నిటినీ ఇదివరకే లేవనెత్తడం జరిగింది. వాటన్నిటినీ సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఈ కేసును సమర్థవంతంగా వాదించడం జరిగింది. కుట్ర జరిగిందని అంగీకరించడానికి ప్రధాన సాక్ష్యాధారమైన ఒప్పందం కుదిరిందనే దాన్ని ప్రాసిక్యూషన్ రుజువుచేయలేకపోయింది. అట్లాగే ఈ ఒప్పందంలో పాల్గొన్న వాళ్లు అపరిచిత వ్యక్తులని న్యాయమూర్తి నిర్ధారించగా, అసలు ప్రాసిక్యూషన్ వాదన వేరేరకంగా ఉంది" అని నా అభిప్రాయం రాసి పంపాను.

ఇంతకూ చెప్పవచ్చిందేమంటే పార్లమెంటు భవనం అనే నిర్మాణం మీద దాడి జరగడానికి చాలా ముందే అసలు పార్లమెంటరీ క్రమం అనే దాన్ని లంచం ద్వారా మార్చడానికి పివి నరసింహారావు ప్రయత్నించారనే ఆరోపణ రావడమే ఆ నిర్మాణపు అసలు లక్ష్యం ధ్వంసమైపోయిందనడానికి సూచిక. ఆ నిర్మాణమేమో ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పడానికి ఏర్పడితే, దానిలోపలే ప్రజాస్వామ్యాన్ని కూలదోసే చర్యలు జరిగాయి. ఆ కేసులో నేను ఒక రకమైన న్యాయపరమైన అభిప్రాయాన్ని ఇచ్చిన మాట నిజమే. కాని ఆ అభిప్రాయం కేవలం న్యాయస్థానం ముందర ఉన్న సాక్ష్యాధారాల మీద ఆధారపడినది మాత్రమే. తాను ఎదుర్కొంటున్న సంక్షోభం నుంచి తనను గట్టెక్కించాలని ఆయన తన అనుచరులకు చెప్పి ఉండవచ్చు. కాని న్యాయస్థానం ముందుకు పోయినపుడు దాని అర్థం లంచాలు మేపమని ఆయన ఆదేశించాడని కాదు. అయితే నైతికంగా చూసినపుడు ఆయన ఆమోదించిన ఆ అనైతిక పద్ధతికి ఆయన బాధ్యత లేదని చెప్పలేము.

సరిగ్గా ఆ భవనం పైననే మిలిటెంట్లు దాడిచేశారు. దాడి చేసిన మిలిటెంట్లందరూ చంపివేయబడ్డారు. వారి సహచరులనే పేరుతో కొందరిని అరెస్టుచేసి విచారించారు.

ఆ కేసుకు సంబంధించిన మొత్తం వాస్తవాలను పరిశీలించే ముందు, అఫ్జల్ గురు కేసును వివరించాలని నాకు అనిపిస్తోంది. అఫ్జల్ గురుకు విధించిన ఘర్షణ శిక్షను సుప్రీంకోర్టు నిర్ధారించింది. పార్లమెంటు మీద దాడి అనే దుస్సంఘటనను గుర్తు చేసుకునే వాళ్లందరూ ఆయనను ఉరి తీయవలసిందే అని గగ్గోలు పెడుతున్నారు. క్రిమినల్ లాయర్స్ బార్ అసోసియేషన్ ఒక తీర్మానం చేసి ఈ కేసులో నిందితుల తరపున ఏ న్యాయవాది వాదించగూడదని కట్టడి చేసింది. కొంతమంది మానవ హక్కుల న్యాయవాదులు ఈ తీర్మానాన్ని ధిక్కరించి కేసులో నిందితుల తరపున వాదించడం మొదలు పెట్టారు. అలా వాదించడం మొదలు పెట్టిన న్యాయవాదులలో ప్రముఖులు నందితా హక్సర్, నిత్యా రామకృష్ణన్.

అపుడు న్యాయస్థానం కూడా వ్యతిరేక వైఖరిని తీసుకుంది. అసలు మొత్తం వాతావరణమే వ్యతిరేకంగా ఉండింది. ఈ కేసులో నిందితుల తరపున వాదిస్తున్న

న్యాయవాదుల మధ్య కూడా సమస్యలు ఉండడంవల్ల వాళ్లందరూ ఒక బృందంలాగ కూడా పనిచేయలేకపోయారు. ప్రాథమిక వాదనలు ముగిసి అభియోగపత్రాన్ని ఖరారు చేసే దశ వచ్చినపుడు పియుడిఆర్‌కు చెందిన గౌతమ్ నవ్లాఖా, న్యాయవాది నిత్యా రామకృష్ణన్ నేను ఆ కేసులో పాల్గొనాలనీ, నిందితుడు షౌకత్ గురు తరపున వాదించాలనీ కోరారు. నేను కింది విచారణ న్యాయస్థానంలో షౌకత్ గురు తరపున వాదించాను.

అయితే ఆ కేసులో నిందితుల తరపున వాదించిన న్యాయవాదులందరమూ ఒక బృందంలాగ వ్యవహరించలేదన్నది వాస్తవం. ప్రతి ఒక్క నిందితుడు, నిందితురాలు తన విముక్తి కోసం మాత్రమే ప్రయత్నించారు. నందితా హక్సర్ ప్రొఫెసర్ జిలానీ తరపున వాదించారు. తన కక్షిదారును ఇతర నిందితుల నుంచి వేరు చేసి వాదిస్తేనే ఆయనకు ఎక్కువ మేలు జరుగుతుందని ఆమె చాలా కచ్చితంగా నమ్మారు. బహుశా ఆ నమ్మకం ఆమె కక్షిదారు ప్రొఫెసర్ జిలానీ ఆదేశాల మేరకే ఏర్పడి ఉండవచ్చు. కాన్‌స్టిట్యూషనల్ క్లబ్‌లో ఒక సమావేశం జరిగి ప్రొఫెసర్ జిలానీ డిఫెన్స్ కమిటీ అనేది ఏర్పడింది. నన్ను కూడా ఆ కమిటీలో చేరమని అడిగారు. నేను అందులో చేరడానికి నిరాకరించాను.

అలా ఒక వ్యక్తి కోసం కమిటీ ఏర్పాటుచేయడం తప్పు అని నేను ఇప్పటికీ భావిస్తున్నాను. ఆ చర్య అటు కింద విచారణ న్యాయస్థానంలో గాని, ఇటు హైకోర్టులోగాని ఎటువంటి మేలు సాధించలేదు. దానివల్ల ఫలితం లేకపోగా, నిందితులందరి తరపునా ఒక ఉమ్మడి డిఫెన్స్ వాదన తయారు చేయడానికి అది ప్రతిబంధకమైపోయింది. ఈ మొత్తం క్రమంలో అఫ్జల్ ఒంటరివాడయిపోయాడు. తాము తమ కేసును ఉమ్మడిగా వాదించుకుంటే ఓడిపోతామని నిందితులు భయపడ్డారు. మా న్యాయవాదుల ప్రవర్తన, అత్యుత్సాహం వాళ్ల భయానికి ఆజ్యం పోసింది.

నాకు ఆ పరిస్థితి మొత్తం చాలా నిస్సహాయంగా అనిపించింది. నా క్రాస్ ఎగ్జామినేషన్ సమయంలో నేను చాలా గందరగోళానికి గురయ్యాను. ఆ సమయంలో నేను నా పరిధులు దాటి అఫ్జల్ ప్రయోజనాలను కాపాడడానికో, జిలానీ ప్రయోజనాలను కాపాడడానికో ప్రయత్నిస్తే ఎవరు ఎట్లా తీసుకుంటారోనని నాకు అనుమానం ఉండేది. న్యాయమూర్తి ధింగ్రా బహిరంగంగానే నిందితులకు వ్యతిరేక వైఖరిని తీసుకుని క్రాస్ ఎగ్జామినేషన్‌ను అడ్డుకోవడం ప్రారంభించాడు. నా మొత్తం న్యాయవాద జీవితంలో ఆ కేసు వాదన ఒక చేదు అనుభవంలాగ మిగిలిపోతుంది. ఆ కేసు తర్వాత ధింగ్రాకు హైకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి ఇచ్చినట్టున్నారు.

మన సమాజం వంటి బహుళత్వం ఉన్న సమాజంలో అన్ని రకాలుగానూ సమానత్వం ఆశయాలు ఉన్న న్యాయమూర్తులు ఉండవలసి ఉంటుంది. 1984 సిక్కుల మారణకాండ, 1992 డిసెంబరులో బాబ్రీ మసీదు విధ్వంసానంతరం ముంబాయిలో జరిగిన

హత్యాకాండ, కోయంబత్తూరు పేలుళ్ల తర్వాత జరిగిన హత్యాకాండ, గుజరాత్ మారణకాండ వంటి సందర్భాలు చూసిన తర్వాత మన వంటి బహుళత్వం ఉన్న సమాజాలలో న్యాయ పాలన పాక్షిక, సంకుచిత దృక్పథం ఉన్నవారు ఈ స్థితిలో ఉండగూడదనీ, మొత్తంగానే మన నియామకాల పద్ధతి విభిన్నంగా ఉండక తప్పదనీ అనిపిస్తుంది. మన న్యాయ విచారణ వేదికల మీద ధింగ్రా లాంటి వ్యక్తులకు అసలు స్థానం ఉండగూడదు. బహుళత్వం ఉన్న సమాజంలో తలెత్తే సమస్యలను పరిష్కరించడానికి శక్తిలేని న్యాయవ్యవస్థ ఉన్న ఫలితమే ఇవాళ అఫ్జల్ గురు ఎదుర్కొంటున్న పరిస్థితి.

పోటా చట్టం కింద నియామకమైన ప్రత్యేక న్యాయమూర్తి ముందర అఫ్జల్ గురు, మరి ముగ్గురు నిందితులు పొందిన విచారణ క్రమాన్ని గనుక ఎవరయినా చిత్రీకరించినట్లయితే మన దేశంలో చట్టబద్ధ పాలన ఎంతగా పలచబారిపోయి, నీరుకారి ఉందో అర్థమవుతుంది. ఆ కేసు చాలా పెద్ద ఎత్తున ప్రచారమయిన వ్యవహారమయి పోయింది. పరిశోధక సంస్థలు నిందితులను పత్రికల, ప్రచార సాధనాల విలేకరుల ఉందు ప్రదర్శించాయి. అంటే నేరారోపణ అభియోగ పత్రం దాఖలు కాకముందే విచారణ జరిగిందన్నమాట. ఎటువంటి విచారణ జరగకముందే పత్రికల పతాక శీర్షికలు వాళ్లే నేరస్తులన్నట్టు గగ్గోలు పెట్టాయి. న్యాయశాస్త్రపరంగా నిష్పాక్షికంగా జరగవలసిన విచారణ, కేసు పూర్వాపరాలను, వాస్తవాలను ఎటువంటి రాగద్వేషాలు లేకుండా అర్థం చేసుకోవడం, నిందితులకు అనుకూలంగానూ వ్యతిరేకంగా పరిగణనలోకి తీసుకోవడం వంటి క్రమమంతా రద్దయిపోయింది.

ఆ కేసులో ప్రచార సాధనాలు చూపిన మితిమీరిన శ్రద్ధవల్ల ఆ కేసును న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా నడిపించే అవకాశం రద్దయిపోయింది. అటువంటి సందర్భంలో కేవలం చట్టం నిర్దేశించిన విధి విధానాలను కచ్చితంగా పాటించేలా చూసినా న్యాయం జరుగుతుందనే కనీస హామీ కనబడుతుందేమో అనిపించింది. పార్లమెంటు భవనం మీద జరిగిన దాడి సమాజంలో ఎంత వ్యతిరేకతను ఎంత పెద్ద ఎత్తున సృష్టించిందంటే మొట్టమొదట నిందితుల తరఫున వాదించడానికి న్యాయ వాదులెవరూ సిద్ధపడలేదు.

న్యాయస్థానం తనకు సహకరించే న్యాయవాదిగా అలమ్‌ను నియమించింది. ఆయన పాటియాలా హౌజ్ న్యాయస్థానంలో న్యాయవాదిగా పనిచేస్తుండేవాడు. న్యాయస్థానంలో ఉన్న కాగితాలను బట్టి ఆయనకు తన నియామకం గురించి 2001 జనవరి 10న సమాచారం అందించారు. కాని ఆయన తనకు ఇచ్చిన బాధ్యతకు ప్రతిస్పందించినట్టు లేదు. ఆ తర్వాత క్రిమినల్ కోర్టులలో పనిచేస్తుండే అనుభవజ్ఞురాలైన న్యాయవాది సీమా గులాటికి ఆ బాధ్యత అప్పగించారు. ఆమె తనకు న్యాయవాదిగా ఉండనవసరంలేదని అఫ్జల్ గురు ఒక దరఖాస్తు ఇచ్చాడు. ఆ లిఖిత దరఖాస్తులో ఆయన, తనకు న్యాయవాదిగా న్యాయస్థానం నియమించిన సీమా గులాటి తన దగ్గరికి వచ్చి తన మాటలు వినలేదేని,

అసలు ఆ కేసు గురించి తనతో చర్చించనే లేదని, అందువల్ల ఆమె తన తరపున వాదించజాలదని ప్రకటించాడు. అదే మాదిరిగా ఆమె కూడా తన న్యాయస్థానం నియమించిన బాధ్యతలు నెరవేర్చలేనని, ఆ కేసులోని మరొక నిందితుడయిన జీలాని కూడా తనను న్యాయవాదిగా నియమించుకున్నందున తనను అఫ్జల్ తరపు న్యాయవాదిగా తప్పించాలని కోరింది.

ఆమె స్థానంలో కొత్త, యువ న్యాయవాది నీరజ్ బన్సాల్‌ను న్యాయస్థానం తరపున అఫ్జల్ న్యాయవాదిగా 2002, జులై 1న నియమించారు. ఆ తర్వాత జులై 8న విచారణ ప్రారంభమైంది. ఆ రోజున అఫ్జల్ గురు న్యాయస్థానం ముందు తన న్యాయవాదుల గురించి ఒక దరఖాస్తు చేశాడు.

అందులో తనకు న్యాయస్థానం నియమించిన ప్రభుత్వ న్యాయవాదిపట్ల సంతృప్తి లేదని, అందువల్ల తనకు, న్యాయస్థానానికి సహకరించేందుకు, ఆ న్యాయస్థానం నుంచి న్యాయం పొందేందుకు ఒక సమర్థుడైన సీనియర్ న్యాయవాదిని నియమించాలనీ కోరారు. "ఈ న్యాయస్థానం నన్ను పరిగణిస్తున్న తీరు చూస్తే నాకు న్యాయం లభించదని అనిపిస్తున్నది" అంటూ, అందువల్ల తనకు అశోక్ అగర్వాల్, పండిట్ ఆర్ కె నసీమ్, ఆర్‌కె ధామ్, ఆర్‌ఎం తుఫేల్‌లలో ఎవరయినా ఒకరిని న్యాయవాదిగా నియమించవలసిందిగా కోరారు.

ఆ దరఖాస్తును పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం జులై 12న ఒక ఉత్తర్వు ఇచ్చింది. ఇరవై మంది ప్రాసిక్యూషన్ సాక్షుల సాక్ష్యాలు విన్న తర్వాత, నిందితుడు అఫ్జల్ గురు చేసిన ఫిర్యాదులు పరిశీలించిన తర్వాత విజ్ఞుడైన న్యాయమూర్తి ఇచ్చిన ఉత్తర్వు అది. "న్యాయస్థానం నియమించిన న్యాయవాది నీరజ్ బన్సాల్ తనకు ప్రాతినిధ్య వహించలేదని అఫ్జల్ అంటున్నాడు. అఫ్జల్ నలుగురు న్యాయవాదుల జాబితాను న్యాయస్థానం ముందు ఉంచి వారిలో ఎవరినో ఒకరిని తనకు న్యాయవాదిగా నియమించమని కోరాడు. వారు అశోక్ అగర్వాల్, ఆర్‌కె నసీమ్, ఆర్‌కె ధామ్, ఆర్‌ఎం తుఫేల్. ఈ న్యాయస్థానం తుఫేల్, నసీమ్‌లను ఈ విషయమై విచారించగా, వారిద్దరూ అఫ్జల్ గురు తరపున వాదించడానికి తమ అసమ్మతిని తెలియజేశారు. తన మీద కేసు మిగతా నిందితుల మీద కేసు కన్న పూర్తిగా భిన్నమైనదని అఫ్జల్ భావిస్తున్నాడు. అందువల్లనే తనకు ప్రత్యేకమైన న్యాయవాది ఉండాలని పట్టుపడుతున్నాడు. న్యాయస్థానంలో అఫ్జల్ ఉన్నప్పుడే తుఫేల్, నసీమ్ ఇద్దరూ ఉండడం తటస్థించింది. గనుక నిందితుని ముందరే వారిని నిందితుని తరపు న్యాయవాదిగా ఉండమని కోరడం జరిగింది. ఆ ఇద్దరూ తమ అశక్తతను వెలిబుచ్చారు. అశోక్ అగర్వాల్ ఈ కేసులో మరొక నిందితుడు తరపున బెయిల్ దరఖాస్తు విషయంలో వాదించి ఉన్నారు. కాని ఆ తర్వాత అయన ఈ కేసులో జోక్యం చేసుకోలేదు. ఒకవేళ నిందితుడు తనకు తన ఇష్టం వచ్చిన న్యాయవాది కావాలని

అనుకుంటే, ఆయనకు అందుకు స్వేచ్ఛ ఉంది. కాని ఆయన తన ఇష్టం వచ్చిన న్యాయవాదిని నియమించుకోకపోయి ఉంటే, న్యాయస్థానమే ఒక సహాయ న్యాయవాదిని నియమించాలని కోరి ఉంటే, అప్పుడిక అందుబాటులో ఉన్న జాబితాలోంచి ఎవరికి వీలయితే వారిని న్యాయస్థానమే నియమించవచ్చు. అలాగే సాక్షులను క్రాస్ ఎగ్జామిన్ చేయడానికి అఫ్జల్‌కు కూడా స్వేచ్ఛ ఉంటుంది. ఈ కేసు నుంచి తనను తప్పించమని నీరజ్ బన్సాల్ కోరారు. కాని ఆ విచారణలో తనకు సహకరించవలసిందిగా ఆయనను ఈ న్యాయస్థానం కోరుతోంది" అని న్యాయమూర్తి రాశాడు.

అఫ్జల్ తరపు కాకపోయినా, న్యాయస్థానానికి సహకరించే న్యాయవాది హూదా లోనైనా బన్సాల్ వాదించడం కుదరదు. కాని ఆ న్యాయమూర్తి చట్టబద్ధపాలన పట్ల తన అభిప్రాయం ప్రకారం ఈ తంతు జరిపి, తన చేతులు కడిగేసుకున్నాడు. దీని ఫలితంగా ఏమయిందంటే, ఆ కేసు విచారణ జరిగినంత కాలమూ అఫ్జల్ గురు తరపున అసలు న్యాయవాది లేకుండా పోయాడు. అంటే అఫ్జల్ ఎటువంటి రక్షణా లేకుండానే, ఆయన వైపు నుంచి సమర్థించే వాదనలు వినిపించకుండానే నేర నిర్ధారణకు, శిక్షకు గురయ్యాడన్నమాట. ఆయనకు తన మీద వచ్చిన అభియోగాలు ఎంత తీవ్రమైనవో తెలుసు. అందువల్లనే తన తరపున ఒక అనుభవజ్ఞుడైన సీనియర్ న్యాయవాది వాదించడం అవసరమని ఆయన అనుకున్నాడు. ఇద్దరు న్యాయవాదులేమో అంగీకరించలేదు. మిగతా ఇద్దరినీ ఎవరూ అడగనేలేదు. అఫ్జల్ తరపున వాదించే పని నుంచి యువ న్యాయవాది బన్సాల్‌ను తప్పించిన తర్వాత, ఇక అఫ్జల్‌కు ప్రాతినిధ్యం వహించేవాళ్లే లేకపోయారు.

మిగతా ముగ్గురు నిందితుల తరపున వాదించడానికి న్యాయవాదులు ఉన్నారన్న మాట నిజమే కాని వాళ్లకు అఫ్జల్ తరపున వాదించే అధికారం లేదు. న్యాయస్థానం ముందర ఉన్న పత్రాలు చూస్తే ఆ పనికి అఫ్జల్ వారిని అనుమతించలేదని తెలుస్తుంది. అటువంటి సందర్భంలో సాక్షుల క్రాస్ ఎగ్జామినేషన్ ఉమ్మడిగా, అందరికీ కలిపి వర్తిస్తుందని అనుకోవడంగాని, నిర్ధారించడం గాని అసాధ్యం. ఆ ప్రత్యేక న్యాయమూర్తి ముగ్గురు నిందితులకు మరణశిక్ష విధించి అదృష్టవశాత్తూ నాలుగో నిందితురాలైన షౌకత్ భార్యకు మాత్రం మరణశిక్ష విధించలేదు. ఆమె పొత్తిళ్ల పసికందు కూడా జైలులో గడపవలసివచ్చింది.

భారత నేర శిక్షాస్మృతి నిబంధనల ప్రకారం ఈ మరణశిక్షలను ఇద్దరు న్యాయమూర్తుల బెంచి ఖరారు చేయవలసి ఉంటుంది. ఆ ఖరారు ప్రక్రియ అప్పటికి నమోదు చేసిన సాక్ష్యాధారాలను చాలా వివరంగా పరిశీలించే పునర్విచారణలాంటిది. దానివల్ల న్యాయస్థానాలకు న్యాయం అందించడానికి అవకాశం వస్తుంది. కేసుకు సంబంధించిన ప్రతి ఒక్క అంశాన్నీ మరొకసారి పరిశీలనకు గురి చేయడానికి వీలు చిక్కుతుంది.

అఫ్జల్ తరపున సమర్పించిన తుది దరఖాస్తులో ఈ విషయాలు చాలా స్పష్టంగా బయటపడ్డాయి. నిందితులను చట్టం నిర్దేశించిన విధివిధానాల ప్రకారం మాత్రమే విచారించాలని అధికరణాలు 14, 21, 22, 39ఎ శాసిస్తున్నాయి. ఇక్కడ చట్టం నిర్దేశించిన విధి విధానాలు అంటే అర్థం ఏవో కొన్ని విధి విధానాలు అని కాదు. దాని అర్థం న్యాయసమ్మతమైన, సమంజసమైన విధి విధానాలు అని. న్యాయం అందుబాటులో ఉండడం అనేది దానిలో భాగమే. సాక్షులను క్రాస్ ఎగ్జామిన్ చేయడానికి, ప్రశ్నించడానికి అఫ్జల్‌కు న్యాయస్థానం ఇచ్చిన అవకాశం అర్థంలేని అధికారంగా మారిపోయింది. ఎందువల్లనంటే ఎవరయినా ఆ అధికారాన్ని వాడుకోవాలంటే భారత సాక్ష్యాధారాల చట్టం గురించీ, భారత నేరశిక్షాస్మృతి గురించీ సమగ్రమైన అవగాహన ఉండవలసి ఉంటుంది. రాజ్యాంగ బాధ్యతను నెరవేర్చకుండా అటువంటి అధికారాన్ని న్యాయస్థానం అఫ్జల్‌కు ఇచ్చిందంటే తనను తాను సమర్థించుకోవడానికి అతనికి ఉన్న రాజ్యాంగబద్ధమైన హక్కును నిరాకరించినట్టే.

ఈ విషయాలను ఈ కేసులో హైకోర్టు తన తీర్పులో ప్రస్తావించింది. నిందితుడు అఫ్జల్ తన విచారణ క్రమంలో భాగంగా ఎనభై మంది సాక్షులను విచారించాడనీ, “మహమ్మద్ అఫ్జల్ ఎటువంటి అభ్యంతరంగానీ, ఫిర్యాదుగాని లేకుండా తన విచారణను కొనసాగించాడు'” అనీ హైకోర్టు తీర్పు ప్రకటించింది. కాని కింది న్యాయస్థానం విచారణ క్రమాన్ని పరిశీలిస్తే ఈ నిర్ధారణ ఎంత అబద్ధమో తేలుతుంది. తన తరపున ఒక న్యాయవాదిని నియమించమని అఫ్జల్ న్యాయస్థానాన్ని అనేకసార్లు వేడుకున్నాడు. కాని న్యాయస్థానం విచారణ సమయంలో అఫ్జల్‌కు ఆ అవకాశం ఇవ్వలేదు. నీకు ఇష్టం ఉన్నా లేకపోయినా మేం నియమించిన న్యాయవాదిని ఒప్పుకో లేదా సాక్షులను నువ్వే విచారించుకో అని న్యాయస్థానం నిందితుడికి చెప్పింది. ఆ కేసు ఎంత తీవ్రమైనదో అందరికీ తెలుసు. అటువంటప్పుడు కింది ప్రత్యేక న్యాయస్థానం స్థాయిలోనూ, పైన హైకోర్టు స్థాయిలోనూ ఆ కేసుతో ఈ మాదిరిగా వ్యవహరించడం చాలా అనుచితం. ఈ అనుచిత వ్యవహారం గురించి సుప్రీంకోర్టులో ప్రస్తావనకే రాలేదు. అపై స్థాయిలో న్యాయవాది తాను ఇంత తప్పుడు కేసును చేపట్టవలసి వచ్చినందుకు, సాంకేతికమైన అభ్యంతరాలు లేవనెత్తుతున్నందుకు చాలా క్షమాపణలు చెప్పాడు. అసలు ఏమిచెప్పినా ఏమి చేసినా చివరికి ఒక వ్యక్తిని సమర్థిస్తూ చేసే వాదన ఏదయినా సాంకేతికమైనదే అవుతుందని మరిచిపోయినట్టున్నాడు.

ఒకరికి తమ తరపున వాదించే న్యాయవాదిని ఏర్పాటుచేసుకునే హక్కును నిరాకరించినప్పుడు ఆ పనిని సమర్థతతో, సరైన వాదనతో చేయాలి. ప్రత్యేక న్యాయమూర్తి అఫ్జల్‌కు ఒక సరైన న్యాయవాదిని' ఏర్పాటు చేయలేకపోవడానికి చెప్పిన కారణం న్యాయస్థానం దగ్గర ఒక న్యాయవాదుల జాబితా ఉంటుందని, తాను ఆ జాబితాను

దాటి పోలేనని మాత్రమే. కాని న్యాయవాదులు అందుబాటులో లేకపోవడం అనేది సమస్య కాదు. అందుబాటులో ఉన్న న్యాయవాదులు కూడా అఫ్జల్ తరపున వాదించడానికి సిద్ధపడలేదన్నది సమస్య. న్యాయవాదులు లభించకపోవడం, వాదించడానికి అసమ్మతి తెలపడం రెండూ వేరు వేరు విషయాలు. వాటిలో రెండవది కచ్చితంగా చట్టం ఎదుట సమాన అవకాశాలు అనే సూత్రాన్ని ఉల్లంఘించడమే. అంటే న్యాయం అందుబాటులో ఉంచడానికి నిరాకరించడమే. ఇక హైకోర్టు తీసుకున్న వైఖరి ఎంత మాత్రమూ సమర్థనీయం కాదు. ఒక న్యాయవాదిచేత సమర్థన పొందడానికి ప్రతివ్యక్తికి ఉండే హక్కు కేవలం రాజ్యాంగం ఆమోదించిన ప్రాథమిక హక్కు మాత్రమే కాదు. అది అంతర్జాతీయ పౌర, రాజకీయ హక్కుల ప్రకటన కూడా హామీ ఇచ్చిన హక్కు. ఆ ప్రకటనను భారత ప్రభుత్వం అంగీకరించింది. అంతేకాదు దాన్ని 1993 మానవహక్కుల పరిరక్షణ చట్టం ద్వారా గుర్తించింది. దానిలో అధికరణం 8 ప్రకారం ప్రతి వ్యక్తికీ రాజ్యాంగం గాని, చట్టంగాని ఇచ్చిన ప్రాథమిక హక్కులు సమర్థవంతంగా అమలయ్యేల చూసుకునే హక్కు కూడా ఉంది. ప్రతి నిందితుడికీ తమ సమక్షంలోనే విచారణకు గురయ్యే హక్కును, సమర్థుడైన న్యాయవాదిచేత వాదనలు చేయించుకునే హక్కును అధికరణం 14 సి గుర్తించింది. ఈ అంతర్జాతీయ ప్రకటనలోని అధికరణాలు మన రాజ్యాంగంలోని అధికరణం 14, 21, 22, 39ఎలతో కలిపి చదవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. వీటిలో అధికరణం 14 చట్టం ఎదుట సమానత్వాన్ని, చట్టాల నుంచి సమానమైన రక్షణను హామీ ఇస్తుంది. అధికరణం 21 చట్టం ద్వారా స్థాపితమైన విధివిధానాల ద్వారా మాత్రమే విచారణకు గురయ్యే హామీని ఇస్తుంది. నిర్బంధంలోకి పోయిన క్షణం నుంచీ, విచారణ క్రమం పూర్తయ్యే వరకూ న్యాయవాది తోడ్పాటు హక్కును అధికరణం 22 గుర్తిస్తుంది. అధికరణం 39ఎ సమాన న్యాయాన్ని, ఉచిత న్యాయ సహాయాన్ని హామీ ఇస్తుంది. అధికరణం 39ఎ అనేది, అధికరణం 21కి వ్యాఖ్యానం వంటిదని కూడా సుప్రీంకోర్టు చెప్పింది. ఈ అధికరణాలపట్ల న్యాయస్థానాలు నిర్లక్ష్యంగా ఉండజాలవని సుప్రీంకోర్టు ప్రకటించింది.

రేమండ్ వర్సస్ హోష్లిన్ అనే కేసులో అమెరికా సుప్రీంకోర్టు న్యాయమూర్తి డగ్లస్ ఇచ్చిన తీర్పును మన సుప్రీంకోర్టు ఉటంకించింది. ఒక నిందితుడికి న్యాయవాది ద్వారా తన వాదనలు వినిపించే హక్కు ఇవ్వకపోతే, అసలు తన వాదనలు వినిపించే హక్కు ఇచ్చినట్టే కాదని సుప్రీంకోర్టు అన్నది. ఒక్కోసారి చాలా తెలివైన, విద్యావంతుడైన సాధారణ పౌరుడికి కూడా న్యాయశాస్త్ర నైపుణ్యం ఉండదు. అతని మీద ఒక నేరారోపణ జరిగితే సాధారణంగా ఆ ఆరోపణను ఎట్లా ఎదుర్కోవాలో, తన తరపున వాదనలు ఎట్లా పెట్టాలో తెలియదు. సాక్ష్యాధారాలను ఎట్లా సమర్పించాలో తెలియదు. అందువల్ల ఒక న్యాయవాది సహాయం లేకుండా అతను ఆ ఆరోపణలను ఎదుర్కోవలసి వస్తే విచారణ సక్రమంగా

జరగదు. సరైన సాక్ష్యాధారాలు లేకపోవడంవల్ల ఆ నేరాలు నిర్ధారణ కూడా అవుతాయి. శిక్షలు కూడా పడతాయి. అంటే ఆ నిందితుడు తనను తాను సమర్థించుకునే వాదనలు వినిపించుకోవడానికి తగిన శిక్షణ, నైపుణ్యం, సౌకర్యాలు లేనందువల్ల మాత్రమే శిక్షకు గురవుతాడు. అందువల్ల అటువంటి నిందితులకు విచారణ క్రమంలో సహాయం అందించే న్యాయవాది అవసరం ఉంటుంది. తెలివైన వారి విషయంలోనే పరిస్థితి ఇలా ఉన్నప్పుడు అజ్ఞానంలో ఉన్నవారు, నిరక్షరాస్యులైనవారు, మందకొడి మనుషుల విషయంలో న్యాయస్థానాలు ఎలా పనిచేస్తాయి?

సుప్రీంకోర్టు ఈ అమెరికన్ న్యాయస్థానం తీర్పు ఉటంకింపు అంతా చేసిందిగాని ఆ తర్వాత దాని మీద చర్చ ఏమీ లేదు. ఈ ప్రత్యేక కేసుకు ఆ వ్యవహారం నుంచి అన్వయించదగిన విషయాలు ఏమీ లేవు. ఒక నిందితుడికి న్యాయవాదిని పెట్టుకునే హక్కు గురించి ఈ విషయం ఉటంకించి, ఆ తర్వాత ఆ పనిని నిర్వహించడంలో న్యాయవాదికి ఉండే కష్టాల గురించి మాట్లాడడం మొదలుపెట్టారు. నిందితుడికి న్యాయవాదిని ఏర్పాటుచేయడంలో న్యాయస్థానానికి ఉన్న బాధ్యత గురించి యాంత్రికంగా మాట్లాడిన సుప్రీంకోర్టు ఆ బాధ్యతను ఈ కేసులో కింది న్యాయస్థానం సరిగా నిర్వహించినా లేదా అనే విషయంలో సంతృప్తి ప్రకటించి ఆ వ్యవహారం ముగించేసింది.

ఇంతకూ నిందితులకు సరైన విచారణ లేకుండానే మరణశిక్ష విధించినందుకుగాను ఆ కింది కోర్టు న్యాయమూర్తికి హైకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి దొరికింది. సాక్షులను క్రాస్ ఎగ్జామిన్ చేసేందుకు అఫ్జల్ గురును అనుమతించడమే రాజ్యాంగం అధికరణాలు 21, 22, 39ఎలను పాటించడమని, అంతర్జాతీయ ఒడంబడికలను గౌరవించడమని అనుకుంటే చాలా అన్యాయం. చాలా పొరపాటు.

గత శతాబ్దపు డెబ్బైల దశకంలో చాలా మంది మేధావులనూ ఆలోచనాపరుల బృందాలనూ ఆకర్షించిన, పెద్ద ఎత్తున చర్చ జరిగిన విషయం ఒకటి ఉంది. అది మన రాజ్యాంగానికీ, పాలనకూ చట్టబద్ధపాలన అనే సూత్రం మార్గదర్శకంగా ఉండాలనేది. కాని ఆ చర్చ జరిగి రెండు దశాబ్దాలు తిరగకుండానే మన దేశంలో చట్టబద్ధ పాలన అనేది అంతకు ముందెన్నడూ లేనివిధంగా దెబ్బతినిపోయింది. నిజం చెప్పాలంటే చట్టబద్ధపాలన 1975 ఎమర్జెన్సీ చీకటి రోజులలో కూడా ఇంత ఘోరంగా దెబ్బతిని పోలేదు. రాజకీయ రాగద్వేషాలు న్యాయశాస్త్ర సూత్రాలుగా ముసుగు కప్పుకుని తిరుగుతున్నాయి. మత విద్వేష పూరితమైన అభిప్రాయాలు న్యాయవ్యవస్థలో విధాన నిర్ణయ క్రమాలను ఆక్రమించుకుని అదే న్యాయ వ్యవస్థ క్రియాశీలత అని పేరు పెట్టుకున్నాయి.

1984 మారణ కాండలో చనిపోయిన సిక్కులకు న్యాయం అందించడంలో వైఫల్యం, 1992లో ముంబైలో జరిగిన కల్లోలాలలో మెజారిటీ మతోన్మాదులు సాగించిన దారుణ

నేరాలపై శ్రీ కృష్ణ కమిషన్ నియమించబడినప్పటికీ ఆ నేరాల పట్ల చూపిన నిర్లక్ష్యం. అదే సమయంలో ఆ కల్లోలాల కొనసాగింపుగా ముంబాయి పేలుళ్లలో మైనారిటీలు సాగించిన నేరాల పట్ల చట్టబద్ధ పాలన చూపిన శ్రద్ధాశక్తులు, కోయంబత్తూరులో జరిగిన కల్లోలాలలో కోట్లాది రూపాయల ఆస్తి ధ్వంసం కావడం, కొన్ని డజన్ల ముస్లింలు ఊచకోతకు గురికావడం, దానికి ప్రతిగా కొన్ని రోజులలోనే కోయంబత్తూరులో బాంబుదాడులు, ఆ దాడులకు బాధ్యులనే పేరుమీద నూట డెబ్బై ఐదు మంది నిందితులను అరెస్టు చేసి, విచారణ లేకుండానే ఒక దశాబ్దంపాటు నిర్బంధించి ఉంచడం, గుజరాత్ దారుణ మారణకాండ, దానిపై ఎటువంటి జవాబుదారీతనం లేకపోవడం, బెస్ట్ బేకరీ కేసు, ముగిసిపోయిన విచారణను మళ్లీ మొదలు పెట్టడం – ఈ పనులన్నీ మన దేశంలో నేర న్యాయవ్యవస్థ ప్రధాన వైఫల్యాలకు సూచికలుగా ఉన్నాయి. ఈ అన్ని సందర్భాలలోనూ చట్టబద్ధ పాలన సంపూర్ణంగా అమలుకాలేదు. అరకొరగా, అప్పుడప్పుడు అమలు చేస్తూ, అప్పుడప్పుడు అమలు చేయకుండా ఉంటూ సాగింది.

అదే సమయంలో కేహార్‌సింగ్ మరణశిక్ష విషయంలోనూ, అఫ్జల్ గురు మరణశిక్ష విషయంలోనూ పాక్షిక న్యాయాన్ని చాలా కచ్చితంగా అమలు జరపడం కనబడుతుంది. అవతలి వారిని చూసి భయపడే రాజ్యాంగ యంత్రం చట్టబద్ధ పాలనను ఎలా అమలు చేస్తుందో చూపే ఉదాహరణలివి. వీరిలో ఒకరేమో సారాంశంలో అన్యాయానికి గురయి మరణశిక్షకు బలి అయ్యారు. మరొకరు విచారణ పరమైన అన్యాయానికి గురయి మరణ శిక్ష పొందారు.

రాజకీయ న్యాయం అందించడంలో న్యాయస్థానాలు ఎప్పుడైనా ఎక్కడైనా పొరపాటు చేస్తే, సర్వసత్తాక ప్రజాస్వామిక గణతంత్ర అధ్యక్షుడిగా రాష్ట్రపతి జోక్యం చేసుకోవచ్చును. ఆ తీర్పును సవరించి ప్రజాస్వామ్యాన్ని కాపాడవచ్చును.

ఈ కేసు వాస్తవాలన్నిటినీ ఇక్కడ ఎందుకు వివరిస్తున్నానంటే మనం ఆ నిందితులను ముస్లింలుగానో, తీవ్రవాదులుగానో ఖండించి ఊరుకోగూడదు. ప్రజాస్వామ్యంలో ఒక తెలివైన భాగస్వాములుగా పాల్గొని విషయాలన్నిటినీ సరిగా అర్థం చేసుకోవడానికి వీలుగా ఈ సమాచారం పని చేస్తుంది.

నిందితులందరి మీదా కలిసి న్యాయస్థానం పదహారు అభియోగాలు ఖరారు చేసింది. ఇందులో ఆరు కుట్ర నేరాలు. 1. పరారీలో ఉన్న నిందితులతో, లేదా చనిపోయిన తీవ్రవాదులతో కలిసి భారత పార్లమెంటు మీద దాడి చేయడానికి, ప్రధానమంత్రితో సహా పార్లమెంటు సభ్యులను బందీలుగా పట్టుకోవడానికో, చంపడానికో ఆయుధాలు మందుగుండు సామాగ్రి సేకరించడానికి కుట్ర చేశారనే అభియోగం. 2. భారత ప్రభుత్వం మీద యుద్ధం చేయడానికి, లేదా ప్రభుత్వాన్ని భయపెట్టడానికి నేరపూరిత బలప్రయోగం చేయడానికి పరారీలో ఉన్న నిందితులతో, చనిపోయిన తీవ్రవాదులతో కలిసి కుట్ర

చేశారనే అభియోగం. 3. భారతదేశానికి చెందిన వ్యక్తులకు, ఆస్తులకు నష్టం కలిగించే ఉద్దేశ్యంతో ఉన్న నిందితులతో, చనిపోయని తీవ్రవాదులతో కలిసి కుట్రచేశారనే అభియోగం. ఆ పేలుడు పదార్థాలలో కొన్ని దర్యాప్తు క్రమంలో లభించాయి. కొన్ని చనిపోయిన తీవ్రవాదుల సంచులలో దొరికాయి. ఆ ఉద్దేశ్యంతోనే వాటిలో కొన్నిటిని పార్లమెంటు భవనంలోకి దూసుకువచ్చిన అంబాసిడర్ కారుకు కూడ కట్టారు. 4. తీవ్రవాద చర్యలు చేయడానికి, లేదా ఆ చర్యలకు మార్గం సుగమం చేయడానికి కుట్ర చేయడం, జైష్ ఏ మహమ్మద్‌కు చెందిన తీవ్రవాదులను స్వచ్ఛందంగా దాచి ఉంచడానికి, రక్షణ ఇవ్వడానికి కుట్ర చేయడం. 5. సామూహిక జనహననానికి దారితీయగల ఆయుధాలు, మందుగుండు సామాగ్రి, పేలుడు పదార్థాలు, మారణాయుధాలు, రసాయనిక పదార్థాలు పోగు చేయడానికి, పార్లమెంటు భవనం మీద ప్రయోగించడానికి కుట్ర చేయడం. 6. పేలుడు పదార్థాల చట్టంలోని నిబంధనలకు వ్యతిరేకంగా పరారీలో ఉన్న నిందితులతోనూ చనిపోయిన తీవ్రవాదులతోనూ కలిసి కుట్ర చేయడం.

ఈ కుట్ర అభియోగాల గురించి కాస్త లోతుగా, వివరంగా చర్చించవలసి ఉంది. కుట్ర అనే అభియోగాన్ని నిరూపించాలంటే అందుకు ఉద్దేశ్యాన్ని, ఒక ఒప్పందాన్ని కూడా నిరూపించవలసి ఉంటుంది. చాలా నేరాల విషయంలోలాగానే, కుట్ర అనే నేరానికి ఒక ఆచరణ, చర్య ఉండాలి. దానితోపాటు ఒక మానసిక స్థితి కూడా ఉండాలి. ఒప్పందం అనేది చర్యగా భావించబడుతుంది. ఆ ఒప్పందం ద్వారా ఒక చట్ట వ్యతిరేకమైన లక్ష్యాన్ని సాధించడమే మానసిక స్థితి అని ఫిరోజుద్దీన్ బషీరుద్దన్ వర్సస్ స్టేట్ ఆఫ్ కేరళ కేసులో సుప్రీంకోర్టు 2001లో అభిప్రాయ పడింది. అదే సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వాధ్వా 1999లో స్టేట్ వర్సస్ నళిని కేసులో కుట్ర నిరూపణ గురించి చాలా వివరమైన చర్చ చేశారు. 'నేర స్వభావం గల కుట్ర అనే నేరం ఒక నేరాన్ని చేయడానికి గల ఉద్దేశ్యాన్ని, అదే ఉద్దేశ్యంగాగల వ్యక్తులతో చేయి కలపడాన్ని సూచిస్తుంది. అది కేవలం ఉద్దేశ్యం మాత్రమే కాదు, ఆ ఉద్దేశ్యపు లక్ష్యాన్ని సాధించడానికి ఒక ఒప్పందం జరిగిందని కూడా నిర్ధారణ కావాలి. ఒక కేసులో పరిశీలించవలసిన అంశమేమంటే, నిందితులందరూ ఆ ఉద్దేశ్యాన్ని కలిగి ఉన్నారా, వారందరూ ఆ నేరం చేయవలసిందేనని ఒప్పందానికి వచ్చారా అనేది. నిందితులలో కొందరు మాత్రమే ఒక నేరం, అది ఎంత ఘోరమైన నేరమైనా సరే, చేయాలని కోరుకున్నప్పుడు, కుట్ర నేరం ఆరోపించడానికి సరిపోదు' అని జస్టిస్ వాధ్వా అన్నారు

ఆ తర్వాత కుట్ర ఆరోపణను రుజువు చేయగల ఇతర అంశాల గురించి కూడా ఆయన చర్చించారు. ఒకసారి ఒక కుట్ర లక్ష్యం నెరవేరిన తర్వాత జరిగే ఏ చర్య అయినా అది చట్ట వ్యతిరేకమయినదయినప్పటికీ, నిందితులను ఆ కుట్రలో భాగం చేయజాలదు. ఉదాహరణకు ఒక పరారీలో ఉన్న నిందితుడికి ఆశ్రయం ఇవ్వడం

లాంటిది. కుట్రదారులు ఒక వరుసలో ఆ కుట్రలో ప్రవేశించవచ్చు. ఏ అనే వ్యక్తి బి అనే వ్యక్తిని ఆ కుట్రలో భాగం చేయవచ్చు. బి అనే వ్యక్తి సి అనే వ్యక్తిని భాగం చేయవచ్చు. అలా ఆ వరుస సాగిపోవచ్చు. కాని వారందరి మధ్య పరస్పర ప్రయోజనం ఉండాలి. ఆ తర్వాత ఆ విజ్ఞుడైన న్యాయ మూర్తి ఒక జాగ్రత్త కూడా చెప్పారు. ప్రస్తుత సందర్భంలో ఆ జాగ్రత్తను చాలా గుర్తు చేసుకోవలసి ఉంది.

'ఒక కుట్ర ఆరోపణ నిందితుల మీద ఒక అన్యాయానికి దారి తీస్తుంది. ఏమంటే అది వారందరినీ ఒక ఉమ్మడి విచారణ కిందికి తీసుకువస్తుంది. న్యాయస్థానం మొత్తం సాక్ష్యాన్ని ప్రతి నిందితుడికి వ్యతిరేకంగానే ఉన్నట్టుగా భావిస్తుంది. ఆ నిందితులలో ప్రతి ఒక్కరి మీద సాక్ష్యాధారాలున్నాయని, ప్రతి ఒక్కరికీ కుట్ర లక్ష్యం తెలుసుననీ, ఒప్పందం ఉందనీ ప్రాసిక్యూషన్ రుజువు చేయడానికి ప్రయత్నించవలసి వస్తుంది. ఆ కుట్ర నేరాన్ని ఖరారు చేసేటపుడు న్యాయస్థానం ఏ ఒక్క నిందితుడి పట్లా అన్యాయంగా ఉండకుండా చాలా జాగ్రత్త వహించవలసి వస్తుంది. వారిలో కొందరికి వ్యతిరేకంగా చూపిన సాక్ష్యాధారాలవల్ల అందరిమీద అభియోగాలను ఖరారు చేయవలసిరావచ్చు. కాని దాన్ని అధిగమించవలసి ఉంటుంది. మామూలు నేర విచారణలలో ఆమోదించదానికి వీలులేని సాక్ష్యాధారాల సహాయంతో కుట్ర అభియోగాన్ని రుజువు చేయడానికి, నిందితులను ఆ కుట్రలో భాగస్వాములను చేయడానికి, అందరూ ఆ నేరం చేశారని చూపడానికి ప్రాసిక్యూషన్ ప్రయత్నిస్తుంది. ఒక కుట్రలో ప్రతి ఒక్క సభ్యుడికి వాస్తవంగా ఎంత భాగం ఉన్నదో రుజువు చేయడం అసాధ్యం. అలా నేరం ఖరారు చేయాలంటే కచ్చితమైన, నిర్దిష్టమైన సాక్ష్యాధారాలు ఉండాలి. 'ప్రధాన నిందితులతో ఎటువంటి సంబంధం ఉన్న వారినయినా కుట్ర అనే పెద్ద వలలో ఇరికించడం ప్రాసిక్యూటర్లకు అలవాటయిపోయిన ఈ రోజుల్లో ఈ తేడా గుర్తించడం చాలా ముఖ్యం' అని జస్టిస్ లర్నెడ్ హాండ్ అన్నారు అని వాధ్వా రాశారు.

సరిగ్గా జస్టిస్ వాధ్వా రాసినట్టే ఈ పార్లమెంటుపై దాడి కేసులో కూడా కుట్ర జరిగిందనే అభియోగంపై నిందితులందరినీ మూకుమ్మడిగా ఇరికించడం జరిగింది. ప్రధాన నిందితులతో ఒక మేరకు సంబంధం ఉన్న వాళ్లందరినీ కలగలిపి ఒకే పెద్ద వలలో ఇరికించడం జరిగింది.

నిందితులు చనిపోయిన తీవ్రవాదులతో, పారిపోయిన నిందితులతో కలిసి పార్లమెంటు భవన ప్రాంగణంలో మహిళా కానిస్టేబుల్ కమలేష్‌ను చంపేశారని ఒక అభియోగం చెపుతుంది. అదే సమయంలో, అదే స్థలంలో ఆ నిందితులే తుపాకీ తూటాలతో, పేలుడు పదార్థాలతో అసిస్టెంటు సబిన్‌స్పెక్టర్ జీత్ రామ్‌ను గాయపరిచారని మరొక అభియోగం చెబుతుంది. ఆ నిందితులు పేలుడు పదార్థాలను ఉపయోగించి పేలుడు జరపారని మరొక అభియోగం చెబుతుంది. భారతదేశ ఐక్యతను, సమగ్రతను,

భద్రతను, సార్వభౌమత్వాన్ని భంగపరిచే ఉద్దేశ్యంతో ఆ నిందితులు పార్లమెంటు భవనం ప్రాంగణంలో బాంబులు, ఇతర పేలుడు పదార్థాలు, తుపాకులు, మారణాయుధాలు ఉపయోగించారని, అంటే తీవ్రవాద కార్యకలాపాల నిరోధ చట్టం (పోటా) లోని సెక్షన్ 3 (ఎ) కింద నేరానికి పాల్పడ్డారని మరొక అభియోగం అంటుంది. అదే తేదీన, అదే సమయంలో, అదే స్థలంలో మహిళా కానిస్టేబుల్ కమలేష్‌ను చంపడం అనే తీవ్రవాద చర్యకు పాల్పడడం ద్వారా అదే చట్టంలోని సెక్షన్ 3(2) కింద కూడా నేరం చేశారని మరొక అభియోగం చెపుతుంది.

విచారణకు గురయిన నిందితులలో ఏ ఒక్కరయినా ఈ నేరాలలో ప్రత్యక్షంగా పాల్గొన్నారని చెప్పేందుకు వీసమెత్తు సాక్ష్యాధారమైనా లేదు. అటువంటి సాక్ష్యాధారాలులేవన్న సంగతి ప్రాసిక్యూషన్‌కు చాలా స్పష్టంగా తెలుసు. నిజంగా దాడిలో పాల్గొన్న వాళ్లందరూ చనిపోయారు. చంపేయబడ్డారు. ఆ చనిపోయినవారితో కలిసి కుట్ర చేశారని చెపుతూ, విచారణ ఎదుర్కొన్న నిందితుల మీద పైన చెప్పిన ఈ విడివిడి అభియోగాలన్నిటినీ మోపారు. పార్లమెంటు భవన ప్రాంగణంలో 2001 డిసెంబరు 13న జరిగిన హింసాత్మక చర్యలతో విచారణ ఎదుర్కొన్న నిందితులకు ప్రత్యక్షమైన, స్పష్టమైన సంబంధం ఉన్నదని రుజువు చేయాలని ప్రాసిక్యూషన్ ఏ సందర్భంలోనూ ఎటువంటి ప్రయత్నమూ చేయలేదు. నిందితులకు అభియోగ పత్రంలోని నేరాలతో ప్రత్యక్ష సంబంధం ఉన్నదని చూపడానికి దర్యాప్తు అధికారి ఎటువంటి ప్రయత్నమూ చేయలేదు. అయినా ఆ అభియోగాలను ఉద్దేశ్యపూర్వకంగా అభియోగ పత్రంలో ప్రవేశపెట్టారు. న్యాయస్థానం ఆ అభియోగాల మీద ఆధారపడి వారు చేసిన నేరాలను నిర్ధారించి విచారణ ప్రారంభించింది.

తాను చేస్తున్న అభియోగాలను రుజువు చేయగల సాక్ష్యాధారాలు ఏమీ లేవని దర్యాప్తు అధికారికి స్పష్టంగా తెలిసినప్పటికీ తన నిరాధారమైన ఆరోపణలను ఆ విధంగా అభియోగ పత్రంలో ప్రవేశపెట్టడం న్యాయ వ్యవస్థ అధికారాన్ని దుర్వినియోగం చేయడమే. అంటే దురుద్దేశ్యపూరితమైన ప్రాసిక్యూషన్ నడపడమే. నిందితులు ఎవరయినా ప్రాసిక్యూషన్ వారి మీద ఏ అభియోగాలను ఆరోపిస్తే ఆ అభియోగాలమీద విచారణను ఎదుర్కోవలసిందే అనే మాటకు ఎదురులేదు. అట్లాగే ఆ అభియోగాలు ఏమిటో స్పష్టంగా పేర్కొన్నంతవరకూ అందులో అన్యాయం కూడా ఏమీలేదు. కాని చాలా అభియోగాలను, అందులోనూ తీవ్రమైన అభియోగాలను ఎవరిమీదయినా మోపినప్పుడు వాటిని సమర్థించే సాక్ష్యాధారాలు వీసమెత్తయినా లేకపోవడం, ఏవో అరకొర సాక్ష్యాధారాలున్న చిన్నచిన్న అభియోగాలను వాటితో కలపడం వల్ల పెద్ద అభియోగాలను ఎదుర్కోవడంలో నిందితులు అన్యాయానికి గురి అవుతారు. ఎందువల్లనంటే నేరస్తులు ఆ అభియోగాలలో ప్రతి ఒక్కదాన్నీ ఖండించవలసి వస్తుంది. ఆ పనిలో నిజమైన అభియోగాలను కూడా

ఖండించవలసి వస్తుంది. అటువంటి విచారణ న్యాయమైన విచారణ కాజాలదు. అటువంటి ప్రాసిక్యూషన్ న్యాయశాస్త్ర ప్రకారం దురుద్దేశ్య పూరితమైనదవుతుంది.

హింసాత్మక చర్యలలో పాల్గొన్నారని ఆ నిందితుల మీద అభియోగం మోపడానికి ఆధారమేమీ లేదని ప్రాసిక్యూషన్‌కు స్పష్టంగా తెలిసికూడా, ఉద్దేశ్యపూర్వకంగానే అలా చేయడానికి నిర్ణయించుకున్నదంటే, న్యాయస్థానం దృష్టిలో దురభిప్రాయాలు నాటడానికి, నిందితుల మనసులలో భయం నింపడానికి ప్రాసిక్యూషన్ ప్రయత్నిస్తున్నదని అర్థం. న్యాయవ్యవస్థ ఏ లక్ష్యంతో ప్రాసిక్యూషన్ బాధ్యతను రాజ్యాంగ యంత్రం చేతుల్లో పెట్టిందో ఆ లక్ష్యానికి ఈ రెండు ఉద్దేశ్యాలూ పూర్తిగా భిన్నమైనవి. న్యాయవ్యవస్థ ఇచ్చిన అధికారాన్ని ఈ మాదిరిగా దుర్వినియోగం చేయడం న్యాయానికి అపచారం చేయడమే.

అలాగే మరో రెండు అభియోగాలున్నాయి. అవి నిందితులందరూ జైష్-ఎ-మహ్మమ్మద్ అనే తీవ్రవాద సంస్థ సభ్యులని ఆరోపించాయి. ఈ అభియోగాన్ని బలపరచడానికి కూడా ప్రాసిక్యూషన్ దగ్గర వీసమెత్తు ఆధారం కూడా లేదు. నేను విశ్వసనీయమైన ఆధారం కావాలనో, నిజం కాదగిన ఆధారం కావాలనో కూడా అనడం లేదు. అసలు ఎటువంటి చిన్న మెత్తు ఆధారమైనా కూడా లేదు. దర్యాప్తు క్రమంలో అటువంటి ఆధారం ఏమీ దొరకలేదని స్పష్టంగా తెలిసికూడా ఆ అభియోగాన్ని అభియోగపత్రంలో భాగం చేశారు. అలా చేయడం చాలా స్పష్టంగా నిందితులను భయపెట్టే, న్యాయస్థానాన్ని తప్పుదారి పట్టించే ఉద్దేశ్యంతోనే జరిగింది. ప్రాసిక్యూషన్ ఆ మాదిరిగా ప్రవర్తించడం అనేది న్యాయశాస్త్రం ప్రకారం అక్రమం. అది తప్పనిసరిగా అసమంజసం గానూ అన్యాయానికి దారితీసేదిగానూ ఉంటుంది.

అది ఒక నిందితుడు కళ్లకు గంతలు కట్టి విచారణ జరిపినట్టు ఉంటుంది. ఆ మాదిరిగా కళ్లకు గంతలు కట్టినప్పుడు ఆ నిందితుడి మీద ఏ ఆరోపణలయినా చేయవచ్చు. అలాంటప్పుడు ఏ ఆరోపణలకు జవాబు చెప్పాలో ఏ ఆరోపణలను అబద్ధమైనవని విస్మరించవచ్చునో ఆ నిందితుడికి తెలియని స్థితి వస్తుంది. ప్రాసిక్యూషన్ తన మీద ఆరోపిస్తున్న వ్యాజ్యం మొత్తం ఫలితం ఏమిటో ఆ నిందితుడికి తెలియకుండా పోతుంది. అటువంటప్పుడు న్యాయస్థానం కూడా దురుద్దేశ్యపూరితంగా చేసిన అభియోగాలేవో గుర్తించి విస్మరించే అవకాశం ఉండదు. ఇతర అభియోగాలను బలపరిచే ఆధారాన్ని అంచనా కట్టడం కుదరదు. ఈ మాదిరిగా న్యాయశాస్త్రపరమైన దురుద్దేశ్యంతో ధ్వంసమై పోయిన వ్యాజ్యంలో విచారణ అనబడేది కూడా అక్రమంగానే జరుగుతుంది.

ప్రాసిక్యూషన్ ఎంతోకొంత ఆధారం సమకూర్చగలిగిందనే అభిప్రాయం ఇచ్చే అభియోగాలు కుట్ర అభియోగాలు మాత్రమే. అయితే అక్కడ కూడా ఉన్న సాక్ష్యాధారాలు హేతుబద్ధమైన అనుమానాలను నివృత్తి చేసేంత నిఖార్సయినవి కావు. కుట్ర అభియోగాలను ఎప్పుడైనా ప్రత్యక్ష ఆధారాల ద్వారా నిరూపించడం సాధ్యం కాదు. పరిస్థితుల సాక్ష్యం

ద్వారా, అనుమాన ప్రమాణం ద్వారా నిరూపించవలసిందే కాని పరిస్థితుల సాక్ష్యాన్ని నిర్ధారించాలంటే ఆ పరిస్థితుల వరుస ఒకటి ఉండాలి. ఆ పరిస్థితుల పరిణామాలు ఒకదానితో ఒకటి సంబంధంతో జరిగి ఉండాలి. ఆ పరిణామాలన్నీ నిందితుల నేరాన్ని గాక మరొక నిర్ధారణకు దారితీయలేవనే వాదన ఉండాలి.

అసలు ఆ సాక్ష్యాధారాలున్నాయాలేవా అని చర్చించబోయే ముందు, ప్రాసిక్యూషన్ కథనాన్ని యథాతథంగా, అక్షరం పొల్లుపోకుండా నమ్మినప్పటికీ భారత శిక్షాస్మృతిలోని సెక్షన్లు 121, 121ఎ, 122 ఈ నేరానికి ఎంత మాత్రం వర్తించవని స్పష్టం చేయవలసి ఉంది. ఎందువల్లనంటే, మొట్టమొదట, ఆ నిబంధనలన్నీ కూడా మనదేశంలో వలసవాద ప్రభుత్వం స్థానిక ప్రజల తిరుగుబాటుల్ల నుంచి తనను తాను రక్షించుకునేందుకు తయారుచేసినవి. ఆ అర్థంలో స్థానిక ప్రజలు వలసవాద ప్రభుత్వం మీద 'యుద్ధం చేయడం' అనే మాటను అర్థం చేసుకోవచ్చు. కాని ఒక సర్వసత్తాక ప్రజాస్వామిక రాజ్యంలో పౌరుల విషయంలో అటు వంటి నేరాలకు అర్థమేలేదు. స్వాతంత్ర్యానికి పూర్వం భారత శిక్షాస్మృతిలోని సెక్షన్లు 121, 122లకు న్యాయస్థానాలు ఇచ్చిన వ్యాఖ్యానాలు చూస్తే ఆ నిబంధనల అసలు స్వభావం స్పష్టంగా బయటపడుతుంది.

'ఆ గుంపు లక్ష్యం కేవలం జిల్లా మెజిస్ట్రేటును ప్రతిఘటించడం మాత్రమే కానప్పుడు, ఏదో విడి సంఘటన కానప్పుడు, మొత్తంగా బ్రిటిష్ అధికారాన్ని కూలదోయడమయినప్పుడు, ఖిలాఫత్ ప్రభుత్వాన్ని స్థాపించడం అయినప్పుడు' భారత శిక్షాస్మృతి సెక్షన్ 121 వర్తిస్తుందని మద్రాసు హైకోర్టు 1924లో అభిప్రాయపడింది. ఆ మాదిరిగానే1934లో కలకత్తా హైకోర్టు ఇచ్చిన మరొక తీర్పులో ఒక ఆయుధాగారం మీద దాడి అనేది ప్రభుత్వం మీద యుద్ధం చేయడంతో సమానమని, నిందితుడు 'గృహ నిర్బంధం నుంచి విడుదల అయినప్పటి నుంచి కూడా చక్రవర్తి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కుట్ర చేస్తున్నాడని, ప్రణాళికలు చేస్తున్నాడని' అన్నారు. 'తిరుగుబాటుదార్ల లక్ష్యం ఆయుధ బలం ద్వారా, హింస ద్వారా ప్రభుత్వోద్యోగులను లొంగదీసుకుని, ప్రభుత్వానికి అందవలసిన పన్నుల సేకరణను అడ్డుకోవడం అయినప్పుడు, అది ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేసే యుద్ధమేనని తీర్పు ఇచ్చింది. 1931లో రంగూన్ హైకోర్టు తీర్పు ఇచ్చింది. అదే న్యాయస్థానం 1933లో ఇచ్చిన మరొక తీర్పులో 'కొందరు తిరుగుబాటు దారులు ప్రస్తుత ప్రభుత్వాన్ని కూలదోసే ఉద్దేశ్యంతో దాడిచేసి, ఒకానొక స్థలం నుంచి కొందరు సైనికులను రాబట్టుకోవడానికి, తమ తిరుగుబాటు లక్ష్యానికి సహకరించని వారిని శిక్షించడానికి పూనుకున్నప్పుడు అది ప్రభుత్వం మీద యుద్ధానికి దిగడమే అవుతుంద'ని అంది.

అంటే ఈ భారత శిక్షాస్మృతి నిబంధన వలస పాలనకు వ్యతిరేకమైన తిరుగుబాట్లకే పరిమితమైందన్నమాట. స్వతంత్ర భారతదేశంలో ఆ నిబంధనకు ఎటువంటి అర్థమూ

ఉండడానికి వీలులేదు.

దానితో పాటుగా, ఒకవేళ ఆ నిబంధనకు ఏదో ఒక అర్థం ఇంకా ఉన్నదని మనం భావించినప్పటికీ, పార్లమెంటు భవనం మీద ఐదుగురు వ్యక్తులు దాడి చేయడం, మరొక నలుగురి సహాయం, ప్రోత్సాహం కూడా ఉన్నప్పటికీ 'భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా యుద్ధం చేయడం'తో సమానం కాజాలదు.

ప్రాసిక్యూషన్ సమకూర్చిన ఆధారాలన్నిటినీ ఉన్నవి ఉన్నట్టు నమ్మినప్పటికీ, ఇంతకన్న ఎక్కువ ఆధారాలను వారు సమకూర్చలేదు. భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా శత్రుపూరితంగా వ్యవహరిస్తున్న ఏదయినా సంస్థతోగాని, దేశంతోగాని నిందితులకు సుదూర సంబంధం ఉన్నదని అయినా సాక్ష్యాధారాలను ప్రాసిక్యూషన్ చూపలేక పోయింది. అభియోగ పత్రంలో జైష్-ఎ-మహమ్మద్ అనే పేరును ఏదో యదాలాపంగా అలవోకగా పేర్కొనడం తప్ప దానికయినా ఆధారాలులేవు. నిందితులకు ఉన్నదని చెప్పబడుతున్న తిరుగుబాటు ఉద్దేశ్యాలకు ఆధారాలే లేవు. ఆ దాడి ద్వారా పార్లమెంటు సభ్యులను, కేంద్ర మంత్రులను బందీలుగా పట్టుకుపోయే ఉద్దేశ్యం ఉండిందనే అభియోగం ఊహాపోహనే గాని దాన్ని బలపరచడానికి చిన్నమొత్తం ఆధారం కూడా లేదు. ఒక సాధారణ స్వభావంగల ఉద్దేశ్యాన్ని బలపరచడానికి ఆ ఆధారాలు సరిపోవు. నిజం చెప్పాలంటే డిసెంబరు 13 దాడికి గల ఉద్దేశ్యం ఏమిటో ప్రాసిక్యూషన్ చూపలేకపోయింది. ప్రాసిక్యూషన్ చూపిన ఆధారాల నుంచి ఎక్కువలో ఎక్కువగా ఊహించ గలిగిందేమంటే ఆ నేరస్తులు తమ దాడిని బలప్రదర్శనగానో, సాహసిక చర్యగానో చూపదలచుకున్నారుగాని అంతకన్న ఎక్కువేమీ కాదు. అభియోగపత్రంలో రాసిన ఊహలూ, కల్పనలూ అన్నిటినీ శిలాక్షరాలుగా భావించకపోయినట్టయితే, ప్రాసిక్యూషన్ చూపించిన ఆధారాలను బట్టి ఆ చర్యకు తిరుగుబాటు ఉద్దేశ్యాలు ఉన్నాయని నిర్ధారించడం కూడా అసాధ్యం. ఆ చర్య భారత ప్రభుత్వ అధికారాన్ని సవాలు చేసే సాధారణ ఉద్దేశ్యంతో జరిగిందని నిర్ధారించడం అసాధ్యం.

భారత శిక్షాస్మృతులలో, చట్టాలలో చాలా కచ్చితంగా ఇప్పటికే నిర్ధారణ అయిపోయిన విషయమేమంటే ప్రతి ఒక్క మాటను, వ్యక్తీకరణనూ స్పష్టంగా, నిర్దిష్టంగా నిర్వచించాలి. వినియోగించాలి. భారత శిక్షాస్మృతి సెక్షన్ 121, 122ల ప్రకారం చూస్తే అక్కడ వాడిన యుద్ధం అనే మాట రెండు దేశాల మధ్య జరిగే యుద్ధం అనే మాటకు సమానం కాజాలదు. ఆ మాటను ఆ మామూలు అర్థంలో వాడలేదు.

అయితే పట్నా హైకోర్టు 1952లో ఇచ్చిన ఒక తీర్పులో భారత శిక్షాస్మృతిలోని ప్రభుత్వంపై యుద్ధానికి పూనుకోవడం అనే అభియోగంలోని యుద్ధం అనే మాటకు రెండు దేశాల మధ్య యుద్ధం అనే సాధారణ అర్థం చెప్పాలని అభిప్రాయపడింది.

ఏది ఏమయినా, రాజద్రోహకర చర్యలు, దొమ్మి, వగైరా మాటలకన్న కచ్చితంగా

వేరయిన అర్థంలోనే ఈ మాటను వాడడం జరుగుతుంది. భారత పార్లమెంటు భవనం మీద ఐదుగురు వ్యక్తులు దాడి చేయడం, వారికి మరొక నలుగురు వ్యక్తులు సహకరించడం, వారికి పాకిస్తాన్‌లో నివసించే మరొక నలుగురు వ్యక్తులు సలహాలు ఇవ్వడం అవేది ఎంత దారుణమైన నేరమయినప్పటికీ, భారత ప్రభుత్వం మీద యుద్ధానికి పూనుకోవడం అనే మాటకు సరిపోయినది కాజాలదు. బొంబాయి హైకోర్టుకు చెందిన నాగపూర్ బెంచి 1946లో ఇచ్చిన ఒక తీర్పులో దొమ్మీకి యుద్ధానికి దిగడానికి మధ్య ఏడా గురించి మాట్లాడింది. "గుమిగూడిన మనుషులు అసలు ఏ ఉద్దేశ్యంతో జమ అయ్యారు అనేది నిజమైన ప్రమాణం. గుమిగూడిన ప్రజల లక్ష్యం బలప్రయోగం ద్వారా, హింస ద్వారా ప్రభుత్వ అధికారాన్ని ప్రత్యక్షంగా సవాలు చేసి తాము అనుకున్నదాన్ని సాధించుకోవడం అయినప్పుడు, ఆ లక్ష్యం సాధారణ ప్రజా స్వభావం కలిగి ఉన్నదయితే' అది యుద్ధమే అని నాగపూర్ బెంచి అభిప్రాయపడింది.

ప్రభుత్వ అధికారానికి గురిపెట్టిన సాయుధ చర్యలను సెక్షన్ 121 పరిధిలోకి తేవాలంటే తప్పనిసరిగా అవి ఆ సాధారణ ప్రజాస్వభావపు చర్యలై ఉండవలసి ఉంటుందనే అభిప్రాయాన్ని న్యాయస్థానాలు పదేపదే ప్రకటించాయి. కాని పార్లమెంటు భవనంపై దాడి విషయంలో సాధారణ ప్రజా స్వభావపు ఉద్దేశ్యం అనేది పక్కన పెట్టండి. అసలు ఉద్దేశ్యమేమిటనేదాన్నయినా రుజువు చేసే సాక్ష్యాధారాలేమీ లేవు.

సరే ఆ వాదనను అలా ఉంచినా, ఇప్పుడిక కుట్ర అభియోగాలను కొంచెం పరిశీలిద్దాం. ఆ కుట్ర జరిగిందని, అందులో నిందితులు పాల్గొన్నారని చెప్పడానికి ఆధారాలేమీ లేవు. నేర న్యాయశాస్త్రం ప్రకారం కుట్ర అనే దేన్ని అనవచ్చునో న్యాయస్థానాలు ఎన్నో సార్లు విశదం చేసిన అభిప్రాయాన్ని ఇంతకుముందే చర్చించాను. అవి మళ్లీ చెప్పాలంటే ఒకటి, కుట్రలో పాల్గొన్న వాళ్ళందరికీ ఒక స్పష్టమైన ఉద్దేశ్యం ఉండాలి. రెండు, నేరం చేయడానికి ఆ కుట్రలో పాల్గొన్న వాళ్లందరూ కుదుర్చుకున్న ఒప్పందం ఉండాలి.

ఒకవేళ ఆ నేరాన్ని రుజువు చేయడానికి కేవలం పరిస్థితుల ఆధారంగా, అనుమాన ప్రమాణాలు మాత్రమే ఉన్నప్పుడు కూడా ఏమి చేయాలో సుప్రీంకోర్టు 1987లోనే చెప్పింది. నిజానికి పార్లమెంటు భవనంపై దాడి కేసులో అనుమానప్రమాణాలు, పరిస్థితుల ఆధారాలు తప్ప మరేమీ లేవు. బల్వీందర్ సింగ్ వర్సస్ స్టేట్ ఆఫ్ పంజాబ్ అనే ఆ 1987 కేసులో సుప్రీంకోర్టు ఏమి చెప్పిందంటే, 'ఏ వాస్తవాల, పరిస్థితుల ఆధారంగా నేరం జరిగిందనే నిర్ధారణకు రావడం జరుగుతున్నదో, ఆ వాస్తవాలు, పరిస్థితులు ఎటువంటి హేతుబద్ధమైన అనుమానానికీ వీలులేనివై ఉండాలి. అలాగే ఆ వాస్తవాలు, పరిస్థితులు నిందితులు నేరంలో పాల్గొన్నారని చూపడం మాత్రమే కాదు, వారు నిరపరాధులై ఉండడానికి ఎటువంటి అవకాశం లేదని కూడా నిర్ధారించగలిగినట్టు ఉండాలి. వారు నిరపరాధులేనని చెప్పే ఎటువంటి హేతుబద్ధమైన వాదననయినా ఖండించగలిగినట్టుగా ఉండాలి'.

నిందితుల నేరం ఒప్పుకోలు ప్రకటనలు అనబడే వాటిని మినహాయించి, ప్రాసిక్యూషన్ సమర్పించిన సమస్త సాక్ష్యాధారాలనూ ఉన్నవి ఉన్నట్టుగా అంగీకరించినప్పటికీ, ఖరారు చేయగలిగినదేమంటే నిందితులకు చనిపోయిన తీవ్రవాదులతో పరిచయం ఉన్నదని మాత్రమే. ఆ పరిచయంతో వారికి ఉండడానికి ఇళ్లు దొరికేలా సహకరించారని మాత్రమే. వారితో ఎంతో కొంత కాలం గడిపారని మత్రమే. వారి మధ్య ఉమ్మడిగా ఏ ఉద్దేశ్యాలయినా ఉన్నాయని చెప్పగల ఆధారాలేమీ లేవు. భారత పార్లమెంటు మీద దాడిచేసే ఉద్దేశ్యంతో వారి మధ్య ఒప్పందం ఉన్నదని చూపేందుకు అసలు ఎటువంటి ఆధారాన్నీ ప్రాసిక్యూషన్ చూపలేకపోయింది. ప్రాసిక్యూషన్ దాఖలు చేసిన సాక్ష్యాధారాలు నమ్మదగినవే అని ఒక క్షణానికి అనుకున్నప్పటికీ, వాటి ప్రకారమే అర్థమయ్యేదేమంటే, చనిపోయిన తీవ్రవాదులు తాము విద్యార్థులనో మరొకటనో నిందితులను నమ్మించారు. నిందితులు ఆ నమ్మకం మీదనే వాళ్లకు సహాయం చేశారు.

ఇక వారి మధ్య జరిగాయని చెపుతున్న మొబైల్ ఫోను, టెలిఫోన్ సంభాషణల విషయానికి వస్తే, వాటి గురించి ప్రాసిక్యూషన్ చాలా వివరాలు చెప్పిందిగాని, వాళ్ల మధ్య కొన్ని సంభాషణలు నడిచాయని తప్ప మరేమీ రుజువు కాలేదు. ఒకవేళ కొందరు నిందితులు చనిపోయిన తీవ్రవాదులతోనో, కొందరు విదేశీయులతోనో సంభాషణలు జరిపారని అనుకున్నప్పటికీ, దాని ఆధారంగా తేల్చగలిగినదేమీ లేదు. విదేశీయులు అనడం మినహా వారెవరో ప్రాసిక్యూషన్ తేల్చిచెప్పలేదు. ఒకవేళ సంభాషణ జరగడం నిజమే అయినప్పటికీ, దాని ఆధారంగానే వారి మధ్య భారత పార్లమెంటు మీద దాడి చేసే విషయంలో ఒప్పందం కుదిరిందని గాని ఉమ్మడి లక్ష్యం ఉందని గాని ఖరారు చేయడం అసాధ్యం. ఆ మాటకొస్తే ఎవరో ఇద్దరి మధ్య టెలిఫోన్ సంభాషణ జరిగిందన్నంత మాత్రాన వారి మధ్య ఒక నేరానికి ఒప్పందం జరిగిందని తేల్చి చెప్పడం అసాధ్యం. ఎందుకంటే జరిగిందని చెప్పబడుతున్న టెలిఫోన్ సంభాషణలో మాట్లాడుకున్న విషయాలేమిటో కచ్చితమైన రుజువు ఏదీ ప్రాసిక్యూషన్ ఇవ్వలేకపోయింది.

ఏ కుట్ర అయినా ప్రత్యక్ష ఆధారాల ద్వారా రుజువు చేయడం సాధ్యం కాదని, పరోక్ష ఆధారాలను వాడుకోవలసిందేననీ అనడం సరయినదే, కాని ఆధారం ప్రత్యక్షమైనదా, పరోక్షమైనదా అనే దానికన్న, ముఖ్యమైనదేమంటే, నేరం జరిగిందని, నేరస్తులు కచ్చితంగా వాళ్లేనని అంతిమంగా నిరూపణ కావలసి ఉంటుంది. ఆ నిరూపణ కూడా హేతుబద్ధమైన అనుమానాలన్నిటినీ నివృత్తి చేయవలసి ఉంటుంది. ఒకవేళ పరిస్థితుల సాక్ష్యం ఇవ్వవలసి వస్తే వరుసగా ఏ పరిణామాలు జరిగాయో ఒక వరుస చెప్పగలగాలి. ఆ వరుస పరిణామాల వల్ల ఒక నిందితుడికి నేరం భాగస్వామ్యం ఉన్నదనేది రుజువు కావాలి. టెలిఫోన్ మీద జరిగిన సంభాషణల్లో ఏమి మాట్లాడుకున్నారో ఎటువంటి సాక్ష్యాధారాలు లేనప్పుడు, ఏదీ రుజువు కానప్పుడు, కేవలం సంభాషణ జరిగిందనే

విషయానికి మాత్రమే ఆధారం ఉన్నప్పుడు, అసలు ఆ సంభాషణ రెండు నంబర్ల మధ్య జరిగినదే తప్ప ఏ ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగినదో కూడా ఆధారాలులేనప్పుడు, పరిస్థితుల వరుస సక్రమంగా లేదన్నమాటే, ఆ పరిణామాలు వరుసగా జరగలేదనే నిర్ధారణకు రాకతప్పదు.

ఘాజీ బాబా, మహమ్మద్ మసూద్ అజర్, అబు జిహాది, తారిఖ్ అహ్మద్ అనే పాకిస్తాన్ జాతీయుల పేర్లను నిందితులుగా, నేరస్తులుగా అభియోగ పత్రంలో విచ్చలవిడిగా వాడారు. వారిని విదేశీ కుట్రదారులుగా, ఇతర నిందితులు వారితో కుట్ర చేసినట్టుగా చెప్పారు. కాని నిందితులుగాని, చనిపోయిన నిందితులుగాని ఏ రకంగానైనా ఆ విదేశీయులతో సంబంధంలో ఉన్నారని చూపేందుకు ఎటువంటి ఆధారాలూ లేవు. ఫోన్ సంభాషణల గురించి దర్యాప్తు జరిపిన ప్రాసిక్యూషన్ సాక్షి, దర్యాప్తు అధికారి ఇంత గందరగోళం తర్వాత చెప్పిందల్లా ఏమంటే విచారణను ఎదుర్కొన్న నిందితులు, చనిపోయిన నిందితులు పాకిస్తాన్, దుబాయిలకు ఫోన్లు చేశారనీ, అక్కడి నుంచి వారికి ఫోన్లు వచ్చాయని మాత్రమే, ఆ సంభాషణల్లో ఏమి మాట్లాడుకున్నారనేది చెప్పకపోవడం ఒక ఎత్తయితే, అసలు ఆ సంభాషణ జరిగినప్పుడు అవతలి పక్కన ఎవరు ఉన్నారనే విషయం కూడా ప్రాసిక్యూషన్ ఏమీ చెప్పలేకపోయింది. అప్రకటిత నేరస్తులతో నిందితులకు, చనిపోయిన నిందితులకు ఉన్న సంబంధం గురించి ప్రాసిక్యూషన్ చెప్పిన మొత్తం సమాచారం ఇంతే. పూర్తిగా నిరాధారమైన ఇటువంటి సాక్ష్యాధారాల మీద ఆధారపడి నిందితుల మధ్యఉమ్మడి ఉద్దేశ్యం గాని, ఉమ్మడి ఒప్పందం గాని ఉన్నదని నిర్ధారించడం అసాధ్యం.

అంటే షౌకత్ హుసేన్ గురుకు వ్యతిరేకంగా ప్రాసిక్యూషన్ ఏమి సమర్పించని సాక్ష్యాధారాలను చర్చించబోయేముందు, అసలు మొత్తం కేసుకు సంబంధించి వర్తించే ఒకటి రెండు విషయాలు చెప్పడం అవసరం.

మొదటి అంశం ఏమంటే, విచారణ క్రమంలో క్రాస్ ఎగ్జామినేషన్‌లో చాలా హేతుబద్ధంగా వేసిన చాలా ప్రశ్నలకు గౌరవ నీయమైన న్యాయమూర్తి నిరాకరించాడు. అసలు న్యాయస్థానాల విచారణలో ఇప్పటికే ఖరారయిపోయిన అంశమేమంటే క్రాస్ ఎగ్జామినేషన్ పరిధి చాలా విశాలంగా ఉండాలని. ప్రధాన పరీక్షలో సాక్షి చెప్పిన అంశాలమీద మాత్రమే క్రాస్ ఎగ్జామినేషన్ పరిమితమై ఉండగూడదని.

ఈ న్యాయసూత్రం ఈ కేసుకు సంబంధిచిన విషయాలన్నిటికీ వర్తిస్తుంది. ఈ సూత్రం ద్వారా దాచిపెట్టబడిన నిజాలను రాబట్టవచ్చు. చెప్పిన విషయంలోని అసమంజసత్వాన్ని బయటపెట్టవచ్చు. సాక్షి విశ్వసనీయతను పరీక్షకు పెట్టవచ్చు. ప్రాసిక్యూషన్ ప్రవేశపెట్టిన సాక్ష్యాధారాల సాధారణ విలువను ప్రశ్నించవచ్చు. అసలు కొత్త వాస్తవాలను వెలికితీసి నిందితుల రక్షణ కోసం వాదనలను నిర్మించవచ్చు. క్రాస్

ఎగ్జామినేషన్ చేసే హక్కు కేవలం భారత సాక్ష్యాధారాల చట్టం సెక్షన్ 138 ద్వారా మాత్రమే చట్టబద్ధంగా మారదంలేదు. అది ఒక సహజ న్యాయ సూత్రపు హక్కు ఆ హక్కును నిరంకుశంగా నిరాకరించడానికి, అడ్డుకోవడానికి వీలులేదు. కాని పార్లమెంటు మీద దాడి కేసులో సరిగ్గా జరిగినదదే.

ఈ కేసులో దర్యాప్తు అధికారి అయిన ప్రాసిక్యూషన్ సాక్షిని ప్రశ్నించడానికి ప్రయత్నించినప్పుడు విజ్ఞుడైన న్యాయమూర్తి ఆ ప్రశ్నలను అడ్డుకున్నారు. ఆయనను అడిగే ప్రశ్నల సమాధానాలు కేసు కాగితాలలో అప్పటికే ఉన్నాయని, ఇతర పోలీసు సాక్షులు అప్పటికే ఆ విషయాలు చెప్పారని, అటువ ంటి కారణాలతో ఆ ప్రశ్నలను అడ్డుకోవడానికి ఆయన ప్రయత్నించాడు. ఇతర దర్యాప్తు అధికారుల పనిని కూడా ఈ అధికారి పర్యవేక్షించాడు గనుక, డిఫెన్స్ న్యాయవాది ఆయనను ప్రశ్నించడం, క్రాస్ ఎగ్జామిన్ చేయడం చాలా అవసరం, సమంజసం కూడా. ఆ ప్రశ్నలను న్యాయస్థానం అరికట్టడానికి వీలేలేదు.

అప్పటికే కేసు కాగితాలలో (రికార్డులో) అది భాగమనీ, ఆ విషయాలను అదివరకే ఇతర పోలీసు సాక్షులు ఇతర దర్యాప్తు అధికారులు చెప్పి ఉన్నారనీ కారణాలు చూపి విజ్ఞుడైన న్యాయమూర్తి ముఖ్య దర్యాప్తు అధికారిని చాలా ప్రశ్నలకు జవాబు చెప్పడం నుంచి తప్పించేశాడు. కాని ఈ ముఖ్య దర్యాప్తు అధికారి ఈ కేసును దర్యాప్తు చేసిన ఇతర కిందిస్థాయి అధికారులను పర్యవేక్షించాడు గనుక ఆయనను ప్రశ్నించడం చాలా కీలకమైనది. అంతేకాదు, ఇతర కింది స్థాయి దర్యాప్తు అధికారులు చేసిన దర్యాప్తు మీద కూడా ఆయనను క్రాస్ ఎగ్జామిన్ చేయడం డిఫెన్స్ న్యాయవాదికి చాలా అవసరం.

న్యాయశాస్త్ర ప్రమాణాల రీత్యా కూడా అది పూర్తిగా అంగీకారయోగ్యమే. న్యాయస్థానం దాన్ని నిషేధించడానికి, కాదనడానికి వీలేలేదు. అదేమాదిరిగా, ఒక విషయం అప్పటికే కేసు కాగితాలలో భాగమై ఉన్నది గనుక దాన్ని గురించి ప్రశ్నించడానికి వీలులేదని అనడం అసమంజసం. కాని ఆ తెలివైన న్యాయమూర్తి ఏమని ఉత్తర్వు ఇచ్చాడో తెలుసునా? 'ఇప్పటికే కాగితాలలో ఉన్న విషయాలకు సంబంధించిన అన్ని ప్రశ్నలూ, సాక్షికి సంబంధంలేని, సాక్షికి తెలియని విషయాలపై అన్ని ప్రశ్నలూ అడగడానికి వీలులేదు' అని. మరొక చోట అదే న్యాయమూర్తి 'న్యాయస్థానం దగ్గర ఉన్న సమాచారం గురించి సాక్షులను ప్రశ్నించడానికి వీలులేదు' అని కూడా ఉత్తర్వు ఇచ్చాడు. న్యాయశాస్త్ర ప్రకారం ఒక న్యాయవిచారణలో అటువంటి సాధారణ స్వభావం గల ఉత్తర్వులు ఇవ్వడం పూర్తిగా అసమంజసం, అక్రమం.

అదేమాదిరిగా మరొక సాక్షి, కింది స్థాయి ఇన్‌స్పెక్టర్ చేసిన దర్యాప్తు గురించి ఈ సాక్షిన (ముఖ్య దర్యాప్తు అధికారిని) అడగడానికి వీలులేదని కూడా ఆ న్యాయమూర్తి ఉత్తర్వు ఇచ్చాడు. కాని ఆ కింది అధికారి జరిపిన దర్యాప్తును ఈ పై అధికారి

పర్యవేక్షించాడు గనుక దాని గురించి పై అధికారిని ప్రశ్నించ గూడదనడం పూర్తిగా చట్టవ్యతిరేకం.

అలాగే పోటా చట్టంలోని సెక్షన్ 32 ప్రకారం నమోదు చేసిన ఒప్పుకోలు ప్రకటనల గురించి ప్రశ్నలను కూడా న్యాయమూర్తి అడ్డుకున్నాడు. న్యాయస్థానాలలో ఇదివరకు ఎన్నోసార్లు ఖరారయిన విచారణ పద్ధతి ఏమంటే క్రాస్ ఎగ్జామినేషన్ అనేది సాక్షి చెప్పిన ప్రధాన వాంగ్మూలానికి మాత్రమే పరిమితమయి ఉండాలని ఏమీ లేదు.

దర్యాప్తు అధికారులలో కింది అధికారి తన విధిని నిర్వహిస్తున్నపుడు పై అధికారి ఏ ఆదేశాలు ఇచ్చాడనే దాని మీద కూడా ప్రశ్నలు వేయవద్దని న్యాయమూర్తి అన్నాడు. కాని కింది అధికారి దర్యాప్తును అటువంటి ఆదేశాలు ప్రభావితం చేసి ఉంటే అవకాశం ఉంది గనుక అందుకు సంబంధించిన ప్రశ్నలు అడగడం, సమాధానాలు రాబట్టడం చాలా అవసరం.

మొత్తం మీద చెప్పవలసినదేమంటే పార్లమెంటు భవనంపై దాడి కేసులో న్యాయస్థానంలో విచారణా క్రమంలో ముఖ్యంగా క్రాస్ ఎగ్జామినేషన్ క్రమంలో న్యాయమూర్తి లేవనెత్తిన అనేక చట్టవ్యతిరేకమైన, అన్యాయమైన ఆటంకాలవల్ల ముఖ్యమైన సాక్షులను క్రాస్ ఎగ్జామినేషన్ చేసే పని సక్రమంగా జరగలేదు. అందువల్ల నిందితుల తరఫున వాదనలు సక్రమంగా వినిపించే అవకాశం లేకుండాపోయింది. అందువల్ల అసలు విచారణే న్యాయంగా జరగనట్టు అయింది. కింది స్థాయిలో విచారణ జరిపిన న్యాయమూర్తి తొందరపాటుతనం వల్ల నిందితులను ఏదో ఒక రకంగా శిక్షించాలనే మితిమీరిన అత్యుత్సాహం వల్ల న్యాయశాస్త్ర ప్రమాణాల ప్రకారం జరుగవలసిన న్యాయమైన, సక్రమమైన విచారణ జరగకుండా పోయింది.

ఈ క్రమం వల్ల తాము విచారిస్తున్న న్యాయమూర్తికి తమపట్ల ఏవో దురభిప్రాయాలు, అపోహలు ఉన్నాయని నిందితులు అనుమానించే అవకాశం వచ్చింది. ఒక న్యాయమైన నిర్ణయానికి రావాలనే ఆకాంక్షతోనే న్యాయమూర్తి విచారణా క్రమంలో ఇటువంటి సాధారణమైన ఉత్తర్వులు ఇచ్చి ఉండవచ్చు. కాని చిట్టచివరికి నిర్ధారణలు చేసి తీర్పు ప్రకటించేటప్పుడు కేసుకు సంబంధించిన వాస్తవాల మీద ఆధారపడి, న్యాయశాస్త్ర ప్రమాణాల ప్రకారం ఒక నిర్దుష్టమైన ఆదేశం ఇవ్వడానికి న్యాయమూర్తికి అవసరమైన శిక్షణ ఉండాలి.

ఆ తర్వాత న్యాయస్థానంలో విచారణాక్రమంలో ఈ కేసులో నిందితులను భారత నేర శిక్షాస్మృతి (క్రిమినల్ ప్రొసీజర్ కోడ్) సెక్షన్ 313 కింద ఏ మాదిరిగా విచారించారో ఆ పద్ధతి మీద కూడా కొన్ని వ్యాఖ్యలు చేయవలసి ఉంది.

సెక్షన్ 313 అనే దాన్ని శాసన నిర్మాణ సంస్థలు నిందితులకు సహాయపడడానికి ఉద్దేశించి తయారుచేశాయి. ప్రాసిక్యూషన్ తన మీద చూపిన సాక్ష్యాధారాలకు జవాబు

చెప్పుకునేందుకు నిందితుడికి ఉన్న అవకాశం అది. కాని ఈ కేసులో విజ్ఞుడైన న్యాయమూర్తి ఆ నిబంధనను పూర్తిగా తలకిందులు చేసి దాన్ని కూడా అభియోగాలు గుప్పించి సాధనంగా వాడుకున్నాడు.

సెక్షన్ 313 కింద నిందితులు ఇచ్చే వాంగ్మూలాన్ని క్రాస్ ఎగ్జామిన్ చేయగూడదనేది న్యాయశాస్త్రంలో ఇప్పటికే ఖరారయిపోయిన సూత్రం. అదేమాదిరిగా ప్రాసిక్యూషన్ సమకూర్చిన సాక్ష్యాధారాల పరిస్థితులను నిందితుడు తన 313 వాంగ్మూలంలో వివరించడంలో విఫలమైనప్పటికీ దాన్ని నిందితుడికి వ్యతిరేకంగా చూడగూడదని కూడా 1975లో శ్రీరామ్ వర్సస్ స్టేట్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చి ఉంది.

ఇక్కడ గుర్తించవలసిన మరొక అంశం కూడా ఉంది. పాత భారత నేరశిక్షాస్మృతిలో సెక్షన్ 313కు సమానమైన సెక్షన్ 342 అనేదొకటి ఉండేది. దాని ప్రకారం ఒక నిందితుడు తన వాంగ్మూలంలో ప్రాసిక్యూషన్ సాక్ష్యాధారాలను ఖండించడంలో విఫలమైతే, ఏదయినా ప్రశ్నకు జవాబు చెప్పడానికి నిరాకరిస్తే దాన్ని బట్టి నిందితుడు నేరాన్ని నిర్ధారించవచ్చుననే అవకాశం ఉండేది.

కాని భారత నేర శిక్షాస్మృతిని సవరిస్తున్నప్పుడు శాసన నిర్మాణ సంస్థలు ఉద్దేశ్యపూర్వకంగానే ఆ నిబంధనలు రద్దుచేశాయి. ప్రాసిక్యూషన్ తయారుచేసిన కేసులో ఖాళీలు నింపడానికి నిందితుడు 313 వాంగ్మూలాన్ని వాడుకోగూడదని న్యాయస్థానాలు అనేకసార్లు తీర్పులు ఇచ్చాయి.

ప్రాసిక్యూషన్ తన అభియోగాలను రుజువు చేయడానికి నిందితుడి సెక్షన్ 313 వాంగ్మూలాన్ని వాడుకోవడానికి వీలులేదు. కాని నిందితుడు తన తరపున వాదనలు వినిపించడానికి తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవడానికి మాత్రం తన 313 వాంగ్మూలాన్ని వాడుకోవచ్చును. ఇది మాత్రమే కాదు. అది న్యాయస్థానానికి కూడా ఒక అవకాశం ఇస్తుంది. నిందితుడితో ఒక వ్యక్తిగత సంభాషణ జరిపి నిందితుడు ఇవ్వగల వివరణ ఏమిటో తెలుసుకునే అవకాశాన్ని అది న్యాయస్థానానికి ఇస్తుంది. ఆ వివరణ ఇచ్చేప్పుడు ఆ నిందితుడు ఎటువంటి భయానికి, బెదురుకులోను గాకుండా చూస్తుంది. ఆ భయం, బెదురుల వల్ల నిందితుడు తాను చేయని తప్పును ఒప్పుకోవడమో, ప్రాసిక్యూషన్ కేసులో ఉన్న లోపాలను, ఖాళీలను భర్తీచేసే ప్రకటన చేయడమో చేయకుండా 313 పరీక్ష చూస్తుంది.

పరీక్షలో భాగంగా న్యాయస్థానం అడిగే ప్రశ్నలు నిందితుడిలో ఈ ధైర్యాన్ని నింపాలి, తనను అడుగుతున్న ప్రశ్నలు తన ప్రయోజనం కోసమేననీ, ప్రాసిక్యూషన్ ప్రయోజనం కోసం కాదనీ నిందితుడికీ అనిపించేలా ఆ ప్రశ్నలు ఉండాలి. నిందితుడికి ప్రతికూలంగా జరుగుతున్న పరిణామాల గురించి నిందితుడి వివరణను రాబట్టేందుకే ఆ పరీక్షగాని అంతకన్న ఆ పరీక్ష లక్ష్యం మరేమీ కాదని నిందితుడికి తెలియాలి. ఈ లక్ష్యం నెరవేరేలా

చూసే బాధ్యత న్యాయస్థానం మీదనే ఉంది. నిందితుడి పరీక్ష కేవలం మొక్కుబడి వ్యవహారంగా మారకుండా చూసే బాధ్యత కూడా న్యాయస్థానం మీదనే ఉంది.

పార్లమెంటు భవనంపై దాడి కేసులో విజ్ఞుడైన న్యాయమూర్తి 313 వాంగ్మూలంపై పరీక్షను సుదీర్ఘంగా జరిపాడు. పోలీసులు జరిపే ఇంటరాగేషన్ లాగనో, న్యాయస్థానంలో జరిగే క్రాస్ ఎగ్జామినేషన్లాగానో సుదీర్ఘంగా నిందితుడిని పరీక్షిస్తే, అది ఆ నిబంధన చట్టంలో ఎందుకు చేర్చబడిందో దాని స్ఫూర్తికీ, అక్షరాలా భంగకరమే. కాని ఈ కేసులో న్యాయమూర్తి 313 వాంగ్మూలం మీద ఎట్లా పరీక్ష జరపాడంటే నిందితులలో ఒకరయిన అఫ్సాన్ గురు 313 వాంగ్మూల విచారణ సమయంలో బోరున ఏడ్చి కుప్ప కూలిపోయింది.

నిందితుడు షౌకత్ గురు భార్య అఫ్సాన్ గురును ఆమె పసికందుతో సహా జైల్లో నిర్బంధించారు. వాళ్లందరినీ గొలుసులతో కట్టేసి న్యాయస్థానానికి తీసుకువచ్చారు. గొలుసులతో కట్టేసి ఉండేవారు. నిందితులను న్యాయవిచారణ సమయంలో అలా గొలుసులతో కట్టి ఉంచగూడదనే నిబంధనకు నీళ్లు వదలడానికి వాళ్లు చూపించిన కారణమేమంటే ఒక జైలర్ పెట్టుకున్న దరఖాస్తు ఆ జైలర్ దరఖాస్తు మీద నిందితులను గానీ, నిందితుల తరఫున న్యాయవాదులుగానీ ఏమీ అడగకుండానే న్యాయమూర్తి వారిని గొలుసులతో కట్టి ఉండవచ్చునని ఆదేశాలు ఇచ్చేశాడు. ఒక్కరు నిలబడడానికి మాత్రమే చోటు ఉన్న బోనులో గొలుసులతో కట్టి ఉన్న ఆ నలుగురినీ కుక్కేవారు.

పార్లమెంటు భవనంపై దాడి అనే ఈ కేసులో ఇటువంటి అక్రమాలు, అన్యాయాలు ఎన్నో జరిగితే, వాటిని విజ్ఞుడైన న్యాయమూర్తి ఆమోదిస్తే, ఒక స్వతంత్ర న్యాయ వ్యవస్థలో ఇటువంటి విషయాలు జరగవచ్చునా అని ప్రశ్నించడానికి, చర్చించుకోవడానికి కూడ న్యాయవాదులు ప్రయత్నించలేదు.

నిజానికి ఎప్పుడైనా ఒక తీర్పు అంత ముఖ్యమైనది కాదు. ఆ నిర్ణయానికి రావడానికి ఎంచుకున్న క్రమం ఏమిటి, పద్ధతి ఏమిటి అనేవి చాలా ముఖ్యం. ఆ క్రమపద్ధతి సమంజసంగా, న్యాయశాస్త్ర ప్రమాణాల ప్రకారం, సహజ న్యాయసూత్రాల ప్రకారం, మానవ హక్కులను, రాజ్యాంగ హక్కులను గౌరవిస్తూ ఉన్నాయా లేవా అనేది ముఖ్యం.

కింది న్యాయస్థానంలో జరిగిన అక్రమాలలో కొన్నిటిని అయినా సుప్రీంకోర్టు గుర్తించింది. కనుకనే కింది కోర్టు విధించిన శిక్షలను మార్చింది. షౌకత్ గురుకు శిక్షను పది సంవత్సరాలకు తగ్గించింది. ఆయన భార్యను నిర్దోషిగా వదిలిపెట్టింది. ఢిల్లీ విశ్వవిద్యాల అధ్యాపకుడు జిలానిని నిర్దోషిగా వదిలిపెట్టింది. అఫ్జల్ గురు ఒక్కడి మీద మాత్రమే మరణశిక్షను నిర్ధారించింది.

ఆ యావజ్జీవ కారాగారవాస శిక్షలను పునరాలోచించాలనే అప్పీలు కేసును అనుమతించమని కోరేటప్పుడు న్యాయమూర్తి జస్టిస్ పి వెంకటరామిరెడ్డి, మరొక న్యాయమూర్తి ఉన్న బెంచి ముందు నేను వాదించాను. కాని చివరి వాదనల సమయంలో

నా మిత్రుడు కాలిన్ గాన్ సాల్వెస్‌ను వాదించమని కోరాను. ఆయన గత రెండు దశాబ్దాలుగా మానవ హక్కుల కేసులు వాదిస్తున్న ప్రముఖ న్యాయవాది. నేషనల్ హ్యూమన్ రైట్స్‌లా నెట్‌వర్క్ అనే స్వచ్ఛంద సంస్థ బాధ్యుడుగా ఉన్నాడు. ఆయన ఆ కేసుల్లో ఒకదానిలో పడిన యావజ్జీవ శిక్షలను కొట్టివేయించాడు. మరొక కేసులో మాత్రం చనిపోయిన ఒక సబ్ ఇన్స్‌పెక్టర్ తండ్రి కింది కోర్టు వేసిన శిక్షలను పెంచాలని, యావజ్జీవ కారాగార శిక్షను మరణ శిక్షగా మార్చాలని ఆయన కోరాడు. ఆ దరఖాస్తు మీద ఇరుపక్షాల న్యాయవాదుల వాదనలు విన్న తర్వాత న్యాయస్థానం యావజ్జీవ కారాగార శిక్షను మరణశిక్షగా మార్చింది.

కాలిన్‌కు అది ఒక భయంకరమైన అనుభవం. ఆయన వాదించిన కేసులలో నలుగురు వ్యక్తులకు మరణశిక్షలుపడ్డాయి. నిజంగా ఒక న్యాయవాదికి అది చాలా ఆందోళనకరమైన అనుభవం.

ఇటువంటి కేసులలో సాధారణంగా ఏమి జరుగుతుందంటే సమాజానికీ, న్యాయస్థానానికీ కూడా వీరప్పన్ వంటి వారి మీద చాలా కోపం ఉంటుంది. ఆ కోపాన్ని వీరప్పన్ మనుషులుగా న్యాయస్థానపు బోనులో ఉండే వారి మీదికి, వారు నిజంగా నేరం చేసినా చేయకపోయినా బదిలీచేస్తారు.

అలా మరణశిక్ష ఖరారు అయిన తర్వాత ఆ శిక్షకు వ్యతిరేకంగా నన్ను వాదించమని అడిగారు. ఈ కేసులో మరణశిక్ష ఎందుకు విధించగూడదో ఆ ప్రత్యేక న్యాయస్థానపు న్యాయమూర్తిని ఒప్పించడానికి నాకు చాలా సమయం పట్టింది. ఆ కేసులోని సాక్ష్యాధారాలలో వీరప్పన్ క్రూరత్వానికి నిదర్శనంగా ఉన్న భాగాలను న్యాయమూర్తికి చూపించి వీరప్పన్ స్వభావం ఎంత క్రూరమైనదో నేను చూపాను. ఏవో కారణాలవల్ల తనతోపాటు తిరగడానికి వచ్చిన ఒక మహిళవల్ల తనకు పుట్టిన ఆ బిడ్డను కూడా వీరప్పన్ ఎంత క్రూరంగా చంపాడో ఆ సాక్ష్యాలలో ఉంది. అడవులలో తిరుగుతున్నప్పుడు ఆ బిడ్డ ఏడిచాడని, ఆ ఏడుపు తమను పట్టిస్తుందనే కారణంతో బిడ్డను వీరప్పన్ చంపేశాడని సాక్షులు చెప్పారు. అలా బిడ్డను పోగొట్టుకున్న తల్లి కూడా ఏడవగూడదని, శోకాలు పెట్టగూడదని వీరప్పన్ శాసించాడని సాక్షులు చెప్పారు. ఆ మాదిరిగా వీరప్పన్ పరిసర గ్రామాల ప్రజలందరినీ భయభీతావహంలో ముంచాడు. ఆ గ్రామాలలో ఎవరయినా తన మాట వినకపోయినా, తాను శాసించిన తర్వాత అందుకు భిన్నంగ ప్రవర్తించినా వీరప్పన్ నిర్దాక్షిణ్యంగా కాల్చి పారేసేవాడని సాక్ష్యాల ద్వారా నేను చూపాను. అలా రాజ్యం నడుస్తున్న చోట ఎంతోకాలంగా ఆ అడవిదొంగ ఆజ్ఞలను పాటిస్తూ వస్తున్న ఎవరయినా అతను చెప్పిన మాట జవదాటలేరని,ఈ కేసులోని హత్యలు కూడా అలా జరిగినవేనని, ఆ హత్యలు జరిగినప్పుడు వీరప్పన్ స్వయంగా అక్కడ ఉండి ఆ హత్యలు జరిపించాడని సాక్ష్యాల ఆధారంగానే నేను న్యాయమూర్తికి చూపించాను. అందువల్ల

ఎటువంటి స్వతంత్ర నిర్ణయానికి అవకాశంలేని స్థితిలో నిందితులు ఆ పనులు చేశారని, ఆ కారణంగా వారి మీద మరణశిక్ష విధించడానికి అవకాశం లేదని నేను వాదించాను. మొత్తానికి ఆ విజ్ఞుడైన న్యాయమూర్తి నా వాదనతో ఏకీభవించాడు. మరణశిక్ష విధించవక్కరలేదని, యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తే చాలునని భావించాడు.

కాలిన్ లాగ తాము చేసిన కృషికి దక్కిన అనూహ్య ఫలితం చూస్తే ఏ న్యాయవాదికైనా విచారంగానే ఉంటుంది. అందులోనూ మాన హక్కుల న్యాయవాదికి అటువంటి అనుభవం బాధాకరమే.

కాలిన్ గాన్ సాల్వేస్‌ను అఫ్జల్ గురు మరణశిక్ష విషయంలో కూడా అవసరమైన వివాదంలోకి లాగారు. అది దురదృష్టకరం. అక్కడ కాలిన్ మరణశిక్షకు వ్యతిరేకంగా ప్రత్యామ్నాయ వాదనలను వెతుకుతూ ఒక మనిషిని చనిపోయేవరకూ ఉరితీయాలని అనడం క్రూరమైనదనీ, అసాధారణమైనదనీ అన్నాడు. అంటే ఇతరరకాలుగా మరణశిక్ష అమలు చేయవచ్చునని దాని అర్థం కాదు.

ఒక శిక్షారూపంగా మరణశిక్ష ఉండగూడదనేది నా కచ్చితమైన అభిప్రాయం. అందువల్ల నేను మరణశిక్షకు మొత్తంగా వ్యతిరేకిని. అది మొదటి నుంచీ చెపుతూనే వస్తున్నాను. మేమేమీ ప్రత్యేకంగా స్త్రీలను ఉరి తీయగూడదనో, దళితులను ఉరితీయగూడదనో, విప్లవకారులను ఉరితీయగూడదనో మాత్రమే అనడంలేదు. అసలు ఏ ఒక్కరినీ ఉరితీయగూడదనేది మా విశ్వాసం. మనం ఒక రాజ్యాంగం ద్వారా పరిపాలించబడుతున్నప్పుడు ఒక్కరి మీదా మరణశిక్ష ఉండూడదు. ప్రజాస్వామ్యం అంటే జీవితాన్ని వికసింపజేసేదే గాని జీవితాన్ని అణచివేసేది కాదు.

ఇక్కడ నా అనుభవం ఒకటి పంచుకోవాలి. మన రాష్ట్రానికి కెసి అబ్రహాం గవర్నర్‌గా ఉన్నప్పుడు ఆయన హైకోర్టులో నిర్ధారణ కోసం వేచిచూస్తున్న రెండు మరణశిక్షల పునర్విచారణను నా దగ్గరికి పంపారు. ఆయన నన్ను అడిగిందల్లా ఆ కేసులో నిందితులయిన ఇద్దరు ఉరికంబం ఎక్కకుండా కాపాడడం సాధ్యమవుతుందేమో చూడమని. ఉరికంబం నీడలో ఉన్న ఆ ఇద్దరు అభాగ్యులు అన్నదమ్ములు. పదవీ విరమణ పొందిన ఒక పోలీసు కానిస్టేబుల్ కొడుకులు. ఆ ఇద్దరూ కలిసి తమ తండ్రిని గొంతుకోసి చంపినట్టున్నారు. తమ తండ్రి ప్రతిరోజు ఫుల్‌గా తాగివచ్చి తమ తల్లిని చావచితకగొడుతుంటే ఆ కొడుకులు చూస్తూ సహించలేకపోయారు. తమ తల్లి అనుభవిస్తున్న ఆ హింస ఆగిపోవవాలంటే తమ తండ్రి అంతు చూడవలసిందే అని వాళ్లనుకున్నారు. ఒకరోజు తమ ఆలోచనను అమలులో పెట్టారు. వారిని అరెస్టు చేసి విచారణ జరిపారు. సెషన్స్ కోర్టు మరణశిక్ష విధించింది. ఆ మరణశిక్ష ఖరారు కోసం హైకోర్టుకు వచ్చింది.

ఇటువంటి కేసులో హైకోర్టులో మళ్లీ విచారణంతా జరుగుతుంది. సాక్ష్యాధారా లన్నిటినీ మళ్లీ పరీక్షించడం జరుగుతుంది. ఆ సాక్ష్యాధారాలు నిందితులకు వ్యతిరేకంగా

ఎటువంటి హేతుబద్ధమైన అనుమానానికీ ఆస్కారంలేని రీతిలో నేరాన్ని నిర్ధారిస్తున్నాయో అని మళ్లీ పరీక్షించడం జరుగుతుంది. నిందితుడునేరస్తుడా కాదా అని ఖరారు చేయడం జరుగుతుంది. ఈ విచారణ క్రమాన్నంతా పరిశీలిస్తే ఒక ప్రజాస్వామిక పాలనలో వ్యవస్థ మానవ ప్రాణానికి చాలా ప్రాముఖ్యత, విలువ ఇస్తుందని, ఒక ప్రాణం తీయవలసి వచ్చినప్పుడు కూడా చాలా వివరంగా వెనుకా ముందులు ఆలోచిస్తుందని అనిపిస్తుంది.

కాని ఈ నిర్ధారణా క్రమాన్ని, అన్ని కోణాల నుంచి ఒకటికి రెండుసార్లు ఆలోచించే క్రమాన్ని తీవ్రవాద నిరోధక చట్టాలనబడేవి రద్దుచేశాయి.

ఒకసారి జరిగిన విచారణను మరొకసారి పరీక్షించడం అనే క్రమానికి మానవహక్కుల కోణం ఉంది.

మరణశిక్షల విషయంలో మరొక గమనించవలసిన అంశమేమంటే మరణశిక్షణను చివరి ప్రత్యామ్నాయంగా మాత్రమే చూసి జీవితాన్ని కాపాడే ధోరణి. మరణశిక్ష తప్పనిసరిగా విధించవలసిందే అనే వైఖరిని 1973లో నేర శిక్షాస్మృతిని అమలులోకి తెచ్చిన తర్వాత అనేక తీర్పులద్వారా, నిర్ణయాల ద్వారా అనేక న్యాయస్థానాలు మరణశిక్షలను అరుదైన వాటిలోకెల్లా అరుదైన సందర్భంలో మాత్రమే విధించాలని నిర్ధారించాయి. మరణశిక్ష రద్దు చేయాలని వాదించేవారు సాగించిన నిర్విరామ కృషివల్లనే ఇది సాధ్యమయింది. తీవ్రవాదుల విషయానికి వచ్చేసరికి, తీవ్రవాద హింసం గురించి వెలువడిన చట్టాలు ఆ నిందితులకు ఇలా మరొకసారి విచారణ, పరీక్ష జరిపే అవకాశాన్ని నిరాకరించాయి. అంటే తీవ్రవాద నిరోక చట్టాలు నేరశిక్షాస్మృతిని పక్కనపెట్టి నేరుగా సుప్రీంకోర్టులో నిర్ధారణకు వెళతాయి. మరొకసారి విచారణ జరిపి, సాక్ష్యాధారాలను పునఃపరీక్షించి నేరాన్ని నిర్ధారించే మధ్యంతర స్థాయిలోని హైకోర్టును ఈ తీవ్రవాద నిరోధక చట్టాలు తొలగించి వేశాయి. ఒక వేళ అటువంటి మధ్యంతర పునర్విచారణ అవకాశమే ఉంటే జిందా, సుఖాల మీద మరణశిక్ష అమలయి ఉండేది కాదు.

మన రాష్ట్రంలో ప్రఖ్యాతమైన సుఖాని కేసు తీసుకోండి. ఒక యువతి మీద జరిగిన అత్యంత దారుణమైన నేరం అది. ఎంతమాత్రం క్షమార్హం కాని నేరం అది. నేరస్తుడు ఆ యువతి ముఖం మీద, శరీరం మీద కత్తితో దారుణంగా నరికాడు. సమాజంలోని అనేకరంగాలలో చాలా గగ్గోలు పుట్టింది. ప్రజలలో ఒక వర్గం ఆ నేరస్తుడికి మరణశిక్ష విధించవలసిందేనని ఆదోళన ప్రారంభించింది. ఆ నేరస్తుడికి న్యాయ సహాయం అందించగూడదని స్థానిక బార్ అసోసియేషన్ తీర్మానించింది. ఇటువంటి ధోరణి ప్రమాదకరమైనదని నేననుకుంటాను. సరిగ్గా ఇదే ధోరణి పార్లమెంటు భవనం మీద దాడి కేసులో కూడా వ్యక్తమయింది. సుఖాని కేసులో అతని తరపున మొదట వాదించిన న్యాయవాది కూడా ఆ తర్వాత తప్పుకున్నాడు.

అసలు న్యాయభావన అంటే ఏమిటో, న్యాయస్థానాలు ఎందుకు ఉన్నాయో, న్యాయ

వ్యవస్థలో న్యాయమూర్తి పాత్ర ఏమిటో తెలియని అత్యుత్సాహపరుడైన ఒక జిల్లా జడ్జి, సాక్షులను తానే క్రాస్ ఎగ్జామిన్ చేసి పరమ ఘోరంగా విచారణ జరిపాడు. నిందితుడు తన తరపున న్యాయవాది వాదించడం కాకుండా నిందితుడే స్వయంగా చెప్పుకోగా విన్నాడు. చివరికి మరణశిక్ష విధించాడు. సమాజంలో ఒక వర్గం కోరుకున్నట్టుగా తీర్పు ఇచ్చాడు.

ఆ కేసు పునర్విచారణ న్యాయమూర్తులు జస్టిస్ బాపట్, జస్టిస్ వర్మల బెంచి ముందుకు వచ్చింది. అక్కడ కింది కోర్టులో శిక్ష విధించిన న్యాయమూర్తిలాంటి వారికి సెషన్స్ అధికారాలు ఇవ్వగూడదని, మొత్తం కేసు పునర్విచారణ జరపాలని వాదన జరిగింది. కాని హైకోర్టు న్యాయమూర్తులు మాత్రం కొందరు సాక్షుల క్రాస్ఎగ్జామినేషన్ సక్రమంగా జరగలేదని కనుక విజయవాడలో మరొక సెషన్స్ జడ్జి దగ్గర విచారణ జరగాలని ఆదేశించారు. ఆ పని చేయడానికి ప్రభుత్వం తరపున న్యాయవాదిని నియమించారు. ఇక మిగిలిన సాక్షులను నేను పరీక్షించాను. సుభానికి కింది కోర్టు విధించిన శిక్షను సవాలు చేయలేదుగాని, యావజ్జీవ కారాగార శిక్ష విధించవచ్చునని వాదించాను. అక్కడ అవతలిపక్షం వాదనలను సానుభూతితో వినడానికి సిద్ధంగా ఉన్న యువ న్యాయమూర్తి ఉన్నాడు. ఆయన నా వాదనలతో ఏకీభవించి నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధించాడు.

ఇక విజయవాడలో శ్రీలక్ష్మి అనే యువతిని నరికి చంపిన దురంతం విషయానికి వస్తే, నిందితుడు మనోహర్ తరపున వాదించగూడదని అక్కడి స్థానిక బార్ అసోసియేషన్ ఒక తీర్మానం ఆమోదించింది. అప్పుడు నేను ఆ బార్ అసోసియేషన్‌కు ఒక లేఖ రాశాను. న్యాయవాదులు అటువంటి తీర్మానాలు ఎందుకు చేయగూడదో ఆ లేఖలో వివరించాను. అంత ప్రముఖులు కాని నిందితుల తరపున వాదించకుండా న్యాయవాదులను అడ్డగించడం సమాజంలో చాలా మర్యాదపూర్వకమన పని అని అనిపిస్తుంది. కాని చాలా సందర్భాలలో అది చాలా ఉన్మాదపూరిత వైఖరిని తీసుకుంటుంది. ఒక గుంపు తత్వానికి ప్రాతినిధ్యం వహిస్తుమది. నిందితులు ప్రముఖు లయినట్టయితే, వాళ్ళు నేరస్తులేనని అందరికీ తెలిసినా వాళ్ల తరపున వాదించడానికి న్యాయవాదులు లెక్కలేనంత మంది ముందుకొస్తారు. అలా వాదించగూడదని ఎవరూ తీర్మానాలు చేయరు.

నేరస్తులపట్ల వ్యక్తమయ్యే ఆ అసహనాన్ని, వ్యతిరేకతనూ అర్థం చేసుకోవడానికి పెద్ద సైద్ధాంతిక విశ్లేషణ ఏమీ అవసరంలేదు. ప్రతీకార వాంఛ అనీ, జరిగిన నేరానికి తగిన శిక్ష విధించడం అనీ పిల్లకాయల పద్ధతిలో చేసే ప్రాథమికమైన వాదనలు ఆ వ్యతిరేకతను సంపూర్ణంగా వివరించలేవు.

నిజానికి ఏసుక్రీస్తు చాలా తేలిక మాటల్లో నేర హేతువును బహిర్గత పరిచాడు. హత్యవంటి నేరాల విషయంలో అది పూర్తిగా నిజం కాకపోవచ్చుగాని, సాధారణ నేరాల

విషయంలో నిజమే. మామూలుగా నేరస్తులు సమాజంలో ఒక ముఖ్యమైన స్థానాన్ని ఆక్రమించుకుని కూచుంటారు. ఆ నేరస్తులు సమాజంలో నేరాలను ఉత్పత్తి చేయడం మాత్రమే కాదు. ఆ నేరాలను విచారించే మొత్తం యంత్రాంగాన్ని తయారు చేసి పెడతారు. న్యాయస్థానాలు, న్యాయవాదులు, న్యాయశాస్త్ర కోవిదులు ఆ నేరాలను సవివరంగా పరిశోధిస్తుంటారు. శిక్షా సిద్ధాంతాలు తయారు చేస్తుంటారు. ప్రజలు చదువుకుని పొద్దుపుచ్చుకునేందుకు నేరకాల్పనిక సాహిత్యాన్ని సృష్టించే రచయితలు కూడా ఈ యంత్రాంగంలో భాగమే. ఆ కల్పనిక సాహిత్యం చదువరులను ఉత్తేజపరచి, నేరస్తులను శిక్షించడంలో వారికి ఆనందం కలిగిస్తుంటుంది.

ఏ మనిషీ నేరస్తుడుగా పుట్టడు. చుట్టూ ఉన్న దోపిడీ వ్యవస్థే వేరు వేరు రకాల నేరాలూ నేరస్తులు పుట్టి పెరగడానికి వీలు కలిపిస్తుంది. ఆ వ్యవహారాన్ని వివరించడానికి ఎటువంటి సులభమైన వివరణలూ సరిపోవు. నేర విచారణలోని ఈ సంక్లిష్టతను అర్థం చేసుకున్నందువల్లనే, న్యాయశాస్త్ర పరిణామక్రమంలో సత్యాన్ని కనిపెట్టడానికి న్యాయశాస్త్ర కోవిదులు ఎప్పుడూ ప్రయత్నించలేదు. ఏసుక్రీస్తు తర్వాత ఎన్నో తరాలపాటు న్యాయశాస్త్రవేత్తలు ఒక చర్చ చేస్తూ వచ్చారు. ఏసుక్రీస్తుకు జుడియా విధించిన శిక్ష సమంజసమేనా అని చర్చిస్తూ వచ్చారు. క్రీస్తును శిలువ ఎక్కించి చంపాలని శిక్ష విధించడం న్యాయమేనా అనే ఆ ప్రశ్న బహుశా మనను ఈ రోజుకు కూడా వెంటాడుతూనే ఉంది. ఎందుకంటే న్యాయ వ్యవస్థలో తీర్పులు చెప్పే పద్ధతి, ఆ తీర్పుకు రావడానికి అవలంభించే విధానం కనుక్కోవలసిన సత్యానికి ఉజ్జాయింపులో తప్ప కచ్చితంగా నిశ్చితాలని చెప్పే వీలులేదు.

ఒకసారి నాకు కర్నాటకలోని బెల్గాం సెంట్రల్ జైలులో మరణశిక్ష పడి ఉరితీత కోసం ఎదురుచూస్తున్న ఖైదీ నుంచి ఒక ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరంలో చెప్పిన కథ ఒక కాల్పనిక కథ లాగ ఉంది. అతను ఒక దర్జీ అతనికి వరుసకుసోదరి అయిన దనవంతురాలి ఇంట్లో ఉండేవాడు. ఆమె తన నగలు ఎక్కడ దాచిపెడుతుందో అతనికి తెలుసు. వాటిని అప్పుడప్పుడు తీసి వాటిని తాకట్టు పెట్టి ఆ డబ్బుతో బట్టలు కొని, దుస్తులు కుట్టి అమ్మి మళ్ళీ డబ్బులు రాగానే ఆ నగలు విడిపించి ఎక్కడివి అక్కడ పెట్టేసేవాడు. ఇలా ఎంతకాలం గడిచిందో తెలియదు. కాని ఒక రోజు అతను అలా నగలు తీస్తూ ఉండగా ఆ సోదరి తల్లి అక్కడికి వచ్చింది. అది ఒక రాత్రిపూట. తాను ఆ నగలు దొంగతనం చేస్తుండగా ఎవరో చూస్తున్నారనే కంగారులో అయన పక్కనే ఉన్న కత్తిపీట తీసుకుని ఆ ముసలామె మీద దాడి చేశాడు. అమె అక్కడికక్కడే చనిపోయింది. ఆ తర్వాత వచ్చిన ఆమె కూతురిని కూడా అతను చంపేశాడు. తర్వాత వెళ్ళి తనంతట తనే పోలీసులకు లొంగిపోయాడు. కేసు విచారణ జరిగి అతనికి మరణశిక్ష విధించారు. అలా అతను చావు కోసం ఎదురుచూస్తూ బెల్గాం జైలులో ఉన్నాడు.

ఈ కేసులో అతనికి మరణశిక్ష విధించనక్కరలేదని నేను భావిస్తాను. ఆ కేసు వివరాలు చూస్తే అతనికి తన సోదరి పట్ల చాలా అభిమానం ఉండేదని తెలుస్తుంది. అయినా సోదరికి చెందిన ఆస్తిని దొంగిలించడం నైతిక తప్పిదమే. అతని మీద ఆమె ఉంచిన నమ్మకానికి ద్రోహం చేయడమే. కాని ప్రతిసారీ తనకు డబ్బులురాగానే నగలు విడిపించి జాగ్రత్తగా, నమ్మకంగా ఉన్నచోటనే పెట్టడం చూస్తే దాన్ని నమ్మక ద్రోహమనీ, దొంగతనమనీ, తప్పుడు పద్ధతులలో మార్చడమనీ అనగలమా? కనుక ఆ కేసులో అనేక సంక్లిష్ట, సందేహాస్పద అంశాలున్నాయి. అందువల్ల ఇటువంటి నేరాలను చిన్న శిక్షలతో సరిపెట్టవచ్చు.

చాలా సంవత్సరాల కింద సికిందరాబాద్ జైలులో నరసింహారెడ్డి జైలరుగా ఉన్నప్పుడు నాకు ఫోన్ చేసి వచ్చి ఒక ఖైదీని కలవగలరా అని అడిగాడు. ఆ ఖైదీ ఒక స్త్రీపై అత్యాచారం, హత్య నేరాలకు గాను మరణశిక్షకు గురయి ఉరికంబం నీడలో ఉన్నాడు. నేను వెంటనే ముషీరాబాద్ జైలుకు వెళ్ళి ఆ ఖైదీని కలిశాను. అతని మీద నేర నిర్ధారణ జరిగిన తీరు గాని, అతనిపై విధించిన శిక్షగాని అత్యంత దారుణమైనవి. అతను ఒకనిరుపేద, అణగారిన వర్గానికి చెందినవాడు. అతనికి భార్య, ఒక బిడ్డ ఉన్నారు. అతనికి ఒక ఎకరం భూమి ఉండేది. ఆ భూమి మరొక పెద్ద భూస్వామి భూమిని ఆనుకుని ఉండేది. ఆ భూమిని ఆక్రమించుకోవడానికి ఆ భూస్వామి అతని మీద ఈ అత్యాచారం, హత్య నేరాలు బనాయించాడు. నేను జైలులో అతనిని కలిసి మాట్లాడినంతసేపూ అతను ఏడుస్తూనే ఉన్నాడు. ఆ శిక్ష మీద అప్పీలు కేసు నేను చేశాను. చూడగా కింది కోర్టులో కేవలం ఆ నిందితుడు పోలీసుల దగ్గర ఇచ్చిన ఒప్పుకోలు ప్రకటనల మీద మాత్రమే ఆధారపడి మరణశిక్ష విధించారు. అసలు మన పోలీసులు అటువంటి ఒప్పుకోలు ప్రకటనలు ఎట్లా రాస్తారో, ఎట్లా తయారు చేస్తారో, ఆ ప్రకటనల మీద నిందితుల చేత సంతకాలు ఎట్లా పెట్టించుకుంటారో తెలుసుగనుక పై న్యాయస్థానాలు ఆ ఒప్పుకోలు ప్రకటనలు సాక్ష్యాధారాలుగా అనుమతించనే అనుమతించవు. అందువల్ల నేను చాలా సులభంగా హైకోర్టులో అతని మీద కేసు కొట్టివేయించగలిగాను. అతణ్ని నిర్దోషిగా విడుదల చేయించగలిగాను.

1980ల మొదట్లో బర్ల యాదగిరిరాజు అనే నక్సలైటుకు కూడా న్యాయమూర్తి గోగినేని రాధాకృష్ణమూర్తి మరణశిక్ష విధించాడు. అక్కడ కూడా స్వతంత్ర సాక్షులు చూపించిన ఆధారాలేమీ లేవు. అసలు ఆ సాక్షులు యాదగిరిరాజును గుర్తించనుకూడా లేదు. కాని నేరం జరిగి చాలా సంవత్సరాలు అయింది గనుక, ఆ సాక్షులు నిందితుడిని గుర్తుపట్టకపోయి ఉంటారనీ, అందువల్ల వారు దర్యాప్తు సమయంలో పోలీసుల దగ్గర చేసిన ప్రకటనలను అంగీకరించవచ్చుననీ న్యాయమూర్తి అన్నాడు. అలా పోలీసు ప్రకటనలను బట్టి ఒక నేరాన్ని నిర్ధారించడం, తద్వారా శిక్ష విధించడం ఎంత

అసమంజసమో, ఎంత అన్యాయమో పై కోర్టులో న్యాయమూర్తిచేత ఒప్పించడానికి నాకు పావుగంట కూడా పట్టలేదు.

అయితే ముందు మరణశిక్ష విధించిన జడ్జిని ఆ తర్వాత బెంగళూరు కుట్ర కేసు సమయంలో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించారు. నిందితుల నేరాల్ని ఏదో ఒక రకంగా నిర్ధారించి కఠిన శిక్షలు విధింపజేయడమే తమ బాధ్యతగా భావించే పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అవసరమైన పరిజ్ఞానం లేని జడ్జిలు ఉన్న ప్రస్తుత సంస్కృతిలో మనిషి ప్రాణాలు తీసే హక్కును న్యాయవ్యవస్థ చేతిలో పెట్టడం అసమంజసం అనుకుంటాను.

అసలు మరణశిక్షకు దారితీసే క్రమం అంతా చూస్తే బహుశా ఉద్దేశ్యపూర్వకంగా హత్య చేయడం అనే దానికి ఏకైక నిదర్శనం ఇదేననుకుంటాను. నిజానికి రాజ్యాంగ యంత్రం చేసే హింస ఎప్పుడయినా ఉద్దేశ్యపూర్వకమైనదే. అందువల్లనే ఎక్కడా ఏ రాజ్యాంగం రాజ్యాంగ యంత్రానికి హింస చేసే హక్కు ఇవ్వలేదు. ఎన్‌కౌంటర్ పేరుతో జరిపే హత్యలకూ మరణశిక్ష విధించడానికి ఏమీ తేడాలేదు.

మరణశిక్షలు, అసలు శిక్షలు విధించడానికి ఎప్పుడూ తాత్వికపరమైన కారణాలుండవు. కేవలం దురభిప్రాయాలు - అవి రాజకీయమైనవయినా, జాతిపరమైన వయినా, మతపరమైనవయినా నేరాలను నిర్ధారించడంలో ప్రధాన పాత్రవహిస్తాయి. అందువల్ల శిక్షలు విధించడంలో కూడా అవే ముఖ్యమైన పాత్ర వహిస్తాయి.

కిష్టాగౌడ్, భూమయ్య అనే ఇద్దరు నక్సలైటు ఖైదీలు ఉండేవాళ్లు. వాళ్లు నేరస్తులని నిర్ధారించి వారికి మరణశిక్ష విధించి ఉండాల్సింది కాదు. వారు క్షమాభిక్ష కోసం పెట్టుకున్న దరఖాస్తు, 1975 డిసెంబరు దాకా వేచిచూస్తూ ఉండింది. ఆ సంవత్సరం మేలో వారి దరఖాస్తులను కొట్టివేసి, ఉరితీయడానికి తేదీ ఖరారు చేసిన తర్వాత మేము హైకోర్టులో మరొక దరఖాస్తు వేసి వారి క్షమాభిక్ష దరఖాస్తులను పునరాలోచించవలసిందిగా ప్రభుత్వాన్ని ఆదేశించమని కోరాము. అప్పుడు హైకోర్టుకు వేసవి సెలవులు. సెలవుల బెంచి మీద న్యాయమూర్తి జస్టిస్ ఓ చిన్నపరెడ్డి ఉన్నారు. ఆయన దగ్గర మేం హౌజ్ మోషన్ దరఖాస్తు ఇవ్వగా ఆయన ఉరితీతను తాత్కాలికంగా నిలుపుదల చేయాలని ఉత్తర్వులు ఇచ్చారు. కాని దరఖాస్తు విచారణ, వాదనల దశకు వచ్చేసరికి జస్టిస్ చిన్నపరెడ్డి పంజాబ్ హర్యానా హైకోర్టుకు బదిలీ అయిపోయారు. అప్పటికే ఎమర్జెన్సీ హవా నడుస్తోంది.

అప్పటికి న్యాయస్థానాలు సాధారణంగా ప్రతి మరణశిక్షనూ ఆ శిక్షపడిన ఖైదీ రెండు మూడు సంవత్సరాలు ఉరికంబం నీడలో గడిపిన తర్వాత యావజ్జీవ కారాగార శిక్షగా మారుస్తూ ఉండేవి. ఇటువంటి పద్ధతి చాలా క్రమబద్ధంగా జరుగుతున్నది గనుక అది దాదాపు ఒక న్యాయసూత్రంగా మారిపోయిందని, రాష్ట్రపతి క్షమాభిక్ష విధించే సందర్భంలో కూడా ఇదే సూత్రం వర్తించాలని మేము వాదించాం. అంతేగాక కిష్టాగౌడ్ భూమయ్యలు రాజకీయ ఖైదీలనీ, రాజకీయ ఖైదీ అనే వర్గీకరణను మన స్వాతంత్ర్యోద్యమం

గుర్తించిందని, అందువల్ల వారి మరణశిక్షను తగ్గించి యావజ్జీవ శిక్షగా మార్చవలసి ఉందని మేం వాదించాం.

ఆ వాదనల మొత్తంలో నాకు బాగా వివరంగా గుర్తుండిపోయిన సందర్భం ఒకటుంది. అది జస్టిస్ మధుసూదనరావు వేసిన ప్రశ్న, నేను ఇచ్చిన జవాబు. అపుడు బెంచి మీద సీనియర్ న్యాయమూర్తిగా జస్టిస్ మాధవరెడ్డి కూడా ఉన్నారు.

'రాజ్యాంగంలో విశ్వాసంలేని ఈ నక్సలైట్లు రాజ్యాంగం కింద రక్షణలు పొందాలను కోవడం ఏమిటి?' అని ఆయన నన్ను అడిగారు.

'ఈ విషయాలు న్యాయస్థానాల ముందుకు వచ్చినపుడు, అసలు సవాలు వాళ్లు ఏ విలువలకు కట్టుబడుతారని కాదు, మనం ఏ విలువలకు కట్టుబడుతామని' అని నేను జవాబు ఇచ్చాను.

ఆ కేసు సుప్రీంకోర్టులో విచారణ జరిగినపుడు గార్గ్ ఆ ఇద్దరూ రాజకీయ ఖైదీలు అనే పునాదిపైననే చాలాసేపు వాదించాడు. అక్కడ వాదనలు నడిచినపుడు బెంచిపై న్యాయమూర్తి జస్టిస్ కృష్ణయ్యర్ అధ్యక్షత వహిస్తున్నాడు. గార్గ్ చాలా పట్టుదల ఉన్న యోధుడు. బహుశా అటువంటి న్యాయవాద యోధులు గతంలోనూ, భవిష్యత్తులోనూ కూడా చాలా తక్కువ మంది ఉంటారు. ఆయన భగత్‌సింగ్ దగ్గర ప్రారంభించి, అపుడు వార్తల్లో ప్రముఖంగా ఉండిన ఐదుగురు స్పానిష్ నిందితుల దాకా ఎంతోమంది ఉదాహరణలు ఉటంకించి వాళ్లెవరూ సాధారణ నేరస్తులు కారని, వారిని ప్రత్యేకంగా గుర్తించవలసిందేనని వాదించారు. అలాగే మరణశిక్ష అనేది ఒక పాశవిక న్యాయచర్య అనే అవగాహన పెరుగుతున్నదని కూడా ఆయన వాదించాడు.

ఈ వాదనలకు స్పందనగా, "మేం నేరశిక్షాస్మృతిని కాపాడడానికి ప్రమాణం చేసి ఈ స్థానంలో కూచున్నాం. ఆ నేర శిక్షాస్మృతి నేరాల మధ్య ఎటువంటి తేడాను చూడదు. మన నేర న్యాయవ్యవస్థకు ఉన్న నిష్పాక్షిక దృష్టిలో హత్య అంటే హత్య మాత్రమే" అని కృష్ణయ్యర్ అన్నారు.

ఐతే అది హత్య కాదని ఎవరమూ అనలేదు. మేం అడిగిందల్లా ఆ శిక్షను మరణశిక్ష నుంచి యావజ్జీవ శిక్షగా తగ్గించమని మాత్రమే. అంతేకాదు, మన రాజ్యాంగంలోని ప్రవేశిక, ఆదేశిక సూత్రాలు కూడా మన రాజ్యాంగ సంస్థలన్నింటి చర్యలలో రాజకీయ న్యాయభావన ఉండాలని నిర్దేశిస్తున్నాయి.

ఇక రెండో వాదనకు జవాబు చెపుతూ ఆ మరణశిక్ష 1972లో విధించినదని, ఇపుడు ఇంత ఆలస్యం అయిపోయింది గనుక ఇక ఆ నష్టాన్ని సరి చేయలేమని కృష్ణయ్యర్ అన్నారు.

రాజ్యాంగానికి 44వ సవరణలో ప్రభుత్వానికి ఎమర్జెన్సీ ప్రకటించిన తర్వాత ఏ అధికారాలు సమకూరుతాయో స్పష్టీకరించారు. అయితే ఆ అధికారాలను కేవలం యుద్ధ

సమయాలలోనూ, ఇతర దేశాల దురాక్రమణల సందర్భంలోనూ, సాయుధ తిరుగుబాట్ల సమయంలోనూ మాత్రమే వాడవలసి ఉంటుంది. కాని సాయుధ తిరుగుబాటు సమయంలో అయినా తప్పు చేసిన పోలీసు అధికారుల మీద విచారణ కోసం సాధారణ న్యాయస్థానాలను ఆశ్రయించవలసిన పద్ధతి రద్దుకాదు.

నక్సలైట్లను నిర్బంధించడం కోసం వారిని వెతుకుతూ వెళ్లినప్పుడు వారిని చంపడం జరిగితే దాన్ని చట్టం అనుమతించవలసి ఉంటుందా, లేక ఆ చంపే అధికారాన్ని ఆ పోలీసు బృందానికి నాయకత్వం వహిస్తున్న అధికారి విచక్షణాధికారానికో, లేక ఆ బృందంలోని ఎవరయినా ఒకవ్యక్తి విచక్షణాధికారానికో వదలవచ్చునా? ఒక మనిషి ప్రాణాన్ని తీసేందుకు పోలీసులకు స్వతంత్రాధికారం ఉందా?

కూంబింగ్ కోసం వెళ్లడంగాని, అటువంటి పేరుగల మరొక చర్యలె అయినాగానీ, పోలీసులు కాల్పులు ప్రారంభించి ఒకరినో అంతకంటే ఎక్కువ మందినో చంపడం అనేది భారత సాక్ష్యాధారాల చట్టం సెక్షన్ 105 ప్రకారం ఉదేశ్యపూరితమైన చర్య అవునా కాదా? ఆ పని ఆత్మరక్షణ కోసమే చేయవలసి వచ్చిందనే వాదనకన్న ముందే ఈ ఉద్దేశ్యం ఉన్నట్టు కాదా?

ఎన్‌కౌంటర్ పేరు మీద పోలీసులు ఎవరినయినా చంపినప్పుడు ఆ మృతి మీద ఒక మెజెస్ట్రీరియల్ విచారణ జరిపించడం జరుగుతున్నది. ఆ విచారణ భారత నేర శిక్షాస్మృతి ప్రకారం జరిగినా, అప్పటికి అమలులో ఉండే పోలీసు స్టాండింగ్ ఆర్డర్స్ ప్రకారం జరిగినా ఒక సెషన్స్ న్యాయస్థానం జరిపే న్యాయవిచారణకు ప్రత్యామ్నాయ మవుతుందా? అందులోనూ పోలీసు స్టాండింగ్ ఆర్డర్స్‌కు చట్ట ప్రతిపత్తి కూడా లేదు. సెషన్స్ న్యాయవిచారణ ఎట్లా జరగాలో భారత నేర శిక్షాస్మృతి చాలా వివరంగా నిర్దేశించింది. మరి ప్రభుత్వోద్యోగులు హత్యానేరాలకు పాల్పడినప్పుడు విచారణను కేవలం శాఖాపరమైన విచారణకు, నిర్ణయానికి పరిమితం చేయడం చట్టప్రకారం సరయినదేనా? మేనకాగాంధీ కేసులో 1978లో ఇచ్చిన తీర్పులోనూ, ఆ తర్వాత అనేక న్యాయస్థానాలు పునరుద్ఘాటించిన తీర్పులలోనూ రాజ్యాంగ అధికరణాలు 14, 21లకు ఇచ్చిన వ్యాఖ్యానాలను ఈ రకమైన విచారణ పాటిస్తుందా?

ఒక మనిషిని చంపడం అనే నేరం చేసినప్పుడు చట్టం సాధారణ పౌరుని పట్ల ఒక రకంగానూ, ప్రభుత్వోద్యోగిపట్ల మరో రకంగానూ వ్యవహరించవచ్చునని ఎవరయినా, న్యాయస్థానాన్ని ఒప్పించగలరా? మన రాజ్యాంగ సూత్రాల ప్రకారం అటువంటి వ్యాఖ్యానం చెప్పే అవకాశం ఉందా? ఒక క్షణం ఆందోళనకు గురయిన సైనికులకీ సాధారణ పౌరునికీ ఏమీ తేడా లేదని, అందువల్ల సైనికుడు ఎటువంటి మినహాయింపుకూ అర్హుడు కాదని బర్డెట్ వర్సస్ అబ్బాట్ అనే కేసులో బ్రిటిష్ న్యాయమూర్తి లార్డ్ మాన్స్ ఫీల్డ్ తీర్పు ఇచ్చారు. మరి పోలీసుల విషయంలోనూ, పారామిలిటరీ బలగాల

విషయంలోనూ పరిస్థితిలో మౌలికమైన మార్పు ఏమయినా ఉందా? ఇక్కడ నేరస్తులను విచారణ నుంచి మినహాయించవలసిన ప్రత్యేక పరిస్థితి ఏర్పడిందా? రెండు వందల సంవత్సరాల కింద వెలువడిన ఆ తీర్పుకు నిర్ధారణగానే అధికరణం 21ని మార్చడానికి వీలులేదని నిర్దేశించలేదా?

ఇటీవల ఎన్‌కౌంటర్లను హత్యా నేరాలుగా పరిగణించాలనే వాదన వచ్చినపుడు ప్రభుత్వమూ, పోలీసు అధికారులూ ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసుల పేర్లు బయటపెట్టడం కుదరదనీ, అందువల్ల వారి భద్రతకు ప్రమాదం ఏర్పడుతుందనీ వాదించారు. ఎన్‌కౌంటర్లలో పాల్గొని అవతలి మనుషులను చంపిన పోలీసుల వీరత్వాన్ని మెచ్చుకుని వారికి నగదు పారితోషికాలు, బిరుదులు, పతకాలు ఇవ్వవచ్చుగాని, వారి పేర్లు బయటపెట్టమని అగడడం మాత్రం కుదురదన్న మాట.

ఒక నేరం జరిగినప్పుడు ఆ నేరంలో పాల్గొన్న వారి పేర్లను బయటపెట్టడానికి నిరాకరించడం అంటే, భారత నేర శిక్షా స్మృతి ప్రకారం శిక్షార్హులైన నేరస్తులను కాపాడడం కాదా? ఈ మాదిరిగా నేరస్తుల పేర్లు బయటపెట్టకుండా ఉండడానికి రాజ్యాంగ అధికరణాలు 14గాని, 21గాని అధికరారులకు అవకాశం ఇస్తాయా? అంతేగాక, ఇలా నేరస్తుల పేర్లను దాచి పెట్టడం సమాచార హక్కు చట్టానికి ఉల్లంఘన కాదా?

ఇక్కడ ఇంకొక ఆసక్తికరమైన అంశం కూడా దాగి ఉంది. నిజానికి భారత శిక్షా స్మృతిగాని, భారత నేరశిక్షాస్మృతిగాని నేరస్తుడు అనేమాట వాడవు. అక్కడ చెప్పేదంతా జరిగిన నేరాన్ని పరిశోధించడం గురించి మాత్రమే. ఆ దర్యాప్తు పూర్తయిన తర్వాతనే ఆ నేరం చేసినదెవరో తెలుస్తుంది. అప్పుడే నేరస్తుడు అనే మట వస్తుంది. నేరస్తుడిని నిర్బంధించడానికి, శిక్ష విధించడానికి సహకరించడమే దర్యాప్తు విచారణ పని అని శిక్షాస్మృతి నిర్దిష్టంగా చెపుతుంది. అంటే మొట్టమొదట చేయవలసింది నేరాన్ని నమోదు చేయడం. నేరస్తుడిని నిర్ధారించడం కాదు. ఒకవేళ ఆ సమయంలో నేరస్తుడి పేరు చెప్పినప్పటికీ అది కేవలం అనుమానితుడి పేరును ప్రస్తావించడం మాత్రమే అవుతుంది. ఒకవేళ ఆ చర్య ఆత్మరక్షణ కోసమే చేసినప్పుడు కూడా ఆ అనుమానితుడు విచారణను ఎదుర్కొని తనను తాను సమర్థించుకోవలసిందే.

ఎన్‌కౌంటర్ల పేరు మీద పోలీసు అధికారులు చేస్తున్న హత్యలను కూడా మిగిలిన అన్ని హత్యలలాగే నమోదు చేయాలని, విచారణ జరపాలని, ఈ దేశంలో మరొకమనిషిని చంపిన ఏ మనిషయినా న్యాయస్థానం బోనెక్కవలసిందేనని మేం చాలా కాలంగా వాదిస్తున్నాం. ఇప్పుడు ఈ వాదనలు న్యాయస్థానాలలో కూడా ప్రతి ధ్వనిస్తున్నాయి.

ఈ ఎన్‌కౌంటర్ హత్యల వ్యవహారం గురించి మాట్లాడేటప్పుడు నాకు మన ప్రజాస్వామ్యం గురించి కూడా మాట్లాడాలని అనిపిస్తోంది.

ఎమర్జెన్సీలో జరిగిన చాలా ఎన్‌కౌంటర్ హత్యలలో గుంటూరు జిల్లాలో బడుగు

జయరావు, రత్నం సూర్యవర్మ, అత్తలూరి మల్లికార్జునావు, సత్యానందం అనే నలుగురు నక్సలైట్లు చనిపోయిన ఎన్‌కౌంటర్ కూడా ఉంది. తార్కుండే కమిటీ విచారణలలో భాగం మేం ఆ సంఘటనలను విచారించడానికి వెళ్లాం. ఆ విచారణలో భాగంగా చిలకలూరిపేటలో కొల్లా వెంకయ్యగారి అబ్బాయి డాక్టర్ కొల్లా రాజమోహన్ ఇంట్లో ఆగాం. ఆ సమయంలో కొల్లా వెంకయ్యగారు కూడా అక్కడే ఉన్నారు.

అప్పుడు మా బృందంలో న్యాయవాది కె ప్రతాపరెడ్డి కూడా ఉన్నారు. మర్నాడు ఉదయంలేచి అత్తలూరి మల్లికార్జునరావు, సత్యానందంల ఎన్‌కౌంటర్ జరిగిన జూపూడి అనే ఊరికి వెళ్లవలసి ఉండింది. సత్యానందంను ఒక పశువుల దొడ్డిలో కట్టేసి కొట్టిచంపారని గుర్తు.

మేం బయల్దేరే సమయానికి చూస్తే ప్రతాపరెడ్డి వెంకయ్యగారితో చిన్నగా ఏదో మాట్లాడుతున్నాడు. దాదాపు గుసగుసల స్థాయిలో ఉన్న ఆ సంభాషన చూస్తే, జనతా పార్టీ ఎన్నికల విజయం గురించి ప్రతాపరెడ్డి కొల్లా వెంకయ్యతో చెపుతున్నాడు. పాలకుల బుల్లెట్ ఎన్నికల విజయం గురించి ప్రతాపరెడ్డి కొల్లా వెంకయ్యతో చెపుతున్నాడు. పాలకులను బుల్లెట్ కన్న సమర్థంగా, శక్తిమంతంగా బ్యాలట్ ఎట్లా ఓడించగలదో చెపుతున్నాడు. బుల్లెట్ బ్యాలట్‌ల తారతమ్యం గురించి, బ్యాలట్ గొప్పతనం గురించి వెంకయ్యతో చెప్పే సాహసం చేస్తున్నందుకు నేను చాలా ఆశ్చర్యపోయాను. ఎందుకంటే కొల్లా వెంకయ్య తన యవ్వనంలోనే ఎన్నికల రాజకీయాల్లో ప్రవేశించాడు. నెహ్రూకన్న ఎక్కువ ఓట్లు సంపాదించాడు. ఎన్‌జిరంగా వంటి సుప్రసిద్ధ నాయకుడిని ఓడించాడు. పార్లమెంటరీ రాజకీయాల్లో అంత ఘన విజయం చూసిన తర్వాతనే ఆయన మళ్లీ సాయుధ పోరాటంలోకి ప్రవేశించాడంటే అందుకు సరయిన కారణాలే ఉండి ఉండాలి.

నిజానికి సామాజిక పరివర్తన కోసం పోరాడకుండా మెరుగైన ప్రపంచాన్ని స్థాపించేవైపు ప్రయాణించకుండా ప్రజలను పక్కదారి పట్టించడంలో పార్లమెంటరీ రాజకీయాలకు చాలా శక్తిసామర్థ్యాలున్నాయి.

ఓటు హక్కు అనేది ఎన్నికలు జరిగే ప్రాంగణంలో ఒక చిన్న అరలోకి నడిపిస్తుంది. అక్కడ మీరు ఒక బాలట్ కాగితం చేతిలోకి తీసుకుంటారు. మీరు ఎవరిని ఎన్నుకోదలచుకుంటారో వారి పేరుకూ, ఎన్నికల చిహ్నానికీ ఎదురుగా ఒక ముద్రవేస్తారు. అంటే అక్కడ పోటీపడుతున్న అభ్యర్థులలో మీకు నచ్చిన ఒక అభ్యర్థిని ఎన్నుకుంటారు.

మరొక మాటలో చెప్పాలంటే అది మీ భావ ప్రకటనా స్వేచ్ఛకూ, మీ వాక్స్వాతంత్ర్యానికీ ఒక వ్యక్తీకరణ అన్నమాట. ఆశ్చర్యమేమంటే రాజ్యాంగం ఉనికిలోకి వచ్చిన అరవై సంవత్సరాల తర్వాత కూడా మనం ఓటు హక్కు అనేది భావ ప్రకటనా స్వేచ్ఛకూ, వాక్స్వాతంత్ర్యానికీ ఒక వ్యక్తీకరణ అని గుర్తించడం లేదు. దాన్ని అలా అర్థం చేసుకున్నట్లయితే అది ఒక శక్తివంతమైన సాధనమని తెలుస్తుంది. అటువంటి భావ

ప్రకటనా స్వేచ్ఛ మీద ఏ రకమైన అంక్షలనయినా రాజ్యాంగం తప్ప మరొకరు విధించడానికి వీలులేదు. జనతాపార్టీ విజయం తర్వాత కూడా, బ్యాలట్ విప్లవం అనబడేదాని తర్వాత కూడా మన ఎన్నికల ప్రచారమంతా ఎన్నికల చిహ్నాల ఆధారంగానే జరుగుతోంది. ఆ పార్టీగాని, ఆ అభ్యర్థిగాని ఏ ఆదర్శాలకు నిలబడతారో చెప్పడం ఎట్లాగూలేదు గనుక ఎన్నికల చిహ్నాపు లక్షణాల గురించి మాత్రమే చర్చ జరుగుతున్నది.

జనతాపార్టీ విజయం తర్వాత భార్గవ కమిషన్ రోజులవి. సత్తుపల్లి శాసనసభ నియోజకవర్గం నుంచి జలగం వెంగళరావు పోటీ చేస్తున్నారు. తార్కుండే కమిషన్ విచారణలో కాస్త విరామం వచ్చింది. వెంగళరావు మీద కాళోజీ పోటీ చేస్తే బాగుంటుందని మేం అనుకున్నాం. వెంగళరావు సొంత ఊరిలో ఆయన మీద పోటీ చేయమని కాళోజీని కోరాం.

మేం కాళోజీని ఎంపిక చేయడంలో ఒక ఉద్దేశ్యం ఉంది. కాళోజీ అన్యాయానికి వ్యతిరేకంగా రాజీలేని పోరాటం జరిపిన యోధుడు. "నాకు అన్యాయాలు నిండిన ప్రపంచంగనుక అందితే, నేను ఆ అన్యాయాలను మౌనంగా చూస్తూ ఉండను. నా ఆవేశంతో ఆ అన్యాయాలను కదిలిస్తాను. నేను వాటి గుట్టు విప్పి చెపుతాను. అన్యాయమే వాటి స్వభావమని విప్పి చెపుతాను. అక్రమాలను కప్పిపెట్టడమే వాటి స్వభావమని వెల్లడిస్తాను"అని జీన్ పాల్ సార్త్రే అన్నమాటలు కాళోజీకి సరిగ్గా సరిపోతాయి. కాళోజీ జీవితమంతా కూడా అంతులేని, ఎడతెగని ఆగ్రహంగానే సాగింది. ఆయన కోపావేశాలు సమాజంలోని అన్యాయాలపైన, ఆ అన్యాయాలను వెంటనే సవరించలేని ప్రభుత్వంపైన, అధికారంపైన, అసలు అన్యాయాలు ఉన్నాయని గుర్తించడానికి నిరాకరించే ప్రభుత్వాల, పాలకుల గుడ్డితనం పైన ఆయన తనను తాను అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడే యోధుడిగా గుర్తించుకున్నాడు. అందువల్ల ఆయన నియోజకవర్గం సహజంగానే ప్రజల నియోజకవర్గమే. ఆయన గుర్తించిన అన్యాయాలన్నిటినీ చిన్న చిన్న పంక్తులలో రాసిపెట్టాడు. అవి పెద్ద సంక్లిష్టమైన కవితా రూపాలు కావు. ఆయన అస్పష్టమైన భాషను వదిలేశాడు. వ్యాఖ్యానం అవసరమైన, నిఘంటువు అవసరమైన భాషను పక్కనెట్టాడు. తన స్వాతంత్ర్యం ప్రజల స్వాతంత్ర్యంతో కలగలపి ఉన్నదని ఆయన గుర్తించాడు. అందువల్ల వారితో సంభాషించడమే అత్యవసరమని ఆయన గుర్తించాడు. నిజంగా ఆయన గొప్ప సంభాషణ కర్త. ఆయన ఎవరితోనయినా మాట్లాడగలిగేవాడు, ఎవరు చెప్పినదయినా వినేవాడు. తన పాఠకులనూ శ్రోతలను అలరించడం కోసం మాత్రమే రాయని కవి ఆయన. మరొక దిక్కు లేని శ్రోతలను కూచో బెట్టుకుని గంభీర ప్రవచనాలు పలికే కవి వంటివాడు కాదాయన. వారికి అర్థమైన భాషలోనే ఆయన మాట్లాడాడు. వారికి అర్థమయ్యే రూపాలలోనే తన కవిత్వం కూర్చాడు.

ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో 1978లో జరిగిన ఈ ఎన్నికల పోరాటంలో ఎంతో

మందిమి పాల్గొన్నాం. చంద్రపుల్లారెడ్డి నాయకత్వంలోని మార్క్సిస్టు లెనినిస్టు గ్రూపు అప్పటికే పార్లమెంటరీ సంస్థలను వాడుకోవాలని నిర్ణయించుకుంది గనుక వాళ్లు కూడా కాళోజీకి అనుకూలంగా ఆ ఎన్నికలలో చురుగ్గా పాల్గొన్నారు. మధుసూదన్‌రాజ్, ఆయన సహచరులు వాళ్ల పార్టీ తరఫున ఆ ప్రచారంలో పాలుపంచుకున్నారు. లలిత, శశి, మరెంతో మంది మంచి గాయకులు ఆ ప్రచారంలో పాల్గొన్నారు.

నేను ప్రత్యక్షంగా చూసిన మంచి ఎన్నికల ప్రచారాలలో అది ఒకటి. ఆ ప్రచార కార్యక్రమం ఎంతో విజ్ఞాన దాయకంగా ఉండింది. ప్రచారానికి వెళ్లేవాళ్లందరికీ కాళోజీ తప్పకుండా చెప్పే మాట ఏమంటే ఉపన్యాసాలు ఇవ్వాలి, అన్ని విషయాలూ మాట్లాడాలి, కాని చివరికి మాకే ఓటు వెయ్యమని ఎప్పుడూ అడగగూడదు. మాకే మీ ఓటు అనగూడదు'. ఎన్నికల క్రమంలో పాల్గొనడానికి ప్రజలను సన్నద్ధులను చేయడం, ఓటు వేసేందుకు ప్రజలకు అవసరమైన సమాచారం అందించడం వరకే మన బాధ్యత అని కాళోజీ చెప్పేవాడు.

ఆయన ఎన్నికల చిహ్నం సైకిల్ అని నాకు గుర్తు. మా మొదటి సభ సత్తుపల్లి పట్టణంలోని ఒక సినిమాహాలులో జరిగింది. ఆ హాలువైపు మేము నడిచి వెళ్తుండగా మాకు కొట్టవచ్చినట్టు కనబడినదేమంటే ఆ రోడ్డు మీద ప్రతి ఒక్క ప్రభుత్వ సంస్థ వెంగళరావు పేరుమీదనే ఉంది. గౌరవ శ్రీ వెంగళరావు కళాశాల, గౌరవ శ్రీ జలగం వెంగళరావు ఆస్పత్రి, వగైరా, వగైరా, ఇక సమావేశ మందిరంలో ప్రచార కార్యక్రమం కాళోజీ వ్యంగ్యంతో మొదలయింది. కాళోజీ కవితలో మొదటి వాక్యం 'శత జలగం శత మత్తు వదలగొట్టాలి' అని ప్రారంభించాడు. ఆ తర్వాత కవితలు, నానుడులు, సామెతలు కాళోజీ నోటి నుంచి వరదలా వచ్చాయి.

ఆ ప్రచారంలో ప్రధాన పాత్ర వహించినది ఎం వి రామమూర్తి. ఆయన హేతువాది. రాష్ట్రంలో పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ (పియుసిఎల్) స్థాపకసభ్యుడు. ఆయన ప్రతిదీ కచ్చితంగా, క్రమశిక్షణతో చేసే మనిషి. కాళోజీ అభిమాని. మొత్తంగా చూస్తే వామపక్ష ఉదారవాది అనే చెప్పాలి. కాని అందరు రాయిస్టులలాగనే ఆయన కూడా బాగా కమ్యూనిస్టు వ్యతిరేకిగా ఉండేవాడు. మేమిద్దరమూ చాలా సన్నిహితంగా ఉండేవాళ్లం. చాలా కాలం కలిసి పనిచేశాం. నేను పీపుల్స్ వార్‌కు దగ్గరవుతున్నానని ఆయనకు అనుమానం కలగడంతో మా మధ్య సాన్నిహిత్యం తగ్గింది. నేను ఆంధ్ర ప్రదేశ్ పౌరహక్కుల సంఘానికి రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికవడంతో ఆయన అనుమానం మరింత బలపడింది. మా మధ్య దూరం మరింత పెరిగింది. ఆయన రాష్ట్ర పియుసిఎల్ అధ్యక్షుడు గనుక ఆన పౌరహక్కుల సంఘం పదవి గురించి నేను ఆయనను సంప్రదించి ఉండవలసిందని ఆయన అనుకున్నాడు.

కాని ఆయనకు తెలియని విషయమూ, ఆయన అంగీకరించదలచుకోని విషయమూ

ఏమంటే ఆయనతో సంబంధం లేకుండానే, ఆంధ్రప్రదేశ్‌తో కూడా సంబంధం లేకుండానే నన్ను పియుసిఎల్ జాతీయ కార్యవర్గంలో సభ్యుడిగా తీసుకున్నారు. ఎమర్జెన్సీ అయిపోయిన వెంటనే మహారాణి బాగ్‌లోని తార్కుండే ఇంటిలో ఒక పియుసిఎల్ సమావేశం జరిగింది. అప్పుడు నన్ను, బొంబాయి కమిటీ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ డెమోక్రటిక్ రైట్స్ (సిపిడిఆర్) ఉపాధ్యక్షుడు అస్గర్ అలీ ఇంజనీర్‌నూ జాతీయ కార్యవర్గ సభ్యులుగా తీసుకున్నారు.

ఇదంతా తెలియని పియుసిఎల్ రాష్ట్ర ప్రధాన బాధ్యులు మద్రాసులో జరిగిన సదస్సులో ఒక తీర్మానం ప్రతిపాదించారు. పియుసిఎల్ సభ్యులెవరూ అవే ఆశయాలు కలిగిన మరొక సంస్థ కార్యనిర్వాహక వర్గంలో బాధ్యులుగా ఉండగూడదనేది ఆ తీర్మాన సారాంశం. తార్కుండే, సురేంద్ర మోహన్‌లతో సహా అక్కడ జాతీయ బాధ్యులందరూ పియుసిఎల్ జాతీయ కార్యవర్గంలోకి తమ ఆహ్వానం మీదనే నేను వచ్చాననీ, కనుక అటువంటి తీర్మానం అవసరంలేదనీ నచ్చజెప్పారు.

కాని రామమూర్తికీ నాకూ మధ్య ఏర్పడిన అఖాతం ఎప్పుడూ పూర్తిగా పూడనేలేదు. ఆయన అనుకున్నట్టు నేను నక్సలైట్లలో ఏ ఒక్క గ్రూపుకూ దగ్గర కాలేదు. నక్సలైట్లతో నా సంబంధం ఎప్పుడూ ఒకేరకంగా ఉంది. ఆ ఉద్యమం లోపల చీలికల గురించి, ఘర్షణల గురించి, వాటి కారణాల గురించి నేను ఎప్పుడూ చర్చలోకి దిగలేదు. ఎప్పుడూ నా దృష్టి ఏమంటే ఈ సమాజంలో ఒక ఉదారవాద, వామపక్ష ప్రజాస్వామ్యాన్ని ప్రోత్సహించాలని మాత్రమే. ఉదారవాద వామపక్ష ప్రజాస్వామ్యమంటే ఏమిటనేది నేను అర్థం చేసుకున్న ప్రత్యేక పద్ధతిలో ఇతరులు అర్థం చేసుకోకపోవచ్చు. నాకు అర్థమయిన పద్ధతిలోనే నేను పనిచేస్తూవచ్చాను. రామ మూర్తి మాత్రం ఉదారవాదానికి ఎంత నిబద్ధుడో, హేతువాదిగా అంత పిడివాది. మేధో సంబంధమైన నిజాయితీలోనూ, సత్ప్రవర్తనలోనూ ఆయన మచ్చలేని మనిషి. అన్యాయానికి వ్యతిరేకంగా  విసుగూ విరామమూ లేకుండా పనిచేసిన యోధుడు. మా ఇద్దరం ఒకరికొకరం పరిచయమయినప్పటి నుంచీ, ఎమర్జెన్సీలో ఆయన అరెస్టయినప్పటి నుంచీ మేమిద్దరం కలిసి పనిచేశాం. కాని మా భిన్నాభిప్రాయాలనో, అపార్థాలనో నేరుగా చర్చించుకుని పోగొట్టుకోవడానికి మేము ఎప్పుడూ ప్రయత్నించకపోవడం దురదృష్టకరం. అసలు విషయం వదిలేసి ఇదంతా ఎందుకు చెపుతున్నానంటే నా జీవితంలోని ఒక భాగాన్ని వివరించకుండా వదిలేస్తానేమోననే భయంతోనే.

ఇక సత్తుపల్లి ఎన్నికల ప్రచారం సంగతికి మళ్లీ వస్తే, ఆ ప్రచార నిర్వాహకుడిగా రామమూర్తికి ఆ ఎన్నికల ఖర్చు మీద పూర్తి అదుపు ఉండేది. వెంగళరావు ఎన్నికల సభల్లో ఏమి మాట్లాడుతున్నారో చూసి వచ్చి తనకు చెప్పమని రామమూర్తి వేగులను పంపేవాడు. వాళ్లు తిరిగి వచ్చి ఇచ్చే నివేదికల మీద చర్చించి ఏమి జవాబులు చెప్పాలో నిర్ణయించే వాళ్లం. నిజంగా అదంతా చాలా పద్ధతి ప్రకారం జరిగిన ఎన్నికల ప్రచార

కార్యక్రమం. వెంగళరావు మాట్లాడిన మాటలమీద ఎక్కడయినా ప్రతిస్పందన అవసరమయితే కాళోజీ స్పందించేవాడు. సత్తుపల్లిలో తన ఇంటి దగ్గర జరిగిన ఒక సభలో వెంగళరావు 'ఈ కాళోజీ ఎవరు? తప్పతాగి పాటలూ కవిత్వమూ లొల్లాయిపదాలూ రాసే వాడేనా' అని అన్నాడని తెలిసింది. ఆ తర్వాత అదే ప్రాంగణంలో మేమూ సభ ఏర్పాటుచేశాం. అక్కడ సభలో కాళోజీ మాట్లాడడం మొదలుపెడుతూనే సభను ఉద్దేశించి 'మీలో తాగేవాళ్లెవరో చేతులు ఎత్తండి' అన్నాడు. ఆయన ప్రశ్నతో ఆశ్చర్యపోయిన వాళ్లు చాలా మంది తమ చేతులు ఎత్తారు. 'అయ్యా, మీరందరూ ఇక నుంచి పాటలూ కవిత్వమూ లొల్లాయిపదాలు రాయండి' అన్నాడు కాళోజీ. ఆ మాటలో కావలసిన ఫలితం వచ్చింది. కాళోజీ వెంగళరావు వ్యాఖ్యను తిప్పికొడుతున్నాడని తెలిసి జనం గొల్లుమన్నారు.

ఇక అక్కడితో అది ఆపేసి ఎన్నికల ప్రాధాన్యత ఏమిటో, ఓటు హక్కు ప్రాముఖ్యత ఏమిటో వివరించాడు. వాక్స్వాతంత్ర్యానికి ఒకానొక పరివర్తనా రూపమే ఓటు హక్కు అని గుర్తించిన మొదటి వ్యక్తి కాళోజీనే అనుకుంటాను.

ఆ శాసనసభ నియోజకవర్గంలో ఆ 1978 ఎన్నికలలోనే మొదటిసారిగా ప్రతిపక్ష అభ్యర్థికి కూడా ఎన్నికల ఏజెంట్లు ఉండే స్థితి వచ్చింది. అంతకు ముందు ఏ ఎన్నికలలోనూ ఎన్నికలు అయిపోయేదాకా ఎన్నికల ఏజెంట్లు ఆ చుట్టుపక్కలకు వచ్చే పరిస్థితి ఉండేది కాదు. అటువంటి పరిస్థితులలో అసలు పోటీ చేయడమే ఒక విజయం.

ఇక ఎన్నికల దగ్గర పడుతున్నాయనే సరికి మా దగ్గర డబ్బులు అయిపోయాయి. రామమూర్తి నేనూ కలసి విజయవాడ వెళ్లి న్యాయవాదుల దగ్గర, వ్యాపారస్తుల దగ్గర, విరాళాలు సేకరించాలని అనుకున్నాం. అది కుదరలేదుగాని, మధుసూదన్ రాజ్ మోటర్ సైకిల్ నడుపుతుండగా నేను వెనక కూచుని విజయవాడ వెళ్లాను. విజయవాడలో జనతా అభ్యర్థి అచ్చయ్యను సంప్రదించి, మా రాక గురించి చెప్పాను. నేను అక్కడ ఎన్నికల సభలో ఒక ఉపన్యాసం ఇస్తే డబ్బులు సేకరించవచ్చునని అచ్చయ్య చెప్పాడు. అక్కడ రెండు వేల రూపాయలు పోగయ్యాయి. అక్కడి నుంచి విజయవాడ బార్ అసోసియేషన్‌కు వెళ్లి అక్కడ ఒక ఉపన్యాసం ఇస్తే న్యాయవాదులు పదిహేను వందల రూపాయలు విరాళాలు ఇచ్చారు. ఆ తర్వాత కొందరు డాక్టర్ల దగ్గరికి, కొందరు వ్యాపారస్తుల దగ్గరికి వెళ్లి విరాళాలు పోగుచేశాం. ఆ సాయంత్రానికల్లా మేం వెనక్కి తిరిగి వెళ్లాం. ఆ మర్నాడే ఎన్నికల ప్రచారానికి ఆఖరి రోజు. ఆ రోజు ప్రచారం చాలా బాగా జరిగింది.

మన పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ప్రత్యర్థుల మీదికి రౌడీలను తోలకుండా ఏ ఒక్క ఎన్నికా జరగదు. సత్తుపల్లి ఎన్నికలలోనూ అటువంటి సంఘటనలో రామమూర్తి వాహనం మీద దాడిచేశారు. ఆయన గాయాలు తగలకుండా తప్పించుకుని రాగలిగాడు. ఇక ఎన్నికలు అయిపోయిన తర్వాత తిరిగి హైదరాబాదుకు రావడం కొరకు మా జీపులో పెట్రోలు కొట్టించుకోవడానికి నేను పెట్రోలు పంపుకు వెళ్లాను. అక్కడ వెంకటాపురం

హత్యకేసు ముద్దాయిలు నిలబడి ఉన్నారు. వాళ్లు మా మీద దాడి చేయడానికే అక్కడ వేచి చేస్తున్నారని మాకు అర్థమైపోయింది. అక్కడి నుంచి మధు తన మోటర్ సైకిల్ మీద మా శిబిరానికి వెళ్లి ఒక లారీ నిండా వాలంటీర్లను తీసుకుని వచ్చాను. ఇటువంటి సవాళ్లన్నీ మా పనిలో భాగంగా అనివార్యంగా ఎదుర్కోవలసినవే.

మొత్తానికి అది చాలా మంచి అనుభవం. న్యాయస్థానాలతో వ్యవహరించి నప్పుడయినా సమాజాన్ని మార్చడం ఎంత కష్టమయిన పనో మాకు ప్రతి సందర్భంలోనూ తెలిసివచ్చింది. దానికి ప్రత్యామ్నాయం ఒక్క హింస మాత్రమే కాదు. సమాజాన్ని పునర్నిర్మించే ప్రయత్నంలో తప్పుడు ధోరణులు ప్రవేశిస్తే ఆ ప్రయత్నం కూడా కుప్పకూలిపోతుందని అనుభవం పాఠాలు నేర్పుతున్నది.

కాళోజీ పోటీ చేసిన ఎన్నికలు చాలా సూత్రబద్ధంగా నడిచాయిగాని, అటువంటి పరిస్థితి అన్నిసార్లూ ఉండదు. ఆయన ఆ ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థిగా నిలబడ్డాడు. మార్క్సిస్టుపార్టీ అంటీముట్టకుండా మద్దతు ఇచ్చింది. ఒకవైపు భార్గవా కమిషన్ విచారణ జరుగుతుండగా మానవహక్కుల వాదనను బలోపేతం చేయడానికి ఆ ఎన్నిక తోడ్పడింది. వెంగళరావుకు వ్యతిరేకంగా, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా, అప్పటి ప్రభుత్వం సాగించిన అతి దారుణమైన మానవహక్కుల హననానికి వ్యతిరేకంగా ఎన్నికలు ఒక ప్రచారాన్ని ప్రతిఘటనను ప్రకటించాయి.

నాకు ప్రత్యక్ష అనుభవం ఉన్న మరొక న్నికలు సార్వత్రిక ఎన్నికలు పాతనగరంలో మజ్లిస్ ఇత్తెహాదుల్ ముసల్మీన్ (ఎంఐఎం) అభ్యర్థిగా సలాఉద్దీన్ ఓవైసీ ఎన్నికయిన సందర్భం అది. ఆయన ఎన్నికను ఉస్మాన్ షహీద్ అనే న్యాయవాది సవాలుచేశాడు. పాతబస్తీ అంటే ఒవైసీ ఇంటి పెరడులాంటిది. అక్కడ ఆయన మీద పోటీ చేసే ఎత్తుకు ఎవరూ ఎదగలేదని, ఎదగలేరని ఆయన అనుకుంటాడు. అవినీతిలో రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులకు ఆయన ఏ మాత్రం తీసిపోడు. కాని జనతాపార్టీ తరపున అహ్మద్ హుసేన్ ఆయన మీద పోటీచేశాడు. ఎన్నికల అక్రమాలకు పాల్పడ్డాడని ఆయన ఎన్నికను సవాలు చేయడం జరిగింది.

మనం మన కోసం తయారుచేసుకుని, ప్రజాస్వామ్యం అని పిలుచుకుంటున్న ఎన్నికల విధానం ఎట్లా పనిచేస్తుందో వివరిస్తాను. మనం పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అనుసరించాలని, బహుళపార్టీల వ్యవస్థ ఉండాలని అనుకున్నప్పుడు, రాజ్యాంగంలో మాత్రం ఎక్కడా బహుళపార్టీల వ్యవస్థ గురించి ప్రస్తావన లేదు. చివరికి 1951లో అమలులోకి వచ్చిన ప్రజా ప్రాతినిధ్య చట్టంలో కూడా దాని ఊసులేదు. ఆ చట్టంలోని 3, 3(1)(ఎ) నిబంధనలు ఏ అభ్యర్థి అయినా మతం, జాతి, కులం, సామూహిక బృందం, భాషల ప్రాతిపదిక మీద ఓట్లు కోరగూడదని నిర్దేశిస్తాయి. మత, జాతి, కుల సమూహ ప్రాతిపదికపై విభిన్న వర్గాల మధ్య ఎటువంటి శత్రు భావననుగాని,

ద్వేషభావననుగాని రెచ్చగొట్టగూడదని నిర్దేశిస్తాయి. అటువంటి ప్రవర్తనను ఎన్నికల అక్రమాలుగా నిర్వచిస్తాయి. అయితే ఇక్కడ విధినిషేధాలు ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులకు వ్యక్తిగత స్థాయిలో వర్తించేవేగాని, ఒకవేళ ఆ పార్టీయే ఆ ప్రాతిపదికలపై ఏర్పడితే అది నిషిద్ధం కాదు.

మనం నా ఈ జీవిత కథనం మొదలు పెట్టినప్పుడూ, మధ్యలో అనేక చోట్ల కూడా తప్పనిసరిగా నక్సల్బరీ ప్రజా ప్రజ్వలనం గురించి, దాని వ్యాప్తి గురించి మాట్లాడవలసి వచ్చింది. ఆ ఉద్యమం మీద అమలయిన దారుణమైన నిర్బంధం, తొలిరోజుల్లో ఆ నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ ప్రారంభమైన డిఫెన్స్ కమిటీ గురించి కూడా మాట్లాడుకున్నాం. ఆ కమిటీ ఆ తర్వాతి రోజుల్లో అన్నిరకాల మానవహక్కుల ఉల్లంఘనలను సమగ్రంగా అర్థం చేసుకుంటూ రాష్ట్రంలో ఒక బలమైన పౌర, ప్రజాస్వామిక హక్కుల, మానవహక్కుల ఉద్యమంగా రూపుదిద్దుకుంది. ఆ ఉద్యమానికి తొలిరోజుల్లో ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (ఎపిసిఎల్‌సి), ఆ తర్వాత క్రమంగా ఆర్గనైజేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ డెమోక్రటిక్ రైట్స్ (ఒపిడిఆర్), పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ (పియుసిఎల్) వంటి సంస్థలు కూడా చేరాయి. పియుసిఎల్ అఖిల భారత స్థాయిలో కూడా పనిచేసింది.

కాని ఏ రాజకీయ పార్టీకీ ఒక మాన హక్కుల విభాగం లేదు. అప్పుడుగాని, ఇప్పుడుగాని ఆ అవసరాన్ని ఒక్క పార్టీ కూడా గుర్తించలేదు. పౌరహక్కుల ఉద్యమంలో జోక్యం కలిగించుకోవడానికి నక్సలైట్లు కొద్దికాలం ప్రయత్నించారు. ఆ ప్రయత్నంలో పౌరహక్కుల ఉద్యమం చాలా వెనుకడుగు వేసింది. వాళ్ల జోక్యంవల్ల పౌరహక్కుల ఉద్యమమనేది నక్సలైట్ల ముసుగు సంస్థ అని ప్రభుత్వం ప్రచారం చేయడానికి అవకాశం వచ్చింది.

పౌరహక్కుల ఉద్యమం ప్రజలలో హక్కుల చైతన్యం, హక్కులపట్ల అవగాహన కలిపించంలో విజయం సాధించిందిగాని, అవి లేవనెత్తుతున్న ప్రత్యేకమైన, నిర్దిష్టమైన మానవహక్కుల ఉల్లంఘనల పట్ల ప్రజలు తమ ప్రతిఘటనను ప్రదర్శించేలా వారిని ప్రేరేపించలేకపోయింది.

డా. రామనాథం, లక్ష్మారెడ్డి, నర్రా ప్రభాకర్‌రెడ్డి వంటి తన నాయకులను పోలీసులు ఎటువంటి జవాబుదారీతనం లేకుండా కాల్చి చంపినప్పుడు కూడా ప్రజలు నిరసన తెలిపేలా, న్యాయం కోరేలా చేయలేకపోయింది. మానవహక్కుల కార్యకర్తలను నిర్మూలించే పనిని పాలకవర్గాలు ప్రయివేటు హంతక ముఠాలకు అప్పగించినప్పుడు కూడా ప్రజాస్పందన చాలా బలహీనంగా ఉండింది. అటువంటి ముఠాల చేత పురుషోత్తం, అజం అలీ ఎటువంటి జవాబుదారీతనం లేకుండానే చంపివేయబడ్డారు. ఆ తర్వాత ఆ హంతకులు తమను తాము కోబ్రాలమని పిలుచుకుంటూ కరువు వ్యతిరేక పోరాట సమితికి చెందిన కనకాచారిని, కుల నిర్మూలనా పోరాట సమితికి చెందిన మస్నెం

ప్రసాద్‌ను చంపేశారు. అయినా ఫిర్యాదూ లేదు.

ఇవన్నీ హత్యలు, గరిష్ట నేరాలు, చట్టప్రకారం వీటన్నిటి మీద విచరాణ జరగవలసి ఉంటుంది. కాని నాకు తెలిసినంతవరకు ఎటువంటి దర్యాప్తు జరగలేదు. విచారణ జరగలేదు. ప్రాసిక్యూషన్ జరగలేదు. ఒకవేళ మన న్యాయవ్యవస్థకే ధైర్య సాహసాలు, వృత్తిపట్ల నిబద్ధత ఉంటే ఈ హత్యానేరాల మీద సరయిన దర్యాప్తు జరపమని ఆదేశించి ఉండవలసింది. లేదా, మానవ ప్రాణంపట్ల, ప్రజాస్వామిక ప్రవర్తనపట్ల ఎంతో శ్రద్ధాసక్తులు ఉన్నట్టు కనబడుతున్న హైకోర్టు ఈ వ్యవహారంలో జోక్యం కలిగించుకుని ఈ రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి పట్టిన ఈ చీడను తొలగించడానికి ప్రయత్నించి ఉండవలసింది.

మన న్యాయవ్యవస్థలో, ప్రజాస్వామ్యంలో ఒక గుర్తించవలసిన విషయమేమంటే అది ప్రభుత్వాధికారులయిన హంతకులు న్యాయస్థానానికి వచ్చితాము ఎటువంటి నేరాలనయినా చేయవచ్చునని, తమను సాధారణ పౌరులుగా విచారణకు గురి చేయగూడదని వాదించడానికి అవకాశం ఇస్తుంది, ఇచ్చింది. ఆ వాదనను మన హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు కూడా అంగీకరించారు.

ఆ సందర్భంలో న్యాయమూర్తి ప్రభాశంకర్ మిశ్రా ఒక్కరే సరయిన, చట్టబద్ధమయిన వైఖరి తీసుకున్నారు. ఆయనతోపాటు కూచున్న న్యాయమూర్తి సివిఎస్ శాస్త్రి కూడా ఆ తీర్పుతో ఏకీభవించారు. ఈ దేశంలో ప్రభుత్వాలకు అటువంటి శిక్షాతీత ప్రవర్తనను అనుమతిస్తే పాలన ఏమయిపోతుందో ఆ న్యాయమూర్తులు సరిగ్గా అర్థం చేసుకున్నారు. చాలా సందర్భాలలో ప్రభుత్వం ఆయా శిక్షాతీత నేరాల కేసుల్లో ఎన్‌కౌంటర్ల పేరిట జరిగిన హత్యల కేసుల్లో ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్లు చేసిన విచారణ నివేదికలను సమర్పించి, సెషన్స్ న్యాయస్థానంలో జరిగే విచారణకు ఆ నివేదికలు ప్రత్యామ్నాయమన్నట్టు, ఆ మాత్రం జవాబుదారీ తనం చాలునన్నట్టు వాదించాయి. హైకోర్టుగాని, సుప్రీంకోర్టుగాని ఈ వాదనను అంగీకరించాయి. కావాలంటే నిర్దిష్టమైన కేసులలో ఫిర్యాదు చేసుకొమ్మని సలహా ఇస్తూ సుప్రీంకోర్టు మా సాధారణ ఫిర్యాదును కొట్టివేసింది.

కాని ఈ హత్యలను గురించి పోలీసులను విచారించనక్కరలేదని న్యాయస్థానాలు ఏ ఒక్క సందర్భంలోనూ అనలేదు. అదే సందర్భంలో ఇటువంటి శిక్షాతీత నేర ప్రవృత్తి చట్టబద్ధపాలనను, రాజ్యాంగ బద్ధ అధికారాన్ని దుర్వినియోగం చేయడమే అన్న మా వాదనను న్యాయస్థానాలు నిరాకరిస్తూ వచ్చాయి.

జీవితం మీద, భద్రతమీద జరిగిన అటువంటి దాడులు ఈ దేశ రాజకీయ జీవితంలో ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహనతో, చైతన్యయుతంగా పాల్గొనకుండా అడ్డుకున్నాయి. ప్రశ్నించినవారి ప్రాణాలకూ భద్రతకూ హామీలేని, వారి హక్కులను కాలరాచివేసే పరిస్థితి ఇంత పెద్ద ఎత్తున ఇంత కాలం పాటు కొనసాగుతుంటే ఇంకెవరూ సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక హక్కుల కోసం పోరాడే సాహసం చేయలేదు. సామాజిక

సమానత్వాన్ని సాధించడానికి పోరాటాలు జరపడానికి వీలుండదు. అసలు ప్రాణాలకూ భద్రతకూ హామీ లేకుండా పోతే ఇంక మరే ఇతర హక్కు కోసమూ పోరాడే అవకాశం ఉండదు.

పోరాడితే ప్రాణాలు పోతాయనీ, జీవన భద్రత ఉండదనీ ఒకసారి భయం ఏర్పడితే ఇక అన్ని పోరాటాలూ విచ్ఛిన్నమైపోతాయి. రాజకీయ సంస్థలు ముక్కలు ముక్కలయి పోతాయి. అలా ముక్కలయి పోయిన సంస్థలు నడిపే పోరాటాలకు ఏ ప్రభావమూ ఉండదు. ఆ ముక్కలు నడిపే పోరాటాలు జీవించే హక్కు ఉల్లంఘన మీద ఎటువంటి ప్రభావాన్నీ వేయలేవు. 'ముల్లా కి దౌడ్ మసీద్ తక్' అన్నట్టు ఈ ముక్కలయిపోయిన రాజకీయ సంస్థల పరుగు అంతా కలెక్టర్ ఆఫీసులకో, ఇంకా చెప్పాలంటే ముఖ్యమంత్రి కార్యాలయానికో మాత్రమే సాగుతుంది. ఆ పరుగులవల్ల ఎటువంటి న్యాయంగాని, ఉపశమనం గాని దొరకదు. మనకు తెలియకుండానే మనం ఎక్కడో ప్రపంచీకరణ సమర్థకులమయిపోతాయి. ఇవాళ పార్లమెంటరీ పార్టీలన్నిటి స్థితీ ఇదే. అవన్నీ మార్కెటింగ్‌కు వీలయిన సమస్యలను మాత్రమే చేపడతాయి.

వ్యక్తిగత స్వేచ్ఛను కాపాడడంలో సుప్రీంకోర్టు విఫలమైన తర్వాత, బహుశా ఆ కోల్పోయిన ప్రతిష్టను తిరిగి సంపాదించేందుకు ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పబ్లిక్ ఇంటరెస్ట్ లిటిగేషన్) అనే ఒక కొత్త సాధనం వచ్చింది. అధికార వర్గం చేతుల్లో అన్యాయానికి గురయిన పౌరుల గురించి ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు పట్టించుకున్నాయి. ఆ రకంగా భాగల్పూర్‌లో ఖైదీల కళ్లలో ఆసిడ్ పోసి వాళ్లను అంధుల్ని చేసిన తీరు గురించి, ఆసియాడ్ క్రీడల నిర్మాణాలలో ప్రభుత్వమే కార్మికులకు చేసిన న్యాయం గురించి, బంధువా ముక్తి మోర్చా వేసిన పిటిషన్లు, బీహార్ విచారణలో మగ్గుతున్న ఖైదీల కేసులు వంటివి సుప్రీంకోర్టు ముందుకు వచ్చాయి. ఈ కేసులలో చాలా భాగం ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ కన్న ముందు నుంచే జరుగుతున్న అక్రమాల గురించి ప్రపంచానికి తెలియజేశాయి. కాని ఆ కేసులలో ఆ పాపాలకు ఆమే కారణమనీ, ఆమె ప్రభుత్వమే బాధ్యురాలనీ స్పష్టంగా బయటపడింది.

అయినా చెప్పుకోవలసిన విషయమేమంటే ప్రజా ప్రయోజన వ్యాజ్యాల ద్వారాగాని, బాధితులయిన వ్యక్తులు వేసిన కేసులలో గాని ఆస్తిహక్కు విషయంలోనూ, రిజర్వేషన్ వ్యతిరేక కేసులలోనూ మాత్రమే న్యాయస్థానాలు గతంలోకన్న ఎక్కువ శక్తివంతంగా పనిచేయడం మొదలు పెట్టాయి. ఇంతకాలం న్యాయం దొరకని వారికి న్యాయం ఇవ్వడానికి ప్రారంభమయిన ఒక మంచి సాధనాన్ని దోపిడీ వర్గాలు, దోపిడీ సామాజిక ధర్మాన్ని కొనసాగించే శక్తులు విజయవంతంగా పక్కదారి పట్టించాయి.

ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన కోర్కెల మీద సమ్మె నోటీసు ఇస్తే ఒక వకీలు దగ్గర పనిచేసే మున్షీ ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యం చేస్తాడు. విజ్ఞుడైన ఒక న్యాయమూర్తి

సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ఉత్సాహంగా ముందుకొస్తాడు. కార్మికులు సమ్మె మానేస్తేనే వారి వాదనలు వింటానని న్యాయ స్థానం షరతు విధిస్తుంది. ఈ మాదిరిగా న్యాయమూర్తులు శాంతి భద్రతల నిర్వహణ సంస్థల అధికారాన్ని తమ చేతుల్లోకి తీసుకుని ఉత్తర్వులు ఇవ్వడం మొదలు పెట్టినప్పుడు తమ నిజమైన అధికారానికీ పరిధికీ లోబడి పని చేస్తున్నట్టు కాదు. అది న్యాయమూర్తులుగా ఉన్న హోదావల్ల తమకు చేకూరిన అధికారాన్ని దాని పరిధికి అవతల ఉపయోగిస్తున్నట్టే అవుతుంది. మీ హోదావల్ల మీకు వచ్చిన అదికారానికీ, ఆ పదవి పరిమితులలోపల మీరు అమలు చేయగలిగిన అధికారానికీ మధ్య తేడా చాలా ఉంది.

ఆ తేడా ఏమిటో వివరించడానికి ఒక ఉదాహరణ ఇస్తారు. ఈ మధ్య ఒక హైకోర్టు న్యాయమూర్తి తన కారులో సీలుబెల్టు పెట్టుకోకుండా వెళ్తున్నాడు. అప్పటికే సీలుబెల్టు పెట్టుకోకుండా కారు నడపగూడదనే ఉత్తర్వులు వచ్చి ఉన్నాయి. కనుక చట్ట ప్రకారం ఆ ఉత్తర్వులను ఎవరు ఉల్లంఘించినా శిక్షార్హమైన నేరమే. కనుక ఒక కానిస్టేబుల్ ఆయనను ఆపాడు. కాని ఆ న్యాయమూర్తిగారు తనను ఆపడమే అవమానించడం అనుకున్నారు. ఆపిన పోలీసుల మీద అరిచాడు. చివరికి వ్యవహారం పోలీసు డైరెక్టర్ జనరల్ స్వయంగా వచ్చి ఆ న్యాయమూర్తికి క్షమాపణ చెప్పడంతో ముగిసింది. నిజానికి ఆ కానిస్టేబుల్ తనకు చట్టం ద్వారా అందిన అధికారాన్ని ఎటువంటి రాగద్వేషాలు లేకుండా నిష్పక్ష పాతంగా అమలు చేశాడు. ఆ న్యాయమూర్తి మాత్రం తన పదవి ద్వారా, హోదా ద్వారా అందిన అధికారాన్ని వాడుకున్నాడు. కచ్చితంగా చెప్పాలంటే తన అదికారాన్ని దుర్వినియోగం చేశాడు. ఆయన తన ప్రవర్తన ద్వారా తన అధికార హోదాకే కళంకం తెస్తున్నానని గుర్తించడంలేదు.

ప్రజా ప్రయోజన వ్యాజ్యాలనే వాటిని ప్రజా వ్యతిరేక ప్రయోజనాల కోసం వాడడం జరుగుతున్నదని గుర్తించిన, న్యాయస్థానాలు రాజ్యాంగ విలువలను, రాజ్యాంగబద్ధ పాలనను పరిరక్షించడానికి గాక మార్కెట్ శక్తుల ప్రజా ప్రయోజనాల కోసం పని చేస్తున్నాయని గుర్తించిన న్యాయవాదులు, కలహ భోజనులు అతి దారుణమైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు వేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో బంద్‌లకు వ్యతిరేకంగా రెండు దారుణమైన రిట్ దరఖాస్తులు దాఖలయ్యాయి. ఆ రెండింటిని కూడా హైకోర్టు అనుమతించింది. సిపిఐ(ఎం), సిపిఐలు నన్ను ఆ కేసులలో వాదించమని కోరారు. బంద్‌లను సమర్థించే రాజకీయ పార్టీలను నిషేధించాలని కోరుతూ మరొక వ్యాజ్యం వచ్చింది.

ఈ రిట్ పిటిషన్లలో ఒకదాన్ని వేసిన వ్యక్తి తాను ఖమ్మంలో స్థానిక లయన్స్ క్లబ్ సహాయంతోనూ, స్థానిక కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ సహాయంతోనూ వందమంది విద్యార్థులతో వయోజన విద్యా కేంద్రాలు, వైద్య చికిత్సా కేంద్రాలు నడిపానని

చెప్పుకున్నాడు. ఈ మాత్రం ప్రజా జీవితానుభవంతో ఆయన ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేయడానికి పూనుకోవడం మాత్రమే కాదు, రాష్ట్రంలో జరిగిన కొన్ని హింసాత్మక సంఘటనలలో మరణించిన వారి బంధుమిత్రుల, కుటుంబ సభ్యుల గళానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాననీ చెప్పుకున్నాడు.

* * *

94293

ఆయనను
ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్
'మానవహక్కుల కొరకు ఉద్విగ్నంగా పోరాడే న్యాయవాది'
అంది.

నక్సల్బరీ తరం నాయకుడు
సత్యనారాయణసింగ్
'ప్రాసిక్యూటర్లకు ప్రాసిక్యూటర్' అన్నాడు.

ఒకప్పటి మానవహక్కుల నేత, జర్నలిస్టు,
ఇప్పుడు సంఘపరివార్ సిద్ధాంతకర్త
అరుణ్ శౌరి
'లోకాధివక్త' అన్నాడు.

ఆయన
నాలుగు దశాబ్దాలుగా
న్యాయవాద వృత్తిలో
పోరాడే ప్రజల హక్కుల
పరిరక్షణ కోసం
అహర్నిశలు శ్రమిస్తున్న
అసాధారణ మేధావి

ఆంధ్రదేశంలోనే కాదు
దేశం మొత్తానికే
పౌర, ప్రజాతంత్ర హక్కుల స్ఫూర్తికి
పర్యాయ పదంగా ఎదిగినవాడు

మనిషిగా సామాన్యుడు
వాదనా పటిమలో అసామాన్యుడు
తోటి మనిషి హక్కులను కాపాడడంలో అనితరసాధ్యుడు

K. G. Kannabiran's
Personalised Social History

Aksharekarana
N. Venugopal

ఆత్మకథాత్మక సామాజిక చరిత్ర